నగ ధగధగ.. 'నిధి' మిలమిల

నర్సీపట్నంలో జ్యువెలరీ షోరూం ప్రారంభోత్సవానికి సినీ నటి నిధి అగర్వాల్ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. అభిమానుల కోరిక మేరకు స్టెప్పులు వేశారు. వారితో కలిసి సెల్ఫీలు దిగారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

జి.మాడుగుల గజగజ

చింతపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జి.మాడుగులలో ఆదివారం 5.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ముంచంగిపుట్టు 7.7, డుంబ్రిగుడ 8.2, అరకులోయ 8.9, చింతపల్లి 9.5, హుకుంపేట 9.6, పెదబయలు 10.2, పాడేరులో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రత పెరగడంతో స్థానికులు, మన్యానికి వచ్చే పర్యాటకులు వణికిపోతున్నారు.

మలుపు తిరిగేలోగా ప్రమాద పిలుపు

ఘాట్ రోడ్డు ప్రయాణమంటే హడల్

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

ఘాట్ రోడ్డులో ప్రయాణించే వారు గమ్యం చేరుకునే వరకు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే సంగతులు. పాడేరు ఘాట్ రోడ్డులోని మలుపులన్నింటిలో 'కోమాలమ్మ' మలుపంటే వాహన చోదకులకు హడల్. 'యు' ఆకారంలో ఉండే ఈ మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతుండటమే ఇందుక్కారణం. భారీ వాహనాలు మలుపు తిరగలేక ఆగిపోతుండటం, పోలీసులు వచ్చే వరకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించడం పరిపాటిగా మారుతోంది.

పొడవు	23 కి.మీ.
ఏటా ప్రమాదాలు	సుమారు 50
మృతులు	8–10 మంది
ట్రాఫిక్ జాం	నెలకు పదిసార్లు
రోజూ రాకపోకలు సాగించే వాహనాలు	సుమారు 700

▪ ఘాట్ రోడ్డులో ఈ మలుపు 'కోమాలమ్మ పనుకు', ఏసు ప్రభు బొమ్మ మలుపుగా ప్రాచుర్యం పొందింది. ఇక్కడకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల దూరంలో దశాబ్ద కాలంలో జరిగిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృత్యువాత పడగా.. వందలాది మంది క్షతగాత్రులయ్యారు.

బోల్తా పడిన కలప లోడు లారీ

▪ ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉన్న ఘాట్ రోడ్డు కూడలి నుంచి పాడేరు వరకు సుమారు 23 కి.మీ. దూరం ఘాట్‌రోడ్డు ఉంది. ఐదు దశాబ్దాల కిందట అప్పట్లో వాహనాల రద్దీకి తగ్గట్లుగా ఘాట్ రోడ్డు నిర్మాణం జరిగింది. గత పదేళ్లలో పాడేరు పట్టణ ప్రాంతంగా అభివృద్ధి చెందింది.

▪ వర్తక, వాణిజ్యం పెరగడం, పాడేరు జిల్లా కేంద్రం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. జనాభాతోపాటు వాహనాల రద్దీ పెరిగింది. పాడేరు మీదుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు పెరిగాయి. సిమెంట్, ఇసుక, ఇనుము లోడుతో భారీ వాహనాలు ఘాట్ రోడ్డులో తరచూ ఆగిపోతున్నాయి.

నాలుగు చోట్లా ముచ్చెమటలు

గరికబంద నుంచి వంట్లమామిడి వరకు ప్రమాదకర మలుపులు నాలుగు ఉన్నాయి. వీటిలో కోమాలమ్మ మలుపు ఒకటి. ఘాట్ రోడ్డు ఇరుకుగా ఉండటం, భారీ వాహనాలు మలుపు తిరగలేక రోజుకు నాలుగైదు సార్లు ఆగిపోతున్నాయి. రోజూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మలుపు ఎత్తుగా ఉండటంతో కొన్ని వాహనాలు బ్రేకులు ఫెయిల్ అయి లోయలోకి దూసుకెళ్లిన ఘటనలున్నాయి.

▼ మూడేళ్ల కిందట పాడేరు నుంచి ఆటోలో వెళ్తున్న ఓ కుటుంబం కోమాలమ్మ మలుపు సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఐదుగురు మృత్యువాత పడ్డారు.

▼ కిలగాడ జాతరను ముగించుకుని తిరుగు ప్రయాణంలో వెళ్తున్న ఓ కారు లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందారు.

▼ చోడవరం నుంచి వస్తున్న జీపు మలుపు వద్ద అదుపు తప్పి లోయలో పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందాడు.

▼ ఈ నెల 4న పాడేరు నుంచి కలప లోడుతో వెళ్తున్న లారీ మలుపు తిరగలేక అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది.

ఈ ఏడాది ఆగస్టులో పనస కాయల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి లోయలోకి వెళ్లడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అదే నెలలో ఆర్టీసీ బస్సు, వ్యాన్ మలుపులో ఢీకొన్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లు ఘాట్ రోడ్డుతోపాటు మలుపులను విస్తరించాలని గతంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు పని చేసిన ఐఏఎస్ అధికారులు ప్రతిపాదించారు. నాటి నుంచి ఇప్పటివరకు అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. హుదూద్ తుపాను సమయంలో మలుపుల అంచులు కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో ఐటీడీఏ పీవోగా ఉన్న వినయ్‌చంద్ తిరుమల ఘాట్ రోడ్డు తరహాలో రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసి విస్తరించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు రూ.50 లక్షల వరకు అవసరమని అంచనాలు రూపొందించారు. ఆ తర్వాత పీవోలుగా వచ్చిన డీకే బాలాజీ, వెంకటేశ్వర్లు విస్తరణపై దృష్టిసారించినా.. నిధుల లేమితో కార్యరూపం దాల్చలేదు. ఘాట్ రోడ్డు అంతా అటవీ ప్రాంతం కావడంతో అభివృద్ధి, విస్తరణకు అటవీ శాఖ అభ్యంతరాలు ప్రతిబంధకంగా మారాయి.

గడువు పెరిగింది.. దరఖాస్తు చేసుకోండి

విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణకు మరో అవకాశం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇళ్లలో విద్యుత్తు వినియోగం సాధారణ స్థాయి కంటే అధికంగా ఉంటే బిల్లు పెరుగుతుంది. దీని నుంచి ఉపశమనం పొందేందుకు అదనపు లోడు క్రమబద్ధీకరణ ఒక్కటే మార్గమని విద్యుత్తుశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ 30 వరకు 50 శాతం రాయితీతో దీనికి అవకాశం కల్పించారు. దీన్ని పలువురు సద్వినియోగం చేసుకున్నారు. మరింత మందికి లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో దీని గడువును డిసెంబరు 31 వరకు పొడిగించారు.

▪ ఈ నేపథ్యంలో లోడు క్రమబద్ధీకరించకుండా విద్యుత్తును వాడుకుంటున్న వారిని గుర్తించి అధికారులు అదనపు రుసుము విధిస్తున్నారు. లోడు క్రమబద్ధీకరించుకుంటే ఈ సమస్య ఉండదని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గడువు పొడిగింపును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి ఏఈ ప్రభాకర్ తెలిపారు.

అపరాధ రుసుం..: చాలామంది వినియోగదారులకు విద్యుత్తు కనెక్షన్ లోడు ఎంత ఉందో తెలియని పరిస్థితులున్నాయి. దరఖాస్తు చేసుకున్న సమయంలో నమోదు చేసిన దానికంటే ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, గీజర్, ఐరన్‌బాక్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగంతో నియంత్రికలపై భారం పడుతుంది. దీంతో తరుచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

రాయితీ పోను చెల్లింపు ఇలా.. (రూ.లలో)

కిలో వాట్స్	ప్రస్తుత ఛార్జీలు	రాయితీ పోను
1	2,250	1,250
2	4,450	2,450
3	6,650	3,650
4	8,850	4,850
5	11,050	6,050

జనజాతర

జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. చింతపల్లి మండలం చెరువులవెనం కోలాహలంగా మారింది. దూరప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ మంచు అందాలను చూసి ముగ్ధులయ్యారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

గంగపై.. గగన విహారం

తాజంగి జలాశయంలో బోటు షికారు అందుబాటులోకి రావడంతో పర్యాటకులు జిప్‌లైనర్‌పై గగన విహారంతోపాటు జల విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. పర్యాటక వికాస్ ఆధ్వర్యంలో ఎప్పట్నుంచో జిప్‌లైనర్ అందుబాటులో ఉంది. జలాశయంలో పర్యాటకులు బోట్లపై విహరించేందుకు ఆరు బోట్లను సమకూర్చారు. పర్యాటకులు నీటిలో బోట్లపైనా.. జిప్‌లైనర్‌పై గగన తలంలోనూ విహరిస్తూ మధురానుభూతి పొందుతున్నారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

పాపికొండల్లో హాయ్ హాయ్..!



దేవీపట్నం, వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పాపికొండల విహారయాత్రకు పర్యాటకుల రద్దీ కొనసాగుతోంది. గండిపోశమ్మ ఆలయం నుంచి ఆదివారం ఆరు బోట్లలో 366 మంది, పోచవరం పర్యాటక రేవు నుంచి 14 బోట్లలో 1052 మంది పాపికొండల సందర్శనకు వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. పోలీసులు తనిఖీలు అనంతరం బోట్లకు పచ్చజెండా ఊపారు. గోదావరిలో నీటి మట్టం మళ్లీ స్వల్పంగా పెరుగుతోంది. పూడిపల్లి, చినరమణయ్యపేట పంచాయతీల పరిధిలోని దాదాపు వారం రోజులుగా మొక్కజొన్న చేలను వరద నీరు ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. సీతారం వద్ద సీతపల్లి వాగులో రాకపోకలను పోలీసులు నిషేధించారు.

పారిశుద్ధ్య ఇబ్బందులు తీరేలా..

ఎస్సీ వసతిగృహాల్లో సిబ్బంది నియామకానికి ఆదేశాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే

దూర ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా ప్రభుత్వం ఎస్సీ, బీసీ వసతిగృహాలను నిర్వహిస్తోంది. గురుకులాలు, కేజీబీవీల్లో మినహా వీటిలో పారిశుద్ధ్య సిబ్బంది లేరు. ఇక్కడ పనిచేసే దిగువ స్థాయి సిబ్బంది/ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తుంటారు. అయినప్పటికీ శుభ్రత అనుకున్న స్థాయిలో జరగడంలేదు.

జిల్లాలో ఇలా..

ఎస్సీ బాలుర వసతిగృహాలు	17
ఎస్సీ బాలికల వసతిగృహాలు	13
విద్యార్థులు	3,540

త్వరలోనే నియామకం... ఇప్పటివరకు హాస్టళ్లల్లో ఉన్న సిబ్బందితోనే మరుగుదొడ్ల నిర్వహణ సాగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ప్రతి ఎస్సీ వసతిగృహానికి విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఒకరిద్దరు ప్రత్యేక సిబ్బంది నియమితమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం జీఓ ఇచ్చింది. త్వరలోనే వీరి నియామకం జరుగుతుంది. తద్వారా మరింత పరిశుభ్రత పెరుగుతుంది. – బి.రామానందం, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ

★ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హాస్టళ్ల అభివృద్ధి, వసతుల కల్పనకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే రూ.కోట్లు వెచ్చించి మరమ్మతు చేయడంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సరఫరా వ్యవస్థ మెరుగుపర్చడం చేశారు. తాజాగా ఎస్సీ వసతిగృహాల్లో పొరుగు సేవల విధానంలో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించేందుకు ఆదేశాలిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 1051 వసతిగృహాల్లో 1,365 మందిని నియమించడానికి అనుమతులు ఇచ్చింది.

★ వంద మందిలోపు విద్యార్థులుంటే ఒకరు, అంతకు మించి ఉంటే ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించనున్నారు. ఇన్నాళ్లూ హాస్టళ్లల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలకు తెరపడనుంది. ప్రస్తుతం ఎస్సీ వసతిగృహాలకు మాత్రమే ఆదేశాలిచ్చినా, బీసీ వసతిగృహాలకు సంబంధించి త్వరలోనే ఆదేశాలు రానున్నాయి. ఇప్పటికే వీటి వివరాలను ప్రభుత్వం సంబంధిత శాఖ నుంచి సేకరించిందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఈ-శ్రమ్‌తో ప్రయోజనాలెన్నో!

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మీరు ఏదైనా దుకాణాల్లో, గార్మెంట్స్.. ప్రైవేటు సంస్థల్లో.. భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారా.. అయితే ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుడిగా తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోండి. దీని వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఉన్నాయి. సభ్యత్వం పొందిన ప్రతి సభ్యుడికి రూ.2 లక్షల ఉచిత బీమాతోపాటు దేశవ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ సరకులు తీసుకునే వెసులుబాటు ఉంది. కార్మికుడు శాశ్వతంగా అంగవైకల్యం పొందితే ఆ శాతం ప్రకారం ఆర్థికసాయం మంజూరు చేస్తారు.

ఏం చేయాలంటే...: కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కార్మిక శాఖ కార్యాలయం, మీసేవ కేంద్రాలు, ఆధార్ లింక్ అయిన చరవాణి వివరాలతో నమోదు చేసుకోవచ్చు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఈ అవకాశం ఉంది.

అర్హతలు, అవసరమైన పత్రాలు..: వ్యవసాయం, గార్మెంట్స్, దుకాణాల్లో పనిచేసే కార్మికులు, ఆశా కార్యకర్తలు, ఇళ్లలో పనిచేసేవారు, బండ్ల వ్యాపారం చేసే వాళ్లు, మత్స్యకారులు, చేతివృత్తులవారు, భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కూలీలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లో సభ్యత్వం లేనివారు అర్హులు.

▪ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, ఐఎఫ్‌సీ కోడ్, చరవాణి నంబరు ఉండాలి.

ఓటు నమోదు నిరంతర ప్రక్రియ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి కొత్తగా ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ నిరంతరం చేపట్టాలన్నారు. అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ శివలింగపురం గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో 280, 281 పోలింగ్ బూత్‌లను ఆదివారం ఆయన పరిశీలించారు. బీఎల్‌వోలతో మాట్లాడి.. మ్యాపింగ్ ప్రక్రియపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడి బూత్‌ల ఏర్పాటుపై అభ్యంతరాలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను జాబితాల నుంచి తొలగించాలన్నారు. అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ.. ఒక ఊర్లో ఓటర్లకు.. వేరే చోట ఓట్లు ఉంటున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజ మాట్లాడుతూ.. ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అసిస్టెంట్ కలెక్టర్ కె.సాహిత్, ఆర్డీవో లోకేశ్వరరావు, తహసీల్దార్ వీరభద్రాచారి, మాణిక్యం, శంకరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వివేక్ యాదవ్ తదితరులు

ఆలస్యంగా కిరండూల్ పాసింజర్

అరకులోయ, న్యూస్‌టుడే: విశాఖపట్నం నుంచి కిరండూల్ వెళ్లే పాసింజర్ రైలు సాంకేతిక సమస్య కారణంగా ఆదివారం ఆలస్యంగా అరకు చేరుకుంది. చిమిడిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో విద్యుత్తు తీగల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో మూడున్నర గంటలపాటు అక్కడే నిలిపివేశారు. సిబ్బంది సమస్యను పరిష్కరించడంతో సాయంత్రం 3 గంటలకు అరకు రైల్వేస్టేషన్‌కి పాసింజర్ చేరుకుంది. విశాఖపట్నం నుంచి అరకు వచ్చే పర్యాటకులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు వీసీ హాల్‌లో అర్జీలు స్వీకరిస్తామన్నారు. మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లోనూ వినతుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. 1100 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి అర్జీల స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు.

వసతిగృహాలపై ఏఐ కన్ను!

అనంతగిరి, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వసతిగృహాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచేందుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా సంక్షేమ వసతి గృహాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వసతిగృహాల్లో చేసే పనుల వివరాలు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయటంతోపాటు విద్యార్థులకు వండి పెట్టే ఆహార పదార్థాల ఫొటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

వసతిగృహాల్లో పారదర్శకత పెంపొందించే ఉద్దేశంతో హెచ్‌పీటీఎస్ (హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టమ్) పేరుతో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. రోజు, వారాంతం, నెల వారీ కార్యక్రమాలను నమోదు చేయాలి. కంచాలు కడగటం నుంచి పిల్లల హాజరు, భోజన పదార్థాలు, ఆవరణ, మరుగుదొడ్లు, గదుల శుభ్రత వివరాలను నిక్షిప్తం చేస్తారు. ఈ ప్రక్రియలో ఎక్కడ ఎటువంటి పొరపాటు జరిగిన ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లు, డిప్యూటీ వార్డెన్‌లకు హెచ్చరికలు జారీ చేస్తారు.

భోజనాలు చేస్తున్న వసతిగృహ విద్యార్థినులు

జిల్లాలో వివరాలు	వసతిగృహాలు	విద్యార్థులు
	180	10,250 మంది

▪ ఈ యాప్‌తో వసతిగృహాల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట పడనుందని అధికారులు భావిస్తున్నారు. ఈ యాప్ ఏఐ సాంకేతికతతో పనిచేస్తుందని, వండిన భోజనాలు విద్యార్థులకు సరిపడా ఉన్నాయా లేదా, నాణ్యత తదితర వివరాలు సైతం ఈ యాప్ ఏఐ ద్వారా గుర్తిస్తుందని చెబుతున్నారు.

తప్పక వినియోగించాలి..: ఇప్పటికే యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాం. పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు తప్పక వినియోగించాలి. విద్యార్థులకు వండిన భోజనాల దగ్గర నుంచి వంట పాత్రలు కడిగే వరకు ప్రతి ఫొటో ఈ యాప్‌లో సూచించిన విధంగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పూర్తిస్థాయి వార్డెన్లు లేని చోట్ల ఎటువంటి తప్పులు దొర్లినా ప్రధానోపాధ్యాయులదే బాధ్యత. – వెంకటరమణ, ఏటీడబ్ల్యూఓ, అనంతగిరి

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 678 మంది హాజరు

పాడేరు, న్యూస్‌టుడే: జాతీయ ఉపకార వేతన పరీక్షకు 93 శాతం హాజరు నమోదైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు పరీక్ష కేంద్రాల్లో 727 మంది విద్యార్థులకు 678 మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. మండల విద్యాశాఖ అధికారులు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ప్రభుత్వ పరీక్ష జిల్లా సహాయ కమిషనర్ శశికుమార్, జిల్లా నోడల్ అధికారి సీహెచ్ రత్నకుమార్, ఎంఈఓ మోరి జాన్ సందర్శించారు.

తలారిసింగి పాఠశాల కేంద్రంలో ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా సహాయ కమిషనర్ శశికుమార్, ఎంఈవో విశ్వప్రసాద్

100వ జయంతి

మహాభాష్యం శేషాద్రి శాస్త్రి (రిటైర్డ్ డిఐజి రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) 08-12-1925 | 26-11-2000

మహాభాష్యం పిల్లా బాయి 1932-2015

ఇట్లు

మహాభాష్యం సుధాకర్ నిర్మల | సూరి సుజాత డా. నరసింహం | మహాభాష్యం జయకర్ మంజుల

మహాభాష్యం శ్రీనివాస్ సురేఖ మాధురి | మహాభాష్యం నరశింహమూర్తి అరుణ | మరియు మనుమలు, మనుమరాళ్ళు

సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

ఎలమంచిలి, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలుకానుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆదివారం మధ్యాహ్న భోజనం అందించారు.

తొలిరోజు హాజరైన విద్యార్థులు : పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాల సాధనకు విద్యాశాఖ వంద రోజుల ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 6 నుంచి అమలవుతుండగా సెలవు రోజుల్లోనూ మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు.

● రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెండు సబ్జెక్టులపై అదనపు తరగతులు నిర్వహిస్తారు. తరగతుల అనంతరం విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేశాక ఇళ్లకు పంపుతారు. ఈ ఆదివారం భోజనంలో పప్పు, కోడిగుడ్డు కూర వడ్డించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శత శాతం ఉండగా, కొన్నిచోట్ల తక్కువగా ఉంది.

● ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెం ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులకు 21 మంది హాజరయ్యారు. వీరంతా భోజనం చేశారు. ఎలమంచిలి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులకు 8 మందే భోజనం చేశారు. మిగిలిన వారంతా భోజనానికి ఇళ్లకు వెళ్లిపోయారు.

పక్కాగా అమలు చేయాలి.. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి పది విద్యార్థి కచ్చితంగా అన్ని రోజులు బడికి వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించాం. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు మధ్యాహ్నం భోజనం చేసి ఇళ్లకు వెళ్లిపోతారు. స్థానికులైతే సాయంత్రం వరకు ఉంటారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వచ్చిన విద్యార్థులందరికీ నిర్దేశించిన మెనూ పక్కాగా అమలు చేయాలి. – పి.బ్రహ్మాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

అల్లూరి జిల్లాలో..	పాఠశాలలు	విద్యార్థులు	పరీక్ష కేంద్రాలు
	2,948	11,500	63

విహారానికి వెళ్తుండగా విషాదం

బైక్ ప్రమాదంలో బాలుడి దుర్మరణం

పాడేరు, న్యూస్‌టుడే: వంజంగి మేఘాలకొండ అందాలు చూసేందుకు వెళ్తూ ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. హుకుంపేట మండలం గూడ గ్రామం నుంచి కొంత మంది యువకులు ఆదివారం వంజంగి అందాలు చూసేందుకు ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. ఒక ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వెళ్తుండగా బూరెలవాక మలుపు సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న సిగ్నల్ స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో వెనుక ఉన్న మఠం శ్రీరామభద్ర(15) సుమారు 30 అడుగుల దూరంలో ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఉదయం ఐదు గంటల సమయంలో జరిగింది. చింతపల్లి మండలం ఉమ్మరసిగొంది గ్రామానికి చెందిన శ్రీరామభద్ర గూడ గ్రామంలో బంధువుల ఇంట్లో ఉంటూ పాడేరు బీవీకే ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి కారణాలపై పరిశీలించారు. మృతదేహం, క్షతగాత్రులను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ద్విచక్రవాహనం నడుపుతున్న కిల్లో చరణ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సురేష్, సిబ్బంది

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు క్లాసిఫైడ్స్ | ఉద్యోగ విరమణ | జన్మదిన శుభాకాంక్షలు | లీగల్ ప్రకటనలు | జయంతి, వర్ధంతి | అంత్యక్రియలు,

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

(c) eenadu

గంజాయికి దూరంగా ఉండండి

పాడేరు, న్యూస్‌టుడే: మన్యానికి వచ్చే పర్యాటకులు గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ అమిత్ బర్దార్ పేర్కొన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం వంజంగి మేఘాల కొండ వద్ద ఆదివారం సీఐ దీనబంధు ఆధ్వర్యంలో ఐదు కిలోమీటర్ల మారథాన్‌ను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా పర్యాటకులతో ముచ్చటించారు. ఇక్కడకు రావడం ఎలా అనిపించిందని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ప్రకృతి అందాలు అద్భుతంగా ఉన్నాయని చెప్పారు. గంజాయి జోలికి వెళ్లి.. ఖైదీలుగా మారొద్దంటూ పర్యాటకులతో నినాదాలు చేయించారు. డీఎస్పీ షహబాజ్ అహ్మద్, ఎస్సై సురేష్, పోలీసులు, పర్యాటకులు పాల్గొన్నారు.

మారథాన్ ప్రారంభిస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్, చిత్రంలో డీఎస్పీ అహ్మద్ తదితరులు

స్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్లు సులభం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎట్టకేలకు సులభతరమైంది. స్లాట్ బుకింగ్‌తో వేగంగా పూర్తవుతున్నాయి. ఎవరైనా సరే అనుకూలమైన సమయం ఎంచుకునే విధానం అమలులోకి వచ్చింది. పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ (పీడీఈ)తో స్థిరాస్తుల క్రయ విక్రయాలకు ఎవరి దస్తావేజు వారే రూపొందించుకోవచ్చు. హెల్ప్ డెస్క్‌లతో అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. తొలుత ఈ పద్ధతికి కాస్త ఒడిదొడుకులు వచ్చినా క్రమంగా గాడిన పడింది. తద్వారా రిజిస్ట్రేషన్ల ఆదాయం లక్ష్యానికి మించి రావడం గమనార్హం.

■ సాంకేతికతతో గతంలోనే రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొంతకాలంగా స్లాట్ బుకింగ్‌తో వినియోగదారులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ఎవరికి వారే స్లాట్ బుక్ చేసుకుని డాక్యుమెంట్లు పొందేలా వీలు కలిగింది. ఇందుకు నమూనా పత్రాలు అందుబాటులో ఉంచారు. ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లినా హెల్ప్ డెస్క్‌లోని సిబ్బంది సహకరిస్తారు. వివాహ రిజిస్ట్రేషన్లు, ఇతర లావాదేవీలు నచ్చిన సమయంలో బుక్ చేసుకోవచ్చు.

స్లాట్ బుకింగ్‌కు నర్సీపట్నంలో ఏర్పాటైన హెల్ప్ డెస్క్

■ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వేగంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి కావడానికి ప్రభుత్వం ఈ స్లాట్ విధానాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు తెలిపారు. దీనిపై ఎవరి నుంచి ఏ ఫిర్యాదులూ లేవు. అవసరమైన వారు అవగాహన కోసం జిల్లాలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉన్న హెల్ప్‌డెస్క్‌ల సేవలు ఉపయోగించుకోవచ్చు. జిల్లాలో నవంబరు నెలాఖరు నాటికి రూ.204.44 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.219.51 కోట్లు వచ్చిందని పేర్కొన్నారు.

■ స్లాట్ బుకింగ్ చాలా సులువు. దీని కోసం రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ regis-traion.ap.gov.in లోకి వెళ్లాలి. ఆస్తులు, ఇతర వివరాలను నమోదు చేసి డాక్యుమెంట్ రూపొందించాలి. దీనికి ఐడీ వస్తుంది. అనంతరం ఆస్తుల విలువ ప్రామాణికంగా స్టాంపు డ్యూటీ ఇతర ఫీజులు చెల్లించాలి. కార్యాలయానికి వెళ్లడానికి అనుకూలమైన సమయాన్ని నిర్ణయించుకుని స్లాట్ బుక్ చేసుకుంటే క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ టోకెన్ వస్తుంది. తర్వాత స్లాట్ సమయం ప్రకారం కార్యాలయానికి వెళ్తే సబ్ రిజిస్ట్రార్ ప్రక్రియ పూర్తి చేస్తారు. స్లాట్ బుకింగ్‌కు పైసా చెల్లించనవసరం లేదు. రద్దు చేసుకుంటే రూ.100, వాయిదా వేస్తే రూ.200 చెల్లించాల్సి ఉంది.

మినుము రైతులకు ప్రోత్సాహకాలు

ఉచితంగా విత్తన కిట్లు

అనకాపల్లి, న్యూస్‌టుడే

కారణాలు ఏవైనా అపరాల సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ముఖ్యంగా మినుము విస్తీర్ణం ఏటికేడు పడిపోతోంది. ఫలితంగా మార్కెట్‌లో మినపప్పు ధరలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మినుము సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు చేపడుతోంది. రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేయాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 4,700 విత్తన కిట్లు ఇవ్వనున్నారు. కేజీ విత్తనం ధర రూ.138. ఒక్కో కిట్‌లో నాలుగు కేజీల విత్తనాలు ఉంటాయి. అర ఎకరా విస్తీర్ణంలో సాగు చేసేందుకు సరిపోతాయి.

రబీ సాగవుతున్న మినుము

❖ జిల్లాలో వరి కోతల అనంతరం రైతులు అపరాలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయి. రబీలో వరి సాగు తక్కువ. ఖరీఫ్‌లో 85,884 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తుంటే రబీలో 15,662 హెక్టార్లలోనే పంటలు వేస్తున్నారు. దాదాపు 70 వేల హెక్టార్ల భూమి ఖాళీగా ఉండిపోతుంది. ఈ క్రమంలో రబీ విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో పెసర 6,273 హెక్టార్లలో సాగవుతుంటే.. మినుము 2,753 హెక్టార్లలోనే వేస్తున్నారు.

❖ పుష్కర కాలం కిందట జిల్లాలో 5,380 హెక్టార్లలో మినుము సాగయ్యేది. ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. రెండేళ్ల కిందట 2,641 హెక్టార్లకు పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అపరాల సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టిసారించింది. గతేడాది రబీలో 3,098 హెక్టార్లకు సాగు పెరిగింది. ఈ ఏడాది కనీసం ఐదు వేల హెక్టార్లలో సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వరి కోతలకు రెండు, మూడు రోజుల ముందు మినుము విత్తనాలు వేసేలా కిట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

జీవన పత్రాల నమోదుకు తొందరొద్దు

జనవరి ఒకటి తర్వాతే..

నర్సీపట్నం, న్యూస్‌టుడే

ప్రభుత్వ పింఛనుదారులకు ఏటా జీవన పత్రాల సమర్పణ తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు వచ్చే ఏడాది జనవరిలో వీటిని నమోదు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులు వీటిని సమర్పిస్తున్నారు. పాత విధానంతో రాష్ట్ర పింఛనుదారులు కొందరు హైరానా పడుతూ ఇప్పుడే నమోదు చేస్తూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని సంఘాల ప్రతినిధులు, ఖజానా అధికారులు చెబుతున్నా.. కొందరు హడావుడి పడుతున్నారు.

ఆన్‌లైన్‌కు పింఛనుదారుడిని ఫొటో తీస్తున్న సంఘ ప్రతినిధి

● జీవన పత్రాలను జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు మాత్రమే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా ఖజానాధికారి సుభాషిణి సూచిస్తున్నారు. బయోమెట్రిక్ నమోదు కాని వారు ఐరిస్‌తో పంపవచ్చన్నారు. ఇప్పుడు వివరాలను నమోదు చేసే యాప్‌లో వాటిని అనుమతించినట్లు కనిపిస్తున్నా జనవరి ఒకటో తేదీ తర్వాత మళ్లీ సమర్పించక తప్పదని పేర్కొన్నారు.

● ఉద్యోగ విరమణ చేసిన వారంతా పింఛను పునరుద్ధరణకు ఏటా ఈ పత్రాలను సమర్పిస్తుంటారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను తొలగించేందుకు 'జీవన్ ప్రమాణ్' పేరుతో కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఉన్న చోటు నుంచి ఆన్‌లైన్లో నమోదు చేసుకునే వెసులుబాటు కలిగింది. 2018కి ముందు ప్రభుత్వ పింఛనుదారులంతా ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో జీవన పత్రాలను అందజేసేవారు.

● జిల్లాలో 8 ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో సుమారు 9 వేల మంది ప్రభుత్వ పింఛనుదారులు ఉన్నారు. 11 వేల మందికిపైగా కేంద్ర సర్కారు పెన్షనర్లు ఉన్నారు. వీరు నవంబరు నుంచి జీవన పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల్లో కొందరు తమ వివరాలన్నీ ఇప్పుడే నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్లో వీటికి ఆమోదం కనిపిస్తుండటంతో జీవన పత్రాల సమర్పణ పూర్తయిందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల శ్రమ మినహా ప్రయోజనం లేదని గుర్తించలేక పోతున్నారు.

వరికుప్పలకు పూజలు

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం మన్యంలో వరికోతలు ఊపందుకున్నాయి. గిరిజనులు వరిచేలు కోసి కల్లంలో కుప్పలు పెడుతున్నారు. గిరిజనులు వాటికి విశేష పూజలు చేస్తున్నారు. వరి ఇతర విత్తనాల నిల్వలకు విత్తనాల్లో మట్టి బెరడు, బూడిద కలిపి టేకాకు, అడ్డాకుల బుట్టల్లో నిల్వచేస్తారు. దీని వల్ల ఏడాది వరకు ఈ విత్తనాలు పురుగు పట్టకుండా ఉంటాయి. ఇలా గింజలతో నింపిన బుట్టలను అటకపై ఏడాది పొడవునా నిల్వ ఉంచి తొలకరిలో కిందకు దింపుతారు.

పూజలు చేస్తున్న గిరిజనులు

వైద్య శిబిరంలో 160 మందికి సేవలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రామకృష్ణ మిషన్ ట్రస్టు ఆధ్వర్యాన ఆదివారం సిరిగిందలపాడులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 160 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు ట్రస్టు కార్యదర్శి స్వామి పరిజ్ఞానంద మహారాజ్ తెలిపారు. శిబిరంలో వైద్యులు తలారి వెంకట సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమామహేశ్ రోగులకు వైద్యసేవలను అందించారు. సుమారు 80 మందికి వివిధ రకాల పరీక్షలు చేశారు. రోగులతోపాటు వెంట వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించారు. రామకృష్ణ మిషన్ కో ఆర్డినేటర్ కామమెరాజు శ్రీనివాస్, వలంటీర్ దాసరి పెదఅప్పారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

కొత్త జీవో ప్రకారం పరిహారాలు ఇవ్వాలి

కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితులకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీవో ప్రకారం పరిహారాలు ఇవ్వాలని టేకులబోరు నిర్వాసితులు అధికారులను కోరారు. టేకులబోరులో నిర్వాసితులతో ఐటీడీఏ అధికారులు నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశంలో నిర్వాసితులు సమస్యలను ఏకరువు పెట్టారు. పునరావాసంలో యువత జీవనోపాధి కోసం పరిశ్రమలు ఏర్పాటు, ఒక కుటుంబంలో వచ్చిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ వర్తింపజేయాలని, ఒకే ప్రాంతంలో స్థలాలు కేటాయించాలని, ఇంటి నిర్మాణ విలువలు పెంచాలని కోరారు. చింతూరు ఐటీడీఏ పీవో సమావేశంలో లేకపోవడంతో సీసీ దుర్గాప్రసాద్ ప్రభుత్వ నిబంధనలు వివరించారు. నిర్వాసితుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కూనవరంలో మంగళవారం మరోసారి సమావేశం నిర్వహించి అనుమానాలు నివృత్తి చేస్తామన్నారు. సర్పంచి హేమంత్, తహసీల్దార్ ద్వర్వేద్, ఎంపీడీవో జగ్గారావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీసీ దుర్గాప్రసాద్

ముమ్మరంగా వాహనాల తనిఖీ

గంగవరం, న్యూస్‌టుడే: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో గంగవరం వై.జంక్షన్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి, గంగవరం ఎస్సై వెంకటేష్ సిబ్బందితో కలిసి మన్యానికి వచ్చిపోయే ప్రతి వాహనాన్ని జల్లెడ పట్టారు. వాహనచోదకులు విధిగా వాహనాలకు సంబంధించిన దస్త్రాలను సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే, సంబంధిత వాహనదారులపై చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.

గంగవరం వై.కూడలిలో కారును తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై, సిబ్బంది

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా కార్యక్రమాలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం వాలంటీర్లు దత్తత గ్రామాల్లో ప్రత్యేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. రవ్వలగుడ, ఆర్.డుంబ్రిగుడ గ్రామాల్లో వాలంటీర్లు ఆదివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పిచ్చిమొక్కలు తొలగించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచారు. బాల్యవివాహాల నియంత్రణ, మాదకద్రవ్యాల వినియోగం, ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు నాగబాబు, విజయలక్ష్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపడుతున్న విద్యార్థులు

ఆలోచన అదిరింది

శీతల పానీయాలు, తాగునీటి ప్లాస్టిక్ బాటిళ్లు వాడేసిన తర్వాత బయటకు విసిరేస్తుంటాం. పెదబొడ్డేపల్లిలోని డాన్‌బాస్కో డిగ్రీ కళాశాలలో ఇలా పారేయడానికి వీల్లేదు. ఇనుప చువ్వలతో పెద్ద సీసాలా తయారు చేసిన దానిలో తీసుకెళ్లి వేయాల్సిందే. ఇది నిండిన తర్వాత పారిశుద్ధ్య సిబ్బందికి అందజేస్తుంటారు. ఇలా చేయడం ప్లాస్టిక్ కాలుష్యం నియంత్రణకు దోహదపడుతుందని, కళాశాల ఆవరణ శుభ్రంగా ఉంటోందని అధ్యాపకులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

'ఓపెన్‌టాప్ డబుల్‌డెక్కర్' రయ్ రయ్



బీచ్‌రోడ్డులో ఓపెన్‌టాప్ బస్సు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పర్యాటక శాఖ, జీవీఎంసీ స్మార్ట్ సిటీ విభాగాల ఆధ్వర్యంలో ఓపెన్‌టాప్ డబుల్‌డెక్కర్ బస్సు ఆదివారం ప్రారంభమైంది. ప్రస్తుతం నడుస్తున్న రెండు డబుల్‌డెక్కర్ బస్సులకు అదనంగా దీన్ని ఇక్కడికి తీసుకొచ్చారు. వీటిని వన్యప్రాణులు, పుణ్యక్షేత్రాలు, లైట్‌హౌస్ వంటి చిహ్నాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బీచ్‌రోడ్డులో ఆర్కేబీచ్ నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు, కైలాసగిరి రోప్ వే, ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల, రుషికొండ మీదుగా తొట్లకొండ వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. పెద్దలకు రూ.263, పిల్లలకు రూ.105 చెల్లించి ఆన్‌లైన్‌లో లేదా నేరుగా బస్సుల్లో టికెట్లు తీసుకోవచ్చును. టికెట్ తీసుకున్న సమయం నుంచి 24 గంటల వరకూ విన్యసించొచ్చు.

◆ బీచ్‌రోడ్డులో పిక్నిక్‌లు వంటి విహారయాత్రలకు వచ్చేవారు ఈ పర్యాటక బస్సుల్లో విన్యసించేందుకు ముందుగానే బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు.

మత్స్యకారులకు రాయితీపై ఇంజిన్లు

✦ వలలు, బోట్లకూ అవకాశం
✦ 15వ తేదీతో ముగియనున్న గడువు

నక్కపల్లి, న్యూస్‌టుడే

సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులకు రాయితీపై వేట సామగ్రిని కూటమి ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే అనేక మంది సద్వినియోగం చేసుకోగా, అర్హులకు మంజూరు చేసేందుకు సంబంధిత అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. దీని గడువు త్వరలోనే ముగియనుంది.

జిల్లాలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల పరిధిలో 30 వరకు మత్స్యకార గ్రామాలున్నాయి. వీటి పరిధిలో 70 వేల మంది జనాభా ఉండగా చేపల వేటపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది వరకు ఉన్నారు. తెదేపా ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు ఇంజిన్లు, వలలు, తెప్పలను రాయితీపై ఇచ్చేవారు. వైకాపా పాలనలో అది కాస్త అటకెక్కింది. అప్పట్లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ఉన్నా ఇంజిన్, తెప్ప, వల కలిపి ఒకే యూనిట్‌గా ఇచ్చారు. దీని ధర రూ.5 లక్షలు ఉండగా, రాయితీపోనూ మత్స్యకారులు రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉండేది. దీంతో మత్స్యకారులెవరూ ముందుకు రాలేదు.

● కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకంలో వల, ఇంజిన్, బోటు వేర్వేరు యూనిట్లుగా ఇచ్చేలా కేంద్రంతో మాట్లాడింది. దీంతో మత్స్యశాఖ అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది.

● ఇప్పటికే జిల్లాలో నాలుగు మండలాల పరిధిలో 58 ఇంజిన్లు ఇచ్చారు. ఇందులో అత్యధికంగా 'పేట' నియోజకవర్గంలోనే 25 వరకు వచ్చాయి. ఇటీవలే మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు.

లైసెన్సు మనుగడలో ఉండాలి.. ఇంజిన్, వల, జీపీఎస్ వంటివి రాయితీపై పొందాలంటే బోటు యజమాని అయ్యుండాలి. బోటు లైసెన్స్ మనుగడలో ఉండాలి. జిల్లాకు 169 ఇంజిన్లు కేటాయించారు. జీపీఎస్ కావాలంటే మరో వేట సామగ్రి కలిపి దరఖాస్తు చేస్తేనే ఇస్తారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారంతా ఈ నెల 15వ తేదీ నాటికి తమ వాటా మొత్తానికి డీడీ తీయాలి.

– విజయ, మత్స్యశాఖ జిల్లా అధికారిణి

రాయితీ ఇలా..
ఒక్కో ఇంజిన్ ఖరీదు: రూ. 83,300
రాయితీ (40 శాతం): రూ. 33,200
మత్స్యకారుడి వాటా: రూ. 49,980

మంజూరైన ఇంజిన్లు (గ్రామాల వారీగా..)

గ్రామం	ఇంజిన్లు
రాజానగరం	14
బంగారమ్మపేట	1
రాజయ్యపేట	10
తంతడి	2
పూడిమడక	16
తిక్కవానిపాలెం	3
ముత్యాలమ్మపాలెం	12

కరాటే పోటీల్లో ప్రతిభ

ఎటపాక, న్యూస్‌టుడే: తోటపల్లి ఆదిత్య పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఖమ్మంలోని సుమన్ చోటాకాన్ అకాడమీ ఆధ్వర్యాన ఆదివారం జాతీయస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు సాయి అనన్య బ్లాక్, రోహిత్ సిల్వర్, దీప్తి బ్రౌన్ బెల్ట్‌లు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. హీరో సుమన్ చేతులమీదుగా బహుమతులు అందుకున్నట్లు చెప్పారు. అల్లూరి జిల్లాలోనే బ్లాక్ బెల్ట్ సాధించిన మొదటి విద్యార్థిగా సాయి అనన్య నిలిచిందని శిక్షకుడు ముత్తుతేజ తెలిపారు.

సినీ హీరో సుమన్ చేతులమీదుగా బహుమతులు అందుకున్న విద్యార్థులు

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

విశాఖపట్నం, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జరిగిన పంచామృతాభిషేకం సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ అనివేటి మండపంలో శ్రీచక్రనవ వర్ణార్చన, లక్ష్మీహోమం, శప్తపతీ, వేదపారాయణం తదితర పూజాధికాలు జరిగాయి.

సర్కారు విద్యార్థీ.. విజయీభవ..!

గురుకులాల్లో నీట్, జేఈఈల్లో ఉచిత శిక్షణ

ప్రత్యేకంగా మెటీరియల్ తయారీ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పేద విద్యార్థులు నీట్, జేఈఈలో ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురుకుల పాఠశాలల్లో శిక్షణ ఇవ్వడానికి ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం విద్యార్థుల(బాలురు)కు శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలలో, అమ్మాయిలకు విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని గురుకుల పాఠశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో మన్యం ప్రాంత విద్యార్థులకు అవకాశం ఇచ్చారు.

తరగతి గదిలో బోధిస్తున్న అధ్యాపకుడు

నీట్, జేఈఈ మెటీరియల్

ఎంపిక ఇలా: పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులను నియమించారు. అంతేకాకుండా ఇంజినీరింగ్, మెడిసిన్‌లకు వేర్వేరుగా ప్రత్యేక మెటీరియల్ రూపొందించారు. వాటిని విద్యార్థులకు ఇచ్చి సాధన చేయిస్తున్నారు. వారు అర్థం చేసుకునేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో బోధిస్తున్నారు.

జిల్లాల వారీగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు..		కోర్సుల వారీగా..
శ్రీకాకుళం: 24	విశాఖ: 14	నీట్: 14
విజయనగరం: 36		జేఈఈ: 60

కార్పొరేట్ సంస్థల నుంచి అధ్యాపకులు: మొదటి దశ జేఈఈ మెయిన్ పరీక్షలు వచ్చే ఏడాది జనవరి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. కేవలం 40రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కోర్సును పూర్తి చేసి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల చేత పాత ప్రశ్నపత్రాలను సాధన చేయిస్తున్నామని అధ్యాపకురాలు వాణి తెలిపారు. నారాయణ అకాడమీ ప్రత్యేక మెటీరియల్ అందజేసిందని, ఇన్ఫినిటీ అకాడమీ టైఅప్‌తో కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థల నుంచి అధ్యాపకులను రప్పించి శిక్షణ ఇప్పిస్తున్నామని శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల/కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మురళి తెలిపారు.

పక్కాగా సమయ పాలన					
● ఉదయం 5 గంటలకు నిద్రలేవడం.	● 5.30 గంటల వరకు కాలకృత్యాలు	● 5.30 గంటల నుంచి ఆసనాలు, ధ్యానం, వ్యాయామం..	● ఉదయం 6 నుంచి 8 వరకు విద్యార్థుల సాధన.	● సాయంత్రం 6 నుంచి 7వరకు, రాత్రి 9 నుంచి 10 వరకు పునశ్చరణ.	● పోషకాహారం, నిద్ర, ఆరోగ్యంపై జాగ్రత్తలు.

పార్కింగ్ వద్దు.. 'వాణిజ్యం' ముద్దు..!

★ 'ది డెక్' భవనంలో ఓ అంతస్తు మార్పు
★ సౌకర్యాల కల్పనకు రూ.5 కోట్ల ఖర్చు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సిరిపురంలో నిర్మించిన ది డెక్ భవనంలో మార్పులు చేర్పులకు సిద్ధమవుతోంది. పార్కింగ్ కోసం కేటాయించిన ఒక అంతస్తును వాణిజ్య అవసరాలకు అనుగుణంగా మార్పు చేస్తున్నారు. ఇందుకోసం మళ్లీ రూ.5 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా నిర్మాణం చేపట్టడంతో ప్రజాధనం వృథా అవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

ప్రాజెక్టు ఉద్దేశం ఇదీ..: మొదట్లో బహుళ అంతస్తుల కార్ల పార్కింగ్ ప్రాజెక్టుగా దీన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.80కోట్లతో రెండేళ్లలో దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పలు కారణాలతో బాగా ఆలస్యమైంది. దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.5 కోట్ల వరకు అదనంగా పెరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీన్ని పట్టాలెక్కించి త్వరితగతిన పూర్తి చేసింది.

'ది డెక్' భవనం ఇలా..	
అంతస్తులు: 11	వాణిజ్య అవసరాలకు..: 6 అంతస్తులు
పార్కింగ్‌కు కేటాయించినవి: 5	విస్తీర్ణం: 1.64లక్షల చ.అడుగులు
స్థలం: 1.90 లక్షల చ.అడుగులు	
సామర్థ్యం: 430 కార్లు, 400 బైక్‌లు	

టెండర్లకు కొరవడిన స్పందన..

పార్కింగుకు కేటాయించిన కింది అంతస్తును ఆరేళ్లకు లీజుకు ఇవ్వాలని రెండు నెలల కిందట వీఎంఆర్‌డీఏ ప్రకటన ఇచ్చింది. వాహనాల పార్కింగ్ నిర్వహణకు టెండర్లు పిలిచారు. స్పందన లేకపోవడంతో పార్కింగ్ స్థలం కొంత ఖాళీగా ఉంటుంది. దీంతో ఓ అంతస్తును వాణిజ్య అవసరాలకు అనుగుణంగా మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రూ.5కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో పార్కింగ్ ప్రాంతాన్ని వాణిజ్య అవసరాలకు కేటాయించడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పెరిగిన కమర్షియల్ డిమాండ్: నగరం నడిబొడ్డున ఉన్న ది డెక్ భవనం ఆకర్షణీయంగా మారింది. పలు సంస్థలు అక్కడ ఆఫీసు స్పేస్ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ప్రస్తుతం ఒక అంతస్తును ప్రైవేటు వర్సిటీకి కేటాయించారు. మరో రెండు ఫ్లోర్లు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు, మరొకటి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అప్పగించారు. మరో కేంద్ర ప్రభుత్వ సంస్థకు ఒక అంతస్తు కేటాయించారు. మరికొన్ని సంస్థలు ఇక్కడ కార్యాలయాలు, రెస్టారెంట్ల నిర్వహణకు ఆసక్తి చూపుతున్నాయి.

JOBS

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ని పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం. జీ:20k. ✆ 89776 39662,89776 39663.

వేతన బకాయిలు చెల్లించాలి

చింతూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజా సంజీవినిగా పేరు తెచ్చుకున్న 104 సిబ్బందికి రావల్సి పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏపీ 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గత నిర్వహణ సంస్థ అరబిందో సంస్థ నుంచి రావాల్సిన బకాయిలు చెల్లింపులో ఉద్యోగులకు అన్యాయం జరిగిందని, ఆ సంస్థ నుంచి రావల్సి బకాయిలు తక్షణమే ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నాయకులు పవన్, రామ్మూర్తినాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు పవన్

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలోని కోకోవెన్ బ్యాటరీ-3లో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఓ ఛార్జింగ్ కారు మంటల్లో దగ్ధమైంది. 305 నంబర్ ఒవెన్‌కు ఛార్జింగ్ జరుగుతుండగా.. అది పూర్తైన తర్వాత లిఫ్ట్ కాకపోవడంతో సమస్య తలెత్తింది. ఈ లోపం కారణంగా ఓవెన్ నుంచి వచ్చిన మంటలు ఛార్జింగ్ కారుకు అంటున్నాయి. దీంతో ఛార్జింగ్ కారు సహా ఎంసీసీ పూర్తిగా కాలిపోయాయి. సి.ఐ.ఎస్.ఎఫ్. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కొంతసేపు ఇబ్బంది తలెత్తినా వెంటనే మళ్లీ పనులు కొనసాగాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	126	125
లైవ్	153	145
డ్రెస్డ్	222	260
స్కిన్‌లెస్	252	270

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా
పాడేరు 89853 66570 అరకులోయ: 63034 86346 రంపచోడవరం: 94908 77172

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కరిముఖి పుట్టు పంచాయతీలోని నందిమెట్టలో అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలమైంది. గోడలు పెచ్చులూడి, నేల ఛిద్రమైంది. – రామ్మూర్తి, స్థానికుడు, ✓: కొత్త భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మరమ్మతులకు చర్యలు చేపడతాం. – విమలకుమారి, సీడీపీఓ, ముంచంగిపుట్టు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: డుంబ్రిగుడలోని పైవీధిలో కుళాయిలకు మూతలు లేక నీరు వృథాగా పోతోంది. – అరుణ్‌రాజ్, స్థానికుడు, ✓: మూడు రోజుల్లో కుళాయిలకు మూతలు బిగిస్తాం. – గౌతమి, పంచాయతీ కార్యదర్శి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. అయితే అవసరమైన హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. – రాంబాబు, మారేడుమిల్లి, ✓: మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్లే రహదారిలో మలుపుల్లో రక్షణ చర్యలు చేపడతాం. – ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని ఎగువశోభ పంచాయతీకి వెళ్లే రోడ్డు దారుణంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – సుబ్బారావు, గ్రామస్థుడు, ✓: రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – గణేష్, గిరిజన సంక్షేమశాఖ ఏఈ

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం పోలీస్‌స్టేషన్ ఎదురుగా కుంజం బొజ్జిదొరగారి వీధిలో 20 రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రిపూట విషసర్పాలు సంచరిస్తున్నాయి. వీధిలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. – కుంజం సిద్దు, గంగవరం, ✓: ఎలక్ట్రీషియన్‌తో మాట్లాడి మరమ్మతు చేయిస్తాం. ఇప్పటికే పోలీస్‌స్టేషన్ ఎదురుగా కొన్ని వీధి దీపాలు ఏర్పాటు చేశాం. మరమ్మతుకు గురైన వాటిని మార్చి వీధి దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, కార్యదర్శి, గంగవరం

అడిగేదెవరు.. అంతా మాఇష్టమే!

రోడ్డు పనుల్లో అలసత్వం

బూసీపుట్టు సమీపంలో మలుపు వద్ద కోతకు గురైన రహదారి

పెదబయలు, న్యూస్‌టుడే: మన్యంలోని మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరుచేస్తున్న ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) రహదారులు కొంతమంది గుత్తేదారులకు వరంలా మారుతున్నాయి. మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనులు కావడంతో.. ఎలా నిర్మిస్తే అడిగేదెవరు అన్నరీతిలో వ్యవహరిస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో వారి అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. నిర్మించిన రెండేళ్లకే పాడైపోతున్నాయి. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని కుమడ నుంచి బూసీపుట్టు, జామిగుడ మీదుగా ఒడిశా సరిహద్దు వరకు రూ. 2.80 కోట్లతో నిర్మించిన తారురోడ్డే దీనికి నిదర్శనం.

★ జామిగుడ మీదుగా ఒడిశా సరిహద్దు వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రహదారిని నిర్మించారు. పనులు అంతంతమాత్రంగా చేపట్టి మమ అనిపించడంతో ఏడాది క్రితం ఈనాడు, ఈటీవీలో కథనాలు వెలువడడంతో ఎట్టకేలకు రహదారిని పూర్తిచేశారు. కొద్ది రోజులకే నాణ్యత లోపాలు బయటపడుతున్నాయి. ప్రమాదకర మలుపులతోపాటు ఎక్కడపడితే అక్కడ రహదారి కోతకు గురై రాళ్లు తేలిపోవడం, కొన్నిచోట్ల పూర్తిగా తారురోడ్డే కానరాని స్థితిలో ఉంది. దీనిని ఎలా పర్యవేక్షించి బిల్లులు చెల్లించారో ఇంజినీరింగ్ అధికారులకే ఎరుక. పదికాలాలపాటు ఉండాల్సిన రహదారి మూణ్నాళ్లకే ముక్కలవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో జామిగుడ వరకు ఆర్టీసీ బస్సు వెళ్తుంది. మరికొద్ది నెలల్లో రహదారి పూర్తిగా దెబ్బతింటుందని.. తమ రవాణా కష్టాలు యథావిధిగా ఉంటాయని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని కోరుతున్నారు.

జామిగుడ వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

ఉపాధ్యాయుడు సత్యనారాయణ దంపతులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక.. ఆత్మీయ వేడుక

సీలేరు, న్యూస్‌టుడే: వారంతా 33 సంవత్సరాల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్నారు.. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. మూడు దశాబ్దాల తర్వాత అంతా ఓచోట కలిసి సందడి చేశారు. సీలేరు జడ్పీ ఉన్నత పాఠశాల 1992 పదో తరగతి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉదయం జరిగింది. పూర్వ విద్యార్థులంతా తరగతి గదుల్లో కూర్చుని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అల్లరి చేసినవారికి, బాగా చదవని వారికి ఉపాధ్యాయులు ఇచ్చే పనిష్మెంట్లను మరోసారి నాటి గురువుల నుంచి పొందారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు సత్యనారాయణ, దంపతులను సత్కరించారు. మదీనావల్లి, త్రినాథ్, పి. వెంకటేశ్వరరావు, పాపారావు, అప్పలనాయుడు, లుక్మాన్, దేవరాయ్, మణిచంద్ర, ఈశ్వరి, రమణమ్మ, సుజాత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎండిన చెట్టు... పట్టించుకుంటే ఒట్టు

మారేడుమిల్లి ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు వసతి సదుపాయం కల్పించడంతోపాటు, ఆహ్లాదాన్ని అందించే లక్ష్యంతో 'వనవిహారి' పర్యాటక ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. కాటేజీలు, రిసార్టు నిర్మించారు. వాటిలో పర్యాటకులకు విడిది సదుపాయం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో నిత్యం పర్యాటకులు ఈ ప్రాంతంలో తిరుగుతూనే ఉంటారు. అయితే ఇక్కడ ఒక చెట్టు ప్రమాదకరంగా ఉంది. ఇది ఎండిపోయి ఉండటంతో ఎప్పుడు పడిపోతుందోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, దీనిని తొలగించడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. – మారేడుమిల్లి, న్యూస్‌టుడే

పొలాల్లో ప్రమాదకరంగా..

పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో వ్యవసాయాభివృద్ధి కోసం కొన్నేళ్ల క్రితం పొలాల్లో బావులు ఏర్పాటుచేశారు. మోటార్లను అమర్చారు. తరువాత పర్యవేక్షణ లేక ఇవి నిరుపయోగంగా తయారయ్యాయి. వీటిని బాగు చేయలేదు. కనీసం పూడ్చకుండా వదిలేశారు. దీనితో ఇవి పొలాల మధ్య ప్రమాదకరంగా ఉన్నాయి. పెదబయలు మండలంలోని సీతగుంట, పన్నెడ, లకేయిపుట్టు, బంగారుమెట్ట, గంపరాయి తదితర చోట్ల ఇవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వీటిని వినియోగంలోకి తీసుకొస్తే రెండో పంటకు అవకాశం ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని పలువురు కోరుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

బంగారుమెట్టలో పొలాల్లో నిరుపయోగంగా బావి

వంతెన నిర్మించి... రహదారిని విస్మరించి!

ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీలోని పేటమాలిపుట్టు సమీపంలో రూ.40 లక్షలతో వంతెన నిర్మించిన అధికారులు.. రహదారి నిర్మాణాన్ని విస్మరించారు. పేటమాలిపుట్టు, కుమ్మరిపుట్టు, తలింభా, డీంగుడ, మురళిపుట్టు, రంగిలిసింగి, డొక్రిపుట్టు, కోడాపుట్టు గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో వంతెనకు ఇరువైపులా రోడ్డు నిర్మాణం చేపట్టక అక్కడి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

పేటమాలిపుట్టు సమీపంలో నిర్మించిన వంతెన

కొత్తూరులో తాగునీటి కష్టాలు

పెదబయలు మండలం మారుమూల జామిగుడ పంచాయతీ కొత్తూరులో తాగునీటి కష్టాలు తీర్చాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ గ్రావిటీ పథకం మూలకు చేరింది. జల్‌జీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా ఆగిపోయింది. తెగిపడిన గ్రావిటీ పథకం పైపులైను నుంచి వస్తున్న నీటిని పట్టుకొని అవసరాలు తీర్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే పథకాలను పునరుద్ధరించి కష్టాలు లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగదీష్‌ని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. – పెదబయలు, న్యూస్‌టుడే

కొత్తూరులో కొండధార వస్తున్న ఈ నీరే గిరిజనులకు ఆధారం..

అ వీ ఇ వీ

గిరిజనులకు వితరణ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గిరిజనులకు సేవ చేయడం అభినందనీయమని పెదవలస సర్పంచి కృష్ణవంశీ, వైస్ ఎంపీపీ ఆనందరావు అన్నారు. యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అడ్‌హాక్ కమిటీ నర్సీపట్నం యూనిట్ బృందం ఆదివారం పెదవలసలో రొంపుల, కొకితపాడు, డొకులూరు, బంధవీధి, చాపరాతిపాలెం, పెదలంక, తియ్యామామిడి గ్రామాల్లోని 150 గిరి కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వ్యవసాయ పరికరాలు, ఉన్ని దుస్తులు, రగ్గులు పంపిణీ చేశారు. పంచాయతీ అధ్యక్షులు త్రిమూర్తులు, పీఏసీఎస్ మాజీ ఛైర్‌పర్సన్ ప్రసాద్, పెసా ఉపాధ్యక్షులు బాలయ్య, పాలపర్తి సత్యానందం, సభ్యులు పాల్గొన్నారు.

పెదవలసలో గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులు

ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు చేపట్టాలి

చింతూరు, న్యూస్‌టుడే: మన్యంలో నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు డివిజన్ ప్రధాన కార్యదర్శి రాఘవయ్య డిమాండ్ చేశారు. చింతూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వాహనాలపై విచ్చలవిడిగా ఫైనాన్స్ చేస్తూ గిరిజనులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరారు.

రాజేంద్రపాలెంలో సెమీ క్రిస్మస్

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెం గ్రామంలోని ఒలీవల ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. కారుణ్య మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్, రెవరెండ్ డాక్టర్ చిక్కాల దైవకృప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు చూపిన మార్గం అందరికీ అనుసరణీయమన్నారు. దైవకృప దంపతులను బ్రదర్ నెహెమ్యా, స్వరూపరాణి దంపతులు, సంఘ సభ్యులు సన్మానించారు. నర్సీపట్నంకు చెందిన రెవరెండ్ ఫిలిప్, రాజవొమ్మంగి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బాబూరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను నియంత్రించాలి

చింతూరు, న్యూస్‌టుడే: దేశంలో మహిళలపై జరుగుతున్న హింసలను ప్రభుత్వం నియంత్రించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి డిమాండ్ చేశారు. 'మహిళలపై జరుగుతున్న హింస' అనే అంశంపై ఆదివారం చింతూరులో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. చిన్నారుల నుంచి వృద్ధుల మహిళల వరకు నిరంతరం దాడులకు గురవుతున్నారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడటంతో ఇలాంటి దాడులు అధికమవుతున్నాయని, రాష్ట్రంలో బెల్టు షాపుల నిర్వాహణపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా నాయకులు రంగమ్మ, రాములమ్మ, సుబ్బమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

పర్యాటక ప్రాంతాలు కళకళ

కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసింది. జలపాతం అందాలు, ప్రకృతి సోయగాలు ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున సందర్శకులు తరలివచ్చారు.

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు సమీపంలోని వంజంగి మేఘాలకొండకు పర్యాటకులు పోటెత్తారు. పోలీసులు ట్రాఫిక్ నివారణ చర్యలు చేపట్టారు. సందర్శకుల ద్వారా రూ. 1.8 లక్షల ఆదాయం వచ్చిందని ఎకో టూరిజం నిర్వాహకులు తెలిపారు.

బొర్రాగుహల ముఖద్వారం వద్ద..

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చాపరాయి జలవిహారి, అంజోడ సిల్క్‌ఫాం పీనరీ పర్యాటకులతో కళకళలాడాయి. మంచు అందాలు, జాతీయ రహదారికి ఇరువైపులా పసుపు పూల సోయగాల నడుమ పర్యాటకులు ఫొటోలు తీసుకున్నారు. చాపరాయిలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడడంతో ఎస్సై పాపినాయుడు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

అనంతగిరి, న్యూస్‌టుడే: కటికి, తాడిగుడ జలపాతాలు, డముకు, గాలికొండ వ్యూపాయింట్లు, బొర్రాగుహలు, కాఫీ తోటలను అధిక సంఖ్యలో సందర్శించారు. ఆదివారం ఒక్కరోజే గుహలను సుమారు 6 వేల మంది సందర్శించగా.. దాదాపు రూ. 4 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు గుహల మేనేజరు గౌరీశంకర్ చెప్పారు. కాఫీతోటల వద్ద మంచు అందాలలో ఫొటోలు తీసుకునేందుకు పర్యాటకులు ఆసక్తి చూపించారు.

చాపరాయిలో..

పొల్లూరుకు పోటెత్తారు!

మోతుగూడెం, న్యూస్‌టుడే: రవితేజ హీరోగా నిర్మిస్తున్న సినిమా కోసం మోతుగూడెం పర్యాటక ప్రాంతాల్లో పలుచోట్ల సెట్టింగులు ఏర్పాటు చేశారు. పర్యాటకులు వాటిని వీక్షించటానికి ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. పొల్లూరు దిగువ జలపాతంపై ఏర్పాటు చేసిన సెట్టింగుపైకి ఎక్కి సందర్శకులు జలపాతం అందాలను వీక్షించారు. పొల్లూరు ధారాలమ్మ పిక్నిక్ స్పాట్, ఎగువ దిగువ జలపాతాలు, ఫోర్‌బే, పికప్, డొంకరాయి జలపాతాల వద్దకు వెళ్లి ప్రకృతి అందాలను తిలకించారు.

జలపాతం అందాలను వీక్షిస్తున్న సందర్శకులు

జిల్లా ఆసుపత్రికి వితరణ

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు జిల్లా ఆసుపత్రికి రాజమహేంద్రవరానికి చెందిన ఓఎన్‌జీసీ ప్రతినిధులు ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సన్‌ట్రేటర్లు అందించారు. ఇన్‌ఛార్జి పర్యవేక్షకురాలు హేమలతాదేవికి ఆదివారం వీటిని ఇచ్చారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సీఎస్‌ఆర్ కింద వీటిని అందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఓఎన్‌జీసీ వైద్యాధికారి డాక్టర్ రామ్మోహన్, సహాయ ఆచార్య డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

సామగ్రితో ప్రిన్సిపల్ హేమలతాదేవి, ఓఎన్‌జీసీ ప్రతినిధులు

హుండీ లెక్కింపు 17న

రంపచోడవరం, న్యూస్‌టుడే: సీతపల్లి బాపనమ్మ తల్లి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపును ఈ నెల 17న నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి సత్యరమేష్, ఛైర్మన్ కుంజం బాపన్నదొర తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారుల సమక్షంలో దీన్ని లెక్కిస్తామన్నారు.

పొగ... ప్రజలకు సెగ

చెత్త కాలుస్తుండడంతో వ్యాపిస్తున్న పొగ

మారేడుమిల్లిలోని ప్రజలు పొగతో ఇబ్బందులు పడుతున్నారు. పొగ కారణంగా పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్య పరిస్థితులకు గురవుతున్నారు. మారేడుమిల్లిలోని వీధులను శుభ్రం చేయడం ద్వారా వచ్చిన చెత్తను గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది శివారులోని వంతెన (శివాలయం)వద్ద వేస్తుంటారు. ఈ చెత్త ఎక్కువగా పేరుకుపోయిన సందర్భంలో దీనికి నిప్పు పెట్టి కాల్చివేస్తుంటారు. చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా ఉండడంతో పొగతో పాటు, దుర్వాసన వెదజల్లుతోంది. దీనితో పరిసరాల్లోని ఇళ్లల్లో ఉంటున్న వారితో పాటు, ఈ మార్గంలో ప్రయాణించే వారంతా తీవ్ర అసౌకర్యానికి, అనారోగ్యాలకు గురౌతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – మారేడుమిల్లి, న్యూస్‌టుడే

విలువైనవి.. వృథాగా వదిలేశారు!

చింతూరు, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వ హయాంలో ఎర్రంపేటలో భూ గర్భ డ్రైనేజీ ఏర్పాటుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. ఈ టెండరును దక్కించుకున్న గుత్తేదారు ఈ పనులు చేపట్టేందుకు కావల్సిన సామగ్రి తీసుకు వచ్చి మండల పరిషత్తు కార్యాలయంలో నిల్వ చేశారు. ఆ కొద్ది రోజులకే రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడటంతో ఈ పనులకు బ్రేక్ పడింది. అప్పటికే నిర్మాణానికి తరలించిన సామగ్రిని గుత్తేదారు ఇక్కడే వదిలేశారు. కాగా ప్రస్తుతం చింతూరు పంచాయతీ అధికారులు అక్కడక్కడ వీటిని చెత్త కుండీలుగా ఏర్పాటు చేశారు.

ఎంపీడీవో కార్యాలయంలో వదిలేసిన సామగ్రి

శ్రమదానంతో గుంతల పూడ్చివేత

అనంతగిరి, న్యూస్‌టుడే: బొర్రా-కోనాపురం రహదారి అధ్వానంగా తయారై వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీల్లేని విధంగా తయారైంది. పలు చోట్ల ప్రమాదకరంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొర్రా మోటారు యూనియన్ సభ్యులు ఆదివారం శ్రమదానంతో గుంతలు పూడ్చారు. కోతకు గురైన చోట సరిచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

గుంతలో రాళ్లు పేర్చుతున్న మోటారు యూనియన్ సభ్యులు

'థింసా' ప్రదర్శనతో ఉపాధి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో గిరి మహిళలు థింసా నృత్యం ప్రదర్శనతో వినోదాన్ని పంచుతూ, ఉపాధి పొందుతున్నారు. ఆదివాసీ నృత్యం థింసాకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. పాడేరు ఐటీడీఏ, పంచాయతీ సహకారంతో చెరువులవెనం ముఖద్వారమైన భీమునాపల్లి గ్రామం వద్ద థింసా నృత్య ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. పర్యాటక సీజన్ ముగిసే వరకు రోజూ ఉదయం ఆరు నుంచి 11 వరకు, సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దీన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకుడు బొబ్బిలి కామేశ్వరరావు తెలిపారు. సర్పంచి కొర్రా శాంతి, మాజీ సర్పంచి రఘునాథ్, వీఆర్వో సదానందరావు, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు బలరామ్ పాల్గొన్నారు.

గిరి మహిళలతో థింసా నృత్యం చేస్తున్న పర్యాటకులు

గిరిజన రైతులకు మేకలు, గొర్రెలు

వై.రామవరం, న్యూస్‌టుడే: గిరిజన రైతులకు మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. ఈ పథకంలో మండలం నుంచి 3,870 లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. ఎంపికైన లబ్ధిదారులు 10 శాతం వాటా రుణం చెల్లించాల్సి ఉందన్నారు. ఎంపికైన ప్రతి లబ్ధిదారుడు ఆయా పథకానికి అవసరమయ్యే 10 శాతం వాటారుణం చెల్లించాలని తెలిపారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టా పొందిన షెడ్యూల్ తెగల లబ్ధిదారులు వారి వాటాను చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు పశు వైద్యుడిని సంప్రదించాలని తెలిపారు.

వై.రామవరంలో వైద్య శిబిరం నేడు

వై..రామవరం, న్యూస్‌టుడే: వై.రామవరంలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన నిర్వహించే ఈ వైద్య శిబిరంలో జనరల్, కంటి వైద్య నిపుణులు హాజరవుతారన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని తెలిపారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి సహకారంతో వైద్య సేవలు అందిస్తారన్నారు.

ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.కృష్ణయ్య, వెంకట నారాయణ, కన్నారావు విజ్ఞప్తి చేశారు. రేఖపల్లిలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, బోధనేతర పనుల నుంచి తమని తప్పించాలని కోరారు. తొలుత సంఘం పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు.

పతాకావిష్కరణ చేస్తున్న ఉపాధ్యాయులు

బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి అందజేత

మోతుగూడెం, న్యూస్‌టుడే: బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో నివసిస్తున్న నిరుపేద పాలుమూరి శంకర పార్వతికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 41,084 చెక్కును ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం అందజేశారు. ఈమె కుమారుడు సాయితేజకు రెండు నెలల కిందట తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భద్రాచలం ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించారు. ఈమె పరిస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే శిరీషాదేవి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందేలా చొరవ చూపారు. సత్యనారాయణ, గురుమూర్తి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ

శివయ్యకు ప్రత్యేక పూజలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: అరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

అలంకరణలో ఉమారామలింగేశ్వర స్వామి

బాపనమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

రంపచోడవరం, న్యూస్‌టుడే: సీతపల్లిలో వేంచేసిన బాపనమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారికి మొక్కులను సమర్పించుకొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసినట్టు ఆలయ ఛైర్మన్ కుంజం బాపన్నదొర, ఈవో సత్యరమేష్ తెలిపారు. ఆలయం వద్ద ఎటువంటి ఘర్షణలు జరగకుండా ఎస్సై వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును నిర్వహించారు.



బాపనమ్మతల్లి

సైబర్ నేరాలపై అప్రమత్తం

సీలేరు, న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయని సీలేరు ఎస్సై యాసిన్ పేర్కొన్నారు. ఆదివారం ధారకొండ వారపుసంతలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, నిషేధిత డ్రగ్స్ విక్రయించడం, కొనుగోలు చేయడం, వాడటం నేరమన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించాలని ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించాలని పేర్కొన్నారు.

ధారకొండ వారపుసంతలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై యాసిన్

రాత్రివేళల్లో పోలీసుల గస్తీ

చింతపల్లి, న్యూస్‌టుడే: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాధారణంగా పోలీసులు రాత్రివేళ గస్తీ విధులకు దూరంగా ఉంటారు. భద్రతాపరమైన కారణాలతో కేవలం పగటి వేళల్లో వాహన తనిఖీలకే పరిమితం అవుతారు. మారిన పరిణామాలతో పోలీసులు రాత్రివేళ మైదాన ప్రాంతాల మాదిరిగానే పెట్రోలింగ్ విధుల్లో నిమగ్నం అవుతున్నారు. ఇటీవల చింతపల్లి ప్రాంతంలో ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఇళ్లు, దుకాణాల ముందు ఉంచిన ద్విచక్రవాహనాలను దొంగలు చోరీకి పాల్పడుతున్నారు. వీటిని అరికట్టాలని రాత్రివేళల్లో పోలీసుల గస్తీ పెంచాలని ఎస్పీ ఆదేశించారు. దీంతో రాత్రివేళల్లో చింతపల్లిలో నైట్ పెట్రోలింగ్‌ను చేపడుతున్నట్లు సీఐ వినోద్‌బాబు, ఎస్సైలు వెంకటరమణ, వెంకటేశ్వరరావు తెలిపారు.

బోర్ల మరమ్మతుకు చర్యలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరి గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ స్వర్ణలత తెలిపారు. దీనికి అవసరమైన సామగ్రిని ఆదివారం ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు. రూ. 5 లక్షలతో ఈ సామగ్రిని కొనుగోలు చేశామని, వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

200 ఏళ్ల నాటి దక్షిణావృత శంఖం

ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా వెలుగొందుతోన్న మంగళగిరిని ఒకప్పుడు మంగళాద్రిగా పిలిచేవారు. పడుకున్న ఏనుగు ఆకారంలో ఈ కొండ ఉండడం దీని ప్రత్యేకత. ఇక్కడి శ్రీపానకాల లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో 204 ఏళ్ల నాటి దక్షిణావృత శంఖానికి ఎంతో విశిష్టత ఉంది. ఇది బంగారు తొడుగుతో ఉంటుంది. తంజావూరు మహారాజు రెండో సర్ఫోజీ 1820లో దేవాలయాన్ని సందర్శించిన సమయంలో దీన్ని స్వామివారికి బహూకరించారు. దీని నుంచి నిత్యం ప్రణవనాదం (ఓంకారం) వినిపిస్తుందని అర్చకులు చెబుతున్నారు. ఏటా వైకుంఠ ఏకాదశి రోజు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. ఆ రోజు ఈ శంఖం ద్వారా తీర్థం అందజేస్తారు. దీన్ని స్వీకరించిన వారికి గ్రహ బాధలు, వ్యాధులు తొలగుతాయని భక్తుల విశ్వాసం. మిగిలిన రోజుల్లో దీన్ని బ్యాంక్ లాకర్‌లో భద్రపరుస్తారు. **- న్యూస్‌టుడే, తాడేపల్లి, మంగళగిరి**

మహా నాట్య నీరాజనం

బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి సంయుక్తంగా తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రెండు రోజులుగా తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహిస్తున్నాయి. ఆదివారం కూచిపూడి మహా నాట్య ప్రదర్శన నిర్వహించారు. సుమారు 500 మంది కూచిపూడి కళాకారిణుల నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. నృత్య గురువులు జి.నిర్మలారమేష్, ఎ.వెంకటలక్ష్మి, ఎల్.శ్రీరామచంద్రమూర్తి, సి.హెచ్.యామిని, బి.రంగనాయకి, పి.వసంత దుర్గ, సి.హెచ్.బాలాత్రిపుర సుందరి సమన్వయం చేశారు. నిర్వాహకులు బొల్లిముంత కృష్ణ, చందు సుబ్బారావు పర్యవేక్షించారు. **- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**

నృత్య ప్రదర్శన చేస్తున్న కూచిపూడి కళాకారిణులు

జాప్యం వద్దు.. జాగ్రత్త పడదాం

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న స్క్రబ్ టైఫస్ కేసులు
- అధికారులు అప్రమత్తం; జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు

ఈనాడు, అమరావతి

గుంటూరు శివారు గ్రామాన్ని పట్టిపీడించిన మెలియాయిడోసిస్ వేదన మరువక ముందే రాష్ట్రవ్యాప్తంగా మరో వ్యాధి తెరపైకి వచ్చింది. అన్ని జిల్లాల్లోనూ స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కావడంతో ఇక్కడా ఉలికిపాటు మొదలైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 50 మందికి ఈ వ్యాధి సోకగా.. పలువురు ఇప్పటికే కోలుకున్నారు. ఆదివారం సాయంత్రానికి 14 మంది జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. శనివారం ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలు ఇదే వ్యాధితో చనిపోగా, అదే రోజు అర్ధరాత్రి పల్నాడు జిల్లాకు చెందిన మరో మహిళ ప్రాణాలు కోల్పోయారు. ఈమెకు కిడ్నీ సంబంధ సమస్యలూ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

తక్షణ స్పందన బృందాల ఏర్పాటు

అనుమానిత లక్షణాలతో గుంటూరు జీజీహెచ్‌కు వచ్చే వారిని ప్రత్యేకవార్డుల్లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షల కోసం ప్రత్యేక ప్రయోగశాల సిద్ధం చేశారు. వ్యాధి నిర్ధారణ అయినంతనే వారి ఆరోగ్య పరిస్థితులను బట్టి చికిత్స ఉంటోంది. అలాగే, వారి చిరునామాల ఆధారంగా ఆయా ప్రాంతాలకు తక్షణ స్పందన బృందాలను పంపించి పరిసరాల్లోని ప్రజలకూ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

లక్షణాలు ఇలా.. స్క్రబ్ టైఫస్ అనేది ఒక రకమైన జ్వరం. ఇది మైట్ (నల్లి తరహా పురుగు) కరిచినప్పుడు వస్తుంది. అడవులు, పంట పొలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుంది. పురుగు కరిచిన ప్రదేశంలో చర్మంపై చిన్నపాటి నల్లని పుండు ఏర్పడుతుంది. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, దద్దుర్లు దీని ప్రధాన లక్షణాలు.

ఈ చర్యలతో దూరం

- గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ఇంట్లో తడి దరి చేరనీయకూడదు
- కాళ్లు, చేతులు కప్పి ఉండేలా దుస్తులు ధరించాలి
- పంట పొలాల్లో పనిచేసే వారు ఏదైనా పురుగు కరిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

లక్షణాలు ఉంటే ఆలస్యం చేయొద్దు

స్క్రబ్ టైఫస్ లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే పరీక్షలు చేయిస్తే నిర్ధారణ చేయొచ్చు. తద్వారా సరైన చికిత్స తీసుకొని కోలుకోవచ్చు. అలా కాకుండా ఆలస్యం చేస్తే అవయవాల వైఫల్యానికి దారితీసి ఇబ్బందిగా మారడానికి అవకాశం ఉంది.

- డాక్టర్ అనిల్, జనరల్ మెడిసిన్, గుంటూరు జీజీహెచ్

రాజధానిలో నేడు ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల బృందం పర్యటన

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలో సోమవారం ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ప్రతినిధుల బృందం పర్యటించనుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారు పర్యటించి. రహదారులు, భవన నిర్మాణాలు, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి, ఎల్‌పీఎస్ లేఔట్లు, కాలువలు, రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. పని ప్రదేశంలో కార్మికులకు గుత్తేదారు సంస్థలు కల్పిస్తున్న సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు, రక్షణ, భద్రత చర్యల కోసం పాటిస్తున్న జాగ్రత్తలను పరిశీలించనున్నారు. హైకోర్టు, ఎన్‌జీవో భవన సముదాయాలు, సీడ్ యాక్సెస్ రహదారి (ఈ-3) మీదుగా ఆర్‌వీఆర్ క్యాంపును సందర్శించి రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తారు. అనంతరం ఈ-9, పెనుమాక రిజర్వాయర్‌లను పరిశీలించనున్నట్లు సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

హైకోర్టుకు వెళ్లే బస్సు సమయం మార్పు

పట్నంబజారు, న్యూస్‌టుడే: గుంటూరు బస్టాండ్ నుంచి హైకోర్టుకు(వయా తుళ్లూరు) నడుపుతున్న జనరల్ బస్సు సమయాన్ని 15 నిమిషాల ముందుకు మార్చినట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఉదయం 8 గంటలకు బయలుదేరే బస్సు ఇకనుంచి 7.45 గంటలకే వెళుతుందన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి మారిన బస్సు సమయం అమల్లోకి వస్తుందన్నారు. మిగిలిన ట్రిప్పుల సమయం యథావిధిగానే కొనసాగుతుందన్నారు.

కార్పొరేషన్‌లో ఎలుకలు పడ్డాయి..!

కీలక దస్త్రాల కొరికివేత; కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌ పైనా దాడి

ఈనాడు, అమరావతి

గుంటూరు నగరపాలకసంస్థ (జీఎంసీ) కార్యాలయంలో మూషికాలు ప్రధాన ఇబ్బందిగా మారాయి. అక్కడా ఇక్కడా అని కాదు.. కమిషనర్ ఛాంబర్ నుంచి అనేక విభాగాల వరకు ఇదే పరిస్థితి. కీలక ఫైళ్లను కొరికేస్తుండడం సమస్యగా తయారైంది. చివరకు కంప్యూటర్లు, హార్డ్‌డిస్కులనూ వదిలి పెట్టకపోవడంతో కార్యాలయంలోని అనేక విభాగాలు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పెస్ట్ కంట్రోల్ ప్రేక్షకపాత్రకే పరిమితం కావడం ఇక్కడ సమస్యను జటిలం చేస్తోంది.

క్షణం కూర్చోలేం.. సాక్షాత్తూ కమిషనర్ ఛాంబర్ పరిసరాల్లోనే ఎలుకల మంద శబ్దాలతో క్షణం కూర్చోలేని పరిస్థితి. ఎటువైపు నుంచి దాడి చేస్తాయో, కరుస్తాయోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు. ఇక్కడ బీరువాల్లో కాకుండా ఆరుబయట ఉంచిన ఫైళ్లను కొరికేస్తున్నాయి. ఓ దశలో కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయగా.. వాటినీ ధ్వంసం చేయడం గమనార్హం. కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌ల వైర్లనూ పాడు చేస్తుండడంతో అవస్థ పడుతున్నారు. పథకాల ప్రచార కరపత్రాలు, ఇతర సామగ్రీ పనికిరాకుండా చేసిన ఉదంతాలు ఉన్నాయి.

రూ.1,500 కోట్ల వార్షిక బడ్జెట్.. 10 లక్షల మంది జనాభా.. ఇలా అతి పెద్ద నగరపాలికగా పేరొందిన జీఎంసీలో గత కొన్నేళ్లుగా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ఇందులో ఎలుకల సమస్య కూడా ఒకటి. జీఎంసీ ప్రధాన కార్యాలయానికి సమీపంలోని గాంధీపార్కుకు మధ్య గతంలో ఓ భూగర్భ పైపులైను వ్యవస్థ ఉండేదని కొందరు సిబ్బంది చెబుతున్నారు. ఆ సమయంలో పార్కులో నుంచి ఎక్కువగా జీఎంసీలోకి ఎలుకలు వచ్చేవన్నది వారి మాట. అది మూసేశాక కొంతమేర తగ్గినప్పటికీ.. ప్రస్తుతం మళ్లీ పుంజుకున్నట్లు తెలుస్తోంది. కార్యాలయం సమీపంలో ఉన్న కూరగాయలు, పండ్ల మార్కెట్లు, గాంధీపార్కులో నుంచి వీటి దాడి తీవ్రమవుతోంది. జీఎంసీలో పాటైన గదులు కూడా ఎలుకలకు అడ్డాగా మారడం సమస్యను జటిలం చేస్తోంది.

పెస్ట్ కంట్రోల్ ఏమైనట్లు? నగరం మొత్తానికీ సమస్యలు తీర్చే జీఎంసీకే ఎలుకల సమస్యలు వెంటాడుతుండగా.. పెస్ట్ కంట్రోల్ ఏమైందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అసలు నిర్వహణలో ఉందా? లేదా? అన్న సందేహం వ్యక్తమవుతోంది. రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్.. ఇలా అనేక కీలక విభాగాల్లో నిత్యం రూ.కోట్ల విలువైన పనులకు అనుమతులు, ఆమోదాలు, బిల్లుల మంజూరు చేస్తుంటారు. ఇలాంటి చోట మూషికాల దాడులకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా జీఎంసీ ఉన్నతాధికారులు చొరవ చూపాల్సిన అవసరం కనిపిస్తోంది..!!

ఊరికి ఉపకారం.. మనసులు బంగారం

చిలువూరు అభివృద్ధికి ఎన్నారైల చేయూత

ప్రవాస భారతీయురాలు అన్నే ఓల్గా నిర్వహిస్తున్న వైద్యశాల

ఒకప్పుడు 'ఇంటర్నెట్ విలేజ్‌గా' రాష్ట్రంలోనే పేరు సాధించిన చిలువూరు ప్రవాసభారతీయుల గ్రామంగా పేరొందింది. అంతర్జాలంపై ప్రాచుర్యం లేని రోజుల్లో ఇక్కడ పలువురు వినియోగదారులు ఉండేవారు. ఇక్కడ 9 వేల జనాభా ఉండగా.. సుమారు 250 మందికి పైగా వేర్వేరు దేశాల్లో నివసిస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, అరబ్‌దేశాలు తదితర చోట్ల తమ ప్రావీణ్యాన్ని చాటుతూ ఉపాధి పొందుతున్నారు. వీరిలో చాలా మంది సొంత ఊరి అభివృద్ధికి చేయూత అందిస్తున్నారు. అప్పట్లో ఎన్నారై కాట్రగడ్డ కృష్ణప్రసాద్ గ్రామంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి వందల మందికి అవగాహన ఏర్పరిచారు. ఆయన సమకూర్చిన లక్షలాది రూపాయల భాగస్వామ్యంతో ప్రభుత్వం నిధులు జోడించి అంతర్గత రోడ్లు నిర్మించింది. మరో ప్రవాస భారతీయుడు, సీనియర్ వైద్యుడు హేమప్రసాద్ పాఠశాలకు అనుసంధానంగా గ్రామ ప్రజల కోసం విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చాలాకాలం ప్రజలు వినియోగించారు. ఇప్పుడు ఎయిడెడ్ స్కూలు తొలగించడంతో ఆ కేంద్రాన్ని వినియోగించేవారు లేకుండాపోయారు. ఎన్నారై అన్నె ఓల్గా తాను జన్మించిన గ్రామంలో ప్రజలు వైద్యానికి ఇబ్బంది పడకుండా తమ ఛారిటీస్ తరఫున వైద్యశాల కొన్నేళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికీ అక్కడ ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. **-న్యూస్‌టుడే, చిలువూరు(దుగ్గిరాల)**

కృష్ణప్రసాద్ భాగస్వామ్యంతో నిర్మించిన సీసీ రోడ్డు

లొట్టలేసే రుచి.. లాగించెయ్యరా మరి..!

బెల్లం తయారు చేస్తున్న రైతులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే

తెలుగింటి పిండి వంటల్లో అరిసెలది ప్రత్యేక స్థానం. సంక్రాంతి వచ్చిందంటే తెలుగింటి లోగిళ్లన్నీ అరిసెల ఘుమఘుమలతో నిండిపోతాయి. వీటి తయారీలో వాడే బెల్లానికి దుగ్గిరాల మండలం శృంగారపురం పెట్టిందిపేరు. ఏటా డిసెంబర్ మొదటి వారం నుంచి 40 రోజుల పాటు ఇక్కడ బెల్లం తయారు చేస్తారు. ఇది సుదూర ప్రాంతాలకూ రవాణా అవుతోంది. ఎటువంటి కల్తీ లేని, రసాయన రహిత చెరుకురసంతో బెల్లం

రవాణాకు సిద్ధంగా..

శృంగారపురం బెల్లం స్థానం ప్రత్యేకం

తయారుచేయడం ఇక్కడి ప్రత్యేకత.

మూడు క్రషర్ల నిర్వహణ... ఇక్కడ ప్రస్తుతం మూడు క్రషర్ల యజమానులు సుమారు 18 ఎకరాల చెరకు సాగు చేస్తున్నారు. రోజుకు దాదాపు 15 క్వింటాళ్ల చొప్పున బెల్లం ఉత్పత్తి చేస్తారు. కిలో రూ.130 చొప్పున విక్రయిస్తున్నారు. లీటరు రూ. 120 చొప్పున బెల్లం పాకం కూడా అమ్ముతున్నారు.

లక్ష్యం ఘనం.. ఆచరణలో కనం..!

గుంటూరు జీజీహెచ్‌లో అమలు కాని కాలేయ, కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సలు

ఈనాడు, అమరావతి

లక్ష్యాలు ఘనంగానే ఉన్నాయి.. ఆచరణలో మాత్రం అమలుకు నోచడం లేదు. ప్రభుత్వ అనుమతులు రాక ప్రతిబంధకంగా మారడం, అవసరమైన సిబ్బందిని సమకూర్చడంలో సమస్యలు నెలకొనడం.. వెరసి పేదలకు ఉచిత కాలేయ, కిడ్నీమార్పిడి శస్త్ర చికిత్సల నిర్వహణ పరంగా ఇబ్బందులు నెలకొంటున్నాయి. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయి.

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల.. ఆరు జిల్లాలకు వైద్య ప్రదాయిని. నిత్యం 5వేల మందికి పైగా రోగులు ఇక్కడ చికిత్స పొందుతుంటారు. ఇంతటి కీలకమైన వైద్యాలయంలో ఈ ఏడాది ఆగస్టు నుంచి మోకీళ్లు, నవంబరు నుంచి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించేందుకు అధికారులు సంకల్పించారు. దీనికి సంబంధించి గతేడాది చివరనే ప్రయత్నాలు ప్రారంభించగా.. ఈ ఏడాది జనవరిలోనే జీవన్‌దాన్ ట్రస్టు అనుమతి ఇచ్చింది. గుంటూరు జీజీహెచ్‌లో చనిపోయిన వారి అవయవాలను సేకరించి, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేసేలా అందులో పేర్కొన్నారు. అయితే, ఇందుకోసం ప్రత్యేక సమన్వయకర్త అవసరం కాగా.. ఆ పోస్టును భర్తీ చేయలేదు. బ్రెయిన్‌డెడ్ కమిటీ సమావేశం కాకపోవడం మరో ఇబ్బందిగా తయారైనట్లు చెబుతున్నారు. ఫలితం.. ఈ ప్రయత్నం కార్యరూపం దాల్చలేదు.

కిడ్నీ మార్పిడిలో అలా.. కిడ్నీ మార్పిడి పరంగానూ కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఇంప్లాంట్స్ ఇవ్వకపోవడంతో కార్యరూపం దాల్చడం లేదని జీజీహెచ్ వర్గాలు చెబుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవలో ఇందుకోసం ప్రత్యేక కోడ్ రూపొందించాల్సి ఉందని, ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు జీజీహెచ్‌లో కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సలకు అనుమతి ఇచ్చింది. 2016లో అప్పటి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఇక్కడే సర్జరీ చేయించుకున్నారు. 2017 జులైలో నాటి ప్రభుత్వం రూ.65 లక్షలు మంజూరు చేయడంతో పేదలకూ 100 మందికి కిడ్నీ మార్పిడి చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇది అమలుకు నోచకపోగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ పట్టాలెక్కించేందుకు అధికారులు ప్రయత్నించగా.. అనుమతులు, సిబ్బంది పరంగా సమస్యలు నెలకొన్నాయి.

ఉన్నతాధికారులకు లేఖ.. ఈ రెండింటికీ సంబంధించిన సమస్యలపై ఇటీవల వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు జీజీహెచ్ వర్గాలు ఓ లేఖ రాశాయి. అందులో అంశాల వారీగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అయితే, ఇది ప్రభుత్వస్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయం కావడంతో ప్రస్తుతం ఎటూ తేలకుండా ఉన్నట్లు సమాచారం. నెలకు కనీసం 10 నుంచి 20 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేయడానికైనా అవకాశం కల్పిస్తే.. ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నది ప్రధానంగా వినిపిస్తోన్న మాట. ఇది అమల్లోకి వస్తే నిరుపేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఆ దిశగా ప్రభుత్వం, వైద్యఆరోగ్యశాఖ ఉన్నత వర్గాలు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం కనిపిస్తోంది..!!

లంచాల షాక్

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, అమరావతి

సీఆర్డీఏ పరిధి విద్యుత్తుశాఖలో పనిచేసే ఓ అధికారి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. పని ఏదైనా తనకు రావాల్సినవి ఇవ్వకపోతే నిలిపేస్తున్నారు. ఉద్యోగ విరమణ లోపు వీలైనంత సంపాదించుకోవడానికి సహకరించాలని బహిరంగంగానే చెబుతున్నారు. రెండునెలల క్రితం సీఆర్డీఏ పరిధిలో విద్యుత్తుశాఖలో అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రెండో రోజే కిందిస్థాయి వారిని పిలిపించుకొని తన లక్ష్యం వివరించారు. మండలాల పరిధిలో ప్రతి పనికి తనకు వాటా రావాలని ఆదేశాలిచ్చారు. అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు వెళ్లాయి. అయినా సీఎండీలోని ఓ ఉన్నతాధికారి అండదండలు ఉండడంతో ఆయనను ఎవరూ ఏమీ చేయలేక పోతున్నారని ఆ శాఖలోనే చర్చ నడుస్తోంది. ఆ అధికారి ధనదాహానికి తట్టుకోలేక కొంతమంది కిందిస్థాయి సిబ్బంది సెలవుపై వెళ్లేందుకు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది.

విద్యుత్తు అధికారి అడిగినంత ఇవ్వకపోతే పని జరగదు

- ధరణికోటలోని ఓ దేవాలయానికి సంబంధించి అధికలోడు కోసం ఆలయ నిర్వాహకులు దరఖాస్తు చేసుకోగా దానికి మండల స్థాయి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అందుకు రూ.30 వేలిస్తే కానీ ప్రతిపాదనలు ఆమోదించనని చెప్పడంతో చేసేది లేక అడిగినంత ఇచ్చారు.
- అదే అధికారి ఇటీవల అమరేశ్వరాలయ దర్శనానికి వచ్చిన సీఎండీకి ఏర్పాట్లు చేయడానికి అమరావతి మండల వైకాపా అధ్యక్షుడికి బాధ్యతలు అప్పజెప్పాడు. దీంతో ఆ వైకాపా నేత సీఎండీ పర్యటనలో హడావుడి చేశాడు ఈ విషయం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైనా ఇంత వరకు చర్యల్లేవు. సదరు అధికారి కుటుంబ సభ్యులు పత్తిపాడు నియోజకవర్గంలో వైకాపా ప్రజాప్రతినిధులుగా ఉండటంతో ఆ పార్టీ నేతలకు అంటకాగుతున్నారనే విమర్శలు న్నాయి.
- మండలాల్లో వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. తనకు తెలియకుండా ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వడానికి వీలు లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సమస్య ఉన్న చోట స్తంభం మార్చినా తనకు రావాల్సినవి ఇవ్వాలని లేకపోతే పని చేయవద్దని చెప్పడం గమనార్హం.
- ఆయా మండలాల పరిధిలో విద్యుత్తు పనులు చేసే గుత్తేదారులను పిలిపించుకుని తాను కొత్త కారు కొనాలని, ఒక్కొక్కరు తనకు రూ.లక్షన్నర చొప్పున ఇవ్వాలని చెప్పారు. పనులు పరిశీలించేందుకు సొంతంగా కారు పెట్టి తీసుకెళతామని అంత ఇచ్చుకోలేమని చెప్పడంతో కొంత మందికి పనులు రాకుండా అడ్డుకున్నారు.
- ఇటీవల అమరావతిలో ఓ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి నియంత్రిక ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోగా అందుకు సదరు అధికారి రూ.50 వేలు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు చేశారని చెప్పినా వినలేదు. చివరకు ఆ అధికారికే ప్రజాప్రతినిధి పీఏ ఫోన్ చేసినా నగదు ఇవ్వనిదే పని చేయలేదు.
- సీఆర్డీఏ పరిధిలోని అధికారి కావడంతో రాజధాని అమరావతి పరిధిలో జరుగుతున్న పనులకు కూడా లంచం ఇవ్వకపోతే అర్ధంతరంగా నిలిపేస్తున్నారని గుత్తేదారులు వాపోతున్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

పొన్నూరు, న్యూస్‌టుడే: రేషన్ బియ్యం అక్రమ రవాణాకు వ్యాపారులకు సహకారం అందిస్తున్న పొన్నూరు గ్రామీణ పోలీసు స్టేషన్ కానిస్టేబుళ్లు ఎం.నాగార్జున, వై.మహేష్‌లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే పోలీసు సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దారి మళ్లిస్తే.. పట్టించే యాప్‌రేషన్

తనిఖీలు చేస్తున్న పౌర సరఫరాల శాఖ అధికారి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పౌరసరఫరాల వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ కూటమి సర్కారు చర్యలు చేపట్టింది. ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులతో క్యూఆర్ కోడ్, ప్రభుత్వ రాజముద్రతో ఉండేలా ముద్రించి కార్డుదారులకు అందించింది. రేషన్ దుకాణాల్లో సరకులు పక్కదారి పట్టకుండా నియంత్రించేందుకు రేషన్ దుకాణాల తనిఖీ పేరుతో ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. దానిలోనే క్షేత్ర స్థాయిలోని చౌక దుకాణాల వివరాలన్నీ నమోదై ఉండడంతో పాటు అక్కడ ఉండాల్సిన సరకుల వివరాలు దర్శనమిస్తాయి. పౌరసరఫరాల శాఖ అధికారులతో పాటుగా తహసీల్దార్ కూడా దీనిని వినియోగించే వెసులుబాటు కల్పించారు. తనిఖీల సమయంలో యాప్‌లో చూపించిన మేరకు దుకాణంలో నిల్వలు లేకపోతే.. వెంటనే డీలర్‌పై కేసు నమోదు చేసేలా రూపొందించారు. దీంతో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించాలనుకుంటే ఇట్టే పట్టించేస్తుంది.

తేడాలుంటే చర్యలే..:

- పౌరసరఫరాల సంస్థ నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్న సరకుల వివరాలు, కార్డుదారుల సమాచారం మొత్తం కూడా రేషన్ దుకాణాల తనిఖీ యాప్‌లో నిక్షిప్తమై ఉంటుంది.
- జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు రేషన్ దుకాణాల్లో తనిఖీలకు వెళ్లిన సమయంలో డిపోల్లో, యాప్‌లోని నిల్వలకు వ్యత్యాసం ఉంటే సదరు డీలరుపై చర్యలు తీసుకుంటారు. కార్డుదారులతో సరకుల సరఫరాపై ఆరా తీసి, ఫిర్యాదులు వస్తే కేసు నమోదు చేస్తారు.
- ప్రతి నెలా డీఎస్‌ఓ, ఆర్డీవో, తహసీల్దార్, సీఎస్‌డీటీలు తప్పకుండా 218 దుకాణాల్లో తనిఖీ చేయాలి.
- ఆయా దుకాణాల్లో గుర్తించిన అంశాలు, అక్రమాలపై ఉన్నతాధికారులకు నివేదించాలి.
- జిల్లాలో నవంబరులో 315 చోట్ల, డిసెంబరులో ఇప్పటివరకు 218 దుకాణాలను తనిఖీ చేశారు.
- గత రెండు నెలల్లో అధికారులు ఏడు కేసులు నమోదు చేశారు.

జోరుగా పనులు.. సమకూరనున్న వసతులు

రాజధానిలో ఎల్‌పీఎస్ లేఔట్ల అభివృద్ధి

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల ఇప్పటికే రహదారులు, భూగర్భ విధానంలో మురుగు నీరు, తాగు నీరు సరఫరాకు పైపులు, విద్యుత్, టెలిఫోన్, ఇంటర్‌నెట్ సౌకర్యాల ఏర్పాటుకు డక్ట్‌ల నిర్మాణం చేపట్టారు. రైతులకు అభివృద్ధి చేసి తిరిగి ఇవ్వాల్సిన ప్లాట్లలో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయటానికి జంగిల్ క్లియరెన్స్ పనులు కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ రాజధాని ప్రాంతానికి భారీగా యంత్రాలు, వాహనాలు, నిర్మాణ సామగ్రి లోడుతో లారీలు తరలి వస్తున్నాయి. భూగర్భ విధానంలో ఏర్పాటు చేసేందుకు రాజధాని ప్రాంతానికి భారీగా విద్యుత్ తీగలను తీసుకు వచ్చి నిల్వ చేశారు. అనంతవరం, నెక్కల్లు, తుళ్లూరు, దొండపాడు, శాఖమూరు, రాయపూడి, నేలపాడు సమీపంలో ఎల్‌పీఎస్ లేఔట్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. పంపింగ్ చేసే పని లేకుండా గ్రావిటీతో ఎగువ నుంచి దిగువకు నీరు ప్రవహించేలా డ్రైనేజీలు, వరద నీరు, తాగు నీటి పైపులను ఏర్పాటు చేయడానికి సర్వే చేసి లెవలింగ్ చేస్తున్నారు. వీటి ద్వారా కాలువల్లో చేరిన వరద నీటిని కృష్ణానదిలోకి మళ్లించేలా నిర్మాణాలు జరగనున్నాయి. రాజధాని నగరాన్ని 10 సీవరేజ్ జోన్లుగా విభజించి మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్‌టీపీ) నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

భారీగా చేరుకున్న విద్యుత్తు తీగల బండిళ్లు

నెక్కల్లు వద్ద లేఔట్లో రహదారి నిర్మాణ పనుల్లో కార్మికులు

5,307 క్యూసెక్కుల నీటి విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్ : వివిధ పంటల అవసరాల నిమిత్తం ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీటి విడుదల కొనసాగుతోంది. రానున్న జనవరి 15వ తేదీ వరకు వ్యవసాయానికి నీటి అవసరాలు ఉంటాయని జలవనరుల శాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 5,307 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 3,211, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 2,010, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 2,306, కేఈబీ (దివిసీమ) 403, ఏలూరు 401, బందరు కాలువకు 101 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ నేడు

కలెక్టరేట్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మీకోసం వెబ్‌సైట్‌లోనూ పీజీఆర్ఎస్ అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల స్థాయి కార్యాలయాల్లోనూ ప్రతి సోమవారం అర్జీలు సమర్పించవచ్చన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

(c) eenadu

నెరవేరనున్న.. 50 పడకల ఆసుపత్రి కల

వైద్యశాల నిర్మాణ పనులకు రూ.5 కోట్లు మంజూరు

ఈనాడు కథనానికి స్పందన

పొన్నూరు, న్యూస్‌టుడే

పొన్నూరు 30 పడకల ఆసుపత్రిని.. 50 పడకలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వం కొద్ది రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేసినట్లు వైద్యశాఖాధికారులు వెల్లడించారు. వైద్యశాల నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. గత వైకాపా పాలనలో 30 పడకల వైద్యశాలను 100 పడకలుగా మార్చేందుకు ప్రతిపాదనలను పంపినట్లు ఆనాటి నేతలు గొప్పలు చెప్పారు. సంవత్సరాలు గడిచినా ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం చేశారు తప్ప ఇచ్చిన మాటను నెరవేర్చలేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించాలని కోరుతూ గతేడాది నవంబరు 5న వంద పడ'కలేనా'..? అనే శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది.

పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఎమ్మెల్యే చొరవతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పరిశీలించిన ప్రభుత్వం 50 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు మార్గదర్శకాలు జారీచేసింది. మంజూరైన నిధులతో భవన నిర్మాణ పనులతో పాటు రోగులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం
- ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ఎమ్మెల్యే

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాం. 50 పడకల వైద్యశాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. గత వైకాపా పాలనలో సరైన వైద్యం అందక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. గర్భిణులకు భోజనం అందించలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గర్భిణులకు పోషకాలతో కూడిన ఆహారం అందిస్తోంది. ఇప్పటికే అనేక రకాల వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చాం.

ధనమున్నా.. ఆనందం లేకపోతే జీవితం వ్యర్థం



బ్రహ్మానందానికి జీవిత సాఫల్య పురస్కారం అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: 'మనిషికి ఎంత ధనం ఉన్నా కూడా ఆనందం లేని జీవితం వ్యర్థం. అలాంటి ఆనందాన్ని అందరికి పంచే సత్తా, శక్తి కలిగిన ముఖాన్ని దేవుడు నాకు ఇచ్చాడు' అని హాస్య బ్రహ్మ కన్నెగంటి బ్రహ్మానందం పేర్కొన్నారు. బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి సంయుక్తంగా ఆదివారం రాత్రి గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన బొల్లిముంత శివరామకృష్ణ జాతీయ స్థాయి జీవిత సాఫల్య పురస్కార ప్రదాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ఆ దేవుడు ఎన్ని జన్మలు ఇచ్చినా అన్నింటిలోనూ ఇతరులకు ఆనందం పంచే జన్మను ఇవ్వాలని కోరుకుంటాను. బొల్లిముంత శివరామకృష్ణ చేసిన ప్రతి పనిలోనూ సమాజ మార్పు, సంకల్పం కనిపిస్తుంది' అని కొనియాడారు. తొలుత కార్యక్రమానికి హాజరైన అతిథులు ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, నిర్వాహకులు చందు సుబ్బారావు, బొల్లిముంత కృష్ణ, తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్, తుమ్మల కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. సభకు శాస్త్రవేత్త చందు సాంబశివరావు అధ్యక్షత వహించారు.

ఆటలు చక్కని వ్యాయామం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆటలు శరీరానికి చక్కని వ్యాయామమని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బాలుర విభాగంలోని పోటీలు డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో, బాలికల పోటీలను స్థానిక ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బాలుర విభాగంలో 13, బాలికల విభాగంలో 13 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు ఎన్.సురేష్‌కుమార్, వి.పద్మావతి తెలిపారు. బాలుర విభాగంలో గుంటూరు-ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు గెలిచింది. బాలికల విభాగంలో విశాఖపట్నం, నెల్లూరు, గుంటూరు జట్లు గెలిచాయి.

30న నారసింహుని ఉత్తర ద్వార దర్శనం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కోగంటి సునీల్ కుమార్ ఆదివారం తెలిపారు. ఏటా ఆ రోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారిని బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు దర్శనం చేసుకునే అవకాశం ఉంది. రాత్రి నమ్మాళ్వార్ అధ్యయనోత్సవాలు (కొరాయి) నిర్వహిస్తారు. ముందురోజు 29వ తేదీ రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారిని జగన్మోహినిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి రోజు బంగారు శంఖు ద్వారా ఇచ్చే తీర్థాన్ని స్వీకరించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిస్తారు. ఈ సారి 31వ తేదీ ద్వాదశి నాడు కూడా శంఖు తీర్థం ఇవ్వనున్నారు. కాగా, ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 15 వరకు ధనురాస్మ మహోత్సవాలను నిర్వహించనున్నారు.

త్వరలో పికిల్‌బాల్ లీగ్ టోర్నమెంట్

పోటీలో తలపడుతున్న క్రీడాకారిణి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: పికిల్‌బాల్ క్రీడకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని త్వరలో లీగ్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా పికిల్‌బాల్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.శివకుమార్ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో జేకేసీ కళాశాల రోడ్డులోని వీవీవీ హెల్త్ హబ్‌లో పికిల్‌బాల్ ఓపెన్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. క్రీడాకారుల్ని పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించిన శివకుమార్ మాట్లాడుతూ ఈ క్రీడ ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఓపెన్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ గుంటూరులో తొలిసారి పికిల్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామని, మంచి స్పందన లభించిందన్నారు. పలు ప్రాంతాల నుంచి 50 మందికి పైగా హాజరయ్యారన్నారు. అండర్-14, 16, మిక్స్‌డ్, మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్ ఈవెంట్లలో పోటీలు జరుగుతున్నాయన్నారు. జిల్లా సంఘం ప్రతినిధి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పికిల్‌బాల్ క్రీడ గుంటూరులో బాగా వృద్ధి చెందుతుందన్నారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ యువత ఈ క్రీడ పట్ల ఆసక్తులవుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వాణి మారి, కోశాధికారి జయశ్రీ, సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, న్యాయవాది రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యమే సాహిత్య లక్ష్యం

విజేతలతో నిర్వాహకులు, అతిథులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సాహిత్యం సామాజికంగా చైతన్యపర్చేదిగా ఉండాలని, అటువంటి సాహిత్యాన్ని తాపీ ధర్మారావు తదితర రచయితలు రచించారని సుప్రసిద్ధ కవి గంటేడ గౌరునాయుడు అన్నారు. బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం బ్రాడీపేట 2/7లోని కొరటాల సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా జరిగింది. ప్రముఖ కవి పుప్పాల శ్రీరామ్ సభకు అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బండికల్లు జమదగ్ని.. తాపీ ధర్మారావు పేరిట ఏర్పాటు చేసిన స్మారక పురస్కారాన్ని కవి గంటేడ గౌరునాయుడుకు అందజేశారు. తాపీ ధర్మారావు సాహిత్య ప్రతిభను సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు వివరించారు. పురస్కార గ్రహీత గంటేడ గౌరునాయుడు సాహిత్య ప్రస్థానాన్ని సాహితీవేత్త ఎస్.ఎం.సుభాని వివరించి చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో బహుమతి పొందిన కథలను విశిష్ట అతిథి శిరంశెట్టి కాంతారావు విశ్లేషించారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న మల్లెతీగ పత్రిక సంపాదకుడు కలిమిశ్రీ, విశాఖ సంస్కృతి పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం కథల పోటీ విజేతలు నందిరాజు పద్మలతాజయరాం, వాడపల్లి పూర్ణకామేశ్వరి, కైకాల సుమలతలను నగదు పురస్కారాలతో జమదగ్ని కుటుంబ సభ్యులు సత్కరించారు. వివిధ రంగాల్లో సేవలందించిన వడ్రాణం హరిబాబు, డాక్టర్ గాజుల రామకృష్ణ, డాక్టర్ నెల్లూరి బ్రహ్మయ్య, నారదాసు శ్రీహరిరావు, బండ్లమూడి గాంధీ, బిళ్లా అశోక్, మిరియాల గోపీకుమార్, రామరాజు లక్ష్మీశ్రీనివాస్, మేడిశెట్టి సుభద్రాకృష్ణ, ఉప్పు వెంకటరత్తయ్యలను స్ఫూర్తి పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. సభా ప్రారంభంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. యర్రంశెట్టి శ్రావణ సంధ్య తదితరులు ప్రసంగించారు. పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

9 నుంచి అమరావతి బాలోత్సవం

పోటీలకు 12 వేల మంది విద్యార్థులు

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న రామరాజు, సాంబిరెడ్డి, కొండలరావు, ఎన్.రామరాజు, విద్యాకన్నా, మురళీకృష్ణ, డీవీ రాజు, క్రాంతికిరణ్ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అమరావతి బాలోత్సవం-8.. ఈ నెల 9వ తేదీ నుంచి 11 వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్వీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమ గోడప్రతులను ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పిల్లల పండగను పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవం కోసం అనే నినాదంతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 43 అకడమిక్, 17 కల్చరల్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు ప్రాంగణాలు, 5 గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 12 వేల మంది పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, బాలోత్సవాల వ్యవస్థాపకులు, కొత్తగూడెం బాలోత్సవం కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు, బెంగళూరుకు చెందిన నవస్కంద హౌమ్ ఫర్ జనరేషన్స్ ప్రతినిధి కె.యతిరాజులు నాయుడు హాజరవుతారని తెలిపారు. గోడప్రతుల ఆవిష్కరణలో ఆఫీస్ బేరర్స్ సాంబిరెడ్డి, పిన్నమనేని మురళీకృష్ణ, ఎన్.విద్యాకన్నా, యువీ రామరాజు, వల్లభరావ్, వై.సుబ్బారావు, డీవీ రాజు, టి.క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

హిందువుల్లో ఐక్యత పెరగాలి



మాట్లాడుతున్న యామినీశర్మ

నగరంపాలెం, గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేశంలోని హిందువులు ఐక్యత ద్వారా సత్తా చాటాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీశర్మ అన్నారు. గుంటూరు ఎస్వీఎన్ కాలనీలోని మెట్టు అంజిరెడ్డి కల్యాణ మండపంలో హిందూ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. సభలో యామినీశర్మ మాట్లాడుతూ సమాజంలో విషక్రిమి దురాగతాలను సమూలంగా, సమరసతతో అందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. మేకపాటి సుబ్రహ్మణ్యశర్మ స్వామీజీ మాట్లాడుతూ హిందూ బంధువులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ మీడియా విభాగ ఇన్‌ఛార్జి అవ్వారు శ్రీనివాస్, విభాగ్ ప్రముఖ్ కలగా శ్రీనివాసరావు, డాక్టర్ రాధాకృష్ణ అంజిరావు, నాగేశ్వరరావు, ఏపీ రమణమూర్తి, అంకయ్య, నిరంజన్, విజిత స్కూల్ నిర్వాహకుడు చెరుకూరి శ్రీహరి తదితరులు మాట్లాడారు. కార్యక్రమానికి వెయ్యి మందికి పైగా హిందూ బంధువులు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్విజ్, ఏకపాత్రాభినయం, భరతనాట్యం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

అపూర్వం.. ఆనందం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి టీజీఎస్ గార్డెన్‌లో మంగళగిరి సీకే ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ వనసమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. 1982-1983కు చెందిన 10వ తరగతి విద్యార్థులు 42ఏళ్ల నాటి బాల్య మిత్రులతో కలిసి వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, వీజే విద్యాసంస్థల డైరెక్టర్ వ్రగడ రాజశేఖర్ మాట్లాడుతూ నాటి మధుర స్మృతులను నెమరువేసుకుని నూతన ఉత్తేజం పొందామని అన్నారు. జీవితంలో ఒత్తిడి ఎక్కువైన సమయంలో బాల్య మిత్రుల కలయిక ఎంతో ఊరట ఇస్తుందని తెలిపారు. తాము విద్య నేర్చుకున్న విద్యాలయానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు దుర్గారావు, పార్థసారథి, చంద్రశేఖర్, శ్రీను, సీతయ్య, రత్నాకర్‌లు పాల్గొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో! ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి అధిక మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College. 91774 08565.

FINANCIAL SERVICES

నూతన ఇండస్ట్రీ ఏర్పాటుకు కావలసిన Term Loans Working Capital పాత GST Returns పై OD, CC, E.P.C Loans Distributers Exporters కి Loans ఇప్పించబడును. 94944 02285.

PEOPLE CARE

OLD AGE HOME

రాజకృష్ణ గ్రూప్, GNT, వృద్ధులకు, పేషెంట్స్ సేవలు ఇంటి వద్ద, [illegible] ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

గుంటూరు, పేరేచర్ల NRI ITకాలేజీ పక్కన ORR కి మధ్య APCRDA [illegible] 77290 75959, 99591 27008.

JOBS

Lakshmi Spares Corporation Vijayawada, Authorised Dealer for Atlas Copco Air Compressors Wanted: Service Engineers Qul: B.Tech/ Diploma. Location: Krishna, Guntur & Prakasam. Note: Complete Field Work Send Your Resumes : hr.lakshmispares@gmail.com ✆ 90325 74443.

[illegible] ✆ 97039 71968

[illegible] 89784 80429.

[illegible] 93944 46449.

[illegible] Ph: 93469 83822.

ఒమేగా హాస్పిటల్ నందు [illegible] 89776 39662, 89776 39663.

[illegible] 93906 33593, 90595 14555.

E-Kart నందు [illegible] Oly: Inter Any డిగ్రీ జీ: 15,000 Online are Available. 90141 20139.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేస్తున్న క్లెయిములకు ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. [illegible] చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

టికెట్ ఎవరిస్తారు సార్..!

❖ చిలువూరు రైల్వే స్టేషన్‌లో మూతపడిన కౌంటర్

చిలువూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే

చిలువూరు రైల్వే స్టేషన్‌లోని టికెట్ కౌంటర్ మూతపడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లకు ఒకసారి రైల్వే అధికారులు వేలం పెడతారు. ఎవరైతే ఎక్కువకు పాడుకుంటారో.. వారికే టికెట్లు అమ్ముకునే అవకాశం ఇస్తారు. స్టేషన్ మాస్టర్ అంటూ ప్రభుత్వ పరంగా ఉండరు. టికెట్లు విక్రయించే వ్యక్తే గంట కొట్టుకోవాలి. జెండా ఊపాలి. మండల పరిధిలో దుగ్గిరాల, చిలువూరు రెండు స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. వీటిలో చిలువూరు నుంచే ఎక్కువ మంది ప్రయాణిస్తుంటారు. సపోట, నిమ్మ చిరువ్యాపారులు రోజూ విజయవాడ, తెనాలి, గుంటూరు మార్కెట్లకు ఇక్కడి నుంచే సరుకు తీసుకెళుతుంటారు.

15 రోజులుగా ఇదే పరిస్థితి..

గత మూడేళ్లుగా ఇక్కడ టికెట్లు విక్రయిస్తున్న వ్యక్తి తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో 15 రోజులుగా స్టేషన్‌కు రావడం లేదు. ఫలితంగా స్టేషన్‌మాస్టర్ గదికి తాళం వేసి ఉంటోంది. టికెట్ ఇచ్చే వారు లేరు. రైలు ఎక్కడానికి వచ్చిన ప్రయాణికులకు ఏం చేయాలో తెలియడం లేదు. తెనాలి, తిరుపతి, బిట్రగుంట, పొన్నూరు, గూడూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు చిలువూరులో రైలు ఎక్కేసి దుగ్గిరాలలో ఆగినప్పుడు టికెట్ తీసుకోవాలి. అక్కడ ఆగేది రెండు నిమిషాలే. ఈ సమయంలో ప్లాట్‌ఫాం మారి తెచ్చుకునే వీలుండదు. ఇక్కడి నుంచి రోజూ సుమారు 100 నుంచి 150 మంది ప్రయాణిస్తుంటారు. రైల్వే అధికారులు దృష్టిసారించి తమ వెతలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కౌంటర్ పరిస్థితి ఇదీ..

ముగిసిన రాష్ట్ర థాంగ్‌టా పోటీలు

ప్రతిభ చాటిన క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం గొర్లెవానిపాలెంలోని ఇండోర్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 69వ రాష్ట్ర స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో 7 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు రాష్ట్ర అబ్జర్వర్లు శ్రీహరిరాజు, ప్రసాదు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఎం.నాయుడు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ప్రతిభ చాటిన 36 మందిని జనవరి 17 నుంచి 22 వరకు దిల్లీలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వర్రావు, ఏపీ థాంగ్‌టా అసోసియేషన్ అధ్యక్షుడు గొర్లె పుష్పారావు, కార్యదర్శి తులసీరావు తదితరులు పాల్గొన్నారు. ఎంపికైనవారిలో గుంటూరుకు చెందిన శ్రీలత (బాలికలు అండర్-19), హరివెంకటఅఖిల్, జాన్‌పాల్ (బాలురు అండర్-17), అఖిల్(బాలురు అండర్-19) ఉన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

విజయవాడ: ఎస్సీ వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. వర్గీకరణ చేసి 59 కులాలకు సామాజిక న్యాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం ఆయన చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. సంక్షేమ పథకాల అమలులో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరినట్లు వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు.

91.9 FM Vijayawada 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

భారత్‌పేటలో చోరీ

10 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

చిందరవందరగా వస్తువులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: భారత్‌పేటలో ఓ ఇంట్లో దొంగలు పడి.. పది సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. ఠాగూర్ భారత్‌పేట అయిదో లైనులో నివాసం ఉంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైలోని వేళాంగిణమాత చర్చికి ఈనెల 5న వెళ్లారు. దొంగలు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువా లాకర్‌ను ధ్వంసం చేశారు. అందులో ఉన్న 10 సవర్ల బంగారు ఆభరణాలు తస్కరించారు. వెండి పట్టీలు, వెండి మొలతాడు, పది పట్టు చీరలు సైతం మూట కట్టుకుని పరారయ్యారు. 7న ఊరు నుంచి తిరిగొచ్చిన ఠాగూర్ ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడం గమనించి దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరండల్‌పేట పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ బృందం అక్కడకు చేరుకుని పరిశీలించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఆర్‌డీఏ పీడీ బదిలీపై ఊహాగానాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మి బదిలీపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఆమె డీఎల్‌డీవో హోదాలో ఉన్నారు. 2024, నవంబరులో ప్రభుత్వం డిప్యుటేషన్‌పై డీఆర్‌డీఏ పీడీగా నియమించడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పూర్తయిన తర్వాత కొనసాగింపు ఉత్తర్వులు జారీ కాలేదు. దీనికి తోడు వేరే జిల్లాల్లో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు గుంటూరు జిల్లా పీడీగా వచ్చేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. జీజీహెచ్‌లో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరిక్ మందుల దుకాణాలను వేరే వ్యక్తులకు కేటాయించాలని పలువురు ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే పీడీ బదిలీ గురించి చర్చలు సాగుతున్నాయి. డీఆర్‌డీఏ పీడీగా ఉన్న విజయలక్ష్మి పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా యువజన సేవలు, స్టెప్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. దాంతో పీడీని కొనసాగిస్తారా? లేక పంచాయతీరాజ్ శాఖకు వెనక్కి పంపుతారా? అనే దానిపై చర్చనీయాంశంగా మారింది.

ట్రాఫిక్ వెతలు తీరేలా ప్రత్యామ్నాయ మార్గాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధానిలో సామగ్రి తరలిస్తున్న భారీ వాహనాలు ప్రస్తుతం కొన్ని గ్రామాల మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో ట్రాఫిక్, దుమ్ము తదితర సమస్యలు ఏర్పడుతున్నాయి. స్థానికులకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ట్రాఫిక్ సమస్య నివారణకు సీఆర్డీఏ ప్రత్యామ్నాయంగా కొన్ని రహదారులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళిక తయారు చేస్తోంది. అవేంటంటే...

✤ పెదపరిమి, రాయపూడి వైపు వెళ్లేందుకు తుళ్లూరు గ్రామం పక్కగా వెళుతున్న ఎన్-14 రోడ్డును అందుబాటులోకి తీసుకు రావడం ✤ వీఐటీ, ఎస్ఐడీ యూనివర్సిటీలకు వెళ్లేందుకు ఎన్-12నుంచి ఈ-6, ఈ-8కు అనుసంధానం. ✤ మందడం నుంచి తుళ్లూరు, అనంతవరం వైపు ఈ-6 రోడ్డును ఎన్-9కు అనుసంధానం చేసి అందుబాటులోకి తీసుకు రావటం. ✤ కురగల్లు, నిడమర్రు- ఈ-12 రోడ్డును విజయవాడ పశ్చిమ బైపాస్‌కు అనుసంధానం. *పెదపరిమి నుంచి మంగళగిరి రోడ్డును ఎస్ఆర్ఎం వరకు నిర్మాణం. ✤ యర్రబాలెంలో ట్రాఫిక్ నియంత్రణకు రామాలయం నుంచి ఒక వైపు దారి ఏర్పాటు చేయటం. ✤ నిడమర్రు వైపు- నిడమర్రు నుంచి కంతేరు డొంక వరకు రోడ్డు ఏర్పాటు. ✤ తుళ్లూరు నుంచి రాయపూడి వరకు నూతన రోడ్డు నిర్మాణం *సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు రావటం. *నెక్కల్లు వైపు- ఈ-8, ఎన్-16, ఎన్-17 రోడ్లకు మరమ్మతులు చేసి తాత్కాలికంగా అందుబాటులోకి తీసుకురావడం. ✤ దొండపాడు వైపు- బోరుపాలెం, దొండపాడు రోడ్డును ఎన్-16 జంక్షన్‌కు అనుసంధానం చేయడం. ✤ ఉండవల్లిలో ట్రాఫిక్ నియంత్రణకు గ్రామంలో ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేసి వెడల్పు చేయటం.

10 నుంచి రాష్ట్ర స్థాయి క్రీడలు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య పాఠశాలలో ఈనెల 10 నుంచి రాష్ట్ర స్థాయి అండర్-20 క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుత్తా కవిత, రాము ఆదివారం వెల్లడించారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పురుషుల విభాగంలో మందడి శివరామ కాళిబాబు మెమోరియల్ వారి సహకారంతో డేఅండ్‌నైట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాయపూడి పాపయ్య-వెంకటసుబ్బమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో అండర్-20 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు పురుష, మహిళల విభాగంలో నిర్వహిస్తున్నామన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ పురుష విభాగంలో తూములూరి ఆదినారాయణ మెమోరియల్ ఆధ్వర్యంలో పోటీలు ఉంటాయన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 162, చికెన్ విత్‌స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 274 చికెన్ స్కిన్‌లెస్ - 284.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

తెనాలి

•తెనాలి •పొన్నూరు

వంద రోజుల శిక్షణ తరగతులు

కొల్లిపర, న్యూస్‌టుడే: విద్యలో వెనుకబడిన 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖాధికారిణి ఝాన్సీలత తెలిపారు. ఆదివారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు.. పాఠశాలకు హాజరైన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు రెండో శని వారం, ఆదివారాలు కూడా జరుగుతాయని చెప్పారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలు తెదేపా కార్యాలయంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 9 వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ హాజరై వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు

ఉప్పలపాడు(పెదకాకాని), న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. ఉప్పలపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోళ్ల ప్రక్రియ, బిల్లు చెల్లింపులు ఎలా చేస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు పాటించిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయిస్తే లాభం వస్తుందని, రైతుల ఖాతాల్లో త్వరగా నగదు పడుతున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుంటూరు ఛానల్ డీసీ ఛైర్మన్ బూషిబాబు, ఎంపీటీసీ సభ్యుడు వెంపర్తి శ్రీనివాసరావు, తెదేపా మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచి కర్నాటి శ్రీనివాసరావు, ఏవో రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు. ❖ ఉప్పలపాడు గ్రామంలో కొత్తగా నిర్మించిన యేసు తిరు హృదయ దేవాలయం (ఆర్‌సీయం చర్చి) పునః ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

మహిళా రైతుకు కొనుగోలు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ పాండురంగపేట కల్యాణ మండపం రోడ్డులో కుక్కల బెడద అధికంగా ఉంది. పిల్లలు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. **- శ్రీనివాసరావు, పాండురంగపేట** ✔ సమస్యను పరిష్కరిస్తాం. ? తెనాలి చెంచుపేట ప్రధాన రోడ్డులో ఒక వైపు మాత్రమే వేగనిరోధకం ఉంది. రెండో వైపు లేదు. ఈ ప్రాంతంలో కాలనీలు అధికంగా ఉన్నాయి. రోడ్డుకు అటు నుంచి ఇటు రావడానికి చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. **- సుబ్రహ్మణ్యం, చెంచుపేట.** ✔ క్షేత్ర స్థాయిలో పరిశీలించి పోలీసు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రామప్పలనాయుడు, పురపాలక కమిషనర్**

❖ తెనాలి పట్టణ ప్రకాశంబజార్, బోసురోడ్డు ప్రాంతాల్లోని హోటళ్ల వద్ద రోడ్లపైనే వాహనాలు నిలపడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు స్పందించారు. వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకున్నారు. సంబంధిత హోటళ్ల వారితో మాట్లాడారు.

❖ తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని పాల్దారి కాలువ వెంబడి వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

పొన్నూరు: పట్టణ పరిధిలోని 23వ వార్డులో మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో కాలువలో పూడిక తీయించారు.

? పొన్నూరు పరిధిలోని 27వ వార్డులో వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. **- షేక్ రియాజ్, 27వ వార్డు.** ✔ పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు.**

? పొన్నూరు పరిధిలోని 2వ వార్డులో మూడు రోజులుగా చెత్త పేరుకుంది. **-కె.లక్ష్మీనారాయణ, 2వ వార్డు.** ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి. - న్యూస్‌టుడే, పొన్నూరు**

నివాసాల మధ్యన.. నిర్లక్ష్యపు నీడన..!

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలిని ఆంధ్రా ప్యారిస్ అనే పేరు రావడానికి గల కారణాల్లో ఒకటి పట్టణం మధ్య నుంచి మూడు కాలువలు ప్రవహిస్తూ ఉండడమే. ఈ కాలువల వల్ల స్థానికంగా నీటికి ఇబ్బంది లేకపోవడంతో పాటు వాతావరణ పరంగానూ, మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇదంతా ఒక వైపు అయితే మరో వైపు ఈ పంట కాలువలు పట్టణ పరిధిలో దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా సాగుతున్నాయి. వాటి ఒడ్డునే పెద్ద సంఖ్యలో కాలనీలు, వేలాది మంది జనం నివాసం ఉంటున్నారు. కాలువల ఒడ్డు నుంచి సాగే రోడ్ల మీద వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి కీలక, రద్దీ ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఈ కాలువలకు ఎలాంటి రక్షణ

ఫెన్సింగ్ లేకుండా.. వ్యర్థాలకు నిలయంగా..

లేదు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా... రోడ్ల మీది గుంతల వల్ల వాహనాలు అదుపు తప్పి కాలువల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది.

★ ఇటీవల బాలాజీరావుపేట పరిధిలో ఓ పిల్లాడు ఆడుకోవడానికి ఇంటి నుంచి రోడ్డు మీదకు వచ్చి నేరుగా కాలువలో పడి మృతి చెందాడు. గతంలోనూ ఇదే తరహాలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

ప్రమాదకరంగా కాలువలు

ఇవే కాకుండా ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో వ్యర్థాలు సైతం అక్కడ పడేస్తున్నారు. దీంతో తాగు, సాగుకు ఉపయోగించే నీరు కలుషితం అవుతుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడే కాలువలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు తెరమీదకు వస్తాయి తర్వాత వాటి గురించి ఊసే ఉండదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై దృష్టి సారించాలి.

స్పందించారు.. సమస్యలు పరిష్కరించారు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను 'ఈనాడు' ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి పరిష్కరించారు.

స్పందనకు వందనం

గుంతలు పూడ్చివేత..

తెనాలిలోని పలు ప్రధాన రహదారుల్లో ప్రయివేటు కంపెనీల ప్రతినిధులు తీగల ఏర్పాటు కోసం పెద్ద పెద్ద గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న తీరును 'ఈనాడు' అక్టోబరు 10వ తేదీన 'గుంతలు.. ప్రమాదాలు' శీర్షికన ప్రచురించింది. స్పందించిన మున్సిపల్ అధికారులు సంబంధితులతో మాట్లాడి గుంతలు పూడ్పించారు.

పూడికలు తొలగింపు

తెనాలి పట్టణ యడ్లలింగయ్య కాలనీలో కొత్తగా రోడ్లు నిర్మించారు కాని కాలువలు కట్టలేదని.. దాంతో పాటు కచ్చా కాలువలు పూడిపోయి మురుగు పారుదల లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్న తీరును ఈ నెల 5న 'ఈనాడు' 'ముందుకు కదలని మురుగు' శీర్షికన ప్రచురించింది. స్పందించిన మున్సిపల్ ఆరోగ్య విభాగ సిబ్బంది అడ్డంకులు, పూడికలు తొలగించి సమస్యను పరిష్కరించారు, దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

సైకిలు తొక్కడం ఆరోగ్యకరం

పొన్నూరు, న్యూస్‌టుడే: రోజూ కొంత సమయం సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యకరంగా జీవించవచ్చని పొన్నూరు పురపాలక సంఘ కమిషనర్ ఎం.రమేషుబాబు పేర్కొన్నారు. ఆదివారం 'డ్రగ్స్ వద్దు.. సైకిలు తొక్కు బ్రో' అనే నినాదంతో పట్టణ పరిధిలోని నిడుబ్రోలు, మండల పరిధిలోని జడవల్లి, కోమలి, మాచవరం, చింతలపూడి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు అలవాటు పడితే జీవితం అంధకారంగా మారుతుందని.. విద్యలో కూడా అనుకున్న లక్ష్యాలను

నిడుబ్రోలులో సైకిల్‌పై ప్రచారం చేస్తున్న కమిషనర్ రమేషుబాబు

సాధించలేమనే విషయాన్ని గుర్తించాలని కోరారు. నేటి యువత వ్యాయామం చేయడంలో భాగస్వాములు కావడం వల్ల అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. అలాగే సైకిలు వాడటం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చని చెప్పారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

కొల్లిపర, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సామాజిక బహిష్కరణకు గురవుతారని ఎస్సై ఎన్‌సీ ప్రసాద్ రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఆదివారం కొల్లిపర మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి 15 మంది రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. జీవనోపాధి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రతి గింజా కొంటామని చెబుతున్న ప్రభుత్వం మాటలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని, రైతు సేవా కేంద్రాల వద్ద నాణ్యతా ప్రమాణాల పేరిట రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం తేలప్రోలు, నేలపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానం పరోక్షంగా దళారులను ప్రోత్సహించేలా ఉందని.. మాటలు కాకుండా చేతల్లో రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

మేడికొండూరు, న్యూస్‌టుడే: ప్రపంచ వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యం కొనసాగడానికి, రూపాయి విలువ తగ్గడానికి కేంద్రం అనుసరిస్తోన్న సరళీకరణ ఆర్థిక విధానాలే ఒక కారణమని మధ్య తరగతి సంఘాల జిల్లా కన్వీనర్ వి.వి.కె. సురేష్ ఆరోపించారు. మేడికొండూరులో ఆదివారం బహిరంగ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీడీపీ పరిమాణంలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా.. నేటికీ ఎంతో మంది జీవన స్థితిగతులు దుర్భరంగా ఉన్నాయన్నారు. ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేయడం, అమెరికా అనుకూల వాణిజ్య విధానం ఫలితంగా రూపాయి విలువ దిగజారిపోతుందని విశ్లేషించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం నాయకుడు రామకృష్ణ, మస్తాన్‌వలి, మహ్మద్ జానీ, సుబ్బయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యేక శిబిరం

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చినపలకలూరులో వారం రోజులు నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. శిబిరం ముగింపులో భాగంగా మెడెక్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. గ్రామస్థులు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారం రోజులు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను స్థానికులు అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక, ఎన్ఎస్ఎస్ అధికారిణి భవాని తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీరుస్తున్న దాతలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం వద్ద శివ భక్త బృందం సభ్యులు ఆదివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళగిరి మాజీ మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మన్నెం రమేష్ బాబు చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా శివ భక్తుల ఆధ్వర్యంలో అమావాస్యకు ముందు ఆదివారం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దాతలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బోగి కోటేశ్వరరావు, గుండా రామకృష్ణ, ఆనందరావులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు చేపట్టాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగింపు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు కోరారు. ఆదివారం స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన సీపీఎం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సేకరణకు నిధులు కేటాయించినట్లు ప్రకటించిన గ్రామసభలు జరిపి రైతులలో ఏకాభిప్రాయం తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సీపీఎం మండల కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. వరి, పత్తి పంటలను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు జె. రామారావు, వెంకటసుబ్బారావు, భువనేశ్వరి, రాజేంద్ర, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఊర చెరువులో నిర్మాణాలు..!

నంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే:

నంబూరు గ్రామ ఊర చెరువును ఆక్రమించి ఇళ్లు, ఇతర భవనాలు నిర్మిస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువు ఆక్రమణలను నియంత్రించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నా.. క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. భారీగా వర్షాలు కురిసినప్పుడు గ్రామం ముంపునకు గురికాకుండా ఈ చెరువులో నీరు చేరేవి. సుమారు 30 ఎకరాలకు పైగా ఉండాల్సిన చెరువు ప్రస్తుతం ఆక్రమణకు గురై విస్తీర్ణం తగ్గింది.

నంబూరులో ఆక్రమణకు గురైన చెరువు

ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం..

ఆక్రమణలపై కొందరు గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు గ్రామాన్ని ముంచెత్తింది. చెరువు ఆక్రమణకు గురికాకపోతే ముంపునకు గురయ్యేది కాదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు కాజకు వెళ్లే దారిలో చెరువు సైతం ఆక్రమణకు గురైంది. గ్రామంలోని వాడుక నీరు బయటకు వెళ్లే పరిస్థితి పూర్తిస్థాయిలో లేదు. దీనిపై 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా.. కొన్ని నిర్మాణాలు చేపట్టడం వాస్తవమే. జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేసిన తరువాత పనులు నిలుపుదల చేశాం. త్వరలో కొంతమేర కట్టిన నిర్మాణాలను పూర్తిస్థాయిలో తొలగిస్తాం.

రూ.5 లక్షలు ఖర్చయినా తీరని సమస్య

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:

పట్టణంలో వాహనాల రద్దీ తగ్గించడానికి నిర్మించిన అనుసంధాన వంతెనల అప్రోచ్‌ల నిర్మాణ పనులు నిబంధనల మేరకు చేయక గుంతలు పడ్డాయి. విషయం తెలిసిన మంత్రి నాదెండ్ల మనోహర్ ఇంజినీర్లను పిలిచి వెంటనే అప్రోచ్‌లు వేయించాలని సూచించారు. పట్టణంలో ప్రవహిస్తున్న మధ్య కాలువ(నిజాంపట్నం)పై నిర్మించిన వంతెనకు ఇరువైపుల నిర్మించిన అప్రోచ్‌లు ధ్వంసమయ్యాయి. వీటి మరమ్మతులు ఊసెత్తకుండా అనుసంధానంగా రూ.5 లక్షలతో కొత్త అప్రోచ్‌లు నిర్మించారు. ప్రజాధనం

మధ్య కాలువ అప్రోచ్‌పై ఇలా..

ఖర్చు అయినా ప్రజల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మరమ్మతులు లేదా కొత్తది నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఇలా ఉంటే.. రాకపోకలు ఎలా?

పట్టణ పరిధి నిడుబ్రోలు ఎస్టీ కాలనీ నుంచి టిడ్కో గృహాలకు వెళ్లే మార్గంలో తాగునీటి పైపులైను మరమ్మతులకు నెల రోజుల కిందట గొయ్యి తవ్వారు. రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

వేంకటేశ్వరస్వామి సేవలో బ్రహ్మానందం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: హాస్య బ్రహ్మ బ్రహ్మానందం ఆదివారం వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తన పెళ్లి అయిన ఈ ఆలయానికి మరోసారి రావడం ఎంతో ఆనందం కలిగించిందని ఆయన పేర్కొన్నారు.

మహిళా గ్రంథాలయానికి వితరణ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: శిక్షణా ఫౌండేషన్, బెంగళూరు డెల్ కంపెనీ సంయుక్తంగా తెనాలి మహిళా గ్రంథాలయానికి కంప్యూటర్లు, టీవీ, ఇతర సాంకేతిక సామగ్రి అందించినట్లు ప్రతినిధి బుచ్చిబాబు తెలిపారు. ఆయన ఆదివారం కొత్తపేట మహిళా గ్రంథాలయంలో మాట్లాడారు.

నమ్మించి మోసం చేశాడని ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వివాహం చేసుకుంటానని నమ్మించి పది సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్న లైన్‌మెన్ గోపి తనను మోసం చేశాడని పట్టణ చెంచుపేటకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. తన వద్ద రూ. 12 లక్షల నగదు, 6 సవర్ల బంగారం తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారని.. దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కాలువలో వృద్ధురాలి మృతదేహం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పడవల కాలువలో పట్టణ పరిధిలోని చెంచుపేటకు చెందిన లక్ష్మమ్మ (85) మృతదేహాన్ని త్రీ టౌన్ పోలీసులు ఆదివారం గుర్తించారు. ఈ నెల 5న విజయవాడ అమ్మవారి గుడికి వెళుతున్నానంటూ ఇంటి నుంచి వెళ్లిన వృద్ధురాలు ఎలా మృతి చెందారు? ఆమె కాలువలో దూకారా? ప్రమాదవశాత్తూ పడ్డారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం పెదరావూరులో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.1800 స్వాధీనం చేసుకుని.. దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

క్రైం కార్నర్

జూదరులు 8 మంది ..

తెనాలి టౌన్: తెనాలి పట్టణ వైకుంఠపురం కాలువ కట్ట వద్ద ఆదివారం ఓ ఇంట్లో జూదం ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.25,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

★ ఎరుకలపూడిలో జూదం ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న గ్రామీణ పోలీసులు.. వారి నుంచి రూ.1700, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పారిపోయారని వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కిశోర్

తెనాలి(కొత్తపేట): వైకాపా ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొల్లిపర మండలం మున్నంగికి చెందిన వేమూరి కిశోర్ నియమితులయ్యారు. తన నియామకానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఆయన పట్టణంలోని వైకాపా కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అధ్వానంగా రైతు సేవా కేంద్రం

తెనాలి మండలం తేలప్రోలులోని రైతు సేవా కేంద్ర భవనం వినియోగంలో లేదు. మరమ్మతులకు నోచుకోకపోవడంతో పాటు కనీస నిర్వహణ లేక ఆవరణ అంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. వర్షాలు కురిసిన సమయంలో చెరువును తలపిస్తుంది. దీంతో పాములు, పురుగులు నివాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ కేంద్రం మీదుగా రాకపోకలు సాగించే వారికి సైతం ఇబ్బందికరంగా మారింది. ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేయించి నిర్మాణాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

రూ. 28.5 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు

వల్లభాపురం గ్రామంలోని ఆలయం చుట్టూ రూ. 28.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎంపీపీ భీమవరపు పద్మావతి తెలిపారు. నిర్మాణ పనులను పీఆర్ ఏఈ సాంబిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. పనులు తుదిదశకు చేరుకున్నాయని పద్మావతి తెలిపారు. **- కొల్లిపర, న్యూస్‌టుడే**

ఇలా ఉంటే.. రోగాలు రావా..?

సిమెంటు మురుగు కాలువలు లేక ఇబ్బందులు

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని నిడుబ్రోలు, క్యాబిన్‌పేట, రైలుపేట, విద్యానగర్, టీచర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, ముబారక్‌నగర్, డీఆర్‌కే కాలనీ, పాత పొన్నూరు, తదితర ప్రాంతాల్లో సిమెంటు మురుగు కాలువలు లేవు. దీంతో మురుగు నీరు ముందుకు కదలని పరిస్థితి. నీరు రోజులు తరబడి అక్కడే నిల్వ ఉండటంతో దోమలు, దుర్వాసనతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దోమ కాటు వల్ల విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. గత వైకాపా పాలనలో సిమెంటు మురుగు కాలువల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశామని ఆనాటి నాయకులు గొప్పలు చెప్పారు. కాని క్షేత్ర స్థాయిలో మాత్రం పనులు చేపట్టిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి మురుగు కాలువల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

★ పట్టణం : పొన్నూరు ★ వార్డులు : 31
★ జనాభా: 61,500 ★ కుటుంబాలు: 19,075
★ మురుగు కాలువలు: 170 కిలో మీటర్లు
★ సిమెంటు మురుగు కాలువలు : 120 కిలో మీటర్లు
★ కచ్చావి : 50 కిలో మీటర్లు

14వ వార్డులో నిలిచిన మురుగు నీరు

ప్రతిపాదనలు పంపించాం..

దీనిపై పురపాలక సంఘం డీఈ పి.వెంకయ్యను న్యూస్‌టుడే వివరణ కోరగా.. సిమెంటు మురుగు కాలువ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

రోడ్డుపై కుప్పకూలిన వ్యక్తి

తెనాలి టౌన్: కొత్తపేటలో ఆదివారం రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతన్ని వైద్యశాలకు తరలించారు. అతను హైదరాబాద్ నివాసి అని.. వ్యక్తిగత పని నిమిత్తం తెనాలి వచ్చారని.. మూర్ఛ వల్ల పడిపోయినట్లు గుర్తించారు.

యువకుడిపై పోక్సో కేసు

గుంటూరు రూరల్: బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి లైంగిక నేరానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు. గోరంట్ల బాలాజీనగర్‌కు చెందిన దేవళ్ల కొండా అలియాస్ పండు తాపీ పనులు చేస్తుంటాడు. అదే ప్రాంతంలో ఉంటూ పాఠశాలకు వెళ్తున్న బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో చోరీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం కొలకలూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. తెనాలి గ్రామీణ పోలీసుల సమాచారం మేరకు.. ఆదివారం ఉదయం అర్చకులు వచ్చే సరికి గుడి తాళం పగలగొట్టి ఉండడంతో ఈవోకు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి హుండీ తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గేటుకు వేసి ఉన్న తాళం పగలగొట్టి గుడి ఆవరణలోకి వచ్చిన దుండగులు.. హుండీని పలుగుతో పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. క్లూస్ బృందం వచ్చి ఆధారాలు సేకరించింది. తెల్లవారుజామున ఇద్దరు యువకులు గుడి ఆవరణలోకి ప్రవేశించినట్లు సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. కాగా ఈ ఆలయంలో ఇదే ఏడాది జులైలో చోరీ జరిగింది. అయితే అప్పట్లో గుడి వద్ద ఉన్న సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఆధారాలు లభించలేదు. ఇలా గ్రామంలో వరుసగా చోరీలు జరగడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

www.kimssikhara.com

KIMS SIKHARA HOSPITALS

కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరుకు చెందిన ప్రముఖ సినియర్ కార్డియాలజిస్ట్ (గుండె వైద్యనిపుణులు) కన్సల్టేషన్ కొరకు తెనాలి లో అందుబాటులో ఉంటారు.



డా॥ నాగ శ్రీ హరిత పర్వతనేని
MD (Osm), DM (SVIMS), FESC, FSCAI, FACC
Ex. Associate Professor Guntur Medical College
Sr. Interventional Cardiologist
Director – Cardiac Sciences

ప్రతి మంగళవారం నాడు
సమయం: ఉ॥ 10 గం॥ నుండి సా॥ 6 గం॥ వరకు అందుబాటులో ఉంటారు.
ECG, 2D Echo, TMT సదుపాయం కలదు

స్థలం : ఆశ్రిత సూపర్ స్పెషాలిటి కేర్
7-5-31, లెక్చరర్స్ కాలని, ప్రకాశం రోడ్, బ్యాంక్ ఆఫ్ బరోడా దగ్గర, గంగానమ్మపేట, తెనాలి.

అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి.
ఫోన్ నెం: 97057 53356 | 99661 90493

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233
స్పందనకు వందనం

తాడికొండ గ్రామం బీసీ కాలనీలో బోరింగ్ పంపుల వద్ద శుభ్రత కరవైంది. గడ్డి, పాచి పెరిగి నీటిని తీసుకువెళ్లేందుకు కష్టంగా మారింది. సమస్యను తాడికొండ ఈవోపీఆర్డీ రమణ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టి ఆవరణను శుభ్రం చేయించారు. **తాడికొండ, న్యూస్‌టుడే**

? మా గ్రామంలో విద్యుత్తు స్తంభాలపై అంతర్గత రోడ్లు ఇబ్బందిగా మారాయి. వీటికి గుంతల్లో కంకర నింపి, రాకపోకలకు వీలు కల్పించాలి. ఇలా ఉండటం వల్ల స్థానికులు అవస్థలు పడాల్సి వస్తోంది. -వెంకటరావు

✔ రెండు రోజుల్లో రహదారికి మరమ్మతులు చేపడతాం. గుంతలు పూడ్చి రాకపోకలకు అనువుగా చేస్తాం. -పాతూరి శివపార్వతి, సర్పంచి, లేమల్లెపాడు

-న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు

నేడు ఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ: స్థానిక సమస్యలపై సోమవారం ప్రజా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863-2224202) కార్యక్రమం ఉంటుందని, తర్వాత అర్జీల స్వీకరణ ఉంటుందన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కోగంటి

గుంటూరు: బహుముఖ ప్రజ్ఞాశాలి కోగంటి సీతారామాచార్యులని త్రిదండి రామచంద్ర జీయర్ స్వామి అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన కోగంటి శత జయంత్యుత్సవాల్లో ఆయన మాట్లాడారు. అధ్యాపకుడిగా, గురువుగా కోగంటి సేవలు ఆదర్శనీయమన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

పగలు మాటేసి.. రాత్రికి దోచేసి..

వరుస చోరీలతో జనం బెంబేలు

మేడికొండూరు, తుళ్లూరు, తాడికొండ, న్యూస్‌టుడే

ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఇలా..

మండలం	చోరీలు
మేడికొండూరు	35
తుళ్లూరు	29
తాడికొండ	12

★ మేడికొండూరు మండల పరిధిలో కొద్ది రోజుల కిందట పాలడుగు, పేరేచర్ల రెండు గ్రామాల్లో పట్టపగలు తాళం వేసిన రెండు ఇళ్లల్లో దొంగతనం జరిగింది. ఒక ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు ఎట్టకేలకు పట్టుకుని కోర్టులో హాజరు పరిచారు.

★ ఈ నెల 6వ తేదీ శనివారం పేరేచర్లలో తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. ఘటనా స్థలాన్ని నిపుణులు పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. వాటి సొత్తు విలువ మొత్తంగా రూ.1.5లక్షలు ఉంటుందని పోలీసుల లెక్క. కేసు నమోదు చేశారు. ఆ కేసులో నిందితులు దొరకలేదు.

ఇటీవల నియోజకవర్గ పరిధిలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ప్రజలు తమ ఆస్తుల రక్షణ లేకుండా పోతుందని వాపోతున్నారు. పగలు సమయంలో రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తించి అర్ధరాత్రి వేళల్లో దొంగలు చొరబడి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లిపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలు ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. కారణంతో ఏదైనా పని మీద ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలు సైతం మాయం చేస్తున్నారు. కొంత మంది భయపడి ఇళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకున్నారు. చోరీల కారణంగా చివరకు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి గ్రామాల్లో నిఘా పెంచాలని వారు కోరుతున్నారు. మరోవైపు రాజధాని పనుల నిమిత్తం గుత్తేదారు సంస్థలు తీసుకొచ్చిన ఇనుప సామగ్రి సైతం చోరీకి గురవుతున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

పేరేచర్లలో చోరీ జరిగిన ప్రాంతంలో ఆధారాలు సేకరణ

ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించుకోండి..

ఎవరైనా ఏదైనా పని మీద ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాలని అనుకుంటే ముందుగా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా ఇంటిని పర్యవేక్షిస్తుంటాం. ఏదైనా అనుమానిత కదలికలు కనిపిస్తే అప్రమత్తం చేస్తుంటాం. - ఖాజీబాబు, మేడికొండూరు ఎస్ఐ

పేదల ఆకలి తీరుస్తున్న దాతలు

భక్తులకు అన్నదానం చేస్తున్న రమేష్‌బాబు తదితరులు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం వద్ద శివభక్త బృందం సభ్యులు ఆదివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళగిరి మాజీ మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మన్నెం రమేష్ బాబు చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా శివభక్తుల ఆధ్వర్యంలో అమావాస్య ముందు ఆదివారం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దాతలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు ఛైర్మన్ భోగి కోటేశ్వరరావు, గుండా రామకృష్ణ, ఆనందరావులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు చేపట్టాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు కోరారు. ఆదివారం స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన సీపీఎం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సేకరణకు నిధులు కేటాయించినట్లు ప్రకటించినా గ్రామసభలు జరిపి రైతులలో ఏకాభిప్రాయం తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సీపీఎం మండల కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ పత్తి, పసుపు పంటలను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు జె.రామారావు, వెంకటసుబ్బారావు, భువనేశ్వరి, రాజేంద్ర, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామకోటి మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీరామనామ క్షేత్రంలో 99వ శ్రీరామకోటి మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలను జ్యోతి మురళీకృష్ణ మాచార్యులు నిర్వహించారు. రామకృష్ణ మిషన్ సీతానగరం కార్యదర్శి స్వామి వినిశ్చలానంద పతాక ఆవిష్కరణ చేసి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమాలను క్షేత్ర నిర్వాహకులు బెల్లంకొండ మన్నెన్రావు తదితరులు పర్యవేక్షించారు.

పూజలు చేస్తున్న అర్చకులు

లోకేశ్ మాటిచ్చారు.. నెరవేర్చారు

హర్షం వ్యక్తం చేస్తున్న తెదేపా, జనసేన నాయకులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలోని శ్రీ రామకృష్ణరామాకాలనీ (మీసరీ)ని గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 22ఏ జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్లు లేకుండా చేసి కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించి కాలనీని 22ఏ జాబితా నుంచి తొలగింపజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తూ ఆదివారం కాలనీలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, తితిదే పాలకమండలి సభ్యులు తమ్మిశెట్టి జానకీదేవి, జనసేన నాయకులు గంజి చిరంజీవి, మునగాల వెంకట మారుతీరావు, దామర్ల మోహన్, మునగాల విరల్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి విస్తరణ పనులు

మేడికొండూరు శివారులో తూములు ఏర్పాటు

మేడికొండూరు, న్యూస్‌టుడే: పేరేచర్ల - కొండమోడు రహదారి విస్తరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మండల పరిధిలో పనులు వేగం పెంచారు. కొర్రపాడు - మేడికొండూరు మధ్య రోడ్డుకు రెండు వైపులా చదును చేశారు. అక్కడక్కడా తూములు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు అయ్యాయి. పేరేచర్ల నుంచి పల్నాడు జిల్లా కొండమోడు వరకు రహదారి నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. కేంద్ర ప్రభుత్వం దీన్ని జాతీయ రహదారిగా గుర్తించింది.

అలరించిన నృత్య పోటీలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాధామాధవ రసరంజని, రాధామాధవ నాట్య క్షేత్రం నిర్వహణలో రెండు రోజుల పాటు నిర్వహించిన నృత్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం హిందూ కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్ దుర్గాప్రసాద్‌కు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి షేక్ ఖలీల్ గురు సత్కారం చేశారు.

ముంపు నివారణకు పటిష్ఠ చర్యలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: మేకలవాగు ముంపు నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకునే నిమిత్తం సర్వే చేస్తున్నట్లు డీఈ ధనలక్ష్మి (బాపట్ల) చెప్పారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా అబ్బినేనిగుంటపాలెం ప్రాంతంలో వరద వచ్చి పొలాల్లోకి, రహదారులపై నీరు పొంగి రావడంతో భవిష్యత్తులో ముంపు రాకుండా కలెక్టర్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు. వర్షపునీరు వాగులోకి వెళ్లేందుకు వీలుగా అబ్బినేనిగుంటపాలెం 15.4, 17 కిలోమీటర్ల వద్ద మూడు ఇన్‌లెట్లు, పుసులూరు, వంగిపురం మధ్య రెండు ఇన్‌లెట్లు నిర్మించి వాటికి షట్టర్స్ అమర్చనున్నట్లు ఆమె పేర్కొన్నారు. తుపాను కారణంగా వరదనీటి ఉద్ధృతికి మేకలవాగు అబ్బినేనిగుంటపాలెం వద్ద నాలుగు గండ్లు, గోగులమూడి సమీపంలో రెండు గండ్లు పడ్డాయని వీటికి మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. కంపచెట్లను (జంగిల్) కూడా తొలగిస్తామన్నారు. జేఈ విజయవర్ధనరాజు, రైతులు ఆమె వెంట ఉన్నారు.

సర్వే నిర్వహిస్తున్న డీఈ ధనలక్ష్మి, సిబ్బంది

విజయం, పరాజయం.. రెండూ గురువులే

గుంటూరు రూరల్: విజయం, ఓటమి రెండు విద్యార్థులకు గురువులేనని ఒకటి మనల్ని ముందుకు నడిపిస్తే మరొకటి మార్గాన్ని చూపుతుందని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంగాదేవి అన్నారు. చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీరం చేతన ప్రాంగణంలో ఆదివారం జరిగిన స్పోర్ట్స్ మీట్‌ను డాక్టర్ మంగాదేవి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వటం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో కలిసికట్టుగా ముందుకుసాగితే విజయం సాధించవచ్చన్నారు. సంస్థ సీఏవో దుర్గా రఘురాం మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో మనోబలం పెంచి ముందడుగు వేసేలా ఉపయోగపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. చేతన కార్య నిర్వాహకురాలు మరుద్వతి పాల్గొన్నారు.

విజేతలతో నిర్వాహకులు, అతిథులు

ముగిసిన ప్రత్యేక సేవా శిబిరం

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చినపలకలూరులో వారం రోజులు నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. శిబిరం ముగింపులో భాగంగా మెడిక్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. గ్రామస్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారం రోజులు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను స్థానికులు అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక, ఎన్ఎస్ఎస్ పీవో కారిణి భవాని తదితరులు పాల్గొన్నారు.

హాజరైన గ్రామస్థులు

నేత్ర వైద్య పరీక్షలు.. కళ్ల జోళ్ల పంపిణీ

లేమల్లెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: లేమల్లెపాడు గ్రామంలో విజయవాడ శరత్ ఐకేర్ కంటి వైద్యశాల సిబ్బంది నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆదివారం 60 మంది రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సర్పంచి పాతూరి శివపార్వతి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కృష్ణారావులు పాల్గొన్నారు.

దేశానికే గర్వకారణం డా. బీఆర్ అంబేడ్కర్

గుంటూరు సాంస్కృతికం: అంబేడ్కర్ భారతదేశంలో పుట్టడం మనందరికీ గర్వకారణమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-జాషువా-పులె-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సభ ఆదివారం జరిగింది. కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం రచించడమే గాక ప్రత్యేకించి స్త్రీల హక్కుల కోసం పోరాడిన స్త్రీవాది అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ విద్యా రంగంలో అరుదైన గుర్తింపు అంబేడ్కర్ సొంతం చేసుకున్నారని తెలిపారు.

మురుగు పారక.. వెతలు తీరక

తాడికొండ మండలం పాములపాడు గ్రామం ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు పూడిపోయాయి. గడ్డి పెరిగి మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసన, దోమలతో స్థానికులు నిత్యం నరకం చూస్తున్నారు. ఆ కాస్తా దూరం దాటి కాలినడక ఇల్లు చేరుకోవాలంటే ముక్కు మూసుకుని రావాల్సిన పరిస్థితి ఉందని పలువురు చెబుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు నీరు మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తాడికొండ**

శిథిల భవనం.. కూలితే ప్రమాదం

వరగాని బస్‌స్టాండ్ కూడలిలోని దేవాదాయ శాఖకు చెందిన ఏలూరి లక్ష్మీనరసింహం ట్రస్టు సత్రం భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గోడలపై పైచెట్లు మొలిచి దట్టంగా పెరిగాయి. దీంతో నిర్మాణం ఎక్కడికక్కడ పగుళ్లు ఇచ్చింది. నిత్యం ఇటుగా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జనం తిరుగుతుంటారు. వారంతా తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఆ నిర్మాణంలో పాములు చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎలాంటి ముప్పు వాటిల్లకముందే నిర్మాణాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు. దీనిపై దేవాదాయ శాఖ ఈవో జేవీ నారాయణ మాట్లాడుతూ సత్రం శిథిలమైన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు భవనాన్ని తొలగిస్తామని చెప్పారు. **-న్యూస్‌టుడే, పెదనందిపాడు**

ఈ రోడ్డుకో దండం..!

తాడికొండ మండలం రావెల గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. సీసీ రోడ్డు ముక్కలుగా విరిగి భారీ గుంత ఏర్పడింది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇరుక్కుపోయి జనం తిప్పలు పడుతున్నారు. రాత్రివేళ ద్విచక్రవాహనాలు వీటిని గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తాడికొండ**

ఇంటింటికీ నీరు.. ఆదర్శం వీరు

రావిపాడులో సర్పంచి మువ్వా శ్రీదేవి ఆధ్వర్యంలో ఇంటింటికి తాగు నీటిని ఉచితంగా సరఫరా చేస్తున్నారు. సర్పంచి తన అత్త ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం ఓ వ్యాన్‌పై ట్యాంకర్ అమర్చి నీటిని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాగు నీటిని తెచ్చుకోలేని వృద్ధులకు ఇది ఎంతో వెసులుబాటుగా ఉంది. వ్యాన్ డ్రైవరే నీటిని పట్టి ఆ క్యాన్‌లను లోపలకి చేరవేస్తున్నారు. తాగునీటి సరఫరాకు రోజుకు సుమారు రూ.1,000 ఖర్చు చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, రావిపాడు(పెదనందిపాడు)**

నిందితులను కఠినంగా శిక్షించాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: గంజాయి అనర్థాలను కళారూపాల ద్వారా ప్రజలకు వివరిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారుడు పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన పెంచలయ్య సంతాప సభలో ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని కోరారు. తొలుత పెంచలయ్య చిత్రపటం వద్ద నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యుడు రామారావు, నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వైభవంగా పడిపూజ

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వరగాని సమీపంలోని సిరి శీతలగిడ్డంగి ఆవరణలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి మహా పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గురుస్వామి శ్రీనివాసరావు, ఎన్ అగ్రిటెక్ డైరెక్టర్ నూతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, కలశ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మణికంఠ భజన బృంద సభ్యుల భక్తి పాటలు ఆకట్టుకున్నాయి.

అయ్యప్పస్వామికి పూజ చేస్తున్న దీక్షధారులు

జగజ్జననీ.. నమోస్తుతే..

దుగ్గిరాల, న్యూస్‌టుడే: కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారిని, పెదకొండూరు కనకపుట్టలమ్మను ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దుగ్గిరాల: దీపారాధన చేస్తున్న భక్తులు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

మేడికొండూరు, న్యూస్‌టుడే: ప్రపంచ వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యం కొనసాగడానికి, రూపాయి విలువ తగ్గడానికి కేంద్రం అనుసరిస్తోన్న సరళీకరణ ఆర్థిక విధానాలే ఒక కారణమని మధ్య తరగతి సంఘాల జిల్లా కన్వీనర్ వి.వి.కె. సురేష్ ఆరోపించారు. మేడికొండూరులో ఆదివారం బహిరంగ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీడీపీ పరిమాణంలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా.. నేటికీ ఎంతో మంది జీవన స్థితిగతులు దుర్భరంగా ఉన్నాయన్నారు. ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేయడం, అమెరికా అనుకూల వాణిజ్య విధానం ఫలితంగా రూపాయి విలువ దిగజారిపోతుందని విశ్లేషించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం నాయకుడు రామకృష్ణ, మస్తాన్‌వలి, మహ్మద్ జానీ, సుబ్బయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్

ఆలయాలకు మహర్దశ

తుళ్లూరు, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆలయాలకు మహర్దశ పట్టింది. మండలంలోని పలు ఆలయాల అభివృద్ధికి దేవాదాయ శాఖ నిధులు మంజూరు చేసింది. అనంతవరం గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.83 లక్షలు, నెక్కల్లులోని మల్లేశ్వరస్వామి ఆలయ పురాణ కాలక్షేప మండప నిర్మాణానికి రూ.50 లక్షలు, మల్కాపురం గ్రామంలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం పునర్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు ఆ శాఖ మంజూరు చేసింది. ఈ నిధుల్లో 33 శాతం నగదును ఆయా గ్రామాల్లోని గ్రామస్థులు మ్యాచింగ్ గ్రాంటుగా అందించాల్సి ఉంటుంది.

❖ తుళ్లూరులోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్ నిర్మాణం కోసం రూ.2 కోట్లు నిధులను దేవాదాయశాఖ మంజూరు చేసింది. అందులో సీజీఎఫ్ నిధుల నుంచి 1.33 కోట్లు గ్రాంట్‌గా మంజూరు చేసింది. మిగతా రూ.66.67 లక్షలను మ్యాచింగ్ గ్రాంటు గ్రామస్థులు అందించనున్నారు. గ్రామంలోని వీరభద్రస్వామి దేవస్థానం పునర్ నిర్మాణం కోసం రూ. 1.80 కోట్లు సీజీఎఫ్ గ్రాంటుగా మంజూరు చేశారు. ఇందులో రూ.60 లక్షలు గ్రామస్థులు మ్యాచింగ్ గ్రాంటుగా చెల్లించాల్సి ఉంది. రాజధాని ప్రాంతంలోని ఆలయాల పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లకు రాజధాని రైతులు, మహిళలు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ఆయా గ్రామాల ప్రజలు ఆలయ ఈవో, దేవస్థానం అర్చకులను సంప్రదించాలని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

అనంతవరంలోని మల్లేశ్వరస్వామి ఆలయం

బంగారు గొలుసు చోరీకి విఫలయత్నం

ఈమని(దుగ్గిరాల), న్యూస్‌టుడే: మంచి నీళ్లిమ్మని అడిగిన యువకుడు మహిళ మెడలో గొలుసు(తాళిబొట్టు) లాగిన సంఘటన ఈమనిలో శనివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం చుక్కపల్లివారిపాలెం గ్రామానికి చెందిన బీటెక్ చదివిన యువకుడు కటికల రాజశేఖర్ శనివారం మధ్యాహ్నం సమీప గ్రామం ఈమనిలో కాంక్రీట్ పనులకు సామగ్రి అద్దెకు ఇచ్చే దుకాణం వద్దకు వచ్చాడు. పలు ఉపకరణాలు అద్దెకు కావాలని దుకాణదారు కామిశెట్టి జయలక్ష్మిని అడిగాడు. ఆమె సామగ్రి ఇచ్చే ప్రయత్నంలో ఉండగా మంచినీరు కావాలన్నాడు. ఆమె నీరు తెస్తుండగా మెడలో ఉన్న గొలుసు తెంచుకుని పారిపోయే ప్రయత్నం చేశాడు. ఆమె పెద్దపెద్దగా అరవడంతో సమీపంలో ఉన్న వాళ్లు అతడిని పట్టుకుని గొలుసు ఆమెకు ఇప్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటరవి కేసు నమోదు చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి లైంగిక నేరానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు. గోరంట్ల బాలాజీనగర్‌కు చెందిన దేవళ్ల కొండా అలియాస్ పండు తాపీ పనులు చేస్తుంటాడు. అదే ప్రాంతంలో ఉంటూ పాఠశాలకు వెళ్తున్న బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

వివాహితను వేధిస్తున్న యువకుడిపై..

మేడికొండూరు, న్యూస్‌టుడే: చదువుకునే రోజుల్లో తీసుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమంలో ఉంచుతూ ఓ వివాహితను ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిని అరెస్ చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తిరుపతి చంద్రశేఖర్‌కు మండలంలోని ఒక వివాహితకు గతంలో పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో వారు ఫొటోలు తీసుకున్నారు. వాటిని 'ఎక్స్'లో పోస్టు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై కేసు నమోదు చేశారు.

పంట గట్టెక్కింది..!

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: 'దిత్వా' తుపాను గండం గట్టెక్కడంతో ప్రత్తిపాడు నియోజకవర్గంలో ధాన్యం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. సరాసరి హెక్టారుకు 80 బస్తాల దిగుబడి కర్షకుల చేతికి అందుతోంది. ఎక్కువ మంది రైతులు యంత్రాల సాయంతో నూర్పిడిచేసి, పంటలను ఇళ్లకు తరలించు కుంటున్నారు. గుంటూరు రూరల్, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో సుమారు 15260హెక్టార్లలో కర్షకులు వరి సాగు రబీలో మొక్కజొన్న, జొన్న, మినుము తదితర పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇందు కోసం మేలు రకం విత్తనాలను సమీకరించు కుంటున్నారు. 'మొత్తం 15 ఎకరాల్లో వరి సాగు చేశాను. ప్రస్తుతం కోత పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాను' అని వట్టిచెరుకూరుకు చెందిన రైతు చిగురుపాటి నాగేశ్వరరావు తెలిపారు.

వట్టిచెరుకూరులో ఆరబెట్టిన ధాన్యం

ముగిసిన క్రీడా పోటీలు

గుంటూరు సాంస్కృతికం: టీజేపీఎస్ కళాశాలలో 2వ సౌత్ జోన్ సిలంబం ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద హాస్పిటల్ డాక్టర్ కొండ వెంకటేశ్వర్లు, 24 డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి, ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ కర్రసాము సాధనతో ఆత్మరక్షణతో పాటు అధిక బరువు తగ్గడానికి, ఎముకల పటుత్వానికి, శరీరంలో రక్త ప్రసరణ సజావుగా సాగేందుకు, ఏకాగ్రత పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో ఏపీ సిలంబం అసోసియేషన్ కార్యదర్శి రిషిరాజవర్మ, కావటి వెంకట్, జిడుగు సుబ్బారావు, కూడో కార్యదర్శి సిద్ధార్థవర్మ, ఉషు కోచ్ కిరణ్, కిక్ బాక్సింగ్ కోచ్ గణపతి, అడక వేణు పాల్గొన్నారు.

బహుమతులతో విజేతలు

అలర్జీ, ఆస్తమా వ్యాధులపై అవగాహన

సమ్మిట్‌లో అతిథులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అలర్జీ, ఆస్తమా వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో మణిపాల్ హాస్పిటల్, ఐఎంఏ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో 'అలర్జీ 360-కనెక్టింగ్ ఎక్స్‌పర్టైజ్ అక్రాస్ స్పెషాలిటీస్' సమ్మిట్ ఆదివారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించారు. కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ లోకేశ్ గుప్తా.. టైప్-2 సివియర్ ఆస్తమా, ఐఎల్-5 ఆధారిత బయోలాజిక్స్‌పై ప్రసంగించారు. కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ జి.ఉదయ్‌కిరణ్, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణులు, పల్మనాలజిస్టులు, పీడియాట్రిస్టులు, అలర్జీ వైద్య నిపుణులు జనరల్ ప్రాక్టీషనర్స్‌లు 300 మందికిపైగా హాజరయ్యారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

నేడు ఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: స్థానిక సమస్యలపై సోమవారం ప్రజా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863- 2224202) కార్యక్రమం ఉంటుందని, తర్వాత కౌన్సిల్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని వెల్లడించారు.



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 37, వంగ 20, బెండ 42, పచ్చిమిర్చి 39, కాకర 45, క్యారెట్ 40, క్యాబేజీ 24, బీర 35, దొండ 29, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 48, దోస 28, పొట్ల 37, చామదుంప 28, మునగ 10, గోంగూర 10, తోటకూర 15, చుక్కకూర 14, కొత్తిమీర 25, బీట్‌రూట్ 35, కీర 30, క్యాప్సికం 69, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 54, సొర 13, అరటి 8. - **న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందనకు వందనం

☛ రజకకాలనీ ప్రధానరోడ్డులో చెత్త కుప్పలు రోజులుగా అలాగే ఉండడంతో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు వంశీ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన ట్రాక్టర్ పంపి చెత్తకుప్పలు తీయించి తరలించారు.

☛ సుద్దపల్లిడొంక విజయశాంతినగర్ రెండోలైన్‌లో సైడు కాల్వల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు పారుదల కాక దోమలు పెరుగుతున్నాయని స్థానికులు భాస్కరరావు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లంతో కాల్వల్లో పూడికలు తీయించారు. - **న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)**

వృద్ధులకు బియ్యం పంపిణీ

కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, వాసవీక్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ తదితరులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఏటుకూరురోడ్డులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వాసవీక్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో 150 మంది వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరకులు, పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, వాసవీక్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో గుండా హరిప్రసాద్, కె.చంద్రశేఖరరావు, వేమూరి ప్రదీప్‌కుమార్, డి.అఖిల్, కె.వెంకట భాస్కర్ పాల్గొన్నారు.

ఉపా సెల్ గాడిన పడేనా..!

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

మహిళా సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వీటిని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా అమలు చేస్తోంది. ఈ వ్యవస్థ స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు లీకేజీ రుణాలు ఇప్పించి యూనిట్లు పెట్టుకునేలా ప్రోత్సహించాల్సి ఉంది. దీంతోపాటు గ్రూపు సభ్యుల పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు అమలు చేయాల్సిన బాధ్యత జీఎంసీ పరిధిలో ఉపాసెల్ సిబ్బందిపై ఉంది. కూటమి ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. వీటిలో 'ఒక కుటుంబం-ఒక వ్యాపారి' కింద యూనిట్లు ఇప్పటికే ఉన్న వాటిని ఎంఎస్‌ఎంఈల కింద రిజిస్ట్రేషన్ చేయించి సబ్సిడీ రుణాలు ఇప్పించడంతో పాటు నిపుణులను తయారు చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నారు. తృప్తి క్యాంటీన్లు, స్మార్ట్ వెండింగ్ జోన్లు, రాపిడోతో సమన్వయం చేసి ఎలక్ట్రికల్ వాహనాలు అందజేత వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. వీటన్నింటినీ క్షేత్ర స్థాయిలో అమలు చేసే బాధ్యత మెప్మా, ఉపాసెల్ సిబ్బందిదే. కానీ ఈ సిబ్బందిపై సరైన పర్యవేక్షణ లేక ప్రభుత్వ కార్యక్రమాలన్నీ మొక్కుబడిగానే సాగుతున్నాయి. మెప్మా సీఎంఎంలు, సీవోలకు జీఎంసీ కార్యాలయంలో ఒక గది అంటూ లేదు. దీంతో వారు ఉదయాన్నే కార్యాలయానికి హాజరు కోసం వచ్చి వెళ్లిపోతున్నారు. పనివేళల్లో వారు ఎక్కడ ఉంటున్నారో..ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది.

ఉపాసెల్ విభాగం

పక్కాగా పర్యవేక్షణ ఉంటేనే.. మెప్మా సిబ్బందికి జీఎంసీ కార్యాలయంలోనే సీట్లు కేటాయించి..వారికి సంబంధించిన దస్త్రాలు, సామగ్రి పెట్టుకుందుకు కనీసం క్యాబిన్లు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. సిబ్బంది వారి పరిధిలోని మహిళా గ్రూపుల అభ్యున్నతికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకునేలా పర్యవేక్షణ ఉండాలి. కొందరు సిబ్బంది గుంటూరులో కాకుండా వేరే ప్రాంతాల నుంచి విధులకు వస్తున్నారు. వీరు హాజరు వేశాక విధుల్లో ఉంటున్నారో..లేదో అర్థం కావడం లేదు. ఇటీవలే జీఎంసీ ఉపాసెల్ పీవోగా అధికారిని నియమించినందున ఇప్పటికైనా ఈ విభాగం పనితీరు మెరుగుపడేలా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

జీఎంసీ పరిధిలో 57 డివిజన్లు ఉండగా, మొత్తం స్వయం సహాయక సంఘాలు 10,600 వరకు ఉన్నాయి. సీఎంఎంలు ఇద్దరు, సీవోలు 26, ఆర్పీలు 330 మంది వరకు ఉన్నారు. వీరు మహిళా సంఘాల పురోగతికి తోడ్పడాల్సింది పోయి.. క్షేత్రస్థాయిలో అక్రమాలకు అలవాటుపడి నీరుగార్చుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు సిబ్బంది గతంలో ఏకంగా బ్యాంకర్లతో కుమ్మక్కై బోగస్ గ్రూపులు సృష్టించి రుణాలు పొంది ఎగ్గొట్టిన పరిస్థితి ఉంది. ఇలాంటి తప్పులు చేసిన సిబ్బందిపై అధికారులు తగు చర్యలు తీసుకోకపోవడంతో మెప్మా సిబ్బంది పనితీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు.

హజ్ హౌస్ నిర్మాణానికి కృషి

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: హజ్ యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. అంజుమన్ షాదీఖానాలో హజ్ సొసైటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది హజ్ యాత్రికులకు విజయవాడలో ప్రత్యేక భవనం సిద్ధం చేస్తామన్నారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. హజ్ యాత్రికులకు ఎటువంటి సదుపాయాలు కావాలన్నా తనను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా, సొసైటీ సభ్యులు కబీర్, అలీం, రఫీ, మున్నాన్, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

పేదల వైద్యానికి ప్రాధాన్యం

తెదేపా నాయకులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. బాలాజీనగర్‌లో తెదేపా నాయకులు ఐలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జేవీఎం ఆసుపత్రి తోడ్పాటుతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వం పేదల వైద్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పలువురు పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

నేటి నుంచి రాష్ట్ర మహాసభలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే : అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర మహాసభలు ఈనెల 8, 9 తేదీల్లో గుంటూరులో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 8న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగనున్న బహిరంగ సభలో నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్, సీనియర్ న్యాయవాది వై. కోటేశ్వరరావు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా, కేంద్ర కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితరులు ప్రసంగిస్తారని చెప్పారు. 9న అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ మర్చంట్స్ కల్యాణ మండపంలో జరగనున్న ప్రతినిధుల సభకు మానవ హక్కుల వేదిక నాయకుడు కృష్ణ, రైతు కూలీ సంఘం నాయకుడు నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ తదితరులు హాజరవుతారన్నారు.

చిరంజీవికి సత్కారం

పట్నంబజారు, న్యూస్‌టుడే: గుంటూరు తూర్పు తెదేపా బీసీ విభాగం నూతన అధ్యక్షుడు తాడిబోయిన చిరంజీవిని ఆదివారం పాతగుంటూరులోని కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ తాడిబోయిన చిరంజీవి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సుబ్బయ్య, కొంజేటి వెంకటనగేష్ పాల్గొన్నారు.

వేచి చూస్తున్న వృద్ధులు

ఓపిక పడితేనే వైద్యం అందేది..!

నగరంలోని పలు అర్బన్ హెల్త్‌సెంటర్‌లలో సిబ్బంది నిర్లక్ష్యంతో రోగుల అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల ఓపీ ఇచ్చేందుకే గంటల తరబడి సమయం పడుతుండడంతో రోగులు వేచి ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు కృష్ణనగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో జ్వరాలతో వచ్చిన వారికి గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదని పలువురు రోగులు వాపోతున్నారు. ఓపీ సమయం తర్వాత వైద్యం కోసం వచ్చిన వారిని వెనక్కి పంపించేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - **ఈనాడు గుంటూరు.**

దంత సమస్యలకు అధునాతన వైద్యం

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక కొరిటెపాడు సాయి బాబా రోడ్డులోని ఐశ్వర్య డెంటల్ క్లినిక్ ఇంప్లాంట్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆసుపత్రి చీఫ్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఐశ్వర్య పాల్గొని ప్రసంగించారు. డెంటల్ క్లినిక్ ఇంప్లాంట్ సెంటర్‌ను ప్రారంభించిన అనతి కాలంలోనే నగర ప్రజల మన్ననలు పొందడం ఆనందంగా ఉందన్నారు. ఏడాది కాలంలో నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల దంత సమస్యలకు అధునాతన పరికరాలతో తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

కేకు కోస్తున్న డాక్టర్ ఐశ్వర్య

ఏపీజీఈఏ నగర కార్యదర్శిగా కోటేశ్వరరావు

గోరంట్ల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర ప్రధాన కార్యదర్శిగా గుంటూరు సహాయ కార్మిక అధికారి బొందలపాటి కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఉద్యోగ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

సూచిక.. ప్రమాద ఘంటిక

మిర్చియార్డు సమీపంలో రహదారి వైపు ఒరిగి..

నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటుచేసిన ట్రాఫిక్ సూచికలు ప్రమాదకరంగా మారాయి. రహదారులపై మలుపులు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన సూచికలు పలు ప్రాంతాల్లో పక్కకు ఒరిగిపోయాయి. దీని వల్ల రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ వీటిని గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వీటిని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. - **ఈనాడు గుంటూరు**

కార్మెల్ సేవాసదన్‌కు అండగా నిలుద్దాం

శిబిరంలో ధనుంజయరెడ్డి తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే : మానసిక దివ్యాంగులకు సేవలందిస్తున్న కార్మెల్ సేవాసదన్‌కు అండగా నిలుద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్మెల్ సేవాసదన్‌లో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 80 మంది మానసిక దివ్యాంగులకు డాక్టర్ చల్లా చైతన్య నేతృత్వంలో ఉచితంగా పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందించారు. మానసిక దివ్యాంగులకు మెరుగైన సేవలు అందించేందుకు దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మణరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, సత్యనారాయణ, రామారావు, పావులూరి రమేష్, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా బస్సులు.. ట్రాఫిక్‌తో చిక్కులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో శంకర్‌విలాస్ పైవంతెన పనుల కారణంగా కలెక్టరేట్ రహదారివైపు విపరీతంగా రద్దీ పెరిగింది. దీనికి తోడుగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, రహదారుల ఆక్రమణలతో సమస్యలు ఎక్కువవుతున్నాయి. మార్కెట్ కూడలి వద్ద టీబీ బంగ్లా ఎదుట సిటీబస్సులను ఇష్టానుసారం నిలపడం వల్ల నిత్యం సమస్యలు వస్తున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ నుంచి రాకపోకలు చేసేవారు మార్కెట్ నుంచి కలెక్టరేట్ వైపు వచ్చేటప్పుడు టీబీ బంగ్లా ఎదుటకు రాగానే ఆగిపోవాల్సి వస్తోంది. ఇక్కడ పలుమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. ఇక్కడ సిటీబస్సులను ఆపకుండా.. గతంలో బస్‌షెల్టరు ఉన్న చోట నిలిపేలా పోలీసులు చర్యలు తీసుకుని, వెనుక బస్సు రాగానే క్రమపద్ధతిలో ట్రాఫిక్ వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అధ్వానంగా ఫౌంటెయిన్లు

బస్టాండు సెంటర్లోని ఫౌంటెయిన్లు అధ్వాన స్థితికి చేరాయి. అధికారుల పర్యవేక్షణ లేక చెత్త, కాగితాలు, మద్యం సీసాలు అందులో పడేస్తున్నారు. రాత్రి వేళల్లో కొంతమంది ఇక్కడే మద్యం తాగుతున్నారు. కార్పొరేషన్ అధికారులు తక్షణం స్పందించి వాటి అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. - **న్యూస్‌టుడే, పట్నంబజారు**

రోడ్లపై ఆవులు.. ప్రజలకు తప్పని పాట్లు

పాతగుంటూరులోని బాలాజీనగర్ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై ఆవులు గుంపులుగా చేరుతున్నాయి. వాటిని కట్టడి చేసేందుకు అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవటం లేదు. వాటి కారణంగా చిన్నారులు ఇటుగా రాకపోకలు చేసేందుకు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్లపై ఆవులు తిరగకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పట్నంబజారు**

రౌడీషీటర్లపై నిరంతర నిఘా



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు, న్యూస్‌టుడే: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం తూర్పు డివిజన్‌ని కొత్తపేట, పాతగుంటూరు, లాలాపేట స్టేషన్ల పరిధిలోని దాదాపు 150 మంది రౌడీషీటర్లకు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రౌడీషీటర్లు జీవితంలో మార్పునకు అవకాశాన్ని ఉపయోగించుకొని, బాధ్యతాయుత జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. పాతగుంటూరు సీఐ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ రౌడీషీటర్లపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందన్నారు. వారి ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. లాలాపేట సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో గౌరవం పొందాలంటే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు రెహమాన్, రమేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో ఎన్నో ఉపయోగాలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే : ఆయుర్వేద వైద్యంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ప్రాచీనమైన ఈ వైద్యంతో దీర్ఘకాల వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని భాష్యం పాఠశాల డీన్ హరిబాబు అన్నారు. శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, వైద్యులు మౌనిక, భవాని, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనకే పరిమితమా..!
అభివృద్ధికి నోచని గడ్డిపాడు చెరువు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

నగరంలో చెరువులు, నీటికుంటల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. భూగర్భ జలాల పరిరక్షణతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా వాటిని తీర్చిదిద్ది నగరానికి సిటీ లుక్ తెచ్చేలా దృష్టి సారించాల్సి ఉంది. విజయవాడరోడ్డు ఆటోనగర్ పక్కన గడ్డిపాడు వద్ద ఉన్న చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు ఉన్నా.. వాటి అమలుపై అధికారులు ఆలోచన చేయడం లేదు.

మహాత్మాగాంధీ ఇన్నర్ రింగురోడ్డు పక్కన ఉన్న ఈ చెరువును అభివృద్ధి చేస్తే పరిసరాల్లోని వారికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈప్రాంతంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వచ్చినందున..చెరువును కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే..ఇక్కడ ప్రస్తుతం ఉన్న కలుషిత వాతావరణంలో మార్పు వస్తుందని పలువురు సూచిస్తున్నారు. చెరువు చుట్టూ కట్ట బలోపేతం చేయడంతోపాటు వాకింగ్‌ట్రాక్, పచ్చదనం, ఇతర సదుపాయాలు కల్పిస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. చుట్టుగుంట చెరువును అభివృద్ధి చేసినట్లుగానే దీనిపైనా దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలతో నిండిన చెరువు

ఆక్రమణలకు గురవుతున్నా.. : చెరువు చుట్టూ ఇప్పటికే అనేక నివాసాలు ఉండగా..వీటిలో అనేకం ఆక్రమించి నిర్మించారు. కొందరు కబ్జాదారులు ఒకవైపు నుంచి చెరువును చెత్త, వ్యర్థాలతో పూడ్చేస్తూ వస్తున్నారు. తర్వాత వీటిపై మట్టితో మెరక చేయించి నివాస స్థలాలుగా మార్చి కబ్జా చేస్తున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు వెంటనే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికే చెరువు అభివృద్ధి నిమిత్తం పలుమార్లు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రాథమిక నిర్ణయాలు తీసుకుని ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రతిపాదనలు వెంటనే అమల్లోకి వచ్చేలా..చెరువు అభివృద్ధికి అడుగులు పడేలా ఇంజినీరింగ్ అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఫలించిన పెద్దల ప్రయత్నాలు
ఎల్వీఆర్ సన్స్‌క్లబ్ ప్రధాన పదవులు ఏకగ్రీవం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పెద్దల క్లబ్‌గా పేరొందిన ఎల్వీఆర్ సన్స్ క్లబ్ పాలకవర్గ ఎన్నికల్లో ప్రధాన పదవులు ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. ఆదివారం లోగా నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ దఫా పలు పదవులకు 100 మందికి పైగానే నామినేషన్లు దాఖలు చేశారు. పెద్దలు రంగంలోకి దిగి ఏకగ్రీవమయ్యేలా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులతో చర్చలు జరిపారు. వారి ప్రయత్నాలు చాలా వరకు ఫలించాయి. మరో దఫా అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామని నచ్చజెప్పడంతో చాలామంది మెత్తబడ్డారు. దీంతో ప్రధాన పదవులన్నీ ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా నూకవరపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పతంగి జనార్దనరావు, కార్యదర్శిగా యర్రమనేని రామకృష్ణ, కోశాధికారిగా వక్కలగడ్డ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా కొండ్రగుంట బుచ్చిబాబు, ఈసీ సభ్యులు కొమ్మినేని నాగేశ్వరరావు (టెన్నిస్), వట్టికూటి బాలాజీ ప్రసాద్ (బిలియర్డ్స్), నెల్లూరి రోశయ్య (బఫెట్), వట్టిగుంట నాగిరెడ్డి (ఇండోర్ గేమ్స్), పాలడుగు సుబ్బారావు (రీడింగ్‌రూమ్, లైబ్రరీ), చిట్టినేని శివకోటేశ్వరరావు (కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు), కృష్ణమనేని లలితబాబు (బార్), తిరివీధి వెంకట రమణయ్య (విశ్రాంతి గదులు), వజ్రాల సాంబిరెడ్డి (స్టోర్స్, హౌస్ కీపింగ్), కొలిపాకుల చంద్రశేఖర్ (జిమ్, సూపర్‌బజార్), కుర్రా ఏసుబాబు (సాంఘిక సంక్షేమ, క్రీడా కార్యక్రమాలు) ఏకగ్రీవమయ్యాయి. పెద్ది వెంకటరావు, కూనిశెట్టి వెంకటరమణ ప్రసాద్ (వైద్యశాల), జె.ధర్మారావు, బోనబోయిన సాంబయ్య, తాడిబోయిన సంపత్‌కుమార్, కాకుమాను పున్నారావు (క్యారమ్స్, చెస్)లు ఎన్నికల బరిలో ఉన్నారు. మొత్తం ఆరుగురు వైద్యశాల, క్యారమ్స్, చెస్ విభాగాలకు పోటీ పడుతున్నారు.

గంజాయి కేసులో ఆరుగురి అరెస్టు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే : గంజాయి అమ్మకం, కొనుగోలు చేస్తున్న ఆరుగురిని నగరంపాలెం పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో పశ్చిమ వలయ డీఎస్పీ అరవింద్ వివరాలు వెల్లడించారు. వీఐపీ రోడ్డులోని లాల్‌పురం వెళ్లే డొంక సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. గొర్ల కోటేష్ అలియాస్ ఈశ్వర్, కాకర్ల శ్రీకాంత్, బిశెట్టి కిరణ్ అలియాస్ సాయి, షేక్ నాగుల్ షరీఫ్, అర్థల అశోక్, షేక్ అబ్దుల్ ఖయ్యూమ్‌లను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో మరికొందరికి ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని, వారిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. కోటేష్, శ్రీకాంత్, కిరణ్, నాగుల్ షరీఫ్, అబ్దుల్ ఖయ్యూమ్‌లపై గతంలో పలు కేసులు ఉన్నాయన్నారు. నిందితుల్లో ఒకరైన శ్రీకాంత్ ఇంజినీరింగ్ చదువుతూ గంజాయికి బానిసగా మారాడన్నారు. గంజాయి కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులను ఎస్పీ అభినందించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో డీఎస్పీ అరవింద్, సీఐ సత్యనారాయణ

కత్తితో దాడి: కేసు నమోదు

పట్నంబజారు, న్యూస్‌టుడే: నవభారత్‌నగర్‌లో జరిగిన దాడి ఘటనపై పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం..ఆదివారం రాత్రి ప్రభాకర్, అతని భార్య గొడవ పడుతున్నారు. వారి ఇంటి పక్కనే నివాసం ఉంటున్న మోహన్‌రావు వీరి వద్దకు వెళ్లి గొడవ పడొద్దని చెప్పాడు. దీంతో ప్రభాకర్ కత్తితో మోహన్‌రావుపై దాడి చేశాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గోరంట్ల, న్యూస్‌టుడే : ఎలుక సీతారామమ్మ సంక్షేమ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పాతగుంటూరు యాదవ హైస్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైకాపా నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, తాడికొండ సమన్వయకర్త బాలవజ్రబాబు ప్రారంభించారు. అనంతరం వైద్యులు అక్కడికి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఎలికె శ్రీకాంత్ యాదవ్, వైకాపా రాష్ట్ర కార్యదర్శి గులాబ్ రసూల్ సంస్థ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

కరాటేతో క్రమశిక్షణ.. ఆత్మవిశ్వాసం

పోటీల్లో పాల్గొన్న బాలలతో ఎమ్మెల్యే మాధవి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ సాధనతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం పెంపొందుతాయని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ స్వీయ రక్షణ ఎంతో అవసరమన్నారు. ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాలువలో పూడికతీత: ఎన్జీవో కాలనీ దగ్గర కాలువలో మురుగు ముందుకు కదలకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ సూపర్‌వైజర్ ఐజాక్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు.

వ్యర్థాల తొలగింపు: కంకరగుంట మసీదు రోడ్డులో పీకలవాగు దగ్గర చెత్తతో కూడిన వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బంది సాయంతో వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

అలరించిన నృత్య పోటీలు

జానపద నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాధామాధవ రసరంజని, రాధామాధవ నాట్య క్షేత్రం నిర్వహణలో రెండు రోజుల పాటు నిర్వహించిన నృత్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం హిందూ కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్ దుర్గాప్రసాద్‌కు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి షేక్ ఖలీల్ గురుసత్కారం చేశారు.

రహదారిపై వ్యర్థాల తొలగింపు

జేసీబీతో వ్యర్థాలు తొలగించి లారీలో తరలిస్తున్న కార్మికులు

ఈనాడు కథనానికి స్పందన

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: రైస్‌మిల్లు రోడ్డు, నేతాజీనగర్ సమీపంలోని రహదారులపై గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య విభాగం సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. 'స్వచ్ఛతకు తూట్లు' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం వచ్చిన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. కమిషనర్ ఆదేశాలతో శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో వ్యర్థాలు తొలగించి లారీలో డంపింగ్ యార్డుకు తరలించారు. మరోసారి ఎవరైనా వ్యర్థాలు రోడ్లపై వేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. చెత్త సమస్య పరిష్కారం కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మో.. రైల్వేగేట్లు..!

ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకీ తీవ్రతరం

పట్టాభిపురం, గోరంట్ల, న్యూస్‌టుడే

గుంటూరులో రైల్వే గేట్లు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. గేటు పడిదంటే రెండు వైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. శ్యామలానగర్, ఇన్నర్ రింగ్‌రోడ్డులో రైల్వేగేట్ల వద్ద వాహనదారులు పడుతున్న వెతలు అన్నీ ఇన్నీ కావు. ప్యాసింజర్లు, ఎక్స్‌ప్రెస్‌లు, గూడ్సు బండ్లు అనీ కలిపి రోజుకు సుమారు వంద వెళ్తుంటాయి. గేటు పడిన ప్రతిసారీ పావుగంట వరకు రెండు వైపులా వాహనాలు నిలిచిపోక తప్పదు. ట్రాఫిక్ రద్దీ సమయాల్లో ఇంకా ఎక్కువ సమయమే పడుతోంది. కొన్ని సందర్భాల్లో రైల్వే గేటు తీసిన సమయంలో వాహనాలు క్లియర్ అవ్వక రైళ్లు ఆగిపోతున్నాయి.

ఇన్నర్ రింగ్‌రోడ్డులో గేటు వద్ద వాహనాలు బారులు

గడ్డిపాడు రైల్వేగేటు పడిందా అంతే..: మహాత్మా గాంధీ న్యూఇన్నర్ రింగ్‌రోడ్డులో వాహనాల తాకిడి బాగా పెరిగింది. ఇదే మార్గంలో గడ్డిపాడు సమీపంలోని రైల్వే గేటు పడితే జంక్షన్ వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. పలు సందర్భాల్లో రెండు రైళ్లు రాకపోకలు ఒకేసారి ఉంటే మాత్రం రైల్వే గేటు వద్ద కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. సాయంత్రం రైల్వే గేటు పడితే ఆటోనగర్ వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. గడ్డిపాడు జంక్షన్‌లో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభిస్తున్నాయి. గేటు తీసిన తర్వాత గంట వరకు కూడా ట్రాఫిక్ అదుపు కావడం లేదు.

☛ రైల్వే గేట్ల వద్ద వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరైనా దున పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేస్తేనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. దీనిపై ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శ్యామలానగర్ రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

శ్యామలానగర్ రైల్వేగేటు దాటాలంటే యుద్ధమే..: గుంటూరు పశ్చిమలో శ్యామలానగర్ రైల్వే గేటు కీలకమైంది. ఉదయం 8 నుంచి 10.30 గంటలు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలతో రద్దీ ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో రైల్వే గేటు ఎత్తగానే దాటాలంటే యుద్ధం చేయాల్సిందే. నిలిచిపోయిన వాహనాలన్నీ గేటు దాటక ముందే మళ్లీ పడుతుంది. గూడ్సు రైళ్లు వెళ్లే సమయాల్లో ఈ పరిస్థితి తలెత్తుతోంది. విద్యార్థులు, ఉద్యోగులు ట్రాఫిక్‌లో చిక్కుకుని సకాలంలో పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లలేకపోతున్నారు. బారికేడ్లతో రహదారులు మూసివేయకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు వైపులా ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కృష్ణనగర్ రైతుబజారులో నిన్నటి ధరలు(కిలో రూ.లో): టమాట 37, వంగ 24, బెండ 42, పచ్చిమిర్చి 39, కాకర 45, బీర 50, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజీ 24, క్యారెట్ 40, దొండ 29, బంగాళదుంప 27, పాయలు 27, గోరుచిక్కుళ్లు 48, దోస 28, సొర 22, పొట్ల 37, అరటికాయ 10, పెద్దచిక్కుళ్లు 67, చామదుంప 28, మునగ 10, బీట్‌రూట్ 40, కీరదోసకాయ 30, బీన్స్ 65, క్యాప్సికమ్ 69, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 25, అల్లం 80, వెల్లుల్లి 110. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

ఏపీజీఈఏ నగర కార్యదర్శిగా కోటేశ్వరరావు

కోటేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

గోరంట్ల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర ప్రధాన కార్యదర్శిగా గుంటూరు సహాయ కార్మిక అధికారి బొందలపాటి కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఉద్యోగ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: స్థానిక సమస్యలపై సోమవారం ప్రజా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863- 2224202) కార్యక్రమం ఉంటుందని, తర్వాత కౌన్సిల్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని వెల్లడించారు.

వైభవంగా రామకోటి మహోత్సవాలు ప్రారంభం

పూజలు చేస్తున్న అర్చకులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీరామనామ క్షేత్రంలో 99వ శ్రీరామకోటి మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలను క్రోసూరి మురళీకృష్ణమాచార్యులు నిర్వహించారు. రామకృష్ణ మిషన్ సీతానగరం కార్యదర్శి స్వామి వినిశ్చలానంద పతాక ఆవిష్కరణ చేసి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమాలను క్షేత్ర నిర్వాహకులు బెల్లంకొండ మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

ఆనందం.. ఆహ్లాదం..

యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, గుంటూరు శాఖ ఆధ్వర్యంలో పలువురు ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో ఆదివారం ట్రెక్కింగ్ చేశారు. తాడు సాయంతో ఒకరికొకరు సహకరించుకుంటూ కొండను ఎక్కారు. ప్రకృతి అందాల మధ్య ట్రెక్కర్స్ ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు.

-న్యూస్‌టుడే, నవభారత్‌నగర్

వైద్యానికీ నిరీక్షణ తప్పదా..!

ఓపీ కోసం వేచి ఉన్న వృద్ధులు

నగరంలోని పలు అర్బన్ హెల్త్‌సెంటర్లలో సిబ్బంది నిర్లక్ష్యంతో రోగులు అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల ఓపీ ఇచ్చేందుకే గంటల తరబడి సమయం పడుతుండడంతో రోగులు వేచి ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు కృష్ణనగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో జ్వరాలతో వచ్చిన వారికి గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదని పలువురు రోగులు వాపోతున్నారు. ఓపీ సమయం తర్వాత వచ్చిన తర్వాత వైద్యం కోసం వచ్చిన వారిని వెనక్కి పంపించేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - **ఈనాడు గుంటూరు.**

వైభవంగా గౌరీవిశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం

బ్రాడీపేట 2/7లోని గౌరీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి శాంతి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. జంధ్యాల పవన్‌కుమారశర్మ, శ్రీవెంకటలక్ష్మి, అడారి దుర్గావినోద్‌కుమార్ దంపతులు తదితరులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అర్చక స్వామి విశ్వేశ్వరశర్మ కల్యాణ క్రతువును జరిపించారు. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లికార్జునశర్మ, చక్రపాణి, వాసు, కల్యాణ్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

-న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్..

రింగ్‌రోడ్డులోని విద్యానగర్ నాలుగోలైను ప్రధాన రహదారిలో రోడ్డు కంటే ఎత్తుగా మ్యాన్‌హోల్ ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉండడంపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గుజ్జనగుండ్ల నుంచి కొరిటెపాడు వెళ్లేవారితో పాటు విద్యానగర్ నాలుగో లైనులో నుంచి ప్రధాన రహదారి వైపు వచ్చే వారి వాహనాల టైర్లు మ్యాన్‌హోల్ పైకి ఎక్కి బెసికి ప్రమాదాల బారిన పడుతున్నారు. మ్యాన్‌హోల్ చుట్టూ స్లోప్ చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పట్టాభిపురం

అటు మెరుగులు.. ఇటు తూట్లు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు ఒకవైపు నగరపాలక సంస్థ యంత్రాంగం డివైడర్లకు రంగులు వేయిస్తూ.. పూల మొక్కలు నాటిస్తుంది. మరోవైపు చెత్త ట్రాక్టర్ల డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు స్వచ్ఛతకు తూట్లు పొడుస్తున్నారు. నివాస గృహాల నుంచి కార్మికులు సేకరించిన వ్యర్థాలను ట్రాక్టర్లలో స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. ఈ పాయింట్ల నుంచి డంపర్ ట్రేసర్ వాహనం వ్యర్థాలను ప్లాంటుకు తరలిస్తుంది. ఈ క్రమంలో ఎక్కువ చెత్త ఉంటే.. వల లాంటి పట్టా కప్పుతున్నారు. కొందరు మాత్రం కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓవర్‌లోడుతో వెళుతున్న చెత్త ట్రాక్టరు, (అంతర్ చిత్రంలో) ట్రాక్టర్ నుంచి జారి పడిన వ్యర్థాలు

చెత్త ట్రాక్టర్ల నుంచి రోడ్లపై పడుతున్న వ్యర్థాలు

★ నగరంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ట్రాక్టర్లలో చెత్త తీసుకెళ్లే సమయంలో ఓవర్‌లోడు చేస్తున్నారు. ఎక్కువ చెత్త ఉంటే.. మరోసారి రావాల్సి వస్తుందన్న కారణంతో పైవరకు వేసేస్తున్నారు. వ్యర్థాలు రోడ్లపై పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడంలేదు. దీంతో ట్రాక్టర్లు ప్రధాన రహదారిపై వెళ్తున్న సమయంలో అందులో వ్యర్థాలు జారి పడుతున్నాయి.

డివైడర్లకు రంగులు వేస్తున్న కార్మికులు

కనీస జాగ్రత్తలు తీసుకోలేరా..

★ ఆదివారం ఉదయం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ నుంచి స్తంభాలగరువు సెంటర్ నుంచి కంకరగుంట గేటు వరకు వ్యర్థాలు రోడ్డుపై పడ్డాయి. ప్రధాన రహదారిపై వ్యర్థాలు జారి పడినా వాహనం డ్రైవర్, సిబ్బంది వాటిని అలానే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ★ చెత్త తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై పారిశుద్ధ్య విభాగం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ట్రాక్టర్లలో ఓవర్‌లోడ్‌తో వ్యర్థాలు తరలించకుండా చూడాలని, ఒకవేళ తరలించాల్సి వస్తే.. పైన పట్టా కప్పి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలంటున్నారు.

దేశానికే గర్వకారణం అంబేడ్కర్

మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ భారతదేశంలో పుట్టడం మనందరికీ గర్వకారణమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-జాషువా-పులె-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సభ ఆదివారం జరిగింది. సభకు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం రచించడమే గాక ప్రత్యేకించి స్త్రీల హక్కుల కోసం పోరాడిన స్త్రీవాది అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ విద్యా రంగంలో అరుదైన గుర్తింపు అంబేడ్కర్ సొంతం చేసుకున్నారని తెలిపారు. ముంబయితో పాటు కొలంబియా, లండన్‌లోని విశ్వవిద్యాలయాల నుంచి ఎన్నో డిగ్రీలు, డాక్టరేట్ పొందారన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా దేశానికి విశేష సేవలు అందజేశారన్నారు. సభలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వీసీకే పార్టీ మహిళా విభాగం ఏపీ అధ్యక్షురాలు కె.జయసుధ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ పర్యవేక్షించారు.

యువకుడిపై పోక్సో కేసు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి లైంగిక నేరానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు. గోరంట్ల బాలాజీనగర్‌కు చెందిన దేవళ్ల కొండా అలియాస్ పండు తాపీ పనులు చేస్తుంటాడు. అదే ప్రాంతంలో ఉంటూ పాఠశాలకు వెళ్తున్న బాలికను ప్రేమిస్తున్నానని వెంట పడుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.



ఉత్సాహంగా క్రీడా పోటీలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్ టుడే: టీజేపీఎస్ కళాశాలలో 2వ సౌత్ జోన్ సిలంబం ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద హాస్పిటల్ డాక్టర్ కొండ వెంకటేశ్వర్లు, 24 డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి, ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ కర్రసాము సాధనతో ఆత్మరక్షణతో పాటు అధిక బరువు తగ్గడానికి, ఎముకల పటుత్వానికి, శరీరంలో రక్త ప్రసరణ సజావుగా సాగేందుకు, ఏకాగ్రత పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో ఏపీ సిలంబం అసోసియేషన్ కార్యదర్శి రిషిరాజవర్మ, కావటి వెంకట్, జిడుగు సుబ్బారావు, కూడో కార్యదర్శి సిద్ధార్థవర్మ, ఉష కోచ్ కిరణ్, కిక్ బాక్సింగ్ కోచ్ గణపతి, అడక వేణు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

క్రియాయోగ దీక్షలతో చైతన్యశక్తి

గుంటూరు సాంస్కృతికం: చంద్రమౌళినగర్‌లోని సాయి కృష్ణ మండపంలో జరుగుతున్న క్రియాయోగ దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా ప్రభుదానంద గురూజీ మాట్లాడుతూ శరీరంలోని ప్రాణశక్తి సూక్ష్మ ప్రవాహాన్ని క్రియాయోగం పునర్జీవింపజేసి శక్తివంతం చేస్తుందన్నారు. దీనివల్ల గుండెపై ఒత్తిడి తగ్గిస్తుందని, మనుషుల్లో చైతన్య శక్తి పెంపొందుతుందని వివరించారు. మనోజ్‌బాబా గురూజీ, క్రియాయోగ ధ్యాన కేంద్రం సత్సంగ సభ్యులు శ్రీనివాసరావు, ప్రసాదరావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోరంట్ల, న్యూస్‌టుడే: ఎలుక సీతారామమ్మ సంక్షేమ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పాతగుంటూరు యాదవ హైస్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైకాపా నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, తాడికొండ సమన్వయకర్త బాలవజ్రబాబు ప్రారంభించారు.

దంత సమస్యలకు అధునాతన వైద్యం

వార్షికోత్సవ కేకు కోస్తున్న డాక్టర్ ఐశ్వర్య

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక కొరిటెపాడు సాయిబాబా రోడ్డులోని ఐశ్వర్య డెంటల్ క్లినిక్ ఇంప్లాంట్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆసుపత్రి చీఫ్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఐశ్వర్య పాల్గొని ప్రసంగించారు. డెంటల్ క్లినిక్ ఇంప్లాంట్ సెంటర్‌ను ప్రారంభించిన అనతి కాలంలోనే నగర ప్రజల మన్ననలు పొందడం ఆనందంగా ఉందన్నారు. ఏడాది కాలంలో నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల దంత సమస్యలకు అధునాతన పరికరాలతో తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారామాచార్యులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బహుముఖ ప్రజ్ఞాశాలి కోగంటి సీతారామాచార్యులని త్రిదండి రామచంద్ర జీయర్ స్వామి అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై కోగంటి సీతారామాచార్యులు శత జయంత్యుత్సవాల్లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. కోగంటి సీతారామచార్యులు అధ్యాపకుడిగా, ఆచార్యుడిగా, గురువుగా, పండితుడిగా విశేష కీర్తి గడించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులు శతజయంత్యుత్సవాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. తొలుత దేవాలయ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం 'పాంచరాత్మ పారమ్యం' అనే గ్రంథాన్ని రామచంద్ర జీయర్ స్వామి, గుదిమెళ్ల కూర్మనాథ స్వామి, కోగంటి వెంకటశ్రీరంగనాయకి ఆవిష్కరించారు. అంతకుముందు బాలాజీ కల్యాణ మండపంలో జరిగిన సభలో డాక్టర్ రంగాచార్యులు సభాధ్యక్షతన డాక్టర్ శృంగారం తిరువేంగళ కృష్ణమాచార్యులు, డాక్టర్ ఎస్‌వీఎస్ఎల్ ఫణి కామేశ్వరి, రాఘవ, రాజ్యలక్ష్మి, కె.స్వర్ణ, ఎం.ఇందిర, ఎస్.సుధాపరిమళ... సీతారామాచార్యులు జీవిత విశేషాలపై ప్రసంగించారు.

గ్రంథావిష్కరణ చేస్తున్న రామచంద్ర జీయర్ స్వామి తదితరులు

ఫలించిన పెద్దల ప్రయత్నాలు

ఎల్వీఆర్ సన్స్‌క్లబ్ ప్రధాన పదవులు ఏకగ్రీవం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పెద్దల క్లబ్‌గా పేరొందిన ఎల్వీఆర్ సన్స్ క్లబ్ పాలకవర్గ ఎన్నికల్లో ప్రధాన పదవులు ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. ఆదివారం లోగా నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ దఫా పలు పదవులకు 100 మందికి పైగానే నామినేషన్లు దాఖలు చేశారు. పెద్దలు రంగంలోకి దిగి ఏకగ్రీవమయ్యేలా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులతో చర్చలు జరిపారు. వారి ప్రయత్నాలు చాలా వరకు ఫలించాయి. మరో దఫా అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామని నచ్చజెప్పడంతో చాలామంది మెత్తబడ్డారు. దీంతో ప్రధాన పదవులన్నీ ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా నూకవరపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పతంగి జనార్దనరావు, కార్యదర్శిగా యర్రమనేని రామకృష్ణ, కోశాధికారిగా వక్కలగడ్డ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా కొండ్రగుంట బుచ్చిబాబు, ఈసీ సభ్యులు కొమ్మినేని నాగేశ్వరరావు (టెన్నిస్), వట్టికూటి బాలాజీ ప్రసాద్ (బిలియర్డ్స్), నెల్లూరి రోశయ్య (బఫెట్), వట్టిగుంట నాగిరెడ్డి (ఇండోర్ గేమ్స్), పాలడుగు సుబ్బారావు (రీడింగ్‌రూమ్, లైబ్రరీ), చిట్టినేని శివకోటేశ్వరరావు (కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు), కృష్ణమనేని లలితబాబు (బార్), తిరివీధి వెంకట రమణయ్య (విశ్రాంతి గదులు), వజ్రాల సాంబిరెడ్డి (స్టోర్స్, హౌస్ కీపింగ్), కొలిపాకుల చంద్రశేఖర్ (జిమ్, సూపర్‌బజార్), కుర్రా ఏసుబాబు (సాంఘిక సంక్షేమ, క్రీడా కార్యక్రమాలు) ఏకగ్రీవమయ్యాయి. పెద్ది వెంకటరావు, కూనిశెట్టి వెంకటరమణ ప్రసాద్ (వైద్యశాల), జె.ధర్మారావు, బోనబోయిన సాంబయ్య, తాడిబోయిన సంపత్‌కుమార్, కాకుమాను పున్నారావు (క్యారమ్స్, చెస్)లు ఎన్నికల బరిలో ఉన్నారు. మొత్తం ఆరుగురు వైద్యశాల, క్యారమ్స్, చెస్ విభాగాలకు పోటీ పడుతున్నారు.

టకటకా కొనుగోళ్లు.. చకచకా చెల్లింపులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వైకాపా హయాంలో ధాన్యం విక్రయాల్లో విధించిన నిబంధనలతో రైతులు అనేక అవస్థలు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని సడలించడంతో పాటు మద్దతు ధర అందిస్తోంది. విక్రయించిన 48 గంటల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంది. దీంతో ప్రస్తుతం కొనుగోళ్లు వేగవంతమయ్యాయి. ★ ఈ-పంట నమోదుతో పాటు ఈకేవైసీ పూర్తయిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన మిల్లులకు సరకు పంపేలా చర్యలు తీసుకుంది. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఎక్కువ మంది యంత్రాలతో కోతలు కోయించడంతో ధాన్యం అంతా ఒకేసారి వచ్చింది. ఈ నేపథ్యంలో కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా రైతుకు ఇష్టం వచ్చిన చోట విక్రయించుకునే వెసులుబాటు సైతం కల్పించింది. ★ ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 29,668 మంది రైతులు ధాన్యం విక్రయించారు. వారి బ్యాంకు ఖాతాలకు 48 గంటల్లో నగదు జమవుతోంది. ఆ మొత్తం రూ.502.50 కోట్లుగా అధికారులు చెబుతున్నారు. అయితే ఇటీవలి వరకు తేమ శాతం నిబంధన, వివిధ సమస్యలతో అనేక మంది బయట వ్యాపారులకు అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఎవరికి వారు ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు: 287
దిగుబడి అంచనా: 10 లక్షల టన్నులు
డిసెంబరు 7వరకు కొనుగోలు: 2,46,473 టన్నులు
ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర(క్వింటాల్)
ఏ గ్రేడ్ : రూ.2,389 సాధారణ: రూ.2,369
కంట్రోల్ రూమ్ నంబరు: 82476 93551

ప్రత్యేక కమిటీలతో..

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నాం. 72,98,622 సంచులు అందుబాటులో ఉంచాం. ధాన్యం మిల్లులకు తరలించేందుకు 4,199 వాహనాలు ఏర్పాటు చేశాం. ఎగుమతి దగ్గర నుంచి దిగుమతి అయ్యే వరకు జీపీఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేస్తాం. సమస్యలు ఉంటే అధికారులు, లేదా కంట్రోల్ రూమ్‌కు చెబితే చర్యలు తీసుకుంటాం.

-ఎం.నవీన్, జేసీ

ఫలం.. పుష్పం.. పర్యావరణ హితం

నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో రోజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫల, పుష్ప ప్రదర్శన ఆకట్టుకుంది. ఆదివారం ఎకో ఫ్రెండ్లీ అంశంపై జరిగిన కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈనాడు, అమరావతి- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

దుకాణం పెట్టనివ్వరు.. మద్యం ముట్టనివ్వరు!

అవకాశం వస్తే మద్యం దుకాణాలకు పోటీపడి ఆదాయం పొందేందుకు తీవ్రంగా ప్రయత్నించే వారిని చూశాం. కానీ కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామం ఇందుకు పూర్తి భిన్నం. అక్కడ పెద్దలు.. ప్రజారోగ్యం, గ్రామాభివృద్ధికి దోహదపడే ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం విక్రయాలు కానీ, గొలుసు దుకాణాలు కానీ లేకుండా ఉండేలా అందరూ కలిసి కట్టుబాటు చేసుకున్నారు. ఏళ్లుగా ఈ నిర్ణయాన్ని పక్కాగా అమలు చేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఈ గ్రామ జనాభా 15వేలకు పైనే. అత్యధికులు చిరువ్యాపారులే. గతంలో మద్యం తాగిన వారికి జరిమానా కూడా విధించిన సందర్భాలున్నాయని, ఏళ్లుగా మద్యం అమ్మకాలను మాత్రం అనుమతించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని గ్రామస్థులంతా ఒకే మాటగా పాటిస్తున్నారని సర్పంచి షేక్ షబ్బీర్ తెలిపారు.
– పెండ్యాల(కంచికచర్ల)

కొండపల్లి కోన.. జలపాతాల వీణ

ఈనాడు, అమరావతి

విజయవాడకు పది కి.మీ దూరంలో ఉండే దట్టమైన కొండపల్లి అటవీ ప్రాంతంలో మనసు దోచే జలపాతాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. చుట్టూ పచ్చని చెట్లు.. కొండలు.. పక్షుల కిలకిలారావాలు.. సీతాకోక చిలుకల వయ్యారాల నడుమ ఇవి మాడుమువ్వలుగా ఉంటాయి. వీటిలో ప్రధానమైన 12 జలపాతాలను గత తెదేపా హయాంలో కలెక్టర్‌గా లక్ష్మీకాంతం పనిచేసిన సమయంలో గుర్తించి అధికారికంగా పేర్లు పెట్టారు.

ఒక్కోదానికి ఒక్కో పేరు

ఛత్తీస్‌గఢ్‌లోని చిత్రకూట్ జలపాతాన్ని పోలి ఉండే జలపాతానికి జేబీ చిత్రకూట్, కొండ జడలను పోలినట్టుగా ఉండే రెండు పాయల జలపాతానికి జడల కొలను, అడవి లోపలికి వెళ్లే కొద్దీ ఆత్మీయ స్వాగతం పలికేలా దర్శనమిచ్చేదానికి వనమాలి, రెండు కొండల మధ్య చీర పరిచినట్టుగా కనిపించే జలపాతానికి కొంగు ధార, సీతాకోక చిలుకలు కనిపించేచోట సీతాకోక గుండం అని నామకరణం చేశారు. ✦ శేషాచలం అడవుల్లో ఉండే తుంబురు కోన జలపాతాన్ని పోలి ఉండేదానికి.. చిట్టి తుంబురకోన, మారుడుమ్మ అయ్యానికి సమీపంలోని దానికి మారుడుమ్మ తీర్థం, ఏడుపాయలుగా నీటి కిందకు పారే జలపాతానికి సప్తస్వరధార, 30 అడుగుల ఎత్తునుంచి జలధార జారి కింద ఉన్న ఓ రాతిపై పడి.. శివ లింగానికి అభిషేకం చేసినట్లుగా కనిపిస్తుండటంతో.. క్షీరలింగ జలపాతం, నెమళ్లు తిరిగే ప్రాంతంలో ఉండేదానికి.. నెమలిధార, పడి, ఎడమల జలపాతం, కలెక్టర్ జలపాతం.. ఇలా 12 పేర్లను అధికారికంగా పెట్టారు.

మూలపాడులో..

అధికారికంగానే 12 గుర్తించి నామకరణం

దొనబండలో..

ఘాట్ రోడ్డు నుంచి.. ఇవన్నీ అడవిలోకి వెళ్లక కొండపల్లి ఘాట్‌రోడ్డుకు రెండు నుంచి నాలుగైదు కి.మీ దూరంలోనే అధికంగా ఉన్నాయి. కొన్ని మూలపాడుకు 16-18 కి.మీ, మరికొన్ని దొనబండ గ్రామానికి 11-12 కి.మీ దూరంలో ఉన్నాయి. ఒక్కో జలపాతం కనీసం 30 నుంచి 120 అడుగుల ఎత్తు నుంచి కిందకు జాలువారుతున్నాయి.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

కొండపల్లి, దొనబండ, మూలపాడు ప్రాంతాల మీదుగా కొండపల్లి అటవీ ప్రాంతంలోకి వెళితే జలపాతాలు కనువిందు చేస్తాయి. జులై నుంచి అక్టోబరు వరకూ నాలుగు నెలలు నీటితో కళకళలాడుతుంటాయి. నవంబరు నుంచి జనవరి వరకూ నీటిధార తగ్గిపోతుంది. కింది భాగంలో ఈ నీటి వల్ల ఏర్పడిన కొలనులు ఉంటాయి. ఫిబ్రవరి తర్వాత వేసవిలో పూర్తిగా నీరు ఎండిపోతుంది. మళ్లీ జల కళ రావాలంటే వర్షాకాలం వరకూ ఆగాల్సిందే. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే విశేషంగా ఆకట్టుకుంటాయి.

సౌకర్యాలు సరే.. సంతృప్తి చూడరే!

ఇబ్బందికర తీరుతో భక్తుల మనసు చివుక్కు

ఈనాడు, అమరావతి

అన్నప్రసాదం

విజయవాడ దుర్గగుడిలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంస్కరణలు చేపట్టారు. అయితే భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కొన్ని సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదు. అందుకే భక్తుల మన్ననలు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవాలయమైన దుర్గగుడిలోని భక్తుల సేవల్లో గత కొన్ని నెలల్లో అనేక మార్పులు చేశారు. ఐదేళ్ల వైకాపా హయాంతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో సౌకర్యాలు కల్పించారు. అయినా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకుల్లో దుర్గగుడి ఏడో స్థానంలో నిలవడం భక్తుల అసంతృప్తి స్థాయికి ప్రత్యక్ష నిదర్శనం.

★ అమ్మవారి ప్రసాదాలైన చక్రపొంగలి, పులిహోర, లడ్డూ.. మిగతా ఆలయాలతో పోలిస్తే రుచిగా, నాణ్యంగా ఉండేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులకు శుద్ధిచేసిన తాగునీరు అందిస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4వరకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. రాత్రివేళ 800 నుంచి వెయ్యి మందికి భోజన వసతి కల్పిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులకు బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆధునికీకరించారు. ఆధునిక అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు.

దురుసు ప్రవర్తన..అధిక వసూళ్లు..

★ ఆలయానికి వచ్చే భక్తుల మనసు చివుక్కుమనేలా కొన్ని ఘటనలు జరుగుతున్నాయి. నైపుణ్యం లేని భద్రత సిబ్బంది, టోల్‌గేట్ వద్ద ప్రైవేటు వ్యక్తుల దురుసు ప్రవర్తన, కొండపైన, దిగువన పూజా సామగ్రి విక్రయించే దుకాణాల్లోని వారి ఇబ్బందికరమైన తీరు, కొబ్బరికాయలు, పూజాద్రవ్యాల అధిక ధరలతో భక్తులను ఇబ్బంది పెడుతున్నారు. ★ చెప్పుల స్టాండ్, లగేజీ క్లోక్‌రూం, సెల్‌ఫోన్ కౌంటర్లలో నిర్ణయించిన ధరల బోర్డులు కనిపించకుండా చేసి మరీ ప్రైవేటు వ్యక్తులు రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారు. ★ దేవస్థానం క్యాలెండర్లు, ల్యామినేషన్ ఫొటోలు అమ్మే కౌంటర్లలో అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కొబ్బరికాయలు కొట్టేచోట గుత్తేదారు మనుషులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ★ కేశఖండనశాలలో భక్తుల నుంచి టిక్కెట్ రుసుం కాకుండా అదనంగా వసూళ్లు చేస్తున్నారు. కౌంటర్లలో నుంచి వారికి రూ.5 చిల్లర కూడా ఇవ్వడం లేదు. ప్రసాదాల కౌంటర్లు, దేవస్థానం బస్సుల్లోనూ ఇదే జరుగుతోంది. ★ వీటిపై అధికారులు దృష్టి సారించకపోతే భక్తుల సంతృప్తి స్థాయిని అందుకోలేరు.

భాషపై మమకారం.. సాహిత్య సహకారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్న చింతలపాటి

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు ఎందరో కృషి చేస్తుంటారు. కానీ మచిలీపట్నానికి చెందిన డా.చింతలపాటి మోహన మురళీకృష్ణ ఉద్యోగాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు తెలుగులో ఎంఏ చేసేలా ప్రోత్సహిస్తున్నారు. 50 ఏళ్లుగా వందలాది సాహిత్య సభలు నిర్వహిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులకు అమ్మ భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని వాఙ్మయి పేరిట అంతర్జాతీయ తెలుగు సాహితీ వేదిక ఏర్పాటు చేశారు. దీని ద్వారా తనతో పాటు పండితులు మేడసాని మోహన్, ఆర్.అనంత పద్మనాభరావు, ధూళిపాళ మహదేవమణి, కడిమెళ్ల వరప్రసాద్, పాలపర్తి శ్యామలానందప్రసాద్, వోలేటి పార్వతీశం, రఘునాథశర్మ లాంటి వందమంది పండితులతో తెలుగు భాషా సాహిత్యాలపై ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆస్ట్రేలియా, సింగపూర్, న్యూజిలాండ్, మలేషియా తదితర దేశాల్లోని ప్రవాస భారతీయులు, వారి పిల్లలకు తెలుగులో పద్యాలు, చందస్సులులపై శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేక అవకాశం కల్పించి.. ఈయన చొరవతో ప్రస్తుతం 40 మంది ప్రవాస భారతీయులు ఆంధ్రా విశ్వవిద్యాలయం ద్వారా ఎంఏ తెలుగు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం విశ్వవిద్యాలయ ప్రతినిధులతో చింతలపాటి మాట్లాడి ప్రత్యేక అవకాశం కల్పించారు. ఉపాధ్యాయుడిగా పని చేసిన ఈయన 5వేల పద్యాలతో 25 పద్యగ్రంథాలు రచించి రచయితగా, కవిగా రాణిస్తున్నారు. కావ్య కళా ప్రవీణ, సిరి కవి, సహజ కవితా కళాభిజ్ఞ లాంటి బిరుదులు, ప్రభుత్వ పరంగా ఉగాది పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

ఆత్మవిశ్వాసమే నడిపిస్తోంది..

విధి వక్రించినా ఆత్మవిశ్వాసం నింపుకొని ఒంటి చేత్తో ట్రాక్టరును నడుపుతూ స్ఫూర్తిగా నిలిచాడు ఆ యువకుడు. నందిగామ మండలం మాగల్లు గ్రామానికి చెందిన యలమందల నాగేశ్వరరావు ట్రాక్టర్ డ్రైవర్. ఏడాది కిందట వరిగడ్డిని చుట్టే యంత్రంలో ప్రమాదవశాత్తూ చేయిపడింది. వెంటనే ఆసుపత్రికి వెళ్లినా వైద్యులు భుజం వరకు ఆయన ఎడమ చేయిని తొలగించి శస్త్రచికిత్స చేశారు. ప్లాస్టిక్ చేయి పెట్టినా అది పనిచేయక ఇబ్బందిపడ్డారు. గతంలో పనిచేసిన యజమాని వద్దే ప్రస్తుతం వరిగడ్డిని చుట్టే యంత్రం ఉన్న ట్రాక్టరును ఒంటి చేత్తో నడుపుతున్నారు. గతంలో డ్రైవర్‌గా పనిచేసిన అనుభవం, ఆత్మవిశ్వాసంతో ట్రాక్టరు నడుపుతూ బతుకు బండి లాగుతున్నారు. ఆయన భార్య భవానీ హోటల్ నడుపుతుండగా.. ఆమెకు హోటల్ పనుల్లో సైతం సాయపడుతూ వైకల్యాన్ని జయించారు.
- మాగల్లు(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే

నేడు రాజధానిలో బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటన

తుళ్లూరు: అమరావతిలో సోమవారం ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ప్రతినిధుల బృందం పర్యటించనుంది. రహదారులు, భవన నిర్మాణాలు, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి, ఎల్‌పీఎస్ లేఔట్లు, రిజర్వాయర్ నిర్మాణ పనులు పరిశీలించనున్నారు. హైకోర్టు, ఎన్జీవో భవన సముదాయాలు, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తారు.

ధనుర్ధారి తపోస్థలం.. పార్థీశ్వరాలయం

ఇంద్రకీలాద్రిపై ద్వాపర యుగంలో అర్జునుడు పాశుపతాస్త్రం కోసం శివ తపస్సు చేసినట్లు చరిత్ర. అర్జునుడిని పరీక్షించేందుకు కిరాత రూపంలో శివుడు ఇంద్రకీలాద్రిపై ప్రత్యక్షమయ్యాడు. ఆ సమయంలో అర్జునుడు వేసిన బాణానికి చనిపోయిన వరాహం తనదని కిరాత రూపంలో ఉన్న శివుడు అర్జునుడితో యుద్ధం చేస్తాడు. అర్జునుడి తపస్సు, పరాక్రమానికి శివుడు మెచ్చి ప్రత్యక్షమై పాశుపతాస్త్రాన్ని ప్రసాదించినట్లు మహాభారతంలోని అరణ్య పర్వంలో ఉంది. అర్జునుడు తపస్సు చేసిన చోట శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడు. ఆ ప్రాంతమే పార్థీశ్వరాలయం. కాలక్రమంలో విష్ణువర్ధన మహారాజు ఆస్థానంలో పని చేసే ఉద్యోగి ఆలయం నిర్మించినట్లు చరిత్ర తెలియజేస్తుందని ఆర్కియాలజిస్టు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. ఆదరణ కరవై పార్థీశ్వరాలయం జీర్ణావస్థకు చేరిందని చెప్పారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.
– ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

జీర్ణావస్థలోని పార్థీశ్వరాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్కియాలజిస్టు ఈమని శివనాగిరెడ్డి

పండగ పూట.. పప్పన్నం లేదా?

కూటమి సర్కారు అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా కందిపప్పు ఊసే లేకపోవడంపై కార్డుదారులు పెదవి విరుస్తున్నారు. వైకాపా అరకొరగా కందిపప్పు సరఫరా చేయడంతో కూటమి సర్కారు వస్తే నిరవధికంగా కందిపప్పు వస్తుందని భావించినా నిరాశే మిగిలింది. ఇప్పటిదాకా లేకున్నా పెద్ద పండగ నాటికైనా అందుబాటులోకి వస్తుందా అంటూ రేషన్ డీలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఆర్థిక భారం పడుతోందని పేదలు వాపోతున్నారు.
– ఈనాడు, అమరావతి

✧ ఉమ్మడి జిల్లాలో కార్డులు: 11,07,933
✧ మొత్తం రేషన్ దుకాణాలు: 2,016
✧ ఎంఎల్ఎస్ పాయింట్లు: 14
✧ సరఫరా చేయాల్సింది: 1,108 మె.ట
✧ రేషన్ దుకాణంలో కేజీ కందిపప్పు: రూ.60
✧ మార్కెట్‌లో కందిపప్పు ధర: రూ.120

మార్కెట్‌లో రెట్టింపు ధర..

గత తెదేపా పాలనలో ప్రతి నెలా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, వంటనూనె, చింతపండు, సబ్బులు, రాగి పిండి ఇలా చాలా వస్తువులు సరఫరా చేసేవారు. వైకాపా వచ్చాక ఈ విధానాన్ని పూర్తిగా నీరుగార్చింది. కూటమి సర్కారు వచ్చాక తిరిగి ప్రారంభించలేదు. రేషన్‌లో ఇచ్చే బియ్యం, కందిపప్పు, పంచదారపై ఆధారపడే కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వీరందరూ అధిక మొత్తానికి బయట కందిపప్పు కొనుగోలు చేస్తున్నారు. చౌక దుకాణాల్లో సరఫరా చేసే కందిపప్పు కేజీ రూ.60కి మించి ఉండదు. బయట మార్కెట్‌లో రూ.120 పైమాటే. కార్డుదారులకు రెట్టింపు భారం పడుతోంది. కందిపప్పు సరఫరా విషయంపై చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేసే గుత్తేదారుడి కోసం అన్వేషిస్తున్నారు. ఈ అంశంపై ఎన్టీఆర్, కృష్ణా డీఎస్వోలు పాపారావు, మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం సరఫరా చేస్తే పంపిణీ చేస్తామని తెలిపారు.



సాంకేతిక ఆధారాలతో చిక్కారు

☛ సీడీఆర్ విశ్లేషణలో నిందితుల మధ్య భారీగా కాల్స్
☛ నకిలీ మద్యం కేసులో కీలకంగా మారిన వైనం

ఈనాడు, అమరావతి

నకిలీ మద్యం కేసులో సాంకేతిక ఆధారాలు కీలకంగా మారాయి. నిందితుల పాత్రను నిరూపించే పలు ఆధారాలు వారి ఫోన్లలోనే లభించాయి. వారి మధ్య సాగిన చెల్లింపులు, వాటి తాలూకూ స్క్రీన్‌షాట్లు, లేబుళ్ల డిజైన్లు, సంభాషణలు పక్కాగా దొరికాయి. నిందితులు ఉపయోగించిన ఫోన్‌నంబర్ల తాలూకు సీడీఆర్ (కాల్ డీటెయిల్ రికార్డ్స్)లు, టవర్ లొకేషన్లను సిట్, ఎక్సైజ్ అధికారులు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ల నుంచి సేకరించారు.

● **ఇబ్రహీంపట్నంలో కుట్రకు శ్రీకారం:** ఇబ్రహీంపట్నంలోనే అక్రమ, నకిలీ మద్యం కుట్రకు బీజంపడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ1) ఫోన్ నంబరు లొకేషన్ ఇబ్రహీంపట్నంలోనే 549 రోజులు చూపించింది. ఈ రోజుల్లో 31వేలు పైగా కాల్స్ ఉన్నట్లు గుర్తించారు. మరో నంబరు 14వేలకు పైగా కాల్స్ ఉన్నాయి. ఈ లొకేషన్ 522 రోజులు ఇక్కడే ఉన్నట్లు చూపించింది. అద్దేపల్లి జగన్మోహన్‌రావు (ఏ2) ఫోన్ నుంచి 36వేల కాల్స్ ఉన్నాయి. 684 రోజులు ఇదే లొకేషన్ చూపించింది. ఇక్కడి నుంచే కుట్ర సాగిందనడానికి ఇవి కీలకంగా తోడ్పడ్డాయి. క్షేత్రస్థాయిలో రవాణా పరంగా కట్టా రాజు (ఏ6) ప్రధాన భూమిక పోషించాడు. ప్రదీప్‌దాస్ (ఏ8), మిథున్‌దాస్ (ఏ9)లు సామగ్రిని అందుకోవడం, నకిలీ సరకు రవాణాలో క్రియాశీలకంగా వ్యవహరించారు. వీరితో పాటు ఎన్.రవి (ఏ4), సయ్యద్ హాజీ (ఏ5) లొకేషన్లూ ఎక్కువ రోజులు ఇబ్రహీంపట్నంలోనే చూపించాయి. స్పిరిట్‌ను సరఫరా చేసిన బాలాజీ (ఏ3)నంబరు.. 34రోజులు, 124 కాల్స్, మరో నంబరు 23రోజులు, 49 కాల్స్ నమోదయ్యాయి. అంతదాస్ (ఏ10), కల్యాణ్ (ఏ12), శ్రీనివాస్‌రెడ్డి (ఏ11) వివరాలు సీడీఆర్ విశ్లేషణలో దొరికాయి. వీరంతా తరచూ ఒకే టవర్ లొకేషన్ పరిధిలోకి రావడం కుట్రలో వీరి పాత్రను తేటతెల్లం చేస్తోంది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులోనూ జనార్దన్‌రావు, రాజు, హాజీ, రవి, బాలాజీ, సుదర్శన్ తదితరుల టవర్ లొకేషన్లు చూపించాయి.

జనార్దన్‌రావు నుంచి ఎన్.రవి, హాజీ, కట్టా రాజు, అంగలూరు వెంకట కల్యాణ్, చెక్కా సతీష్, జోగి రాము, సుదర్శన్ తదితరుల మధ్య చాలా కాల్స్ ఉన్నాయి. పలు దఫాలు నకిలీ మద్యం వ్యవహారంపై సంభాషణలు సాగించినట్లు వెలుగులోకి వచ్చింది. జగన్మోహన్‌రావు ఫోన్ల నుంచి బాలాజీ, రవి, హాజీ, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, చెక్కా సతీష్, జోగి రాము, సుదర్శన్‌లకు ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్ ఉన్నాయి. వీటి ఆధారంగా నకిలీ మద్యం వ్యవహారంలో ప్రధాన కుట్రదారుడిగా జనార్దన్‌రావుగా తేలింది. మిగిలిన నిందితులతో సమన్వయం చేసుకోవడం, వ్యవహారాన్ని అమలుచేయడంలో జగన్మోహన్‌రావు పాత్ర ఉన్నట్లు తేలింది. 2023 అక్టోబరు 10 నుంచి 2025 సెప్టెంబరు 29 వరకు నిందితుల సీడీఆర్‌ల విశ్లేషణలను పరిశీలిస్తే.. ఏ1 పలు దఫాలు హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. అక్రమ మద్యం, ఈ7 బార్ నిర్వహణ, తదితర పనులకు సంబంధించి వెళ్లినట్లు తేలింది. లేబుళ్లు, మూతలు, హోలోగ్రామ్‌లు, ఇతర ప్యాకేజింగ్ సామగ్రినీ హైదరాబాద్‌లోనే సమకూర్చుకున్నాడు.

సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం కిటకిట

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ఆదివారం కిటకిటలాడింది. దాదాపు 18 వేల మంది భక్తులు స్వామికి మొక్కులు సమర్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, నామకరణ, అన్నప్రాసనలు, ఉయ్యాల సేవలను వేడుకగా జరిపారు. వివాహాలు, సంతానం కలగాలని, ఆర్థిక బాధలు, రాహు, కేతు, సర్పదోషాల నివృత్తి పూజలు చేశారు. వివిధ రూపేణా మొత్తం ఆదాయం రూ.9,97,952 వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాద్ పేర్కొన్నారు.

కొనసాగుతున్న సాగునీటి విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వివిధ పంటల అవసరాల నిమిత్తం నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీటి విడుదల కొనసాగుతోంది. రానున్న జనవరి 15వ తేదీ వరకు వ్యవసాయానికి నీటి అవసరాలు ఉంటాయని జలవనరుల శాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 5,307 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 3,211, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 2,010, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 2,306, కేఈబీ (దివిసీమ) 403, ఏలూరు 401, బందరు కాలువకు 101 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

వాగు పోయే.. వాడ వచ్చే..



విజయవాడ వన్‌టౌన్ ప్రాంతమంతా పూర్వం వాగులు, వంకలు, చెరువులు, కొండలతో దర్శనమిచ్చేది. అక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకున్న కుమ్మరి కుటుంబాలు కుండలు తయారు చేయడానికి మట్టి తీసే క్రమంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని తవ్వేవారు. కాలానుగుణంగా అది కాస్తా చెరువుగా మారింది. చిట్టినగర్ సెంటర్ నుంచి కొత్తపేట పోలీస్‌స్టేషన్ వరకు ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని వాగు సెంటర్‌గా పిలిచేవారు. 1916లో వీరాంజనేయ స్వామి ఆలయం నిర్మించడంతో ఆ ప్రాంతాన్ని ఆంజనేయ వాగు సెంటర్‌గా పిలవడం మొదలు పెట్టారు. కొండ వాగుకు కాటన్‌దొర 'కేటీఎస్4' అని పేరు పెట్టారు. కేటీ అంటే కొత్తూరు తాడేపల్లి అని, ఎస్ అంటే స్ట్రీమ్ ప్రవాహం అని, 4 అంటే ఇలాంటి వాగుల్లో ఇది నాలుగోదని చెబుతున్నారు. గతంలో వర్షం పడినప్పుడు ఈ వాగు ఉద్ధృతంగా ప్రవహించేది. 1947లో రజాకారుల గొడవలు కారణంగా ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి నిర్వాసితులు బెజవాడకు తరలివచ్చారు. వారందరూ ఆంజనేయస్వామి ఆలయం పక్కన కనిపించిన ఖాళీ ప్రదేశంలో, కాలానుగుణంగా కొండలపై ఇల్లు నిర్మించుకున్నారు.
- చిట్టినగర్, న్యూస్‌టుడే

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా కార్యక్రమం జరుగుతుందన్నారు. వీటితో పాటు కాల్‌సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి అర్జీ నమోదు చేసుకోవచ్చన్నారు.

(c) eenadu

స్వర్ణోత్సవ కలయిక.. మధురమైన జ్ఞాపిక

చౌటపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 1975 పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం

పాఠశాలలో 1975లో పదో తరగతి చదివిన విద్యార్థుల బృంద చిత్రం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ మండలం చౌటపల్లి గ్రామంలోని శ్రీ అట్లూరి వెంకట్రామయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975లో పదో తరగతి చదివిన విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో ఆదివారం సందడి చేశారు. 65 ఏళ్ల వారి జీవిత ప్రస్థానంలో 15 ఏళ్ల వయస్సులో జరిగిన సంఘటనల్ని నెమరు వేసుకున్నారు. అమెరికా నుంచి వచ్చినా.., ఇక్కడ చౌటపల్లిలో వ్యవసాయం చేసుకుంటున్నా.. ఎటువంటి భేషజాలు లేకుండా వారి కష్ట సుఖాలను పంచుకున్నారు. అమెరికాలోని అట్లాంటాలో నివాసం ఉండే అట్లూరి శోభన్ బాబు, అట్లూరి ఖజేంద్ర, హైదరాబాద్‌కు చెందిన నర్రా జనార్దనరావు, కేవీఆర్ చౌదరి, ఎల్. మార్కండేయులు, మరికొందరి కృషితో నాడు కలసి చదివిన మొత్తం 44 మందిలో 29 మంది ఆనందాల్ని పంచుకున్నారు. అట్లూరి శోభన్ బాబు రూ. లక్ష, మిగిలిన వారు రూ. లక్షతో పాఠశాలకు ఇనుప రక్షణ గ్రిల్స్ అందించడం ముదావహం అని రోటరీ క్లబ్ నేత పర్వతనేని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈక్రమంలో ఆదివారం దాన్ని ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు అట్లూరి దేశాయ్, వెన్ననపూడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వై. మాదవ కుమార్, వరదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం అందుకున్న ఉపాధ్యాయురాలు శ్రీదేవి

✷ నా ఉన్నతికి కారణమైన నా పాఠశాల, నా స్నేహితులు, సహ విద్యార్థులను 50 ఏళ్ల తర్వాత కలవడం చాలా ఆనందంగా ఉంది. మాలో చాలా మంది చనిపోయారు. మళ్లీ కలుస్తామో లేదో కానీ ఇది పూర్తి సంతోషాన్ని ఇచ్చింది.
- అట్లూరి శోభన్ బాబు, అమెరికా

✷ పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం పొంది స్వర్ణ పతకం సాధించాను. అప్పటి నుంచి విజయాల దిశగా నా ప్రస్థానం సాగింది. ఎయిర్‌ఫోర్సులో 10 ఏళ్ల సేవల అనంతరం యూపీఎస్సీలో ఐటీఎస్ కేడర్‌లో ఉపాధి పొంది బీఎస్ఎన్ఎల్‌లో చీఫ్ జనరల్ మేనేజర్‌గా రిటైర్ అవటానికి కారణం నా పాఠశాలే.
-నర్రా జనార్ధనరావు

✷ మా జన్మస్థలం చౌటపల్లిని, విద్య నేర్పిన పాఠశాలను ఎన్నటికీ మరచిపోలేం. 50 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం ఓ మధురానుభూతి. ఇది నా జీవితంలో మరింత ఉత్సాహాన్ని అందిస్తుంది.
-డి.వరలక్ష్మి, విశ్రాంత ఇంజినీరు, ఈసీఐఎల్

✷ ఈ స్వర్ణోత్సవ కలయిక ఇంకొంత ఆయుష్షు పెరగడానికి దోహద పడుతుంది. చాలా మందిని వెతికి పట్టుకుని మరీ అందరూ ఈ కలయికకు వచ్చేలా చేసి గత స్మృతులు నెమరు వేసుకోవడం చాలా సంతోషంగా ఉంది.
-ఎల్.మార్కండేయులు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ విశ్రాంత మేనేజర్

అనుభవాల్లోంచే.. కథలు పుట్టుకొస్తాయ్

కాలంతో పాటే కొత్తగా.. విభిన్న కోణాల్లో రచనలు

'కథ 2024' సంకలనం ఆవిష్కరణలో సాహితీవేత్తలు

కథ 2024 పుస్తకంలో ప్రచురితమైన కథలు రచించిన రచయితలతో ముఖాముఖీ కార్యక్రమం

ఈనాడు, అమరావతి - విజయవాడ సాంస్కృతికం, కానూరు, న్యూస్‌టుడే

'జీవిత అనుభవాలు, ఆలోచనల్లో నుంచే కథలు పుట్టుకొస్తాయి. కాలంతో పాటే కొత్త కథలు జాలువారుతున్నాయి. సామాజిక రీతులను ప్రతిబింబిస్తూ విభిన్న కోణాలు ఆవిష్కృతమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల జోరు పెరిగినా సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమైనా.. కథల విస్తృతి పెరుగుతుందే తప్ప తగ్గలేదు.' అంటూ పలువురు సాహితీవేత్తలు, రచయితలు అభిప్రాయపడ్డారు. విజయవాడ పి.బి.సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన కథ-2024 సంకలనం ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో సాహితీ వేత్తలు తరలివచ్చారు. అనంతరం కథాసాహితీ సహాయ సంపాదకులు ఎ.వి.రమణమూర్తి, కొప్పర్తి రాంబాబు ఆధ్వర్యంలో.. సంకలనంలో ప్రచురితనమైన కథల రచయితలతో ముఖాముఖి నిర్వహించారు. రచయితలు పతంజలిశాస్త్రి, కొట్టం రామకృష్ణారెడ్డి, జి.లక్ష్మి, శీలం సురేంద్ర, అశ్వనీకుమార్, శ్రీనివాసమూర్తి, డాక్టర్ కె.వి.రమణారావు, సుజాత వేల్పూరి, పాలగిరి విశ్వప్రసాద్, జి.ఉమామహేశ్వర్, పలాస సినిమా దర్శకుడు, రచయిత కరుణకుమార్.. తదితరులు తాము రాసిన కథా నేపథ్యాలను వివరించారు.

కథతో ఇష్టంగా 35ఏళ్ల ప్రయాణం..

కథ సంకలనం 1990లో ప్రారంభించాం. 1991లో మొదటి పుస్తకం ప్రచురితమైంది. పుస్తక సంపుటిని 1991 డిసెంబరు నెలలో హైదరాబాద్‌లోని ద్వారకా హోటల్‌లో చేకూరి రామారావు ఆవిష్కరించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు, కుమార్తె రావడం ఆనందంగా ఉంది. గత 35 ఏళ్లుగా కథలతో మా ప్రయాణం చాలా ఇష్టంగా చేస్తున్నాం. మూడున్నర దశాబ్దాలుగా తెలుగులో ఇన్ని సంకలనాలు మరేవీ లేవు.
-వాసిరెడ్డి నవీన్, కథాసాహితీ సంపాదకులు

కథల్లోని పాత్రలు వెంటాడుతున్నాయి..

కథ 2024 పుస్తకంలోని 17 కథలు చదివిన తరువాత పుస్తకం మూసేసినా కొన్ని పాత్రలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రతి కథలోని పాత్ర నిర్మాణం చాలా చక్కగా ఉంది. కొన్ని కథల్లోని పాత్రలు.. ప్రస్తుత సమాజంలోని పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. వ్యవస్థ ఎంత గందరగోళంలో ఉందో చెబుతున్నాయి. అన్ని కథలూ చదివించేలా ఆసక్తిని పెంచేలాగానే ఉన్నాయి. **-ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, రచయిత, సమీక్షకులు**

కొత్త కథలు విభిన్నంగా ఉన్నాయ్..



కథలన్నీ చదివిన తరవాత పాఠకుడిగా కథాసాహితిపై మరింత గౌరవం పెరిగింది. 35 ఏళ్లుగా ఈ పుస్తకాన్ని తీసుకురావడం ఆనందంగా ఉంది. కొత్త, యువ రచయితలు రాసిన కథలు చాలా ఆసక్తిని పెంచుతున్నాయి. కథలు ఎంచుకునే విషయంలో విభిన్నం, వైవిధ్యం చూపుతున్నారు. కార్యక్రమానికి సహకరించిన సిద్ధార్థ కళాపీఠానికి నా కృతజ్ఞతలు.
- పాపినేని శివశంకర్, కథాసాహితీ సంపాదకులు

తల్లిదండ్రుల ప్రవర్తన ఆదర్శంగా ఉండాలి

మచిలీపట్నం కార్పొరేషన్: తల్లిదండ్రులు ప్రవర్తన వారి బిడ్డలకు ఆదర్శంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. నగరం లోని కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. పిల్లలు వారి తల్లిదండ్రుల ప్రవర్తన చూస్తూ ఎదుగుతారన్నారు. ఈ నేపథ్యంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. పిల్లలతో మాట్లాడేటప్పుడు తగిన జాగ్రత్త వహించాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు తపనతో కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యాలయ వార్షిక నివేదికను ప్రిన్సిపల్ మహ్మద్ ఆసీఫ్ హుస్సేన్ చదివి వినిపించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ బాలాజీ, పృథ్వీ కల్యాణిలు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా విజయవాడ

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా విజయవాడ ఎదుగుతోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. దేశంలోనే ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతికంగా ఇది సుసంపన్నమైన నగరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'కృష్ణవేణి సంగీత నీరాజనం-2025' ముగింపు వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సంగీతోత్సవాలతో విజయవాడ దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా మరింత ఉన్నత స్థానానికి చేరిందన్నారు. 'ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణకు.. చెందిన కళాకారులు పాల్గొని అద్భుత సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యం, నాటకం, సంగీతం సహా అన్ని కళలకు నిలయం ఆంధ్రప్రదేశ్. ప్రపంచానికి.. కూచిపూడి శాస్త్రీయ నృత్యాన్ని బహూకరించిన నేల ఇది. దక్షిణ భారత సంగీతంలో ప్రముఖ రచనలు చేసిన వారు ఆంధ్రులే. జానపద కళారూపాలలో.. బుట్టబొమ్మలు, కోలాటం, వీరనాట్యం, బుర్ర కథ, థింసా.. ఇవన్నీ ఇక్కడ అత్యంత ప్రజాదరణ పొందినవే..' అని గవర్నర్ పేర్కొన్నారు. ఇలాంటి అనేక అద్భుత కళారూపాలు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని సుసంపన్నం చేశాయన్నారు.

పర్యాటకాభివృద్ధికి కళలు దోహదం

కేంద్ర పర్యాటక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ వెంకటరామన్ హెగ్డే మాట్లాడుతూ. . సాహిత్య కళలు పర్యాటకాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని చెప్పారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో ఎంతో మంది ప్రముఖ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. ప్రజల నుంచి చక్కని సహకారం లభించిందన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఐదు ఈవెంట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో ఉత్సవం మూడోదని తెలిపారు. వైద్యం, వ్యాపారం, హెరిటేజ్-కల్చర్, ఆధ్యాత్మిక యాత్రలు తదితరాలను కేంద్రం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఇలక్కియా, సాంస్కృతిక సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, సంగీత విద్వాంసులు మల్లాది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



'సంగీత నిరాజనం' చిత్తరువు ఆవిష్కరించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్. పక్కన మల్లాది రవిశంకర్, జేసీ ఇలక్కియా, మల్లికార్జునరావు, వెంకటరామన్ హెగ్డే

రుక్మిణి శ్రీకృష్ణ సంగీత విభావరి కార్యక్రమం

పెనాల్టీల జీవో రద్దుకు డిమాండ్

గాంధీనగర్: జీవో నంబరు-21 ద్వారా పెనాల్టీలు పదుల రెట్లలో పెంచేశారని.. ఆ జీవోను రద్దు చేయాలని ఏపీ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారీ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15ఏళ్లు దాటిన ఆటోలకు రూ.3500, 20ఏళ్లు దాటిన వాటికి రూ.7వేల ఫీజు పెంచారని పేర్కొన్నారు. చాలీచాలని ఆదాయంతో రూ.వేలకు వేలు చలానాలు కట్టలేరని చెప్పారు. జీవో 21ని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. డి.శ్రీధర్‌బాబు, వై.అప్పారావు, రఫి, వలీ, సి.హెచ్. సుబ్బారావు, సుమన్, శివరామ్, అప్పలస్వామి పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మూట్‌కోర్టు పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన మంగళూరు ఎస్‌డీఎం లా కాలేజీ విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణరావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ ఆర్.రఘునందనరావు, కాంటినెంటల్ కాఫీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: న్యాయ విద్యార్థులు జ్ఞానసముపార్జన ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు అన్నారు. వీడీసిద్ధార్థ న్యాయ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జస్టిస్ చల్లాకొండయ్య మెమోరియల్ సిద్ధార్థ 4వ నేషనల్ లీగల్ ఫెస్ట్-2025 ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. జాతీయస్థాయి మూట్‌కోర్టు, లీగల్‌క్విజ్ పోటీల్లో ఎంతో మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీల ద్వారా వారిలోని శక్తిసామర్థ్యాలు వెలికి తీయొచ్చని పేర్కొన్నారు. అనంతరం మూట్ కోర్టు పోటీల్లో ప్రథమ స్థానం పొందిన కర్ణాటకలోని మంగళూరు ఎస్‌డీఎం లా కాలేజీ విద్యార్థులకు, ద్వితీయ స్థానంలో నిలిచిన కేరళలోని కోజికోడ్ గవర్నమెంట్ లా కాలేజీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. లీగల్ క్విజ్‌లో ప్రథమ బహుమతిని సిద్ధార్థ లా కాలేజీ, స్కూల్ ఆఫ్ లా విత్ ఏపీ యూనివర్సిటీ అమరావతిలు సాధించగా, ద్వితీయ బహుమతిని కేఎల్ఈఎఫ్ కాలేజీ ఆఫ్ లా విద్యార్థులు అందుకున్నారు. బెస్టు మూటర్ ఇన్ కోర్టుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన గవర్నమెంట్ లా కాలేజీ, బెస్ట్ మెమోరియల్ ఇన్ మూట్ కోర్టు, బెస్ట్ రీసెర్చర్ ఇన్ మూట్‌కోర్టుగా తమిళనాడులోని అంబేడ్కర్ లా యూనివర్సిటీ విద్యార్థులు నిలిచారన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణరావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకరబాబు, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి అమరావతి బాలోత్సవం

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న రామరాజు, సాంబిరెడ్డి, కొండలరావు, రామరాజు, విద్యాకన్నా తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అమరావతి బాలోత్సవం-8.. ఈ నెల 9వ తేదీ నుంచి 11 వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావులు తెలిపారు. ఈ కార్యక్రమ గోడప్రతులను ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పిల్లల పండగను పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవం కోసం అనే నినాదంతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 43 అకడమిక్, 17 కల్చరల్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు ప్రాంగణాలు, 5 గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 12 వేల మంది పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్, అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, బాలోత్సవాల వ్యవస్థాపకులు, కొత్తగూడెం బాలోత్సవం కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్ బాబు, బెంగళూరుకు చెందిన నవస్కంద హూమ్ ఫర్ జనరేషన్స్ ప్రతినిధి కె.యతిరాజులు నాయుడు హాజరవుతారని తెలిపారు. గోడప్రతుల ఆవిష్కరణలో ఆఫీస్ బేరర్స్ సాంబిరెడ్డి, పిన్నమనేని మురళీకృష్ణ, ఎన్.విద్యాకన్నా, యువీ రామరాజు, వల్లభరావ్, వై.సుబ్బారావు, డీవీ రాజు, టి.క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ఆలయ ప్రాంగణంలో రద్దీ

కనకదుర్గానగర్ మార్గంలో..

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. భవానీ దీక్షల విరమణ నిమిత్తం క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో వాహనాలను నిలపడం సమస్యగా మారింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని అమ్మవారి నివేదన సమయంలో వీఐపీ టికెట్లు, అంతరాలయ దర్శనాన్ని నిలిపి వేయడంతో రూ.100, రూ.300 దర్శనం టికెట్ల విక్రయాలు పెరిగాయి. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. దేవస్థానం ఈవో శీనానాయక్ క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు పేర్కొన్నారు. - **ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే**

వాజ్‌పేయీ సేవలు దేశాభివృద్ధికి దోహదం

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి ఉత్సవాల కార్యక్రమం నిర్వహణకు సంబంధించి విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో వార్ రూమ్‌ను మాధవ్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ తేదీ ధర్మవరంలో నిర్వహించే బహిరంగ సభకు మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించినట్లు తెలిపారు. ఏపీ అభివృద్ధికి వాజ్‌పేయీ ఆద్యుడని.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. టెలికం రంగం అభివృద్ధికి నాంది పలికారని వెల్లడించారు. యాత్ర రాష్ట్ర కన్వీనర్‌గా నాగోతు రమేష్‌నాయుడు, విభాగాల వారీగా నాయకులను నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాగోతు రమేష్‌నాయుడు, అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, నాయకులు ఎస్.కె.బాజీ, బి.నాగలక్ష్మి, గోపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వార్‌రూమ్ ప్రారంభిస్తున్న మాధవ్, పక్కన రమేష్‌నాయుడు, యామిని శర్మ

యంత్రాంగం తాత్సారం.. సాగని విచారణ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన తోట్లవల్లూరు గ్రామ పంచాయతీలో 2022, 2023, 2024 సంవత్సరాల్లో పలు అవకతవకలు జరగ్గా.. వీటిపై అధికారులు విచారణ చేయడానికి తాత్సారం చేస్తున్నారని ప్రజాప్రతినిధుల నుంచి పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ ప్రజాప్రతినిధి ఫిర్యాదుతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరమ్మ తోట్లవల్లూరు గ్రామ పంచాయతీలో రికార్డులను మాజీ గుమస్తా సునీల్‌కుమార్ నుంచి స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. సునీల్‌కుమార్ షాపింగ్ కాంప్లెక్స్ డబ్బులు వసూలు చేసి పంచాయతీ అకౌంట్‌లో జమ చేయకుండా సుమారు రూ.1.35 లక్షలు వాడుకున్నాడని విచారణలో తేలటంతో ఇటీవల డీపీవో సస్పెండ్ చేశారు. కంకిపాడు మండలం గొడవర్రు పంచాయతీ బిల్లు కలెక్టరుగా పనిచేస్తున్న రత్నకుమారి పదోన్నతిపై తోట్లవల్లూరు గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. మాజీ గుమస్తా సునీల్‌కుమార్ పాత రికార్డులు గత రెండు రోజులుగా లెక్కలు రాస్తూ అప్పగిస్తున్నాడని కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. టెండర్ ఫైల్ పెట్టకపోవడంతో పారిశుద్ధ్య కార్మికుల సిబ్బందికి జీతాలు పెట్టడానికి ఇబ్బందికరంగా మారిందని వివరించారు. ఈ విషయాలపై డిప్యూటీ ఎంపీడీవోను వివరణ కోరగా తోట్లవల్లూరు పంచాయతీ రికార్డులు తన వద్దే ఉన్నాయని, త్వరలో అప్పగిస్తానని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు సీఎం కృషి

లోగో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ప్రసాద్, అంకమ్మ చౌదరి, కిదాంబి శ్రీకాంత్, రవినాయుడు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు యోనెక్స్-సన్‌రైజ్ 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లోగో, పోస్టర్‌ను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, స్టార్ బ్యాడ్మింటన్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి, శాప్ మాజీ ఛైర్మన్ పి.అంకమ్మ చౌదరిలతో కలిసి ఎంపీ శనివారం విజయవాడలోని ఒక హోటల్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ క్రీడల నిర్వహణ కోసం కావాల్సిన అన్ని క్రీడా మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నామని, విజయవాడలో పోటీల నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర రాజధానిలో క్రీడా వర్సిటీ, స్టేడియం ఏర్పాటు కానుందన్నారు. ఐజీఎంసీ స్టేడియం ఆధునికీకరణ పనులకు ప్లాన్ సిద్ధమైందని, త్వరలోనే సీఎం చంద్రబాబును కలిసి వివరాలను తెలియజేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. జింఖానా, విద్యాధరపురం మైదానాలను జాతీయ క్రీడల నిర్వహణకు అనుకూలంగా తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ విజయవాడలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనుండడం హర్షణీయమన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో మాట్లాడి రాష్ట్రంలో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. తిరుపతిలో కిడాంబి శ్రీకాంత్‌కు, విశాఖలో పీవీ సింధు, అమరావతిలో గోపీచంద్‌కు అకాడమీల ఏర్పాటుకు స్థలాలు కేటాయించామన్నారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఎంఎస్ఎన్ ప్రసాద్‌తో పాటు రాష్ట్ర, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆83338 33368

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

విజయవాడలో BPT / B.Sc. మెడికల్ ల్యాబ్ / డిప్లొమా ఇన్ MLT, అనస్థీషియా, కార్డియాక్, డయాలసిస్, రేడియోగ్రఫీ, మెడికల్ ఇమేజింగ్ కోర్సులు. అర్హత: ఇంటర్. CQ / MQ సీట్లు - తక్కువ ఫీజు. స్కాలర్‌షిప్ / హాస్టల్స్ కలవు. ✆ 88866 54339.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూపు, VJA, వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆99590 21122, 96038 42233

TO LET

COMMERCIAL

విజయవాడ కబేళా ఇండస్ట్రియల్ ఏరియా 4వ క్రాస్ రోడ్‌లో 1100 చ|| గ|| షెడ్, 24 అడుగుల ఎత్తు, 52 H.P. కరెంట్‌తో అద్దెకు కలదు ✆ 99631 11303.

JOBS

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:76599 88728

REQUIRE FEMALE Admission Counsellors for Nakshatra Overseas. Sal: 16K + Incentives Work Place:Vijayawada. ✆ 96031 36899.

Wanted Electrical Engineers. Qualified By B.Tech Electrical Engineering, Diploma or ITI Experience 0-3 Years. Place of Work: East and West Godavari Districts, Attractive Salary. Contact: 79950 50571 or Send Resumes To hr@gvsprojectspvtltd.com

Lakshmi Spares Corporation Vijayawada. Authorised Dealer for Atlas Copco Air Compressors Wanted: Service Engineers Qul: B.Tech/ Diploma. Location: Krishna, Guntur & Prakasam. Note:Complete Field Work Send Your Resumes : hr.lakshmispares@gmail.com ✆ 90325 74443

Wanted Female Telecallers. Qul: any Degree, Salary:Up To 15000+Incentives, Job Location: Benzcircle, & Kankipadu. ✆98481 72444

WANTED
➤ Telecallers (Female)
➤ Marketing Executives (Field Work - Male)
to work at Vijayam Publications Hanumanpet, Vijayawada-3.
✆98854 79105

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ:23000 టు 29000 వ:18-35 ✆: 77309 58410.

VJA గాంధీనగర్ హోటల్ రూమ్స్ నందు పని చేయుటకు M/F అనుభవం కల్గి డిగ్రీ/ DTP కంప్యూటర్ నాలెడ్జ్ గల రిసెప్షనిస్టులు మల్టీ పర్పస్ స్టాఫ్, లేడి స్వీపర్ కావలెను ✆ 81256 69996.

ఉచిత శిక్షణ మరియు ఉపాధి టైపింగ్ MS Office టాలి Hardware & Networking, CCNA, 18- 26 VJA. ✆ 79811 40437,63028 26034

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:20k. ✆ 89776 39662, 89776 39663.

E-Kart నందు అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Qly: Inter Any డిగ్రీ జీ: 15,000/- Online Available. 93819 12123, 77318 16950

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

❖ నగరంలోని పరాసుపేటలో చెట్ల కొమ్మలు వ్యర్థాలను రోడ్డ పక్కన గుట్టలుగా వేసి వదిలేశారు. దీంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా అధికారులు స్పందించి.. సమస్య పరిష్కరించారు.

? నగరంలోని సుకర్లాబాదలో 10/226 విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం కొన్ని రోజులుగా వెలగడం లేదు. దీంతో రాత్రిపూట రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ సిబ్బందికి చెప్పినా స్పందించడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి. - స్థానికులు

✔ మరమ్మతులు చేయిస్తాం. - బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నిర్ణీత గడువులో సమర్పించండి

బంటుమిల్లి: విశ్రాంత ఉద్యోగులు, పింఛను దారులు నిర్ణీత గడువులోగా జీవన ధ్రువపత్రాలు సమర్పించాలని బంటుమిల్లి ఉపఖజానా అధికారి కె. గోపీకృష్ణ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఉప ఖజానా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ధరవరలు

టమాట 39, వంగ 20, బెండ 42, పచ్చిమిర్చి 40, కాకర 36, క్యాబేజీ 24, క్యారెట్ 42, దొండ 27, బంగాళదుంప 30, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 46, దోస 28, సొర 20.18, అరటికాయ 7.6, చిక్కుళ్లు 47,బీర 40, చామదుంప 26,మునగ 20/18, కంద 40, బీట్‌రూట్ 44, కీరదోస 32, బీన్స్ 70, క్యాప్సికం 74, అలసందలు 45, చిలకడదుంప 42, కొత్తిమీర 17/08, పుదీనా 15/05 సోమవారం ఉదయం 7 గంటలకుంటే ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి, ఫోన్ 9182361295లో సంప్రదించవచ్చు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

సినిమాలు

రేవతి: రివాల్వర్ రీటా, మినీరేవతి: ప్రేమంటే, సిరి కృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి, సిరి వెంకట్: ఆంధ్ర కింగ్ తాలూకా

యంత్రాలతో కోత.. గ్రాసం కొరత!

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: బందరు, పెడన నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరిపంట సాగవుతోంది. గతంలో అక్కడక్కడ కొద్దిమంది మాత్రమే యంత్రాలతో కోత కోయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. కూలీలతో కోయించి, పనలు ఆరబెట్టి, కుప్పేసి, నూర్పిడి చేసే వరకు అయ్యే ఖర్చుతో పోల్చితే యంత్రాలకు తక్కువ అవడం, పైగా వెంటనే ధాన్యం ఒడ్డుకు చేరుతుండటంతో ఎక్కువ మంది అటువైపు మొగ్గుచూపుతున్నారు. ఈ ఖరీఫ్‌లో మనుషులతో కోత కోయించిన విస్తీర్ణం చాలా తక్కువ. అక్కడక్కడ కొందరు అదీ వారికి ఉన్న పాడి పశువులకు అవసరమైన గ్రాసాన్ని సరిపెట్టుకునేందుకు మనుషులతో కోయించారు. ఈ పరిణామంతో ప్రస్తుతం తీవ్ర పశుగ్రాసం కొరత ఏర్పడింది.

ఎకరం గడ్డి రూ.10 వేల నుంచి రూ.12వేలు

యంత్రాలతో కోతల ప్రభావంతో వరిగడ్డికి కొరత ఏర్పడి ధరలు చుక్కలనంటుతున్నాయి. గతంలో ఎకరా రూ.3వేల నుంచి రూ.4వేలు పలికేది. ప్రస్తుతం రూ.10వేల నుంచి రూ.12వేలు చెబుతుండటంతో పాడి గేదెలు, పరిశ్రమ నిర్వహించే వారు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో ప్రతి ఇంటికీ ఒకటో రెండో పశువులు ఉండేవి. ప్రస్తుతం పశువులను మేపే వారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. అధిక ధర పెట్టి వరిగడ్డికొని, పశువుల దాణా తదితరాలకు ఖర్చు చేయలేక కొందరు ఉన్న గేదెలను అమ్ముకుంటున్నారు. ఇప్పుడే ఇంత ధర పలుకుతుంటే ముందుముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. మచిలీపట్నం, విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి డెయిరీలు నిర్వహించే వారు పశుగ్రాస కొరతను గుర్తించి ముందుగానే గ్రామాలకు వచ్చి వరిగడ్డి కొనుగోలు చేసి లారీల్లో తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పాడి పరిశ్రమ నిర్వాహకులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెడన, బందరు నియోజకవర్గాల్లో పశుసంపద వివరాలు

మండలం	ఆవులు	గేదెలు
బందరు	3,400	24,322
పెడన	2,850	14,000
గూడూరు	1,143	8,483
బంటుమిల్లి	1,690	9,375
కృత్తివెన్ను	1,469	8,072

శ్రీవారి భక్తుల మనోభావాలపై జగన్ దాడి

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: పరకామణిలో జరిగిన చిన్నచోరీ అని వ్యాఖ్యానించి.. వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలపై వైకాపా అధ్యక్షుడు జగన్ దాడికి పాల్పడ్డారని తెదేపా నాయకులు మండిపడ్డారు. తెదేపా మచిలీపట్నం నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. దేవుడు, ఆలయాల పవిత్రతపై జగన్‌కు ఏమాత్రం గౌరవం లేదని విమర్శించారు. శ్రీవారి ఆలయానికి సంబంధించిన ప్రతి అంశంలో భక్తుల మనోభావాలు మసకబారేలా వ్యవహరించారన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

యిటీ ఏంటని నిలదీశారు. చిన్న చోరీ కాదు, నేను మహాపాపం చేశాను అని నిందితుడు రవికుమార్ వ్యాఖ్యలు చూస్తుంటే.. జగన్‌మోహన్‌రెడ్డి పరివారం తిరుమలను ఏ విధంగా దోచుకుందో అర్థమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు గొర్రెపాటి గోపీచంద్, ఆలయ ఛైర్మన్ పద్మనాభ లక్ష్మీనారాయణ, దుళ్లిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు మిదినవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రార్థనలో విశ్వాసులు

చిన్నారుల ప్రదర్శన

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మానవాళి రక్షణ కోసం ఏసుక్రీస్తు జన్మించారని విజయవాడకు చెందిన దైవ ప్రసంగీకుడు ప్రియానంద్ అన్నారు. నగరంలోని మల్కాపట్నం ఎల్ఈఎల్సీ చర్చిలో ఆదివారం సాయంత్రం సెమీక్రిస్మస్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియానంద్‌తో పాటు సంఘ కాపరి ప్రభాకరరావు క్రీస్తు సందేశం అందించారు. వారు మాట్లాడుతూ దేవుడిని మనస్ఫూర్తిగా ఆరాధించాలన్నారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువత క్రీస్తుగీతాలు ఆలపించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొని దేవుడిని స్తుతించారు. చర్చిని క్రిస్మస్ ట్రీలు తదితరాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఆదివారం మచిలీపట్నం వడ్డెర పనివారల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా కొరగంటి కాంతారావు, ప్రధాన కార్యదర్శి పరసా లక్ష్మీనారాయణ, పలువురు సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ సలహాదారు గద్దల రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయ సలహాదారు లంకిశెట్టి బాలాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గం వడ్డెర కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయడంతో పాటు పథకాలు అందించేలా కృషిచేయాలన్నారు.

అభినయ సాంఘిక నాటక పుస్తకావిష్కరణ

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని మహతి కళావేదికపై ఆదివారం సాయంత్రం భావతరంగిణి సంస్థ నిర్వాహకులు భవిష్య రచించిన అభినయ సాంఘిక నాటక పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, సాహితీవేత్త డా. బి.ధన్వంతరి ఆచార్య, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, భావ తరంగిణి సంస్థ గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమోహనరావు తదితరులు పాల్గొన్నారు. సంస్థ నిర్వహిస్తున్న సాహితీ కార్యక్రమాలను అభినందించారు. ఆర్టీసీ డిపో మేనేజరు టి.పెద్దిరాజు, వివిధ సంస్థల ప్రతినిధులు కొప్పవరపు నారాయణమూర్తి, బీవీవీ సత్యనారాయణ, గుడిపూడి రాధికారాణి, అన్నెబడి పోతురాజు తదితరులు పుస్తకాన్ని సమీక్షించారు. అనంతరం ప్రదర్శించిన అభినయ సాంఘిక నాటకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గుత్తికొండ సుబ్బారావు, పెద్దిరాజు తదితరులు

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..?

బందరు మండలం హుస్సేన్‌పాలెం నుంచి చిల్లపాలెం వెళ్లే రహదారిలో పలుచోట్ల ఏర్పడిన గోతులతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే నీరునిలిచి గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. సమస్యను పలుమార్లు అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి గుంతలు పూడ్చించడంతో పాటు పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

మండల పరిధిలోని జాతీయ రహదారి 216 నుంచి నారాయణపురం చేరుకునే బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పలువురు భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డు అంచునున్న గుంతల్లో పోశారు. అందులో భారీ పరిమాణంలో ఉన్న కాంక్రీట్, ఐరన్ దిమ్మెలు ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రిపూట ఆ దారిలో ప్రయాణించే వారు వాటిని ఢీకొనే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కాంక్రీట్ వ్యర్థాలను తొలగించి, రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

మానవత సేవలు ప్రశంసనీయం

గూడూరు, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సంస్థ పెడన శాఖ అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి ఆధ్వర్యంలో మండలంలోని కప్పలదొడ్డి గ్రామంలో చేనేత కార్మికులు, దివ్యాంగులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరవి, సంస్థ ప్రధాన కార్యదర్శి కాగిత సాంబశివరావులు మాట్లాడుతూ తోటివారిని ఆదుకోవడం బాధ్యతగా భావించాలన్నారు. సంస్థ ప్రతినిధులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

సూచికలు ఇలా.. భద్రత ఎలా..?

జాతీయ రహదారుల వెంబడి ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి అక్కడ వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో పాటు రాత్రి పూట ప్రమాదమని తెలిసేలా డ్రమ్ములపై రేడియం స్టిక్కర్లు అంటించారు. వాటిపై పర్యవేక్షణ లేక చాలా చోట్ల పాడైపోయాయి. నగర శివారులోని బైరాగిపాలెం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డ్రమ్ములు పగిలిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు రోజూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయినా వాటి గురించి పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి పాడైపోయిన డ్రమ్ములు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే:

చుట్టూ పొదలు.. ఆందోళనలో ప్రజలు

నగరంలోని శివగంగ నుంచి కృష్ణా విశ్వవిద్యాలయానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పొదలు ఆవరించడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఉన్నా.. దట్టంగా పొదలు అల్లుకుపోయాయి. అటుగా విశ్వవిద్యాలయానికి వెళ్లే విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పొదలు తొలగించాలని సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని వారంతా వాపోతున్నారు. అలాగే వదిలేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున.. అధికారులు స్పందించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మూగజీవాల సంచారం.. రాకపోకలకు అంతరాయం

పెడనలో రహదారులపై మూగజీవాల సంచారం పెరుగుతోంది. వీటిని యజమానులు రోడ్లపైకి విడిచి పెట్టడంతో పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గతంలో మున్సిపల్ అధికారులు మూగజీవాలను రహదారులపైకి వదిలిన యజమానులపై చర్యలు తీసుకున్నారు. బందీల దొడ్డికి తరలించి ఆ తర్వాత జరిమానా కట్టించుకుని విడుదల చేసేవారు. కానీ ప్రస్తుతం అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పెడన

పైడమ్మ ఉత్సవం.. భక్త జన సందోహం

పెడన, న్యూస్‌టుడే: పెడన గ్రామ దేవత పైడమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

పైడమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దంపతులు

పైడమ్మ, పోతురాజుల ప్రతిమలు

నాలుగో రోజు ఆదివారం భారీగా భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో పట్టణంలోని పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉత్సవ ప్రాంగణానికి వెళ్లే గూడూరు రోడ్డు కిటకిటలాడింది. పైడమ్మ, ఆమె సోదరుడు పోతురాజుల ప్రభలను భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. దేవాంగ యూత్‌తో పాటు పలువురు ప్రముఖులు శిడిబొమ్మలతో ఆలయానికి తరలివెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మచిలీపట్నం సబ్ డివిజన్ పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే దంపతుల దర్శనం

.. పైడమ్మను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయన వెంట జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేశ్, తెదేపా పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కౌన్సిలర్లు మట్టా పావనీ, కొసనం కరుణకుమారి తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

పెడన, న్యూస్‌టుడే: పెడనలో జరుగుతున్న పైడమ్మ ఉత్సవాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు భక్తులు సహకరించాలని మచిలీపట్నం డీఎస్పీ చప్పిడి రాజా సూచించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న స్థానిక దక్షిణ తెలుగుపాలెం, గూడూరు మండలం పించివానిపాలెం, పోసినవానిపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు శిడిబొమ్మలతో భారీగా ఆలయానికి తరలిరావటం ఆచారంగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రముఖులతో ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ సమావేశమై దిశానిర్దేశం చేశారు. డీజేల్లో అభ్యంతరకర పాటలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రాత్రి 11 గంటల లోపు ఊరేగింపులు పూర్తి చేసి సహకరించాలన్నారు. సమావేశంలో రూరల్ సీఐ నాగేంద్ర ప్రసాద్, ఎస్సైలు గంట్ల సత్యనారాయణ, జి.సత్యనారాయణ మున్సిపల్ కౌన్సిలర్ చిరువెళ్ల జయేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో సమీక్షిస్తున్న డీఎస్పీ రాజా

సోమేశ్వరస్వామి

పార్వతీ అమ్మవారు

పెదతుమ్మిడిలో అగస్త్యేశ్వరస్వామి, అమ్మవారు

చెమ్మనగిరిపేటలో అయ్యప్పస్వామి

ఆలయాల్లో అభిషేకాలు.. అర్చనలు

గూడూరు, న్యూస్‌టుడే: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మండల పరిధిలోని ఐదుగుళ్లపల్లిలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మండలంలోని పెదతుమ్మిడిలో పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ మట్టా విజయలక్ష్మి, నాగబాబు పాల్గొన్నారు.

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని చెమ్మనగిరిపేట అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్పస్వామి దీక్షాధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్తు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

పెడన, న్యూస్‌టుడే: ఉయ్యూరులో ఇటీవల ఫ్లెక్సీలు దించుతున్న నలుగురు యువకులు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఈ సంఘటనపై పెడన నియోజకవర్గ యాదవ సంఘం వారు స్పందించి బాధిత కుటుంబాలకు సాయం అందించాలని వాట్సప్ గ్రూపులో పిలుపునిచ్చారు. స్పందించిన సభ్యులు రూ.60 వేలు జమచేయగా ఆ మొత్తాన్ని ఆదివారం ఉయ్యూరులో నలుగురి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పల్లపోతు అంకరాజు, కొణతం రాంబాబు, పుట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

పాలకాయతిప్ప బీచ్‌లో సందర్శకుల సందడి

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: ఇటీవల తుపాను హెచ్చరికలతో పాలకాయతిప్ప బీచ్‌కు యాత్రికులను అనుమతించక పోవడంతో బోసిపోయింది. కొద్ది రోజుల విరామం తర్వాత ఆదివారం బీచ్‌లో యాత్రికులు సందడి చేశారు. పిల్లలతో వచ్చిన కుటుంబ సభ్యులు ఆడిపాడారు. అవనిగడ్డ సీఐ యువకుమార్ ఆధ్వర్యంలో జాగ్రత్తలు సూచించారు. మెరైన్, అటవీ సిబ్బంది లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లతో ఒడ్డున సిద్ధంగా ఉండి, యాత్రికులను అప్రమత్తం చేస్తూ రక్షణగా ఉన్నారు. లోపలకు వెళ్లకుండా స్నానాలు చేయాలని సూచించారు.

బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ యువకుమార్, మెరైన్ సిబ్బంది

దేశాభివృద్ధిలో యువతే కీలకం

గుడివాడ, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో యువతే కీలకమని, మన దేశంలో 2047 నాటికి యువత అతి పెద్ద సమూహంగా మారి దేశ ప్రగతిలో భాగస్వాములు అవుతారని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.కరుణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'వికసిత భారత్‌లో యువత' అనే అంశంపై ఆదివారం అతిథి ఉపన్యాసమిచ్చారు. యువత వినూత్న ఆలోచనలు దేశ నిర్మాణంలో ఆర్థిక, సామాజిక పురోగతికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపల్ ఆలియా బేగం, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.జె.సతీష్ చంద్ర, జీ.జీవన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.కరుణ్ కుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పోలీసులతో యువకుల దురుసు ప్రవర్తన

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనం నడుపుతూ ట్రాఫిక్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ముగ్గురు యువకులపై ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పరమేశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం ట్రాఫిక్ సీఐ రాజు ఆధ్వర్యంలో కోనేరు సెంటర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా శంకర్, రవితేజ, జీవన్‌సాయి అనే యువకులు ఒకే వాహనంపై వెళుతూ కనిపించారు. వారిని ఆపడానికి ప్రయత్నించగా ముందుకు దూసుకుపోయారు. ఎట్టకేలకు వారిని నిలువరించి ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించారు. ఆ సమయంలో పూటుగా మద్యం తాగి ఉన్నట్లుగా తేలడంతో ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరిని ఆదివారం అరెస్టు చేశారు. ఈ విషయమై సీఐ పరమేశ్వర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు బయటకు వెళ్లాక ఏం చేస్తున్నారో గమనించాలని సూచించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

పెడన, న్యూస్‌టుడే: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన పెడన మండలం పెనుమల్లిలో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన వల్లభు ఏడుకొండలు(56) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. కుమారులు లేకపోవటంతో తలకొరివి ఎవరు పెడతారన్నది బంధువర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈనేపథ్యంలో మూడో కుమార్తె కల్యాణి ముందుకొచ్చి.. తండ్రి అంత్యక్రియలు పూర్తిచేశారు.

(c) eenadu

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

ముక్తేశ్వరుడికి వైభవంగా పూజలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: శివుడి జన్మ నక్షత్రమైన ఆరుద్ర పర్వదినం సందర్భంగా పెరికీడు శ్రీముక్తికాంత ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సైతం నిర్వహించగా, దీనిని తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని విశేష రూపంలో అలంకరించారు. విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు నందూరి శర్మ, నక్కాబాబు, మెరుగుమాల వేణు, పుట్టివీర్రాజు, తదితరులు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

★ పెనమలూరు సీతామహాలక్ష్మీవీధిలో కొన్ని దీపాలు వెలగడం లేదని స్థానికులు శనివారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామ కార్యదర్శి అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి ఆదివారం ఈ వీధిలో 10 కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు. ★ పెనమలూరులోని ప్రధాన మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయిందని స్థానికులు శనివారం గ్రామకార్యదర్శి అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి ఆదివారం పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు ★ గంగూరు ప్రధాన గ్రామంలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు శనివారం గ్రామకార్యదర్శి ప్రకాష్‌నాథ్‌కు తెలిపారు. స్పందించిన కార్యదర్శి ఆదివారం ఈ ప్రాంతంలో తొమ్మిది వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. ★ గంగూరు చెరువు సమీపంలోని ప్రధాన మురుగు కాలువ, రామాలయం వద్ద ఉన్న ఇతర కాలువల్లో పూడిక తీయడం లేదని ఆ ప్రాంతవాసులు గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్యదర్శి ఆదివారం ఆయా కాలువల్లో పూడిక తీయించి సమస్య పరిష్కరించారు.. -పెనమలూరు, న్యూస్‌టుడే

విద్యుత్తు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

నగదు అందజేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

పెదన, న్యూస్‌టుడే: ఉయ్యూరులో ఇటీవల ఫ్లెక్సీలు దించుతున్న నలుగురు యువకులు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఈ సంఘటనపై పెడన నియోజకవర్గ యాదవ సంఘం వారు స్పందించి బాధిత కుటుంబాలకు సాయం అందించాలని వాట్సప్ గ్రూపులో పిలుపునిచ్చారు. స్పందించిన సభ్యులు రూ.60 వేలు జమచేయగా ఆ మొత్తాన్ని ఆదివారం ఉయ్యూరులో నలుగురి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పల్లపోతు అంకరాజు, కొణతం రాంబాబు, పుట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా సాంబశివరావు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా మరోసారి కోడె సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏజీఎస్‌జీఎస్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉయ్యూరు వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వాకా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా చంటిబాబు, కోశాధికారిగా షేక్ అబ్దుల్ ఖలీల్ ఎన్నికయ్యారు.

హనుమాన్ జంక్షన్‌లో మళ్లీ ట్రాఫిక్ కష్టాలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

హనుమాన్‌జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికొచ్చింది. వలయంలో చిక్కుకుని ముందుకెళ్లడం కష్టమవుతోంది. 16వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మించిన బైపాస్ మార్గం మూడేళ్ల క్రితం అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ వెతలకు శాశ్వత పరిష్కారం లభించిందని అంతా భావించినా, అది తాత్కాలిక ఊరటగానే మిగిలింది. 216హెచ్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడం, స్థానికంగా ట్రాఫిక్ తీవ్రమవడం, రోడ్లు, నడకదారులు ఆక్రమణలకు గురికావడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు లేకపోవడం నరకప్రాయంగా మారింది.

నిరంతరం వాహనాల రద్దీ

బైపాస్ అందుబాటులోకి వచ్చిన తర్వాత భారీ వాహనాలు ఇటుగా రావడం లేదన్న మాటే కానీ, నేటికీ కూడలి మీదుగా వెళ్లే ఏ ఒక్కరికీ కూడా సజావుగా, క్షేమంగా వెళ్తామన్నా భరోసా లేదు. ఈ ప్రాంతం నిరంతరం వాహనాల రద్దీతో కిక్కిరిసిపోవడం, ఇరుకు రహదారులు, నియంత్రణ వ్యవస్థ లేకపోవడం ఇందుకు మూలకారణాలు. వేగంగా దూసుకుపోయే వాహనాల ధాటికి జనం బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. కార్లు, ద్విచక్రవాహనాల దూకుడికి పాదచారులు రహదారి దాటాలంటే హడలెత్తిపోతున్నారు.

రోడ్లపైనే పార్కింగ్..

శివారులో విశాలంగా ఉన్న రెండు ప్రధాన రహదారులు కూడలిని సమీపించే సరికి ఇరుగ్గా మారిపోయాయి. విస్తరణ సందర్భంగా భవిష్యత్తులోని ట్రాఫిక్ ఇబ్బందులను అధికారులు పట్టించుకోకుండా మార్కింగ్ వేయడమే ఇందుకు కారణం. ఇది జరిగి 15 ఏళ్లు దాటినా, ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా రోడ్లను విస్తరించే దిశగా సంబంధిత శాఖల అధికారులతో ఎవరూ సంప్రదింపులు జరిపిన దాఖలాల్లేవు. మరోవైపు కాలిబాటలు, మార్జిన్లు మొత్తం ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో పాదచారులు కూడా రహదారిపైనే నడవాల్సి వస్తుంది. కొందరు వ్యాపారులు తమ దుకాణాల ఎదుట సగం మేర రహదారిని దర్జాగా పార్కింగ్ స్థలంగా మార్చేశారు. ఇక తోపుడుబండ్లు, ఆటోస్టాండ్లు పూర్తిగా రోడ్లపైనే ఉంటున్నాయి.

రహదారుల ఆక్రమణతో ఇబ్బందులు

ప్రధాన రహదారిపై అడ్డగోలుగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

సిబ్బంది కేటాయింపు అంతంతమాత్రమే..

ట్రాఫిక్ నియంత్రణకు గతంలో ప్రత్యేకంగా ఎస్సైని నియమించి, పర్యవేక్షణ జరిపేవారు. బైపాస్ తర్వాత ఎస్సైను, సిబ్బందిని పూర్తిగా తొలగించేశారు. ప్రస్తుతం కేవలం ఒకరిని కేటాయిస్తున్నారు. ఎంతో కీలకమైన ఎస్‌బీఐ డివైడర్, బస్టాండ్ ఇన్‌గేట్, అవుట్‌గేట్ వద్ద తరచుగా ఇబ్బందులు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పోలీసులు తగినంత మంది సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం, హైవే మొబైల్ వాహనాల సేవలు ఉపసంహరించడం సమస్య తీవ్రతను పెంచాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం

భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

కాటూరు (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యతనిచ్చి రూ.కోట్లతో ఆసుపత్రులు నిర్మిస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మండలం కాటూరులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో కార్పొరేట్ తరహాలో సేవలందించేలా ప్రభుత్వం అత్యాధునిక వైద్య పరికరాలను సమకూరుస్తోందని పేర్కొన్నారు. వైద్యఆరోగ్యశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అభినందనీయం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు చెక్కు అందజేస్తున్న వడ్డిల్లి లక్ష్మీ, సత్యనారాయణ దంపతులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: శుభకార్యాల సమయంలో హంగులు, ఆర్భాటాల కంటే సామాజిక సేవకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. బాపులపాడుకు చెందిన తెదేపా మహిళా నాయకురాలు వడ్డిల్లి లక్ష్మీ, సత్యనారాయణ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి నిమిత్తం రూ.లక్ష, స్థానికంగా ఉన్న దాసాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి గతంలో ఇచ్చిన రూ.90 వేలకు జతగా మరో రూ.60 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ రెండు చెక్కులను లక్ష్మీ దంపతులు యార్లగడ్డకు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, సీనియర్ నేత దుట్టా రామచంద్రరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చలమలశెట్టి రమేష్, తెలుగు మహిళా నాయకురాలు ఆచంట సునీత, అట్లూరి శ్రీను, మొవ్వా వేణుగోపాల్, జాస్తి భూపతి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో సమస్యలేమైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆదివారం వేలేరులో రహదారి వెంట ఆరబెట్టిన ధాన్యం రాశుల్ని ఆయన పరిశీలించి, సంబంధిత రైతులతో మాట్లాడారు. తేమ శాతం తగ్గించేందుకు నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం తప్పనిసరని, దీనికి అనువుగా స్థలాలు లేకపోవడం కొంచెం ఇబ్బందికర విషయమేనన్నారు. ఈ సమస్యకు తగిన పరిష్కారం దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎంపోసీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బహుమతులు అందుకున్న వారితో ప్రిన్సిపల్ సాయినాథ్, వాణి, రాజేష్ తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: నారాయణ విద్యాసంస్థల సాఫ్ట్ స్కిల్స్ విభాగం నేతృత్వంలో నిర్వహించిన మాస్టర్ ఒరేటర్ కాంటెస్టు పోటీల్లో అశోక్‌నగర్ నారాయణ టెక్నో విద్యార్థులు ఐదు అంశాల్లో ప్రథమ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్ సాయినాథ్ తెలిపారు. ఆదివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు. మొత్తం 18 అంశాల్లో విద్యార్థులు పోటీ పడ్డారన్నారు. ఈ చాంప్స్ అర్అండ్‌డీ వాణి, ఏజీఎం మురళీ కిశోర్, ఆర్ఐ రాజేష్, కోఆర్డినేటర్ ఫాతిమా, వైస్ ప్రిన్సిపల్ రాజశ్రీ, శ్రీవిద్య, అజార్‌బాషా పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మధ్య నియోజకవర్గం తెదేపా నేతల వనసమారాధన

మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), వేదికపై ఎమ్మెల్యే బొండా ఉమా, తెదేపా నాయకులు నాగుల్‌మీరా, బుద్ధా వెంకన్న, తదితరులు

నున్న, న్యూస్‌టుడే: నున్న వికాస్ కళాశాల రోడ్డులోని ఆయుర్వాన్ రిసార్ట్‌లో విజయవాడ మధ్య నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతంతో పాటు మరో ఐదేళ్లు అధికారంలో ఉండేందుకు ఇప్పటి నుంచే కార్యకర్తలంతా కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో మధ్య నియోజకవర్గం తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

మాట్లాడుతున్న కేసీపీ పూర్వ వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ

ఉయ్యూరు, న్యూస్‌టుడే: కేసీపీ వ్యవసాయ విభాగం విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశాన్ని కోడే సాంబశివరావు అధ్యక్షతన ఆదివారం ఉయ్యూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేసీపీ పూర్వ వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సహోద్యోగులుగా పనిచేసినవారు వృద్ధాప్యంలో ఇలా కలవడం ద్వారా వారి ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. ఒకరికొకరు కష్టసుఖాలు పంచుకోవడం ద్వారా మనసు ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఈ వయసులో మందుల కంటే మనశ్శాంతి ముఖ్యమన్నారు. అనంతరం 75 ఏళ్లు నిండిన సంఘం సభ్యుల్ని సత్కరించారు. ఎం.సత్యనారాయణ, సీహెచ్.వి.కోటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, వి.సూర్యనారాయణ, కృష్ణమోహనరావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నున్న, న్యూస్‌టుడే: ఆలయాల నిజమైన అర్థం త్రైత సిద్ధాంత భగవద్గీత ద్వారా తెలుసుకోవచ్చని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ అధ్యక్షుడు కాళ్ల సత్యం అన్నారు. ఆదివారం పాతపాడు, కుందావారి కండ్రిక గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు.

అనుమోలు ప్రభాకరరావుకు సన్మానం

ప్రభాకరరావుకు జ్ఞాపిక ఇస్తున్న లయన్స్ గవర్నర్లు శేషగిరిరావు, శివశంకర్, శ్రీశాంతి

కానూరు, న్యూస్‌టుడే: ఎల్బ్రస్ పర్వతాన్ని 67 సంవత్సరాల వయసులో అధిరోహించి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ వీఆర్‌కె వాణిజ్య అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావును స్పందన లయన్స్ జిల్లా అవార్డుల కార్యక్రమంలో భాగంగా సన్మానించారు. ఆదివారం కానూరు అన్నేవారి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గవర్నర్లు గద్దె శేషగిరిరావు, శివశంకర్, శ్రీశాంతి, ఆంజనేయులు కలిసి సత్కరించారు. దీంతోపాటు ఔట్‌స్టాండింగ్ ప్రెసిడెంట్ అవార్డును కూడా ఆయనకు అందించారు. కార్యక్రమంలో పలువురు లయన్స్‌క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ప్రదర్శన

కుందేరు(కంకిపాడు), న్యూస్‌టుడే: ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కుందేరులో ప్రదర్శన నిర్వహించారు. సంఘం జాతీయ ప్రచారోత్సవంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దేశ సమైక్యత, ప్రగతికి కృషి చేయడమే సంఘం లక్ష్యమన్నారు. పరమత సహనం, దేశభక్తి భావంపైనే ప్రజాస్వామ్య వ్యవస్థ ఆధారపడి ఉందన్నారు. సంఘం జిల్లా బాధ్యుడు మహ్మద్ యాకూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

గోనె సంచుల కొరత.. అన్నదాత కలత

కంకిపాడు, న్యూస్‌టుడే

మద్దూరు కరకట్టపై ఆరబెట్టిన ధాన్యం రాశులు

ధాన్యం సేకరణలో ఎదురవుతున్న అవాంతరాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మొన్నటివరకు వాతావరణం మబ్బుపట్టి ఉండటంతో ఆందోళనకు గురైన అన్నదాతలు.. నేడు గోనె సంచులు లేకపోవడంతో కలవరపాటుకు గురవుతున్నారు. వారం, పది రోజులుగా రహదారులు, కల్లాల్లోనే ధాన్యం ఆరబెడుతూ పడిగాపులు కాస్తున్నారు. ఆరబోత, తిరగబోత ఖర్చులు తలకు మించిన భారంగా మారాయని వాపోతున్నారు. పగలంతా ఎండబెట్టి మంచు నుంచి రక్షణకు సాయంత్రానికి పరదాలు కప్పుతున్నారు. మరోవైపు తేమశాతం అధికంగా ఉన్న ధాన్యాన్ని సేకరించే దావులూరు, చలివేంద్రపాలెంలోని రైస్ మిల్లుల్లో రెండు రోజులుగా దిగుమతి ఆపేశారు. సంబంధిత మిల్లుల పరిమితి దాటిపోయిందని చెబుతున్నారు. దీంతో రైతుల కష్టాలు రెట్టింపయ్యాయి. గోనెసంచుల కోసం ఆర్ఎస్‌కేలో నమోదు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం మొలకెత్తింది

ఐదున్నర ఎకరాల్లోని పంటను 12 రోజుల క్రితం ఆరబెట్టాను. గోనె సంచుల కోసం నిత్యం ఆర్ఎస్‌కేకు వెళ్తున్నాను. ఇంతవరకు సరఫరా చేయలేదు. ఈలోగా ధాన్యం రంగు మారడమే కాకుండా చాలా వరకు మొలకెత్తింది. 75 కిలోల బస్తాకు రూ.200-300 ధర తగ్గుతుంది. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారు.

- చొప్పరపు గంగాధరరావు, కోలవెన్ను

నాలుగు రోజులుగా పడిగాపులు

రెండు ఎకరాల్లోని పంటను ఆరబెట్టి నాలుగు రోజులైంది. గోనె సంచులు అందుబాటులో లేవంటున్నారు. కూలీల ఖర్చు భరించలేక నేనే రోజూ తిరగవేస్తున్నాను. వేగంగా ధాన్యం సేకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రమణమ్మ, పునాదిపాడు

ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణ

టూవీలర్స్ మెకానిక్ సంఘం సభ్యులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు టూవీలర్స్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘం కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 60 మంది మెకానిక్‌లు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. అప్తమాలజిస్ట్ రాకేష్ వారికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా మెకానిక్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.డి.అక్బర్ బాషా మాట్లాడుతూ.. మెకానిక్‌లు తమ ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. మెకానిక్‌ల కుటుంబాల జీవిత భద్రతకు ప్రమాద బీమా పథకాలు అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యదర్శి ఇబ్రహీం, నాయకులు నాగరాజు, జగన్నాథం, మురళీకృష్ణ, వేణు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'శాలివాహన' ఛైర్మన్‌కు సత్కారం

పేరిత ఈశ్వర్‌తో కందలంపాడు తెదేపా నాయకులు

కందలంపాడు (కంకిపాడు), న్యూస్‌టుడే: రాష్ట్ర శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పేరిత ఈశ్వర్ ఆదివారం తన స్వగ్రామమైన కంకిపాడు మండలంలోని కందలంపాడు వచ్చిన సందర్భంగా గ్రామస్థులు ఆయన్ని సన్మానించారు. స్థానిక గంగానమ్మ తల్లి గుడిలో కుటుంబసభ్యులతో పూజలు చేశారు. తెదేపా నాయకులు మువ్వా వరప్రసాద్, పొనుగుమాటి రామస్వామి, దొప్పలపూడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు నీరివ్వాలి

తహసీల్దార్ శివయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం ముస్తాబాద పెద్దచెరువులో నిండుకుండలా నీరున్నా.. దాళ్వా పంట వేసుకునేందుకు నీటిని అందించడం కుదరదన్న చెరువు కమిటీ నిర్ణయంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్ద చెరువు కింద సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఇటీవల పోలవరం నీటితో చెరువును నింపారు. ఏటా చెరువు నీటి ఆధారంగా కమిటీ ప్రతినిధులు, ఆయకట్టు రైతులు సమన్వయ సమావేశం నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎలాంటి సమావేశం నిర్వహించకపోవడం.. చెరువు నీటిని రైతులకు ఇవ్వలేమని చెప్పడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. సత్వరమే సమావేశం నిర్వహించి జొన్న, వరి సాగుకు నీరివ్వాలని తహసీల్దార్ వెంకటశివయ్యను ఆదివారం కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలో అధిక సంఖ్యలో కొలువుల భర్తీ

మాట్లాడుతున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ. చిత్రంలో ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, తెనాలి శ్రావణ్‌కుమార్, తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీ ద్వారా ఒకేసారి 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. కానూరులోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్న అభ్యర్థుల్లో 358 మంది ఉపాధ్యాయ పోస్టులు సాధించిన సందర్భంగా ఆదివారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులను వారి తల్లిదండ్రులతో సహా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, తెనాలి శ్రావణ్‌కుమార్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ సింహాచలం, ఎస్.రామారావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, కోచింగ్ సెంటర్ ఛైర్మన్ జంపాన సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ముదునూరులో అధికారుల సర్వే

ముదునూరు(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామానికి చెందిన బుట్టి శివశంకర్ రాజు(42) స్క్రబ్ టైఫస్ లక్షణాలతో మృతిచెందడంతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కాటూరు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం సిబ్బంది 700 ఇళ్లల్లో సర్వే నిర్వహించారు. తీవ్ర జ్వరంతో ఎవరైనా బాధపడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. స్క్రబ్ టైఫస్ లక్షణాల గురించి అవగాహన కల్పించారు. ప్రజలు ఆందోళనకు గురికావొద్దని అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పర్యవేక్షకులు కొలుసు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని వీరవల్లి ఎస్సై ఎం.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎస్పీ విద్యాసాగర్ ఆదేశాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లను ఆదివారం పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాజంలో ఏ తరహా అసాంఘిక కార్యకలాపాల్లో భాగస్వాములైనా చట్ట ప్రకారం మరిన్ని చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు.

ప్రథమ వర్ధంతి

శ్రీమతి తోటకూర ప్రపుల్లరాణి గారు
జననం 10-3-1962
Rtd. టీచర్, పోరంకి
మరణం 18-12-2024

ప్రేమ, మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మాతృమూర్తి, ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి, మా ఉన్నతికి అహర్నిశలు కృషిచేసిన శ్రీమతి తోటకూర ప్రపుల్లరాణి గారు మా నుండి దూరమై ఏడాది గడిచిననూ మీ మధుర స్మృతులు మా వెన్నంటే ఉన్నాయి. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భర్త : తోటకూర కిషోర్, పోరంకి. ✆ 99120 78989
తండ్రి : గరికపాటి భాస్కరరావు - తల్లి : వెంకట సూర్యకుమారి
కుమారుడు : తోటకూర పవన్‌కుమార్ - కోడలు : హిందుజ
కుమార్తె : కంతేటి భవ్య - అల్లుడు : కిరణ్ చంద్రకుమార్
మనుమరాండ్రు : తోటకూర క్రితిక, కంతేటి ఆన్వశ్రీ
మనుమడు : కంతేటి మన్విత్

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

పెరటి తోటలో పనులు చేస్తున్న విద్యార్థినులు

పెరటి తోటల పెంపకంతో ఎన్నో ప్రయోజనాలు

ఘంటసాల, న్యూస్‌టుడే: పెరటి తోటల పెంపకంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఎన్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు ఎ.సంధ్యారాణి, ఎ.సువర్ణలత అన్నారు. ఆదివారం ఘంటసాలలో పెరటి తోటల పెంపకంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్లకార్డులతో ప్రదర్శన జరిపారు. ఆదర్శ రైతు అయినపూడి విజయకుమార్, బాపట్ల, నరసరావుపేట కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పైడమ్మ ఉత్సవం.. భక్త జన సందోహం

పెడన, న్యూస్‌టుడే: పెడన గ్రామ దేవత పైడమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో పట్టణంలోని పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉత్సవ ప్రాంగణానికి వెళ్లే గూడూరు రోడ్డు కిటకిటలాడింది. పైడమ్మ, ఆమె సోదరుడు పోతురాజుల ప్రభలను భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. దేవాంగ యూత్‌తో పాటు పలువురు ప్రముఖులు శిడిబొమ్మలతో ఆలయానికి తరలి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మచిలీపట్నం సబ్‌డివిజన్ పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

స్పందనకు వందనం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ❖ అవనిగడ్డలో సీతాయిలంక అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా చెత్త కుప్పలు గాలికి ఎగిరి రోడ్డుమీదకు వస్తున్నాయని, దుర్వాసన కొడుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆదివారం చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. ❖ అవనిగడ్డ ఒకటో వార్డు కొత్తపేట రోడ్డులో రజకుల చెరువు వద్ద చెత్త కుప్పలు పెరిగిపోయి దుర్వాసన కొడుతున్నాయని సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావుల వినతి మేరకు పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకున్నారు.

పాడైన దారుల అభివృద్ధి దిశగా..

గుడివాడ నియోజకవర్గంలో రూ.11.20 కోట్లతో కార్యాచరణ

గుడివాడ, న్యూస్‌టుడే

దొండపాడు రహదారి గుంతలమయం

గుడివాడ నియోజకవర్గంలో పలు రహదారుల అభివృద్ధికి రహదారులు భవనాల శాఖ రూ.11.20 కోట్ల నిధులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల పరిధిలోని పలు రహదారులు పూర్తిగా ధ్వంసమై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్థుల విజ్ఞప్తుల మేరకు అధికారులు రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకొంటున్నారు. వీటిలో కొన్ని నిర్మాణ దశలో, మరికొన్ని టెండరు దశలో ఉన్నాయి. మరికొన్నింటికి ప్రతిపాదనలు పంపారు. గుడివాడ బైపాస్ రోడ్డు ప్రాణాంతక గుంతలతో వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తోంది. దీంతో నిత్యం చోదకులు పలు ప్రమాదాల బారిన పడుతున్నారు. తొలుత కూటమి ప్రభుత్వం గుంతలు పూడ్చినా వెంటనే మళ్లీ షరా మామూలే. ఈక్రమంలో గుడివాడలో బైపాస్ రోడ్డును రూ.2.50 కోట్లతో 2.8 కిలోమీటర్ల అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల ఈ పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ముదినేపల్లి - గుడ్లవల్లేరు రోడ్డు కూడా భారీ గుంతలతో వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారింది. జేమ్సు పేట సమీపం నుంచి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీని బాగుజేతకు రూ.2.50 కోట్లతో నిర్మాణ పనులు సాగుతున్నాయి. గుడివాడ మండలం దొండపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అత్యంత ప్రమాదకరంగా ఉంది. దీనికి రెండు వైపులా కాలువలు ఉండటం, బాగా గుంతలు పడటంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రయాణికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రజల కష్టాలను గుర్తించిన అధికారులు నాబార్డు నిధులు రూ.2 కోట్లతో నిర్మాణానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

టెండర్ దశలో... 3 రహదారులు

గుడివాడ నియోజకవర్గంలో మరో 3 రోడ్లను రూ.4.20 కోట్లతో నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులు టెండరు దశలో ఉన్నాయి. నందివాడ మండలంలో గండేపూడి, పోలుకొండ, కానుకొల్లు (జీపీకే) రోడ్డు నుంచి విరివాడ, కానుకొల్లు వరకూ రహదారులు పూర్తిగా పాడై పోయి ప్రజలకు చాలా ఇబ్బందిగా మారాయి. గుడివాడ నుంచి తటివర్రు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయం అయ్యింది. నిత్యం తటివర్రు, రామనపూడి గ్రామాల ప్రజలు ఈ రహదారి మీదుగా గుడివాడ వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. తటివర్రు రోడ్డు పనులు సైతం టెండరు దశలో ఉన్నాయి. బంటుమిల్లి-గుడివాడ రోడ్డు నుంచి పర్నాస వరకూ బాగుజేతకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చల్లపల్లి: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ చల్లపల్లి యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగాయి. అధ్యక్షునిగా పి.వి.మాధవేంద్రరావు, సహాధ్యక్షునిగా పూసపాటి బ్రహ్మానందరావు, ఉపాధ్యక్షులుగా జి.వి.రమణ, ఎం.రాజకుమారి, వై.శ్యాంసన్‌బాబు, కార్యదర్శిగా సీహెచ్.వి.డి.ప్రసాదరావు, సహాయ కార్యదర్శులుగా జి.రాంబాబు, ఎ.శ్రీనివాసరావు, అబ్దుల్ వజీద్, వై.శివనాగలక్ష్మి, కోశాధికారిగా కె.రామకోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా కె.రవి అంకినీడు ప్రసాద్, పి.విష్ణు, ఎస్.నాగలక్ష్మి, వై.నాగలక్ష్మి, వి.లావణ్య ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జి.వెంకటేశ్వర్లు, ఓగిరాల నాగమల్లేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, కె.ద్రాక్షాయణి, టి.శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఎన్‌జీవో యూనిట్ కృష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకూరి శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. డీపీవో కార్యాలయ ఏవో వి.సీతారామయ్య పరిశీలకునిగా వ్యవహరించగా, అవనిగడ్డ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు బి.రాజేంద్రకుమార్ ఎన్నికల అధికారిగా, శిర్విశెట్టి సురేష్‌కుమార్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు పదవిలో ఉంటుంది. కొత్త కార్యవర్గాన్ని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షులు తోట సుధాకరరావు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.


చల్లపల్లి యూనిట్ నూతన కార్యవర్గ నేతలు

కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా మురళీకృష్ణ

మోదుమూడి (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: కిసాన్ మోర్చా అవనిగడ్డ మండల అధ్యక్షునిగా మోదుమూడికి చెందిన బచ్చు మురళీకృష్ణ ఎన్నికైనట్లు భాజపా నియోజకవర్గ కన్వీనర్ తుంగల వెంకటగిరి పేర్కొన్నారు. ఆదివారం జరిగిన మోర్చా మండల సర్వసభ్య సమావేశంలో ఈమేరకు ఎన్నుకున్నారు. భాజపా రాష్ట్ర కౌలు రైతు కన్వీనర్ జీవీ నగరయాలు, నాయకులు చంద్రశేఖర్, భూపతి సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.

బచ్చు మురళీకృష్ణను సత్కరిస్తున్న భాజపా నేతలు

పాలకాయతిప్ప బీచ్‌లో సందర్శకుల సందడి

బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ యువకుమార్, మెరైన్ సిబ్బంది

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: ఇటీవల తుపాను హెచ్చరికలతో పాలకాయతిప్ప బీచ్‌కు యాత్రికులను అనుమతించక పోవడంతో బోసిపోయింది. కొద్ది రోజుల విరామం తర్వాత ఆదివారం బీచ్‌లో యాత్రికులు సందడి చేశారు. పిల్లలతో వచ్చిన కుటుంబ సభ్యులు ఆడిపాడారు. అవనిగడ్డ సీఐ యువకుమార్ ఆధ్వర్యంలో జాగ్రత్తలు సూచించారు. మెరైన్, అటవీ సిబ్బంది లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లతో ఒడ్డున సిద్ధంగా ఉండి, యాత్రికులను అప్రమత్తం చేస్తూ రక్షణగా ఉన్నారు. లోపలకు వెళ్లకుండా స్నానాలు చేయాలని సూచించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కూచిపూడి, న్యూస్‌టుడే: గొట్టిపాటి సాయి ఫౌండేషన్, రూప ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కూచిపూడిలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సాయి ఫౌండేషన్ నేత గొట్టిపాటి సాయి ఆధ్వర్యంలో గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్ ప్రారంభించిన ఈశిబిరంలో కూచిపూడితోపాటు పరిసర ప్రాంతాల నుంచి 474 మంది రోగులు వచ్చి వైద్యసేవలతోపాటు మందులు కూడా ఉచితంగా అందుకున్నారు. ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ వైద్యుడు డాక్టర్ ఎ.వి.హరిప్రసాద్, డాక్టర్ కె.వి.రామకిషోర్, డాక్టర్ కృష్ణతేజ్, డాక్టర్ ఎన్.వేణు రోగుల్ని పరీక్షించారు. పామర్రు సీఐ సుబ్బారావు, కూచిపూడి ఎస్.ఐ పి.శిరీష, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, రాజులపాటి రామారావు, పద్మశాలీయ సంఘ జిల్లా అధ్యక్షులు అమరలింగేశ్వరరావు, మాజీ సర్పంచి మద్దాల నాగమా శివ పాల్గొన్నారు.

వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులతో అతిథులు

చిన్నఅవుటపల్లి సిద్ధార్థ మెడికల్ కళాశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మధుమేహం, ఎముకలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షిత, డాక్టర్ రేవతి, రోటరీ క్లబ్ కార్యదర్శి జి.కిరణ్, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, సి.సూర్యచంద్రరావు, మారుతీరావు, ప్రసాద్, ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: గుడివాడ పట్టణం కోత్తిబొమ్మ సెంటర్ ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో

మందులు అందజేస్తున్న డాక్టర్ సీఎల్

జన్మభూమి వైద్య సేవలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక జన్మభూమి వైద్యశిబిరంలో ఆదివారం స్వచ్ఛాంధ్రమిషన్ రాష్ట్ర మాజీ వైస్‌ఛైర్మన్ డాక్టర్ సీఎల్.వెంకట్రావ్, విజయవాడ కామినేని ఆస్పత్రి వైద్య సిబ్బంది, డాక్టర్ హరిహర్ వైద్యసేవలందించారు. హైదరాబాద్ లీఫార్మా లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో ఉచితంగా మందులు అందజేశారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్.ఐ చంటిబాబు

ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం తప్పనిసరి

గుడివాడ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని కోల్పోయే చర్యలు తప్పవని గుడివాడ రూరల్ ఎస్.ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెంలో జాతీయ రహదారిపై శిరస్త్రాణం లేని వారికి ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాల బారిన పడితే తలకు బలమైన గాయాలై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ప్రమాదాల బారిన పడితే వారిని రక్షించేందుకు శిరస్త్రాణం వాడాలన్నారు.

30 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ మండలంలోని 30 మంది రౌడీషీటర్లు, అనుమానిత షీటర్లు వారి ప్రవర్తన మార్చుకుని మంచిగా నడుచుకోవాలని, లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తప్పవని గుడివాడ రూరల్ పోలీసు స్టేషన్ ఎస్.ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లు, అనుమానిత షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్టేషన్‌కు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడైనా వివాదంలో తలదూర్చితే చర్యలు తప్పవన్నారు.

గుడ్లవల్లేరులో పారిశుద్ధ్య చర్యలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ఇందిరాకాలనీకి చెందిన యువతికి, పామర్రు నుంచి వచ్చిన మహిళలకు శనివారం స్క్రబ్ టైఫస్ వ్యాధి నిర్ధారణ కావడంతో పంచాయతీ అప్రమత్తమైంది. ఇందిరాకాలనీతో పాటు గ్రామంలోని పలు కాలనీలు, ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టింది. ప్రధాన రహదారులు, కాల్వలు, డ్రెయిన్లు, మురుగు స్థావరాలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం చల్లించారు. చెత్తను తరలించారు. వీధులను శుభ్రం చేశారు. మాజీ సర్పంచి దాదాల బాలాజీ, పీహెచ్‌సీ మాజీ ఛైర్మన్ దాసరి రాజేశ్వరరావు, శానిటరీ అధికారి పవన్‌కుమార్‌లు పనులను పర్యవేక్షించారు.

ఇందిరా కాలనీలో డ్రెయినింగ్ చల్లుతున్న దృశ్యం

కళాపీఠం వ్యవస్థాపకుడికి సత్కారం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి కళాపీఠం వ్యవస్థాపకుడు మల్లికేడి రాములును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. తెలంగాణ, నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కోట మండలం, రాచాలపల్లికి చెందిన మల్లికేడి రాములుకు ఉన్న పరిచయంతో ఆదివారం అవనిగడ్డ వచ్చి ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. గత స్మృతులు పంచుకున్నారు. 2018లో సి.నా.రే.కళాపీఠం స్థాపించిన రాములు తన స్వగ్రామంలో విద్యా ప్రోత్సాహక, గ్రామ అభివృద్ధి, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

మార్జిన్ కోతతో సిమెంట్ రోడ్డుకు గండం

మండలంలోని వెణుతురుమిల్లి శివారు దేశాయ్‌గుంట గ్రామమధ్యలోని ఊర చెరువుకు చుట్టూ రివిట్‌మెంట్ లేక రోడ్డు కోతకు గురవుతున్నాయి. రామాలయం వీధిలోని సిమెంట్‌రోడ్డు చెరువు గట్టు వెంబడే నిర్మించగా నేడు చెరువు కోతకు గురై రోడ్డు మార్జిన్‌తో సహ కోతకు గురైంది. రోడ్డు అడుగున మట్టి కూడా కొట్టుకుపోవడంతో నేడు దాని భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పెద్ద వాహనం వెళితే విరిగిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

- దేశాయ్‌గుంట(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

ప్రమాదభరితంగా లంకమ్మమాన్యం వంతెన

స్థానిక లంకమ్మ మాన్యం వద్ద దక్షిణ పంట కాలువపై నిర్మించిన వంతెనపై కొంత మంది ఇసుక, బుసక, కంకర వంటివి లారీలతో వేసి, వేరే ప్రదేశాలకు వాటిని జేసీబీలతో లోడింగ్ చేసి తరలిస్తున్నారు. దీంతో వంతెనపై వర్షపు నీరు కిందకు వెళ్లే రంధ్రాలు పూడిపోయి, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇసుకలో ద్విచక్ర వాహనాలు జారిపోయి ఇప్పటికే కొందరు పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. అక్కడ వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు రాత్రి సమయంలో రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎక్కడ పడిపోతామోనని భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంటనే ఈ పరిస్థితిని నివారించాలని, వంతెనను పరిశుభ్రంగా ఉంచాలని జనం కోరుతున్నారు.

- అవనిగడ్డ, న్యూస్‌టుడే

వాహన రాకపోకలకు ఇక్కట్లు

స్థానిక కొత్తపేటలో పలు రహదారుల మార్జిన్‌లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మార్గాలు కుచించుకుపోయి రాకపోకలకు వాహన చోదకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వెంటనే రహదారి మార్జిన్‌లో వ్యర్థాలను తొలగించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- అవనిగడ్డ, న్యూస్‌టుడే**

బాధితురాలికి గృహోపకరణాల వితరణ

భట్లపెనుమర్రు(కూచిపూడి), న్యూస్‌టుడే: ఇటీవల భట్లపెనుమర్రులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన చదువుల లక్ష్మికి అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ హ్యూమానిటీ ఫస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా గృహోపకరణాలను అందజేశారు. జిల్లా ఇన్‌ఛార్జి మహ్మద్ యాకూబ్ పాషా, భట్లపెనుమర్రు ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షుడు షేక్ మౌలాలి స్థానికులు పాల్గొన్నారు.

కృత్తికా మండల వేదసభ

కూచిపూడి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: స్థానిక శ్రీ గంగా బాలాత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కృత్తికామండల వేదపారాయణ సభ జరిగింది. ఆర్షవిద్యా పరిశోధనా పరిషత్తు అధ్యక్షుడు కప్పగంతు వెంకట సీతారామశర్మ పర్యవేక్షణలో విశ్రాంత ఉపాధ్యాయుడు చింతలపాటి రామకృష్ణ సహకారంతో వేదసభ నిర్వహించారు. అనంతరం వేదపండితులను సత్కరించారు.

'వ్యాధి లక్షణాలు లేవు'

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు శివారు కొరముక్కువానిపురంలో ఆదివారం వైద్య ఆరోగ్య సిబ్బంది స్క్రబ్ టైఫస్ వ్యాధిపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, ఎవరికీ ఎటువంటి వ్యాధి లక్షణాలు లేవని, ప్రజలు భయపడాల్సిన పనిలేదన్నారు.

కొరముక్కువానిపురంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

సోమేశ్వరస్వామికి ఏకాదశి రుద్రాభిషేకం

పామర్రు, న్యూస్‌టుడే: మార్గశిరమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక గంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పామర్రు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు భేతరబొట్ల సుబ్బారావు, గడియారం సుబ్రహ్మణ్యం, భేతనబొట్ల చంద్రశేఖర శర్మ, రొంపిచర్ల విశాలాక్షి, భేతనబొట్ల రాజేశ్వర శాస్త్రి, ఇత బ్రాహ్మణ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకారాలు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.

సోమేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న సభ్యులు

పూజల్లో పండిత బృందం

కొండలమ్మ తల్లికి పూజలు

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానాన్ని ఆదివారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది భక్తులు తరలివచ్చి పూజాదికాలు నిర్వహించారు. మహిళలు సామూహిక పాలపొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. తలనీలాలు, మొక్కుబడులు తీర్చుకుని బంధుమిత్రులకు అన్నసమారాధనలు చేసుకున్నారు.

జలధీశ్వరుని ఆలయంలో..

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాలలో జలధీశ్వర ఆలయంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య సతీమణి శ్రీదేవి, కుమారుడు కృష్ణపవన్, శ్రీదేవి తల్లిదండ్రులు చింతా వెంకట జనార్ధనరావు-విశాలాక్షి ఆదివారం విశేష పూజలు జరిపారు. ప్రాచీన ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. వీరిని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ స్వామి వారి చిత్రపటంతో ఘనంగా సత్కరించారు.

వైభవంగా రాజశేఖరునికి..

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక రాజరాజేశ్వరీ సమేత రాజశేఖరస్వామి దేవాలయం (శివాలయం)లో ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఏకాదశరుద్ర అభిషేకం, లక్ష బిల్వార్చన, అన్నాభిషేకం, రుద్రహోమం, స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. 30 మంది పండితులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

దేశాభివృద్ధిలో యువతే కీలకం

గుడివాడ, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో యువతే కీలకమని, మన దేశంలో 2047 నాటికి యువత అతి పెద్ద సమూహంగా మారి దేశ ప్రగతిలో భాగస్వాములు అవుతారని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.కరుణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'వికసిత భారత్‌లో యువత' అనే అంశంపై ఆదివారం అతిథి ఉపన్యాసమిచ్చారు. యువత వినూత్న ఆలోచనలు దేశ నిర్మాణంలో ఆర్థిక, సామాజిక పురోగతికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపల్ ఆలియా బేగం, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.జె.సతీష్ చంద్ర, జీ.జీవన్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ బి.కరుణ్ కుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

అభినయ సాంఘిక నాటక పుస్తకావిష్కరణ

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని మహతి కళావేదికపై ఆదివారం సాయంత్రం భావ తరంగిణి సంస్థ నిర్వాహకులు భవిష్య రచించిన అభినయ సాంఘిక నాటక పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, సాహితీవేత్త డా.బి.ధన్వంతరి ఆచార్య, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, భావ తరంగిణి సంస్థ గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమోహనరావు తదితరులు పాల్గొన్నారు. సంస్థ నిర్వహిస్తున్న సాహితీ కార్యక్రమాలను అభినందించారు. ఆర్టీసీ డిపో మేనేజరు టి.పెద్దిరాజు, వివిధ సంస్థల ప్రతినిధులు కొప్పవరపు నారాయణమూర్తి, బీవీవీ సత్యనారాయణ, గుడిపూడి రాధికారాణి, అప్పినేడి పోతురాజు తదితరులు పుస్తకాన్ని సమీక్షించారు. అనంతరం ప్రదర్శించిన అభినయ సాంఘిక నాటకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది.

కోకిలాంబకు ఎమ్మెల్యే పరామర్శ

చినకళ్లేపల్లి(ఘంటసాల), న్యూస్‌టుడే: వైజ్‌మెన్ క్లబ్ జిల్లా గ్రామీణ డైరెక్టర్ గుత్తికొండ కోకిలాంబ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూటమి నాయకులతో కలసి చినకళ్లేపల్లిలో ఆదివారం కోకిలాంబను పరామర్శించారు. ఆమె అనారోగ్య కారణాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. నాయకులు తుమ్మల చౌదరిబాబు, గొర్రెపాటి వెంకటరామకృష్ణ, కనగాల భాస్కరరావు, కనగాల బుజ్జి, ఎం.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా గంటా చంద్రశేఖరరావు, కార్యదర్శిగా లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారిగా తాత బాలభాస్కర్, 44 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు జి.బాబూ శ్రీకర్, నేతలు పి.రామకృష్ణ, బొగ్గరపు తిరుపతయ్య, డి.వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ ఏఈ మృతి

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: జలవనరుల శాఖ పులిగడ్డ సబ్‌డివిజన్‌లో ఏఈగా పనిచేసిన వెంకటేశ్వరరావు(45) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. గత కొంత కాలంగా సెలవులో ఉండి విశ్రాంతి పొందుతున్న ఆయన తిరిగి అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటేశ్వరరావుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.


వెంకటేశ్వరరావు (పాతచిత్రం)

నిరుపేద కుటుంబానికి సహాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే : రామానగరం గ్రామానికి చెందిన గంజాల శ్రీను అనే నిరుపేద దివ్యాంగుని కుటుంబానికి రావెళ్ల కృష్ణ సేవా సమితి ఛైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ రూ.పది వేలు సహాయాన్ని అందజేశారు. సేవా సమితి అధ్యక్షుడు, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు గొరిపర్తి సుబ్బారావు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, నాయకులు జన్ను నాంచారయ్య, ముమ్మనేని సన్నీ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) అవనిగడ్డ

EP No. 3/2023 in O.S. No. 26/2018

Between

గాదె సత్యనరసింహారావు .... DHR

VS

1) బడే లంకేశ్వరి (డైడ్), 2) తాతా వీర వెంకటేశ్వరరావు, 3) మండలి మాధవి, 4) బండె ఝాన్సి, 5) కమ్మిలి గోవర్ధన .... JDR's

(JDR's 3 to 5 are added as per the orders in I.A No. 31/2021, Dt.:9-12-21)

వేలం ప్రకటన

పై నంబరు తనఖా దావాలో వాది / DHR డిక్రీ పొందిన దర్మిలా పై నెంబరు E.P.ని తనఖా బాకీ వసూలు నిమిత్తం తనఖా ఆస్తి అయిన అనగా మొదటి JDR సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తంతో ఉండి, ఆమె మరణానంతరం 3 to 5 JDRలకు సంక్రమించినటువంటి కృష్ణా జిల్లా, అవనిగడ్డ మండలం, అవనిగడ్డ గ్రామ పంచాయతీ మరియు అవనిగడ్డ S.R.O. పరిధిలో ఉన్న సర్వే నంబరు 38లోని 172 చ॥గ॥ (య.11.04 సెంట్లలో) స్థలము మరియు అందులో R.C.C. బిల్డింగ్ కట్టుట నిమిత్తం ఫౌండేషన్ వేసి ఉన్న ఈ దిగువ తెలిపిన హద్దులు అనగా **తూర్పు:** 1st JDR యొక్క సరిహద్దు గోడ 70 అడుగులు, **దక్షిణం :** అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కాలేజి యొక్క సరిహద్దు గోడ 22 అడుగులు, **పడమర :** రెడ్రౌత్తు వెంకటేశ్వరరావు గారి సరిహద్దు గోడ 70 అడుగులు మరియు **ఉత్తరం :** గ్రామ పంచాయతీ వారి రోడ్డు 22 అడుగుల మధ్యన ఉన్న ఆస్తిని ది. 29-12-2025 నాడు పైన తెలిపిన కోర్టునందు ఉదయం 10:30ని॥ లగాయిత్తు వేలము జరుపబడునని ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది. కావున వేలంలో ఎవరైననూ పైన తెలిపిన ఆస్తిని కొనుగోలు నిమిత్తం, సదరు వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వేలం తేది: 29–12–2025
Further hearing : 05-01-2026
Ameena Value : 20,00,000/-
(EC దాఖలా ఎట్టి అన్యాక్రాంతములు లేవు, శ్రీ కోర్టువారి ఉత్తర్వులననుసరించి)

ఇట్లు, న్యాయవాది
పేర్ల రామచంద్రరావు, M.Com., B.L.అడ్వకేట్, అవనిగడ్డ

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
సోమవారం డిసెంబరు 8, 2025

కాలువ కట్టు.. కన్నీరు తుడిచేట్టు

రూ.600 కోట్లతో వరదనీటి డ్రెయిన్లకు డీపీఆర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగరంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థ(ఎస్‌డబ్ల్యూడీ)ను అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఆయా డ్రెయిన్ల నిర్మాణ పనులను పట్టాలెక్కించనున్నారు. వీటికి రూ.600 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో సీఆర్‌డీఏ, యూఎల్‌బీల వాటాగా రూ.300 కోట్లు భరించాలి. ఆ మేరకు ఇంజినీర్-ఇన్-చీఫ్(అమరావతి) తాజాగా మెమో జారీచేశారు. విజయవాడ కార్పొరేషన్ భరించాల్సిన రూ.150 కోట్లకు కౌన్సిల్ ఆమోదం తెలపాల్సి ఉంది. ప్రభుత్వం రూ.300 కోట్లు రాయితీగా సమకూర్చుతుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు సమగ్ర నివేదిక సిద్ధమైంది. కౌన్సిల్ ఆమోదం తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు.

అప్పటి ప్రభుత్వం వాడేసుకుంది

వర్షపు నీటి డ్రెయిన్ల నిర్మాణానికి గతంలో కేంద్రం రూ.461.04 కోట్లు విడుదల చేసింది. ఇంజినీరింగ్ ఇన్ పబ్లిక్‌హెల్త్ ఆధ్వర్యంలో 2019 వరకు ఆయా పనులు జరిగాయి. అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుత్తేదారు సంస్థకు బిల్లుల చెల్లింపు నిలిపేసింది. ఎస్క్రో ఖాతాను సైతం మూసేసింది. దీంతో పనులు ఆగిపోయాయి. అనంతరం అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టక పోగా.. కేంద్రం విడుదల చేసిన నిధుల్లో రూ.289.04 కోట్లు నాటి ప్రభుత్వం వాడేసుకుంది. ఆ నిధులను తిరిగి రప్పించడంలో పాలకపక్షం ఏమాత్రం ప్రయత్నించలేదు. కనీసంగా ఒక్క లేఖ కూడా ప్రభుత్వానికి రాయలేదు. అయితే వైకాపా కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లలో మాత్రం రూ.21.03 కోట్లతో కొన్ని పనులు జరిగాయి.

నిధులను బట్టి..

నగరంలోని 64 డివిజన్లలో 443.71 కిలోమీటర్ల మేర వర్షపునీటి డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇందులో మేజర్ 77.92, మైనర్ 113.61 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. వీటితో పాటు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అదనంగా డ్రెయిన్లు నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేసే నిధులను బట్టి ఆ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

ఫలం.. పుష్పం.. పర్యావరణ హితం

నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో రోజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫల, పుష్ప ప్రదర్శన ఆకట్టుకుంది. ఆదివారం ఎకో ఫ్రెండ్లీ అంశంపై జరిగిన కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈనాడు, అమరావతి- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

బాల్యమిత్రులం.. 54 ఏళ్లకు కలిశాం..

వారంతా పది విద్యార్థులు. 54 ఏళ్ల తర్వాత కలిశారు. ఆనాటి ముచ్చట్లను మళ్లీ గుర్తుచేసుకుని సందడిగా గడిపారు. మైలవరంలో గతంలో ఉన్న బాపూజీ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1971లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం స్థానిక శిరిడీసాయిబాబా అనుదాన మందిరంలో శనివారం నిర్వహించారు. దీనికి 33 మంది హాజరయ్యారు. తమ వంతుగా నాటి సహచర విద్యార్థులకు చేదోడుగా ఉండాలని తీర్మానించారు.
- మైలవరం, న్యూస్‌టుడే

కొండపల్లి కోన.. జలపాతాల వీణ

ఈనాడు, అమరావతి

విజయవాడకు పది కి.మీ దూరంలో ఉండే దట్టమైన కొండపల్లి అటవీ ప్రాంతంలో మనసు దోచే జలపాతాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. చుట్టూ పచ్చని చెట్లు.. కొండలు.. పక్షుల కిలకిలారావాలు.. సీతాకోక చిలుకల వయ్యారాల నడుమ ఇవి చూడముచ్చటగా ఉంటాయి. వీటిలో ప్రధానమైన 12 జలపాతాలను గత తెదేపా ప్రభుత్వ హయాంలో కలెక్టర్‌గా లక్ష్మీకాంతం పనిచేసిన సమయంలో గుర్తించి అధికారికంగా పేర్లు పెట్టారు.

ఒక్కోదానికి ఒక్కో పేరు

ఛత్తీస్‌గఢ్‌లోని చిత్రకూట్ జలపాతాన్ని పోలి ఉండే జలపాతానికి జేబీ చిత్రకూట్, రెండు జడలను పోలినట్లుగా ఉండే రెండు పాయల జలపాతానికి జడల కొలను, అడవి లోపలికి వెళ్లే వారికి ఆత్మీయ స్వాగతం పలికేలా దర్శనమిచ్చేదానికి వనమాలి, రెండు కొండల మధ్య చీర పరిచినట్లుగా కనిపించే జలపాతానికి కొంగుదార, సీతాకోక చిలుకలు కనిపించేచోట సీతాకోకల గుండం అని నామకరణం చేశారు. ✦ శేషాచలం అడవుల్లో ఉండే తుంబుర కోన జలపాతాన్ని పోలి ఉండేదానికి.. చిట్టి తుంబుకోన, మాదులమ్మ ఆలయానికి సమీపంలోని దానికి మాదులమ్మ తీర్థం, ఏడుపాయలుగా వీటి కిందకు పారే జలపాతానికి సప్తస్వరధార, 30 అడుగుల ఎత్తునుంచి జలధార జారి కింద ఉన్న ఓ రాతిపై పడి.. శివ లింగానికి అభిషేకం చేసినట్లుగా కనిపిస్తుండడంతో.. క్షీరలింగ జలపాతం, నెమళ్లు తిరిగే ప్రాంతంలో ఉండేదానికి.. నెమలిధార, కడి, ఎడమల జల పాతం, కలెక్టర్ జలపాతం.. ఇలా 12 పేర్లను అధికారికంగా పెట్టారు.

మూలపాడులో..

అధికారికంగానే 12 గుర్తించి నామకరణం

దొనబండలో..

ఘాట్ రోడ్డు నుంచి..

ఇవన్నీ అడవిలోకి వెళ్లాక కొండపల్లి ఘాట్‌రోడ్డుకు రెండు నుంచి నాలుగైదు కి.మీ దూరంలోనే అధికంగా ఉన్నాయి. కొన్ని మూలపాడుకు 16-18 కి.మీ, మరికొన్ని దొనబండ గ్రామానికి 11-12 కి.మీ దూరంలో ఉన్నాయి. ఒక్కో జలపాతం కనీసం 30 నుంచి 120 అడుగుల ఎత్తు నుంచి కిందకు జాలువారుతున్నాయి.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

కొండపల్లి, దొనబండ, మూలపాడు ప్రాంతాల మీదుగా కొండపల్లి అటవీ ప్రాంతంలోకి వెళ్తే జలపాతాలు కనువిందు చేస్తాయి. జులై నుంచి అక్టోబరు వరకు నాలుగు నెలలు నీటితో కళకళలాడుతుంటాయి. నవంబరు నుంచి జనవరి వరకు నీటి ధార తగ్గిపోతుంది. కింది భాగంలో ఈ నీటి వల్ల ఏర్పడిన కొలన్లు ఉంటాయి. ఫిబ్రవరి తర్వాత వేసవిలో పూర్తిగా నీరు ఎండిపోతుంది. మళ్లీ జల కళ రావాలంటే వర్షాకాలం వరకూ ఆగాల్సిందే. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే విశేషంగా ఆకట్టుకుంటాయి.

సౌకర్యాలు సరే.. సంతృప్తి చూడరే!

ఇబ్బందికర తీరుతో భక్తుల మనసు చివుక్కు

ఈనాడు, అమరావతి

అన్నప్రసాదం

విజయవాడ దుర్గగుడిలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంస్కరణలు చేపట్టారు. అయితే భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కొన్ని సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదు. అందుకే భక్తుల మన్ననలు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవాలయమైన దుర్గగుడిలోని భక్తుల సేవల్లో గత కొన్ని నెలల్లో అనేక మార్పులు చేశారు. ఐదేళ్ల వైకాపా హయాంతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో సౌకర్యాలు కల్పించారు. అయినా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకుల్లో దుర్గగుడి ఏడో స్థానంలో నిలవడం భక్తుల అసంతృప్తి స్థాయికి ప్రత్యక్ష నిదర్శనం.
★ అమ్మవారి ప్రసాదాలైన చక్రపొంగలి, పులిహోర, లడ్డూ.. మిగతా ఆలయాలతో పోలిస్తే రుచిగా, నాణ్యంగా ఉండేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులకు శుద్ధిచేసిన తాగునీరు అందిస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4వరకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. రాత్రివేళ 800 నుంచి వెయ్యి మందికి భోజన వసతి కల్పిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులకు బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆధునికీకరించారు. ఆధునిక అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు.

దురుసు ప్రవర్తన..అధిక వసూళ్లు..

★ ఆలయానికి వచ్చే భక్తుల మనసు చివుక్కుమనేలా కొన్ని ఘటనలు జరుగుతున్నాయి. నైపుణ్యం లేని భద్రత సిబ్బంది, టోల్‌గేట్ వద్ద ప్రైవేటు వ్యక్తుల దురుసు ప్రవర్తన, కొండపైన, దిగువన పూజా సామగ్రి విక్రయించే దుకాణాల్లోని వారి ఇబ్బందికరమైన తీరు, కొబ్బరికాయలు, పూజాద్రవ్యాల అధిక ధరలతో భక్తులను ఇబ్బంది పెడుతున్నారు. ★ చెప్పుల స్టాండ్, లగేజీ క్లోక్‌రూం, సెల్‌ఫోన్ కౌంటర్లలో నిర్ణయించిన ధరల బోర్డులు కనిపించకుండా చేసి మరీ ప్రైవేటు వ్యక్తులు రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారు. ★ దేవస్థానం క్యాలెండర్లు, ల్యామినేషన్ ఫొటోలు అమ్మే కౌంటర్లలో అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కొబ్బరికాయలు కొట్టేచోట గుత్తేదారు మనుషులు డబ్బులు వసూలు చేస్తున్నారు.
★ కేశఖండనశాలలో భక్తుల నుంచి టిక్కెట్ రుసుం కాకుండా అదనంగా వసూళ్లు చేస్తున్నారు. కౌంటర్లలో నుంచి వారికి రూ.5 చిల్లర కూడా ఇవ్వడం లేదు. ప్రసాదాల కౌంటర్లు, దేవస్థానం బస్సుల్లోనూ ఇదే జరుగుతోంది. ★ వీటిపై అధికారులు దృష్టి సారించకపోతే భక్తుల సంతృప్తి స్థాయిని అందుకోలేరు.

భాషపై మమకారం.. సాహిత్య సహకారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్న చింతలపాటి

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు ఎందరో కృషి చేస్తుంటారు. కానీ మచిలీపట్నానికి చెందిన డా.చింతలపాటి మోహన మురళీకృష్ణ ఉద్యోగాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు తెలుగులో ఎంఏ చేసేలా ప్రోత్సహిస్తున్నారు. 50 ఏళ్లుగా వందలాది సాహిత్య సభలు నిర్వహిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులకు అమ్మ భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని వాఙ్మయి పేరిట అంతర్జాతీయ తెలుగు సాహితీ వేదిక ఏర్పాటు చేశారు. దీని ద్వారా తనతో పాటు పండితులు మేడసాని మోహన్, ఆర్.అనంత పద్మనాభరావు, ధూళిపాళ మహాదేవమణి, కడిమెల్ల వరప్రసాద్, పాలపర్తి శ్యామలానందప్రసాద్, వోలేటి పార్వతీశం, రఘునాథశర్మ లాంటి వందమంది పండితులతో తెలుగు భాషా సాహిత్యాలపై ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆస్ట్రేలియా, సింగపూర్, న్యూజిలాండ్, మలేషియా తదితర దేశాల్లోని ప్రవాస భారతీయులు, వారి పిల్లలకు తెలుగులో పద్యాలు, చందస్సులులపై శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేక అవకాశం కల్పించి.. ఈయన చొరవతో ప్రస్తుతం 40 మంది ప్రవాస భారతీయులు ఆంధ్రా విశ్వవిద్యాలయం ద్వారా ఎంఏ తెలుగు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం విశ్వవిద్యాలయ ప్రతినిధులతో చింతలపాటి మాట్లాడి ప్రత్యేక అవకాశం కల్పించారు. ఉపాధ్యాయుడిగా పని చేసిన ఈయన 5వేల పద్యాలతో 25 పద్యగ్రంథాలు రచించి రచయితగా, కవిగా రాణిస్తున్నారు. కావ్య కళా ప్రవీణ, సిరి కవి, సహజ కవితా కళాభిజ్ఞ లాంటి బిరుదులు, ప్రభుత్వ పరంగా ఉగాది పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

ఆత్మవిశ్వాసమే నడిపిస్తోంది..

విధి వక్రించినా ఆత్మవిశ్వాసం నింపుకొని ఒంటి చేత్తో ట్రాక్టరును నడుపుతూ స్ఫూర్తిగా నిలిచాడు ఆ యువకుడు. నందిగామ మండలం మాగల్లు గ్రామానికి చెందిన యలమందల నాగేశ్వరరావు ట్రాక్టర్ డ్రైవర్. ఏడాది కిందట వరిగడ్డిని చుట్టే యంత్రంలో ప్రమాదవశాత్తూ చేయిపడింది. వెంటనే ఆసుపత్రికి వెళ్లినా వైద్యులు భుజం వరకు ఆయన ఎడమ చేయిని తొలగించి శస్త్రచికిత్స చేశారు. ప్లాస్టిక్ చేయి పెట్టినా అది పనిచేయక ఇబ్బందిపడ్డారు. గతంలో పనిచేసిన యజమాని వద్దే ప్రస్తుతం వరిగడ్డిని చుట్టే యంత్రం ఉన్న ట్రాక్టరును ఒంటి చేత్తో నడుపుతున్నారు. గతంలో డ్రైవర్‌గా పనిచేసిన అనుభవం, ఆత్మవిశ్వాసంతో ట్రాక్టరు నడుపుతూ బతుకు బండి లాగుతున్నారు. ఆయన భార్య భవానీ హోటల్ నడుపుతుండగా.. ఆమెకు హోటల్ పనుల్లో సైతం సాయపడుతూ వైకల్యాన్ని జయించారు.
- మాగల్లు(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే

నేడు రాజధానిలో బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటన

తుళ్లూరు: అమరావతిలో సోమవారం ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ప్రతినిధుల బృందం పర్యటించనుంది. రహదారులు, భవన నిర్మాణాలు, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి, ఎల్‌పీఎస్ లేఔట్లు, రిజర్వాయర్ నిర్మాణ పనులు పరిశీలించనున్నారు. హైకోర్టు, ఎన్‌జీవో భవన సముదాయాలు, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తారు.

ధనుర్ధారి తపోస్థలం.. పార్థీశ్వరాలయం

ఇంద్రకీలాద్రిపై ద్వాపర యుగంలో అర్జునుడు పాశుపతాస్త్రం కోసం శివ తపస్సు చేసినట్లు చరిత్ర. అర్జునుడిని పరీక్షించేందుకు కిరాత రూపంలో శివుడు ఇంద్రకీలాద్రిపై ప్రత్యక్షమయ్యాడు. ఆ సమయంలో అర్జునుడు వేసిన బాణానికి చనిపోయిన వరాహం తనదని కిరాత రూపంలో ఉన్న శివుడు అర్జునుడితో యుద్ధం చేస్తాడు. అర్జునుడి తపస్సు, పరాక్రమానికి శివుడు మెచ్చి ప్రత్యక్షమై పాశుపతాస్త్రాన్ని ప్రసాదించినట్లు మహాభారతంలోని అరణ్య పర్వంలో ఉంది. అర్జునుడు తపస్సు చేసిన చోట శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడు. ఆ ప్రాంతమే పార్థీశ్వరాలయం. కాలక్రమంలో విష్ణువర్ధన మహారాజు ఆస్థానంలో పని చేసే ఉద్యోగి ఆలయం నిర్మించినట్లు చరిత్ర తెలియజేస్తుందని ఆర్కియాలజిస్టు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. ఆదరణ కరవై పార్థీశ్వరాలయం జీర్ణావస్థకు చేరిందని చెప్పారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.
– ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

జీర్ణావస్థలోని పార్థీశ్వరాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్కియాలజిస్టు ఈమని శివనాగిరెడ్డి

పండగ పూట.. పప్పన్నం లేదా?

కూటమి సర్కారు అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా కందిపప్పు ఊసే లేకపోవడంపై కార్డుదారులు పెదవి విరుస్తున్నారు. వైకాపా అరకొరగా కందిపప్పు సరఫరా చేయడంతో కూటమి సర్కారు వస్తే నిరవధికంగా కందిపప్పు వస్తుందని భావించినా నిరాశే మిగిలింది. ఇప్పటిదాకా లేకున్నా పెద్ద పండగ నాటికైనా అందుబాటులోకి వస్తుందా అంటూ రేషన్ డీలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఆర్థిక భారం పడుతోందని పేదలు వాపోతున్నారు.
– ఈనాడు, అమరావతి

- ✧ ఉమ్మడి జిల్లాలో కార్డులు: 11,07,933
- ✧ మొత్తం రేషన్ దుకాణాలు: 2,016
- ✧ ఎంఎల్ఎస్ పాయింట్లు: 14
- ✧ సరఫరా చేయాల్సింది: 1,108 మె.ట
- ✧ రేషన్ దుకాణంలో కేజీ కందిపప్పు: రూ.60
- ✧ మార్కెట్‌లో కందిపప్పు ధర: రూ.120

మార్కెట్‌లో రెట్టింపు ధర..

గత తెదేపా పాలనలో ప్రతి నెలా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, వంటనూనె, చింతపండు, సబ్బులు, రాగి పిండి ఇలా చాలా వస్తువులు సరఫరా చేసేవారు. వైకాపా వచ్చాక ఈ విధానాన్ని పూర్తిగా నీరుగార్చింది. కూటమి సర్కారు వచ్చాక తిరిగి ప్రారంభించలేదు. రేషన్‌లో ఇచ్చే బియ్యం, కందిపప్పు, పంచదారపై ఆధారపడే కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వీరందరూ అధిక మొత్తానికి బయట కందిపప్పు కొనుగోలు చేస్తున్నారు. చౌక దుకాణాల్లో సరఫరా చేసే కందిపప్పు కేజీ రూ.60కి మించి ఉండదు. బయట మార్కెట్‌లో రూ.120 పైమాటే. కార్డుదారులకు రెట్టింపు భారం పడుతోంది. కందిపప్పు సరఫరా విషయంపై చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేసే గుత్తేదారుడి కోసం అన్వేషిస్తున్నారు. ఈ అంశంపై ఎన్టీఆర్, కృష్ణా డీఎస్వోలు పాపారావు, మోహన్‌రావు మాట్లాడుతూ..ప్రభుత్వం సరఫరా చేస్తే పంపిణీ చేస్తామని తెలిపారు.



సాంకేతిక ఆధారాలతో చిక్కారు

- ☛ సీడీఆర్ విశ్లేషణలో నిందితుల మధ్య భారీగా కాల్స్
- ☛ నకిలీ మద్యం కేసులో కీలకంగా మారిన వైనం

ఈనాడు, అమరావతి



నకిలీ మద్యం కేసులో సాంకేతిక ఆధారాలు కీలకంగా మారాయి. నిందితుల పాత్రను నిరూపించే పలు ఆధారాలు వారి ఫోన్లలోనే లభించాయి. వారి మధ్య సాగిన చెల్లింపులు, వాటి తాలూకు స్క్రీన్‌షాట్లు, లేబుళ్ల డిజైన్లు, సంభాషణలు పక్కాగా దొరికాయి. నిందితులు ఉపయోగించిన ఫోన్‌నంబర్ల తాలూకు సీడీఆర్ (కాల్ డీటెయిల్ రికార్డ్స్)లు, టవర్ లొకేషన్లను సిట్, ఎక్సైజ్ అధికారులు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ల నుంచి సేకరించారు.

● **ఇబ్రహీంపట్నంలో కుట్రకు శ్రీకారం:** ఇబ్రహీంపట్నంలోనే అక్రమ, నకిలీ మద్యం కుట్రకు బీజంపడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ1) ఫోన్ నంబరు లొకేషన్ ఇబ్రహీంపట్నంలోనే 549 రోజులు చూపించింది. ఈ రోజుల్లో 31వేలు పైగా కాల్స్ ఉన్నట్లు గుర్తించారు. మరో నంబరు 14వేలకు పైగా కాల్స్ ఉన్నాయి. ఈ లొకేషన్ 522 రోజులు ఇక్కడే ఉన్నట్లు చూపించింది. అద్దేపల్లి జగన్మోహన్‌రావు (ఏ2) ఫోన్ నుంచి 36వేల కాల్స్ ఉన్నాయి. 684 రోజులు ఇదే లొకేషన్ చూపించింది. ఇక్కడి నుంచే కుట్ర సాగిందనడానికి ఇవి కీలకంగా తోడ్పడ్డాయి. క్షేత్రస్థాయిలో రవాణా పరంగా కట్టా రాజు (ఏ6) ప్రధాన భూమిక పోషించాడు. ప్రదీప్‌దాస్ (ఏ8), మిథున్‌దాస్ (ఏ9)లు సామగ్రిని అందుకోవడం, నకిలీ సరకు రవాణాలో క్రియాశీలకంగా వ్యవహరించారు. వీరితో పాటు ఎన్.రవి (ఏ4), సయ్యద్ హాజీ (ఏ5) లొకేషన్లు ఎక్కువ రోజులు ఇబ్రహీంపట్నంలోనే చూపించాయి. స్పిరిట్‌ను సరఫరా చేసిన బాలాజీ (ఏ3)నంబరు.. 34రోజులు, 124 కాల్స్, మరో నంబరు 23రోజులు, 49 కాల్స్ నమోదయ్యాయి. అంతదాస్ (ఏ10), కల్యాణ్ (ఏ12), శ్రీనివాస్‌రెడ్డి (ఏ11) వివరాలు సీడీఆర్ విశ్లేషణలో దొరికాయి. వీరంతా తరచూ ఒకే టవర్ లొకేషన్ పరిధిలోకి రావడం కుట్రలో వీరి పాత్రను తేటతెల్లం చేస్తోంది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులోనూ జనార్దన్‌రావు, రాజు, హాజీ, రవి, బాలాజీ, సుదర్శన్ తదితరుల టవర్ లొకేషన్లు చూపించాయి.

జనార్దన్‌రావు నుంచి ఎన్.రవి, హాజీ, కట్టా రాజు, అంగలూరు వెంకట కల్యాణ్, చెక్కా సతీష్, జోగి రాము, సుదర్శన్ తదితరుల మధ్య చాలా కాల్స్ ఉన్నాయి. పలు దఫాలు నకిలీ మద్యం వ్యవహారంపై సంభాషణలు సాగించినట్లు వెలుగులోకి వచ్చింది. జగన్మోహన్‌రావు ఫోన్ల నుంచి బాలాజీ, రవి, హాజీ, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, చెక్కా సతీష్, జోగి రాము, సుదర్శన్‌లకు ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్ ఉన్నాయి. వీటి ఆధారంగా నకిలీ మద్యం వ్యవహారంలో ప్రధాన కుట్రదారుడిగా జనార్దన్‌రావుగా తేలింది. మిగిలిన నిందితులతో సమన్వయం చేసుకోవడం, వ్యవహారాన్ని అమలుచేయడంలో జగన్మోహన్‌రావు పాత్ర ఉన్నట్లు తేలింది. 2023 అక్టోబరు 10 నుంచి 2025 సెప్టెంబరు 29 వరకు నిందితుల సీడీఆర్‌ల విశ్లేషణలను పరిశీలిస్తే.. ఏ1 పలు దఫాలు హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. అక్రమ మద్యం, ఈ7 బార్ నిర్వహణ, తదితర పనులకు సంబంధించి వెళ్లినట్లు తేలింది. లేబుళ్లు, మూతలు, హోలోగ్రామ్‌లు, ఇతర ప్యాకేజింగ్ సామగ్రినీ హైదరాబాద్‌లోనే సమకూర్చుకున్నాడు.

దుకాణం పెట్టనివ్వరు.. మద్యం ముట్టనివ్వరు!

అవకాశం వస్తే మద్యం దుకాణాలకు పోటీపడి ఆదాయం పొందేందుకు తీవ్రంగా ప్రయత్నించే వారిని చూశాం. కానీ కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామం ఇందుకు పూర్తి భిన్నం. అక్కడ పెద్దలు.. ప్రజారోగ్యం, గ్రామాభివృద్ధికి దోహదపడే ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం విక్రయాలు కానీ, గొలుసు దుకాణాలు కానీ లేకుండా ఉండేలా అందరూ కలిసి కట్టుబాటు చేసుకున్నారు. ఏళ్లుగా ఈ నిర్ణయాన్ని పక్కాగా అమలు చేస్తూ స్ఫూర్తిబాటలో నడుస్తున్నారు. ఈ గ్రామ జనాభా 15వేలకు పైనే. అత్యధికులు చిరు వ్యాపారులే. గతంలో మద్యం తాగిన వారికి జరిమానా కూడా విధించిన సందర్భాలున్నాయని, ఏళ్లుగా మద్యం అమ్మకాలను మాత్రం అనుమతించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని గ్రామస్థులంతా ఒకే మాటగా పాటిస్తున్నారని సర్పంచి షేక్ షబ్బీర్ తెలిపారు.
– పెండ్యాల(కంచికచర్ల), న్యూస్‌టుడే

శ్రీ సాయి పీతాంబరి శారీస్
డిజైనర్ శారీస్ ప్రదర్శన మరియు అమ్మకం
డిసెంబర్ 9, 10, 11 మరియు 12 వ తేది వరకు మాత్రమే. ఎగ్జిక్యూటివ్ క్లబ్, రమేష్ హాస్పటల్ ప్రక్కన, విజయవాడ. రాజా అక్కినేని ఏలూరు ఫోన్: 9100599599. సేల్

కొనసాగుతున్న సాగునీటి విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వివిధ పంటల అవసరాల నిమిత్తం నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీటి విడుదల కొనసాగుతోంది. రానున్న జనవరి 15వ తేదీ వరకు వ్యవసాయానికి నీటి అవసరాలు ఉంటాయని జలవనరుల శాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 5,307 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 3,211, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 2,010, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 2,306, కేఈబీ (దివిసీమ) 403, ఏలూరు 401, బందరు కాలువకు 101 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

వాగు పోయే.. వాడ వచ్చే..

విజయవాడ వన్‌టౌన్ ప్రాంతమంతా పూర్వం వాగులు, వంకలు, చెరువులు, కొండలతో దర్శనమిచ్చేది. అక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకున్న కుమ్మరి కుటుంబాలు కుండలు తయారు చేయడానికి మట్టి తీసే క్రమంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని తవ్వేవారు. కాలానుగుణంగా అది కాస్తా చెరువుగా మారింది. చిట్టినగర్ సెంటర్ నుంచి కొత్తపేట పోలీస్‌స్టేషన్ వరకు ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని వాగు సెంటర్‌గా పిలిచేవారు. 1916లో వీరాంజనేయ స్వామి ఆలయం నిర్మించడంతో ఆ ప్రాంతాన్ని ఆంజనేయ వాగు సెంటర్‌గా పిలవడం మొదలు పెట్టారు. గతంలో వర్షం పడినప్పుడు ఈ వాగు ఉద్ధృతంగా ప్రవహించేది. 1947లో రజాకారుల గొడవలు కారణంగా ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి నిర్వాసితులు బెజవాడకు తరలివచ్చారు. వారందరూ ఆంజనేయస్వామి ఆలయం పక్కన కనిపించిన ఖాళీ ప్రదేశంలో, కాలానుగుణంగా కొండలపై ఇళ్లు నిర్మించుకున్నారు.
- చిట్టినగర్, న్యూస్‌టుడే

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఈ నెల 8న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ ఎస్.ఇలక్కియా తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా విజయవాడ

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా విజయవాడ ఎదుగుతోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. దేశంలోనే ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతికంగా ఇది సుసంపన్నమైన నగరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'కృష్ణవేణి సంగీత నీరాజనం-2025' ముగింపు వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సంగీతోత్సవాలతో విజయవాడ దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా మరింత ఉన్నత స్థానానికి చేరిందన్నారు. 'ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణకు.. చెందిన కళాకారులు పాల్గొని అద్భుత సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యం, నాటకం, సంగీతం సహా అన్ని కళలకు నిలయం ఆంధ్రప్రదేశ్. ప్రపంచానికి.. కూచిపూడి శాస్త్రీయ నృత్యాన్ని బహూకరించిన నేల ఇది. దక్షిణ భారత సంగీతంలో ప్రముఖ రచనలు చేసిన వారు ఆంధ్రులే. జానపద కళారూపాలలో.. బుట్టబొమ్మలు, కోలాటం, వీరనాట్యం, బుర్ర కథ, థింసా.. ఇవన్నీ ఇక్కడ అత్యంత ప్రజాదరణ పొందినవే..' అని గవర్నర్ పేర్కొన్నారు. ఇలాంటి అనేక అద్భుత కళారూపాలు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని సుసంపన్నం చేశాయన్నారు.



'సంగీత నిరాజనం' చిత్తరువు ఆవిష్కరించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్. పక్కన మల్లాది రవిశంకర్, జేసీ ఇలక్కియా, మల్లికార్జునరావు, వెంకటరామన్ హెగ్డే

పర్యాటకాభివృద్ధికి కళలు దోహదం

కేంద్ర పర్యాటక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ వెంకటరామన్ హెగ్డే మాట్లాడుతూ. సాహిత్య కళలు పర్యాటకాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని చెప్పారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో ఎంతో మంది ప్రముఖ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. ప్రజల నుంచి చక్కని సహకారం లభించిందన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఐదు ఈవెంట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో ఉత్సవం మూడోదని తెలిపారు. వైద్యం, వ్యాపారం, హెరిటేజ్-కల్చర్, ఆధ్యాత్మిక యాత్రలు తదితరాలను కేంద్రం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఇలక్కియా, సాంస్కృతిక సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, సంగీత విద్వాంసులు మల్లాది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుక్మిణి శ్రీకృష్ణ సంగీత విభావరి కార్యక్రమం

అనుభవాల్లోంచే.. కథలు పుట్టుకొస్తాయ్

కాలంతో పాటే కొత్తగా.. విభిన్న కోణాల్లో రచనలు

'కథ 2024' సంకలనం ఆవిష్కరణలో సాహితీవేత్తలు

కథ 2024 పుస్తకంలో ప్రచురితమైన కథలు రచించిన రచయితలతో ముఖాముఖీ కార్యక్రమం

ఈనాడు, అమరావతి - విజయవాడ సాంస్కృతికం, కానూరు, న్యూస్‌టుడే

'జీవిత అనుభవాలు, ఆలోచనల్లో నుంచే కథలు పుట్టుకొస్తాయి. కాలంతో పాటే కొత్త కథలు జాలువారుతున్నాయి. సామాజిక రీతులను ప్రతిబింబిస్తూ విభిన్న కోణాలు ఆవిష్కృతమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల జోరు పెరిగినా సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమైనా.. కథల విస్తృతి పెరుగుతుందే తప్ప తగ్గలేదు.' అంటూ పలువురు సాహితీవేత్తలు, రచయితలు అభిప్రాయపడ్డారు. విజయవాడ పి.బి.సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన కథ-2024 సంకలనం ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో సాహితీ వేత్తలు తరలివచ్చారు. అనంతరం కథాసాహితీ సహాయ సంపాదకులు ఎ.వి.రమణమూర్తి, కొప్పర్తి రాంబాబు ఆధ్వర్యంలో.. సంకలనంలో ప్రచురితనమైన కథల రచయితలతో ముఖాముఖి నిర్వహించారు. రచయితలు పతంజలిశాస్త్రి, కొట్టం రామకృష్ణారెడ్డి, జి.లక్ష్మి, శీలం సురేంద్ర, అశ్వనీకుమార్, శ్రీనివాసమూర్తి, డాక్టర్ కె.వి.రమణారావు, సుజాత వేల్పూరి, పాలగిరి విశ్వప్రసాద్, జి.ఉమామహేశ్వర్, పలాస సినిమా దర్శకుడు, రచయిత కరుణకుమార్.. తదితరులు తాము రాసిన కథా నేపథ్యాలను వివరించారు.

కథతో ఇష్టంగా 35ఏళ్ల ప్రయాణం..

కథ సంకలనం 1990లో ప్రారంభించగా.. 1991లో మొదటి పుస్తకం ప్రచురితమైంది. పుస్తక సంపుటిని 1991 డిసెంబరు నెలలో హైదరాబాద్‌లోని ద్వారాకా హోటల్‌లో చేకూరి రామారావు ఆవిష్కరించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు, కుమార్తె రావడం ఆనందంగా ఉంది. గత 35 ఏళ్లుగా కథలతో మా ప్రయాణం చాలా ఇష్టంగా చేస్తున్నాం. మూడున్నర దశాబ్దాలుగా తెలుగులో ఇన్ని సంకలనాలు మరేవీ లేవు.
-వాసిరెడ్డి నవీన్, కథాసాహితీ సంపాదకులు

కథల్లోని పాత్రలు వెంటాడుతున్నాయి..

కథ 2024 పుస్తకంలోని 17 కథలు చదివిన తరువాత పుస్తకం మూసేసినా కొన్ని పాత్రలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రతి కథలోని పాత్ర నిర్మాణం చాలా చక్కగా ఉంది. కొన్ని కథల్లోని పాత్రలు.. ప్రస్తుత సమాజంలోని పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. వ్యవస్థ ఎంత గందరగోళంలో ఉందో చెబుతున్నాయి. అన్ని కథలూ చదివించేలా ఆసక్తిని పెంచేలాగానే ఉన్నాయి. **-ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, రచయిత, సమీక్షకులు**

కొత్త కథలు విభిన్నంగా ఉన్నాయ్..



కథలన్నీ చదివిన తరవాత పాఠకుడిగా కథాసాహితిపై మరింత గౌరవం పెరిగింది. 35 ఏళ్లుగా ఈ పుస్తకాన్ని తీసుకురావడం ఆనందంగా ఉంది. కొత్త, యువ రచయితలు రాసిన కథలు చాలా ఆసక్తిని పెంచుతున్నాయి. కథలు ఎంచుకునే విషయంలో విభిన్నం, వైవిధ్యం చూపుతున్నారు. కార్యక్రమానికి సహకరించిన సిద్ధార్థ కళాపీఠానికి నా కృతజ్ఞతలు.
- పాపినేని శివశంకర్, కథాసాహితీ సంపాదకులు

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ఆలయ ప్రాంగణంలో రద్దీ

కనకదుర్గానగర్ మార్గంలో..

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. భవానీ దీక్షల విరమణ నిమిత్తం క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో వాహనాలను నిలపడం సమస్యగా మారింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని అమ్మవారి నివేదన సమయంలో వీఐపీ టికెట్లు, అంతరాలయ దర్శనాన్ని నిలిపి వేయడంతో రూ.100, రూ.300 దర్శనం టికెట్ల విక్రయాలు పెరిగాయి. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. దేవస్థానం ఈవో శీనానాయక్ క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు పేర్కొన్నారు. - **ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే**

పది మంది ఎస్సైల బదిలీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ నగర పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డ్ శనివారం సమావేశమై.. బదిలీలకు ఉత్తర్వులు జారీ చేశారు. పది మంది ఎస్సైలను శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. కాగా.. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించిన నూతన ప్రొబెషనరీ ఎస్సైలకు ఈ బదిలీల్లో పోస్టింగ్‌లు దక్కాయి. మొత్తం 49 మంది ఎస్సైలను శిక్షణ నిమిత్తం నగరంలోని పోలీస్‌స్టేషన్లకు కేటాయించారు. అక్కడ శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత వారిని కేటాయించిన పోలీస్ స్టేషన్లకు పంపిస్తారు.

'పరకామణి కేసుపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు'

పటమట, న్యూస్‌టుడే: భక్తుల మనోభావాలు పట్టించుకోకుండా పరకామణి చోరీ కేసు చాలా చిన్నదంటూ మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న విమర్శించారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరకామణి చోరీ కేసులో నిందితుడు రవికుమార్ తాను మహాపాపం చేశానని అంగీకరిస్తే.. రూ.లక్షల కోట్లు దోచుకున్న జగన్‌కు మాత్రం అది చిన్న కేసుగా కనిపిస్తోందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యాపారం ద్వారా అన్ని రూ. కోట్లు సంపాదించిన రవికుమార్‌కు పరకామణి చోరీ చేయాల్సిన అవసరం ఎందుకు ఉంటుందని, దీని వెనుక పెద్ద కుట్రకు పథకం రూపొందించారని ఆరోపించారు. పరకామణి కేసులో తాడేపల్లి ప్యాలెస్‌కు ఉన్న లింకులు త్వరలోనే బయటపడతాయన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన జగన్, మోకాళ్లపై కూర్చొని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ బుద్ధా వెంకన్న డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ఇంకోసారి చేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.

ఇటీవల నిర్వహించిన కృతజ్ఞత సభ క్లిప్పింగ్స్‌ను సీఎంకు చూపిస్తున్న వెంకటేశ్వరరావు మాదిగ

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. వర్గీకరణ చేసి 59 కులాలకు సామాజిక న్యాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం ఆయన సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. సంక్షేమ పథకాల అమలులో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరినట్లు వెంకటేశ్వర రావు మాదిగ తెలిపారు.

9 నుంచి అమరావతి బాలోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అమరావతి బాలోత్సవం-8.. ఈ నెల 9వ తేదీ నుంచి 11 వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్వీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావులు తెలిపారు. ఈ కార్యక్రమ గోడపత్రులను ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పిల్లల పండుగను పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవం కోసం అనే నినాదంతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 43 అకడమిక్, 17 కల్చరల్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు ప్రాంగణాలు, 5 గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 12 వేల మంది పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, బాలోత్సవ వ్యవస్థాపకులు, కొత్తగూడెం బాలోత్సవం కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, బెంగళూరుకు చెందిన నవస్పంద హెడ్ ఫర్ జనరేషన్ ప్రతినిధి కె.రాఘవరాజులు నాయుడు హాజరవుతారని తెలిపారు. గోడపత్రుల ఆవిష్కరణలో ఆఫీస్ బేరర్స్ సాంబిరెడ్డి, పిన్నమనేని మురళీకృష్ణ, ఎస్.విద్యాకన్నా, యువీ రామరాజు, వల్లభరావ్, వై.సుబ్బారావు, డీవీ రాజు, టి.క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రులు ఆవిష్కరిస్తున్న రామరాజు, సాంబిరెడ్డి, కొండలరావు, రామరాజు, విద్యాకన్నా తదితరులు

వాజ్‌పేయీ సేవలు దేశాభివృద్ధికి దోహదం

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతి ఉత్సవాల కార్యక్రమం నిర్వహణకు సంబంధించి విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో వార్ రూమ్‌ను మాధవ్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ తేదీ ధర్మవరంలో నిర్వహించే బహిరంగ సభకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించినట్లు తెలిపారు. ఏపీ అభివృద్ధికి వాజ్‌పేయీ ఆద్యుడని.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. టెలికం రంగం అభివృద్ధికి నాంది పలికారని వెల్లడించారు. యాత్ర రాష్ట్ర కన్వీనర్‌గా నాగోతు రమేష్‌నాయుడు, విభాగాల వారీగా నాయకులను నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాగోతు రమేష్‌నాయుడు, అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, నాయకులు ఎస్.కె.బాజీ, బి.నాగలక్ష్మి, గోపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వార్‌రూమ్ ప్రారంభిస్తున్న మాధవ్, పక్కన రమేష్‌నాయుడు, యామిని శర్మ

బీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బొల్లిపో మనోజ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. సంఘ నిర్మాణం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా భూపతి రామారావు, ప్రధాన కార్యదర్శిగా చిట్టేటి రమేష్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా కె.మోహనరావు, అసోసియేట్ అధ్యక్షులుగా పర్రె వెంకటరావు, పల్లం వేణుగోపాల్, బొల్లిపో మనోజ్‌కుమార్, కోశాధికారిగా ఎం.ఆర్.చక్రవర్తి, మహిళా కార్యదర్శిగా వి.మేరీతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నూకపోటి రమణయ్య, పరిశీలకుడు జి.ఆంజనేయులు ప్రకటించారు.

పోలీసుల అదుపులో రౌడీషీటర్ సాయి

సస్పెక్ట్ షీటర్ నవీన్ హత్య కేసు దర్యాప్తు వేగవంతం

పిల్ల సాయి

నందిగామ, జగ్గయ్యపేట(న్యూస్‌టుడే): జగ్గయ్యపేటలో సంచలనం సృష్టించిన సస్పెక్ట్‌షీటర్ నవీన్‌రెడ్డి హత్య కేసులో నిందితుడైన రౌడీషీటర్ పిల్ల సాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుడిని పట్టుకునే క్రమంలో పోలీసుల పైనే దాడికి యత్నించగా అతికష్టం మీద అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విజయవాడలో పలు కేసుల్లో ఉండడంతో ఇతడిపై రౌడీషీట్ తెరిచారు. మూడు రోజుల క్రితం జన్మదిన వేడుకల్లో బీరు సీసాలతో పరస్పరం దాడి చేసుకోగా సస్పెక్ట్‌షీటర్‌ను పిల్ల సాయి హత్య చేసిన సంగతి తెలిసిందే.

చిల్లకల్లుకు చెందిన అన్వేష్‌కు కుమార్తె జన్మించడంతో మూడు రోజుల కిందట స్నేహితులకు మందు పార్టీ ఇచ్చాడు. దీనిలో చిల్లకల్లుకు చెందిన ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నారు. మత్తులో నవీన్‌రెడ్డి, సాయిలు వాగ్వాదానికి దిగారు. ముందుగా నవీన్‌రెడ్డి బీరు సీసాతో దాడి చేయడంతో సాయికి ఎడమ చేతికి గాయమైంది. అనంతరం సాయి దాడి చేసి నవీన్‌రెడ్డిపై బీరుసీసాతో పొడవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్కూటీపై నందకిషోర్, అన్వేష్‌లు వైద్యశాలకు తరలించగా అప్పటికే నవీన్‌రెడ్డి మృతి చెందాడు.

ఆ ఐదుగురి నుంచి వివరాల సేకరణ

గత మూడు రోజుల నుంచి పార్టీకి హాజరైన ఐదుగురు వ్యక్తులను పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఏ సందర్భంలో అందరూ కలిసి పార్టీ చేసుకున్నారు. అక్కడ ఎన్ని గంటలకు కలిశారు. బీరు సీసాలతో దాడి చేసుకోవడానికి దారితీసిన కారణాలు గురించి లోతుగా విచారించారు. పార్టీకి అవసరమైన డబ్బులు ఎవరు ఖర్చు చేశారు? దీనిలో అన్వేష్ పార్టీ ఇచ్చి డబ్బులు ఖర్చు చేసినట్లు భావిస్తున్నారు. ముందుగా చిల్లకల్లులో కలిసిన తర్వాత హత్య స్థలానికి ఏ సమయానికి వెళ్లారని ప్రశ్నించినట్లు తెలిసింది.

సీన్ రీకన్‌స్ట్రక్షన్ : ఎంసీఎల్ కర్మాగారానికి సమీపంలో ఉన్న ఘటనా స్థలానికి పార్టీకి హాజరైన ఐదుగుర్ని పోలీసులు తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. అలాగే చిల్లకల్లు, జగ్గయ్యపేట ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించారు. ఏడుగురు ఎన్ని గంటలకు కలిశారు? తర్వాత ఎక్కడికి వెళ్లారు? గాయాలైన సస్పెక్ట్‌షీటర్‌ను దేనిపైన వైద్యశాలకు తీసుకెళ్లారనే విషయాలు సీసీ కెమెరాల ఫుటేజీలో నమోదై ఉండడంతో వాటిని పరిశీలిస్తున్నారు. దీని ప్రకారం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దీనిలో హత్యకు పాల్పడిన రౌడీషీటర్ పైనే పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతానికి ఒక్కరినే నిందితుడిగా చేర్చారు. మిగిలిన ఐదుగురు ఘటనా స్థలంలో ఉండడంతో విచారిస్తున్నారు. వీరిలో ఇద్దరు నవీన్‌రెడ్డి ప్రాణాలు కాపాడేందుకు జగ్గయ్యపేట ప్రభుత్వ వైద్యశాల వరకు స్కూటీపై తీసుకెళ్లారు. వీరందర్నీ సాక్షులుగా పరిగణిస్తున్నట్లు సమాచారం. ఎంతకాలం నుంచి చిల్లకల్లులో నవీన్‌రెడ్డి, నిందితుడు ఉంటున్నారు? ఇక్కడ ఏమి చేస్తున్నారనే విషయాలను సేకరిస్తున్నారు. ఇక్కడే ఎందుకు ఉంటున్నారనే కోణంలోనూ జగ్గయ్యపేట పోలీసుల దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం.

తిరుపతమ్మ ఆలయంలో సౌకర్యాల కల్పనకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

భక్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో భక్తులకు సౌకర్యాలు మెరుగు పర్చేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 5న 'ఈనాడు'లో 'తిరుపతమ్మా.. తిప్పలు తప్పించమ్మా' శీర్షికతో వచ్చిన కథనానికి ఆలయ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి స్పందించారు. ఆదివారం ఆలయం వద్ద అమ్మవారి దర్శనం, ప్రసాదాలు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై భక్తులను అడిగి వివరాలు సేకరించారు. దర్శనం చేసుకున్న వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఉద్యోగులతో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. లడ్డూలు తెప్పించి భక్తులకు ఇచ్చి ఎలా ఉందో చూడాలని కోరారు. లడ్డు తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు దగ్గరి దారిలో ఆలయంలోకి వెళ్లేలా క్యూలైన్‌లో మార్పులు చేయాలని ఆలయ ఈఈ రమాను ఆదేశించారు. అనంతరం క్యూలైన్లు పరిశీలించారు. చంటి పిల్లలతో వచ్చే తల్లులకు తొందరగా దర్శనం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు సీఎం కృషి

లోగో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ప్రసాద్, అంకమ్మ చౌదరి, కిదాంబి శ్రీకాంత్, రవినాయుడు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు యోనెక్స్-సన్‌రైజ్ 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లోగో, పోస్టర్‌ను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, స్టార్ బ్యాడ్మింటన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి, శాప్ మాజీ ఛైర్మన్ పి.అంకమ్మ చౌదరిలతో కలిసి ఎంపీ శనివారం విజయవాడలోని ఒక హోటల్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ క్రీడల నిర్వహణ కోసం కావాల్సిన అన్ని క్రీడా మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నామని, విజయవాడలో పోటీల నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర రాజధానిలో క్రీడా వర్సిటీ, స్టేడియం ఏర్పాటు కానుందన్నారు. ఐజీఎంసీ స్టేడియం ఆధునికీకరణ పనులకు ప్లాన్ సిద్ధమైందని, త్వరలోనే సీఎం చంద్రబాబును కలిసి వివరాలను తెలియజేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. జింఖానా, విద్యాధరపురం మైదానాలను జాతీయ క్రీడల నిర్వహణకు అనుకూలంగా తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ విజయవాడలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనుండడం హర్షణీయమన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో మాట్లాడి రాష్ట్రంలో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. తిరుపతిలో కిడాంబి శ్రీకాంత్‌కు, విశాఖలో పీవీ సింధు, అమరావతిలో గోపీచంద్‌కు అకాడమీల ఏర్పాటుకు స్థలాలు కేటాయించామన్నారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఎంఎస్ఎన్ ప్రసాద్‌తో పాటు రాష్ట్ర, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పెనాల్టీల జీవో రద్దుకు డిమాండ్

గాంధీనగర్: జీవో నంబరు-21 ద్వారా పెనాల్టీలు పదుల రెట్లలో పెంచేశారని.. ఆ జీవోను రద్దు చేయాలని ఏపీ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారీ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15ఏళ్లు దాటిన ఆటోలకు రూ.3500, 20ఏళ్లు దాటిన వాటికి రూ.7వేల ఫీజు పెంచారని పేర్కొన్నారు. చాలీచాలని ఆదాయంతో రూ.వేలకు వేలు చలానాలు కట్టలేరని చెప్పారు. జీవో 21ని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. డి.శ్రీధర్‌బాబు, వై.అప్పారావు, రఫీ, వలీ, సి.హెచ్.సుబ్బారావు, సుమన్, శివరామ్, అప్పలస్వామి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

ధర వరలు

వంకాయలు-20/28, టమాటా-38, బెండ-42, పచ్చిమిర్చి-40, కాకర-36, బీర-40/44, క్యాలీ ఫ్లవర్-20/22, క్యాబేజి-24, క్యారెట్-42, దొండ-28, బంగాళదుంప-29, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-46, దోస-28, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-80, మునగ-20/18, ఆకు కూరలు (కట్ట)-3/7, కంద-40, బీట్‌రూట్-44, కీరదోస-32, బీన్స్-80/70, క్యాప్సికమ్-74, చింతకాయలు-60, నిమ్మ (డజను)-24/18, కొత్తిమీర-8/15, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/15 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK)
రిజిస్టర్డ్ ఆఫీస్: 29/1, 1వ అంతస్తు, శ్రీ యం.ఎస్. కృష్ణరావు రోడ్డు, లాల్‌బాగ్ వెస్ట్ గేట్ దగ్గర, బసవనగుడి, బెంగుళూరు-560004. Web: www.canfinhomes.com, Call: 7625079119.

పబ్లిక్ నోటీసు

మా విజయవాడ బ్రాంచి క్రొత్త ప్రాంగణానికి మార్చబడింది మరియు ది. 08.12.2025 నుండి క్రొత్త ప్రాంగణం నుండి పనిచేయడం ప్రారంభిస్తుందని మా కస్టమర్లందరికీ తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాము.
మా క్రొత్త బ్రాంచి చిరునామా డి.నెం. 40-9-54, 1వ అంతస్తు, అలాస్కా కాస్కేడ్స్, పటమట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ రోడ్డు, కళా నగర్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ, ఎన్.టి.ఆర్ జిల్లా, పిన్:520010.
మొబైల్ నెం. +91-7625079119, ల్యాండ్ లైన్: 0866-2474781, 2487131.
తేది: 05-12-2025 సం/-
ప్రదేశము: విజయవాడ బ్రాంచి ఇన్‌ఛార్జ్

91.9FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనుటకు. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనుటకు. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆83338 33368

బంగారం కొనుటకు. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

గాయత్రి గ్రూప్, VJA. వృద్ధులను, పేషెంట్స్ సేవకు, ఇంటి/ పనికి, దేవి కేర్‌కు వర్కర్లు/ పనివారు అందుబాటులో ఉన్నారు. ✆99590 21122, 96038 42233

TO LET

COMMERCIAL

విజయవాడ జీలు బెంజ్‌సర్కిల్ ఏరియా 4వ ఫ్లోర్ 1100 చ.గ సెల్, 24 అంతస్తు, 52 H.P. కరెంటు ఉన్నది అద్దెకు కలదు ✆ 99631 11303.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

విజయవాడలో BPT / B.Sc. మెడికల్ ల్యాబ్ / డిప్లొమా ఇన్ MLT, అనస్తీషియా, కార్డియాక్, డయాలసిస్, రేడియోగ్రఫీ, మెడికల్ ఇమేజింగ్ కోర్సులు. అర్హత: ఇంటర్. CQ / MQ సీట్లు - తక్కువ ఫీజు. స్కాలర్‌షిప్ / హాస్టల్స్ కలవు. ✆ 88866 54339.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, HDFC/ AXIS బ్యాంక్స్, క్లర్క్స్ కావలెను. ✆:76599 88728

REQUIRE FEMALE Admission Counsellors for Nakshatra Overseas. Sal: 16K + Incentives Work Place:Vijayawada. ✆ 96031 36899.

Wanted Electrical Engineers. Qualified By B.Tech Electrical Engineering, Diploma or ITI Experience 0-3 Years. Place of Work: East and West Godavari Districts, Attractive Salary. Contact: 79950 50571 or Send Resumes To hr@gvsprojectspvtltd.com

Lakshmi Spares Corporation Vijayawada. Authorised Dealer for Atlas Copco Air Compressors Wanted: Service Engineers Qul: B.Tech/ Diploma. Location: Krishna, Guntur & Prakasam. Note:Complete Field Work Send Your Resumes : hr.lakshmispares@gmail.com ✆ 90325 74443

Wanted Female Telecallers. Qul: any Degree, Salary: Up To 15000+Incentives, Job Location: Benzcircle, & Kankipadu. ✆98481 72444

WANTED
Telecallers (Female)
Marketing Executives (Field Work - Male)
to work at Vijayam Publications Hanumanpet, Vijayawada-3.
✆98854 79105

డ్రైవర్, కార్ల్ కొరియర్ సర్వీసెస్‌లో పర్సన్ కావలెను. జీ:20000 ను 29000 వయసు:18-35 ✆: 77309 59410.

VJA గాంధీనగర్ హోటల్ రూమ్స్ కావలెను. ✆ 81256 69996.

ఉడీత కెరీర్ మిషన్ టైపింగ్ MS Office టాలి Hardware & Networking, CCNA, 18- 26 VJA. ✆ 79811 40437,63028 26034

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:20k. ✆ 89776 39662, 89776 39663.

E-Kart నందు అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Qly: Inter Any డిగ్రీ జీ: 15,000/- Online Available. 93819 12123, 77318 16950

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

నందిగామ

●నందిగామ ●జగ్గయ్యపేట

ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నందిగామ గ్రామీణం: నందిగామ శ్రీ అక్షర జూనియర్ కళాశాలలో ఆదివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్ విద్యార్థులకు 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అన్న అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో కళాశాల ఇంటర్ విద్యార్థులు ఆర్. హేమచంద్రసాయి, కె.సాయిశ్రీనివాస్, పమిడిపాటిహరిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ గడుపూడి కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ కొణకంచి కిరణ్ లు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు.

విజేతలతో శ్రీఅక్షర కళాశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ కిరణ్

సైనికులకు రుణపడి ఉన్నాం

నందిగామ, న్యూస్‌టుడే: సరిహద్దుల్లో ఉంటూ దేశాన్ని కాపాడుతున్న సైనికులకు అందరూ రుణపడి ఉంటారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విరాళాల సేకరణ చేపట్టారు. మాజీ సైనికులు, వారి పిల్లల సంక్షేమానికి సౌమ్య విరాళం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సైనిక సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వడం సామాజిక బాధ్యత అని అన్నారు. దేశ రక్షణలో గాయపడిన సైనికులు, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని చెప్పారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

విరాళం ఇస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

★ నందిగామ నుంచి అనాసాగరం గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్‌కు నాలుగు చోట్ల లీకుల య్యాయి. ఈ విషయాన్ని మున్సిపల్ ఏఈ పత్తిశ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి మరమ్మతులు చేయించారు. ★ స్థానిక ముక్కపాటి కాలనీలో రెండు చోట్ల వీధి దీపాలు వెలగట్లేదు. దీనివల్ల రాత్రివేళ వీధిలో చీకటిగా ఉండడం వల్ల ఇబ్బందిపడుతున్నట్లు స్థానికులు మున్సిపల్ వైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి మరమ్మతులు చర్యలు తీసుకున్నారు. ★ స్థానిక 19, 20వ వార్డుల్లో కాలువల నుంచి తీసిన పూడిక మట్టిని అక్కడే వదిలేశారని స్థానికులు.. కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపి పూడిక తీయించి శుభ్రం చేయించారు. ★ స్థానిక ఒకటో వార్డులో డ్రైనుల్లో పూడిక పేరుకుని మురుగునీరు దిగువకు వెళ్లట్లేదని దీనివల్ల దుర్గంధం వస్తోందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనును శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, నందిగామ

చిల్లకల్లు ఎస్సై-2గా సాయి మణికంఠ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు పోలీస్ స్టేషన్ ట్రైనీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సాయి మణికంఠ ఆదివారం చిల్లకల్లు ఎస్సై-2గా బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

ఈఈగా రవికిషోర్ బాధ్యతల స్వీకరణ

ఇబ్రహీంపట్నం: విజయవాడ రూరల్ డిస్కం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా రవికిషోర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏపీ విద్యుత్తు నిర్వహించిన వసంతరావు పదోన్నతిపై విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రెగ్యులర్ పోస్టు నియామకం జరిగే వరకూ రవికిషోర్ ఇన్‌ఛార్జిగా ఉంటారని ఆదేశాలు జారీ అయ్యాయి.

బాలింతలు.. గర్భిణులకు వరం

పీఎం మాతృవందన యోజనలో ప్రోత్సాహకాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

బాలింతలకు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన ద్వారా నగదు ప్రోత్సాహకాలు మంజూరు చేస్తున్నారు. మొదటి, రెండు కాన్పులకు ఈ అవకాశం కల్పించారు. మొదటి కాన్పులో మగబిడ్డ, ఆడ బిడ్డను ప్రభుత్వాసుపత్రిలో ప్రసవిస్తే రూ.6 వేలు, ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవిస్తే రూ.5 వేలు ప్రోత్సాహకం మంజూరు చేస్తారు. రెండో కాన్పులో కేవలం ఆడ బిడ్డ జన్మిస్తేనే ఈ పథకం ద్వారా ప్రభుత్వాసుపత్రిలో ప్రసవానికి రూ.6 వేలు, ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవిస్తే రూ.5 వేలు వంతున ఆర్థికసాయం మంజూరవుతుంది. ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల ప్రోత్సాహకానికి, గర్భిణులు పోషకాహారం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా ఈ సాయం అందజేస్తోంది. దీనికి గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేస్తారు.

పోషకాహార కిట్లతో గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

నియోజకవర్గంలో అర్హులు..

మండలం	కాన్పు 1	2
నందిగామ పట్టణం	27	3
నందిగామ గ్రామీణం	55	6
చందర్లపాడు	93	27
కంచికచర్ల	103	5
వీరులపాడు	65	4

నాలుగు మండలాల్లో మొదటి కాన్పులో 343 మంది బాలింతలు, రెండో కాన్పులో 45 మంది బాలింతలకు ఈ పథకంలో అర్హులుగా నమోదయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులుగా నమోదు చేయించుకోవాలి. గర్భిణి రెండు టీటీ ఇంజక్షన్లు చేయించుకున్నాక రూ.3 వేలు, రోగనిరోధక టీకాలు వేయించాక రూ.2 వేలు, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవిస్తే రూ.వెయ్యి వంతున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. రెండో కాన్పులో ఆడ బిడ్డను ప్రసవిస్తే మూడు టీకాలు వేయించుకున్నాక రూ.5 వేలు, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం అయితే రూ.వెయ్యి వంతున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. మొదటి కాన్పులో ఆడ/మగ బిడ్డకు జన్మనిచ్చినా ఈ సాయం అందిస్తారు. రెండో కాన్పులో కేవలం ఆడబిడ్డను కంటేనే ఈ సాయం మంజూరవుతుంది.

పేర్లు నమోదు చేయించుకోవాలి

గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకుంటే సాయం మంజూరవుతుంది. ఒకవేళ నమోదు చేయించుకోని పక్షంలో ప్రసవం అయిన ఆరు మాసాల్లోగా నమోదు చేయించాలి. గతంలో పీహెచ్‌సీల్లో నమోదు చేసేవారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఐసీడీఎస్‌కు బాధ్యత అప్పగించారు. పేదల గర్భిణులకు ఉన్న సమయంలో పోషకాహారం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ప్రోత్సాహం అందజేస్తోంది. - లక్ష్మీభార్గవి, సీడీపీవో

నైపుణ్యాలు పెంపొందించుకుంటే విజయం

కానూరు, న్యూస్‌టుడే: న్యాయ విద్యార్థులు జ్ఞానసముపార్జన ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు అన్నారు. వీఆర్‌సిద్ధార్థ న్యాయ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జస్టిస్ చల్లాకొండయ్య మెమోరియల్ సిద్ధార్థ 4వ నేషనల్ లీగల్ ఫెస్ట్-2025 ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మూట్ కోర్టు పోటీల్లో ప్రథమ స్థానం పొందిన కర్ణాటకలోని మంగళూరు ఎస్‌డీఎం లా కాలేజీ విద్యార్థులు, ద్వితీయ స్థానంలో నిలిచిన కేరళలోని కోజికోడ్ గవర్నమెంట్ లా కాలేజీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. లీగల్ క్విజ్‌లో ప్రథమ బహుమతిని సిద్ధార్థ లా కాలేజీ, స్కూల్ ఆఫ్ లా విట్ ఏపీ యూనివర్సిటీ అమరావతిలు సాధించగా, ద్వితీయ బహుమతిని కేఎల్‌ఈఎఫ్ కాలేజీ ఆఫ్ లా విద్యార్థులు అందుకున్నారు. బెస్ట్ మూటర్ ఇన్ కోర్టుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన గవర్నమెంట్ లా కాలేజీ, బెస్ట్ మెమోరియల్ ఇన్ మూట్ కోర్టు, బెస్ట్ రీసెర్చర్ ఇన్ మూట్‌కోర్టుగా తమిళనాడులోని అంబేడ్కర్ లా యూనివర్సిటీ విద్యార్థులు నిలిచారన్నారు.

బోద వ్యాధి నిర్ధారణ పరీక్షలు

చందర్లపాడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం నుంచి బోదకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి సుమనిరూత్ తెలిపారు. 8వ తేదీన పొక్కునూరు, 9న కాసరబాదలో రాత్రి సమయంలో రక్త పరీక్షలు చేస్తామన్నారు. గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుపతమ్మ ఆలయాభివృద్ధికి సహకరించండి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మాజీ ఎంపీపీ వేగినేటి గోపాల కృష్ణమూర్తి కోరారు. ఈమేరకు తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు తొండపు దశరథ జనార్దన్‌తో కలిసి మంత్రిని శనివారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయం రెండోస్థానంలో ఆర్జేసీ అధికారి స్థాయి హోదాలో ఉన్న ఆలయాన్ని గత వైకాపా ప్రభుత్వం డిప్యూటీ కమిషనర్ స్థాయికి తగ్గించిందని వివరించారు. గత ప్రభుత్వంలో అమ్మవారి ఆదాయంతో పలు అక్రమ నిర్మాణాలు నిర్మించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మునేరు అవతలి వైపున అమ్మవారి మామిడితోటలో రూ.3 కోట్లతో ఏసీ కల్యాణ మండపాన్ని నిర్మించారని.. దీనిలో భోజన శాల ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆలయానికి ప్రతి శుక్ర, ఆదివారాల్లో వేలాది మంది భక్తులు వస్తున్నారని గ్రామంలో ట్రాఫిక్ సమస్య వస్తుందని చెప్పారు. దీన్ని నివారించేందుకు గ్రామంలోకి వాహనాలు రాకుండా మైత్రి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. వీటిపై మంత్రి ఆనం సానుకూలంగా స్పందించారని ఆదివారం పెనుగంచిప్రోలులో విలేకరుల సమావేశంలో గోపాల కృష్ణమూర్తి తెలిపారు.

మంత్రి రామనారాయణ రెడ్డికి సమస్యలు వివరిస్తున్న మాజీ ఎంపీపీ వేగినేటి పక్కన టీడీ జనార్దన్

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరులో జరిగిన ఎస్‌ఎఫ్ఐ 59వ జిల్లా మహాసభల్లో జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారని నూతన అధ్యక్షుడు టి.కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని తదితర సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వరావు, కుమార్ నాయక్, ప్రణీత, ప్రణయ్, కాజా, యాదవ్, ఉష, యశస్విని తదితరులను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

సజావుగా జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తిరువూరు ఎంఈవో-1, డీఈవో(నందిగామ) శ్యామ్ సుందరావు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అందించే ఈ స్కాలర్‌షిప్‌నకు ప్రతి ఏడాది వేలాది మంది పోటీ పడుతుంటారని చెప్పారు. ఈ పరీక్షకు సుమారు 500 వందల మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

చంద్రమౌళీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పూజల్లో పాల్గొన్న ఉదయభాను దంపతులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పురాతన చంద్రమౌళీశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, విమలాదేవి దంపతులు పాల్గొన్నారు. వారికి ఆలయ స్థానాచార్యులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ, ప్రధానార్చకుడు పల్లెపోలు శేషప్రసాద్ తదితరులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు సమర్పించారు.

రాఘవాపురం: పుష్పాలంకరణలో రామలింగేశ్వరస్వామి

సేవలు అభినందనీయం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ మహంకాళి వెంకన్నగురుస్వామి పీఠంలో అయ్యప్ప మాలధారుల మండల దీక్షలు ఆదివారం ముగిశాయి. మున్సిపల్ కమిషనర్ లోవరాజు, ఆర్మ్‌ఉర్బ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఏపూరి రాము, కుంచం సుజిత్, అయ్యప్ప మాలధారులు గురుస్వామి వెంకన్నను సన్మానించారు. గత 38 సంవత్సరాలుగా అయ్యప్ప సేవా సమితి ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అయ్యప్ప శరణు ఘోషతో ఆ ప్రాంగణం మార్మోగింది. ✦ మండలంలోని దాములూరు శివారు కూడలి శివాలయంలో సంగమేశ్వరస్వామికి, గోళ్లమూడి శివాలయంలో శంభులింగేశ్వరస్వామికి, రాఘవాపురం శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాభిషేకం నిర్వహించారు.

వెంకన్న గురుస్వామిని సన్మానించిన కమిషనర్ లోవరాజు, రాము, మాలధారులు

252 మందికి కంటి పరీక్షలు

శిబిరంలో తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, వెంకట నరసింహారావు తదితరులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని కొణకంచి, తోటచర్ల, నవాబుపేట గ్రామాల్లో జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో వైద్యులు కంటి వైద్య పరీక్షలు చేశారు. వైద్యశిబిరాన్ని తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ పరిశీలించారు. 40 రోజుల కిందట ఆయా గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించి 90 మందికి శంకర నేత్రాలయంలో శుక్లాల శస్త్ర చికిత్సలు చేయించారు. ఆదివారం వారికి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కొణకంచిలో 117, తోటచర్ల, నవాబుపేటలో 135 మందికి కంటి పరీక్షలు చేశారు. 67 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయాలని.. 166 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. మందులు పంపిణీ చేస్తామని కోఆర్డినేటర్ కట్ల వెంకట నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నెట్టెం దుర్గాభవాని, కసుకుర్తి దశరథ రామారావు, జి.హెచ్.వెంకటేశ్వరావు, సి.హెచ్.క్రాంతి, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దారుల దశ మారేదెప్పుడో?

కంచికచర్ల, న్యూస్‌టుడే

మండలంలోని పలు రహదారులు వాహనదారులకు నిత్యనరకం చూపిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వం వీటి అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. అనంతరం వచ్చిన కూటమి సర్కారు పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. దీంతో కంచికచర్ల-మున్నలూరు రహదారి అడుగడుగునా భారీ గుంతలతో అధ్వానంగా మారింది. ఇక్కడి గుంతల నడుమ రహదారిని వెతుక్కోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

★ కీసర-గండేపల్లి రహదారిలో నిత్యం స్థానిక ప్రైవేటు కర్మాగారానికి వచ్చి పోయే భారీ వాహనాల కారణంగా రహదారి ధ్వంసమైంది. ఈ మార్గంలో గుంతల కారణంగా నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ★ కంచికచర్ల-వేములపల్లి రహదారి రాళ్లు తేలి రాకపోకలకు అనువుగా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ★ మోగులూరు రహదారిలో భారీ గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. ★ ఇవేకాక పలు అంతర్గత రహదారులు సైతం అధ్వానంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ఆసుపత్రికి వచ్చే రోగులు, రోగుల బంధువులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ★ గొట్టుముక్కల ప్రధాన సెంటరులో దారి మొత్తం కంకర తేలి ప్రమాదకరంగా మారింది.

భారీ గుంతలతో మున్నలూరు రోడ్డు

బాల చైతన్య స్ఫూర్తి క్రీడా ఉత్సవానికి ఏర్పాట్లు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలో కొనసాగుతున్న బాల చైతన్య స్ఫూర్తికి 14 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభిస్తున్న క్రీడా ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. విద్యా సంస్థల పాల్గొనాలని సూచించారు. బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో క్రీడోత్సవం ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ.. తాళ్లూరు గెంటేల వెంకటరమణ స్ఫూర్తితో ప్రారంభించిన బాల చైతన్య స్ఫూర్తి ముప్పుడు మరింత ఉత్సాహ భరితంగా, ఇతర అంశాలకు కూడా విస్తరించి నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడలు, నైతిక విలువలపై బాల చైతన్య స్ఫూర్తి ద్వారా దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నూకల కుమార రాజా, నాయకులు మన్నె నారాయణరావు, ఎం.శ్రీనివాసరావు, పీఈటీలు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

రైతుల ఇళ్ల వద్ద పత్తి కొనుగోలు

నందిగామ, నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మునగచర్ల గ్రామంలో ఆదివారం నందిగామ ఏఎంసీ వైస్ ఛైర్మన్ అమ్మినేని జ్వాలాప్రసాద్, సీసీఐ బయ్యర్ జానకిరామయ్య, సంపత్ రైతుల ఇళ్ల వద్ద పత్తి నాణ్యత పరిశీలించి క్వింటా రూ.7750 నుంచి రూ.8110 వంతున కొనుగోలు చేశారు. మిగిలిన గ్రామాల్లోనూ రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సీసీఐ కేంద్రానికి రైతులు పత్తిని తీసుకువచ్చినా నాణ్యత లేదని తిరస్కరిస్తే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో రైతుల వద్దకు వెళ్లామని ఏఎంసీ వైస్ ఛైర్మన్ తెలిపారు. రైతులు యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని పత్తి విక్రయించుకోవాలని అన్నారు. నందిగామ ఏఎంసీ కార్యదర్శి వెంకటేశ్వరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిని పరిశీలిస్తున్న జ్వాలాప్రసాద్, సీసీఐ బయ్యర్

రౌడీషీటర్లకు సత్ప్రవర్తనపై అవగాహన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. జగ్గయ్యపేట, వత్సవాయి, చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సర్కిల్ పోలీసులు ఆదివారం బాలుర జడ్పీ స్కూల్లో సత్ప్రవర్తనపై ఆయన అవగాహన కల్పించారు. నేర ప్రవర్తనను మార్చుకొని సమాజంలో నూతన అడుగులు వేస్తే ఎలా జీవితాలు మారుతాయో వివరించారు. ఎస్సైలు రాజు, సూర్యశ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, ట్రైనీ ఎస్సైలు సాయి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: రౌడీషీటర్లు గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఏసీపీ బాలగంగాధర తిలక్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా మంచిగా జీవిస్తున్న వారిపై ఉన్న రౌడీషీట్లు పరిశీలించి ఎత్తివేస్తామన్నారు. నేర ప్రవృత్తిని మానుకుని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని చెప్పారు. సీఐ వైవీవీఎల్ నాయుడు, ఎస్సైలు శాతకర్ణి, సూర్యవంశీ తదితరులు పాల్గొన్నారు. వీరులపాడు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్ప్రవర్తతో మెలగాలని ఎస్సై బి.అభిమన్యు హెచ్చరించారు. వీరులపాడు పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్సై కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించేది లేదన్నారు. శిక్షణ ఎస్సై కిరణ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ఉద్యోగ, కార్మికుల సమస్యపై పోరాటం


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వీరులపాడు, న్యూస్‌టుడే: ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ పోరాటాలు చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి 2026 జనవరి 4 వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహా సభలను విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని జుజ్జూరు, అల్లూరు, పెద్దాపురం, జయంతి, దొడ్డదేవరపాడు, వీరులపాడు గ్రామాల్లో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు గోడ ప్రతులు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి బొట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: వ్యాపారుల వ్యాపారాభివృద్ధి కోసం రాజధాని అమరావతిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణానికి ఔటర్‌రింగ్ రోడ్డు పక్కన స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ పొట్లూరి భాస్కరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో ఫెడరేషన్ తమ వంతు సహకారం అందిస్తుందని చెప్పారు. రాజధాని రాకతో వ్యాపారాలు మరింత ఊపందుకుంటాయని పేర్కొన్నారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎల్.ఎన్.వరప్రసాద్, ఉపాధ్యక్షులు వంకాయల రామకృష్ణ, బొప్పిడి రామకృష్ణ, ఎ.విజయకుమార్‌రెడ్డి, తాళ్లూరి సత్యనారాయణ, ఎం.సత్యకుమార్, నండేపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక పీఎస్‌కు ముగ్గురు ఎస్సైలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: శాంతి భద్రతలను మరింత బలోపేతం చేసే క్రమంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు ముగ్గురు ఎస్సైలను కేటాయిస్తూ నగర పోలీస్ కమిషనర్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణలంక స్టేషన్‌లో ట్రైనీ ఎస్సై పోస్టింగ్‌లు ఇవ్వగా.. జగ్గయ్యపేట నుంచి సత్యనారాయణను కృష్ణలంకకు బదిలీ చేశారు. కృష్ణలంకలో ఎస్సైగా పనిచేస్తున్న ఎ.మణి మహిళా పీఎస్‌కు బదిలీ అయ్యారు.

కీసర టోల్‌ప్లాజా వద్ద భయం భయం

కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే

కీసర సర్వర్ టోల్ ప్లాజా ప్రాంతం రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గత ఆగస్టు 22న టోల్ ప్లాజా వద్ద బోటుకునున్న రహదారి ప్రమాదంలో తల్లితో పాటు మూడు నెలల బాలుడు మరణించిన ఘటన అక్కడ రహదారి భద్రతను ప్రశ్నార్థకం చేసింది. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి.

కారణాలు ఇవీ..: కీసరకు రెండు వైపులా ఉన్న గండేపల్లి, పెద్దాపుల గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనాలు టోల్ ప్లాజాకు అత్యంత దగ్గరలో కీసరకు చేరుకోవడం. *ఆయా గ్రామాల నుంచి వచ్చే వాహనాలతోడు జాతీయ రహదారిపై మునేటి మీద నిర్మించిన వంతెనపై నుంచి వచ్చే వాహనాలు వేగంగా అదే సెంటరుకు చేరుకోవడం. ఇంతరద్దీగా ఉండే సెంటరులో జాతీయ రహదారి భద్రతా చర్యలు పాటించకపోవడం, టోల్ ప్లాజాకు ఇరువైపులా జాతీయ రహదారిపై ఆక్రమణలు, అక్కడే ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి ఉంచడం, అన్నీ వైపుల నుంచి ఇష్టారీతిన వాహనాలు దూసుకురావడం ఈ ప్రమాదాలకు కారణంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు టోల్ ప్లాజా వద్ద ప్రమాదాలు జరుగకుండా శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారిపై నిలిపిన ఆటోలు

కార్యాలయ ఆవరణలో మద్యం సీసాలు

కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, సచివాలయం, గృహ నిర్మాణ శాఖ, వెలుగు తదితర కార్యాలయాలున్నాయి. ఆఫీసు పని గంటలు ముగిసిన తరువాత ఆవరణలో చీకటిగా ఉండటంతో పాటు కార్యాలయాల భవనాలు అడ్డంగా ఉండటంతో కొంతమంది అక్కడకు చేరి మద్యం తాగుతున్నారు. ఇక్కడే ఆవరణలో అసంపూర్తిగా ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటరు, అన్న క్యాంటీన్ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. -కంచికచర్ల, న్యూస్‌టుడే

పీఏసీఎస్ ఉద్యోగుల ధర్నా నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు, సిబ్బంది తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సహకార కేంద్ర బ్యాంకు వద్ద ధర్నా నిర్వహిస్తామని జేఏసీ నాయకులు బొల్లి నేని రమణారావు తదితరులు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

విజయవాడ తూర్పు

తారు తేలింది.. అవస్థ మిగిలింది

స్టెల్లా ఆడిటోరియం సమీపంలో పంట కాలువ రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు తారు మొత్తం తేలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పటమట

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సత్వరం వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రెయిన్ సమస్యలతో పాటు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో నెలకొన్న సమస్యలను వినతుల రూపంలో అందించాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

◆ మూడో డివిజన్ గుణదల పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని విజయనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి శ్రీనివాస్.. మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు.

◆ 3వ డివిజన్ శ్రీరాచంద్రనగర్ ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయని, దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి కోటేశ్వరరావు.. మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టారు.

◆ 4వ డివిజన్ శ్రీనివాస్‌నగర్ బ్యాంకు కాలనీలో 4-8/62, 4-8/59 విద్యుత్తు స్తంభాలకున్న దీపాలు వెలగడం లేదని స్థానిక నివాసి వాసు.. ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

కళల్లో అదరహో..

కృష్ణాతరంగ్‌లో నగర విద్యార్థినుల సత్తా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ఆకట్టుకున్న జానపద నృత్య ప్రదర్శన

సహజంగా నగర విద్యార్థులంటే చదువుకే పరిమితమవుతారని, ఖాళీ దొరికితే చాలు ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తారనే భావన ఉంటుంది. కానీ వీరు మాత్రం అందుకు భిన్నం. శాస్త్రీయ, సంప్రదాయ, జానపద నృత్యాలు, వాయిద్య పరికరాలు, నాటికలు ఇలా వివిధ పోటీల్లో పాల్గొంటూ బహుమతులు సొంతం చేసుకుంటున్నారు. ఇటీవల మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో మూడు రోజులు నిర్వహించిన కృష్ణా తరంగ్‌లోని ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు నగరంలో పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు. వరుసగా ఏడేళ్లుగా విజయం సాధిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు. 16 విభాగాల్లో ప్రథమ స్థానం పొందగా.. నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు.

గాయకురాలు కావాలని..

బాల్యం నుంచే సంగీతం అంటే నాకు ఎంతో ఆసక్తి. ఇది గమనించి తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. కృష్ణాతరంగ్‌లో కర్ణాటక గాత్ర సంగీతం, వాయిద్య పరికరాలు, వయోలిన్, లలిత సంగీతం, పాశ్చాత్య వాయిద్య పరికరాలు, భారతీయ బృందగానంలో దేశభక్తి, జానపదం పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలవడం ఆనందంగా ఉంది. గాయకురాలు కావాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నా. - సింధు రాగేశ్వరి, బీకాం ద్వితీయ, పీబీ సిద్ధార్థ కళాశాల

ఆత్మవిశ్వాసం పెరిగింది

నృత్యం అంటే ఇష్టం. ప్రత్యేక శిక్షణ తీసుకోవడం వల్ల రాణిస్తున్నా. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో వివిధ లఘు నాటికలు చూసి వారి నటనను చూసి ఆకర్షితురాలినయ్యా. లఘు నాటికల్లో ప్రథమ స్థానం సాధించా. పోటీల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగింది. గుర్తింపు లభించింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగం సాధించాలని ఉంది. నటనను గుర్తించి సినీ, బుల్లితెరల్లో అవకాశాలు వస్తే వెళతా. - వై.ధరణి, బీసీఏ, తృతీయ

చదువుతో పాటు కళలకూ ప్రాధాన్యం

చదువుతో పాటు కళలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. కృష్ణాతరంగ్‌లో జానపద నృత్యం, జానపద వాయిద్య పరికరాలు, క్రియేటివ్ కొరియోగ్రఫీ పోటీల్లో ద్వితీయ స్థానాలు సాధించా. సాధన చేసి ప్రథమ స్థానాల్లో నిలవడానికి కృషి చేస్తా. - ఎ.ప్రసన్న, బీసీఏ ప్రథమ, నలంద డిగ్రీ కళాశాల

బొంబేడయింగ్
స్టాకిస్టు మానస గాయత్రినగర్ 11వ వార్షికోత్సవ సేల్
15% సంపూర్ణ వస్త్రశ్రేణిపై డిస్కౌంట్ స్పెషల్ ఆఫర్
8 డిసెంబర్ 25 నేడే ఆఖరి రోజు
కింగ్‌సైజ్ బెడ్‌షీట్‌సెట్ 274 x 274 cms MRP. 2999 | క్వీన్‌సైజ్ బెడ్‌షీట్‌సెట్ 229x 254 cms MRP. 2699 | సింగిల్ కాట్ బెడ్‌షీట్ MRP. 999
1 కొనండి 2 ఉచితం
400 TC Trident రూ. 5999/- రూ. 1899/- మీడియం డబుల్‌కాట్
కింగ్‌సైజ్ బెడ్‌షీట్‌సెట్ 183 x 229 cms బెడ్‌షీట్‌సెట్‌పై
1కొనండి 1ఉచితం 60% డిస్కౌంట్
1.30 mt. ఫ్యాంట్ బిట్స్ 2 కొనండి కేవలం రూ.799/- మాత్రమే | రూ. 2299/- దివాన్‌సెట్స్‌పై 60% డిస్కౌంట్
ప్రింటెడ్ పిల్లో కవర్స్ 1 పెయిర్ రూ.399 - 2 పెయిర్స్ రూ.350 | రూ. 299/- బాత్‌మ్యాట్స్ 1కొనండి 1ఉచితం
సుందరం లుంగీలు 1కొనండి 1ఉచితం
గమనిక: ప్రత్యేక స్కీములున్న వాటికి 15% డిస్కౌంట్ వర్తించదు.
మానస గాయత్రి నగర్, విజయవాడ-10 ఫోన్: 2486598, 8886192939

మెనోపాజ్ సమస్యపై సదస్సు

నవల ఆవిష్కరిస్తున్న వైద్యులు హరిత, అనూరాధ, కీర్తి

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: మెనోపాజ్ సొసైటీ తొలి వార్షిక సదస్సు లబ్బీపేటలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షురాలు డాక్టర్ పిన్నమనేని హరిత మాట్లాడుతూ ఆధునిక వైద్య చికిత్సలు, మానసిక సంసిద్ధతతో మెనోపాజ్ సంబంధిత సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. చికిత్సల్లో నూతన పద్ధతులు, హార్మోన్ థెరపీ మార్గదర్శకాలు, రిస్క్, పోషకాహారం, వ్యక్తిగత చికిత్స విధానంపై మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యదర్శి డాక్టర్ మైనేని పూజిత, సొసైటీ కోశాధికారి డాక్టర్ బీమవరపు నవీన, ఉపాధ్యక్షురాలు కె.బి.గాయత్రి, సంయుక్త కార్యదర్శి జె.ప్రత్యూష, వైద్యులు శ్రీదేవి, ఆర్.ఎస్.రమాదేవి, పద్మజ, పి.సుశీల తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ అనూరాధ కోదూరి రచించిన 'మై బాలీవుడ్ రొమాన్స్' నవలను ఆవిష్కరించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో చేపట్టనున్న మరమ్మతు పనుల్లో భాగంగా మెట్ల బజారు, హైస్కూల్ రోడ్డు, వల్లూరు వారి వీధి, గుంటూరువారి వీధి, రెహమాన్ వీధి, పెద్దివారి వీధి, పచ్చమేడ బజారు, రామాలయం సమీపంలోని సర్వీసు రోడ్డు, నిమ్మలవారి వీధి, మంటాడవారి వీధి, కొట్టు సుబ్బారావు వీధి, వర్మ వీధి తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టౌన్ ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు.

సైనికుల సేవలతోనే స్వేచ్ఛా జీవనం

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా నుంచి చెక్కు స్వీకరిస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కల్యాణ వీణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే దేశానికి సైనికులు అందించే రక్షణే కారణమని ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ ఎస్.ఇలక్కియా అన్నారు. దేశ రక్షణకు ప్రాణాలు అర్పించిన సైనికుల సేవలను వెలకట్టలేమని, సాయుధ దళాల నిధికి తోచిన సాయం చేసి, మాజీ సైనిక కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆమె పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవం (ఫ్లాగ్ డే) పురస్కరించుకుని నగరంలోని కలెక్టరేట్‌లో ఆదివారం సాయుధ దళాల నిధికి ఆమె విరాళం అందజేశారు. నగరానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపల్ కాళీ ప్రసాద్ రూ.25,000 విరాళం అందించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి కల్యాణ వీణ మాట్లాడుతూ.. సాయుధ దళాల నిధికి విరాళాలు అందజేసే వారికి ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందన్నారు. ప్రజలు, సంస్థలు తమ విరాళాలను ఎస్‌బీఐ నంబర్ 62067742138 (ఐఎఫ్ఎస్ కోడ్: 0020899)కు పంపాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది, సైనిక సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే మేలు

శిరస్త్రాణం ధరించిన వాహనచోదకునికి బెలూన్ అందిస్తున్న ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ): వాహనచోదకుల్లో భద్రతపై చైతన్యం పెంచేందుకు ఆదివారం బెంజిసర్కిల్‌లో శిరస్త్రాణం ధరించిన ద్విచక్ర వాహనాలు, సీటు బెల్టు ధరించి కారు నడుపుతున్న డ్రైవర్లకు ధన్యవాదాలు తెలియజేస్తూ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం బెలూన్లు అందజేశారు. ట్రాఫిక్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

చుట్టుగుంట: చుట్టుగుంట సబ్ స్టేషన్ 11కేవీ ఎస్సారార్ కళాశాల, చుట్టుగుంట ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 8 నుంచి 10.30 గంటలకు వరకు సరఫరా నిలిపివేస్తామని ఈఈ రవీంద్రబాబు తెలిపారు. రామాలయం రోడ్డు, గులామొహిద్దీన్ నగర్ కొండ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఏసీబీ బిల్డింగ్, టి.వెంకటేశ్వరరావు వీధి, మారుతీనగర్ ఏలూరు రోడ్డు, మైహోమ్ అపార్ట్‌మెంట్స్, ఎస్సారార్ కళాశాల ప్రాంతం, కళాశాల వెనుక కాలువ గట్టు, పాత మలేరియా కార్యాలయం రోడ్డు, హిందీ కళాశాల రోడ్డు, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి, మారుతీనగర్ పాత సెవెన్ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, వీరన్న వీధి, కోకా కోలా వీధి, మారుతీనగర్ ఏలూరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని పేర్కొన్నారు.

రాజధానిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: వ్యాపారుల వ్యాపారాభివృద్ధి కోసం రాజధాని అమరావతిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణానికి ఔటర్ రింగ్ రోడ్డు పక్కన స్థలాం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ వక్కలగడ్డ భాస్కరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో ఫెడరేషన్ తమ వంతు సహకారం అందిస్తుందని చెప్పారు. రాజధాని రాకతో వ్యాపారాలు మరింత ఊపందుకుంటాయని పేర్కొన్నారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎల్.ఎన్.వరప్రసాద్, ఉపాధ్యక్షులు వంకాయల రామకృష్ణ, బొప్పిడి రామకృష్ణ, ఐ.విజయ్‌కుమార్‌రెడ్డి, తాళ్లూరి సత్యనారాయణ, ఎం.సత్యకుమార్, నందేపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మంగళూరు ఎస్‌డీఎం లా కాలేజీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న జస్టిస్ లక్ష్మణరావు, జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ ఆర్.రఘునందనరావు, చల్లా రాజేంద్రప్రసాద్

కానూరు, న్యూస్‌టుడే: న్యాయ విద్యార్థులు జ్ఞానసముపార్జన ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు అన్నారు. వీపీ సిద్ధార్థ న్యాయకళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జస్టిస్ చల్లాకొండయ్య మెమోరియల్ సిద్ధార్థ 4వ నేషనల్ లీగల్ ఫెస్ట్-2025 ముగింపు కార్యక్రమానికి ఆదివారం ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జాతీయస్థాయి మూట్‌కోర్ట్, లీగల్‌క్విజ్ పోటీల్లో ఎంతో మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీల ద్వారా వారిలోని శక్తిసామర్థ్యాలు వెలికి తీయొచ్చని పేర్కొన్నారు. అనంతరం మూట్ కోర్టు పోటీల్లో ప్రథమ స్థానం పొందిన కర్ణాటకలోని మంగళూరు ఎస్‌డీఎం లా కాలేజీ విద్యార్థులకు, ద్వితీయ స్థానంలో నిలిచిన కేరళలోని కోజికోడ్ గవర్నమెంట్ లా కాలేజీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. లీగల్ క్విజ్‌లో ప్రథమ బహుమతిని సిద్ధార్థ లా కాలేజీ, స్కూల్ ఆఫ్ లా విట్ ఏపీ యూనివర్సిటీ అమరావతి సాధించగా, ద్వితీయ బహుమతిని కేఎల్ఈఎఫ్ కాలేజీ ఆఫ్ లా విద్యార్థులు అందుకున్నారు. బెస్టు మూటర్ ఇన్ కోర్టుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన గవర్నమెంట్ లా కాలేజీ, బెస్ట్ మెమోరియల్ ఇన్ మూట్ కోర్టు, బెస్ట్ రీసెర్చర్ ఇన్ మూట్‌కోర్టుగా తమిళనాడులోని అంబేద్కర్ లా యూనివర్సిటీ విద్యార్థులు నిలిచారన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణరావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అలర్జీ, ఆస్తమా వ్యాధులపై అవగాహన

సమ్మిట్‌లో అతిథులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అలర్జీ, ఆస్తమా వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో మణిపాల్ హాస్పిటల్, ఐఎంఏ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో 'అలర్జీ 360-కనెక్టింగ్ ఎక్స్‌పర్టైజ్ అక్రాస్ స్పెషాలిటీస్' సమ్మిట్ ఆదివారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించారు. కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ లోకేశ్ గుట్టా.. టైప్-2 సివియర్ ఆస్తమా, ఐఎల్-5 ఆధారిత బయోలాజిక్స్‌పై ప్రసంగించారు. కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ జి.ఉదయ్‌కిరణ్, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణులు, పల్మనాలజిస్టులు, పీడియాట్రిస్ట్‌లు, అలర్జీ వైద్య నిపుణులు జనరల్ ప్రాక్టీషనర్స్‌లు 300 మందికిపైగా హాజరయ్యారు.

మొక్కల ప్రియులకు కనువిందు

నేటితో ముగియనున్న ఫల, పుష్ప ప్రదర్శన

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంటోంది. చిట్టి, పొట్టి మొక్కలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. అరుదుగా ప్రత్యేకంగా కనిపించే వాటిని కొనుగోలు చేయడానికి మొక్కల ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వృక్ష ప్రేమికులు ప్రదర్శనకు తరలి వస్తున్నారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. సోమవారంతో ప్రదర్శన ముగియనుంది.

కొనుగోలు చేస్తున్న మహిళలు

చూపుతిప్పనివ్వని చామంతులు

తిలకిస్తున్న నగరవాసులు

సహజంగా తెలుపు.. పసుపు రంగు చామంతులు ఎక్కువగా చూస్తుంటాం. అందులో వంద రకాలు ఉన్నాయని, ప్రదర్శనలో 50 రంగుల్లో ఉన్న హైబ్రిడ్ చామంతులు ఉంచామని నర్సరీల నిర్వాహకులు చెబుతున్నారు. వివిధ రకాల గులాబీలు, లిల్లీలు, మందార పూలు కనువిందు చేస్తున్నాయి. సక్లెన్స్, కళాంచి, గోల్డెన్ మనీ ప్లాంట్, పిస్‌లిల్లీ, ఆంథోరియం, పెంటాస్, వాటర్ లిల్లీ, పెట్రో క్రోటన్‌తో పాటు వివిధ రకాల పూల మొక్కలు కొలువుదీరాయి. 35 ఏళ్ల వయసున్న బొన్సాయ్ మొక్కలు ఆకర్షణగా నిలిచాయి. కడియం, భీమవరంతో పాటు కేరళ, హరియాణ, దిల్లీ నుంచి నర్సరీల నిర్వాహకులు వచ్చి ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మిద్దె, ఇంటి ఆవరణలో మొక్కలు పెట్టుకోవడానికి వివిధ రకాల కుండీలు ఉన్నాయి. సేంద్రియ పద్ధతుల్లో వీటిని ఎలా పెంచాలో వివరిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం..

✤ ఆదివారం రాత్రి ఎకో ఫ్రెండ్లీ అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ హితంగా ఉండేలా ఆకులు, కాగితాలు ధరించి వేదికపై ప్రదర్శనలిచ్చి అలరించారు.

క్రికెట్ టోర్నీ విజేత.. వన్‌టౌన్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైల్వే స్టేడియంలో నిర్వహించిన ద్విచక్ర వాహన మెకానిక్స్ క్రికెట్ టోర్నీలో వన్‌టౌన్ మెకానిక్స్ జట్టు విజేతగా నిలిచింది. నవరంగ్ మెకానిక్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వాహనాల తయారీలో వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, దీనికి కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తానన్నారు. నిత్యం పనులు చేస్తూ జీవించే వారికి క్రీడలు ఆట విడుపుగా ఉంటాయన్నారు. ఆరోగ్యం మెరుగుదలకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, తెదేపా నాయకుడు విశ్వనాథం పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ విజేత బాబు శామ్యూల్

విజేతలతో అతిథులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: భవానీపురంలోని ఆచార్య ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో ఎం.శామ్యూల్ విజేతగా నిలిచాడు. టోర్నీ మొత్తం ఆరు రౌండ్లు పాటు నిర్వహించగా.. శామ్యూల్, పి.జ్యోతి కిరణ్‌లు 5.5 పాయింట్లతో సమానంగా నిలిచారు. దీంతో ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా శామ్యూల్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. కొమ్మినేని చిరాగ్ 5 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచాడు. ఓపెన్ టోర్నీతో పాటు చిన్నారులను ప్రోత్సహించేందుకు అండర్-6, 8, 10, 12, 14 కేటగిరీలోనూ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఆచార్య ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రాజేష్, ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్షుడు ఎండీ పాషా, కార్యదర్శి ఎం.రాజీవ్ అతిథులుగా హాజరై విజేతలకు నగదు పారితోషకం, బహుమతులు అందజేశారు.

కృష్ణలంక పీఎస్‌కు ముగ్గురు ఎస్సైలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: శాంతి భద్రతలను మరింత బలోపేతం చేసే క్రమంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు ముగ్గురు ఎస్సైలను కేటాయిస్తూ నగర పోలీస్ కమిషనర్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణలంక స్టేషన్‌లో ట్రైనీ ఎస్సైలుగా ఉన్న ఎన్.వెంకటలక్ష్మి, ఎస్.గిరిధర్‌బాబులకు ఇక్కడే పోస్టింగ్‌లు ఇవ్వగా.. జగయ్యపేట నుంచి సత్యనారాయణను కృష్ణలంకకు బదిలీ చేశారు. కృష్ణలంకలో ఎస్సైగా పనిచేస్తున్న ఎ.మణి మహిళా పీఎస్‌కు బదిలీ అయ్యారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఐ.ఎం.ఎ. నగర శాఖ అధ్యక్షుడిగా వేమూరి

వరప్రసాద్‌ను అభినందిస్తున్న హనుమయ్య

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ వేమూరి వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం గవర్నర్‌పేటలోని ఐ.ఎం.ఎ. హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ బోడేపూడి హనుమయ్య ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ముందుగా బోడేపూడి హనుమయ్య మాట్లాడుతూ ఐ.ఎం.ఎ. ద్వారా సామాన్య ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన సదస్సులు అందించామని వివరించారు. సంతృప్తికరమైన సేవలతో ఐ.ఎం.ఎ.ను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ కేశవరావుబాబు ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపికైన డాక్టర్ హనుమయ్య, కార్యదర్శి డాక్టర్ సురేష్ తదితరులను ఘనంగా సన్మానించారు. ✦ ఊబకాయంపై అవగాహన సదస్సు: డాక్టర్ టి.వి.ఎస్.చలపతిరావు స్మారకోపన్యాసంలో భాగంగా 'ఊబకాయం-నివారణ' అనే అంశంపై గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వై.వి.ఎస్.ప్రభాకర్ ప్రసంగించారు. ఊబకాయం అనేక రోగాలకు మూలమని, దాని పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామంతో ఊబకాయాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన అనేక మంది వైద్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే కాలుష్య నియంత్రణ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి జానకి లక్ష్మి అన్నారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శను ఆదివారం రాత్రి సందర్శించారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, రోజ్ సొసైటీ అధ్యక్షురాలు ఎస్.ఉషారాణి, కార్యదర్శి జి.లక్ష్మి, అబ్బూరి రత్నలక్ష్మి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

అశ్రుతాంజలి

మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..
కుమారులు: సాదినేని వీర సుభాష్ గాంధి, సాదినేని మహేష్ మరియు బంధు మిత్రులు
కీ॥శే॥ సాదినేని శ్రీనివాసరావు గారు
మరణం: 24-11-2025
పెద్దకర్మ: ది. 08-12-2025 సోమవారం ఆటోనగర్ APIIC కాలనీ వారి కళ్యాణ మండపం నందు జరుపబడును.

కరెన్సీనగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ కరెన్సీనగర్ రేట్ పేయర్స్ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం కాలనీ సామాజిక భవనం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా వంగల కృష్ణప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా మద్దినేని శ్రీనివాసరావు, కార్యదర్శిగా ముప్పాళ్ల భార్గవ, కోశాధికారిగా పవన్ కుమార్, న్యాయ సలహాదారుడిగా డీవీ ప్రసాద్‌లను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని, అందరి సహాయ సహకారాలు కావాలని ఎన్నికైన కమిటీ సభ్యులు కోరారు.

✦ నాలుగో డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. నూతన కమిటీ అధ్యక్షుడిగా సీహెచ్ సురేష్, ఉపాధ్యక్షుడిగా ఎస్.సుబ్బారావు, కార్యదర్శిగా కె.కిషోర్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎం.గోవిందరావు, కోశాధికారిగా ఇ.సుగుణ బాబులు ఎన్నికయ్యారు. కాలనీ సీనియర్ సభ్యుడు మండవ వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ప్రజాదర్బార్‌కు స్పందన

పటమట, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కార మార్గాలు చూపడమే ప్రజాదర్బార్ లక్ష్యమని తెదేపా రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ అన్నారు. ఆదివారం 14వ డివిజన్ దర్శిపేటలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లకు సంబంధించి ఎక్కువగా వినతిపత్రాలు వస్తున్నాయన్నారు. డివిజన్ అధ్యక్షుడు కర్ణ రమేష్, నాయకులు గరికిపాటి బద్రి, రాధారపు యల్లబాబు, రేపాకుల ప్రసాద్, కర్ణ కోటేశ్వరరావు, ఫాతిమా, పోతంశెట్టి నాగేశ్వరరావు, యర్లగడ్డ సందీప్, వీర్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్జీ పరిశీలిస్తున్న భవకుమార్, నాగేశ్వరరావు తదితరులు

Gone from our sight.. But never our memories
Gone from our touch.. But never our hearts

22-8-1973 8-12-1998
Mr. P.A. Satya Keerthi
B.Tech., M.B.A
Senior Analyst, Business Solutions Group
Sonata Software Ltd., Bangalore
Mother : P.NIRMALA PRABHAKAR
Sister : P.SUSANNA MADHURI
Members of the Family, Friends & Relatives

(c) eenadu

విజయవాడ మధ్య

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రెయిన్ల సమస్యలతో పాటు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో నెలకొన్న సమస్యలను వినతుల రూపంలో అందించాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో ప్రజా వైద్యశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. స్థానిక తెదేపా డివిజన్ ఇన్‌ఛార్జి గార్లపాటి విజయ్‌కుమార్ ప్రారంభించారు. వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. తెదేపా నాయకులు పడమటి రామకృష్ణ, చిలువేరు శ్రీనివాస్, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం-63036 11232, పాయకాపురం- 90631 44761

స్పందనకు వందనం

పాయకాపురం, న్యూస్‌టుడే : ఇందిరానాయక్ నగర్, నేతాజీ రోడ్డులోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దోమలు, విష కీటకాలకు ఆవాసాలుగా మారాయి. అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై శనివారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు ఆప్రాంతంలోని నీటిని తోడారు. మలేరియా బాల్స్ వేశారు. ❖ వాంబేకాలనీ శ్మశానవాటిక మార్గంలో వేగ నిరోధకాలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై 'ఈనాడు'లో వచ్చిన వార్తకు ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. స్థానికంగా సరిపడా వేగనిరోధకాలు ఉన్నాయని, కొత్తవి అవసరం లేదని నిర్ధారించారు.

? ఆంధ్రప్రభ కాలనీ, విందు హోటల్ పక్కవీధిలో మురుగుకాలువలో పూడిక పేరుకుంది. తీవ్ర దుర్వాసన వస్తోంది. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. - **మారుతీరాజు, స్థానికుడు**

✔ పారిశుద్ధ్య సిబ్బందితో ప్రతి రోజూ పూడిక తీసేలా చర్యలు తీసుకుంటాం. - **బాబూ శ్రీనివాసన్, ఏఎంవోహెచ్, సర్కిల్-2**

? ప్రకాష్‌నగర్ చేపలమార్కెట్ వద్ద వ్యర్థాలన్నీ రోడ్డుపైనే వేస్తున్నారు. - **ప్రభావతి, స్థానికురాలు**

✔ యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. ప్రతి రోజూ వ్యర్థాలు తరలించేలా చూస్తాం. - **శ్రీనివాసరావు, శానిటరీ అధికారి**

? వాంబేకాలనీ డి-బ్లాక్ వద్ద గంజాయి బ్యాచ్ ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. - **రాజారావు, స్థానికుడు**

✔ గంజాయి బ్యాచ్ సభ్యులను పట్టుకుంటాం. - **రమ్య, సెక్టార్ ఎస్.ఐ, అజిత్‌సింగ్‌నగర్** - న్యూస్‌టుడే, పాయకాపురం

బస్సు.. ఎప్పుడు వస్తుందో..?

దుర్గమ్మ భక్తులకు తప్పని పడిగాపులు

అధికారుల పర్యవేక్షణ కరవు

ఇంద్రకీలాద్రి, పాయకాపురం

ఎండలో నిలబడి ఎదురుచూస్తున్నారిలా..

రాష్ట్రంలో రెండో అతి పెద్ద దేవస్థానంగా పేరుగాంచిన దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారి దర్శనం భక్తుల సహనానికి పరీక్షగా మారింది. సామాన్య భక్తులే కాదు టికెట్లు కొని దర్శనం చేసుకునే వారికి అవస్థలు తప్పడం లేదు. కొండపైకి చేరాలంటే వ్యక్తిగత వాహనాలను అనుమతించని పరిస్థితి. మరోవైపు దేవస్థానం బస్సుల కోసం గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. దుర్గాఘాట్ వద్ద భక్తులు పడిగాపులు పడుతుంటే రోడ్డుకు అవతల బస్సులు రైలు పెట్టెలను తలపిస్తూ విశ్రాంతి తీసుకుంటున్నాయి. బస్సు ఎక్కేందుకే గంటల సమయం పడుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంటి పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి దారుణంగా ఉందని పలువురు భక్తులు చెబుతున్నారు.

చిన్న పిల్లలతో ఇబ్బంది పడుతున్నాం

కుటుంబ సభ్యులు, చిన్న పిల్లలతో అమ్మవారి దర్శనానికి వచ్చాం. బస్టాండ్ నుంచి దుర్గాఘాట్ చేరడానికి గంట సమయం పట్టింది. ఘాట్‌లో స్నానం చేసి అమ్మవారి దర్శనం కోసం మరో గంట వేచి చూడాల్సి వస్తోంది. ఎదురుగా బస్సులు ఉన్న వాటిని తిప్పక పోవడంతో అవస్థలు పడుతున్నాం. పర్యవేక్షణ అధికారులు ఘాట్ వద్ద ఉంటే ఇబ్బందులు ఉండవు. - **గోపి, కడప**

సమాచారం లేదు

పల్నాడు జిల్లా మాచర్ల నుంచి దుర్గగుడి చేరడానికి నాలుగు గంటలు, అమ్మవారి దర్శనానికి మరో మూడు గంటలు పట్టింది. దుర్గాఘాట్ వద్దకు చేరి గంట సేపు ఎదురు చూసినా దేవస్థానం బస్సు రాలేదు. సమాధానం చెప్పేవారు లేరు. ఎంత సేపటికి వస్తుందో తెలియదు. బస్సు కోసం భక్తులు పడిగాపులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. - **నాగలక్ష్మి, మాచర్ల**

☛ ఈ విషయమై ఈవో శీనానాయక్‌ను సంప్రదించగా.. ఇంద్రకీలాద్రిపై పార్కింగ్ సౌకర్యం లేక పోవడంతో అధిక శాతం దేవస్థానం బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది. భక్తులకు పూర్తి స్థాయిలో బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు సూపరింటెండెంట్ స్థాయి అధికారిని ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లలో ఉండడంతో పర్యవేక్షణ కొంత తగ్గి ఉంటుందని తెలిపారు.

since 1879 bd బోంబేడయింగ్
స్టాకిస్టు మానస గాయత్రినగర్ 11వ వార్షికోత్సవ సేల్
15% సంపూర్ణ వస్త్రశ్రేణిపై డిస్కౌంట్ స్పెషల్ ఆఫర్
8 డిసెంబర్ 25 నేడే ఆఖరి రోజు
కింగ్‌సైజ్ బెడ్‌షీట్‌సెట్ 274 x 274 cms MRP. 2999 లేదా క్వీన్‌సైజ్ బెడ్‌షీట్‌సెట్ 229x 254 cms MRP. 2699 లేదా సింగిల్ కాట్ బెడ్‌షీట్ MRP. 999
1 కొనండి 2 ఉచితం
400 TC Trident రు. 5999ల కింగ్‌సైజ్ బెడ్‌షీట్‌సెట్ 1కొనండి 1ఉచితం
రు. 1899ల మీడియం డబుల్‌కాట్ 183 x 229 cms బెడ్‌షీట్‌సెట్‌పై 60% డిస్కౌంట్
1.30 mt. ప్యాంట్ బిట్స్ 2 కొనండి కేవలం రు. 799లు మాత్రమే
రు. 2299ల దివాన్‌సెట్స్‌పై 60% డిస్కౌంట్
ప్రింటెడ్ పిల్లో కవర్స్ 1 పెయిర్ రు. 399 - 2 పెయిర్స్ రు. 350
రు. 299ల బాత్‌మ్యాట్స్ 1కొనండి 1ఉచితం
సుందరం లుంగీలు 1కొనండి 1ఉచితం
గమనిక: ప్రత్యేక స్కీములున్న వాటికి 15% డిస్కౌంట్ వర్తించదు.
మానస గాయత్రి నగర్, విజయవాడ-10 ఫోన్: 2486598, 8886192939

ఆకులు, పువ్వుల అలంకరణలో చూడముచ్చటగా చిన్నారులు

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఫల, పుష్ప ప్రదర్శనలో భాగంగా ఆదివారం రాత్రి ఎకో ఫ్రెండ్లీ అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ హితంగా ఉండేలా ఆకులు, కాగితాలు ధరించి వేదికపై ప్రదర్శనలిచ్చి అలరించారు.

మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమా, నాగుల్‌మీరా, వెంకన్న తదితరులు

ముఖ్యమంత్రి స్ఫూర్తితో పరిపాలన

గాంధీనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో.. ఆయన ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ప్రతి నియోజకవర్గ అభివృద్ధి స్వప్నమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించారని తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంతో పాటు ప్రత్యేకంగా విజన్ డాక్యుమెంట్-2047ను తయారు చేసి అమలు చేయడానికి అధికారులను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉమా ఆధ్వర్యంలో కొత్త కార్యాలయాన్ని ప్రజల కోసం అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారంలో ఆయన ముందుంటారని కొనియాడారు. ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు రూపొందించిన విజన్-2047 యాక్షన్ ప్లాన్ అమలుకు మొదటి కార్యాలయాన్ని తన నియోజకవర్గంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల విస్తరణకు.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్‌లో ఉన్న కార్యాలయంతో పాటు కొత్త కార్యాలయం.. 11 డివిజన్లకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. దూదేకుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, విజయకృష్ణా సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్, నవనీతం సాంబశివరావు, కార్పొరేటర్లు, నాయకులు హాజరయ్యారు.

సైనికుల సేవలతోనే స్వేచ్ఛా జీవనం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే దేశానికి సైనికులు అందించే రక్షణే కారణమని ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ ఎస్. ఇలక్కియా అన్నారు. దేశ రక్షణకు ప్రాణాలను అర్పించిన సైనికుల సేవలను వెలకట్టలేమని, సాయుధ దళాల నిధికి తోచిన సాయం చేసి, మాజీ సైనికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆమె పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవం (ఫ్లాగ్ డే) పురస్కరించుకుని నగరంలోని కలెక్టరేట్‌లో ఆదివారం సాయుధ దళాల నిధికి ఆమె విరాళం అందజేశారు. నగరానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపల్ కాశీ ప్రసాద్ ఇచ్చిన రూ.25,000ల విరాళ చెక్కును ఇన్‌ఛార్జి కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కె. కల్యాణ వీణకు అందజేశారు. కల్యాణ వీణ మాట్లాడుతూ.. సాయుధ దళాల నిధికి విరాళాలు అందజేసే వారికి ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందన్నారు. ప్రజలు, సంస్థలు తమ విరాళాలను ఎస్‌బీఐ నంబర్ 62067742138 (ఐఎఫ్ఎస్‌సీ కోడ్: 0020899)కు పంపాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది, సైనిక సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా నుంచి చెక్కు స్వీకరిస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కల్యాణ వీణ

జన విజ్ఞాన వేదిక కార్యవర్గం ఎన్నిక

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : సామాన్య ప్రజలకు విజ్ఞాన ఫలితాలు అందించేలా జన విజ్ఞాన వేదిక (జవివే) కృషి చేస్తున్నట్లుగా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్ అన్నారు. జవివే నగర మహా సభను ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా నగర నూతన అధ్యక్షులుగా ఎ.పూర్ణానంద్, ఎ.మోహనరెడ్డి, నగర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.లక్ష్మి కుమార్ బాబు, వెలగా శ్రీనివాస్ తదితర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సురేష్ మాట్లాడుతూ.. సైన్స్ ఉపాధ్యాయులను పాఠ్యాంశాలను సులభ రీతిలో బోధించేందుకు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 4.50లక్షల మంది విద్యార్థులకు చెకుముకి సంబరాలు నిర్వహించామన్నారు. రాష్ట్ర కోశాధికారి జి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

చుట్టుగుంట, న్యూస్‌టుడే: చుట్టుగుంట సబ్ స్టేషన్ 11కేవీ ఎస్సారార్ కళాశాల, చుట్టుగుంట ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ ఉదయం 8 నుంచి 10.30 గంటలవరకు సరఫరా నిలిపివేస్తామని ఈఈ పి.రమేష్‌బాబు తెలిపారు. చుట్టుగుంట రామాలయం రోడ్డు, గులాంమొహియుద్దీన్ నగర్ కొండ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఎస్‌బీఐ బిల్డింగ్, టి.వెంకటేశ్వరరావు వీధి, మారుతీనగర్ ఏలూరు రోడ్డు, మైహోమ్ అపార్ట్‌మెంట్స్, ఎస్సారార్ కళాశాల ప్రాంతం, కళాశాల వెనుక కాలువ గట్టు, పాత మలేరియా కార్యాలయం రోడ్డు, హిందీ కళాశాల రోడ్డు, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి, మారుతీనగర్ పాత సెవెన్ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, వీరన్న వీధి, కోకా కోలా వీధి, మారుతీనగర్ ఏలూరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ చక్రబంధం!

ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

రెండు వైపులా నిలిపిన కార్లు.. మధ్యలో ఆగిపోయిన బస్సు

గవర్నర్‌పేట ప్రకాశం రోడ్డులోని ఐవీ ప్యాలెస్ పరిసరాలు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకున్నాయి. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా.. కార్లను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. దీనివల్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ మార్గంలోనే ఆర్టీసీ సిటీ బస్సులు తిరుగుతుంటాయి. రెండు వైపులా పార్కింగ్ వల్ల బస్సు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అష్టకష్టాలు పడి చోదకుడు వాహనాన్ని కదిలించినా.. దాని వెనుక భారీగా ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు నిలిచిపోతున్నాయి. ప్రతి రోజూ ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది. ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా.. ట్రాఫిక్ పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.

ప్రకాశం రోడ్డు పొడవు	3 కి.మీ.
వ్యాపార సంస్థలు	సుమారు 200
కార్పొరేట్ ఆసుపత్రులు	5
వాహనాల రాకపోకలు	20వేలు
ఆర్టీసీ బస్సులు	80

సాయంత్రం వేళలో... గవర్నర్‌పేటలో సాయంత్రం వేళ రాకపోకలు దాదాపుగా నిలిచిపోతాయి. వేలాది మంది షాపింగ్‌కు వస్తుంటారు. వారంతా రోడ్డుపైనే వాహనాలను నిలుపుతుంటారు. ప్రధానంగా కార్లతోనే సమస్య ఉంటోంది. ఇరువైపులా ఉండటంతో వాటి మధ్యలో నుంచి వెళ్లాలి. బస్సు వంటి భారీ వాహనం వస్తే.. ఎదురు నుంచి వచ్చే వాహనాలు ఆగిపోవాల్సిందే. తప్పుకొనే మార్గం లేక ట్రాఫిక్ నిలిచిపోతోంది. రోడ్డుకు ఒక వైపునే కార్లు నిలిపేలా చర్యలు తీసుకుంటే చాలా వరకు సమస్య తీరిపోతుంది.

శిరస్త్రాణం.. ప్రయాణం భద్రం..

విజయవాడ నేరవార్తలు: మన కోసమే ట్రాఫిక్ నియమాలు ఏర్పాటు చేశారని ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం పేర్కొన్నారు. మీ భద్రత.. మీ చేతుల్లోనే ఉందని వాహన చోదకులకు స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో భద్రతా చైతన్యంపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న చోదకులను గుర్తించి వారిని అభినందించారు. శిరస్త్రాణం ధరించి వెళుతున్న ద్విచక్రవాహన చోదకులను, సీటు బెల్టు ధరించి ప్రయాణిస్తున్న కారు డ్రైవర్లకు 'థాంక్యూ ఫర్ సేఫ్ డ్రైవింగ్... విజయవాడ ట్రాఫిక్ పోలీస్' అనే ట్యాగ్‌తో కూడిన బెలూన్లను అందించి అభినందించారు. డీసీపీ మాట్లాడుతూ.. శిరస్త్రాణం ధరించడం ఒక అలవాటుగా చేసుకోవాలని, అది మీకు రక్షణ కవచమన్నారు. సీటు బెల్టు.. ప్రాణాలను కాపాడే శక్తివంతమైన పరికరమని తెలిపారు. స్నేహితులు, కుటుంబ సభ్యులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శిరస్త్రాణం ధరించిన చోదకుడికి బెలూన్ అందిస్తున్న డీసీపీ షిరీన్‌బేగం

రాజధానిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణం

మాట్లాడుతున్న భాస్కరరావు. వేదికపై ఛాంబర్ నాయకులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : వ్యాపారుల వ్యాపారాభివృద్ధి కోసం రాజధాని అమరావతిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణానికి ఔటర్ రింగ్ రోడ్డు పక్కన స్థలాం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ వక్కలగడ్డ భాస్కరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో ఫెడరేషన్ తమ వంతు సహకారం అందిస్తుందని చెప్పారు. రాజధాని రాకతో వ్యాపారాలు మరింత ఊపందుకుంటాయని పేర్కొన్నారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని చెప్పారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎల్.ఎన్. వరప్రసాద్, ఉపాధ్యక్షులు వంకాయల రామకృష్ణ, బొప్పిడి రామకృష్ణ, ఐ.విజయ్‌కుమార్ రెడ్డి, తాళ్లూరి సత్యనారాయణ, ఎం.సత్యకుమార్, నందేపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్లతో కార్మికుల శ్రమ దోపిడీ

మాట్లాడుతున్న సుధాకర్. వేదికపై దుర్గారావు, శ్రీనివాస్, కరీం, రాజు

మధురానగర్: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతారని సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.సుధాకర్, కె.దుర్గారావు పేర్కొన్నారు. ఆదివారం బి.ఆర్.టి.ఎస్. రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ కోపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన లేబర్ కోడ్లు కార్మిక హక్కులను కాలరాస్తాయని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆలిండియా మహాసభలు డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతాయని తెలిపారు. 4న జరిగే మహా ప్రదర్శనలో కార్మికులంతా వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నూతన కమిటీ నియామకం.. యూనియన్ నూతన గౌరవ అధ్యక్షుడిగా కె.దుర్గారావు, అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె.కరీం, కోశాధికారిగా డి.రాజు, ఉపాధ్యక్షులుగా వి.రామ్మోహన్‌రావు, వి.ఎన్.వి.సాయిరాం, సహాయ కార్యదర్శులుగా పి.విజయ్‌కుమార్, ఎన్.సి.హెచ్.పాపారావు మరో అయిదుగురితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సుధాదేవి సేవలు నిరుపమానం

నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

విజయవాడ సాంస్కృతికం: రచయిత తెన్నేటి సుధాదేవి ఇరవైకి పైగా పుస్తకాలు రచించి అందరికీ ఆదర్శంగా నిలిచారని శారదా కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు కొనియాడారు. ఆదివారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సుధాదేవి సంస్మరణ సభ నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి సాహితీవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శారదా కళాసమితి కన్వీనర్ ఎం.ఆర్.ఎస్.ప్రకాశరావు.. సుధాదేవి జీవిత విశేషాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ.. 500కు పైగా సామెతలు, నాటికలు రచించారని, వాటిని రేడియోలో ప్రసారం చేశారని వివరించారు. చలన చిత్ర సెన్సార్ బోర్డులో సభ్యురాలిగాను సేవలు అందించారని కొనియాడారు. కృష్ణా జిల్లా తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవిపూర్ణచందు మాట్లాడుతూ.. తెలుగు మహా సభల్లో 4 పర్యాయాలు సేవలు అందించారని గుర్తుచేశారు. పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

తెదేపా నేతల వనసమారాధన

మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), వేదికపై ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు

నున్న, న్యూస్‌టుడే: నున్న వికాస్ కళాశాల రోడ్డులోని ఆయుర్వాన్ రిసార్ట్‌లో విజయవాడ మధ్య నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతంతో పాటు మరో ఐదేళ్లు అధికారంలో ఉండేందుకు ఇప్పటి నుంచే కార్యకర్తలంతా కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో మధ్య నియోజకవర్గం తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎంఏ నగర శాఖ అధ్యక్షుడిగా వేమూరి

వరప్రసాద్‌ను అభినందిస్తున్న హనుమయ్య

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ వేమూరి వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం గవర్నర్‌పేటలోని ఐ.ఎం.ఎ. హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ బోడేపూడి హనుమయ్య ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ముందుగా బోడేపూడి హనుమయ్య మాట్లాడుతూ ఐ.ఎం.ఎ. ద్వారా సామాన్య ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన సదస్సులు అందించామని వివరించారు. సంతృప్తికరమైన సేవలతో ఐ.ఎం.ఎ.ను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. నూతన అధ్యక్షుడు డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. లయన్స్, రోటరీ క్లబ్బుల ద్వారా సామాన్య ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తామని, వాటికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ కేశవరావుబాబు ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపికైన డాక్టర్ హనుమయ్య, కార్యదర్శి డాక్టర్ సురేష్ తదితరులను ఘనంగా సన్మానించారు.

❖ **ఊబకాయంపై అవగాహన సదస్సు..** డాక్టర్ టి.వి.ఎస్.చలపతిరావు స్మారకోపన్యాసంలో భాగంగా 'ఊబకాయం-నివారణ' అనే అంశంపై గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వై.వి.ఎస్.ప్రభాకర్ ప్రసంగించారు. ఊబకాయం అనేక రోగాలకు మూలమని, దాని పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామంతో ఊబకాయాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన అనేక మంది వైద్యులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఆరోగ్యం అందించే విధానాలు అవసరం

రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే : ప్రజలందరికీ ఆరోగ్యాన్నిచ్చేలా హెల్త్ కేర్ సిస్టం ఉండాలని వక్తలు అభిప్రాయపడ్డారు. జన్ స్వాస్థ్య అభియాన్ (జేఎస్‌ఏ) వ్యవస్థాపకుడు డాక్టర్ అమిత్ సేన్ గుప్తా వర్ధంతి పురస్కరించుకుని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సదస్సు నిర్వహించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.పూర్ణానంద్ మాట్లాడుతూ.. వ్యవస్థలో లోపాలు, అవగాహనా రాహిత్యంతో వైద్యుల సలహాలు కూడా నమ్మని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడారు. రోజురోజుకు మానసిక సమస్యలు పెరుగుతున్నాయని.. మానవ, కుటుంబ సంబంధాలు దెబ్బతినడం ప్రమాదకరమైన సూచనగా పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను ప్రభుత్వాలు పూర్తిగా నిర్మూలించాలని.. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచించారు. ప్రజారోగ్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరోగ్య రంగానికి జీడీపీలో ఆరు శాతం నిధులను కేటాయించాలని నిపుణులు చెబుతున్నప్పటికీ.. పీపీపీ పేరుతో ప్రైవేటీకరించే ప్రయత్నం చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. ప్రైవేటు రంగంలో వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ.. ప్రభుత్వ రంగంలో సేవలు అందుబాటులో లేకపోతే ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రజారోగ్య వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సీతారామారావు మాట్లాడుతూ.. అమిత్‌సేన్ గుప్తా ప్రజారోగ్య సమస్యలపై నిరంతరాయంగా కృషి చేశారని కొనియాడారు. వైద్యులు సూరపనేని సుధాకర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ పిల్లల వైద్యుడు జి.సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పూర్ణానంద్. వేదికపై సీతారామారావు, సుధాకర్, రామసుబ్బారెడ్డి తదితరులు

క్రికెట్ టోర్నీ విజేత.. వన్‌టౌన్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైల్వే స్టేడియంలో నిర్వహించిన ద్విచక్ర వాహన మెకానిక్స్ క్రికెట్ టోర్నీలో వన్‌టౌన్ మెకానిక్స్ జట్టు విజేతగా నిలిచింది. నవరంగ్ మెకానిక్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వాహనాల తయారీలో వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, దీనికి కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులు, శ్రామికులకు అండగా నిలబడి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. నిత్యం పనులు చేస్తూ జీవించే వారికి క్రీడలు ఆట విడుపుగా ఉంటాయన్నారు. ఆరోగ్యం మెరుగుదలకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న, తెదేపా నాయకుడు సంకే విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ ఏఈ మృతికి సంతాపం

ఎన్టీఆర్ కలెక్టరేట్: అవనిగడ్డ మండలం పులిగడ్డకు చెందిన జలవనరుల శాఖ ఏఈ పి.వెంకటేశ్వరరావు (45) ఆదివారం మరణించారు. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. విజయవాడ సర్కిల్ ఎస్ఈ ఆర్.మోహనరావు, కేసీ డివిజన్ ఈఈ ఆర్.రవికిరణ్ తదితరులు సంతాపం తెలిపారు.

వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

(c) eenadu

విజయవాడ పశ్చిమ

9న పాతశివాలయం హుండీ కానుకల లెక్కింపు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం) హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను 9న 10 గంటలకు లెక్కించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో నటరాజన్ షణ్ముఖం ఒక ప్రకటనలో తెలిపారు. కానుకల లెక్కింపులో పాల్గొనే భక్తులు పూర్తి వివరాలు తెలిపి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 9న ఉదయం 7.30 గంటలకు సంప్రదాయ దుస్తులు ధరించి ఆధార్ కార్డు ఇతర వివరాలతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

☛ చిట్టినగర్ ఎర్రకట్ట సీఎస్ఐ చర్చి మురుగు వీధిలో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన మంచినీటి విభాగం అధికారులు ఆ ప్రాంతంలో మంచినీటి పరీక్షలు నిర్వహించారు.

☛ పూర్ణానందంపేట ఆర్‌సీఎం చర్చి వద్ద మురుగు కాలువలో పూడిక పారడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

? చిట్టినగర్ గౌతమ్‌స్కూల్ నుంచి కటికల మస్తానయ్యవీధికి వెళ్లే మార్గంలో మురుగు కాలువలో పూడిక పేరుకుంది. - **శ్రీరాములు, స్థానికుడు** ✔ పూడిక తీయిస్తాం. - **జి.నరసింహరావు, స్థానిక శానిటరీ అధికారి** ? మల్లికార్జునపేట ప్రధాన రహదారి మార్గం పాతపోస్టాఫీసు వద్ద యూజీడీ నుంచి మురుగు పొంగి పొర్లుతుంది. - **రామబ్రహ్మం, స్థానికుడు** ✔ తగిన చర్యలు తీసుకుంటాం. - **చెన్నారాజు, స్థానిక శానిటరీ అధికారి**

? కబేళా నుంచి సీవీఆర్ ఫ్లైఓవర్‌కు వెళ్లే మార్గంలో కబేళా కూడలి వద్ద చప్టాలు విరిగి దర్శనం ఇస్తున్నాయి. - **కోటేశ్వరరావు, స్థానికుడు** ✔ మరమ్మతులు నిర్వహిస్తాం. - **శ్రీనివాస్, సర్కిల్-I, ఈఈ** - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రెయిన్ల సమస్యలతో పాటు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో నెలకొన్న సమస్యలను వినతుల రూపంలో అందించాలని తెలిపారు.

బస్సు.. ఎప్పుడు వస్తుందో..?

దేవస్థానం బస్సుల కోసం భక్తుల పడిగాపులు

అధికారుల పర్యవేక్షణ కరవు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఎండలో ఇలా..

రాష్ట్రంలో రెండో అతి పెద్ద దేవస్థానంగా పేరు గాంచిన దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారి దర్శనం భక్తుల సహనానికి పరీక్షగా మారింది. సామాన్య భక్తులే కాదు టికెట్లు కొని దర్శనం చేసుకునే వారికి అవస్థలు తప్పడం లేదు. కొండపైకి చేరాలంటే వ్యక్తిగత వాహనాలను అనుమతించని పరిస్థితి. మరోవైపు దేవస్థానం బస్సుల కోసం గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. దుర్గాఘాట్ వద్ద భక్తులు పడిగాపులు పడుతుంటే రోడ్డుకు అవతల బస్సులు రైలు పెట్టెలను తలపిస్తూ విశ్రాంతి తీసుకుంటున్నాయి. బస్సు ఎక్కేందుకే గంటల సమయం పడుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంటి పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి దారుణంగా ఉందని పలువురు భక్తులు చెబుతున్నారు.

చిన్న పిల్లలతో ఇబ్బంది పడుతున్నాం

కుటుంబ సభ్యులు, చిన్న పిల్లలతో అమ్మవారి దర్శనానికి వచ్చాం. బస్టాండ్ నుంచి దుర్గాఘాట్ చేరడానికి గంట సమయం పట్టింది. ఘాట్‌లో స్నానం చేసి అమ్మవారి దర్శనం కోసం మరో గంట వేచి చూడాల్సి వస్తోంది. ఎదురుగా బస్సులు ఉన్న వాటిని తిప్పక పోవడంతో అవస్థలు పడుతున్నాం. పర్యవేక్షణ అధికారులు ఘాట్ వద్ద ఉంటే ఇబ్బందులు ఉండవు. - **గోపి(కడప)**

సమాచారం లేదు

పల్నాడు జిల్లా మాచర్ల నుంచి దుర్గగుడి చేరడానికి నాలుగు గంటలు, అమ్మవారి దర్శనానికి మరో మూడు గంటలు పట్టింది. దుర్గాఘాట్ వద్దకు చేరి గంట సేపు ఎదురు చూసినా దేవస్థానం బస్సు రాలేదు. సమాధానం చెప్పేవారు లేరు. ఎంత సేపటికి వస్తుందో తెలియదు. బస్సు కోసం భక్తులు పడిగాపులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. - **నాగలక్ష్మి(మాచర్ల)**

☛ ఈ విషయమై ఈవో శీనానాయక్‌ను సంప్రదించగా.. ఇంద్రకీలాద్రిపై పార్కింగ్ సౌకర్యం లేక పోవడంతో అధిక శాతం దేవస్థానం బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది. భక్తులకు పూర్తి స్థాయిలో బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు సూపరింటెండెంట్ స్థాయి అధికారిని ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లలో ఉండడంతో పర్యవేక్షణ కొంత తగ్గి ఉంటుందని తెలిపారు.

సైనికుల సేవలతోనే స్వేచ్ఛా జీవనం

జేసీ ఇలక్కియా నుంచి చెక్కు తీసుకుంటున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కల్యాణ వీణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే దేశానికి సైనికులు అందించే రక్షణే కారణమని జేసీ ఎస్.ఇలక్కియా అన్నారు. దేశ రక్షణకు ప్రాణాలను అర్పించిన సైనికుల సేవలను వెలకట్టలేమని, సాయుధ దళాల నిధికి తోచిన సాయం చేసి, మాజీ సైనికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆమె పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవం (ఫ్లాగ్ డే) పురస్కరించుకుని నగరంలోని కలెక్టరేట్‌లో ఆదివారం సాయుధ దళాల నిధికి ఆమె విరాళం అందజేశారు. నగరానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపల్ కాళీ ప్రసాద్ ఇచ్చిన రూ.25,000ల విరాళ చెక్కును ఇన్‌ఛార్జి కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కె.కల్యాణ వీణకు అందజేశారు. కల్యాణ వీణ మాట్లాడుతూ.. సాయుధ దళాల నిధికి విరాళాలు అందజేసే వారికి ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందన్నారు. ప్రజలు, సంస్థలు తమ విరాళాలను ఎస్‌బీఐ నంబర్ 62067742138 (ఐఎఫ్ఎస్సీ కోడ్: 0020899)కు పంపాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది, సైనిక సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గంలోని 35 డివిజన్ తెదేపా అధ్యక్షురాలు బుదాల నందకుమారి కుటుంబాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ పరామర్శించారు. శనివారం నందకుమారి భర్త షేక్ మహబూబ్ బాషా గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపీ ఆదివారం బాపిస్టుపాలెంలోని ఆమె నివాసానికి వెళ్లి బాషా మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ శివనాథ్, బుద్దా వెంకన్న తదితరులు

జనహితం కోసమే వాసవీ క్లబ్‌ల సేవలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్‌ల సేవలు జనహితం కావాలని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ తూనుగుంట్ల శ్రీధర్ పేర్కొన్నారు. సితార సెంటరు సమీపంలోని ఎస్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన వాసవీ క్లబ్ జిల్లా 212 వార్షిక కాన్ఫరెన్సులో 2026 సంవత్సరానికి జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా వాసవీ సంస్థలకు విశేష సేవలు అందించిన న్యాయవాది హజరత్తయ్య గుప్తాను సత్కరించారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ నేతృత్వంలో పొట్టి శ్రీరాములు స్మృతి వనం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించడం శుభపరిణామమన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రాముప్రసాద్, న్యాయవాది హజరత్తయ్య గుప్తా, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, వాసవీ క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శ్రీనివాసరావు, రోజారాణి, సతీష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ తూనుగుంట్ల శ్రీధర్ దంపతులు

త్వరలో భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు పూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు రెండు రోజుల్లో పూర్తి చేయాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశించారు. ఈనెల 11 నుంచి 15 వరకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై చేపట్టిన భవానీ దీక్షల విరమణ ఏర్పాట్ల అధికారులతో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఘాట్ వద్ద భక్తుల స్నానాలు చేసే సమయంలో ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, తయారీ కేంద్రాలు, హోమగుండాలు, ఇరుముడి సమర్పణ కేంద్రాలు పరిశీలించారు. సమన్వయ పరిష్కారంలో నాణ్యత లోపిస్తే గుత్తేదారుపైనా సంబంధిత ఉద్యోగులపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ రాంబాబు, డీఈ అశోక్, రవీంద్ర పాల్గొన్నారు.

సీతమ్మ వారి పాదాల ఘాట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఈవో శీనానాయక్

'లేబర్ కోడ్లతో కార్మికుల శ్రమ దోపిడీ'

మాట్లాడుతున్న సుధాకర్. వేదికపై దుర్గారావు, శ్రీనివాస్, కరీం, రాజు

మధురానగర్, న్యూస్‌టుడే : కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతారని సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.సుధాకర్, కె.దుర్గారావు పేర్కొన్నారు. ఆదివారం బి.ఆర్.టి.ఎస్. రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ కోఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కొత్త చట్టాలతో కార్మికుల హక్కులు కాలరాస్తాయని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆలిండియా మహాసభలు డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతాయని తెలిపారు. 4న జరిగే మహా ప్రదర్శనలో కార్మికులంతా వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

★ **నూతన కమిటీ నియామకం**

యూనియన్ నూతన గౌరవ అధ్యక్షుడిగా కె.దుర్గారావు, అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె.కరీం, కోశాధికారిగా డి.రాజు, ఉపాధ్యక్షులుగా వి.రామ్మోహన్‌రావు, వి.ఎన్.వి.సాయిరాం, సహాయ కార్యదర్శులుగా పి.విజయ్ కుమార్, ఎన్.సి.హెచ్.పాపారావు మరో అయిదుగురితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

న్యాయవాది అన్వర్‌కు కరాటేలో బంగారు పతకం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: విద్యాధరపురం చెరువు సెంటరుకు చెందిన హైకోర్టు న్యాయవాది ఎస్.కె.అన్వర్‌కు ఆలిండియా నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 కటా విభాగంలో బ్యాల్ కేటగిరిలో బంగారు పతకం సాధించారు. గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో వరల్డ్ కరాటే ఫెడరేషన్, సిట్రో రియో కాయ్ ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అన్వర్‌కు పతకం, ప్రశంసాపత్రం, జ్ఞాపికను నిర్వాహకులు హన్సి, సురేష్, జె.హరినాథ్ అందజేశారు. జేకే గోజురియో కరాటే అకాడమీ నిర్వాహకులు దినేష్, మధు న్యాయవాదిని అభినందించారు. దశాబ్దకాలం పాటు కరాటేలో శిక్షణ ఇచ్చిన గురువులకు ఈ పతకం అంకితం చేస్తున్నట్లు అన్వర్ తెలిపారు.

అన్వర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు హన్సి, సురేష్, హరనాథ్

ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణానికి స్థలం కేటాయించండి

గాంధీనగర్, న్యూస్‌టుడే : వ్యాపారుల వ్యాపారాభివృద్ధి కోసం రాజధాని అమరావతిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణానికి ఔటర్ రింగ్ రోడ్డు పక్కన స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ వక్కలగడ్డ భాస్కరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో ఫెడరేషన్ తమ వంతు సహకారం అందిస్తుందని చెప్పారు. రాజధాని రాకతో వ్యాపారాలు మరింత ఊపందుకుంటాయని పేర్కొన్నారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఛాంబర్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎల్.ఎన్.వరప్రసాద్, ఉపాధ్యక్షులు వంకాయల రామకృష్ణ, బొప్పిడి రామకృష్ణ, ఐ.విజయ్‌కుమార్‌రెడ్డి, తాళ్లూరి సత్యనారాయణ, ఎం.సత్యకుమార్, నందేపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళల్లో అదరహో..

కృష్ణాతరంగ్‌లో నగర విద్యార్థినుల సత్తా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ఆకట్టుకున్న జానపద నృత్య ప్రదర్శన

సహజంగా నగర విద్యార్థులంటే చదువుకే పరిమితమవుతారని, ఖాళీ దొరికితే చాలు ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తారనే భావన ఉంటుంది. కానీ వీరు మాత్రం అందుకు భిన్నం. శాస్త్రీయ, సంప్రదాయ, జానపద నృత్యాలు, వాయిద్య పరికరాలు, నాటికలు ఇలా వివిధ పోటీల్లో పాల్గొంటూ బహుమతులు సొంతం చేసుకుంటున్నారు. ఇటీవల మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో మూడు రోజులు నిర్వహించిన కృష్ణా తరంగ్‌లోని ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు నగరంలో పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు. వరుసగా ఏడేళ్లుగా విజయం సాధిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు. 16 విభాగాల్లో ప్రథమ స్థానం పొందగా.. నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు.

గాయకురాలు కావాలని..

బాల్యం నుంచే సంగీతం అంటే నాకు ఎంతో ఆసక్తి. ఇది గమనించి తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. కృష్ణాతరంగ్‌లో కర్ణాటక గాత్ర సంగీతం, వాయిద్య పరికరాలు, వయోలిన్, లలిత సంగీతం, పాశ్చాత్య వాయిద్య పరికరాలు, భారతీయ బృందగానంలో దేశభక్తి, జానపదం పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలవడం ఆనందంగా ఉంది. గాయకురాలు కావాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నా. **- సింధు రాగేశ్వరి, బీకాం ద్వితీయ, పీబీ సిద్ధార్థ కళాశాల**

ఆత్మవిశ్వాసం పెరిగింది



నృత్యం అంటే ఇష్టం. ప్రత్యేక శిక్షణ తీసుకోవడం వల్ల రాణిస్తున్నా. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో వివిధ లఘు నాటికలు చూసి వారి నటనను చూసి ఆకర్షితురాలినయ్యా. లఘు నాటికల్లో ప్రథమ స్థానం సాధించా. పోటీల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగింది. గుర్తింపు లభించింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగం సాధించాలని ఉంది. నటనను గుర్తించి సినీ, బుల్లితెరల్లో అవకాశాలు వస్తే వెళతా. **- వై.ధరణి, బీఎస్సీ, తృతీయ**

చదువుతో పాటు కళలకూ ప్రాధాన్యం

చదువుతో పాటు కళలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. కృష్ణాతరంగ్‌లో జానపద నృత్యం, జానపద వాయిద్య పరికరాలు, క్రియేటివ్ కొరియోగ్రఫీ పోటీల్లో ద్వితీయ స్థానాలు సాధించా. సాధన చేసి ప్రథమ స్థానాల్లో నిలవడానికి కృషి చేస్తా. **- ఎ.ప్రసన్న, బీఎస్సీ ప్రథమ, నలంద డిగ్రీ కళాశాల**

న్యాయ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కానూరు, న్యూస్‌టుడే: న్యాయ విద్యార్థులు జ్ఞానసముపార్జన ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు అన్నారు. వీడీసిద్ధార్థ న్యాయకళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జస్టిస్ చల్లా కొండయ్య మెమోరియల్ సిద్ధార్థ 4వ నేషనల్ లీగల్ ఫెస్ట్-2025 ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. జాతీయస్థాయి మూట్‌కోర్టు, లీగల్‌క్విజ్ పోటీల్లో ఎంతో మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీల ద్వారా వారిలోని శక్తిసామర్థ్యాలు వెలికి తీయొచ్చని పేర్కొన్నారు. అనంతరం మూట్ కోర్టు పోటీల్లో ప్రథమ స్థానం పొందిన కర్ణాటకలోని మంగళూరు ఎస్‌డీఎం లా కాలేజీ విద్యార్థులకు, ద్వితీయ స్థానంలో నిలిచిన కేరళలోని కోజికోడ్ గవర్నమెంట్ లా కాలేజీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. లీగల్ క్విజ్‌లో ప్రథమ బహుమతిని సిద్ధార్థ లా కాలేజీ, స్కూల్ ఆఫ్ లా విత్ ఏపీ యూనివర్సిటీ అమరావతిలు సాధించగా, ద్వితీయ బహుమతిని కేఎల్ఈఎఫ్ కాలేజీ ఆఫ్ లా విద్యార్థులు అందుకున్నారు. బెస్ట్ మూటర్ ఇన్ కోర్టుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన గవర్నమెంట్ లా కాలేజీ, బెస్ట్ మెమోరియల్ ఇన్ మూట్ కోర్టు, బెస్ట్ రీసెర్చర్ ఇన్ మూట్ కోర్టుగా తమిళనాడులోని అంబేడ్కర్ లా యూనివర్సిటీ విద్యార్థులు నిలిచారన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణరావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకరబాబు పాల్గొన్నారు.

మూట్‌కోర్టు పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న జస్టిస్ లక్ష్మణరావు, జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ ఆర్.రఘునందనరావు, కాంటినెంటల్ కాఫీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్

క్రికెట్ టోర్నీ విజేత.. వన్‌టౌన్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైల్వే స్టేడియంలో నిర్వహించిన ద్విచక్ర వాహన మెకానిక్స్ క్రికెట్ టోర్నీలో వన్‌టౌన్ మెకానిక్స్ జట్టు విజేతగా నిలిచింది. నవరంగ్ మెకానిక్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వాహనాల తయారీలో వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, దీనికి కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులు, శ్రామికులకు అండగా నిలబడి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. నిత్యం పనులు చేస్తూ జీవించే వారికి క్రీడలు ఆట విడుపుగా ఉంటాయన్నారు. ఆరోగ్యం మెరుగుదలకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రె శ్రీనివాస చక్రవర్తి, న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, తెదేపా నాయకుడు సంకే విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే మేలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: వాహనచోదకుల్లో భద్రతపై చైతన్యం పెంచేందుకు ఆదివారం బెంజిసర్కిల్‌లో శిరస్త్రాణం ధరించి ద్విచక్ర వాహనాలు, సీటు బెల్టు ధరించి కార్లు నడుపుతున్న డ్రైవర్లకు ధన్యవాదాలు తెలియజేస్తూ ట్రాఫిక్ డీసీపీ షిరిన్ బేగం బెల్లూన్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు.

ఐఎంఏ నగర శాఖ అధ్యక్షుడిగా వేమూరి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ వేమూరి వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం గవర్నర్‌పేటలోని ఐ.ఎం.ఎ. హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ బోడేపూడి హనుమయ్య ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ముందుగా బోడేపూడి హనుమయ్య మాట్లాడుతూ ఐ.ఎం.ఎ. ద్వారా సామాన్య ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన సదస్సులు అందించామని వివరించారు. సంతృప్తికరమైన సేవలతో ఐ.ఎం.ఎ.ను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. నూతన అధ్యక్షుడు డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. లయన్స్, రోటరీ క్లబ్బుల ద్వారా సామాన్య ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తామని, వాటికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ కేశవరావుబాబు ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపికైన డాక్టర్ హనుమయ్య, కార్యదర్శి డాక్టర్ సురేష్ తదితరులను ఘనంగా సన్మానించారు.



వరప్రసాద్‌ను అభినందిస్తున్న హనుమయ్య

కృష్ణలంక పీఎస్‌కు ముగ్గురు ఎస్సైలు

కృష్ణలంక: శాంతి భద్రతలను మరింత బలోపేతం చేసే క్రమంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు ముగ్గురు ఎస్సైలను కేటాయిస్తూ నగర పోలీస్ కమిషనర్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణలంక స్టేషన్‌లో ట్రైనీ ఎస్సైలుగా ఉన్న ఎన్.వెంకటలక్ష్మి, ఎస్.గిరిధర్‌బాబులకు ఇక్కడే పోస్టింగ్‌లు ఇవ్వగా.. జగయ్యపేట నుంచి సత్యనారాయణను కృష్ణలంకకు బదిలీ చేశారు.

సినిమాలు

★ **రివాల్వర్ రీటా, రాజు వెడ్స్ రాంబాయి:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **ఆంధ్ర కింగ్:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **అమరకావ్యం:** స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నరుపేట), ఎల్ఈపీఎల్(పటమట).

- **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

క్రైం కార్నర్

బెదిరింపులకు పాల్పడుతున్న అధ్యాపకుడిపై కేసు

భవానీపురం, న్యూస్‌టుడే: మహిళను బెదిరిస్తున్న అధ్యాపకుడిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గొల్లపూడిలో మహిళ (51) కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. నాలుగేళ్ల కిందట సామాజిక మాధ్యమాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం కూనవరం మండలం పల్లూరు గ్రామానికి చెందిన నస్కూరి సత్యనారాయణతో పరిచయం ఏర్పడింది. అతడు విద్యాధరపురంలోని జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. మహిళ, కుటుంబ సభ్యులకు సంబంధించిన ఫొటోలను సత్యనారాయణ సేకరించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతానని, నగదు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు సదరు మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సత్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

భవానీపురం, న్యూస్‌టుడే: రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడిన వ్యక్తిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లో పైడి ప్రసాద్‌రావు కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ముఠా పని చేస్తూ కొన్నాళ్ల క్రితం మానేశాడు. 2024లో స్థానికంగా నివాసం ఉండే ఇంధన శ్రీరామకృష్ణ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తనకు రాజకీయ నాయకులతో పరిచయం ఉందని, రైల్వేలో ఉద్యోగాలు ఉన్నాయని ఇప్పిస్తానని చెప్పాడు. నిజమేనని నమ్మిన ప్రసాదరావు తన కుమారుడికి ఉద్యోగం కావాలని కోరాడు. అందుకు రామకృష్ణ రూ.10 లక్షలు కావాలని.. టిడ్కో గృహం కూడా ఇప్పిస్తానని నమ్మబలికాడు. 2024న మే 30న రూ.7.44 లక్షలు రామకృష్ణకు ప్రసాదరావు ఇచ్చాడు. అప్పటి నుంచి కుమారుడికి ఉద్యోగం, గృహం ఇప్పించలేదు. అడుగుతుంటే సమాధానం చెప్పకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన ప్రసాదరావు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: భర్త వేధిస్తున్నాడని భార్య పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో షేక్.షబీరా, ఖాజావలీ దంపతులు నివాసం ఉంటున్నారు. ఖాజావలీ తాపీ కార్మికుడు. కొంతకాలంగా ఖాజావలీ మద్యానికి బానిసై ప్రతి రోజు తాగి ఇంటికి వచ్చి భార్యను వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం తేవాలని..

భవానీపురం, న్యూస్‌టుడే: భర్త వేధిస్తున్నాడని భార్య భవానీపురం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. భవానీపురం శాంతి వీధిలో వై.హేమ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆమెకు మూడేళ్ల కిందట గుంటూరుకు చెందిన కృష్ణ సాయి హర్షతో వివాహమైంది. వివాహ సమయంలో రూ.25 లక్షలు కట్నంగా, రూ.25 లక్షలు బంగారం రూపంలో ఇచ్చారు. కొన్నాళ్లుగా భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తూ.. ఆమె వద్ద ఉన్న నగదు తీసుకున్నాడు. అదనపు కట్నం తేవాలని బలవంతం చేస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ విజేత బాబు శామ్యూల్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: భవానీపురంలోని ఆచార్య ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో ఎం.శామ్యూల్ విజేతగా నిలిచాడు. టోర్నీ మొత్తం ఆరు రౌండ్లు పాటు నిర్వహించగా.. శామ్యూల్, పి.జ్యోతి కిరణ్‌లు 5.5 పాయింట్లతో సమానంగా నిలిచారు. దీంతో ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా శామ్యూల్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. కొమ్మినేని చిరాగ్ 5 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచాడు. ఓపెన్ టోర్నీతో పాటు చిన్నారులను ప్రోత్సహించేందుకు అండర్-6, 8, 10, 12, 14 కేటగిరీలోనూ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఆచార్య ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రాజేష్, ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్షుడు ఎండీ పాషా, కార్యదర్శి ఎం.రాజీవ్ అతిథులుగా హాజరై విజేతలకు నగదు పారితోషకం, బహుమతులు అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రకటన

నా క్లయింటు విజయవాడ, కొత్తపేట కాపురస్తులు అన్నా చినగాలయ్య గారి కుమారుడు అన్నా రామసుధాకర్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటు ఈ దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తిని క్రయం పొందుటకు 1) మద్దాళి వెంకటరావు గారి కుమారుడు మద్దాళి వెంకట సత్య శ్రీనివాసకుమార్ మరియు 2) మద్దాళి వెంకట సత్య శ్రీనివాసకుమార్ గారి కుమార్తె మద్దాళి భవ్యసాయి అనూష వారితో విక్రయ ఖరారు అగ్రిమెంట్ పొందియున్నారు. సదరు షెడ్యూలు ఆస్తిని మద్దాళి వెంకటరావు గారు విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ మెంబర్స్ వెల్ఫేర్ సొసైటీ వారి నుండి రిజిష్టరు క్రయ దస్తావేజు నెం. 1306/2003 ద్వారా కొనుగోలు చేసి వారి జీవిత కాలంలో సదరు షెడ్యూలు ఆస్తిని తన కుమారుడైన 1వ వారికి జీవితకాలపు హక్కును మరియు వారి మనుమరాలైన 2వ వారికి సర్వహక్కులతో సంక్రమింపచేస్తూ రిజిష్టరు దఖలు దస్తావేజు నెం. 4403/2003, SRO ఇబ్రహీంపట్నం ద్వారా వారికి సంక్రమింపచేసియున్నారని తెలిపియున్నారు. దరిమిలా వారు విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ మెంబర్స్ వెల్ఫేర్ సొసైటీ, మహేంద్రనగర్, గొల్లపూడి వారు నిర్వహించిన బహిరంగ లాటరీ పద్ధతిలో వారికి విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ నందు ప్లాటు నెం. 234 దాఖలా ఆర్.సి.సి. గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోరు బిల్డింగ్‌ను ఎలాట్ చేసియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని క్రయం పొందుటకు ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు గాని, క్లయిములు గాని, కోర్టు జప్తులు గాని మరియు ఏ ఇతరత్రా క్లయిములు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో రిజిష్టరు పోస్టు విత్ అకనాలెడ్జ్‌మెంట్ ద్వారా అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనియెడల తదుపరి వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవని తెలియపరచడమైనది.

విక్రయ ఆస్తి షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా (లోగడ కృష్ణా జిల్లా) ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన గొల్లపూడి గ్రామ రీసర్వే నెం. 499/1, 499/2, 502/1, 502/3, 511, 510/3ఎ, 518/1బి, 518/2 దాఖలా మొత్తం ఎ. 24-04. 3/4 శెంట్లు స్థిరాస్తి భూమిలో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు చ.గ. 149.33లు లేక చ.మీ. 124.86ర్ల స్థలములో ఆర్.సి.సి. కట్టడములకు **హద్దులు: Iవ అయిటం: తూర్పు:** అ. 100.0లు వెడల్పు గల రోడ్డు కొంత, పోగుల ముత్యాలరావు గారి భూమి కొంత, **దక్షిణం:** వల్లూరి నరసయ్య గారి భూమి కొంత, మహేంద్ర ఫైనాన్స్ వారి ఆస్తి కొంత, **పడమర:** బొమ్మసాని కృష్ణమూర్తి గారి భూమి కొంత, వల్లంకొండ వెంకటేశ్వర్లు భూమి కొంత, **ఉత్తరం:** అ. 200.0లు వెడల్పు గల రోడ్డు కొంత, బొమ్మసాని కృష్ణమూర్తి గారి భూమి కొంత. **2వ అయిటం: తూర్పు:** షాపు నెం. 269రు దాఖలా చందలూరి బసవయ్య గారి షాపు, **దక్షిణం:** అ. 50.0లు వెడల్పు గల రోడ్డు, **పడమర:** అ. 40.0లు వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** షాపు నెం. 235రు దాఖలా మద్దాళి వీరయ్యగారి షాపు.

ఈ హద్దుల మధ్య చ.గ. 149.33లు లేక 124.86 చ.మీ. ఆర్.సి.సి. కట్టడములు మరియు సదరు స్థలముపై నాకు గల యావత్తు ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

V. Raja Suresh, M.Com., LLB, Advocate
41-18-53, Tirumala Rao Street, Krishna Lanka,
Vijayawada- 520 013, Cell No: 93462 21022

దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా విజయవాడ

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా విజయవాడ ఎదుగుతోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. దేశంలోనే ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతికంగా ఇది సుసంపన్నమైన నగరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'కృష్ణవేణి సంగీత నీరాజనం-2025' ముగింపు వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సంగీతోత్సవాలతో విజయవాడ దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా మరింత ఉన్నత స్థానానికి చేరిందన్నారు. 'ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణకు.. చెందిన కళాకారులు పాల్గొని అద్భుత సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యం, నాటకం, సంగీతం సహా అన్ని కళలకు నిలయం ఆంధ్రప్రదేశ్. ప్రపంచానికి.. కూచిపూడి శాస్త్రీయ నృత్యాన్ని బహూకరించిన నేల ఇది. దక్షిణ భారత సంగీతంలో ప్రముఖ రచనలు చేసిన వారు ఆంధ్రులే. జానపద కళారూపాలలో.. బుట్టబొమ్మలు, కోలాటం, వీరనాట్యం, బుర్ర కథ, థింసా.. ఇవన్నీ ఇక్కడ అత్యంత ప్రజాదరణ పొందినవే..' అని గవర్నర్ పేర్కొన్నారు. ఇలాంటి అనేక అద్భుత కళారూపాలు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని సుసంపన్నం చేశాయన్నారు.

'సంగీత నీరాజనం' చిత్రపటం ఆవిష్కరించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, పక్కన మల్లాది రఘురాం, జేసీ ఇలక్కియా, మల్లికార్జునరావు, వెంకటరామన్ హెగ్డే

పర్యాటకాభివృద్ధికి కళలు దోహదం

కేంద్ర పర్యాటక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ వెంకటరామన్ హెగ్డే మాట్లాడుతూ. . సాహిత్య కళలు పర్యాటకాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని చెప్పారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో ఎంతో మంది ప్రముఖ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. ప్రజల నుంచి చక్కని స్పందన లభించిందన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఐదు ఈవెంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో ఉత్సవం మూడోది తెలిపారు. వైద్యం, వ్యాపారం, 'హెరిటేజ్-కల్చర్, ఆధ్యాత్మిక యాత్రలు తదితరాలను కేంద్రం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఇలక్కియా, సాంస్కృతిక సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, సంగీత విద్వాంసులు మల్లాది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుక్మిణి శ్రీకృష్ణ సంగీత విభావరి

9 నుంచి అమరావతి బాలోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అమరావతి బాలోత్సవం-8.. ఈ నెల 9వ తేదీ నుంచి 11 వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావులు తెలిపారు. ఈ కార్యక్రమ గోడప్రతులను ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పిల్లల పండగను పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవం కోసం అనే నినాదంతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 43 అకడమిక్, 17 కల్చరల్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు ప్రాంగణాలు, 5 గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 12 వేల మంది పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, బాలోత్సవాల వ్యవస్థాపకులు, కొత్తగూడెం బాలోత్సవం కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు, బెంగళూరుకు చెందిన నవస్కంద హూమ్ ఫర్ జనరేషన్స్ ప్రతినిధి కె.యతిరాజులు నాయుడు హాజరవుతారని తెలిపారు. గోడప్రతుల ఆవిష్కరణలో ఆఫీస్ బేరర్స్ సాంబిరెడ్డి, పిన్నమనేని మురళీకృష్ణ, ఎన్.విద్యాకన్నా, యువీ రామరాజు, వల్లభరావ్, వై.సుబ్బారావు, డీవీ రాజు, టి.క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న రామరాజు, సాంబిరెడ్డి, కొండలరావు, రామరాజు, విద్యాకన్నా తదితరులు

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ఆలయ ప్రాంగణంలో రద్దీ

కనకదుర్గ నగర్ మార్గంలో..

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. భవానీ దీక్షల విరమణ నిమిత్తం క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో వాహనాలను నిలపడం సమస్యగా మారింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని అమ్మవారి నివేదన సమయంలో వీఐపీ టికెట్లు, అంతరాలయ దర్శనాన్ని నిలిపి వేయడంతో రూ.100, రూ.300 దర్శనం టికెట్ల విక్రయాలు పెరిగాయి. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. దేవస్థానం ఈవో శీనానాయక్ క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు పేర్కొన్నారు. - **ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే**

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

పెనాల్టీల జీవో రద్దుకు డిమాండ్

గాంధీనగర్: జీవో నంబరు-21 ద్వారా పెనాల్టీలు పదుల రెట్లలో పెంచేశారని.. ఆ జీవోను రద్దు చేయాలని ఏపీ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారీ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15ఏళ్లు దాటిన ఆటోలకు రూ.3500, 20 ఏళ్లు దాటిన వాటికి రూ.7వేల ఫీజు పెంచారని పేర్కొన్నారు. చాలీచాలని ఆదాయంతో రూ.వేలకు వేలు చలానాలు కట్టలేరని చెప్పారు. జీవో 21ని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

ప్రకటన

నా క్లయింటు విజయవాడ, కొత్తపేట కాపురస్తులు అన్నా చినగాలయ్య గారి కుమారుడు అన్నా రామసుధాకర్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా..
నా క్లయింటు ఈ దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తిని క్రయం పొందుటకు 1) మద్దాళి వెంకటరావు గారి కుమారుడు మద్దాళి వెంకట సత్య శ్రీనివాసకుమార్ మరియు 2) మద్దాళి వెంకట సత్య శ్రీనివాసకుమార్ గారి కుమార్తె మద్దాళి భవ్యసాయి అనూష వారితో విక్రయ ఖరారు అగ్రిమెంట్ పొందియున్నారు. సదరు షెడ్యూలు ఆస్తిని మద్దాళి వెంకటరావు గారు విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ మెంబర్స్ వెల్ఫేర్ సొసైటీ వారి నుండి రిజిష్టరు క్రయ దస్తావేజు నెం. 1306/2003 ద్వారా కొనుగోలు చేసి వారి జీవిత కాలంలో సదరు షెడ్యూలు ఆస్తిని తన కుమారుడైన 1వ వారికి జీవితకాలపు హక్కును మరియు వారి మనుమరాలైన 2వ వారికి సర్వహక్కులతో సంక్రమింపచేస్తూ రిజిష్టరు దఖలు దస్తావేజు నెం. 4403/2003, SRO ఇబ్రహీంపట్నం ద్వారా వారికి సంక్రమింపచేసియున్నారని తెలిపియున్నారు. దరిమిలా వారు విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ మెంబర్స్ వెల్ఫేర్ సొసైటీ, మహేంద్రనగర్, గొల్లపూడి వారు నిర్వహించిన బహిరంగ లాటరీ పద్ధతిలో వారికి విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ నందు ప్లాటు నెం. 234 దాఖలా ఆర్.సి.సి. గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోరు బిల్డింగ్‌ను ఎలాట్ చేసియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని క్రయం పొందుటకు ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు గాని, క్లయిములు గాని, కోర్టు జప్తులు గాని మరియు ఏ ఇతరత్రా క్లయిములు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో రిజిష్టరు పోస్టు విత్ అకనాలెడ్జ్‌మెంట్ ద్వారా అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనియెడల తదుపరి వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవని తెలియపరచడమైనది.
విక్రయ ఆస్తి షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా (లోగడ కృష్ణా జిల్లా) ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన గొల్లపూడి గ్రామ రీసర్వే నెం. 499/1, 499/2, 502/1, 502/3, 511, 510/3ఏ, 518/1బి, 518/2 దాఖలా మొత్తం ఎ. 24-04. 3/4 శెంట్లు స్థిరాస్తి భూమిలో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు చ.గ. 149.33లు లేక చ.మీ. 124.86ర్లు స్థలములో ఆర్.సి.సి. కట్టడములకు **హద్దులు: 1వ అయిటం: తూర్పు:** అ. 100.0లు వెడల్పు గల రోడ్డు కొంత, పోగుల ముత్యాలరావు గారి భూమి కొంత, **దక్షిణం:** వల్లూరి నరసయ్య గారి భూమి కొంత, మహేంద్ర ఫైనాన్స్ వారి ఆస్తి కొంత, **పడమర:** బొమ్మసాని కృష్ణమూర్తి గారి భూమి కొంత, వల్లంకొండ వెంకటేశ్వర్లు భూమి కొంత, **ఉత్తరం:** అ. 200.0లు వెడల్పు గల రోడ్డు కొంత, బొమ్మసాని కృష్ణమూర్తి గారి భూమి కొంత. **2వ అయిటం: తూర్పు:** షాపు నెం. 269రు దాఖలా చందలూరి బసవయ్య గారి షాపు, **దక్షిణం:** అ. 50.0లు వెడల్పు గల రోడ్డు, **పడమర:** అ. 40.0లు వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** షాపు నెం. 235రు దాఖలా మద్దాళి వీరయ్యగారి షాపు.
ఈ హద్దుల మధ్య చ.గ. 149.33లు లేక 124.86 చ.మీ. ఆర్.సి.సి. కట్టడములు మరియు సదరు స్థలముపై నాకు గల యావత్తు ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

V. Raja Suresh, M.Com., LLB, Advocate
41-18-53, Tirumala Rao Street, Krishna Lanka,
Vijayawada- 520 013, Cell No: 93462 21022

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK)
రిజిస్టర్డ్ ఆఫీస్: 29/1, 1వ అంతస్తు, శ్రీ యం.ఎస్. కృష్ణరావు రోడ్డు, లాల్‌బాగ్ వెస్ట్ గేట్ దగ్గర, బసవనగుడి, బెంగళూరు-560004. Web: www.canfinhomes.com, Cell: 7625079119.

పబ్లిక్ నోటీసు

మా విజయవాడ బ్రాంచి క్రొత్త ప్రాంగణానికి మార్చబడింది మరియు ది. 08.12.2025 నుండి క్రొత్త ప్రాంగణం నుండి పనిచేయడం ప్రారంభిస్తుందని మా కస్టమర్లందరికీ తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాము.
మా క్రొత్త బ్రాంచి చిరునామా డి.నెం. 40-9-54, 1వ అంతస్తు, అలాస్కా కాన్సెక్ట్స్, పటమట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ రోడ్డు, కళా నగర్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ, ఎన్.టి.ఆర్ జిల్లా, పిన్:520010.
మొబైల్ నెం. +91-7625079119, ల్యాండ్ లైన్: 0866-2474781, 2487131.
తేది: 05-12-2025 సం/-
ప్రదేశము: విజయవాడ బ్రాంచి ఇన్‌ఛార్జ్

జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు సీఎం కృషి

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఏపీ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు యోనెక్స్-సన్‌రైజ్ 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లోగో, పోస్టర్లను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, స్టార్ బ్యాడ్మింటన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి, శాప్ మాజీ ఛైర్మన్ పి.అంకమ్మ చౌదరితో కలిసి ఎంపీ శనివారం విజయవాడలోని ఒక హోటల్లో ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ క్రీడలకు పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ క్రీడా నిర్వహణ కోసం కావాల్సిన అన్ని క్రీడా మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నామని, విజయవాడలో పోటీల నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాన్నారు. రాష్ట్ర రాజధానిలో క్రీడా వర్సిటీ, స్టేడియం ఏర్పాటు కానుందన్నారు. ఐజీఎంసీ స్టేడియం ఆధునికీకరణ పనులను ప్లాన్ సిద్ధమైంది, త్వరలోనే సీఎం చంద్రబాబును కలిసి వివరాలను తెలియజేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. జింఖానా, విద్యాధరపురం మైదానాలను జాతీయ క్రీడల నిర్వహణకు అనుకూలంగా తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ విజయవాడలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనుండడం హర్షణీయమన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుభవాల్లోంచే.. కథలు పుట్టుకొస్తాయ్

కాలంతో పాటే కొత్తగా.. విభిన్న కోణాల్లో రచనలు
'కథ 2024' సంకలనం ఆవిష్కరణలో సాహితీవేత్తలు

కథ 2024 పుస్తకంలో ప్రచురితమైన కథలు రచించిన రచయితలతో ముఖాముఖీ కార్యక్రమం

ఈనాడు, అమరావతి - విజయవాడ సాంస్కృతికం, కానూరు, న్యూస్‌టుడే

'జీవిత అనుభవాలు, ఆలోచనల్లో నుంచే కథలు పుట్టుకొస్తాయి. కాలంతో పాటే కొత్త కథలు జాలువారుతున్నాయి. సామాజిక రీతులను ప్రతిబింబిస్తూ విభిన్న కోణాలు ఆవిష్కృతమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల జోరు పెరిగినా సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమైనా.. కథల విస్తృతి పెరుగుతుందే తప్ప తగ్గలేదు.' అంటూ పలువురు సాహితీవేత్తలు, రచయితలు అభిప్రాయపడ్డారు. విజయవాడ పి.బి.సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన కథ-2024 సంకలనం ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో సాహితీ వేత్తలు తరలివచ్చారు. అనంతరం కథాసాహితీ సహాయ సంపాదకులు ఎ.వి.రమణమూర్తి, కొప్పర్తి రాంబాబు ఆధ్వర్యంలో.. సంకలనంలో ప్రచురితనమైన కథల రచయితలతో ముఖాముఖి నిర్వహించారు. రచయితలు పతంజలిశాస్త్రి, కొట్టం రామకృష్ణారెడ్డి, జి.లక్ష్మి, శీలం సురేంద్ర, అశ్వనీకుమార్, శ్రీనివాసమూర్తి, డాక్టర్ కె.వి.రమణారావు, సుజాత వేల్పూరి, పాలగిరి విశ్వప్రసాద్, జి.ఉమామహేశ్వర్, పలాస సినిమా దర్శకుడు, రచయిత కరుణకుమార్.. తదితరులు తాము రాసిన కథా నేపథ్యాలను వివరించారు.

కథతో ఇష్టంగా 35ఏళ్ల ప్రయాణం..

కథ సంకలనం 1990లో ప్రారంభించగా.. 1991లో మొదటి పుస్తకం ప్రచురితమైంది. పుస్తక సంపుటిని 1991 డిసెంబరు నెలలో హైదరాబాద్‌లోని ద్వారాకా హోటల్‌లో చేకూరి రామారావు ఆవిష్కరించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు, కుమార్తె రావడం ఆనందంగా ఉంది. గత 35 ఏళ్లుగా కథలతో మా ప్రయాణం చాలా ఇష్టంగా చేస్తున్నాం. మూడున్నర దశాబ్దాలుగా తెలుగులో ఇన్ని సంకలనాలు మరేవీ లేవు.
-వాసిరెడ్డి నవీన్, కథాసాహితీ సంపాదకులు

కథల్లోని పాత్రలు వెంటాడుతున్నాయి..

కథ 2024 పుస్తకంలోని 17 కథలు చదివిన తరువాత పుస్తకం మూసేసినా కొన్ని పాత్రలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రతి కథలోని పాత్ర నిర్మాణం చాలా చక్కగా ఉంది. కొన్ని కథల్లోని పాత్రలు.. ప్రస్తుత సమాజంలోని పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. వ్యవస్థ ఎంత గందరగోళంలో ఉందో చెబుతున్నాయి. అన్ని కథలూ చదివించేలా ఆసక్తిని పెంచేలాగానే ఉన్నాయి. **-ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, రచయిత, సమీక్షకులు**

కొత్త కథలు విభిన్నంగా ఉన్నాయ్..



కథలన్నీ చదివిన తరవాత పాఠకుడిగా కథాసాహితిపై మరింత గౌరవం పెరిగింది. 35 ఏళ్లుగా ఈ పుస్తకాన్ని తీసుకురావడం ఆనందంగా ఉంది. కొత్త, యవ రచయితలు రాసిన కథలు చాలా ఆసక్తిని పెంచుతున్నాయి. కథలు ఎంచుకునే విషయంలో విభిన్నం, వైవిధ్యం చూపుతున్నారు. కార్యక్రమానికి సహకరించిన సిద్ధార్థ కళాపీఠానికి నా కృతజ్ఞతలు.
- పాపినేని శివశంకర్, కథాసాహితీ సంపాదకులు

'పరకామణి కేసుపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు'

పటమట, న్యూస్‌టుడే: భక్తుల మనోభావాలు పట్టించుకోకుండా పరకామణి చోరీ కేసు చాలా చిన్నదంటూ మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరకామణి చోరీ కేసులో నిందితుడు రవి కుమార్ తాను మహాపాపం చేశానని అంగీకరిస్తే.. రూ.లక్షల కోట్లు దోచుకున్న జగన్‌కు మాత్రం అది చిన్న కేసుగా కనిపిస్తోందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యాపారం ద్వారా అన్ని రూ.కోట్లు సంపాదించిన రవికుమార్‌కు పరకామణి చోరీ చేయాల్సిన అవసరం ఎందుకు ఉంటుందని, దీని వెనుక పెద్ద కుట్రకు పథకం రూపొందించారని ఆరోపించారు. పరకామణి కేసులో తాడేపల్లి ప్యాలెస్‌కు ఉన్న లింకులు త్వరలోనే బయటపడతాయన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన జగన్, మోకాళ్లపై కూర్చొని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ బుద్ధా వెంకన్న డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ఇంకోసారి చేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.



ఇటీవల నిర్వహించిన కృతజ్ఞత సభ క్లిప్పింగ్స్‌ను సీఎంకు చూపిస్తున్న వెంకటేశ్వరరావు మాదిగ

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. వర్గీకరణ చేసి 59 కులాలకు సామాజిక న్యాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం ఆయన సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. సంక్షేమ పథకాల అమలులో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరినట్లు వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు.

తిరుపతమ్మ ఆలయంలో సౌకర్యాల కల్పనకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో భక్తులకు సౌకర్యాలు మెరుగు పర్చేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 5న 'ఈనాడు'లో 'తిరుపతమ్మా.. తిప్పలు తప్పించమ్మా' శీర్షికతో వచ్చిన కథనానికి ఆలయ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి స్పందించారు. ఆదివారం ఆలయం వద్ద అమ్మవారి దర్శనం, ప్రసాదాలు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై భక్తులను అడిగి వివరాలు సేకరించారు. దర్శనం చేసుకున్న వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఉద్యోగులతో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. లడ్డూలు తెప్పించి భక్తులకు ఇచ్చి ఎలా ఉందో చూడాలని కోరారు. లడ్డూ తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు దగ్గరి దారిలో ఆలయంలోకి వెళ్లేలా క్యూలైన్‌లో మార్పులు చేయాలని ఆలయ ఈఈ రమాను ఆదేశించారు. అనంతరం క్యూలైన్లు పరిశీలించారు. చంటి పిల్లలతో వచ్చే తల్లులకు తొందరగా దర్శనం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

భక్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి

వాజ్‌పేయీ సేవలు దేశాభివృద్ధికి దోహదం

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి ఉత్సవాల కార్యక్రమం నిర్వహణకు సంబంధించి విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో వార్ రూమ్‌ను మాధవ్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . 11వ తేదీ ధర్మవరంలో నిర్వహించే బహిరంగ సభకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించినట్లు తెలిపారు. ఏపీ అభివృద్ధికి వాజ్‌పేయీ ఆద్యుడని.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. టెలికం రంగం అభివృద్ధికి నాంది పలికారని వెల్లడించారు. యాత్ర రాష్ట్ర కన్వీనర్‌గా నాగోతు రమేష్‌నాయుడు, విభాగాల వారీగా నాయకులను నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాగోతు రమేష్‌నాయుడు, అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, నాయకులు ఎస్.కె.బాజీ, బి.నాగలక్ష్మి, గోపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో విశేష పూజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం నియోజకవర్గంలోని తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో శివలింగాలకు అభిషేకం, అర్చన, అలంకారం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కొత్తపల్లి ఉమాగౌరీ శంకర దేవాలయంలో..

పెనుగోలను: రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

ముగ్గురు ఎస్సైల నియామకం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు పోలీస్ స్టేషన్‌కు కొత్తగా ముగ్గురు ఎస్సైలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు ఎస్సైలు విధులు నిర్వహిస్తుండగా సెక్టార్- 1 ఎస్సై సత్యనారాయణను విజయవాడకు బదిలీ చేశారు. నందిగామ ఎస్సై వై.విశ్వశాతకర్ణి, నున్న పోలీస్ స్టేషన్ నుంచి టి.గౌరీశ్వరి(పీడబ్ల్యూ ఎస్సై), తిరువూరులో పీఎస్సైగా శిక్షణ తీసుకున్న కె.రాజును ఇక్కడ నియమించారు.

విశ్వశాతకర్ణి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గుంటుపల్లి సెక్టార్ ఎస్సైగా ఉన్న విజయలక్ష్మి బదిలీ అయ్యారు. ఈమెను విజయవాడ ఫోర్‌టౌన్ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. శిక్షణలో ఉన్న ఇద్దరు ఎస్సైలకు ఇబ్రహీంపట్నంలో పోస్టింగ్ ఇచ్చారు.

రాజధానిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణం

విజయవాడ(గాంధీనగర్): వ్యాపారుల వ్యాపారాభివృద్ధి కోసం రాజధాని అమరావతిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణానికి ఔటర్ రింగ్ రోడ్డు పక్కన స్థలాం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ వక్కలగడ్డ భాస్కరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

దివ్యాంగులకు చేయూత

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ప్రవాస భారతీయుడు వేగి రాధాకృష్ణ, రాణి దంపతుల కుమార్తె, తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు మేనకోడలు ఆన్య నూతన వస్త్రాలంకరణ వేడుక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆన్య తన పొదుపు ఖాతా నుంచి రూ.20,000లు నగదును స్థానిక భవిత కేంద్రం అధికారులకు అందించారు. వీటిని దివ్యాంగుల్లో ప్రతిభ చాటిన వారికి అవార్డులు అందించడానికి వినియోగించాలని కోరారు. ఎస్సై జి.రామకృష్ణ, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో రాట్నాలు, ఎంఈవో శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : పవిత్ర సంగమం రోడ్డులో గంజాయి తాగుతున్న అయిదుగురిని ఇబ్రహీంపట్నం పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 900 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ నిందితులను విచారిస్తున్నట్లు తెలిపారు.

శిరస్త్రాణం రక్షించింది

కొండపల్లి, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో కింద పడిన వ్యక్తిని శిరస్త్రాణం కాపాడిన సంఘటన కొండపల్లిలో ఆదివారం జరిగింది. శ్రీనివాసరావు అనే వ్యక్తి కొండపల్లి బి.కాలనీ మలుపు వద్ద ఇబ్రహీంపట్నం వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అదే సమయంలో మలుపును దాటుకొని మరో ద్విచక్ర వాహనదారుడు వచ్చాడు. దీంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. శ్రీనివాసరావు రోడ్డుపై పడిపోయి బైక్ నుజ్జు అయ్యింది. అయితే అతను శిరస్త్రాణం ధరించి ఉండటంతో చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరావు

బెదిరింపులకు పాల్పడుతున్న అధ్యాపకుడిపై కేసు

భవానీపురం: మహిళను బెదిరిస్తున్న అధ్యాపకుడిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గొల్లపూడిలో మహిళ (51) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. నాలుగేళ్ల కిందట సామాజిక మాధ్యమాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం కూనవరం మండలం పల్లూరు గ్రామానికి చెందిన నస్కూరి సత్యనారాయణతో పరిచయం ఏర్పడింది. అతడు విద్యాధరపురంలోని జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. మహిళ, కుటుంబ సభ్యులకు సంబంధించిన ఫొటోలను సత్యనారాయణ సేకరించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతానని, నగదు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు సదరు మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సత్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆83338 33368

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College. 91774 08565.

విజయవాడలో BPT / B.Sc. మెడికల్ ల్యాబ్ / డిప్లమో ఇన్ MLT, అనస్థీషియా, కార్డియాక్, డయాలసిస్, రేడియోగ్రఫీ, మెడికల్ ఇమేజింగ్ కోర్సులు. అర్హత: ఇంటర్. CO / MQ సీట్లు - తక్కువ ఫీజు. స్కాలర్‌షిప్ / హాస్టల్స్ కలవు. ✆ 88866 54339.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూపు, VJA, వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆99590 21122, 96038 42233

TO LET

COMMERCIAL

విజయవాడ కబేళా ఇండస్ట్రియల్ ఏరియా 4వ క్రాస్ రోడ్‌లో 1100 చ|| గ|| షెడ్, 24 అ||ఎత్తు, 52 H.P. కరెంట్‌తో అద్దెకు కలదు ✆ 99631 11303.

JOBS

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:76599 88728

REQUIRE FEMALE Admission Counsellors for Nakshatra Overseas. Sal: 16K + Incentives Work Place:Vijayawada. ✆ 96031 36899.

Wanted Electrical Engineers. Qualified By B.Tech Electrical Engineering, Diploma or ITI Experience 0-3 Years. Place of Work: East and West Godavari Districts, Attractive Salary. Contact: 79950 50571 or Send Resumes To hr@gvsprojectspvtltd.com

Lakshmi Spares Corporation Vijayawada. Authorised Dealer for Atlas Copco Air Compressors Wanted: Service Engineers Qul: B.Tech/ Diploma. Location: Krishna, Guntur & Prakasam. Note:Complete Field Work Send Your Resumes : hr.lakshmispares@gmail.com ✆ 90325 74443

Wanted Female Telecallers. Qul: any Degree, Salary:Up To 15000+Incentives, Job Location: Benzcircle, & Kankipadu. ✆98481 72444

WANTED
➤ Telecallers (Female)
➤ Marketing Executives (Field Work - Male)
to work at
Vijayam Publications
Hanumanpet, Vijayawada-3.
✆98854 79105

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ:23000 టు 29000 వ:18-35 ✆: 77309 58410.

VJA గాంధీనగర్ హోటల్ రూమ్స్ నందు పని చేయుటకు M/F అనుభవం కల్గి డిగ్రీ/ DTP కంప్యూటర్ నాలెడ్జ్ గల రిసెప్షనిస్టులు మల్టీ పర్పస్ స్టాఫ్, లేడి స్వీపర్ కావలెను ✆ 81256 69996.

ఉచిత శిక్షణ మరియు ఉపాధి టైపింగ్ MS Office టాలి Hardware & Networking, CCNA, 18- 26 VJA. ✆ 79811 40437,63028 26034

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ:20k. ✆ 89776 39662, 89776 39663.

E-Kart నందు అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Qly: Inter Any డిగ్రీ జీ: 15,000/- Online Available. 93819 12123, 77318 16950

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

తిరువూరు

• తిరువూరు • మైలవరం

సమస్యలు గుర్తించి పరిష్కరిస్తాం

2వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు

కొండపల్లి, న్యూస్‌టుడే : పురపాలికలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కొండపల్లిలోని పలు డివిజన్లలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ వాసు ఆదివారం పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంత తెదేపా నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షురాలిగా నాగలక్ష్మి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : యూటీఎఫ్ రెడ్డిగూడెం మండల శాఖ అధ్యక్షురాలుగా బి.వి.ఎస్.నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా డి.ప్రకాష్ ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ శాఖ జిల్లా కార్యదర్శి పి.భవాని అధ్యక్షతన సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆదివారం చెప్పారు. ఉపాధ్యక్షులుగా డి.సర్దార్ నాయక్, డి.విజయలక్ష్మి, కోశాధికారిగా కె.విజయ్ కుమార్, ఆడిటర్‌గా ఎ.బిక్షాలు, కార్యదర్శులుగా శైలజ, ఎస్‌కే.హసీనా, డి.రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కె.శంకర్రావు, పి.కస్తూరి లలిత ఎన్నికైనట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా రవికిషోర్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : విజయవాడ రూరల్ డిస్కం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా రవికిషోర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ విధులు నిర్వహించిన వసంతరావు పదోన్నతిపై విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎగ్జిక్యూటివ్ రెగ్యులర్ పోస్టు నియామకం జరిగే వరకూ రవికిషోర్ ఇన్‌ఛార్జిగా ఉంటారని ఆదేశాలు జారీ అయ్యాయి.

కుట్టేస్తోంది.. వణికిస్తోంది!

భయం అవసరం లేదంటున్న వైద్యులు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం, కొండపల్లి

★ ఈలప్రోలులో వ్యవసాయ పనులు చేసే వ్యక్తికి జ్వరమొచ్చి ఒంటిపై అక్కడక్కడ దద్దుర్లు వచ్చాయి. వేడి వల్ల జ్వరం వచ్చిందని భావించాడు. పది రోజులైనా తగ్గకపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడ ఆసుపత్రిలో చేరాడు. మరికొన్ని రోజులు చికిత్స పొందిన తర్వాత ఆ జ్వరం సాధారణమైంది కాదని, ఓ పురుగు కాటు వల్ల సంభవించిందని వైద్యులు తేల్చారు.

★ కొండపల్లికి చెందిన ఓ వ్యక్తికి జ్వరం రాగా సాధారణమై అనుకొని టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి పరీక్షలు చేయించుకున్న తగ్గలేదు. 20 రోజుల తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ప్రభుత్వ వైద్యులు గమనించి అది స్క్రబ్ టైఫస్ అని తేల్చారు. డాక్ సైక్లిన్ కోర్స్ అయిదు రోజుల పాటు అతనికి ఇచ్చి జ్వరాన్ని తగ్గించారు. అప్పటికే గుండెకు వెళ్లే రక్తనాళాలు ఇబ్బంది ఏర్పడటంతో స్టంట్ వేసి అతడిని కాపాడారు.

గతం నుంచే చాపకింద నీరులా వ్యాపిస్తున్న ఈ స్క్రబ్ టైఫస్ జ్వరాలను ప్రస్తుతం వైద్యారోగ్య శాఖ గుర్తించింది. ఇందులో భాగంగా అనుమానిత వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. అయితే కొండపల్లి పురపాలిక, ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామాల్లో గతంలోనే వీటి ఛాయలు కనిపించాయి. సకాలంలో వైద్యులు గుర్తించి వాటికి తగిన చికిత్స అందించారు. నల్లిని పోలిన చిన్న కీటకం కుడితే శరీరంలో బ్యాక్టీరియా పెరిగి స్క్రబ్ టైఫస్‌గా మారి కనిపిస్తోంది. చలి కాలం నేపథ్యంలో ప్రస్తుతం ఈ జ్వర కేసులు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి.

లక్షణాలను గుర్తిస్తే మేలు

కీటకం కుట్టిన చోట కురుపు మాదిరిగా శరీరం కమిలిపోతోంది. కొన్ని రోజులకు నల్లని మచ్చతో పాటు దద్దుర్లు ఏర్పడతాయి. వైరస్ శరీరంలో పెరిగినా, రెండ్రోజులు గడిచిన తర్వాత జ్వరం వస్తోంది. తలనొప్పి, అలసట ఉంటుంది. ఈ జ్వరానికి లోనైన వారికి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నట్లయితే తీవ్ర అలసట కలుగుతుంది. టైఫాయిడ్, మలేరియా మాదిరిగా జ్వరం కనిపిస్తోంది. జ్వరానికి చెందిన పరీక్షల్లో ఈ లక్షణాలు స్పష్టమవుతాయి.

సమస్యేమి కాదు

దీనిపై అవగాహన ఉంటే తీవ్రమైన సమస్యేమి కాదు. గతంలోనే ఇద్దరు వ్యక్తులకు ఈ జ్వరం వచ్చిన సందర్భంలో వాటిని గుర్తించి చికిత్స అందించాం. సకాలంలో జ్వర లక్షణాలను బట్టి వ్యాధిని గుర్తిస్తే ఐదు రోజుల చికిత్స చేసి తగ్గించవచ్చు. అనుమానిత కేసులు ఉన్న చోట ఆయా ప్రభుత్వాసుపత్రుల్లో అజిత్రోమైసిన్, డాక్ సైక్లిన్ మందులు ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.

- రాథోడ్, సుధా ప్రసూజ, వైద్యులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కొండపల్లిలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువల్లోని చెత్త తొలగించి రోడ్డుపైనే వదిలేశారు. **- శ్రీనివాసరావు, స్థానికుడు** ✔ చెత్తను తొలగించేందుకు సిబ్బందిని కేటాయిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- శ్రీను, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు - కొండపల్లి**

? రంగాపురంలోని డ్రెయిన్లలో పూడిక పేరుకుంది. **- ఎస్‌కే. కరీముల్లా, స్థానికుడు** ✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ఎస్.రామారావు, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి, రంగాపురం** – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : తిరువూరులో జరిగిన ఎస్ఎఫ్ఐ 53వ జిల్లా మహాసభల్లో జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారని నూతన అధ్యక్షుడు టి.కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని తదితర సమస్యలపై భవిష్యత్తు కార్యచరణ రూపొందించామని చెప్పారు. కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వరావు, కుమార్ నాయక్, ప్రణీత, ప్రణయ్, కాజు, యాదవ్, ఉష, యశస్విని తదితరులను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

తోటమూలలో సమావేశమైన సంఘం సభ్యులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని తోటమూలలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సీనియర్ ఎలక్ట్రీషియన్ టి.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మండల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోసు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా వైకుంఠాచారి, ఆర్.ఈశ్వరాచారి, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఎన్నిక అయ్యారు.

చెత్త డబ్బాల పంపిణీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక పంచాయతీలోని కొత్తరెడ్డిగూడెంలో ఇంటింటికి చెత్త డబ్బాలను ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచి రాణి, ఉప సర్పంచి వెంకటేశ్వరరావు(బాబు), పంచాయతీ కార్యదర్శి రామారావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

కూనపరాజుపర్వ: నేత్ర పరీక్షలు చేస్తున్న లక్ష్మీకుమారి, పక్కన నాయకులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో తెదేపా కూనపరాజుపర్వ గ్రామ కమిటీ ఆర్థిక సహాయంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 100 మందికి నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. కంటి వైద్య నిపుణురాలు లక్ష్మీకుమారి వైద్య సేవలందించారు. మాజీ ఉప సర్పంచి కృష్ణప్రసాద్, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండ, నాయకులు నాగమల్లేశ్వరరావు, సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైలవరం : మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్(మోస్ట్) ఆధ్వర్యంలో జయమ్మ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం మండలంలోని వెల్వడంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రవాస భారతీయుడు లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రారంభించారు. ట్రస్ట్ నాయకులు వరప్రసాద్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, హమీర్ హంజా, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మొర్సుమిల్లి : వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మైలవరం : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత గ్రామం మొర్సుమిల్లిలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రా ఆసుపత్రి సహకారంతో ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేశారు. వారం పాటు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాలపై ప్రిన్సిపల్ అప్పారావు అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శివహరిప్రసాద్, వైద్యులు పల్లవి, నాగేశ్వరరావు, రామరాజు, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలన్నదే లక్ష్యం

పరీక్ష కేంద్రం వద్ద శ్యామ్‌సుందరావు తదితరులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం నేషనల్ మీన్స్‌కోమెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తిరువూరు ఎంఈవో- 1, డీవైఈవో(నందిగామ) శ్యామ్‌సుందరావు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అందించే ఈ స్కాలర్‌షిప్‌నకు ప్రతి ఏడాది వేలాది మంది పోటీ పడుతుంటారని చెప్పారు. ఈ పరీక్షకు సుమారు 500 వందల మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

తిరువూరులో ఆత్మీయ సమావేశం

కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ నియోజకవర్గ నాయకుల ఆత్మీయ సమావేశంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఫయ్యాద్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హబీబ్, రాష్ట్ర కార్యదర్శి కె.రాధాకృష్ణ పాల్గొన్నారు. రాహుల్, ప్రియాంక గాంధీ సేనలు నియోజకవర్గంలో కూడా బలోపేతం చేయాలని కోరారు. బి.ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు, జీవన్‌బాబు, లక్ష్మీదాసు, సురేష్, శాంతిభూషన్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత.. వన్‌టౌన్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైల్వే స్టేడియంలో నిర్వహించిన ద్విచక్ర వాహన మెకానిక్స్ క్రికెట్ టోర్నీలో వన్‌టౌన్ మెకానిక్స్ జట్టు విజేతగా నిలిచింది. నవరంగ్ మెకానిక్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

పీఏసీఎస్ ఉద్యోగుల ధర్నా నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సహకార బ్యాంకుల వద్ద ధర్నా నిర్వహిస్తామని జేఏసీ నాయకుడు బొల్లినేని రఘురాం ఆదివారం తెలిపారు.





నగ ధగధగ.. 'నిధి' మిలమిల

నర్సీపట్నంలో జ్యువెలరీ షోరూం ప్రారంభోత్సవానికి సినీ నటి నిధి అగర్వాల్ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. అభిమానుల కోరిక మేరకు స్టెప్పులు వేశారు. వారితో కలిసి సెల్ఫీలు దిగారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

అప్పన్న సన్నిధిలో అర్చనా అయ్యర్

సింహాచలం, న్యూస్‌టుడే: సినీ కథానాయకుడు ఆది సాయికుమార్, కథానాయిక అర్చనా అయ్యర్ సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకున్నారు.

యూపీఐ చెల్లింపుల్లో పొరపాట్లా..

మోసం

యూపీఐ ద్వారా చెల్లింపులు చేసినప్పుడు ఒక్కోసారి పొరపాటున వేరొకరి ఖాతాకు జమ అవుతుంటాయి. లేకుంటే పెండింగ్‌లో ఉండిపోతాయి. ఇలాంటి సమయంలో ఆందోళన చెందకుండా ఇలా చేస్తే పోయిన డబ్బులు తిరిగి రాబట్టుకోవచ్చు. లావాదేవీకి సంబంధించి స్క్రీన్‌షాట్ తీసుకుని ఈ నంబర్లలో సంప్రదించాలి.

సంప్రదించాల్సిన నంబర్లు..

✦ గూగుల్‌పే	: 1800 419 0157
✦ ఫోన్‌పే	: 0806 872 7374
✦ పేటీఎం	: 0120 445 6456
✦ భీమ్	: 1800 120 1740

✦ ఎన్‌పీసీఐ వెబ్‌సైటులోనూ ఫిర్యాదు చేయవచ్చు

– న్యూస్‌టుడే, చీడికాడ

పరిశుద్ధ మరియ.. ప్రేమతో దీవించు..!

నేడు కొండగుడి మేరీమాత ఉత్సవం

విశాఖపట్నం, న్యూస్‌టుడే : విశాఖ పాతనగరంలోని పాత పోస్టాఫీసు సమీపంలోని రోజ్‌హిల్‌పై ఉన్న విశాఖపురి మేరీమాత (అమలోద్భవిమాత) పుణ్యక్షేత్రం ప్రధాన ఉత్సవం సోమవారం జరగనుంది. ఈ ఉత్సవాన్ని స్థానికంగా 'కొండ గుడి' పండగగా పిలుస్తారు. విశాఖతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు హాజరై మేరీమాతను కొలుస్తారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. కాన్వెంట్ కూడలి మీదుగా పోర్టు మార్గంలో వచ్చే వాహనాలకు పోర్టులోని అదానీ రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో, ఫిషింగ్ హార్బర్ మీదుగా వచ్చే వాహనాలకు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, వన్‌టౌన్ నుంచి వచ్చే వాహనాలకు, బస్సులకు విక్టోరియా రాణి విగ్రహం వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

స్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్లు సులభం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎట్టకేలకు సులభతరమైంది. స్లాట్ బుకింగ్‌తో వేగంగా పూర్తవుతున్నాయి. ఎవరైనా సరే అనుకూలమైన సమయం ఎంచుకునే విధానం అమలులోకి వచ్చింది. పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ (పీడీఈ)తో స్థిరాస్తుల క్రయవిక్రయాలకు ఎవరి దస్తావేజు వారే రూపొందించుకోవచ్చు. హెల్ప్ డెస్కులతో అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. తొలుత ఈ పద్ధతికి కాస్త ఒడిదొడుకులు వచ్చినా క్రమంగా గాడిన పడింది. తద్వారా రిజిస్ట్రేషన్ల ఆదాయం లక్ష్యానికి మించి రావడం గమనార్హం.

■ సాంకేతికతతో గతంలోనే రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొంతకాలంగా స్లాట్ బుకింగ్‌తో వినియోగదారులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ఎవరికి వారే స్లాట్ బుక్ చేసుకుని డాక్యుమెంట్లు పొందేలా వీలు కలిగింది. ఇందుకు నమూనా పత్రాలు అందుబాటులో ఉంచారు. ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లినా హెల్ప్ డెస్కులోని సిబ్బంది సహకరిస్తారు. వివాహ రిజిస్ట్రేషన్లు, ఇతర లావాదేవీలు నచ్చిన సమయంలో బుక్ చేసుకోవచ్చు.

స్లాట్ బుకింగ్‌కు నర్సీపట్నంలో ఏర్పాటైన హెల్ప్ డెస్క్

■ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వేగంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి కావడానికి ప్రభుత్వం ఈ స్లాట్ విధానాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు తెలిపారు. దీనిపై ఎవరి నుంచి ఏ ఫిర్యాదులూ లేవు. అవసరమైన వారు అవగాహన కోసం జిల్లాలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉన్న హెల్ప్‌డెస్కుల సేవలు ఉపయోగించుకోవచ్చు. జిల్లాలో నవంబరు నెలాఖరు నాటికి రూ.204.44 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.219.51 కోట్లు వచ్చిందని పేర్కొన్నారు.

■ స్లాట్ బుకింగ్ చాలా సులువు. దీని కోసం రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ registraion.ap.gov.in లోకి వెళ్లాలి. ఆస్తులు, ఇతర వివరాలను నమోదు చేసి డాక్యుమెంట్ రూపొందించాలి. దీనికి ఐడీ వస్తుంది. అనంతరం ఆస్తుల విలువ ప్రామాణికంగా స్టాంపు డ్యూటీ ఇతర ఫీజులు చెల్లించాలి. కార్యాలయానికి వెళ్లడానికి అనుకూలమైన సమయాన్ని నిర్ణయించుకుని స్లాట్ బుక్ చేసుకుంటే క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ టోకెన్ వస్తుంది. తర్వాత స్లాట్ సమయం ప్రకారం కార్యాలయానికి వెళ్తే సబ్ రిజిస్ట్రార్ ప్రక్రియ పూర్తి చేస్తారు. స్లాట్ బుకింగ్‌కు పైసా చెల్లించనవసరం లేదు. రద్దు చేసుకుంటే రూ.100, వాయిదా వేస్తే రూ.200 చెల్లించాల్సి ఉంది.

మినుము రైతులకు ప్రోత్సాహకాలు

ఉచితంగా విత్తన కిట్లు

అనకాపల్లి, న్యూస్‌టుడే

కారణాలు ఏవైనా అపరాల సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ముఖ్యంగా మినుము విస్తీర్ణం ఏటికేడు పడిపోతోంది. ఫలితంగా మార్కెట్‌లో మినపప్పు ధరలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మినుము సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు చేపడుతోంది. రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేయాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 4,700 విత్తన కిట్లు ఇవ్వనున్నారు. కేజీ విత్తనం ధర రూ.138. ఒక్కో కిట్‌లో నాలుగు కేజీల విత్తనాలు ఉంటాయి. అర ఎకరా విస్తీర్ణంలో సాగు చేసేందుకు సరిపోతాయి.

రబీ సాగవుతున్న మినుము

❖ జిల్లాలో వరి కోతల అనంతరం రైతులు అపరాలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయి. రబీలో వరి సాగు తక్కువ. ఖరీఫ్‌లో 85,884 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తుంటే రబీలో 15,662 హెక్టార్లలోనే పంటలు వేస్తున్నారు. దాదాపు 70 వేల హెక్టార్ల భూమి ఖాళీగా ఉండిపోతుంది. ఈ క్రమంలో రబీ విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో పెసర 6,273 హెక్టార్లలో సాగవుతుంటే.. మినుము 2,753 హెక్టార్లలోనే వేస్తున్నారు.

❖ పుష్కర కాలం కిందట జిల్లాలో 5,380 హెక్టార్లలో మినుము సాగయ్యేది. ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. రెండేళ్ల కిందట 2,641 హెక్టార్లకు పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అపరాల సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టిసారించింది. గతేడాది రబీలో 3,098 హెక్టార్లకు సాగు పెరిగింది. ఈ ఏడాది కనీసం ఐదు వేల హెక్టార్లలో సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వరి కోతలకు రెండు, మూడు రోజుల ముందు మినుము విత్తనాలు వేసేలా కిట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

జీవన పత్రాల నమోదుకు తొందరొద్దు

జనవరి ఒకటి తర్వాతే..

నర్సీపట్నం, న్యూస్‌టుడే

ప్రభుత్వ పింఛనుదారులకు ఏటా జీవన పత్రాల సమర్పణ తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు వచ్చే ఏడాది జనవరిలో వీటిని నమోదు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులు వీటిని సమర్పిస్తున్నారు. పాత విధానంతో రాష్ట్ర పింఛనుదారులు కొందరు హైరానా పడుతూ ఇప్పుడే నమోదు చేస్తూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని సంఘాల ప్రతినిధులు, ఖజానా అధికారులు చెబుతున్నా.. కొందరు హడావుడి పడుతున్నారు.

ఆన్‌లైన్‌కు పింఛనుదారుడిని ఫొటో తీస్తున్న సంఘ ప్రతినిధి

● జీవన పత్రాలను జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు మాత్రమే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా ఖజానాధికారి సుభాషిణి సూచిస్తున్నారు. బయోమెట్రిక్ నమోదు కాని వారు ఐరిస్‌తో పంపవచ్చన్నారు. ఇప్పుడు వివరాలను నమోదు చేస్తే యాప్‌లో వాటిని అనుమతించినట్లు కనిపిస్తుందని జనవరి ఒకటో తేదీ తర్వాత మళ్లీ సమర్పించక తప్పదని పేర్కొన్నారు.

● ఉద్యోగ విరమణ చేసిన వారంతా పింఛను పునరుద్ధరణకు ఏటా ఈ పత్రాలను సమర్పిస్తుంటారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను తొలగించేందుకు 'జీవన్ ప్రమాణ్' పేరుతో కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఉన్న చోటు నుంచి ఆన్‌లైన్లో నమోదు చేసుకునే వెసులబాటు కలిగింది. 2018కి ముందు ప్రభుత్వ పింఛనుదారులంతా ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో జీవన పత్రాలను అందజేసేవారు.

● జిల్లాలో 8 ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో సుమారు 9 వేల మంది ప్రభుత్వ పింఛనుదారులు ఉన్నారు. 11 వేల మందికిపైగా కేంద్ర సర్కారు పెన్షనర్లు ఉన్నారు. వీరు నవంబరు నుంచి జీవన పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల్లో కొందరు తమ వివరాలన్నీ ఇప్పుడే నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్లో వీటికి ఆమోదం కనిపిస్తుండటంతో జీవన పత్రాల సమర్పణ పూర్తయిందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల శ్రమ మినహా ప్రయోజనం లేదని గుర్తించలేక పోతున్నారు.

మత్స్యకారులకు రాయితీపై ఇంజిన్లు

✦ వలలు, బోట్లకూ అవకాశం

✦ 15వ తేదీతో ముగియనున్న గడువు

నక్కపల్లి, న్యూస్‌టుడే

సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులకు రాయితీపై వేట సామగ్రిని కూటమి ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే అనేక మంది సద్వినియోగం చేసుకోగా, అర్హులకు మంజూరు చేసేందుకు సంబంధిత అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. దీని గడువు త్వరలోనే ముగియనుంది.

జిల్లాలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల పరిధిలో 30 వరకు మత్స్యకార గ్రామాలున్నాయి. వీటి పరిధిలో 70 వేల మంది జనాభా ఉండగా చేపల వేటపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది వరకు ఉన్నారు. తెదేపా ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు ఇంజిన్లు, వలలు, తెప్పలను రాయితీపై ఇచ్చేవారు. వైకాపా పాలనలో అది కాస్త అటకెక్కింది. అప్పట్లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ఉన్నా ఇంజిన్, తెప్ప, వల కలిపి ఒకే యూనిట్‌గా ఇచ్చారు. దీని ధర రూ.5 లక్షలు ఉండగా, రాయితీపోనూ మత్స్యకారులు రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉండేది. దీంతో మత్స్యకారులెవరూ ముందుకు రాలేదు.

● కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకంలో వల, ఇంజిన్, బోటు వేర్వేరు యూనిట్లుగా ఇచ్చేలా కేంద్రంతో మాట్లాడింది. దీంతో మత్స్యశాఖ అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది.

● ఇప్పటికే జిల్లాలో నాలుగు మండలాల పరిధిలో 58 ఇంజిన్లు ఇచ్చారు. ఇందులో అత్యధికంగా 'పేట' నియోజకవర్గంలోనే 25 వరకు వచ్చాయి. ఇటీవలే మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు.

లైసెన్సు మనుగడలో ఉండాలి.. ఇంజిన్, వల, జీపీఎస్ వంటివి రాయితీపై పొందాలంటే బోటు యజమాని అయ్యుండాలి. బోటు లైసెన్స్ మనుగడలో ఉండాలి. జిల్లాకు 169 ఇంజిన్లు కేటాయించారు. జీపీఎస్ కావాలంటే మరో వేట సామగ్రి కలిపి దరఖాస్తు చేస్తేనే ఇస్తారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారంతా ఈ నెల 15వ తేదీ నాటికి తమ వాటా మొత్తానికి డీడీ తీయాలి.

– విజయ, మత్స్యశాఖ జిల్లా అధికారిణి

రాయితీ ఇలా..

ఒక్కో ఇంజిన్ ఖరీదు:	రూ. 83,300
రాయితీ (40 శాతం):	రూ. 33,200
మత్స్యకారుడి వాటా:	రూ. 49,980

మంజూరైన ఇంజిన్లు (గ్రామాల వారీగా..)

గ్రామం	ఇంజిన్లు
రాజానగరం	14
బంగారమ్మపేట	1
రాజయ్యపేట	10
తంతడి	2
పూడిమడక	16
తిక్కవానిపాలెం	3
ముత్యాలమ్మపాలెం	12

ఆలోచన అదిరింది

శీతల పానీయాలు, తాగునీటి ప్లాస్టిక్ బాటిళ్లు వాడేసిన తర్వాత బయటకు విసిరేస్తుంటాం. పెదబొడ్డేపల్లిలోని డాన్‌బాస్కో డిగ్రీ కళాశాలలో ఇలా పారేయడానికి వీల్లేదు. ఇనుప చువ్వలతో పెద్ద సీసాలా తయారు చేసిన దానిలో తీసుకెళ్లి వేయాల్సిందే. ఇది నిండిన తర్వాత పారిశుద్ధ్య సిబ్బందికి అందజేస్తుంటారు. ఇలా చేయడం ప్లాస్టిక్ కాలుష్యం నియంత్రణకు దోహదపడుతుందని, కళాశాల ఆవరణ శుభ్రంగా ఉంటోందని అధ్యాపకులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

పారిశుద్ధ్య ఇబ్బందులు తీరేలా..

ఎస్సీ వసతిగృహాల్లో సిబ్బంది నియామకానికి ఆదేశాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే

దూర ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా ప్రభుత్వం ఎస్సీ, బీసీ వసతిగృహాలను నిర్వహిస్తోంది. గురుకులాలు, కేజీబీవీల్లో మినహా వీటిలో పారిశుద్ధ్య సిబ్బంది లేరు. ఇక్కడ పనిచేసే దిగువ స్థాయి సిబ్బంది/ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తుంటారు. అయినప్పటికీ శుభ్రత అనుకున్న స్థాయిలో జరగడంలేదు.

నక్కపల్లి ఎస్సీ వసతిగృహంలో కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు

త్వరలోనే నియామకం... ఇప్పటివరకు హాస్టళ్లలో ఉన్న సిబ్బందితోనే మరుగుదొడ్ల నిర్వహణ సాగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ప్రతి ఎస్సీ వసతిగృహానికి విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఒకరిద్దరు ప్రత్యేక సిబ్బంది నియమితమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం జీఓ ఇచ్చింది. త్వరలోనే వీరి నియామకం జరుగుతుంది. తద్వారా మరింత పరిశుభ్రత పెరుగుతుంది. – బి.రామానందం, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ

★ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హాస్టళ్ల అభివృద్ధి, వసతుల కల్పనకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే రూ.కోట్లు వెచ్చించి మరమ్మతు చేయడంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సరఫరా వ్యవస్థ మెరుగుపర్చడం చేశారు. తాజాగా ఎస్సీ వసతిగృహాల్లో పొరుగు సేవల విధానంలో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించేందుకు ఆదేశాలిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 1051 వసతిగృహాల్లో 1,365 మందిని నియమించడానికి అనుమతులు ఇచ్చింది. వంద మందిలోపు విద్యార్థులుంటే ఒకరు, అంతకు మించి ఉంటే ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించనున్నారు. ఇన్నాళ్లూ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలకు తెరపడనుంది. ప్రస్తుతం ఎస్సీ వసతిగృహాలకు మాత్రమే ఆదేశాలిచ్చినా, బీసీ వసతిగృహాలకు సంబంధించి త్వరలోనే ఆదేశాలు రానున్నాయి. ఇప్పటికే వీటి వివరాలను ప్రభుత్వం సంబంధిత శాఖ నుంచి సేకరించిందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

జిల్లాలో ఇలా..

ఎస్సీ బాలుర వసతిగృహాలు:	17
ఎస్సీ బాలికల వసతిగృహాలు:	13
విద్యార్థులు:	3,540

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ ఉపకార వేతన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. అనకాపల్లి పరిధిలో 9, నర్సీపట్నంలో 8 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 17 పరీక్ష కేంద్రాల్లో 3994 మంది విద్యార్థులకు 3857 మంది హాజరయ్యారు. 96.56 శాతం హాజరు నమోదు అయినట్లు డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు వెల్లడించారు. రెండు స్క్వాడ్ బృందాల సభ్యులు 12 పరీక్ష కేంద్రాలను, డీఈఓ అయిదు కేంద్రాలను తనిఖీ చేశారు.

Thus we will always be with the Lord.
1 THESSALONIANS 4:17
IN LOVING MEMORY

DOB: 06-08-1961
DOD: 28-11-2025
PEDAPATI ATCHYUTA RAO
M.A., M.E.O (RTD.)
FUNERAL SERVICE ON
08th Dec 2025 (Mon)
Please join us in celebrating the life and memory of our beloved Husband, Father, Brother and Grandfather and offering prayers for his peaceful journey ahead.
Venue: Oduru, Penumantra (Md.) West Godavari, 534126
Respond to this invitation by contacting sons:
RAHUL : 7288998059
ANAND : 7288994795
WITH HEARTFELT GRATITUDE
PEDAPATI FAMILY

వినతులు బుట్టదాఖలు!

గడువు సమీపిస్తున్నా పట్టని అధికారులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే

కలెక్టరేట్‌తోపాటు మండల, డివిజన్ కేంద్రాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వినతులు అధిక సంఖ్యలో వస్తున్నాయి. ప్రతి వారం 200కుపైగా వస్తుండగా.. గడువులోగా పరిష్కరించడంపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి సమస్యలు పరిష్కరిస్తారన్న నమ్మకంతో వ్యయప్రయాసలకోర్చి వస్తుంటే.. అధికారులు గడువులోగా పరిష్కారం చూపకుండా బుట్టదాఖలు చేస్తున్నారు. చాలా మంది అధికారులు గడువు మీరగానే సమస్యకు పరిష్కారం చూపినట్లు దస్త్రాలను మూసేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వినతులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశిస్తున్నా తీరు మారడం లేదు. ఫలితంగా ఒకే తరహా సమస్యలపై వినతులు పదేపదే వస్తున్నాయి.

సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు

✦ **వివిధ శాఖల తీరిలా..** పీజీఆర్ఎస్ ప్రారంభం నుంచి అర్జీలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిన ఆయా శాఖలకు ఇప్పటివరకు రెండు వేలకుపైగా నోటీసులు ఇచ్చారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖ 1,177, పోలీసు 246, మున్సిపాలిటీ 20, విద్యాశాఖ 5, సర్వే 156, పంచాయతీరాజ్ శాఖ 237 నోటీసులు అందుకున్నాయి.

✦ కలెక్టర్ విజయకృష్ణన్ వినతులపై సమీక్ష నిర్వహించే సమయంలో నోటీసులు అందుకున్న శాఖల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నా మార్పు రావడం లేదు. అర్జీదారులతో అమర్యాదగా మాట్లాడుతున్న వారి జాబితా సిద్ధమవుతోంది.

✦ మండల, డివిజన్ స్థాయి అధికారుల్లో కొందరు అర్జీదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎందుకు ఫిర్యాదు చేశారంటూ ప్రశ్నిస్తున్నారని చాలామంది అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ సకాలంలో పూర్తిచేయండి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్ ప్రాజెక్టులో భాగంగా అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీ గిరిధరరావు కోరారు. అచ్యుతాపురంలో ఆదివారం పర్యటించారు. ఆర్అండ్ఆర్ సమస్యలతోపాటు పరిహారం పంపిణీ, పనుల వేగం వంటి అంశాలపై ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించారు. పనుల్లో నాణ్యతతో పాటు రక్షణ ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లి 2027 మార్చి 15 నాటికి పూర్తిచేయాలన్నారు. ఆర్అండ్‌బీ డీఈ నరసింహమూర్తి, ఏఈ పద్మిని వెంట ఉన్నారు.

100వ జయంతి

మహాభాష్యం శేషాద్రి శాస్త్రి
(రిటైర్డ్ డిఐజి రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్)
08-12-1925 | 26-11-2000

మహాభాష్యం పిల్లా బాయి
1932-2015
ఇట్లు
మహాభాష్యం సుధాకర్ నిర్మల | సూరి సుజాత డా. నరసింహం | మహాభాష్యం జయకర్ మంజుల
మహాభాష్యం శ్రీనివాస్ సురేఖ మాధురి | మహాభాష్యం నరశింహమూర్తి అరుణ | మరియు మనుమలు, మనుమరాళ్ళు

సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

ఎలమంచిలి, నక్కపల్లి, న్యూస్‌టుడే

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలుకానుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆదివారం మధ్యాహ్న భోజనం అందించారు.

తొలిరోజు హాజరైన విద్యార్థులు : పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాల సాధనకు విద్యాశాఖ వంద రోజుల ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 6 నుంచి అమలవుతుండగా సెలవు రోజుల్లోనూ మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు.

● రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెండు సబ్జెక్టులపై అదనపు తరగతులు నిర్వహిస్తారు. తరగతుల అనంతరం విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేశాక ఇళ్లకు పంపుతారు. ఈ ఆదివారం భోజనంలో పప్పు, కోడిగుడ్డు కూర వడ్డించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శత శాతం ఉండగా, కొన్ని చోట్ల తక్కువగా ఉంది.

● ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెం ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులకు 21 మంది హాజరయ్యారు. వీరంతా భోజనం చేశారు. ఎలమంచిలి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులకు 8 మందే భోజనం చేశారు. మిగిలిన వారంతా భోజనానికి ఇళ్లకు వెళ్లిపోయారు.

పక్కాగా అమలు చేయాలి.. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి పది విద్యార్థి కచ్చితంగా అన్ని రోజులు బడికి వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించాం. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు మధ్యాహ్నం భోజనం చేసి ఇళ్లకు వెళ్లిపోతారు. స్థానికులైతే సాయంత్రం వరకు ఉంటారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వచ్చిన విద్యార్థులందరికీ నిర్దేశించిన మెనూ పక్కాగా అమలు చేయాలి.

– అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

పాఠశాలలు.. విద్యార్థులు	జడ్పీ:	ప్రభుత్వ:	మున్సిపల్:	ఎయిడెడ్, అన్ ఎయిడెడ్:	కేంద్ర ప్రభుత్వ	విద్యార్థులు:	బాలురు:	బాలికలు:	ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారు:
	213	27	06	151	2	20,760	10,485	10,275	14,392

సీఎంఆర్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

అయ్యన్న దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న సీఎంఆర్ అధినేత వెంకటరమణ తదితరులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ జ్యువెలరీ షోరూంను సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు ఆదివారం ప్రారంభించారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా నర్సీపట్నంలో నగల దుకాణం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సీఎంఆర్ అంటే నమ్మకమన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 45 వస్త్ర దుకాణాలు, 14 జ్యువెలరీ షోరూంలు ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ వ్యాపారవేత్తగానే కాకుండా సామాజిక సేవకుడిగానూ గుర్తింపు పొందారన్నారు. నర్సీపట్నంలో కృతజ్ఞతగా రూ.30 లక్షలతో ఉద్యానవనం తీర్చిదిద్దారని కొనియాడారు. వెంకటరమణ మాట్లాడుతూ.. నర్సీపట్నం షోరూంలో 200 మందికి ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. జేవీవీ బంగార్రాజు, వెలగా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు విద్యార్థీ.. విజయీభవ..!

గురుకులాల్లో నీట్, జేఈఈల్లో ఉచిత శిక్షణ

ప్రత్యేకంగా మెటీరియల్ తయారీ

జిల్లాల వారీగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు..		కోర్సుల వారీగా..
శ్రీకాకుళం: 24	విశాఖ: 14	నీట్: 14
విజయనగరం: 36	14	జేఈఈ: 60

అరిలోవ, న్యూస్‌టుడే: పేద విద్యార్థులు నీట్, జేఈఈల్లో ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురుకుల పాఠశాలల్లో శిక్షణ ఇవ్వడానికి ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి జిల్లాల విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం విద్యార్థుల(బాలుర)కు శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో, అమ్మాయిలకు విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని గురుకుల పాఠశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో మన్యం ప్రాంత విద్యార్థులకు అవకాశం ఇచ్చారు.


తరగతి గదిలో బోధిస్తున్న అధ్యాపకుడు

ఎంపిక ఇలా: పదో తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు నిష్ణాతులైన సీనియర్ అధ్యాపకులను నియమించారు. అంతేకాకుండా ఇంజినీరింగ్, మెడిసిన్‌కు వేర్వేరుగా ప్రత్యేక మెటీరియల్ రూపొందించారు. వాటిని విద్యార్థులకు ఇచ్చి సాధన చేయిస్తున్నారు. వారు అర్థం చేసుకునేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో బోధిస్తున్నారు.

కార్పొరేట్ సంస్థల నుంచి అధ్యాపకులు: మొదటి దశ జేఈఈ మెయిన్ పరీక్షలు వచ్చే ఏడాది జనవరి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. కేవలం 40రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కోర్సును పూర్తి చేసి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల చేత పాత ప్రశ్నపత్రాలను సాధన చేయిస్తున్నామని అధ్యాపకులు వాణి తెలిపారు. నారాయణ అకాడమీ ప్రత్యేక మెటీరియల్ అందజేసింది, ఇన్ఫినిటీ అకాడమీ ట్రైనింగ్ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థల నుంచి అధ్యాపకులను రప్పించి శిక్షణ ఇప్పిస్తున్నామని శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల/కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మురళి తెలిపారు.

నీట్, జేఈఈ మెటీరియల్

పక్కాగా సమయ పాలన
- ఉదయం 5 గంటలకు నిద్రలేవడం.
- 5.30 గంటల వరకు కాలకృత్యాలు
- 5.30 గంటల నుంచి ఆసనాలు, ధ్యానం, వ్యాయామం..
- ఉదయం 6 నుంచి 8 వరకు విద్యార్థుల సాధన.
- సాయంత్రం 6 నుంచి 7వరకు, రాత్రి 9 నుంచి 10 వరకు పునశ్చరణ.
- పోషకాహారం, నిద్ర, ఆరోగ్యంపై జాగ్రత్తలు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి

గొలుగొండ, న్యూస్‌టుడే: ఆర్టీసీలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అధిక పింఛన్ తక్షణమే అమలు చేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏఎల్‌పురం రాజులబాబు ఆలయం వద్ద ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకుని తమ సమస్యలపై చర్చించారు. సుప్రీంకోర్టు ఆదేశించినా పింఛన్ అమలుపై అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ ఎదుగుదలకు సేవలు అందించిన తమకు వైద్య సదుపాయంతోపాటు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని కోరారు.

కనులపండువగా వెంకన్న కల్యాణం

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్నకు ఆలయంలో ఆదివారం నిర్వహించిన కల్యాణం కనుల పండువగా సాగింది. ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, సాయిగోపాలాచార్యులు, పవన్‌తో పాటు మరికొంత మంది కలిసి ఈ క్రతువును నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష పూజలనంతరం క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకం, లక్ష తులసి పూజ జరిపారు. గుడి ఆవరణలో సన్నాయి వాయిద్యాల నడుమ కలశ ఊరేగింపు జరిగింది. తర్వాత గోదాదేవికి లక్ష కుంకుమార్చన చేపట్టారు. ఈ పూజల తర్వాత సతీసమేతుడైన శ్రీవారి ఉత్సవమూర్తులకు ఆలయ అద్దాల మండపంలో శాంతి కల్యాణం జరిపారు. అర్చకులు, వేద పండితులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. వేడుక ఆద్యంతం కమనీయంగా నిర్వహించడంతో భక్తులు పరవశించిపోయారు. గోవింద నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మూర్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమలకు పాదయాత్ర

అనకాపల్లి పట్టణం, మునగపాక, న్యూస్‌టుడే: అనకాపల్లి నుంచి తిరుమలకు 11 మంది భక్తులు పాదయాత్ర చేపట్టారు. ఆదివారం ప్రారంభమైన కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి, సీతానగరం, వాడ్రాపల్లి ప్రాంతానికి చెందిన 11 మంది పాల్గొన్నారు. గాంధీనగరం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేసి బయలుదేరారు. తెదేపా నేత దాడి రత్నాకర్, జబర్దస్త్ నటుడు సత్తిపండు, అర్చక సంఘ ఎగ్జామినర్ రేజేటి రామాచార్యులు, కన్నబాబు, చక్రవర్తి వీరిని పాదయాత్రను ప్రారంభించారు.

పాదయాత్రలో భక్తులు

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఘంటసాల

ఎలమంచిలి, న్యూస్‌టుడే: సంగీతం బతికి ఉన్నంత కాలం ఘంటసాల ప్రజల గుండెల్లో చిరంజీవిగా ఉంటారని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అమరగాయకుడి జయంత్యుత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంగీత కళాకారులను గౌరవించాలన్నారు. నియోజకవర్గంలో యోగా కేంద్రాలు ఏర్పాటు చేస్తానన్నారు. సాయంత్రం వరకూ గాయకులు పాటలు ఆలపించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ విభాగంలో హరిణి ప్రథమ, అప్పారావు ద్వితీయ, జగదీశ్వరి తృతీయ, సూర్యకుమారి ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. జూనియర్ విభాగంలో కొండపల్లి శ్రీప్రజ్ఞ ప్రథమ, ఎం.మణిదీపిక ద్వితీయ, డి.మౌనిక తృతీయ, సన్యాసమ్మ ప్రత్యేక బహుమతి పొందారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, నాయకులు రవికుమార్, రంగనాయకులు, నానాజీ, కొండబాబు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే విజయకుమార్

మంచి సమాజం విద్యార్థుల చేతుల్లోనే..

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మంచి సమాజం నిర్మాణం మీ చేతుల్లోనే ఉందని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ విద్యార్థులకు సూచించారు. క్రైట్స్ కళాశాల వార్షికోత్సవం, ఫ్రెషర్స్‌డే వేడుకకు ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.10 వేల చెక్కు అందజేశారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటుచేసుకొని వాటి సాధనకు కృషిచేయాలన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అచ్యుతాపురం అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చెందడం ఖాయమని కంపెనీల్లో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రైట్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, సీఐ చంద్రశేఖరరావు, ఎస్సై సుధాకరరావు, సర్పంచి కూండ్రపు విమలకుమారి, వెంకునాయుడు, రెడ్డి అప్పలనాయుడు, గణేష్, విల్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాంబిల్లి, న్యూస్‌టుడే: సముద్రతీర గ్రామాల్లో ఇష్టానుసారంగా తరలిస్తున్న ఇసుకపై నిఘా వేసిన పోలీసులు వాడపాలెంలో ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇసుకలోడుతో పట్టుబడ్డ ఆ ట్రాక్టర్‌పై కేసు నమోదుచేసి తహసీల్దారుకు నివేదించామని సీఐ సీహెచ్.నరసింగరావు చెప్పారు. గతనెల 30న 'తీరంలో ఇసుక దందా' శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన కథనంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం రాత్రి ఇసుకతో ట్రాక్టర్‌ని పట్టుకున్నారు. తీరంలో ఎంతటివారు ఇసుకలు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర కార్యవర్గం ఎంపిక

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రామిక మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి మాట్లాడుతూ వేతన కమిటీని వెంటనే వేయాలని కోరారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకంపై సిబ్బంది, తమ సంఘాలతో చర్చించాలని కోరారు. రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ సీతాలక్ష్మి, ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు జిలానీబాషా, అధ్యక్షులు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, కృష్ణారావు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులు

ఎంపీ రమేశ్‌కు కేంద్ర సహాయ మంత్రి పరామర్శ

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కుటుంబ సభ్యులను కేంద్ర సహాయ మంత్రి, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు పరామర్శించారు. ఎంపీ రమేశ్ తల్లి రత్నమ్మ ఇటీవల తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చేరుకుని చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తమిళనాడు రాష్ట్ర చేనేత టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఆర్.గాంధీ, ఎంపీలు పుట్టా మహేష్ యాదవ్, లావు శ్రీకృష్ణదేవరాయులు, సుప్రియాసూలే, నిషికాంత్‌దూబె శ్రీకాంత్ షిండే, భోలాసింగ్, సంజయ్‌జైశ్వాల్, నీరజ్‌శేఖర్, మాజీ మంత్రి సంజయ్ బాల్యాన్, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, తదితరులు ఎంపీ రమేశ్‌ను పరామర్శించారు.

నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, ఎంపీలు

సామాజిక భవన నిర్మాణానికి చొరవ

అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే: అనకాపల్లిలో కమ్మ సామాజిక భవనాన్ని నిర్మించేలా చొరవ చూపుతామని కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి ప్రకటించారు. జిల్లా కమ్మ ఆత్మీయ సమ్మేళనం కశింకోట మండలం బయ్యవరంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంఘటితంగా ఉండి సమస్యలు పరిష్కరించుకునేలా చొరవ చూపాలన్నారు. సంఘ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కాకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ అవసరమైన వారికి విద్య, వైద్యం, ఆర్థిక అవసరాలపై అసోసియేషన్ సహకారం అందిస్తుందన్నారు. సంఘం తరపున సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. జిల్లా నలుమూలల నుంచి హాజరైన వారంతా సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. బ్రహ్మం చౌదరికి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాకర్ల రమేష్‌బాబు, కార్యదర్శి కొల్లి శ్రీనివాస్ తదితరులు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జ అజయ్, సేవా సమాఖ్య అధ్యక్షులు మండల మురళీకృష్ణ, పారిశ్రామిక వేత్త పరుచూరి భాస్కరరావు, యూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వెంగమాంబ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న బ్రహ్మం చౌదరి

'స్థానికం'లో యాదవులకు ప్రాధాన్యం ఇవ్వండి

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థ ఎన్నికల్లో యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన సాయినాథ్ పేర్కొన్నారు. శంకరం బొజ్జన్న కొండ వద్ద ఆదివారం నియోజకవర్గ యాదవ సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి మండల అధ్యక్షుడిగా పంచదార్ల కాన్నరావు, ప్రధాన కార్యదర్శిగా కురందాసు ముత్యాల నాయుడు, కశింకోట మండల అధ్యక్షుడిగా కరక రాజు, ప్రధాన కార్యదర్శి చొప్పా అప్పలనాయుడు, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడిగా కారుకుండి కన్నా, ప్రధాన కార్యదర్శిగా కోన ఉమా ఎన్నికయ్యారు. నియోజకవర్గ అధ్యక్షుడుగా పంచదార్ల సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి రాము యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న సాయినాథ్

నాయకత్వ లక్షణాలపై అవగాహన

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై పురుషోత్తం తెలిపారు. అరట్లకోటలో స్పేస్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ..యువత వ్యసనాలకు జోలికి వెళ్లవద్దని సూచించారు. చదువుల ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ధూమపానం, మద్యం ద్వారా వచ్చే అనర్థాలపై గ్రామస్థులకు, యువకులకు విద్యార్థులు ప్రదర్శన ద్వారా వివరించారు. నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. సర్పంచి పి. అప్పలనర్స, వేమూల వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం అధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్సై పురుషోత్తం తదితరులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక జడ్పీ పాఠశాలలో 1981-82లో పదోతరగతి విద్యార్థులు ఆదివారం వాడ్రాపల్లి దక్షిణేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమావేశమయ్యారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ప్రతినిధులు ప్రసాదు, ఆడారి మహేష్, యల్లపు గోవింద, ఆడారి లక్ష్మణరావు, సూర్యనారాయణ, భరణి, జగ్గారావు పాల్గొన్నారు.

పరదేశమ్మకు బోనాలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎర్రవరం గ్రామంలో ఆదివారం రాత్రి పరదేశమ్మ బోనాల పండగ అందరినీ ఆకట్టుకుంది. మహిళలు బోనాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలంతా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిట్టా శ్రీను కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎర్రవరంలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

నక్కపల్లి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల్లో వెనుకబడిన వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సమగ్ర శిక్షా ఏపీసీ పెన్నాడ అప్పారావు సూచించారు. నక్కపల్లి కేజీబీవీ, ఉన్నత పాఠశాలల్లో ఆదివారం ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారిలో ప్రగతి స్థాయి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠ్యాంశాల వారీగా విద్యార్థుల్లో ప్రగతి స్థాయులను గుర్తించి నివేదించాలన్నారు. ఎవరైతే వెనుబడినట్లున్నారో వారిని దత్తత తీసుకుని ప్రగతి మెరుగుపడేలా చూడాలన్నారు. రోజూవారీ, వారంతపు పరీక్షలను నిర్వహించాలన్నారు. దేవవరంలో తరగతులను ఎంఈఓ కె.నరేశ్ పరిశీలించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ అప్పారావు

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఐక్య పోరాటాల ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి తెలిపారు. మండలకేంద్రంలో ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించడం చాలా అన్యాయమన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దని చెబుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయడంతో పాటు ఐఆర్ ప్రకటించాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన మండల కార్యవర్గ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షునిగా మారిశెట్టి వెంకట అప్పారావు, అధ్యక్షునిగా రెయ్యి రవికుమార్, ఉపాధ్యక్షులు- వియ్యపు అరుణ, గణేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి- మాత సూర్యలక్ష్మి, కోశాధికారి- కడలి పారిజాతం తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకునిగా జీఎస్ ప్రకాశ్ హాజరయ్యారు.

నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

EENADU eClassifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 9121314141.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

Vastu Consultants genuine India's best vastu for Industries / houses rural / urban Ph:9676119507, 9014285369.

REAL ESTATE

GENERAL

భోగాపురంలో ఇండిపెండెంట్ హౌస్ 48 లక్షలు. ఓపెన్ ప్లాటు గజం 9వేలు, 12వేలు, 14వేలు. ప్రతి ప్లాటుపై 5గ్రా గోల్డ్ కాయిన్. సెల్: 9701598389.

FLAT FOR SALE

GENERAL

First Floor Apartment with Covered Parking in Madhurawada. Ph:- 7013705474.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

Building for Sale. 121 Sq.Yds. Cellar+ G+1 North East Corner Excellent Vastu. Prime Location Atchuthapuram. 9885824528.

PLOT FOR SALE

KURMANNAPALEM

కూర్మన్నపాలెం దగ్గరలో VUDA Layout గల కాలనీలో 220 చ॥గజాల నివాసస్థలం అమ్మకానికి కలదు. Cont Phone No: 9949759177.

WANTED

GENERAL

భీమిలి సంగివలస కొమ్మాది ప్రాంతంలో 3 బెడ్‌రూమ్ హౌస్ 30 Feet Road /ఇండిపెండెంట్ హౌస్ కావాలి. డైరెక్ట్ పార్టీలు మాత్రమే. సంప్ర॥ వాట్సాప్ /ఫోన్: 7337456288.

JOBS

Wanted Staff in Saree Store Sales Boys, Sales Girls experience must be 2 to 3 years. Contact: 9394311123.

Required M/F Candidates for Admin Managers. Working or Retd/ VRS From any field can call above 40yrs. Salary + Inc; to be Finalised on : 8th & 9th During Interview. Ph: 8919140915.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 టు 29000 వ:18-35 ✆: 77309 58410.

కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (F) కావలెను. ఆకర్షణీయమైన జీతం. Whatsapp: 9949129054, 9347473257.

ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పని చేయుటకు 18-35 వయస్సుగల యువతీయువకులు కావలెను. జీతం: 10,000-13500 ఫుడ్+రూము 9704637370, 9949904532.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:20k. ✆ 89776 39662,89776 39663.

హైదరాబాద్‌లో పనిచేయడానికి M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 20,000+భోజనము+వసతి. ఈ జీతం నెల 20లోపు జాయిన్ అయిన వారికి మాత్రమే. +91 76809 22316.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, All (డిగ్రీ, B.Tech, Dip. & ITI) కావలెను. Sal: 18-25K, Age: 35లోపు, స్పాట్ జాయిన్ ✆ 7995439539.

ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీ నందు అపార్ట్‌మెంట్ హౌస్ ఫ్లాట్ సేల్స్ ప్రమోషన్ చేయుటకు అనుభవం గల యువకులు కావలెను. అచ్యుతపురం వైజాగ్. ✆9347756501

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖ స్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 150 మంది 8గం॥ డ్యూటీ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది (Ex -Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం:30,000/- యూనీఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

FACULTY/ TEACHERS

Tutors for Full Stack Python, Java Tutors for B.Tech,ECE, EEE Subjects PDC, SS, CS, EDS, Physics, ICSE, CBSE (6-10th) 9397955328.

ఆకట్టుకున్న సిరిగంధం నాటిక

మునగపాక, న్యూస్‌టుడే: మిత్ర కళా నాట్యమండలి ప్రదర్శించిన 'సిరి గంధం' నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మునగపాకలో ఆదివారం రాత్రి నాటకరంగ దర్శకులు మొతికా సాంబశివరావు సంస్మరణ కార్యక్రమం సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటిక అలరించింది. గవర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాదు, దాడి ముసిలినాయుడు, బద్దెం సూర్యనారాయణ, ఎస్.శ్రీను, ఏవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నాటికలో ఓ సన్నివేశం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

ఉక్కునగరం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారంలోని కోకోవెన్ బ్యాటరీ-3లో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ఓ ఛార్జింగ్ కారు మంటల్లో దగ్ధమైంది. 305 నంబర్ ఒవెన్‌కు ఛార్జింగ్ జరుగుతుండగా.. అది పూర్తైన తర్వాత లిఫ్ట్ కాకపోవడంతో సమస్య తలెత్తింది. ఈ లోపం కారణంగా ఓవెన్ నుంచి వచ్చిన మంటలు ఛార్జింగ్ కారుకు అంటుకున్నాయి. దీంతో ఛార్జింగ్ కారు సహా ఎంసీసీ పూర్తిగా కాలిపోయాయి. సి.ఐ.ఎస్.ఎఫ్. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కొంతసేపు ఇబ్బంది తలెత్తినా వెంటనే మళ్లీ పనులు కొనసాగాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

కోకోవెన్ బ్యాటరీలో మంటలు

గృహహింస కేసు నమోదు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: బలిఘట్టానికి చెందిన అల్లంపల్లి ఈశ్వరరావుపై గృహహింస కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ గఫూర్ ఆదివారం తెలిపారు. రెండేళ్లుగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఈశ్వరరావు భార్య లక్ష్మి ఫిర్యాదు చేశారన్నారు. ఈశ్వరరావుపై పట్టణ స్టేషన్‌లో తొమ్మిది కేసులు ఉన్నాయని, రౌడీ షీట్ తెరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలస్యంగా కిరండూల్ పాసింజర్

అరకులోయ, న్యూస్‌టుడే: విశాఖపట్నం నుంచి కిరండూల్ వెళ్లే పాసింజర్ రైలు సాంకేతిక సమస్య కారణంగా ఆదివారం ఆలస్యంగా అరకు చేరుకుంది. చిమిడిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో విద్యుత్తు తీగల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో మూడున్నర గంటలపాటు అక్కడే నిలిపివేశారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	126	125
లైవ్	153	145
డ్రెస్డ్	222	260
స్కిన్‌లెస్	252	270

(c) eenadu

అనకాపల్లి
• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **రాజు వెడ్స్ రాంబాయి,** సత్యనారాయణ స్క్రీన్2: **స్కూల్ లైఫ్,** పర్తిసాయి: **ప్రేమంటే,** షిర్డిసాయి: **అమర కావ్యం,** రామచంద్ర: **జనతాబార్,** సత్యనారాయణ స్క్రీన్1: **ఆంధ్ర కింగ్ తాలూకా,** వెంకటేశ్వర: **బిజినెస్ మేన్,** **అచ్యుతాపురం:** ఎస్‌టీబీఎల్ స్క్రీన్-1 **ఆంధ్ర కింగ్ తాలూకా,** స్క్రీన్-2: **రివాల్వర్ రీటా**

ఎన్జీఓ సంఘ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ నేడు

పాయకరావుపేట గ్రామీణం: ఈ నెల 15న నిర్వహించనున్న ఏపీ ఎన్జీఓ సంఘం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సోమవారం నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి జీవి రమణ బాబు తెలిపారు. పోటీచేయదలచిన వారు పాయకరావుపేట ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సాయంత్రం అయిదు గంటల లోపు అందజేయాలన్నారు. ఉద్యోగులందరూ ఎన్నికలో పాల్గొనాలని సూచించారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పది విద్యార్థులకు స్టడీ అవర్స్ ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. శతశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా 100 రోజుల ప్రణాళిక ఇచ్చారు. దీనిలోభాగంగా ఆదివారం నుంచి ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల సహా మండలంలోని ఎస్.నర్సాపురం, రాజానగరం, సత్యవరం పాఠశాలల్లో ఈ తరగతులు నిర్వహించారు. వీటిని ఎంఈఓ-2 రమేష్‌బాబు పరిశీలించారు.

ఎలమంచిలి: పట్టణంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నమూనా పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోవడానికి ఈ నమూనా పరీక్షలు నిర్వహించామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జీ చెప్పారు. 500 మందికి పైగా హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారికి త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు.

స్టడీ అవర్‌లో విద్యార్థులు

భగవద్గీత శ్లోకాల్లో దిట్టలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

భగవద్గీత శ్లోకాల పఠనంపై విద్యార్థులు చూపిన ప్రతిభ పలువురిని ఆకట్టుకుంది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అనకాపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఆలపించిన శ్లోకాలు అలరించాయి. మండల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు శ్రీకాళహస్తి, విల్లూరి శ్రీనివాసరావు, బీఎస్ గుప్త, తాతాజీ చేతుల మీదగా బహుమతులు అందజేశారు. వీరిని జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈనెల 16న వీరికి పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. విజయవాడలో ఈనెల 25న రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలు జరగనున్నాయి.

శ్లోకాలు చెబుతున్న విద్యార్థిని

జ్ఞాపకశక్తి పెంపొందుతుంది..: భగవద్గీత శ్లోకాలు నేర్చుకోవడం వల్ల జ్ఞానంతో పాటు జ్ఞాపకశక్తి పెంపొందుతుంది. 18 అధ్యాయాల్లోని శ్లోకాలు నేర్చుకున్నారు. 2023లో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించాను. ఇంట్లో భగవద్గీత శ్లోకాలను చదివేవారు. అప్పటినుంచే ఆసక్తి పెరిగింది.
– గోపిశెట్టి నాగసృజన, డిగ్రీ విద్యార్థిని

ప్రతిభ చూపేలా సాధన

భగవద్గీత శ్లోకాలు నేర్చుకోవాలన్న ఆసక్తితో పాఠశాల ఉపాధ్యాయిని సహకారంతో నేర్చుకున్నాం. ఇదే స్ఫూర్తితో పోటీలో పాల్గొన్నాం. మాతో పాటు చాలామంది పోటీ పడ్డారు. జిల్లాస్థాయి పోటీలో ప్రతిభచూపేలా సాధన చేస్తున్నాం.
– ఎస్‌కే పాతిమా హసీరా, రోషిత

రాష్ట్రస్థాయిలో సత్తా చాటేలా..

గతంలో రాష్ట్రస్థాయి పోటీల్లో మూడోస్థానం వచ్చింది. ఈసారి ప్రథమ స్థానంలో నిలిచేలా సాధన చేస్తున్నా. భగవద్గీత శ్లోకాలను నేర్చుకోవడం వల్ల మనలో చాలా మార్పు వస్తుంది. చదువుతో పాటు వీటిని సాధన చేశా. ఈసారి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చేస్తున్నాననే నమ్మకం కుదిరింది. **– సాయి సాత్విక్, తొమ్మిదో తరగతి**

ప్రతి ఒక్కరూ పఠనం చేయాలి

మునగపాక, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలని తిరుమల తిరుపతి ధర్మాచార్య బి.నరసింహమూర్తి అన్నారు. మునగపాక కాశీవిశ్వేరాలయంలో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. శరగడం పరదేశినాయుడు, తేలు నూకరాజు, పెంటకోట జగన్నాథం నాయుడు, రామసీత, జోగేశ్వరరావు పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: కంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాజీ వైస్ ఎంపీపీ పిట్టా శ్రీను అన్నారు. ఎర్రవరంలో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 230 మందికి కంటి పరీక్షలు చేశారు. 16 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖపట్నం తరలించారు. ఫౌండేషన్ మేనేజర్ అరుణ్‌కుమార్, పిట్టా గోవింద, రమణ, వీసం గంగరాజు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో 60 మంది రోగులకు వైద్యులు నాగార్జున పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్షేత్ర ట్రస్టీ ఆంజనేయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రవరంలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

వివాదాల జోలికెళ్లొద్దు

మునగపాక, న్యూస్‌టుడే: గణపర్తిలో గౌరీప రమేశ్వరుల ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ ధనుంజయరావు సూచించారు. ఎలాంటి వివాదాలు సృష్టించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మునగపాక పోలీస్‌స్టేషన్‌లో 24 మందితో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎస్సై ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు తెలిపారు. పట్టణంలోని పార్కుసెంటర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మత్తుపదార్థాలకు కలిగే అనర్థాలకు వివరించారు. మహాలక్ష్మినాయుడు. గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.

రేగుపాలెంలో జాతీయ జెండాలతో విద్యార్థులు

వందేమాతర గీతాలాపన

ఎలమంచిలి గ్రామీణం: వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా రేగుపాలెంలో ఎలమంచిలి గురజాడ డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ జెండాలతో వందేమాతర గీతాలపన చేశారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు వివరించారు. ఎన్ఎస్ఎస్‌పీఓ చిట్టిబాబు పాల్గొన్నారు.

అధ్వానంగా నీటి వాల్వ్‌లు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లకు ఏర్పాటు చేసిన వాల్వ్‌లు అధ్వానంగా ఉన్నాయి. ఆయాచోట్ల సరఫరాల్లో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు, మరమ్మతు చేసేందుకు ఇవీ కీలకంగా ఉపయోగపడతాయి. పీఎల్‌పురం, నామవరం తదితర చోట్ల వాల్వ్‌లు మురుగులో కనిపిస్తున్నాయి. లీకుల వద్ద మురుగు చేరితే ఈ నీటిని తాగేవారికి రోగాలు వ్యాపించే ప్రమాదముంది. సీతారాంపురం వద్ద వ్యర్థాలతో నిండి ఉన్నాయి. వీటిని శుభ్రం చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ

కశింకోట, న్యూస్‌టుడే దివ్యాంగుల్లో ఆత్మన్యూనతాభావాన్ని తొలగించాలని జిల్లా సహిత విద్యా కోఆర్డినేటరు రామకృష్ణనాయుడు అన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో భాగంగా ఆదివారం బయ్యవరం ఆదర్శ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల వేదిక, స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో దివ్యాంగ కుటుంబాలకు దుప్పట్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి హాజరైన 300 మందికి పోటీల, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కొరుప్రోలు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్ఫూర్తి కళాశాల కరస్పాండెంట్ జి.నానాజీ, ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్, వేపాడ ఎంపీడీవో సీహెచ్.సూర్యనారాయణ, డీసీసీబీ చీఫ్ మేనేజరు ఎల్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విద్యాభివృద్ధికి తోడ్పాటు

మునగపాక: విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని గౌతమపఠన మందిర అధ్యక్షుడు మారిశెట్టి అప్పారావు అన్నారు. మునగపాక పరదేశిమాంబ ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటు ఉన్నాయన్నారు. . సభ్యులకు క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మందిర కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు, బద్దెం సూర్యనారాయణ, దాడి ముసిలినాయుడు, సూరిబాబు, దాడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడికి జనసేన నాయకుడి సాయం

నక్కపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న రాజయ్యపేటకు చెందిన మత్స్యకారుడు చొక్కా కాశీ జనసేన నాయకుడు పిక్కిస్వామి ఆదివారం ఆర్థిక సాయం చేశారు. ఆయన కుటుంబానికి రూ. 5వేలు నగదుతో పాటు, నిత్యావసర సరకులు అందజేశారు.

నేడు ప్రజాదర్బార్

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని గాంధీనగరం శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులతో కలిసి సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

శిథిల భవనం తొలగింపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని లింగాలతోట కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని శిథిల భవనాన్ని తొలగించారు. ఈ భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. కొత్త భవనం నిర్మాణానికి హోంమంత్రి వంగలపూడి అనిత నిధులు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో తెదేపా పట్టణశాఖ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు తన సొంత నిధులతో భవనాన్ని తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఎస్.రాయవరం: రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాల్లో ముసలమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన వృద్ధులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. యజ్జల ముసలమ్మ మూడో వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు బంగారుచిట్టి, స్నేహితులతో కలిసి రెండు గ్రామాల్లోనూ 150 మందికి ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు.

ఘనంగా ఖాదర్‌వల్లీ ఉర్సు వేడుక

నక్కపల్లి, న్యూస్‌టుడే: పెదబోదుగల్లంలో ఆదివారం ఖాదర్‌వల్లీ ఉర్సు వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం మసీదులో ప్రార్థనల తర్వాత గుర్రాన్ని అందంగా అలంకరించారు. తర్వాత వీధుల్లోకి ఊరేగింపుగా తీసుకెళ్లగా స్థానికులు చందనం పూసిన బావుటాలను గుర్రంపై వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీటిని ఇక్కడి ఖాదర్‌వల్లీ నిషాని వద్దకు తీసుకెళ్లి మత పెద్దలు పూజలనంతరం బావుటాలను ఆవిష్కరించారు. మధ్యాహ్నం సామూహిక విందు ఏర్పాటు చేసుకున్నారు.

పెదబోదుగల్లంలో గుర్రంపై బావుటాల ఊరేగింపు

బోనాలు ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా బోనాల ఊరేగింపు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం మండలం పెనుగొల్లులో ఆదివారం బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భవానీ మాలధారులు విజయవాడ అమ్మవారి దర్శనానికి వెళ్తున్న సందర్భంగా బోనాల సంబరం ఏర్పాటు చేశారు. భవానీ భక్తులు, మహిళలు ఘటాలను వీధుల్లో ఊరేగించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కశింకోట: మార్గశిర ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని కశింకోటలో ఆదివారం త్రిపురాంతకస్వామికి ప్రదోషకాలంలో విభూతి అర్చన చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కోడిపందేలపై దాడి

కశింకోట: నర్సింగబిల్లిలో కోడిపందేల శిబిరంపై దాడిచేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. రూ. 650 నగదు, స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. పిల్లలు వీధుల్లోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. **– జగదీష్, స్థానికుడు,** ✓: వీధి దీపాలు వేయిస్తాం. సమస్య పరిష్కరిస్తాం. **– కె.డేవిడ్, ఈవో**

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: అనకాపల్లిలోని గవరపాలెం రహదారులను స్థానికులు భోజనాలు పెట్టేందుకు మూసివేస్తున్నారు. ఇబ్బందిగా ఉంది. **– ఏ.లక్ష్మి, అనకాపల్లి,** ✓: అనుమతి లేకుండా రహదారి మూసివేస్తే చర్యలు తీసుకుంటాం. **– చక్రవర్తి, జోనల్ కమిషనర్**

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: అనకాపల్లి చదువుల వారివీధిలో సీసీ రోడ్డు గోతులు పడింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **– సుధాకర్, అనకాపల్లి,** ✓: మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. **– గోపాలకృష్ణ, జీవీఎంసీ డీఈ**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: అచ్యుతాపురంలో మురుగును దుప్పితూరు చెరువులోకి విడిచిపెడుతున్నారు. దీని వల్ల పశువులకు సైతం చెరువులో నీరు తాగడానికి వీలుకావడంలేదు. **– గోవిందరావు, దుప్పితూరు,** ✓: మురుగు చెరువులో కలవకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. **– చిన్నారావు, ఎంపీడీఓ**

ఆదర్శమూర్తికి అశ్రుతాంజలి

స్వర్గప్రాప్తి: 27-11-2025
కీ॥శే॥ శ్రీ సూరకాసుల నారాయణరావు గారు
ప్రొప్రయిటర్: శ్రీ వెంకటేశ్వర లాడ్జి, యస్.ఎన్.ఆర్. వైన్స్ & యస్.ఎన్.ఆర్. ఆక్వాఫామ్, యలమంచిలి
మీ రూపం మా కళ్ళ ఎదుటనే ఉంది...
మీ మాటలు మాకు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి...
మీ చిరునవ్వు మాకు కనిపిస్తూనే ఉంది...
మీరు లేరనే మాట మా శ్వాసకు అడ్డుపడుతూనే ఉంది...
మీరు భౌతికంగా మాకుదూ లేకున్నా మా అందరి మనస్సులో మీ హృదయాన్ని పలకరించగలగడం ఆశతో జీవిస్తున్నాము. మమ్ముల్ని వీడి అకస్మిక మరణం పొందిన మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో... భార్య శ్రీమతి సూరకాసుల ఆదిలక్ష్మి
కుమారులు - కోడళ్లు: సూరకాసుల శ్రీనివాసరావు - సత్యవతి, సూరకాసుల నానాజీ - నాగమణి
కుమార్తె - అల్లుడు: కొఠారు మంగతాయారు - నానాజీ
మనుమలు: సంజీవ్‌కుమార్, యశ్వంత్ నారాయణ, సోమేష్, సుమంత్, రేవంత్
మనుమరాళ్లు: కోమలి, మౌనిక, లహరి, వేదిక మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
పెద్దకర్మ: తేది. 08-12-2025 సోమవారం ఉ॥ 11.00 గం॥ల నుండి యలమంచిలి, ధర్మవరం వీధిలో మా స్వగృహము నందు జరుపబడును.

అమృతమూర్తికి అశ్రుతాంజలి

జననం: 10-04-1945 మరణం: 26-11-2025
మంచిమనిషి, నిష్కలంక హృదయులు, మాకు అత్యంత ఆప్తులు, గౌరవనీయులు డా॥ సి.ఎం. రమేష్ గారి మాతృమూర్తి గారైన కీ॥శే॥ శ్రీమతి చింతకుంట రత్నమ్మ గారు ఆకస్మికంగా మానుండి దూరమై దైవసన్నిధికి చేరినందుకు చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ..
శ్రీమతి చింతకుంట రత్నమ్మ గారు

వెలమ సంక్షేమ సంఘం (రి) - అనకాపల్లి

మిరియాల రాజేంద్రప్రసాద్ వెలమ పెద్దలు	రాజాన అప్పారావు వెలమ సంఘం గౌ॥ అధ్యక్షులు	కూండ్రపు బీమ వెలమ సంఘం అధ్యక్షులు	లాలం కన్నాజి సెక్రటరీ, NTR హాస్పిటల్ మాజీ డైరెక్టర్
సింగంపల్లి వాసు MRO	తమరాన బాబులు వర్కింగ్ ప్రెసిడెంట్	కూండ్రపు సూర్యప్రకాశరావు సిటీ పబ్లిక్ స్కూల్	లాలం బైరాగినాయుడు వెలమ పెద్దలు
మురుముళ్ళ చందు ట్రెజరర్	పెదపాటి కళ్యాణి, టిడిపి ఉమ్మడి జిల్లా మాజీ వైస్ ప్రెసిడెంట్	డా॥ పూడి సందీప్ డెంటల్ డాక్టర్	లాలం గణేష్ సర్వే కర్రల వ్యాపారం
పాటూరు నాయుడు సర్వే కర్రల వ్యాపారం	కశిరెడ్డి సత్తిబాబు సర్వే కర్రల వ్యాపారం	కశిరెడ్డి నాగేశ్వరరావు సర్వే కర్రల వ్యాపారం	కొల్లు శ్రీరామమూర్తి అడ్వకేట్
వి. రాజశేఖర్ అడ్వకేట్	సింగంపల్లి దివాకర్ అడ్వకేట్	వనం దేముడుబాబు (చిరంజీవి)	రాజాన దొరబాబు సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి
రొంగలి నాయుడు మాకవరం	ఆర్.యస్.ఆర్. కన్సల్టెన్సీ (ప్రొ॥ రొంగలి శ్రీనివాసరావు)	కోస్టల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ (ప్రొ॥ రొంగలి శ్రీనివాసరావు)	అయ్యప్ప ఎంటర్‌ప్రైజెస్ మేన్‌పవర్ సర్వీసెస్, కె. రాజేష్
కశిరెడ్డి వాసు జనసేన యువనాయకులు	మురుముళ్ళ శ్రీకాంత్	లాలం నాయుడుబాబు మిత్ర ఫైనాన్స్	రొంగలి పవన్ కశింకోట
రుత్తల రవీంద్ర గాడి చినబాబు	సూరెడ్డి సుబ్రమణ్యం లాలం వాసు, మాటూరు	చీపురుపల్లి శ్రీనివాస్ అగ్రికల్చర్	బొడ్డు మురళీకృష్ణ బజాజ్ ఫైనాన్స్
దాసరి చంద్రమౌళి	సుర్ల హేమసుందర్ (నాని)	కశిరెడ్డి సాయి S/o తాతయ్యలు	డా॥ సింహాచలం నాయుడు ఎముకల డాక్టర్
బోళెం బ్రదర్స్ లవరాజు, కుసురాజు, రాముసాయుడు	రాజాన నాయుడు బొంబాయి నాయుడు	లాలం నాని S/o బుల్లబ్బాయి	మురుముళ్ళ సుధాకర్

వెలమ ఫౌండేషన్ - విజయనాయుడు, ఎమ్.వి.ఆర్. మూర్తి, సత్యనారాయణరాజు, YSN మాస్టారు

శ్రద్ధాంజలి

జై శ్రీమన్నారాయణ..!
మా మాతృమూర్తి మానుండి భౌతికంగా దూరమైనారని తెలియజేయుటకు చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
కుమారుడు - కోడలు: S. వెంకటేష్ - స్వర్ణ
కుమార్తెలు - అల్లుళ్ళు: పెంటకోట లీలా -భాస్కరరావు (లేటు)
యల్లపు జగదీశ్వరి - సూర్యనారాయణమూర్తి
ఆళ్ళ వరలక్ష్మి - శ్రీనివాస్
మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు మునిమనుమరాళ్ళు
కీ॥శే॥ శరకం అరుణ గారు
జననం: 25-04-1947 మరణం: 27-11-2025
W/o (లేటు) శరకం సూర్యనారాయణ మూర్తి గారు
Retd. Sr. Manager (Communications), Airport Authority of India
పెద్దకర్మ: తేది. 08-12-2025 సోమవారం మ॥ 12 గం॥లకు పెందుర్తి, పులగానిపాలెం రోడ్డు, శివాలయం జంక్షన్‌లో గల మా స్వగృహము నందు జరుగును.

శ్రద్ధాంజలి

మా అందరికి మార్గదర్శకులు మంచి తనానికి మారుపేరుగా నిలిచి మమ్ములను మా కుటుంబాలకు అండగా.... ఉంటున్న మీరు ఆకస్మికంగా దూరమైనారు. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ శ్రీ సూరకాసుల నారాయణరావు గారు
ప్రొ॥ శ్రీ వెంకటేశ్వర లాడ్జి, SNR వైన్స్, SNR ఆక్వాఫామ్, యలమంచిలి
S.N.R. వైన్స్ యలమంచిలి | శ్రీ వెంకటేశ్వరా లాడ్జి యలమంచిలి
సిగిరెడ్డి రమేష్, అప్పికొండ సూర్యప్రకాశరావు, సూరకాసుల రామసాయి, సూరకాసుల గురునాథరావు, పూడి నలమారి, సిగిరెడ్డి అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, కర్రి మాణిక్యాలరావు, పిల్లా వీరుశురాం

జన్మదిన శుభాకాంక్షలు

మా ఆత్మీయులు, సహృదయులు, శ్రీ కొణతాల రఘునాథ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ కొణతాల రఘునాథ్ గారు
శ్రీ బుద్ధ రాజేష్ గారు
(ప్రొ॥ ఆర్.ఎమ్. లాజిస్టిక్స్, అనకాపల్లి

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

ఊరేమో దూరం.. దారంతా అయోమయం

చీడికాడ, న్యూస్‌టుడే

ఏళ్లు గడుస్తున్నా.. ఆ గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. దీంతో వారు ఊరు దాటడమే నరకప్రాయంగా మారింది. వర్షం కురిస్తే బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు నిలిచిపోతున్నాయి. ఇదీ.. చీడికాడ మండలం కోనాం పంచాయతీ జాజులపాలెం గిరిజన గ్రామ పరిస్థితి. గత ప్రభుత్వంలో నాయకులు ఓట్లు కోసం రహదారి నిర్మాణం ప్రారంభించి ఎర్త్‌వర్కు చేసి వదిలేశారు. రోడ్డు కోసం తెచ్చిన సిమెంటు గొట్టాలు సైతం నిరుపయోగంగా తుప్పల్లోనే ఉన్నాయి. వైకాపా నిర్వాకంతో ప్రస్తుతం రోడ్డు నడవడానికి అవకాశం లేకుండా మరింత అధ్వానంగా తయారైంది. గిరిజనులు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గెడ్డలో దిగి వస్తున్న గిరిజనులు

✦ ఊరిలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి తరలించేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్నాళ్ల కిందట ఈ మార్గంలో గెడ్డపై తాత్కాలిక కల్వర్టు కాస్త కొట్టుకుపోయింది. దీంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిపోయింది. రహదారి సమస్యపై ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించాలని జాజులపాలెం ప్రజలు కోరుతున్నారు.

రహదారులు లేక అవస్థలు

కోనాం పంచాయతీలోని పలు గిరిజన గ్రామాలకు రహదారుల సౌకర్యం లేదు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. రహదారులు లేక గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు. ఇన్నేళ్లుగా రహదారులు లేక నరకం చూస్తున్నాం. గిరిజన గ్రామాలకు రహదారులను నిర్మిస్తామని హామీ ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి రహదారుల సమస్య తీర్చాలని కోరుతున్నాం.
– నరసింహమూర్తి, గిరిజన సంఘం నాయకుడు

తుప్పల్లో నిర్మాణం కోసం తెచ్చిన సిమెంటు తూములు

నిర్మాణానికి ప్రతిపాదనలు..

జాజులపాలెం గిరిజన గ్రామానికి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. గతంలో రోడ్డు నిర్మాణానికి కొంతమేరకు ఎర్త్‌వర్కు చేసి వదిలేశారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో రద్దు చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు కొత్తగా రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. – శ్రీనివాసరావు, మండల ఇంజినీర్, చీడికాడ

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి1:** రివాల్వర్ రీటా, జనతా బార్, స్కూల్ లైఫ్, రాజు వెడ్స్ రాంబాయి, **ఆడి 2:** ది గర్ల్ ఫ్రెండ్, రాజు వెడ్స్ రాంబాయి, నాట్ ఆల్ మూవీస్ ఆర్ ది సేమ్ డ్యూయల్, **ఆడి 3:** ఆంధ్రా కింగ్ తాలుకా, **ఆడి 4:** జూటోపియా, ఆంధ్రా కింగ్ తాలుకా, **బంగార్రాజు:** ప్రీ వెడ్డింగ్‌షో, **రాజు:** జింగిరి.
చోడవరం: **శ్రీసాయిలక్ష్మి:** ఆంధ్రా కింగ్ తాలుకా **సాయిలక్ష్మి:** శివ, **పూర్ణా:** రాజు వెడ్స్ రాంబాయి

ప్రశాంతంగా పరీక్షలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నవోదయ నమూనా పరీక్షకు వివిధ మండలాల నుంచి 350 మంది హాజరయ్యారు. సంఘ జిల్లా అధ్యక్షుడు డీజినాథ్ పరీక్షను పర్యవేక్షించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు. నేషనల్ మీన్స్‌కమ్‌మెరిట్ (ఎన్.ఎం.ఎం.ఎస్) ఉపకార వేతనాల పరీక్షకు 1906 మంది హాజరయ్యారు. ఎనిమిది కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఎంఈవో చీడిపల్లి తలుపులు పర్యవేక్షించారు.

స్వయం శక్తితో.. ఆర్థిక స్వావలంబన

మహిళామణులు స్వశక్తితో ఆర్థిక సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలతో వివిధ వ్యాపారాల్లో రాణిస్తున్నారు. ఒక్కో కుటుంబం నుంచి ఒకరిని వ్యాపారవేత్తగా తయారు చేయాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) బాసటగా నిలుస్తోంది. నర్సీపట్నం మున్సిపాలిటీలో పలువురు ఎస్‌హెచ్‌జీ మహిళలు వ్యాపారాలతో కుటుంబాలను పోషించుకుంటూ మరి కొందరికి ఉపాధిని కల్పించే స్థాయికి ఎదుగుతున్నారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం

రూ.25 వేల ఆదాయం..: మెప్మా సహకారంతో రూ.3.60 లక్షల ముద్ర రుణం తీసుకున్నాను. దీనికి డ్వాక్రా రుణం రూ.1.70 లక్షలు కలిపి ఎంబ్రాయిడరీ చేస్తూ జీవనం సాగిస్తున్నాను. ఎలక్ట్రానిక్ మిషన్‌తో చీరల ఎంబ్రాయిడరీ తదితర పనులు చేస్తున్నాను. క్రమంగా ఆదరణ పెరిగింది. నెలకు అన్ని ఖర్చులు పోనూ రూ.25 వేలు రాబడి వస్తోంది. – ఎం.నాగజ్యోతి

మరో ఇద్దరికి ఉపాధి..: తీసుకున్న రూ.60 వేల రుణంతో నర్సీపట్నం అబీద్ కూడలిలో చెప్పుల దుకాణాన్ని ఏర్పాటు చేశాను. ఇద్దరు పని వారితో వ్యాపారం బాగానే సాగుతోంది. నెలకు రూ.50 వేలు వస్తోంది. జీతాలు ఇతరత్రా రూ.20 వేలు పోగా రూ.30 వేలు మిగులుతోంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మా వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయాలని భావిస్తున్నాను. – రుత్తల నాగలక్ష్మి

ధీమాగా వ్యాపారం

కుటుంబ జీవనం కష్టమవుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం ఎంతో భరోసానిస్తోంది. మెప్మా వాళ్లు రూ.2 లక్షలు రుణం మంజూరు చేయించారు. పండ్ల వ్యాపారం ఎంతో సాఫీగా సాగుతోంది. సక్రమంగా రుణం చెల్లిస్తుండటంతో అధికారులు సహకరించి ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ.20 వేలు రాబడి లభిస్తోంది. – అమలకంఠ లక్ష్మి

అన్నివిధాలా సహకారం.. మహిళల ఆర్థికాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తున్నాం. జిల్లాలో 2500 సంఘాలు ఉన్నాయి. వీటిలోని 484 సంఘాల్లోని సభ్యులకు గత తొమ్మిది నెలల్లో మొత్తం రూ.60 కోట్ల రుణాల మంజూరు చేయాలని లక్ష్యం నిర్ణయించారు. ఇందులో 430 సంఘాలకు రూ.57 కోట్లు మంజూరయ్యాయి. 88 సంఘాల్లోని వారికి అదనపు పెట్టుబడులకు రుణాలు అందజేశాం. వసూలు 98 శాతం ఉంది. – సరోజిని, పీడీ, మెప్మా

దళారీల వలలో పడొద్దు

చోడవరం, న్యూస్‌టుడే: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తే డ్వాక్రా సంఘాలకు కమీషన్ రూపంలో ఆదాయం వస్తుందని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో డ్వాక్రా గ్రూపుల తరఫున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల ఆధ్వర్యంలో కేటాయించిన రెండు కేంద్రాలు చోడవరంలోనే నెలకొల్పడం విశేషమన్నారు. కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే దళారీల బెడద ఉండదని ఎమ్మెల్యే అన్నారు. మాజీ సర్పంచి శిరిసోళ్ల సత్యారావు, వెలుగు ఏపీఎం తిలక్, వెలుగు సిబ్బంది, డ్వాక్రా గ్రూపు సభ్యురాళ్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా ఖాదర్‌వల్లీ ఉర్సు వేడుక

నక్కపల్లి, న్యూస్‌టుడే: పెదబోదుగల్లంలో ఆదివారం ఖాదర్‌వల్లీ ఉర్సు వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం మసీదులో ప్రార్థనల తర్వాత గుర్రాన్ని అందంగా అలంకరించారు. తర్వాత వీధుల్లోకి ఊరేగింపుగా తీసుకెళ్లగా స్థానికులు చందనం పూసిన బావుటాలను గుర్రంపై వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీటిని ఇక్కడి ఖాదర్‌వల్లీ నిషాని వద్దకు తీసుకెళ్లి మత పెద్దలు పూజలనంతరం బావుటాలను ఆవిష్కరించారు. మధ్యాహ్నం సామూహిక విందు ఏర్పాటు చేసుకున్నారు.

ఎన్జీవో సంఘం కార్యవర్గం ఎన్నిక

నర్సీపట్నం అర్బన్: ఏపీ ఎన్జీవోల సంఘం నర్సీపట్నం తాలూకా యూనిట్ ఎన్నిక ఆదివారం ఎన్జీవో హోంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా చింతకాయల శ్రీనివాసరావు, కార్యదర్శిగా యాళ్ల కృష్ణ, ఉపాధ్యక్షుడిగా పి.చిరంజీవి, ఆర్.రామచంద్ర, డీవీఎన్ నాగరాజు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాజశేఖర్, కె.శ్రీనివాస్, కోశాధికారిగా ఎన్.శేషకుమార్ ఎన్నికయ్యారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పరిసరాల శుభ్రతపై అవగాహన

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సాగరం కాలనీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరాల్లో భాగంగా రెండోరోజు పరిసరాలు పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని చేపట్టారు. విద్య ఉపాధి అవకాశాల్లో పెద్ద పీట వేస్తున్న సమాచార నైపుణ్యాలు సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థులు స్థానిక యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.రామ్ కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నిరుపయోగంగా ఫైబర్‌నెట్ పరికరాలు

గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ఫైబర్‌నెట్ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. రెండేళ్ల కిందట అన్ని గ్రామాలకు కేబుళ్లు వేసి పరికరాలను అమర్చారు. వీటి ద్వారా కార్యాలయాలతో పాటు గృహాలకు అంతర్జాల సదుపాయం కల్పిస్తామని ప్రకటించినా నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. లోపూడి, లింగభూపాలపుర అగ్రహారం, వడ్డాది, తైపురం, మంగళాపురం తదితర పంచాయతీ కార్యాలయాల్లో ఫైబర్‌నెట్ పరికరాలన్నీ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇంటర్నెట్ సదుపాయంలేక గ్రామసచివాలయాల్లో పనులు సరిగా జరగడం లేదు. సచివాలయ సిబ్బంది ఫోన్ల ద్వారా నెట్ కనెక్ట్ చేసుకుని ఆన్‌లైన్ పనులు చేస్తున్నారు. సిగ్నల్ లేకపోవడం, నెట్‌బ్యాలెన్స్ అయిపోవడం తదితర సమస్యలతో తరచూ ఆన్‌లైన్ పనులకు ఆటంకం కలుగుతోంది. తద్వారా ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది.
– న్యూస్‌టుడే, బుచ్చెయ్యపేట

లోపూడిలో నిరుపయోగంగా ఉన్న పరికరం

జూద శిబిరంపై దాడి

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని గుడ్డిపలో జూద శిబిరంపై దాడి చేసినట్లు రావికమతం ఎస్.ఐ రఘు వర్మ చెప్పారు. రూ.23,560 నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దేవాలయ నిర్మాణానికి స్థల వితరణ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని కె.పి.అగ్రహారం గ్రామంలో కృష్ణాలయానికి అవసరమైన స్థలాన్ని దాతలు సమకూర్చారు. గ్రామానికి చెందిన వియ్యపు ముసలి కుమారులు రాజబాబు, అప్పారావు కలిసి రూ.2 లక్షల విలువైన రెండు సెంట్ల స్థలాన్ని ఆలయానికి రాసిచ్చారు. భూమికి సంబంధించిన పత్రాలను ఆదివారం స్థానిక నాయకులు ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, అడ్డూరి శ్రీను, మల్లి ఈశ్వరరావులకు అందజేశారు.

తుప్పలతో ముప్పు

చీడికాడ మండలం కోనాం-గుడివాడ మార్గంలో తుప్పలు దట్టంగా ఉన్నాయి. మరోవైపు ఈ మార్గంలోని కాకులగెడ్డ వంతెన వద్ద తుప్పలు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. తుప్పలతో తారురోడ్డు కాలిబాటలా మారింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు స్పందించి రహదారికి ఇరుపక్కలా, వంతెన వద్ద తుప్పలను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. – చీడికాడ, న్యూస్‌టుడే

గుడివాడ మార్గంలో కాకులగెడ్డ వంతెన వద్ద తుప్పలు

వైద్య శిబిరానికి స్పందన

రోగుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

గొలుగొండ, న్యూస్‌టుడే: శ్రీధర్మశాస్త్ర గ్రామీణ అభివృద్ధి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పాకలపాడులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. నీరుకొండ ఆసుపత్రి యాజమాన్యం సౌజన్యంతో ఈ శిబిరంలో 80మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. వైద్య నిపుణులు నిత్య, మహేంద్ర, ఆనంద్, హర్షవర్ధన్, తెదేపా నేత రామన్నతోపాటు కార్యకర్తలు సహకరించారు.

కొంగల కోలాహలం

పొలాల్లో పక్షులు మనుషుల మధ్యనే నిర్భయంగా తిరుగాడుతుంటాయి. వారి మధ్యనే మసులుతూ ఆహారం వెతుక్కుంటాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో పలుచోట్ల కోలాహలంగా కూలీలు వరి కోసి పనలు వేస్తుండగా కొంగలు ఆహారం వేటలో నిమగ్నమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూపరులకు ఉల్లాసాన్ని ఇస్తున్నాయి.
– న్యూస్‌టుడే, నర్సీపట్నం గ్రామీణం

కోసిన వరి పనల్లో ఆహారం కోసం వచ్చిన కొంగలు

ఆటస్థలం అనుకుంటే పొరపాటే..!

నాచుతో ప్రమాదకరంగా తురువోలు చెరువు

చీడికాడ మండలం తురువోలులో ఆటోస్టాండ్ వద్ద అర్జునగిరి మార్గంలో చెరువులోని నీటిపై పచ్చని నాచు పట్టింది. క్రీడా మైదానంలా ఉందని ఎవరైనా పొరపాటున చెరువులోకి దిగితే ప్రమాదం తప్పదు. పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.
– చీడికాడ, న్యూస్‌టుడే

పర్యాటక ప్రాంతాల్లో సందడి

కృష్ణదేవిపేట: గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు స్మారక మందిరం, పుణ్యస్నానాలు ఘట్టం ధారమతం జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. అనకాపల్లి, అచ్యుతాపురం, తుని, పాయకరావుపేట, నక్కపల్లి, నర్సీపట్నం ప్రాంతాలకు చెందిన పలు విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు, పలు ఆలయాల ఆధ్యాత్మిక సిబ్బంది ఇక్కడకు విహార యాత్రకు వచ్చారు. ఆట, పాటలతో సాయంత్రం వరకూ సందడి చేశారు. జలపాతంలో పుణ్యస్నానాలు ఆచరించారు. విహార యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గొలుగొండ, కృష్ణదేవిపేట పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

శ్లోక పఠనం పోటీల్లో సత్తా

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడులో ఆదివారం జరిగిన భగవద్గీత శ్లోక పఠన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. విశ్వహిందూ పరిషత్‌కు చెందిన సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. విజేతలగా నిలిచిన పాటూరి జానకి, పూసర్ల వర్ధిణిలు బహుమతులను అందుకున్నారు. తులసి వెంకట పద్మజ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా నూకాంబిక పండగ

రావికమతం, న్యూస్‌టుడే: రావికమతం మండలంలోని మేడివాడలో గ్రామ దేవత నూకాలమ్మ పండగ ఆదివారం ఘనంగా జరిగింది. సాధారణంగా కొత్త అమావాస్య రోజున జరిగే అమ్మవారి పండగ మేడివాడలో పూర్వం నుంచి పలకమ్మ పౌర్ణమి రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచి వజ్రపు లీలా నాగ వెంకటరత్నం, తెదేపా సీనియర్ నాయకుడు ఈశ్వర నర్సింహమూర్తి ఉత్సవ కమిటీ భక్తుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద తాగునీరు, అమ్మవారి ప్రసాదం తదితర ఏర్పాట్లు చేశారు.

పూజలు అందుకుంటోన్న నూకాంబిక అమ్మవారు

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలి

నర్సీపట్నం, న్యూస్‌టుడే: విశాఖలో చేపట్టనున్న సీఐటీయూ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఇక్కడ మహా సభల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 31 నుంచి వచ్చే జనవరి నెల 4వ తేదీ వరకు వీటిని చేపట్టనున్నారని వీరు తెలిపారు. పని గంటల విధానంలో మార్పుతో పాటు లేబర్‌కోడ్‌ను రద్దు చేయడం తదితర డిమాండ్ల సాధనకు చేపట్టాల్సిన పోరాటంపై ఈ సభల్లో కార్యాచరణ సిద్ధం చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు ఈరెల్లి చిరంజీవి, దంట్ల శివ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

అశ్లీల నృత్యాలు.. ఏడుగురి అరెస్టు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: అసభ్యకర నృత్యాలు ప్రదర్శిస్తున్న ఏడుగురితోపాటు నిర్వాహకుడిని ఆదివారం అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు కె.కోటపాడు సీఐ పైడపునాయుడు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అందిన సమాచారం మేరకు ఈనెల ఒకటిన మండలానికి చెందిన ఓ రిసార్టుపై కె.కోటపాడు పోలీసులు ఆకస్మిక దాడులను నిర్వహించారు. అక్కడ మహిళలతో బలవంతంగా అశ్లీల నృత్యాలు చేయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. బుచ్చయ్యపేటకు చెందిన ఆర్గనైజరుతోపాటు చీడికాడకు మండలం బైలపూడికి చెందిన ఏడుగురిపై పలు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అపూర్వ కలయిక

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఇరవై ఏడేళ్ల కిందట దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (1997-1998) చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం తెనుగుపూడి గురుకులానికి ఆనుకుని ఉన్న ఉద్యానక్షేత్రంలో సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఆహ్వానించి వారిని సత్కరించారు. మృతి చెందిన తమ మిత్రులను గుర్తుచేసుకుని పలువురికి ఆర్థిక సాయంచేశారు. భవిష్యత్తులోనూ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని తీర్మానించుకున్నారు. అందరు కలిసి విందు ఆరగించి ఆటపాటలతో సరదాగా గడిపారు.

ఇరవై ఏడేళ్ల తరువాత కలిసిన మిత్ర బృందం

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి సన్నాహాలు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు నిధులు మంజూరు చేశారని చోద్యం పీఏసీఎస్ అధ్యక్షుడు చిటికెల సాంబమూర్తి తెలిపారు. ఈ మేరకు కొత్తమల్లంపేట, చిన్నయ్యపాలెం, రేఖపల్లి, గింజర్తి, అమ్మపేట తదితర గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు వీధి కాలువలకు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ పనులకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు కొలతలు తీసినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని సాంబమూర్తి తెలిపారు.

జనం రద్దీ.. అభివృద్ధి ఏదీ ?

కె.కోటపాడు మండలంలో అనేక ప్రాంతాల్లో సంతలు జరుగుతున్నా వాటి ద్వారా ఆదాయం మాత్రం సమకూరడం లేదు. కె.కోటపాడు, ఎ.కోడూరులోనే వారపు సంత ద్వారా ఆదాయం పంచాయతీలకు వెళుతోంది. మిగతా చోట్ల ఇలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం లేకుండా పోతోంది. – న్యూస్‌టుడే, కె.కోటపాడు

రెండింటి ద్వారానే ఆదాయం : రోజువారీ సంతలు మండలంలో 12గ్రామాల్లో జరుగుతున్నా ఎక్కడా వీటి నుంచి పంచాయతీలకు పైసా ఆదాయం సమకూరడం లేదు. పంచాయతీ పెద్దలు సైతం దీని గురించి పట్టించుకోవడం లేదు. కె.కోటపాడులో మంగళవారం జరిగే సంత ద్వారా ఏడాదికి దాదాపు రూ.1.25 లక్షల ఆదాయం వస్తోంది. ఎ.కోడూరులో జరిగే సంత ద్వారా ఏడాదికి రూ.5వేల వరకు ఆదాయం సమకూరుతోంది.

కె.సంతపాలెంలో రోజు కూరగాయల మార్కెట్

సంతల వివరాలిలా..: కె.కోటపాడులో మంగళవారం, గొండుపాలెంలో శుక్రవారం, గుల్లిపల్లిలో ఆదివారం, చౌడువాడలో బుధవారం, ఎ.కోడూరులో గురువారం వారపు సంతలు జరుగుతున్నాయి. పలుచోట్ల చాలా కాలం నుంచి ఆశీళ్ల పాటలు నిర్వహించకపోవడంతో ఆదాయం రావడం లేదు.

కె.సంతపాలెం మార్కెట్ పరిస్థితి: కె.సంతపాలెం మార్కెట్‌లో రోజూ కూరగాయలు, ఆకుకూరలు క్రయవిక్రయాల ద్వారా రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. వేకువజామునుంచి మొదలు తెల్లవారు 9గంటల వరకు ఈ మార్కెట్ కిక్కిరిసి ఉంటుంది. ఇక్కడ ఆశీలు వసూలు చేసి తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని కోరుతున్నారు.

ఉచితంగా పండ్లు, మొక్కల పంపిణీ

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తకోటలో స్వయం కృషి ఫార్మర్ ప్రొడ్యూసర్ మార్కెటింగ్ థ్రిఫ్ట్ అండ్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మొక్కల పంపిణీ జరిగింది. స్వయం కృషి రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా మామిడి, సపోటా, నేరేడు, చింత, సీతాఫలం, మహాగని తదితర 12రకాలకు పండ్లు, వృక్ష జాతులకు చెందిన 3వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసేందుకు సంస్థ నిర్వాహకులు సిద్ధం చేశారు. ఈమేరకు ఆదివారం కొత్తకోట మాజీ సర్పంచి కోట నీలవేణి, ఉప సర్పంచి పందల దేవా, తెదేపా నాయకులు కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీనివాసరావు సమక్షంలో రావికమతం, రోలుగుంట మండలాల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు, ఇతరులకు 2,500 వరకు మొక్కలను అందజేశారు. స్వయం కృషి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్ విసారపు వెంకటరమణ, సీఈవో కృష్ణ, కొత్తకోట పీఏసీఎస్ సీఈవో రఘు తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు, నిర్వాహకులు

పంటలను నాశనం చేస్తున్న పందులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బంగారుమెట్ట గ్రామంలో పంటలను పందులు నాశనం చేస్తున్నాయి. సాయం రవికి చెందిన పొలంలో పందులు ప్రవేశించి వరిపంటను ధ్వంసం చేశాయి. కోతకి సిద్ధంగా ఉన్న పంటను నాశనం చెయ్యడంతో రైతు లబోదిబోమంటున్నాడు. కొంతమంది పెంపకందారులు తీసుకువచ్చి గ్రామంలో వదిలిపెట్టారు. వీటివల్ల పంటలు నాశనమవడంతో పాటు రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

ఆద్యంతం.. అద్భుతం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: సకల జీవరాశులు బాగుండాలని కోరుకునేది హిందూధర్మమేనని సమరసత సేవా సంఘం ప్రతినిధి ఎం.సాయిరాం అన్నారు. ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ మినీస్టేడియంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అమృతేశ్వర నాట్యఅకాడమీ శిక్షకురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో చిన్నారులు భరతనాట్యంతో ఆకట్టుకున్నారు. కోలాటం, సుందరకాండ పారాయణం, భగవద్గీత శ్లోకాలతో చిన్నారులు అలరించారు. ఎక్కల శాంతి, చింతలపూడి నిర్మలాదేవి తదితరులు ప్రసంగించారు. డాక్టర్ కిల్లాడ సత్యనారాయణ, వెలగా నారాయణరావు, రమేష్ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో సీతాకల్యాణం ఘట్టం

'థింసా' ప్రదర్శనతో ఉపాధి

చింతపల్లి గ్రామీణం: ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో గిరి మహిళలు థింసా నృత్యం ప్రదర్శనతో వినోదాన్ని పంచుతూ, ఉపాధి పొందుతున్నారు. ఆదివాసీ నృత్యం థింసాకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. పాడేరు ఐటీడీఏ, పంచాయతీ సహకారంతో చెరువులవెనం ముఖద్వారమైన భీమునాపల్లి గ్రామం వద్ద థింసా నృత్య ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. పర్యాటక సీజన్ ముగిసే వరకు రోజూ దీన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకుడు బొబ్బిలి కామేశ్వరరావు తెలిపారు.

యోగా జీవితంలో భాగం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: యోగా జీవితంలో భాగమని యోగాభ్యాసన శిక్షణ సంస్థ శ్రీనివాస తెలిపారు. నర్సయ్యపేటలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఆదివారం యోగాసనాలు, ధ్యానం తదితరాలపై అవగాహన కల్పించారు. రోజూ యోగాకు కొంతసమయాన్ని కేటాయించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవితానికి యోగా చేయడం చాలా ముఖ్యమని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. సర్పంచి గాడి అప్పారావు, ప్రోగ్రాం ఆఫీసర్ రత్నభారతి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నర్సయ్యపేటలో ఆసనాలు వేస్తున్న విద్యార్థినులు

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 రాజా వెడ్స్ రాంబాయి
స్క్రీన్-2 - ఆంధ్ర కింగ్ తాలూకా

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న నిత్య కల్యాణోత్సవం ఆదివారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ.10 నుంచి మ. ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 93వ వార్డు సమత కాలనీలో రహదారులు బాగు లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలి. – సత్యారావు. ✓: రహదారులను కాలనీలో దశల వారీగా నిర్మించాం. కొద్ది రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – రవిపల్లి కన్న, కార్పొరేటరు

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి చెత్త తొలగించేలా చూడాలని కోరుతున్నాం. – ఎన్.భీమారావు ✓: పంచాయతీ పేరుకుపోయిన చెత్తను తొలగించే ఏర్పాటు చేస్తాం. – పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: గొట్టివాడ కాలనీలో సచివాలయ కేంద్రానికి తరలించాల్సిన చెత్తను రోడ్డు పక్కన పడేస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం. – స్థానికులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ నుంచి భరణికం వెళ్లే రహదారిలో వీధి దీపాలు లేవు. రాత్రుళ్లు పరిసర గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. – నాయుడు ✓: దీపాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం. – రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

ఆటలో అదరగొట్టి.. పతకాలు చేతపట్టి..

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గొర్లె వానిపాలెం ఇండోర్ స్టేడియంలో ఈ నెల 6 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో బాల బాలికలు వేర్వేరుగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 7 ఉమ్మడి జిల్లాల నుంచి 250కి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. పసిడి పతకాలు సాధించి త్వరలో జరిగే జాతీయ స్థాయికి ఎంపికైన పలువురి క్రీడాకారులతో 'న్యూస్‌టుడే' మాట్లాడగా వారి నేపథ్యాన్ని, ఈ క్రీడపై ఉన్న ఆసక్తిని వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే...

ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

ఏడాదిగా మెలకువలు నేర్చుకుంటా: తండ్రి సింహాచలం ఎల్జీ పీసీ ఉద్యోగి. తల్లి యశ్వస్వినీరాణి గృహిణి. థాంగ్‌టాలో ఏడాది కాలంగా మెలకువలు నేర్చుకుంటున్నా. ఉక్కు నగరం డీపీఎస్ వరల్డ్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నా. ప్రస్తుత అండర్-14 విభాగంలో 40 కేజీల కేటగిరీలో లీగ్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్లో రాణించి స్వర్ణ పతకం సొంతం చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యా. క్రీడల్లో రాణించి నేవీలో ఉద్యోగం సాధించాలని ఉంది. – షణ్ముఖ్ సాత్విక్

తొలి పోటీలోనే స్వర్ణం తెచ్చుకున్నా: తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏడాది కాలంగా థాంగ్‌టా క్రీడపై సాధన చేస్తున్నా. పరవాడ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. తండ్రి త్రిమూర్తులు లారీడ్రైవర్. తల్లి కనకదుర్గ బ్రాండిక్స్ పరిశ్రమలో పని చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగంలోని 49 కేజీల థాంగ్‌టా పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యా. చాలా సంతోషంగా ఉంది. – కొరుపోలు తులసి

ఈ క్రీడ అంటే చాలా ఇష్టం: స్వగ్రామం వాడచీపురుపల్లి. తండ్రి శ్రీనివాసరావు కారు డ్రైవర్. తల్లి శివలక్ష్మీదేవి గృహిణి. ఎన్టీపీసీ బాల భారతి పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నా. థాంగ్‌టా అంటే చాలా ఇష్టం. అండర్-17 థాంగ్‌టా పోటీల్లో ఫైనల్లో స్వర్ణ పతకం సొంతం చేసుకుని జాతీయ క్రీడలకు ఎంపికయ్యా. రాష్ట్ర స్థాయిలో 3 పసిడి, ఎస్‌జీఎఫ్ పరుగు పోటీలో రజతం సాధించా. – సాయిరాగిని

అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతా: అమ్మానాన్నల ప్రోత్సాహంతో థాంగ్‌టా నేర్చుకున్నా. స్వగ్రామం రామన్నపాలెం. తిమ్మరాజుపేట ఇంటిగ్రేటెడ్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నా. నాన్న దీవెనగ్ ప్రైవేట్ ఉద్యోగి. తల్లి ఇందుమతి ప్రైవేట్ టీచర్. అండర్-17 పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యా. గతంలో నిర్వహించిన జాతీయ పోటీల్లో కాంస్యం, రాష్ట్ర స్థాయిలో స్వర్ణం కైవసం చేసుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటేందుకు కఠోర సాధన చేస్తున్నా. – పవన్‌కుమార్‌సింగ్

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3): ఉక్కు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విశాఖ ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కోలార్ ఎంపీ ఎం.మల్లేశ్‌బాబు, బెంగళూరు రూరల్ ఎంపీ డాక్టర్ సి.ఎన్.మంజునాథ్‌ను దిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. కాటం ఎస్.ఎస్. చంద్రరావు, కేవీడీ. ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందిస్తున్న ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు

ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీపై దర్యాప్తునకు డిమాండ్

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న విశాఖ ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీ ఎ.కె.సక్సేనాపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి కర్మాగారానికి, కార్మికులకు నష్టం కలిగించే చర్యలే చేపట్టారన్నారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని, కర్మాగారాన్ని కాపాడాలని ఉక్కు మంత్రిత్వశాఖను డి.ఆదినారాయణ(ఐఎన్‌టీయూసీ), పాడి త్రినాథరావు(బీఎంఎస్‌ఈయూ), ఎం.రాజశేఖర్(ఇంటక్), ఎస్.రామారావు(సిటూ) డిమాండ్ చేశారు.

ముగిసిన రాష్ట్ర థాంగ్‌టా పోటీలు

36 మంది జాతీయ స్థాయికి ఎంపిక

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం గొర్లెవానిపాలెంలోని ఇండోర్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 69వ రాష్ట్ర స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో 7 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు రాష్ట్ర అబ్జర్వర్లు శ్రీహరిబాబు, ప్రసాద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఎం.నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రతిభ చాటిన 36 మందిని జనవరి 17 నుంచి 22 వరకు దిల్లీలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరావు, ఏపీ థాంగ్‌టా అసోసియేషన్ అధ్యక్షుడు గొర్లె పుష్పారావు, కార్యదర్శి తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులతో నిర్వాహకులు

ఎంపికైనవారు వీరే..

బాలికలు: అండర్-14 విభాగంలో: ప్రణీత(విశాఖ), అమీరా ఇరాన్(కర్నూలు), సుదీక్ష(తూర్పుగోదావరి), తులసి(విశాఖ), త్రివేణి(విశాఖ), మేఘన(విశాఖ), అండర్-17లో సాయిరాగిని(విశాఖ), రూప్సీ(విజయనగరం), మణికర్ణిక(కృష్ణా), ప్రవల్లిక(విశాఖ), హర్షిణి(విశాఖ), సుహాస(కర్నూలు), అండర్-19లో సుల్తానా(కర్నూలు), శ్రీశాలి(విజయనగరం), శ్రీలత(గుంటూరు), మానస(విశాఖ), జ్యోతి(విశాఖ), సురేఖ(కర్నూలు).

బాలురు: అండర్-14 విభాగంలో: షణ్ముఖ్‌సాయి(విశాఖ), వి.సాత్విక్(కృష్ణా), హరీష్(విశాఖ), ఎస్.కె.అయాన్(విజయనగరం), వై.మోక్షిత్(కృష్ణా), రఘుక్(తూర్పుగోదావరి), అండర్-17లో పవన్‌కుమార్ సింగ్(విశాఖ), ఆకాశ్(విజయనగరం), హరివెంకటఅఖిల్(గుంటూరు), చరణ్ తేజ(విశాఖ), జాన్‌పాల్(గుంటూరు), టి.చరణ్(కర్నూలు), అండర్-19లో వినయ్‌కుమార్(విజయనగరం), చెన్నకేశవ(కడప), రోహిత్(విజయనగరం), అఖిల్(గుంటూరు), వెంకటేశ్(విజయనగరం), లక్ష్మీప్రణీత్(కృష్ణా).

స్పందనకు వందన

ఎట్టకేలకు పిచ్చిమొక్కల తొలగింపు

భరణికం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ నుంచి భరణికం వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను ఎట్టకేలకు తొలగించారు. కొద్ది నెలలుగా రహదారి పక్కన తుప్పలు పెరిగిపోవడంతో అటుగా రాకపోకలు సాగించడానికి వాహనదారులు నానా ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై పలు మార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురించడంతో అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి సమస్యను పరిష్కరించారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాటం'

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేసేవరకు కార్మిక సంఘాలంతా ఐక్యంగా ఆందోళనలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. చినముషిడివాడ అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక వర్గానికి నష్టం కలిగించే ఆయా చట్టాలను రద్దు చేసే వరకు పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.గీత, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, కార్యదర్శి సీహెచ్.వెంకటరావు, జిల్లా కమిటీ సభ్యులు చిన్నారి, శ్రీనివాసరావు, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు

తక్షణమే వీఆర్ఎస్ బకాయిలు చెల్లించాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కులో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వారికి తక్షణమే బకాయిలను చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మొదటి విడత జూన్ 2025లో 1137 మంది, రెండో విడత ఆగస్టు 2025లో 486 మంది ఉద్యోగ విరమణ చేశారన్నారు. వీరికి రెండు దఫాలుగా కేవలం 50 శాతం మాత్రమే చెల్లించారన్నారు. మిగతా 50 శాతమైన ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాల్సి ఉందన్నారు. డీపీఈ గైడ్‌లైన్స్‌ను అనుసరించి తక్షణమే వీరికి అన్ని బకాయిలు చెల్లించాలని ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!

దర్పణం

లక్ష్మీపురం(వేపగుంట), న్యూస్‌టుడే: లక్ష్మీపురం కూడలిలో చింతలగ్రహారం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో మంచినీటి పైపులైను సంపు ప్రమాదకరంగా మారింది. సంపు చుట్టూ రక్షణ పలకలు ఏర్పాటు చేయకుండా అడ్డుగా చెట్ల కొమ్మలను పెట్టి వదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ఈ గొయ్యిలో పడి గాయాలపాలవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సంపును సరిచేసి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ

వేపగుంట, న్యూస్‌టుడే: కాలనీల్లో నేరాలు జరగకుండా నియంత్రించేందుకు ప్రజల సహకారం అవసరమని పెందుర్తి క్రైం సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. పెందుర్తి క్రైం విభాగం ఆధ్వర్యంలో 95వ వార్డు వరలక్ష్మీనగర్‌లోని కాలనీవాసులతో నేరాలు నియంత్రణ - ప్రజల సహకారం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనుమానితులు కాలనీల్లో సంచరిస్తే వెంటనే ఎవరికి సమాచారం ఇవ్వాలనే విషయాలపై కాలనీవాసులకు తెలియజేశారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు గంట్ల నరసింహమూర్తి, కార్యదర్శి ఆర్ఆర్‌బీ వర్మ సారధ్యంలో జరిగిన సదస్సులో కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వరలక్ష్మీనగర్‌లో కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ ఎం.చంద్రమౌళి

శిథిల దారి.. అవస్థలు తెచ్చి..

పరవాడ, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కూడలి నుంచి సబ్‌స్టేషన్‌కి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి శిథిలావస్థకు చేరుకుంది. దారిలో పెద్ద పెద్ద గుంతలు పడటంతో పాటు రాళ్లు తేలి ప్రయాణం చేయడానికి అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వర్షం పడితే అందులో నీరు చేరి రహదారి మరింత అధ్వానంగా మారుతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారిలో భారీ గుంతలు

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ముమ్మన దేముడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన వార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం, భవానీనగర్, బీసీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శివగాయత్రినగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భూగర్భ మురుగు నీటి వ్యవస్థ మ్యాన్‌హోల్ నుంచి పొంగి పొర్లుతున్న మురుగు నీటికి అడ్డుకట్ట వేయాలన్నారు. అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తానని ముమ్మన వివరించారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు అయితి ఎర్నిబాబు, 95, 97 వార్డుల భాజపా అధ్యక్షుడు చిక్కాల సతీశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మురుగు నీటిని పరిశీలిస్తున్న ముమ్మన దేముడు, తదితరులు

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరే రామ..హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి మహిమల్ని అభివర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీ నితాయి సేవిని పర్యవేక్షణలో అన్నసమారాధన చేపట్టారు.

ఆధ్యాత్మికం

రామలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

పూజలు అందుకుంటున్న శ్రీరామలింగేశ్వరుడు

సబ్బవరం, న్యూస్‌టుడే: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని సబ్బవరంలోని రామలింగేశ్వర ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేయించారు. మహాశివుడి జన్మతార, శివపార్వతుల వివాహం జరిగిన నక్షత్రం ఆరుద్ర కావడంతో ప్రత్యేక పూజలు జరిపినట్లు అర్చకులు తెలిపారు.

వైభవంగా దుర్గాదేవి పూజ

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట సమీప గంగిరెడ్లకాలనీలో నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం దుర్గాదేవి పూజను మాలధారణ భక్తులు వైభవంగా నిర్వహించారు. విజయదుర్గా భవానీ పీఠం రమణ భవానీ ఆధ్వర్యంలో వేచలం గురూజీ సారథ్యంలో నర్సింహమూర్తి, కనకరాజు పర్యవేక్షణలో పెద్దఎత్తున పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి భక్తిపాటలతో కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో జరిపించారు.

పూజలు చేస్తున్న భక్తులు

శరణుఘోషతో మార్మోగిన చింతలగ్రహారం

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: అయ్యప్ప శరణు ఘోషతో చింతలగ్రహారం గ్రామం ఆదివారం మార్మోగింది. వంశీ స్వామి సారథ్యంలో గురుస్వాములు కాళ్ల వెంకటరావు, ఎస్.సత్తిబాబు, పెంటకోట బల్లు అప్పారావు సారథ్యంలో అయ్యప్ప మహాసన్నిధానం పూజలను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో వేపగుంట, పెందుర్తి, గోపాలపట్నం, నరవ, సింహాచలం ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

అయ్యప్ప భక్తులు ఏర్పాటు చేసిన సన్నిధానం

బీచ్‌రోడ్డులో స్పిరిట్ రన్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వాలంటీర్స్ డేను పురస్కరించుకొని బీచ్‌రోడ్డులో ఆదివారం వాలంటీర్ స్పిరిట్ రన్ నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి, యూత్ ఆఫ్ భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరుగు జరిగింది. ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం వద్ద ఈ పరుగు ప్రారంభమైంది. ఈ సందర్భంగా భాజపా పూర్వ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా స్ఫూర్తితో స్వచ్ఛంద సేవ చేయాలన్నారు. ఈ రన్‌లో పురుషుల విభాగంలో వేదవ్యాస్(ప్రథమ), వి.రమేష్(ద్వితీయ), వి.కిరణ్‌కుమార్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో కె.జీవనతన్య(ప్రథమ), స్వాతిరతన్(ద్వితీయ), సి.నిర్మల(తృతీయ) స్థానాల్లో నిలిచారు. యూత్ ఆఫ్ భారత్ వ్యవస్థాపకులు చందన్‌మచ్చా, జంపన రంగరాజు పాల్గొన్నారు.

పరుగులో పాల్గొన్న నగరవాసులు

5కె రన్‌లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సీనరేజీ భారం.. నిలిచిన పనులు..

పెందుర్తి, న్యూస్‌టుడే: కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన సీనరేజీ విధానంతో అభివృద్ధి పనులకు అవరోధంగా మారింది. జీవీఎంసీ వార్డుల పరిధిలో అమలవుతున్న పలు అభివృద్ధి పనులు నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. పనులు ప్రారంభించిన గుత్తేదారులు అదనపు భారం పడుతోందన్న కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. దీంతో అసంపూర్తి రహదారి పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రహదారి నిర్మాణం పనులు చేసే గుత్తేదారుల నుంచి జీవీఎంసీ సీనరేజీ రుసుమును వసూలు చేస్తోంది. ఆ సొమ్మును గనుల శాఖకు చెల్లిస్తుంది. ఆ మేరకు అధికారులు జారీ చేసిన ధ్రువీకరణల ద్వారా గుత్తేదారులు గ్రావెల్, తదితర ముడి సరకును గనుల నుంచి తీసుకుంటారు. ఇంత వరకు ఈ విధానం కొనసాగింది. తాజాగా గనుల వద్ద జీఎస్టీ, సీజీఎస్టీ అధికారులు నిర్మాణ ముడి సరకును తీసుకొచ్చే వాహనాల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఈ భారం గుత్తేదారులపై పడుతోంది. దీంతో రెండు సార్లు సీనరేజీ చెల్లించాల్సిన పరిస్థితి వస్తోందని గుత్తేదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పనులు నిలిపివేశారు. జీవీఎంసీ 95, 96, 97 వార్డుల పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టిన బీటీ రహదారుల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చినముషిడివాడ వుడా కాలనీ, 95వ వార్డు ఎన్ఏడీ లేఅవుట్, పెందుర్తి జనచైతన్య లేఅవుట్, తదితర ప్రాంతాల్లో రహదారులు సగంలో ఆగిపోయాయి. కంకర తేలిన రోడ్లపై జారి పడుతున్నారని ద్విచక్ర వాహనదారులు, పాదచారులు చెబుతున్నారు.

చినముషిడివాడ వుడాకాలనీలో నిలిచిపోయిన రోడ్డు పనులు

సమస్య పరిష్కారానికి చర్యలు

ఇప్పటికే జీవీఎంసీ అధికారులు ఈ సమస్య పరిష్కారంపై దృష్టిసారించినట్లు తెలిసింది. అధికారులు గుత్తేదారులతో సమావేశమై గనుల నుంచి ముడి సరకులు తీసుకువచ్చేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని నిర్ణయించారు. దీనిపై ఆయా శాఖల అధికారులతో చర్చించినట్లు సమాచారం. పెద్ద పనులు చేస్తున్న గుత్తేదారులపైనే దీని ప్రభావం అధికంగా ఉంది. ప్రధానంగా బీటీ రహదారుల నిర్మాణాలు నిలిచిపోయాయి. త్వరలోనే ఆయా పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.

నిర్మాణానికి ఏడేళ్లు.. ప్రారంభానికి ఎన్నేళ్లో..!

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో బాలికల డ్రాప్ అవుట్స్ తగ్గించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోంది. క్షేత్ర స్థాయిలో అవి పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. సబ్బవరం ఉన్నత పాఠశాలలో ఎక్కువమంది బాలికలు చదువుతున్నారు. వీరంతా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తుంటారు. వీరంతా రోజూ వెళ్లి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఇక్కడి పాఠశాలను టైప్-4(కేజీబీవీ) తరహాలో అభివృద్ధి చేసి వసతి గృహం నిర్మించాలని 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికోసం రూ.1.94 కోట్లతో వసతి గృహ నిర్మాణం ప్రారంభించింది.

నిర్మాణం పూర్తి చేసుకున్న బాలికల వసతి గృహం

వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో:

ఫోకస్

2019లో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ వసతి గృహం వంక కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. 2024లో మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ఊపందుకున్నాయి. ఆరు నెలల క్రితమే వసతి గృహం నిర్మాణాన్ని పూర్తి చేశారు. 2025 జూన్‌లో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ మేరకు వసతి గృహంలో ఉండేందుకు విద్యార్థినులను కూడా ఎంపిక చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 50 మందిని, మిగిలినవారిని మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలికలను ఎంపిక చేశారు. అవసరమైన వంట పాత్రలు, రుబ్బు మిషన్లు, సుమారు 100 బియ్యం బస్తాలు సమకూర్చారు. అదేవిధంగా వార్డెన్, కుక్, సహాయ కుక్, ట్యూటర్ వాచ్‌మెన్‌లను నియమించారు. అయినప్పటికీ వసతి గృహాన్ని మాత్రం ప్రారంభించలేదు. ఇక్కడ ఉంచిన పురుగులు పట్టే అవకాశం ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వీటితో మంజూరు చేసిన అనేక వసతి భవనాలు ఇప్పటికే ప్రారంభించారు. అధికారులు, నేతలు వెంటనే స్పందించి వసతి గృహాన్ని ప్రారంభించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భవనంలో ఉంచిన బియ్యం బస్తాలు

ఆసుపత్రుల అభివృద్ధికి రూ.6.18 కోట్లు మంజూరు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాల పరిధిలోని 21 ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.6.11 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కార్యాలయం అధికారులు తెలిపారు. పరవాడ మండలంలోని ఎనిమిది ఆరోగ్య కేంద్రాలు, సబ్బవరం మండలంలో 13 ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గతంలో మంత్రిని ఎమ్మెల్యే కోరినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ ఇటీవల లేఖ ద్వారా సమాచారం తెలియజేసినట్లు వివరించారు. ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత విస్తరించడంతో పాటు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నిధులతో ఆసుపత్రి భవనాల నిర్మాణంతో పాటు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, పబ్లిక్ హెల్త్ యూనిట్లను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

హెచ్చరికలు బేఖాతరు..!

వేపగుంట, న్యూస్‌టుడే: ఎవరెన్ని హెచ్చరికలు చేసినా మా సరదాలు మావే అంటున్నారు కొందరు యువకులు. ఆ సరదా కోసం ప్రమాదమని సెలవు దినాల్లో యువకులు మేహాద్రి రిజర్వాయరులో స్నానాలకు దిగుతున్నారు. కొంతమంది మద్యం సేవించి స్నానాలకు దిగడంతో మరణాలు సంభవిస్తున్నాయని రిజర్వాయర్ సిబ్బంది అంటున్నారు. పోలీసులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేహాద్రి రిజర్వాయరులో హెచ్చరిక బోర్డు పక్కనే స్నానాలు చేస్తున్న యువకులు


శ్రద్ధాంజలి
జై శ్రీమన్నారాయణ..!
మా మాతృమూర్తి మానుండి భౌతికంగా దూరమైనారని తెలియజేయుటకు చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
కుమారుడు - కోడలు: S. వెంకటేష్ - స్వర్ణ
కుమార్తెలు - అల్లుళ్ళు: పెంటకోట లీలా - భాస్కరరావు (లేటు)
యల్లపు జగదీశ్వరి - సూర్యనారాయణమూర్తి
ఆళ్ళ వరలక్ష్మి - శ్రీనివాస్
మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు మునిమనుమరాళ్ళు
కీ॥శే॥ శరకం అరుణ గారు
జననం: 25-04-1947 మరణం: 27-11-2025
W/o (లేటు) శరకం సూర్యనారాయణ మూర్తి గారు
Retd. Sr. Manager (Communications), Airport Authority of India
పెద్దకర్మ: తేది. 08-12-2025 సోమవారం మ॥ 12 గం॥లకు పెందుర్తి, పులగానిపాలెం రోడ్డు, శివాలయం జంక్షన్‌లో గల మా స్వగృహము నందు జరుగును.

(c) eenadu

భారీగా హవాలా నగదు జప్తు?

పుట్టపర్తి, ఈనాడు: ముంబయి నుంచి బెంగళూరుకు ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.కోటికి పైగా హవాలా నగదును ఐదు రోజుల క్రితం పెనుకొండ శివారులో పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిసింది. గత మంగళవారం పెనుకొండ మండలంలోని హరిపురం శివారులో 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు ఓ కారును ధ్వంసం చేసి.. ఓ వ్యక్తిని బలవంతంగా మరో కారులో ఎక్కించి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు పట్టణ శివారులో అనుమానాస్పదంగా వెళుతున్న ఓ కారును అడ్డగించి సోదాలు నిర్వహించారు. అందులో రూ.కోటికి పైగా హవాలా నగదు గుర్తించి సీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసు బృందాలు బెంగళూరు, చెన్నైల్లో విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పెట్రోలు బంకుల్లో మొక్కజొన్న కంకులు

జిల్లాలోని చాలా గ్రామాలకు కర్ణాటక రాష్ట్రంతో సరిహద్దు ఉంటుంది. అనంతపురం జిల్లా విడపనకల్లు మండల కేంద్రం నుంచి 3 కి.మీల దూరంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రారంభమవుతుంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో పెట్రోలు రూ.109.80, డీజిల్ రూ.97.49 ఉంటే.. కర్ణాటకలో రూ.104.06, డీజిల్ రూ.92.16కే లభిస్తోంది. దీంతో మన రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న పెట్రోలు పంపులు రెండున్నరేళ్లుగా మూతపడ్డాయి. ఇలా మూతబడిన ఓ బంకులో ఓ రైతు మొక్కజొన్న కండెలను ఎండబెట్టుకుంటున్నాడు.

- ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, ఉరవకొండ

కూడేరు మండలం జల్లిపల్లి సమీపాన తెగిపోయిన పీఏబీఆర్ కుడి కాలువ గట్టు

గట్టుకు మట్టి సంచులే దిక్కు

ఈఏడాది జులై 5న కాలువ గట్ల దుస్థితిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

రెండు కాలువల గట్లు బలహీనంగా ఉన్నాయని.. ముప్పు పొంచి ఉందని, శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సి తీరుపై 'ఈనాడు' పలు కథనాలను ప్రచురించింది. కూటమి ప్రభుత్వం సైతం అత్యవసర మరమ్మతుల కోసం రూ.కోట్లల్లో నిధులు ఇచ్చింది. అధికారులు నిర్వహణపై మొదటి నుంచి నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఇప్పటికీ ప్రధాన కాలువలపై పర్యవేక్షణ కొరవడింది. దీనివల్లే ప్రాథమిక దశలోనే నీటి లీకేజీ, గండ్లను గుర్తించలేకపోయారు.

బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద కాలువకు గండిపడి వాగులోకి వెళుతున్న నీరు

అన్నదాతల ఆశలకు గండి

- తెగిన హెచ్చెల్సీ ప్రధాన, పీఏబీఆర్ కుడి కాలువల గట్లు
- పంట పొలాల్లోకి చేరిన నీరు
- అధికారుల నిర్లక్ష్యవైఖరి ఫలితం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), బొమ్మనహాళ్, ఉరవకొండ, న్యూస్‌టుడే: అధికారుల్లో ముందుచూపు కొరవడింది. కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. వారి నిర్వాకం.. నిర్లక్ష్యం మూలంగా ఒకే రోజులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎంతో కీలకమైన హెచ్‌ఎల్‌సీ ప్రధాన కాలువ, పీఏబీఆర్ కుడి కాలువ గట్లు తెగిపోయాయి. ఆదివారం ఉదయం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు 113-507 కిలోమీటరు వద్ద హెచ్చెల్సీ కాలువకు గండి పడి సుమారు 100 క్యూసెక్కుల నీరు వృథాగా పోయింది. 2023లోనూ ఇక్కడే కాలువకు రంధ్రం పడినప్పుడు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతోనే మళ్లీ పరిస్థితి పునరావృతమైంది. నీరంతా కోతలు కోసే వరి మళ్లలోకి వెళ్లడంతో సుమారుగా 200 ఎకరాల్లో పంటకు నష్టం కలిగినట్లు అన్నదాతలు వాపోయారు. అధికారులు టీబీ డ్యాం ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి ప్రవాహాన్ని నిలిపివేయించి గండిని తాత్కాలికంగా పూడ్చారు. ఇదిలా ఉండగా దిగువన కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ గట్టు కోతకు గురైంది. నీరు పెద్దఎత్తున పంట పొలాల్లోకి వెళ్లడంతో సుమారు 50 ఎకరాల్లో కంది, వరికి నష్టం వాటిల్లింది. కొర్రకోడు డ్యాం సమీపంలోని ఎస్కేప్ ఛానల్ ద్వారా నీటిని పెన్నానదికి మళ్లించడంతో ప్రవాహం తగ్గింది. అంతకుముందు.. కాలువ తెగిన ప్రదేశంలో వెంటనే మరమ్మతు పనులను చేపట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు జిల్లా జలవనరులను అధికారులను ఆదేశించారు.

ఉద్దేహాళ్ వద్ద కోతకు వచ్చిన వరి పొలంలోకి చేరిన నీరు

గేట్లు దయనీయం.. గట్లు బలహీనం

రెండు వారాలకుపైగా కఠోరంగా శ్రమిస్తే తప్ప.. పీఏబీఆర్ కుడి కాలువ గేటు (షట్టర్) పైకి లేవలేదు. నానా అవస్థలతో తెరిచి ఈనెల ఒకటో తేదీన కుడి కాలువకు నీటిని విడుదల చేశారు. కాలువ పొడవు 112 కి.మీ. ఉండగా.. ఆదివారం ఉదయం 8 గంటలకు 80.7 కి.మీ. దాకా నీరు వెళ్లాయి. ఈలోగా కాలువ మొదట్లోనే 4.460 కి.మీ. వద్ద తెగిపోయింది. కాలువ ప్రవాహ సామర్థ్యం 821 క్యూసెక్కులు కాగా.. ఆదివారం ఉదయం నాటికి 790 క్యూసెక్కులు కొనసాగింది. కాలువ బలహీనంగా ఉందని తెలిసినా ప్రవాహం ఎక్కువ పెంచడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

● కుడి కాలువ, దీని అనుబంధ ధర్మవరం ఉప కాలువ, బి.పప్పూరు కాలువలను శుభ్రం చేయడానికి, నిర్దేశిత మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం రూ.2.12 కోట్లు మంజూరు చేసింది. కాని.. ఈ కాలువ 0-40 కి.మీ వరకు అసలు శుభ్రంతోపాటు చిన్నపాటి మరమ్మతులు చేయలేదు. 0-25 కి.మీ. దాకా అసలు పనుల అంచనాలే తయారు చేయకపోవడం గమనార్హం. ఇందుకు హెచ్చెల్సీ డివిజన్ అధికారుల నిర్లక్ష్యమే కారణం. కాలువలో జమ్ముగడ్డి, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. గట్లన్నీ శిథిలం అయ్యాయి. గట్టుపై తిరగడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది.

ప్రధాన కాలువపై పర్యవేక్షణ లోపం

హెచ్‌ఎల్‌సీ ప్రధాన కాలువపై పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 2023లో తెగిన చోటే.. తాజాగా కాలువ గట్టు తెగిపోవడం గమనార్హం. అప్పట్లో తూతూమంత్రంగా మరమ్మతులు చేసినట్లు తేటతెల్లమైంది. అంతేకాదు... ఈ ఏడాది నీటి సీజన్‌కు ముందే అత్యవసర మరమ్మతు పనుల కోసం కూటమి ప్రభుత్వం రూ.33.89 కోట్లు మంజూరు చేసింది. 11 కీలక పనులకు సదరు నిధులను వెచ్చించారు. ఇదే క్రమంలో హెచ్చెల్సీ ప్రాజెక్టు పరిధిలో 181 పనులకు మరో రూ.14.88 కోట్లు ఇచ్చింది. మరమ్మతులతోపాటు కాలువలను సకాలంలో శుభ్రం చేయలేదు. ఒక్క రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోనే 36 పనులు చేశారు. అయినా ప్రధాన కాలువనే తెగిపోయింది. కాలువ ప్రవాహం సామర్థ్యం 2400 క్యూసెక్కులు.. ఆదివారం నీటి ప్రవాహం 1746 క్యూసెక్కులు మాత్రమే. అయినప్పటికీ కోతకు గురికావడం నిర్వహణ లోపానికి నిదర్శనం.

సజావుగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

అనంతపురం (విద్య), న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు (ఎన్‌ఎంఎంఎస్) ఆదివారం అనంతపురం జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లావ్యాప్తంగా 15 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. 3354 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా.. వీరిలో 3205 మంది పరీక్షకు హాజరయ్యారు. 149 మంది గైర్హాజరు అయ్యారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాలు లభిస్తాయి.

అక్రమ కట్టడాలపై కొరడా

ఈనాడు స్పందన

గుంతకల్లు పట్టణం: గత వైకాపా ప్రభుత్వంలో బోగస్ పట్టాలను సృష్టించి రూ.కోట్ల విలువ చేసే సర్కారు స్థలంలో నిర్మించుకున్న షెడ్లను ఆదివారం రెవెన్యూ అధికారులు తొలగించడానికి చర్యలు తీసుకున్నారు. గుంతకల్లు పట్టణం హనుమాన్ సర్కిల్‌లో బళ్లారి రోడ్డు, ఆలూరు, ఉరవకొండ రోడ్డు కూడలిలో కలుస్తాయి. అక్కడ వైకాపా నాయకుడు జి.దేవేంద్రప్పకు చెందిన పెట్రోల్ బంకు ఉంది. దాని పక్కనే సర్వే నంబరు 424-బి విస్తీర్ణంలో 23 సెంట్లు, సర్వే నంబరులో 412-2 విస్తీర్ణంలో 0.31 సెంట్ల స్థలం ఉంది. పెట్రోల్ బంకు ఉన్న ప్రభుత్వ స్థలం ఉండటంతో 2021లో ఆక్రమించడాని రెవెన్యూ అధికారులు తెలిపారు. అతని కుటుంబ సభ్యుల పేర్లతో 7.5సెంట్ల స్థలానికి నకిలీ పత్రాలను సృష్టించారు. మిగతా సర్కారు స్థలంలో షెడ్లు నిర్మించి అద్దెకు ఇచ్చారు. నెలకు ఒక్కో షెడ్డుకు రూ.25వేలు వరకు అద్దె తీసుకుంటున్నారు. ఈ ఏడాది జులై 6 తేదీన 'ఈనాడు'లో 'రూ.15కోట్ల సర్కారు స్థలం కబ్జా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. విచారణలో ఆక్రమణలు వాస్తవం అని తేలడంతో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిపై గుంతకల్లు ఉప తహసీల్దార్ నారాయణస్వామి స్పందిస్తూ 12.75 సెంట్లలో అక్రమంగా నిర్మించుకున్న షెడ్లను తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

'డ్రగ్స్ వద్దు.. సైకిల్ తొక్కు బ్రో'

ర్యాలీలో సైకిల్ తొక్కుతున్న ఎస్పీ జగదీశ్, అధికారులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: యువతను మత్తు పదార్థాల మాయాజాలం నుంచి దూరంగా ఉంచి, ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చే లక్ష్యంతో అనంత నగరంలో 'డ్రగ్స్ వద్దు.. సైకిల్ తొక్కు బ్రో' అవగాహన ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ జగదీశ్ ర్యాలీని ప్రారంభించి, సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై అంబేడ్కర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, సుభాశ్ రోడ్డు, గడియారస్తంభం, ఎన్టీఆర్, శ్రీకంఠం సర్కిల్, పాతూరు, తాడిపత్రి బస్టాండ్, గాంధీ బజార్, సంగమేశ్ కూడలి మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. డ్రగ్స్..యువత భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సమస్య అన్నారు. ఆకతాయితనంగా, కిక్ కోసం తీసుకునే మాదకద్రవ్యాలు మరణం దాకా తీసుకెళ్తాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో పిల్లల నడవడికను సరిచేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. యువత సైకిల్ తొక్కే వ్యాయామాన్ని నిరంతరం కొనసాగించాలని సూచించారు. మానసిక- శారీరక ఆరోగ్యంపై డ్రగ్స్ దుష్ప్రభావాల గురించి నిపుణులు సూచనలు ఇచ్చారు. ఎవరైనా గంజాయి వినియోగం, విక్రయం, సరఫరా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు గానీ, డయల్ 112 కిగానీ స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, మహిళా పీఎస్ డీఎస్పీ మహబూబ్ బాషా, డీటీసీ డీఎస్పీ నారాయణరెడ్డి, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని అధిగమించడానికి అనంతపురం మీదుగా చెర్లపల్లి - యలహంక మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు డివిజన్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న రైలు (07187) చెర్లపల్లిలో రాత్రి 10 గంటలకు బయలుదేరి కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, ప్రశాంతి నిలయం గుండా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 11.45కు యలహంక చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో రైలు (07188) యలహంకలో 9న మధ్యాహ్నం 1 గటకు బయలుదేరి ఇదే మార్గంలో ప్రయాణించి చెర్లపల్లికి మరుసటి రోజ తెల్లవారు జామున 4.30కు చేరుకుంటుందన్నారు.

బస్టాండ్‌లోకి రాకముందే బస్సులన్నీ ఫుల్

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు వెళ్లడానికి బస్టాండుకు వచ్చారు. వచ్చిన ప్రతి బస్సూ నిండిపోయింది. సీటు దొరక్కపోయినా ఫర్వాలేదు.. నిలబడటానికి చోటు ఉంటే చాలు అన్నట్లు ఎగబడ్డారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, కదిరి ప్రాంతాల నుంచి బస్సులు స్టాండులోకి రాకమునుపే ప్రయాణికులు ఎదురెళ్లి బస్సుల్లో ఎక్కడానికి ప్రయత్నించారు. బస్సులను చుట్టుముట్టి, చిన్నపిల్లలను కిటికీల్లో సీట్లలోకి తోశారు. అక్కడ నియంత్రించే సిబ్బంది లేరు. తగినన్ని బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, అనంతపురం (ఆజాద్‌నగర్)

తలనీలాల సొమ్మేది స్వామీ!

కొంతే చెల్లింపు.. మిగతాది మమ

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ఏటా లక్ష మంది వరకు భక్తులు దర్శించుకుంటుంటారు. వారిలో ఏడాది కాలంలో దాదాపు 20 వేల మంది వరకు తలనీలాలు సమర్పిస్తుంటారు. ఏటా తలనీలాల సేకరణ ప్రక్రియకు ఆలయ అధికారులు వేలం పాట నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 2023-24 ఏడాదికి గాను రూ.52.5లక్షలకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దక్కించుకున్నాడు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉరవకొండ ప్రాంతానికి చెందిన గుత్తేదారు రూ.27 లక్షలకు సేకరణ హక్కులను పొందాడు. ఈఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు మూడుసార్లు టెండర్లను నిర్వహించగా వాయిదా పడుతూ వస్తున్నాయి.

ఆలయంలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

తలనీలాల టెండర్లలో ఖరారైన పూర్తి మొత్తం ఆలయ ఖాతాకు చేరడం లేదు. 2023-24లో రూ.52.5లక్షలకు గాను రూ.36.5లక్షలు, 2024-25లో రూ.27లక్షలకు గాను రూ.9.5లక్షలు గుత్తేదారు చెల్లించారు. అందులో రూ.6.5లక్షలు ఆలయ ఖాతాకు జమ చేసి, మిగతా రూ.3లక్షలు ఓ అధికారి తన సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి సంబంధించి గుత్తేదారుకు రసీదు ఇవ్వలేదని తెలిసింది. ఇదిలా ఉండగా టెండరు కాలం ముగిసిపోయి నెలలు గడుస్తున్నా... వారి నుంచి పూర్తి మొత్తాన్ని వసూలు చేయడంలో ఆలయ అధికారులు చొరవ చూపడం లేదు. భక్తులు ఎంతో నమ్మకంతో తలనీలాలను సమర్పిస్తే వాటిలోనూ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తున్నా ఉన్నతాధికారులు సైతం తమకేదీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

● గుత్తేదారులకు కనీసం నోటీసులు జారీ చేస్తున్న సందర్భాలు లేవు. ఈ ఏడాదికి సంబంధించి ఆగస్టులోనే టెండర్లు పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటివరకు కొలిక్కి రాలేదు. కొందరు గుత్తేదారులు సిండికేటుగా ఏర్పడి తక్కువ ధరకు దక్కించుకోవడానికి ఎత్తుగడ వేస్తుండటంతో వేలం ప్రక్రియ వాయిదా పడుతూవస్తోంది.

● ఈ అంశంపై దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ సుధారాణిని వివరణ కోరగా... టెండరు మొత్తం వసూలు చేయడంలో అలసత్వం చూపినా, పక్కదారి పట్టించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

అతివల భవితకు ఉషస్సు!

గుంతకల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని, సాధికారత సాధన కోసం ఎన్డీయే ప్రభుత్వం గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసింది. రాష్ట్రంలో గుంతకల్లుతోపాటు శృంగవరపుకోటలోని కళాశాలలను పీఎం ఉష పథకం కింద ఎంపిక చేసి అమలు చేయడం ప్రారంభించింది. మహిళలు విద్యతోపాటు, వివిధ అంశాల్లో శిక్షణ పొందడానికి ఇబ్బందులు పడుతున్నారని.. మధ్యలో చదువు నిలిపివేస్తున్నారని సర్కారు గుర్తించి... వారి అభ్యున్నతికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరిన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర సామగ్రి

రూ.10 కోట్లు కేటాయింపు

మహిళలకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలుగజేయడానికి రూ.10 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో రూ.6కోట్లతో హాస్టల్ భవనాల నిర్మాణం సాగుతోంది. శిక్షణ పరికరాలు కొనుగోలుకు రూ.2.50 కోట్లు, ఇతర సామగ్రికి రూ.1.50 కోట్లు వ్యయం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం 25 కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్లు, ప్రింటర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, ఫ్యానళ్లు సరఫరా చేసింది. హాస్టల్ భవనాల పనులు పూర్తయితే ఇతర సామగ్రిని సరఫరా చేయనుంది.

ఎందులో తర్ఫీదు ఇస్తారంటే..

- డ్రోన్‌ల వినియోగం
- కృత్రిమ మేధస్సు
- ఆత్మవిశ్వాసం
- ఆరోగ్య పరిరక్షణ
- స్వీయరక్షణ
- చట్టాలపై అవగాహన

★ ఇప్పటికే అధికారులు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వసతిగృహాలు అందుబాటులోకి వస్తే కొత్త కోర్సుల్లోనూ తర్ఫీదు ఇస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మహిళలే కాకుండా రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా నివసిస్తున్న వారు హాస్టల్‌లో చేరడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-డాక్టర్ లక్ష్మయ్య, ప్రధానాచార్యులు

ఉష పథకాన్ని మహిళలు పూర్తిగా సద్వినియోగం చేసుకుని జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గుంతకల్లులోని ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ఆసక్తి ఉన్న మహిళలు అవకాశాన్ని అందిపుచ్చుకుని ముందడుగు వేయాలి.

పట్టుచీరకు జరీ ధరాఘాతం

అదనపు భారంతో నేతన్న కుదేలు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టు చీరల తయారీలో ఉపయోగించే జరీ ధరలు అమాంతం పెరగడం చేనేత కార్మికులకు భారంగా మారింది. వెండి, బంగారం ధరలకు రెక్కలు రావడమే దీనికి కారణం. ఒక్కో జరీ మార్కుపై రూ.150 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. పట్టుచీర తయారీలో పట్టుదారంతో పాటు జరీ వాడుతారు. ఒక్కో చీరకు రెండు నుంచి మూడు జరీ మార్కులు అవసరమవుతాయి. దీనివల్ల ఒక్కో చీరకు రూ.300 నుంచి రూ.400 వరకు తయారీదారుడు అదనంగా వెచ్చించాలి. ఇప్పటికే ముడిపట్టు కిలో రూ.6500కు చేరడంతో ఒక్కో పట్టుచీరపై రూ.వెయ్యి, జరీతో అదనంగా మరో రూ.400 భారం పడుతోంది. మరో వైపు విపణిలో చీర ధర పెరగడం లేదు. ఫలితంగా అటు చేనేత ఇటు మరమగ్గాలపై చీరలు రూపొందిస్తున్న కార్మికులపై ఆర్థిక భారం పడుతోంది.

మగ్గంపై జరీతో పట్టుచీర నేస్తున్న కార్మికుడు

- ఉమ్మడి జిల్లాలో చేనేత మగ్గాల సంఖ్య: **24 వేలు**
- మరమగ్గాలు: **22 వేలు**
- మగ్గాలపై ప్రతి నెలా తయారయ్యే పట్టుచీరలు: **96 వేలు**
- మరమగ్గాలపై రూపొందించే చీరలు: **5.5 లక్షలు**
- 6 నెలల క్రితం జరీ మార్కు ధర: **రూ.500**
- ప్రస్తుతం ధర: **రూ.650 నుంచి రూ.700 వరకు**

పెరిగిన వెండి ధరతోనే...

గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో జరీ తయారీ పరిశ్రమలు అధిక సంఖ్యలో ఉన్నాయి. పట్టుదారంపై వెండి, బంగారు, రాగి పూతతో అక్కడి కార్మికులు నైపుణ్యంగా జరీ తయారు చేస్తున్నారు. ఆరు నెలలుగా వెండి, బంగారు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. జరీ తయారీలో అధికంగా వెండి వినియోగిస్తుంటారు. దీనివల్ల వెండి జరీ మార్కుపై రూ.150 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఆరు నెలల క్రితం బంగారు జరీ మార్కు రూ.30వేలు పలికేది. ప్రస్తుతం రూ.35వేలకు చేరింది. అదనంగా రూ.5వేలు పెరగడంతో బంగారు జరీతో తయారు చేయించే పట్టుచీరల వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రభుత్వం స్పందించి జరీ మార్కు ధరలు స్థిరంగా ఉండేలా చూడాలని వ్యాపారులు, నేతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

27 నుంచి ఇస్తెమా నిర్వహణ

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సున్నపుగుట్ట తండా బాహ్యావలయ రహదారి సమీపంలో 27, 28 తేదీల్లో ముస్లిం సోదరుల ఆధ్యాత్మిక కార్యక్రమం ఇస్తెమా నిర్వహించనున్నారు. ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇస్తెమా నిర్వహించే ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ముస్లిం మతపెద్దలు, నిర్వాహకులతో కలిసి పరిశీలించారు. అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్తు సరఫరా, నీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇస్తెమాకు హాజరయ్యే ముస్లిం సోదరులకు అన్ని సదుపాయాలు ప్రభుత్వపరంగా కల్పిస్తామన్నారు. డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐలు నిరంజన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రెవెన్యూ, విద్యుత్తు శాఖల సిబ్బంది, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఇర్షాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి
మీ ఉన్నతికి శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

(c) eenadu

నిత్యం పుస్తక పఠనం చేయాలి

కమలానగర్, న్యూస్‌టుడే: జీవితాలలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే నిత్యం పుస్తక పఠనం చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో 'చదువంటే మా కిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో పాటు గ్రంథాలయ సంస్థ అధికారిణి రమ, శిక్షకులు విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీరాములు, డాక్టర్ రామలింగయ్య హాజరై మాట్లాడారు. జీవితాలకు ఉపయోగపడే పుస్తకాలను విద్యార్థి దశ నుంచే చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించి, కథలు, పుస్తక విశ్లేషణ చేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, గోవిందు, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నేరాలను కట్టడి చేసి నేరస్థులను జైలుకు పంపించాల్సిన పోలీసుల్లో కొందరు అవినీతికి పాల్పడుతున్నారు. అక్రమార్జనకు అలవాటుపడి కాసుల కక్కుర్తితో కేసులను తారుమారు చేస్తున్నారు. సివిల్ పంచాయతీలు సైతం చేస్తుండటం వివాదాస్పదంగా మారాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం సబ్‌డివిజన్ పరిధిలోని ఎంతోమంది పోలీసులపై విమర్శలు గుప్పుమంటున్నాయి.

పోలీసులు.. దారితప్పి ప్రజల నుంచి వసూళ్లు
పిండేస్తున్నారు కాసులు!

● తాడిపత్రి సబ్‌డివిజన్‌లో ఓ అధికారిని ఉన్నతాధికారులు మూడోసారి వీఆర్‌కు పంపినా ఆయన తీరులో మార్పు రాలేదు. గుంతకల్లు సబ్ డివిజన్‌లో పనిచేసే క్రమంలో వైకాపా నాయకులను అడ్డం పెట్టుకుని ఇసుక దందా చేయించారు. జూదం పెచ్చరిల్లినా మామూళ్లు తీసుకుని పట్టించుకునేవాడు కాదు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను బూతులు తిట్టడం, ప్రశ్నిస్తే చేయి చేసుకోవడం వంటివి ఉండేవి. ఇతని వ్యవహారం తెలిసి వీఆర్‌కు పంపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి సబ్ డివిజన్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరు కానిస్టేబుళ్లను వసూళ్లకు పంపి.. ప్రతి కేసుకూ లెక్క కట్టి వసూలు చేసేవాడు. తాజాగా ఓ ప్రేమజంట విషయంలో పంచాయితీ చేసి డబ్బులు వసూలు చేశాడు. ఎస్పీకి ఫిర్యాదులు అందడంతో పది రోజుల క్రితం మరోసారి వీఆర్‌కు పంపారు.

● అనంతపురం సబ్ డివిజన్‌లో ఓ అధికారి ఏ స్టేషన్‌లో చేరినా వివాదాస్పదమే. ప్రభుత్వం ఏదైనా, అధికారి ఎవరైనా అక్రమాలకు పాల్పడుతుంటాడు. గతేడాది నగరంలో ఓ స్టేషన్‌నుంచి మరో స్టేషన్ బదిలీ అయ్యాడు. మట్కా, జూదం, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా ఉండే ఆ ప్రాంతంలో అక్రమార్కులతో చేతులు కలిపి నెలవారీ వసూళ్లు చేసేవాడు. బియ్యం మాఫియాతో రూ.లక్షల్లో లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపారు.

ఐడీ పార్టీ ముసుగులో..!

ఉరవకొండ సర్కిల్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ ఐడీ పార్టీలో విధులు నిర్వహిస్తున్నాడు. అతడు గత వైకాపా ప్రభుత్వంలో ఉరవకొండలోనే పనిచేశాడు. అప్పట్లో తెదేపా నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేశాడు. ప్రభుత్వం మారాక బదిలీ అయ్యాడు. కొందరు నాయకుల అండతో తిరిగి పాత సర్కిల్‌కు వచ్చాడు. ఆ కానిస్టేబుల్ జనాన్ని వేధిస్తూ, వ్యాపారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. ఎక్కడైనా రద్దీ ప్రాంతం కనిపిస్తే చాలు.. నిలబడి అనధికారిక తనిఖీలు చేసి సొమ్ము చేసుకుంటున్నాడు.

● కళ్యాణదుర్గంలో ఓ కానిస్టేబుల్ జూదం, మట్కా, నాటుసారా కాసేవాళ్లలో మామూళ్లు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడు. స్టేషన్‌కు వచ్చే బాధితులను డబ్బులు తీసుకుని బయటే పంచాయితీ చేసి పంపుతున్నాడు. శెట్టూరు స్టేషన్‌లో ఓ హెడ్‌కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్ ప్రజాకంటకులుగా మారారు. ఆ స్టేషన్‌కు కొంతకాలం అధికారి లేడు. కేసుకో రేటు నిర్ణయించి బాధితులతో డబ్బులు వసూలు చేశాడు. అదే స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ మద్యం అక్రమార్కులు, జూదం, మట్కా మాఫియాలతో సన్నిహితంగా మెలుగుతూ చేతికందినంత పోగేసుకుంటున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

కనులపండువగా ఖాద్రీశుడి కల్యాణం

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయంలోని కల్యాణ మండపంలో ఆదివారం భక్తులు శ్రీవారికి ఆర్జిత కల్యాణోత్సవాన్ని జరిపించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను వధువూరులుగా శోభాయమానంగా అలంకరించారు. తొలుత హోమం నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామివారి వివాహం శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు స్వామివార్లకు పెళ్లి కానుకలు చదివించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. - **న్యూస్‌టుడే, కదిరి**

పంపనూరు ఆలయ అభివృద్ధే లక్ష్యం

పాలక మండలి సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి భక్తులు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే నేడు ఉచిత బస్సుల కారణంగా భక్తుల సంఖ్య పూర్తిగా పెరిగిపోయిందన్నారు. భక్తులకు అనుగుణంగా ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. భక్తుల కోసం రూ.30 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. వీటితోపాటు ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.14.50 కోట్లతో ప్రణాళికలు తయారు చేశామని త్వరలోనే దేవదాయశాఖ మంత్రిని కలిసి అనుమతులు తీసుకుంటామన్నారు. అనంతరం నూతన ఆలయ కమిటీ ఛైర్మన్‌గా వేణుగోపాల్ రెడ్డిని ఎంపిక చేసి 11 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీకు కారు ఉందా? ఎందుకు ఇంట్లో నిలబెట్టాలి. హ్యాపీ Car ఇప్పుడు అనంతపురంలో మీ కారుని జోడించి, నెలకు 32,000/- వరకు సంపాదించండి. కాల్: 6301174565.

JOBS

Opportunity for Male Hindi Age 20 to 30 Managers with good Pay in Sainagar, Anantapur. Cell: 8096000222.

Wanted Teachnicians 10th/ Inter/ ITI Pass/ Fail Work at Crompton Service Center Opportunity earn 10K to 12K Per Month Training will Provide ATP. 8330942076

ఇంటర్ కాలేజీలో పనిచేయటానికి టెలికాలర్స్, ట్యూటర్లు, వార్డెన్లు మరియు పీఆర్వోలు కావలెను. సెల్: 80199 89913, 94400 45441.

ATP ఫ్లైవుడ్ షాపు నందు అకౌంటెంట్‌గా Tally Input, Output మరియు GST Returns వేయడంలో అనుభవం గల జెంట్స్ మాత్రమే కావలెను. సెల్: 9676358269.

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషంట్స్ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 20k. © 89776 39662,89776 39663.

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు సేల్ ఎగ్జిక్యూటివ్స్ (ఓన్లీ గర్ల్స్) కావలెను. ఆఫీసువర్క్ మాత్రమే. జీతం: 14K to 20K. ఇంటర్వ్యూ: 17, 18 తేదీలలో ATP. 9573588092.

పెనుకొండ పట్టణం గార్డెన్ హోటల్ నందు పనిచేయడానికి అనుభవజ్ఞులయిన ఆల్‌రౌండ్ వంటమాస్టర్లు, కటింగ్ మరియు సప్లయ్ చేయడానికి సప్లయర్లు కావలెను. ప్రతిరోజు పేమెంట్ వసతి భోజనం ఫ్రీ సంప్రదించండి. © 9000559668.

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff For Science and English Subject (3 to 5 Classes) to Work in Blossoms School, Aravind Nagar, ATP. Mob: 9030777676.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రచురించడంలో ముందు తగిన రీతిలో కట్టుదిట్టం వహించినప్పటికీ పాఠకులకు సూచించవలసినది. ప్రకటనలను చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటించబడిన సరుకులు అమ్మకం లేదా అలాంటి సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేసినా డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలను పొందండి. వివాహాలు అమ్మకాలు... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు ఇచ్చేందుకు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జీఎస్టీ 5% వర్తించును

ధర్మవరం బాలుర జట్టు ఘన విజయం



89 పరుగులతో రాణించిన గణేష్

మూడు వికెట్లు తీసిన కుందన్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని క్రీడా మైదానంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రూరల్ క్రికెట్ లీగ్ (ఆర్‌సీఎల్) పోటీల్లో ఆదివారం ధర్మవరం బాలుర జట్టు హిందూపురంపై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన హిందూపురం బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌లో ధర్మవరం జట్టు 40 ఓవర్లలో 242 పరుగులు చేసి ఆలౌట్ అయింది. బ్యాటర్లు గణేష్ 89, జావీద్ 43, కుందన్ 31 పరుగులతో రాణించారు. ఛేదనలో హిందూపురం జట్టు 187 పరుగులకే ఆలౌటై ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని చరణ్ అర్ధ సెంచరీ చేశాడు. ధర్మవరం జట్టు బౌలర్లు కుందన్ మూడు, సాయిసంతోష్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బకొట్టారు. ఆస్ట్రో ఫ్యాషన్ యజమాని ఆటగాళ్లకు భోజన వసతి కల్పించారు. ఆల్‌రౌండర్ ప్రతిభ చూపిన కుందన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు, అత్యధిక పరుగులు చేసిన గణేశ్‌కు క్రికెట్ అభిమాని శంకర్ ధావన్ క్రీడా దుస్తులు బహుకరించారు. ఆర్డీటీ ఏరియా కో-ర్డినేటర్ శ్రీనివాసులు, కోచ్ రాజశేఖర్ మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

క్రికెట్ శిక్షణ వేదికను ప్రారంభించిన డీఆర్ఎం చంద్రశేఖర్, ఏడీఆర్ఎం సుధాకర్

గుంతకల్లు, న్యూస్‌టుడే : క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకుంటూ ఆటల్లో సత్తా చాటుకోవాల్సిన బాధ్యత క్రీడాకారులపై ఉందని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ అన్నారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్మించిన క్రికెట్ శిక్షణ వేదికతో పాటు లాన్‌టెన్నిస్, షటిల్, చిత్రలేఖనం శిక్షణ శిబిరాలను ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైల్వే ఉద్యోగులతో పాటు వారి పిల్లలు క్రీడా వేదికలను వినియోగించుకుంటేనే వాటి కోసం వ్యయం చేసిన నిధులకు సార్థకత ఉంటుందన్నారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయంగా మారడానికి కమిటీ కృషి చేయాలన్నారు. డివిజన్ క్రీడాధికారి, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి ఎల్లప్ప, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి నేతానియల్, కమిటీ సభ్యులు, ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఆర్.ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కుంటలో పడి సోదరుల మృత్యువాత

నరేంద్ర

చరణ్

ప్రమాదానికి కారణమైన కుంట ఇదే..

కళ్యాణదుర్గం గ్రామీణం, బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కుంటలో పడి అన్నదమ్ములు నరేంద్ర (22), చరణ్ (18) మృత్యువాత పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం వాల్మీకి సర్కిల్‌లో నివాసం ఉంటున్న వెంకటేశులు-లలితమ్మ దంపతులు పాలవెంకటాపురం గ్రామంలో మామిడి తోపును గుత్తకు తీసుకున్నారు. వీరి కుమారులు నరేంద్ర (భవన నిర్మాణ కూలి), చరణ్ (ద్విచక్ర వాహన మెకానిక్) అవసరమైనప్పుడు తల్లిదండ్రులకు సాయంగా తోటలో పనులకు అప్పుడప్పుడు వెళ్లేవారు. ఆదివారం మామిడి చెట్లకు పురుగుమందు పిచికారీ చేయాలని కూలీలతో కలిసి వెళ్లారు.

ఈత రాకపోవడంతో..

అందరూ పనుల్లో నిమగ్నమైనప్పుడు నరేంద్ర నీటి కుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. దీనిని గుర్తించిన తమ్ముడు చరణ్ అన్నను రక్షించేందుకు నీటిలో దిగాడు. ఇరువురికి ఈత రాకపోవడంతో మునిగిపోయి మృత్యువాతపడ్డారు. కుమారులు ఎంతసేపటికి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతకగా కుంటలో విగత జీవులుగా కనిపించారు. ఎస్సై నరేంద్రకుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాలను పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నవారికి కడుపుకోత

వెంకటేశులు- లలితమ్మ దంపతులు కుమారులిద్దరిని కంటికి రెప్పలా చూసుకునేవారు. బతుకుదెరువు నిమిత్తం మామిడి తోపులను గుత్తకు తీసుకుంటున్నారు. ఆదివారం సంతోషంగా తోట వద్దకు వెళ్లిన సమయంలో కుమారులిద్దరి మృతితో 'మాకు కడుపుకోత మిగిల్చారా' అంటూ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈఘటనతో కళ్యాణదుర్గంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

ఒకసారి చూడవయ్యా.. నాకు దిక్కెవరూ..!

పెళ్లై ఏడాది కాకముందే నన్ను వదలి వెళ్లిపోయావా? తోడు, నీడగా ఉంటావని చెప్పి అంతలోనే కానరాని లోకాలకు వెళ్లిపోతివా? ఇక నాకు దిక్కెవరంటూ నరేంద్ర భార్య చిట్టి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతపురానికి చెందిన చిట్టికి కళ్యాణదుర్గానికి చెందిన నరేంద్రతో 8 నెలల కిందట వివాహమైంది.

హోయసల రాజ్యచిహ్నం గుర్తింపు

చిహ్నం చూపిస్తున్న ఉపాధ్యాయుడు గోపి

బుక్కపట్నం, న్యూస్‌టుడే: బుక్కపట్నంలోని పురాతన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 11వ శతాబ్దానికి చెందిన హోయసల రాజ్యచిహ్నం వ్యాలను గుర్తించినట్లు ఉపాధ్యాయుడు గోపి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ వ్యాల అనేది క్రీ.శ. 11 నుంచి 14వ శతాబ్దం వరకు కర్ణాటకను పాలించిన హోయసరాజుల రాజ్య చిహ్నమన్నారు. దీన్ని ధైర్యం, శక్తికి ప్రతీకగా భావిస్తారన్నారు. విజయనగర సామ్రాజ్యానికి ముందు బుక్కపట్నం ప్రాంతం హోయసల రాజ్యంలో అంతర్భాగంగా ఉండేదన్నారు. ఇక్కడ మూడు వైష్ణవ దేవాలయాలను నిర్మించారని, వీటిలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఒకటన్నారు. క్షేత్రపాలకుడిగా ఆంజనేయస్వామి ఉన్నారన్నారు. ఈ ఆలయ స్తంభాలపై అద్భుత దేవతా శిల్పాలను చెక్కారని, హోయసల తర్వాత విజయనగర రాజులు రాజపోషకులుగా ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోందని వివరించారు.

చేతివృత్తి కళాకారులను ప్రోత్సహిద్దాం

నేడు నుంచి హస్తకళల వారోత్సవాలు

అరటి నారతో తయారు చేసిన వివిధ రకాల సంచులు

తోలుతో తయారు చేసిన శివాజీ, ఆంజనేయుడి చిత్రాలు

రుద్రంపేట, న్యూస్‌టుడే: చేతి వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న హస్తకళాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. హస్తకళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది. సోమవారం జాతీయ హస్తకళల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా లేపాక్షి ఎంపోరియం విక్రయ కేంద్రాల్లో ఈ నెల 14 వరకు హస్తకళల వారోత్సవాలు నిర్వహణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గడియార స్తంభం సమీపంలోని లేపాక్షి ఎంపోరియంలో ప్రత్యేక అమ్మకాలు ప్రారంభిస్తున్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచి పుట్టపర్తి (జిల్లా) నిమ్మలకుంట గ్రామంలో తోలుబొమ్మలతో తయారు చేసిన దేవతామూర్తులు, లైటింగ్ ల్యాంప్‌లతోపాటు వివిధ రకాల బొమ్మలు, అనంతపురం జిల్లా కురుగుంటలో గ్రామంలో అరటి నారతో తయారు చేసిన సంచులు, అల్లికలు, దేవతామూర్తులతోపాటు ఇతర జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఏటికొప్పాక బొమ్మలపై 20 నుంచి 30 శాతం రాయితీతో వినియోగదారులకు విక్రయించనున్నట్లు మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. అవకాశాన్ని పుర ప్రముఖులు వినియోగించుకోవాలని కోరారు.

సైనికుల త్యాగాలను ప్రజలంతా గుర్తించాలి

హుండీలో నగదు వేస్తున్న కలెక్టర్ ఆనంద్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దేశ రక్షణలో మన సైనికుల త్యాగాలు ప్రజలు ఎప్పటికీ మరువకూడదని కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. ప్రజల రక్షణ కోసం వారు ప్రాణాలను తెగించి పోరాడుతున్నారు. వారి సంక్షేమం కోసం ప్రజలు విరివిగా విరాళాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం సాయుధ త్రివిధదళాల పతాక దినోత్సవ ప్రదర్శన ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైంది. కలెక్టర్ విరాళం అందజేస్తూ ప్రసంగించారు. తొలుత జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి. తిమ్మప్ప కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేయగా. . కలెక్టర్ పతాక నిధికి విరాళం అందజేశారు. అర్హులైన మాజీ సైనికులకు ఇంటిపట్టాలు ఇవ్వడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత ఏడాది దాతలు రూ. 6.68 లక్షలు విరాళాలు అందించారు. ఈసారి కూడా దాతలు స్పందించి పెద్దఎత్తున విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రదర్శనకు ముందు తిమ్మప్ప మాట్లాడుతూ.. సరిహద్దుల్లో కాపలా కాస్తూ మరణించిన కుటుంబాల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

విరాళాలు ఇవ్వాలని సూచన

యుద్ధంలో అమరులైన మాజీ సైనికుల కుటుంబాలు, యుద్ధాల్లో పాల్గొని పింఛను లేని వారి కోసం విద్యార్థులు కూడా విరాళాలు ఇవ్వాలని మాజీ సైనిక అధికారి కనుపల్లి చిరంజీవి రెడ్డి పిలుపునిచ్చారు. ఎరా అంతర్జాతీయ పాఠశాల, ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులతో మాట్లాడి సైనిక సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా విరాళాలు అందించి ఇబ్బందుల్లో ఉన్న సైనిక కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

జై సీతారాం రచనలు అమృతవాక్కులు

మాట్లాడుతున్న కవి శాంతినారాయణ

అనంత సాంస్కృతికం: స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం అనంత సాహితీ సంస్థల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో 'కవికాకి' గా పేరెన్నికగన్న కోగిర జై సీతారాం జయంతిని కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త తూముచెర్ల రాజారాం మాట్లాడుతూ.. జైసీతారాం రాయలసీమ మాండలిక భాషకు కవిత్వ గౌరవాన్ని సాధించిన సహజ వాగ్గేయకారుడని కొనియాడారు. జైసీతారాం రచించిన పద్య కవిత్వాన్ని చంద్రశేఖరశాస్త్రి విశ్లేషిస్తూ.. వాడుక భాషలో అందమైన పద్యాన్ని నిర్మించడమే గాకుండా పద్యంలో వ్యంగ్యాన్ని సమర్థంగా ప్రయోగించారన్నారు. ఏలూరు యంగన్న మాట్లాడుతూ.. దుర్భర పేదరికం నుంచి పుట్టుకొచ్చిన కవితా పుష్పం జై సీతారామ్ అని ప్రశంసించారు. 'అక్షర సైన్యం' అనే వచన కవితా సంపుటి రాయలసీమ నుంచి వచ్చిన విప్లవ కవిత్వానికి తొలి రుజువుగా ఉందని అంకే శ్రీనివాస్ పేర్కొన్నారు. రాయలసీమలో తొలి విప్లవ ప్రజాకవి అని, రాయలసీమ ఏ విధంగా నిర్లక్ష్యానికి గురైందో ఆ విధంగానే గుర్తింపునకు నోచకోని మహాకవి కోగిర జై సీతారాం అని శాంతి నారాయణ అభివర్ణించారు. 'చలిమంట' అనే రచనలోని హాస్యాన్ని సంభాషణాత్మక రచనను అనంతపురం మాండలికంలోని యాసతో కోగిర జయచంద్ర వినిపించారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా రవీంద్ర

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గంతో జేఏసీ జిల్లా ఛైర్మన్ దివాకర్ రావు, ప్రధాన కార్యదర్శి పాపారావు, తదితరులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అనంత నగరం డ్రైవర్ల హోం ఆవరణలో ఆదివారం ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపారావు ఎన్నికల అధికారిగా, ముఖ్య అతిథిగా ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ ఆర్ఎన్ దివాకర్ రావు హాజరయ్యారు. తొలుత సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల నియమ, నిబంధనలను వివరించారు. ఆ తర్వాత పోటీదారుల నుంచి నామపత్రాలు స్వీకరించారు. అధ్యక్షుడి పదవికి ఒకరు మాత్రమే నామినేషన్ వేశారు. మొత్తం కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. కొత్త కమిటీ వివరాలను ఎన్నికల అధికారి పాపారావు ప్రకటించారు. అధ్యక్షుడిగా గృహ నిర్మాణ శాఖ డ్రైవర్ డి.రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా సి.కె.లక్ష్మన్న, కోశాధికారిగా ఆర్.ఎం.బాష, గౌరవాధ్యక్షుడిగా రాంగోపాల్, సహాధ్యక్షుడిగా ఎస్.డేవిడ్, ఉపాధ్యక్షులుగా పి.మాబూసాబ్, శ్రీనివాసుల నెహ్రూ, సహాయకార్యదర్శిగా పెంచలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా సురేశ్, ప్రచార కార్యదర్శిగా ఆదివరం, కార్యవర్గ సభ్యులుగా వెంకటరమణను ఎంపిక చేశారు.

రమేశ్ ఎన్నిక చెల్లదు..

ఈ కమిటీ ఎంపిక తర్వాత ఎన్నికల అధికారి పాపారావు, జేఏసీ ఛైర్మన్ దివాకర్‌రావు విలేకరులతో మాట్లాడారు. డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా తాను ఎంపిక అయ్యానంటూ రమేశ్‌బాబు అనే వ్యక్తి సొంతంగా ప్రకటించుకున్నారని, ఇతని ఎన్నిక అసలు చెల్లదన్నారు. రెండున్నరేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. రాష్ట్ర కమిటీ అనుమతి లేకపోవడమే కాదు.. సంఘం మార్గదర్శకాలను తుంగలో తొక్కారన్నారు.

సైకిల్‌పై 11వ సారి శబరిమలకు...

కుమారస్వామి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోటవీధికి చెందిన మఠం కుమారస్వామి అయ్యప్ప దీక్షతో 11 ఏళ్లుగా ప్రతిఏటా సైకిల్‌పై శబరిమలకు వెళ్లి వస్తున్నారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, బంధువులు, అయ్యప్ప స్వాములు కుమార స్వామిని రాయదుర్గం నుంచి శబరిమలకు సాగనంపారు. కుమారస్వామి ప్రతిఏటా సుమారు 1600ల కిలోమీటర్ల దూరంలోని శబరిమలకు సైకిల్ పైనే వెళ్లి వస్తుండటంతో ఆయనను ప్రజలు 'సైకిల్ స్వామిగా' పిలుస్తున్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రమణారెడ్డి

రమణారెడ్డి

అనంతపురం విద్య: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడుగా రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా మల్లికార్జున ఎన్నికయ్యారు. ఆ ఉపాధ్యాయ సంఘం 79వ కౌన్సిల్ సమావేశం ఆదివారం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జరిగింది. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2 సంవత్సరాలపాటు కార్యవర్గం ఉంటుంది.

రోటావేటర్ బోల్తాపడి యువకుడి దుర్మరణం

ఎంజారప్ప

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కోతులగుట్ట వద్ద ట్రాక్టరు రోటావేటర్ బోల్తా పడి ఎంజారప్ప(31) దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ లావణ్య అందించిన వివరాల మేరకు గుడిబండ మండలం సీసీగిరి గ్రామానికి చెందిన బండిమనే తిప్పన్న కుమారుడు ఎంజారప్పకు కోతులగుట్ట గ్రామంలో వివాహమైంది. ఇతను బెంగళూరులో మెడికల్ రెప్‌గా పనిచేసేవాడు. భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కోసం కోతులగుట్ట గ్రామానికి వచ్చాడు. ఆదివారం పొలం పనుల కోసం బావ మల్లికార్జునతో కలిసి వెళ్లాడు. పనుల అనంతరం తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ మలుపు వద్ద ట్రాక్టరును తిప్పుతుండగా బోల్తాపడింది. పక్కనే ఉన్న మల్లికార్జున అక్కడి నుంచి పక్కకు దూకడంతో గాయపడ్డాడు. ట్రాక్టరు నడుపుతున్న ఎంజారప్ప రొటావేటర్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు. భార్య గాయిత్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాద్రిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో చంద్రమౌళి(65) మృతిచెందారు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం బెళుగుప్పకు వచ్చి అంగడి సరకులు తీసుకుని వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తిప్పేస్వామి అనే వ్యక్తి కొట్టాల నుంచి బెళుగుప్పకు వస్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రమౌళిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

హంద్రీనీవా కాలువలో వ్యక్తి గల్లంతు!

ఆత్మకూరు, న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువలో వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని పంపనూరు తండా వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. పంపనూరుకు చెందిన ఎగ్గిడి మల్లన్న (70) మతి స్థిమితంతో ఇబ్బంది పడేవాడు. ఆదివారం గ్రామం సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద తిరుగుతున్నట్లు గ్రామస్థులు గుర్తించారు. ఎంతవెతికినా కనిపించకపోవడంతో కాలువలోకి పడి ఉంటాడని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది భావించి గాలింపు చర్యలు చేపట్టారు. హంద్రీనీవా కాలువలో నీటి వేగం పైకి కనిపించేదాని కంటే ఎక్కువ వేగం ఉందని ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. లైనింగ్ పనులు పూర్తి చేసిన నాటి నుంచి మూడు నెలల్లో నలుగురు కాలువలో పడి మృతి చెందారన్నారు. ఇప్పటికే కాలువలోకి దిగేందుకు ఏర్పాటు చేసిన ర్యాంప్‌లు, మెట్ల వద్ద ముళ్లకంపలు వేశామని అయినా ఏదో ఒక ప్రాంతంలో కాలువలోకి దిగుతున్నారని చెప్పారు. ఎంత ఈత వచ్చినప్పటికి కాలువ నీటి వేగాన్ని తట్టుకోలేరని ఎవరూ కాలువలోకి దిగరాదని కోరాడు.

తెదేపా వర్గీయులపై వైకాపా నాయకుల దాడి

బాధితులను పరామర్శిస్తున్న తెదేపా నాయకులు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రంపల్లికి చెందిన తెదేపా మద్దతుదార్లు గొల్ల శివానంద, గొల్ల వినోదమ్మ, గొల్ల సునందమ్మలపై వైకాపా నాయకులు పురుషోత్తంరెడ్డి, వారి మద్దతుదారులు కలిసి తోవ(రాస్తా) విషయమై ఆదివారం దాడులు చేసినట్లు తెలిసింది. కట్టెలు, ఇతర ఆయుధాలతో దాడులు చేసుకున్నారు. గ్రామంలో రాస్తా విషయమై కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. స్థానిక ఎస్సై ఈశ్వరయ్య మాట్లాడుతూ దాడి విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తెదేపా మండల కన్వీనర్ కాలవ సన్నన్న, మాజీ ఎంపీపీ గిరిమల్లప్ప, సర్పంచ్‌లు నాగరాజు, సదాశివ, నాయకులు బేలోడు సంజీవ, రాజు, లోకేష్, బంజోభ, శ్రీధర్ మూర్తి, చారుకి పాలయ్య, మూర్తి, నరసింహ యాదవ్‌లు బాధితులను పరామర్శించారు.

వాహనం ఢీకొని జీవాలు మృత్యువాత

బెళుగుప్ప, న్యూస్‌టుడే: గొర్రెలపై తుఫాన్ వాహనం దూసుకెళ్లిన ఘటనలో 40 గొర్రెలు మృతిచెందిన ఘటన మండలంలోని కాలువపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. ఆత్మకూరు మండలం యాలేరు గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డికి చెందిన జీవాలు మేత కోసం రోడ్డుపై వెళ్తున్నాయి. జీవాలు పెన్నానది వంతెనను దాటుతుండగా గుర్తించిన డ్రైవర్ తన బస్సును పక్కన నిలిపేశారు. ఇదే సమయంలో వేగంగా వచ్చిన తుఫాన్ వాహనం బస్సు ముందు భాగాన్ని పాక్షికంగా ఢీకొని గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుమారు 40 గొర్రెలు మృతిచెందగా 15 జీవాలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనివల్ల రైతుకు సుమారు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లింది. సీఐ మహానంది, ఎస్సైలు శివ, మహేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదే సమయంలో వైకాపా నాయకుడు అక్కడికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి.. దీనికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని నినాదాలు చేశారు. అక్కడే ఉన్న తెదేపా నాయకులు వారితో వాదనకు దిగటంతో సుమారు 3 కిలోమీటర్లు మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి వారిని అక్కడి నుంచి పంపించేశారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఖాళీ బిందెలతో నిరసన

కొలిమిపాళ్యంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

కుందుర్పి, న్యూస్‌టుడే: కొలిమిపాళ్యంలో వివిధ కాలనీలకు తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, వెంటనే సరఫరా చేయాలని కోరుతూ ఆదివారం పలువురు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. బోడిబావి నుంచి ఓవర్ హెడ్ ట్యాంకుకు వెళ్లే ప్రధాన పైపు నుంచి ఇష్టానుసారంగా ఇక్కడ అక్రమంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేసుకోవడంతో నీటి సమస్య పెరుగుతోందన్నారు. ఈ కుళాయిలను తొలగించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే లేరన్నారు.

విద్యాలయంలో పడకేసిన పారిశుద్ధ్యం

రాయదుర్గం: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో బుట్టల్లో నింపిన చెత్తాచెదారాన్ని నిత్యం తరలించకపోవడంతో కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాలలో స్వీపర్లు ఉన్నా.. రోజువారీగా బుట్టలను శుభ్రం చేయకపోవడంతో సమస్య తలెత్తుతోంది. వారంలో ఒకసారి మున్సిపల్ సిబ్బంది పాఠశాలలోని చెత్తను తీసుకెళ్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది వారానికి రెండుమార్లయినా చెత్తను తరలించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరకాలనీలో ఇళ్లమధ్య మురుగు చేరి అస్తవ్యస్తంగా మారింది. దోమలతో రోగాలు వస్తున్నాయి. శుభ్రత చర్యలు తీసుకోవాలి. - గోవిందు, వేంకటేశ్వరకాలనీ

సమాధానం: కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. - రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సమస్య: బీఎర్‌కాలనీలో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది. వెంటనే వాటిని ఏర్పాటు చేయాలి. - జగన్, బీఎర్‌కాలనీ, రాయదుర్గం

సమాధానం: త్వరలో వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - నరసింహులు, ఏఈ

సమస్య: నేతాజీ రోడ్డు నుంచి 9వ వార్డు వరకు ప్రధాన కాలువలో పూడిక పేరుకుపోయింది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. - నాగరాజు, నేతాజీ రోడ్డు

సమాధానం: త్వరలో పూడిక తొలగిస్తాం. - రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సమస్య: వాల్మీకినగర్‌లో రోడ్డు, మురుగు కాలువలు, నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. - రమేష్, వాల్మీకినగర్

సమాధానం: వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. - దివాకర్‌రెడ్డి, కమిషనర్

- న్యూస్‌టుడే, రాయదుర్గం

మొక్కుబడిగా పనులు!

కొతిమి వీధిలో సైడు కాలువ దుస్థితి

పూడిపోతున్న అంతర్గత కాలువలు

న్యూస్‌టుడే, రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని ప్రధాన కాలువలతోపాటు సైడు కాలువల్లో పూడిక పేరుకుపోతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. ఇప్పటికే దశాబ్దాల కిందట నిర్మించిన సైడ్ కాలువలు శిథిలావస్థకు చేరటంతో మురుగు ముందుకు కదలటం లేదు. ఉదయం వేళల్లో దారులు ఊడ్చి, ఇంటింటా చెత్త సేకరణ తరలింపు తదితర పారిశుద్ధ్య పనులు చేసి మధ్యాహ్నం వేళల్లో సమస్యాత్మక డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉంది. కొన్ని నెలలుగా ఇది కొసాగక కాలువల్లో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి పూడుకుపోతున్నాయి. చిన్న పాటి వర్షం పడినా నీరంతా రోడ్లపైనే పారుతోంది. కొత్తగా నిర్మించిన కాలువల్లో కూడా పూడిక సక్ర మంగా తొలగించకపోవడం గమనార్హం.

పూడిక తీసినా.. మారని తీరు

ఇటీవల పడిన చిన్నపాటి వర్షానికే ప్రధాన కాలువ పూడిపోయింది. పురపాలక సంఘం పరిధిలో రెగ్యులర్, ఒప్పంద కార్మికులు కలిపి 190 మంది ఉన్నారు. 50 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని పట్టణాన్ని శుభ్రం చేయటానికి కార్మికులు సరిపోవటం లేదు. నలుగురైదు గురు కార్మికులతో ఒకటోటి చేయిస్తున్న పను లతో ప్రయోజనం ఉండటం లేదు. గతంలో మాదిరిగా 10 నుంచి 20 మంది కార్మికులతో పనులు చేయిస్తే కాలువల్లోని పూడిక తొలగి పోయే అవకాశం ఉంటుంది. కొలిమివీధి, రాజీవ్‌గాంధీ కాలనీ, జేఆర్‌ఎస్ కాలనీ, శాంతినగర్ పార్కు సమీపం, వేంకటేశ్వరనగర్, 17వ వార్డు, నర్సాపురంరోడ్డు, కేటీ.ప్యాలెస్ ఏరియా, ఆర్టీసీ బస్టాండు వెనుకవైపున తదితర ప్రాంతాల్లో మురుగు అస్తవ్యస్తంగా మారింది.

తక్షణం తొలగింపునకు చర్యలు

వర్షంతో కాలువలు పూడిపోయాయి. త్వరలో మొదట ప్రధాన కాలువలో పూడికను తొలగిస్తాం. ఆ తర్వాత పలు వీధుల్లోని సైడు కాలువల్లో పూడికను తొలగిస్తాం.

- రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రాయదుర్గం

ఘనంగా కనకదాస జయంతి

బండమీదపల్లిలో ఊరేగింపు...

బ్రహ్మసముద్రంలో కళశాలతో ...

కుందుర్పి, గుండిగానిపల్లి(బ్రహ్మసముద్రం), కణేకల్లు, న్యూస్‌టుడే: బండమీదపల్లిలో కురుబుల ఆరాధ్య దైవం శ్రీభక్త కనకదాస జయంతిని ఆది వారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కనకదాస చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొరవయ్యలు చేసిన ప్రత్యేక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

• బ్రహ్మసముద్రం మండలంలోని గుండిగానిపల్లి సమీపంలోని వేదావతి హగరిలో నుంచి మహిళలు పూర్ణకుంభాలతో కనకదాస విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించారు.

• కణేకల్లు మండలంలోని హనకనహాళ్‌లో కురుబ సంఘం ఆధ్వర్యంలో కనకదాస జయంతి నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే మల్లికార్జున కనకదాస విగ్రహానికి పూలమాల వేశారు. మహిళలు కలశాలతో గ్రామ వీధులలో చిత్రపటం ఊరేగింపు నిర్వహించారు.

'ఉపాధ్యాయులతో సాధ్యం'

అనంతపురం విద్య: శక్తిమంతమైన సమాజ నిర్మాణం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని జేవీవీ రాష్ట్ర గౌరవ సలహాదారుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. జేవీవీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కేఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల్లో విజయమే ధ్యేయం: కాలవ

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాలవ శ్రీనివాసులు, నాయకులు

కణేకల్లు, న్యూస్‌టుడే: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా సాను భూతిపరులు అఖండ విజయం సాధించేలా తెదేపా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ప్రభుత్వ విప్, కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని హనకనహాళ్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే రూ.15 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు భూమి పూజ చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. తెదేపా మండల కన్వీనర్ వన్నారెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు నాగార్జున, తెదేపా నాయకులు ఎస్‌కే మల్లికార్జున, లాలెప్ప, సుజాతా ఆనందరాజు , నరేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ హోమియో వైద్యశాల

తెరుచుకోని వైద్యశాల తలుపులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రజలకు కొన్ని ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న హోమియోపతి వైద్యశాల మూతపడింది. కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో 1969 సంవత్సరంలో దీనిని ఏర్పాటు చేయగా 1979 సంవత్సరంలో హోమియో వైద్యశాలగా గుర్తింపు వచ్చింది. నాటి నుంచి కొన్ని వేలమందికి హోమియో పరంగా వైద్యసేవలు అందాయి. గతేడాది జనవరిలో కొత్తగా వైద్యులను నియమించగా ఇక్కడ వసతులు సరిగా లేవని వారు అనంతపురం సమీపంలో కురుగుంట గ్రామానికి వెళ్లారు. ఇక్కడి వైద్యశాలను తరలించి అనంతపురంలోని కురుగుంట గ్రామంలో ఏర్పాటు చేశారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇదే విషయమై గ్రామస్తులు హోమియో వైద్యుడిని నియమించాలని, వైద్యశాలను యధావిధిగా నడిపించాలని ఈ ఏడాది నవంబరులో కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీ సమర్పించారు. నేటికి వైద్యశాల తలుపులు తెరుచుకోలేదు. ఈ విషయమై కడపలోని ఆయుష్ శాఖ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్‌రాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వైద్యశాలను కురుగుంటకు మార్చిన విషయం వాస్తవమే, అయితే గ్రామస్థుల అభ్యర్థన మేరకు స్థానికంగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కౌన్సిల్ సభ్యులకు నోటీసుల జారీ

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికకు సంబంధించి కౌన్సిలర్లకు స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఆర్డీవో వసంతబాబు ఆదివారం ఆహ్వాన పత్రాలు పంపారు. పుర వైస్‌చైర్మన్ ఎన్నికలకు సంబంధించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆనంద్ స్థానిక ఆర్డీవోను ప్రిసైడింగ్ అధికారిగా నియమించారు. ఈనెల 11వ తేదీ 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరగనున్న ఎన్నికల ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరు కావాలని ఆహ్వానాలు పంపారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

కోనాపురం గొల్లలదొడ్డి నుంచి గుమ్మఘట్టకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయమై రాళ్లు తేలింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధించిన అధికారులు సమస్యను పరిష్కరించాలి. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని, వర్షం వస్తే పూర్తిస్థాయిలో నీరు నిలబడి రాకపోకలకు తీవ్ర ఆటంకంగా ఉంటోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు. - **న్యూస్‌టుడే, గుమ్మఘట్ట**

పొలాల్లో ఒరిగిన స్తంభాలు

విడపనకల్లు మండలం పెంచులపాడు సమీపంలోని పొలాల్లో పదుల సంఖ్యలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఒకవైపునకు ఒరిగిపోయాయి. పనులు చేసేటప్పుడు ఇవి మీద పడతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ పంట పొలాలకు వెళ్లాలంటేనే భయంగా ఉందని పలువురు కూలీలు సైతం రావడం లేదు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన స్తంభాలను సరిచేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

- **న్యూస్‌టుడే, విడపనకల్లు**

గుట్టపైకి.. పోయేదెట్లా?

విడపనకల్లు మండలం గడేకల్లులో ఎత్తైన ప్రదేశంలో గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం, ఆర్‌ఎస్కేలను నిర్మించారు. తదుపరి వాటి ఎదుట ఉన్న ప్రదేశాన్ని తవ్వేయడంతో ఆ కేంద్రాలకు వెళ్లడానికి దారి లేదు. ప్రస్తుతం అక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లడానికి రోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, మహిళలు, పిల్లల విషయం చెప్పాల్సిన అవసరం లేదు. అధికారులు గుర్తించి భవనాల ఎదుట ప్రహరీని నిర్మించడంతోపాటు పక్కా దారిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

- **న్యూస్‌టుడే, ఉరవకొండ**

ఇది దారే... నమ్మండి

ఈ చిత్రాన్ని చూడగానే మురుగు కాలువ అనిపిస్తుంది కదూ! ఇది ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలోని ప్రధాన వీధి. అడుగు తీసి అడుగేయలేని విధంగా మురుగుగా మారింది. పంచాయతీ అధికారులు శుభ్రత చర్యలు చేపట్టకపోవడంతో ఇంత దారుణంగా మారింది. వాహనాలు వెళ్లినపుడు వచ్చే దుర్వాసనతో స్థానికులు పడే వేదన వర్ణనాతీతం. అయినా పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎంపీడీవో రవిప్రసాద్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వెంటనే శుభ్రత చర్యలు చేపడతామని పేర్కొన్నారు. - **న్యూస్‌టుడే, ఉరవకొండ**

ఆటో.. ఇటో అయితే..!

ఉరవకొండ నుంచి చాబాలా దిశగా వెళ్తున్న ఆటోలో ప్రయాణికులు నిండుగా ప్రయాణించారు. కొందరు టాపుపై కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణిస్తూ కనిపించారు. ఈ ప్రాంతంలో ఇటీవల ఆటో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయినా ఆటోచోదకులు, ప్రయాణికుల్లో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా ప్రజలు జాగ్రత్తగా ప్రయాణించాల్సిన అవసరం ఉంది. - **న్యూస్‌టుడే, ఉరవకొండ**

అపూర్వ సమ్మేళనం

అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం ములకలేడు ఉన్నత పాఠశాలలో 2009- 2010 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పటి జ్ఞాపకాలు, గురువులను గుర్తుచేసుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

వేపులపర్తి- పడమటి కోడిపల్లికి దారిని చదును చేయిస్తూ..

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని వేపులపర్తి నుంచి పడమటి కోడిపల్లి వెళ్లే మట్టిరోడ్డు గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో పడమటి కోడిపల్లి తెదేపా నాయకులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం టిప్పర్లు, పొక్లెయిన్ యంత్రాల ద్వారా మట్టి తరలించి మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏమారితే... ప్రమాదమే!

వజ్రకరూరు మండలం గుంతకల్- ఉరవకొండ ప్రధాన దారి నుంచి రాగులపాడు వెళ్లే ప్రాంతంలోని గురుకుల పాఠశాల హాస్టల్ వద్ద కల్వర్టు మీద రక్షణ గోడ లేదు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు తప్పవు. రాత్రి సమయంలో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుచున్నారు. - **న్యూస్‌టుడే, వజ్రకరూరు**

బిందు పరికరాలు ధ్వంసం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: బోరంపల్లికి చెందిన విశ్రాంత వ్యవసాయాధికారి వీరయ్య చౌదరికి చెందిన తోటలో ఏర్పాటు చేసిన రూ.10 వేల బిందు పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం ధ్వంసం చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేఉకుని ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

కాలమానిని ఆవిష్కరణ

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: సీ అండ్ ఐజీఎం మిషన్ చర్చికి సంబంధించిన కాలమానిని దొడగట్ట రోడ్డులోని చర్చిలో డికెన్ బోర్డు సభ్యులు ఆవిష్కరించారు. న్యాయవాది పరిపూర్ణమ్మ, కుమారుడు బంగి వినయ్ సొంత నిధులతో కాలమానిని తయారు చేయించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కణేకల్లు, న్యూస్‌టుడే: సొల్లాపురంలో అనారోగ్యంతో బాధపడి కోలుకుంటున్న తెదేపా సీనియర్ నాయకుడు శేషప్పను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదివారం పరామర్శించారు. మండల కన్వీనర్ వన్నారెడ్డి, నాయకులు లాలెప్ప, ఆనందరాజు, చాంద్, రమేష్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మసముద్రం: నంజాపురానికి చెందిన తెదేపా కార్యకర్త తిమ్మారెడ్డి(35) గుండెపోటుతో మృతిచెందగా.. ఆ పార్టీ కన్వీనర్ శ్రీరాములు, టెలికాం అడ్వైజర్ కమిటీ సభ్యుడు అమరా రామ్మోహన్ చౌదరి నివాళి అర్పించారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

ఘనంగా ఇమాంషావలి ఉరుసు

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని మాల్యంలో ఆదివారం ఇమాంషావలి ఉరుసు వైభవంగా సాగింది. ఈ సందర్భంగా దర్గాను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. భక్తులు చక్కెర చదివింపులు, తులాభారం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైకాపా జిల్లా విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శిగా నవీన్

శెట్టూరు, న్యూస్‌టుడే: జిల్లా వైకాపా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా శెట్టూరు మండలం ముచ్చర్లపల్లికి చెందిన నవీన్ ఎన్నికైనట్లు వైకాపా కన్వీనర్ రాయుడు ఆదివారం తెలిపారు. ఈ విభాగం నుంచి పార్టీ పటిష్టతకు తనవంతుగా కృషిచేయనున్నట్లు ఆయన తెలిపారు.

'వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు తరలిరావాలి'

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: అనంతపురంలో 12న ఏర్పాటు చేయనున్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని భాజపా నాయకులు కోరారు. ఆదివారం శ్రీశివలింగారూఢ మఠంలో నిర్వహించిన సమావేశంలో బాజపా మండల అధ్యక్షులు ఆంజనేయ ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బాజపా జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, డి.హీరేహాళ్ మండల ఇన్‌ఛార్జి తిమ్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు హరిత, నాని, చన్నమల్లేశ్వర, కిసాన్ మోర్చా సభ్యులు గోపాలకృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్, బాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలవ గట్టు రంధ్రం పూడ్చివేత

కణేకల్లు, న్యూస్‌టుడే: కళేకుర్తి వెళ్లే దారిలో హెచ్చెల్సీ వేదవతి హగరి వంతెన మలుపు వద్ద గట్టుకు పడిన రంధ్రాన్ని అధికారులు ఆదివారం యుద్ధప్రాతిపదికన పూడ్చివేశారు. స్థానికుల సమాచారంతో డీఈ దివాకరరెడ్డి, జేఈ నరేంద్రమారుతి వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రమేష్ సహకారంతో ట్రాక్టర్లతో మట్టిని తరలించి రంధ్రం పూడ్చివేయించారు.

రాయితీ విత్తనకాయల పంపిణీ

ఉరవకొండ, న్యూస్‌టుడే: రబీలో సాగు చేయడానికి రాయితీ వేరుసెనగ విత్తనకాయలు లత్తవరంలోని రైతు సేవా కేంద్రంలో పంపిణీకి అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకెళ్లవచ్చని ఆర్ఎస్కే అధికారి యోగానంద పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు బోదపాటి గోవిందప్ప, వంకలపాటి మోహన్, నాగరాజు, రామకోటి, అంజినప్ప, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలు ఆదివారం సజావుగా సాగాయి. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలల్లో ఈ పరీక్షలు కొనసాగాయి. ఈ పరీక్షలకు మొత్తం 600 విద్యార్థులకు 580 మంది హాజరయ్యారు.

శిక్షణతో అనేక ఉపయోగాలు

కమలానగర్: పోటీ పరీక్షలకు నిర్వహించే ఉచిత శిక్షణలతో అభ్యర్థులకు ప్రయోజనాలు ఉన్నాయని, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి, రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బీసీ స్టడీ సర్కిల్ భవనంలో సివిల్స్ ఉచిత శిక్షణ పరీక్షను నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి అభ్యర్థులు స్క్రీనింగ్ పరీక్షలో పాల్గొన్నారు.

కరిబసవ రాజేంద్రస్వామితో స్థానిక ఆర్ఎస్ఎస్ నేతలు

విడపనకల్లులో వేడుకగా సమ్మేళనం

విడపనకల్లు, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ శతజయంతి విజయోత్సవాల సందర్భంగా దేశంలోని పలు ప్రాంతాల్లో హిందూ సమ్మేళనాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విడపనకల్లులోని శ్రీసుంకలమ్మ ఆలయంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గవిమఠం శ్రీకరిబసవ రాజేంద్రస్వామి, విడపనకల్లు సంచాలన సమితి అధ్యక్షుడు నూతేటి రామకృష్ణ హాజయ్యారు. విడపనకల్లు, పెద్ద కొట్టాలపల్లి, మాళాపురం, జనార్దనపల్లి, వేల్పుమడుగు, వి.కొత్తకోట గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హిందూబంధువులు తరలివచ్చారు. మహిళా వక్త చింబిలి రాజ్యలక్ష్మి, ప్రధాన వక్త నీలకంఠ, ఖండకార్యవాహ వినోద్, విభాగ్ కార్యకారిణి రంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపతి స్వామికి పుష్పాలంకరణ

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్‌లోని రమా సత్యనారయణ స్వామి ఆలయంలో ఆదివారం వినాయకుడికి సంకష్ట గణపతి పూజను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సబ్యులు పాల్గొన్నారు. .

శివలింగానికి ప్రత్యేక పూజలు

కంబదూరు, న్యూస్‌టుడే: మార్గశిర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివలింగానికి ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దేదీప్యమానంగా తీర్చిదిద్దిన శివలింగాన్ని అధిక భక్తులు దర్శనం చేసుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

అయ్యప్పస్వామికి అర్ధ మండలం పూర్తి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అర్ధ మండలం పూర్తికావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాల ధరించిన భక్తులు, పుర ప్రజలు ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

దుర్గంలో విశేష అంకరణలో స్వామివారు..

సూర్యదేవాలయంలో టీఎస్ భాజపా ఉపాధ్యక్షురాలి పూజలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం బూదగవిలోని సూర్య దేవాలయాన్ని తెలంగాణ భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమెకు ఆలయ కమిటీ ప్రతినిధులు మహేంద్రగౌడ్, సుధాకర్, బండారు నగేశ్, అర్చకులు స్వామి వారి ప్రసాదాలను అందించి సత్కరించారు.

మాధవిని సత్కరిస్తున్న ప్రతినిధులు

తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

రాయదుర్గం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల ప్రజల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన శ్రీరాంరెడ్డి తాగునీటి పథకం నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో 114 గ్రామాలకు ఎస్ఆర్‌పీ ద్వారా తాగునీరు అందాల్సి ఉన్నా.. కనీసం 10 గ్రామాలకు తాగునీరు సరఫరా కావడం లేదు. మండలంలోని కొంతానపల్లి, కెంచానపల్లి, కాశీపురం గ్రామాలకు ఆరు నెలలుగా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాలకు తాగునీరు సక్రమంగా సరఫరా చేసి దాహం తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. పలు గ్రామాల్లో బిందె రూ.10 నుంచి రూ. 15లు చెల్లించి కొనుగోలు చేసి తాగుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్ఆర్‌పీ సూపర్‌వైజర్ చక్రిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసుకున్న పైపులు పగిలిపోవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఎస్ఆర్‌పీ పైపులు పగిలిపోయిన ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేసి నీరందిస్తామని పేర్కొన్నారు.– న్యూస్‌టుడే, రాయదుర్గం గ్రామీణం

కొంతానపల్లిలో నిరుపయోగంగా మారిన శ్రీరాంరెడ్డి తాగునీటి పథకం కుళాయిలు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం, ఉరవకొండ గ్రామంలో నివాసం ఉండు **కొత్తపల్లి హరినాథ్ గారి కుమారులు (1) కొత్తపల్లి భాస్కర్, (2) కొత్తపల్లి జగన్నాథ్** అనువారి తరపున తెలియజేయు బహిరంగ ప్రకటన ఏమనగా

మా కక్షిదారుల తండ్రి అయిన **కొత్తపల్లి హరినాథ్, తండ్రి: కొత్తపల్లి కొండప్ప** మరియు ఇతని మొదటి కుమారుడు **కొత్తపల్లి చంద్రశేఖర్,** ఉరవకొండ గ్రామ వాస్తవ్యులు ఇప్పటికి సుమారు ఆరు నెలల క్రితం లోకుల వద్ద చేసిన అప్పుల బాధతో ఉరవకొండ గ్రామం వదలి ఎక్కడికో వెళ్ళిపోయినారు. ప్రస్తుతము వారు ఎక్కడ ఉన్నది, వారి చిరునామా గాని, సెల్ నంబర్లుకాని మా కక్షిదారులకు తెలియవు. **కొత్తపల్లి హరినాథ్, కొత్తపల్లి చంద్రశేఖర్** యొక్క ఋణబాధితులు మా కక్షిదారుల వద్దకు వచ్చి దుర్భాషలు మాట్లాడుచూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడ మా కక్షిదారులను బెదిరించుచున్నారని పై తెలిపిన కొత్తపల్లి హరినాథ్, కొత్తపల్లి చంద్రశేఖర్‌లతో మా కక్షిదారులకు ఎటువంటి సంబంధము లేదు. కావున ఋణబాధితులు ఎవ్వరు కాని మా కక్షిదారులను దుర్భాషలాడిన, స్టేషన్‌కు పిలిపించి నిర్బంధించిన మా కక్షిదారులు తీసుకొనబోవు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలముగా తెలియజేయడమయినది.

ఎ.రామమోహన్, M.A., B.L., అడ్వకేట్, ఉరవకొండ.
సెల్ నంబర్: 8106371019

(c) eenadu

వీధుల్లో సాగుతున్న అయ్యప్ప ఉత్సవం

నేత్రపర్వంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఆదివారం కనుల పండువగా సాగింది. పాత గుంతకల్లులో శివాలయం నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. దీక్ష చేపట్టిన అయ్యప్ప మాలధారులు స్వామివారి పాటలు పాడుతూ ఉత్సవాన్ని ముందుకు సాగించారు.

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

లైఫ్ సర్టిఫికెట్లు నిర్ణీత గడువులో ఇవ్వాలి

గుత్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా ఉపఖజానా అధికారులకు అప్పగించాలని ఖజానాశాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు రమణయ్య పేర్కొన్నారు. 2026 జనవరి నుంచి ఫిబ్రవరి 28లోగా ధ్రువపత్రాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆదివారం ఆయన గుత్తిలోని తాలూకా పెన్షనర్ల భవనంలో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఎస్టీవోలు, మీసేవా కేంద్రాలు, పెన్షనర్ల భవనంలో ఇవ్వాలని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్లను ఇవ్వడంలో జాప్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్టీవో సురేశ్‌బాబు, పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు అబూబకర్, నారాయణరెడ్డి, కుల్లాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లు ప్రశాంతి నగర్‌లో శివాలయం దగ్గర వారం రోజులుగా వీధి దీపం వెలగటం లేదు. **- లక్ష్మి**

సమాధానం: సిబ్బందిని పంపించి వీధి దీపం వెలగడానికి చర్యలు తీసుకుంటాం.
- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం.

సమస్య: ప్రశాంతి నగర్‌లో శివాలయం వెనుక కాలువలో మురుగు పేరుకుపోయింది. **- స్థానికురాలు**

సమాధానం: కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. -వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు పురపాలక సంఘం.
- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య: నార్పల మేజర్ పంచాయతీలో మసీదు ముందు ప్రధాన రహదారిలో మురుగు ఏరులై పారుతోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **- బాషా స్థానికుడు**

సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపి రహదారిపై మురుగు లేకుండా చర్యలు తీసుకుంటాం. -శ్యామల, గ్రామ కార్యదర్శి
- న్యూస్‌టుడే, నార్పల

రైల్వే ప్రయాణికులకు టికెట్ల తిప్పలు

● గమ్యస్థానాలకు చేరుకోలేక అగచాట్లు
● స్టేషన్‌లో వేధిస్తున్న ఏటీవీఎంల కొరత

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు జంక్షన్‌లో ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం)లు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సాధారణ టికెట్లను కొనేందుకు కౌంటర్ల వద్ద వరుసలో ఎక్కువ సేపు నిలబడకుండా త్వరగా టికెట్లను పొందడానికి ఉద్దేశించిన ఏటీవీఎంలను ఏర్పాటు చేశారు. వీటి సంఖ్య తక్కువగా ఉండటంతో వేళకు టికెట్లను తీసుకోలేకపోతున్నారు. ఫలితంగా వారు వెళ్లాల్సిన గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేక నానాపాట్లు పడుతున్నారు.

✦ వ్యాపారానికి రైళ్లలో ప్రయాణించే వారు ప్లాట్‌ఫారాల్లో రైలు ఆగిన సమయంలో టికెట్లను ఏటీవీఎంల నుంచి పొందడానికి అధికారులు కమిషన్ ప్రాతిపదికన పనిచేయడానికి ఇద్దర్ని నియమించారు. స్టేషన్‌లో రెండు మిషన్లు మాత్రమే ఉండటంతో ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు సేవలు అందడం లేదన్న విమర్శలున్నాయి.

ఏటీవీఎం వద్ద ప్రయాణికుల రద్దీ

గంటల తరబడి నిరీక్షణ: రైళ్లలో వెళ్లడానికి కొన్నిసార్లు వందల మంది ప్రయాణికులు ఒకేసారి స్టేషన్‌కు వస్తుంటారు. ఈక్రమంలో ఇక్కడి సేవల్లోని లోపాలతో పిల్లాపాపలతో వచ్చిన వారంతా గంటల తరబడి స్టేషన్లో ఉండలేక ఇబ్బంది పడుతున్నారు. టికెట్ల జారీకి రెండు మిషన్లు మాత్రమే ఉండడంతో అనుకున్న సమయానికి రైలు ఎక్కలేకపోతున్నారు. తరువాత వచ్చే రైలు కోసం వేచి ఉండాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో టికెట్‌కు సరిపడ చిల్లర లేకపోవడమూ సమస్యగా మారుతోంది. దీంతో రైలు ప్రయాణమంటేనే జనం విసిగిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

కౌంటర్ల వద్ద వాగ్వాదాలు

కొన్నిసార్లు ప్రయాణికులు, సిబ్బంది మధ్య టికెట్‌కు సరిపడ చిల్లర లేక వాగ్వాదాలూ జరుగుతున్నాయి. ఈ కారణంగా కూడా సకాలంలో టికెట్‌లను కొనలేక పలువురు ప్రయాణికులు రైళ్లు తప్పిపోయి ఇబ్బంది పడుతున్నారు. రోజూ జంక్షన్ గుండా 15 వేల మందికి పైనే వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు.

ఈసేవ్యవస్థలో ఇప్పుడున్న వాటికి తోడు మరో మూడు టికెట్ వెండింగ్ మిషన్లను సమకూర్చి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. మరి కొన్ని మిషన్లను ఏర్పాటు చేయమని అని సంబంధిత అధికారులను అడగితే ప్రయాణికులు వారి చరవాణుల ద్వారా జనరల్ టికెట్లను పొందడానికి కొత్తగా క్యూఆర్ కోడ్ వ్యవస్థను అమలు చేస్తున్నామని, దీన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కరాటేలో సత్తా చాటారు!

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ షితో కాయ్ కరాటే సంఘం ఆధ్వర్యంలో కర్నూలులోని టీజీవీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన దక్షిణభారత దేశ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో గుంతకల్లుకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. పట్టణానికి చెందిన కరాటే అకాడమీ నిర్వాహకుడు దినేశ్ దగ్గర శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు అర్పిత, హస్విత్‌రెడ్డి, నవనీత్, కునాల్‌లు బంగారు పతకాలను సాధించినట్లు దినేశ్ పేర్కొన్నారు. గంగాధీర్ రెండో స్థానం, షణ్ముఖ, అభయ్, హేమతేజ, సిద్ధార్థ్, లక్ష్మి, ప్రభాస్, శివ, రుత్విక్‌లు మూడో స్థానాల్లో నిలిచారని వెల్లడించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విజేతలు

ఆటో కార్మికుల మండల కమిటీ ఏర్పాటు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆటో కార్మికుల నూతన మండల అడహక్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆదివారం ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కమిటీలో తొమ్మిది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నాగరాజు, కో-కన్వీనర్లుగా రమణారెడ్డి, నారాయణస్వామి మిగిలిన ఆరుగురిని సభ్యులుగా ఎంపిక చేశారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్మికులందరూ క్రమశిక్షణగా ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఆటోలు నడపాలని వారు సూచించారు.

ఇసుక రవాణాపై ఆకస్మిక దాడులు

శింగనమల (బుక్కరాయసముద్రం): శింగనమల మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో సీఐ కౌలుట్లయ్య, గనులశాఖ అధికారులతో కలిసి ఉమ్మడిగా పెన్నానది పరివాహక ప్రాంతాల్లో మెరుపు దాడులు చేశారు. టిప్పర్లు, ట్రాక్టర్లు, పొక్లెయిన్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. మండల పరిధిలో ఎక్కడైనా సరే అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

పొక్లెయిన్ స్వాధీనం చేసుకున్న శింగనమల పోలీసులు

కమ్మసేవా సంఘాన్ని బలోపేతం చేద్దాం

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లుకు చెందిన కమ్మ సేవా సంఘాన్ని భవిష్యత్తులో మరింత బలోపేతం చేసి సేవా కార్యక్రమాలను చేపడతామని సంఘం నాయకులు నిర్ణయించారు. ఆదివారం పట్టణంలోని హనుమేశ్‌నగర్‌లో ఉన్న పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో సంఘం సమావేశం జరిగింది. ప్రస్తుతం ఉన్న కల్యాణమండపం భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని తీర్మానించారు. పట్టణ ప్రజలు వివాహాలు, సభలు, సమావేశాలు జరపడం కోసం ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని నిశ్చయించారు. అనంతరం నూతన ఏడాది క్యాలెండర్లను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామమూర్తి, ఉపాధ్యక్షుడు బి. రమేశ్, కార్యదర్శి దామోదర్, సంయుక్త కార్యదర్శి అనిల్, కోశాధికారి టి. వెంకటరమణ, సంఘం నాయకులు కేసీ హరికుమార్, డాక్టర్ వెంకటేశులు పాల్గొన్నారు.

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమ్మ సేవా సంఘం నాయకులు

వైభవంగా గంగమ్మ జాతర

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని బెస్తవీధిలో గంగమ్మ తల్లి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మత్స్యకారుల సేవా సంఘం ఆహ్వానం మేరకు జాతర మహోత్సవానికి పామిడి, గుత్తి మండలాల బాధ్యుడు గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. మంగళవాయిద్యాల నడుమ మత్స్యకారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన గంగమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న జి. కొట్టాల గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు తిప్పారెడ్డిని ఆదివారం గుమ్మనూరు ఈశ్వర్ పరామర్శించారు.

● జి. కొట్టాల గ్రామ పర్యటనలో గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పెన్షన్ లేదని ఆయనకు విన్నవించింది. ఆమెకు పెన్షన్ వచ్చే వరకు తానే స్వయంగా ప్రతి నెలా రూ. 2వేలు ఇస్తానని తెలిపారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న గుమ్మనూరు ఈశ్వర్

విద్యార్థినికి ఆర్థికసాయం

తాడిపత్రి, న్యూస్‌టుడే: నర్సింగ్ చదువుతున్న పేద విద్యార్థినికి తాడిపత్రి పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ గౌతమి అనే విద్యార్థిని నర్సింగ్ చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతోందని తెలిసి సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేలు అందజేసినట్లు తెలిపారు. దాత మదన్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూదస్థావరాల్లో పోలీసుల సోదాలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సమీపంలోని పొలాల్లో ఆదివారం జూదస్థావరాలపై పోలీసులు దాడులు చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. జూదం ఆడుతున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించగా ఎనిమిది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 11,900 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

● **రౌడీషీటర్లకు కౌన్సెలింగ్:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆదివారం ఎస్సై ఆంజనేయులు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుస్టేషన్‌లో పలువురు రౌడీషీటర్లు రాగా రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ఉండాలని ఆయన సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై ఆంజనేయులు

కుల్లాయిస్వామిని కలిసిన పూర్వ విద్యార్థులు

స్నేహితుడికి ఆర్థిక సాయం

నార్పల, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న తమ స్నేహితుడికి నార్పల పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. నార్పల ప్రభుత్వ పాఠశాలలో 1991-92 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న కుల్లాయిస్వామి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పూర్వవిద్యార్థులు మిత్రుడిని కలిసి రూ. 35 వేలు సాయం అందించారు. భవిష్యత్తులో మిత్రుడి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

యాదవులకు సముచిత స్థానం కల్పించండి

గుత్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు అన్నిపార్టీలు సముచిత స్థానం ఇవ్వాలని వక్తలు కోరారు. యాదవులకు టికెట్లు ఇవ్వకపోతే స్వతంత్రులుగా పోటీలో ఉంటామన్నారు. ఆదివారం గుత్తిశివారులోని శ్రీకృష్ణమందిరం వద్ద యాదవులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం రాష్ట్ర నాయకులు నారాయణస్వామి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఎంపీటీసీలు, పురపాలిక, పంచాయతీ ఎన్నికల్లో యాదవులను పార్టీలు విస్మరించరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాసులు, శంకర్‌మహదేవ్, రాజశేఖర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం సరిగా లేకనే విద్యార్థి మృతి

కొండాపురం, న్యూస్‌టుడే: గండికోట వెనుక జలాల్లో మృతి చెందిన అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన పదోతరగతి విద్యార్థి శిరణ్‌కుమార్ (16)కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రతాప్‌రెడ్డి ఆదివారం తెలిపారు. శనివారం వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండల పరిధిలోని గండికోట వెనుక జలాల్లో శిరణ్‌కుమార్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తల్లిదండ్రులను విచారించారు. రెండు నెలలుగా మతిస్థిమితం సరిగా లేక పోవడంతో బెంగుళూరులోని ఓ ఆసుపత్రిలో పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

అప్పుల బాధతో బలవన్మరణం

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: అప్పులబాధ తాళలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యాడికి మండలం నగరూరు గ్రామానికి చెందిన జయరాముడు, ఆనందకుమారి దంపతుల కుమారుడు శరత్‌కుమార్(25) బెంగళూరులో దుకాణం నిర్వహించేవాడని తెలిపారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో బెంగళూరులో ఉండలేక అతడి మిత్రుడిని కలిసేందుకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు వచ్చాడు. శనివారం రాత్రి మిత్రుడు పని నిమిత్తం బయటికి వెళ్లగా వెంట తెచ్చుకున్న విషగుళికలు మింగేశాడు. చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

శతాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయండి

యాడికి, న్యూస్‌టుడే : సీపీఐ ఆధ్వర్యంలో జరిగే శతాబ్ది ఉత్సవాలకు అందరు హాజరై విజయవంతం చేయాలని మండల కార్యదర్శి జూటూరు రఫీ కోరారు. 11న అనంతపురంలోని లలిత కళా పరిషత్‌లో శతాబ్ది ఉత్సవాలకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. కమ్యూనిస్టు యోధుల కుటుంబాలకు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనేక ఉద్యమాలు, పోరాటాలు చేస్తూ పేద పక్షాన నిలబడిన ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు.

ఎమ్మెల్యేగా గెలిచి.. ఆలయ సమస్య పరిష్కరిస్తా: శైలజానాథ్

శింగనమల (బుక్కరాయసముద్రం): వచ్చే ఎన్నికల్లో వైకాపా తరపున శింగనమల ఎమ్మెల్యేగా విజయం సాధిస్తా.. దుర్గాంజనేయస్వామి ఆలయ సమస్యను పరిష్కరిస్తానని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ అన్నారు. ఆదివారం ఆయన దుర్గాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి... ఇక్కడ నెలకొన్న వివాదంపై పూజారి రమణతో మాట్లాడారు. భక్తులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆలయ వివాదంపై రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు.

మినీ ట్యాంకులు.. దిష్టిబొమ్మలు

గుంతకల్లులోని జగనన్న కాలనీ పదో లేఅవుట్ దగ్గర మినీ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. 10, 9, 8, 7 లేవుట్లలో చాలా మంది ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉన్నారు. ట్యాంకులకు చెందిన మోటారు బోర్లు పని చేయకపోవడంతో ట్యాంకులు వృథాగా ఉన్నాయి. ఫలితంగా రూ. లక్షలు ఖర్చుచేసిన ప్రజలకు ఏమాత్రం ఉపయోగం కలగలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ప్రత్యేక పంచాయతీగా గుర్తించండి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని తెలికి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని వార్డుసభ్యులు ఆదివారం తీర్మాణించారు. తెలికి గ్రామం ప్రస్తుతం మేడిమాకులపల్లి పంచాయతీలో విలీనం కాగా తమ పంచాయతీని ప్రత్యేక పంచాయతీగా ఉండేలా చూడాలని అధికారులను సభ్యులు కోరారు. గ్రామంలో సుమారు 200 గృహాలకు పైగా ఉన్నాయని ఇది వరకు మూడుదఫాలుగా సర్పంచు, ఎంపీటీసీ సభ్యులూ ఇదే గ్రామం నుంచి ప్రాతినిధ్యం వహించారని వివరించారు. ప్రత్యేక పంచాయతీ తీర్మాణం చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు రామన్న తెలిపారు.

ఏకగ్రీవ తీర్మాణం చేస్తున్న వార్డుసభ్యులు

విశ్రాంత ఆచార్యుడు దయానందకు పీఎం ప్రొఫెసర్‌షిప్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని విశ్రాంత ఆచార్యుడు దయానంద ప్రధానమంత్రి ప్రొఫెసర్‌షిప్‌కు ఎంపికయ్యారు. జాతీయ పరిశోధన సంస్థ ఈ మేరకు ఆయనను ఎంపిక చేసింది. యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఏఎన్ఆర్ఎఫ్ పథకం కింద యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులను ప్రోత్సహించడం, పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి ఆయన కృషి చేయాల్సి ఉంటుంది. నెలకు రూ. 2.50 లక్షలు ఫెలోషిప్, సంవత్సరానికి రూ.24 లక్షలు పరిశోధన గ్రాంటు, రూ.లక్ష భత్యం ఆయనకు అందిస్తారు. ఎస్కేయూ బయోకెమిస్ట్రీలో ఆచార్యులుగా పనిచేశారు. అనంతరం హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. తరువాత ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా విధులు నిర్వహించారు.

హిందూ సమ్మేళన కమిటీ ఏకగ్రీవం

గార్లదిన్నె గ్రామీణం: ఈనెల 14న జరిగే హిందూ సమ్మేళన కార్యక్రమానికి ఆదివారం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.రాము, ఉపాధ్యక్షులు రామచంద్రాచారి, సురేష్‌బాబు, ప్రసాద్, పీవీ ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి పవన్‌కుమార్, సహ కార్యదర్శులు సురేష్‌బాబు, నరేష్ కుమార్, మణికంఠ, కృష్ణలు ఎంపికయ్యారు. వచ్చే ఆదివారం గార్లదిన్నె బాలాజీ పాఠశాలలో కార్యక్రమం ఉంటుందన్నారు.

‘వంటగ్యాస్ రాయితీపై అపోహలొద్దు’

గుంతకల్లు, న్యూస్‌టుడే : వంట గ్యాస్ సిలిండర్లకు చెందిన రాయితీ సొమ్ము లబ్ధిదారులకు అందడం లేదని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ఇలాంటి అనుమానాలను నివృత్తి చేయాలని తెదేపా నాయకులు ఆర్డీవో, తహసీల్దారును కోరారు. ఆదివారం తహసీల్దార్ ఆధ్వర్యంలో అధికారులు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో భాగ్యనగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ప్రత్యేక కార్యాక్రమాన్ని నిర్వహించారు. కొందరికి మూడు, నాలుగు బ్యాంకు ఖాతాలు ఉండడం, రేషన్‌కార్డుకు అనుసంధానం తదితర వివరాలతో లబ్ధిదారులు శోధించక పోవడంతో డబ్బు జమా అయిన విషయం తెలుసుకోలేకపోయారని వివరించారు. పట్టణంలోని పలు కాలనీల్లోనూ ఇలాంటి సదస్సులు నిర్వహించాలని తెదేపా నాయకులు నిర్ణయించారు. తెదేపా నాయకుడు రామాంజనేయులు, కౌన్సిలర్ మెహ్రూన్, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహసీల్దారు రమాదేవి

మురుగు కష్టాలు తప్పేదెన్నడు?

తాడిపత్రి పరిసరాల్లోని ఆర్డీటీ కాలనీలో సీసీ రోడ్లపైకి మురుగు చేరుతోంది. సరైన కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగంతా రహదారులపైకి వస్తోంది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా నెలల తరబడి మురుగు ఉండటంతో దుర్వాసన, దోమలు వ్యాపిస్తున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణను వివరణ కోరగా వెంటనే పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
- న్యూస్‌టుడే, తాడిపత్రి

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరులోని గుత్తిరోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కండ్లగూడూరుకు చెందిన ఓబుళపతి తీవ్రంగా గాయపడ్డాడు. ఓబుళపతి కుమారుడు నరసింహాతో కలిసి గుత్తి మండలం జక్కలచెరువు సమీపంలో ఉన్న క్వారీలో పని చేస్తున్నారు. సాయంత్రం పనులు ముగించుకుని సొంత గ్రామం కండ్లగూడూరుకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఇక్కడకు రాగానే రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వచ్చిన లగేజీ ఆటో ఢీకొనడంతో ఓబుళపతి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం 108 వాహనంలో పామిడి ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం రాలేదు.

హౌసింగ్‌బోర్డులో మౌలిక వసతులేవీ?

అధ్వానంగా కాలనీలోని మురుగు కాలువ

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు వారు ఇళ్ల నిర్మాణంతో పాటు రోడ్లు, మురుగు కాలువలు నిర్మించిన తరువాతే కాలనీలను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఈ సౌకర్యాలు లేకపోయినా గుంతకల్లు పురపాలిక హౌసింగ్‌బోర్డుకు చెందిన రెండు కాలనీలను పది సంవత్సరాల కిందట స్వాధీనం చేసుకుంది. ఫలితంగా సౌకర్యాల కల్పనకు పెద్దఎత్తున వ్యయం చేయాల్సి వస్తోంది. ✦ గుంతకల్లు పట్టణం గుండా వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా, బళ్లారిరైల్వే గేటు సమీపంలో హౌసింగ్ బోర్డు అధికారులు రెండు కాలనీలను ఏర్పాటు చేశారు. మౌలిక వసతులు కరవై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

పురపాలిక : గుంతకల్లు
హౌసింగ్ బోర్డు కాలనీలు : 2
నివాస గృహాలు : 1200
జనాభా : 3000
సమీప కాలనీలు : కాల్వగడ్డ కాలనీ, హమాలీ కాలనీ
నివాసగృహాలు : 500
జనాభా : 1800

ఎన్నో సమస్యలు

హౌసింగ్‌బోర్డు కాలనీల్లో మున్సిపాలిటీ కొన్ని రోడ్లు, మురుగు కాలువలను మాత్రమే నిర్మించింది. మురుగు బయటకు పోవడానికి ఏర్పాట్లు చేయలేదు. దీనివల్ల మురుగునీరు ఇళ్ల మధ్య ఆగుతోంది. ఎక్కువ భాగం మట్టిరోడ్లు ఉండటం వల్ల వర్షం వస్తే జలమయమవుతున్నాయి. ఈ నీరు పోవడానికి మార్గం లేదు. కొన్నిచోట్ల కాలువలపై కల్వర్టులను కూడా నిర్మించలేదు. ఫలితంగా ప్రజలు మురుగునీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. కాలనీలకు సంబంధించి జాతీయ రహదారి పక్కన కూడా మురుగు కాలువలు లేవు. ఇక కాల్వగడ్డ, హమాలీ కాలనీల పరిస్థితి కూడా ఈ విధంగానే ఉంది. కాలనీల అనుసంధానానికి రోడ్లు ఏర్పాటు చేయలేదు.

సమస్యలను పరిష్కరిస్తాం

సర్వేచేసి, సమస్యలను గుర్తించి విషయాన్ని మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం. అక్కడ రోడ్లు, కాలువలను నిర్మించాల్సి ఉంది. నిధుల లభ్యతను బట్టి దశలవారీగా పనులు చేపడతాం. ప్రత్యేకంగా రూపొందించిన ప్రణాళికకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.
- షబానా, మున్సిపల్ డీఈ

అశ్వర్థ ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో ఆదివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అశ్వర్థ నారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామివారికి వేద పండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

చక్రభీమలింగేశ్వరస్వామి

భోగేశ్వరుడి సన్నిధిలో..

పామిడిలో.. భోగేశ్వరుడు

పామిడి, న్యూస్‌టుడే : ప్రసిద్ధి గాంచిన పురాతన భోగేశ్వర ఆలయంలో ఆదివారం మార్గశిర మాస ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేకువ జామున 3 గంటల నుంచి 4 గంటల సమయంలో భోగేశ్వరునికి విశేష రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. వివిధ పుష్పాల అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు రామాచార్యులు ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు, ఆకుపూజలు వంటి విశేషపూజలు జరిపి స్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన సదుపాయం కల్పించారు.

ప్రత్యేకాలంకరణలో గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

(c) eenadu

అనంతపురం
• అనంతపురం • రాప్తాడు

ఉపాధి పనులు కల్పించండయ్యా!

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: దశాబ్దాల క్రితమే స్థిరపడ్డాం. ప్రభుత్వం ఇళ్లు కూడా నిర్మించింది. అంత కూలినాలీ చేసుకునే బతుకు తెరువు కొనసాగిస్తున్నాం. ఇప్పటికీ ఒక్కరికి కూడా జాబ్ కార్డు ఇవ్వలేదని అనంతపురం గ్రామీణ చిన్నంపల్లి పంచాయతీ మటన్ మార్కెట్ కాలనీలో ప్రజలు కోరారు. ఆదివారం పంచాయతీ సర్పంచి శివశంకర్, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది కాలనీలో పర్యటించారు. ఎంత మందికి జాబ్ కార్డులున్నాయను దానిపై ఆరా తీశారు. ఇప్పటికీ కాలనీలో ఒక్క జాబ్‌కార్డు ఇవ్వలేదు. ఒక్క కూలీకీ ఉపాధి కల్పించలేదని సర్పంచి ముందు స్థానికులు వాపోయారు. 72 మంది జాబ్‌కార్డులు మంజూరు చేసి, ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయిస్తామని సర్పంచి శివశంకర్ భరోసా ఇచ్చారు.

విశ్రాంత ఆచార్యుడు దయానందకు పీఎం ప్రొఫెసర్‌షిప్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని విశ్రాంత ఆచార్యుడు దయానంద ప్రధానమంత్రి ప్రొఫెసర్‌షిప్‌కు ఎంపికయ్యారు. జాతీయ పరిశోధన సంస్థ ఈ మేరకు ఆయనను ఎంపిక చేసింది. యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఏఎన్‌ఆర్‌ఎఫ్ పథకం కింద యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులను ప్రోత్సహించడం, పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి ఆయన కృషి చేయాల్సి ఉంటుంది. నెలకు రూ.2.50 లక్షల ఫెలోషిప్, సంవత్సరానికి రూ.24 లక్షలు పరిశోధన గ్రాంటు, రూ.లక్ష భత్యం ఆయనకు అందిస్తారు. ఎస్కేయూ బయోకెమిస్ట్రీలో ఆచార్యులుగా పనిచేశారు. అనంతరం హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. తరువాత ఒప్పంద ప్రాతిపదికన విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా విధులు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్: 9440247485
తపోవనం: 8008573010
రుద్రంపేట: 8008550310

● **సమస్య:** రెండో రోడ్డులో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి రోడ్డుపైనే పడేశారు. తొలగించండి.
- శంకర్ స్థానికుడు.

● **సమస్య:** కమలానగర్ డీసీఎంఎస్ కార్యాలయంలో సమీపంలో మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. శుభ్రం చేయండి.
- గోవర్ధన్, స్థానికుడు.

● **సమస్య:** గుల్జార్‌పేటకాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేయక తీవ్ర దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయండి.
- సమీర, స్థానికురాలు.

సమాధానం : వెంటనే తొలగించి, శుభ్రం చేయిస్తాం **- నగరపాలక కమిషనర్ బాలస్వామి.** **- న్యూస్‌టుడే, కమలానగర్**

తాగే పాల నాణ్యతపై తనిఖీలేవీ?

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: తాగే పాల దగ్గర నుంచి తినే ఆహారం వరకు మార్కెట్లో అనేకం కల్తీ అవుతున్నాయి. ఆయా పదార్థాలను పోలిన వాటిని కలిపి వినియోగదారులను మోసం చేస్తున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం బండమీదపల్లిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు చేసిన తనిఖీలో పాల వ్యాపారి విక్రయిస్తున్న పాలు కల్తీవని ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీసే కాస్టిక్ షోడా, మాల్టోడెక్స్‌ట్రిన్ కలిపింది వాస్తవమేనని ప్రయోగశాల పరీక్షలో తేలింది. అప్పట్లో ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. సంబంధించిన పాల వ్యాపారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. జిల్లాలో 30 కేంద్రాల్లో తనిఖీ చేసి పాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. అప్పట్లో తూతూ మంత్రంగా తనిఖీ చేసి వదిలేశారు. ఇప్పటికి ఏడాది అవుతోంది. తర్వాత ఏమాత్రం ఎక్కడా పరిశీలనలు లేవు తనిఖీలు లేవు. నగరంలోకి వచ్చే పాలలో నాణ్యత తగ్గిపోతోందని విమర్శలు వస్తున్నా అధికార యంత్రాంగం మేలుకోవడం లేదు

జాగ్రత్తగా గమనించాలి..

● పాలు మరీ చిక్కగా ఉంటే పిండి, తెల్లగా నురగలు వస్తే యూరియా, జిడ్డుగా కనిపిస్తే అందులో వంట నూనె కలిపినట్లు గుర్తించాలి. బ్రాండెడ్ కంపెనీలు పొట్లాల్లో విక్రయిస్తున్న పాలను కొనుగోలు చేయడం కొంత ఉపయోగకరం. నీటిని కలిపితే.. పాల నాణ్యత తగ్గి పోషక విలువలు తగ్గుతాయి. పిండి పదార్థాలు కలిపితే పాలలో చిక్కదనాన్ని పెరిగినట్లు అనిపిస్తాయి. వీటిని తాగితే విరేచనాలు, జీర్ణాశయ సమస్యలు వస్తాయి. యూరియా కలిపిన పాలను తాగితే వికారం, వాంతులు ఖాయం.
● డిటర్జెంట్ కలిపిన పాలలో చిక్కగా తెల్లగా కనిపిస్తాయి. శరీర కణజాలంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

నీలం రంగులోకి మారితే పిండి కలిపినట్లే..

● శుభ్రమైన, వాలుగా ఉన్న గాజు పాత్రపై ఒక చుక్క పాలు పోస్తే, అది జాడ లేకుండా త్వరగా ప్రవహిస్తే అందులో నీరు కలిపారని అర్థం.
● పాలలో కొన్ని చుక్కలు అయోడిన్ ద్రావణాన్ని కలిపితే నీలం రంగులోకి మారితే పిండి కలిపినట్లు గుర్తు.
● పాలను వేళ్ల మధ్య రుద్దితే, నురగలు వస్తే యూరియా కలిపారని, బుడగలు వస్తే డిటర్జెంట్ కలిపినట్లు అనుమానించాల్సిందే.

నిఘా పెంచుతాం..

రాప్తాడు మండలంలో పాల వ్యాపారి ఒకరు కాస్టిక్ షోడా, మాల్టో డెక్స్‌ట్రిన్ పాలలో కలిపి విక్రయిస్తున్న వైనం గత ఫిబ్రవరిలో విజిలెన్స్ అధికారులతో కలిసి చేసిన తనిఖీలో తేలింది. అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేశాం. నిబంధనల మేరకు ఏడాది గడువు ముగిసిన తరువాత (అంటే 2026 ఫిబ్రవరి నెల తరువాత) కోర్టులో కేసు వేస్తాం. జిల్లావ్యాప్తంగా అప్పట్లో 30 పాల కేంద్రాల్లో తనిఖీ చేసి, పాల నమూనాలను నాణ్యత పరీక్షకు పంపించాం. ఫలితాలు రావాల్సి ఉందని, ఇటీవల కాలంలో పాల నాణ్యతపై పలుచోట్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. మళ్లీ తనిఖీలు పెంచుతాం..
- తస్లీమ్, ఫుడ్ సేఫ్టీ అధికారిణి.

తిరుమలలో ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్, నాయకులు

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే

రాంనగర్ : అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ ఆదివారం తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. 41 రోజుల పాటు అయ్యప్ప దీక్ష అనంతరం శబరిమలకు వెళ్లొచ్చారు. సన్నిధానంలో ఇరుముడిని సమర్పించి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా తిరుమలకు చేరుకుని స్వామిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. [illegible] అనంతరం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నామన్నారు. అనంత నగరాభివృద్ధి వేగంగా జరగాలని ప్రార్థించినట్లు తెలిపారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అడిషనల్ ఎస్పీ యర్రగడ్డ ప్రసాద్, పీవీకేకే విటీ కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్

క్రీడలు క్రమశిక్షణ నేర్పుతాయి

రుద్రంపేట, న్యూస్‌టుడే: క్రీడలు క్రమశిక్షణ నేర్పడంతో పాటు మంచి జీవితాన్ని తీర్చిదిద్దుతాయని అడిషనల్ ఎస్పీ యర్రగడ్డ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్- 2కె25 జూనియర్ కళాశాలల క్రీడా పోటీల ముగింపు సభలో అడిషనల్ ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిశోర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడా క్రీడా వసతులను మరింత విస్తరింపజేసి జాతీయ స్థాయిలో అథ్లెట్ల తయారీని ప్రోత్సహించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. విద్యార్థుల్లో ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించంలో క్రీడలు కీలకమన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ రమేశ్ బాబు, డీన్ సంతోష్ కుమార్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే : గౌరి : **కాంత,** త్రివేణి : **దురంధర్** నీలిమ : **ది గర్ల్ ఫ్రెండ్,** ఎస్వీ సినిమా : **రాజు వెడ్స్ రాంబాయి,** శాంతి : **ఆంధ్రకింగ్ తాలూకా.**

కూరగాయల ధరలు

అరవిందనగర్ (అనంతపురం): (అనంతపురం నగరం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 30, రెండోరకం 20, ఉల్లిగడ్డలు 25, రెండోరకం 15, బంగాళాదుంపలు 40, మిరపకాయలు50, బెండకాయలు40, వంకాయలు20 , ముల్లంగి20, బీట్‌రూట్40, బీరకాయలు40, కాకరకాయలు40, చౌళేకాయలు40, క్యాప్సికం40, చిక్కుడుకాయలు40, క్యారెట్60, బీన్స్ 50, క్యాబేజీ 35, అల్లం70.

నగరంలో నేడు

కమలానగర్: జిల్లా కలెక్టరేట్, పోలీసు కార్యాలయంలో నేడు ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమాలు నిర్వహణ.

కమనీయంగా ఇన్నర్‌వీల్ స్వర్ణోత్సవం

సీనియర్ సభ్యులను సత్కరిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ఇన్నర్‌వీల్ క్లబ్ స్వర్ణోత్సవ వేడుకలు కమనీయంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అలెగ్జాండర్ హోటల్లో జరిగిన ఈ వేడుకల్లో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి పలువురు మహిళలు హాజరయ్యారు. 50 ఏళ్లలో ఈ క్లబ్ ద్వారా అందించిన సేవలను గుర్తుచేస్తూ భవిష్యత్తులో చేయాల్సిన కార్యక్రమాలను వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీక్లబ్-3160 ఎన్నికైన గవర్నర్ పి.కేశవరెడ్డి, ఇన్నర్‌వీల్ క్లబ్ పీడీసీలు శ్రీవల్లి, శ్యామల, క్లబ్ అధ్యక్షురాలు జయంతి, జిల్లా ఎడిటర్ శ్వేతారెడ్డి, రోటరీక్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు గల్లా హర్ష, కార్యదర్శి మేడా రామలక్ష్మిలు హాజరయ్యారు. ఈ క్లబ్‌లో సభ్యురాలిగా డీఎంహెచ్‌ఓ ఈబీ దేవికి సభ్యత్వం అందజేశారు. 50 ఏళ్లుగా ఈ క్లబ్‌లో సభ్యులుగా ఉంటూ నిరుపమాన సేవలు అందించిన టి.పుష్పలత, మేడా అరుణలను ఘనంగా సత్కరించారు. పీడీసీ శ్రీవల్లి మాట్లాడుతూ.. గత 50 ఏళ్లలో అనేక సామాజిక కార్యక్రమాలు చేసి మహిళల్లో చైతన్యం తెచ్చామని వెల్లడించారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణం ఉపాధ్యాయులతో సాధ్యం

మాట్లాడుతున్న గేయానంద్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: శాస్త్రీయ సమాజ నిర్మాణం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని జేవీవీ రాష్ట్ర గౌరవ సలహాదారుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కేఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం జరిగింది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ ఆలోచన పెంపొందించడమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ కార్యక్రమంలో 4 లక్షల విద్యార్థులు పాల్గొంటారన్నారు. చంద్రశేఖర్, ప్రసూన, వీర్రాజు, జిలాన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదినారాయణకు సత్కారం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : పశుసంవర్ధకశాఖకు సంబంధించిన చిరుద్యోగి ఆదినారాయణ గత నెల 30న కలెక్టర్ క్యాంపు ఆఫీసులో పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. ఆదివారం జిల్లా గొర్రెల పెంపకందార్ల సహకార సంఘం భవనంలో ఆదినారాయణకు సన్మానసభ ఏర్పాటు చేశారు. ముందుగా కేక్ కోశారు. అనంతరం ఆదినారాయణకు శాలువా, పూలదండ, బహుమతి అందించి సత్కరించారు. సంఘం అధ్యక్షుడు మహేంద్ర, నాయకులు వరప్రసాద్, బాబు, ఆదినారాయణ, రంగనాయకమ్మ, చంద్ర, నరసింహ, చంద్రశేఖర్, వెంకటేశ్, రంజిత్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు, పర్యవేక్షిస్తున్న అధికారులు

శిక్షణతో అనేక ఉపయోగాలు

కమలానగర్, న్యూస్‌టుడే : ప్రభుత్వం పోటీ పరీక్షలకు నిర్వహించే ఉచిత శిక్షణలతో అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి, రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని బీసీ స్టడీ సర్కిల్ భవనంలో సివిల్స్ (ప్రిలిమనరీ, మెయిన్స్) ఉచిత శిక్షణ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ శిక్షణకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకొని స్క్రీనింగ్ పరీక్షలో పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకొన్న 59 మందిలో నలుగురు గైర్హాజరు కాగా. . 55 మంది పరీక్షను రాశారు. పరీక్ష అనంతరం ప్రశ్నపత్రాలను అభ్యర్థుల సమక్షంలోనే ఓపెన్ చేసి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు.

కీలక పోస్టు.. ఎవరికి దక్కేనో!

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా ఉన్న పలువురికి ఇటీవల పదోన్నతులు వరించాయి. గ్రామ, వార్డు సచివాలయాల మండల అధికారులుగా పదోన్నతులు రావడంతో పలువురు రిలీవ్ అయ్యారు. గత వారంలో కొందరు బాధ్యతలు కూడా చేపట్టారు. గ్రేడ్-1 కార్యదర్శులందరికీ పదోన్నతులు రాగా.. అనంతపురం గ్రామీణ మండలంలోని అనేక పంచాయతీలకు కార్యదర్శులు లేరు. ఆదాయం ఉన్న పంచాయతీలకు కార్యదర్శులుగా రావడానికి పలువురు ఎగబడుతున్నారు. ఎ.నారాయణపురం గ్రామ పంచాయతీకి తీవ్ర పోటీ నెలకొంది. ఈ పంచాయతీ ఇటు అనంతపురం, అటు రాప్తాడు పరిధికి విస్తరించింది. ఈ పంచాయతీకి కార్యదర్శిగా రావాలంటే ఇద్దరు ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉండాలి. అనంతపురం ఎమ్మెల్యేతో ఓ గ్రేడ్-4 కార్యదర్శి సిఫార్సు లేఖ తీసుకుని నారాయణపురం పంచాయతీ కార్యదర్శిగా కాలు పెట్టడానికి ప్రయత్నించారు. అయితే అతను గతంలో రెండుసార్లు సస్పెండ్ అయిన విషయం రాప్తాడు ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. స్పెషల్‌గ్రేడ్ పంచాయతీకి గ్రేడ్-4 కార్యదర్శిని ఎలా నియమిస్తారని రాప్తాడు ఎమ్మెల్యే సునీత వర్గీయులు చెక్‌పెట్టారు. అతని ప్రయత్నాలు విఫలమయ్యాయి.

రంగంలోకి పీఏ!

● ఈ పంచాయతీ విషయంలో ఇద్దరి ఎమ్మెల్యేల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయని తెలుస్తోంది. ఇప్పటివరకు పనిచేసిన పదోన్నతిపై వెళ్లిన ప్రవీణ్ మళ్లీ ఇక్కడికే రావాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఉప ఎంపీడీఓ ఎ.నారాయణపురం ఇన్‌ఛార్జి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వరిస్తున్నారు. అనంతపురం గ్రామీణ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రావుకు కూడా పదోన్నతి లభించింది. ఈ పంచాయతీకి కూడా ప్రస్తుతం కార్యదర్శి లేరు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆశీస్సుల కోసం పలువురు ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్రేడ్-1 పంచాయతీలైన ఉప్పరపల్లి, రాచానపల్లి గ్రామ కార్యదర్శులు బాబాఫకృద్దీన్, రఫీలు కూడా పదోన్నతిపై వెళ్లగా ఈ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు పంచాయతీల్లో కూడా ఆదాయం ఎక్కువే. వీటి కోసం ఎమ్మెల్యే ఇంటి దగ్గర వరుస కట్టారు. ఓ ప్రజాప్రతినిధి పీఏకు అనుకూలమైన వారికి పోస్టింగులు ఇప్పించడానికి చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది. డీపీఓ కార్యాలయ ఉద్యోగిగా ఉన్న ఆయన పదోన్నతి కూడా వద్దని పీఏగానే కొనసాగుతున్నారు. గ్రామ పంచాయతీల పరిపాలనలో, కార్యదర్శుల నియామకంలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉప ఎంపీడీఓ వెంకటనాయుడు మాట్లాడుతూ.. పదోన్నతులతో ఖాళీ అయిన గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులుగా రావడానికి పలువురు ప్రయత్నిస్తున్న విషయం వాస్తవమేనని తెలిపారు.

నగరంలో నేటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

అనంత సాంస్కృతికం: నగరంలోని మూడో రోడ్డు శిర్డీ సాయి బాబా మందిరంలో సంకష్ట హర చతుర్థి, శ్రీమహాగణపతి పూజలు సోమవారం సాయంత్రం 6.30కు ఘనంగా జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అభిషేకం, కుడుముల హారాలు, పుష్పమాలికలతో ప్రత్యేకఅలంకరణ, అష్టోత్తర శత నామావళి పూజ, మంత్రపుష్పం, మంగళ హారతులు నిర్వహిస్తారు. అదేవిధంగా నగరంలోని విఘ్నేశ్వరాలయాలైన బెంగళూరు రోడ్డులోని శివబాలయోగి ఆశ్రమం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం, పీటీసీలోని కామితార్థ వరసిద్ధి వినాయక ఆలయం, హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వరాలయం, అశోక్‌నగర్‌లోని సత్యదేవాలయం, చెరువుకట్టపై బాబామందిరం, రాంనగర్ వరసిద్ది వినాయకస్వామి ఆలయం, మొదటి రోడ్డు శివాలయం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో వ్రతాలు నిర్వహిస్తారు.



ప్రత్యేక రథంపై ఊరేగుతున్న మణికంఠుడు

రథంలో కొలువుదీరిన గణపతి, అయ్యప్ప, కార్తికేయుడు

కనులపండువగా గ్రామోత్సవం

అనంత సాంస్కృతికం: అశోక్‌నగర్ హరిహర దేవాలయం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం ఆదివారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. మహాగణపతి, చందనప్రియుడు, కార్తికేయుడు ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంలో కొలువుదీర్చారు. పుష్పరథంలో అయ్యప్ప అభయ హస్తదారుడై భక్తులను కటాక్షించారు. ఆలయ మహిళామండలి వారి కోలాటం ఆకట్టుకుంది. శ్రీదేవి, స్రవంతి సారథ్యంలో పలువురు మహిళలు చేసిన కోలాటం నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ మహిళలు, బాలికలు జ్యోతులు పట్టుకుని ఊరేగించిన దృశ్యం ఆకట్టుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అనంత నేరవార్తలు: నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు నగరంలోని ఆర్టీవో ఆఫీసు సమీపంలో నివాసముంటున్న నాగేంద్ర వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై రాప్తాడు వైపు వెళ్తుండగా, ధర్మవరం వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తికి కాలు విరిగింది. స్థానికులు క్షతగాత్రున్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కిమ్స్ సవేర సహకారంతో కమ్మసంఘం ఆధ్వర్యంలో రాంనగర్‌లోని కమ్మభవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె, కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా కమ్మ సంఘం అధ్యక్షుడు బాంబేడైయింగ్ నాగన్న, ఉపాధ్యక్షుడు మాసినేని రామయ్య, కార్యదర్శి తిప్పయ్య, ఇతర సభ్యులంతా కలిసి ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ముందుగా ప్రతి ఒక్కరికి చెక్కర వ్యాధి, బీపీ పరీక్షలు చేశారు. అనంతరం గుండె నొప్పి, ఆయాసం, కళ్లుతిరుగుట, చమటలు పట్టడం, కాళ్లు, చేతుల వాపు, వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు వైద్యులు పరీక్షలు చేశారు. వైద్య శిబిరానికి మొత్తం 325 మంది వచ్చారు. వారిలో గుండెకు సంబంధించిన సమస్యలపై ఎక్కువగా పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కిమ్స్ సవేర ఆసుపత్రి వైద్యులను సత్కరించారు.

పాతూరు అమ్మవారిశాలలో మాలధారణలో ఆర్య వైశ్యులు

వాసవీ దీక్షలో 120 మంది

అనంత సాంస్కృతికం: ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ కన్యకాపరమేశ్వరీ దర్శనార్థం నగరంలో ప్రారంభ రోజైన ఆదివారం 120 మంది మాలధారణ చేపట్టారు. వాసవీ దీక్షా సమితి ఆధ్వర్యంలో పాతూరులో 70 మంది, కొత్తూరులో 50 మంది దీక్షలు చేపట్టారు. ఆదివారం మండల దీక్షలు, ఈనెల 28న అర్ధమండలం, జనవరి 7న మహిళల ప్రత్యేక దీక్షలు, యజ్ఞముడి 18న, విశ్వరూప దర్శనం జనవరి 20న జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పాతూరు ప్రధాన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లా కృష్ణరంగయ్య, ఏవీ రత్నం, గర్జాల నాగరాజు దీక్షా సమితి అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు అరుణ్‌కుమార్, బాలాజీ, కృష్ణకుమార్‌ల సారథ్యంలో దీక్షలు ప్రారంభమయ్యాయి. కొత్తూరులో అధ్యక్ష, గౌరవాధ్యక్షులు గోపా మచ్చా నరసింహులు, నాగరాజ గుప్త, దీక్షా సమితి అధ్యక్ష, కార్యదర్శులు మిరియాల సుకుమార్, మధుబాబు, ఫణిరాజ్, అశ్వర్థనారాయణల సారథ్యంలో దీక్షలు కొనసాగనున్నాయి.

కొత్తూరు అమ్మవారిశాలలో...

ఆకట్టుకున్న స్వరార్చన

అనంత సాంస్కృతికం: నగరంలోని కృష్ణ కళామందిరంలో అనంత్‌నాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన సంగీత స్వరార్చన ఆకట్టుకుంది. ఘంటసాల 103వ జయంతి పురస్కరించుకుని 'మనసు పాడింది సన్నాయి పాట' శీర్షికతో పాత పాటల సంగీత విభావరి నిర్వహించారు. సంగీత విభావరిలో డీఆర్వో మాలోలతో పాటు దాదాపు 20 మంది గాయనీ గాయకులు పాత చిత్రాల మధుర గీతాలను ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకుడు కరణం ప్రసాద్ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఆరుద్ర నక్షత్రాభిషేకం

మొదటి రోడ్డు శివాలయంలో అలంకరణలో స్వామివారు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: మార్గశిర ఆరుద్ర నక్షత్రాభిషేకం పురస్కరించుకుని నగరంలో పలు శివాలయాల్లో ఆదివారం ఆరుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి. పీటీసీ ఆవరణలోని కామితార్థ శ్రీమహాగణపతి ఆలయంలో 11 శివలింగాలు, మూలమూర్తికి సైతం శత రుద్రాభిషేకం జరిపారు. ప్రధాన అర్చకుడు సత్యనారాయణ అర్చక బృందం గణపతికి దర్భపుష్పాలతో అలంకరించి అర్చన, పుష్పాభిషేకం చేశారు. మొదటి రోడ్డు శివాలయంలో ఆరుద్రాభిషేకం జరిపారు. ప్రధాన అర్చకుడు నరసింహశాస్త్రి, ఆలయ కోఆప్షన్ సభ్యుడు కిషోర్‌శర్మ అర్చక బృందం నిర్వహణలో అభిషేకం, పూలంగిసేవ చేశారు. శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో భక్తుల స్వహస్తాలతో ఆరుద్రాభిషేకం, బిల్వార్చన తెల్లవారుజాము 3.35కు ప్రారంభించి 6.30 వరకు నిర్వహించారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వీడాలి: సీపీఐ

ఆర్కేనగర్: సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. ఇటీవల పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యామ్‌ల గేట్లు మొరాయించడం, తాజాగా పీఏబీఆర్ కుడి కాలువకు గండిపడటం జిల్లా రైతాంగానికి నష్టమేనన్నారు. 49 చెరువులకు నీరందించే పీఏబీఆర్ కాలువకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. గతంలో కూడా కాలువకు అనేక సార్లు గండ్లు పడినా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

● కుడి కాలువకు పడిన గండి వెంటనే పూడ్చి చెరువులకు సకాలంలో నీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జల్లిపల్లి వద్ద పడిన గండి పెద్ద ఎత్తున నీరంతా పొలాల్లోకి ప్రవహించిందన్నారు. వరి, వేరుసెనగ, చీనీ, ఇతర పంటలు దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

లైఫ్ సర్టిఫికెట్లు నిర్ణీత గడువులో ఇవ్వండి

గుత్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా ఉపఖజానా అధికారులకు అప్పగించాలని ఖజానాశాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు రమణయ్య పేర్కొన్నారు. 2026 జనవరి నుంచి ఫిబ్రవరి 28లోగా సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. ఆదివారం ఆయన గుత్తిలోని తాలూకా పెన్షనర్ల భవనంలో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. సర్టిఫికెట్లను ఇవ్వడంలో జాప్యం చేయరాదన్నారు.

ఉద్యోగులపై పనిభారం తగ్గించండి

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై రోజు రోజుకు పెరుగుతున్న సర్వే భారాన్ని ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుస్వామి డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం నగరంలోని గణేనాయక్ భవనంలో జరిగిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. సర్వేల భారంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్నారన్నారు. గతంలో సర్వే భారం తగ్గిస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. పైగా కొత్త సర్వేలు పెంచడం కక్షపూరిత చర్యగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందన్నారు. ఉద్యోగులందరినీ మాతృశాఖలకు అప్పగించి స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ ప్రకటించాలన్నారు. అన్ని శాఖల్లో అర్హులకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలన్నారు. క్రమబద్ధీకరణ ఆలస్యంతో నష్టపోయిన 9 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. జాయినింగ్ తేదీ నుంచి ఇవ్వాల్సిన నోషన్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లపైనే ఆవుల మందలు

శారదానగర్‌లో పశువులు విస్తృతమై వాహన చోదకులను ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా మొదటి క్రాస్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకుని ఉంది. పశువుల యజమానులు వీటికి ఆహారం సరిగా పెట్టనందున రోడ్డుపైకి చేరుతున్నాయి. పర్యవేక్షణ లోపం కారణంగా పశువులు అడ్డదిడ్డంగా పండుకొంటున్నాయి. ద్విచక్ర వాహనాల్లో రాత్రివేళల్లో వచ్చే వారి ఇబ్బంది అంతా ఇంతా కాదు. శారదానగర్ మొత్తం నాలుగు క్రాస్‌ల్లో ఏదో ఒక ప్రాంతంలో ఇటువంటి పరిస్థితి ఉంటోంది. **- న్యూస్‌టుడే, శారదానగర్**

మైనార్టీలపై వేధింపులు ఆపాలి

కమలానగర్, న్యూస్‌టుడే : జిల్లాలో మైనార్టీలపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని యునైటెడ్ జేఏసీ కన్వీనర్ జాఫర్, నగర మేయర్ వసీం, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ పేర్కొన్నారు. పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన మెహతాజ్‌ను ఆదివారం వారు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. నగరంలో చిన్న దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న మెహతాజ్‌పై అధికార పార్టీ నాయకులు కక్ష్య సాధింపులకు పాల్పడుతూ నిత్యం వేధించారన్నారు. న్యాయం కావాలని పోలీసు స్టేషన్‌కు వెళితే.. పోలీసులు సైతం అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుతున్నారన్నారు.

(c) eenadu

హస్తకళ.. పనితనం భళా!

నేటి నుంచి వారోత్సవాలు ప్రారంభం

టెర్రాకోట బొమ్మలు తయారు చేస్తున్న కార్మికుడు

టెర్రాకోట కుండలు.. రాజు-రాణి బొమ్మలు.. మగువలు మెచ్చే చీరలు... రమణీయమైన శిల్పాలు ఇలా విభిన్న హస్త కళలకు జిల్లా ప్రసిద్ధిగాంచింది. చరితగన్న ఈ కళారూపాలు అంతరించిపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల రాయితీలు ప్రకటిస్తుండడంతో వందలాది మంది కళాకారులు జీవనోపాధి పొందడంతో పాటు మన కళను దేశ విదేశాలకు చాటుతున్నారు. ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడం, సాంకేతిక మార్పులతో ఇప్పుడు మన కళలు భళా అనిపించుకుంటున్నాయి. సోమవారం నుంచి దేశవ్యాప్తంగా హస్తకళా వారోత్సవాలు ప్రారంభమవుతుండగా మన ప్రత్యేకతలపై ఈ కథనం.

- న్యూస్‌టుడే, మదనపల్లె పట్టణం, రైల్వేకోడూరు, ఒంటిమిట్ట

మండలం కురబలకోట

- గ్రామాలు : : అంగళ్లు, కంటేవారిపల్లె, చెన్నామర్రిమిట్ట
- హస్తకళ : టెర్రాకోట బొమ్మల తయారీ ● ఆధారపడిన కుటుంబాలు : 200
- ఎగుమతులు : దేశవ్యాప్తంగానే కాకుండా ఆస్ట్రేలియా, అమెరికా వెళ్తున్నాయి.
- ఆదాయం : గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం వీరి ఆదాయం పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం టెర్రాకోట బొమ్మలు తయారీకి యంత్రాలు మంజూరు చేయడంతో ఒక్కో కుటుంబానికి నెలకు రూ.30 వేల వరకు ఆదాయం లభిస్తోంది.
- ప్రత్యేకతలు : కురబలకోట మండలంలో తయారు అవుతున్న టెర్రాకోట బొమ్మలకు ఉన్న నాణ్యత మరెక్కడ ఉండటం లేదు. ఇక్కడి మట్టిలో రాళ్లు లేకపోవడం, జిగటగా ఉండటం వల్ల బొమ్మల తయారీకి అనువుగా ఉంటోంది. గతంలో రోజుకు ఒకరు 10 నుంచి 15 బొమ్మలు తయారు చేసేవారు. డీఆర్‌డీఏ, కేవీఐసీ వారు అందించిన యంత్రాల సాయంతో ఒక్కొక్కరు రోజుకు 50కి పైగా తయారు చేస్తున్నారు. మట్టి పాత్రల్లో వంటలు చేసే సంస్కృతి పెరుగుతుండటంతో మంచి గిరాకీ ఉంది.

వివిధ ఆకృతుల్లో విక్రయాలకు సిద్ధంగా ఉన్న టెర్రాకోట బొమ్మలు

- కురబలకోట మండలంలో తయారు అయ్యే టెర్రాకోట వస్తువులు రూ.35 నుంచి మొదలై రూ.500 వరకు ధర పలుకుతున్నాయి. లేపాక్షి క్రాఫ్ట్‌లు, ప్రదర్శనలు, శిల్పారామాల్లో విక్రయిస్తున్నారు.
- ఇక్కడున్న మాస్టర్లు ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో టెర్రాకోట బొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు వెళ్తున్నారు. కురబలకోట మండలంలో ఉన్న టెర్రాకోట బొమ్మలను కొనుగోలు చేసేందుకు పలు ప్రాంతాల నుంచి ప్రజలతో పాటు వ్యాపారులు వస్తున్నారు.
- ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లోని కొత్తమాధవరం, కొండమాచుపల్లె, సిద్దవటం పట్టుచీరల తయారీకి పేరెన్నికగన్నాయి. దాదాపు 2,500 కుటుంబాలు చేనేత మీద ఆధారపడి జీవిస్తున్నాయి. ఇక్కడి నుంచి దేశవ్యాప్తంగా పట్టుచీరలు ఎగుమతి చేస్తున్నారు. పట్టు, నూలు, సీకో రకాలు తయారవుతున్నాయి.

రైల్వేకోడూరు

- శెట్టిగుంట, లక్ష్మీగారిపల్లె
- ఎర్రచందనంతో బొమ్మల తయారీ
- 50, ● రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలకు
- ఏటా రూ.2 కోట్లు
- ప్రత్యేకతలు : ఎర్రచందనంతో తయారు చేసిన రాజు-రాణి బొమ్మలు

మదనపల్లె

- నీరుగట్టువారిపల్లె
- పట్టుచీరల తయారీ
- 8,500 ● రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు
- ఆదాయం : ఏటా రూ.180 కోట్లు పైబడి
- చేనేత హస్త కళలతో, నూతన డిజైన్లతో పట్టుచీరలు తయారు చేయడం
- అద్భుత ఆకృతులు సృష్టించడంతో ఇక్కడి కార్మికులు దిట్టలు. ఈ వస్త్రాలు ధరిస్తే రాజసం ఉట్టిపడుతుంది. కళ్లు, కాళ్లు, మని వేళ్లతో మగ్గంతో మమేకమై రాణిస్తున్నారు. పూర్వీకుల నుంచి వారసత్వ సంపదగా వచ్చిన వృత్తి ఎంతో మంది జీవనానికి భరోసా ఇస్తోంది. స్వచ్ఛమైన జరీతో నిండైన చీరలు చేతికి వస్తున్నాయి. నాణ్యతలో రాజీపడటం లేదు.

ఆనందప్పా.. ఆలోచన అదిరిందప్పా!

పక్షులు, దొంగల నుంచి పంట దిగుబడులను కాపాడుకోవడానికి రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రామసముద్రం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న శీతగానిపల్లెకు చెందిన రైతు ఆనందప్ప తోటలోని దానిమ్మ దిగుబడులను పక్షుల నుంచి కాపాడుకోవడానికి తోటపై కంటికి కనిపించని విధంగా వైరుతో అల్లిన వల అమర్చారు. వీటితో పాటు శబ్దాలను రికార్డు చేసే మైకును అమర్చారు. 'హో... హూ' అంటూ అరుపులు వినబడడంతో పక్షులు తన తోట వైపు రావడం పోతున్నాయని చెప్పారు. పంట చోరీ కాకుండా సీసీ కెమెరాలను సైతం అమర్చారు. ఆయువైపు ఎవరు వచ్చినా వెంటనే రైతు చరవాణికి ఆ దృశ్యాలు వెళ్తాయి. ఈ ఏర్పాట్లు చూసిన మిగతా రైతులంతా ఆనందప్పా.. ఐడియా బాగుందప్పా! అని అభినందిస్తున్నారు. - న్యూస్‌టుడే, రామసముద్రం

రైలు బండి.. విద్యార్థులకు రాయితీలు దండి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : బస్సుల్లో మాదిరి రైల్వేలో కూడా విద్యార్థులకు ప్రయాణ రాయితీలను ఇస్తున్నారు. కరోనా సమయంలో తొలగించారు. అయితే విద్యార్థులకు గతంలో కొనసాగిస్తున్న రాయితీని రెండేళ్ల క్రితమే మళ్లీ పునరుద్ధరించారు. ఈ విషయంపై చాలా మంది విద్యార్థులకు అవగాహన లేక పూర్తి స్థాయి ఛార్జీలు చెల్లిస్తూ ప్రయాణం సాగిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. విద్యార్థుల కోసం ఆ రాయితీల వివరాలు. ● దసరా, సంక్రాంతి పర్వదినాలతో పాటు సెమిస్టర్ వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చి వెళ్లేందుకు విద్యార్థులకు రైల్వే రాయితీలను అందిస్తోంది. తాము చదువుతున్న గుర్తింపు పొందిన యూనివర్సిటీ, కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాల నుంచి పొందిన పత్రంతో డీఆర్‌ఎం కార్యాలయంలో సీనియర్ డీసీఎం వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ వారు సూచించిన మేరకు కొన్ని పత్రాలను ఇవ్వాలి. అనంతరం రైల్వే అధికారులు సంతకాలతో కూడిన రాయితీ పుస్తకాన్ని సంబంధిత యాజమాన్యానికి ఇస్తారు. ఆ విషయాన్ని స్థానిక రైల్వేస్టేషన్లలో తెలియజేయాల్సి ఉంటుంది. ఆపై ప్రిన్సిపల్ నుంచి లెటర్ తీసుకుని ఆఫ్‌లైన్‌లో టిక్కెట్‌ను రిజర్వ్ చేసుకోవచ్చు.

లబ్ధి ఎంతంటే..!

సాధారణ విద్యార్థులకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 75 శాతం రాయితీని ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు చేసుకున్న వారికి ఈ ప్రయాణ రాయితీ లభించదు. ఆఫ్‌లైన్‌లోనే టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలి. ఆ సమయంలో రైల్వే సిబ్బందికి అవసరమైన పత్రాలు ఇవ్వాలి. రాయితీలు జనరల్, స్లీపర్ క్లాసులకు మాత్రమే వర్తిస్తాయి. ఏసీ తరగతులకు లభించదు. జిల్లా నుంచి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు ఇదెంతో ప్రయోజనకరం. రైల్వేశాఖ అందిస్తున్న ప్రయాణ రాయితీని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుంది.

1.20 కోట్లకు చేరిన స్త్రీశక్తి

113 రోజులు.. రూ.37.59 కోట్ల లబ్ధి

చిన్నమండెం, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలో స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15న అమల్లోకి తీసుకొచ్చింది. నాటి నుంచి డిసెంబరు 5 వరకు కేవలం 113 రోజుల్లోనే 1.20 కోట్ల మంది మహిళా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణాలు చేశారు. ఈ పథకంతో మహిళలు రూ.37.59 కోట్ల లబ్ధిని పొందారని రీజనల్ మేనేజరు రాము తెలిపారు. సగటున నెలకు 30 లక్షల మందికి పైగానే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొన్నారు. దసరా సెలవుల్లో మహిళా ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణం చేశారు. వచ్చే క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి పండగల నేపథ్యంలో ఈ రద్దీ మరింత పెరగనుంది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు నడిపేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ● జిల్లా వ్యాప్తంగా ఐదు ఆర్టీసీ డిపోలున్నాయి. ఇందులో పీలేరు డిపో పరిధిలో అత్యధికంగా 28.74 లక్షల మంది ప్రయాణించగా తక్కువగా మదనపల్లె-2 డిపో పరిధిలో 18.66 లక్షల మంది సద్వినియోగం చేసుకొన్నారు. మొత్తం 2,07,66,364 మంది ప్రయాణాలు చేయగా 1,20,00,826 మంది మహిళలు ఉండడం విశేషం. మహిళల సగటు పరిశీలిస్తే 58 శాతంగా ఉంది.

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

జిల్లాలో ఆర్టీసీ డిపోల వారీగా లబ్ధి పొందిన వారి వివరాలు ఇలా..

డిపో పేరు	మహిళా ప్రయాణికులు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
మదనపల్లె-1	28,02,532	రూ. 10.47
మదనపల్లె-2	18,66,744	రూ. 5.51
పీలేరు	28,74,525	రూ. 8.59
రాజంపేట	18,99,126	రూ. 5.52
రాయచోటి	25,57,899	రూ. 7.48

శేషాచలం.. జలసోయగం

దిత్వా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు బాలపల్లె వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. అక్కడి శేషాచలం కొండల నుంచి జాలువారుతున్న వర్షపు నీరు కడప - చెన్నై ప్రధాన రహదారిపైన, పక్కన ప్రవహిస్తోంది. ఆ దారిలో ప్రయాణించే వారు ఆ దృశ్యాలను చూస్తూ ఆనందించడమేగాక సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ ఆనందిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ఇక్కడ రోడ్డు పక్కన ఉన్న కొండల నుంచి వర్షపు నీరు ఇలా ప్రవహిస్తూ ఉంటుంది. ఈ సారి ఎక్కువ రోజులు కనువిందు చేయడం ప్రత్యేకత. - న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

కొత్త ఏడాది.. మదనపల్లె నుంచి పాలన షురూ

సచివాలయంగా సబ్ కలెక్టర్ కార్యాలయం

జిల్లా కార్యాలయాలకు భవనాల పరిశీలన

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- మదనపల్లె గ్రామీణ: కొత్తగా ఏర్పాటవుతున్న మదనపల్లె జిల్లా కార్యకలాపాలు నూతన సంవత్సరం జనవరి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు అందాయి. ఈలోపు ప్రభుత్వ కార్యాలయాలు ఎంపిక చేయాలంటూ ప్రభుత్వం నుంచి వచ్చిన సంకేతాల నేపథ్యంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాథమికంగా సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని నూతన జిల్లా కలెక్టర్ కార్యాలయంగా ఎంపిక చేయనున్నారు. ఇటీవల ప్రారంభించిన డీఎల్‌డీవో కార్యాలయానికి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని మార్చాలని భావిస్తున్నారు. ఇతర విభాగాల ఎంపికలకు కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి కసరత్తు చేస్తున్నారు. బీటీ కళాశాలలో కొన్ని విభాగాలను, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కార్యాలయాలకు తాత్కాలికంగా వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఇంకా అవసరమైన పక్షంలో ప్రైవేటు భవనాల కోసం ఆరా తీస్తున్నారు. జిల్లా కేంద్రంలో దాదాపు 60 ప్రభుత్వ విభాగాలుంటాయి. వీటన్నింటికీ తాత్కాలిక కార్యాలయాలు అవసరం కాగా 50 శాతం వరకు ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయొచ్చనే అభిప్రాయానికి జిల్లా ఉన్నతాధికారులొచ్చారు. మిగిలిన వాటి కోసం ప్రైవేటు భవనాలను ఎంపిక చేయనున్నారు. ఎస్పీ కార్యాలయానికి అనువైన భవనాలు దొరకడం లేదు. వారం రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాల ఎంపిక చేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. జనవరి 26న గణతంత్ర వేడుకలు కొత్త జిల్లాలో జరగనున్నాయి. ఇందుకు బెంగళూరు రోడ్డులోని బీటీ కళాశాల మైదానంలో నిర్వహించవచ్చనే అభిప్రాయానికి వచ్చారు.

ప్రభుత్వ కార్యాలయాలకు వేదిక కానున్న బీటీ కళాశాల ప్రాంగణం

నాలుగు నియోజకవర్గాలతో జిల్లా

తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటవుతోంది. మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లు ఈ జిల్లాలో ఉండనున్నాయి. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన రొంపిచెర్ల మండలం మదనపల్లె జిల్లాలో ఉండనుండగా రెవెన్యూ డివిజన్ మాత్రం చిత్తూరులో ఉంటోంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌లోనూ పేర్కొన్నారు. పీలేరు రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పీలేరు సమీపంలోని రొంపిచెర్లను చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో ఉంచాలనే ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

మూడింటితో అన్నమయ్య జిల్లా

రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలతో అన్నమయ్య జిల్లా పరిమితం కానుంది. ఇది వరకు ఆరు నియోజకవర్గాలతో ఉండగా ఇకపై మూడింటితోనే ఉండనుంది. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ ఉద్యమం నడుస్తోంది. మూడు నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా రాజంపేట ఉంటుందంటూ రాజంపేటతో పాటు రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు రాయచోటినే జిల్లా కేంద్రంగా ఉంటుందంటూ ఇటీవల ఉత్సవాన్ని నిర్వహించుకున్నారు. ప్రభుత్వం వైపు నుంచి మాత్రం అధికారికంగా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

ఈ గంట.. అర టన్నంట

మరియాపురంలోని కేథడ్రల్ చర్చి



అర టన్ను బరువు కల్గిన గంట

గంట అంటే కిలోల్లో ఉన్నవి చూసుంటారు.. కానీ ఈ గంట చూశారా.. దీని బరువు అర టన్ను.. ఇదెక్కడుంది ఏమిటి ప్రత్యేకత అనుకుంటున్నారా.. క్రైస్తవుల పండగ క్రిస్మస్ సందర్భంగా ఆ వివరాలు మీ కోసం. . చర్చిలకు పేరొందిన జిల్లాలో అనేక పురాతన ప్రార్థనాలయాలు ఉన్నాయి. అనేక మంది విదేశీయులు వీటి నిర్మాణానికి తోడ్పడ్డారు. అందులో ఒకటి కడప పట్టణంలోని మరియాపురం కేథడ్రల్ చర్చి.. 1934 నాటి ఈ చర్చి 1976లో నెల్లూరు డయోసిస్ నుంచి విడిపడి సెయింట్ మేరీస్ చర్చిగా మారింది. అద్భుతమైన చర్చి నిర్మాణంలో ప్రధానమైన ఆకర్షణ ఇటలీ నుంచి తెప్పించిన మరియామాత విగ్రహం కాగా రెండోది 500 కిలోలున్న ఈ గంట. విదేశాల నుంచి దీనిని తెప్పించారు. - న్యూస్‌టుడే, మారుతీనగర్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు meekosam.ap.inలో నమోదు చేసుకొంటే వాటిని కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలుగా పరిగణించి నిర్ణీత గడువుగా పరిష్కరిస్తామన్నారు. మండలం, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని అర్జీలను కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తీసుకురావచ్చని ఆయన తెలిపారు. గతంలో ఇచ్చిన అర్జీల పరిష్కార స్థితిని తెలుసుకొనేందుకు 1100 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలియజేశారు.

చెయ్యేరు.. అటువైపు పోయ్యేరు

చెయ్యేరు.. జిల్లాలో అనేక వాగులు, వంకల కలయికతో ఉద్ధృతంగా ప్రవహించే నది. ఇసుక మేటలతో విశాలంగా కన్పించే చెయ్యేరు నేడు జల పరవళ్లతో ఉగ్రరూపం దాల్చింది. ఇసుక తవ్వకాలతో ఊబులు, సుడి గుండాలు ఎక్కువగా ఉండడంతో అటు వైపు వెళితే ప్రమాదమని అధికారులు హెచ్చరిస్తున్నారు. బాలరాజుపల్లె వద్ద చిరు వంతెనను ముంచెత్తి ప్రవహిస్తున్న చెయ్యేరును చిత్రంలో చూడవచ్చు. - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

మరచిపోతే అదనపు వాతే

పుల్లంపేట, నందలూరు, న్యూస్‌టుడే: నెల వారీ బిల్లులో భాగంగా నిర్ణీత తేదీన మీటరు నుంచి రీడింగ్ తీసి బిల్లు ఇస్తుంటారు. వినియోగానికి సంబంధించిన యూనిట్లు, అందుకయ్యే బిల్లు, రకరకాల ఛార్జీలు కలిపి బిల్లు మొత్తం ఉంటుంది. చెల్లింపు గడువూ ఉంటుంది. ఆలస్యం చేస్తే తెలియకుండానే జేబుకు చిల్లుపడుతుంది మరి. ● బిల్లుపై ఉన్న తేదీలోపు అంటే చేతికందిన తేదీ నుంచి 15 రోజుల్లోపు చెల్లించాల్సి ఉంటుంది. జాగు చేస్తే మరో 15 రోజుల వరకు అవకాశం ఉంటుంది. అయితే ఈ పదిహేను రోజులకు సర్ ఛార్జీ వేస్తారు. దీంతో బిల్లు ఇచ్చిన రోజు నుంచి ఒక 15 రోజులు, ఆ తర్వాత మరో 15 రోజులు కలిపి 30 రోజులవుతుంది. ఈ గడువు మించగానే సర్వీసు కట్ చేస్తారు. బిల్లు చెల్లించగానే తిరిగి(రీ కనెక్షన్) సర్వీసు ఇచ్చేందుకు రూ.100 బిల్లులోనే కలిపి వేస్తారు. వాస్తవానికి సర్వీసు కట్ చేసినా.. చేయకపోయినా రూ.100 వసూలు చేయడం ఆగదు. ఇది గృహ సర్వీసుకు వర్తిస్తుంది. వాణిజ్య, పరిశ్రమలకు ఛార్జీలు మరింత పెరుగుతాయి.

జిల్లాలో సర్వీసులు ఇలా...

- గృహ కనెక్షన్లు: 4,99,157
- వాణిజ్యం: 49,588 ● పరిశ్రమలు: 4,084
- కేటగిరీ-4: 16,412 (కేటగిరి-4లో ప్రార్థనా మందిరాలు, నీటి పథకాలు, వీధి దీపాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉంటాయి)

పాతా.. హుషార్

రాయచోటి, వీరబల్లి, న్యూస్‌టుడే: రాయచోటికి చెందిన వ్యాపారి శివరామ్ ఇటీవల తన పాత ద్విచక్ర వాహనాన్ని విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తి మూడు నెలలకు ఈఎంఐ చెల్లించకపోవడంతో అమ్మిన వ్యక్తి ఇంటికి బ్యాంకు అధికారులు వచ్చారు. తన వాహనాన్ని విక్రయించినా యాజమాన్య హక్కులను మార్చుకోకపోవడంతో అప్పు బాధ మళ్లీ వెంటాడింది. ప్రస్తుత రోజుల్లో ప్రతి కుటుంబానికి వాహనం తప్పనిసరైంది. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పలువురు కొత్తది కొనుగోలు చేయలేక పాత వాటి వైపు మొగ్గు చూపుతుంటారు. జిల్లాలో ఈ ధోరణి ఊపందుకుంది. ప్రతి నెలా వందల సంఖ్యలో పాత ద్విచక్ర వాహనాలు, కార్ల అమ్మకాలు సాగుతున్నాయి. నిర్వాహకులు ఆఫర్లు ప్రకటించి అమ్మకాలు పెంచుకునేందుకూ ప్రయత్నిస్తున్నారు.

ముకోసం

పరిశీలించాలి:

- వాహన సామర్థ్యాన్ని ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. నమ్మకమైన మెకానిక్ వద్దకు తీసుకెళ్లి చూపించాలి. ● వాహనానికి గుండె వంటిదైన ఇంజిన్ పరిస్థితి గమనించాలి. ● మైలేజీ, విడివిభాగాల పరిస్థితి, వాటి మన్నిక, లైట్లు వెలుగుతున్నదీ? లేనిదీ? తనిఖీ చేయాలి.

సరిచూసుకోవాలి

- పత్రాలన్నింటినీ ఒకటికి రెండు సార్లు తనిఖీ చేయాలి. ● కొందరు చోరీ చేసిన వాహనాలకు సంబంధించి ఛాసిస్ నంబరు చెరిపేసి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో వాహనం ఆర్సీ నంబరులోని ఛాసిస్ నంబరు, వాహనంపై ఉన్నదీ ఒకటా? కాదా? సరిచూసుకోవాలి. ● పోలీసు స్టేషన్‌లో కేసులేమైనా నమోదయ్యాయేమో నిర్ధారించుకోవాలి. ● ఫైనాన్స్ క్లియరెన్స్ ఉందా? ఉంటే అందుకు సంబంధించిన పత్రం, ఒరిజినల్ ఆర్సీ పరిశీలించాలి.
- వాహనం తన పేరుపై రిజిస్ట్రేషన్ అవుతుందా? లేదా? అన్న విషయాన్ని ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి తెలుసుకోవాలి. ● ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వాటికైతే వాహనం రిజిస్ట్రేషన్‌కు ఎంత ఖర్చవుతుందో తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేస్తే మేలు.

రహదారుల మరణశాసనం

ప్రమాదాల్లో జిల్లాకు 87వ ర్యాంకు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చేంత వరకు ఎదురు చూడాల్సి వస్తుంది. జిల్లాలో సగటున రోజుకు మూడు ప్రమాదాలు జరుగుతుండగా, ఇద్దరు మృత్యువాతపడుతున్నారు. నలుగురు క్షతగాత్రులవుతున్నారు. జిల్లాలో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నట్లు సర్వేలో తేలింది. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 100 జిల్లాల జాబితాలో మన జిల్లా 87వ ర్యాంకును పొందింది. ప్రమాదాల్లో ఎక్కువగా జాతీయ రహదారులపైనే జరుగుతున్నాయి.



గువ్వలచెరువు ఘాట్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (పాత చిత్రం)

అర్ధరాత్రి దాటిన తర్వాతే ఎక్కువ : జిల్లాలో ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత, తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల మధ్యలో మరీ ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎందుకంటే ఈ రెండు గంటల సమయంలో ఎంతటి వారైనా కునుకు తీస్తూ రెప్పపాటులో ప్రమాదాలకు గురవుతున్నారు.

- ఈ ఏడాది నవంబరు వరకు జిల్లాలో 270 మంది ప్రమాదాల్లో మృతి చెందగా, 390 మంది గాయపడ్డారు.
- కడప నుంచి రాయచోటికి వెళ్లే దారిలోని గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు వద్ద జరిగిన ప్రమాదాల్లో 22 మంది మృత్యువాతపడ్డారు. ఒకే రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.
- కడప-కర్నూలు మార్గంలో దారిలో ఈ ఏడాదిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 29 మంది మృత్యువాతపడ్డారు. ఎక్కువగా దువ్వూరు వద్ద ప్రమాదాలు జరిగాయి.
- కడప నుంచి రాజంపేటకు వెళ్లే దారిలో అందులోనూ ఒంటిమిట్ట, జేఎంజే కళాశాల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది ఈ మార్గంలో 15 మంది మృత్యువాతపడ్డారు.

ఫేస్ వాష్ అండ్ గో : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేసేందుకు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ జాతీయ రహదారుల పరిధిలో ఉండే ఠాణా పోలీసులు అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత ప్రతి ఒక్క వాహనాన్ని ఆపి డ్రైవర్ ముఖం కడుక్కుని వెళ్లేలా ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

టమాట కిలో రూ.38

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో టమాట ధరలు తగ్గుముఖం పట్టాయి. వారం రోజుల వరకు మదనపల్లె మార్కెట్‌లో కిలో రూ.25 నుంచి నాణ్యమైన టమాట అత్యధికంగా కిలో రూ.46 వరకు పలికింది. ఆదివారం కిలో రూ.20 నుంచి నాణ్యమైన సరకు కిలో రూ.38కి మించి పలకలేదు. మార్కెట్‌కు మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి రైతులు 133 టన్నుల సరకు తీసుకొచ్చారు. ఈ మేరకు ఏ-గ్రేడ్ కిలో రూ.30 నుంచి రూ.38 వరకు, బి-గ్రేడ్ కిలో రూ.20 నుంచి రూ.29 వరకు సగటున కిలో రూ.27 నుంచి రూ.35తో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక్కడి నుంచి తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు నగరాలకు ఎగుమతి అవుతున్నాయి.

జ్ఞాపకాల మదిలో...

జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ

తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత ..

అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట

మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.

ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని

భావాలను అక్షర రూపంలో

నివేదించడం తప్ప

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

స్మృతి, వర్ధంతి, జయంతి ప్రకటనల వివరాలకు

ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.

కడప : 99899 97626

మదనపల్లి : 80080 01768

(c) eenadu

ఎంపీ రమేష్‌కు కేంద్ర సహాయ మంత్రి పరామర్శ

ఎంపీ రమేష్ తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వన్, ఎంపీలు

ఎర్రగుంట్ల: రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సభ్యులను కేంద్ర సహాయ మంత్రి, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు పరామర్శించారు. ఎంపీ రమేష్ తల్లి రత్నమ్మ ఇటీవల తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చేరుకుని చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తమిళనాడు రాష్ట్ర చేనేత టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఆర్.గాంధీ, ఎంపీలు పుట్టా మహేష్ యాదవ్, లావు శ్రీకృష్ణదేవరాయులు, సుప్రియాసులే, నిషికాంత్‌దూబె శ్రీకాంత్ షిండే, భోలాసింగ్, సంజయ్‌జైశ్వాల్, నీరజ్‌శేఖర్, మాజీ మంత్రి సంజయ్ బాల్యన్, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, ఎంపీ రమేష్‌ను పరామర్శించారు.

టెన్నికాయిట్ విజేత పీలేరు గురుకులం

విజేతలుగా నిలిచిన అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు మండలం చిత్తూరు మార్గంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు టెన్నికాయిట్ పోటీలో మొదటి స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ బేబి కరుణ ఆదివారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్‌లోని జీవీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో టెన్నికాయిట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 9 జిల్లాల విద్యార్థినులు పాల్గొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారని ఆమె పేర్కొన్నారు. పీడీ పుష్పలత, విద్యార్థినులను అభినందించారు.

ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర కార్యవర్గం ఎంపిక

నెల్లూరు (విద్య) : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు ఆదివారం నిర్వహించారు. శ్రామిక మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి మాట్లాడుతూ వేతన కమిటీని వెంటనే వేయాలని కోరారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకంపై సిబ్బంది, తమ సంఘాలతో చర్చించాలని కోరారు. రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. జిల్లా కోకన్వీనర్ సీతాలక్ష్మి, ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు జిలానీబాషా, అధ్యక్షులు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, కృష్ణారావు, శివకుమారి పాల్గొన్నారు.

చలికాలం.. చిన్నారులు భద్రం

ఈనాడు తోడు

● 'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ వంశీధర్

సందేహాలు నివృత్తి చేస్తున్న వైద్యాధికారులు

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: చలికాలంలో చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కడప సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల విభాగం వైద్యుడు డాక్టర్ వంశీధర్ సూచించారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోన్ ఇన్‌లో అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి వచ్చిన వచ్చిన సందేహాలకు ఆయన మరిన్ని సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో రిమ్స్ చిన్నపిల్లల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రెహమాన్, సీనియర్ రెసిడెంట్ సుప్రజ, పీజీ వైద్యులు సుమతి, భవ్యలు పాల్గొన్నారు.

?: మా చెల్లెలు కుమారుడి వయసు ఏడాదిన్నర. వారం రోజులుగా జ్వరం వస్తోంది. మందులు వాడుతున్నా తగ్గుతూ మళ్లీ వస్తోంది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? **- విజయకుమారి, రాయచోటి**

✓: ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో జలుబు, దగ్గు, జ్వరం సాధారణం వస్తుంటాయి. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉండటం అవసరం. వారం రోజులుగా జ్వరం తగ్గలేదంటే తప్పకుండా వైద్యులను సంప్రదించి రక్త పరీక్షలు చేయించాలి. వచ్చిన ఫలితాల ఆధారంగా మందులు వాడాలి.

?: మా కుమారుడి వయసు ఏడేళ్లు. పోషకాహారం అందిస్తున్నా బరువు పెరగడం లేదు. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. బరువు మాత్రం పెరగడం లేదు. బరువు పెరగాలంటే ఏం చేయాలి.? **- జానకి, సుండుపల్లి**

✓: చిరు తిండ్లకు అలవాటు చేయకూడదు. అటువంటి వాటికి దూరంగా ఉంచాలి. చిన్నారుల వయస్సుతో పాటు బరువు కూడా పెరగాలి. రోజువారీ ఆహారంలో గుడ్లు, పాలు, పండ్లు, ఆకు కూరలు, చిక్కీలు, సున్నుండలు ఇస్తూ ఉండాలి. అప్పటికీ బరువు పెరగపోతే రిమ్స్‌కు వస్తే పరీక్షించి చూస్తాం.

?: మా బాబు వయస్సు ఎనిమిది సంవత్సరాలు. పది రోజులుగా దగ్గుతూ ఆయాస పడుతున్నాడు. సమస్య ఏమై ఉంటుంది? **- రమణ, పీలేరు**

✓: వాతావరణంలో వచ్చిన మార్పులతో పిల్లల్లో జలుబు ఎక్కువగా ఉంది. దానికి తోడు చాలా మంది చిన్నారులు ఫ్రిడ్జ్‌లోని చల్లని నీటిని, జ్యూస్‌లు తాగుతుంటారు. దీంతో జలుబు, దగ్గు మరింత అధికమవుతుంది. తద్వారా ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరుతుంది. దాని కారణంగా ఆయాసం వస్తుండవచ్చు. ఎక్స్‌రే తీయించి చూసి నెమ్ము ఉంటే మందులు వాడితే సరిపోతుంది. ఇంట్లో పిల్లలు ఏం తింటున్నారు.. తాగుతున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి.

?: మా పాపకు పదేళ్ల వయసు. హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. వాతావరణం చల్లబడితే జలుబు, దగ్గు వచ్చేస్తున్నాయి. వేడి నీళ్లతో స్నానం చేయించాన జలుబు చేస్తోంది. వైద్యులను సంప్రదిస్తే అలర్జీతో అలా వస్తుంది అంటున్నారు. మా పాప ఇబ్బంది పడుతూ ఉంది.? **- గాయత్రి, రాజంపేట**

✓: పాపకు ఏరకమైన అలర్జీనో తెలుసుకోవాలి. ముఖ్యంగా వాతావరణం చల్లబడినప్పుడు వేడి నీటినే తాగమని చెప్పండి. దుమ్ము వ్యాప్తి చెందే ప్రాంతంలో ఆటలాడేటప్పుడు మాస్క్ ధరించాలి.

?: మా పాపకు తొమ్మిదేళ్లు. పది రోజుల కిందట జ్వరం వచ్చి తగ్గింది. అప్పటి నుంచి పొట్ట మీద చిన్నపాటి దద్దుర్లు, గుళ్లలు వస్తున్నాయి. ఆందోళనగా ఉంది. ఏం చేయాలి? **- సరోజ, ఒంటిమిట్ట**

✓: ఏ తరహా జ్వరమొచ్చింది.. ఏం మందులు వాడారో చూడాలి. పొట్టపైన ఎలాంటి ర్యాసెస్ ఉన్నాయో పరిశీలించాలి. రిమ్స్ ఆసుపత్రికి రండి. పరీక్షించి అవసరమైన మందులు ఇస్తాం.

?: మా బాబుకు ఏడేళ్లు. అన్నం తినిపిస్తుంటే కడుపు నొప్పిగా ఉంటుందని ఏడుస్తున్నాడు. మెడికల్ స్టోర్ నుంచి మందులు తెప్పించి వేస్తున్నా తగ్గడం లేదు.? **- వెంకటసుబ్బయ్య, మైదుకూరు**

✓: చిన్నారులకు అనారోగ్య సమస్యలొచ్చినా సొంత వైద్యం చేయకూడదు. వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకే మందులు వాడాలి. మెడికల్ దుకాణాల్లో మందులు ఇష్టారీతిన తెచ్చి వాడకూడదు. పాఠశాలకు వెళ్లే చిన్నారులకు చిరుతిండ్ల వల్లే ఎక్కువగా కడుపునొప్పి వస్తూ ఉంటుంది. వాటిని మానిపించి కొన్ని రోజులు ఇంటి ఆహారమే అందించండి. తగ్గకపోతే రిమ్స్‌కు వస్తే అల్ట్రాసౌండ్ స్కాన్ చేసి చూస్తాం.

?: మా పాపకు రెండేళ్లు. వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతోంది. బయట ప్రైవేట్‌లో వైద్యులకు చూపించాం. కొన్ని మందులు రాసిచ్చారు వాడుతున్నాం. అయినా తగ్గడం లేదు. ఒంటిపై ఎర్రటి దద్దుర్లు కూడా వచ్చాయి. ఏం చేయాలి? **- సుధారాణి, రైల్వేస్టేషన్ అపార్ట్‌మెంట్, కడప**

✓: మూడు రోజుల కంటే మించి జ్వరం వస్తూనే ఉంటే తప్పక రక్త పరీక్షలు చేయించాలి. మందులు వేస్తున్నాం కదా పోతుందిలే అని నిర్లక్ష్యం చేయకూడదు. చిన్న పిల్లలకు వైద్యం అందించేందుకు రిమ్స్‌లో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు, వసతులు ఉన్నాయి. సద్వినియోగం చేసుకోండి.

విగ్రహాలకు తుప్పు.. ఉత్సవాలు నిలిపివేత

పంచలోహ విగ్రహాలు

ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : పెద్దతిప్ప సముద్రంలోని సంత బజారులో గ్రామస్థుల పురాతన రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. ఆలయంలో ఉన్న మూల విరాట్‌తో పాటు వివిధ ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. గ్రామస్థులందరూ చందాలు వేసుకుని తితిదే అధికారులను 2023లో సంప్రదించారు. 25 శాతం నగదు చెల్లిస్తే 75 శాతం తితిదే నిధులతో పంచలోహ విగ్రహాలు ఇస్తారని తెలియడంతో రూ.47 వేలు చెల్లించారు. 2023 మార్చి నెలలో సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి వారి పంచలోహ విగ్రహాలను తితిదే అధికారులు అందించారు. దేవస్థానంలో విగ్రహాలు భద్రపరిచారు. డిసెంబరు 7న ఆదివారం రాముల వారి ఆలయ పునర్నిర్మాణ సందర్భంగా కల్యాణోత్సవంతో పాటు వివిధ పూజలు, అన్నదానం నిర్వహించడానికి భారీ ఎత్తున ప్రచారం నిర్వహించారు. శనివారం ఉత్సవ విగ్రహాలను తెరిచి చూడగా అవి తుప్పు పట్టడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తుప్పుపట్టిన విగ్రహాలకు పూజలు చేయడం అపశకునంగా భావించి కల్యాణోత్సవం నిలిపివేశారు. పూజలు అందుకోక ముందే ఇలా చోటు చేసుకుంది.

ఆశ్రమానికి హీటర్ల వితరణ

నిర్వాహకులకు వాటర్ హీటర్లు అందిస్తున్న బ్యాంక్ అధికారులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: యల్లాయపల్లె చిన్నయ రత్నం ఆశ్రమానికి ఆదివారం ముక్కావారిపల్లె కెనరా బ్యాంక్ అధికారులు రూ.2 లక్షల విలువ చేసే మూడు వాటర్ హీటర్లను వితరణ చేశారు. బ్యాంకు మేనేజర్ ఎం.ప్రసాద్ మాట్లాడుతూ... సీఎస్ఆర్ ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడడం తమ బాధ్యత అన్నారు. ఆశ్రమ నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి, శ్రేయానంద మాతాజీ, జయకృష్ణ పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని నిరసన

నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ జేఏసీ చేస్తున్న ఆందోళన, నిరసన కార్యక్రమాలకు వివిధ వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. రాజంపేట ప్రభుత్వ క్రీడా మైదానంలో ఆదివారం ఆటలకు వచ్చిన క్రీడాకారులు, ప్రజలు జేఏసీకి మద్దతుగా నిలిచారు. రాజంపేట రైల్వేస్టేషన్ మార్గంలోని చర్చిలో క్రైస్తవులు జేఏసీకి మద్దతుగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని నిరసన చేశారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ వైకాపా నేత మల్లి రవి చేపట్టిన రిలే దీక్ష ఆదివారానికి రెండో రోజుకి చేరుకుంది.

బాధితులకు సత్వర న్యాయమందించండి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : బాధితులకు సత్వర న్యాయం అందించే దిశగా న్యాయమూర్తులు అడుగులు వేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. న్యాయవాద వృత్తిలో సుదీర్ఘ కాలంగా సేవలందించి ఇటీవల మృతి చెందిన ఎస్.కృష్ణారెడ్డి, ఎల్.తులసిరెడ్డి చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రొద్దుటూరు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి న్యాయవాది అన్నపూర్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. జిల్లా జడ్జి యామిని, న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాది మెట్టుపల్లి సుధాకర్‌రెడ్డి, ఎన్టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

కీడెంచి.. ప్రమాదమని బావించి

పీలేరు - గోరంట్లపల్లె మార్గం ఎర్రవాండ్లపల్లె వద్ద రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి రక్షణ గోడ కూలడంతో మిగిలిన కొద్దిపాటి తారు రోడ్డులో బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో గత రెండు నెలలుగా ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసుల రాకపోకలను రద్దు చేశారు. రెండు నెలల కిందట వర్షాలకు రోడ్డు పక్కన బావికి ఉన్న రక్షణ గోడ కూలిపోయింది. ఉన్న కొద్ది పాటి తారు రోడ్డు కుంగింది. దీంతో ఈ మార్గంలో వాహనాలు వెళ్లడం లేదు. ఈ మార్గంలో 10 కిలోమీటర్ల దూరం 15 పల్లెలున్నాయి. ఆయా పల్లెల ప్రజలంతా బస్సు రద్దవ్వడంతో ఆటోల్లో వెళ్తున్నారు. రాత్రి పూట కనీసం ద్విచక్ర వాహనాలు కూడా ఈ మార్గంలో వెళ్లడం లేదు. తారు రోడ్డు దెబ్బతిన్నందున బస్సులు రద్దు చేశామని పీలేరు బస్టాండు మేనేజరు బాబు నాయక్ తెలిపారు. రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరైన తరవాత పనులు చేస్తామని ఆర్అండ్‌బీ డీఈ సురేశ్ నాయక్ తెలిపారు. **- న్యూస్‌టుడే, పీలేరు**

ఆయకట్టు చెరువైంది.. అడ్డుకట్ట కరవైంది

● కన్నీటిపర్యంతమవుతున్న రైతులు

చెరువులా మారిన బి.కొత్తకోట మండలం దేగానిచెరువు ఆయకట్టుభూములు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలం దేగానిచెరువు నిండి మొరవ పారుతున్నా.. ఆయకట్టు భూముల్లో పంటలను సాగు చేసుకునే పరిస్థితి లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షపు నీటితో నిండిపోయిన ఆయకట్టు భూములు చెరువును తలపిస్తుండటంతో ఏమి చేయాలో తెలియక కన్నీటిపర్యంతమవుతున్నారు. హంద్రీ - నీవా ప్రాజెక్టులో భాగమైన పుంగనూరు ఉప కాలువ నిర్మాణంలో ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయ లోపం శాపంగా మారి రైతులు నష్టపోతున్నారు.

ముంపులో పంట పొలాలు

బి.కొత్తకోట శివారులో ఉన్న దేగానిచెరువు కింద ఆయకట్టు 90 ఎకరాలు ఉంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు నిండిపోయి గత నెల రోజులుగా మొరవ పారుతోంది. ఈ చెరువు ఆయకట్టు మధ్యలో నుంచి హంద్రీ - నీవా కాలువ తవ్వగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి వస్తున్న కృష్ణా జలాలు బి.కొత్తకోట నుంచి మదనపల్లె వైపునకు వెళ్తున్నాయి. ఈ కాలువ నిర్మాణం వల్ల చెరువు తూముల నుంచి పంటలకు సాగునీటిని సరఫరా చేస్తున్న పిల్ల కాలువలు పూడిపోయాయి. చెరువుకు కింది ఎడమ వైపుల్లో మొరవ నీళ్లు దిగువకు వెళ్లడానికి ఉన్న కాలువలు తెగిపోయాయి. మరో వైపు హంద్రీ - నీవా కాలువకు జీవిల సిమెంటు లైనింగ్ పనులను పూర్తి చేశారు. దీంతో మొరవ నీళ్లు దిగువకు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆయకట్టులోకి చేరుతున్నాయి. ఇలా ఇప్పటికే 25 ఎకరాలకు పైగా ఆయకట్టు నీళ్లలో ముంపునకు గురికాగా.. మిగిలిన భూములు బురదమయమయ్యాయి.

దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

ఆయకట్టు భూముల్లో ఉన్న వర్షపునీటిని మళ్లించగలిగితే రైతులు పంటలను సాగు చేసుకోవడానికి మార్గం సుగమమవుతుంది. అయితే సిమెంటు లైనింగ్ పనుల కారణంగా కాలువను పగలగొట్టి పైపులను వేస్తే అందులో నుంచి నీళ్లు దిగువ ప్రాంతానికి వెళ్తాయి. గతంలో మట్టి కాలువలు ఉండటంతో ఈ పనులు రైతులు సొంతంగా చేసుకునేవారు. ఇప్పుడు సిమెంటు కాలువలు పగలగొడితే రైతులపై అధికారులు కేసులు పెడుతున్నారు. దీంతో రైతులు అధికారుల సాయం కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. చెరువు కింద పంటలు సాగు చేసుకోవడానికి అనేక ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పనులను ప్రారంభించగా తాము ఆయకట్టు భూముల్లో అడుగు పెట్టలేకపోతున్నామని దేగానిచెరువుకు చెందిన రైతులు వెంకటరెడ్డి, రెడ్డెప్పరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జలవనరులు, హంద్రీ - నీవా అధికారులు ఉమ్మడిగా చెరువును పరిశీలించి చెరువు మొరవనీళ్లు సక్రమంగా దిగువకు వెళ్లేలా చేయగలిగితే పంటలు సాగు చేసుకునేందుకు వీలవుతుందన్నారు. ఈ విషయంపై జలవనరుల శాఖ ఏఈ శ్రీనివాసులు రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ దేగానిచెరువును పరిశీలించి వర్షపు నీటిని మళ్లించడానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆయకట్టు భూములను చూపిస్తున్న రైతులు

రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు

కరపత్రాలు విడుదల చేస్తున్న పౌర హక్కుల సంఘం నాయకులు

రాయచోటి, న్యూస్‌టుడే: 20వ పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి రవిశంకర్ కోరారు. ఆదివారం వారు రాయచోటిలో సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. జనవరి 10, 11 తేదీలలో తిరుపతిలో ఈ మహా సభలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్రంలో దశాబ్దాల నుంచి రాజ్యహింసకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పౌర హక్కుల సంఘం తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తోందన్నారు. అడవులలో ఉన్న ఆదివాసీలను తరిమేసి అక్కడ ఉన్న అపార ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని ప్రజలు వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రెడ్డెయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు వంగిమళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

గండికోటలో పర్యాటకుల సందడి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోట ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి విహార యాత్రకు వచ్చిన విద్యార్థులు, సందర్శకులు గండికోటలో సందడి చేశారు. కోటలోని జుమ్మామసీదు, పెన్నానదిలోయ, మాధవరాయస్వామి దేవాలయం, రంగనాథ స్వామి ఆలయంపై చెక్కిన శిల్పాల అందాలు పర్యాటకులను కట్టిపడేశాయి. కోట అందాలను సెల్‌ఫోన్‌లో బందిస్తూ.. సెల్ఫీలు తీసుకున్నారు. భారీ సంఖ్యలో జనాలు తరలిరావడంతో పార్కింగ్ సౌకర్యం, తాగునీటి వసతి తదితర మౌలిక వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పనులు చేస్తూ కుప్పకూలి మహిళ మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కూలీ పనులు చేస్తూ ఓ మహిళ కుప్పకూలి ప్రాణాలు వదిలేసింది. ఈ ఘటన మదనపల్లెలో ఆదివారం సాయంత్రం జరిగింది. పట్టణంలోని నక్కలదిన్నె తండాకు చెందిన రవినాయక్‌కు భార్య నాగలక్ష్మి (32), నాలుగేళ్ల కుమార్తె లహరి ఉన్నారు. రెండేళ్ల కిందట రవినాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ కోసం నాగలక్ష్మి భవన నిర్మాణ పనులకు వెళ్తోంది. ఆదివారం వెంకటేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో ఓ ఇంటి నిర్మాణం పనికి వెళ్లింది. ఇసుకను రెండో అంతస్తులోకి తీసుకెళ్లి అక్కడే పడిపోయింది. ఎంతసేపటికి ఆమె కిందకు రాకపోవడంతో అక్కడే పనిచేస్తున్న కూలీలు వెళ్లి చూశారు. కిందపడి ఉన్న ఆమెను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. గతంలో తండ్రి, ఇప్పుడు తల్లి చనిపోవడంతో చిన్నారి ఒంటరైంది.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

రాజంపేట గ్రామీణ: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఆదివారం పోలీసులు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బోయనపల్లెకు చెందిన వెంకటసుబ్బయ్య(75) ఈ నెల 5న రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం కడపలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

బహిరంగ వేలం

డిసెంబర్ నెల తేదీ : 10-12-2025, 17-12-2025, 24-12-2025 & 31-12-2025

Vehicle No.	Description	Year
AP03TB3323	MAHINDRA BOLERO MAXI TRUCK	2012
AP03TC9507	AL 1616 IL FBT	2015
AP03TE9697	TATA LPT 3718 CUMMINS FBT	2017
AP16TH0854	BHARAT BENZ 3123 FBT	2015
AP03BE8989	VERNA CRDI SX(O) 1.6 DIESEL 5 SEATER	2012
AP39TN9214	TATA ACE GOLD BS6 PETROL	2020
AP11Y1728	TOYOTA INNOVA-P	2010
AP03BG4161	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP39TM3764	TATA ACE GOLD BS6 DIESEL	2020
AP03TK3036	TATA ACE	2018
AP39TS-3033	EICHER PRO 2114 XP FBT	2020
AP31CA-0999	VERNA (FLUDIC) CRDI EX 1.6 DIESEL 5 SEATER	2012
AP03BK-0477	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP02TB9329	EICHER 11.10 FBT	2014
AP39TV2405	MAHINDRA BOLERO PICK UP 1.7T BS6	2021
AP04TU0221	MAHINDRA 275 DI	2012
AP27CC9713	ETIOS GD DIESEL 5 SEATER	2011
AP26AX5464	TAFE 241	2013
AP39NS8433	ETIOS G PETROL 5 SEATER	2011
AP21CJ4514	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2015
AP02TC0207	TAFE 241	2010
AP39HA1383	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2015
AP05TF0567	TATA LPT 3118 CUMMINS FBT	2016
AP39UA5541	TATA ACE GOLD BS6 DIESEL	2021
AP39UK4025	APE AUTO HT DX BS6 CNG-P	2022
AP39TK7961	JOHN DEERE 5105	2019
AP39TD8022	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2012
AP03BL7779	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP31TP1832	AL U TRUCK 2518 FBT-T	2018
AP39NQ7828	DZIRE TOUR DIESELS SEATER	2014
AP39TS4593	MAHINDRA 475 DI	2011
AP31AW6777	INNOVA EURO 3 2.5 G DIESEL 7 SEATER	2008
AP03TD5452	AL DOST	2016
AP03BK9628	JCB 3DX	2013

గమనిక : పైన తెలిపిన వాహనముల యొక్క రుణగ్రహీత(లు) / హామీదారులు మా యందు ఋణం పొంది వాహనము కొనుగోలుచేసి ఋణము చెల్లించనందువలన పలుమార్లు నోటీసుటీసు పంపడమైనది. కాని ఖాతరు చేయనందువలన పలుమార్లు నోటీసు పంపడమైనది. కాని ఖాతరు చేయనందున పై వాహనములను వేలము ద్వారా విక్రయించి ఋణము రాబట్టుకొనుటకు కంపెనీ నిర్ణయించడమైనది. షరతులు వర్తిస్తాయి.

వేలము జరుగు ప్రదేశం : శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, NH No.205, తూకివాకం గ్రామం, RPR కన్వెన్షన్ సెంటర్ ప్రక్కన, తిరుపతి-517320

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

డి.నెం.19-03-13/కె, 1వ అంతస్తు, హోండ షోరూమ్ దగ్గర, రేణిగుంట రోడ్డు, తిరుపతి - 517501, ఆం.ప్ర. ఫోన్ : 0877-2221287, 90000 80798

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం

విజేత చిత్తూరు జట్టుతో అధికారులు, నిర్వాహకులు

ద్వితీయ స్థానంలో నిలిచిన అన్నమయ్య జట్టు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తూ దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా విద్యార్థులు రాణించాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని రెడ్డివారిపల్లె ఆదర్శపాఠశాల వద్ద షూటింగ్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు అత్యంత ప్రోత్సాహాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారుల కోసం క్రీడా పరికరాలు ఆటస్థలం వంటి సమస్యలు ఉంటే తాను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ప్రిన్సిపల్ అమృతా ప్రియదర్శిని, తెదేపా నాయకులు జునైద్ అక్బరీ, రాజన్న, మునిరత్నం, రెడ్డెప్పరెడ్డి, సుజాత, నాగరాజనాయుడు, శ్రీపతి, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

విజేత చిత్తూరు జట్టు

అస్మిత ఖేలో ఇండియా షూటింగ్‌బాల్ లీగ్ విజేతగా చిత్తూరు-1 జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో అన్నమయ్య జిల్లా అసోసియేషన్ -7, తృతీయ స్థానంలో చిత్తూరు-2 జట్లు నిలిచాయి. విజేతలకు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, పోటీల పరిశీలకుడు పరశురాముడు, దంత వైద్యులు అఫ్సర్ షరీఫ్, ప్రిన్సిపల్ అమృతాప్రియదర్శిని, అన్నమయ్య జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి నాగరాజు, షూటింగ్‌బాల్ జిల్లా కార్యదర్శి గౌతమి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి నరేశ్, మణి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పరిమళాలు.. అష్ట దిగ్గజాలు

ఎస్‌హెచ్‌వీఆర్‌కు జిల్లాలో 8 పాఠశాలల ఎంపిక

మదనపల్లె విద్య, రాజంపేట, న్యూస్‌టుడే : పాఠశాలల్లో స్వచ్ఛత ప్రమాణాలు పాటించేలా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ్ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్)ను అమలు చేస్తోంది. జాతీయ విద్యా విధానం కింద పాఠశాలల్లో నీరు, చేతుల శుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, క్రమ శిక్షణ అంశాల ఆధారంగా పాఠశాలలకు ఆ రేటింగ్ కేటాయిస్తారు. విద్యాశాఖ అధికారులు జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలను పరిశీలించి 2025-26 విద్యా సంవత్సరానికి రేటింగ్ ప్రకటించారు. జిల్లాలో ఉత్తమంగా 8 పాఠశాలలను గుర్తించారు. వాటికి స్టార్ రేటింగ్ ఇవ్వడంతోపాటు రాష్ట్ర స్థాయి నామినేషన్‌కు ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైతే ఆ పాఠశాలలకు జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుంది. ప్రాథమిక పాఠశాలలను కేటగిరి-1గా, ఉన్నత పాఠశాలలను కేటగిరి-2 రేటింగ్ ఇచ్చారు. పాఠశాలల్లో 90 నుంచి 100 శాతం మధ్య పాయింట్లు ఉంటే 5 స్టార్ రేటింగ్, 75 నుంచి 89 మధ్య ఉంటే నాలుగు స్టార్లు, 51 నుంచి 74 మధ్య ఉంటే మూడు స్టార్లు, 35 నుంచి 50 పాయింట్లు ఉంటే రెండు స్టార్లు, 35 కంటే తక్కువ పాయింట్లు ఉంటే ఒక స్టార్ రేటింగ్ ఇస్తారు.

ఎస్‌హెచ్‌వీఆర్ రాష్ట్ర స్థాయి గుర్తింపుకు పంపిన పాఠశాలలు ఇవే..

పాఠశాల	పట్టణం	కేటగిరి
విజయభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్	మదనపల్లె	1 - అర్బన్
జడ్పీ హెచ్ఎస్, మాసాపేట	రాయచోటి	2 - అర్బన్
ఎంపీపీఎస్ బాలంవారిపల్లె	పీలేరు	1 - రూరల్
ఎంపీపీఎస్ బూచిపల్లె	తంబళ్లపల్లె	1 - రూరల్
ఎంపీపీఎస్ కృష్ణంపల్లె	పుల్లంపేట	1 - రూరల్
జడ్పీ హెచ్ఎస్, బసినికొండ	మదనపల్లె	2 - రూరల్
కేజీబీవీ హెచ్ఎస్, రాయచోటి	రాయచోటి	2 - రూరల్
ఎస్‌జేఎస్ఎం జడ్పీ హెచ్ఎస్ బోయనపల్లె	రాజంపేట	2 - రూరల్

పచ్చదనం పరుచుకున్న బసినికొండ జడ్పీ హైస్కూల్, మదనపల్లె

ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలు ఎస్‌హెచ్‌వీఆర్ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉండేలా చూసుకోవాలి. దీనిద్వారా పాఠశాలకు మంచి గుర్తింపు వస్తుంది. జిల్లాలో 8 పాఠశాలలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి నామినేషన్‌కు పంపడం జరిగింది. **- అనురాధ, ఏపీసీ, సమగ్ర శిక్షా, అన్నమయ్య జిల్లా**

రాష్ట్ర స్థాయి అధికారుల పరిశీలన

జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలను రాష్ట్రస్థాయి రేటింగ్‌కు పంపాం. పరిశీలనకు అన్నమయ్య, కడప జిల్లాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పాఠ్యపుస్తకాల ప్రెస్ డైరెక్టర్ మధుసూదన్‌రావు రానున్నారు. ఆయన జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తారు. **- సుబ్రహ్మణ్యం, డీఈవో, అన్నమయ్య**

EENADU Classifieds

MARRIAGE SERVICES

పద్మశాలి 40సం॥ వైధవ్య G.జాబ్, ఫెయిర్, 5' 10'' నిర్దోష్స్ & సిస్టర్స్ సెటిల్డ్ తగిన వరుడు కావలెను. కాంటాక్ట్: 9440339516.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషెంట్స్, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ☎ 89776 39662,89776 39663.

ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు 2 సం॥ అనుభవం కలిగిన వారు కావలెను. ☎ 9989996784.

REAL ESTATE

HOUSE FOR SALE

జిల్లా అమ్మబడును, ఇండిపెండెంట్ ... సంప్రదించండి: 9963451132.

రాయచోటిలోని ప్రముఖ ఫైనాన్స్ సంస్థ నందు పనిచేయుటకు బ్రాంచ్ మేనేజర్ కావలెను. జీతం: 20K to 40K. సంప్రదించండి: 9985178956, 9441560001.

JOBS

We are Hiring Field Debt Recovery Agentsfor Banking Process. Location: Kadapa, Mydukur, Proddatur, Rajampet, Tirupati, Srikalahasti, Palamaner. Salary 15K-22K+ Incentives. 9963959854.

Wanted PRO's for Admissions - Jeevan Jyothi Junior College and Edify Proddatur. Cell: 9440914765, 9908278718.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రకటనకర్తలు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రచురిస్తున్నాం. ప్రకటనలలోని విషయాలకు ఈనాడు బాధ్యత వహించదు. పాఠకులు తగిన జాగ్రత్తలు తీసుకుని స్వయంగా విచారించుకుని నిర్ణయం తీసుకోవాలని మనవి.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 350/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248, PDTR: 8008597620

మదనపల్లె
•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

వరపడు పూజలతో కొండ కిటకిట

గుర్రంకొండ, న్యూస్‌టుడే : గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లెలో వెలిసిన శ్రీరెడ్డెమ్మ దేవతకు ఆదివారం పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు, ప్రత్యేక ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారి పుష్కరిణిలో స్నానాదులు చేసి వరపడు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మ వారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఛైర్మన్ లంకిపల్లె రాజన్న నాయుడు, ఈవో మంజుల, భక్తులకు ఏర్పాట్లు సమకూర్చారు.

రేపటి నుంచి పీలేరులో ధ్యాన జ్ఞాన సప్తాహం

పీలేరు, న్యూస్‌టుడే : పీలేరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ సోమవారం నుంచి ఏడు రోజులపాటు పీలేరు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో 'ధ్యాన జ్ఞాన సప్తాహం' ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రేవూరి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. 8న సోమవారం బెంగళూరు బ్రహ్మర్షి ప్రేమనాథ్, 9న మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి బాషా, 10న బుధవారం పలమనేరు ఏఎన్ బాలజీ, 11న గురువారం తిరుపతి బ్రహ్మర్షి కంచి రఘురాం, 12న శుక్రవారం తిరుపతి మేడసాని మోహన్, 13న శనివారం తిరుపతి ధ్యానరత్న శివప్రసాద్, 14న హైదరాబాద్ నరేంద్ర ముదల్కర్ పాల్గొని ప్రసంగిస్తారని రేవూరి సుధీర్ వివరించారు.

దెబ్బతిన్న కాలువలు.. మురుగుతో తంటాలు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : గుర్రంకొండలో మురుగు కాలువలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల పూర్తిగా ధ్వంసం కాగా మరి కొన్ని చోట్ల నిర్మించలేదు. దీంతో ఎక్కడ పడితే అక్కడ పరిసరాల్లో మురుగు నిలిచి కంపు కొడుతోంది. దోమలకు ఆవాసంగా మారింది. పట్టణంలోని కొత్తపేట, పోలేరమ్మగుడివీధి, నబీకాలనీ, పాత ఇందిరమ్మకాలనీ, కొత్త ఇందిరమ్మకాలనీల్లో మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల, ఎస్సీ వసతి గృహం పక్కన మురుగు కాలువ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శ్రీహరిని వివరణ కోరగా కాలువలు కొన్ని చోట్ల లేనిది వాస్తవం.. నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.. అనుమతులు రాగానే వెంటనే నిర్మాణ పనులు చేపడతామన్నారు. దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేస్తామన్నారు.

గుర్రంకొండలో గంజికాలువ దుస్థితి

ఎత్తు పెరిగిన చెరువు.. తాగునీటికి కరవు

ముంపునకు గురైన పొలాలు

పీలేరు, న్యూస్‌టుడే : చెరువు మొరవ ఎత్తు పెంచడంతో అందులో ఉన్న తాగునీటి బోరు మునిగిపోయింది. తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. పొలాలు కూడా నీటిలో మునగడంతో వ్యవసాయం చేయలేని దుస్థితి నెలకొంది. పీలేరు మండలం మేళ్లచెరువు పంచాయతీ వెంగన్నగారిపల్లె, రెడ్డివారిపల్లె మీదుగా వడ్డెపల్లెకు రూ1.50 కోట్లతో ఏడాది కిందట చెరువుకట్ట మీద తారు రోడ్డు వేశారు. రెండు కిలోమీటర్లమేర రోడ్డు నిర్మాణం చేసేటప్పుడు చెరువు మొరవ ఎత్తు పెంచారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువుకు పుష్కలంగా నీరు చేరింది. దీంతో చెరువులో ఉన్న తాగునీటి బోరు మునిగిపోయింది. కట్ట ఎత్తు ఒక అడుగు పెరిగినందున చెరువు ముందున్న రెడ్డివారిపల్లె, మూలపల్లెకు చెందిన పన్నెండు మంది రైతులకు సంబంధించి 25 ఎకరాల మాగాణి పొలాలు మునిగిపోయాయి. ఫలితంగా చెరువునీరు తగ్గేవరకు వరిసాగు చేసే పరిస్థితి లేకుండా పోయింది. రూ.50 లక్షలు విలువ చేసే వరిపంట సాగు చేయడానికి అవకాశం లేకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరువులో ఉన్న చేతిపంపు కూడా మునిగిపోయి చుట్టు పక్కల ప్రజలకు తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. స్థానికులు నీళ్ల కోసం వెంగన్నగారిపల్లెకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు చర్యలు తీసుకుని మొరవ ఎత్తు కొంత తగ్గిస్తే బోరుతో పాటు, వరి సాగుకు సౌకర్యం ఏర్పడుతుందని ప్రజలు కోరుతున్నారు. సమస్యను 'న్యూస్‌టుడే' పీలేరు ఎంపీడీవో శివశంకరయ్య దృష్టికి తీసుకుపోగా ఇంజినీరు చెరువు పరిశీలన తరువాత తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వెంగన్నగారిపల్లె చెరువులో మునిగిన బోరు (వృత్తంలో)

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574955
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 7989663199

?: మండలంలోని కొత్తిండ్లు పంచాయతీలోని రంగారెడ్డికాలనీ రెడ్డమ్మపిండిమిల్లు మార్గంలో వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రి వేళ రాకపోకలు సాగించేందుకు మహిళలు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. **- యూసూఫ్, రంగారెడ్డికాలనీ**

✓: మరమ్మతులు చేయించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- షర్ఫుద్దీన్, కార్యదర్శి, కొత్తిండ్లు పంచాయతీ, మదనపల్లె**

?: పప్పిరెడ్డిగారిపల్లెలో బెంగళూరు రహదారిపై చెత్తదిబ్బలు పేరుకుపోయి పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. చెత్తతో దోమల ఉద్ధృతి పెరిగింది. **- శ్రీనివాసులు, బెంగళూరు రోడ్డు**

✓: పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **- తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె**

?: పట్టణంలోని పటేల్‌రోడ్డులో దుకాణాలు, ఇళ్ల ఎదుట కాలువ తవ్వేసి నిర్మాణాలు చేపట్టకుండా వదిలేశారు. నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో వృద్ధులు, మహిళలు కాలువలోపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. **- సుధాకర్, పటేల్‌రోడ్డు**

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- ప్రమీల, కమిషనర్, పురపాలక సంఘం, మదనపల్లె**

?: మదనపల్లె పట్టణం సొసైటీకాలనీలోని రామాలయం వీధిలో రహదారిపై అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యగా మారింది. **- మురళి, సొసైటీ కాలనీ**

✓: క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగిస్తాం. **- శ్రావణి, డీఈ, పురపాలక సంఘం, మదనపల్లె**

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

పూర్వ విద్యార్థులు కలిశారు.. మధురస్మృతులతో తడిచారు!

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మండలంలోని వలసపల్లె వద్ద ఉన్న పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం జరిగిన 14వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆకట్టుకుంది. సుమారు 25 ఏళ్ల కిందట విద్యాలయంలో చేరిన విద్యార్థులంతా మళ్లీ ఒక్క చోటికి చేరడంతో ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. తమతోపాటు చదువుకున్న ఎక్కడెక్కడో స్థిరపడిన తోటి వారిని ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమ అనుభవాలను, అనుభూతులను ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో పంచుకున్నారు. గత పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించారు. అలాగే పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 14వ బ్యాచ్ విద్యార్థులంతా కలిసి విద్యాలయంలో రూ.10 లక్షలతో హ్యాండ్‌బాల్ కోర్టు, గది నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పూర్వ విద్యార్థులను ప్రిన్సిపల్ గీతతో పాటు అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జనార్దన్, మోహన్‌బాబు, వినీత్, శివానందరెడ్డి, చంద్రమౌళి, విద్య, దేవేంద్ర, ఉదయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాలలో మాట్లాడుతున్న కొండన్న

నవోదయ విద్యాలయంలో పూర్వవిద్యార్థులు

సామాజిక బాధ్యత అవసరం

మదనపల్లె విద్య : విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కొండన్న అన్నారు. ఆదివారం స్థానిక మిట్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకుల పట్ల గౌరవం, వినయం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. మిట్స్ వీసీ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు వివిధ కంపెనీల్లో అత్యుత్తమ స్థానాల్లో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని ప్రస్తుత విద్యార్థులకు సూచించారు. పూర్వవిద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో ప్రధాన వాణిజ్య కేంద్రమైన ఆర్.ఆర్.వీధిలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటామనని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మదనపల్లె జిల్లాగా చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యేను అభినందిస్తూ మదనపల్లె క్లాత్, రెడీమేడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆర్.ఆర్.వీధిలోని వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లెను జిల్లాగా ప్రకటించడంతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావాలంటే వ్యాపారులు సహకరించాలని కోరారు. అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు టి.గిరి, ఖాదర్‌వల్లీ, ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం ఛైర్మన్ నవీన్‌చౌదరి, ప్రశాంత్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న మదనపల్లె క్లాత్, రెడీమేడ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

కలకడ, న్యూస్‌టుడే : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మండల టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.చంద్రబాబునాయుడు శనివారం రాజధాని అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా మదనపల్లె జిల్లాను, పీలేరు డివిజన్ ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ వీపీసీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం సహారా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరం నిర్వాహకులు సాదిక్, అయ్యప్ప, ప్రసాద్, ఇర్ఫాన్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మదనపల్లెకు చెందిన శ్రీసాయిస్వామి హృదయాలయ ఆసుపత్రి, అగర్వాల్స్ ఐ ఆసుపత్రి, రామాలా మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రి, కేశవి హోమ్ ఫిజియో థెరపీ ఆసుపత్రుల సహకారంతో శిబిరం నిర్వహించారు. గుండె, కంటి, పంటి, అర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రులు వైద్యులు, వైద్య సిబ్బంది, సహారా ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు, జమీల్, ఖలందర్, అష్రఫ్, అయ్యప్ప, జావీద్, మున్నా, ఇమ్రాన్, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుపై రంధ్రం.. కాపాడేనా వస్త్రం

కంభంవారిపల్లి మండలంలోని గర్నిమిట్ట బస్టాండు వద్ద రోడ్డుపై ఒకవైపు కల్వర్టుకు గుంత పడింది. వాహనాలు అలాగే వెళ్తే కల్వర్టు కూలిపోయే ప్రమాదం ఉందని, స్థానికులు గుర్తించి, ఇలా ఒక కమ్మీ నాటి దానికి ఎర్ర వస్త్రం కట్టారు. రాత్రివేళ వాహనదారులు తెలియక ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఈ విషయాన్ని మదనపల్లి ఆర్అండ్‌బీ ఈఈ అరవిందాదేవి దృష్టికి తీసుకెళ్లగా డీఈకి చెప్పి మరమ్మతు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కంభంవారిపల్లి**

అధ్వాన దారిపై ప్రయాణం ఎలా!

కలకడ మండలంలోని ఎర్రకోటపల్లె నుంచి పాపిరెడ్డిగారిపల్లె వరకు ఉన్న దారి అధ్వానంగా తయారైంది. రెండు కిలోమీటర్ల మట్టిదారి గుంతలమయం కావడంతో పాటు వర్షానికి బురదగా మారింది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాపిరెడ్డిగారిపల్లెలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తపాలా కార్యాలయం అన్నీ ఉన్నాయి. మధ్యలో కోటమిట్ట శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, ముష్ఠారమ్మ ఆలయాలు ఉన్నాయి. ఈ దారిలో ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి నానాఅవస్థలు పడుతున్నారు. రోడ్డు అభివృద్ధి చేయాలని గ్రామస్థులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కలకడ**

స్తంభానికి అల్లుకున్న నిర్లక్ష్యం

వాల్మీకిపురంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంతంలోని చర్చి సమీపంలోని విద్యుత్తు స్తంభానికి చెట్ల తీగలు అల్లుకుపోయాయి. స్తంభానికి ఉన్న తీగలకు ముళ్లకంపలు, తీగ చెట్ల కొమ్మలు అల్లుకోవడంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం చోటుచేసుకుంటోంది. విద్యుత్తుశాఖ సిబ్బంది తెలిసినా స్తంభానికి అల్లుకున్న చెట్లను తొలగించడం లేదనే విమర్శలున్నాయి. ఈ విషయాన్ని వాల్మీకిపురం విద్యుత్తు శాఖ ఏఈ రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే నిర్వహణ పనులు చేపట్టి చెట్లను తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, వాల్మీకిపురం**

ప్రహరీ లేక భద్రత కొరవడి

మదనపల్లె మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు భద్రత కరవైంది. కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీ, ఇందిరమ్మకాలనీ, వైఎస్ఆర్ కాలనీలకు చెందిన విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ గదుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో కుక్కల సంచారంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. రాత్రివేళ అల్లరిమూకలకు బడి అడ్డాగా ఉంది. ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

రామసముద్రం, న్యూస్‌టుడే : రామసముద్రంలో ఎస్ఐగా **దిలీప్ కుమార్** నియమితులయ్యారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముదివేడు నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా ఉన్న రమేశ్‌బాబు అన్నమయ్య సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు.

ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నియామకం

మదనపల్లె పట్టణం : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన **బండి ఆనంద్‌**ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా ఆర్ఎస్ఎస్‌లో అనేక బాధ్యలతో పాటు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా, 2019లో భాజపా తరపున మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన తనకు ఆ పదవి అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

వివరాలు తెలుసుకుంటున్న డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అర్హతా పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మదనపల్లె డివిజన్‌కు సంబంధించి పట్టణంలోని ఏడు పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను మదనపల్లె డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఏడు కేంద్రాల్లో 1,462 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,412 మంది హాజరయ్యారు. 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల సందడి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. తుపాను ప్రభావం వల్ల వర్షం కురవడంతో గత 15 రోజులుగా కొండపై రద్దీ తగ్గింది. అయితే ఆదివారం సెలవురోజు కావడంతో కొండపై ఎండ కాసి సాధారణ పరిస్థితులు ఏర్పడటంతో సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చేందుకు ఆసక్తి చూపారు. అటవీ మార్గంలోని గంగోత్రితో పాటు కొండపై ఉన్న మానస సరోవరం, గాలిబండ, కొత్త, పాత వ్యూపాయింట్ల వద్ద రద్దీ అధికంగా కనిపించింది. బెంగళూరుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు కార్లలో, ద్విచక్ర వాహనాల్లో ఉదయం చేరుకుని ప్రకృతి అందాలను వీక్షించి సాయంత్రానికి తిరుగు ప్రయాణమయ్యారు. అతిథిగృహాల్లోని గదుల్లో బస చేసిన పర్యాటకులు శనివారం మధ్యాహ్నం వచ్చి ఆదివారం సాయంత్రానికి వెళ్లారు. వాతావరణం అనుకూలిస్తే రద్దీ ఈ నెలాఖరుకు పుంజుకుంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

వ్యూ పాయింట్ నుంచి ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే బుద్ధిచెబుతాం

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : వాస్తవాలు తెలుసుకోకుండా అసత్యపు వార్తలు రాసే పత్రికలకు మనుగడ ఉండబోదని తెదేపా మండల అధ్యక్షుడు పుర్రా వెంకటరమణ, రాజంపేట పార్లమెంటరీ మీడియా అధికార ప్రతినిధి రాజన్న, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుజాత అన్నారు. ఆదివారం నిమ్మనపల్లెలో తెదేపా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరాధారమైన వార్తలు రాస్తే పరువు నష్టం దావా వేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీసే వార్తలు ప్రచురించే వారికి తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు లక్ష్మన్న, మల్లప్ప, ఖాసీం, ప్రసాద్, నరేంద్ర, శేషు, జయన్న, శంకర, చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిమ్మనపల్లెలో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడిన ఘటన గుర్రంకొండ మండలంలో ఆదివారం జరిగింది. పెద్దమండ్యం మండలం అంగజాలవారిపల్లెకు చెందిన చలపతి (48), మల్లికార్జున (40) సొంత పనిపై గుర్రంకొండకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా టమాటా మార్కెట్ వద్ద బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న వారిద్దరూ గాయపడ్డారు. వారిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని గుర్రంకొండ పోలీసులకు తెలియజేశారు.

ఆరుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె వద్ద కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్.ఐ. విష్ణునారాయణ ఆదివారం తెలిపారు. ఒక నాటుకోడి నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు చరవాణులతో సహా వారివద్ద నుంచి రూ.35,420 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్యం తాగి వాహనం నడపొద్దు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనాలు నడిపిన డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని బి.కొత్తకోట సీఐ గోపాల్ రెడ్డి హెచ్చరికలు చేశారు. ఆదివారం బి.కొత్తకోటలోని దిగువ బస్టాండులో వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాన్ని నడుపుతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : పరిసరాల శుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి అన్నారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెలో జాతీయ సేవా పథకం శిబిరంలో భాగంగా రెండో రోజైన ఆదివారం విద్యార్థినులు గ్రామంలోని సచివాలయం, ప్రభుత్వ పాఠశాలల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు. అలాగే ఇంటింటికి వెళ్లి జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి సేగు రెడ్డెప్పరెడ్డి, అధ్యాపకులు సతీశ్‌రెడ్డి, పంచాయతీ ఇన్‌ఛార్జి రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు

అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు

పీలేరు, న్యూస్‌టుడే : పీలేరు నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న తొమ్మిది అంగవాడీ కేంద్రాల నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరైనట్లు పీలేరు ఐసీడీఎస్ క్లస్టర్ అధికారి రాజమ్మ తెలిపారు. గుర్రంకొండ మండలంలో కొత్తపేట, కృష్ణాపురం, గేరికుంటపల్లెలకు రూ.10 లక్షల వంతున, కలకడలో బంగారువాండ్లపల్లె, కొత్తపల్లెకు రూ.13 లక్షల వంతున, కలికిరిలో జంగంపల్లె దళితవాడకు రూ.8 లక్షలు, కొర్నమిట్టపల్లెకు రూ.13 లక్షలు, పీలేరులో కంభమిట్టపల్లెకు రూ.5 లక్షలు, వాల్మీకిపురంలో చింతలవారిపల్లెకు రూ.8 లక్షలు మంజూరైనట్లు రాజమ్మ వివరించారు.

హిందూ సమ్మేళనం విజయవంతానికి పిలుపు

పీలేరులో కరపత్రాలను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

పీలేరు, న్యూస్‌టుడే : ఈ నెల 14న పీలేరు ఆర్టీసీ ప్రాంగణంలో వారపుసంత పక్కన ఉదయం 10 గంటలకు జరగనున్న హిందూ సమ్మేళనంతో ప్రతిహిందువు పాల్గొని విజయవంతం చేయాలని పీలేరు హిందూ సమ్మేళనం నిర్వాహక సమతి కోరారు. ఆదివారం పట్టణంలో సమితి ఆధ్వర్యంలో ప్రజలు కరపత్రాలను ఇంటింటికి పాదయాత్రగా వెళ్లి ఆహ్వానిస్తూ ర్యాలీ నిర్వహించారు. పీలేరు చిన్మయ మిషన్ పూజ్య స్వామి శ్రీకృష్ణానంద సరస్వతి, తిరుపతి జిల్లా శ్రీనివాసమంగాపురం పీఠాధిపతి శ్రీస్వస్వరూపానందగిరి స్వాములు హిందూ సమ్మేళనంలో పాల్గొని సనాతన హిందూ ధర్మాన్ని గురించి ప్రసంగిస్తారని సమ్మేళనం నిర్వాహక సమితి సభ్యులు వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

వైద్య శిబిరానికి స్పందన

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పుల్లంపేట కసకదుర్గ యూపీ పాఠశాలలో ఆదివారం తిరుపతి నారాయణాద్రి వైద్య బృందం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 180 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

అంటు వ్యాధులపై అప్రమత్తత అవసరం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: కాలానుగుణంగా వచ్చే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. రాజంపేట మండలం ఎన్టీఆర్ కాలనీలో ఈ నెల 5 నుంచి నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వ్యాధులు... వాటి ప్రభావం... తీసుకోవాల్సిన నివారణ చర్యలను ప్రజలకు వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గడిచిన అనుభవాలు, జ్ఞాపకాలు ఎంతో సంతృప్తిని సంతోషాన్ని కల్పించాయని పదో తరగతి పూర్వ విద్యార్థుల బృందం నిర్వాహకులు కుమార్‌రెడ్డి, ఉషా, శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్‌కే కళ్యాణ మండపంలో గాలివీడు జడ్పీ ఉన్నత పాఠశాల 1982-83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 42 ఏళ్ల నాటి అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన వారికి నివాళులర్పించారు. పాఠశాల విశ్రాంత గురువు నరసింహారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వి.రాజశేఖర్‌రెడ్డి, పెద్దప్ప, వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, గాలివీడు

దివ్యాంగులు ఏకమైతేనే హక్కుల సాకారం

పుల్లంపేట, న్యూస్‌టుడే: దివ్యాంగుల సంపూర్ణ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని మండల దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్బీవీడీ సభా జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కోసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఇచ్చిన ప్రకటనపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి రాజంపేట, పెనగలూరు, చిట్వేలి, కోడూరు, ఓబులవారిపల్లె మండలాల నుంచి దివ్యాంగుల నాయకులు హాజరయ్యారు.

కేకు కోస్తున్న దివ్యాంగులు

ఆటోలా.. పుష్పక విమానాలా!

పరిమితికి మించి విద్యార్థుల తరలింపు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పాఠశాల ఆటోలు పుష్పక విమానాలను తలపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆటోవాలాలు పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. బస్సు సౌకర్యం అందుబాటులో లేకో, తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలలకు తీసుకెళ్లేందుకు కుదరకనో గత్యంతరం లేని పరిస్థితులల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

● జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు అధికంగా ఉన్న ప్రాంతం రాయచోటి. సుమారు 100కు పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో చాలా వాటికి రవాణ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఆటోలల్లో పాఠశాలలకు పంపిస్తున్నారు. సాధారణంగా ఒక ఆటోలో నలుగురు విద్యార్థులకు మించి తీసుకెళ్లకూడదు. అయితే ఆటోవాలాలు డబ్బుకు ఆశపడి ఒక్కో ఆటోలో సుమారు 12 నుంచి 15 మంది వరకు తీసుకెళ్తున్నారు. డ్రైవరు సీట్లో ఇరువైపుల మగ్గురు, నలుగురు విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. అంతేగాక ఆటోకు ఇరువైపుల ఉన్న కడ్డీలపై కూడ విద్యార్థులను ప్రమాదకరంగా కూర్చోబెట్టి పరిమితికి మించి తీసుకెళ్తున్నారు. ఆటో టాప్‌పై వేసిన విద్యార్థుల బ్యాగులను కూడ విద్యార్థులే ఎక్కి తీసుకోవాల్సిన దుస్థితి. ఇంత జరుగుతున్నా రవాణ శాఖ అధికారులుగాని, పోలీసులుగాని పట్టించుకోవడం లేదు. కొందరు ఆటోడ్రైవర్లు లైసెన్సులు లేకుండానే వాహనాలను నడుపుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పాఠశాలల ఆటోలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విదార్థులు

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

● ఎట్టి పరిస్థితుల్లోను డ్రైవరు పక్కన ఎవరినీ కూర్చోబెట్టరాదు. ఆ విధంగా ప్రయాణించడం ప్రమాదం. ● డ్రైవర్‌కు లైసెన్సు, ఆటోకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. ● పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే వాహన వివరాలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో నమోదు చేయాలి. పోలీసులు ప్రత్యేకంగా గుర్తింపు సంఖ్యను ఇస్తారు. ● పిల్లల్ని పాఠశాలలకు తీసుకెళ్లే వాహనంపై స్కూల్ ఆటో అని రాయాలి.

అధికారులు ఏం చేస్తున్నారు

● చాలా మంది ఆటోవాలాలు 10 నుంచి 15 మంది వరకు పిల్లల్ని వాహనంలో కుక్కుతున్నారు. చివరకు డ్రైవరు సీటులో కూడా రెండు వైపుల విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ● పుస్తకాల బ్యాగులు, క్యారియర్లను వాహనాలకు ఇరువైపుల తగిలిస్తుడటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ● ఆటోవాలాలు ఎవరూ నిబంధనలు పాటించడం లేదు. ● ట్రాఫిక్ పోలీసులు, రవాణ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నాయకులు

రాజంపేట గ్రామీణ, (పెనగలూరు) న్యూస్‌టుడే: పెనగలూరు మండల వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం కూటమి నేతలు పంపిణీ చేశారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, తెదేపా నాయకులు ముఖ్య వలంటీర్లు మాట్లాడుతూ... ప్రభుత్వం మంజూరు చేసిన నగదును వారి కుటుంబ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. సీఎం నిధి పేదల పాలిట పెన్నిధని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రూ.15.58 లక్షల విలువగల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. కూటమి నేతలు సుదర్శన్ చౌదరి, దాము, పెనగలూరు మండల పార్టీ కార్యదర్శి కొంచంద్ర, శ్రీరామ సుబ్బయ్య, న్యాయవాది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే అభివృద్ధి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఏపీఎంఐడీసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, ఏపీ అటవీశాఖ డైరెక్టర్ రెడ్డెయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కస్సూరారం జగారిపల్లె, చౌటపల్లె గ్రామాల్లో ఆదివారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి దిశలో నడిపిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ డీసీసీబీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంతెన.. పనులు నత్తనడకన

మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిత్యం రైళ్ల రాకపోకలతో ఇక్కడ రైల్వేగేట్ తెరిచి ఉంచే సమయం కంటే మూసివేసే సమయమే అధికంగా ఉంటోంది. అక్కడ నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఆ మార్గం అంతా నీటి కుంటను తలపిస్తోంది. మూడేళ్ల క్రితం రూ.14 కోట్లు మంజూరైన ఇంకా పనులు పూర్తికాపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

వానొస్తే.. సఛీవాలయం

పెనగలూరు మండల వ్యాప్తంగా గత వారం రోజులుగా తుపాను కారణంగా వర్షాలు కురవడంతో గ్రామాలన్నీ బురదమయంగా మారాయి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వర్షపు నీరు నిలిచి అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిద్దవరం గ్రామ సచివాలయం ఆవరణలో బురద, మురుగునీరు నిండిపోయింది. ప్రజలు గ్రామ సచివాలయానికి రావాలంటే బురదలో నడవాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి సచివాలయ ఆవరణలో బురద లేకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

రహదారిలా.. ప్రయాణమెలా!

ఈ చిత్రంలో చూస్తున్న దారి రాయచోటి మండలం బొట్ల చెరువు నుంచి మల్లువాండ్లపల్లెకు వెళ్లే మార్గం. ఈ మార్గంలో సుమారు మూడు కిలోమీటర్ల మేర రాళ్లు తేలి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

రూ. లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు

మండలంలోని సూర్యనారాయణపురంలో ఉన్న గ్రామ ఆరోగ్య కేంద్రం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. భవన నిర్మాణ పనులు పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఆరోగ్య సిబ్బంది సచివాలయంలోనే కార్యకలాపాలు సాగిస్తున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రామాపురం

వదలని ప్లాస్టిక్.. కదలని మురుగు

ప్లాస్టిక్ వ్యర్థాలు పురపాలక రోడ్లనే కాకుండా సాగు, తాగు నీటి వనరులను కూడా కలుషితం చేస్తున్నాయి. పట్టణానికి సమీపంలో ఉన్న బోయనపల్లె గ్రామం వద్ద ఉన్న పంట కాలువలో చెత్తను వేయడంతో కాలువంతా వ్యర్థాలతో నిండుకుంది. ఈ కాలువ ద్వారా పోలి గ్రామంలోని వ్యవసాయ పొలాలకు సాగు నీరు చేరుతుంది. ఈ నీటితో పాటు పొలాల్లోకి ఈ వ్యర్థాలు కూడా చేరుతాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

ఐకమత్యంతోనే సమాజంలో గుర్తింపు

సమావేశంలో పాల్గొన్న నాయకులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: పద్మశాలీలంతా కలిసి ఉంటే సమాజంలో గుర్తింపు వస్తుందని అఖిల భారత పద్మశాలీ సంఘం జనరల్ సెక్రటరీ శ్రీరాములు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌బీవీడీ సభా సంస్థల ప్రాంగణంలో మండలంలోని పద్మశాలీలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 9న రాజంపేటలో నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సీఎం చంద్రబాబును సత్కరిస్తున్న లక్ష్మీనారాయణ

రాజంపేట, న్యూస్‌టుడే: మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో రాజంపేటకు చెందిన తెదేపా జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ శనివారం రాత్రి సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును ఆయన సత్కరించారు. అనంతరం జిల్లాలోని పలు సమస్యలను ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. పార్టీ బలోపేతానిక కృషి చేయాలని సీఎం సూచించినట్లు ఆయన వివరించారు.

విద్యుత్తు తీగలతో ప్రాణ సంకటం

జాంబవంతుని ఆలయం వద్ద ఇలా..

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. అనేక ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభం దెబ్బతినడం, ఎన్నో ఏళ్ల క్రితం నుంచి వైర్లను మార్చకపోవడంతో అవి సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. పట్టణంలోని చిట్వేలి రోడ్డులో ఉన్న శ్రీనివాసనగర్‌లో శనివారం హైటెన్షన్ విద్యుత్తు తీగ స్తంభం నుంచి తెగిపడింది. అది గమనించని ఓ వరాహం విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. స్థానికులు అది చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఒకవేళ ఆ సమయంలో మనుషులు సంచరించి ఉంటే ఏమయ్యేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగిపడిన తీగ ఇప్పటి వరకు మూడు సార్లు తెగిందని, దాన్ని మార్చమని చెప్పినా అధికారులు మళ్లీ మళ్లీ దాన్నే అతికించి ప్రమాదానికి కారణమయ్యారని స్థానికులు చెబుతున్నారు. స్తంభం, తీగలన్నీ పాతబడి పోయాయని అధికారులు స్పందించకపోతే ప్రాణనష్టం జరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● పట్టణంలోని అంకమ్మనగర్ - కొత్తబజారు వీధుల మధ్య జాంబవంతుని ఆలయం ఉంది. ఆలయం ఎదురుగా ఉన్న విద్యుత్తు నియంత్రిక చిన్నపిల్లలకు సైతం చేతికి అందేంత ఎత్తులో ఉంది. ఇక్కడి రోడ్లు ఎత్తు చేయడంతో ఎప్పుడో ఏర్పాటు చేసిన నియంత్రిక ప్రమాదకరంగా మారుతోంది. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా రంగనాయకుల పేట, ధర్మాపురం, జగడంపల్లె తదితర ప్రాంతాలలో విద్యుత్తు స్థంభాలకు ప్రైవేటు కేబుల్ కనెక్షన్లకు సంబంధించిన అనేక వైర్లను చుట్టలు చుట్టి కట్టిపెట్టారు. అవికూడా వర్షాకాలంలో ప్రమాదరకంగా మారుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

సరి చేయిస్తాం

పట్టణంలోని వీధులు, అక్కడ ఏర్పాటు చేసి ఉన్న విద్యుత్తు స్తంభం, తీగలను పరిశీలిస్తాం. ప్రమాదకరంగా ఉన్న వాటిని సరి చేయిస్తాం. విద్యుత్తు నియంత్రికను పరిశీలించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.
- ప్రియదర్శన్‌రెడ్డి, విద్యుత్తు శాఖ డిఈఈ, రైల్వేకోడూరు

వేమన పద్య పోటీల్లో రాజంపేట విద్యార్థి సత్తా

హరినాథ్‌యాదవ్‌తో నిర్వాహకులు

రాజంపేట, న్యూస్‌టుడే: కడప రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వేమన పద్య పోటీల్లో రాజంపేట విద్యార్థి సత్తా చాటారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్న హరినాథ్‌యాదవ్ ఈ పోటీల్లో ప్రతిభ చూపి రెండో దశ పోటీలకు ఎంపికయ్యారని నిర్వాహకులు చెప్పారు.

సేవా లోపంపై చర్యలకు వినతి


మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: విమాన ఛార్జీల పెరుగుదల, సేవల లోపంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలతో దేశంలో విమానయాన రంగం సంక్షోభంలో చిక్కుకుందంటూ విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జగన్‌బాబు, అంజనేయులు, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట మండల పరిధిలోని గారాలమడుగు, అప్పయ్యరాజుపేట, చెర్లోపల్లె, ఖాదర్ పేట, టి.వి ఎన్ ఆర్ పురం, టి.అగ్రహారం గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కుమార్ నాయుడు ఆదివారం తెలిపారు. విద్యుత్తు తీగల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వ్యవసాయానికి ఉదయం 4 గంటల నుంచి 11 వరకు విద్యుత్తు సరఫరా చేస్తామన్నారు. ఈ విషయంపై ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహా రాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
IA No. 280/2018
OS No. 3/2008

డా॥ SMd అబ్దుల్ రజాక్, తండ్రి మహమ్మద్ షాలెహా, 70 సం॥, HOD, ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్, కడప, సాకిన్ డి.నెం. 57/101, బట్టు వీధి, రాయచోటి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా మరియు ఇతరులు - పిటీషనర్లు

V/s

R 59) పఠాన్ ఫైరోజ్ ఖాన్, తండ్రి అమీర్‌ఖాన్, 27 సం॥లు
R 60) పఠాన్ అంజద్ ఖాన్, తండ్రి అమీర్‌ఖాన్, 25 సం॥లు
R 61) పఠాన్ షకీల్ ఖాన్, తండ్రి అమీర్‌ఖాన్, 24 సం॥లు
R 62) పఠాన్ ఇలాహీ ఖాన్, తండ్రి అమీర్‌ఖాన్, 22 సం॥లు.
డి.నెం. 28/5/53, గఫార్ వీధి, రాయచోటి.
- రెస్పాండెంట్లు

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో పిటీషనర్లు, రెస్పాండెంట్లు 59 to 62 ప్రతివాదులు మరియు ఇతర రెస్పాండెంట్లుపైన దావాను Restore చేయమని IA No. 280/2018 రు పిటీషన్ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీరు 15/12/2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఖుద్దున గానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలయును లేనంతట మీ పరోక్షంలో తీర్మానించబడును.

//By order of the court//
ఇట్లు: వి.శ్రీధర్ మూర్తి,
పిటీషనర్లపరం అడ్వకేట్, రాయచోటి
సెల్ : 9642820983.

సమస్యలు విన్నారు.. పరిష్కారం చూపారు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పురపాలక పరిధిలో నెలకొన్న సమస్యలపై 'ఈనాడు' ఆధ్వర్యంలో కమిషనర్ రవితో నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించింది. ప్రజలు తెలిపిన ఫిర్యాదులను కమిషనర్ నమోదు చేసుకున్నారు. సత్వరమే కొన్నింటిని పరిష్కరించారు. మరి కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలకు కమిషనర్ ఇచ్చిన సమాధానాలు ఇవి.

?: పట్టణంలోని సీఐ రోడ్డు మార్గంలో సీసీ నిర్మించలేదు. ఉన్న మట్టిదారులు కూడా వర్షాలు కురుస్తున్న వేళ బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి వీధులు శుభ్రం చేయడం లేదు. - శ్రావణి, ఉపాధ్యాయురాలు

✓: సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. సిబ్బందిని పంపి వీధులు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం.

?: పట్టణంలోని సరస్వతి నగర్‌లో పది రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో వేల రూపాయలు వెచ్చించి నీటి ట్యాంకుల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నాం. అధికారులు స్పందించి నీటి సరఫరాను మెరుగు పరచాలి. అలాగే మురుగు కాలువల్లో పూడిక తొలగించాలి. - హసీనా, స్థానికురాలు

✓: పైపులైన్ మరమ్మతుకు గురవడంతో నీటి సరఫరాలో జాప్యం ఏర్పడింది. ఇకపై సమయానికి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగింపజేస్తాం.


ఫిర్యాదులు వింటున్న కమిషనర్

?: పట్టణంలోని ప్రధాన రహదారులపై ఎటు చూసినా పశువులు సంచరిస్తూ.. వాహనాలకు అడ్డు వస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలకు తరలించాలి. - గౌనిపల్లె శివ, స్థానికుడు

✓: రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులను ఇప్పటికే గుర్తించి వారికి నోటీసులు ఇచ్చాం. స్పందించకపోతే పశువులను గోశాలకు తరలిస్తాం.

?: పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. - కోటకుండ రఘునాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్

✓: వెంటనే మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించి మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

?: పట్టణంలోని డైట్ హాస్టల్, డిష్ రెడ్డెన్న వీధిలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. చిన్నారులను, పెద్దలను గాయపరుస్తున్నాయి. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలి. - భాస్కర్, రమణ, పల్లవి, స్థానికులు

✓: వీధి కుక్కల నివారణకు చర్యలు చేపడుతున్నాం. కుక్కల సంతతి అభివృద్ధి చెందకుండా శస్త్ర చికిత్సలు నిర్వహించేలా ఎన్జీవోతో మాట్లాడుతున్నాం.

సరస్వతి నగర్‌లో కాలువల్లో పూడిక తీస్తున్న సిబ్బంది

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలో పాత బస్టాండు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ధర్మాపురానికి చెందిన ఎం.వెంకటేష్ రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చంద్రగిరి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. అగరాల సమీపంలోని ప్రైవేట్ కళాశాల వద్ద ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... రైల్వేకోడూరు ప్రాంతానికి చెందిన ఆరుగురు అయ్యప్ప భక్తులు శబరిమలలో స్వామివారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవరు రెప్పపాటులో కునుకు తీయడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ తీవ్రంగా గాయపడగా, మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితులను రుయా ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గుముఖం పట్టిన ప్రవాహం

పింఛ(సుండుపల్లి), న్యూస్‌టుడే: వై.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయంలోకి వస్తున్న ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టిందని జలాశయ ఏఈఈ నాగేంద్రనాయక్ తెలిపారు. జలాశయంలోకి వస్తున్న ప్రవాహం ప్రస్తుతం 970 క్యూసెక్కులుగా ఉందని, అదే పరిమాణంలో గేటుద్వారా దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు.

పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి అగ్రహారం గుట్టపై ఉన్న రక్షిత నీటి పథకం, ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలలో ఉన్న పిచ్చిమొక్కలను ఆదివారం తెదేపా నాయకులు తొలగింపజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెదేపా మండల అధ్యక్షుడు చప్పిడి రమేష్‌నాయుడు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ఈనాడు
బాపట్ల
సోమవారం డిసెంబరు 8, 2025

రాకపోకలు అడ్డదిడ్డం.. ప్రమాదాలు నిత్యకృత్యం

అమరావతి-అనంతపురం జాతీయ రహదారి, నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల ఎక్స్‌ప్రెస్ రహదారి కలిసే సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు కూడలిలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ కూడలి మీదుగా రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కూడలి ప్రాంతంలో ఆక్రమణలు, రహదారి విభాగినిల మధ్య రాజకీయ నేతల ఫ్లెక్సీలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 3న కూడలి దాటుతున్న ద్విచక్ర వాహన చోదకుడ్ని అదుపు తప్పి లారీ ఢీ కొట్టింది. గతంలో ఇదే ప్రాంతంలో రహదారి అంచున నిలబడిన చిన్నారిపై తల్లిదండ్రుల కళ్ల ముందు లారీ దూసుకుపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన ఘటన చోటు చేసుకుంది. ట్రాఫిక్ రద్దీ ఉంటున్నా నియంత్రణకు సిబ్బంది లేకపోవడంతో తరచూ సమస్య ఉత్పన్నమవుతోంది. దీనికితోడు వాహనదారులు అడ్డదిడ్డంగా వెళుతుండడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆదివారం సాయంత్రం కూడలిలో ట్రాఫిక్ నిలిచి ఇబ్బందులు ఎదురయ్యాయి.

– న్యూస్‌టుడే, సంతమాగులూరు

రాజధానిలో ఆ బృందం పర్యటన నేడు

తుళ్లూరు: ప్రజా రాజధాని అమరావతిలో సోమవారం ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ప్రతినిధుల బృందం పర్యటించనుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారు పర్యటించి.. రహదారులు, భవన నిర్మాణాలు, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి, ఎల్‌పీఎస్ లేఔట్లు, కాలువలు, రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. పని ప్రదేశంలో కార్మికులకు గుత్తేదారు సంస్థలు కల్పిస్తున్న సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు, రక్షణ, భద్రత చర్యల కోసం పాటిస్తున్న జాగ్రత్తలను పరిశీలించనున్నారు.

తెమ్మంటూ.. తేమంటూ.. దోపిడీ

న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె అర్బన్, వేమూరు

రేపల్లె మండలం మైనేనివారిపాలేనికి చెందిన ఓ రైతు యంత్రంతో ధాన్యం నూర్పిడి చేసి విక్రయించటానికి ఆర్‌ఎస్‌కే వద్దకు వెళ్లాడు. ధాన్యం నమూనాకు సిబ్బంది తేమ పరీక్ష చేయగా 21 శాతంగా వచ్చింది. ఆరబెట్టి 17 శాతానికి రాగానే తెస్తే కొంటామని ఆర్‌ఎస్‌కే సిబ్బంది చెప్పారు. సమీపంలో ఉన్న మిల్లర్ ధాన్యాన్ని కొంటానని చెప్పి ఆ రైతును తన మిల్లు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మళ్లీ పరికరం ద్వారా పరీక్షించి 30 శాతం తేమ ఉన్నట్లు చూపాడు. నిర్దేశితం కంటే 13 శాతం అధికంగా ఉందని చెప్పి బస్తాకు 13 కిలోలు తగ్గించి నగదు ఇస్తానని చెప్పాడు. 13 కిలోల తరుగు కింద బస్తాకు రూ.310 కోత వేశాడు. ధాన్యాన్ని ఆరబెట్టలేని స్థితిలో ఉన్న సదరు రైతు విక్రయించటానికి అంగీకరించాడు. దీంతో ఎకరాకు 32 బస్తాల చొప్పున మొత్తం మూడున్నర ఎకరాలకు తరుగు కింద రూ.34,720 ఆదాయం కోల్పోయాడు.

ఆర్‌ఎస్‌కేలు, మిల్లర్ల వద్ద శాతాల్లో తేడాలు

నిలువునా మోసపోతున్న అన్నదాతలు

➻ వేమూరుకు చెందిన మరో రైతు నాలుగెకరాల్లో వరి సాగు చేయగా ఎకరాకు 32 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. నాలుగు రోజులు ఆరబెట్టినా ఆకాశం మేఘావృతమై ఉండటం, మంచు కురుస్తుండటంతో ధాన్యంలో తేమ శాతం 18 నుంచి 19 మధ్య ఉంది. ఆర్‌ఎస్‌కేలో కొనుగోలు చేయలేదు. మిల్లర్ రంగప్రవేశం చేసి ధాన్యం నమూనాను తన మిల్లుకు రప్పించి తేమ శాతం యంత్రంతో పరీక్షించాడు. అందులో 24 శాతం చూపించింది. ధాన్యం అమ్ముతానని రైతు చెప్పగా బస్తాకు 7 కిలోల తరుగు లెక్కకట్టి కనీస మద్దతు ధర కన్నా రూ.167 తక్కువగా బస్తాకు చెల్లించాడు. రైతు రూ.21,376 నష్టపోయాడు.

ఆరబెట్టిన ధాన్యం

❖ ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో మిల్లర్లు రైతు కష్టాన్ని లాగేసుకుంటున్నారు. బంగాళాఖాతంలో తుపానులు, వాయుగుండాలు, అల్పపీడనాల ప్రభావంతో ఇటీవల ఆకాశంలో మబ్బులు కమ్మి చల్లని వాతావరణం ఉంది. చిరుజల్లులు కురిశాయి. యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యంలో తేమ శాతం కొంచెం ఎక్కువగా ఉంది. ఆర్‌ఎస్‌కేలలో పౌరసరఫరాల సంస్థ ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటే తేమ శాతం 17 లోపు ఉండాలి. దీన్ని ఆసరాగా తీసుకుని బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో కొందరు మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారు.

❖ రైతు సేవా కేంద్రాల్లో తేమశాతం ఒకలా, మిల్లర్ల వద్ద రైస్‌మిల్లుల్లో మరోలా ఉంటోంది. రెండుచోట్ల ఒకే కంపెనీకి చెందిన తేమశాతం కొలిచే పరికరాలు వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించినా అమలు కావటం లేదు. మిల్లర్లు తేమ శాతం ఎక్కువగా ఉందని ధాన్యానికి తక్కువ ధర చెల్లిస్తున్నారు. అన్నదాతల కష్టాన్ని దోచుకుంటున్నారు. దీనిపై పౌరసరఫరాల డీఎం శ్రీలక్ష్మిని సంప్రదించగా రైతులు ఎవరూ తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దన్నారు. ఒకట్రెండురోజులు ఆలస్యమైనా తేమ శాతం 17 వచ్చే వరకు ఆరబెట్టి ఆర్‌ఎస్‌కేలకు తెచ్చి విక్రయించి 'గ్రేడ్-ఎ' ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1792, సాధారణ రకానికి రూ.1772 చొప్పున ఎంఎస్‌పీ పొందాలని సూచించారు. అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్లపై రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

స్క్రబ్ టైఫస్.. తక్షణ వైద్యమే రక్ష

ఈనాడు, అమరావతి

గుంటూరు శివారు గ్రామాన్ని పట్టిపీడించిన మెలియాయిడోసిస్ వేదన మరువక ముందే రాష్ట్రవ్యాప్తంగా మరో వ్యాధి తెరపైకి వచ్చింది. అన్ని జిల్లాల్లోనూ స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కావడంతో ఇబ్బంది ఉలిపాటు మొదలైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 50 మందికి ఈ వ్యాధి సోకగా.. పలువురు ఇప్పటికే కోలుకున్నారు. ఆ సమయంలో గ్రానికి 14 మంది జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. శనివారం ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలు ఇదే వ్యాధితో చనిపోగా, అదే రోజు అర్ధరాత్రి పల్నాడు జిల్లాకు చెందిన మరో మహిళ ప్రాణాలు కోల్పోయారు. ఈమెకు కిడ్నీ సంబంధ సమస్యలూ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక, పల్నాడు జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 11 కేసులు నమోదు కాగా.. ఇద్దరు చనిపోయి, 9 మంది కోలుకున్నారు. బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు 3 కేసులు నమోదు కాగా.. ఇద్దరు చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఇద్దరిలోనూ ఒకరికి ఇతర అనారోగ్య కారణాలు ఉన్నాయన్నది వారి మాటల సారాంశం. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ఉమ్మడి జిల్లాలో కేసులు నమోదు

జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు

ప్రత్యేక బృందాల ఏర్పాటు

అనుమానిత లక్షణాలతో గుంటూరు జీజీహెచ్‌కు వచ్చే వారిని ప్రత్యేకవార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షల కోసం ప్రత్యేక ప్రయోగాలు సిద్ధం చేశారు. వ్యాధి నిర్ధారణ అయినవారికి ఆరోగ్య పరిస్థితులను బట్టి చికిత్స అందిస్తున్నారు. చిరునామాల ఆధారంగా ఆయా ప్రాంతాలకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను పంపించి ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తలతో దూరం

❖ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ❖ ఇంట్లో తడి దుస్తులు చేరనీయకూడదు. ❖ కళ్లు, చేతులు కప్పి ఉండేలా దుస్తులు ధరించాలి. ❖ పంట పొలాల్లో ఏదైనా పురుగు కరిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఆలస్యం చేయొద్దు

స్క్రబ్ టైఫస్ లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే పరీక్షలు చేయిస్తే మేలు. తద్వారా సరైన చికిత్స తీసుకొని కోలుకోవచ్చు. ఆలస్యం చేస్తే అవయవాల వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉంది. -డాక్టర్ అనిల్, జనరల్ మెడిసిన్, గుంటూరు జీజీహెచ్

లక్షణాలు ఇలా..

స్క్రబ్ టైఫస్ అనేది ఒక రకమైన జ్వరం. ఇది మైట్ (నల్లి తరహా పురుగు) కరిచినప్పుడు వస్తుంది. అడవులు, పంట పొలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుంది. పురుగు కరిచిన ప్రదేశంలో చర్మంపై చిన్నపాటి నల్లని పుండు ఏర్పడుతుంది. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, దద్దుర్లు దీని ప్రధాన లక్షణాలు.

వయ్యారి హంస.. బాగుంది వరుస

కొరిశపాడు మండలం అనమనమూరు గ్రామంలోని నర్సరీలో విభిన్నమైన రూపాల్లో పూలకుండీలు ఉన్నాయి. అందులో తెలుపు రంగులో హంస ఆకృతిలో ఉన్న కుండీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వీటిని నిర్వాహకులు వరుస క్రమంలో ఒకదానిపై మరొకటి పేర్చి విక్రయిస్తున్నారు.

– న్యూస్‌టుడే, మేదరమెట్ల

విద్యుత్తు బిల్లు.. గడువు దాటొద్దు

ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), కర్లపాలెం, న్యూస్‌టుడే : ఒక్క నెలే కదా అని విద్యుత్తు బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారా.. అయితే జరిమానా చెల్లించక తప్పదు. ప్రతీ కరెంటు బిల్లుపై గడువు తేదీ ఉంటుంది. రీడింగ్ తీసిన రోజు నుంచి 15 రోజులు లోగా బిల్లు చెల్లించాలని విద్యుత్తు శాఖ అధికారులు సూచిస్తున్నారు. అలా చెల్లించకపోతే బిల్లులపై అదనపు ఛార్జీలు వసూలు చేస్తారు.

❖ గడువులోగా చెల్లించకుంటే కనెక్షన్ కట్టి రూ.25 నుంచి రూ.150 వరకు జరిమానా విధిస్తారు. కేటగిరీల వారీగా తర్వాత బిల్లులో ఆటోమేటిక్‌గా అదనపు నగదు జనరేట్ అవుతుంది. రెండు నెలలైనా బిల్లు చెల్లించకుంటే మరో 15 రోజుల సమయం ఇచ్చి కరెంటు సరఫరా నిలిపివేస్తారు. కనెక్షన్ తొలగింపు సమయంలో కటింగ్ ఛార్జీల కింద రూ.75 వినియోగదారుల నుంచే వసూలు చేస్తారు. దీనిపై పీవీపాలెం విద్యుత్తు శాఖ ఏఈ హుషేన్‌ఖాన్ మాట్లాడుతూ ఏదైనా విద్యుత్తు సమస్య ఉంటే 1912 టోల్‌ఫ్రీ నంబరుకు వినియోగదారులు సంప్రదించవచ్చన్నారు.

బాపట్ల జిల్లాలో గృహ విద్యుత్తు కనెక్షన్లు 4,66,627

వాణిజ్యం	45,660
పరిశ్రమలు	2,422
వ్యవసాయం	43,420
ఆక్వా	2,700

మహా నాట్య నీరాజనం

తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం కూచిపూడి మహా నాట్య ప్రదర్శన నిర్వహించారు. కళాకారిణుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

– న్యూస్‌టుడే, తెనాలి

సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివే విద్యార్థుల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా వందరోజుల ప్రణాళికలో భాగంగా పాఠశాలల్లో ఈనెల ఆరో తేదీ నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఇవి మార్చి 15 వరకు అంటే పరీక్షలు జరిగే కొద్ది రోజుల ముందు వరకు కొనసాగించనున్నారు. సెలవు రోజుల్లో అయినా వీటిని తప్పక నిర్వహించాలనే ఆదేశాలను విద్యాశాఖ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆ సమయంలో ప్రత్యేక తరగతులకు వచ్చే విద్యార్థులు ఇంటి వద్ద నుంచి భోజనం తీసుకుని రాకుండా బడిలోనే ఏర్పాటు చేయాలని మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టరు బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో దీన్ని ఆదివారమే అమలు చేశారు. ప్రత్యేక తరగతుల కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న 239 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసి అందించారు. ఆదివారం, సెలవు రోజుల్లో ప్రత్యేకంగా దీనికోసం మెనూ రూపొందించలేదు. రెండో శనివారం, రెగ్యులర్ శనివారం సాధారణంగా అందజేసే మెనూనే ఆ రోజుల్లో ఇవ్వాలని ఉత్తర్వుల్లో సూచించారు. దీంతో సెలవు రోజుల్లో పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు భోజన వసతి సమకూరడంతో ఇటు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేటపాలెంలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

కంటైనర్‌ను ఆపింది ఏఎస్సై కుమారుడే!

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ : చిలకలూరిపేట బైపాస్‌లో ఈనెల 4న ఘోరప్రమాదం.. ఐదుగురు బీటెక్ విద్యార్థుల మృతి చిక్కుముడి వీడింది. ట్రాక్టర్ల లోడుతో వెళ్తున్న భారీ కంటైనర్‌ను ఓ కారులో వెళ్తున్న వ్యక్తి ఆపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. కంటైనర్‌ను ఆపిన వ్యక్తి నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో పనిచేసే ఏఎస్సై కుమారుడే అని గుర్తించారు. ట్రాక్టర్ల లోడ్ కంటైనర్‌ను పక్కన ఆపాలని కారులోంచి దిగి చేతితో సైగచేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌గా అవతారం ఎత్తి జాతీయ రహదారులు, బైపాస్‌ల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఏఎస్సై కుమారుడి లీలలు బయటకు వస్తున్నాయి. 2023లో తక్కువ ధరకే బంగారం పేరిట కారు, రూ.40 లక్షలతో ఉడాయించాడు. ఇందులో తండ్రి హస్తం కూడా ఉందని అప్పట్లోనే నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఈ కేసు ఎస్పీ వద్ద ఉంది. కుర్రాళ్లతో ఓ గ్యాంగ్ ఏర్పాటు చేసుకుని వారి ద్వారా తన నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నాడు. గంజాయి సరఫరా, విక్రయాలు చేస్తూ కాలేజీ విద్యార్థులను మత్తులోకి దింపుతున్నాడు. వేర్వేరు చోట్ల రిజిస్టర్ అయిన ఖరీదైన కార్లు ఇతని వద్ద అయిదు ఉన్నాయి. ఇవి ఎలా సంపాదించాడు? ఎవరిపేర రిజిస్టర్ అయి ఉన్నాయనేది పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది. పలుకుబడి ఉపయోగించుకుని కొన్నేళ్లుగా నరసరావుపేటలోనే పోస్టింగ్ వేయించుకుంటూ కుమారుడి నేరాలకు తండ్రి సహకరిస్తున్నట్లు పోలీసుశాఖలోనే చర్చ నడుస్తోంది. ఆదివారం చిలకలూరిపేట గ్రామీణ పోలీసులు ఏఎస్సై కుమారుడిని నరసరావుపేట నుంచి తీసుకెళ్లి రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం.

బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌నంటూ అక్రమంగా వసూళ్లు

లొట్టలేసే రుచి..

దుగ్గిరాల: తెలుగింటి పిండి వంటల్లో అరిసెలది ప్రత్యేక స్థానం. సంక్రాంతికి ప్రతి ఇంట్లో అరిసెల ఘుమఘుమలు ఉంటాయి. వీటి తయారీలో వాడే బెల్లానికి దుగ్గిరాల మండలం శృంగారపురం పెట్టిందిపేరు. ఏటా డిసెంబర్ మొదటి వారం నుంచి 40 రోజుల పాటు ఇక్కడ బెల్లం తయారు చేస్తారు. ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకూ ఇది రవాణా అవుతోంది. ఎటువంటి కల్తీ లేని, రసాయన రహిత చెరుకు రసంతో బెల్లం తయారీ ఇక్కడి ప్రత్యేకత.

పురాతన ఆలయం.. పటిష్ఠం

వేమూరు నియోజకవర్గం అమృతలూరు మండలం కూచిపూడిలోని పురాతన శివాలయం నేటికీ చెక్కు చెదరలేదు. రెడ్డిరాజుల పాలనలో గ్రామం మధ్యలో క్రీ.శ 1314లో రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించారు. అంతకు ముందు స్వామివారిని పరశురామ మహర్షిగా ప్రతిష్ఠించారని ప్రతీతి. క్రీ.శ 1578లో రెడ్డి రాజుల ప్రభుత్వాన్ని గద్దె దింపి మల్కి ఇబ్రహీం బాదుషా కొండవీడు దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాటి నుంచి మొగలాయిల పరిపాలన కొనసాగింది. కూచిపూడి, మరో 44 గ్రామాలు కొండవీడు పరిపాలనలో ఉన్నాయి. తర్వాత వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు పరిపాలన క్రీ.శ 1815 వరకు కొనసాగింది. వీరి పాలనలోనే స్వామివారి దేవస్థానం ఎదుట 70 అడుగుల ఎత్తులో తొమ్మిది అంతస్తుల రాజగోపురం నిర్మించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో 11 అంతస్తుల రాజగోపురం తర్వాత కూచిపూడిలోని రాజగోపురం ప్రసిద్ధి చెందింది.

– కూచిపూడి, (అమృతలూరు), న్యూస్‌టుడే

ఇక ఆటలు ఆడుకుంటాం

అంగన్‌వాడీలకు 11 రకాల వస్తువులతో కిట్లు

ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), కర్లపాలెం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ పలు మార్పులు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్పు చేసింది. చిన్నారుల ఆట పాటలతో కొనసాగేందుకు ఉండాల్సిన ప్రీ స్కూల్ కిట్లను ఇటీవలే పంపిణీ చేశారు. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారుల హాజరు శాతం పూర్తి స్థాయిలో ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

అన్ని కేంద్రాలకు సరఫరా.. జిల్లాలోని 9 ప్రాజెక్టుల పరిధిలో 1888 అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 57,504 మంది చిన్నారులు ప్రీ స్కూల్ చిన్నారులు ఉన్నారు. వీరి కోసం ఈ కిట్లను ప్రభుత్వం సరఫరా చేసింది. కిట్టు 11 రకాల వస్తువులు ఉన్నాయి. వీటితో చిన్నారుల్లో ఆట పాటలతో పూర్వ ప్రాథమిక విద్యను కార్యకర్తలు అందించనున్నారు. వీటి వల్ల చిన్నారులు కూడా సక్రమంగా కేంద్రానికి వస్తారు. సరైన పోషకాహారం తీసుకోవడంతో పాటు ఉత్సాహంగా కేంద్రంలో గడుపుతారు. మూడేళ్ల తర్వాత ప్రీ స్కూల్ కిట్లు రావడంతో అంగన్‌వాడీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ స్థలంలో పండించేలా..

న్యూస్‌టుడే, బాపట్ల

పట్టణాలు, నగరాల్లో హైడ్రోపోనిక్స్ సాంకేతిక పరిజ్ఞానంతో ఇంట్లోనే నాణ్యమైన తాజా ఆకుకూరలు, కూరగాయలు ఉత్పత్తి చేసే విధానంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. బాపట్ల ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల సహాయ ఆచార్యురాలు, శాస్త్రవేత్త కె.కృపావతి చిన్న పట్టణాలు, గ్రామాలకు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించాలన్న లక్ష్యంతో పరిశోధనలు చేస్తున్నారు. కొత్త నమూనాలు ఆవిష్కరిస్తున్నారు. సామాన్య మహిళలు ఇంట్లోనే కూరగాయలు పండించేలా కొత్త పరికరాలకు రూపకల్పన చేశారు. గ్రామీణ రైతులు, మహిళలు, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

❖ కళాశాలలో హైడ్రోపోనిక్స్ పరిజ్ఞానంతో ఐదు శాతం నీటితో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ఔషధ మొక్కల సాగు ప్రాజెక్టును కృపావతి ప్రారంభించారు. మార్కెట్లో లభిస్తున్న పెద్ద నమూనాల పరికరాలు తెచ్చి బిగించి పంటల సాగుకు రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది. పెద్ద పరికరాల స్థానంలో కేవలం 2×2 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉద్యానపంటలు సాగు చేసేలా ఏరో టవర్ నమూనా అభివృద్ధి చేశారు. దీని తయారీకి రూ.12 నుంచి 15 వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ టవర్‌లో 65 మొక్కల వరకు పెంచవచ్చు.

హైడ్రోపోనిక్స్‌లో ఏరో టవర్ నమూనా ఆవిష్కరణ

కృపావతి ప్రత్యేకంగా రూపొందించిన టవర్ నమూనా లో పెంచుతున్న ఆకుకూరలు

కృపావతి రూపొందించిన హైడ్రోపోనిక్స్ టవర నమూనాను అఖిల భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) మెచ్చి రూ.25 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాల్లో యువత, మహిళలు, రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించి పంటల సాగుపై అవగాహన కల్పించి చేపట్టేలా ప్రోత్సహిస్తున్నారు.

మూడురెట్లు అధిక దిగుబడి

హైడ్రోపోనిక్స్ సాంకేతిక పరిజ్ఞానంతో ఏరో టవర్ పేరుతో చిన్న నమూనాలు తక్కువ ఖర్చుతో గృహిణులు, చిన్న, సన్నకారు రైతులకు అందుబాటులోకి తెస్తున్నాం. ఇంట్లోనే ఈ పరికరాల ద్వారా తక్కువ నీటితో నాణ్యమైన ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవచ్చు. మూడు రెట్ల అధిక దిగుబడి వస్తుంది. –కృపావతి, సహాయ ఆచార్యురాలు

లక్ష్యం ఘనం.. ఆచరణలో కనం

ఈనాడు, అమరావతి

గుంటూరు జీజీహెచ్‌లో అమలు కాని కాలేయ, కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సలు

లక్ష్యాలు ఘనంగానే ఉన్నాయి.. ఆచరణలో అమలుకు నోచడం లేదు. ప్రభుత్వ అనుమతులు రాక ప్రతిబంధకంగా మారడం, అవసరమైన సిబ్బందిని సమకూర్చడంలో సమస్యలు నెలకొనడం.. వెరసి పేదలకు ఉచిత కాలేయ, కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సల నిర్వహణ పరంగా ఇబ్బందులు నెలకొంటున్నాయి. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల..ఆరు జిల్లాలకు వైద్య ప్రదాయిని. నిత్యం 5వేల మందికి పైగా రోగులు ఇక్కడ చికిత్స పొందుతుంటారు. ఇంతటి కీలకమైన వైద్యాలయంలో ఈ ఏడాది ఆగస్టు నుంచి మోకీళ్లు, నవంబరు నుంచి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించేందుకు అధికారులు సంకల్పించారు. దీనికి సంబంధించి గతేడాది చివరనే ప్రయత్నాలు ప్రారంభించగా.. ఈ ఏడాది జనవరిలోనే జీవన్‌దాన్ ట్రస్టు అనుమతి ఇచ్చింది. గుంటూరు జీజీహెచ్‌లో చనిపోయిన వారి అవయవాలను సేకరించి, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేసేలా అందులో పేర్కొన్నారు. అయితే, ఇందుకోసం ప్రత్యేక సమన్వయకర్త అవసరం కాగా..ఆ పోస్టును భర్తీ చేయలేదు.

కీళ్ల మార్పిడిలో అలా..

కీళ్ల మార్పిడి పరంగానూ కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఇంప్లాంట్స్ ఇవ్వకపోవడంతో కార్యరూపం దాల్చడం లేదని జీజీహెచ్ వర్గాలు చెబుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవలో ఇందుకోసం ప్రత్యేక కోడ్ రూపొందించాల్సి ఉందని, ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు జీజీహెచ్‌లో కీళ్లమార్పిడి శస్త్రచికిత్సలకు అనుమతి ఇచ్చింది. 2016లో అప్పటి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఇక్కడే సర్జరీ చేయించుకున్నారు. 2017 జులైలో నాటి ప్రభుత్వం రూ.65 లక్షలు మంజూరు చేయడంతో పేదలకూ 100మందికి కీళ్ల మార్పిడి చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇది అమలుకాలేదు. ప్రస్తుతం అనుమతులు, సిబ్బందిపరంగా సమస్యలున్నాయి.

ఉన్నతాధికారులకు లేఖ

ఈ రెండింటికీ సంబంధించిన సమస్యలపై ఇటీవల వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు జీజీహెచ్ వర్గాలు ఓ లేఖ రాశాయి. అందులో అంశాల వారీగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అయితే, ఇది ప్రభుత్వస్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయం కావడంతో ప్రస్తుతం ఎటూ తేలలేదు. నెలకు కనీసం 10 నుంచి 20 కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేయడానికైనా అవకాశం కల్పిస్తే..ఎంతో మేలు.

(c) eenadu

తలకు కట్టుకునే వస్త్రం

తయారు చేసిన జాకెట్

గడ్డి పరకేనోయ్.. తీసిపారేయకోయ్!

కళాత్మక వస్తువులు రూపొందించే వృద్ధుడు

భారతీయతను చాటుతూ రూపొందించిన టవలుతో కృష్ణమూర్తి

కుక్క పిల్ల.. అగ్గి పుల్ల.. సబ్బుబిళ్ల.. హీనం గా చూడకుమోయ్.. దేనికదియే నోయ్ అన్నీ.. అని శ్రీశ్రీ అన్నట్లు.. ఆ వృద్ధుడి చేతిలో గడ్డిపరక కళాత్మక వస్తువుగా మారుతోంది. చూడచక్కగా రూపొందుతుంది. బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలెనికి చెందిన చిన్నకృష్ణమూర్తి వయసు 78 ఏళ్లు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన చిన్నకృష్ణ మూర్తి పుదూనా ఉండే గడ్డితో వస్తువులు తయారుచేయడంలో దిట్ట. గడ్డితో చీరలు, జాకెట్లు, టవళ్లు రూపొందించడమేకాక పశువులకు చెందిన నాగలి, చంద్రకోల్, మూతికి కట్టే చిక్కాలు, గాడికి కట్టేసే తాళ్లు తయారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి ప్రముఖుల నుంచి ప్రశంసలు పొందారు. చిన కృష్ణమూర్తి తన లోని కళాత్మకతతో గిన్నిస్ బుక్‌లో ఎక్కేందుకు తీవ్రంగా శ్రమించారు. ఫలితం ఒనగూరలేదు. ప్రస్తుతం వయోభారం, ఆరోగ్యం సహకరించకపోవడంతో కళపై ఆసక్తి సన్నగిల్లుతోంది. - న్యూస్‌టుడే, పర్చూరు, మార్టూరు

రాయితీ శనగలా.. వామ్మో వద్దు!

మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే

వినియోగదారుడికి మార్కెట్‌లో లభించే పప్పు శనగ భారంగా మారుతున్నా.. రైతులు పండించిన పంటకు మాత్రం కొనుగోలు ధర అంతంత మాత్రమే. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి, రాయితీపై శనగ విత్తనాలు సరఫరా చేస్తున్నా రైతులు మాత్రం వ్యవసాయ శాఖ అందిస్తున్న విత్తనాలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. జిల్లాలో గతేడాది 32 వేల ఎకరాల్లో శనగ రకాలు సాగయ్యాయి. ఈ ఏడాది ఆ విస్తీర్ణం రెట్టింపయ్యేలా గ్రామాల్లో ట్రాక్టర్లతో చేలను సాగుచేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం నల్లబర్లీ పొగాకు సాగు నిషేధంతో ప్రత్యామ్నాయ సాగుగా రైతులు శనగ వైపు మారుతున్నారు. దీనిలో భాగంగా తక్కువ పెట్టుబడితో సాగయ్యే శనగను

విత్తనాల కోసం రైతులు సిద్ధం చేసుకుంటున్న శనగలు

పొలాల్లో విత్తుతున్నారు. మొక్కజొన్న ధర ఒక్కసారిగా పడిపోవడం, మెట్ట భూముల్లో అనువైన పంటగా భావించి శనగలో జేజీ-11 రకం విత్తనాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు.

వ్యవసాయ కార్యాలయం మెట్లెక్కని అన్నదాత

దెబ్బతిన్న కర్షకులను ఆదుకునేందుకు ప్రభుత్వం 25 శాతం రాయితీపై జేజీ-11, కాక్-2 రకాలు వివిధ నంబరు వెరైటీలను రాయితీపై సరఫరా చేసేందుకు ముందుకొచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా మారడంతో రైతులు వ్యవసాయ కార్యాలయాల గడప తొక్కేందుకు ముందుకు రావడం లేదు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన విత్తనాలు, పక్కనే ఉన్న రైతుల నుంచి అవసరమైన రకాలను కొనుగోలు చేసి, పొలాల్లో వెదజల్లుతున్నారు. దీంతో వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో సిబ్బందికి పంపిణీ కార్యక్రమాలు కనిపించడం లేదు. శనగ విత్తనాల నమోదుకు క్రమించాల్సిన అవసరం లేకుండా మారింది.

బయట మార్కెట్‌లోనూ అదే ధర

రైతులకు ప్రభుత్వం 25 శాతం రాయితీపై క్వింటా జేజీ-11 రకం విత్తనాలను రూ.5850 అందిస్తోంది. బయట మార్కెట్‌లోనూ క్వింటా రూ.6వేలు పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలకు సంబంధించి పత్రాలు అందజేసి, క్యూ లైన్లలో నిలబడటం కంటే నేరుగా శీతల గిడ్డంగుల వద్ద లేదా సమీప రైతుల నుంచి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. కాక్-2 రకాలు సర్కారు ధర, బయట లభిస్తున్న ధర దగ్గరగా ఉండటంతో ఇదే పరిస్థితి నెలకొంది.

డార్మెటరీ నిర్మాణానికి ప్రతిపాదనలు

ఈనాడు స్పందన

వేటపాలెం, న్యూస్‌టుడే: మహాత్మాజ్యోతి బాపులే ఆశ్రమ పాఠశాలలో పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన డార్మెటరీ నిర్మాణ విషయాన్ని ఏపీ డబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పనులు చేపట్టడానికి కొత్తగా ప్రతిపాదనలు తయారు చేస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ నహీద్ తెలిపారు. ఈనెల 6న ఈనాడులో 'అక్షరమే చదువు.. నిద్ర ఇంకెక్కడ' శీర్షికన కథనం ప్రచురితమైంది. డార్మెటరీ నిర్మాణం పిల్లర్లస్థాయిలో నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు కథనంలో సారాంశం. దీనికి స్పందించిన ప్రిన్సిపల్‌ పై విషయాలను వివరించారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, తహసీల్దార్లు, ఎంపీడీవో ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తారని చెప్పారు. అర్జీదారులు తమ సమస్యలపై అందజేసిన అర్జీలకు ఇప్పటికీ పరిష్కారం దొరక్కపోయినా ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు 1100 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలన్నారు.

బండలాగుడులో చుండూరు ఎడ్లు ప్రథమం

గురజాల, న్యూస్‌టుడే : పాతపాటమ్మ తిరుణాళ్లను పురస్కరించుకొని నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగు పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. న్యూకేటగిరి విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత మొదటి బహుమతిని దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత రెండో బహుమతి, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన మంగు రమాదేవి ఎడ్లజత మూడో బహుమతి కైవసం చేసుకున్నాయి. పోటీలను రైతు కమిటీ సభ్యులు ఎన్.లక్ష్మయ్య, టి.బుచ్చిబాబు, ఎన్.మల్లయ్య, పి.నాగేశ్వరరావులు పర్యవేక్షిస్తున్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, న్యూస్‌టుడే : జిల్లాలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను జిల్లా పోలీస్ యంత్రాంగం, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరుకు చెందిన లారీ డ్రైవర్ కె.సాంబశివరావు, చీరాలకు చెందిన గోపిరాజు, దుర్గారావు అన్నదమ్ములు చీరాల పరిసరాల్లో చీపుర్లు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలను ఎంచుకున్నారు. వారిని పట్టుకునేందుకు బాపట్ల సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ ప్రేమయ్య, జిల్లా పోలీస్ యంత్రాంగంతో కలిసి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను అరెస్టు చేశారు. దొంగిలించిన రూ.21.2 లక్షల విలువైన 37 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని వాటిని సీజ్ చేశారు. కేసులో ప్రతిభ చూపిన సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐ ప్రేమయ్య, బాపట్ల పట్టణ సీఐ రాంబాబు, చీరాల వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, సీసీఎస్ ఎస్సై రాంబాబు, సీసీఎస్ కానిస్టేబుళ్లు కోటేశ్వరరెడ్డి, కృష్ణ, సురేష్, దాసు, చిరంజీవిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు ప్రకటించారు.

అదుపు తప్పితే.. కాలువలోకే!

కొటికలపూడి(అద్దంకి), న్యూస్‌టుడే: మండలంలోని కొటికలపూడి పంచాయతీ పరిధిలో శ్రీరామ్‌నగర్- కొటికలపూడి- పార్వతీపురం రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ గ్రామాలన్నీ కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న కారణంగా గత పాలకులు ఎలాంటి ఆదరణ చూపలేకపోయారు. ప్రస్తుతం రహదారి పూర్తిగా ఛిద్రమైంది. దీనికి తోడు మాగాణి సాగు చేసిన రైతులు ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు నడుపుతుండటంతో కొద్దికాలానికే దెబ్బతింటున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ ఎల్.వెంకటేశ్వర్లును వివరణ కోరగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మూడు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు.

కొటికలపూడి-శ్రీరామ్‌నగర్ మధ్య రోడ్డు దుస్థితి

దీనిలో భాగంగా శ్రీరామ్‌నగర్-కొటికలపూడి-పార్వతీపురం రహదారికి రూ.1.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. కొటికలపూడి-తిమ్మారెడ్డిపాలెం మట్టి రోడ్డును బీటీ రహదారిగా మార్చేందుకు రూ.15 కోట్లు, జార్లపాలెం-చెరువుకొమ్ముపాలెం రహదారి నిర్మాణానికి రూ.కోటి మంజూరైనట్లు వివరించారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

ఆపదలో ప్రాణవాయువు!

ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి ఆక్సిజన్ అందించడం ఎంతో అవసరం. కరోనా సమయంలో దీని అవసరం ఎక్కువగా కలిగింది. దీంతో రూ.1.06 కోట్లతో స్థానిక ఏరియా వైద్యశాలలో దీన్ని 2022 జనవరి 10న ఏర్పాటు చేసి, ప్రారంభించారు. దీని ఉత్పత్తి సామర్థ్యం 1000 ఎల్‌పీఎం. ఆ సమయంలో చాలామందికి దీన్ని అందించి, అత్యవసర స్థితి నుంచి కాపాడారు. ఆ తరువాత దీని అవసరం లేకపోవడంతో వినియోగించకపోవడంతో అందులోని పరికరాలు తుప్పుపడుతున్నాయి. దీంతో ఆ రోజున దీని నిర్మాణానికి వ్యయం చేసిన సొమ్మంతా వృథా అయ్యే అవకాశం కనపడుతోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది. దీనిపై వైద్యశాల సూపరింటెండెంట్ పేట శ్రీకాంత్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా అందులో కంప్రెషర్ పనిచేయడంలేదన్నారు. ప్రారంభ సమయంలో కనీసం టెక్నీషియన్‌ని నియమించలేదని చెప్పారు. దీని మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించామని, దీనికి ప్రత్యామ్నాయంగా మాన్‌పోల్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇది వినియోగంలోకి వస్తే పైపుల ద్వారా అవసరమైన వారికి ఆక్సిజన్ అందించడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు.

ఆక్సిజన్ ప్లాంట్

- ఉడ్‌నగర్ (చీరాల అర్బన్), న్యూస్‌టుడే

విశ్వవిద్యాలయం వాలీబాల్ జట్టుకు శిక్షణ

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: కాకినాడ జేఎన్‌టీయూ ప్రాంగణంలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల క్రీడల పోటీల్లో పాల్గొనే ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వాలీబాల్ జట్టుకు శింగరకొండ కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శిక్షణ ఇస్తున్నారు. శుక్ర, శనివారాల్లో అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు శింగరకొండలో జరిగాయి. వీటిలో ప్రతిభ చూపిన ఆయా కళాశాలల జట్ల నుంచి క్రీడాకారుల్ని ఎంపిక చేసి, వర్సిటీ జట్టుగా కూర్చారు. రెండు రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత ఈనెల 10న కాకినాడలో జరిగే పోటీలకు జట్టు హాజరవుతుందని పీడీ టి.సుశీల తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు: వి.జాన్, వి.రాఘవేంద్ర, వై.దుర్గాతేజ, పి.వెంకటేష్, వై.ఏడుకొండలు (టీఆర్‌ఆర్, కందుకూరు), పి.జేమ్స్ (బీబీఎం, వేటపాలెం), వి.చెన్నయ్య, కె.అశోక్, ఎం.లెనిన్ (కేఆర్‌కే, అద్దంకి), కె.గణేష్ (జీవీఎస్‌ఎం, ఉలవపాడు), ఎ.సిద్దు, పి.సుధీర్ (గౌతమి, చీరాల), డి.గోపిరాజ్ (ఏకేవీకే, ఒంగోలు), ఎం.దామోదర్‌చంద్ (వేద, అద్దంకి) ఉన్నారు.

ఆంధ్రకేసరి వర్సిటీ వాలీబాల్ జట్టుతో అధ్యాపక బృందం

చురుగ్గా జలజీవన్ పనులు

ఎస్ఈ అనంతరాజు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: డిసెంబరు 2025-26 నాటికి జిల్లాలోని ప్రతి ఇంటికి నల్లాతో స్వచ్ఛమైన మంచి నీరు అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.అనంతరాజు తెలిపారు. జిల్లాలో జలజీవన్ మిషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రూ.139 కోట్లతో 338 పనులు మంజూరైనట్లు వెల్లడించారు. వీటిలో 296 పనులు ప్రారంభించగా, మరో 42 పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు చేసిన వాటికి రూ.20 కోట్ల బిల్లులు చేయగా రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. గతంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచి నీటి ట్యాంకులను జలజీవన్ పనులకు అనుసంధానించి, వినియోగంలోకి తీసుకొస్తామని వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా సచివాలయాలకు 308 మరుగుదొడ్లు మంజూరు కాగా 233 పూర్తయినట్లు తెలిపారు. ఆరోగ్య మందిరాలు, వైద్యశాలలు మొదలైన చోట్ల సాముహిక మరుగుదొడ్లు 344 మంజూరు కాగా 135 పూర్తయినట్లు చెప్పారు. మిగతా వాటిరి త్వరలో పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 265 గ్రామాల్లో 176 ఓడీఎస్ గ్రామాలుగా ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

FINANCIAL SERVICES

నూతన ఇండస్ట్రీ ఏర్పాటుకు కావలసిన Term Loans Working Capital పాత GST Returns పై OD, CC, E.P.C Loans Distributers Exporters కి Loans ఇప్పించబడును. 94944 02285.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT, వృద్ధులకు, పేషెంట్ల సేవకు ఇంటి/ వంట, బేబీ కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

గుంటూరు, పేరేచర్ల NRI ITకాలేజి ప్రక్కన ORR కి మధ్య APCRDA ప్లాట్లుకలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ. 77290 75959, 99591 27008.

JOBS

Lakshmi Spares Corporation Vijayawada. Authorised Dealer for Atlas Copco Air Compressors Wanted: Service Engineers Qul: B.Tech/ Diploma. Location: Krishna, Guntur & Prakasam. Note: Complete Field Work Send Your Resumes : hr.lakshmispares@gmail.com ✆ 90325 74443.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్. HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆: 97039 71968

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, క్లాస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయి ఉండాలి. సంప్ర. ఫోన్ నెంబర్: 89784 80429.

పద్మప్రియ ఆటోఫైనాన్స్ నందు పనిచేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్స్ మరియు ఆఫీస్ స్టాఫ్ కావలెను. 7 లైను, గుంటూరువారి తోట, సాయికృష్ణ లాడ్జి ప్రక్కన, గుంటూరు. 93944 46449.

గుంటూరు & నరసరావుపేటలోని ప్రముఖ అడ్వకేటు ఆఫీసునందు లీగల్ Openions వ్రైపుచేయుటకు అనుభవంకలిగిన అభ్యర్థులు కావలెను. Ph: 93469 83822.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 20k. ✆ 89776 39662, 89776 39663.

అకౌంటెంట్స్, సూపర్ వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. చిలకలూరిపేట మం. యడవల్లి గ్రామంలోఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 93906 33593, 90595 14555.

E-Kart నందు అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Qly: Inter Any డిగ్రీ జీ: 15,000 Online are Available. 90141 20139.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఆటలు చక్కని వ్యాయామం

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆటలు శరీరానికి చక్కని వ్యాయామమని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బాలుర విభాగంలోని పోటీలు డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో, బాలికల పోటీలను స్థానిక ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. క్రీడాకారులు, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బాలుర విభాగంలో 13, బాలికల విభాగంలో 13 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు ఎన్.సురేష్‌కుమార్, వి.పద్మావతి తెలిపారు.

బాలుర విభాగంలో విజేతల వివరాలు

హాజరైన జట్లను నాలుగు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. చిత్తూరు- శ్రీకాకుళం జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. తూర్పుగోదావరి- వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన పోటీలో 1-0 తేడాతో తూర్పుగోదావరి జట్టు, విజయనగరం- ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్‌లో ప్రకాశం 1-0 తేడాతో గెలిచింది. నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య పోటీలో నెల్లూరు 2-0 తేడాతో గెలిచింది. పశ్చిమగోదావరి- కృష్ణా జట్ల మధ్య పోరులో 0-4 తేడాతో కృష్ణా జట్టు గెలవగా, గుంటూరు- ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు గెలిచింది. తూర్పుగోదావరి- శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. చిత్తూరు- వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైఎస్సార్ కడప గెలిచింది. ★ బాలికల విభాగంలో విశాఖపట్నం, నెల్లూరు, గుంటూరు జట్లు గెలిచాయి.

విశాఖ బాలికల జట్టు సభ్యులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చదలవాడ

సీనియర్ ఫ్లోర్‌బాల్ పోటీలు ప్రారంభం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 19వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఫ్లోర్‌బాల్ అంతర్ జిల్లాల పోటీలను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఆదివారం ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. నరసరావుపేటలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 14 జట్లు పాల్గొన్నాయి. మహిళల విభాగంలో పల్నాడు - నెల్లూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయానికి ఇరు జట్ల స్కోర్లు సమానంగా ఉండటంతో షూట్ అవుట్ నిర్వహించగా పల్నాడు జిల్లా జట్టు 2-1 తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. కడప-తిరుపతి జిల్లా జట్ల మధ్య మ్యాచ్‌లో కడప జట్టు 2-0 తేడాతో గెలిచింది. పురుషుల విభాగంలో బాపట్ల జట్టుపై కడప జట్టు 1-0 తేడాతో గెలుపొందగా, తిరుపతి- కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లో కర్నూలు జట్టు 3-0తో విజయాన్ని సొంతం చేసుకుందని నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుబ్బరాయగుప్తా, ఎంఏఎం కళాశాల ఛైర్మన్ శేషగిరిరావు, ఐడీపీఎస్ స్కూల్ ఛైర్మన్ నాగోతు ప్రకాష్, డైరెక్టర్ సబిత, ప్రిన్సిపల్ రేఖాపూలేఖర్, ఏపీ ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రత్నకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్‌బాబు, పీడీ సురేంద్ర, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పోటీల్లో తలబడుతున్న పురుషుల జట్లు

పడినా.. పచ్చగానే

కష్టాలు మనిషికి కాక మానుకు వస్తాయా అన్నది నానుడి. నిజంగానే ఈ వృక్షానికి ఓ కష్టం వచ్చిపడింది. ఇటీవల వచ్చిన తుపానుకు వేర్లతో సహా లేచి పడిపోయింది. చిత్రంగా.. నేలకొరిగినా..ఎండిపోకుండా.. ఎప్పటిలాగే పచ్చగానే ఉంది. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చేవారు ఇది చూసి ఆశ్చర్యచకితులవుతున్నారు. చిన్నపాటి ఇబ్బందులొస్తే వణికిపోయే వారికి ఇది స్ఫూర్తిగా ఉందంటున్నారు. నిన్నటి వరకు నీడనందించిన ఈ చెట్టు ఇలా నేలపై ఉండే కంటే ఓ చిన్న ప్రయత్నం చేసి నిలబెడితే బాగుంటుంది కదా అనుకుంటున్నారు. మరి అధికారులు స్పందిస్తారా లేదా వేచిచూడాలి.

- న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం.

10నుంచి రాష్ట్ర స్థాయి క్రీడలు

పెదకూరపాడు: పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య పాఠశాలలో ఈనెల 10 నుంచి రాష్ట్ర స్థాయి అండర్-20 క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుత్తా కవిత, రాము ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పురుషుల విభాగంలో మండది శివరామ కాశీబాబు మెమోరియల్ వారి సహకారంతో డే అండ్ నైట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో అక్కా తమ్ముడికి తీవ్ర గాయాలు

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన బైక్ ఆపి నిలిచి ఉన్న అక్కా తమ్ముడి పైకి లారీ దూసుకుపోవడంతో వారికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చెరుకుపల్లి ఐలాండ్ కూడలి వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని తూర్పు పాలెం పంచాయతీ పరిధి బడేవారిపాలేనికి చెందిన బడే గౌతమ్ జయకృష్ణ తన అక్క ఆషా సంతోషితో కలిసి చెరుకుపల్లి ఐలాండ్ కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహం సమీపంలో బైక్‌పై ఇద్దరు నిలిచి ఉన్నారు. బాపట్ల నుంచి భీమవరం లోడుతో వెళుతున్న లారీ వేగంగా వచ్చి అంబేడ్కర్ విగ్రహం రోడ్డు మధ్యలో ఉండటంతో చోదకుడు పక్కకు వాహనాన్ని తిప్పడంతో వెనుక చక్రాలు బైక్‌పై నుంచి వెళ్లాయి. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని తొలుత గుళ్లపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. నిత్యం వాహనాలకు చలానాలు రాసే పోలీసులు ఘటన జరిగిన గంట వరకు అక్కడికి రాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లారీ చోదకుడిని ప్రజలు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి అప్పగించారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు, పార్కింగ్ లేక నిలిచిపోతున్న వాహనాలు..మరో పక్క రోడ్డు మధ్యలో అంబేడ్కర్ విగ్రహం కారణంగా ఐలాండ్ కూడలిలో ప్రమాదాలకు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

అద్దంకిలో ఒకరికి..

ఎన్టీఆర్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే: నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై విద్యుత్తు కార్యాలయం ఎదుట జరిగిన ప్రమాదంలో యువకుడు నాజర్ వలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. శింగరకొండపాలెం శివారు కొత్త రెడ్డిపాలేనికి చెందిన యువకుడు స్థానికంగా నివసిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోకి ప్రవేశించే క్రమంలో అతని ద్విచక్ర వాహనం విభాగినిని ఢీకొంది. కిందపడగా కాలికి తీవ్ర గాయమైంది. స్థానికులు స్పందించి సపర్యలు చేశారు. ప్రైవేటు అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గొడ్డలితో దాడి.. ఒకరికి గాయాలు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: బెల్లంకొండ మండలం పాపాయపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. తన తండ్రిని దూషించాడన్న కోపంతో కుమారుడు గొడ్డలితో దాడిచేశాడు. ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో దాచేపల్లి కోటయ్య అలియాస్ సంక్రాంతి కోటయ్యకు ఒర్సు కృష్ణయ్యకు ఆదివారం సాయంత్రం చిన్న వివాదం తలెత్తింది. ఒకరినొకరు దూషించుకున్నారు. స్థానికులు వివాదం పెద్దది కానివ్వకుండా చేసి ఇంటికి పంపించారు. విషయం తెలుసుకున్న కోటయ్య కుమారుడు గోపాలకృష్ణ తన బావమరిదితో కలిసి కృష్ణయ్యతో వాదనకు దిగాడు. మాటామాటా పెరిగి తనతో తెచ్చుకున్న గొడ్డలితో దాడి చేశాడు. కృష్ణయ్య తలపై గాయమైంది. అచేతన స్థితిలో పడిపోయిన కృష్ణయ్యను స్థానికులు 108 వాహనంలో సత్తెనపల్లి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బెల్లంకొండ ఎస్సై ప్రవీణ్ స్థానికంగా విచారిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 162, చికెన్ విత్‌స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 274 చికెన్ స్కిన్‌లెస్ - 284.

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541 ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

విద్యార్థులకు ప్రోత్సాహకాల వితరణ

పేటేరు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం పేటేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తన్వీర్ ఆర్యన్ (కోయంబత్తూర్) పుట్టిన రోజు సందర్భంగా యార్లగడ్డ పోలీసురావు సహకారంతో ముగ్గురు విద్యార్థులకు రూ.7,500 విలువైన దుస్తులు, బూట్లు, బ్యాగు, సామగ్రి ఆదివారం పొట్టా కనకదుర్గా వరప్రసాద్ అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు బాబూజీ, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

చెరుకుపల్లి: గుంటూరులో ఈనెల 8, 9 తేదీల్లో జరిగే అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ)రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా నాయకుడు మరివాడ వెంకట్రావు కోరారు. సమాఖ్య నాయకులు ఆదివారం మండలంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అర్చకుల సమస్యలపై 10న సమావేశం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : అర్చకుల క్షేత్రస్థాయి సమస్యలు, అర్చక సంక్షేమ నిధి ద్వారా చేపట్టాల్సిన పథకాలపై అర్చక సంఘ ప్రతినిధులతో చర్చించేందుకు దేవాదాయ శాఖ ఈనెల 10న గొల్లపూడి కమిషనర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిందని మండల అర్చక సంక్షేమ సంఘం నాయకులు స్వర్ణ శ్రీనివాసశర్మ, చావలి శ్రీధర్ శర్మ తెలిపారు. అర్చక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై దేవాలయాల్లో మెరుగైన సేవలందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అర్చకుల సమస్యలపై శాఖకు తగు సూచనలు చేయాల్సిందిగా వారు కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? స్థానిక గాంధీ నగరంలోని బొద్దులూరుపాడు రోడ్డులో పంచాయతీ వారు ఏర్పాటు చేసిన మంచినీటి పంపు పనిచేయడం లేదు. - **ఖాసిం బేగ్, స్థానికురాలు, కొల్లూరు**

✔ మరమ్మతులు చేయించి, సమస్య పరిష్కరిస్తాం. - **శంకర్రావు, పంచాయతీ కార్యదర్శి, కొల్లూరు** –న్యూస్‌టుడే, నగరం

? ధూళిపూడి- యేలేటిపాలెం ఆర్‌అండ్‌బీ రహదారి శివారులో చెత్త వేస్తున్నారు. వ్యర్థాలు గాలికి కొట్టుకొచ్చి పంట చేలల్లో పడుతున్నాయి. -**గ్రామ రైతు, ధూళిపూడి**

✔ రహదారి శివారులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. -**దోగేంద్ర, కార్యదర్శి, ధూళిపూడి**

? గుళ్లపల్లి బూర్లమ్మ డొంకలో రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోయింది. చెత్త తొలగించాలి. -**శ్రీనివాసరావు, గుళ్లపల్లి**

✔ సిబ్బందిని పంపి చెత్త తొలగించి శుభ్రం చేయిస్తాం. -**శ్రీనివాసన్, డిప్యూటీ ఎంపీడీవో, గుళ్లపల్లి**

–న్యూస్‌టుడే గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ)

పేదింటి పిల్లలు.. క్రీడల్లో విజేతలు

జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

వేమూరు, చుండూరు, న్యూస్‌టుడే

వారంతా పేద కుటుంబాల నుంచి వచ్చిన వారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. సాఫ్ట్‌బాల్ సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. తాజాగా చుండూరు మండలం మోదుకూరులో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలోని సాఫ్ట్ బాల్ పోటీలు జరుగుతున్నాయి. అక్కడకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. వారి ఆశయాల గురించి తెలుసుకుందాం.

ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించాలని

గుంటూరు జిల్లా వట్టిచెరుకూరుకు చెందిన **చిలకా అనిత** ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ఆరేళ్ల నుంచి సాఫ్ట్‌బాల్‌లో సాధన చేస్తోంది. ఇప్పటికి ఐదు సార్లు జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలో పాల్గొని మంచి నైపుణ్యం ప్రదర్శించింది. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలి ఉద్యోగం సాధిస్తానని చెబుతోంది.

జవాన్‌గా దేశ సేవ చేయాలని

కొల్లిపర నాగరాజుది నిరుపేద కుటుంబం. అతనికి చిన్నతనం నుంచి జవాన్‌గా దేశానికి సేవలు అందించాలని కోరిక. అదే స్ఫూర్తితో క్రీడల్లో సాధన చేస్తూ సాఫ్ట్ బాల్‌లో ఇప్పటికి రెండు సార్లు జాతీయ స్థాయిలో ఆడాడు. రానున్న రోజుల్లో మరింత రాణించి క్రీడా కోటాలో జవాన్‌గా దేశ సేవ చేస్తా అంటున్నాడు.

అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని



కృష్ణా జిల్లాకు చెందిన **డి.కృష్ణ** తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. అతడికి చిన్నతనం నుంచి క్రీడలంటే ఇష్టం. అదే స్ఫూర్తిగా పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో రాణిస్తున్నాడు. ఒకసారి జాతీయ స్థాయిలో ఆడాడు. ఇకపై మరింత సాధన చేసి, అంతర్జాతీయ స్థాయిలో ఆడతానని చెబుతున్నాడు.

బండ్లమ్మ ఆలయాల్లో పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : చందోలు బండ్లమ్మ అమ్మవారికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించగా మహాశక్తిగా దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని శ్రీబండ్లమ్మ వార్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మహాశక్తి దేవతగా చందోలు బండ్లమ్మ

అల్లూరమ్మకు...

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : అల్లూరు గ్రామ దేవత అల్లూరమ్మకు ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో 'అభయప్రదాయిని'గా భక్తులకు దర్శనమిచ్చారు.

అభయప్రదాయినిగా అల్లూరమ్మ

అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

జంపని(వేమూరు), న్యూస్‌టుడే: జంపని షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలోని షిర్డీ సాయిబాబా గుడి వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామికి అభిషేకాలు, విశేషపూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన చేపట్టారు.

ఆనందీశ్వరునికి అన్నాభిషేకం

గుళ్లపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఆరుద్రోత్సవం సందర్భంగా గుళ్లపల్లి ఆనందీశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విశేష అభిషేకాలు, అనంతరం అన్నంతో ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం అన్నాభిషేకాలంకరణలో స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కనగాల పృథ్వీశ్వర స్వామి ఆలయం, నడింపల్లి, పొన్నపల్లి, రాజోలు, కావూరు శివాలయాల్లోనూ భక్తులు పూజలు చేశారు.

సీఎం సహాయనిధి మంజూరు పత్రాల అందజేత

మూల్పూరు, బోడపాడు, (అమృతలూరు), న్యూస్‌టుడే: మండలంలోని మూల్పూరు, బోడపాడు గ్రామాలకు చెందిన పాలకుమారి, జ్యోతి కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందారు. ఆర్థిక ఇబ్బందులతో వారు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మంజూరైన రూ.80 వేలు, రూ.50వేలు విలువైన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం గుంటూరులోని పార్టీ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

శారీరక దృఢత్వం అవసరం

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: అందరికీ శారీరక దృఢత్వం అవసరమని ఎన్ఆర్ఐ కె.కృష్ణ అన్నారు. స్థానిక రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వివేకానంద్ రన్ పేరుతో పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాలుగు స్థాయిల్లో 13 నుంచి 60 ఏళ్ల వయస్సు గల స్త్రీ, పురుషులు 250 మంది పాల్గొన్నారు. కృష్ణ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన 60 మందికి బహుమతులు, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పరుగు పోటీల్లో ప్రతిభ చూపిన వారు

పిచ్చి మొక్కల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కర్లపాలెం, న్యూస్‌టుడే: పెదపులుగువారిపాలెంలో పలు విద్యుత్తు స్తంభాలతో పాటు తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. వర్షం పడి గాలి వీచినప్పుడు మంటలు చెలరేగి తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈనాడులో ఈనెల 5న 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. విద్యుత్తు శాఖ ఇన్‌ఛార్జి ఏఈ దుర్గా ప్రసాద్ సిబ్బందిని పంపి విద్యుత్తు స్తంభాలతో పాటు తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలు తొలగింపజేశారు.

చెత్త పారబోతతో ఇబ్బందులు

రేపల్లె మండలం కారుమూరు శివారులో పేరుకున్న వ్యర్థాలు డంపింగ్ యార్డును తలపిస్తోంది. గ్రామంలో ఇంటింటా సేకరించిన చెత్తాచెదారాన్ని రేపల్లె వచ్చే ప్రధాన రోడ్డు పక్కన గుట్టలు పోస్తున్నారు. వాటిలో ఉన్న ఆహార పదార్థాలను కుక్కలు పెకలిస్తూ రహదారిపైకి ఆకస్మికంగా రావడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్**

రహదారి అధ్వానం.. ప్రయాణం ప్రాణ సంకటం

రేపల్లె మండలం పెనుమూడి నుంచి భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వరకు ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. 10 కిలోమీటర్ల దూరం అడుగుకో గుంతగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2016లో కృష్ణా పుష్కరాల సందర్భంగా ఈ రహదారిని విస్తరించి అభివృద్ధి చేశారు. గత వైకాపా ప్రభుత్వం ఈ రహదారిని గాలికి వదిలేయడంతో గుంతలమయంగా మారింది. తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఈనాడు, బాపట్ల,న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్**

రేపల్లె మండలం రావిఅనంతవరం వద్ద గుంతల మయంగా రహదారి

వస్త్రం కడితే నీరు ఆగుతుందా!

గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాలు నిర్వహణ లోపంతో వెలవెలబోతున్నాయి. యేలేటిపాలెం శివారు వెలమవారిపాలెంలోని పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేయిక పోవడంతో ప్రతి రోజు వేల లీటర్ల నేలపాలవుతున్నాయి. అధికారులు స్పందించక పోవడంతో స్థానికులు పుల్లలు, వస్త్రాలతో నీటి వృథాను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నగరం**

ఉత్సాహంగా సాఫ్ట్ బాల్ పోటీలు

మోదుకూరు (చుండూరు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలోని సాఫ్ట్ బాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. ఆదివారం జరిగిన పోటీలో బాలికల విభాగంలో విజయనగరం, గుంటూరు, శ్రీకాకుళం, కడప జిల్లాల జట్లు, బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, విజయనగరం, కృష్ణా జిల్లాల జట్లు సెమీ ఫైనల్‌కు చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.

సెమీఫైనల్ చేరిన జట్లతో వ్యాయామోపాధ్యాయులు

అటు అధ్వానం.. ఇటు ప్రమాదం

పొన్నూరు నుంచి చందోలు ప్రయాణం నరకప్రాయం

చెరుకుపల్లి గ్రామీణ, చందోలు (పిట్లవానిపాలెం), న్యూస్‌టుడే

గత నెల 28న పొన్నూరుకు చెందిన కల్యాణ్ స్నేహితుడితో కలిసి చందోలు వెళ్తున్నారు. నిడుబ్రోలు ఊరి చివరి నుంచి సంగుపాలెంకోడూరు మీదుగా చందోలు మార్గం పూర్తిగా దెబ్బతినడంతో మరమ్మతులు జరుగుతున్నాయి. దీంతో అతడు ఇంటూరు మీదుగా కుంచాలవారిపాలెం వెళ్తున్నారు. అక్కడి నుంచి చందోలు వెళ్లవచ్చు. ఈ క్రమంలో ఇంటూరు నుంచి కుంచాలవారిపాలెం వస్తుండగా రోడ్డు మీద రాయి ఎక్కి కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటనలో కల్యాణ్‌కు గాయాలు అయ్యాయి. అతడి స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

✶ చెరుకుపల్లి మండలం కుంచాలవారిపాలెం నుంచి తెనాలి మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏక మార్గం కావడం, రోడ్డుకు రెండు పక్కల కాలువలు, చెట్లు, గుంతలు ఉండటం ఎదురుగా వాహనం వస్తే తప్పుకొనే వీలు లేక, మలుపులు వద్ద ఎదుటి వాహనం కనిపించక.. దగ్గరికి వచ్చాక వాహనాన్ని గుర్తించి బ్రేక్ వేసే లోపే వేగం నియంత్రణలోకి రాక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

గుంతలమయంగా సంగుపాలెం- కోడూరు రోడ్డు

పెరుగుతున్న ప్రమాదాలు

గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది నవంబరు వరకు ఈ మార్గంలో దాదాపు 15 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా ఆరుగురు మరణించారు. పదిమందికి గాయాలయ్యాయి. వీరిలో పొన్నూరు నుంచి చందోలు, పిట్లవానిపాలెం వెళ్లే వారే అధికంగా ఉంటున్నారు. పొన్నూరు- చందోలు రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు చుట్టూ ఇంటూరు - కుంచాలవారిపాలెం మీదుగా ప్రయాణించడమే కారణం అంటున్నారు. సంగుపాలెం రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి వాహనదారులు కోరుతున్నారు. సమస్యపై ఆర్‌అండ్‌బీ ఏఈ గోగినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో ఉపయోగించే చిప్స్ లభ్యత లేక పోవడంతో పనుల్లో జాప్యం తలెత్తిందని, క్రషర్ల యజమానులతో మాట్లాడి చిప్స్ తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక

అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

రేపల్లెలో..

బాపట్ల, బాపట్ల వెస్ట్ : న్యూస్‌టుడే : బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసించిన 1975…79 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తాము కళాశాలలో చదువుకుని 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆదివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒకరినొకరు కుశల ప్రశ్నలతో పలకరించుకున్నారు. 2025 ఏడాదిని స్వర్ణోత్సవ సంవత్సరంగా ఉత్సాహభరితంగా నిర్వహించారు. విద్యానంతరం వైద్య విద్యనభ్యసించి వైద్య వృత్తి చేపట్టిన నలుగురు వైద్యులు, సివిల్ సర్వీసెస్‌లో నలుగురు, బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్లు ఇలా ఎంతో మంది అధికారులు ఈ బ్యాచ్‌లో ఉన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఉద్యోగ విరామం పొందినవారున్నారు. వీరందరూ తమకు పాఠాలు బోధించిన 12 మంది గురువులకు వేదపండితుల ఆశీస్సులతో పట్టువస్త్రాలు బహూకరించి ఘనంగా సన్మానించి గురుభక్తిని చాటారు. కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనరాణి, ఇతర బోధనా సిబ్బంది, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు జె.ధర్మారావు, పి.రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె అర్బన్: రేపల్లె భగవాన్ శ్రీ సత్యసాయి ఉన్నత పాఠశాలలో 1979-80 పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 45 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులను ఆప్యాయంగా పలకరించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన 13 మంది గురువులకు పాదాభివందనం చేసి పూలమాల, శాలువా, జ్ఞాపిక బహూకరించి సత్కరించారు. వైద్యుడు గౌస్, ఎస్ఎస్‌వీ ప్రసాద్, దత్తాత్రేయ, శ్రీనివాస్, రంగనాధ్, శ్రీకాంత్, పద్మజ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడి నియామకం

నిజాంపట్నం (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ నిజాంపట్నం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఆదివారం శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికలు జరగ్గా నూతన అధ్యక్షుడిగా కుర్రా కిరణ్, గౌరవాధ్యక్షుడిగా కేవీ గోపాల్, ప్రధాన కార్యదర్శిగా కె.రాంబాబును ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి దోవా రవి తెలిపారు.

రాంభొట్లపాలెం వద్ద సాగులో దాళ్వా వరినారు

దాళ్వాకు వరినారు సిద్ధం

రాంభొట్లపాలెం (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: గత రెండు నెలల్లో కురిసిన వర్షాలకు అక్కడక్కడ వరి పైర్లు దెబ్బతిన్నాయి. కృష్ణా, పల్నాడు జిల్లాల్లో వరి పైర్లు పూర్తిగా పాడవడంతో అక్కడ నాట్లు వేసేందుకు రైతులు ఇక్కడి రైతులతో ఒప్పందం చేసుకుని వరినారు సాగు చేయిస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే ఖరీఫ్ పంట కోత అనంతరం పొలాలను నాట్లకు సమాయాత్తం చేస్తున్నారు. దీంతో దాళ్వా వరి సాగుకు మండలంలోని రాంభొట్లపాలెం వద్ద వరి నారు మడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. స్థానికంగా కొందరు రైతులు పది, ఇరవై సెంట్లలో వరినారు మడులను పోస్తున్నారు. ఇక్కడి ఇసుక నేలలు నారుమడులకు అనువుగా ఉండటంతో రైతులు ఇక్కడకు వచ్చి వరినారుకు కొందరు ముందుగానే చెల్లింపులు చేస్తున్నారని రైతులు అంటున్నారు.

ఆదివారం హాయిగా.. సంతోషం మది నిండుగా

బాపట్ల, బాపట్ల వెస్ట్ న్యూస్‌టుడే : బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాపీ సండే కార్యక్రమంలో ప్రతి ఆదివారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భరతనాట్యం, కోలాటం, దేశభక్తి గీతాలు, కీబోర్డు ద్వారా దేశభక్తి పాటలను ఆలపించి ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. విద్యార్థుల ప్రతిభను బయటకు తీసేందుకు సీఎం చంద్రబాబు చేపట్టిన ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పురపాలక సంఘ కమిషనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, నాటక అకాడమీ డైరక్టర్ ఎం.ఆంథ్రేయ, కార్యదర్శి బి.రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాట్యం చేస్తున్న చిన్నారులు

హాజరైన రఘునాథ్ రెడ్డి తదితరులు

దారి మధ్యలో పశువులు.. వాహనదారులు బెంబేలు

బాపట్ల పట్టణ శివారు ప్రాంతాల్లో 216ఎ జాతీయ రహదారి మధ్యలో పశువులు మేత మేస్తున్నాయి. దీంతో వాహన దారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. పశువుల కాపరులు సైతం సమీపంలో లేరు. పశువులు గడ్డి మేయడంతో పాటు మధ్యలో పెంచుతున్న మొక్కలను నాశనం చేస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, బాపట్ల టౌన్**

ప్రగతి చక్రం తిరిగేలా.. పల్లె మురిసేలా

రేపల్లె మండలంలో 5.68 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు

న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

రేపల్లె మండలంలో పలు రహదారులు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. ఏళ్లుగా పలు గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేక ప్రజలు పడిన ఇబ్బందులు తీరుతున్నాయి. 2024 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అనగాని సత్యప్రసాద్ ఒక్కొక్కటిగా నెరవేర్చేలా దృష్టి సారించారు. నాబార్డు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్స్ తదితర నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

ఉప్పూడిలో పూర్తయిన సిమెంటు రోడ్డు నిర్మాణం

✦ ఉప్పూడి గ్రామానికి రాకపోకలు సాగించే ప్రధాన రహదారిని రూ.1.05 కోట్లతో సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయించారు. శివారు మార్గాన్ని తారు రోడ్డుగా మార్చే పనులు జరుగుతున్నాయి. 2.50 కోట్లతో తుమ్మల నుంచి బండికాయమోటు వెళ్లే ప్రధాన రహదారిని 250 మీటర్ల వరకు సిమెంటు, మరో 250 మీటర్లు తారు రోడ్డు గ్రామంలో మరో 150 మీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. రూ.1.40 కోట్లతో తుమ్మల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గాదెవారిపాలెం వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.73 లక్షలతో పోటుమెరక నుంచి గౌడపాలెం వెళ్లే రోడ్డును తారు రోడ్డుగా రూపు దిద్దే పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో రోడ్లను అభివృద్ధి చేయించడంలో నిర్లక్ష్యం వహించింది. దాంతో రాకపోకలు చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లోని అనేక రోడ్లను అభివృద్ధి చేయించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు తాము పడిన ఇబ్బందులు తీరనున్నాయని వాహదారులు సంతోషిస్తున్నారు. సాధ్యమైనంత తొందరగా అభివృద్ధి పనులు పూర్తి చేయించేలా సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

అంకాలమ్మ ఆలయంలో చోరీ

నడింపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా నడింపల్లి గ్రామదేవత అంకాలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం ఉదయం పూజారి శ్రీనివాసరావు ఆలయానికి వెళ్లి చూడగా అక్కడ వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. గ్రామస్థులకు విషయం తెలపగా వారు వచ్చి చూశారు. అమ్మవారి విగ్రహంపై చీర కప్పి ఉండటంతో తొలగించి చూడగా వెండి కిరీటం కనిపించలేదు. దాని విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని, హుండీని పగులగొట్టి నగదు చోరీ చేశారని గుర్తించారు. పూజారి శ్రీనివాసరావు చెరుకుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అందుబాటులో లేకపోవడంతో కేసు నమోదు కాలేదు.

జూదరుల అరెస్టు

బాపట్ల, న్యూస్‌టుడే: తూర్పు బాపట్ల పంచాయతీ పరిధిలోని హైదరపేటలో జూద స్థావరంపై బాపట్ల గ్రామీణ పోలీసులు ఆదివారం దాడిచేశారు. జూదం ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి నుంచి రూ.4,020 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

21న హిందూ సమ్మేళనం

చీరాల, న్యూస్‌టుడే: ఈనెల 21న చీరాల ఎన్ఆర్‌పీఎం పాఠశాల మైదానంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు బి.హేమంత్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని ఆదివారం భావనారుషిస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేశారు. మువ్వల వెంకటరమణారావు, దేవరాజు, జ్వాలా నరసింహం, తులాబందు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

చీరాల: నియోజకవర్గంలో చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించాలనేది తన లక్ష్యమని, దీనిలో భాగంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. ఈనెల 12న చీరాలలోని ఎన్ఆర్‌పీఎం పాఠశాలలో నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాకు సంబంధించి కరపత్రాన్ని ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీత

చీరాల: విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన వారోత్సవాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎనిమిది రోజులు జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పోటీలు ప్రారంభమయ్యాయి.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల ఫోన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

• ఉసుమర్రిపేట మహాలక్ష్మమ్మ చెట్టు వెనుక వీధిలో పాటు రైల్వేగేటు వద్ద నుంచి సచివాలయం వచ్చే దారిలో మూడు దీపాలు వెలగడం లేదు. పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడంలేదు. **శ్రీనివాసరావు, స్థానికుడు**

• వెంటనే సిబ్బందిని పంపి లైట్లు ఏర్పాటు చేయిస్తా. **పూర్ణ కుమారి, పంచాయతీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి, దేశాయిపేట** — న్యూస్‌టుడే, వేటపాలెం

21న హిందూ సమ్మేళనం

చీరాల, న్యూస్‌టుడే: ఈనెల 21న చీరాల ఎన్ఆర్‌పీఎం పాఠశాల మైదానంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు బి.హేమంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని ఆదివారం భావనారుషిస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేశారు. మువ్వల వెంకటరమణారావు, దేవ రాజు, జ్వాలా నరసింహం, తులాబందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు పంచాయతీ పరిధిలో తాగునీటి పైపులైను మరమ్మతులకు గురవడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆదివారం పంచాయతీ అధికారుల నేతృత్వంలో రక్షిత నీటి పథకం వడపోత తొట్టెల వద్ద మరమ్మతులను వేగవంతం చేశారు. సోమవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పంచాయతీ ఈవో టి.శ్రీనివాసరావు వెల్లడించారు.

ముగిసిన డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం

శింగరకొండపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండపాలెంలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శిబిరం ఆదివారంతో ముగిసింది. వారం రోజుల పాటు గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహించారు. విలువైన సమాచారాన్ని గ్రామస్థులకు అందించారు. అధికారులతో అవగాహన కల్పించారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా సచివాలయం వద్ద సమావేశం, సదస్సులు నిర్వహించారు. మధ్యాహ్నం తరువాత గ్రామంలో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం శింగరకొండపాలెం, కొత్తరెడ్డిపాలెంలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి తెదేపా గ్రామ క్లస్టర్ ఇన్‌ఛార్జి స్వాములు, పంచాయతీ కార్యదర్శి చెన్నయ్యలు సంపూర్ణ సహకారం అందించారు. యూనిట్-1 అధికారి డాక్టర్ ఎన్.పద్మలారాణి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.వి.సత్యనారాయణ, అధ్యాపకుల డాక్టర్ వి.ప్రసాద్, వీటీవీఎస్.రమణక్ష్మ, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, తదితరులు

చీరాల, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలనేది తన లక్ష్యమని, దీనిలో భాగంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. ఈనెల 12న చీరాలలోని ఎన్ఆర్‌పీఎం పాఠశాలలో నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమించేయ్.. పార్టీ కండువా మార్చేయ్

విఠల్‌నగర్, దండుబాట సెంటర్ (చీరాల), న్యూస్‌టుడే:

పట్టణంలో విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా కొనసాగిన ఆక్రమణల పర్వం కూటమి పాలనలో కొంతమేర తగ్గినా పూర్తిగా మార్పు రాలేదు. అధికారులు మాత్రం మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

చీరాలకు రెండు వైపులా అందుబాటులోకి రావడంతో పాటు తీరప్రాంత పర్యాటకం బాగా పెరిగింది. దీంతో పట్టణంలో వాణిజ్య దుకాణాలు, కార్పొరేట్ వైద్యశాలలు, ఇలా అనేక వాణిజ్య కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇక వస్త్రవ్యాపారం రాష్ట్రంలోనే పేరుగాంచింది. దీనికితోడు పట్టణ పరిధి తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇక్కడి భూములకు డిమాండ్ ఏర్పడింది. దీంతో రోడ్ల పక్కన కొంచెం స్థలం ఆక్రమించుకున్నచాలు అన్నట్లుగా పరిస్థితి ఉంది.

వైకాపా పాలనలో రహదారుల పక్కన ఖాళీ జాగా కనపడితేచాలు ఆక్రమించేశారు. ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో తెలుసుకొని అప్పటి అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్నారు.

విఠల్‌నగర్‌లో ఆక్రమణలు

ప్రస్తుత విఠల్‌నగర్‌లోని ఆర్వోబీ వద్ద విలువైన స్థలాలు ఆక్రమించి, దుకాణాలు నిర్మిస్తున్నారు. దీనికి స్థానికంగా ఉన్న వైకాపా ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. ఆదేవిధంగా తంలో విలువైన ప్రభుత్వ భూమి ఖాళీగా ఉంది. దీన్ని ఆక్రమించేందుకు ఆ నాయకులు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణం వైపు ఉన్న ఆర్వోబీ కింది ప్రాంతంలో వైకాపాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. వీటితోపాటు మున్సిపల్ కార్యాలయం పక్కన, బాలికోన్నత పాఠశాల వద్ద, ప్రభుత్వ వైద్యశాల రహదారిలో ఆక్రమణలు పెరిగిపోయాయి. ఇవన్నీ విలువైన భూములు.. వీటిలో చాలా వరకు ఆక్రమించి అద్దెలకు ఇస్తున్నవారే కావడం గమనార్హం. జయంతిపేట సెయింట్ ఆన్స్ పాఠశాల సమీపంలో, రామనగర్ 300 కాలనీలో జరిగిన భూముల అవకతవకలపై విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కుబడి చర్యలతో అధికారులు

కోట్ల రూపాయల విలువైన భూముల ఆక్రమణ గుర్తుంటే అధికారులు మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు. వాటికి పన్నులు వేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వారు తాము చట్టబద్ధంగా ఉంటున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఇక వైకాపా స్థలాలు ఆక్రమించిన వారు పార్టీ ఎటువంటి చర్యలు లేకుండా పెంచడంలేదు. కొందరు తమకు ఇబ్బంది ఎదురవుతుందనుకుంటే పార్టీ కండువా మార్చేస్తున్నారు. అధికారులు విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రషీద్‌ని వివరణ కోరగా పరిశీలిస్తామని చెప్పారు.

స్వామివార్లకు మహా రుద్రాభిషేకాలు

వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

బల్లికురవ, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం మండలంలోని ప్రసిద్ధ బ్రాహ్మగుండం వద్ద కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి, నాగలింగేశ్వరస్వామి వార్లకు విశేష మహా రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు చేశారు. అష్టోత్తర పూజలు, బిల్వార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు అద్దంకి తాలూకా ఎన్జీవో సంఘ ఎన్నికలు

రామ్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే: అద్దంకి తాలూకా ఏపీ ఎన్జీవో ఎన్నికలు సోమవారం నిర్వహించనున్నారు. అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు మండలాల్లో మొత్తం 902 మంది వరకు ఓటర్లు ఉండగా అందులో ఓటుహక్కు కలిగిన వారు మాత్రం 699 మంది మాత్రమే. తాలూకా పరిధిలో మొత్తం 16 పదవులకు నామపత్రాలు స్వీకరిస్తారని అధ్యక్ష, కార్యదర్శులు జి.కిరణ్‌కుమార్, తాళ్లూరి రమేష్‌బాబు తెలిపారు. ఎన్నెస్పీ కాలనీ పరిధిలోని ఎన్జీవో కార్యాలయం వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్హత కలిగిన వారి నుంచి నామపత్రాలు స్వీకరిస్తారన్నారు. పరిశీలించిన అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు పోటీలో ఉండే వారి జాబితా ప్రదర్శిస్తారన్నారు. ఉపసంహరణ 9న ఉంటుందన్నారు. అవసరమైతే ఈనెల 15న ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జనవరి 4న సీఐటీయూ మహాసభలు

అభ్యుదయనగర్(అద్దంకి), న్యూస్‌టుడే: విశాఖపట్నంలో జనవరి 4న జరిగే అఖిల భారత సీఐటీయూ 18వ మహాసభలను విజయవంతం చేయాలని అద్దంకిలో ఆదివారం గోడపత్రికను ఆవిష్కరించారు. అభ్యుదయనగర్‌లోని సుందరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.మజుందార్, తంగిరాల వెంకటేశ్వర్లు, పెనుబాక ఆదాం, తిరుపతి రెడ్డి, శారద, ఉసురుపాటి శామ్యూల్, రావులపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో కొవ్వొత్తుల ప్రదర్శన

అద్దంకి, న్యూస్‌టుడే: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని పసుమర్తిపాలెం ప్రార్థనా మందిరానికి చెందిన వారు పట్టణంలో ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సుమారు 60 మందితో కూడిన బృందం ఉదయం పట్టణంలోని ప్రతి నాలుగు రోడ్ల కూడలిలో కొద్దిసేపు నిలబడి ప్రార్థనలు చేశారు. స్థానికులు ఈ అంశాన్ని ఆసక్తిగా గమనించారు.

కళాపురస్కారానికి సుందర రామకృష్ణ ఎంపిక



డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ

అద్దంకి, న్యూస్‌టుడే: పుట్టంరాజు బుల్లెయ్య-రామలక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్టు అందిస్తున్న 2025 విస్తృత కళాపురస్కారాన్ని ఈ ఏడాదికి సినీనటుడు డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ ఎంపికైనట్లు ప్రతినిధి శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈనెల 21న పురస్కారంతో పాటు రూ.పది వేల నగదు, పట్టువస్త్రాలు, జ్ఞాపిక అందించనున్నట్లు చెప్పారు.

మాజీ సర్పంచి ఆదియ్యకు నివాళులు

నాగరాజుపల్లి(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని నాగరాజుపల్లి గ్రామ మాజీ సర్పంచి మిన్నెకంటి ఆదియ్య చిత్రపటానికి తెదేపా నేతలు నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మిన్నెకంటి దశదినకర్మ స్వగృహంలో ఆదివారం నిర్వహించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, అసిస్ట్ సంస్థ ప్రతినిధి జాస్తి రంగారావు, నేతలు కందుల రమణరావు, గంగా శ్రీనివాసరావు, అబ్దుల్ రజాక్, తొండెపు ఆదినారాయణ, కిలారు లక్ష్మీనారాయణ తదితరులు హాజరై కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయన చిత్రపటం వద్ద పూలతో నివాళులర్పించారు. వారితో దివ్వే కిశోర్ ఉన్నారు.

బస్టాండ్‌లో ఇష్టారీతిన వాహనాల పార్కింగ్

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో వాహనాల పార్కింగ్ ఇష్టారీతిన సాగుతోంది. పలు దుకాణాల వద్ద కొనుగోలు నిమిత్తం వచ్చిన వారు వాహనాలు అక్కడే ఉంచి వెళ్లిపోతున్నారు. వీటిలో కొన్ని చోరీ చేసిన వాహనాలూ ఉన్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఆర్టీసీ డిపోలో పని చేసే సిబ్బంది వీటి విషయంలో కఠినంగా వ్యవహరించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు.. కొటికలపూడికి సాగర్ జలాలు

పార్వతీపురం వద్ద పొగతోటలకు నీరు పెట్టుకుంటున్న రైతులు

కొటికలపూడి (అద్దంకి), న్యూస్‌టుడే: సాగర్ జలాలు కొటికలపూడికి చేరాయి. పొగతోటలు సాగు చేసిన రైతులు నీటి తడులు పెట్టుకుంటున్నారు. మోదేపల్లి మేజరు కాలువ ఏర్పడిన తరువాత బహుశా రైతుల అవసరాలకు తగినట్లుగా నీటి సరఫరా జరగడం అరుదు. జలాశయంలో నీరు పుష్కలంగా ఉండటంతో నెల రోజుల క్రితం పంచాయతీ సర్పంచి పూనాటి విక్రం, నీటిసంఘం నేతలతో కలిసి సాగర్ కాలువలో చిల్ల చెట్లు తొలగించారు. ఫలితంగా నీటి సరఫరాకు మార్గం సుగమమైంది.

ప్రమాదాల నివారణే లక్ష్యం

శింగరకొండ వద్ద నామ్ రహదారిపై వేగనియంత్రికల ఏర్పాటు

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: నామ్ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లో జిల్లా ఎస్పీ పర్యటించారు. ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి స్థానిక అధికారులకు సూచనలు చేశారు. దీనిలో భాగంగా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి, ఆయా ప్రదేశాల వద్ద వేగనియంత్రికలు(స్టాపర్స్)ను ఉంచారు. పట్టణంలోని కలవకూరు రోడ్డు, విద్యుత్తు కార్యాలయం, శింగరకొండ, చక్రాయపాలెం, శాంతినగర్, చిన్నకొత్తపల్లి, గోవాడ మలుపుల వద్ద వీటిని ఏర్పాటు చేశారు. నామ్ రహదారి గుత్తేదారు సంస్థతో మాట్లాడి జీబ్రా గీతలు గీయించనున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

నీటి వృథా.. ఎవరికీ పట్టదా?

నాగులబండ బజారు వద్ద సైడుకాలువలో కలుస్తున్న మంచి నీరు

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. వీధి కుళాయిల నుంచి మంచినీరు వృథాగా మురుగు కాలువల్లో కలుస్తోంది. ప్రజలు ప్రశ్నించిన సమయంలో పైపులు నిర్మిస్తున్నారు. శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. మంచినీటి పైపులైన్‌కు కుళాయిలు బిగించని ఫలితంగా ద్విచక్రవాహనం తగిలితే చాలు అవి పగిలిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితి పట్టణంలో అనేక చోట్ల నెలకొని ఉంది. తక్షణం శాశ్వత మరమ్మతులు జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇక్కడ ఫుట్‌పాత్‌లు ఉండేవట!?

మీకు ఏమైనా కనిపించాయా

ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఫుట్‌పాత్ దాటి రోడ్డుపైనే ఇలా...

అద్దంకి, న్యూస్‌టుడే: నామ్ రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనికితోడు కొంతమంది రహదారి వెంబడి దుకాణ యజమానులు తామే ఒక అడుగు ముందుకేసి ఉప అద్దె(సబ్‌లీజు)కు ఇస్తున్నారు. ఈ కారణంగా ప్రమాదాల నివారణకు నిర్మించిన ఫుట్‌పాత్‌లు నిరుపయోగంగా మారాయి. బంగ్లా రోడ్డు నుంచి భవానీ కూడలి వరకు ఇలాంటి పరిస్థితి నెలకొంది. పురపాలక, పోలీసు అధికారులు జోక్యం చేసుకుని ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధపడుతుండగా రాజకీయ నాయకుల నుంచి సిఫార్సులు పెరిగిపోతున్నాయి. అదీ కుదరకపోతే సంఘాల నేతలు ప్రత్యక్షమవుతున్నారు.

సుమారు రూ.80 లక్షలతో నిర్మాణం

వాహనాల తాకిడి అధికంగా ఉండే బంగ్లా రోడ్డు నుంచి ఎస్‌బీఐ (ఏసీబీ) వరకు 800 మీటర్లు, కమఠేశ్వరాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు 1200 మీటర్ల చొప్పున రెండు కి.మీ. నిడివిన ఫుట్‌పాత్‌లు నిర్మించారు. దీనికి పురపాలక సంఘం నిధులు రూ.80 లక్షలు వెచ్చించారు. ఫుట్‌పాత్‌లపై ప్రజలు నడవాల్సింది పోయి చిన్న వ్యాపారులు ఉపయోగించుకుంటున్నారు. పాదచారులు ఫుట్‌పాత్‌పైకి నడిచే అవకాశం లేకుండా అన్నిరకాలుగా ఆటంకాలు సృష్టిస్తున్నారు. గతంలో పురపాలక ప్రణాళిక విభాగం అధికారులు తోపుడుబండ్లు, చిరు వ్యాపారుల్ని తొలగించేందుకు ప్రయత్నించగా పాత అధికారుల పేర్లు చెప్పి చర్యలు చేపట్టకుండా అడ్డుకోగలిగారు. ఫలితంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రహదారి అంచులు పూర్తిగా చిరు వ్యాపారుల ఆధీనంలోనే ఉన్నాయి. ఈ విషయమై సీఐ ఎ.సుబ్బరాజును వివరణ కోరగా సోమవారం నుంచి ఫుట్‌పాత్ దాటిన చిరు వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా 18 మెట్ల పూజ

సోపిరాల (చినగంజాం), న్యూస్‌టుడే: సోపిరాలలోని శ్రీహరహరసుత అయ్యప్పస్వామి ఆలయం ఎదుట ఉన్న 18 మెట్ల వద్ద పూజలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని దివంగత పర్వతరెడ్డి వెంకటస్వామి, ధర్మపత్ని రంగనాయకమ్మ కుటుంబ సభ్యులు చేశారు. వారితో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు, విజయలక్ష్మి దంపతులు, గురుస్వాములు, అయ్యప్ప, శివ, కనకదుర్గ, ఆంజనేయ స్వామి స్వాములు పూజల్లో పాల్గొన్నారు. లక్ష్మణస్వామి, ఆర్కెస్ట్రా వారు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

భవానీ కూడలా.. విక్రయ కేంద్రమా

కూడలిలో ఇదీ పరిస్థితి

అద్దంకి, న్యూస్‌టుడే: నాలుగు రోడ్ల కూడలి.. మూడు రాష్ట్రాలకు చెందిన వాహనాలు కలిసే ప్రదేశం. ఇది అద్దంకి భవానీ కూడలి పరిస్థితి. నిరంతరం వాహనాల రద్దీతో ఇరుకుగా మారుతోంది. దీనికితోడు ఆదివారం అయితే చాలు వేకువజాము నుంచి మాంసం విక్రయదారులు, కోళ్లు అమ్ముకునే వారితో నిండిపోతుంది. వీటి విక్రయాలు బహిరంగంగానే జరుగుతాయి. పొట్టేలు మాంసం దారులు ఒకరిని చూసి మరొకరు తాత్కాలిక దుకాణాలు నెలకొల్పుతున్నారు. వాటిని కొనేందుకు వచ్చే వారి ద్విచక్ర వాహనాలు, పండ్ల దుకాణాలు ట్రాఫిక్‌కు తీవ్ర అడ్డంకిగా మారుతున్నాయి. అధికారులు మాత్రం మాకేం పట్టదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పైపెచ్చు శివాలయం ఎదుటే చేపలు, మాంసం విక్రయాలు జరుపుతుంటే కనీసం ప్రశ్నించే వారులేకపోవడంపై భక్తులు ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు. చెన్నై, హైదరాబాద్, బళ్లారి/బెంగళూరు, విజయవాడ నుంచి వచ్చే వాహనాలన్నీ భవానీ కూడలి మీదుగానే ప్రయాణించాలి. పదేళ్ల క్రితంతో పోలిస్తే వాహనాల రద్దీ నాలుగింతలు పెరిగింది. కూడలిలో నిరంతరం పోలీసుల గస్తీ ఉన్నా రహదారి విస్తరణ లేక చోదకులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి.

సిగ్నల్ వ్యవస్థ అనివార్యం

రాజధాని అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వెళ్లే కూడలి కావడంతో వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రమాదాలు జరిగిన తరువాత బాధపడేకంటే ముందుగానే హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే కొంతవరకు ప్రమాదాలను నియంత్రించొచ్చని పట్టణవాసులు అభిప్రాయ పడుతున్నారు. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి గుత్తేదారుల సమన్వయంతో పోలీసు, పురపాలక అధికారులు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గుండ్లకమ్మ వంతెనకు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

తిమ్మాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే: గుండ్లకమ్మ వంతెనపై మరమ్మతులు చేపట్టారు. 'ఈనాడు'లో అక్టోబరు 16న ప్రచురితమైన 'గుంతల దారితో ముప్పు' కథనానికి ర.భ.శాఖ అధికారులు స్పందించారు. వంతెన ఉపరితలం దృఢంగా ఉన్న కారణంగా మరమ్మతులు చేస్తే సరిపోతుందని భావించారు. ఆమేరకు రూ.2 లక్షలతో వంతెన పైభాగం, అప్రోచ్ దారిలో మరమ్మతు పనులు శనివారం చేపట్టినట్లు ర.భ.శాఖ ఏఈ శివన్నారాయణ తెలిపారు.

పైపులైను సరిచేశారు

పర్చూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన భారీ ఇనుప పైపులైను పర్చూరు-గుంటూరు రహదారిలో లోలెవల్ చప్టా వద్ద మొంథా తుపాను వరద నీటి ఉద్ధృతికి రోడ్డుకు ఒకవైపునకు చేరింది. దీనిపై గతనెల 17న 'పైపులైను సరిచేయరూ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శుక్ర,శనివారాల్లో విడతలవారీగా ఆ పైపు లైనును రోడ్డుకు ఒకవైపునకు సరిచేసి ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

తవ్వివ గుంత పూడ్చారు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.10 లక్షలతో సుమారు అయిదున్నర కిలోమీటర్ల పరిధిలో పైపు లైను పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. ఇవి అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీనిలో భాగాంగా చినగంజాం పోలీస్‌స్టేషన్ ఎదుట తారురోడ్డు పక్కన తీసిన తవ్విన గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో గుంత ప్రాంతంలో వాహన చోదకులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వైనాన్ని వివరిస్తూ దీనిపై ఈ నెల 5న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.బసవరాణి స్పందించారు. గుంతను పూడ్పించారు. దీంతో ఆ ప్రాంతంలో ఇబ్బంది లేకుండా సంతోషంగా వాహనాలపై వెళుతున్నామని పలువురు వాహన చోదకులు తెలిపారు.

గంగాభవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

కారంచేడు, న్యూస్‌టుడే: కారంచేడు గ్రామంలోని శ్రీ జగజ్జనని గంగా భవానీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్షాపరులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లనైవేద్యాలు సమర్పించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీత

చదరంగంలో తలపడుతున్న క్రీడాకారులు

చీరాల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన వారోత్సవాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎనిమిది రోజులు జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పోటీలు ప్రారంభమయ్యాయి. డాక్టర్ విజయ్‌కుమార్, బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, శంకరరెడ్డి, చుక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అసంపూర్తి కాలువలకు మోక్షం కలిగేనా?

యూనియన్ బ్యాంకు వద్ద నిలిచిన మురుగు నీరు

వేటపాలెం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన వేటపాలెం పంచాయతీకి వందేళ్ల పైబడి చరిత్ర ఉంది. 17 వార్డులు, 15 వేల కుపైబడి జనాభా ఉంది. పంచాయతీ ఆదాయం అరకోటిపైనే ఉంది. ఇంతటి చరిత్ర ఉన్న పంచాయతీలో ఆరేళ్లుగా మురుగు సమస్య ఉన్నా నేటికి పరిష్కారం లభించకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో భూగర్భ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పంచాయతీ కార్యాలయం దగ్గర నుంచి చిన్నబజారు, తుపానుపేట, రోటరీ క్లబ్ రోడ్డు, రైల్వేస్టేషను రోడ్డు, గొల్లపూడివారి వీధి, సర్వోదయ కాలనీ ప్రాంతాల్లో కొత్త కాలువ నిర్మాణం ప్రారంభించారు. కొన్ని కాలువలు నిర్మించారు. దీనికోసం రూ.70 లక్షలు వ్యయం చేశారు. ఆ తరువాత నిధులు విడుదల కాక పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

అనుసంధానం చేయని కాలువలు

కొన్నింటిని నిర్మించినప్పటికి అనుసంధానం చేయలేదు. దీనివల్ల గృహాల్లో వినియోగించిన మురుగునీరు పారుదల లేక దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు రాత్రులు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో తవ్విన కాలువలను స్థానికులే మూసివేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య స్థానిక పంచాయతీ కార్యాలయానికి విచ్చేశారు. ఈసమయంలో ప్రధానంగా డ్రైనేజి సమస్యను ప్రజలు, నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నేటికి పనుల్లో కదలిక లేకపోవడంతో మురుగు సమస్యకు ఎప్పటి మోక్షం కలుగుతుందో నని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎన్నారైలు

యద్దనపూడి, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ డాలస్ పర్యటన సందర్భంగా అక్కడున్న యద్దనపూడి మండలంలోని ప్రవాసాంధ్రులు ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు. భారతకాలమాన ప్రకారం శనివారం రాత్రి 11 గంటల సమయంలో అక్కడి తెలుగు డయాస్పోరా సమావేశ మందిరంలో లోకేశ్‌ని కలిసినట్లు ఎన్నారై ప్రతినిధి సభ్యుడు నారాయణ తొట్టెంపూడి తెలిపారు.

చిన గర్నెపూడిలో సమస్యల తిష్ఠ

పాఠశాల పక్కన పోలేరమ్మ గడ్డలో నిలిచిన మురుగు

చిన గర్నెపూడి(పర్చూరు), న్యూస్‌టుడే: డ్రైవర్ల గ్రామంగా పేరొందిన చిన గర్నెపూడిలో సమస్యలు తిష్ఠవేశాయి. పిడుగురాళ్ల-వాడరేవు జాతీయ రహదారిని ఆనుకుని ఉండే ఈ గ్రామంలో మొత్తం 700మంది జనాభా నివసిస్తున్నారు. ఏ వీధిలో చూసిన సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగుపారుదల లోపించి, దుర్వాసన వెదజల్లుతోంది. ఈ గ్రామంలోని చెరువుల్లో నీరు రంగుమారి గృహావసరాలకు వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. మంచినీటిని పర్చూరు, అడుసుమల్లి గ్రామాలకు వెళ్లి డబ్బాల్లో తెచ్చుకుంటున్నామని మహిళలు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనప్పటికీ అవి అరకొరగా పూర్తి చేశారు. బడితో పాటు పక్కనే ఉన్న పోలేరమ్మ గడ్డపై వర్షాల సమయంలో నీరు నిలిచి దుర్వాసన వస్తోందని, దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు రోగాల బారినపడే ప్రమాదం ఉందని గ్రామ యువత చెబుతున్నారు. గ్రామంలో సైడ్ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనుల్లో జాప్యం జరుగుతోందని, అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అర్చకుల సమస్యలపై సమావేశం 10న

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : అర్చకుల క్షేత్ర స్థాయి సమస్యలు, అర్చక సంక్షేమ నిధి ద్వారా చేపట్టాల్సిన పథకాలపై అర్చక సంఘ ప్రతినిధులతో చర్చించేందుకు దేవాదాయ శాఖ ఈనెల 10న గొల్లపూడి కమిషనర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిందని మండల అర్చక సంక్షేమ సంఘం నాయకులు స్వర్ణ శ్రీనివాసశర్మ, చావలి శ్రీధర్‌శర్మ తెలిపారు. అర్చక సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో సమావేశానికి హాజరై దేవాలయాల్లో మెరుగైన సేవలందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అర్చకుల సమస్యలపై శాఖకు తగు సూచనలు చేయాల్సిందిగా వారు కోరారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

చెరుకుపల్లి,న్యూస్‌టుడే: గుంటూరులో ఈనెల 8, 9 తేదీల్లో జరిగే అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ)రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా నాయకుడు మరివాడ వెంకట్రావు కోరారు. సమాఖ్య నాయకులు ఆదివారం మండలంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd., Addanki Branch, Bapatla District issue the following notice to the general public.

My client intends to grant loan to the applicant Kesanapalli Lydiarani, W/o Vijayakumar,R/o, Addanki Village and Mandal, Bapatla District, Andhra Pradesh, submitted the documents to create the same as security for the Trade Finance. On careful scrutiny of the documents, I have submitted my legal opinion as follows for the property as security by way of registered mortgage. As such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes, etc., shall be informed to the below address within 7. days from the date of this notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE: Bapatla District Registration, Addanki Sub Registration, Addanki Mandal, Addanki Grama Panchayat, North Addanki Village Sy.No.975. Northern side to Door No.31- 590, LEF Nagar, an extent of 98 Sq.yards of vacant site, bounded by: **East :** House of Sanepogu Joseph **South :** Remaining property of Executant, **West :** Site of Varagani Marthamma, **North :** Road

Sd/- **M.S.S.PRASAD**
Advocate & Legal Advisor, AP/3706/2023
Shriram Finance Ltd., Ongole

(c) eenadu

ఈనాడు
చిత్తూరు
సోమవారం డిసెంబరు 8, 2025

కాణిపాకం.. కిటకిట

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దర్శనానికి సాధారణ, అయ్యప్ప భక్తులతో ఆదివారం ఆలయం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. దర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది. భక్తులకు కావాల్సిన వసతులను ఆలయ అధికారులు పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, కాణిపాకం

టికెట్ ఉంటేనే అంతరాలయ దర్శనం

ఈనాడు కథనానికి స్పందన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల అంతరాలయ దర్శనాలకు వెళ్లే భక్తులు విధిగా టికెట్ తీసుకోవాల్సిందేనని ఈవో బాపిరెడ్డి స్పష్టం చేశారు. టికెట్ లేకుండా అంతరాలయ దర్శనాలకు అనుమతించడంపై 'నిబంధనలు ఏమైనట్లు' శీర్షికన ఈ నెల 4వ తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆలయ ఈవో అంతరాలయ దర్శన టికెట్లు కచ్చితం చేస్తూ, భక్తులు ఎవరైనా వాళ్ల వ్యక్తిగత వివరాలు ఇచ్చి అంతరాలయ దర్శన టికెట్లు పొందేందుకు వీలుగా ఆదివారం నుంచి అవకాశం కల్పించారు. తీసుకున్న టికెట్లను మహాద్వారం ముందుగా స్కానర్ల ద్వారా తనిఖీ చేయడం, ఆపై మహాద్వారం, స్వామి, అమ్మవార్ల ఆలయాల వద్ద పరిశీలించి పంపే విధంగా ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.

బీసీలకూ.. సూర్య వెలుగులు

ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ పలకలు

విద్యుత్ వినియోగదారుల బిల్లులు తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం.. పీఎం సూర్య ఘర్ పథకం విస్తరణకు కూటమి ప్రభుత్వ సారథ్యంలో వేగవంతం చేసింది. ఇంటి పైకప్పుపై సౌర పలకలు ఏర్పాటు చేసుకునే ఓసీ, బీసీ సర్వీసుదారులకు రాయితీలు అందజేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల మంది బీసీ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ పలకలు ఉచితంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 3.45 లక్షల బీసీ వర్గాల గృహ సర్వీసుదారుల నివాసాలపై సూర్య వెలుగులు మున్ముందు ప్రకాశించనున్నాయి.
న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు)

జిల్లాలో బీసీ వర్గాల గృహ సర్వీసులు ఇలా..(లక్షల్లో)
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సర్వీసులు: 3.45
- చిత్తూరు జిల్లా: 1.45
- తిరుపతి జిల్లా: 1.90

ఎస్సీ, ఎస్టీలకు 16 వేల పలకల ఏర్పాటు

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర పలకలు ప్రభుత్వం ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో అమర్చుతోంది. తొలుత జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సర్వీసుదారులకు 16 వేల సౌరశక్తి యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటికే వీటి ఏర్పాటుపై టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఆయా పనులు చేపట్టేందుకు చిత్తూరు జిల్లాకు ఓ కంపెనీని కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

గ్రిడ్‌కు అనుసంధానం..

ఇళ్ల పైకప్పులపై సౌరపలకలు ఏర్పాటు చేసి.. విద్యుదుత్పత్తి చేసి సొంతానికి వినియోగించుకున్నది పోను.. మిగిలింది గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పాతికేళ్ల పాటు విద్యుత్తు పొందే అవకాశం ఉంది. బీసీలు సూర్యఘర్ పథకంలో ఉచితంగా రూఫ్‌టాప్ పలకల ఏర్పాటుకు అధికారులు తెలియజేశారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా..

బీసీ వర్గాల గృహ సర్వీసులకు ఉచితంగా సూర్యఘర్ పథకం అమలుపై ఉత్తర్వులు రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తాం. ఈ పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. **-ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ, చిత్తూరు జిల్లా**

గోడలపై బొమ్మలు.. చరిత్రకు ప్రతిబింబాలు

మండలంలోని కంగుందిని కడా సహకారంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తదేకం ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఇందులో భాగంగా ఇప్పటికే విద్యార్థులకు బోల్డరింగ్, రాక్ క్లైబింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు గ్రామంలోని ఇంటి గోడలపై చరిత్రను ప్రతిబించేలా దేవతామూర్తుల బొమ్మలను పెయింటింగ్ ద్వారా రూపుదిద్దుతున్నారు. ఈ బొమ్మలను జనం ఆసక్తిగా తిలకిస్తున్నారు. **- న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణం**

బినామీ రిజిస్ట్రేషన్లు.. బోగస్ దందా

- వెలుగులోకి తుక్కు వ్యాపారి సీజీఎస్టీ అక్రమాలు
- నకిలీ బిల్లులతో రూ.కోట్లు దోపిడీ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: జీఎస్టీ రిటర్న్‌లో అక్రమాలకు పాల్పడిన తుక్కు మాఫియా ముఠా నాయకుడిని అధికారులు గుర్తించారు. ఆతడిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించడం లేదు. కాకి లెక్కలతో రూ.కోట్ల లావాదేవీలు చూపి పన్ను మినహాయింపు మొత్తాన్ని రిటర్న్స్ ద్వారా దోచుకున్నట్లు గుర్తించారు. అమాయకులకు నగదు ఆశ చూపి వారి పేరుతో నాలుగు బోగస్ సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో క్రయవిక్రయాలు చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సీజీఎస్టీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సొమ్ము దోచుకున్నారు. చిత్తూరు కేంద్రంగా ఇటీవల వెలుగు చూసిన ఈ వ్యవహారం సంచలనం సృష్టించింది.

అక్రమాలకు పాల్పడిన సంస్థలు ఇవే..

చిత్తూరు నగరానికి చెందిన ఆరహం మెటల్ అండ్ నాన్ ఫెర్రో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మదీనా స్టీల్స్, జెడ్‌ఎఫ్ ట్రేడర్స్, యార్ స్టీల్స్, ఎమ్మార్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్.. ఇవన్నీ బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ అయ్యాయి. వాటి ద్వారా పెద్దఎత్తున వ్యాపారం చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సీజీఎస్టీ రిటర్న్స్ చేయించుకుని ప్రభుత్వ సొమ్ము రూ. కోట్లలో కాజేసినట్లు విచారణ బృందాలు తేల్చాయి.

ముఠా నాయకుడు చిత్తూరు వాసి..

తుక్కు వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించి అక్రమ మార్గంలో రూ. కోట్లు గడిస్తున్న బోగస్ సంస్థలన్నింటికీ అంతిమ ముఠా నాయకుడు చిత్తూరు వాసిగా గుర్తించారు. గతంలోనూ ఆతడి అక్రమాలు గుర్తించి కేసులు నమోదు చేసినా, తనకున్న పలుకుబడి, ఆర్థిక బలంతో పాటు వాణిజ్య పన్నుల శాఖలోని కొందరి అధికారుల సహకారంతో తన అక్రమ వ్యాపారాన్ని కొనసాగించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. అమాయకులు, దినసరి కూలీలు, తోపుడు బండ్లపై చిరు వ్యాపారం చేసుకునే పేదలకు మధ్యవర్తుల ద్వారా రూ.10 వేల నుంచి రూ.20 వేలు ఇవ్వడం, వారి ఆధార్, పాన్, చరవాణుల నుంచి ఓటీపీ నంబర్లు తీసుకుని బినామీ సంస్థలు రిజిస్ట్రేషన్ చేయించారు. బ్యాంకుల్లోనూ వారి ఖాతాలకు సీజీఎస్టీ రిటర్న్స్ చేయించి ఆ మొత్తాన్ని దోచుకున్నట్లు గుర్తించారు.

ఎలా గుర్తించారంటే..

తుక్కు మాఫియా ముఠా నాయకుడి ఫోన్ నంబరు ఆధారంగా కాల్ రికార్డులు సేకరించి నిత్యం మాట్లాడే వారి నంబర్లు, జరిగిన సంభాషణ, బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ సంస్థలు, సీజీఎస్టీ ఇన్‌పుట్ టాక్స్ రిటర్న్స్ చేయించిన ఖాతాలు, వారి ఆర్థిక లావాదేవీలతో పాటు, మధ్యవర్తులుగా వ్యవహరించిన కొందరిని అదుపులోకి తీసుకుని వివరాలు రాబడుతున్నారు. త్వరలో ఈ దందాలో ముఠా నాయకుడితో పాటు, మరికొందరిని అదుపులోకి తీసుకుని మొత్తం వ్యవహారాన్ని గుట్టురట్టు చేయనున్నారు.

వాహనదారులూ.. ఈ సేవలు తెలుసా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎటువైపు ప్రయాణం చేయాలన్నా జాతీయ రహదారుల్లో వెళ్లాల్సిందే. టోల్‌గేట్ల వద్ద రుసుము చెల్లిస్తూ.. దాటాల్సిందే. మరి ఇలా వసూలు చేసే డబ్బులతో వాహనదారులకూ పలు సౌకర్యాలు కల్పిస్తారని తెలుసా.. అవేంటో తెలుసుకుందామా..! **- న్యూస్‌టుడే, పుత్తూరు**

- జిల్లాలో జాతీయ రహదారి పొడవు: **350** కి.మీ.
- వాహనం ఆగితే.. **1033**

జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగినా.. వాహనం బోల్తాపడినా.. మరమ్మతుకు గురై ఆగిపోయినా 1033 నంబరు సంప్రదించాలి. ఫోన్ చేసిన వెంటనే దిల్లీలోని కేంద్ర కార్యాలయానికి సమాచారం చేరుతుంది. సమీపంలోని టోల్‌గేట్ నిర్వాహకులు స్పందించి తక్షణమే సిబ్బంది వచ్చి సాయం చేస్తారు. వాహనంలో పెట్రోల్, డీజిల్ అయిపోయినా ఈ నంబరు ద్వారా సాయం పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులు
- పూతలపట్టు-నాయుడుపేట
- తిరుపతి- చెన్నై
- చిత్తూరు-బెంగళూరు
- చెన్నై- గూడూరు

తిరుపతి-చెన్నై జాతీయ రహదారి ఎస్పీపురం వద్ద ఉన్న టోల్‌ప్లాజా

పోలీసుల సాయం.. 112

జాతీయ రహదారుల్లో అనుకోని సంఘటనలు జరిగిన సమయంలో 112ను సంప్రదిస్తే పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటారు. దీనికితోడు టోల్‌ప్లాజాల వద్ద 24 గంటలు అంబులెన్స్, క్రేన్, హైవే పెట్రోలింగ్ వాహనం అందుబాటులో ఉంటాయి. వాహనాల పార్కింగ్ స్థలాలు, డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు గదులు ఉంటాయి. ఈ సేవలన్నీ ఉచితమే.

ఫొటో పెట్టు.. రివార్డు పట్టు

జాతీయ రహదారుల సంస్థ ఇటీవల ఓ ప్రకటన చేసింది. టోల్‌ప్లాజాల వద్ద పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. అదే సమయంలో అవి అపరిశుభ్రంగా ఉంటే ఫొటో తీసి రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రివార్డు కూడా ఇస్తారు.

సేవలకు ఎస్‌వోఎస్..

జాతీయ రహదారిపై ప్రతి రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో రోడ్డు పక్కన పసుపు రంగు స్తంభాల వద్ద ఎస్‌వోఎస్ పెట్టెలు ఉంటాయి. ఎలాంటి అవసరమైనా దానిపై ఉండే మీటను నొక్కితే సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని సేవలందిస్తారు.

కడలి ఒడిలో.. స్వర్ణకాంతులు

దిత్వా తుపాను అనంతరం ఏర్పడిన అల్పపీడనంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. స్వర్ణముఖి నది నిండుకుండను తలపిస్తూ ఉద్ధృతంగా ప్రవహించింది. వరదనీరు వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద పెద్దఎత్తున సముద్రంలో చేరగా కొత్త, పాత నీరు ఇలా వేరువేరుగా కనిపించి కనువిందు చేసింది. **- ఈనాడు, తిరుపతి**

నేడు చిత్తూరులో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్, క్రైమ్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టరేట్, పాత ఏఆర్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లా ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

10నుంచి టెట్

జిల్లాలో ఐదు కేంద్రాలు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఏపీ టెట్ ఈ నెల 10 నుంచి 21 వరకు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నిర్వహించనున్నామని డీఈవో వరలక్ష్మి ఆదివారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జరుగుతాయన్నారు. 8,597మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని, అభ్యర్థులు తమ వెంట గుర్తింపు కార్డు(ఆధార్/పాన్‌కార్డు/డ్రైవింగ్ లైసెన్స్) ఒరిజినల్ తెచ్చుకోవాలని చెప్పారు. సందేహాలు ఉంటే చరవాణి సంఖ్య 73864 08270, 98855 06094, 84989 91250ను సంప్రదించాలని డీఈవో కోరారు.

పరీక్ష కేంద్రాలివే..

■ చిత్తూరు శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల(ఎస్వీసెట్), శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల(సీతమ్స్) ■ పలమనేరులో మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాల ■ కుప్పంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ■ పూతలపట్టులో పి. కొత్తకోట వేము ఇంజినీరింగ్ కళాశాల

కొండకు.. ఎకో ముద్ర

సీఎం చొరవతో రానున్న మరో 300 ఎలక్ట్రిక్ బస్సులు

తిరుమల క్షేత్రాన్ని సంపూర్ణ కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు భారీ కార్యాచరణ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ విధానంలో భాగంగా 2029 నాటికి ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్ మయం చేయాలన్న లక్ష్యంతో ఆర్టీసీ అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నూతన సంవత్సరంలో తిరుపతి, తిరుమలకు అదనపు బస్సులు రానున్నాయి. **ఈనాడు డిజిటల్, తిరుపతి**

ప్రస్తుతం ఆర్టీసీ వినియోగిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు

ప్రస్తుత సేవలు ఇలా..
- మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు: 100
- కొత్తగా వచ్చే ఈవీ బస్సులు: 350
- ఒకరోజులో డీజిల్ బస్సులు సహా తిరిగే ట్రిప్పులు: 2,600
- ప్రయాణికులు: 1,20,000

ముందుగా 50.. ఆపై 300

తిరుమల ఘాట్ రోడ్లలో ప్రస్తుతం 64 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. కడప, నెల్లూరు, మదనపల్లె మార్గాల్లో మరో 36 సర్వీసులు తిరుగుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తగా మరో 50 బస్సులకు ఆర్టీసీ టెండర్లు ఖరారు చేసింది. 'ఈకా' సంస్థ ఈ బస్సులను సరఫరా చేయనుండగా.. రానున్న 3-6 నెలల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఇవి కాకుండా.. తిరుమలకు ప్రత్యేకంగా మరో 300 బస్సులు కేటాయించాలని సీఎం కేంద్రాన్ని కోరడంతో అందుకు ఆమోదం లభించింది. వాటికి సంబంధించిన రూట్‌మ్యాప్, ప్రతిపాదనల ప్రక్రియ 95 శాతం పూర్తయిందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

కేంద్రమే నోడల్ ఏజెన్సీ

ఎలక్ట్రిక్ బస్సుల ధరలు, నిర్వహణ వ్యయం అధికంగా ఉండటంతో.. కేంద్ర ప్రభుత్వమే నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. పీఎం ఈ - సేవ కింద దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వివరాలు సేకరించి, కేంద్రమే టెండర్లు పిలుస్తుండటంతో తక్కువ ధరకే బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన 11 నగరాల్లో తిరుపతికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం విశేషం.

కొండపైనే ప్రత్యేక డిపో

ప్రస్తుతం అలిపిరి డిపో, తిరుపతి బస్టాండ్ పరిధిలో 36 ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో బస్సుల సంఖ్య భారీగా పెరగనుండటంతో కొండపైనే ప్రత్యేకంగా డిపో ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇందుకోసం 5 ఎకరాలు కేటాయించాలని తితిదేని కోరగా.. ప్రాథమికంగా అంగీకారం లభించింది. కొత్తగా నిర్మిస్తున్న శ్రీనివాసం, అచ్యుతం కాంప్లెక్సుల వద్ద కూడా ఛార్జింగ్ సదుపాయాలు కల్పించనున్నారు.

అప్పటిలోగా డీజిల్ బస్సులు బంద్

ప్రస్తుతం ఘాట్ రోడ్లలో 323 డీజిల్ బస్సులు నడుస్తున్నాయి. కొండ పైకి కిందికి కలిపి 2,600 ట్రిప్పులు తిరుగుతూ.. సుమారు 1.20 లక్షల మంది భక్తులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. రాష్ట్ర ఈవీ పాలసీ ప్రకారం 2029 నాటికి డీజిల్ బస్సులన్నింటినీ తొలగించి, నూటికి నూరు శాతం ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

స్థలముంటే గృహయోగం

- ఇప్పటికే 40 వేలకు పైగా దరఖాస్తులు
- 14 వరకు గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సొంతంగా ఇంటి స్థలం ఉన్నవారికి గృహం మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. . ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) 2.0 ద్వారా ఇంటి నిర్మాణం కోసం పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 2,400 గృహాలు మంజూరు చేశారు. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గడువు గత నెల 30తో ముగిసింది.. లబ్ధిదారులు ఇంకా దరఖాస్తులు చేస్తుండటంతో గడువును ఈ నెల 14 వరకు పొడిగించారు. గత నెల చివరి నాటికి 46వేల దరఖాస్తులందాయి.

స్థలం కావాలంటున్న పేదలు.. కొందరు ఇంటి నిర్మాణం కోసం స్థలం కావాలని వినతులు పెద్దఎత్తున అందిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 7,900 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటి స్థలం ఉన్నవారి దరఖాస్తులను గృహనిర్మాణ శాఖ ఏఈలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ద్వారా గృహం పొందారా..? లేదా..? తదితర విషయాల్ని విచారిస్తున్నారు. తర్వాత సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి స్థలం ఫొటో తీసి జియోట్యాగింగ్ చేస్తున్నారు.

మండలాల వారీ సర్వే..

వచ్చిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో సర్వే చేసి వివరాలు నమోదు చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటికే తమకు అందిన ఏడు వేల దరఖాస్తులు సర్వే చేశారు. చిత్తూరు నియోజకవర్గంలోని రెండు మండలాల్లో 750, జీడీనెల్లూరులో 3 వేలు, నగరిలో 1,500, పలమనేరులో 9,600, పుంగనూరులో 2,700, పూతలపట్టులో రెండు వేల దరఖాస్తులు సర్వే చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక జనవరిలో మంజూరు పత్రాలు అందించే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

ఎందుకీ దాపరికం.. ఎవరిదీ అలక్ష్యం

సంస్కృత వర్సిటీ ఘటనపై తీవ్ర విమర్శలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఘటనపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బీఈడీ విద్యార్థినిని అక్కడి అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కుమార్ మానసికంగా, శారీరకంగా వేధించడం, విద్యార్థిని వర్సిటీని వదిలి సొంత రాష్ట్రమైన ఒడిశాకు వెళ్లిపోయిన ఘటనలో అందరి వేళ్లు అక్కడి పాలకుల నిర్లక్ష్యం వైపే చూపుతున్నాయి.

సెమిస్టర్ జవాబుపత్రంలో ఫిర్యాదు.. ఘటనపై బాధిత విద్యార్థిని నవంబర్ 24న లిఖితపూర్వకంగా వర్సిటీ వీసీకి ఫిర్యాదు చేసింది. అదే సమయంలో సెమిస్టర్-1 పరీక్షలు జరుగుతుండటంతో.. తనను నిత్యం ప్రొఫెసర్ లక్ష్మణ్‌కుమార్ వేధిస్తున్నారంటూ జవాబుపత్రాల్లో పేర్కొనడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఘటన జరిగి రెండువారాలు గడిచినా వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లు ఈ అంశంలో ఎందుకు మౌనం దాల్చారో అంతుపట్టడం లేదు. గుట్టుచప్పుడు కాకుండా బాధిత విద్యార్థినిని నవంబరు 26న ఇంటికి పంపించారు. అసలు ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం బయటకు వెల్లడించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.

విచారణాధికారిగా డీఎస్పీ భక్తవత్సలం.. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో విచారణ అధికారిగా తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం నియమితులయ్యారు. మరో ఇద్దరు మహిళా ఎస్సైలను సహాయకులుగా నియమించారు.

విమాన టికెట్ ధరలకు రెక్కలు

కేంద్రం ఆదేశాలు బేఖాతరు



రేణిగుంట, న్యూస్‌టుడే: ఇండిగో విమాన సంస్థ సంక్షోభంతో ప్రయాణికులపై భారం పడుతోంది. పలు సర్వీసుల రద్దుతో గమ్యస్థానాలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా ఇతర విమాన సంస్థలు టికెట్ ధరలు భారీగా పెంచేశాయి. ధరల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

దిల్లీ నుంచి తిరుపతికి రూ.45వేలు చూపుతున్న టికెట్

నాలుగింతలు అధికంగా వసూలు

■ దూరాన్ని బట్టి దేశంలో రూ.7500 నుంచి రూ.18 వేల మధ్య విమాన టిక్కెట్ల ధరలు ఉండాలని శనివారం కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ పేర్కొంది. ■ ఇది బిజినెస్ తరగతి, ఉడాన్ విమానాలకు వర్తించదు. ■ దిల్లీ నుంచి రేణిగుంటకు సుమారు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఉంటుంది. దీనిని ఒక సంస్థ సోమవారం రూ.45 వేలు ధర నిర్ణయించింది. ■ హైదరాబాదుకు టిక్కెట్లు లేవని ట్రావెల్స్ వెబ్‌సైట్లో చూపిస్తుంది. ■ మంగళవారం నాటికి దిల్లీ నుంచి రేణిగుంటకు ఎకానమీ అందుబాటులో లేదని బిజినెస్ క్లాస్ మాత్రం రూ.91 వేల వరకు నిర్ణయించింది.

క్రిమినల్‌గా మారి.. నేరాల్లో రాటుదేలి

అంతర్రాష్ట్ర నేరస్థుడు అలెక్స్ అరెస్టు

అలెక్స్‌ను చూపుతున్న పోలీసులు

గుడిపాల, న్యూస్‌టుడే: వరుస అత్యాచారాలు, హత్యాయత్నాలు, డ్రగ్స్ వ్యాపారంలో నిందితుడైన అంతర్రాష్ట్ర నేరస్థుడు అలెక్స్(35)ను ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. తమిళనాడులోని కన్యాకుమారికి చెందిన అలెక్స్ కాట్పాడి-వేలూరు ప్రాంతంలో ఉంటున్నాడు. 2010లో జైలుకు వెళ్లి వచ్చాక.. కరుడుగట్టిన నేరస్థుడిగా మారాడు. అతడిపై కాట్పాడి స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. 2018లో హత్యాయత్నం నుంచి తప్పించుకుని.. ఆపై నాలుగు రోజులకే ప్రత్యర్థి గ్యాంగ్‌కు చెందిన వ్యక్తిని హతమార్చాడు. ప్రస్తుతం అతడిపై తమిళనాడులో 50, చిత్తూరు జిల్లాలో ఒక కేసు నమోదైంది. 2023లో జైలు నుంచి విడుదలై.. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు గుడిపాలకు వచ్చాడు. ఇక్కడి అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఓ వ్యక్తితో పరిచయం పెంచుకుని అతడి కుమార్తె(19)ను ప్రేమ పేరుతో బెదిరించాడు. ఈ నెల 24న బాధితురాలిని అపహరించే యత్నంలో.. ఆమె తల్లిదండ్రులు, తమ్ముడిపై పెప్పర్ స్ప్రే చల్లి కత్తితో దాడి చేశాడు. ఆ యువతిని మామిడి తోటలో నిర్బంధించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆమె ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఆదివారం మరోసారి అతడు దాడికి యత్నించగా.. నిఘా పెట్టి తుమ్మిందపాళ్యం వద్ద అరెస్టు చేశామని ఎస్సై వివరించారు.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

(c) eenadu

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో

నిజరూప దర్శనం: ఉ. 7-7.30, 8.30-9.00, 10.30-11.00, సా. 4.30- 5.00

సర్వదర్శనం: ఉ. 6- 7, 8-8.30, 9.30 -10.30, **మధ్యాహ్నం:** 12.00 **సాయంత్రం:** 4.30, **రాత్రి:** 7-9 గంటలు.

నిత్య సేవలు: సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00 బిందుతీర్థ అభిషేకం: 4.30 పంచామృతాభిషేకాలు: ఉ.5.30 ప్రథమ, 9.00 ద్వితీయ, 11.00 తృతీయ కాలాభిషేకాలు క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45 ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు. నిత్య కల్యాణం: 11.00 గంటలకు (ప్రత్యేక మండపంలో)

- న్యూస్‌టుడే, కాణిపాకం

తిరుమల శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు: తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురు వారం ఉ.3.45కు తోమాలసేవ, 4.45కు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2 డోలోత్సవం, 3 ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5 సహస్ర దీపాలంకార సేవ నిర్వహిస్తారు.

సర్వదర్శనం: తెల్లవారుజామున 3.30-5.45, ఉ.8-9.30 గంటలకు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

వారోత్సవాలు: ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. బుధవారం సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

- న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 4.00: మంగళవాయిద్యాలు 4.30:సుప్రభాతసేవ, 4.45:గోమాత పూజ 5.00: సర్వదర్శనం 5.00: ప్రథమ, 6.00: ద్వితీయ, 9.00 తృతీయ కాల అభిషేకాలు 10.30:నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు 11.00: నిత్య కల్యాణం **సాయంత్రం:** 3.30: ప్రదోష కాలాభిషేకం **రాత్రి:** 7.00: నీరాజన మంత్రపుష్పం 9.00: ఏకాంతసేవ **సర్వదర్శనం:** ఉ.5 నుంచి రా.9 వరకు

రాహు, కేతు పూజలు: ఉ. 6 నుంచి సా.5 గంటల వరకు **అభిషేకాలు:** శ్రీమృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళవారం), శ్రీమేధా దక్షిణామూర్తికి (గురువారం), శనీశ్వరునికి (శనివారం), సూర్యనారాయణమూర్తికి (ఆదివారం). **శుక్రవారం:** మహాన్యాసిక ఊంజల్‌సేవ

● ఏడుగంగల జాతరకు సంబంధించి మంగళవారం ముక్కంటి ఆలయం తరఫున ఏడుగంగలకు సారె సమర్పణ జరగనుంది.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

'అభివృద్ధి నా వంతు.. అవగాహన మీ వంతు'

కుప్పం పట్టణం: అభివృద్ధి.. ఉపాధి కల్పన.. అన్నింటా ఆదర్శంగా నిలపడం నా వంతు.. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించడం మీ వంతని ముఖ్యమంత్రి చంద్రబాబు తెదేపా నాయకులకు సూచించారు. ఆదివారం కుప్పం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కుప్పానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. కుప్పం-బెంగళూరు-చెన్నైకు రోడ్డు మార్గాలను మరింత సులువుగా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కుప్పంలో పలు రైళ్లు నిలిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బహిరంగ వేలం

డిసెంబర్ నెల తేది : 10-12-2025, 17-12-2025, 24-12-2025 & 31-12-2025

Vehicle No.	Description	Year
AP03TB3323	MAHINDRA BOLERO MAXI TRUCK	2012
AP03TC9507	AL 1616 IL FBT	2015
AP03TE9697	TATA LPT 3718 CUMMINS FBT	2017
AP16TH0854	BHARAT BENZ 3123 FBT	2015
AP03BE8989	VERNA CRDI SX(O) 1.6 DIESEL 5 SEATER	2012
AP39TN9214	TATA ACE GOLD BS6 PETROL	2020
AP11Y1728	TOYOTA INNOVA-P	2010
AP03BG4161	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP39TM3764	TATA ACE GOLD BS6 DIESEL	2020
AP03TK3036	TATA ACE	2018
AP39TS-3033	EICHER PRO 2114 XP FBT	2020
AP31CA-0999	VERNA (FLUDIC) CRDI EX 1.6 DIESEL 5 SEATER	2012
AP03BK-0477	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP02TB9329	EICHER 11.10 FBT	2014
AP39TV2405	MAHINDRA BOLERO PICK UP 1.7T BS6	2021
AP04TU0221	MAHINDRA 275 DI	2012
AP27CC9713	ETIOS GD DIESEL 5 SEATER	2011
AP26AX5464	TAFE 241	2013
AP39NS8433	ETIOS G PETROL 5 SEATER	2011
AP21CJ4514	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2015
AP02TC0207	TAFE 241	2010
AP39HA1383	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2015
AP05TF0567	TATA LPT 3118 CUMMINS FBT	2016
AP39UA5541	TATA ACE GOLD BS6 DIESEL	2021
AP39UK4025	APE AUTO HT DX BS6 CNG-P	2022
AP39TK7961	JOHN DEERE 5105	2019
AP39TD8022	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2012
AP03BL7779	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP31TP1832	AL U TRUCK 2518 FBT-T	2018
AP39NQ7828	DZIRE TOUR DIESELS SEATER	2014
AP39TS4593	MAHINDRA 475 DI	2011
AP31AW6777	INNOVA EURO 3 2.5 G DIESEL 7 SEATER	2008
AP03TD5452	AL DOST	2016
AP03BK9628	JCB 3DX	2013

గమనిక : పైన తెలిపిన వాహనముల యొక్క రుణగ్రహీత(లు) / హామీదారులు మా యందు ఋణం పొంది వాహనము కొనుగోలుచేసి ఋణము చెల్లించనందువలన పలుమార్లు నోటీసులు పంపడమైనది. కాని ఖాతరు చేయనందువలన పలుమార్లు నోటీసు పంపడమైనది. కాని ఖాతరు చేయనందున పై వాహనములను వేలము ద్వారా విక్రయించి ఋణము రాబట్టుకొనుటకు కంపెనీ నిర్ణయించడమైనది. షరతులు వర్తిస్తాయి.

వేలము జరుగు ప్రదేశం : శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, NH No.205, తూకివాకం గ్రామం, RPR కన్వెన్షన్ సెంటర్ ప్రక్కన, తిరుపతి-517320

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

డి.నెం.19-03-13/కె, 1వ అంతస్తు, హోండ షోరూమ్ దగ్గర, రేణిగుంట రోడ్డు, తిరుపతి - 517501, ఆం.ప్ర. ఫోన్ : 0877-2221287, 90000 80798

ఉందా.. జాతీయ భాగ్యం

పుంగనూరు, న్యూస్‌టుడే: ఆ ఊర్లకు జాతీయ రహదారి ఏర్పాటైతే కల. పుంగనూరు మీదుగా బెంగళూరు నుంచి తిరుపతి, మదనపల్లె-బెంగళూరు, పలమనేరు-బెంగళూరు జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న బైరెడ్డిపల్లె-రొంపిచెర్ల క్రాస్‌కు జాతీయ రహదారిగా మార్చాలనే ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. సుమారు వంద కి.మీ. ఉన్న ఈ మార్గంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల మండల కేంద్రాలు ఉన్నాయి. ఈ మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చితే బెంగళూరు, తిరుపతి, చెన్నై, హైదరాబాద్, విజయవాడ నగరాలకు వెళ్లే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది.

పుంగనూరు-పులిచెర్ల మార్గం

అభివృద్ధి చేస్తే వలసలు తగ్గుముఖం

పుంగనూరులో మినీ బైపాస్, పలమనేరు బైపాస్ రోడ్డు, చౌడేపల్లె-మదనపల్లె వయా బోయకొండ, చౌడేపల్లె-పలమనేరు వయా రాయలపేట రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించారు. జాతీయ రహదారిగా మార్పు చేస్తే పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాలతో కాకుండా మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలు పారిశ్రామికంగా, విద్య, వైద్యపరంగా అభివృద్ధి చెందుతాయి. దీంతో ఉపాధి అవకాశాలు లభించడంతో వలసలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

సురక్షిత ప్రయాణం

బెంగళూరు-తిరుపతి మధ్య రాకపోకలు ఇటు మదనపల్లె, పీలేరు, అటు పలమనేరు, చిత్తూరు మధ్య సాగుతున్నాయి. ఈ మార్గాల్లో వాహనాల రద్దీతో నిత్యం ఏదో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అదే బైరెడ్డిపల్లె-రొంపిచెర్ల మార్గాన్ని అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ తగ్గడంతో పాటు సురక్షితమైన ప్రయాణం చేయవచ్చు. అధికారులు ఆ దిశగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారి మేర.. మంచుతెర

ఓ వైపు మేఘాలు మరోవైపు మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం పూట రహదారులన్నీ మంచు దుప్పటి కప్పుకున్నట్లు కనిపిస్తున్నాయి. ఏ మాత్రం ఏమరు పాటుగా వాహనం నడిపినా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. **- న్యూస్‌టుడే, పుంగనూరు**

తితిదేకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు శివప్రసాద్ రూ.10,01,116 విరాళం అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో పేష్కార్ రామకృష్ణకు ఆదివారం విరాళం డీడీ సమర్పించారు. తితిదే బోర్డు సభ్యుడు ఎన్.సదాశివరావు, మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కుమార్

జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ఎన్నికల అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక ఎన్జీవో భవన్‌లో ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కుమార్(పర్యవేక్షకులు, సమగ్ర శిక్షా, చిత్తూరు), ప్రధాన కార్యదర్శిగా చైతన్య(డీఈవో ఆఫీస్, చిత్తూరు), కోశాధికారిగా గోపాల్, సహాధ్యక్షుడిగా రామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రమేష్, నాగరాజ, రెడ్డిశేఖర్, రహ్మత్‌బాషా, కుమార్ ఎన్నికయ్యారు.

భక్తులు మెచ్చేలా అద్భుత పాలన అందించాలి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులు మెచ్చేలా పాలన అందించి, వారి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ కోరారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ వి. మణినాయుడు, సభ్యుల ఆధ్వర్యంలో కాణిపాకంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. గతంలో పరిసర గ్రామాల వారికి బోర్డులో స్థానం ఉండేదని, కూటమి ప్రభుత్వంలో ఏపీ, తెలంగాణ నుంచి సభ్యులను నియమించడం శుభపరిణామమన్నారు. తితిదే పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమల తరహాలో ఇక్కడా ప్రతిఒక్కరూ టికెట్ కొని దర్శనానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా ఆలయాభివృద్ధికి కావాల్సిన నిధులు సమకూర్చుకోవచ్చన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ తన తండ్రి చెన్నకేశవులు నాయుడి పేరిట ఆలయంలో హోమ మండప నిర్మాణానికి విరాళం అందజేస్తానన్నారు.

ఎమ్మెల్యే మురళీమోహన్. చిత్రంలో ఛైర్మన్ మణినాయుడు, ప్రముఖులు

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ హరిప్రసాద్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలి ఛైర్మన్ సాయిప్రసాద్, కూటమి నేతలు నరసింహయాదవ్, చల్లపల్లి నరసింహారెడ్డి, చల్లాబాబు, దొరబాబు, శ్రీనివాసులు, ఈవో పెంచల కిషోర్, చంద్రప్రకాష్, జయప్రకాష్ నాయుడు, మురార్జీ, దొరబాబు, వెంకటేశ్వర చౌదరి, గిరిధర్, దిలీప్, ధరణీప్రసాద్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

అమరవీరుల త్యాగాలు స్మరించుకుందాం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సాయుధ దళాల పతాక నిధికి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు, సిబ్బంది ప్రమోద్ ఖన్నా, వినాయకరెడ్డి, మాజీ సైనికులు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే): శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 82,007 మంది దర్శించుకున్నారు. రూ.3.13 కోట్ల హుండీ కానుకలు లభించాయి. తిరుమలలో చలితీవ్రత కొనసాగుతోంది.

16వేల టోకెన్లు జారీ : శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు సర్వదర్శన టోకెన్లు ఆదివారం 16 వేలు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువ జామున మూడు నుంచి రాత్రి 10 వరకు దర్శనం జరగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీ చేశారు.

మహానటి సావిత్రి మహోన్నతురాలు

సత్కార గ్రహీతలతో దేవేంద్రరావు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: తెలుగువారు మరువలేని మహానటి సావిత్రి మహోన్నతురాలని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తోట గోవిందన్ అన్నారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు దేవేంద్రరావు నేతృత్వంలో ఆదివారం చిత్తూరులోని సమాఖ్య కార్యాలయంలో సావిత్రి 'సినీ నట వైభవం'పై కవితార్చన నిర్వహించారు. రచయితలు, సామాజిక సేవకులను ఘనంగా సత్కరించారు. ప్రముఖులు కోటీశ్వరమొదలియార్, మునీంద్ర, రాజు, రమేష్, జగదీష్ ప్రేమావతి, గంగాభవాని, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

బద్రీనారాయణకు ఘన నివాళి

నివాళి అర్పిస్తున్న తేజశ్వరి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త, దివంగత మాజీ ఎంపీ, తితిదే పాలకమండలి మాజీ ఛైర్మన్ డీకే ఆదికేశవులునాయుడి సోదరుడు, సీతమ్స్, ఆర్‌కే విద్యాసంస్థల డైరెక్టర్, తెదేపా సీనియర్ నాయకుడు డీకే బద్రీనారాయణ మృతికి పలువురు ప్రముఖులు, నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం ఆయన తీవ్ర అస్వస్థతకు గురికాగా, చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ మరణించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక బీవీరెడ్డి కాలనీలోని స్వగృహానికి ఆయన భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, తెదేపా జిల్లా నాయకుడు చంద్రప్రకాష్, పారిశ్రామిక వేత్తలు డీఏ శ్రీనివాస్, వైదేహీ ఆసుపత్రి ఎండీ కల్పజ, డీఏ తేజశ్వరి(ఆదికేశవులు నాయుడి కుమార్తెలు), రంగనాథ్, మండీ సుధ, సాయిరాక్స్ రవి, అప్పోజి, కాజూరు బాలాజీ, తులసీరామ్, సురేష్‌బాబు, సీతమ్స్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి, ఆర్.కె.డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, పలువురు నాయకులు, ప్రజలు బద్రీనారాయణ భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేటి(సోమవారం) మధ్యాహ్నం చిత్తూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE:10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 93812 87629.

DISTANCE EDUCATION

10th/Inter, BA,B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D, BNYS, BPT, D Pharmacy, B Pharmacy, LLB, BA LLB, 9032030124

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తిరుపతి మెగాసిటీలో తక్కువ బడ్జెట్‌కే తూర్పుముఖం గల తుడా అప్రూవల్ ప్లాట్ తక్కువ ధరకు అందుబాటులో కలవు. ✆ 82470 75857, 94943 92069.

TO LET

AJANADRI RESIDENCY Flat No. 304, IIIrd Floor Lift & Car Parking. Thondawada, Chandragiri. Ph: 73824 86926, Rent: 8000/-.

తిరుపతి ఎయిర్‌పోర్ట్ దగ్గర 3BHK విల్లా & ధనలక్ష్మి నగర్, అవిలాల వద్ద 2 BHK Individual Houses అద్దెకు కలదు. ✆ 80086 25907.

JOBS

We are Hiring Field Debt Recovery Agentsfor Banking Process. Location: Kadapa, Mydukur, Proddatur, Rajampet, Tirupati, Srikalahasti, Palamaner. Salary 15K - 22K + Incentives. 99639 59854.

REQUIRE FEMALE Admission Counsellors for Nakshatra Overseas. Sal: 16K + Incentives Work Place: Tirupati. ✆ 63042 89989.

WANTED: SALES Executives for a reputed Agency, Part & Full Time in Tirupati. Two Wheeler must. Good Salaries & Incentives. 9849130906.

Wanted Ex-Servicemen for managing Depot operations at Tirupati. Call- 8074967705.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ: 20k. ✆ 89776 39662, 89776 39663.

తిరుపతి, సేవా సంస్థ నందు పనిచేయుటకు రిసెప్షనిస్టు, వంట మనుషులు, నైట్ డ్యూటీ చేయుటకు హౌస్ కీపింగ్ స్టాఫ్ M/F కావలెను. Con: 99495 32652.

E-Kart నందు అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Qly: Inter Any డిగ్రీ జీ:15,000. Online are Available. 9704146558.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈ రీతీగ ఉంటే ఎలా?

❖ జిల్లాలో తరచూ విద్యుత్తు ప్రమాదాలు

❖ అప్రమత్తం కాని ఎస్పీడీసీఎల్ అధికారులు

పుత్తూరు ఎన్జీవో కాలనీలో ఇళ్లపై 11 కేవీ విద్యుత్తు లైన్లు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదాలు తరచూ జరుగుతున్నా డిస్కం అధికారులు స్పందించడం లేదు. తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టాలు విలువ కట్టలేనంత జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో పనితీరుకు భిన్నంగా ఉంది. తిరుపతిలో ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఉన్నా తిరుపతి, చిత్తూరు జిల్లాలో తరచూ విద్యుత్తు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

● నగరపాలక సంస్థలు, పట్టణాలు, గ్రామాల్లో ఏళ్ల కిందట లాగిన విద్యుత్తు తీగలు(కండక్టర్లు) నేటికీ అలానే ఉన్నాయి. ఇవి ఉన్నట్లుండి తెగిపోతున్నాయి. సకాలంలో మరమ్మతు చేయడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. తీగలు ఎక్కడైనా తెగిన వెంటనే ఉపకేంద్రాల్లోని బ్రేకర్స్ ట్రిప్ అవ్వాలి. అలా జరిగితే సరఫరా నిలిచిపోతుంది. దీనివల్ల ప్రమాదాలు సంభవించవు. అయితే ఈ ఉపకేంద్రాల్లోని బ్రేకర్స్ పలుచోట్ల సక్రమంగా పని చేయడం లేదు. ఇందుకు కారణం ఎర్త్ వైర్లు సక్రమంగా లేకపోవడమే. దీనివల్లే ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి.

ఇలా జరగట్లేదేం..?

❖ ఉపకేంద్రాల్లో క్రమం తప్పక నిర్వహణ చేపట్టాలి. ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించి మార్పులు, చేర్పులు చేయాలి. ❖ అవసరమైన చోట్ల కొత్త సామగ్రి ఏర్పాటు చేయాలి. అది అందుబాటులో లేక పాత వాటినే సరిచేసి వినియోగిస్తున్నారు. ఇవి కొద్దికాలం పనిచేసి ఆపై మొరాయిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బ్రేకర్స్, ఎర్తులు పనిచేయక పలు ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పలు కాలనీల్లో ఇళ్లపై లైన్లు

నగరాలు, పట్టణాల్లో పలు కాలనీల్లో ఇళ్లపైనే విద్యుత్తు తీగలు వెళ్తున్నాయి. పుత్తూరు ఎన్జీవో కాలనీలో ఇళ్లపై 11కేవీ విద్యుత్తు లైన్లు వెళ్తుంటాయి. కనీసం ఆ ప్రాంతంలో కేబుల్ వ్యవస్థ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. జీడీనెల్లూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లోనూ ఇదే దుస్థితి.

కేంద్ర ప్రభుత్వంపై ఐక్యంగా ఉద్యమించాలి

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కర్షక, కార్మిక చట్టాల్ని రద్దు చేసి, వారి హక్కులు నిర్వీర్యం చేయడం దారుణమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం జిల్లా నాయకులు ప్రేమ, సీపీఐ జిల్లా నాయకులు దాసరి చంద్ర, రమాదేవి, గోవిందస్వామి పాల్గొన్నారు.

సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర, జిల్లా నాయకులు

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ఎన్నికల అధికారి హరిప్రసాద్‌రెడ్డి, పరిశీలకులు బాలగంగిరెడ్డి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో ఆదివారం ఎస్టీయూ జిల్లా సమావేశం నిర్వహించి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెండోసారి మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇలియాస్ బాషా, ఆర్థిక కార్యదర్శిగా పురుషోత్తం, గౌరవాధ్యక్షుడిగా పీతాంబరరాజును ఎన్నుకున్నారు. జిల్లా మహిళా విభాగం కన్వీనర్‌గా రాధాకుమారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గంటా మోహన్, పురుషోత్తం, దేవరాజులరెడ్డి, చంద్రన్, చంద్రశేఖర్ నాయుడు ఎన్నికయ్యారన్నారు. అంతకుముందు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర నాయకులు

మా ఊళ్లకు వెళ్లేదెలా?

రైల్వే వంతెన కింద నీటితో తిప్పలు

పూతలపట్టు, న్యూస్‌టుడే: చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిపై పి.కొత్తకోట సమీపంలోని రైల్వే వంతెన వద్ద వర్షపు నీరు నిలిచి రాకపోకలకు పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకేమో నేషనల్ హైవే. చిన్నపాటి వర్షం కురిసినా. . ఆరు వరుసల జాతీయ రహదారి పక్కనున్న సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచిపోతుంది.

❖ చవటపల్లె ప్రజలు గ్రామంలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరితోపాటు పాకాల మండలం, పూతలపట్టు మండలంలోని సగం గ్రామాల ప్రజలు ఇటుగానే రాకపోకలు సాగించేది. ఈ సమస్యతో చేసేదేమీ లేక మోకాలి లోతు నీటిలో అలానే రాకపోకలు సాగిస్తున్నారు. నీరు నిలిచినపుడల్లా హైవే సిబ్బంది మోటార్ల సాయంతో నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఇక అంతే. ఆపై ఆలకించే నాథుడే లేరు. దీంతో ఈ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నిలిచిన నీటిలో అటుగా వచ్చిన ఓ కారు ఇరుక్కుపోయింది. నానా తంటాలు పడి దాన్ని వెలుపలకు తీయాల్సి వచ్చింది. ఇక మోటారు సైకిళ్లలోకి నీరు వెళ్లి ఇంజిన్లు స్తంభించాయి.

రైల్వే వంతెన కింద హైవేపై నిలిచిన వర్షపు నీరు

గ్రామస్థుల ఆందోళనతో స్తంభించిన రాకపోకలు (పాతచిత్రం)

శాశ్వత పరిష్కారం చూపితేనే..

చవటపల్లె ప్రజలు వంతెన వద్ద నీరు నిలవడంతో గ్రామంలోకి వెళ్లేందుకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఇటీవల రైల్వే వంతెన వద్ద ధర్నా చేపట్టడంతో కి.మీ మేర హైవేపై వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పోలీసు అధికారులు చెప్పడంతో ప్రజలు ఆందోళన విరమించారు. ఆపై ఎమ్మెల్యే, మురళీమోహన్, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎన్‌హెచ్ఏఐ పీడీ వెంకటేశ్వర్లు అక్కడకు వచ్చి గ్రామస్థులతో చర్చించినా సమస్య నేటికీ పరిష్కారం కాలేదు.

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

నిత్యాన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరికి చెందిన రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి రూ.1,00,335 మొత్తాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడికి ఆదివారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

విరాళం అందజేస్తున్న రాజేంద్రప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు

11న ఎంపీపీ ఎన్నిక

విజయపురం, న్యూస్‌టుడే: ఎంపీపీ ఎన్నిక ఈ నెల 11న గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీవో, ఎన్నికల అధికారి రాజేంద్ర తెలిపారు. ఎంపీపీ జమున రాజీనామాతో ఇన్‌ఛార్జి ఎంపీపీగా మంజు కొనసాగుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) చిత్తూరు నగరం: 80085 74598 నగరి: 9866112017 గంగాధరనెల్లూరు: 80085 74605 పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, పెనుమూరు

సమస్య: ఉగ్రాణంపల్లె విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో బట్టువారిపల్లె గ్రామానికి వెళ్లే దారిలోని విద్యుత్తు స్తంభాలకు తీగలు అల్లుకున్నాయి. **-స్థానికులు**

సమాధానం: సమస్య విద్యుత్తు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి తీగలు తొలగింపజేస్తాం. **-తులసిప్రసాద్, ఏఈ, ట్రాన్స్‌కో**

న్యూస్‌టుడే, నింద్ర: సమస్య: అగరం పంచాయతీ డీకే బేడు ప్రధాన వీధిలో వర్షపు నీరు నిలిచి గుంతలమయంగా మారింది. **- స్థానికులు**

సమాధానం: తాత్కాలికంగా గ్రావెల్‌తో గుంతలు పూడ్చాలని, నిధుల విషయమై ఎంపీడీవోతో చర్చించి సమస్య పరిష్కరింపజేస్తాం. **-మునిశేఖర్, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, పాలసముద్రం: సమస్య: శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఆదిఆంధ్రవాడ గ్రామంలో మురుగునీరు బయటకు వెళ్లేందుకు వీలులేదు. **-గోపాల్, గ్రామస్థుడు**

సమాధానం: ఇప్పటికే కాలువ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాం. నిధులు రాగానే నిర్మిస్తాం. **- సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

'నియమాలు పాటించేవారే నిజమైన భక్తులు'

ఉపన్యసిస్తున్న గరికపాటి నరసింహారావు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: నిత్యం దేవుడికి మొక్కుతున్నాం.. పూజలు చేస్తున్నాం.. కానీ మా కష్టాలు తీరడం లేదని.. అందరూ చింతిస్తుంటారు. మనసులో చిత్తశుద్ధి లేకుండా చేసే పూజలు ఫలాన్నివ్వవు. మనం పాటించే నియమాలకు అనుగుణంగా ఫలాలు దక్కుతాయని ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. శ్రీ కాళహస్తీశ్వర శతకంపై చిత్తూరు నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో మూడు రోజులుగా సాగుతున్న ప్రవచన కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ 'భక్తి అంటే దైవంపై విశ్వాసం, ధర్మాన్ని అనుసరించడం, మంచి పనులు చేయడం. ఈ నియమాలు పాటించేవారే నిజమైన భక్తులు. ఇదే విషయాని ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకం ద్వారా సమాజాన్ని మంచి వైపు నడిపించాలని' రచనలు చేశారని వివరించారు.

'దొంగలకు మద్దతుగా జగన్'

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: దొంగలను జగన్ సమర్థించడం దారుణమని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఆరోపించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తితిదే పరకామణిలో జరిగింది చిన్న చోరీ అని జగన్ చెప్పడం మహా పాపమని, వెంకటేశ్వర స్వామిపై ఆయనకు భక్తి, విశ్వాసం, గౌరవం లేనందునే ఆయన సీఎంగా ఉన్నప్పుడు ఇతర మతాలను విశ్వసించే వారిని తితిదే బోర్డు ఛైర్మన్లుగా నియమించి పలు అక్రమాలకు అవకాశం కల్పించారని విమర్శించారు. వైకాపా పాలనలో హంతకులు, రేపిస్టులు, దోపిడీదారులు, కల్తీ మద్యం, భూ కబ్జాదారులు, గంజాయి బ్యాచ్.. అడ్డూఅదుపూ లేకుండా పేట్రేగిపోయారని విమర్శించారు.

మాట్లాడుతున్న సురేంద్రకుమార్

అమ్మో.. ఎప్పుడు కూలుతాయో..?

● ప్రమాదపుటంచున పాత భవనాలు
● భయాందోళనలో ప్రజలు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరంలోని పాత భవనాల్లో వ్యాపారాల నిర్వహణ, నివాసాలు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాత భవనాల పరిస్థితిపై అనుమానాలు తలెత్తుతున్నాయి.. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కాలం చెల్లిన భవనాలు కూలిన ఘటనలు గతంలో అనేకం చోటుచేసుకున్నాయి.. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో ఆయా భవనాలు ప్రమాదకరంగా మారాయి.. ప్రజల ప్రాణాలకు సంబంధించిన కీలక అంశాలపై నగరపాలక సంస్థ అధికారులు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చిత్తూరులో ఇటీవల కూలిపోయిన భవనం

రద్దీ ప్రాంతాల్లో..

నగరంలో 90 నుంచి వందేళ్ల క్రితం పైబడిన భవనాలు లెక్కకు మించి ఉన్నాయి. ప్రధానంగా బజారు వీధి, చర్చివీధి, శేషాపిరాన్‌వీధి, గాంధీరోడ్డు, బ్రాహ్మణవీధి, రంగాచారివీధి, చావడివీధి, రాములగుడివీధి తదితర ప్రాంతాల్లో వందేళ్ల కిందట నిర్మించిన భవనాల్లో ఇప్పటికీ కొందరు బంగారు, పూజా సామగ్రి, హోటళ్లు తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కొన్నింటిలో స్థానికులు నివాసాలు ఉంటున్నారు. ప్రధాన వాణిజ్య ప్రాంతాలైన ఈ వీధుల్లో నిత్యం జన సంచారం అధికంగా ఉంటుంది. ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా రంగులు వేయించి గోడలు బయటకు కనిపించకుండా కప్పిపెట్టడం గమనార్హం. ఇవి ప్రధాన రహదారులు, పాఠశాలల సమీపంలో ఉండటం మరింత ఆందోళన కలిగించే అంశం. గతంలో వాణిజ్య కూడలి స్థానిక మార్కెట్‌చౌక్, నివాస ప్రాంతంలో రెండు పాత భవనాలు అమాంతం కూలిపోవడంతో గతంలో ఇద్దరు మృతి చెందారు. చర్చివీధిలో కాలం చెల్లిన ఓ వస్త్ర దుకాణ భవనం గతంలో అగ్నిప్రమాదంలో ఆహుతైంది. అయితే ఈ భవనంలో నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు అప్పట్లో ప్రకటించారు. నగరంలోని పలు వీధుల్లో వందేళ్ల పైబడిన భవనాల్లో ప్రజలు సైతం ఇంకా నివసిస్తుండటం ఆందోళన కలిగించే అంశం.

కొరవడిన అప్రమత్తత..

గతంలో పాత భవనాలు కూలిన ఘటన తరవాత నగరపాలక సంస్థ అధికారులు జాగ్రత్తలు తీసుకోవడంలో వెనకబడ్డారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పాత భవనాలు గుర్తించి మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి తమపని అయిపోయిందని భావిస్తున్నారు. నగరంలో ఇంకా పదుల సంఖ్యలో పాతవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో వీటి పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంది. కొన్నింటికి నోటీసులు జారీ చేసి మిన్నకున్నారు. ఈ నోటీసులకు స్పందించని పక్షంలో వాటిని కూల్చివేయాల్సి ఉన్నా ఎలాంటి చర్యలు ఇప్పటివరకు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత భవనాల కూల్చివేతకు చర్యలు చేపట్టాలని నగరవాసులు విన్నవిస్తున్నారు. లేనిపక్షంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువేనని చెబుతున్నారు.

నోటీసులు జారీ చేస్తాం..

నగరంలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. గతంలోనూ చాలా మందికి నోటీసులు ఇచ్చాం. **-నాగేంద్ర, సహాయ సిటీప్లానర్, నగరపాలక సంస్థ**

నగరంలో డివిజన్లు: **50** | నగర జనాభా: **2.2** లక్షలు | పాత భవనాలు: **350** | వందేళ్లు దాటినవి: **60**

మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి, అధికారులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ అమరావతి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. 21 మంది ఎంపీటీసీ సభ్యులు, 41 మంది సర్పంచుల్లో కొందరే ఈ సమావేశానికి హాజరయ్యారు. జడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, ఎంపీడీవో మహేష్, తహసీల్దారు షబ్బీర్‌బాషా పాల్గొన్నారు. ● సమావేశానికి వచ్చిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులకు తాగునీరు అందుబాటులో లేదని శెట్టేరి సర్పంచి అనిల్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

చిలుం పట్టి.. లీకులుగా మారి

చిత్తూరు నగరంలోని పలు డివిజన్లలో నీటి పైపులు చిలుం పట్టి శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని ప్రాంతాల్లో పైపులు లీకై నీరు వృథాగా పోతోంది. ప్రధానంగా వినాయకపురం, కిచిలి మఖాన్ వీధి, బాలాజీ కాలనీ, జాన్స్‌గార్డెన్, ఎంజీఆర్ వీధి తదితర ప్రాంతాల్లో పైపులు లీకవుతున్నాయి. దీంతో నీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీన్ని గుర్తించిన స్థానికులు అక్కడక్కడ పాత ట్యూబులు చుట్టినా పనిచేయని పరిస్థితి. ఇలా నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది. నగరపాలిక అధికారులు స్పందించి నీటి వృథా అరికట్టాల్సి ఉంది. **-ఈనాడు, చిత్తూరు**

జలకంఠేశ్వరస్వామికి వెండి నాగపడగ వితరణ

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలి స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయానికి అనుసంధానంగా దేవరకొండపై వెలసిన జలకంఠేశ్వర స్వామికి తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన రవి, శాంతి దంపతులు రూ.1.81 లక్షల విలువజేసే వెండి నాగపడగ ఆదివారం వితరణగా అందజేశారు. వీరు 20 ఏళ్లుగా ఏటా కార్తిక పౌర్ణమికి ఇక్కడకు విచ్చేస్తున్నారు. వెండి నాగపడగ అందజేసి తమ మొక్కు చెల్లించుకున్నామని వారు పేర్కొన్నారు. ఆపై అర్చకులు శ్రీనివాసశర్మ.. వాటిని స్వామివారికి అలంకరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ఆలయ పర్యవేక్షకులు ధనంజయ నాయుడు, ప్రసాద్, మంజునాథ్, గోవర్ధన, బాబు తదితరులు పాల్గొన్నారు.

దాత అందజేసిన నాగపడగ

రూపు మారుతోంది..

● శరవేగంగా గురుకుల పాఠశాల అభివృద్ధి

పుత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని గోపాలకృష్ణాపురంలో 2002లో సీఎం చంద్రబాబు.. జన్మభూమి కార్యక్రమానికి విచ్చేసిన సమయాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రారంభించారు. ఆపై దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు అదే పాఠశాలకు బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేయించి ప్రారంభించారు. భవనాలు, ప్రహరీ నిర్మించి 23 సంవత్సరాలు కావడంతో 2021లో భారీ వర్షాలకు ప్రహరీ కూలిపోయింది. పాఠశాలలో మరుగుదొడ్లు, పైపులైను వ్యవస్థ దెబ్బతింది. ఈ నేపథ్యంలో అప్పట్లో పలుమార్లు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడి సమస్యలను అధికారులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఈ విషయమై అసెంబ్లీలో ప్రస్తావించారు. దీంతో మంత్రి బాలవీరాంజనేయస్వామి స్పందించి వెంటనే రూ.36 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం పైపులైన్లు, వాష్‌రూమ్‌లు, మరుగుదొడ్లు, వంటశాలలో మరమ్మతులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రహరీ నిర్మాణం పూర్తయింది. ఇప్పటివరకు రాత్రివేళ బిక్కుబిక్కుమంటూ గడిపిన విద్యార్థినులు నేడు ఊపిరి పీల్చుకుని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణంలో ప్రహరీ, గురుకుల పాఠశాలలో మరమ్మతులు

ముళ్లకంపలు తొలగింపు

సింహరాజుపురం పంచాయతీ మరవలం గ్రామంలో పెరిగిన ముళ్లకంపల సమస్యపై ఎంపీడీవో సతీష్‌రాజ్ ఆదేశాలతో ఈవోపీఆర్డీ సత్యనారాయణ సిబ్బందిచే వాటిని తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, పాలసముద్రం**

ఈతమాకులకుంట కట్టపై..

స్పందనకు వందనం

పెనుమూరు-చిత్తూరు మార్గంలోని ఈతమాకులకుంట కట్టపై విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న లతల సమస్యపై లైన్‌మ్యాన్ రాజేంద్రరెడ్డి స్పందించి చర్యలు చేపట్టారు. **-న్యూస్‌టుడే, పెనుమూరు**

శుభ్రమైన కాల్వలు

నంగమంగళం పంచాయతీ వేలురాంబట్టి ఎస్టీకాలనీలో మురుగునీటి కాల్వల సమస్యపై ఎంపీడీవో శిరీష స్పందించి సర్పంచి జయకొడి, కార్యదర్శి కుమార్ ఆధ్వర్యంలో కాల్వలు శుభ్రం చేయించారు. దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. **-న్యూస్‌టుడే, గుడిపాల**

పైపులైను లీకేజీకి మరమ్మతు

జీడీనెల్లూరు-ఆవలకొండ తారుమార్గంలో రక్షిత మంచినీటి పైపు దెబ్బతిని నీరు వృథా అవుతున్న సమస్యపై ఎంపీడీవో మనోహర్‌గౌడ్ స్పందించారు. పంచాయతీ సిబ్బందిచే పైపులైన్‌కు మరమ్మతు చేయించి నీటి వృథా అరికట్టారు. **-న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు**

కల నిజమాయెగా..

● నగరి, పుత్తూరు పట్టణాల్లో సొంతిళ్లు
● 750 మందికి మంజూరు పత్రాలు

న్యూస్‌టుడే, పుత్తూరు

పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకెళ్తున్నాయి. దీనిలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పుత్తూరు, నగరి పురపాలికల్లో గృహాల మంజూరు నిమిత్తం అధికారులు సర్వే చేసి జాబితా సిద్ధం చేశారు.. తదనుగుణంగా 750 మందికి గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి పత్రాలు మంజూరు చేశారు.. వార్డు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు.. ఇంటి స్థలం ఉండి ఇళ్లు లేని పేదలను గుర్తించి వారిని ఎంపిక చేయడంతో దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న వారి కల నెరవేరింది.

ప్రత్యేక యాప్‌లో వివరాలు..

గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో గతేడాది నవంబర్ నుంచి జులై వరకు పీఎంఏవై 2.0 కింద ఇళ్ల మంజూరు నిమిత్తం క్షేత్ర స్థాయిలో ఏఈ, డీఈఈ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు సర్వే నిర్వహించారు. వారి పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. తుదిగా వారికి గృహాలు నిర్మించుకునేందుకు అనుమతి లభించింది. వారందరినీ అర్హులుగా గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించడంతో ఆమోదముద్ర వేశారు.

పుత్తూరులో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ (పాత చిత్రం)

రూ.2.5 లక్షల సాయం..

పీఎంఏవై అర్బన్ 2.0 కింద పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు రూ.2.50 లక్షలు అందజేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పరిధిలోని పేదలకు రూ.2.50 లక్షలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సదరు మొత్తాన్ని అందజేసేందుకు అంగీకరించింది. దీంతో పట్టణ పేదల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. వారి సొంతింటి కల నెరవేరనుంది.

త్వరలో నిర్మాణాలు..

పుత్తూరు పురపాలికలో 325, నగరి పురపాలికలో 425 మందికి పీఎంఏవై అర్బన్ 2.0 కింద గృహనిర్మాణాలకు సంబంధించి అనుమతి లభించింది. ఈ మేరకు వారందరికీ మంజూరు పత్రాలను ఇటీవల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందజేశారు. త్వరలోనే సదరు గృహ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు లబ్ధిదారులు సన్నాహాలు చేసుకుంటున్నారు. మరోవైపున 2014-2019లో తెదేపా హయాంలో సొంత స్థలం ఉన్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో గృహాలు మంజూరు చేశారు. అప్పట్లో వందల సంఖ్యలో ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఇవన్నీ కార్యరూపం దాల్చనున్నాయి.

మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారిద్దాం

గుడిపాల, న్యూస్‌టుడే: మొక్కలు నాటి చక్కగా పెంచితే అవి మనల్ని కాపాడతాయని సీఎన్ఆర్ కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదో రోజు ఆదివారం వసంతాపురం పంచాయతీలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి ఏడాదిలో పది మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సుందరేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్, వాలంటీర్లు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: స్థానిక బేతేల్ షారోన్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఆశీర్వాదం, క్రైస్తవులు వేణు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో క్రైస్తవులు

PUBLICE NOTICE

General Public are hereby informed that my client Sri M. Bhaskar Reddy, S/o Sri Munirathnam Reddy, R/o. Pantrampalle,chittoor, is the absolute owner and is in peaceful possession and enjoyment of the lands in Sy. No. 50/1 - Ac. 0-07 cents, Sy. No. 50/2 - Ac. 0-51 cents, Sy. No. 50/3 - Ac. 0-25 cents, Sy. No. 50/4 - Ac. 0-49 cents, Sy. No. 51 Ac. 0-09 cents Total extent: Ac. 0-141cents (One hundred and forty one cents only), situated at Mangasamudram Revenue Village, Chittoor Mandal, Chittoor District, the above property was validly purchased by my client/his predecessors-in- title from the erstwhile owners through registered sale deeds for valuable consideration. My client and his father have been in continuous, peaceful, open and uninterrupted possession and enjoyment of the said property since the date of purchase. Further, the Hon'ble District Munsif Court, Chittoor has passed decrees in favor of my client and his father in O.S. No. 86 of 1962, O.S. No. 170 of 1957, A.S. No. 261 of 1960, Despite the above clear title and court decrees, certain unscrupulous third parties who have no manner of right, title or interest over the property are illegally attempting to alienate/create third-party rights over the said property by fabricating false and forged documents.

The General Public are hereby cautioned **NOT TO ENTER INTO** any sale agreement, sale deed, agreement of sale, lease, mortgage or any other transaction whatsoever in respect of the above-mentioned property with any person other than my client Sri M. Bhaskar Reddy or his authorized representatives.

Any person dealing with such unauthorized third parties shall do so at their own risk and peril, and my client shall initiate appropriate civil and criminal proceedings against such persons without further notice.

Any person claiming any right, title or interest in the above property is hereby called upon to submit their objections, if any, along with original supporting documents to the undersigned advocate at the address mentioned below within **7 (seven) days** from the date of this publication, failing which it will be presumed that nobody has any objection and my client will proceed to deal with the property as absolute owner.

Sd/- **M/s. MAHESH KOMPELLI,** Advocate
Office: Flat No.205, 2nd Floor, Mehtab Arcade, Opp. Ganesh Temple, Tarnaka, Secunderabad-17.
E Mail- maheshkompallyadv@gmail.com
Mobile: **9666624948**
Date: 07.12.2025.

గంగ జాతర నిర్వహణకు సహకరించాలి

మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్

కార్వేటినగరం, న్యూస్‌టుడే: కార్వేటినగరం సంస్థానాధీశుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న గంగమ్మ జాతర నిర్వహణకు అందరూ సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. జాతర నిర్వహణపై స్థానిక భజన మందిరంలో గ్రామస్థులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యం గల ఈ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రంగనాథం మొదలియార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శుభ కార్యానికి వచ్చి తిరిగిరాని లోకాలకు

తవణంపల్లె, న్యూస్‌టుడే: ఓ యువకుడు బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. స్థానికుల కథనం మేరకు చిత్తూరు సమీపంలోని చవటపల్లెకు చెందిన వాసు, భార్గవి దంపతుల కుమారుడు జగన్(17) యుబిపల్లెలో బంధువుల ఇంటికి శుభకార్యానికి ఆదివారం వచ్చారు. అక్కడ బాహుదా నది దగ్గరకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి మృతి చెందాడు. సదరు యువకుడి మృతదేహాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు చెబుతున్నారు.

మెరికల్లా కదిలి.. బంతిని వలలో వదిలి

న్యూస్‌టుడే, చిత్తూరు
(జిల్లా పంచాయతీ, యాదమరి)

బాస్కెట్ బాల్‌లో రాణింపు

అందివచ్చిన ప్రోత్సాహం, నిరంతర సాధనతో క్రీడల్లో చక్కగా రాణిస్తున్నారు పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు.. క్రీడలను ప్రోత్సహించి మెరికల్లాంటి క్రీడాకారులను తీర్చిదిద్దాలనే విద్యాసంస్థల వ్యవస్థాపకులు దివంగత ఎం.ఆర్.దొరస్వామి ఆశయానికి అనుగుణంగా 2018లో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమై ఇప్పటికి ఆరుసార్లు కొనసాగడం గమనార్హం.. సదరు పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి సంయుక్త విజేతలుగా నిలిచారు.

సాధన చేస్తున్న విద్యార్థులు

నిత్య సాధనే గురువు..

నాకు ఇష్టమైన ప్రాంతం పాఠశాలలోని బాస్కెట్‌బాల్ కోర్టు. నిత్య సాధనే నాకు గురువు. రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచానంటే కారణం రెండే రెండు మాటలు. మళ్లీ ప్రయత్నించు.. పరిగెత్తు.. ఇవే నాకు కోచ్. రాష్ట్ర సాయిలో గెలిచా. జాతీయ స్థాయిలోనూ విజేతగా నిలుస్తా. **-ధరణి, గ్రేడ్ 12**

అమ్మ మాటే ఆయుధం..

ప్రతి పోటీలో పాల్గొనే ముందు అమ్మ చెప్పేది. బిడ్డా నీవు గెలిచి రావడం కన్న.. నీ శ్రమపై నువ్వు నిలబడితే చాలని ప్రతిసారీ వెన్ను తట్టేది. అదే భయాన్ని దూరం చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించేలా చేసింది. ఈ విజయానికి మూలం ఇంటి ప్రేమ, గురువుల ప్రోత్సాహం. **-భవజ్ఞసాయి, పదో తరగతి**

ఓడిన ప్రతిసారీ గెలుపుపై ఆశ పెంచింది..

తల్లిదండ్రులు నా తొలి కోచ్‌లు. ఓడిన ప్రతిసారీ వారి మాటలు నాలో గెలుపుపై ఆశ పెంచాయి. కోచ్ ప్రోత్సాహం అందివచ్చింది. బంతిని వేయడమే కాదు.. ఓటమిని అధిగమించి ఎలా ఆడాలో నేర్పారు. దీని ఫలితమే రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచా. **-జశ్వంత్ చౌదరి, గ్రేడ్-II**

సంకల్పం ముందు ఆటంకాలు నిలవలేవు..

బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ఇష్టంతో కష్టపడ్డారు. వారి సంకల్పం ముందు ఆటంకాలు నిలవలేదు. తమ శిక్షణ ఆసక్తిగా గమనించి నిత్యం సాధన చేసేవారు. వారి పట్టుదలే రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిపింది. ఉత్తమ విద్యావంతులతో పాటు ఉత్తమ క్రీడాకారులనూ తీర్చిదిద్దాలనేదే లక్ష్యం. **-అరవింద్, కోచ్**

దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: కడా పీడీ ఆదేశాల మేరకు.. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాపలాదారు, పారిశుద్ధ్య కార్మికురాలి పోస్టుల భర్తీకి తాత్కాలిక నియామకాలు చేపడుతున్నామని వైద్యాధికారి వంశీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నూతన నియామకం

పుంగనూరు: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పుంగనూరు తాలూకా అధ్యక్షురాలిగా స్థానిక ఏరియా ఆస్పత్రి హెడ్‌నర్సు మధుబాలను, కార్యదర్శిగా వీఆర్వో అక్బర్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శివయ్య, కోశాధికారి దేవప్రసాద్, జిల్లా, స్థానిక నాయకులు నాగేనాయక్, మోహన్, సుధ పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

మాకు మార్గదర్శి మంచి మనసు గల కీ॥శే॥ డి.కె. బద్రినారాయణ గారి ఆకస్మిక మరణం.. మాకు తీరని లోటు.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవ దేవుని ప్రార్థిస్తూ..



Sri D.K. BADRI NARAYANA
Industrialist,
Secretary, SITAMS.Chittoor

Management, Principal, HOD's & all the Staff Members (Teaching and Non-teaching)

SREENIVASA INSTITUTE OF TECHNOLOGY AND MANAGEMENT STUDIES (SITAMS) AUTONOMOUS
MURUKAMBATTU POST, CHITTOOR–517 127

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, న్యూస్‌టుడే: కడా పీడీ ఆదేశాల మేరకు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాపలాదారు, పారిశుద్ధ్య కార్మికురాలు పోస్టుల భర్తీకి తాత్కాలిక నియామకాలు చేపడుతున్నట్లు వైద్యాధికారి వంశీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శివాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆరుద్ర నక్షత్రం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కాశీవిశ్వేశ్వర స్వామి, భోగనంజుండేశ్వరస్వామి, సోమేశ్వర స్వామి ఆలయాలకు ప్రజలు పోటెత్తారు.

నూతన నియామకం

పుంగనూరు, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పుంగనూరు తాలూకా అధ్యక్షురాలిగా స్థానిక ఏరియా ఆస్పత్రి హెడ్ నర్సు మధుబాలను, కార్యదర్శిగా వీఆర్వో అక్బర్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శివయ్య, కోశాధికారి దేవప్రసాద్, జిల్లా, స్థానిక నాయకులు నాగేనాయక్, మోహన్, సుధ పాల్గొన్నారు.

మధుబాల

అక్బర్‌అలీ

కురబల అభివృద్ధే తెదేపా ధ్యేయం

✦ ఘనంగా కనకదాస జయంతి

కలశ ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, న్యూస్‌టుడే: కురబల అభివృద్ధే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కనకదాస జయంతి సందర్భంగా ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎగువ చెక్‌పోస్టుకు కురబ మహిళలు కలశాలతో చేరుకుని.. అక్కడి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. మంత్రి సవిత కూడా కలశాన్ని తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన కనకదాస విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కురబ కులస్తుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి వర్తురు ప్రకాష్, కురబ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణప్ప, నాయకులు రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: యువత సామాజిక సేవలో ముందుండాలని ప్రిన్సిపల్ దయానందరాజు తెలిపారు. ఆదివారం మంగళం కాలనీలోని పాఠశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మురళి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలుబు.. దగ్గు.. జ్వరం

✦ వాతావరణ మార్పులతో రోగాల విజృంభణ
✦ ఆస్పత్రులకు ప్రజల పరుగులు

పుంగనూరు, న్యూస్‌టుడే: వర్షాల కారణంగా ఇటీవల వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పులతో రోగాలు విజృంభించడంతో ఆస్పత్రుల్లో బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులతో పలువురు బాధపడుతున్నారు. టైఫాయిడ్, విషజ్వరాల అనుమానిత కేసులు సైతం పెరుగుతున్నాయి.

పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రభుత్వ ఆస్పత్రుల్లో నవంబరు మొదటి వారం ఓపీతో డిసెంబరు మొదటి వారం ఓపీని పోల్చుకుంటే రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నవంబరులో 350 నుంచి 400 వరకు ఓపీ నమోదైతే... ప్రస్తుతం 450 నుంచి 500 వరకు ఓపీ ఉంటోంది. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి.

ఓపీ వివరాలిలా..

ఏరియా ఆస్పత్రి	నవంబరులో	డిసెంబరులో
పుంగనూరు	400	450
పలమనేరు	456	496
కుప్పం	430	452

పుంగనూరు ఏరియా ఆస్పత్రిలో సేవలు అందిస్తున్న వైద్యుడు

సమయానికి వైద్యులు లేక..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమయానికి వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో పలువురు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఒకవేళ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినా కొన్నిరకాల మందులు బయట తీసుకోమంటున్నారని బాధితులు చెబుతున్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో వివిధ పరీక్షల పేరుతో డబ్బులు వసూలు చేయడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సరిపడా మందులు ఉండేలా చూడాలని కోరుతున్నారు.

అశ్రద్ధ చేయకండి

ప్రతి ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో పాటు, మందులు అందుబాటులో ఉన్నాయి. అనారోగ్యానికి గురైన వెంటనే వైద్యులను సంప్రదిస్తే తగిన పరీక్షలు చేస్తారు. జ్వరాల బారిన పడకుండా వైద్యుల సూచనలు పాటించాలి.

- డా.హరగోపాల్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పుంగనూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: మండల పరిధి వనమలదిన్నె బీసీ కాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేయాలి. **- అబ్బోడు**

సమాధానం: కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- అప్పాజీ, ఎంపీడీవో**

సోమల, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని పెద్దఉప్పరపల్లెలోని ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు శుభ్రం చేసేందుకు చొరవ తీసుకోవాలి. **- స్థానికులు**

సమాధానం: పెద్దఉప్పరపల్లె ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేసేందుకు చొరవ తీసుకుంటాం. **- జగదీష్, కార్యదర్శి**

శాంతిపురం, న్యూస్‌టుడే: సమస్య: కడపల్లె పంచాయతీ బీఎం గొల్లపల్లెలోని వీధుల్లో మురుగు నిల్వల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. **- చంద్రశేఖర్**

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ఈశ్వరన్, డిప్యూటీ ఎంపీడీవో**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ వీధిలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. పట్టణంలో చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. **- రామాంజి, కుప్పం**

సమాధానం: నిందితుడిని పట్టుకుని వాహనం రికవరీకి చర్యలు తీసుకుంటాం. **- శంకరయ్య, అర్బన్ సీఐ**

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని అంకిశెట్టి వీధిలో కాలువలు మురుగుతో నిండిపోయాయి. దుర్వాసన వస్తోంది. దీంతో దోమల బెడద కూడా ఎక్కువగా ఉంది. **- అన్నయ్య**

సమాధానం: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. **- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

తాగునీరు వృథా

మండలంలోని గోపాలపురంలో డైరెక్ట్ పంపింగ్‌తో తాగునీరు వృథా అవుతోంది. పంచాయతీ బోరు నుంచి కుళాయిలకు తాగునీరు సరఫరా చేస్తుండటంతో పైపు లైను ద్వారా నీరు వృథాగా వెళ్తోంది. గ్రామంలో మినీ ట్యాంకు ఏర్పాటు చేసి సురక్షిత నీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

నాయకులతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

తెదేపాలో చేరిక

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని తంజంకొట్టాలుకు చెందిన 25 మంది యువకులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో ఆదివారం తెదేపాలో చేరారు. సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు యువకులు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

కమనీయం శ్రీవారి కల్యాణం

సోమల, న్యూస్‌టుడే: స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నవగ్రహ హోమం అనంతరం శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.

జలకంఠేశ్వరస్వామికి వెండి నాగపడగ వితరణ

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలి స్వయంభు కామాక్షీ సమేత మొగిలీశ్వర స్వామి ఆలయానికి అనుసంధానంగా దేవరకొండపై వెలసిన జలకంఠేశ్వర స్వామికి తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన రవి, శాంతి దంపతులు రూ.1.81 లక్షల విలువజేసే వెండి నాగపడగ ఆదివారం వితరణగా అందజేశారు. వీరు 20 ఏళ్లుగా ఏటా కార్తిక పౌర్ణమికి ఇక్కడకు విచ్చేస్తున్నారు. వెండి నాగపడగ అందజేసి తమ మొక్కు చెల్లించుకున్నామని వారు పేర్కొన్నారు. ఆపై అర్చకులు శ్రీనివాసశర్మ.. వాటిని స్వామివారికి అలంకరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ఆలయ పర్యవేక్షకులు ధనంజయ నాయుడు, ప్రసాద్, మంజునాథ్, గోవర్ధన, బాబు పాల్గొన్నారు.

దాత అందజేసిన నాగపడగ

వైద్య శిబిరానికి విశేష స్పందన

బైరెడ్డిపల్లె: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేసి 20 మందిని మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శాంతమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరికి చెందిన రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి రూ.1,00,335 మొత్తాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడికి ఆదివారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

విరాళం అందజేస్తున్న రాజేంద్రప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు

సూరప్ప వీధిలో శుభ్రత పనులు

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సూరప్ప వీధిలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు, పిచ్చి మొక్కలు తొలగించారు. వీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త రావడంతో అధికారులు స్పందించారు.

ఆరోపణలు అవాస్తవం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు నాగేశ్వరనాయుడు ప్రలోభాలకు లోనుకాలేదని మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ పేర్కొన్నారు. మండలంలో కొంత మంది ఆయనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని ఖండించారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గుంతలు పూడ్చండి సారూ..!

గుంతల రోడ్లలో ఇటీవల వర్షాలకు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పుంగనూరు-కంగానెల్లూరు మార్గంలో కోనేటిపాళ్యంలో తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పుంగనూరు

టెడ్డీ బేర్.. వన్యమృగాలు పరార్..!

కుప్పం నియోజకవర్గంలోని అటవీ సమీప రైతులు వన్యప్రాణుల నుంచి పంటల సంరక్షణకు వినూత్న మార్గాలను ఎంచుకొంటున్నారు. అవి పొలాల్లోకి రాకుండా పులి, సింహం, టెడ్డీ బేర్ బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. గుడుపల్లె మండలం పొగురుపల్లె సమీపంలోని అటవీ సరిహద్దున ఉన్న రాగి పంటలో ఓ రైతు ఇలా టెడ్డీ బేర్ బొమ్మను ఉంచారు. దీంతో దుప్పులు, అడవి పందులు, జింకలు పంటల వైపు రావడం లేదని స్థానిక రైతులు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, కుప్పం

సిగ్నల్ ఇవ్వని లైటు

పలమనేరు మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న సిగ్నల్ లైటు అలంకారప్రాయంగా మారింది. కొన్ని నెలల కిందట పోలీసులు ఈ సోలార్ సిగ్నల్ లైట్‌ను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన అనతి కాలానికే మరమ్మతుకు గురైంది. ఇక్కడ నాలుగు రోడ్లు కలుస్తాయి. సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరమ్మతు చేసి తిరిగి పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలమనేరు

నిరుపయోగంగా సహాయకుల భవనం

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల సహాయకుల కోసం నిర్మించిన విశ్రాంతి భవనం నిరుపయోగంగా ఉంది. ఏడాది కిందట రూ.10 లక్షలు ఖర్చు పెట్టి నిర్మించారు. ఇందులో రోగుల కోసం వచ్చేవారికి విశ్రాంతితో పాటు క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే నిర్మాణం పూర్తయినా వినియోగానికి దూరంగా ఉంది. దీంతో రోగుల సహాయకులు ఆరుబయట ఉంటున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పలమనేరు

పరామర్శ

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త బద్రీనారాయణ మృతికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సంతాపం తెలిపారు. చిత్తూరు మాజీ ఎంపీ ఆదికేశవులునాయుడు సోదరుడైన బద్రీనారాయణ శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఉలవలదిన్నె గ్రామానికి చెందిన తేజస్వినికి.. ముల్బాగల్‌కు చెందిన నవీన్‌తో ఐదేళ్ల కిందట వివాహమైంది. భర్త, వారి కుటుంబ సభ్యులు అదనపు కట్నం తేవాలని నిత్యం వేధిస్తున్నారని ఆమె ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లెలోని అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆదివారం కొలువుదీరింది. కమిటీ అధ్యక్షుడిగా గోపాల్, ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, కార్యదర్శిగా రామలింగం, ఉప కార్యదర్శిగా సరస్వతి, కోశాధికారిగా సుబ్రహ్మణ్యంతో పాటు 13 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న బగ్గిడి గోపాల్

బాధ్యులపై చర్యలు తీసుకోండి

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సి.బండపల్లెలో పురాతన రామాలయాన్ని దౌర్జన్యంగా కూల్చివేసిన ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు రాళ్లబూదుగూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని కొందరు వ్యక్తులు రాజకీయ లబ్ధి కోసం నూతన ఆలయం నిర్మిస్తామంటూ.. పురాతన ఆలయాన్ని యంత్రాలతో కూల్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు నామాలప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కంకర దారి.. ముళ్లబాటలా మారి..!

గత ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధిని గాలికొదిలేయడంతో గ్రామీణ రోడ్లతో పాటు ప్రధాన రోడ్లు దుస్థితికి చేరాయి. అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు కంకర తేలి రూపుకోల్పోయాయి. గుంతల్లో తట్టెడు మట్టి వేసేవారు కరవయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే కుప్పం, గుడుపల్లె

■ శాంతిపురం మండలంలో..

అబకలదొడ్డి పంచాయతీ కాకర్లవంక బీటీ రోడ్డు దుస్థితికి చేరుకొంది. కుప్పం-పలమనేరు జాతీయ రహదారి నుంచి కాకర్లవంక మీదుగా వెదురుగుట్టపల్లె రోడ్డు కూడలి వరకు దాదాపు మూడు కి.మీ. పరిధి కంకర తేలి ముళ్లబాటను తలపిస్తోంది. ఈ రహదారిలో రాకపోకలకు జనం తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

■ గుడుపల్లె మండలం..

ఆరేళ్ల కిందట చూడచక్కనైన తారు రోడ్డు.. నేడు కంకరతేలి నరకయాతనగా మారిందని ఒంటిపల్లె గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడుపల్లె-బిసానత్తం రోడ్డు దుస్థితికి చేరడంతో ఆ దారిలో వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు చర్యలు తీసుకుని రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

ఇరుకు గదులు.. ఆరుబయట వంటలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడానికి సన్నబియ్యం సైతం అందిస్తోంది. అయితే పాఠశాలల్లో వంట గదులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యంగా లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో 44 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో 25 వేల మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో వంట గదుల సమస్యతో పాటు పరిసరాల శుభ్రత సైతం అధ్వానంగా ఉంటోంది. ఇకనైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడానికి ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ సిస్టం తీసుకొస్తుంది. మండలంలో చౌడేపల్లె, చారాల పాఠశాలలకు ప్రతిపాదనలు పంపాం. ఈ రెండు పాఠశాలల్లో విశాలమైన వంట గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

-కేశవరెడ్డి, ఎంఈవో

మండలంలోని మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీకి నిర్మించిన వంట గది ఇరుకుగా ఉండటంతో నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో సుమారు 161 మంది విద్యార్థులున్నారు. వంట గది బియ్యం, చిక్కీలు, వంట సరకులు నిల్వ చేయడానికే ఇబ్బందిగా ఉంది. వంట చేయడానికి స్థలం లేకపోవడంతో ఆరుబయట వంట తయారు చేయాల్సి వస్తోంది.

మండలంలోని చారాల ఉన్నత పాఠశాలలో 362 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో వంట గది ఇరుకుగా ఉండటంతో నిర్వాహకులు రేకుల షెడ్డు కింద వంట చేస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉంది.

రైతుపై ఆకతాయిల దాడి

సంగనపల్లె(గుడుపల్లె),న్యూస్‌టుడే: గుర్తుతెలియని ఆకతాయిలు రైతుపై దాడి చేసిన ఘటన మండల పరిధి బోయనపల్లె సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. కొందరు యువకులు గ్రామ సమీపంలోని పొలంలో మద్యం తాగుతుండగా.. రైతు నారాయణప్ప వారిని మందలించడంతో వారు అతనిపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన రైతును చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

పిక్కలు పీకేలా కుక్కలు..!

పుంగనూరు పట్టణంలోని జాతీయ రహదారిపై కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరగడంతో వాహనదారులను ఇబ్బంది పడుతున్నారు. పాదచారులు అటుగా నడవడానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు**

ఇలా ఉంటే రాకపోకలు ఎలా..?

పట్టణంలోని టీబీ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇష్టానుసారం రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపివేయడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పురవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం**

(c) eenadu

ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం డిసెంబరు 8, 2025

యోగా.. ఆరోగ్యం బాగా

విధి నిర్వహణలో ఎంత తీరిక లేకుండా ఉన్నా.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరి ప్రథమ కర్తవ్యమని ఎస్పీ రాహుల్‌మీనా సూచించారు. అమలాపురంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఫిట్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నిర్వహించిన యోగా, జుంబా నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోలీసు సిబ్బంది సంపూర్ణ ఆరోగ్యంతో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐ బ్రహ్మానందం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం(అమలాపురం పట్టణం)

యోగా చేస్తున్న పోలీసు సిబ్బంది

హార్బర్‌కు వెలుగులొచ్చాయ్

ఈనాడు మీ తోడు

అంతర్వేది పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ విద్యుత్తు వెలుగులతో కళకళలాడుతోంది. దీని అభివృద్ధికి ప్రభుత్వం కలెక్టర్ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి పీపీపీ విధానంలో ఆర్ఆర్ ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో హార్బర్ వెలుగులతో నిండిపోయింది. గంగపుత్రులు సంతోషం వ్యక్తం చేశారు. హార్బర్‌లోని సమస్యలపై గతంలో 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధమైంది. - న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

పులిజాడ అన్వేషణ

మడ అడవుల్లో కాలుమోపేందుకు అవకాశం లేని చిత్తడి నేలలు ఉంటాయి. అడవంతా గుబురుగా ఉంటుంది. ఈ అడవుల్లో ఎక్కువగా నీటి పిల్లులు, నక్కలు, పక్షి జాతులు ఉంటాయి. వీటిపై ఏటా గణన నిర్వహిస్తారు. ఈసారి కోరింగ అభయారణ్యంలో పులి సంచారంపై వన్యప్రాణి విభాగం సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నారు. కోరింగ అభయారణ్యంలోని మడ అడవుల్లో ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. పులి కాలు గుర్తులు, ట్రాప్ సెట్లపై వన్యప్రాణి విభాగ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ధనంజయ, గోపీ నాగేంద్రకుమార్, జగదీష్‌లతో కూడిన ఇద్దరు బృంద సభ్యులతో కోరింగ, హోప్ ఐలాండ్, భైరవపాలెం సెక్షన్ పరిధిలోని 58వేల ఎకరాల మడ అడవులో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను ఈ నెల ఒకటిన ప్రారంభించారు. -న్యూస్‌టుడే, తాళ్లరేవు

కోరింగ అభయారణ్యంలో పులి అడుగులను గుర్తిస్తూ...

అనుమతి పేరిట అక్రమం

తీరం వెంబడి ఆగని ఇసుక అక్రమ తరలింపు

న్యూస్‌టుడే, అల్లవరం

అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరం నుంచి ఇసుకను పేరూరులో ఏర్పాటు చేయనున్న డిగ్రీ కళాశాల నిర్మాణానికి సంబంధించి మెరక పనుల పేరుతో కొంత మంది అనుమతులు తీసుకున్నారు. ఆ ఇసుకను రోళ్ల పాలెం బైపాస్ రహదారికి ఆనుకుని ఉన్న ప్రైవేటు స్థలం మెరక చేసేందుకు వినియోగిస్తున్నారు. తీరం వెంబడి ఇసుక తవ్వకాలకు ఇదో ఉదాహరణ మాత్రమే. అక్రమార్కులకు కొంత మంది నాయకులు, అధికారులు సహకారం అందిస్తుండటంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.

సఖినేటిపల్లి, అంతర్వేది, శంకరగుప్తం, చింతలమోరి, కేశనపల్లి, గొల్లపాలెం, ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.యానాం, కాట్రేనికోన పరిధిలో తీరం వెంబడి అనధికారిక ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.

లొసుగులు ఆసరాగా..

జిరాయితీ భూముల్లో సహజ సిద్ధంగా ఉన్న ఇసుక మేటలను తవ్వి ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అభివృద్ధి పనులకు తరలించేందుకు రెవెన్యూ అధికారుల నుంచి కొందరు అనుమతులు తీసుకుంటున్నారు. వీటిని అడ్డుగా పెట్టుకుని తీరంలోని డి.పట్టాలు, సీఆర్‌జడ్ పరిధిలోని భూముల నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి తరలించి ప్రైవేట్ స్థలాల్లో మెరక పనులు చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు.

రోళ్లపాలెం సమీపంలో బైపాస్‌కు ఆనుకుని మెరక పనులకు వినియోగిస్తున్న తువ్వ ఇసుక

- జిల్లాలో సముద్ర తీరం: 93 కి.మీ.
- తీర మండలాలు: 7

తూతూమంత్రంగా పర్యవేక్షణ

15 రోజుల క్రితం అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం తీర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలపై 'ఈనాడు'లో వచ్చిన కథనాలకు గనుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మూడు పొక్లెయిన్లు సీజ్ చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వాటిని స్వాధీనం చేసుకోవాల్సిన అధికారులు ఉదాసీన వైఖరి అవలంబించారు తర్వాత అవే యంత్రాలతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో..

- సఖినేటిపల్లి, అంతర్వేది గ్రామాల్లో సముద్ర తీరంలో అనధికారికి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.
- మలికిపురం మండలం పరిధిలో తూర్పుపాలెం, చింతలమోరి పరిధిలో సముద్ర తీరం, పట్టాభూముల్లో ఇసుక తోడేస్తున్నారు.
- అల్లవరం మండలం పరిధిలో ఓడలరేవు రెవెన్యూ పరిధిలో సీఆర్‌జడ్ పరిధిలో ఇసుక తరలిస్తున్నారు.
- ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్పలో తీరం వెంబడి అనధికారిక ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.

చర్యలు తప్పవు

తీర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. 15 రోజుల క్రితం ఓడలరేవు రెవెన్యూ పరిధిలో మూడు పొక్లెయిన్లు సీజ్ చేశాం. పలుచోట్ల అక్రమ తవ్వకాలను గుర్తించి సంబంధిత భూ యజమానుల వివరాలు తీసుకుంటున్నాం. వారికి నోటీసులు ఇస్తాం. - వంశీధర్ రెడ్డి, గనులశాఖ జిల్లా అధికారి

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాల భోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, వాడపల్లి(ఆత్రేయపురం)

రొయ్య రైతుకు బీమా భరోసా

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: రాష్ట్ర వృద్ధి రేటులో కీలక భూమిక పోషిస్తున్న ఆక్వా రంగం ఇటీవల తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. చెరువు సిద్ధం చేసి.. రొయ్య పిల్లలను(సీడ్) వదలడం నుంచి అవి దిగుబడికి వచ్చే వరకు దినదినగండంగా గడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆక్వాకు బీమా భరోసా కల్పించాలని చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది. బీమా నియంత్రణ, అభివృద్ధి అథారిటీ(ఐఆర్‌డీఏ) ఆక్వా సాగుకు బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది.

ఆక్వా చెరువులో మేతను చల్లుతూ..

రొయ్యలకు మాత్రమే..

ఆక్వాలో రొయ్యలతో పాటు చేపల సాగు జరుగుతోంది. వెనామీ, టైగర్, స్కాంపీ రకాల రొయ్యల సాగుకు మాత్రమే బీమా వర్తించనుంది. దీనికి కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ (సీఏఏ) ధ్రువీకరణ తప్పనిసరి. మత్స్యశాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న చెరువులు రెండు హెక్టార్ల వరకు బీమా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. భారీ తుపాన్లు, వరదలతో నష్టం వాటిల్లినా, విష ప్రభావంతో రొయ్యలు చనిపోయినా, వ్యాధులతో నష్టం వస్తే బీమా వర్తిస్తుంది.

రూ.3 లక్షల వరకు

ఆక్వా చెరువులకు ఎకరాకు ప్రీమియం రూ.12 వేలు చెల్లిస్తే. . రూ.3 లక్షల వరకు పరిహారం అందిస్తారు. దీనికి సంబంధించి విధివిధానాలు త్వరలో వెలువడే అవకాశాలు ఉన్నాయి. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా.. ఆక్వా చెరువులకు బీమా పథకాన్ని అమలుకు కార్యాచరణ సిద్ధం చేశారని.. బీమా కంపెనీలు విడుదల చేసే విధివిధానాల ప్రకారం రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాల్లో చేపల వేట

సామర్లకోట: వైకాపా ప్రభుత్వ హయాంలో నివాసయోగ్యం కాని స్థలాలను సేకరించి పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని జగనన్న కాలనీల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు. పల్లపు ప్రాంతం కావడంతో ఇళ్ల స్థలాల్లో వర్షపు నీరు పోవడానికి కాలువలు లేకపోవడంతో మురుగునీరు చేరింది. ఆ నీటిలో చేపలు పెరిగిపోవడంతో యువకులు గాలాలతో చేపల వేట సాగిస్తున్నారు.

ఇళ్లు.. విలాసాల లోగిళ్లు

గ్రామీణ ప్రాంతాల్లోనూ మారుతున్న అభిరుచులు

జనం అభిరుచులతో పాటు ఇళ్ల రూపురేఖలు మారుతున్నాయి. పురాతన పెంకుటిళ్లు.. మండువాలోగిళ్లు.. భారీ భవనాలు.. ఇలా క్రమేపీ నివాసగృహాల నిర్మాణాలు రూపాంతరం చెందాయి. గతంలో ఒక స్లాబ్ ఇల్లు నిర్మించాలంటే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు సరిపోయేది. రానురానూ వీటి నిర్మాణాల్లో అనేక ఆధునిక మార్పులు చోటుచేసుకున్నాయి. నేడు అభిరుచిని, ఆర్థిక స్తోమతను బట్టి ఇంటి నిర్మాణాలకు రూ.రెండు కోట్లు పైబడి ఖర్చు పెడుతున్నారు. ఎక్కడో మహానగరాలు, పట్టణాల్లో ఇలాంటి ఖరీదైన ఇళ్లు కనిపించేవి. రానురానూ గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇలాంటి విశాలమైన విలాసవంత ఇళ్లు వచ్చేస్తున్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు లిఫ్ట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. హాలు, డైనింగ్‌హాలు, కిచెన్, అటాచ్డ్ టాయిలెట్లు, బాత్‌రూములు, పిల్లల కోసం ప్రత్యేకించి బెడ్‌రూములు, రీడింగ్ రూములు, లైబ్రరీ గదులు, చిన్నపిల్లలకు ప్లేయింగ్‌రూములు ఇలా ఒకటేంటి అనేక హంగులతో నేడు గ్రామీణ ప్రాంతాల్లోకూడా అత్యంత నవ్యంగా ఆధునిక హంగులతో ఇంటి నిర్మాణాలకు లెక్కచేయకుండా రూ.కోట్లలో ఖర్చుపెడుతున్నారు. -న్యూస్‌టుడే, పి.గన్నవరం

మెట్లమీద నుంచి వస్తుంటే సెన్సార్లతో విద్యుత్తు వెలుగులు

ఇంటిలోపల హాలును చేర్చి లిఫ్ట్

వసతి గృహంలో కష్టాల ఏకరవు

కాలం చెల్లిన చిక్కీలు.. పాడయిన కూరగాయలు

ఈనాడు, రాజమహేంద్రవరం: పేద విద్యార్థులు చక్కగా చదువుకోవాలనే మహోన్నత లక్ష్యంతో వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగిస్తే కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఐ.పోలవరం మండలంలోని బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు కాలం చెల్లిన చిక్కీలు ఇస్తూ, పాడయిన కూరగాయలతో వంటలు చేస్తున్నారు. బియ్యం కూడా పక్కదారి పట్టినట్లు అధికారుల విచారణలో తేలింది.

దస్త్రాల్లో ఒకటి.. వాస్తవంగా మరొకటి..

ఐ.పోలవరం బీసీ వసతి గృహంపై ఫిర్యాదులు అందడంతో ఇటీవల అధికారులు సమగ్ర విచారణ చేయగా విద్యార్థుల ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. స్నానాలు చేసేందుకు నీరు అందుబాటులో లేకపోవడం, గదులు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. వసతి గృహం పైకప్పు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా ఉంది. ప్రభుత్వ సరఫరా చేసిన బియ్యం నిల్వలకు, దస్త్రాల్లో లెక్కలకు తేడా ఉండటంతోపాటు, హాజరు జాబితాలో విద్యార్థుల సంఖ్య కూడా మార్చారని తేల్చారు.

అధికారుల ఎదుట పిల్లల ఆవేదన

తమకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించడం లేదని, ఏమైనా అడిగితే దుర్భాషలాడుతున్నారని అధికారుల వద్ద కొందరు విద్యార్థులు ఏకరవు పెట్టారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని, దీని వల్ల చర్మ సమస్యలతో ఎక్కువ మంది బాధపడుతున్నట్లు వివరించారు. నెలవారీ కాస్మోటిక్స్ సరిగా ఇవ్వడం లేదని వాపోయారు.

స్మార్ట్ కార్డులు తిరుగుటపా!

డీలర్ల నుంచి తీసుకోని కొందరు లబ్ధిదారులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

కూటమి అధికారంలోకి వచ్చాక పౌర సరఫరాల శాఖ ప్రక్షాళనకు చర్యలు చేపట్టింది. రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు.. స్మార్ట్ కార్డులను తీసుకువచ్చారు. రెండు నెలల నుంచి వీటిని అందజేస్తున్నా.. నేటికీ చాలా మంది లబ్ధిదారులు వాటిని తీసుకోలేదు. ఆ కార్డులను వెనక్కి పంపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలో వివరాలు ఇలా..	
రేషన్ కార్డులు:	5,42,724
ఇప్పటి వరకు పంపిణీ చేసినవి	5,07,604
ఇంకా పంపిణీ చేయాల్సినవి:	35,120

అనర్హులు ఉన్నారా..?

జిల్లాకు 5.69 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయి. వాటిలో ఇంకా 35వేల కార్డులను లబ్ధిదారులు తీసుకోలేదు. నవంబరు 30 నాటికి గడువు ముగిసిపోవడంతో వెనక్కి పంపించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. డీలర్ల వద్ద ఉన్న రేషన్ కార్డుల్లో మృతి చెందిన వారు, గ్రామాంతరం వెళ్లిన వారు, మ్యాపింగ్‌లో తేడాలపై నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఆ వివరాల ఆధారంగా ఆయా స్మార్ట్ రేషన్ కార్డులను రద్దు చేయనున్నారు.

మ్యాపింగ్‌లో తప్పిదాలు..

గత వైకాపా హయాంలో సచివాలయాల వారీగా వాలంటీర్లు కుటుంబ సభ్యుల మ్యాపింగ్ చేశారు. ఈ ప్రక్రియను ఇష్టానుసారం సాగింది. తప్పులను సరిచేయకుండా అప్పట్లో బియ్యం కార్డులను పంపిణీ చేశారు. ఈ క్రమంలో అనర్హులకు కార్డులు వచ్చాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటి ఆధారంగా ప్రస్తుతం స్మార్ట్ కార్డులు వచ్చేయడంతో అవి మిగిలిపోయినట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇంకా 50వేల మంది ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. మిగిలిపోయిన స్మార్ట్ రేషన్ కార్డుల వాస్తవ పరిస్థితిపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నామని డీఎస్‌వో అడపా ఉదయభాస్కర్ తెలిపారు.

పట్టణాలకు అమృత్ ధార..!

పట్టాలెక్కనున్న పనులు

ఈనాడు, కాకినాడ : పట్టణ, నగర ప్రాంతాల్లో తాగునీరు, మురుగు నీటి సమస్యలకు పరిష్కారంగా తీసుకొచ్చిన అమృత్ పథకానికి ఎదురవుతున్న అవరోధాలు తొలగిపోతున్నాయి. వైకాపా హయాంలో రాష్ట్ర వాటా ఇవ్వకపోగా కేంద్రం ఇచ్చిన నిధులను సైతం ఇతర అవసరాలకు మళ్లించారు. ప్రస్తుతం కూటమి సర్కారు ఈ పథకాన్ని గాడిలో పెట్టేలా చర్యలు తీసుకుంటోంది. అమృత్ 2.0 పేరుతో కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్)లో పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. తాజాగా 2025-26 ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్, షెడ్యూల్డ్ ఆఫ్ రేట్స్) అంచనాలతో కాకినాడ, కోనసీమ జిల్లాలోని 11 పట్టణ స్థానిక సంస్థల్లో పనులకు మరోసారి టెండర్లు పిలిచారు.

18 పనులు రూ.405 కోట్లు..

కాకినాడ, కోనసీమ జిల్లాలోని తాగునీటి వనరుల పునరుద్ధరణ, గ్రావిటీ కాలువల నిర్మాణం, ఇతర అనుబంధ పనులు కలిపి రూ.405 కోట్లతో 18 పనులు చేపట్టనున్నారు.

జిల్లాలోని ఈ ప్రాంతాల్లో...

- మండపేటకు తాగునీటి సరఫరా ఉన్నతీకరణ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా ఆఫ్‌టెక్ ఛాంబర్ నిర్మిస్తారు. అక్కడ నుంచి ముడినీటిని పంప్‌హౌస్‌కు చేర్చి శుద్ధిచేసి పైప్‌లైన్ల ద్వారా ఇంటింటా కుళాయి ద్వారా నీటిని అందిస్తారు.
- ముమ్మిడివరం నగర పంచాయతీలో సమగ్ర తాగునీటి సరఫరా ప్రాజెక్టు ఉన్నతీకరణ చేసి, సోమదేవరపాలెంలో 500 కేఎల్ సామర్థ్యంతో నీళ్లకుండీ (ఈఎల్ఎస్ఆర్) నిర్మిస్తారు.
- అమలాపురంలో సమగ్ర నీటి సరఫరా ప్రాజెక్టును ఉన్నతీకరిస్తారు.
- రామచంద్రపురం పురపాలక సంఘం తాగునీటి సరఫరా పథకాన్ని బలోపేతం చేస్తారు. 2.46 ఎకరాల గంటలమ్మ చెరువుతో పాటు మరో నీటి వనరు పునరుద్ధరణ పనులు చేపడతారు.

నిధుల జాడేదీ.. విస్తరణకు దారేదీ..?

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

వద్దిపర్రు నుంచి బొబ్బర్లంక మీదుగా రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు వంటి పట్టణాలకు వెళ్లే కీలక దారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. గుంతలు ఏర్పడి ప్రయాణం కష్టంగా మారుతోంది. ఈ మార్గంలోనే వాడపల్లి వెంకన్న ఆలయానికి చేరుకోవాలి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సింగిల్ రోడ్డు కావడంతో వాహనాలు తప్పించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిధుల సమస్య కారణంగా విస్తరణకు నోచుకోవడం లేదు. ఈ సమస్యను రోడ్లు, భవనాల శాఖ డీఈ రాజేంద్ర వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా విస్తరణ నిమిత్తం రూ.30 కోట్లు సీఆర్ఎఫ్ నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు.

ఛిద్రమైన అమలాపురం, బొబ్బర్లంక(ఏబీ) ర.భ రోడ్డు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

4డీ.. అనారోగ్యంతో ఢీ

బాలల ఆరోగ్యానికి ప్రత్యేక కార్యక్రమం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా ఛైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో నాలుగు రకాల వ్యాధులు(4డి).. 1. పుట్టుకతో వచ్చే లోపాలు 2. బాల్యంలో వ్యాధులు 3. పోషకాహార లోపాలు 4. ఎదుగుదల లోపం సమస్యలను గుర్తించి ఉచితంగా చికిత్స అందిస్తున్నారు.

అమలాపురం డివిజన్ పరిధిలోని ఓ పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

ఎలాంటి పరీక్షలంటే..

ఏఎన్ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు(ఎంఎల్‌హెచ్‌పీ)లు విద్యార్థుల వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్తహీనత, ఎత్తు, బరువు, కంటి, వినికిడి, పరీక్షలు మానసిక రుగ్మతలు, దంత సమస్యలు, కాలాగుణ, చర్మ సంబంధిత, ఇలా తల నుంచి కాలి గోటి వరకు స్క్రీనింగ్ చేసి వివరాలను ఏపీ హెల్త్ యాప్‌లో నమోదు చేస్తారు.

వివరాలు..

వివరం	సంఖ్య	విద్యార్థులు	పరీక్షలు పూర్తయినవారు	ఆరోగ్యంగా ఉన్నవారు	సమస్యలు ఉన్నవారు
పాఠశాలలు	1580	1,05,839	63,111	45,467	17,644
అంగన్‌వాడీలు	1726	1,08,337	53,358	37,231	16,127

వ్యాధి తీవ్రతను బట్టి..

18 ఏళ్లలోపు బాలబాలికలకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అంగనవాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. స్క్రీనింగ్‌లో సమస్యలున్న విద్యార్థులకు వైద్యాధికారి పర్యవేక్షణలో వ్యాధి తీవ్రతను బట్టి సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తారు.

అప్రమత్తతే ముఖ్యం

పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ పరీక్షల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించిన చిన్నారులకు ప్రత్యేక వైద్యం అందించనున్నాం. పిల్లల ఆరోగ్యంపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.
-డా.సుమలత, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి

ప్రథమ వర్ధంతి



కీ।।శే।। ప్రొఫెసర్ మేడిచర్ల నర్సింహారావు గారు
M.Tech., Ph.D
Andhra University Professor (Rtd.)

మంచికి మారుపేరుగా నిలిచి, మా అందరికీ మీ ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు మిగిల్చి దైవ సన్నిధికి చేరిన మీ రూపం మా మనస్సులలో సదా పదిలం

We Miss You Daddy

ప్రేమతో.. కుటుంబ సభ్యులు

(c) eenadu

సముద్రుడు.. తీరానికి దూరంగా జరిగాడు..

అంతర్వేదిలో సముద్రం వెనక్కి మళ్లింది. గత 40 రోజుల నుంచి వరుస తుపాన్ల(మొంథా, దిత్వా)తో సముద్రం అల్లకల్లోలంగా మారి ముందుకు చొచ్చుకొచ్చింది. సాగర సంగమం నుంచి కేశవదాసుపాలెం వరకు సుమారు 12 కిలోమీటర్ల తీరంలో వందలాది ఎకరాల భూమి కడలిలో కలిసిపోయింది. ప్రస్తుతం ప్రశాంతంగా తయారై ఇసుక మేటలు వేసి సుమారు 50 మీటర్ల మేర వెనక్కి మళ్లింది. ఏవిధమైన ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా ఉంటే ఇసుక మేటలతో చూడముచ్చటగా ఉంటుందని ప్రకృతి ప్రేమికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, అంతర్వేది**

ఇక్కడింతే.. 2 తరగతులు X 1 గది = 2 పాఠాలు

గొల్లప్రోలు పాపయ్యచావిడి వీధిలో గల నంబర్-2 ప్రాథమిక పాఠశాలకు రెండు గదులు ఉండగా వాటిలోనే అయిదుగురు ఉపాధ్యాయులు అయిదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ పాఠశాలకు 3 గదుల భవనం మంజూరు చేసినా తరువాత రెండు గదుల నిర్మాణానికి మాత్రమే నిధులు కేటాయించారు. ఈ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోగా కూటమి ప్రభుత్వం పనులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయించింది. ఒక్కొక్క గదిలో రెండేసి తరగతులు నిర్వహిస్తూ మరొక తరగతిని వరండాలో కొనసాగిస్తున్నారు. నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈవో శ్రీనివాసరావు, ఎంఈవో-2 శివప్రసాద్ తెలిపారు. **- న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

కోరిమరీ తలచి.. కోనసీమ రుచి

మూకుడులో మినప పిండి వేసి పైన, కింద కొబ్బరి డొక్కల మంటతో కాల్చే మినప దిబ్బరొట్టె తింటే లొట్టలేయాల్సిందే. 1996 నుంచి పి.గన్నవరంలో ఈ రొట్టెలకు ప్రసిద్ధి. మూడు దశాబ్దాల క్రితం పడాల బ్రహ్మం ఈ రొట్టెలకు శ్రీకారం చుట్టారు. ఆయన కుమారుడు రాము దుకాణం నడిపిస్తున్నారు. దోరగా కాల్చిన దిబ్బరొట్టెకు కొబ్బరి చెట్నీ, బొంబాయిచెట్నీ, కాసింత కారప్పొడి కలిపి తింటే ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి అనాల్సిందే. ఒకసారి ఈ హోటల్లో దిబ్బరొట్టె తిన్నవాళ్లు మళ్లీ మళ్లీ ఇక్కడికే వస్తారు. రొట్టె ధర రూ.50. సగం తీసుకుంటే రూ.25 చెల్లించాలి. పొద్దున్నే నూనెతో వండిన అల్పాహారం ఇష్టపడనివారు ఎక్కువగా ఈ దిబ్బరొట్టెలు తినడానికి ప్రాధాన్యమిస్తారు. **- న్యూస్‌టుడే, పి.గన్నవరం**

సిద్ధివినాయక.. వరదాయక

అయినవిల్లి సిద్ధివినాయకస్వామికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. వివిధ రుసుముల ద్వారా రూ.2,26,766 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, అయినవిల్లి**

వరి కంకుల్లో రామలింగేశ్వరుడు

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం, ఆదివారం కలిసిరావడంతో శ్రీ ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధాన్యం వరి కంకులతో ధాన్య పరమేశ్వరుడుగా అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. రైతు బాగుండాలని, పంటలు సక్రమంగా చేతికిరావాలని ఈప్రత్యేకమైన పూజలు చేసినట్లు ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు. **– న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

ఉప్పాడ జాంధానీ ఊపు అందుకోనుందా..

సంక్రాంతి సీజన్‌పై వస్త్ర వ్యాపారుల ఆశలు

న్యూస్‌టుడే, కొత్తపల్లి

కరోనా మహమ్మారి రాక ముందు ఉప్పాడ జాంధానీ పట్టు చీరల వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఉండేది. 2020లో కరోనా రావడంతో చేనేత రంగానికి గడ్డుకాలం ఏర్పడింది. ఆ సమయంలో వైకాపా ప్రభుత్వం ఈ రంగాన్ని అభివృద్ధిలోకి తెచ్చేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఫలితంగా అమ్మకాలు లేక వ్యాపారులు, ఉపాధి లేక నేత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమ్మకాలు లేక ఉప్పాడ, కొత్తపల్లి మండలంలోని వందలాది చేనేత వస్త్ర దుకాణాలు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. రానున్న సంక్రాంతి నేపథ్యంలో అమ్మకాలు పెరిగి లాభాలు వస్తాయని వస్త్ర వ్యాపారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో హస్తకళలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఉప్పాడను ఎంపిక చేసింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఉప్పాడలోని నేతన్నలకు అవసరాల రీత్యా మౌలిక వసతులు కల్పించేందుకు రూ.5 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగం అభివృద్ధి చేయాలనే ఆలోచనతో రాష్ట్రంలోనే గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ మండలాల్లో చేనేత రంగం అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించింది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి పంపారు.

రూ.100 కోట్ల నుంచి రూ.20 కోట్లకు..

నాలుగేళ్ల క్రితం చేనేత జాంధానీ పట్టు చీరల వ్యాపారం ఏడాదికి సుమారుగా రూ.100 కోట్ల వరకు లావాదేవీలు జరిగేవి. కరోనా మహమ్మారి, అప్పటి ప్రభుత్వ వైఫల్యం కారణంగా అమ్మకాలు ఒక్కసారిగా 90 శాతం పడిపోయాయి. ప్రస్తుతం ఏడాదికి కేవలం రూ.20 కోట్లు మాత్రమే వ్యాపారాలు సాగుతున్నట్లు మాస్టర్ వీవర్స్ చెబుతున్నారు. ముడిసరుకు ధరలు అమాంతంగా పెరిగినా చీరల ధరలు పెంచలేక నష్టాలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొంతమంది వ్యాపారం మానుకుని దుకాణాలు మూసేశారు. మరి కొంతమంది నష్టాలను భరిస్తూ సంక్రాంతి సీజన్ కోసం ఎదురుచూస్తున్నారు.

దుకాణంలో ఉప్పాడ పట్టు చీరలు

అంబాజీపేట వైకాపాలో ముసలం

పార్టీలో ఇమడలేమంటూ పలువురి రాజీనామా

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండల వైకాపాలో అసంతృప్తి సెగలు బయటపడుతున్నాయి. ఆ పార్టీలో ఇమడలేమని కొందరు గుడ్‌బై చెప్పేశారు. నేతల ఒంటెద్దు పోకడలతో ఏకపక్షంగా వెళ్లడం, పదవుల పంపిణీలో సీనియర్లను విస్మరించడంతో పాటు వ్యక్తిగత కారణాలతో పార్టీని విడిచి పెడుతున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్‌కు లిఖితపూర్వకంగా తెలియజేశారు. దీనికి సంబంధించిన ప్రతులను ఆదివారం స్థానిక విలేకరులకు అందజేశారు. మాచవరం ఎంపీటీసీ సభ్యురాలు మట్టా పార్వతి, నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, ఉందుర్తి నాగబాబు, మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, చిల్లే శ్రీనివాసరావులు వైకాపా ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

మంత్రి లోకేశ్‌పై వైకాపా తప్పుడు ప్రచారం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై వైకాపా నాయకులు దిగజారుడు విమర్శలు చేస్తున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మహాసేన రాజేష్ పేర్కొన్నారు. ఇండిగో విమానయాన సర్వీసుల విషయంలో తలెత్తిన వివాదానికి సంబంధించి లోకేశ్‌పై బురద జల్లేందుకు వైకాపా బ్యాచ్ తప్పుడు ప్రచారం సాగిస్తోందన్నారు. కాకినాడలోని జిల్లా తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇండిగో సమస్య పరిష్కారానికి లోకేశ్ కృషి చేస్తున్నారని ఇటీవల తెదేపా జాతీయ అధికార ప్రతినిధి దీపక్‌రెడ్డి చెప్పగా, కేంద్ర రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ వైకాపా గోలగోల చేస్తోందని విమర్శించారు. లోకేశ్‌కు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీతో సహా పలు కీలక నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఇండిగో సమస్యను పరిష్కరించేందుకు ఆయన చొరవ చూపితే తప్పేంటని నిలదీశారు. అతితక్కువ కాలంలో రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయిలో నాయకునిగా రాణిస్తున్న లోకేశ్‌ను చూసి ఓర్వలేక వైకాపా నాయకులు విమర్శలు చేస్తున్నారని రాజేశ్ మండిపడ్డారు. సమావేశంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్

ఎంపికైన మహిళా జట్టుతో వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

బాస్కెట్‌బాల్ వర్సిటీ జట్టు ఎంపిక

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో ఆదివారం అంతర్ కళాశాలల స్థాయిలో మహిళా క్రీడాకారులకు ఆదివారం బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించి వర్సిటీ జట్టును ఎంపిక చేశారు. వీసీ, ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ క్రీడాకారులు లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి ఎనిమిది జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ నెల 29 నుంచి జనవరి 2 వరకు బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో మహిళా జట్టు పాల్గొంటుందన్నారు. అంతర్ కళాశాలల పోటీల్లో ఏలూరు సెయింట్ థెరిసా, సీఆర్ఆర్, ఆదిత్య మహిళా కళాశాల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవీఎస్ఎన్ మూర్తి, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

15న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గాంధీనగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద జరిగే ప్రదర్శన, ధర్నాలను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పాతబస్టాండ్ సెంటర్‌లోని ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలు నీరుగార్చాయని విమర్శించారు. సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సౌకర్యాలను అదనంగా చేర్చాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు ఆదినారాయణమూర్తి, రాఘవులు, సత్తిబాబు, కృష్ణ, రాము, పి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ

నేడు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కల్టెరేట్‌లో సోమవారం ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు, అన్నిశాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కార మార్గాలు పొందాలని సూచించారు.

దిల్లీ విమాన సర్వీసు రద్దు

కోరుకొండ: ఇండిగో విమానయాన సంస్థలో నెలకొన్న సేవల అంతరాయం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఇంకా కొనసాగుతోంది. ఆదివారం సర్వీసులన్నీ పునరుద్ధరించినా, సోమవారం విమాన సర్వీసుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో భాగంగా సోమవారం దిల్లీ ఎయిర్ బస్ విమాన సర్వీసు రాకపోకలను పూర్తిగా రద్దు చేశారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ముందస్తుగానే ప్రయాణికులకు సమాచారం ఇచ్చారు.

లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బంగార్రాజు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు రెండో పర్యాయం ఎన్నికయ్యారు. కడప జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో ఉన్న 39 మంది సభ్యులు ఈ మేరకు తమ నిర్ణయాన్ని ప్రకటించారు. బంగార్రాజు లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. కడపలో ఈ నెల 6న ప్రారంభమైన మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథులుగా పార్టీ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, పొలిట్ బ్యూరో సభ్యుడు స్వదేశ్ భట్టాచార్య, నాయకులు శంకర్, చంద్రమోహన్ తదితరులు హాజరయ్యారు.

భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బోస్

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏలేశ్వరానికి చెందిన బీసీ నాయకుడు పైల సుభాష్‌చంద్రబోస్ ఎంపికయ్యారు. బాధ్యతను అప్పగించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మోర్చా నాయకులు మధుకర్, ఆర్‌పీ శ్రీనివాస్‌లకు ఆదివారం ఆయన కృతజ్ఞతలు చెప్పారు. వార్డు స్థాయి నుంచి భాజపా, అనుబంధ విభాగాలను మరింత బలోపేతం చేస్తానని బోస్ వెల్లడించారు.

స్వర్ణ పంచాయతీలోనే..

పన్ను లావాదేవీలన్నీ చెల్లింపులు సులువుగా...

న్యూస్‌టుడే, గండేపల్లి

ప్రస్తుత పన్నులు, బకాయిల వసూళ్లకు అధికారులు అవస్థలు పడేవారు. మాన్యువల్ పద్ధతిలో రసీదులు ఇవ్వడం కూడా ఇబ్బందిగా ఉండేది. ఇళ్లలో లేనివారు, పనులకు వలస వెళ్లినవారి నుంచి పన్నులు రాబట్టడం ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం పన్నుల వసూళ్లు, సులభతర పద్ధతిలో చెల్లించేందుకు, అధికారులు ఒత్తిడికి గురికాకుండా / స్వర్ణ పంచాయతీ యాప్/ వినియోగంలోకి తెచ్చింది. ప్రస్తుతం పాత, మొండి బకాయిలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు వసూళ్లపై అధికారులు నిమగ్నమయ్యారు.

మీ కోసం

యాప్ వాడొచ్చు ఇలా..

గతంలో పన్ను చెల్లించిన వారికి రసీదులు ఇవ్వడం, వాటికి ప్రత్యేకంగా రికార్డులు ఉండేవి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్వర్ణ పంచాయతీ యాప్‌ను చరవాణిలో గూగుల్ ప్లేస్టోర్‌లో నుంచి సులువుగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత పన్ను చెల్లించాలనుకుంటే పబ్లిక్ లాగిన్‌లోనికి వెళ్లి ఏపీ, జిల్లా, మండలం, పంచాయతీలను ఎంచుకోవాలి. అందులో న్యూ ఎసెస్మెంట్ నంబరు లేదంటే పేరు, లేదా డోర్ నంబరు లేదా, ఓల్డ్ ఎసెస్మెంట్ నంబర్లలోకి వెళ్లాలి. చెల్లింపులకు ఒక ఐచ్ఛికం (ఆప్షన్), సమాచారం నిజమో కాదో తెలిపేందుకు ఒక ఐచ్ఛికం ఉంటాయి. మన ఫోన్ నంబరుతో చెల్లింపు చేసేందుకు ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్, నెట్ బ్యాంకింగ్‌లోకి వెళ్లి పన్ను బకాయిలు తెలుసుకుని నేరుగా చెల్లించొచ్చు. పంచాయతీ అధికారులైతే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో యాప్‌లో లాగినై పన్ను వసూలు చేస్తున్నారు.



పారదర్శకంగా ఉంటుంది

గతంలో పన్నుల చెల్లింపులో అవకతవకలు ఉండేవి. ప్రస్తుత యాప్‌ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులో పారదర్శకత ఉంటోంది. పన్నులు చెల్లించేందుకు ప్రజలు, వసూలు చేసేందుకు అధికారులకు స్వర్ణపంచాయతీ యాప్ సహాయంగా ఉంటోంది.

- రవికుమార్, డీపీవో, కాకినాడ

మధ్యంతర భృతి చెల్లించాలి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

అయినవిల్లి, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఎస్టీయూ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ముక్తేశ్వరం పాలిటెక్నిక్ కళాశాలలో అయినవిల్లి, అమలాపురం, అంబాజీపేట మండల శాఖల ఆధ్వర్యంలో 79వ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్‌సీ నియామకం చేపట్టాలని, మధ్యంతర భృతి, బకాయిలు ఇవ్వాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షునిగా పోతంశెట్టి వెంకటరామారావు, కార్యదర్శిగా కారుమూరి కల్యాణ్‌బాబు, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సరిదే సత్యపల్లంరాజు, నేరిడిమిల్లి సత్యనారాయణ, నాగిరెడ్డి శివప్రసాద్, వెలిగట్ల రత్నకుమారి, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 98491 38626.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి. ✆ 73862 01191.

TO LET

COMMERCIAL

కాకినాడ జిల్లా, పెద్దాపురంలో హారిజెంటల్, వర్టికల్ మిషన్స్ కలిగి ఉన్న సామిల్లు అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి. ✆ 86396 91555.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Wanted Electrical Engineers. Qualified By B.Tech Electrical Engineering, Diploma or ITI Experience 0-3 Years. Place of Work: East and West Godavari Districts, Attractive Salary. Contact: 79950 50571 or Send Resumes To hr@gvsprojectspvtltd.com

కాకినాడ, ROY చెస్ అకాడమీ కోచింగ్ సిబ్బంది కావలెను. అర్హత డిగ్రీ, వ: 35 లోపు, జీ: 15,000, చెస్ లేదా టీచింగ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. ✆ 62815 98466.

జీతం: రూ.15,000/- నుండి రూ.25,000/-, సర్వీస్ అడ్వైజర్ & ఇన్‌ఛార్జ్ కావలెను. కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి. శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ:20k. ✆ 89776 39662,89776 39663.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. జీతం: రూ.12,000/- నుండి రూ.15,000/- వరకు. Contact: శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

వ్యాన్ డ్రైవర్స్ కావలెను. జీతం: రూ.15,000/- + డైలీ రూ.100/-, (వివాహమైన స్థానిక అభ్యర్థులు మాత్రమే). శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. గోకవరం మండలం, పెంటపల్లి గ్రామంలో ఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 7893555551, 9030056553.

హైదరాబాద్‌లో పనిచేయడానికి M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 20,000+ భోజనము + వసతి. ఈ జీతం నెల 20లోపు జాయిన్ అయిన వారికి మాత్రమే. -91 76809 22316.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-50 పైII అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,500
పాతకాయ: గండేరా	28,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	27,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

నేడు, రేపు నన్నయలో జాతీయ కార్యశాల

హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 8, 9న 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై జాతీయ కార్యశాల నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై కార్యశాలను ప్రారంభిస్తారన్నారు. భారతీయ భాషా సమితి మినిస్ట్రీస్ ఆఫ్ ఎడ్యుకేషన్ సహకారంతో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీఅధ్యక్షుడు ఆర్‌డి.విల్సన్, భారతీయ భాషా సమితి అకడమిక్స్ కోఆర్డినేటర్ డా.కె.గిరిధరరావు, దేశ నలుమూలల నుంచి తెలుగు, హిందీ, సంస్కృత భాషల ప్రముఖులు హాజరవుతారన్నారు. భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలంపై మరింత అవగాహన పెంచుకునేందుకు నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులు, పుస్తకాలు రచించిన విద్యావేత్తలు, భాషాభిమానులు సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని వీసీ కోరారు.

9 నుంచి 12 వరకు ఆలోచనల అన్వేషణ

బొమ్మూరు, న్యూస్‌టుడే: స్థానిక రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో 9 నుంచి 12వ తేదీ వరకు ఆలోచన అన్వేషణ కార్యక్రమం (ఐడియా ఎక్స్‌ప్లోరేషన్ ప్రోగాం) నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి టి.సూర్యప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రారంభ దశ ఫౌండర్లు, ఇన్నోవేటర్లు, విద్యార్థులు, స్టార్టప్ ఆశక్తి ఉన్న వారి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామన్నారు. ప్రారంభదశలో ఉన్న ఆలోచనలను మార్గదర్శకాలతో ఉన్నత స్థితికి చేరడానికి హబ్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ మేఘాస్వరూప్ పాల్గొంటారని తెలిపారు. ఆలోచనలను వ్యాపారంగా మార్చుకోవడానికి ఈ కార్యక్రమం మంచి అవకాశమని పేర్కొన్నారు.

104 ఉద్యోగుల ఆందోళన

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కలెక్టరేట్ వద్ద 104 వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం వీటిని నిర్వహిస్తున్న యాజమాన్యం ఉద్యోగులకు నియామకపత్రాలు, పే స్లిప్‌లు ఇవ్వలేదని, ప్రభుత్వం చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.రాంబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జీ మాట్లాడుతూ అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఔషధాల నిర్వహణ బాధ్యతలు అప్పగించవద్దన్నారు. జీతాల్లో వ్యత్యాసాలు సవరించి, ఇప్పటికే కొత విధించిన సొమ్ములను అరియర్ రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని, ప్రతి డివిజన్‌కు బఫర్ సిబ్బందిని నియమించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి త్రిమూర్తులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, కోశాధికారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

యువకుడి దుర్మరణం

రాజోలు, న్యూస్‌టుడే: కాలువలోకి కారు దూసుకెళ్లి ఓ యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. రాజోలు మండలం కడలి గ్రామంలో శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రాజోలు ఎస్సై బి.రాజేష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. రాజోలు మండలం ములికిపల్లికి చెందిన కలిగితి శ్యామ్‌తేజ(20) అదే గ్రామానికి చెందిన స్నేహితులు ముప్పల పవన్, మరొకరితో కలిసి శనివారం సాయంత్రం పి.గన్నవరంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచి తాటిపాక వచ్చి హోటల్‌లో బిర్యానీ తిని ఇంటికి బయలుదేరారు. కడలి కూడలికి చేరుకున్నాక తాగునీటి సీసా కొనుగోలు చేయడానికి ఇద్దరు దిగారు. అక్కడ శ్యామ్‌తేజ కారు నడపడానికి పవన్ నుంచి స్టీరింగ్ తీసుకున్నాడు. కిందకు దిగిన ఇద్దరు మిత్రులు తిరిగి ఎక్కకుండానే వేగంగా ముందుకు నడిపాడు. కొద్ది దూరం వెళ్లాక రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి మానును ఢీకొట్టి కాలువలోకి కారు పల్టీ కొట్టింది. ప్రమాదాన్ని దూరం నుంచి గమనించిన మిత్రులిద్దరూ వెళ్లి రక్షించే ప్రయత్నం చేశారు. సమీపంలోని ఇళ్లవారిని నిద్రలేపి కారును బయటకుతీశారు. అప్పటికే శ్యామ్‌తేజ మృతిచెందాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి వరుసకు సోదరుడైన నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కలిగితి శ్యామ్‌తేజ (పాత చిత్రం)

స్వగ్రామంలో విషాదఛాయలు

ప్రమాదంలో శ్యామ్‌తేజ మృతి చెందడంతో ములికిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇతని తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉన్నారు. ఇతను తల్లి, సోదరుడితో కలిసి గ్రామంలో ఉంటున్నాడు. గతంలో ఎండీయూ వాహనంలో కార్డుదారులకు రేషన్ సరకులు పంపిణీ చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. గత కొంతకాలం నుంచి ఖాళీగా ఉంటున్నాడు. చేతికి అందొచ్చిన కొడుకు దూరమయ్యాడని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

నొవ్వా, రాళ్ల కాలువలను ఆధునికీకరించాలి

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: అంతర్వేది, గొంది, కేశవదాసుపాలెంలో ఉన్న నొవ్వా, రాళ్ల మురుగు కాలువల్లో ఇసుక మేటలను తొలగించాలని తీరప్రాంత రైతులు ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘ అధ్యక్షుడు చెల్లుబోయిన కేశవశెట్టి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకరగుప్తంలో పర్యటించి అక్కడి మురుగు కాలువ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేశారని, వాటితో పాటు నొవ్వా, రాళ్ల కాలువలను కూడా ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ముంపునీరు అంతర్వేది తీరాన్ని ముంచెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిలోని పూడికతీత తీసి కేశవదాసుపాలెంలో అవుట్‌పాల్ స్లూయిస్ నిర్మించాలని కోరారు.

బుద్ధిజంతోనే సమ సమాజ స్థాపన

ప్రచార రథయాత్రలో నాయకులు

ఐ.పోలవరం: బుద్ధిజంతో దేశంలో సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) నాయకులు అన్నారు. మండలంలోని మురమళ్ల, పాత ఇంజరం, కొమరగిరి, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, మూలపొలం గ్రామాల్లో ఆదుర్రు బౌద్ధ స్థూప ప్రచార రథయాత్రను నిర్వహించారు. కాశీ సత్యనారాయణ, బుడితి బాబూరాజేంద్రప్రసాద్, గిడ్ల రమేష్, మట్టా వెంకట్రావు, యలమంచిన సురేష్, కుంచే చినబాబు, బొంతు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
ఉ॥ 10 - మ॥ 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

వీధి దీపాలు వెలిగాయి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: తాడిపూడి గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచి ముదునూరి సుబ్బలక్ష్మి వద్ద ప్రస్తావించగా సిబ్బందితో లైన్లకు మరమ్మతులు చేయించి దీపాలు వేయించారు.

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం రావులపాడులో వీధి దీపాలు రాత్రి సమయంలో సక్రమంగా వెలగకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి దృష్టికి తీసుకుని వెళ్లగా సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం కొమరాజులంకలో రోడ్డు వద్ద వ్యర్థాలు పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి దృష్టికి తీసుకుని వెళ్లగా సిబ్బందిని పంపి చర్యలు తీసుకున్నారు.

పర్యాటకుల సందడి

అంతర్వేది బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకుంది. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది తరలివచ్చి ముందుగా లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్నారు. అనంతరం సమీపంలోని బీచ్‌లో స్నానాలు చేస్తూ పిల్లాపాపలతో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. వశిష్ఠ గోదావరిలో బోటింగ్ చేశారు. - న్యూస్‌టుడే, అంతర్వేది

కల నెరవేరింది..



రాజోలు మండలం శివకోటి ముసలమ్మతల్లి ఆలయం నుంచి మట్టపర్రు వరకు రోడ్డు సుందరంగా రూపుదిద్దుకుంది. రూ. 1.14 కోట్లతో 2.35 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా మారి రాకపోకలకు ప్రజలు నానాయాతన పడ్డారు. కూటమి ప్రభుత్వం దీనికి నిధులు కేటాయించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రాజోలు

9న అంబాజీపేటలో మెగా వైద్యశిబిరం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటలోని మిస్సమ్మ ఆసుపత్రి వ్యవస్థాపకులు లీజరమ్మ జయంతి సందర్భంగా లీజర్ స్మారక ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 9న స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రోగులకు సేవలు అందిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలి: ఎస్టీయూ

మామిడికుదురు, న్యూస్‌టుడే: పన్నెండో పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్టీయూ నాయకులు పాశర్లపూడిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నినదించారు. 79వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చిస్తామన్నారని, అప్పటివరకు ఐ.ఆర్. ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సంఘ మండల అధ్యక్షుడు చిక్కం రవికుమార్, ప్రధాన కార్యదర్శి నేల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

రుణ సౌకర్యాలు కల్పించాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: దివ్యాంగుల స్వయం ఉపాధికి పూర్తి రాయితీతో రుణ సౌకర్యాలు కల్పించాలని మదర్‌థెరెసా దివ్యాంగుల సంక్షేమ సంఘం కోరింది. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని పాశర్లపూడిలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సంఘ భవనానికి స్థలం కేటాయించాలని కూటమి నాయకులను కోరారు. రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు గుర్రం శ్రీనివాసరావు, కేతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పేదల పెన్నిధి ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అనారోగ్యం వల్ల చికిత్స పొందిన 40 మంది లబ్ధిదారులకు రూ.17,92,681 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో ఎమ్మెల్యే సత్యానందరావు

పిల్లల ఉత్సాహం.. ఆటతో ఆనందం

- న్యూస్‌టుడే, పి.గన్నవరం

సాధారణంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎక్కువగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, హైజంప్, లాంగ్‌జంప్, రన్నింగ్.. ఇలా వివిధ క్రీడలు ఆడుతుంటారు. టేబుల్‌టెన్నిస్ చాలా అరుదు. దీనికి విశాలమైన గది, బాల్, నెట్, టేబుల్, బ్యాట్‌లు ఉండాలి. అన్నింటికీ మించి తర్ఫీదు ఇచ్చేందుకు ప్రత్యేకంగా శిక్షకుడు అవసరం. పి.గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ కొరత తీరింది. వ్యాయామోపాధ్యాయుడు మట్టపర్తి దుర్గాప్రసాద్ ప్రత్యేకంగా సొంత ఖర్చుతో సంబంధిత పరికరాలను సమకూర్చారు. ప్రస్తుతం పలువురు పిల్లలు శిక్షణ పొందుతున్నారు. తరగతులకు ఇబ్బంది లేకుండా నిత్యం సాధన చేయిస్తున్నారు. విద్యార్థులు సైతం ఆసక్తిగా నేర్చుకుంటూ వివిధ పోటీల్లో పాల్గొని రాణిస్తున్నారు.

పి.గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాధన

ఆసక్తికరంగా ఉంది

నేను టేబుల్‌టెన్నిస్‌లో శిక్షణ పొందుతున్నాను. మా పాఠశాలలో ఈ కోర్టు ఏర్పాటు చేశారు. నిత్యం గంటసేపు నేర్చుకుంటున్నాను. ఇంతకుముందు ఈ క్రీడ గురించి కనీస అవగాహన లేదు. మక్కువతో నేర్చుకుంటున్నాను. - వై.ఉమావిజయలక్ష్మి, ఏడోతరగతి, పి.గన్నవరం

సున్నితమైన క్రీడ

చక్కగా గదిలో ఒక టేబుల్‌ను ఆధారంగా చేసుకుని ఆడే ఈ క్రీడ సున్నితమైనది. చదువుతో పాటు ఆసక్తిగా తర్ఫీదు పొందుతున్నాను. ఒత్తిడి లేకుండా ఉంది. భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది. - ఎం.రిషిత, ఏడోతరగతి

రాష్ట్ర స్థాయిలో పోటీపడ్డాను

అండర్-17, అండర్-19 విభాగాల్లో 2022 నుంచి 2024 వరకు జరిగిన జిల్లాస్థాయి టేబుల్‌టెన్నిస్ క్రీడలో తలపడ్డాను. మూడుసార్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించాను. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పట్టుదలతో నేర్చుకుంటున్నాను. - ఎం.చంద్రశేఖర్, 9వ తరగతి, ముంగండ

9న హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో మంగళవారం దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ సత్యనారాయణరాజు తెలిపారు.

ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో జిల్లా అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 18న నిర్వహించడానికి రాష్ట్ర నాయకత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికల అధికారిగా బి. సత్యనారాయణ, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారిగా పి.రమేష్, పర్యవేక్షకులుగా ఎం.జానకి వ్యవహరిస్తారు. ఈ నెల 11న అమలాపురం పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లో నామినేషన్ ప్రక్రియ జరుగుతుందని పీవో సత్యనారాయణ తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి భీమవరం మండలం గునుపూడికి చెందిన గూడూరు వీర వెంకట గోవర్ధన్, భారతి దంపతులు ఆదివారం రూ. 1,00,116 విరాళంగా సమర్పించారు. దేవస్థానం ఈవో వారికి స్వామివారి చిత్రపటాన్ని అందజేసి అభినందించారు.

స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

సత్యసాయి శత జయంత్యుత్సవాలు

సామూహిక వ్రతాల్లో మహిళలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంత్యుత్సవాలను మామిడికుదురు మండలం మొగలికుదురు పరిధి జగ్గన్నపేట కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన అనేకమంది మహిళలు సామూహికంగా సత్యసాయి వ్రతాలు చేశారు. ఆధ్యాత్మిక కీర్తలనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటైంది. ప్రముఖ వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన, వక్తృత్వం, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. యోగా పోటీలు నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాశిన ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'నగరం దీవి' పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణలో వరహాలు తదితరులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: సహృదయ సాహితీ సకల కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక పద్మభూషణ్ బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భజరంగ్‌లాల్ బియానీ రచించిన 'నగరం దీవి' పుస్తక ద్వితీయ విభాగాన్ని రోటరీ సేవా సంస్థ జిల్లా విశ్రాంత గవర్నర్ డాక్టర్ బసవ వరహాలు ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో పలు చారిత్రక విశేషాలు ఉన్నాయని, భావితరాల వారికి విజ్ఞానవంతంగా ఉపయోగపడుతుందన్నారు. ద్విభాష్యం కల్యాణి, పెదమల్లు నాగబాబు, ఏడిద కవీంద్ర, చెరుకూరి సూర్యనారాయణశర్మ, బి.గంగాధరరావు, భావరాజు సూర్యప్రకాశరావు, దార్ల పెదబాబు, ఎన్.త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పంటకాలువ

పుల్లేటికుర్రు పంచాయతీ పరిధి బ్యాంకు సమీపంలోని పంటకాలువ తుప్పలు, డొంకలతో పూడిపోయింది. సాగు నీరు పారని పరిస్థితి ఏర్పడింది. దీనిని బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు. సర్పంచి బల్లి బాలరాజును వివరణ కోరగా ఉపాధి హామీ పథకంలో శుభ్రం చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

చెత్త తొలగించండి..

అంతర్వేది దేవస్థానంలోని ఆర్‌వీకే వద్ద చెత్తాచెదారం నిండిపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతాలవారే కాకుండా, పంచాయతీ సేకరించిన చెత్తను ఇక్కడే వేస్తున్నారని వాపోయారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. కార్యదర్శి వెంకటేశ్వరరావును వివరణ కోరగా చెత్తను తొలగిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, అంతర్వేది

రోడ్డు వేశారు.. ఇబ్బందులు తెచ్చారు

మలికిపురంలో ఆదివారం సంత వద్ద చేపల మార్కెట్ నుంచి సీసీరోడ్డు నిర్మించారు. చివరన అనుసంధాన రహదారి నిర్మించకపోవడంతో ద్విచక్రవాహనాల రాకపోకలు సాగడం లేదు. ఇక్కడి నివాసం ఉంటున్న కుటుంబాల వారికి అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఏసుబాబును వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, మలికిపురం

మలుపుల్లో సూచికలేవీ..?

లొల్ల నుంచి వాడపల్లి వెళ్లే రోడ్డు మలుపుల్లో సూచికలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రిళ్లు పరిస్థితి దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. ఈ విషయాన్ని ర.భ.శాఖ డీఈ రాజేంద్ర వద్ద ప్రస్తావించగా సూచికలు, రేడియం స్టిక్కర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. -న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ఛిద్రమై.. వ్యర్థాలతో దుర్భరమై

మామిడికుదురు మండలం గెద్దాడ, రాజోలు మండలం చెన్నడం గ్రామాలకు సాగునీటిని అందించే పంటకాలువ శిథిలావస్థకు చేరింది. ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలు పేరుకుపోవడంతో సుమారు 220 ఎకరాల వరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి పారుదలకు అడ్డంకు లేకుండా ప్రక్షాళన చేస్తామని జలవనరుల శాఖ ఏఈఈ రమేష్‌బాబు అన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

మామిడికుదురు, అలమూరు, అంబాజీపేట, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అప్పనపల్లి వైనతేయ నదీ తీరాన కొలువైన ఉమా సమేత అమృతలింగేశ్వరస్వామికి 108 బిందెలతో జలాభిషేకం ఆదివారం జరిగింది. రుద్రాక్షలతో విశేష పూజలు చేశారు. కోటి పంచాక్షరి జపం, హోమాన్ని భక్తిపూర్వంగా నిర్వహించారు. అనంతరం పంచామృతాలతో శివలింగాన్ని అభిషేకించారు. శివకేశవ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన అనేకమంది భక్తులు పాల్గొన్నారు. ● జొన్నాడలోని శ్రీఉమా మల్లేశ్వరస్వామివారి ఆలయంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన రావాడ వెంకటశ్రీనివాస్, తొడుపునూరి శివకుమార్, కాశీభట్ల సాయినాథ్ దంపతుల చేతుల మీదుగా రుద్రాభిషేకం, సూర్యనమస్కారాలు, రుద్రహోమం, శాంతి హోమం నిర్వహించారు. ● వక్కలంకలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 108 లీటర్ల పాలు, పెరుగు, నెయ్యి, చెరకు రసం, 108 కిలోల పంచదార, తేనె, 108 కిలోల విభూదితో అభిషేకం చేశారు.

జొన్నాడలో లక్ష బిల్వార్చన

అమృతలింగేశ్వరస్వామికి..

వక్కలంకలో పెరుగుతో అభిషేకం

అమ్మవార్లకు సారె సమర్పణ

అంబాజీపేట: మాచవరం గ్రామదేవతలు ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు దంగేటి సాయిబాబు, మట్టపర్తి దుర్గారావు ఆధ్వర్యంలో ఆదివారం సారె సమర్పించారు. పోతాయిలంక భక్తాంజనేయస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బోనాలతో పాటు పసుపు, కుంకుమ, మిఠాయి, చీరలు తీసుకువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

భాజపా రాష్ట్ర ఓబీసీ విభాగం సెక్రటరీగా సత్తిబాబు

అలమూరు, న్యూస్‌టుడే: భాజపా ఓబీసీ విభాగానికి రాష్ట్ర సెక్రటరీగా జొన్నాడకు చెందిన **అయినవిల్లి సత్తిబాబుగౌడ్** నియమితులయ్యారు. తనను సెక్రటరీగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగలి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు అడపా సత్యనారాయణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఐటీయూ గోడపత్రిక ఆవిష్కరణ

యానాం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరుగనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభల గోడ పత్రికను స్థానిక ద్రాక్షారామ రోడ్డు టాక్సీస్టాండులో ఆదివారం ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాల్ని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికుల శ్రమను కార్పోరేట్లకు దారాదత్తం చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ విమర్శించారు. మహాసభల్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ యానాం కన్వీనర్ కుంచే సత్యనారాయణ, కోకన్వీనర్ టి.శ్రీనివాసరావు, బాబ్జీ, విష్ణుమూర్తి, వీరబాబు, సురేంద్రకుమార్, సత్తిబాబు పాల్గొన్నారు.

రాకపోకలు సాగించేదెలా?

- న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం, పట్టణం

సందిపూడి-వెదురుమూడి రోడ్డు దుస్థితి

కొత్తపేట నియోజకవర్గంలోని పలు రహదారుల పరిస్థితి అత్యంత అధ్వానంగా మారింది. పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో పాటు కుంగిపోయి రాకపోకలకు వీలు లేకుండా ఉంది.

✦ రావులపాలెం మండలం రావులపాడు జాతీయ రహదారి నుంచి లక్ష్మీపోలవరం వెళ్లే రోడ్డు గోరింకల డ్రెయిన్ వద్ద నిలువునా కుంగిపోయింది. ఆటోలు, కార్లు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాత్రి సమయంలో వీధి దీపాలు సైతం లేకపోవడంతో కిందపడి గాయాలపాలవుతున్నారు.

✦ గోపాలపురం సెంటర్ నుంచి గంటి రోడ్డుకు ఉన్న ముమ్మిడివరప్పాడు రోడ్డును గత ఏడాది పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. ఇసుక లారీలు వంటి భారీ వాహనాలు అధిక సంఖ్యలో తిరగడంతో ప్రస్తుతం పెద్దపెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది.

✦ వెదిరేశ్వరం మీదుగా కొత్తపేట మండలం పలివెల వరకు కాలువగట్టు రోడ్డు మొత్తం రాళ్లు తేలిపోయి ముళ్లబాటలా మారింది. దీనిపై రెండు మండలాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి రావడంతో నిత్యం పడుతున్న కష్టాలు అనేకం.

✦ ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ నుంచి పెదపల్ల, సందిపూడి మీదుగా వెదురుమూడి వరకూ ఉన్న రోడ్డు గోతులు ఏర్పడటంతో పాటు పలుచోట్ల నిలువునా కుంగిపోయింది.

✦ జొన్నాడ వద్ద నుంచి ఆలమూరు మీదుగా వెళ్లే ఏటిగట్టు రోడ్డు సైతం గుంతల ఏర్పడి ప్రమాదకరంగా మారింది.

అధికారులు ఏమన్నారంటే.. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్రను వివరణ కోరగా ముమ్మిడివరప్పాడు రోడ్డును త్వరలోనే అభివృద్ధి చేస్తామన్నారు. లక్ష్మీపోలవరం, మిగిలిన రోడ్లను తీర్చిదిద్దేందుకు ఉన్నతాధికారులకు నివేదించి వాటిని కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వెలిచేరు వద్ద ఒరిగిపోయిన విద్యుత్తు స్తంభం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వెలిచేరు పంటకాలువ గట్టు రోడ్డులో ఆదివారం విద్యుత్తు కొత్తలైను స్తంభం ఒరిగిపోయి విద్యుత్తు ప్రవహిస్తున్న మరో స్తంభంపై పడిపోయింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు పరుగులు తీశారు. ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కొత్తలైన్ వేసేటప్పుడు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

ఉప్పలగుప్తం: సావిత్రీ బాయ్ పులె జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ప్రకటించిందని, ఏపీ ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఆప్టా జిల్లా అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి షానావాజ్ హుస్సేన్ తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌లకు లేఖలు పంపినట్లు ఆదివారం తెలిపారు.

తీరనున్న తాగునీటి వెతలు

- న్యూస్‌టుడే, మామిడికుదురు

గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) మంజూరు చేసిన రూ.6 కోట్ల నిధులతో మామిడికుదురు మండలం నగరం గ్రామంలో చేపట్టిన సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టు ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. గత కొన్ని రోజులుగా ప్రయోగాత్మకంగా దీనిని పరిశీలించిన అనంతరం త్వరలో ప్రారంభోత్సవం చేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు. దీంతో పూర్తిస్థాయిలో రక్షిత నీరు ఇంటింటికీ సరఫరా కానుంది.

నగరంలోని సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టు

నాలుగు కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకులతో..

2019లో ఇక్కడ చేపట్టిన మంచినీటి ప్రాజెక్టు దాదాపు రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉండగా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, కోర్టు సమస్యలు, స్థానికంగా తలెత్తిన ఇబ్బందులు తదితర కారణాల వల్ల తీవ్ర తాత్సారం నెలకొంది. దీనిపై పలు దఫాలుగా 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు సంబంధిత గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పనులను త్వరితగతిన పూర్తి చేశారు. దీనికి సంబంధించి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో లక్ష లీటర్ల సామర్థ్యం ఉన్న సంపు నిర్మించి అక్కడే సూక్ష్మనీటి శుద్ధి విభాగాలను ఏర్పాటు చేశారు. పెదపట్నం వద్ద ఇంటెక్‌వెల్ ఏర్పాటు చేసి కాలువ జలాలను సమ్మర్ స్టోరేజీ ట్యాంకు(ఎస్.ఎస్. ట్యాంకు)కు సరఫరా చేశారు. కొత్తగా 40 వేల లీటర్ల సామర్థ్యమున్న నాలుగు ఓవర్‌హెడ్ సర్వీసింగ్ ట్యాంకులను నిర్మించారు. గ్రామంలోని అన్ని నివాసిత ప్రాంతాలకు మంచినీటి సరఫరా కోసం 19 కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్లు వేసి సుమారు 1,100 వరకు కొళాయిలను ఏర్పాటు చేశారు.

పూర్తిస్థాయిలో సరఫరా

నగరంలోని సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టు నుంచి ట్రయల్‌రన్ సమర్థంగా నిర్వహించాం. ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి అన్ని నివాసిత ప్రాంతాలకు సజావుగా నీరు వెళ్లేలా కార్యాచరణ చేశాం. ప్రధాన చెరువులోకి ఎప్పటికప్పుడు నీటిని మళ్లిస్తూ పూర్తిస్థాయిలో ఉండేలా చూస్తున్నాం. త్వరలోనే దీనికి ప్రారంభోత్సవం చేసేందుకు ఉన్నతాధికారులు కార్యాచరణ చేస్తున్నారు.

- జయశ్రీ, ఏఈఈ, గ్రామీణ మంచినీటి విభాగం

రెండు గ్రామాల రైతుల సయోధ్య

ఆలమూరు: చింతలూరు-వెదురుమూడి పంటకాలువపై అడ్డుకట్ట గురించి పినపళ్ల, వెదురుమూడి రైతుల మధ్య ఏర్పడిన వివాదం ఆదివారం పరిష్కారమైంది. అడ్డుకట్టను ఇరు గ్రామాల రైతులకు అనుకూలంగా బాగు చేయడంతో సమస్య ముగిసినట్లు శ్రీనివాస్‌చౌదరి తెలిపారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

విజేతలుగా నిలిచిన పిల్లలు

కరాటేలో చిన్నారుల ప్రతిభ

ఉప్పలగుప్తం: అనపర్తిలో నిర్వహించిన అటల్ జీ ఏపీ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అమలాపురం పవర్ కిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారని కోచ్ పడాల అంజి తెలిపారు. 30 మంది ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పతకాలు సాధించిన చిన్నారులను పలువురు నాయకులు అభినందించారు.

బుద్ధిజంతోనే సమ సమాజ స్థాపన

ఆదుర్రు బౌద్ధ స్తూప ప్రచార రథయాత్ర

ఐ.పోలవరం: బుద్ధిజంతో దేశంలో సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) నాయకులు అన్నారు. మండలంలోని మురమళ్ల, పాత ఇంజరం, కొమరగిరి, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, మూలపొలం గ్రామాల్లో ఆదుర్రు బౌద్ధ స్తూప ప్రచార రథ యాత్రను నిర్వహించారు. కాశీ సత్యనారాయణ, బుడితి బాబూరాజేంద్రప్రసాద్, గిడ్ల రమేష్, మట్టా వెంకట్రావు, యలమించిన సురేష్, కుంచే చినబాబు, బొంతు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో యోగా పోటీలు

ప్రశంసా పత్రాలు, బహుమతులతో చిన్నారులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమంలో మోటూరు భైరవస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆదివారం యోగా పోటీలు నిర్వహించారు. విజేతలకు భైరాస్వామి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చునని యోగా నిపుణుడు శ్రీనివాస్ అన్నారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలో విజేతలుగా నిలిచిన పుదుచ్చేరి, యానాం జట్లు

రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడల్లో సత్తా

వెయిట్ లిఫ్టింగ్ విజేతలతో వ్యాయామోపాధ్యాయులు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో శని, ఆదివారాలలో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడల పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో యానాం క్రీడాకారులు ఐదు పతకాలు సాధించినట్లు జోనల్ స్పోర్ట్స్ కార్యదర్శి కొప్పనాతి భాస్కర్, చింతా వెంకన్న తెలిపారు. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సీహెచ్ మహాశరణ్య- 53కిలోల విభాగంలో ప్రథమస్థానం, వీఎల్ ధనశ్రీ -53కిలోలు తృతీయ స్థానం, ఎం.సూర్యకీర్తి -44కిలోలు తృతీయ స్థానం, ఎస్.భైరవమూర్తి, ఎం.సురేష్ - 98కిలోలు విభాగం - ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. లాస్‌పేట ఇండోర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్ అండర్-17 బాలుర విభాగం పోటీలో ద్వితీయ స్థానం సాధించారు. మొత్తం 82మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నట్లు వెంకన్న తెలిపారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

ఉప్పలగుప్తం: సావిత్రీ భాయి పులే జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ప్రకటించిందని, ఏపీ ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఆప్టా జిల్లా అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి షానావాజ్ హుస్సేన్ తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌కు లేఖలు పంపినట్లు ఆదివారం తెలిపారు.

క్రీడామైదానంలో సమస్యల మేట

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

జిల్లాలోనే అతిపెద్దదిగా పేరొందిన జి.ఎం.సి.బాలయోగి క్రీడామైదానంలో సదుపాయాల్లేక వెలవెలబోతుంది. వైకాపా ప్రభుత్వంలో దీనిని పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా మైదానం పరిస్థితిలో మార్పు లేదు. ఈ మైదానంతోపాటు ఇండోర్ స్టేడియంలోనూ పలు క్రీడలు ఆడుకునేందుకు అవకాశాలున్నప్పటికీ శిక్షకులు లేరు.

పాడైపోయిన నెట్ ప్రాక్టీస్ కోర్టులో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

బాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్ అమలాపురంలోనే సాధన చేసి దేశానికి ఎంతో కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టారు. ఇలాంటి క్రీడాకారులను తయారు చేసేందుకు అవకాశాలు ఉన్నప్పటికీ సానబెట్టే జి.ఎం.సి.బాలయోగి క్రీడా మైదానాన్ని

అభివృద్ధి చేస్తేనే..

మాత్రం అభివృద్ధి చేయడం లేదు. దీంతో ఎందరో క్రీడాకారులు మరుగునపడిపోతున్నారు. ఈ మైదానంలో వాలీబాల్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్, ఫుట్‌బాల్ కోర్టుతోపాటు రన్నింగ్ ట్రాక్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సి ఉంది.

శిక్షకుల నియామకం ఎప్పుడు..?

జి.ఎం.సి.బాలయోగి క్రీడామైదానం, స్టేడియంలో అథ్లెటిక్స్ నేర్పించేందుకు శిక్షకులు లేరు. కేవలం బాస్కెట్ బాల్, తైక్వాండో శిక్షకులు మాత్రమే ఉన్నారు. గతంలో ఫిజికల్ ఫిట్‌నెస్ నిపుణుడిని నియమించారు. త్రోబాల్, రన్నింగ్ వంటి క్రీడ శిక్షకుల నియామకం కలగానే మిగులుతోంది. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఈ స్టేడియంలో వసతుల కల్పనపై పార్లమెంట్‌లో ప్రస్తావించడంతోపాటు నిధులు వెచ్చించాలని విన్నవించారు. అవి ఏ మేరకు సాకారం అవుతాయో వేచి చూడాలి.

అధ్వానంగా జి.ఎం.సి.బాలయోగి మైదానం

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
అమలాపురం పట్టణం: 79939 35935 గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

పూడికను తీశారు..

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో డ్రెయిన్ పూడిపోయి నీరు ముందుకు సాగే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

ఎంఆర్‌కే నారాయణ, స్థానికుడు

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని ఆసుపత్రి వీధిలో డ్రెయిన్‌లో నీరు దిగక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పూడిక తొలగింపుకు చర్యలు తీసుకోవాలి.

పి.రామారావు, స్థానికుడు

స్పందనకు వందనం

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతం, ఆసుపత్రి వీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలను కమిషనర్ రవివర్మ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు.

–న్యూస్‌టుడే, ముమ్మిడివరం

కుండలేశ్వరాలయంలో అభిషేకాలు

పూజలో పాల్గొన్న భక్తులు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: శివుని జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా పార్వతీసమేత కుండలేశ్వరాలయంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాళ్లకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. * నడవపల్లిలోని ప్రాచీన ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు బ్రహ్మాజీ పర్యవేక్షణలో స్వామివారికి సామూహిక అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వేలివెన్నులో అదనపు ఎస్పీ పూజలు

అదనపు ఎస్పీ ప్రసాదు దంపతులను సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఉండ్రాజవరం మండలం వేలివెన్ను అయ్యప్ప స్వామిని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అదనపు ఎస్పీ అడుసుమిల్లి వెంకట రవీంద్ర ఫణిభూషణ ప్రసాదు, శారద దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. కంచుగంట బహూకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు వీరిని సత్కరించారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన కోట ప్రసన్నకుమార్ రూ.10 వేలు విరాళం ఆదివారం అందజేశారు. దాతకు ఆలయ అర్చకులు ప్రత్యేక దర్శనం అందించి స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందించి సత్కరించారు.

ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో జిల్లా అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 18న నిర్వహించడానికి రాష్ట్ర నాయకత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికల అధికారిగా బి.సత్యనారాయణ, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారిగా పి.రమేష్, పర్యవేక్షకులుగా డి.జానకి వ్యవహరిస్తారు. ఈ నెల 11న అమలాపురం పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లో నామినేషన్ ప్రక్రియ జరుతుందని పీవో సత్యనారాయణ తెలిపారు.

పాఠశాలకు పరికరాల అందజేత

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: భీమనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు కుర్చీలు, బల్లలు, కలర్ జిరాక్స్ యంత్రం, ల్యాప్‌టాప్, విద్యార్థులకు క్రీడా దుస్తులు తదితరాలను నంగవరం గ్రామానికి చెందిన సలాది వలీబాబు సమకూర్చారు. పాఠశాల అభివృద్ధికి పాటు పడుతున్న వలీబాబును తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ గుర్లింక చిన్నా ఆధ్వర్యంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఆదివారం సన్మానించారు. హెచ్‌ఎం నూకల సత్యనారాయణ, కామన మధు తదితరులు పాల్గొన్నారు.

'రాఘవుల పోరాటం ప్రశంసనీయం'

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: కార్మిక, కర్షక లోకం ప్రయోజనాల కోసం కె.వీరరాఘవులు జీవితాంతం పోరాటం చేశారని సీపీఐ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం రాఘవులు 15వ వర్ధంతి సభను అమలాపురంలో నిర్వహించారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఉద్యమించాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.సత్యవేణి, కె.సత్తిబాబు, కుంపట్ల వరుణబాబు, ఎన్.శివప్రసాద్, రవణం వేణు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణలో భాగస్వామ్యం

సమ్మేళనంలో పీఠాధిపతి నాగానంద సరస్వతి స్వామీజీ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన ఆవశ్యకత ఉందని శృంగవృక్షం పంచమ పీఠాధిపతి శ్రీసాయి దత్త నాగానంద సరస్వతి స్వామీజీ అన్నారు. ముమ్మిడివరంలో మహిళా కళాశాల ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. సత్యం, ధర్మం ఆచరిస్తూ హిందూ సమాజాన్ని సంఘటితం చేయాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి అత్తిపటల వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ.. పంచ పరివర్తన ద్వారా సమాజంలో బేధ భావాలను రూపుమాపి సమరసతతో కూడిన ఆచరణ, పర్యావరణ అనుకూలమైన జీవన విధానం, విలువలు పునాదిగా కలిగిన కుటుంబ వ్యవస్థ నిర్మాణమే లక్ష్యమన్నారు. తాడి నరసింహారావు, పెన్మత్స జగ్గప్పరాజు, దంగుడుబియ్యం శ్రీనివాసరావు, పెన్మత్స కృష్ణంరాజు, గొలకోటి వెంకటరెడ్డి, ఆదిరాజు సతీష్, పుల్లెపు వెంకట నరసింహశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రమాదకరంగా పాదు తీగలు

వల్లంకుర్రులోని శ్రీరామపురం వద్ద విద్యుత్తు తీగలకు పాదులు వ్యాపించి ఉన్నాయి. దాంతో తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఎలాంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్తు తీగలపై పాదులను తీయించాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కాట్రేనికోన

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా..

ముమ్మిడివరం మండలం చినకొత్తలంక నుంచి కొత్తలంక వెళ్లే రహదారి ధ్వంసం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో అయినాపురం, కొత్తలంక, చినకొత్తలంక తదితర గ్రామాలకు చెందిన ప్రజలు 216 జాతీయ రహదారి చేరడానికి ఈ రోడ్డులోనే ప్రయాణిస్తారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.- న్యూస్‌టుడే, ముమ్మిడివరం

అసంపూర్తిగా వదిలేశారు

అమలాపురం మండలం వన్నెచింతలపూడిలోని రైతు సేవా కేంద్ర భవనం అసంపూర్తిగా మిగిలింది. నిర్మాణ పనులు ప్రారంభించి నాలుగేళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ పూర్తికాలేదు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాన్ని సచివాలయంలో నిర్వహిస్తున్నారు. భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

గుంతల దారితో ఇక్కట్లు

మండలంలోని డి.రావులపాలెం నుంచి తాడికోన వంతెన వరకు వెళ్లే వాసాల తిప్ప ఏటిగట్టు రహదారి గుంతలమయంగా మారింది. సుమారు 800 ఎకరాల్లో చేపలు సాగు చేసే రైతులకు ఈ మార్గమే ఆధారం. మేత, ఇతర సామగ్రి తీసుకువెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా రహదారిని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, అల్లవరం

నీరు పట్టుకునేదెలా..?

బలుసుతిప్పలో కొన్ని కొళాయిల వద్ద గోతులు ఉండటంతో నీరు పట్టుకునేందుకు ఇబ్బందికరంగా మారింది. ఇళ్లవద్ద గోతుల్లో వర్షపు నీరు చేరి రోజుల తరబడి ఉండటంతో మురుగునీరుగా మారుతోంది. ఈ నీటిలో నుంచే స్థానికులు నీరు పట్టుకుంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కొళాయిల వద్ద మురుగునీరు తీయించి బ్లీచింగ్ చల్లించాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కాట్రేనికోన

సీఐటీయూ గోడపత్రిక ఆవిష్కరణ

యానాం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభల గోడ పత్రికను స్థానిక ద్రాక్షారామ రోడ్డు టాక్సీస్టాండులో ఆదివారం ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాల్ని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దారాదత్తం చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ విమర్శించారు. మహాసభల్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ యానాం కన్వీనర్ కుంచే సత్యనారాయణ, కోకన్వీనర్ టి.శ్రీనివాసరావు, బాబ్జీ, విష్ణుమూర్తి, వీరబాబు, సురేంద్రకుమార్, సత్తిబాబు పాల్గొన్నారు.

తవుడు లారీ బోల్తా

పంటబోదేలోకి తిరగబడిన వాహనం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చల్లపల్లి- ఎస్.యానాం రహదారిలో శనివారం రాత్రి తవుడు లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి పంటబోదేలో తిరగబడింది. ఆ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే వెడల్పు చేయాలని బీఎస్పీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొలమూరి మోహన్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న 104 వాహనాల సిబ్బంది

అమలాపురం కలెక్టరేట్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా 104 వాహనాలపై విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. బకాయిలు విడుదల చేయాలని, ఉద్యోగులకు నియామక పత్రాలు ఇవ్వాలని, డేటా ఎంట్రీ సిబ్బందిని మందుల నిర్వహణ బాధ్యతల నుంచి తొలగించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పంటబోదెలో గరళం

దొంతికుర్రులో మురుగునీటితో..

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మండలంలో పంటబోదెలు ఎక్కడికక్కడ మురుగనీటితో దుర్భరంగా ఉన్నాయని అన్నదాతలు వాపోతున్నారు. విస్తారంగా వర్షాలు కురవడంతో చాలాచోట్ల నెలల తరబడి నీరు నిలిచి రంగుమారి మురుగుగా మారింది. కొన్నిచోట్ల పంటబోదెల్లోకి స్థానికులు ఇళ్లల్లో మురుగునీటి పైపులను పెట్టడంతో అవి గరళంగా మారాయి. కాట్రేనికోన, రామస్వామి తోట, దొంతికుర్రు, పల్లంకుర్రు సహ పలుచోట్ల ఇదే పరిస్థితి. కంచువారిపేట నుంచి వేట్లపాలెం వెళ్లే రోడ్డు వరకున్న పంటబోదె ఒకప్పుడు పరిశుభ్రంగా ఉండేది. ఈ బోదెలోకి కొంతమంది స్థానికులు మురుగునీటి పైపులను పెట్టడంతో మొత్తం పాడయ్యింది. ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగాయి. ఖరీఫ్ సీజన్ చివరిదశకు చేరుకోవడంతో రబీ పనులు త్వరలో మొదలుకానున్నాయి. ప్రతి ఏడాది ఉపాధి హామీ పనుల్లో భాగంగా పంటబోదెల్లో పూడిక తీసేవారు. ఈ ఏడాది పనులు చేపట్టలేదు. పంటబోదెల్లోకి ఇళ్లల్లో వ్యర్థాలు వదులుతున్న వారిపై సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రామస్వామితోటలో

సేవాస్ఫూర్తి అలవర్చుకోవాలి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ సేవాస్ఫూర్తిని అలవర్చుకుని ముందుకు సాగాలని అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు అన్నారు. అమలాపురంలోని ఎస్ఎస్‌నాయుడు లే-అవుట్‌లో దోసూరి అన్నపూర్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది రక్తదానం చేశారు. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి, సహస్ర, బుద్ధాల బ్లడ్ బ్యాంకుల సిబ్బంది సహకారం అందించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, యాళ్ల నాగసతీష్, కంచిపల్లి అబ్బులు, ఆర్డీఎస్ ప్రసాద్, బోణం సత్యవరప్రసాద్, చింతలపూడి సత్తిబాబు, మానే ప్రకాష్, వాసిరెడ్డి నాయుడు, లింగోలు పండు, నాగమానస తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతకు ధ్రువపత్రం అందిస్తున్న కల్వకొలను తాతాజీ, యాళ్ల నాగసతీష్

అమలాపురం హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న హనుమంతరావు

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష అద్భుత అవకాశం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ పరీక్షా కేంద్రాన్ని డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్ష విద్యార్థులకు ఒక అద్భుతమైన అవకాశమన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందుతుందన్నారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్ కాశీ సత్యనారాయణ, డిపార్ట్‌మెంట్ అధికారి బి.ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. జిల్లాలోని పరిధిలోని రౌడీ షీటర్లను ఆదివారం ఆయా స్టేషన్లకు పిలిపించి పోలీసు అధికారులతో కౌన్సెలింగ్ ఇప్పించారు. నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనోపాధి ఎంచుకోవాలని వారికి సూచించారు.

గుర్తుంచుకునేలా బోధన

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీనికోసం కొందరు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అభ్యసన సామగ్రి రూపొందిస్తున్నారు. వారితో నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా కొందరు ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో విద్యార్థులకు సమగ్రంగా, సులువుగా అర్థమయ్యేందుకు ప్రత్యేక టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేస్తున్నారు. వీటిని యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థులు వివరిస్తున్నారు. వీరిలో కొందరు ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా...

విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేసి ఎక్కువ కాలం గుర్తుండే విధంగా బోధన సామగ్రి రుపొందిస్తున్నా. ఇలా బోధిస్తే విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుంది. బొమ్మలు, డ్రాయింగ్, పెయింటింగ్స్ చూసి సులువుగా నేర్చుకుంటారు. ప్రత్యక్షంగా చూడటం, వినడం ద్వారా వారికి ఎక్కువ కాలం గుర్తుంటుంది.

–వి.ధనదుర్గా భవాని, ఎంపీపీఎస్, ఇందుపల్లి, అమలాపురం

చిన్నారులకు ఆసక్తి కలిగేలా..

పదేహేనుళ్లుగా విద్యార్థులకు అర్థమయ్యేలా చార్టులు, చిత్రాలు, వర్కింగ్ మోడల్స్‌తో బోధన సాగిస్తున్నా. అభ్యసన సామగ్రితో బోధించడంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. నేను తయారు చేసిన మెటీరియల్‌తో యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నా. మా పాఠశాలలో నేను తయారు చేసిన మెటీరియల్ ఉంది. ఆకర్షణీయంగా ఉన్న బొమ్మలను చూసి పిల్లలు శ్రద్ధగా వింటున్నారు. పలుసార్లు ఉపాధ్యాయులకు టీఎల్ఎం శిక్షణ ఇచ్చా. ఇటీవల శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ వారు పురస్కారం అందజేశారు.

–ఎ.వి. చంద్రసూర్యం, ఎంపీపీఎస్, చినగాడవిల్లి, ఉప్పలగుప్తం

'భాజపా కూటమికే అధికారం ఇవ్వాలి'

యానాం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పుదుచ్చేరి ప్రజలు ఇండియా కూటమిని తిరస్కరించి భాజపా-ఎన్నార్ కాంగ్రెస్‌ను గెలిపించాలని రాష్ట్ర అధ్యక్షుడు వీపీ రామలింగం కోరారు. పుదుచ్చేరిలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ 2026 ఎన్నికల్లో పుదుచ్చేరిలో సుస్థిరమైన పరిపాలన అందించే భాజపా కూటమినే అధికారంలోకి తీసుకురావాలన్నారు. బిహార్‌లో వచ్చిన ఫలితాలే పుదుచ్చేరిలోనూ పునరావృతమౌతాయన్నారు. అన్ని నియోజకవర్గాలలో భాజపాను బలోపేతం చేసే దిశగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో పుదుచ్చేరి ఎన్డీయే కూటమి నేత రంగసామి మంచి ప్రభావం చూపుతారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కూటమి పుదుచ్చేరిలో ఉంటేనే అభివృద్ధి పనులు చురుకుగా సాగుతాయన్నారు. త్వరలో ప్రధాని మోదీ పుదుచ్చేరి వస్తారని రామలింగం తెలిపారు.

(c) eenadu

సమస్యలు పరిష్కరించాలని నిరసన

అమలాపురం కలెక్టరేట్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా 104 వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. పేరుకు పోయిన బకాయిలు విడుదల చేయాలని, ఉద్యోగులను నియామక పత్రాలు ఇవ్వాలని, డేటా ఎంట్రీ సిబ్బందిని మండల నిర్వహణ బాధ్యతల నుంచి తొలగించాలని, కనీస వేతన చట్టం అమలుచేయాలని డిమాండ్ చేశారు.

నినాదాలు చేస్తున్న 104 వాహనాల సిబ్బంది

మండపేట

•మండపేట • రామచంద్రపురం

నేటి నుంచి యోగా ఉచిత శిక్షణ

రామచంద్రపురం: శ్రీవిజయ గాయత్రి యోగా ధ్యాన మండలి ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 10 రోజుల పాటు యోగా అవగాహన సదస్సుతో పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని యోగాచార్యులు రామ్‌కుమార్ తెలిపారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

నేడు మంత్రి సుభాష్ పర్యటన

కాజులూరు, న్యూస్‌టుడే: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని ఎంపీడీవో జె. రాంబాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు శీల, మంజేరు, కోలంక, దుగ్గుదూరు, కుయ్యేరు గ్రామాలకు మంజూరైన కొత్త ట్రాక్టర్లు, ట్రక్కులు పంపిణీ చేస్తారని వివరించారు. కోలంకలో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభిస్తారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ 10 - మ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191
కపిలేశ్వరపురం: 97044 16418 పామర్రు: 80085 74228
ద్రాక్షారామ: 80085 74192 ద్వారపూడి : 91543 96553

సమస్య: పట్టణంలోని కేపీ రోడ్డు డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. దీనివల్ల దోమలు విజృంభిస్తున్నాయి.
- రమేష్, మండపేట

పరిష్కారం: సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో సిబ్బందిని పంపించి వెంటనే శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, మండపేట

మురుగుపారుదలకు చర్యలు

సమస్య: మండపేట మండలం జడ్.మేడపాడు గ్రామం ఎస్సీకాలనీవీధి డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.
- కె.భగవాన్, జడ్.మేడపాడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి కె. వరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి మురుగు పారుదలకు చర్యలు తీసుకున్నారు.
– న్యూస్‌టుడే, ద్వారపూడి

నత్తనడకన బాల ఆధార్ నమోదు

• ఈనెలాఖరుతో గడువు ముగింపు

మండపేట, రాయవరం, న్యూస్‌టుడే: చిన్నారుల్లో ఆరేళ్లలోపు వయసున్న వారి వివరాలను బాల సంజీవని యాప్ ద్వారా నమోదు చేయడంలో తీవ్ర జాప్యం తప్పడం లేదు. చిన్నారుల వివరాల నమోదుతో వారికి పౌష్టికాహారం అందించాలని, బాల ఆధార్‌ను తప్పనిసరి చేశారు. అయితే మండపేట నియోజకవర్గంలో ఎక్కడా శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. మరోపక్క ఈనెలాఖరుతో ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులు గడువు నిర్దేశించినా ఆశించిన స్థాయిలో వివరాల సేకరణ జరగడం లేదు.

నియోజకవర్గం పరిధిలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో మొత్తం 7,066 మంది ఆరేళ్ల లోపు వయసున్న పిల్లల్ని గుర్తించినా ఇంతవరకు 3,917 మందికే బాల ఆధార్ నమోదు చేశారు. మిగిలిన వారికి డిసెంబరులోగా పూర్తిచేయాల్సి ఉన్నా బాలారిష్టాలు తప్పడం లేదు.

మండలాల వారీగా..

మండలం	గుర్తించిన పిల్లల సంఖ్య	నమోదైనవి
మండపేట	3272	1462
రాయవరం	1788	1021
కపిలేశ్వరపురం	2006	1434

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

గతంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడానికి అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటా వెళ్లి వారిని గుర్తించి సరకులు పంపిణీ చేసేవారు. ఈ విధానంలో అవకతవకలు జరుగుతున్నాయని, పథకానికి రూ.కోట్లు వెచ్చించినా లక్ష్యం నెరవేరకపోగా విమర్శలు వస్తున్నాయని అధికారులు గుర్తించారు. పథకం సక్రమంగా అమలుచేయాలని అందరికీ పారదర్శకంగా సరకులు అందాలనే ఉద్దేశంతో బాల ఆధార్ నమోదును తప్పనిసరి చేశారు. గత ఏడాది నవంబరులో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు. చిన్నారుల తల్లి ఆధార్ వివరాల ఆధారంగా ఆమె వేలిముద్ర తీసుకుని పిల్లలతో సహా ఫొటో తీసుకుని బాల ఆధార్ నమోదుచేశారు. ఈ బాధ్యతలను సచివాలయాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగించారు. అయితే తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం కారణంగా గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా కనిపించడం లేదు.

రాయవరం మండలం పసలపూడిలో వివరాల నమోదు

గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు..

బాల ఆధార్ నమోదుచేసిన చిన్నారుల వివరాలను బాల సంజీవని యాప్‌లో డిసెంబరు నెలాఖరులోగా నమోదు చేయాలి. గ్రామాల్లో ఏర్పాటుచేసే ప్రత్యేక ఆధార్ శిబిరాలకు పిల్లల్ని తీసుకువెళ్లి వివరాలు నమోదు చేయించాలని ఐసీడీఎస్ పీడీ వీడియో కాన్ఫరెన్సులో సూచించారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. - పూర్ణిమ, సీడీపీవో, ఐసీడీఎస్ మండపేట

వాహనాల తనిఖీ

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం ఎస్ఆర్ రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్సై డి.సురేష్‌బాబు పలు వాహనాలను ఆపించి డ్రైవింగ్ లైసెన్సు, వాహన బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు లేని 17 మంది వాహనదారుల నుంచి రూ.3,145 జరిమానా వసూలు చేశారు. అదే సమయంలో రహదారి నియమాలు, భద్రతపై చోదకులకు ఎస్సై అవగాహన కల్పించారు.

రెండు గ్రామాల రైతుల మధ్య సయోధ్య

ఆలమూరు, న్యూస్‌టుడే: చింతలూరు - వెదురుమూడి పంటకాలువపై బ్రిటీష్ కాలం నాటి అడ్డుకట్టు గురించి పినపళ్ల, వెదురుమూడి రైతుల మధ్య ఏర్పడిన వివాదం ఆదివారం సామరస్యంగా పరిష్కారమైంది. అడ్డుకట్టను ఇరు గ్రామాల రైతులకు అనుకూలంగా బాగు చేయడంతో సమస్య ముగిసినట్లు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్‌చౌదరి తెలిపారు.

అర్తమూరు తూము వద్ద పూర్తయిన కల్వర్టు

కల్వర్టు నిర్మించారు..

ఈనాడు కథనానికి స్పందన

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట-ద్వారపూడి రహదారిలో కల్వర్టుల వద్ద ఎదురవుతున్న రోడ్డు కష్టాలకు తెరపడింది. దాదాపు ఆరు నెలలుగా సత్తెమ్మతల్లి గుడి, ఇప్పనపాడు వద్ద కల్వర్టులు నిర్మించినా తాపేశ్వరం అర్తమూరు తూము వద్ద కల్వర్టు, రహదారి నిర్మించలేదు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, కార్లు, భారీ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్ల కింది భాగానికి రోడ్డు తగిలి మరమ్మతులకు గురవుతున్నాయని, ఇంధనం లీకవుతోందని చోదకులు వాపోతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఈనెల 2న 'రహదారి అధ్వానం.. అవస్థల ప్రయాణం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ర.భ. శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం వాహనాల రాకపోకలు నిలిపివేసి తూరలతో కల్వర్టు నిర్మాణం పూర్తిచేశారు. అనంతరం రోడ్డును సమాంతరంగా నిర్మించడంతో సమస్య పరిష్కారమైందని స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోటి సంతకాల సేకరణ

మండపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం టిడ్కో గృహాల వద్ద స్థానికుల నుంచి సంతకాలు సేకరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు యరమాటి వెంకన్నబాబు, ఆలీఖాన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు

రాయవరం, న్యూస్‌టుడే: సోమేశ్వరంలోని బాలత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపించారు. అర్చనలు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. మహా నివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.
● వెదురుపాకలోని విజయదుర్గా పీఠంలోనూ భవానీశంకర అష్ట లింగేశ్వరస్వామికి పంచ ద్రవ్యాలతో అభిషేకాలు, రుద్రాభిషేకం, బిల్వార్చనలు జరిపించారు. విజయదుర్గాదేవికి సామూహిక శ్రీచక్రార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ రావుల రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో బాలత్రిపురసుందరీ సమేత సోమేశ్వరస్వామి

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష అద్భుత అవకాశం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షా కేంద్రాన్ని డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష విద్యార్థులకు ఒక అద్భుతమైన అవకాశమన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందుతుందన్నారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్ కాశీ సత్యనారాయణ, డిపార్ట్‌మెంట్ అధికారి బి.ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం హైస్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న హనుమంతరావు

ఉద్యానం.. అభివృద్ధి కనం..

పట్టణంలో ఆహ్లాద కేంద్రాలు కరవు

న్యూస్‌టుడే, రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలో ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ఉద్యానాలు అభివృద్ధి చేసే నాథుడి కోసం ఎదురుచూస్తున్నాయి. వైకాపా హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన పార్కులు ఇపుడూ అలాగే ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా పూర్వ వైభవం వస్తుందని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రహరీ వరకు నిర్మించి వదిలేసిన అఫీషియల్ కాలనీలోని పార్కు

నడకదారి మాటేమరిచారు..

శివాలయం పార్కులో నడకదారిని విస్మరించారు. నాలుగు వైపులా పూర్తిగా వేయకుండా కేవలం మూడు వైపులా నిర్మించి వదిలేశారు. వెనుక భాగంలో పిల్లలు ఆడుకునే వస్తువులను సక్రమంగా ఏర్పాటు చేయలేదు. ఆ ప్రాంతాన్ని మెరకచేసి మరింతగా అభివృద్ధి చేస్తే పిల్లలు వచ్చి కాసేపు ఆడుకునే అవకాశం ఉంటుంది.

అసౌకర్యాలలో..

బ్రాడీపేట మున్సిపల్ పార్కులో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. చీకటిపడితే దీపాలు సరిగా వెలగవు. దీనికి తోడు పిల్లలు ఆడుకునే వస్తువులు మరమ్మతులకు గురయ్యాయి. పార్కు లోనికి వచ్చే ఉత్తరం వైపు గేటు వద్ద టైల్స్ పాడవడంతో సందర్శకులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఫౌంటైన్‌లో నీరు, పచ్చనిమొక్కలతో కళకళలాడిన ఈ పార్కు ప్రస్తుతం వెలవెలబోతోంది.

ప్రహరీకే పరిమితం..

పట్టణంలోని 5వ వార్డు వైఎస్సార్‌నగర్, 13వ వార్డు అఫీషియల్‌కాలనీలోని ఉద్యానం, 21వ వార్డు రత్నంపేట పార్కు ప్రహరీలకే పరిమితమయ్యాయి. వీటిలో సామగ్రి, నడక దారి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధికి చర్యలు..

పట్టణంలోని శివాలయం పార్కు, బ్రాడీపేట పార్కు తదితర ఉద్యానాలను ఒక్కొక్కటిగా అభివృద్ధి చేస్తాం. త్వరలోనే నిధులు సమకూర్చి పనులు పూర్తిచేస్తాం. పార్కుల వద్ద వీధి దీపాల సమస్య లేకుండా చూస్తాం.
- **కె.వి.ఆర్.ఆర్.రాజు, మున్సిపల్ కమిషనర్**

పొగబెట్టి ఎన్నాళ్లయిందో..?

(పాతచిత్రం)

ఒకపక్క చలి.. మరోపక్క దోమల బెడద.. పారిశుద్ధ్య లోపాలతో పట్టణవాసులు సతమతమవుతున్నారు. వార్డుల్లో దోమలు విజృంభించి నిద్ర కరవవుతోందని వాపోతున్నారు. గతంలో నెలకొకసారైనా దోమల నివారణకు ఫాగింగ్ చేసేవారని.. ప్రస్తుతం మొక్కుబడిగా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. వారంలో ఒక్కసారి కూడా కాలువలను శుభ్రంచేయడం లేదని చెబుతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు సూర్యనగర్, రత్నంపేట, తోటవారివీధి తదితర ప్రాంతాల్లో దోమల తీవ్రత ఎక్కువగా ఉంది. దీనిపై శానిటరీ తనిఖీదారు డేవిడ్‌రాజును వివరణ కోరగా కాలువలను వెంటనే శుభ్రం చేయిస్తామని చెప్పారు. దోమల నివారణకు వార్డులవారీగా ఫాగింగ్ చేస్తున్నామని చెప్పారు.

– న్యూస్‌టుడే, రామచంద్రపురం

రైతుబజార్‌కు తాళం

కపిలేశ్వరపురం మండలం అంగరలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన రైతుబజార్ కొన్ని నెలలుగా మూతపడింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చొరవతో 2018లో వీవర్స్‌కాలనీలో రూ.31.50 లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. ప్రారంభంలో ఎనిమిది దుకాణాలు ఏర్పాటుచేసి, వినియోగదారులకు తక్కువ ధరకే కూరగాయలు విక్రయించేవారు. రైతులు దుకాణాలు వేసేయడంతో రైతుబజార్ నిరుపయోగంగా మిగిలింది. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కూరలు కొనలేక స్థానికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తెరిపించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అంగర

వీధి దీపాలు వెలగవు..

రాయవరం మండలం పసలపూడి బైపాస్ రహదారిలో వీధి దీపాలు వెలగక రాత్రివేళల్లో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే కీలకమైన రహదారిలో దీపాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చీకట్లో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. మార్గంలో ప్రమాదకరమైన మలుపులో ప్రయాణికులు భయభ్రాంతులకు లోనవుతున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎ.గోవిందరాజులును వివరణ కోరగా వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి వీధి దీపాలను బాగు చేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, రాయవరం

వీధి దీపాలు లేని ప్రమాదకరమైన మలుపు

ప్రహరీ విరిగింది.. ప్రమాదం పొంచి ఉంది..

మండపేట పట్టణం న్యూకాలనీలోని ఎస్సీ బాలికల పాత వసతి గృహం ప్రహరీ పలు చోట్ల విరిగిపోయింది. మరికొన్ని చోట్ల ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం ఇందులో సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. పలు శాఖలకు చెందిన దస్త్రాలు, ముఖ్యమైన రికార్డులకు భద్రత లోపించింది. ప్రహరీ పునఃనిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, మండపేట

సమ్మేళనంలో పీఠాధిపతి నాగానంద సరస్వతి స్వామీజీ

హిందూ ధర్మ పరిరక్షణలో భాగస్వామ్యం..

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన ఆవశ్యకత ఉందని శృంగవృక్షం పంచమ పీఠాధిపతి శ్రీసాయి దత్త నాగానంద సరస్వతి స్వామీజీ అన్నారు. ముమ్మిడివరంలో మహిళా కళాశాల ఆవరణలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. సత్యం, ధర్మం ఆచరిస్తూ హిందూ సమాజాన్ని సంఘటితం చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అత్తిపటల వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ.. పంచ పరివర్తన ద్వారా సమాజంలో బేధ భావాలను రూపుమాపి సమరసతో కూడిన ఆచరణ, పర్యావరణ అనుకూలమైన జీవన విధానం, విలువలు పునాదిగా కలిగిన కుటుంబ వ్యవస్థ నిర్మాణమే లక్ష్యమన్నారు. తాడి నరసింహారావు, పెన్మత్స జగ్గప్పరాజు, దంగుడుబియ్యం శ్రీనివాసరావు, పెన్మత్స కృష్ణంరాజు, గొలకోటి వెంకటరెడ్డి, ఆదిరాజు సతీష్, పుల్లెపు వెంకట నరసింహశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాహూల్‌మీనా హెచ్చరించారు. జిల్లాలోని పరిధిలోని రౌడీ షీటర్లను ఆదివారం ఆయా స్టేషన్లకు పిలిపించి పోలీసు అధికారులతో కౌన్సెలింగ్ ఇప్పించారు. నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనోపాధి ఎంచుకోవాలని వారికి సూచించారు.

స్మార్ట్‌గా చదవండి.. ఇష్టంగా రాయండి

పామర్రు, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు మరో 95 రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. స్మార్ట్‌గా చదవండి.. మనోబలంతో సమాయత్తం కండి. భయంగా కాకుండా ఇష్టంతో పరీక్షలు రాయండి. ఇప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకుని సాధనకు అనుగుణంగా ముందుకు సాగాలని జాతీయ స్థాయిలో మూడుసార్లు యూత్ ఐకాన్‌గా ఎంపికైన యర్రా శ్రీదీక్షిత విద్యార్థులకు సూచించారు. టాప్ ఐకాన్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎచీవర్స్ మేగజైన్ సర్వేలో మూడో స్థానంలో నిలిచి గిన్నిస్‌బుక్‌లో చోటు సాధించిన ఆమె కె.గంగవరం మండలం పామర్రు ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మెలకువలు బోధిస్తున్న శ్రీదీక్షిత

తాను గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఆన్‌లైన్లలో పలు కోర్సులు నేర్చుకుని ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. పలు విశ్వవిద్యాలయాల్లో, పరిశ్రమల సీఈవోల సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రసంగించినట్లు వివరించారు. పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే ప్రక్రియలో భాగంగా పాఠ్యపుస్తకాలు ఎక్కువగా చదవాలని, సొంతంగా నోట్సు రాసుకోవాలని సూచించారు. ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా రాసుకుని ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవాలన్నారు. అందమైన అక్షరాలు ఆకట్టుకుంటాయని, దస్తూరిని మెరుగుపర్చుకోవాలన్నారు. సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. నమూనా పరీక్షలను శ్రద్ధగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.ఈశ్వరుడు, ఉపాధ్యాయులు చంద్రు చౌదరి, జి.మెహర్‌కుమారి, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు ఎలుగుబంటి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో యోగా పోటీలు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమంలో మోటూరు భైరవ స్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆదివారం యోగా పోటీలు నిర్వహించారు. విజేతలకు భైరాస్వామి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చునని యోగా నిపుణుడు శ్రీనివాస్ అన్నారు.

ప్రశంసా పత్రాలు, బహుమతులతో చిన్నారులు

నాగిరెడ్డి సతీష్‌కు పరామర్శ

ద్రాక్షారామ: మాతృ వియోగంతో బాధపడుతున్న హసనబాద సర్పంచి, భాజపా కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్‌రావును ఆదివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. సతీష్‌రావు తల్లి నాగమణి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఈమె ద్రాక్షారామ నాటక కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగిరెడ్డి సత్యనారాయణ భార్య. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైకాపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి సూర్యప్రకాష్, నాయకులు కాకిలేటి రాంబాబు, చింతపల్లి రాంబాబు, గొల్లపల్లి సుబ్బారాయుడు, రావుల రాజు, నారాయణరావు తదితరులు సతీష్‌రావును పరామర్శించిన వారిలో ఉన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం..

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం జడ్.మేడపాడు మూడు రహదారుల కూడలిలో నిత్యం వాహనదారులు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నారు. సామర్లకోట-వేమగిరి ప్రధాన రహదారి కావడంతో అధిక సంఖ్యలో వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ద్వారపూడి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగుల హడావుడితో వంతెనపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేక వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి జఠిలంగా మారుతున్నా వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు పోలీసు సిబ్బంది అస్సలు కనిపించరు. దీనిపై మండపేట రూరల్ ఎస్సై వి.కిషోర్‌ను వివరణ కోరగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వంతెన కూడలిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వివరించారు.

జడ్.మేడపాడు కూడలిలో అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు

ఇటుకబట్టీలు.. తప్పని ఇబ్బందులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రహదారి పక్కన నిర్వహిస్తున్న ఇటుకబట్టీలతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ద్రాక్షారామ నుంచి రామచంద్రపురం వెళ్లే మార్గంలోని తాళ్లపొలం వద్ద రహదారి పక్కనే పలు బట్టీలు ఉన్నాయి. నిబంధనలు పాటించకుండా రోడ్డు పక్కనే ఇటుకలను కాల్చడానికి ఊకకు నిప్పు పెడుతుండడంతో దట్టంగా పొగ వ్యాపిస్తోంది. ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు, వాహనచోదకుల కళ్లలో ధూళి పడి ముందు వెళ్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. రోడ్డువైపు బరకాలు కట్టి పొగను దారి మళ్లించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. సమస్యను ఇన్‌ఛార్జి తహసీల్దారు మృత్యుంజయరావు దృష్టికి తీసుకువెళ్లగా బట్టీల నిర్వాహకులకు సూచనలు చేస్తామని చెప్పారు.

తాళ్లపొలంలో ఇటుకబట్టీల నుంచి వ్యాపిస్తున్న పొగ

పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలి

మామిడికుదురు: పన్నెండో పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్టీయూ నాయకులు పాశర్లపూడిలో ఆదివారం నినదించారు. 79వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చిస్తామన్నారని, అప్పటివరకు ఐ.ఆర్. ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సంఘ మండల అధ్యక్షుడు చిక్కం రవికుమార్, ప్రధాన కార్యదర్శి నేల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

కోటసత్తెమ్మా.. బోనాలు నీకమ్మా

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసిఉన్న కోటసత్తెమ్మ వారి తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా హిందూ చైతన్యవేదిక జిల్లా మహిళా ప్రముఖ్ జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరం నుంచి 101 మంది మహిళలు కలశాలు, బోనాలతో చీర-సారె సమర్పించారు. అమ్మవారు స్వర్ణ ఆభరణాలు, ప్రత్యేకపూల అలంకరణతో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మకు విశేష పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, నిడదవోలు

నేడు దిల్లీ విమాన సర్వీసు రద్దు

కోరుకొండ, న్యూస్‌టుడే: ఇండిగో విమానయాన సంస్థలో నెలకొన్న సేవల అంతరాయం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఇంకా కొనసాగుతోంది. ఆదివారం సర్వీసులన్నీ పునరుద్ధరించగలిగినా, సోమవారం మళ్లీ విమాన సర్వీసుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నడవాల్సిన దిల్లీ ఎయిర్ బస్ విమాన సర్వీసు రాకపోకలను పూర్తిగా రద్దు చేశారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ముందస్తుగానే ప్రయాణికులకు సమాచారం ఇచ్చారు.

నేడు, రేపు నన్నయలో జాతీయ కార్యశాల

హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాజానగరం: నన్నయలో 8, 9న 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై జాతీయ కార్యశాల నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. భారతీయ భాషా సమితి మినిస్ట్రీస్ ఆఫ్ ఎడ్యుకేషన్ సహకారంతో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీఅధ్యక్షుడు ఆర్‌డీ.విల్సన్, భారతీయ భాషా సమితి అకడమిక్స్ కోఆర్డినేటర్ డా.కె.గిరిధరరావు, వివిధ రాష్ట్రాల నుంచి తెలుగు, హిందీ, సంస్కృత భాషల ప్రముఖులు హాజరవుతారన్నారు. భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలంపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీసీ చెప్పారు.

నిఘా: అదే పంథా.. ఆగని దందా..!

హద్దులు మార్చి... యంత్రాంగాన్ని ఏమార్చి..

అధికారులు దాడులు చేస్తున్నా ఇసుక అక్రమార్కుల దందా మాత్రం ఆగడం లేదు. అడ్డదారుల్లో తెలంగాణకు గతానికి మించి ఇసుక తరలిపోతోంది. కొవ్వూరు నియోజకవర్గం పరిధిలోని నిల్వ కేంద్రాలు, రీచ్‌ల నుంచి ఏలూరు జిల్లా సరిహద్దు గ్రామాల్లో భారీగా నిల్వలుంచి, అక్కడ నుంచి తెలంగాణకు తరలించారు. దీనిపై 'ఈనాడు'లో కథనం రావడంతో అధికారులు నిఘా పటిష్ఠం చేశారు. దీంతో ఆ గ్రామాలకు కాకుండా వేర్వేరు మండలాలకు ఆర్డర్లు చూపుతూ అక్రమ రవాణా చేస్తుండటం గమనార్హం.

– ఈనాడు, రాజమహేంద్రవరం

ఎంత వ్యత్యాసమో..

ఏలూరు జిల్లా చింతలపూడి మండల పరిధిలోని తెలంగాణ సరిహద్దు గ్రామాల నుంచి సెప్టెంబరు వరకు పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగింది. దీనిపై అధికారులు దృష్టి సారించడంతో ఆయా గ్రామాలకు ఇసుక సరఫరా నిలిపేశారు. కానీ సమీపంలోని మరికొన్ని గ్రామాలకు పెద్ద ఎత్తున తరలించారు.

● చింతలపూడి మండలం సరిహద్దు గ్రామాలకు కొవ్వూరు నుంచి సెప్టెంబరు వరకు, తరువాత జరిగిన ఇసుక సరఫరా పరిశీలిస్తే ఏ స్థాయిలో ఆర్డర్లు తగ్గాయో అర్థం చేసుకోవచ్చు.

గ్రామం	సెప్టెంబరు వరకు	ఆ తరువాత (మెట్రిక్ టన్నుల్లో..)
సీతానగరం	22,537	2035
రాఘవాపురం	13912	1655
చింతపూడి	10092	1734
ఈదరపల్లి	2606	707

మండలం	సెప్టెంబరు వరకు	ఆ తరువాత (మెట్రిక్ టన్నుల్లో..)
లింగంపాలెం	404	1,721
పోలవరం	828	3,410
టి.నర్సాపురం	2,096	6,758
బుట్టాయగూడెం	1,194	3,404

తెలంగాణ సరిహద్దులోని వేర్వేరు గ్రామాల పేర్లతో ఆర్డర్లు బుక్ చేసి తెలంగాణకు తరలించారు. సెప్టెంబరు మొదటి వారం వరకు, ఆ తరువాత కొన్ని సరిహద్దు గ్రామాలకు తరలించిన ఇసుక పరిశీలిస్తే అక్రమాలు ఏ స్థాయిలో కొనసాగాయో స్పష్టమవుతోంది.

'ఇప్పటి వరకు రెండు జిల్లాలో 15 కేసులు ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యాయి. బిల్లులు లేకుండా తరలిస్తున్న వాహనాలపై 215 కేసులు నమోదు చేసి రూ.కోటి వరకు అపరాధ రుసుం విధించాం.' అని జిల్లా గనుల శాఖ అధికారి ఫణిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు.

నక్షత్రాల చెట్టు.. వెలుగులు పూసినట్టు!

క్రిస్మస్ నేపథ్యంలో ప్రార్థనాలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యుద్దీపాలంకరణతో మెరుస్తున్నాయి. పేపరుమిల్లు ప్రధాన రోడ్డు సమీపంలోని లూథరగిరి చర్చి వద్ద చెట్టును ప్రత్యేకంగా అలంకరించారు. చెట్టు మొత్తం నక్షత్రాలతో మెరుస్తున్నట్లు కనువిందు చేస్తోంది.

– న్యూస్‌టుడే, కంబాలచెరువు(రాజమహేంద్రవరం)

మధ్యాహ్న భోజనం.. మరింత బలోపేతం

పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

సీతానగరం, రాజానగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి సన్న బియ్యం అందజేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో భోజనం తినేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అంతకుముందు విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారీయర్లు తెచ్చుకోవడం, మధ్యాహ్నం తినకుండా ఉండటం, అర్ధాకలితోనే ముగించడం వంటివి చేసేవారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండటంతో అందరూ కడుపు నిండా భోజనం చేస్తున్నారు. ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ్ ద్వారా విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు వంట ఛార్జీలను పెంచింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా పథకం మరింత బలోపేతం అవుతుందని అంతా భావిస్తున్నారు.

జిల్లాలో పాఠశాలలు

ప్రాథమిక	704
ప్రాథమికోన్నత	32
ఉన్నత	213
విద్యార్థులు	89,091

పెంచిన ధరలు.. (రూ.ల్లో)

తరగతులు	గతంలో	ప్రస్తుతం
1 నుంచి 5	5.45	6.19
6 నుంచి 10	8.17	9.29
ఇంటర్	8.17	9.29

భవనం.. ఇంకెప్పుడో వరం

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధాన భవనం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఓ సంస్థ దీనిని నిర్మిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నాటికే కొత్త బ్యాచ్ విద్యార్థుల బోధనకు ప్రధాన భవనం అందుబాటులో ఉండాలనే మార్గదర్శకాలు ఉన్నా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పటికే మూడోబ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు చేరారు. వారికి తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది.

నిర్మాణంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల ప్రధాన భవనం

గుత్తేదారుల నిర్లక్ష్యమేనా..!

ప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో ఇబ్బంది లేకపోయినా గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రధాన భవనం నిర్మాణాన్ని సబ్ కాంట్రాక్టులకు అప్పగించి గాలికొదిలేశారు. ఈ భవనాన్ని సెల్లార్, జీప్లస్-4గా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 70 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఎలివేషన్, ప్లాస్టింగ్, సీలింగ్, ఫ్లోరింగ్, విద్యుత్తు పనులు, ఏసీలు, ఇతర ఫర్నీచర్, కళాశాల చుట్టూ రోడ్లు ఇతర వసతులు కల్పించాలి. ధరలు పెంచాలనే డిమాండ్‌తో పనుల్లో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్త విద్యార్థులకు ఇక్కట్లు..

జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం ఆగస్టులోగా ప్రధాన భవనం పూర్తవ్వాలనే నిబంధన ఉంది. వైద్య కళాశాల నిర్మాణానికి 2022లో రూ.475 కోట్లు కేటాయించారు. వీటిలో రెండు బ్యాచ్‌లకు సంబంధించి మల్లికార్జుననగర్‌లో ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్(పీఈబీ) నిర్మించారు. ప్రధాన భవనం పూర్తయితే మొత్తం పీఈబీలో వసతులు, విద్యార్థులను సైతం అక్కడికి తరలించి దానిని నర్సింగ్ కళాశాలగా మార్చాలనే ప్రతిపాదన ఉంది. మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు మాత్రమే వసతులున్నాయి. ఇప్పుడు మూడో ఏడాది ప్రారంభమైంది. ఆ విద్యార్థులకు లెక్చర్ హాలు, ల్యాబ్‌లు, ఇతరత్రా వసతులు లేక ఇబ్బందులు తప్పట్లేదు.

నిర్వహణ పనులకూ కాలయాపనే..

● రాజమహేంద్రవరం బోధనాసుపత్రికి 2021లో రూ.475 కోట్లు కేటాయించారు. ● నిర్మాణం, ఆసుపత్రిలో పలు ప్రధాన నిర్వహణ పనులను ఈ మొత్తంతోనే చేయాలి. ● గుత్తేదారు సంస్థ చిన్న పనులు సైతం పట్టించుకోవట్లేదు. ● రేడియాలజీ విభాగానికి లెడ్ డోర్లు కావాలని కలెక్టర్ ఆదేశించినా ఫలితం లేదు. ● లిఫ్ట్ ప్రతిపాదన గాలికొదిలేశారు. ● ప్రధాన భవనం ఓ వైపు అందుబాటులోకి తేవాలని అధికారులు సూచించినా పట్టించుకోవట్లేదు.

జేసీబీ నడిపి.. జోష్ నింపి

పెరవలి మండలం కానూరు-ఉసులుమర్రు రహదారి పనులను మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనే స్వయంగా పొక్లెయిన్ నడిపి శ్రామికుల్లో జోష్ నింపారు.

– న్యూస్‌టుడే, నిడదవోలు

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగే జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ అర్జీలు స్వీకరిస్తారని, ప్రజలు తమ సమీపంలోని కార్యాలయంలోనూ వివిధ సమస్యలపై అర్జీలు అందించవచ్చని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబరు 1100తో పాటు మీకోసం పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చన్నారు. పౌరసేవల మెరుగుకు వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 95523 00009 కూడా వినియోగంలో ఉందన్నారు.

వినండి ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అక్కడి విద్యార్థులు 'జేఎన్‌వీ రేడియో' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం ప్రార్థన సమయంలో రేడియోలో వార్తలు చదివే మాదిరిగా.. వివిధ దినపత్రికల్లో వచ్చే ప్రధాన వార్తాంశాలను 10 నిమిషాల పాటు మూడు భాషల్లో చదువుతారు. విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం చేరవేయాల్సిన పలు అంశాలను ఈ మాధ్యమం ద్వారానే అందిస్తున్నారు. రోజూ ఓ గంట పాటు విద్యార్థులు ముఖాముఖి, గీతాలు ఆలపించడం, జోకులు, పుస్తక సమీక్ష, వివిధ ప్రసంగాలు చేస్తున్నారు. వీటితో విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ సామర్థ్యాలు పెరగడంతోపాటు, నాయకత్వ లక్షణాలు వచ్చి బిడియం పోతుందని ప్రిన్సిపల్ సీతాలక్ష్మి తెలిపారు.

రేడియో సంభాషణలో విద్యార్థులు

-ఈనాడు, రాజమహేంద్రవరం

కొత్తవి రావు... ఉన్నవి సరిపోవు

అరకొర బస్సులతో ప్రయాణికుల అవస్థలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీలో బస్సుల సంఖ్య పెరగడంలేదు. జిల్లాకు 50 విద్యుత్తు బస్సులు మంజూరై నెలలు అవుతున్నా.. ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి. ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు పనులు ఇంకా మొదలు కాలేదు. జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల్లో కలిపి 278 బస్సులు ఉండగా 78 అద్దె బస్సులే. ప్రస్తుతం ఉన్నవాటినే 99 మార్గాల్లో (రూట్లలో) 266 షెడ్యూల్ సర్వీసులుగా నడుపుతున్నారు.

ఛార్జింగ్ కేంద్రాలకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో ఆవరణలో కేటాయించిన స్థలం

గతంలో అన్ని డిపోల నుంచి తిరిగే షెడ్యూల్ బస్సుల్లో రోజుకు సగటున 72 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగా ఇప్పుడు ఆ సంఖ్య 1.35 లక్షలకు పెరిగింది. ప్రయాణికులు పెరుగుతున్నారే తప్ప బస్సులు మాత్రం పెరగడంలేదు. కాలం చెల్లిన బస్సులను ఒక్కొక్కటిగా పక్కన పెడుతున్నా వాటి స్థానంలో కొత్త బస్సులు కూడా రావడంలేదు. గత మూడు నెలల వ్యవధిలో జిల్లాలో అయిదు బస్సులను మూలకు చేర్చారు.

పెరిగిన ప్రయాణికుల సంఖ్య

డిపో	సొంత బస్సులు	అద్దెవి
రాజమహేంద్రవరం	83	54
గోకవరం	41	14
కొవ్వూరు	46	04
నిడదవోలు	30	06

హద్దు మీరొద్దు.. ముప్పు తెచ్చుకోవద్దు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌వోల ఆధ్వర్యంలో ఆదివారం ఆయా పరిధిలోని రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతా సత్ప్రవర్తనతో మెలగాలని, కేసుల్లోకి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. పీడీ చట్టం అమలు చేస్తామన్నారు. గంజాయి తాగినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. మత్తు పదార్థాలతో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాల్లో చేపల వేట

సామర్లకోట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో నివాసయోగ్యం కాని స్థలాలను సేకరించి పేదలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇవి కాలనీలు కాదు ఊళ్లు అని ఎంతో గొప్పలు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా సామర్లకోటలోని జగనన్న కాలనీల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు. పల్లపు ప్రాంతం కావడంతో ఇళ్ల స్థలాల్లో వర్షపు నీరు పోవడానికి కాలువలు లేకపోవడంతో మురుగునీరు చేరింది. ఆ నీటిలో చేపలు పెరిగిపోవడంతో యువకులు గాలాలతో చేపల వేట సాగిస్తున్నారు. పెద్దపెద్ద కొర్రమేనులు పెరుగుతున్నాయి. ఆదివారం యువకులు వాటిని పట్టుకున్నారు. దీంతో జగనన్న కాలనీలు ఏస్థితిలోఉన్నాయో అర్థంచేసుకోవచ్చు.

సాగులో ఇంతులు.. ఆర్థిక కాంతులు

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

మహిళా రైతులను ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతంగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా వ్యవసాయంపై అవగాహన కలిగిన, సాగు చేపడుతున్న గ్రామీణ స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ)లోని మహిళలతో మండలానికొక రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో) ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించింది. తొలుత గ్రామీణ ఎస్‌హెచ్‌జీల్లో మహిళలతో మండలానికి 30-70 వరకు రైతు ఉత్పాదక సంఘాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లాలో 1,718 మహిళారైతు ఉత్పాదక సంఘాలు ఏర్పాటు చేశారు. వీటితో మండలానికొకటి చొప్పున 17 ఎఫ్‌పీవోలు రిజిస్టర్ అయినట్లు డీఆర్‌డీఏ పీడీ మూర్తి చెబుతున్నారు.

శిక్షణలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు

మండలాల వారీగా నిధుల మంజూరు

● దేవరపల్లి, గోకవరం, నల్లజర్ల, రంగంపేట, పెరవలి ఎఫ్‌పీవోలకు రూ.5 లక్షలు చొప్పున రుణాలు ఇచ్చారు.

● కోరుకొండ, చాగల్లు, నిడదవోలు, రాజానగరం ఎఫ్‌పీవోలకు రూ.3 లక్షల చొప్పున బ్యాంకు రుణాలు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు.

● గోపాలపురం, తాళ్లపూడిలోని ఎఫ్‌పీవోలకు రివాల్వింగ్ ఫండ్‌గా రూ.10 లక్షలు, వర్కింగ్ క్యాపిటల్‌గా రూ.35 లక్షల చొప్పున మంజూరయ్యాయి. కోరుకొండ, చాగల్లు, నిడదవోలులోని ఎఫ్‌పీవోలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు అవుతాయన్నారు.

ఇదీ లక్ష్యం..

● పంటల నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేసి మంచి ధర పొందటం. ● ఆర్థికంగా బలోపేతం కావడం. ● సేంద్రియ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించడం. ● సహజ వ్యవసాయం వైపు మహిళా రైతులను మళ్లించడం. ● జీవనోపాధి మెరుగుకు ఏర్పాటు చేసిన లైవ్‌లీహుడ్ సర్వీస్ సెంటర్(ఎల్ఎస్‌సీ)లతో ఎఫ్‌పీవోలు పనిచేస్తాయి. ● మహిళా రైతులకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక, వ్యాపార శిక్షణ.

ప్రతిభే కొలమానం..!

సివిల్స్ లక్ష్యానికి.. ప్రభుత్వ ప్రోత్సాహం..

రాజమహేంద్రవరంలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ సర్వీసు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల్లో అర్హులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి ప్రభుత్వం ఉచిత శిక్షణ అందించనుంది. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వీరికి ఆదివారం రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సివిల్స్‌లో ఉచితంగా శిక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

రిజర్వేషన్లు ఇలా.. (శాతాల్లో)

బీసీ 66 · ఎస్సీ 20 · ఎస్టీ 14

143 : అందిన దరఖాస్తులు

126: స్క్రీనింగ్ పరీక్షకు హాజరైంది

17 : గైర్హాజరైంది

విజయవాడలో తర్ఫీదు

స్క్రీనింగ్ పరీక్షలో మెరిట్ సాధించినవారికి ఉత్తమ బోధన, వసతి, భోజనం, అధ్యయన సామగ్రి వంటివి అందించి పూర్తిస్థాయిలో సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం కోసం విజయవాడ కేంద్రంగా ప్రభుత్వం ఉచిత శిక్షణ అందిస్తామని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి బి.శశాంక తెలిపారు.

పులి అడుగు జాడలేనా..?

కోరింగ అభయారణ్యంలో పులి అడుగులను గుర్తిస్తూ...

మడ అడవుల్లో కాలుమోపేందుకు అవకాశం లేని చిత్తడి నేలలు ఉంటాయి. అడవంతా గుబురుగా ఉంటుంది. ఈ అడవుల్లో ఎక్కువగా నీటి పిల్లులు, నక్కలు, పక్షి జాతులు ఉంటాయి. వీటిపై ఏటా గణన నిర్వహిస్తారు. ఈసారి కోరింగ అభయారణ్యంలో పులి సంచారంపై వన్యప్రాణి విభాగ సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నారు. కోరింగ అభయారణ్యంలోని మడ అడవుల్లో వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ కార్యక్రమంలో భాగంగా పులి కాలు గుర్తులు, ట్రాన్స్ సెట్‌లపై వన్యప్రాణి విభాగ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ధనంజయ, గోపీ నాగేంద్రకుమార్, జగదీష్‌లతో కూడిన మరో ఇద్దరు బృంద సభ్యులతో కోరింగ, హోప్ ఐలాండ్, భైరవపాలెం సెక్షన్ పరిధిలోని 58వేల ఎకరాల మడ అడవులో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే నాలుగేళ్లకు ఒకసారి జరుగుతుంది. ఈ సర్వేను ఈ నెల 1,2,3 తేదీల్లో ప్రారంభించారు. ఏక కాలంలో మూడు బృందాలు తెల్లవారుజామున 6.30 గంటలకే మడ అడవులకు చేరుకుని రోజుకు రెండు కిలోమీటర్ల మేర సర్వే చేస్తున్నాయి.

-న్యూస్‌టుడే, తాళ్లరేవు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

ఆ 2 రోజులు.. 4 గంటలు

రాజమహేంద్రవరంలో ప్రధానమైన మోరంపూడి కూడలి నుంచి కేశవరం వెళ్లే మార్గం సాధారణంగానే రద్దీగా ఉంటుంది. ఆది, మంగళవారాలు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఆ రెండు రోజులు మెయిన్‌రోడ్డుపై 300 మీటర్ల మేర బండ్లు పెట్టి చేపల సంత నిర్వహిస్తున్నారు. ఇక్కడ అన్నిరకాల మత్స్య సంపద దొరుకుతుండటంతో కొనేందుకు పెద్దఎత్తున తరలివస్తున్నారు. దీంతో ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు విపరీతమైన రద్దీ ఉంటుంది. ఓవైపు చేపలు అమ్మేవారు, మరోవైపు వాటిని శుభ్రం చేసేవాళ్లు, ఎదురెదురుగా వచ్చే వాహనాలతో కిలోమీటరు దూరం దాటాలంటే సుమారు అరగంట పడుతుంది. కొన్నిసార్లు అంబులెన్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. ఎవరికీ ఇబ్బంది లేకుండా రద్దీ లేని ప్రదేశాల్లో ఈ సంత పెట్టుకునేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై చేపల సంతతో నిలిచిపోయిన ట్రాఫిక్

ఎక్కడ: మోరంపూడి కూడలి నుంచి అరవిందనగర్, గణేష్‌నగర్ వరకు.

దుకాణాలు: రోడ్డుకు ఇరువైపులా సుమారు 80 దుకాణాలు.

విక్రేతలు, కొనుగోలుదారులు: అందరూ కలిపి దాదాపు 4వేల మంది ఉంటారు.

వాహనాలు: అన్నిరకాల వాహనాలు కలిపి గంటకు 1,000 ప్రయాణిస్తాయి.

ప్రభావం: స్థానికులు, ప్రయాణికులతో కలిపి దాదాపు 20వేల మంది.

ఏ ప్రాంతాలు

రాజమహేంద్రవరం, సమీపంలోని అయిదారు గ్రామాల ప్రజలు వస్తారు. ఈ క్రమంలో నగరం నుంచి మోరంపూడి మీదుగా కేశవరం, శాటిలైట్ సిటీ వైపు వెళ్లేవారికి అవస్థలు తప్పట్లేదు.

– న్యూస్‌టుడే, మోరంపూడి

(c) eenadu

జ్ఞాపకాల నిధి.. సంతోషాల మది

స్థానిక వీరభద్రపురం మున్సిపల్ టౌన్ హైస్కూల్లో 1983-84లో చదువుకున్న 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. కోరుకొండ రోడ్డులోని ముద్రగడ అతిథి గృహంలో వారంతా కలిసి ఆటపాటలతో సందడి చేశారు. ఆనాటి సంగతులను గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు. - న్యూస్‌టుడే, టి.నగర్

ఇక్కడింతే.. 2 తరగతులు X 1 గది = 2 పాఠాలు

గొల్లప్రోలు పాపయ్యచావిడి వీధిలో గల నంబర్-2 ప్రాథమిక పాఠశాలకు రెండు గదులు ఉండగా వాటిలోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ పాఠశాలకు 3 గదుల భవనం మంజూరు చేసినా తరువాత రెండు గదుల నిర్మాణానికి మాత్రమే నిధులు కేటాయించారు. ఆ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోగా కూటమి ప్రభుత్వం పనులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయించింది. ఒక్కొక్క గదిలో రెండేసి తరగతులు నిర్వహిస్తూ మరొక తరగతిని వరండాలో కొనసాగిస్తున్నారు. నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈవో శ్రీనివాసరావు, ఎంఈవో-2 శివప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

కోరిమరీ తలచి.. కోనసీమ రుచి

మూకుడులో మినప పిండి వేసి పైన, కింద కొబ్బరి డొక్కల మంటతో కాల్చే మినప దిబ్బరొట్టె తింటే లొట్టలేయాల్సిందే. 1996 నుంచి పి.గన్నవరంలో ఈ రొట్టెలు ప్రసిద్ధి. మూడు దశాబ్దాల క్రితం పదుల బ్రహ్మం ఈ రొట్టెలకు శ్రీకారం చుట్టారు. ఆయన కుమారుడు రాము దుకాణం నడిపిస్తున్నారు. దోరగా కాల్చిన దిబ్బరొట్టెకు కొబ్బరి చెట్నీ, బొంబాయిచెట్నీ, కారంతో కలిపి తింటే ఆహా ఏమి రుచి. తినరా మైమరచి అనాల్సిందే. ఒకసారి ఈ హోటల్‌లో దిబ్బరొట్టె తిన్నవాళ్లు మళ్లీ మళ్లీ ఇక్కడికే వస్తారు. రొట్టె ధర రూ.50. సగం తీసుకుంటే రూ.25 చెల్లించాలి. పొద్దున్నే నూనెతో వండిన అల్పాహారం ఇష్టపడనివారు ఎక్కువగా ఈ దిబ్బరొట్టెలు తినడానికి ప్రాధాన్యమిస్తారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

సిద్ధివినాయక.. వరదాయక

అయినవిల్లి సిద్ధివినాయకస్వామికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. వివిధ రుసుముల ద్వారా రూ.2,26,766 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి

రామలింగేశ్వరా.. కళ వరించగా..

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం, ఆదివారం కలిసిరావడంతో శ్రీ ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధాన్యం వరి కంకులతో ధాన్య పరమేశ్వరుడుగా అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. రైతు బాగుండాలని, పంటలు సక్రమంగా చేతికిరావాలని ఈప్రత్యేకమైన పూజలు చేసినట్లు ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఉప్పాడ జాంధానీ ఊపు అందుకోనుందా..

సంక్రాంతి సీజన్‌పై వస్త్ర వ్యాపారుల ఆశలు

న్యూస్‌టుడే, కొత్తపల్లి

కరోనా మహమ్మారి రాక ముందు ఉప్పాడ జాంధానీ పట్టు చీరల వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఉండేది. 2020లో కరోనా రావడంతో చేనేత రంగానికి గడ్డుకాలం ఏర్పడింది. ఆ సమయంలో వైకాపా ప్రభుత్వం ఈ రంగాన్ని అభివృద్ధిలోకి తెచ్చేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఫలితంగా అమ్మకాలు లేక వ్యాపారులు, ఉపాధి లేక నేత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమ్మకాలు లేక యు.కొత్తపల్లి మండలంలోని వందలాది చేనేత వస్త్ర దుకాణాలు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. రానున్న సంక్రాంతి నేపథ్యంలో అమ్మకాలు పెరిగి లాభాలు వస్తాయని వస్త్ర వ్యాపారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో హస్తకళలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఉప్పాడను ఎంపిక చేసింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఉప్పాడలోని నేతన్నలకు అవసరాల రీత్యా మౌలిక వసతులు కల్పించేందుకు రూ.5 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగం అభివృద్ధి చేయాలనే ఆలోచనతో రాష్ట్రంలోనే గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ మండలాల్లో చేనేత రంగం అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించింది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి పంపారు.

దుకాణంలో ఉప్పాడ పట్టు చీరలు

రూ.100 కోట్ల నుంచి రూ.20 కోట్లకు..

నాలుగేళ్ల క్రితం చేనేత జాంధానీ పట్టు చీరల వ్యాపారం ఏడాదికి సుమారుగా రూ.100 కోట్లు వరకు లావాదేవీలు జరిగేవి. కరోనా మహమ్మారి, అప్పటి ప్రభుత్వ వైఫల్యం కారణంగా అమ్మకాలు ఒక్కసారిగా 90 శాతం పడిపోయాయి. ప్రస్తుతం ఏడాదికి కేవలం రూ.20 కోట్లు మాత్రమే వ్యాపారాలు సాగుతున్నట్లు మాస్టర్ వీవర్స్ చెబుతున్నారు. ముడిసరకు ధరలు అమాంతంగా పెరిగినా చీరల ధరలు పెంచలేక నష్టాలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొంతమంది వ్యాపారం మానుకుని దుకాణాలు మూసేశారు. మరి కొంతమంది నష్టాలను భరిస్తూ సంక్రాంతి సీజన్ కోసం ఎదురుచూస్తున్నారు.

9 నుంచి 12 వరకు 'ఆలోచనల అన్వేషణ'

బొమ్మూరు, న్యూస్‌టుడే: స్థానిక రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో 9 నుంచి 12వ తేదీ వరకు ఆలోచన అన్వేషణ కార్యక్రమం (ఐడియా ఎక్స్‌ప్లోరేషన్ ప్రోగాం) నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి టి.సూర్యప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రారంభ దశ ఫౌండర్లు, ఇన్నోవేటర్లు, విద్యార్థులు, స్టార్టప్ ఆశక్తి ఉన్న వారి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామన్నారు. ప్రారంభదశలో ఉన్న ఆలోచనలను మార్గదర్శకాలతో ఉన్నత స్థితికి చేరడానికి హబ్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ మేఘాస్వరూప్ పాల్గొంటారని తెలిపారు. ఆలోచనలను వ్యాపారంగా మార్చుకోవడానికి ఈ కార్యక్రమం మంచి అవకాశమని పేర్కొన్నారు.

సమన్వయంతో పౌరసేవలు అందించాలి

సూచనలిస్తున్న జిల్లా సచివాలయాల ఇన్‌ఛార్జి అధికారి వీణాదేవి

వి.ఎల్.పురం: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పౌరసేవలు సకాలంలో అందించేందుకు అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి అధికారి పి.వీణాదేవి అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా అందించే పౌరసేవలపై సిబ్బందికి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. వీణాదేవి మాట్లాడుతూ జిల్లాలో 512 సచివాలయాల ద్వారా మొత్తం 4,067 మంది సేవలు అందించడంతో భాగస్వాములు అవుతున్నారన్నారు. విధులు, బాధ్యతలపై సిబ్బందికి సూచనలు చేస్తూ పారదర్శకత, సమర్థత పెంపుదల లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా జీఎస్‌డబ్ల్యూఎస్ కార్యకలాపాల పర్యవేక్షణకు రూపొందించిన వివిధ డాష్‌బోర్డులు, ఆన్‌లైన్ సమీక్ష పద్ధతులపై ఏపీ ఆన్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ కార్యాలయ సూపరింటెండెంట్ చిరంజీవి, జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సహాయ కోఆర్డినేటర్ బాలకృష్ణ, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బంగార్రాజు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు రెండో పర్యాయం ఎన్నికయ్యారు. కడప జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో ఉన్న 39 మంది సభ్యులు ఈ మేరకు తమ నిర్ణయాన్ని ప్రకటించారు. బంగార్రాజు లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. కడపలో ఈ నెల 6న ప్రారంభమైన మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథులుగా పార్టీ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, పొలిట్ బ్యూరో సభ్యుడు స్వదేశ్ భట్టాచార్య, నాయకులు శంకర్, చంద్రమోహన్ తదితరులు హాజరయ్యారు.

భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బోస్

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏలేశ్వరానికి చెందిన బీసీ నాయకుడు పైల సుభాష్‌చంద్రబోస్ ఎంపికయ్యారు. బాధ్యతను అప్పగించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మోర్చా నాయకులు మధుకర్, ఆర్‌పీ శ్రీనివాస్‌లకు ఆదివారం ఆయన కృతజ్ఞతలు చెప్పారు. వార్డు స్థాయి నుంచి భాజపా, అనుబంధ విభాగాలను మరింత బలోపేతం చేస్తానని బోస్ వెల్లడించారు.

జాతీయ స్థాయికి 36 మంది ఎంపిక

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం గొర్లెవానిపాలెంలోని ఇండోర్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 69వ రాష్ట్ర స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో 7 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు రాష్ట్ర అబ్జర్వర్లు శ్రీహరిరాజు, ప్రసాదు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఎం.నాయుడు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ప్రతిభ చాటిన 36 మందినిజనవరి 17 నుంచి 22 వరకు దిల్లీలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరావు, ఏపీ థాంగ్‌టా అసోసియేషన్ అధ్యక్షుడు గొర్లె పుష్పారావు, కార్యదర్శి తులసీరావు తదితరులు పాల్గొన్నారు. బాలికల అండర్-14 విభాగంలో తూర్పుగోదావరికి చెందిన సుదీక్ష ఎంపికైంది. బాలుర అండర్-14 విభాగంలో జిల్లా నుంచి రఫీక్ ఎంపికయ్యాడు.

ఎంపికైన మహిళా జట్టుతో వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

బాస్కెట్‌బాల్ వర్సిటీ జట్టు ఎంపిక

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో ఆదివారం అంతర్ కళాశాలల స్థాయిలో మహిళా క్రీడాకారులకు ఆదివారం బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించి వర్సిటీ జట్టును ఎంపిక చేశారు. వీసీ, ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ క్రీడాకారులు లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి ఎనిమిది జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ నెల 29 నుంచి జనవరి 2 వరకు బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో మహిళా జట్టు పాల్గొంటుందన్నారు. అంతర్ కళాశాలల పోటీల్లో ఏలూరు సెయింట్ థెరిసా, సీఆర్ఆర్, ఆదిత్య మహిళా కళాశాల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌పై వైకాపా తప్పుడు ప్రచారం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై వైకాపా నాయకులు దిగజారుడు విమర్శలు చేస్తున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మహాసేన రాజేష్ పేర్కొన్నారు. ఇండిగో విమానయాన సర్వీసుల విషయంలో తలెత్తిన వివాదానికి సంబంధించి లోకేశ్‌పై బురద జల్లేందుకు వైకాపా బ్యాచ్ తప్పుడు ప్రచారం సాగిస్తోందన్నారు. కాకినాడలోని జిల్లా తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇండిగో సమస్య పరిష్కారానికి లోకేశ్ కృషి చేస్తున్నారని ఇటీవల తెదేపా జాతీయ అధికార ప్రతినిధి దీపక్‌రెడ్డి చెప్పగా, కేంద్ర రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ వైకాపా గోలగోల చేస్తోందని విమర్శించారు. లోకేశ్‌కు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీతో సహా పలు కీలక నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఇండిగో సమస్యను పరిష్కరించేందుకు ఆయన చొరవ చూపితే తప్పేంటని నిలదీశారు. అతితక్కువ కాలంలో రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయిలో నాయకునిగా రాణిస్తున్న లోకేశ్‌ను చూసి ఓర్వలేక వైకాపా నాయకులు విమర్శలు చేస్తున్నారని రాజేశ్ మండిపడ్డారు. సమావేశంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్

పన్ను లావాదేవీలన్నీ స్వర్ణ పంచాయతీలోనే..

చెల్లింపులు సులువుగా...

న్యూస్‌టుడే, గండేపల్లి

ప్రస్తుత పన్నులు, బకాయిల వసూళ్లకు అధికారులు అవస్థలు పడేవారు. మాన్యువల్ పద్ధతిలో రసీదులు ఇవ్వడం కూడా ఇబ్బందిగా ఉండేది. ఇళ్లలో లేనివారు, పనులకు వలస వెళ్లినవారి నుంచి పన్నులు రాబట్టడం ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం పన్నుల వసూళ్లు, సులభతర పద్ధతిలో చెల్లించేందుకు, అధికారులు ఒత్తిడికి గురికాకుండా / స్వర్ణ పంచాయతీ యాప్/ వినియోగంలోకి తెచ్చింది. ప్రస్తుతం పాత, మొండి బకాయిలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు వసూళ్లపై అధికారులు నిమగ్నమయ్యారు.

మీ కోసం

యాప్ వాడొచ్చు ఇలా..

గతంలో పన్ను చెల్లించిన వారికి రసీదులు ఇవ్వడం, వాటికి ప్రత్యేకంగా రికార్డులు ఉండేవి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్వర్ణ పంచాయతీ యాప్‌ను చరవాణిలో గూగుల్ ప్లేస్టోర్‌లో నుంచి సులువుగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత పన్ను చెల్లించాలనుకుంటే అధికారుల చరవాణికి ఫోన్ చేస్తే వారొక లింక్ పంపుతారు దాని ద్వారా పబ్లిక్ లాగిన్‌లోనికి వెళ్లి ఏపీ, జిల్లా, మండలం, పంచాయతీలను ఎంచుకోవాలి. అందులో న్యూ ఎసెస్మెంట్ నంబరు లేదంటే పేరు, లేదా డోర్ నంబరు లేదా, ఓల్డ్ ఎసెస్మెంట్ నంబర్లలోకి వెళ్లాలి. చెల్లింపులకు ఒక ఐచ్ఛికం (ఆప్షన్), సమాచారం నిజమో కాదో తెలిపేందుకు ఒక ఐచ్ఛికం ఉంటాయి. మన ఫోన్ నంబరుతో చెల్లింపు చేసేందుకు ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్, నెట్ బ్యాంకింగ్‌లోకి వెళ్లి పన్ను బకాయిలు తెలుసుకుని నేరుగా చెల్లించొచ్చు. పంచాయతీ అధికారులైతే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో యాప్‌లో లాగిన్నై పన్ను వసూలు చేస్తున్నారు.

పారదర్శకంగా ఉంటుంది

గతంలో పన్నుల చెల్లింపులో అవకతవకలు ఉండేవి. ప్రస్తుత యాప్‌ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులో పారదర్శకత ఉంటోంది. పన్నులు చెల్లించేందుకు ప్రజలు, వసూలు చేసేందుకు అధికారులకు స్వర్ణపంచాయతీ యాప్ సహాయంగా ఉంటోంది.

- రవికుమార్, డీపీవో, కాకినాడ

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బాలుర విభాగంలోని పోటీలు డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో, బాలికల పోటీలను స్థానిక ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. బాలుర విభాగంలో 13, బాలికల విభాగంలో 13 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు ఎస్.సురేష్‌కుమార్, వి.పద్మావతి తెలిపారు.

బాలుర విభాగంలో విజేతలు

చిత్తూరు- శ్రీకాకుళం జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. తూర్పుగోదావరి- వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన పోటీలో 1-0 తేడాతో తూర్పుగోదావరి జట్టు, విజయనగరం- ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్‌లో ప్రకాశం 1-0 తేడాతో గెలిచింది. నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య పోటీలో నెల్లూరు 2-0 తేడాతో గెలిచింది. పశ్చిమగోదావరి- కృష్ణా జట్ల మధ్య పోరులో 0-4 తేడాతో కృష్ణా జట్టు గెలవగా, గుంటూరు- ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు గెలిచింది. తూర్పుగోదావరి- శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. చిత్తూరు- వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైఎస్సార్ కడప గెలిచింది.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 2,721 మంది హాజరు

శ్యామలాసెంటర్: జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్)కు ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. జిల్లాలో 13 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 2,872 మందికి 2,721 హాజరైనట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. ఏడు కేంద్రాలను డీఎస్‌ఈవో పరిశీలించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 98491 38626.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

TO LET

COMMERCIAL

కాకినాడ జిల్లా, పెద్దాపురంలో హారిజెంటల్, వర్టికల్ మిషన్స్ కలిగి ఉన్న సామిల్లు అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి. ✆ 86396 91555.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Wanted Electrical Engineers. Qualified By B.Tech Electrical Engineering, Diploma or ITI Experience 0-3 Years. Place of Work: East and West Godavari Districts, Attractive Salary. Contact: 79950 50571 or Send Resumes To hr@gvsprojectspvtltd.com

కాకినాడ, ROY చెస్ అకాడమీ కోచింగ్ సిబ్బంది కావలెను. అర్హత డిగ్రీ, వ: 35 లోపు, జీ: 15,000, చెస్ లేదా టీచింగ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. ✆ 62815 98466.

జీతం: రూ.15,000/- నుండి రూ.25,000/-, సర్వీస్ అడ్వైజర్ & ఇన్‌చార్జ్ కావలెను. కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి. శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. స్త్రీ వసతి, భోజనం, జీ:20k. ✆ 89776 39662,89776 39663.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. జీతం: రూ.12,000/- నుండి రూ.15,000/- వరకు. Contact: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

వ్యాన్ డ్రైవర్స్ కావలెను. జీతం: రూ.15,000/- + డైలీ రూ.100/-, (వివాహమైన స్థానిక అభ్యర్థులు మాత్రమే). శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. గోకవరం మండలం, పెంటపల్లి గ్రామంలో ఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 7893555551, 9030056553.

హైదరాబాద్‌లో పనిచేయడానికి M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 20,000+ భోజనము + వసతి. ఈ జీతం నెల 20లోపు జాయిన్ అయిన వారికి మాత్రమే. +91 76809 22316.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,500
పాతకాయ: గండేరా	28,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	27,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-50 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

విద్యుత్తు తీగలు తగిలి గడ్డి వ్యాన్ దగ్ధం

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం మునిపల్లి-కలవచర్ల మధ్య ఎండుగడ్డితో వెళ్తున్న వ్యాన్ ఆదివారం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం కోరుపల్లి నుంచి పశ్చిమగోదావరి జిల్లా గణపవరానికి కట్టలు కట్టిన ఎండుగడ్డిని తీసుకుని ఆకుల శ్రీరామకృష్ణకు చెందిన ఐషర్ వ్యాన్ బయలుదేరింది. కోరుపల్లి వద్ద ఈ వ్యాన్‌పై ఉన్న ఎండుగడ్డికి విద్యుత్తు తీగలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. కొంత దూరం వచ్చేసరికి స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో వ్యాన్‌ను ఆపి మంటలు నియంత్రించే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో నిడదవోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోగా, వ్యాన్ క్యాబిన్ కూడా దగ్ధమైంది. ఈ ప్రమాదం కారణంగా సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. ఇదిలా ఉంటే గడ్డి కట్టలు పడి మంటలు వ్యాపించి నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పూర్తిగా పొగతో నిండిపోయింది. ప్రయాణాలు సాగించేవారు ఎగిసిపడుతున్న మంటలకు భయపడి కొద్దిసేపు అక్కడే నిలిచిపోయారు.

దగ్ధమవుతున్న వాహనం

లారీ ఢీకొని మనవడు మృతి

తాత, మరో మనవడికి తీవ్రగాయాలు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: తాతా మనవళ్లు ప్రార్థన మందిరానికి వెళ్తుండగా లారీ మృత్యువులా దూసుకువచ్చి ఢీకొనడంతో ఒక మనుమడు మృతిచెందాడు. మరో మనుమడు, తాత తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఉదయం లాలాచెరువు కూడలి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. బొమ్మూరు పోలీసుల కథనం మేరకు లాలాచెరువు వాంబే కాలనీకి చెందిన వానపల్లి శ్రీనివాసరావు తన మనవళ్లు సత్తి ప్రవీణ్ కుమార్(12), చరణ్‌తేజ్‌లతో కలసి ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి హోసన్నా మందిర్‌కు బయలుదేరారు. లాలాచెరువు సిగ్నల్ పాయింట్ దాటి హెచ్‌పీ పెట్రోలు బంకు వైపు వెళుతుండగా దివాన్‌చెరువు నుంచి మోరంపూడి వైపు వస్తున్న లారీ అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి కొంత దూరం లాక్కెళ్లింది. ప్రవీణ్‌కుమార్ మీద నుంచి లారీచక్రం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాసరావు, చరణ్‌లకు తీవ్ర గాయలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం జీఎస్ఎల్‌కు తరలించారు. ప్రవీణ్‌కుమార్ చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

యువకుడి దుర్మరణం

రాజోలు, న్యూస్‌టుడే: కాలువలోకి కారు దూసుకెళ్లి ఓ యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. రాజోలు మండలం కడలి గ్రామంలో శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రాజోలు ఎస్సై బి.రాజేష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. రాజోలు మండలం ములికిపల్లికి చెందిన కలిగితి శ్యామ్‌తేజ(20) అదే గ్రామానికి చెందిన స్నేహితులు ముప్పల పవన్, మరొకరితో కలిసి శనివారం సాయంత్రం పి.గన్నవరంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచి తాటిపాక వచ్చి హోటల్‌లో బిర్యాని తిని ఇంటికి బయలుదేరారు. కడలి కూడలికి చేరుకున్నాక తాగునీటి సీసా కొనుగోలు చేయడానికి ఇద్దరు దిగారు. అక్కడ శ్యామ్‌తేజ కారు నడపడానికి పవన్ నుంచి స్టీరింగ్ తీసుకున్నాడు. కిందకు దిగిన ఇద్దరు మిత్రులు తిరిగి ఎక్కకుండానే వేగంగా ముందుకు నడిపాడు. కొద్ది దూరం వెళ్లాక రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి మానును ఢీకొట్టి కాలువలోకి కారు పల్టీ కొట్టింది. ప్రమాదాన్ని దూరం నుంచి గమనించిన మిత్రులిద్దరూ వెళ్లి రక్షించే ప్రయత్నం చేశారు. సమీపంలోని ఇళ్లవారిని నిద్రలేపి కారును బయటకుతీశారు. అప్పటికే శ్యామ్‌తేజ మృతిచెందాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి వరుసకు సోదరుడైన నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కలిగితి శ్యామ్‌తేజ (పాత చిత్రం)

స్వగ్రామంలో విషాదఛాయలు

ప్రమాదంలో శ్యామ్‌తేజ మృతి చెందడంతో ములికిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇతని తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉన్నారు. ఇతను తల్లి, సోదరుడితో కలిసి గ్రామంలో ఉంటున్నాడు. గతంలో ఎండీయూ వాహనంలో కార్డుదారులకు రేషన్ సరకులు పంపిణీ చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. గత కొంతకాలం నుంచి ఖాళీగా ఉంటున్నాడు. చేతికి అందొచ్చిన కొడుకు దూరమయ్యాడని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

సైబర్ నేరాలపై అవగాహన

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఆదివారం పిడింగొయ్యి గ్రామంలో వాలంటీర్లు డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వర్మీ కంపోస్ట్ ఎలా తయారు చేయాలో చూపించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి హెచ్. శ్రీరామ్‌పవన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాటా-30, వంకాయలు నలుపు-24/గులాబీ-32/తెలుపు-26/ దొమ్మేరు-36, బెండ-44, కాకర-32, బీర పందిరి-52, దొండ-28, క్యారెట్-45, బీట్ రూట్-42, గోరు చిక్కుళ్లు-40, దోస-24, ఆనబకాయ-24/26, చిక్కుళ్లు-44.

నేడు వినతుల స్వీకరణ

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ప్రజలు పాల్గొని సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

● కోరుకొండ లక్ష్మీనరసింహ ఆలయంలో

స్వామివారు

కోరుకొండ, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాసోత్సవాలు జరుగనున్నాయి. ఈ దేవస్థానంలో తిరుప్పావై ప్రవచనాలు ధనుర్మాసం ప్రత్యేకతను సంతరించుకుంటాయి. స్వామివారి సన్నిధిలో తెల్లవారుజామున నెలరోజులు తిరుప్పావై జరుగుతుంది. ఈనెల రోజులు పలు విశిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 29న నారాయణునికి పంచామృతాభిషేకాలు, 30న ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, కాపరంలో గ్రామోత్సవం, వచ్చేనెల 7న సింహాసన పాశురం, 8న కూడారై ఉత్సవం, మంగళాశాసన పాశురం, దీపోత్సవం, 11న 108 చిన్న గంగాళాలతో పాయసం నివేదన, 13న రంగనాథస్వామివారికి పంచామృతాభిషేకాలు, 14న భోగి రోజున గోదారంగనాథస్వామివారి తిరుకల్యాణ మహోత్సవం జరుగుతాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని 15న పల్లకీసేవ, 16న జంబూపట్నంలో స్వామివారి గ్రామోత్సవం జరుగుతాయి.

శ్రీరంగధామంలో పవిత్రోత్సవాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: గౌతమఘాట్‌లోని శ్రీరంగధామంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రధాన రఘునాథభట్టర్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం హోమం, పూర్ణాహుతి, వేదపారాయణం, కుంభాభిషేకం, తీర్థ యారాధన నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

బాబా ఆలయ వార్షికోత్సవం

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: స్థానిక మంగళవారపుపేటలో కొలువైన శిర్డీ సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. వేకువజాము నుంచే అభిషేకాలు, కాగడ హారతి నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం అఖండ భజన కార్యక్రమం జరిగింది. సుమారు 1,000 మందికి అన్నదానం చేశారు. వార్డు ఇన్‌ఛార్జి శీలం గోవింద, మునిని సంతోష్, సతీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: స్థానిక వీఎల్‌పురం పరిధి అల్లూరి కాలనీలో శ్రీక్షేత్రం మహాగురుస్థానంలో కొలువైన కాలభైరవ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేకువజామున 03.30 గంటలకు 1,080 లీటర్ల జలాలతో అభిషేకించారు.

ఆత్మీయ సమావేశం

టీనగర్: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు ఆధ్వర్యంలో ఆయా వర్గాల ప్రతినిధులతో ఆదివారం జాంపేటలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మత, కుల రహితంగా అందరూ పాల్గొనే అవసరం ఉందన్నారు. నగరాభివృద్ధికి క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరించేందుకు త్వరలో కార్యాచరణ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆళ్ల రామచంద్రరావు, కోమలి శంకర్, నల్లమిల్లి మధుసూదన్ రెడ్డి, రాజ్ జైన్, ఎండీ కరీం తదితరులు పాల్గొన్నారు.

వారికి పట్టదు.. వీరు పట్టించుకోరు..!

నగరంలో ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. దీనిలో భాగంగా నో పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేయనుంది. రద్దీ ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనాలను ఉంచకుండా నిర్ణయించింది. కచ్చితంగా అమలు చేసేందుకు బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. సక్రమంగా అమలు కాకపోవడంతో ఎక్కడపడితే అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నగరంలో ప్రయాణం నరకంగా మారుతోంది. ప్రధాన ప్రాంతాల్లో రాకపోకలు సాగించాలంటే 20 నుంచి 30 నిమిషాల సమయం పడుతుంది. అయినా అటు పోలీసులు, ఇటు మున్సిపల్ యంత్రాంగం చూసీచూడనట్లు వదిలేయడం గమనార్హం. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

దేవీచౌక్ వద్ద నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు

తోపుడు బండ్లకు కేంద్రాలు..

రోడ్డుపై వ్యాపారాలు చేసే తోపుడు బండ్లకు వ్యాపార కేంద్రాలను నిర్ణయించారు. ఇవన్నీ పక్కన పెట్టి ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కార్ల విషయంలో నేరుగా దుకాణాల వద్ద గంటల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. ఇదంతా చూసి చూడనట్లు వ్యవహరించడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ..

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 180 సీసీ కెమెరాలు నిరంతరం రహదారి మార్గాలను పర్యవేక్షిస్తుంటాయి. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంది. ఆ క్రమంలో అనధికార పార్కింగ్ వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవడం ద్వారా పార్కింగ్ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభిస్తుంది. ఇప్పటికైనా యంత్రాంగం దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఇవన్నీ రెడ్‌జోన్లు..

నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు నగరపాలక సంస్థ జోన్ల విధానం అమలుచేస్తోంది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో రెడ్‌జోన్లను గుర్తించారు. దానవాయి పేట, ప్రకాశంనగర్, కంబాలచెరువు, దేవీచౌక్, మెయిన్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్, జాంపేట, తాడితోట తదితర చోట్ల వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకూడదు. ప్రత్యేకంగా స్థలాలను కేటాయించారు. అక్కడ మాత్రమే ఉంచాలి.

● కాస్త రద్దీగా ఉన్న ప్రాంతాలను ఇక ఎల్లో జోన్లుగా గుర్తించారు. అక్కడ ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

● రద్దీ లేని ప్రాంతాలను గ్రీన్ జోన్లుగా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతంలో ఎక్కడైనా పార్కింగ్ చేసే అవకాశం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ॥ 10 - మ॥ 1
83282 39927
80089 02897

స్పందనకు వందనం

నగరంలోని వివిధ సమస్యలపై 'మేమున్నాం.. మీకుతోడుగా'కు అందిన ఫిర్యాదులను నగరపాలక సంస్థ సంబంధిత భాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

● స్థానిక ఆర్యాపురం రెడ్డీలపేట జంక్షన్ వద్ద రోడ్డు వెంబడి గత పదిరోజులుగా ఉన్న పూడిక మట్టి గుట్టలను పారిశుద్ధ్య సిబ్బంది తరలించినట్లు ఫిర్యాదుదారుడు కామేశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమస్య: స్థానిక తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆవవాంబే కాలనీలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడి గృహసముదాయంలోని పై బ్లాకుల్లోని ఫ్లాట్‌లకు నీరు అందట్లేదు. కొళాయిలకు నీటి సరఫరా సమయం కూడా పెంచాలి. - కుమార్, స్థానికుడు

సమస్య: దేవిచౌక్ వద్ద లలితా జ్యువెలరీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద తాగునీటి పైపులైను లీకై నాలుగు రోజులుగా నీరు వృథాగా పోతుంది. పైపులైను మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి. - రాజు, స్థానికుడు

సమాధానం: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - తాగునీటి సరఫరా విభాగం అధికారి, ఆర్ఎంసీ

సమస్య: స్థానిక విద్యానగర్, లలితానగర్ ప్రాంతాల్లో కార్మికులు రహదారులపై చెత్త తొలగించడం లేదు. - కుమార్, శిరీష

సమాధానం: సిబ్బందిని పంపిస్తాం. తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - ఎంహెచ్‌వో, వినూత్న

– న్యూస్‌టుడే, టి.నగర్

కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజా సంక్షేమమే లక్ష్యం

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా 40వ డివిజన్‌లో కొల్లి నాని ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపులో భాగంగా 136 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. అందులో భాగంగా ఆదివారం వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శిబిరం నిర్వాహకులను అభినందించారు. ప్రజా అవసరాలను గుర్తించి, పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ద్వారా చదువులో రాణిస్తూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అన్ని విధాల అండగా ఉంటామని ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం గోదావరిగట్టున ఉన్న మల్లిగ సత్రంలో 2024-25 ఏడాదికి సంబంధించి 100 మంది విద్యార్థులకు రూ.5లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ట్రస్ట్ కార్యవర్గం దంతుర్తి ప్రసాద్, గాడేపల్లి సత్యనారాయణమూర్తి, చీమలకొండ వీరప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. దంతుర్తి ప్రసాద్ మాట్లాడుతూ తన అన్న కుమారుడు దంతుర్తి వీరభద్రం అమెరికాలో ఉద్యోగం చేస్తూ తన మిత్రబృందం సహకారంతో ఏటా ఉపకార వేతనాలు సమకూర్చుతున్నారన్నారు. ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం పొందిన పిల్లలు ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. రేగడమిల్లి రామ్‌దేవ్‌శర్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారిపై దాడి.. చర్యలకు డిమాండ్

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: నిడదవోలు నుంచి అమలాపురం వెళ్తున్న కోనసీమ జిల్లాకు చెందిన సమాచార శాఖ అధికారి సి. హెచ్. శ్రీనివాస్‌పై రాజమహేంద్రవరంలో జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆర్టీసీ బస్సు ఫుట్‌పాత్ వద్ద ప్రయాణికులకు అడ్డుగా ఉండొద్దని చెప్పినందుకు ఆయనపై ఆరుగురు విద్యార్థులు దాడి చేయడం హేయమైన చర్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. దీనిపై కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తక్షణం విచారణ జరిపించాలని కోరింది. భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని ఆదివారం విజ్ఞప్తి చేసింది.

ఆకట్టుకున్న సంగీత విభావరి

ఏవీఏ రోడ్డు: నగరంలోని విక్రమహాలులో ఆదివారం సాయంత్రం స్వర నీరాజనం సింగర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. సింగర్స్ ఐక్య వేదిక అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ఆకట్టుకుంది. వారాంతం కావడంతో నగరవాసులు పెద్దఎత్తున హాజరై పాల్గొన్నారు. ఆర్గనైజర్‌గా గోవిందరావు వ్యవహరించారు.

ఉచిత వైద్యశిబిరం

ఏవీఏ రోడ్డు: స్థానిక 27వ వార్డు ఇన్నీసుపేట సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద శెట్టిబలిజ కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ బట్లంకి ప్రకాష్, సబ్బెళ్ల దుర్గారెడ్డి హాజరయ్యారు. వైద్య శిబిరంలో మదర్ మల్లీ స్పెషాలిటీ ఆసుపత్రి, డా.మోహన్ డయాబెటిక్, గౌతమీ నేత్రాలయం, శ్రీరామా దంత వైద్యశాల వారు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సుమారు 1,000 మంది సద్వినియోగం చేసుకున్నారు. వనుం తాతారావు, రామకృష్ణ, సింహాద్రి, కన్నారావు తదితరులు పర్యవేక్షించారు.

ఆదమరిస్తే కాలువలోకే..

నగరంలోని హైటెక్ బస్టాప్ నుంచి టీటీడీ కల్యాణ మండపానికి వెళ్లే రోడ్డులో ఎస్‌కేవీటీ కళాశాల గేటు ఎదురుగా కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఏ క్షణమైనా కూలే ప్రమాదం ఉందని స్థానికులు, ద్విచక్రవాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మరమ్మతులు చేసినా మళ్లీ అదే పరిస్థితి. శాశ్వత పరిష్కారం చూపాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కోటగుమ్మం

పైపు పగిలి.. తాగునీరు వృథా

కంబాలచెరువు ఎస్‌బీఐ కూడలిలో రహదారి అంతర్గత పైపు నుంచి నీరు వృథాగా పోతోంది. వాణిజ్య సముదాయాలు, కార్యాలయాలు ఎక్కువగా ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అక్కడ నీరు నిలిచి వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటగుమ్మం

చీకటి పడితే ఆందోళనే..

దానవాయిపేట ప్రాంతంలోని పలు వీధుల్లో రాత్రిపూట దీపాలు వెలగట్లేదు. గత ఘటనల దృష్ట్యా రాత్రి సమయం రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతంలో ఇలాంటి పరిస్థితి నెలకొనడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

నడకదారిలో కుంగిన పలక

స్థానిక కంబాలచెరువు వివేకానంద జంక్షన్ వద్ద నడకదారిలో ఉన్న స్లాబు కుంగి ప్రమాదకరంగా ఉంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న స్లాబులు కుంగిపోవడం లేదా దెబ్బతిని ఉన్నాయి. చాలకాలం నుంచి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా స్లాబులను సరిచేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దేవీచౌక్

ప్రతిభావంతులకు కళాసేవా పురస్కారాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: చల్లగాలి శ్రీనివాస్‌వర్మ నిర్వహణలో ప్రతి నెలా అందిస్తున్న కళాసేవా పురస్కార కార్యక్రమం సరస్వతీఘాట్‌లో జరిగింది. ఆరుగురు విశిష్ట వ్యక్తులకు శోభిత్‌వర్మ శోభాయమాన పురస్కారాలు అందించి సత్కరించారు. ఇంద్రజాలకుడు వి.వి.రమణ ఇంద్రజాల ప్రదర్శనతో మంత్రముగ్ధులను చేశారు. నగరపాలకసంస్థ ఇంజినీర్ షేక్ మదర్సా ఆలీ, కమాండెంట్ ఎస్పీ కొండ నరసింహారావు, చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు, నఖ చిత్రకారుడు రవి పరస, కానిస్టేబుల్ కొరిమి కృష్ణమూర్తి, భమిడిపాటి రాధాకృష్ణ తదితరులను సత్కరించారు. బి.రమాదేవి, సింహాద్రి కోటిలింగేశ్వరరావు, కృష్ణమాచారి ప్రసాద్, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు, దుప్పట్లు అందిస్తున్న రాజబాబు

వికాస్ సొసైటీ సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నిరుపేద వృద్ధులకు ప్రతినెలా ఆర్థిక చేయూత అందిస్తూ, అండగా నిలుస్తున్న వికాస్ సొసైటీ సేవలు అమూల్యమని ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సిద్దెల రాజబాబు ప్రశంసించారు. వీఎల్‌పురం పార్కులో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజబాబు చేతుల మీదుగా 150మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున ఆర్థికసాయం, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధులకు సాయం చేస్తున్న యార్లగడ్డ ప్రభాకర్ ఆదర్శనీయుడన్నారు. సొసైటీ నిర్వాహకుడు ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల 17న వృద్ధుల క్రిస్మస్ వేడుక నిర్వహిస్తామని తెలిపారు. కంటిపూడి రాజేంద్ర, కె.శ్రీనివాస్, దుళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత తోడుగా.. నేర్చుకో చకచకా..

ట్యాబ్‌లతో ఉపాధ్యాయులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థ సంస్కరణలో భాగంగా కూటమి ప్రభుత్వం పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను చదువులో ముందుకు తీసుకువెళ్లేలా ఈ ల్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి. రాజమహేంద్రవరం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు పీఎంశ్రీ పాఠశాలలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పాల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో చదువుతో పాటు ల్యాబ్‌లోనూ పాఠాలు నేర్చుకుంటూ నైపుణ్యాలు పెంచుకోవచ్చు.

ఉపాధ్యాయులకు శిక్షణ: పీఎంశ్రీ పాఠశాలలో ఒక ప్రత్యేక గదిని ఈ పాల్‌ల్యాబ్‌కు కేటాయించారు. ఇందులో 30 చొప్పున ట్యాబ్‌లు, హెడ్‌ఫోన్లు సమకూర్చారు. వీటి వినియోగంపై ఉపాధ్యాయులకు రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల శిక్షణ ఇచ్చారు. ఈ ట్యాబ్‌లతో విద్యార్థులకు మరిన్ని సాంకేతిక పాఠాలు అందించనున్నారు.

పాల్ ల్యాబ్‌లతో ఎంతో ప్రయోజనం..

హైస్కూళ్లలోని 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులను వారి స్థాయి ఆధారంగా నేర్చుకునేలా ఈ పాల్ ల్యాబ్‌లను ప్రవేశపెట్టారు. అక్షరాలు సైతం రాయలేని వారికి ఇవి ఉపకరిస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు, ఆంగ్లం, గణితం పాఠాల్లో రాణించడానికి ఇవి వినియోగపడుతున్నాయి. పిల్లలు ఈ ట్యాబ్‌లోనే పరీక్షలు రాసి వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారు. వెనుకబడిన వారిని చక్కగా తీర్చిదిద్ది 10వ తరగతికి అన్ని విధాలా సిద్ధం చేసేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని పాల్ ల్యాబ్ జిల్లా కోఆర్డినేటర్ నెహ్రూ తెలిపారు. వీటిని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

పరిశీలిస్తున్న జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు

హోటల్‌లో అగ్నిప్రమాదం

కంబాలచెరువు, ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని కుమారి థియేటర్ సమీపంలో ఓ హోటల్‌లో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. హోటల్‌లోని వంటగదిలో పొయ్యి వద్ద నిప్పురవ్వలు చెలరేగాయి. ఇన్నీసుపేట అగ్నిమాపక యంత్రం ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.25 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని, ఎలాంటి ఇబ్బంది కలగలేదని జిల్లా సహాయ అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పక్కనే గ్యాస్ గొడౌన్ ఉంది. ఏమాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. పెద్ద ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వసతిగృహ విద్యార్థినులకు రగ్గుల పంపిణీ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: శారదామాత జయంతి సందర్భంగా రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న సమీకృత బీసీ బాలికల వసతిగృహంలోని 160 మంది విద్యార్థినులకు చాపలు, రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వామీజీలు, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి శశాంక, సహాయ సంక్షేమాధికారి సుబ్బారావు, వార్డెన్ సూర్యకుమారి పాల్గొన్నారు. బాల్య దశలోనే లక్ష్యాలను పెట్టుకుని, సాధించేలా కృషి చేయాలన్నారు.

వాలంటీర్ల శ్రమదానం

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఆదివారం ఉదయం రెడ్‌క్రాస్ సొసైటీ భవన ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కలుపు మొక్కలను తొలగించి క్రోటన్స్, పూలమొక్కలను నాటారు. ఆవరణలో పేరుకున్న చెత్తను తుడిచి శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్.నాగేశ్వరరావు, బి.రమాదేవి, ఎన్.మహేశ్వరి, పోలుకొండ సాయి, పి.వి.ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

గోదారమ్మకు హారతి

రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో గోదావరి నిత్య హారతి ఉత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం వేదపండితులు ముందుగా గోదావరి మాతకు పూజలు నిర్వహించి 14 రకాల హారతులను గోదారమ్మకు సమర్పించారు. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో హాజరై వేడుక తిలకించారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

మహారాజశ్రీ అప్పిలెట్ అథారిటీ టు ఆంధ్ర టెనెన్సీ యాక్ట్ Cum ప్రిన్సిపల్ జిల్లా జడ్జీవారి కోర్టు: తూర్పు గోదావరి: రాజమహేంద్రవరం

A.T.A. No: 6/2024

Between
1) గాడి నాగభూషణం
2) గాడి భీమ్ - అప్పిలెంట్లు

మరియు

1) సముదాయపాలెపు పార్థసారథి (Died)
2) సముదాయపాలెపు మణికుమారి వగైరాలు ..రెస్పాండెంట్లు

To
R4) ఎండ్రి పుణ్యవతి, W/o సుదర్శన సునీల్, హిందు, వయస్సు 42 సం॥, D.No: 86-4-13/7, తిలక్ రోడ్, V.L.పురం, రాజమహేంద్రవరం
R5) E.సుదర్శన సునీల్, S/o బాబురావు, హిందు, వయస్సు 44 సం॥, వ్యాపారం, D.No. 86-4-13/7, తిలక్ రోడ్, V.L.పురం, రాజమహేంద్రవరం

ప్రకటన

పై నెంబరు అప్పీలు గ్రంథములో 4వ రెస్పాండెంటు ఎండ్రి పుణ్యవతి గారికి 5వ రెస్పాండెంటు అయిన సుదర్శన సునీల్ అనువార్లకు పై అప్పీలు, గ్రంథములో ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారు నోటీసులు పంపినను అమలు జరగనందున, పై అప్పీలు, గ్రంథము పైకోర్టులో ది.12-12-2025 తేదీకు సదరు 4, 5 రెస్పాండెంట్లు హాజరు నిమిత్తం వాయిదా అయివున్నదని, పై అప్పీలు గ్రంథములో సదరు 4, 5 రెస్పాండెంట్లకు ఏమైనా ఆక్షేపణలున్నయెడల పై తేదీన ది.12-12-2025 తేదీ ఉ॥ 10.30 ని॥ లగాయితూ పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెనని, లేనియెడల పై అప్పీలు గ్రంథం సదరు 4, 5 రెస్పాండెంట్లు పరోక్షమందు శ్రీ కోర్టువారు తీర్మానించుదురని యీ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టువారి అనుమతితో

రాజమండ్రి, 7-12-2025. శ్రీ CH.వెంకటేశ్వరరావు, అడ్వకేట్ ప్రకాష్‌నగర్, రాజమండ్రి

మహారాజశ్రీ అప్పిలెట్ అథారిటీ టు ఆంధ్ర టెనెన్సీ యాక్ట్ Cum ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు: తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం

IA No:1220/2024 ATA No: 6/2024

Between:
1) గాడి నాగభూషణం
2) గాడి భీమ్ ... పిటీషనర్లు/అప్పిలెంట్లు

మరియు

1) సముదాయపాలెపు పార్థసారథి (Died)
2) సముదాయపాలెపు మణికుమారి వగైరాలు ...రెస్పాండెంట్లు/రెస్పాండెంట్లు

To
R4) ఎండ్రి పుణ్యవతి, W/o సుదర్శన సునీల్, హిందు, వయస్సు 42 సం॥, D.No: 86-4-13/7, తిలక్‌రోడ్, V.L.పురం, రాజమహేంద్రవరం
R5) E.సుదర్శన సునీల్, S/o బాబురావు, హిందు, వయస్సు 44 సం॥, వ్యాపారం, D.No: 86-4-13/7, తిలక్‌రోడ్, V.L.పురం, రాజమహేంద్రవరం

ప్రకటన

పై నెంబరు అప్పీలు గ్రంథములో పిటీషనర్లు ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుతూ దాఖలు చేసిన IA No: 1220/2024 పిటీషనులో 4వ రెస్పాండెంట్ ఎండ్రి పుణ్యవతి, 5వ రెస్పాండెంట్ సుదర్శన్ సునీల్ అనువార్లకు శ్రీకోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినను అమలు జరగనందున పై అప్పీలు గ్రంథములో IA No: 1220/2024లో సదరు 4, 5 రెస్పాండెంట్లు హాజరు నిమిత్తం ది. 12-12-2025 తేదీకు వాయిదా అయివున్నదని పై అప్పీలు గ్రంథములోని IA No:1220/2024 పిటీషనులో 4, 5 రెస్పాండెంట్లకు ఏమైనా ఆక్షేపణలున్నయెడల పై తేదీన 12-12-2025 ఉ॥ 10.30 ని॥ లగాయితూ పైకోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెనని, లేనియెడల పై ఇంజక్షన్ పిటీషను IA No:1220/2024 సదరు 4, 5 రెస్పాండెంట్ల పరోక్షమందు శ్రీకోర్టువారు తీర్మానించుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టువారి అనుమతితో

రాజమండ్రి, Dt: 7-12-2025. CH. వెంకటేశ్వరరావు, అడ్వకేట్ ప్రకాష్‌నగర్, రాజమహేంద్రవరం

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

గోదారమ్మకు హారతి

రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో ఆదివారం సాయంత్రం వేదపండితులు గోదావరి మాతకు పూజలు నిర్వహించి 14 రకాల హారతులను సమర్పించారు. నెలపురోజు కావడంతో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వీక్షించారు.
- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

నేడు కోటసత్తెమ్మ గరగోత్సవం

నిడదవోలు, న్యూస్‌టుడే: కోటసత్తెమ్మ వారి తిరునాళ్లు ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ ఆవరణలో వివిధ మేళాలతో భారీ ఎత్తున గరగోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా సన్నాయి మేళాలు, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు, కేరళ చండా మేళం, కాళికా నృత్యం, కోలాటాలు, పౌరాణిక నాటకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం అమ్మవారిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

వీధి దీపం వెలగక ఇక్కట్లు

సమస్య: బొమ్మూరు రాఘవేంద్రనగర్ మూడో వీధిలో వీధి దీపం రెండు రోజుల నుంచి వెలగడం లేదు. చీకటిలో కుక్కల సంచారంతో స్థానికులు భయపడుతున్నారు. - సంతోష్

సమాధానం: మరమ్మతులు చేయించి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- కాశీ, గ్రామకార్యదర్శి, బొమ్మూరు
- న్యూస్‌టుడే, బొమ్మూరు

ఉపకార వేతనాలు అందజేత



ఉపకార వేతనాలు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ద్వారా చదువులో రాణిస్తూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అన్ని విధాల అండగా ఉంటామని ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం గోదావరిగట్టున ఉన్న మల్లిగ సత్రంలో 2024-25 ఏడాదికి సంబంధించి 100 మంది విద్యార్థులకు రూ.5 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ట్రస్ట్ కార్యవర్గం దంతుర్తి ప్రసాద్, గాడేపల్లి సత్యనారాయణమూర్తి, చీమలకొండ వీరప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. దంతుర్తి ప్రసాద్ మాట్లాడుతూ తన అన్న కుమారుడు దంతుర్తి వీరభద్రం అమెరికాలో ఉద్యోగం చేస్తూ తన మిత్రబృందం సహకారంతో ఏటా ఉపకార వేతనాలు సమకూర్చుతున్నారన్నారు. ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం పొందిన పిల్లలు ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. రేగడమిల్లి రామ్‌దేవ్‌శర్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మోరంపూడి, న్యూస్‌టుడే: ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జరిగిన 3వ గోదావరి బాలోత్సవాల పోటీల్లో ధవళేశ్వరం శ్రీశివానంద పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల ఛైర్మన్ బండారు లక్ష్మి తెలిపారు. సైన్స్ ప్రయోగాల పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలతోపాటు మొత్తం 12 బహుమతులు గెలుచుకున్నారని చెప్పారు. విజేతలను అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఆదివారం పిడింగొయ్యి గ్రామంలో వాలంటీర్లు డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వర్మీ కంపోస్ట్ ఎలా తయారు చేయాలో చూపించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి హెచ్. శ్రీరామ్‌పవన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

వెదజల్లు సాగు.. దిగుబడి బాగు

న్యూస్‌టుడే - అనపర్తి గ్రామీణం, పెదపూడి

అవగాహన కల్పిస్తున్న అధికారులు

రబీలో వెదజల్లు సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరుగుతుండటంతో అన్నదాతలు ఈ విధానంపై ఆసక్తి కనబరుస్తున్నారు. దీంట్లో కలుపు సమస్య ఉన్నప్పటికీ ఖర్చులు తగ్గుతాయని అధికారులు సూచిస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో సుమారు 44 వేల ఎకరాల్లో రబీ వరి సాగు చేపట్టడానికి రైతులు సిద్ధమయ్యారు.

తక్కువ నీటి వినియోగం..

రబీలో సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది. వెదసాగులో ఎకరా వరి పంటకు 1,250 మి.మీ నీరు సరిపోతుంది. నాట్లు వేసిన చేలో వినియోగించే నీటితో పోలిస్తే వెదసాగులో మూడు ఎకరాలకు వాడుకోవచ్చు. మొక్కలకు వేసిన పాస్ఫరస్ బాగా అందుతుంది. పంటను తెగుళ్లు ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది. వెదసాగులో కేవలం దమ్ము దశ నుంచే నీటిని వాడుకుని తరువాత పంటకు ఆరుతడులు సరిపోతాయి. మొక్కకు పెట్టిన నీరు చాలా వరకు వేళ్లుకొనేందుకు అవకాశం ఉంది. పంట సకాలంలో చేతికి అందుతుంది.

మండలాల వారీగా సాగు విస్తీర్ణం ఎకరాల్లో..	
మండలం	విస్తీర్ణం
పెదపూడి	17,865
అనపర్తి	8,950
బిక్కవోలు	15,041
రంగంపేట	2,508

పెదపూడిలో వెదజల్లు సాగులో పొలం

విత్తన శుద్ధి చేసుకోవాలి

ముందుగా విత్తన శుద్ధి చేసుకోవాలి. దీనివల్ల విత్తనాల్లో ఉన్న కొన్ని శిలీంద్రాలు నాశనమవడమేగాక పైరు ఏపుగా పెరుగుతుంది. కిలో విత్తనానికి 8 గ్రాముల సుడోమోనాస్ లేదా 3 గ్రాముల బావిస్టిన్ కలిపి 24 గంటలు ఉంచిన తరువాత నానబెట్టుకోవాలి. మేలు చేకూరే వెదజల్లు సాగునే ఎంచుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పెదపూడి మండలంలో సుమారు 70 శాతం వరకు వెదజల్లు సాగు చేపడుతున్నారు. - కె.సత్యప్రసాద్, వ్యవసాయాధికారి, పెదపూడి

గోకవరంలో హిందూ సమ్మేళనం

గోకవరం, న్యూస్‌టుడే: స్థానిక గుబ్బాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రముఖ్ కొత్తా రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూ సమాజం బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో దేశాబత్తుల సత్యనారాయణ, కంచర్ల సూర్యప్రకాష్, దాసరి తమ్మనదొర, చినబాబు, సుంకర వెంకటరమణ, పులపర్తి బుజ్జి, బత్తుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ సీఐగా సత్యనారాయణమూర్తి

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ సీఐగా సింగంపల్లి సత్యనారాయణ మూర్తి నియమితులయ్యారు. విజయవాడ నుంచి బదిలీపై వస్తున్న ఆయన సోమవారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు సీఐగా విధులు నిర్వర్తించిన వై.సత్యకిషోర్ ఏలూరు వీఆర్‌కు వెళ్లనున్నారు.

వాలంటీర్ల శ్రమదానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఆదివారం ఉదయం రెడ్‌క్రాస్ సొసైటీ భవన ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కలుపు మొక్కలను తొలగించి క్రోటన్స్, పూలమొక్కలను నాటారు. ఆవరణలో పేరుకున్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్.నాగేశ్వరరావు, బి.రమాదేవి, ఎన్.మహేశ్వరి, పోలుకొండ సాయి, పి.వి.ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర

కోరుకొండ, న్యూస్‌టుడే: పలుగ్రామాల్లో అమ్మవారి జాతరలు ఆదివారం వైభవంగా జరిగాయి. మధురపూడిలో కనకదుర్గమ్మను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి, భాజపా రాజానగరం ఇన్‌ఛార్జి నీరుకొండ వీరన్నచౌదరి, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు. శ్రీరంగపట్నం వెళ్లే రహదారి, గాదరాడ దుర్గానగర్‌లో అమ్మవార్ల జాతరలు ఘనంగా నిర్వహించారు.

రంగంపేట: జి.దొంతమూరులో కనకదుర్గమ్మ ఆలయ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాజానగరం: చక్రద్వారబంధం-సూర్యారావుపేట గ్రామాల మధ్య ఉన్న కనకదుర్గమ్మ వార్షికోత్సవ సందర్భంగా తీర్థం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్దఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి బారులుదీరారు. అమ్మవారిని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ నీలపాల అరవరాజు, సొసైటీ అధ్యక్షుడు దొరబాబు దర్శించుకున్నారు.

మధురపూడిలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం: కనకదుర్గమ్మ ఆలయంలో రుడా ఛైర్మన్ వెంకటరమణచౌదరి

కోరుకొండ నరసన్న ఆలయంలో...

● 16 నుంచి ధనుర్మాసోత్సవాలు

లక్ష్మీనరసింహస్వామి

కోరుకొండ, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాసోత్సవాలు జరగనున్నాయి. ఈ దేవస్థానంలో తిరుప్పావై ప్రవచనాలు ధనుర్మాసం ప్రత్యేకతను సంతరించుకుంటాయి. స్వామివారి సన్నిధిలో తెల్లవారుజామున నెలరోజులూ తిరుప్పావై జరుగుతుంది. ఈనెల రోజులు పలు విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 29న నారసింహునికి పంచామృతాభిషేకాలు, 30న ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, కాపవరంలో గ్రామోత్సవం, వచ్చేనెల 7న సింహాసన పాశురం, 8న కూడారై ఉత్సవం, మంగళాశాసన పాశురం, దీపోత్సవం, 11న 108 చిన్న గంగాళాలతో పాయసం నివేదన, 13న రంగనాథస్వామివారికి పంచామృతాభిషేకాలు, 14న భోగి రోజున గోదారంగనాథస్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం జరుగుతాయి. ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని 15న పద్మనాభనగరం, 16న జంబూపట్టంలో స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

అనపర్తి గ్రామీణం: ఆరోగ్యంతోపాటు ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని తితిదే కల్యాణ మండపంలో జపాన్ షుటోకాన్ కరాటే-దూ కన్నిన్‌జుకు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటల్‌జీ రాష్ట్రస్థాయి కరాటే పోటీలను ఆదివారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. శ్యాంప్రసాద్‌ముఖర్జీ, దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయీ చిత్రపటాలకు నివాళి అర్పించారు. మార్కుల ప్రాతిపదికగా తల్లిదండ్రులు చదివిస్తున్నారని, క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చేలా పిల్లల జీవన విధానాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి. నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, గోదావరి తూర్పు డెల్టా కమిటీ ఛైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు ఉపేంద్రరెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు.

పోటీని వీక్షిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, తదితరులు

ఎట్టకేలకు విద్యుత్తు స్తంభం ఏర్పాటు

రంగంపేట, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావానికి నేలకూలిన 11 కేవీ విద్యుత్తు స్తంభం స్థానంలో ఆదివారం కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. స్తంభం పాడైపోయి నెలరోజులు దాటుతున్నా పట్టించుకోకపోవడంపై 'ఈనాడు'లో ఆదివారం 'స్తంభం పడి నెల.. పట్టించుకుంటే ఒట్టు' శీర్షికన ప్రచురితమైంది. స్థానికులు కూడా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. దీనిపై స్పందించిన అధికారులు కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్తు లైన్‌ను పునరుద్ధరించారు.

రోడ్డుపైకి నీరు.. తప్పని అవస్థలు

ప్రధాన రహదారిపై నుంచి పారుతున్న నీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రంప యర్రంపాలెం నుంచి పెంటపల్లి వెళ్లే దారిలో పాండవుల మెట్టుకు వెళ్లే కూడలి వద్ద ఈ పరిస్థితి నెలకొంది. ఇక్కడ తూరలు ఏర్పాటు చేయకపోవడంతో కాలువ నీరు చెరువులకు నేరుగా రోడ్డుపై నుంచే ప్రవహిస్తుంది. దీంతో పాటు మురుగు చేరడంతో ప్రధాన రహదారిపై నీరు నిలుస్తుంది. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తరచూ అదుపు తప్పి పడిపోతున్నారు. ఇక్కడ తూరలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోకవరం

తెలుగు విశ్వవిద్యాలయంలో అంధకారం

బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వీధి దీపాల కొరత ఉంది. 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వీధి దీపాలు తుప్పు పట్టాయి. వైరింగ్ పూర్తిగా దెబ్బతింది. సాయంత్రం ఆరు దాటితే అంధకారం అలుముకుంటుంది. రాత్రి వేళల్లో ఆకతాయిలు అక్కడే మద్యం తాగుతున్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మరోమార్గం గుండా పగటి వేళ కొంతమంది లోపలికి చొరబడుతున్నారని వాచ్‌మ్యాన్ చెబుతున్నారు. సమస్యపై వీసీ మునిరత్నంనాయుడు స్పందిస్తూ విశ్వవిద్యాలయంలో వసతుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామన్నారు. నిధుల లభ్యతను బట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, బొమ్మూరు

గుంతల దారిలో ఇక్కట్లు

మోరంపూడి నుంచి గాడాలమ్మనగరకు వెళ్లే ప్రధాన రహదారి మొత్తం కంకర లేచిపోయి పెద్ద గుంతలు పడిపోయింది. వాహన చోదకులు, స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక పలువురు వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మోరంపూడి

వసతిగృహ విద్యార్థినులకు రగ్గుల పంపిణీ

వి.ఎల్.పురం: శారదామాత జయంతి సందర్భంగా రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న సమీకృత బీసీ బాలికల వసతిగృహంలోని 160 మంది విద్యార్థినులకు చాపలు, రగ్గులు పంపిణీ చేశారు. రామకృష్ణ మఠం స్వామీజీలు, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి శశాంక, సహాయ సంక్షేమాధికారి ముత్యాల సుబ్బారావు, వార్డెన్ సూర్యకుమారి పాల్గొన్నారు.

అధికారిపై దాడి.. చర్యలకు డిమాండ్

వి.ఎల్.పురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన సమాచార శాఖ అధికారి సి. హెచ్.శ్రీనివాస్‌పై రాజమహేంద్రవరంలో ఆరుగురు విద్యార్థులు దాడి చేయడంపై రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆర్టీసీ బస్సు ఫుట్‌పాత్‌పై ప్రయాణికులకు అడ్డుగా ఉండొద్దని చెప్పినందుకు దాడి చేయడం హేయమని ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

యువతి అదృశ్యం

ధవళేశ్వరం: యువతి అదృశ్యంపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.రమేష్ తెలిపిన వివరాల మేరకు శాటిలైట్ సిటీ గౌతమీనగర్ డీబ్లాక్‌లో నివాసం ఉంటున్న ఓ యువతి ఇంటర్మీడియట్ వరకు చదివింది. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెదికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

బిక్కవోలు, న్యూస్‌టుడే: ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బలభద్రపురం గ్రామానికి చెందిన బందం సుభద్ర (64) ఆదివారం మృతి చెందారు. గత నెల 28న గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శస్త్రచికిత్స చేశారు. అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమెకు సంతానం లేదు. భర్త అప్పారావు వృద్ధుడు కావటంతో మంచానికే పరిమితమయ్యారు. సేవలందించే భార్య మరణించటంతో ఆసరా కోల్పోయానని ఆయన విలపిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

బాల్యం వికసించాలి.. ఆరోగ్యంగా ఉండాలి

● వంద రోజులపాటు ప్రచారం

అవగాహన కల్పిస్తున్న పీడీ శ్రీదేవి

బిక్కవోలు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం వంద రోజుల కార్యక్రమం చేపట్టింది. గత నెల 27న ప్రారంభమైన ఈ కార్యక్రమం మార్చి 8 వరకు కొనసాగనుంది. ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమన్వయంతో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మహిళలతో జరిగే సమావేశాల వద్దకు ఐసీడీఎస్ సిబ్బంది వెళ్లి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులు, హాజరైన వారిపై ఎలాంటి కేసులు ఉంటాయో వివరిస్తున్నారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు దాటకుండా వివాహం చేస్తే శిక్షార్హంగా పరిగణిస్తారు.

విద్యార్థులకు అవగాహన..

విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేయడం, తరగతి గదుల్లో పోస్టర్లు ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నారు. అవకాశం ఉన్నచోట తల్లిదండ్రులను పిలిచి బాల్య వివాహాల వల్ల అనర్థాలను వివరిస్తున్నారు. మత పెద్దల సహకారంతో ప్రార్థన మందిరాల వద్ద, కల్యాణ మండపాల వద్ద కూడా ప్రచారం నిర్వహించనున్నారు.

ఈ ఏడాది జిల్లాలో 8 కేసులు..

ఈ ఏడాది జిల్లాలో బాల్య వివాహాలపై 8 కేసులు నమోదు చేశారు. కడియం, గోకవరం, రంగంపేట తదితర మండలాల్లో ఈ కేసులు నమోదు అయ్యాయి. 110 బాల్య వివాహాలు జరగకుండా నిరోధించగలిగారు.

ముమ్మరంగా ప్రచారం

బాల్య వివాహాలపై ప్రచారం ముమ్మరంగా చేస్తున్నాం. వివిధ శాఖల సహకారం కూడా తీసుకుంటున్నాం. ఇటీవల పాఠశాలల్లో నిర్వహించిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల్లోనూ ప్రచారం నిర్వహించాం. ప్రజల్లో మార్పువచ్చి బాల్య వివాహాలు ఆగుతాయని నమ్ముతున్నాం. - శ్రీదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ

వేదికపై నాయకులు

సమస్యలపై ఐకమత్యంతో పోరాడదాం

కోరుకొండ, న్యూస్‌టుడే: దళితులందరూ కలిసికట్టుగా ఉండాలని నాయకులు నక్కా రాంబాబు, పిట్టా కృష్ణ, గండి విజయ్‌కుమార్, కొయ్యా సామ్యూల్, పిట్టా వరప్రసాద్, ఖండవల్లి లక్ష్మి, పండా అబ్బాయి, ఎంపీపీ జ్యోత్స్న తదితరులు పిలుపునిచ్చారు. కోరుకొండ శివారున ఓ ప్రైవేటు లేఔట్‌లో ఆదివారం జరిగిన దళితుల ఆత్మీయ కలయికలో వారు పాల్గొని మాట్లాడారు. ఏ సమస్య వచ్చినా దళితులంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. ఐకమత్యంగా పోరాడదామని పిలుపునిచ్చారు. కోరుకొండ, సీతానగరం, రాజానగరం తదితర ప్రాంతాల ఉంచి దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు కళాసేవా పురస్కారాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: చల్లగాలి శ్రీనివాస్‌వర్మ నిర్వహణలో ప్రతి నెలా అందిస్తున్న కళాసేవా పురస్కార కార్యక్రమం సరస్వతీఘాట్‌లో జరిగింది. ఆరుగురు విశిష్ట వ్యక్తులకు శోభిత్‌వర్మ శోభాయమాన పురస్కారాలు అందించి సత్కరించారు. ఇంద్రజాలకుడు వి.వి.రమణ ఇంద్రజాల ప్రదర్శనతో మంత్రముగ్ధులను చేశారు. నగరపాలకసంస్థ ఇంజినీర్ షేక్ మదర్సా అలీ, కమాండెంట్ ఎస్పీ కొండ నరసింహారావు, చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు, నఖ చిత్రకారుడు రవి పరస, కానిస్టేబుల్ కొరిమి కృష్ణమూర్తి, భమిడిపాటి రాధాకృష్ణ తదితరులను సత్కరించారు. బి.రమాదేవి, సింహాద్రి కోటిలింగేశ్వరరావు, కృష్ణమాచారి ప్రసాద్, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత తోడుగా.. నేర్చుకో చకచకా..

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థ సంస్కరణలో భాగంగా కూటమి ప్రభుత్వం పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను చదువులో ముందుకు తీసుకువెళ్లేలా ఈ ల్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి. రాజమహేంద్రవరం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు పీఎంశ్రీ పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో చదువుతోపాటు ల్యాబ్‌లోనూ పాఠాలు నేర్చుకుంటూ నైపుణ్యాలు పెంచుకోవచ్చు.

ఉపాధ్యాయులకు శిక్షణ: పీఎంశ్రీ పాఠశాలలో ఒక ప్రత్యేక గదిని ఈ పాల్ ల్యాబ్‌కు కేటాయించారు. ఇందులో 30 చొప్పున ట్యాబ్‌లు, హెడ్‌ఫోన్లు సమకూర్చారు. వీటి వినియోగంపై ఉపాధ్యాయులకు రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల శిక్షణ ఇచ్చారు. ఈ ట్యాబ్‌లతో విద్యార్థులకు మరిన్ని సాంకేతిక పాఠాలు అందించనున్నారు.

ట్యాబ్‌లతో ఉపాధ్యాయులు

పాల్ ల్యాబ్‌లతో ఎంతో ప్రయోజనం..

హైస్కూళ్లలోని 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులను వారి స్థాయి ఆధారంగా నేర్చుకునేలా ఈ పాల్ ల్యాబ్‌లను ప్రవేశపెట్టారు. అక్షరాలు సైతం రాయలేని వారికి ఇవి ఉపకరిస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు, ఆంగ్లం, గణితం పాఠాల్లో రాణించడానికి ఇవి వినియోగపడుతున్నాయి. పిల్లలు ఈ ట్యాబ్‌లోనే పరీక్షలు రాసి వారి నైపుణ్యాలను మెరుగుపరచుకుంటారు. వెనుకబడిన వారిని చక్కగా తీర్చిదిద్ది 10వ తరగతికి అన్ని విధాలా సిద్ధం చేసేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని పాల్ ల్యాబ్ జిల్లా కోఆర్డినేటర్ నెహ్రూ తెలిపారు. వీటిని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

హోటల్‌లో అగ్నిప్రమాదం

కంబాలచెరువు, ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని కుమారి థియేటర్ సమీపంలో ఓ హోటల్‌లో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. హోటల్‌లోని వంటగదిలో పొయ్యి వద్ద నిప్పు రవ్వలు చెలరేగాయి. ఇన్నీసుపేట అగ్నిమాపక యంత్రం ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.25 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని, ఎలాంటి ఇబ్బంది కలగలేదని జిల్లా సహాయ అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పక్కనే గ్యాస్ గొడౌన్ ఉంది. ఏమాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. పెద్ద ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

(c) eenadu

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

సుందరేశ్వరునికి అన్నాభిషేకం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మార్గశిర మాస ఆరుద్ర నక్షత్ర పర్వదినం నేపథ్యంలో గోష్పద క్షేత్రంలోని సుందరేశ్వరుని ఆలయంలో లక్షబిల్వార్చన, అన్నాభిషేక కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. గణపతిపూజ, సుందరేశ్వరునికి ఏకవార రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ జరిపారు. బాలాత్రిపురసుందరికి సహస్ర కుంకుమార్చన, విశేషాలంకరణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత

గోపాలపురం: మండలం పరిధి జగన్నాథపురంలో 100 కుటుంబాలకు క్రైస్ట్ ఎవెంజిలికల్ లూథరన్ మినిస్ట్రీస్(గుంటూరు) వారి ఆర్థిక సహకారంతో స్థానిక పాస్టర్ ఎన్.జాన్‌బాబు ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఆదివారం లూథరన్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో వీటిని గ్రామ పెద్దలు పేదలకు అందజేశారు. వేములపల్లి సత్యానందం, రఘురామ్, రాఘవయ్య, పసుమర్తి అబ్బులు, గంగాధర్, కాంట్రగడ్డ సురేష్, గణపతి, రాఘవ చౌదరి పాల్గొన్నారు.

జగన్నాథపురంలో వృద్ధురాలకు సరకులు అందిస్తున్న గ్రామ పెద్దలు

ఘనంగా మహాపూర్ణాహుతి

తాళ్లపూడి, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రక్కిలంక భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్వ్రత మహోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం మహాపూర్ణాహుతిని నిర్వహించారు. ఆలయం నుంచి గోదావరి తీరం వరకు ఊరేగింపు నిర్వహించి వేదపండితుల ఆధ్వర్యంలో చక్రస్నానం నిర్వహించారు. వేగేశ్వరపురంలో ఉత్సవాల ముగింపు పురస్కరించుకొని స్వామి వార్లను వాహనంపై ఉంచి తీన్‌మార్ వాయిద్యాలు, బాణాసంచా పేల్చుతూ ఊరేగించారు. ★ పాత ఊరు భక్తాంజనేయస్వామి ఆలయంలో నాగవల్లి, సిందూర దళార్చలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు.

హోమం వద్ద భక్తులు

పెద్దగూడెంలో కుంతీదేవి ఉత్సవాలు

గోపాలపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పెద్దగూడెంలో కుంతీదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏటా ఇదే రోజుల్లో కుంతీ దేవి, నందీశ్వరులకు రెండు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. దానిలో భాగంగా ఆదివారం కుంతీ, నందీశ్వరులను గ్రామస్థులు తీన్‌మార్ డప్పులు, శక్తి వేషాల మధ్య ఘనంగా ఊరేగించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

శక్తి వేషాల్లో యువకులు

కోటసత్తెమ్మ గరగోత్సవం నేడు

నిడదవోలు, న్యూస్‌టుడే: కోటసత్తెమ్మ వారి తిరునాళ్ళ ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ ఆవరణలో వివిధ మేళాలతో భారీ ఎత్తున గరగోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా సన్నాయి మేళాలు, కాళికావేషాలు, జానపద నృత్య ప్రదర్శనలు, కేరళ చండ మేళం, కాళికా నృత్యం, కోలాటాలు, పౌరాణిక నాటకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం అమ్మవారిని అనపర్తి ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

కొండాలమ్మ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

పెరవలి, న్యూస్‌టుడే: మండలంలోని కానూరులో ప్రసిద్ధి చెందిన కొండాలమ్మ దేవస్థానం ట్రస్టుబోర్డు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి దుర్గేష్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అధ్యక్షుడు బొబ్బిలి దుర్గారావు, ఇతర పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానన్నారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలేవీ..?

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, గోపాలపురం

కొలువులకు పోటీపడుతున్న యువత, నిరుద్యోగులు గ్రంథాలయాలకు వెళ్తే నిరాశే ఎదురవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీతోపాటు ప్రభుత్వశాఖల్లో అన్ని తరహా ఖాళీలు భర్తీకి చర్యలు చేపడుతోంది. కృషి, పట్టుదల ఉన్నా పోటీ పరీక్షలను ఎదుర్కొనే స్థాయిలో గ్రంథాలయాలకు పుస్తకాల సరఫరా సరిగా లేక నిరుద్యోగులు సతమతమవుతున్నారు. పోటీ పరీక్షలకు సిలబస్ మారినా, పాత పుస్తకాలతోనే కుస్తీ పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన పుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఏడాదిన్నరగా ఎదురుచూపులు

కొవ్వూరు గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత

ఆదరణ ఉన్నా.. కొవ్వూరు డివిజన్ పరిధిలో కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలు ఉన్నాయి. కొవ్వూరులో ప్రథమ శ్రేణి, 11 చోట్ల మూడో శ్రేణి గ్రంథాలయాలు, 30 వరకు పుస్తక నిల్వ కేంద్రాలు నడుస్తున్నాయి. కొవ్వూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి రోజూ సుమారు మంది 150 పాఠకులు హాజరవుతుంటే ఆర్ఆర్‌బీ, సివిల్స్, గ్రూప్స్, బ్యాంకు, పోలీసు, డీఎస్సీ ఇలా అన్ని పరీక్షల కోసం 60 మంది వరకు ఉంటారు.

దాతల సహకారం బాగున్నా..

2023-24లో గ్రంథాలయాలకు 10 పుస్తకాలు అందించారు. ఆ తర్వాత మళ్లీ పంపిణీ కాలేదు. ఇండెంట్ ప్రకారం పుస్తకాల కోసం ప్రతిపాదన పంపించాలన్న సూచనలూ కానరావడం లేదు. ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి ఈ ఏడాది నవంబరులో దాత రూ.6 వేలు ఇచ్చారు. వీటితో బాగా అవసరంగా ఉన్న 12 పుస్తకాలను కొనుగోలు చేశారు.

పాత వాటితోనే కుస్తీ..

నేను బీటెక్ పూర్తి చేశా. ప్రస్తుతం ఆర్ఆర్‌బీ, జేఈ, ఎస్‌టీపీసీ, గ్రూప్-4 పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఇందుకు అర్థమెటిక్, రీజనింగ్, జీకే పుస్తకాలు అవసరం. ఇక్కడ పాత పుస్తకాలే ఉంటున్నాయి. లేదా దాతలు ఇచ్చిన వాటిపై ఆధారపడాల్సి వస్తోంది.

- అద్దంకి లక్ష్మీనారాయణ, కొవ్వూరు

కొనుక్కోవాల్సి వస్తోంది..

బీఎస్సీపాటు డైట్ పూర్తి చేశా. డీఎస్సీతో పాటు గ్రూప్-4 పరీక్షలకు సిద్ధమవుతున్నా. అకడమిక్, జీకే, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో లేవు. బయట కొనుక్కుని చదువుకోవడం ఇబ్బందిగా ఉంది.

- పి.సత్యవతి, కొవ్వూరు

బడ్జెట్ ఆధారంగా..

గ్రంథాలయాల నుంచి అందిన ప్రతిపాదన ప్రకారం పుస్తకాలు అందిస్తున్నాం. ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిన తర్వాత అవసరమైన పుస్తకాలన్నీ సమకూరతాయి. ప్రతి గ్రంథాలయానికి దాతలు పుస్తకాలు ఇస్తున్నారు. వారిని మరింతగా ప్రోత్సహించేందుకు శ్రద్ధ చూపాలని గ్రంథపాలకులకు సూచించాం.

- శేఖర్‌బాబు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

గోపాలపురం, న్యూస్‌టుడే: భాజపా బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పని చేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. వేదుళ్లకుంటలో ఆ పార్టీ నేత బి.వీరరాఘవులు నివాసం వద్ద మండల పార్టీ సమావేశం ఆదివారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేంద్రం పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. వాటిని ప్రజల మధ్యకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, గెల్లా శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

9న సర్వసభ్య సమావేశం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ పోశిరాజు అధ్యక్షతన ఈ నెల 9న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివారం ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రహదారులకు కొత్త రూపు

నిడదవోలు, పెరవలి, న్యూస్‌టుడే: పెరవలి మండలం కానూరు-ఉసులుమర్రు సీసీ రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రూ.3 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మిస్తున్నారన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. త్వరలోనే నిడదవోలు నియోజకవర్గంలోని ప్రధాన రహదారులకు సరికొత్త రూపురానుందని పేర్కొన్నారు.

కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

అంబేడ్కర్ జీవితం అందరికి స్ఫూర్తిదాయకం

నిడదవోలు, న్యూస్‌టుడే: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవితాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోగలిగితే అదే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కేవీపీఎస్, చర్చిపేట యూత్, పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. పుష్పాలల పాలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత కోసం పాటుపడుతున్న కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం బూరుగుపల్లి లక్ష్మీపతి ట్రస్టు, జ్ఞానకర్మ, మరి కొంతమంది దాతల సహకారంతో 200 మంది పేదలకు దుప్పట్లు అందించారు. దయామణి, గంటి కృష్ణ, జి.దానియేల్, బైపే రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అభ్యసన సామగ్రి అందజేత

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మోర్తలో పూలే, అంబేడ్కర్ బహుజన ఫౌండేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు అభ్యసన సామగ్రి, మిఠాయిలు ఆదివారం అందజేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతినిధులు ఎం.సాంసన్, కె.మురళి, పి.భాగ్యరాజు, చాపల సుబ్బారావు పాల్గొన్నారు.

సామగ్రితో చిన్నారులు

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

కొవ్వూరు పట్టణం: సీఐటీయూ 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు పట్టణంలో గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుందరబాబు మాట్లాడారు. కార్మికుల సామాజిక భద్రత, హక్కులను హరించే లేబర్ కోడ్‌ల రద్దు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై సమావేశంలో చర్చిస్తారన్నారు. అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు మైగాపుల నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య, కొవ్వూరు కమిటీ కన్వీనర్ బీరా రవి పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

వేలివెన్నులో అదనపు ఎస్పీ పూజలు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో అయ్యప్ప స్వామిని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అదనపు ఎస్పీ అడుసుమిల్లి వెంకట రవీంద్ర ఫణిభూషణ ప్రసాదు, శారద దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. కంచు గంట బహూకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు వీరిని సత్కరించారు.

ప్రసాదు దంపతులను సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు

ప్రక్కిలంక-మలకపల్లి దారికి మరమ్మతులు

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక-మార్టేరు రహదారిలో భాగంగా ప్రక్కిలంక నుంచి మలకపల్లి రహదారికి ర.భ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ రహదారిలో సమస్యలపై ఇటీవల 'ఈనాడు'లో పలు చిత్ర కథనాలు ప్రచురితం అయ్యాయి. వీటికి అధికారులు స్పందించారు. తాళ్లపూడిలోని గడియారం స్తంభం, రైతుబజారు, వేగేశ్వరపురం ప్రధాన కాలువ తదితర చోట్ల రహదారి అధ్వానంగా మారడంతో అక్కడ కంకర వేసి రోడ్ రోలర్‌తో చదును చేసి పైన తారు వేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

శిథిల భవనాన్ని తొలగించరూ..!

నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామంలో నూతనంగా సచివాలయాన్ని నిర్మించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పాత భవనం పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారింది. ఈ కార్యాలయం పక్కనే మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. ఈ కార్యాలయం నుంచి విషసర్పాలు వస్తుండటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాత భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నిడదవోలు

వేగ నియంత్రికలు ఏర్పాటు చేయండి

చాగల్లులోని ఇందిర మ్మకాలనీలో నూతన రోడ్లపై వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. వాహనాల వేగంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను కార్యదర్శి ఎండీ మహబూబ్ అలీ దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ తీర్మానం తీసుకుని, వేగ నియంత్రికల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, చాగల్లు

పీహెచ్‌సీలో సిబ్బంది నియామకం

స్పందనకు వందనం

చాగల్లు, న్యూస్‌టుడే: మండలంలోని కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదుగురు సిబ్బంది ఇటీవల బదిలీ అయ్యారు. దీంతో గ్రామస్థులకు వైద్య సేవలు అందించడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యపై కె.వెంకటేశ్వర్లు మేమున్నాం.. మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. ఇబ్బందులను డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా ఆయన స్పందించారు. బదిలీ అయిన సిబ్బందిని తిరిగి అదే పీహెచ్‌సీలో పనిచేసేలా ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

అగ్నిమాపక కేంద్రానికి యంత్రాన్ని అందిస్తున్న శివసాయిధామం సమితి ప్రతినిధులు

సేవా కార్యక్రమాలు అభినందనీయం

కొవ్వూరు పట్టణం: ఆధ్యాత్మిక, సామాజిక భావనతో చేపట్టే సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని అగ్నిమాపక అధికారి వేణు అన్నారు. కొవ్వూరు శివసాయిధామం సేవా సమితి ఆధ్వర్యంలో కొవ్వూరు అగ్నిమాపక కేంద్రానికి నీటి శీతలీకరణ యంత్రాన్ని ఆదివారం అందజేశారు. సమితి అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సాయిధామం ఆధ్వర్యంలో ఏటా ఉచిత దహన సంస్కారాలు, నిరుపేదలు, వృద్ధులకు నిత్యావసరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పలువురికి ఆదర్శంగా నిలవాలన్నదే తమ సంకల్పమన్నారు. సభ్యులు రెడ్డి తాతయ్యబాబు, పరిమి రాజేష్, నగళ్లపాటి శ్రీను, సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

పశువులకు వసతి గృహాలు

స్థల సేకరణలో అధికారులు

గోపాలపురం, తాళ్లపూడి, న్యూస్‌టుడే: పాడి ఉత్పాదకత పెంపులో భాగంగా పశువుల వసతి గృహాలు పేరిట మెగా గోకులాల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు పాడి పశువుల సంరక్షణకు రైతులకు వారి సొంత స్థలంలో మినీ గోకులాలు మంజూరు చేసింది. ఇందుకు గాను గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించారు. తాజాగా స్థలం లేని రైతులు తమ పశువులను వసతి గృహాల్లో ఉంచి వాటి పోషణ చూసుకునే విధంగా కార్యక్రమాన్ని రూపొందించారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో మూడు నియోజకవర్గాలు ఉండగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున వచ్చే ఆరు నెలల కాలంలో అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోంది.

రూ.10 లక్షలు నిధులు కేటాయింపు..

ప్రతి నియోజకవర్గ పరిధిలో నిర్మించే వసతి గృహానికి రూ.10 లక్షలు ప్రభుత్వం కేటాయించనుంది. ఒక్కో వసతిగృహంలో నిర్మాణం నిమిత్తం సుమారు నాలుగు నుంచి అయిదు ఎకరాల విస్తీర్ణం అవసరం. ఇందుకు ఎంపిక చేసిన ప్రాంతంలో పోరంబోకు, ప్రభుత్వ భూములు ఉంటే రెవెన్యూ శాఖాధికారులు వాటిని గుర్తించి పశుసంవర్ధక శాఖకు కేటాయించనున్నారు. ప్రభుత్వం భూమి లేని చోట్ల ప్రైవేటు భూమిని అయిదేళ్ల పాటు కౌలుకు తీసుకుంటారు. ఒక్కో వసతి గృహంలో 30 పశువులను ఉంచి వాటికి అవసరమైన మేత, దాణా నిల్వలు చేసేందుకు గదులు నిర్మించడం జరుగుతుంది. ఒక ఎకరం పొలంలో పశువుల షెడ్డు, మిగిలిన స్థలంలో పశువులకు అవసరమైన మేతను ఉండే విధంగా ఏర్పాటు చేస్తారు. పశువుల వసతి గృహాల నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం స్థల సేకరణ పనిలో ఉన్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రయోజనాలు ఇవీ..

● పశు వసతి గృహాలు ఏర్పాటు చేయడం వల్ల పాల ఉత్పత్తి 15-20శాతం పెరగడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ● పశు పేడతో సేంద్రియ ఎరువులు, బయో గ్యాస్ ఉత్పత్తి అవుతాయి. ● పశువల ఆరోగ్యానికి, మేతకు, సౌకర్యాలకు భరోసా ఉంటుంది. ● రైతులు పశువులను చూసే పని ఉండదు, సంరక్షకుల పర్యవేక్షణలో ఉంటాయి.

కోడిపందేల స్థావరాలపై దాడి

నిడదవోలు, తాళ్లపూడి, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం కోరుమామిడి శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై ఆదివారం దాడి చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు తెలిపారు. ఈ దాడుల్లో అయిదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రెండు కోళ్లు, రూ.1,070 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ● తాళ్లపూడి మండలం తుపాకుల గూడెంలో కోడిపందేల స్థావరంపై ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,250, రెండు కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కోటి సంతకాల సేకరణ

దేవరపల్లి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా శ్రేణులు దుద్దుకూరు, యాదవోలు గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ ఆదివారం చేపట్టారు. గ్రామంలో వైకాపా శ్రేణులు తిరుగుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాలు సేకరించారు. ఈ నెల 10వ తేదీ తరువాత వాటిని గవర్నర్‌కు అప్పగిస్తామన్నారు.

అనంతపల్లి మాజీ సర్పంచి మృతి


నరసింహారావు (పాత చిత్రం)

నల్లజర్ల, న్యూస్‌టుడే: అనంతపల్లి మాజీ సర్పంచి, తెదేపా నాయకుడు గద్దే నరసింహారావు (77) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. 1980 నుంచి 86 వరకు ఆయన సర్పంచిగా వ్యవహరించి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన కుమారులు, కుమార్తె అమెరికా నుంచి రావాల్సిన ఉండగా అంత్యక్రియలు 9న నిర్వహించనున్నట్లు సమీప బంధువులు తెలిపారు. పలువురు ప్రముఖులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రాచీన చరిత్ర కలిగిన ఏకైక దేశం భారత్

గోపాలపురం, న్యూస్‌టుడే: ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన ఏకైక దేశం భారత్ అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కొనియాడారు. గోపాలపురం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఇస్కాన్ భగవద్గీత పాఠశాల లెర్న్ గీత.. లీవ్ గీత సమన్వయకర్తలగా కల్యాణిప్రసాద్ ఆధ్వర్యంలో గీతా జయంతి మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎంతో మంది మహానుభావులు భగవద్గీతను చదివి, అద్భుత జ్ఞానాన్ని పొందారన్నారు. గీతా జయంతి పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ సోము

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

నిడదవోలు, న్యూస్‌టుడే: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయడంతోపాటు వారికి త్వరలోనే నిడదవోలులో కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులో జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 66వ ప్రపంచ దివ్యాంగుల మాసోత్సవ కార్యక్రమంలో దుర్గేష్ పాల్గొన్నారు. కేకు కోసి దివ్యాంగులకు తినిపించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో అపారమైన శక్తి సామర్థ్యాలు ఉంటాయన్నారు. కార్యదర్శి వంగా కృపా, రాంబాబు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

15న చలో కలెక్టరేట్

నిడదవోలు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనలు జయప్రదం చేయాలని ఆదర్శ ప్లాట్‌ఫాం రిక్షా వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. ఆదివారం నిడదవోలు యర్నగూడెం రహదారిలో ఐఎఫ్‌టీయూ స్థూపం వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. నాయకులు పిచ్చా సూర్యకిరణ్, నాగరాజు, రాజేష్, సిర్రా రాఘవులు, బాపినీడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాలి

నల్లజర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించి పాఠశాలల్లో బోధనకు మాత్రమే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయశంకర్ పేర్కొన్నారు. యూటీఎఫ్ నల్లజర్ల మండలశాఖ నూతన కౌన్సిల్ నిర్మాణ సమావేశం ఆదివారం స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా పత్తిపాటి వీర్రాజు, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బండి కిశోర్, షేక్ ఫక్రుద్దీన్ అలీ, అసోసియేట్ అధ్యక్షుడిగా లింగంకుంట్ల నాగరాజు, మహిళా అధ్యక్షులిగా కృష్ణవేణి, కోశాధికారిగా తాడిగడప నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. జయశంకర్ మాట్లాడుతూ పదో తరగతి వందరోజుల కార్యచరణ ప్రణాళిక సెలవు దినాల్లో అమలుపరచడం సరైంది కాదన్నారు. రెండో శని, ఆదివారాలు మినహాయించి అమలుపరచాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయశంకర్

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ కపిల మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం మల్లేశ్వరం (గ్రా), పెరవలి (మం), తూర్పు గోదావరి జిల్లా

పై దేవస్థానమునకు చెందిన ఈ దిగువ ఉదహరించిన భూములను 3 సంవత్సరములు సేద్యమునకు అనగా ది.01-01-2026 నుండి ది.31-12-2028 వరకు 1 సంవత్సరము నగదు మక్తా అడ్వాన్సుగా చెల్లించు పద్ధతిన లీజునకు ది.19-12-2025వ తేదీ శుక్రవారం ఉదయం గం. 11-00లకు దేవదాయ ధర్మదాయ శాఖ, అధికారుల సమక్షములో శ్రీ స్వామివారి దేవస్థానము వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు ఆధార్ లేదా ఏదైన నివాస ధృవీకరణ పత్రముతో పాటు ధరావతు సొమ్ము చెల్లించి పాటలో పాల్గొనవలెను.

వ. నెం.	గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణం యు.సెం.	ధరావత్తు సొమ్ము రూ.లలో	బహిరంగ వేలం జరుగు ప్రదేశం, తేదీ & సమయం
1	అన్నవరప్పాడు	21/1	2.18	15000	శ్రీ స్వామి వారి దేవస్థానం, మల్లేశ్వరం గ్రామం, ది.19-12-2025వ తేదీ శుక్రవారం ఉదయం గం.11 గంటల నుండి
		33/2	1.07		
			3.25		
2	అన్నవరప్పాడు	19/4	1.17	15000	...డిటో...
		39/3	1.82		
			2.99		
3	అన్నవరప్పాడు	54	2.21	15000	...డిటో...
4	అన్నవరప్పాడు	54	3.50	15000	...డిటో...
5	మల్లేశ్వరం	262/3	0.78	15000	...డిటో...
6	మల్లేశ్వరం	260/4	0.89	15000	...డిటో...
		260/5	0.78		
		264/1	0.35		
			2.02		
7	అన్నవరప్పాడు	54	1.50	15000	...డిటో...
		21/1	0.50		
			2.00		
8	అన్నవరప్పాడు	54	2.00	15000	...డిటో...
9	అన్నవరప్పాడు	56/8	2.40	15000	...డిటో...
10	అన్నవరప్పాడు	21/1	2.09	15000	...డిటో...
		21/2	0.13		
		21/3	0.18		
			2.40		

షరతులు: వేలంపాట షరతులు, ఇతర వివరములకు ఖండవల్లి గ్రూపు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిని అడిగి తెలుసుకోవచ్చును.

మల్లేశ్వరం, 08-12-25. కార్యనిర్వహణాధికారి, 99519 57044

(c) eenadu

జనసంద్రం.. ఫలపూజ మహోత్సవం

తుంగభద్ర నదీ తీరంలోని చక్ర తీర్థ కోదండ రామాలయం ఆవరణలో శనివారం రాత్రి కనుల పండువగా జరిగిన ఫలపూజా మహోత్సవానికి పోటెత్తిన జనవాహిని. - న్యూస్‌టుడే హొసపేటె

రైలుబండిలో సోమణ్ణ

కార్వార, న్యూస్‌టుడే: కార్వార నుంచి గోవాలోకి మడగావ్ వరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి వి.సోమణ్ణ రైల్లో ప్రయాణించారు. కొంకణ రైల్వే విభాగంలో జరుగుతున్న పనులు, స్టేషన్ల మరమ్మతులు, ఉన్నతీకరణను వీక్షించేందుకు రైలు చివరి బోగీలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. నివేదికను పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు ఇస్తూ ఆయన తన ప్రయాణాన్ని పూర్తి చేశారు.

రైలు చివరి బోగీలో అధికారులతో కలిసి ప్రయాణిస్తున్న సోమణ్ణ

శీతాకాల పర్వం.. సవాళ్ల సమరం

- వ్యూహాలతో అధికార పక్షం ● 'ఉత్తర' సమస్యల పరిష్కారానికి గట్టి పట్టు

ఈనాడు, బెంగళూరు: శీతాకాల సమావేశాలకు కర్ణాటక రెండో రాజధాని బెళగావి సిద్ధమైంది. నేటి (సోమవారం) నుంచి ఈనెల 19 వరకు నిర్వహించే ఈ సమావేశాలు ఎప్పటిలాగానే ఉత్తర కర్ణాటక ప్రాంత సమస్యలపై దృష్టి సారిస్తూనే ఈసారి కొత్త అంశాలపై చర్చలకు వేదిక కల్పిస్తున్నాయి. ఢిల్లీలోని ఎర్ర కోటపై దాడుల నేపథ్యంలో సువర్ణ సౌధ వద్ద భద్రతా వ్యవస్థలు కట్టుదిట్టం చేశారు. ఆరు వేల మంది పోలీసు సిబ్బంది, ఎస్పీ స్థాయి పోలీసు అధికారుల సహా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు విపక్షాల నేతృత్వంలో రైతుల ఆందోళనకు పిలుపునివ్వటంతో సౌధ చుట్టూ పోలీసు బలగాలు మోహరించాయి. ఈసారి ఉత్తర కర్ణాటక సమస్యలపై మాట్లాడేందుకు ఎక్కువ సమయం ఇచ్చేందుకు స్పీకర్లు నిర్ణయించటంతో అన్ని పార్టీల సభ్యులు వీటిపై సర్కారును నిలదీసేందుకు సిద్ధమయ్యారు. సౌధ వద్ద ప్రత్యేక ఉద్యానం, అతిపెద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించటం ఈసారి సమావేశాల ప్రత్యేకత.

అధికార పంపిణీ గోల

ఈసారి సమావేశాల్లో అధికార పక్షం ఇబ్బందుల్లో పడుతుందని అందరూ భావించారు. రెండు వారాలుగా అధికార పంపిణీపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య కొనసాగుతున్న పోరు ఇప్పటికీ సమసిపోలేదు. ఢిల్లీ స్థాయిలోనూ వీరిద్దరి మధ్య తగువులాట తీర్చేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయాలకు పరిమితమైన కాంగ్రెస్ పక్షాన్ని ఈ సమావేశాల్లో నిలదీయాలని భాజపా, జేడీఎస్‌లు నిర్ణయించుకున్నాయి. అంతలోనే కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు అప్రమత్తమై వరుస అల్పాహార సమావేశాల్లో మేమిద్దరం ఒక్కటేనని ప్రకటించారు. ఆటు పార్లమెంట్, ఇటు విధానసభ సమావేశాల్లో అధికార పంపిణీ వ్యవహారంతో పార్టీ భంగపడకుండా జాగ్రత్త వహించే లా అధికార పంపిణీపై ముఖ్య నేతల మధ్య ఆలోచనలు కొనసాగుతున్నాయి. అగ్రనేతల మధ్య అనుకోకుండా కుదిరిన ఒప్పందంతో విపక్షాలు కూడా 'అవిశ్వాస' తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సాహసించలేకపోయాయి. విపక్షాలు ఎలాంటి తీర్మానాలు చేసినా వాటిని ఎదుర్కొనేందుకు మేము సిద్ధమని సిద్ధరామయ్య, డీకేలు ప్రకటించటంతో విపక్షాలు తమ ప్రయత్నాలను విరమించుకున్నాయి. పైకి సీనియర్ల మధ్య అగాధం ఉన్నట్లే కనిపించినా సమావేశాల్లో ఐక్యత పాటించాలని నిర్ణయించుకోవటం విశేషం.

శాంతి భద్రతలపై..

ఈ సమావేశాల్లో చర్చకు వచ్చే అంశాల్లో శాంతిభద్రతలు కీలకంగా మారాయి. కేంద్ర కారాగారంలో ఖైదీలకు మొబైళ్లతో పాటు విలాస వ్యవస్థలు ఏర్పాటు చేయటం, ఈ వీడియోలు వైరల్‌గా మారటంతో రాష్ట్ర హోంశాఖ బదులివ్వలేకపోయింది. విపక్షాలు ఈ అంశంపై సభలో గట్టిగా ప్రశ్నించే వీలుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు చర్యలు చేపట్టామని, ఇతర

మరిన్ని అంశాలపై..

ఉత్తర కర్ణాటకతో పాటు బెంగళూరుకు సంబంధించిన అంశాలు ఈ సమావేశాలను కుదిపేయగలవు. ఇందులో రహదుస్థితి, దేశ విదేశీయులు వీటిపై స్పందించిన తీరు, సొరంగ మార్గ పథకం, పులుల దాడి కేసులు, ప్రభుత్వ పాఠశాలలను కేపీఎస్‌ల్లో విలీనం చేయాలన్న నిర్ణయం, ఇటీవల ఉప లోకాయుక్త విడుదల చేసిన 'అవినీతి' రాష్ట్ర భాగోతం, కుల గణన ప్రక్రియ లోపాలు, రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు, ఈ-ఖాతా తప్పనిసరి చట్టంతో ఎదురయ్యే సమస్యలు తదితరాలపైనా విపక్షాలు ప్రశ్నలను సంధించగలవు.

ఆదివారం రాత్రి రంగుల్లో వెలిగిపోతున్న సువర్ణసౌధ

రాష్ట్రంలో పోలీస్ కర్ణాటక సురక్షితమని చెప్పేందుకు తన వద్ద దాఖలాలున్నాయని ఇప్పటికే హోంమంత్రి పరమేశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. వీటితో పాటు ధర్మస్థల పరిసరాల్లో శవాల వెలికితీత, ఎస్ఐటీ విచారణ వ్యవహారాలపైనా విపక్షాలు గట్టిగా ప్రశ్నించాలని చూస్తున్నాయి.

రైతు సమస్యలు

ఈసారి సమావేశాల్లో రైతు సమస్యలు పెద్ద ఎత్తున చర్చకు వచ్చే అవకాశముంది. చెరకు, మొక్కజొన్నకు సంబంధించిన గిట్టుబాటు ధరలపై కేంద్ర రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం, పంటనష్టానికి సంబంధించిన ప్రభుత్వ పరిహారం వ్యవహారాలపైనా కర్షకులు భారీ వర్షాలతో పంట నష్టం, అందుకు పరిహారంపై చర్చలు జోరుగా సాగనున్నాయి. ఇక తుంగభద్ర గేట్ల మరమ్మతుల నేపథ్యంలో రెండో పంట లేని కారణంగా ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలని విపక్షాలు పట్టుబట్టనున్నాయి. ఉత్తర కర్ణాటకకు నీటిపారుదల, అభివృద్ధి పనులతో పాటు డీఎం నంజుండప్ప కమిటీ, డా.ఎం.గోవిందరావ్ కమిటీల ప్రగతి, విద్య, సామాజిక అంశాల్లోనూ బెళగావి, కలబురగి వలయాల సదుపాయాల గురించి ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు ప్రశ్నించగలరు. సర్కారు కేంద్రానికి జీఎస్టీ పరిహారంతో పాటు బడ్జెట్‌లో ప్రస్తావించిన తుంగభద్ర, కృష్ణా ఎగువ ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులను విడుదల చేయాలన్న డిమాండ్లను గుర్తు చేయాలనుకుంటోంది.

సౌధ వద్ద భద్రతా సిబ్బంది సర్వసన్నద్ధం

33 బిల్లులు ప్రవేశపెట్టాలని యోచన

ఈ సమావేశాల్లో 33 బిల్లులు ప్రవేశపెట్టాలని సర్కారు యత్నిస్తోంది. ఇందులో స్పీకర్ వద్దకు 17 బిల్లుల ప్రతులు చేరాయి. వీటిల్లో విద్వేషపూరిత ప్రసంగాలు, వార్తా కథనాల నిషేధ బిల్లు, గోవధ నిషేధం, కార్మిక సంక్షేమ నిధి, గ్రేటర్ బెంగళూరు ప్రాధికార, కర్ణాటక సినీ కార్మికుల సంక్షేమ నిధి వంటి ఉన్నాయి.

పీఠం కోసం పోరాటం అన్ని చోట్లా ఉండేదే

ఉడుపి, న్యూస్‌టుడే: ప్రతి రాష్ట్రంలో ఇలాంటి పోరాటాలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా జరుగుతుంటాయని కర్ణాటకలో ముఖ్యమంత్రి పీఠం కోసం జరుగుతున్న పోరుపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. కన్నడ రాజకీయాలపై ఆయన వద్ద ప్రస్తావించగా పై విధంగా స్పందించారు. ఆదివారం ఉడుపి శ్రీకృష్ణ మఠం సందర్శనకు వచ్చిన పవన్ భేటీ అయ్యేందుకు లోక్‌సభ సభ్యుడు కోట శ్రీనివాస పూజారి, ఆర్ ఎస్ఎస్ నాయకులు కల్లడ్క ప్రభాకర్ భట్ అక్కడకు వచ్చారు. భద్రతా కారణాలతో పవన్‌ను వారు భేటీ అయ్యేందుకు పోలీసులు అనుమతించలేదు. అనంతరం ఉడుపిలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఓషియన్ పర్ల్ హోటల్ నుంచి తెప్పించిన దక్షిణ, ఆంధ్ర శైలి వంటకాలతో ఆయనకు అధికారులు విందు ఏర్పాటు చేశారు. వంటకాల్లో నీర్ దోసె, పుట్టగొడుగుల మీ ఫ్రై, పత్రొడె (సామ ఆకును బల్లెం పిండిలో ఉంచి, ఉడకబెట్టి వేయించిన వంటకం), సేమ్యా, పన్నీర్ లబాబ్దార్, రోటీ, మీ రైస్, దాల్ వీర్ వలి, పాయసం, పుల్కా, పన్నీర్ పుదీనా చిల్లీ, అన్నం, ఉడుపి రసం, రాగి ముద్దను పవన్ కోసం ప్రత్యేకంగా సిద్ధం చేశారు.

- ప్రతి ఊరికీ ఒక సంస్కృతి ఉంటుందని పవన్ పేర్కొన్నారు. కాంతార సినిమా తుళునాడు కథను చెబుతుంది. ఆ సినిమా విడుదలైన వెంటనే చూడలేదని, అనంతరం ఆ సినిమా చూశానని తెలిపారు. అటువంటి సినిమాలు ఎక్కువగా రావాలని పేర్కొన్నారు.

వేదికపై మఠాధిపతులతో పవన్ కల్యాణ్

హస్తినలో కర్ణాటకం

- తాజా రాజకీయంపై పెద్దల చర్చ

ఈనాడు, బెంగళూరు: రాష్ట్రంలో అధికార పంపిణీ లేదంటే లేదని వాదించే అధిష్ఠానం ఎట్టకేలకు నోరు మెదిపింది. అంతే కాకుండా గత రెండు వారాలుగా సీఎం, డీసీఎంల మధ్య కొనసాగుతున్న పోరుపైనా చర్చించేందుకు తొలిసారిగా సమావేశమైంది. దిల్లీలో పార్లమెంటరీ కాంగ్రెస్ సమితి ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ నివాసం 10 జనపథ్‌లో శనివారం రాత్రి ఏఐసీసీ అగ్రనేతలు సమావేశమయ్యారు. ఈ విషయాన్ని ధ్రువీకరించిన కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్.. 'రాష్ట్ర వ్యవహారాలపై తొలిసారిగా చర్చించాం. ఈ సమావేశంలో ఏం మాట్లాడామో బయటకు చెప్పలేం. పార్లమెంట్ సమావేశాల్లో పార్టీ కార్యాచరణపై సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు ప్రత్యేకంగా చర్చించారు. ఇదే సమయంలో రాష్ట్ర రాజకీయాల ప్రస్తావన కూడా వచ్చిందన్నారు.

జనవరి తొలివారంలో

ఈనెల 14న దిల్లీలో చేపట్టే 'ఓట్ చోరీ' ఆందోళన సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొంటారు. అక్కడే రాష్ట్ర నాయకత్వ విషయాలపైనా చర్చించే వీలుందని వేణుగోపాల్ తెలిపారు. ఆలోగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మరోసారి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో మలివిడత చర్చల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాన్ని అధిష్ఠానం ముందు నేరుగా ప్రకటిస్తారు. మొత్తంగా పార్లమెంట్, విధాన సభ సమావేశాలు ముగిసేంత వరకు ఎలాంటి నిర్ణయం తీసుకునే వీలులేదు. జనవరి తొలివారంలోనే అధిష్ఠానం నుంచి కీలక ఆదేశాలు వెల్లడవుతాయని తెలిసింది.

కబ్బన్ ఉద్యానవనాన్ని వ్యాపార కేంద్రంగా మార్చొద్దు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: కబ్బన్ ఉద్యానవనాన్ని వ్యాపార కేంద్రంగా మార్చవద్దంటూ ఉద్యానంలో నడకదారుల సంఘం సభ్యులు కోరారు. సంఘం అధ్యక్షుడు ఎస్.ఉమేశ్ నేతృత్వంలో కొందరు సభ్యులు కబ్బన్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. కొత్తగా ఎటువంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వవద్దని ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వమే ఉల్లంఘిస్తోందని ఆయన ఆక్రోశించారు. ఉద్యానంలో వాణిజ్యీకరణకు అవకాశం ఇవ్వవద్దని నినాదాలు రాసిన అట్టముక్కలను ఆందోళనకారులు ప్రదర్శించారు.

వాయుమాలిన్యం నియంత్రణకు చర్యలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: దేశంలో ఉద్యాననగరి, సిలికాన్‌సిటీగా ఖ్యాతి పొందిన రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలో వాయుమాలిన్యం అపాయకరంగా మారకుండా మాలిన్యాన్ని నియంత్రించేందుకు చేపట్టే చర్యల గురించి అధ్యయనం చేసేందుకు ప్రత్యేక నిపుణుల సమితిని తక్షణం ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. వాయుమాలిన్యం ప్రమాదకరమైన స్థాయికి దిల్లీ నగరం చేరుకుందని అలాంటి పరిస్థితులు బెంగళూరులో రాకూడదని సూచించారు. బెంగళూరు వాయుమాలిన్యం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ దినేశ్‌గూళిగౌడ, డీసీఎంకు లేఖ రాశారు. ఇప్పటి నుంచి చర్యలు తీసుకోకపోతే నగరంలో ప్రజలు జీవించలేని పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. నగర జనసంఖ్య 1.47 కోట్లు ఉండగా వాహనాలు 1.23 కోట్లు ఉన్నట్లు లేఖలో ప్రస్తావించారు. రోజు 2,563 వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని దీంతో ద్విచక్రవాహనాల సంఖ్య 84 లక్షలు దాటినట్లు తెలిపారు. వాయునాణ్యత ఏయూ 50 నుంచి 70 దాటే ప్రమాదం ఉందని, రానున్న ఐదేళ్లలో వాయుమాలిన్యం తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాయుమాలిన్యం బాలలు, వృద్ధులు వ్యాధులకు గురవుతున్నారని ఆలర్జీ, ఆస్తమా, హృదయ వ్యాధులు పెరుగుతాయన్నారు. పరిసర విజ్ఞానులు, సంచార నిపుణులు, ప్రజారోగ్య నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని డీసీఎం సిఫార్సు చేశారు.

బెంగళూరులోనే ఆర్‌సీబీ క్రికెట్ పోటీలు

బెంగళూరు (యలహంక): 2026 నుంచి ఐపీఎల్- ఆర్‌సీబీ క్రికెట్ పోటీలు బెంగళూరు నగరంలో జరుగుతాయని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. ఆదివారం ఇక్కడ జరిగిన కె.ఎస్.సి.ఎ. ఎన్నికల సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఆయన ఓటు హక్కు వినియోగించుకుని అనంతరం విలేకర్లతో మాట్లాడారు. తాను, మంత్రులందరూ క్రికెట్‌ను ప్రేమిస్తామని, ఆర్‌సీబీ తమకు గర్వకారణమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఐపీఎల్ క్రికెట్ పోటీలు ఇక్కడ జరగకుండా తప్పి పోయేందుకు అవకాశం ఇవ్వబోమన్నారు. ఆర్‌సీబీ పోటీలు బెంగళూరు నగరంలోనే జరుగుతాయన్నారు. బెంగళూరు నగర గౌరవాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తామన్నారు. చట్టప్రకారం ప్రేక్షకుల రద్దీని నియంత్రిస్తామన్నారు.

కేసీసీ అధ్యక్షుడిగా వెంకటేశ్ ప్రసాద్

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: కర్ణాటక క్రికెట్ సంఘానికి (కేసీసీ) నూతన అధ్యక్షుడిగా మాజీ క్రికెటర్, ఒకప్పటి పేస్ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆయనపై పట్టుదలతో పోటీ చేసిన కేఎన్ శాంతకుమార్ ఓటమి పాలయ్యారు. వెంకటేశ్ ప్రసాద్‌కు 749 ఓట్లు రాగా, శాంతకుమార్‌కు 558 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షునిగా మాజీ క్రికెటర్ సుజిత్ సోమసుందర్, కార్యదర్శిగా సంతోష్ మెనన్, కోశాధికారిగా మధుకర్ ఎన్నికయ్యారు. వెంకటేశ్ ప్రసాద్‌కు మాజీ బౌలర్ అనిల్ కుంబ్లే మద్దతు ఇవ్వగా, శాంతకుమార్‌కు మరో మాజీ క్రికెటర్ బ్రిజేశ్ పటేల్ మద్దతు ఇచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం 7 వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 1315 ఓట్లు పోలయ్యాయి. సంఘంలో 2013లో 1351 ఓట్లు పోలవగా, ఇది రెండో అత్యధికం. మొత్తం 20 రౌండ్లలో ఓట్లు లెక్కించారు. క్రికెట్ సంఘానికి ఆచార్య జేసీ రోలో 1933 నుంచి 36 వరకు మొదటి అధ్యక్షుడిగా సేవలు అందించగా, వెంకటేశ్ ప్రసాద్ 17వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన పదవీ కాలం 2028 వరకు కొనసాగనుంది. ఎం.చిన్నస్వామి 1978-90, శ్రీకంఠ దత్త నరసింహరాజ ఒడెయరు (2007-10, 2013-16), అనిల్ కుంబ్లే (2010-13) వరకు అధ్యక్షులుగా సేవలు అందించిన ప్రముఖులు.

వెంకటేశ్ ప్రసాద్

ఓటు వేస్తున్న శివకుమార్

కుమార ఉదారత

మండ్య, న్యూస్‌టుడే: 15 నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్న మైషుగర్ పాఠశాల ఉపాధ్యాయులకు అండగా నిలిచేందుకు కేంద్ర మంత్రి కుమారస్వామి ముందుకు వచ్చారు. గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ఇప్పటి వరకు ఎంపీగా తాను అందుకున్న రూ.19,94,200ల మొత్తాన్ని పాఠశాల పాలక మండలికి అప్పగించారు. ఉపాధ్యాయులకు వేతనాలు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. ఈ పాఠశాలను మాదిరి విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి సహకారంతో పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

తన వేతన చెక్కును అందిస్తున్న కేంద్ర మంత్రి

కృష్ణతత్వంపై నమ్మకం

బెంగళూరు (యశ్వంతపుర): కృష్ణతత్వంపై నమ్మకం ఉందే తప్ప కంసుడి హింసపై నమ్మకం లేదని కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి వ్యాఖ్యానించారు. కుమారస్వామి మనువాది అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనను మనువాది అని పేర్కొన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అహింద సిద్ధాంతానికి వ్యతిరేకమన్నారు. దానికి తాళం వేసిన మంత్రి డాక్టర్ మహదేవప్ప తన ఇద్దరు పిల్లలకు ఏమి బోధించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. భగవద్గీత ప్రపంచానికి వెలుగు. స్వర్గానికి మార్గం, ఆదర్శాలను బాల్యం నుంచి నేర్చుకుంటే మంచిదన్నారు. చిన్నతనం నుంచి భగవద్గీత బోధించే విధంగా చర్య తీసుకోవాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. అసలు మంత్రి మహదేవప్పకు భగవద్గీత గురించి తెలియదని తెలుసుకునేందుకు ప్రయత్నించలేదని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులందరూ రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల విషాదాంతం

మండ్య, న్యూస్‌టుడే: నాగమంగల తాలూకా బిండగనవిలె హోబళి తిట్టనహొసహళ్లి గ్రామం వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో చంద్రేగౌడ (62), ఆయన భార్య సరోజమ్మ (58) మరణించారు. దంపతులు ప్రయాణిస్తున్న కారు, అదుపు తప్పి వంతెనను ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. బెంగళూరు నుంచి చిక్కమగళూరు వెళ్తూ వీరు మృత్యువాత పడ్డారు. బిండిగనవిలె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు మద్దూరు వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బస్సు బోల్తా కొట్టి 30 మంది గాయపడ్డారు. మళవళ్లి తాలూకా శింషా మారమ్మ ఆలయంలో పూజ చేయించుకుని బెంగళూరుకు వెళ్తున్న బస్సు తైలూరు చెరువు సమీపంలోని సర్వీసు రోడ్డులో రహదారి విభాజకాన్ని ఢీకొట్టి బోల్తా కొట్టింది. బాధితులను గురుశాంతప్ప సార్వజనిక ఆసుపత్రిలో చేర్పించారు. క్రేన్ సాయంతో బస్సును పక్కకు తొలగించారు. మద్దూరు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఖరీదైన కానుకలు తీసుకోకూడదు

మడికేరి, న్యూస్‌టుడే: అధికారంలో ఉన్న చట్టసభ ప్రతినిధులు ఖరీదైన బహుమతులను తీసుకోవడం సరికాదని రాజవంశస్థుడు, మైసూరు లోక్‌సభ సభ్యుడు యధువీర్ కృష్ణదత్త ఒడెయరు పేర్కొన్నారు. మడికేరిలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. సిద్ధరామయ్య మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.70 లక్షల విలువైన గడియారాన్ని ధరించి విమర్శలు పాలయ్యారని గుర్తు చేశారు. తాజాగా ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇద్దరూ రూ.43 లక్షల విలువైన గడియారాలు ధరించి కనిపించారని తెలిపారు. వారిద్దరూ ఈ విషయంపై ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించినప్పుడు తమకు ఉన్న స్థిర, చరాస్తులు, విలువైన వస్తువులను తప్పనిసరిగా ప్రకటిస్తే ఆరోపణలు రాకుండా ఉంటాయని యధువీర్ పేర్కొన్నారు.

యధువీర్

అవిశ్వాస తీర్మానం ఉండదు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: బెళగావి శాసనసభ సమావేశాల్లో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం లేదని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర స్పష్టం చేశారు. ఇక్కడ తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలపై శాసనసభ సమావేశాల్లో, బయట కూడా భాజపా, దళ్ పోరాటం చేస్తుందని చెప్పారు. కర్ణాటకలో 63 శాతం అవినీతి ఉందని ఉప లోకాయుక్త జస్టిస్ బి వీరప్ప చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించనన్నారు. సిద్ధరామయ్య మాత్రం తమ ప్రభుత్వం సచ్ఛీలురలతో నిండి ఉందన్నట్లు ప్రకటించుకోవడం హాస్యాస్పదం అని ఎద్దేవా చేశారు. భాజపాలో నాయకులు అందరూ ఒక్కతాటిపైనే ఉన్నామని తెలిపారు.

ఆటలు సాగవిక.. ఏఐ ఉండగా!

- ఖైదీలపై కదలికలపై డిజిటల్ నిఘా
- పరప్పన అగ్రహార కారాగారంలో ట్రాకింగ్ సిస్టమ్

ఈటీవీ భారత్: రాష్ట్రంలోని జైళ్లను స్మార్ట్‌గా మార్చేందుకు జైళ్ల శాఖ సిద్ధమైంది. ఖైదీల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు ఏఐ సాంకేతికను వినియోగించేందుకు కర్ణాటక ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జైళ్లలో అసాంఘిక కార్యకలాపాలు, మొబైల్ ఫోన్ల వాడకం, డ్రగ్స్ వినియోగం వంటి చట్టవిరుద్ధ పనులకు చెక్ పెట్టేందుకు కర్ణాటక జైళ్ల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జైళ్లను స్మార్ట్‌గా మార్చేందుకు సిద్ధమైంది. ఖైదీల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు ఏఐ సాంకేతికను వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం ప్రిజినర్స్ ట్రాకింగ్ మూవ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ సాంకేతికతను తొలుత పైలెట్ ప్రాజెక్టుగా బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో అమలుకు శ్రీకారం చుట్టింది.

ట్రాకింగ్ వ్యవస్థ ఎలా ఉంటుందంటే?

జైలులోని ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు ఏఐ సాంకేతికతను జోడిస్తారు. జైలులోని ఖైదీల అనుమానాస్పద కదలికలను ఆటోమేటిక్‌గా గుర్తించేలా వ్యవస్థను మెరుగుపర్చనున్నారు. సందర్శకులను కలిసిన తర్వాత ఖైదీలు నేరుగా తమ బ్యారక్‌లకు వెళ్లకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లడాన్ని నిరోధించడానికి బయోమెట్రిక్‌తో కూడిన టోకెన్ వ్యవస్థను తీసుకురానున్నారు. ఈ డిజిటల్ టోకెన్‌లో ఖైదీ వివరాలు, సమయం రిజిస్టర్ చేసి ఉంటాయి. దీంతో ఖైదీలు తమ గమ్యస్థానానికి చేరుకున్న వెంటనే ఆ వివరాలు సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ అవుతాయి. ప్రస్తుతం బెంగళూరు జైలులో సుమారు 5,000 మంది ఖైదీలు ఉన్నారు. వారానికి రెండు సార్లు మాత్రమే 10 నిమిషాల ఫోన్ మాట్లాడే అనుమతి ఉండడం వల్ల క్యూ ఎక్కువగా ఉంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని 8 సెంట్రల్ జైళ్లలో మొత్తం 115 డిజిటల్ కాలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఆ కాల్స్‌ను రికార్డు చేయనున్నారు.

పారదర్శకత కోసమే..

జైళ్ల పరిపాలనలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ వ్యవస్థను కేవలం మూడు నెలల్లో పూర్తి చేయాలని జైళ్ల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా రాష్ట్రంలోని జైళ్లను స్మార్ట్ జైళ్లుగా మార్చే ప్రయత్నంలో భాగంగా పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో తొలి అడుగు పడింది.

సులభంగా పర్యవేక్షణ చేయవచ్చు

'ఖైదీలు ఎవరిని కలిశారు? అక్కడ ఎంత సమయం గడిపారు? అనే వివరాలతో సహా, ములాఖత్ రూమ్, బ్యారక్స్, వంటగది, పని ప్రదేశం, అలాగే కోర్టు విచారణల కోసం వినియోగించే వీడియో కాన్ఫరెన్సింగ్ వ్యవస్థ ఉన్న గది వంటి మూలలను కొత్త వ్యవస్థతో ట్రాక్ చేయవచ్చు. ఖైదీల ప్రతి కదలికను పర్యవేక్షించడానికి శాఖ ప్రధాన కార్యాలయంలో ఒక కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు కానుంది. పరప్పన అగ్రహార జైలు, రాష్ట్రంలోని ఇతర కేంద్ర జైళ్ల ఖైదీలను కేంద్ర కార్యాలయంలోని కమాండ్ సెంటర్ ద్వారా పర్యవేక్షించవచ్చు' అని ఓ సీనియర్ అధికారి 'ఈటీవీ భారత్'కు చెప్పారు. డిజిటల్ నిఘాతో పాటు విచారణలో ఉన్న ఖైదీలు, శిక్ష పడిన ఖైదీలు కలిసి నేరాలకు ప్లాన్ చేయకుండా నిరోధించడంపై అధికారులు ఫోకస్ పెట్టారు. ఇందుకోసం వ్యూహాత్మక నిర్ణయాలను సైతం తీసుకున్నారు. ఆహారం తీసుకోవడం, చికిత్స పొందడం వంటి సాకులతో ఖైదీలు ఒకే చోట గుమిగూడకుండా ఉండేందుకు, విచారణ ఖైదీలు, శిక్ష పడిన ఖైదీల కోసం ప్రత్యేక క్యాంటీన్‌లు, ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్‌లను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా జైళ్లను మరింత మెరుగ్గా తయారవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ వ్యవస్థను తొలి దశలో పరప్పన అగ్రహార జైలులో అమలు చేసి తర్వాత రాష్ట్రంలోని అన్ని జైళ్లకు విస్తరించనున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

చూసొద్దామా.. టిప్పు ప్యాలెస్

యునెస్కో జాబితాలో చోటుకు యత్నం

చామరాజపేటలో ఉన్న టిప్పుసుల్తాన్ వేసవి విడిది

వేసవి విడిది భవనంలో రెండు అంతస్తుల కొయ్య,రాళ్లతో నిర్మించిన అద్భుతమైన భవనం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: మైసూరు మహారాజు టిప్పు సుల్తాన్ నగరంలో నిర్మించిన వేసవి విడిది ప్రాచీన భవనం యునెస్కో జాబితాలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ మేరకు పర్యాటక శాఖ యునెస్కోకు లేఖ రాశారు. ఆ సంస్థ ప్రతినిధులు వచ్చి పరిశీలించిన తరువాత జాబితాలో చేర్పించాలో లేదో నిర్ణయిస్తారని అధికారులు తెలిపారు. జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలియజేశారు. నగరంలోని ప్రాచీన కట్టడాల్లో టిప్పు విడిది ఒకటి. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు టిప్పు సుల్తాన్ వేసవి విడిది సందర్శిస్తున్నారు. నగరంలో ఉన్న ప్రాచీన కాలం నాటి మైసూరు రాజు టిప్పు సుల్తాన్ నిర్మించిన వేసవి విడిది పర్యాటకులను ఆకట్టుకుంటుంది. నిత్యం పర్యాటకులతో ఆప్రదేశం నిండిపోతోంది. సిటీ మార్కెట్ సమీపంలోని చామరాజపేటలో టిప్పు వేసవి విడిది భవనం ఉంది. స్వదేశీ వాస్తు ఆధారంగా ఆభవనాన్ని రాళ్లు, కొయ్యలతో కలిసి నిర్మించారు. రెండు అంతస్తుల భవనం నేటికి చెక్కుచెదర లేదు. భవనం లోపలకు వెళ్లిన వెంటనే శీతల గదిలోకి వెళ్లినట్లు అనుభూతి కలుగుతోంది. టిప్పు సుల్తాన్ కాలంలో ఉన్న నిపుణులు ఆభవనాన్ని నిర్మించారు. బయట విశాలమైన పచ్చిక బయలు, పక్కన లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఉంది. ఈ దేవస్థానాన్ని టిప్పు అభివృద్ధి చేశారని చరిత్ర చెబుతోంది. బ్రిటిష్ పాలకులు టిప్పుతో యుద్ధం చేసినా ఆయన నిర్మించిన భవనాలను ధ్వంసం చేయలేదు. నేటికీ ఆ భవనాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. సిటీ మార్కెట్ నుంచి విక్టోరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో బెంగళూరు కోట ఉంది. ఆకోటలోకి ఒసారి ప్రవేశిస్తే అనే విషయాలు తెలుసుకోవచ్చు. ఐదువందల ఏళ్ల కిందట నగర నిర్మాత కెంపేగౌడ బెంగళూరు కోటను నిర్మించారు. అక్కడి నుంచి మైసూరు రాజప్రస్థానం వరకు సొరంగ మార్గం ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. కోట లోపలకు వెళ్తే అక్కడ పెద్ద కాలువ దాని అవతల కోట నిర్మించారు. కెంపే గౌడ కాలం తీరిన తరువాత కోట టిప్పు సుల్తాన్ ఆధీనంలోకి వచ్చింది. బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ అధికారులు కోటను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు కోట పాడు కాలేదు. కోట సమీపంలోని ఆవరణలో 1900లో బ్రిటిష్ పాలకులు విక్టోరియా ఆసుపత్రిని ప్రారంభించారు. పర్యాటకుల చూడదగిన ప్రదేశాలుగా పర్యాటక శాఖ ప్రకటించింది. యునెస్కో జాబితాలో చేరితే ఈ ప్రదేశం మరింతగా అభివృద్ధి చెందటంతోపాటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని అధికారులు భావిస్తున్నారు.


స్వదేశీ శైలిలో రూపొందించిన కిటికీ

టిప్పు అభివృద్ధి చేసిన ప్యాలెస్ ఎదుటి దేవస్థానం

కారును జప్తు చేసుకోవాలని ఆదేశాలు

శివమొగ్గ, న్యూస్‌టుడే: రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని న్యాయస్థానం గుర్తించింది. ప్రభుత్వ పథకాలకు 1992లో భూమిని ఇచ్చిన రైతు నందాయప్పకు రూ.22 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.9 లక్షలు మాత్రమే విడుదల చేసింది. బకాయి విడుదల చేయాలని గత 36 ఏళ్లుగా నందాయప్ప, అతని కుటుంబ సభ్యులు జిల్లాధికారి కార్యాలయాన్ని చుట్టి వచ్చినా పరిహారం విడుదల కాలేదు. మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అతనికి రూ.95,88,283 విడుదల చేయాలని రెండో సివిల్ న్యాయస్థానం ఆదేశించింది. ఆదేశాలను పరిగణనలోకి తీసుకోలేదని గుర్తించిన న్యాయమూర్తి, జిల్లాధికారి వాడుతున్న కారును జప్తు చేసుకోవాలని ఆదేశించారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: సఖరాయ పట్టణకు చెందిన గ్రామ పంచాయతి సభ్యుడు గణేశ్ (38) హత్య కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అజయ్, నితిన్ అలియాస్ సైన్స్, దర్శన్ అలియాస్ జపాన్ అనే నిందితులు పరారీలో ఉన్నారని ఎస్పీ విక్రం అమటె తెలిపారు. సఖరాయ పట్టణలో అల్లర్లు చెలరేగకుండా 180 మంది పోలీసులు, ఒక కేఎస్ఆర్‌పీ బెటాలియన్‌ను భద్రత కోసం రంగంలోకి దించారు. ఇప్పటికే అరెస్టు చేసిన నిందితుల్లో ఒకడైన మిథున్ బజరంగదళలో కీలక సభ్యుడని గుర్తించారు.

గణేశ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

శివమొగ్గ, న్యూస్‌టుడే: ఆయనూరు సమీపంలోని హారనహళ్లి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫ్ (25), చాంద్ పీర్ (18) అనే యువకులు మరణించారు. ఎదురెదురుగా వచ్చిన బైకులు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. కింద పడిన వీరిద్దరిపై నుంచి వెనుకగా వచ్చిన భారీ వాహనం వెళ్లడంతో వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. కుంసి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

ధార్వాడ, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ గేమ్‌ల వ్యసనం బారిన చిక్కుకుని అప్పుల పాలైన బసవరాజ సక్రప్పనవర (28) అనే యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్ గేమ్‌లో పలుసార్లు డబ్బు పోగొట్టుకున్నాడు. ఇతర సిబ్బంది అప్పుగా తీసుకున్నాడు. రూ.3 లక్షల తన ఖాతాకు మళ్లించుకున్నాడు. తిరిగి ఆ మొత్తాన్ని చెల్లించడం సాధ్యం కాకపోవడంతో తన స్వగ్రామం మంగళగట్టిలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గరగ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నడిరోడ్డులో తూటా పేల్చాడు

యాదగిరి, న్యూస్‌టుడే: గురుమఠకల్ తాలూకా సిద్ధాపుర గ్రామంలో వివాహం అనంతరం వధూవరులను ఊరేగిస్తున్న సమయంలో రౌడీషీటరు చంద్రశేఖర్ తన డబుల్ బ్యారెల్ గన్‌తో గాల్లోకి మూడుసార్లు కాల్పులు జరిపాడు. కాల్పుల అనంతరం సంతోషంతో కేకలు వేశారు. కాల్పుల వీడియో వైరల్ కావడంతో గురుమఠకల్ ఠాణా పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. నిందితుడు ముందుగా గ్రామ పంచాయతీ సభ్యుడని పోలీసులు తెలిపారు.

నిందితురాలికి బెయిలు మంజూరు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: భిక్షాటన కోసం రెండేళ్ల బిడ్డను అపహరించిన కేసులో నిందితురాలైన రాధ అనే మహిళకు జస్టిస్ శివశంకర్ అమరణ్ణనవర్ బెయిలు మంజూరు చేశారు. మండ్య జిల్లా హొసహళ్లికి చెందిన రాధ చామరాజనగర నివాసి అనిత, ఆమె రెండేళ్ల కుమార్తెను తనతో తీసుకెళ్లింది. తన కుమార్తె, మనవరాలు కనిపించకుండా వెళ్లారని అనిత తల్లి సరోజమ్మ చామరాజనగరం ఠాణాలో 2024 నవంబరు 14న ఫిర్యాదు చేసింది. గాలింపు చేపట్టగా, మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న అనిత స్థానిక బస్టాండ్‌లో కనిపించింది. ఆమె కుమార్తె కోసం గాలింపు కొనసాగించగా, మైసూరు రైల్వే స్టేషన్‌లో నవంబరు 19న చిన్న బిడ్డతో భిక్షం అడుక్కుంటూ రాధ దొరికిపోయింది. అప్పటి నుంచి కారాగారంలో ఉన్న నిందితురాలు వేసుకున్న అర్జీని పరిగణనలోకి తీసుకుని షరతులతో కూడిన బెయిలు మంజూరు చేశారు.

జంతువులకూ జీవించే హక్కు ఉంది

హొసపేటె, న్యూస్‌టుడే: వన్యప్రాణులకూ జీవించే హక్కు ఉందని, మానవుడు-వన్యప్రాణుల నడుమ మనుగడ కోసం సాగే సంఘర్షణలో చాలా జంతువులు ప్రాణాలు కోల్పోతున్నాయని హైకోర్టు న్యాయమూర్తి ఆర్.నటరాజ్ విచారం వ్యక్తం చేశారు. జిల్లా న్యాయశాఖ, న్యాయవాదుల సంఘం, అటవీశాఖల సంయుక్తంగా దరోజీ భల్లూకాల సంరక్షణ కేంద్రంలో ఆదివారం 'మానవ-వన్యప్రాణుల సంఘర్షణ-సమస్యలు,సవాళ్లు' అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. అటవీ సంపద నాశనం చేసి, ఆ ప్రాంతాల్లో జనావాసం ఏర్పాటు చేసుకోవడం తప్పు. వన్యప్రాణులుండే ప్రాంతాల్లో మనిషి సంచరించడాన్ని సృష్టించే శారు. పలు సందర్భాల్లో ఆహారం, నీరు దొరక్క వన్యప్రాణులు గ్రామాలమీద పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బళ్లారి, విజయనగర జిల్లాల న్యాయమూర్తులు కె.జి.శాంతి, కె.ఎం. రాజశేఖర్, బళ్లారి, విజయనగర జిల్లాల ఉప అటవీ సంరక్షణాధికారులు డాక్టర్ బసవరాజ్, అనుపమా తదితరులు పాల్గొన్నారు.

మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి నటరాజ్, జిల్లా న్యాయమూర్తులు

ఉరకలెత్తిన బెంగళూరు మిడ్‌నైట్ మారథాన్

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: బెంగళూరు మిడ్‌నైట్ మారథాన్ 18వ ఎడిషన్‌కు చక్కని స్పందన లభించింది. పదివేల మందికిపైగా ఔత్సాహికులు మారథాన్‌లో పాల్గొనగా అందులో 900 మందికి పైగా రక్షణ దళాలకు చెందిన వారు ఉన్నారు. ఫుల్ మారథాన్ పురుషుల విభాగంలో నరేశ్ థాపా 3.41.08 గంటల్లో పరుగు పూర్తి చేసి విజేతగా నిలిచారు. మహిళల విభాగంలో బిజోయ బర్మన్ 3.35.34 గంటల్లో పరుగు పూర్తి చేయగా, ఇతర విభాగాల్లో పరజి గ్రెహామ్, దేవాంగి దేవాంగి పర్యాయ్య విజేతలుగా బంగారు పతకాలను అందుకున్నారు. రోటరీ బెంగళూరు ఐటీ కారిడార్, ఫోన్‌పే సంయుక్తంగా నిర్వహించిన మారథాన్‌ను మహదేవపుర ఎమ్మెల్యే మంజుల అరవింద లింబావళి, రక్షణ శాఖ అధికారి మేజర్ జనరల్ వీటీ మ్యాథ్యూ సంయుక్తంగా ప్రారంభించారు. మహిళా విభాగంలో నీతు కుమారి, ఊటీ నుంచి వచ్చిన శివం సింగ్ యాదవ్‌లు హాఫ్ మారథాన్‌లో విజేతలుగా నిలిచారు. ఆయా విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి పతకాలు, ప్రమాణ పత్రాలు, నగదు ప్రోత్సాహకాలను వితరణ చేశారు.

పరుగుకు ముందస్తుగా వ్యాయామం చేస్తున్న ఔత్సాహికులు

31.6 కి.మీ. మారథాన్ విజేతలు

ఫుల్ మారథాన్ విజేతలు

హాఫ్ మారథాన్ విజేతలు

చురుగ్గా క్రస్ట్‌గేట్ల తొలగింపు పనులు

యంత్రాలతో కోసి తొలగిస్తున్న క్రస్ట్‌గేట్లు

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆనకట్టలో పాత క్రస్ట్‌గేట్లను కోసి తొలగించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం నుంచి గేట్ల బిగింపు ముందస్తు పనులు చేపట్టడం జరిగిందనే. గేట్లను కోసి తొలగించడానికి గుత్తేదారులు, నిపుణులు, కార్మికులతో మూడు బృందాలను ఏర్పాటు చేసి పనులను చేయిస్తున్నారు. ప్రస్తుతం తుంగభద్రలో నిల్వ ఉన్న జలాలు గేట్లను సగానికి తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో చాలా జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేస్తున్నారు. కొంత ఆదమరిచినా ప్రమాదం తప్పదు కాబట్టి కార్మికుల సంరక్షణ అన్ని జాగ్రత్తలు తీసుకుని పనులు మొదలుపెట్టారు. మొత్తం 32 పాత గేట్లను తొలగించేలోగా నీటి నిల్వలు 43 టీఎంసీలకు చేరుకునే అవకాశం ఉంది, తర్వాత గేట్ల బిగింపు పనులు ప్రారంభిస్తారు. ఈనెల 20 నుంచి ఎట్టకేలకు గేట్ల బిగింపు పనులు చేపట్టాలని కొప్పళ జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడిని సూచనలు ఇవ్వడంతో గుత్తేదారు కంపెనీ ప్రతినిధులు, జలవనరులశాఖ, తుంగభద్ర మండలి అధికారులు దగ్గిరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

'వ్యసనముక్త రాష్ట్రం మా లక్ష్యం'

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: కర్ణాటకను మాదక ద్రవ్య వ్యసన ముక్త రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ వెల్లడించారు. ఈ దిశలో రాష్ట్ర పోలీసులు తీసుకుంటున్న చర్యలు అత్యుత్తమంగా ఉన్నాయని ప్రశంసించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా బెంగళూరు నగర పోలీసులు, ఫెడరేషన్ ఆఫ్ హిస్టోరిక్ వెహికల్స్ ఆఫ్ ఇండియా, పాల్ జాన్ రిసార్ట్స్ అండ్ హోటల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన వింటేజ్, క్లాసిక్ కార్ల ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. రెండేళ్లలో రూ.300 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను జప్తు చేసుకున్నామని గుర్తు చేశారు. కర్ణాటకతో పాటు, దేశంలోని పలు ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలకు బానిస అవుతున్న యువత సంఖ్య ఎక్కువ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తు, ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలకు వెళ్తున్న బాలలకు మాదక ద్రవ్యాలను మొదట చాక్లెట్లలో పెట్టి ఇస్తుంటారని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ రవి ప్రకాశ్, డీజీపీ డాక్టర్ ఎంఏ సలీం, నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్, నటుడు మదన్ పటేల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విధాన సౌధ నుంచి బిగ్ బనియాన్ వైన్ యార్డ్ వరకు ర్యాలీ కొనసాగింది.

మాదక ద్రవ్యాలు వద్దని నినాదాలు రాసి ప్రదర్శిస్తున్న యువతులు, మహిళా పోలీసు సిబ్బంది

వింటేజ్ వాహనానికి జెండా ఊపుతున్న డాక్టర్ రవి ప్రకాశ్, డాక్టర్ ఎంఏ సలీం, సీమంత్ కుమార్ సింగ్‌లతో కలిసి హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

విధానసౌధలో వరుసగా నిలిపిన వింటేజ్ కార్లు

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: పాఠశాల యాజమాన్యం పరిస్థితులతో రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందజేయాలని రాష్ట్ర చిన్న పరిశ్రమల అభివృద్ధి మండలి అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే టి. రఘుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం తాలూకాలోని పరశురాంపురంలో మొరార్జీ దేశాయి గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ అధ్యక్షుడు రుద్రేశ్, తాలూకా పంచాయతీ మాజీ సభ్యులు సమర్థ రాయ్, నేతలు నాగభూషణ, చెన్నకేశవ తదితరులు ఉన్నారు.

పరశురాంపురంలోని బడి పిల్లల సమస్యలను అడిగి తెలుసుకొంటున్న ఎమ్మెల్యే

దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలి

త్రిచక్ర వాహనాలను దివ్యాంగులకు అందజేస్తున్న జిల్లా బాధ్యమంత్రి సుధాకర్

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: సమాజం దివ్యాంగుల పట్ల కనికరం చూపించవలసిన అవసరం లేదని దానికి బదులు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి అవకాశాలను కల్పిస్తే వారు తమ సొంత కాళ్లపై నిలబడగలరని జిల్లా బాధ్య మంత్రి డి సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన హిరియూరులో ఎమ్మెల్యే స్థానిక అభివృద్ధి నిధుల కింద కొనుగోలు చేసిన యంత్ర చాలిత త్రిచక్ర వాహనాలను, నగరసభ నిధుల కింద కొనుగోలు చేసిన వంటగ్యాస్ కనెక్షన్లు, త్రిచక్ర వాహనాలను దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీల లబ్ధిదారులకు, పౌర కార్మికులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నగరసభ కమిషనర్ వాసీం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

చెళ్లకెర, న్యూస్‌టుడే: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందిన ఘటన ఆదివారం తాలూకాలో చోటుచేసుకున్నట్లు చెళ్లకెర పోలీసుస్టేషన్ అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు..

ద్విచక్ర వాహనం నుంచి పడి ఇద్దరు..

తాలూకాలోని వసూరు గ్రామం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి రహదారి పక్కన విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో కాలువేహళ్లి గ్రామానికి చెందిన ప్రకాశ్ (24), మధు(23) అనే యువకులు ప్రమాద స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వారు గ్రామం నుంచి చెళ్లకెరకు బయలుదేరారు. ఆ చీకట్లో ఈ దుర్ఘటన చోటు చేసుకొందని తెలిపారు. ఉదయం ప్రమాద స్థలానికి సమీపంలో గల పొలంలో పనులు చేయడానికి వెళ్తున్న వ్యవసాయ కూలీలు రహదారి పక్కన పడిన వారి జేబులోని చరవాణి రింగ్ కావడంతో గమనించారు. ప్రమాదం విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. చెళ్లకెర పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను చెళ్లకెర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్తు స్తంభం వద్ద పడిపోయిన యువకులు

లారీ ఢీకొని బాలుడు..

చెళ్లకెర: వంట పాత్రల లోడుతో వెళ్తున్న టెంపోను వెనుక వైపు నుంచి దూసుకొచ్చిన లారీ ఢీకొన్న ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృత్యుపాలయ్యాడు. టెంపోలో ప్రయాణిస్తున్న అయాన్ (11) ఈ దుర్ఘటన లో ప్రాణాలు కోల్పోయాడు. తాలూకాలోని విడుపనకుంటే వద్ద ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. టెంపో చోదకుడు దాదా పీర్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకొన్నాడు. ఈ ప్రమాదంలో టెంపోతోపాటు, విక్రయానికి తీసుకెళ్తున్న వంట పాత్రలు ధ్వంసం అయ్యాయి. చెళ్లకెర పోలీసు ఠాణాలో కేసు నమోదయింది.

విడపనకుంటే వద్ద ప్రమాదానికి గురైన టెంపో

బాధితురాలిపైనే కేసు పెట్టారు

బెంగళూరు (గ్రామీణం): తనపై లైంగిక దౌర్జన్యం జరిగిందని ఫిర్యాదు చేసిన మహిళపైనే ఆనేకల్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. కడుపులో తరచూ నొప్పి రావడంతో స్కానింగ్ కోసం రేడియాలజిస్టు జయకుమార్ వద్దకు పది రోజుల క్రితం వచ్చింది. ఆ సమయంలో జయకుమార్ తనపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడంటూ ఆమె ఆనేకల్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఇప్పుడు ఆమె తప్పుడు కేసు పెట్టిందని, హనీట్రాప్‌కు ప్రయత్నించిందంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులతో ఇన్‌స్పెక్టర్ తిప్పేస్వామి కుమ్మక్కై తనపై కేసు నమోదు చేశారని బాధితురాలు ఆరోపించింది.

EENADU Classifieds
JOBS
ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ: 20k. ✆ 89776 39662,89776 39663.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

11న ది డెవిల్ విడుదల

ప్రముఖ సినీనటుడు దర్శన్ నటించిన 'ది డెవిల్' చిత్రం ఈనెల 11న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. హత్య కేసులో సినీ నటుడు దర్శన్ జైల్లో ఉన్న విషయం తెలిసిందే. జైమాత కంబైన్స్ బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌ను ప్రేక్షకులు, అభిమానులు విపరీతంగా ఆదరించారు. ప్రేక్షకుల్లో ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు ప్రకాశ్ వీర్ తెలిపారు. రెండేళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. షర్మిళా మాండ్రె, సోనియా, యువరాజ్ తదితరులు నటిస్తున్నారు.

ది డెవిల్ చిత్రంలో హీరో దర్శన్


పద్మగంధి చిత్రం నటులు

పద్మగంధి టీజర్ వచ్చేసింది

కమల పువ్వు కథ ఆధారంగా వివిధ భాషల్లో నిర్మిస్తున్న 'పద్మగంధి' చిత్రం టీజర్ ఇటీవల విడుదల చేశారు. కన్నడ, సంస్కృత, హిందీ భాషల్లో నిర్మిస్తున్నట్లు దర్శకుడు కె.సుచేంద్ర తెలిపారు. వివిధ అంశాలపై పరిశోధన చేసి కొన్నింటిని చిత్రకథగా మలిచి చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కుమారి మహాపద్మ, పరిపూర్ణ చంద్రశేఖర్, డాక్టర్ ఆర్.గణేశ్, డాక్టర్ గౌరిసుబ్రహ్మణ్య, డాక్టర్ ప్రేమా, డాక్టర్ హేమంత్‌కుమార్, ఆచార్య మృత్యుంజయ శాస్త్రి, జి.ఎల్.భట్, పండిత్ ప్రసన్న వైద్య, డాక్టర్ దీపక్ పరమశివన్, హేమంతకుమార్.జి నటిస్తున్నారు.

ఫస్ట్‌శాలరీ చిత్రీకరణ షురూ

శ్రీరాఘవేంద్ర చిత్రవాణి సంస్థ బ్యానర్‌పై 'ఫస్ట్ శాలరీ' చిత్రం చిత్రీకరణ ప్రారంభమైంది. నిర్మాత సుధీంద్ర వెంకటేశ్ కుమారుడు పవన్ వెంకటేశ్ చిత్రంద్వారా కన్నడ చిత్రపరిశ్రమలోకి అడుగు పెడుతున్నారు. సినీప్రముఖుల రాక్‌లైన్ వెంకటేశ్, శృతి, కమలాకర్ తదితరులు నూతన నటుడిని దీవించారు. తండ్రీకొడుకుల మధ్య ఉన్న అనుబంధమే చిత్రకథ, ఆరుపాటలు ఉంటాయని దర్శకుడు సుధీంద్ర వెంకటేశ్ తెలిపారు. హరిణి శ్రీకాంత్, యతిరాజ్, త్రిశూల్, స్నేహశ్రీ, రక్షిత్, విజయ కుమార్ తదితరులు నటిస్తున్నారు. విజయహరిత్స సంగీతం అందిస్తారు.

ఫస్ట్ శాలరీ చిత్రబృందం

చిత్రంలో శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టితో కూడిన పోస్టర్

క్రిస్మస్‌కు 45 రాక

ప్రముఖ సినీనటులు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్‌బి.శెట్టి కలిసి నటించిన పాన్‌ఇండియా చిత్రం '45' క్రిస్మస్ రోజు 25వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. అందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. సంగీత దర్శకుడు అర్జున్‌జన్య తొలిసారి చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈనెల 15న చిత్రం టీజర్‌ను విడుదల చేయనున్నారు. జరిగే టీజర్ కార్యక్రమాన్ని నేరుగా మైసూరు, మంగళూరు, తుమకూరు, దావణగెరె, శివమొగ్గ, హొస్పేట్, హుబ్బళ్లి చిత్రమందిరాల్లో ప్రసారం చేయనున్నారు. తిలకించేందుకు అభిమానులకు ఉచితం ప్రవేశం కల్పిస్తారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రంలో కిక్కిరిసిన టెట్ పరీక్షార్థులు

ప్రశాంతంగా టెట్

హొసపేటె, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆదివారం పట్టణంలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 19 కేంద్రాల్లో 6570మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. దీంతో ఉదయంనుంచి అన్ని కేంద్రాలు అభ్యర్థులతో కిక్కిరిశాయి. ప్రతీ విద్యార్థినుంచి బయోమెట్రిక్ తీసుకుని పరీక్ష గదులకు అనుమతించారు. ఓ కేంద్రంలో కొంతసేపు బయోమెట్రిక్‌లో సాంకేతిక లోపాలు రావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది, తరువాత నిపుణులు సరిచేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు.

14న సాంస్కృతికోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ అధ్యక్షుడు గురియప్ప,సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: జనసిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న నగరంలోని బసవరాజేశ్వరి పబ్లిక్ పాఠశాలలో సాంస్కృతికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు గరియప్ప తెలిపారు. ఆదివారం ఉదయం పత్రికాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బైలూరు శ్రీ శివశరణ మల్లప్ప తాత, శ్రీజ్ఞానజ్యోతి జడేశ శివలింగ మందిరం శ్రీజడేశ తాత, సోమసముద్రం శ్రీసిద్ధలింగ దేశీయ స్వామి, శ్రీధరగడ్డ కొట్టూరుస్వామి సంస్థానమఠం విరక్తమఠం మరికొట్టూరు దేశీయస్వామి తదితరులు పాల్గొని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

10 కి.మీ. పొడవునా గుంతల పూడ్చివేత

జంగమర కల్గుడి - హొసళ్లి మార్గంలో పూడ్చివేతల అనంతరం రహదారి

ఈనాడు కథనానికి స్పందన

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: గంగావతి తాలూకాలోని జంగమర కల్గుడి-హొసళ్లి క్రాస్ మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద దారి మధ్యలో అగాధాన్ని తలపించే గుంత ఉండేది. రాత్రి వేళ ఎదురుగా వాహనం వస్తే ద్విచక్ర వాహన చోదకులకు ఈ గుంత కన్పించక ప్రమాదాలు జరిగేవి. ఇదే మార్గంలోని తుంగభద్ర వితరణ కాలువ వద్ద మరో రెండు గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయమై 'ఈనాడు'లో అక్టోబరు 6న 'రహదారి మధ్యలో అగాధం' అన్న వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన అధికారులు ఈ మార్గంలోని దాదాపు 4 కిలోమీటర్ల పొడవునా గుంతలను అలాగే గంగావతి-హొసళ్లి క్రాస్ గుండా చిక్క జంతకల్ మార్గంలోని ఆరున్నర కిలోమీటర్ల పొడవునా ఉన్న గుంతలను మూడు వారాలుగా సిబ్బంది పూడుస్తూ వచ్చారు.

రాబకొవికి నష్టాల కొరివి

➠ సహకార సంఘాల సమాఖ్య రూ.7.32 కోట్ల నష్టం ➠ తాజా సమావేశంతో కొంగొత్త ఆశలు

రాబకొవి పరిపాలన భవనం

బళ్లారి, న్యూస్‌టుడే: రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సమాఖ్య (రాబకొవి) నష్టాలతో విలవిల్లాడుతోంది. 2025 మార్చికి రూ.4.20 కోట్లు, ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రూ.3.12 కోట్ల నష్టాలు మూటగట్టుకుంది. నిర్వహణ ఖర్చులు పెరగడం, మార్కెటింగ్ లోపాలు, తడిసి మోపెడవుతున్న విద్యుత్తు ఛార్జీలతో సంస్థ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

నష్టాలు దాటితేనే భవిష్యత్తు

సంస్థను లాభాల్లోకి తీసుకు రావడానికి శ్రమించాలి. ప్రధానంగా పాడి రైతులు అందజేస్తున్న ధర తగ్గించడం సరికాదు. గతంలోనూ ఓసారి తగ్గిస్తే పాడి రైతులు ఇబ్బందులు పడ్డారు. లాభాల్లో తీసుకుని రావడానికి అధికారులు శ్రమించాల్సి ఉంది. ప్రతి నెల రాబకొవి విద్యుత్ ఛార్జీలు రూ.25 లక్షలు చెల్లిస్తున్నారు. ఈ విద్యుత్ ఛార్జీలను తగ్గించడానికి సోలార్ విద్యుత్తు ఉపయోగించడంపై దృష్టి సారించాలి. కొత్త మార్కెటింగ్ వ్యూహాల అమలు అవసరం.

తాజా ఆశలు

సంస్థ సమావేశం అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాళ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు భీమానాయక్ మినహా మిగిలిన 11 మంది సభ్యులతో పాటు, నామినేటెడ్ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంతో కొత్త ఆశలు చిగురించాయి. రాబకొవిని లాభాల్లోకి తీసుకుని రావడానికి సుదీర్ఘంగా చర్చించారు. ఎండీ ప్రభులింగయ్య పాడి రైతులకు ఇస్తున్న ధరలో లీటరుపై రూ.2 నుంచి రూ.2.50లకు తగ్గించాలని సలహా ఇచ్చారు. దీనిపై అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాళ్, ఉపాధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు.

నాయకుల సూచనలు

- పెరిగిన ఖర్చులను తగ్గించుకోవడం, ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న పాలను మార్కెటింగ్‌పై చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- సోలార్ విద్యుత్ ఉపయోగించడం వల్ల నెలకు రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు ఆదా అవుతుందని పలువురు సభ్యుల సలహా.
- ప్రస్తుతం ఉన్న ఇతర ఖర్చులు కూడా తగ్గించుకోవాలి. 15 రోజులు తర్వాత మళ్లీ సమావేశం కావాలి.
- పాడి రైతులకు 10 రోజులకు ఓసారి డబ్బులు ఇవ్వాలి. ప్రస్తుతం 30 నుంచి 40 రోజులు పడుతోంది.
- బ్యాంకులో రూ.15 కోట్లు రుణం తీసుకుని పాడి రైతులకు 10 రోజులకు డబ్బులు చెల్లించే చర్యలు.

మెగా డెయిరీ పనులు త్వరలో..

సంస్థ అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాళ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

కొళగల్లు గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణానగర క్యాంపు వద్ద మెగా డెయిరీ పనులపై కూడా చర్చించాం. మెగా డెయిరీపై గతంలో సీఎం సిద్ధరామయ్యకు వివరించాం. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి సూచనలిచ్చారు. గతంలో మెగా డెయిరీకి మొత్తం రూ.132 కోట్లతో నివేదిక సిద్ధం చేశారు. కె.ఎం.ఇ.ఆర్.సి రూ.80 కోట్లు విడుదల చేసింది. మెగా డెయిరీ నిర్మాణ ఖర్చులు పెరిగిపోవడంతో మెగా డెయిరీ నిర్మాణం, అధునాతన పరికరాలు కొనుగోలు చేయడం వేర్వేరుగా డి.పి.ఆర్ సిద్ధం చేయిస్తున్నాం. కె.ఎం.ఎఫ్ అధ్యక్ష ఎన్నిక కూడా త్వరలో జరుగుతుంది.

ఆరోగ్య స్థాయి సమితి అధ్యక్షుడు పేరం వివేక్

బళ్లారి నగర పాలికె ఆరోగ్య స్థాయి సమితి అధ్యక్షుడిగా పేరం వివేక్ ఎంపికయ్యారు. ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. వివేక్‌ను ఈ సందర్భంగా పలువురు సన్మానించి అభినందించారు.

- న్యూస్‌టుడే, బళ్లారి

త్రిచక్ర వాహనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పురసభ పరిధిలోని దివ్యాంగులు త్రిచక్ర వాహనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పురసభ ముఖ్యాధికారి డాక్టర్ సాబణ్ణ కోరారు. అర్హులైన దివ్యాంగులు ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబోమన్నారు.

10న చలో బెళగావి సువర్ణ సౌధ

చలో బెళగావి సువర్ణసౌధ గోడపత్రికలను విడుదల చేసిన నాగలక్ష్మి తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న చలో బెళగావి సువర్ణసౌధ నిర్వహిస్తున్నట్లు సంయుక్త ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.నాగలక్ష్మి తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చలో బెళగావి సువర్ణసౌధ గోడపత్రికలను విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవ వేతనం రూ.15000లు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నెలవారి వేతనం రూ.10వేలు, గ్యారంటీలు, అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజనం కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.1500 ప్రోత్సాహధనం ఇవ్వాలి. పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహధనం విడుదల చేయాలి. విశ్రాంత పొందిన ఆశాలకు ప్రోత్సాహధనం ఇవ్వాలి. నగరంలో పనిచేస్తున్న ఆశాలకు రూ.2 వేలు గౌరవ ధనం ఇవ్వాలి. తదితర డిమాండ్లు పరిష్కరించాలని చలో బెళగావి సువర్ణసౌధ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు శాంత, రేష్మ, ఖైరూన్, శివకుమారి, రేణుక, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో యువత ముందంజ

కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న సంఘాలు, సంస్థల ప్రతినిధులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: అంబేడ్కర్ అందించిన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని శాసనసభ్యుడు బి.ఎం.నాగరాజు పేర్కొన్నారు. అంబేడ్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం అంబేడ్కర్ కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. న్యాయవాదుల సంఘం, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కన్నడ సాహిత్య పరిషత్ సంయుక్తంగా శనివారం రాత్రి అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీగా అంబేడ్కర్ కూడలికి చేరుకుని నివాళులర్పించారు. సంఘల అధ్యక్షులు ఉప్పార వెంకోబ, టి.హుచ్చీరప్ప, డా.మధుసూదన కారిగనూరు, పదాధికారులు, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వాహనాలు ఇలా..సంచారం ఎలా?

రోడ్డుపైనే వాహనాలు

రోడ్డుపైనే వ్యాపారం

బళ్లారి, న్యూస్‌టుడే: నగర నడిబొడ్డున తేరువీధిలోని దొడ్డమార్కెట్ వద్ద రోడ్డుపై వ్యాపారాలు, నడిరోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు నగర పాలికె అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసులకు ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. నగర పాలికె పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు మార్కెట్ వద్ద ఉంటూ వాహనాలను గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్ చేసేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. దొడ్డ మార్కెట్‌కు వచ్చే వినియోగదారుల వాహనాలు పార్కింగ్ కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ ఫ్లోర్‌ను ఏర్పాటు చేయడంతో ఇక్కడ రద్దీ సమస్య తప్పింది.

కమనీయం.. ధార్మిక మహోత్సవం

విరూపాక్షేశ్వర-పంపాంబికె అమ్మవారి పూజా కార్యక్రమం

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ ఆది దేవుళ్లు విరూపాక్షేశ్వర-పంపాంబికెల నిశ్చయ తాంబూల కార్యక్రమంగా పిలుచుకొనే ఫలపూజా మహోత్సవం శనివారం రాత్రి కనుల పండువగా జరిగింది. తుంగభద్ర నదీ తీరంలోని చక్రతీర్థ కోదండ రామాలయం ఆవరణలో జరిగిన ఈ ధార్మిక కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఫలపూజా మహోత్సవం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో అర్చకులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని పూర్తి చేశారు. విద్యారణ్య భారతీ స్వామీజీ నేతృత్వం వహించిన ఈ కార్యక్రమం అర్ధరాత్రి వరకూ సాగింది. ఈ సందర్భంగా విరూపాక్షేశ్వర ఆలయ ఆవరణలో భక్తులు పెద్ద ఎత్తున దీపాలను వెలిగించారు.

ఉత్సవాన్ని తిలకించటానికి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు

విజయపుర-యశ్వంత్‌పుర రైలు సేవలు క్రమబద్ధం

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేటె మీదుగా విజయపుర-యశ్వంత్‌పుర నడుమ సంచరిస్తున్న ప్రత్యేక రైలు సేవలను సోమవారం నుంచి క్రమబద్ధం(రెగ్యులర్) చేశారు. దాంతో టికెట్ ధరలు బాగా తగ్గనున్నాయి. హొసపేటె నుంచి యశ్వంత్‌పురకు ఇంతకు ముందు రూ.175 ఉన్న టికెట్ ధర ఇకపై రూ.160కు తగ్గుతుంది. స్లీపర్ ధరలు రూ.390 నుంచి రూ.285కు, ఏసీ కోచ్ ధరలు రూ.1060 నుంచి రూ.765కు తగ్గుతాయి. రోజూ రాత్రి 9.30కు యశ్వంత్‌పుర నుంచి బయల్దేరే ఈ రైలు (సంఖ్య: 16547) తుమకూరు, దావణగెరె, కొట్టూరు మార్గం గుండా ఉదయం 5.50కు హొసపేటె చేరుకుంటుంది. ఇక్కడ నుంచి బయల్దేరి కొప్పళ, గదగ, బాగలకోటె గుండా 11.25కు విజయపుర చేరుతుంది. మధ్యాహ్నం 1.50కు విజయపుర నుంచి బయల్దేరే ఈ రైలు (సంఖ్య:16548) వ్యతిరేక మార్గాల్లో సంచరించి రాత్రి 7.20కు హొసపేటె వస్తుంది. ఇక్కడి నుంచి బయల్దేరి ఉదయం 5కు యశ్వంత్‌పుర చేరుకుంటుంది. ప్రత్యేక రైలును ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉండేది, ఇప్పుడు క్రమబద్ధం చేయడంతో ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు కల్గనుంది. ఈ రైలును క్రమబద్ధం చేయాలని నైరుతి రైల్వే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చామని విజయనగర రైల్వే వినియోగదారుల సంఘం అధ్యక్షుడు యమునేశ్, కార్యదర్శి కుడతిని మహేశ్‌లు పేర్కొన్నారు.

నాటకంలో రసవత్తర సన్నివేశం

ప్రేక్షకులను ఆకట్టుకొన్న కురుక్షేత్రం

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: జిల్లా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన కురుక్షేత్రం బయలు నాటకం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకొంది. శనివారం రాత్రి 10 గంటలకు ప్రారంభమయిన నాటకం ఆదివారం వేకువ జామున 5 గంటల వరకు కొనసాగింది. .జిల్లా ప్రధాన న్యాయమూర్తి రోణ్ వాసుదేవ్ నాటకాన్ని ప్రారంభించి మాట్లాడారు. న్యాయవాదులు తమ వృత్తి పనుల ఒత్తిళ్లను పక్కనబెట్టి సమయాన్ని వెచ్చించి నెలల తరబడి సాధన చేసి నాటకాన్ని ప్రదర్శించడం అభినందించదగ్గ విషయమన్నారు.

28న రాష్ట్రస్థాయి విజ్ఞాన సదస్సు

వేదికపై రాష్ట్ర విజ్ఞాన పరిశోధన మండలి డైరెక్టర్ చన్నబసవస్వామి

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్ర విజ్ఞాన పరిశోధన మండలి-2025 ఆధ్వర్యంలో డిసెంబరు 28 నుంచి మూడు రోజుల పాటు యాదగిరి జిల్లా క్రీడా మైదానంలో 5వ రాష్ట్ర స్థాయి విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విజ్ఞాన పరిశోధన మండలి డైరెక్టర్ ఆర్.హెచ్.ఎం.చన్నబసవస్వామి తెలిపారు. ఆదివారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రాష్ట్ర స్థాయి విజ్ఞాన పరిశోధన సదస్సుకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్‌దాస్, ఇస్రో మాజీ ఛైర్మన్ డా.ఎ.ఎస్.కిరణ్‌కుమార్, డా.హులికాల్ నటరాజ్, తదితరులు పాల్గొని ప్రారంభిస్తున్నట్లు వివరించారు. డిసెంబరు 11న మధ్యాహ్నం 3.30లకు ఇంద్రజాలం(పావాడ రహస్య) కార్యక్రమం స్థానిక హొసపేటె రహదారిలోని జ్ఞానామృత కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా.హులికల్ నటరాజ్ పాల్గొనున్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు

క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతుల అందజేత

కంప్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించాలి. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని కంప్లి భారతీ శిశు విద్యాలయ ఉపాధ్యక్షుడు ఎస్.అనిల్ కుమార్ తెలిపారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి ఆదివారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించాలన్న పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యదర్శి జువేరిలాల్ బాగ్రేచా, నాయకులు అరవి బసవనగౌడ, ప్రసాద్ గడాద, శాంతిలాల్ సింఘ్వి, చేతన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని విజయవంతం చేద్దాం

మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు బసవరాజ్

హొసపేటె, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో గుత్తత ఆధారంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల న్యాయసమ్మతమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20, 21 తేదీల్లో బెంగళూరులో చేపట్టిన నిరవధిక ధర్నాను విజయవంతం చేద్దామని సీఐటీయూ నాయకుడు బసవరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విజయనగర జిల్లా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో ఈ విధంగా విధులు నిర్వహిస్తున్న వారు చాలా తక్కువ వేతనాలు అందుకుంటున్నారని, ఉద్యోగ భద్రత లేకుండా దిక్కులు చూసే పరిస్థితి దాపురించిందని వాపోయారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రాజధానిలో చేపట్టిన ఉద్యమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగుల హాజరుకావాలని ఆయన కోరారు. సీఐటీయూ ప్రముఖులు పాల్గొన్నారు.

జైలు వద్దకు సిమ్‌కార్డు.. యువకుడిపై కేసు నమోదు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి కేంద్ర కారాగారంలో ఉన్న తన సోదరుడిని చూడటానికి వెళ్లిన ఓ యువకుడి వద్ద సిమ్ కార్డు ఉండటంతో బళ్లారి గాంధీనగర్ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్.నమోదు చేశారు. వై.కగ్గల్‌కు చెందిన వై.లింగరాజు(24)పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఓ క్రిమినల్ కేసులో అతని సోదరుడు రవి ప్రస్తుతం బళ్లారి కేంద్ర కారాగారంలో ఉంటున్నాడు. గురువారం జైల్లో ఉన్న సోదరుడిని చూడటానికి లింగరాజు వెళ్లాడు. జైలు ప్రధాన ద్వారం వద్ద భద్రత సిబ్బంది అతణ్ని తనిఖీ చేయగా బి.ఎస్.ఎన్.ఎల్ సిమ్ కార్డు కనిపించింది. జైలు నిబంధనల ప్రకారం సిమ్ కార్డులు నిషేధిత వస్తువులను తీసుకుని వెళ్లడం నేరం. దాంతో జైలు సిబ్బంది గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో లింగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలకు నమగాగి చేయూత

మాట్లాడుతున్న నమగాగి నావు సంస్థ ప్రతినిధి

బళ్లారి, న్యూస్‌టుడే: నగర శివారులోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు దుస్థితికి చేరుకున్నాయి. సరైన తలుపులు లేవు..నీటి వ్యవస్థ లేక పోవడంతో బాలికలకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం చేస్తోందని ఎదురుచూడకుండా బళ్లారి నమగాగి నావు సంస్థ సభ్యులు తమ సొంత ఖర్చుతో సామూహిక మరుగుదొడ్లును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించారు. సమస్యను పాఠశాల ముఖ్య గురువు శివకుమార్.. నమగాగి నావు సంస్థ సభ్యులు దృష్టికి తీసుకు వెళ్లడంతో స్పందించిన సంఘం అధ్యక్షుడు వినయ కుమార్ మౌలిక సౌకర్యాలు కల్పించి సేవభావం చాటుకున్నారు.

సేవలకు తగ్గ వేతనాలు ఏవీ?

అక్షర దాసోహలో పాల్గొన్న మహిళలు, మాట్లాడుతున్న ప్రతినిధి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: అక్షర దాసోహ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసి సంక్షేమం కోసం కృషి చేస్తున్న వారి సేవలకు తగ్గ జీతాలు ఇవ్వడం లేదని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని నేతాజీ వ్యాయమశాల ఆవరణలో ఆదివారం అక్షర దాసోహ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షురాలు దుర్గమ్మ మాట్లాడుతూ 60 లక్షల మహిళలు ఆయా పథకాలను నాలుగు దశాబ్దాలుగా పిల్లలు, గర్భిణులకు ఆరోగ్య సేవల ద్వారా అందిస్తున్నామన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలకు అందిస్తున్న నిధుల్లో 60 శాతం కోత విధించడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో కార్యదర్శి గంగమ్మ, పదాధికారులు నాగలక్ష్మి, జ్యోతి, సావిత్రి, మీనాక్షి, విజయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

07-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1621.46	1629.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	526	4,531
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	9,194	5,164
నీటి నిల్వ (టి.ఎం.సి)	65.521	92.239

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

మంచు కురిసే వేళలో.. తప్పవు జాగ్రత్తలు

మంచుతో నిండిన అంబేడ్కర్ కూడలి

కంప్లి, న్యూస్‌టుడే: పట్టణంలో గత రెండు రోజులుగా ఉదయం పొగ మంచు దట్టంగా అలుముకుంటోంది. వాతావరణం చల్లగా ఉండడంతో ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావడం లేదు. ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వృద్ధులు, పిల్లలు ఇబ్బందికి గురవుతున్నారు. చలి అధికంగా ఉండడంతో చెవుల్లోకి గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చలిని తట్టుకునే దుస్తులు ధరించడంతో పాటు వేడి నీళ్ల తాగాలని ప్రభుత్వ ఆయుష్ వైద్యుడు మల్లేశప్ప సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రోగులకు చికిత్సలు అందజేస్తున్న వైద్యులు శ్రీనివాస్, కీర్తి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి అనుష్క సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ వైద్యులు ఎన్.శ్రీనివాస, కీర్తి శ్రీనివాస నేతృత్వంలో ఆసుపత్రికి తరలివచ్చిన రోగులకు ఉచితంగా రక్తపోటు, గ్యాస్ట్రిక్, శ్వాసకోశ, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. వెన్నెముక నొప్పి, కీళ్ల నొప్పులు, మోకాలి నొప్పులు, థైరాయిడ్, మూలవ్యాధి తదితరాలకు చికిత్సలతో పాటు ఔషధాలు అందజేశారు.

సమాలోచనలతో సమైక్యతారాగం

ప్రసంగిస్తున్న మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్యం నాయుడు

సింధనూరు, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రాజధాని బెంగళూరులో రాష్ట్రవ్యాప్తంగా కమ్మసమాజం ప్రజల బృహత్ సమావేశం జరపాలని ఆదివారం సింధనూరు వేదికగా ఏర్పాటైన అఖిల కర్ణాటక కమ్మ సంఘ ప్రతినిధుల సమావేశం తీర్మానించింది. కమ్మ యువసేనను అన్నిరంగాల్లో ముందు వరుసలోకి తేవాలని తీర్మానించారు. బెంగళూరు పెద్దలు మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్యనాయుడు, గుర్రప్పనాయుడు, హరీశ్, రాజగోపాల నాయుడు, కబడ్డీ బాబుతో పాటు సింధనూరు పెద్దలు బూరుగుపల్లి శ్రీహర్ష, చిట్టూరి శ్రీనివాస్, డా.కె.సుబ్బారావు, కరుటూరి సుబ్బారావు తదితరులంతా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని తాలూకాల్లోని కమ్మ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విచ్చేశారు. కార్యక్రమానికి గారపాటి రామకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కట్టా మాట్లాడుతూ 2006 తర్వాత రాష్ట్రంలో కమ్మ సమాజం బృహత్ సమావేశం జరగలేదన్నారు. ఏప్రిల్‌లో బెంగళూరు సమావేశం ముగిశాక 2026 డిసెంబరులో సింధనూరులో కూడా మూడు లక్షల మంది ప్రతినిధులతో మరో సమావేశం జరపాలని తీర్మానించారు.

(c) eenadu

చూసొద్దామా.. టిప్పు ప్యాలెస్

యునెస్కో జాబితాలో చోటుకు యత్నం

చామరాజపేటలో ఉన్న టిప్పుసుల్తాన్ వేసవి విడిది

వేసవి విడిది భవనంలో రెండు అంతస్తుల కొయ్యగాళ్లతో నిర్మించిన అద్భుతమైన భవనం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: మైసూరు మహారాజు టిప్పు సుల్తాన్ నగరంలో నిర్మించిన వేసవి విడిది ప్రాచీన భవనం యునెస్కో జాబితాలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ మేరకు పర్యాటక శాఖ యునెస్కోకు లేఖ రాశారు. ఆ సంస్థ ప్రతినిధులు వచ్చి పరిశీలించిన తరువాత జాబితాలో చేర్పించాలో లేదో నిర్ణయిస్తారని అధికారులు తెలిపారు. జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలియజేశారు. నగరంలోని ప్రాచీన కట్టడాల్లో టిప్పు విడిది ఒకటి. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు టిప్పు సుల్తాన్ వేసవి విడిది సందర్శిస్తున్నారు. నగరంలో ఉన్న ప్రాచీన కాలం నాటి మైసూరు రాజు టిప్పు సుల్తాన్ నిర్మించిన వేసవి విడిది పర్యాటకులను ఆకట్టుకుంటుంది. నిత్యం పర్యాటకులతో ఆప్రదేశం నిండిపోతోంది. సిటీ మార్కెట్ సమీపంలోని చామరాజపేటలో టిప్పు వేసవి విడిది భవనం ఉంది. స్వదేశీ వాస్తు ఆధారంగా ఆభవనాన్ని రాళ్లు, కొయ్యలతో కలిసి నిర్మించారు. రెండు అంతస్తుల భవనం నేటికి చెక్కుచెదర లేదు. భవనం లోపలకు వెళ్లిన వెంటనే శీతల గదిలోకి వెళ్లినట్లు అనుభూతి కలుగుతోంది. టిప్పు సుల్తాన్ కాలంలో ఉన్న నిపుణులు ఆభవనాన్ని నిర్మించారు. బయట విశాలమైన పచ్చిక బయలు, పక్కన లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఉంది. ఈ దేవస్థానాన్ని టిప్పు అభివృద్ధి చేశారని చరిత్ర చెబుతోంది. బ్రిటిష్ పాలకులు టిప్పుతో యుద్ధం చేసినా ఆయన నిర్మించిన భవనాలను ధ్వంసం చేయలేదు. నేటికీ ఆ భవనాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. సిటీ మార్కెట్ నుంచి విక్టోరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో బెంగళూరు కోట ఉంది. ఆకోటలోకి ఓసారి ప్రవేశిస్తే అనే విషయాలు తెలుసుకోవచ్చు. ఐదువందల ఏళ్ల కిందట నగర నిర్మాత కెంపేగౌడ బెంగళూరు కోటను నిర్మించారు. అక్కడి నుంచి మైసూరు రాజప్రస్థానం వరకు సొరంగ మార్గం ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. కోట లోపలకు వెళ్తే అక్కడ పెద్ద కాలువ దాని అవతల కోట నిర్మించారు. కెంపే గౌడ కాలం తీరిన తరువాత కోట టిప్పు సుల్తాన్ ఆధీనంలోకి వచ్చింది. బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ అధికారులు కోటను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు కోట పాడు కాలేదు. కోట సమీపంలోని ఆవరణలో 1900లో బ్రిటిష్ పాలకులు విక్టోరియా ఆసుపత్రిని ప్రారంభించారు. పర్యాటకుల చూడదగిన ప్రదేశాలుగా పర్యాటక శాఖ ప్రకటించింది. యునెస్కో జాబితాలో చేరితే ఈ ప్రదేశం మరింతగా అభివృద్ధి చెందటంతోపాటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని అధికారులు భావిస్తున్నారు.

స్వదేశీ శైలిలో రూపొందించిన కిటికీ

టిప్పు అభివృద్ధి చేసిన ప్యాలెస్ ముందు ఉన్న ఆలయం

కారు జప్తు చేయాలని ఆదేశాలు

శివమొగ్గ, న్యూస్‌టుడే: రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని న్యాయస్థానం గుర్తించింది. ప్రభుత్వ పథకాలకు 1992లో భూమిని ఇచ్చిన రైతు నందాయప్పకు రూ.22 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.9 లక్షలు మాత్రమే విడుదల చేసింది. బకాయి విడుదల చేయాలని గత 36 ఏళ్లుగా నందాయప్ప, అతని కుటుంబ సభ్యులు జిల్లాధికారి కార్యాలయాన్ని చుట్టి వచ్చినా పరిహారం విడుదల కాలేదు. మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అతనికి రూ.95,88,283 విడుదల చేయాలని రెండో సివిల్ న్యాయస్థానం ఆదేశించింది. ఆదేశాలను పరిగణనలోకి తీసుకోలేదని గుర్తించిన న్యాయమూర్తి, జిల్లాధికారి వాడుతున్న కారును జప్తు చేసుకోవాలని ఆదేశించారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: సఖరాయ పట్టణకు చెందిన గ్రామ పంచాయతి సభ్యుడు గణేశ్ (38) హత్య కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అజయ్, నితిన్ అలియాస్ సైన్స్, దర్శన్ అలియాస్ జపాన్ అనే నిందితులు పరారీలో ఉన్నారని ఎస్పీ విక్రం అమటె తెలిపారు. సఖరాయ పట్టణలో అల్లర్లు చెలరేగకుండా 180 మంది పోలీసులు, ఒక కేఎస్ఆర్‌పీ బెటాలియన్‌ను భద్రత కోసం రంగంలోకి దించారు. ఇప్పటికే అరెస్టు చేసిన నిందితుల్లో ఒకడైన మిథున్ బజరంగదళలో కీలక సభ్యుడని గుర్తించారు.

గణేశ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

శివమొగ్గ, న్యూస్‌టుడే: ఆయనూరు సమీపంలోని హారనహళ్లి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫ్ (25), చాంద్ పీర్ (18) అనే యువకులు మరణించారు. ఎదురెదురుగా వచ్చిన బైకులు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. కింద పడిన వీరిద్దరిపై నుంచి వెనుకగా వచ్చిన భారీ వాహనం వెళ్లడంతో వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. కుంసి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

ధార్వాడ, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ గేమ్‌ల వ్యసనం బారిన చిక్కుకుని అప్పుల పాలైన బసవరాజ సక్రణ్ణనవర్ (28) అనే యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఒక ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్న బాధితుడు, ఇతర సిబ్బందికి తెలియకుండా రూ.3 లక్షలు తన ఖాతాకు మళ్లించుకున్నాడు. తిరిగి ఆ మొత్తాన్ని చెల్లించడం సాధ్యం కాకపోవడంతో తన స్వగ్రామం మంగళగట్టిలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గరగ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నడిరోడ్డులో తూటా పేల్చాడు

యాదగిరి, న్యూస్‌టుడే: గురుమఠకల్ తాలూకా సిద్దాపుర గ్రామంలో వివాహం అనంతరం వధూవరులను ఊరేగిస్తున్న సమయంలో రౌడీషీటరు చంద్రశేఖర్ తన డబుల్ బ్యారెల్ గన్‌తో గాల్లోకి మూడుసార్లు కాల్పులు జరిపాడు. కాల్పుల అనంతరం సంతోషంతో కేకలు వేశాడు. కాల్పుల వీడియో వైరల్ కావడంతో గురుమఠకల్ ఠాణా పోలీసులు కార్యాచరణ నిర్వహించి అతన్ని అరెస్టు చేశారు. నిందితుడు ముందుగా గ్రామ పంచాయతీ సభ్యుడని పోలీసులు తెలిపారు.

నిందితురాలికి బెయిలు మంజూరు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: భిక్షాటన కోసం రెండేళ్ల బిడ్డను అపహరించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న రాధ అనే మహిళకు జస్టిస్ శివశంకర్ అమరణ్ణనవర్ బెయిలు మంజూరు చేశారు. మండ్య జిల్లా హొసహళ్లికి చెందిన రాధ అనే మహిళ చామరాజనగర నివాసి అనిత, ఆమె రెండేళ్ల కుమార్తెను వెంట తీసుకెళ్లింది. తన కుమార్తె, మనవరాలు కనిపించకుండా వెళ్లారని అనిత తల్లి సరోజమ్మ చామరాజనగర ఠాణాలో 2024 నవంబరు 14న ఫిర్యాదు చేసింది. గాలింపు చేపట్టగా, మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న అనిత స్థానిక బస్టాండ్‌లో కనిపించింది. ఆమె కుమార్తె కోసం గాలింపు కొనసాగించగా, మైసూరు రైల్వే స్టేషన్‌లో నవంబరు 19న చిన్న బిడ్డతో భిక్షం అడుక్కుంటూ రాధ దొరికిపోయింది. అప్పటి నుంచి కారాగారంలో ఉన్న నిందితురాలు వేసుకున్న అర్జీని పరిగణనలోకి తీసుకుని షరతులతో కూడిన బెయిలు మంజూరు చేశారు.

చర్చాగోష్ఠిలో రచయితలు, పాల్గొన్న పాఠకులు, ఔత్సాహికులు

ముగిసిన సాహిత్య ఉత్సవాలు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: స్వాతంత్ర్య ఉద్యానవనంలో శనివారం ప్రారంభమైన 14వ బెంగళూరు సాహిత్య ఉత్సవాలకు ఆదివారం రాత్రి తెరపడింది. మొత్తం ఏడు వేదికల్లో రచయితలు, చరిత్రకారులు, చర్చాగోష్ఠులు, రచనలు చేసేందుకు ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు కార్యశాలలు నిర్వహించారు. కన్నడ, ఆంగ్లంతో పాటు వివిధ భాషల పుస్తకాలను ప్రచురణ కర్తలు తమ స్టాళ్లలో విక్రయించారు. రెండు రోజుల్లో 300 జాతీయ, అంతర్జాతీయ రచయితలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. రచయితలు సంతకాలు చేసిన పుస్తకాల కొనుగోలుకు యువత ఆసక్తి చూపించారు. నగరానికి చెందిన రచయితలు అరుణ్ నంబియార్, అవితా బసు, చందన్ గౌడ, శ్రీధర్, కార్తికేయన్, పాల్ ఫెర్నాండెజ్, ప్రతిభా నందకుమార్, అరుంధతి ఘోష్, గాయత్రి ప్రభు, జాహ్నవి బారువా, మాళవిక కపూర్, వాణి మహేశ్, తదితరులు ఇతర ప్రాంతాలకు చెందిన రచయితలు చర్చాగోష్ఠుల్లో సహకారాన్ని అందించారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	55
క్యారెట్-	70
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	85
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	65
టమాటా(సాధారణ)-	45
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	140
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	265
గ్రీన్ ఆపిల్-	325
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	95
బత్తాయి-	60

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

అబ్దుల్ రజాక్ అరెస్టు

మండ్య: యువకులను తీసుకువచ్చి జామియా మసీదులో సామూహిక ప్రార్థనలు చేయిస్తున్న ముస్లిం నాయకుడు అబ్దుల్ రజాక్‌ను శ్రీరంగపట్టణ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. గత వారం కొందరు హనుమమాల వేసుకున్న భక్తులు జామియా మసీదులోకి చొరబడేందుకు విఫలయత్నం చేశారు. వారిపై పోలీసులు కేసు పెట్టకుండా ఎందుకు విడిచి పెడతారని ప్రశ్నిస్తూ అబ్దుల్ రజాక్ కొన్ని వీడియోలు చేశాడు. నిత్యం మసీదుకు గుంపులుగా యువకులను తీసుకు రావడాన్ని గుర్తించి, ప్రశ్నించారు. పోలీసులతో అనుచితంగా ప్రవర్తించడంతో అతన్ని అరెస్టు చేసి, విచారణ చేపట్టారు.

బాధితురాలిపైనే కేసు పెట్టారు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: తనపై లైంగిక దౌర్జన్యం జరిగిందని ఫిర్యాదు చేసిన మహిళపైనే ఆనేకల్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. కడుపులో తరచూ నొప్పి రావడంతో స్కానింగ్ కోసం రేడియాలజిస్టు జయకుమార్ వద్దకు పది రోజుల క్రితం వచ్చింది. ఆ సమయంలో జయకుమార్ తనపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడంటూ ఆమె ఆనేకల్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఇప్పుడు ఆమె తప్పుడు కేసు పెట్టిందని, హనీట్రాప్‌కు ప్రయత్నించిందంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులతో ఇన్‌స్పెక్టర్ తిప్పేస్వామి కుమ్మక్కై తనపై కేసు నమోదు చేశారని బాధితురాలు ఆరోపించింది.

మెట్లపై కాలుజారి వృద్ధుడి మృతి

రామనగర, న్యూస్‌టుడే: రేవణ సిద్ధేశ్వర ఆలయం బెట్టపైకి మెట్లు ఎక్కుతూ జారి పడిన రేవణ్ణ (65) అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడి మరణించాడు. బాధితుడు కెంపనహళ్లి నివాసి. ఆదివారం ఉదయం దర్శనం కోసం ఆలయానికి వచ్చి మెట్లు ఎక్కుతున్న సమయంలో ఆయన కాలుజారి కిందపడ్డారు. తలకు తీవ్ర గాయాలైన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. రామనగర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న ఫలపుష్ప ప్రదర్శన

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: కన్నడ రాజ్యోత్సవం, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కబ్బన్ ఉద్యానంలో ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శనకు ఆదివారం రాత్రి తెరపడింది. పది రోజులు కొనసాగిన ప్రదర్శనలో టికెట్ల విక్రయాలతో రూ.50 లక్షలు సమకూరాయని అధికారులు తెలిపారు. ఆదివారం రద్దీని దృష్టిలో ఉంచుకుని హడ్సన్ కూడలి నుంచి ఉద్యానంలోకి వచ్చే ప్రవేశ మార్గం వద్ద రహదారికి ఇరువైపులా వాహనాలను నిలుపుకొనేందుకు అవకాశం కల్పించారు. పది రోజుల్లో ఐదు లక్షల మంది ఉద్యానవనంలో ప్రదర్శనను వీక్షించేందుకు వచ్చారని అధికారులు తెలిపారు.

ఉరకలెత్తిన బెంగళూరు మిడ్‌నైట్ మారథాన్

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: బెంగళూరు మిడ్‌నైట్ మారథాన్ 18వ ఎడిషన్‌కు చక్కని స్పందన లభించింది. పదివేల మందికిపైగా ఔత్సాహికులు మారథాన్‌లో పాల్గొనగా అందులో 900 మందికి పైగా రక్షణ దళాలకు చెందిన వారు ఉన్నారు. ఫుల్ మారథాన్ పురుషుల విభాగంలో నరేశ్ దాపా 3.41.08 గంటల్లో పరుగు పూర్తి చేసి విజేతగా నిలిచారు. మహిళల విభాగంలో బిజోయ బర్మన్ 3.35.34 గంటల్లో పరుగు పూర్తి చేయగా, ఇతర విభాగాల్లో పరాజి గైక్వాడ్, దేవాంగి దేవాంగి పుర్చుయుత్ర విజేతలుగా బంగారు పతకాలను అందుకున్నారు. రోటరీ బెంగళూరు ఐటీ కారిడార్, ఫోన్‌పే సంయుక్తంగా నిర్వహించిన మారథాన్‌ను మహదేవపుర ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి, రక్షణ శాఖ అధికారి మేజర్ జనరల్ వీటీ మ్యాథ్యూ సంయుక్తంగా ప్రారంభించారు. మహిళా విభాగంలో నీతు కుమారి, ఊటీ నుంచి వచ్చిన శివం సింగ్ యాదవ్‌లు హాఫ్ మారథాన్‌లో విజేతలుగా నిలిచారు. ఆయా విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి పతకాలు, ప్రమాణ పత్రాలు, నగదు ప్రోత్సాహకాలను వితరణ చేశారు.

పరుగుకు ముందస్తుగా వ్యాయామం చేస్తున్న ఔత్సాహికులు

31.6 కి.మీ. మారథాన్ విజేతలు

ఫుల్ మారథాన్ విజేతలు

హాఫ్ మారథాన్ విజేతలు

'వ్యసనముక్త రాష్ట్రమే మా లక్ష్యం'

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: కర్ణాటకను మాదక ద్రవ్య వ్యసన ముక్త రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ వెల్లడించారు. ఈ దిశలో రాష్ట్ర పోలీసులు తీసుకుంటున్న చర్యలు అత్యుత్తమంగా ఉన్నాయని ప్రశంసించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా బెంగళూరు నగర పోలీసులు, ఫెడరేషన్ ఆఫ్ హిస్టోరిక్ వెహికల్స్ ఆఫ్ ఇండియా, పౌల్ జాన్ రిసార్ట్స్ అండ్ హోటల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన వింటేజ్, క్లాసిక్ కార్ల ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. రెండేళ్లలో రూ.300 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను జప్తు చేసుకున్నామని గుర్తు చేశారు. కర్ణాటకతో పాటు, దేశంలోని పలు ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలకు బానిస అవుతున్న యువత సంఖ్య ఎక్కువ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తు, ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలకు వెళ్తున్న బాలలకు మాదక ద్రవ్యాలను మొదట చాక్లెట్లలో పెట్టి ఇస్తుంటారని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ రవి ప్రకాశ్, డీజీపీ డాక్టర్ ఎంఏ సలీం, నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్, నటుడు మదన్ పటేల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విధాన సౌధ నుంచి బిగ్ బనియాన్ వైన్ యార్డ్ వరకు ర్యాలీ కొనసాగింది.

మాదక ద్రవ్యాలు వద్దని నినాదాలు రాసి ప్రదర్శిస్తున్న యువతుల, మహిళా పోలీసు సిబ్బంది

వింటేజ్ వాహనానికి జెండా ఊపుతున్న డాక్టర్ రవి ప్రకాశ్, డాక్టర్ ఎంఏ సలీం, సీమంత్ కుమార్ సింగ్‌లతో కలిసి హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

విధానసౌధలో వరుసగా నిలిపిన వింటేజ్ కార్లు

ఘనంగా విష్ణు దీపోత్సవం

మండ్య, న్యూస్‌టుడే: మేలుకోటె చెలువ నారాయణ స్వామి, యోగ నరసింహస్వామి ఆలయాల పరిధిలో శనివారం రాత్రి విష్ణు దీపోత్సవాలను నిర్వహించారు. ఆలయం రాజగోపురం ముందు కర్పూరంతో ఘట హారతి మంటతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం భక్తులు దీపాలను వెలిగించారు. స్వామివారికి పార్థసారథి హారతి అనంతరం కృతికోత్సవాలను ప్రారంభించారు. దేవేరులతో చెలువరాయ స్వామి ఉత్సవ మూర్తిని మండప వాహనోత్సవంలో ఆలయ వీధుల్లో ఊరేగించారు. దీపోత్సవాల కోసం మేలుకోటెకు శనివారం మధ్యాహ్నం నుంచి భక్తులు చేరుకున్నారు. విష్ణుదీపోత్సవం, కృతికోత్సవాలు రాత్రి పొద్దు పోయేంత వరకు నిర్వహించారు. మేలుకోటె ఆలయాల్లో ఆదివారం కూడా రద్దీ కొనసాగింది.

మండప వాహనోత్సవంలో వస్తున్న ఉత్సవమూర్తి

కార్పెట్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది, మంత్రులు, సభ్యుల ఆసనాల వద్ద మైకు, ఇతర పరికరాల పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

కుందానగరి హోటళ్ల కళకళ

బెళగావి, న్యూస్‌టుడే: శీతాకాలం శాసనసభ సమావేశాలకు కుందానగరి సిద్ధమైంది. పది రోజుల పాటు కొనసాగే ఈ సమావేశాలకు ప్రభుత్వం రూ.21 కోట్లను ఖర్చు చేస్తోంది. గత ఏడాది రూ.15 కోట్లు ఖర్చు చేసింది. ఇప్పటి వరకు 13 సార్లు నిర్వహించిన ఉభయ సభల నిర్వహణకు రూ.170 కోట్లు ఖర్చయ్యాయి. బయట చలి, ఉభయ సభల్లో వాడీవేడి చర్చలతో వేడి ఉండే అవకాశం ఉంది. ప్రభుత్వ వైఫల్యాలను ఖండిస్తూ శాసనసభ సమావేశాల్లో తమ మిత్రపక్షంతో కలిపి చర్చిస్తామని భాజపా అధ్యక్షుడు చెప్పగా, తమకు సహకరించాలని కోరితేనే పోరాటాల్లో పాల్గొంటామని మాజీ మంత్రి రమేశ్‌జార్కి హోళి తెలిపారు. ఎమ్మెల్యేలు, అధికారులు, సిబ్బంది, పోలీసుల కోసం మూడు వేల గదులను ఆయా హోటళ్లలో బుక్ చేశారు. ఎమ్మెల్యేలకు ఉచిత భోజనం, విశ్రాంతి తీసుకునేందుకు రిక్లయినర్ కుర్చీలు తదితర సదుపాయాలు కల్పించారు. ఉత్తర కర్ణాటక, బెళగావి శైలి వంటకాలను అతిథులకు అందించేందుకు నలభీములు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని 84 సంఘాలు, సమాఖ్యలు సిద్ధతలు చేసుకోగా, అవాంఛనీయ ఘటనలను అడ్డుకునేందుకు ఆరు వేల మంది పోలీసులను సువర్ణ సౌధ, చుట్టుపక్కల ప్రాంతాల్లో భద్రత కోసం నియమించారు.

EENADU Classifieds

JOBS

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ: 20k. ✆ 89776 39662,89776 39663.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

11న ది డెవిల్ విడుదల

ప్రముఖ సినీనటుడు దర్శన్ నటించిన 'ది డెవిల్' చిత్రం ఈనెల 11న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. హత్య కేసులో సినీ నటుడు దర్శన్ జైల్లో ఉన్న విషయం తెలిసిందే. జైమాత కంబైన్స్ బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌ను ప్రేక్షకులు, అభిమానులు విపరీతంగా ఆదరించారు. ప్రేక్షకుల్లో ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు ప్రకాశ్ వీర్ తెలిపారు. రెండేళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. షర్మిళా మాండ్రె, సోనియా, యువరాజ్ తదితరులు నటిస్తున్నారు.

ది డెవిల్ చిత్రంలో హీరో దర్శన్

పద్మగంధి చిత్రం నటులు

పద్మగంధి టీజర్ వచ్చేసింది

కమల పువ్వు కథ ఆధారంగా వివిధ భాషల్లో నిర్మిస్తున్న 'పద్మగంధి' చిత్రం టీజర్ ఇటీవల విడుదల చేశారు. కన్నడ, సంస్కృత, హిందీ భాషల్లో నిర్మిస్తున్నట్లు దర్శకుడు కె.సుచేంద్ర తెలిపారు. వివిధ అంశాలపై పరిశోధన చేసి కొన్నింటిని చిత్రకథగా మలిచి చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కుమారి మహాపద్మ, పరిపూర్ణ చంద్రశేఖర్, డాక్టర్ ఆర్.గణేశ్, డాక్టర్ గౌరిసుబ్రహ్మణ్య, డాక్టర్ ప్రేమా, డాక్టర్ హేమంత్ కుమార్, ఆచార్య మృత్యుంజయ శాస్త్రి, జి.ఎల్.భట్, పండిత్ ప్రసన్న వైద్య, డాక్టర్‌దీపక్ పరమశివన్, హేమంతకుమార్.జి తదితరులు నటిస్తున్నారు.

ఫస్ట్‌శాలరీ చిత్రీకరణ షురూ

శ్రీరాఘవేంద్ర చిత్రవాణి సంస్థ బ్యానర్‌పై 'ఫస్ట్ శాలరీ' చిత్రం చిత్రీకరణ ప్రారంభమైంది. నిర్మాత సుధీంద్ర వెంకటేశ్ కుమారుడు పవన్ వెంకటేశ్ చిత్రంద్వారా కన్నడ చిత్రపరిశ్రమలోకి అడుగు పెడుతున్నారు. సినీప్రముఖుల రాక్‌లైన్ వెంకటేశ్, శృతి, కమలాకర్ తదితరులు నూతన నటుడిని దీవించారు. తండ్రీకొడుకుల మధ్య ఉన్న అనుబంధమే చిత్రకథ, ఆరుపాటలు ఉంటాయని దర్శకుడు సుధీంద్ర వెంకటేశ్ తెలిపారు. హరిణి శ్రీకాంత్, యతిరాజ్, త్రిశూల్, స్నేహశ్రీ, రక్షిత్, విజయ కుమార్ తదితరులు నటిస్తున్నారు. విజయహరిత్స సంగీతం అందించారు.

ఫస్ట్ శాలరీ చిత్రబృందం

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

చిత్రంలో శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టితో కూడిన పోస్టర్

క్రిస్మస్‌కు 45 రాక

ప్రముఖ సినీనటులు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్‌బి.శెట్టి కలిసి నటించిన పాన్‌ఇండియా చిత్రం '45' క్రిస్మస్ రోజు 25వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. అందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. సంగీత దర్శకుడు అర్జున్‌జన్య తొలిసారి చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈనెల 15న చిత్రం టీజర్‌ను విడుదల చేయనున్నారు. జరిగే టీజర్ కార్యక్రమాన్ని నేరుగా మైసూరు, మంగళూరు, తుమకూరు, దావణగెరె, శివమొగ్గ, హొస్పేట్, హుబ్బళ్లి చిత్రమందిరాల్లో ప్రసారం చేయనున్నారు. తిలకించేందుకు అభిమానులకు ఉచితం ప్రవేశం కల్పిస్తారు.

(c) eenadu

వ్యాసరాయ మఠంలో గీతా పారాయణ

మా సానం మార్గ శిరోమం అని గీతాచార్యుడు చెప్పిన అంశం అందరికి విదితమే. ఈ మార్గ శిరమాసంలో వైష్ణవాలయాలు, మఠాల్లో విష్ణుసహస్రనామ పారాయణలు, భగవద్గీత శ్లోకాల పఠనాలు, పారాయణలు భక్తులతో నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఆదివారం గాంధీబజార్‌లోని వ్యాసరాయ మఠంలో ఉదయం పలువురు భక్తులు, పెద్దలు, బాలబాలికలు 18 అధ్యాయాల గీతాశ్లోక పారాయణ వీనుల విందు చేశారు. ఈ పారాయణ దేశ సంక్షేమం కోసం అంకితమని నిర్వాహకులు తెలిపారు. అనంతరం భగవంతుడికి విశేష అలంకారం, మహామంగళ హారతి, అన్న సంతర్పణ పెద్దఎత్తున జరిగాయి. - న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

అలరించిన హరిదాస మంజరి గానకచేరీ

త్యాగరాజనగర్‌లోని శ్రీకంబద నరసింహస్వామి దేవస్థానంలో జరిగిన హరిదాసమంజరి గానకచేరీ ఆహూతులను విశేషంగా అలరించింది. కళాకారిణి బి. సంగీత పరోక్ష వాగ్గేయ కారులు రచించిన హరిదాస పదాలను వివిధ రాగాల్లో ఎంతో శ్రావ్యంగా అలపించారు. ఈమెకి బాలసుబ్రమణ్య (మృదంగం), కుమార్ (కీబోర్డు), అభిజిత్ (తబలా) కృష్ణకుమార్ (ఖంజీర) పక్కవాద్య సహకారం మరింత శోభను చేకూర్చింది. అనంతరం నిర్వాహకులు విద్వాంసులను సన్మానించి అభినందించారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)

హోసూరు కబుర్లు

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన

ధర్నా చేస్తున్న హిందూమున్నని కార్యకర్తలు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు పాత బెంగళూరు రోడ్డు రామనగర వృత్తంలో హిందూ మున్నని కార్యకర్తలు ఆదివారం ధర్నా నిర్వహించారు. మురుగన్ ఆలయానికి సంబంధించిన మదురై శివారు తిరుప్పర కుండ్రం కొండ మీద కార్తిక దీపాలను వెలిగించడానికి డీఎంకే ప్రభుత్వం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ, హిందూ సంస్థలు ఆందోళన చేపట్టాయి. కోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కార్యకర్తలు విమర్శించారు. అదనపు ఎస్పీ శంకర్ నేతృత్వంలో 50 మంది హిందూ మున్నని కార్యకర్తలను అరెస్టు చేశారు.

ఉత్తర భారత కార్మికులను నియమించొద్దు

ప్రదర్శన చేస్తున్న నాంతమిళర్ కార్యకర్తలు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-బెంగళూరు రోడ్డు మూకండపల్లి పారిశ్రామికవాడలోని డి.మార్ట్ వ్యాపార కేంద్రం ఎదుట నాంతమిళర్ పార్టీ వ్యవస్థాపకుడు సీమాన్ ఆదేశం మేరకు ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేశారు. ప్రభుత్వం, పరిశ్రమకు వ్యతిరేకంగా వందలాది మంది ప్రదర్శనలో పాల్గొని నినాదాలు చేశారు. ఉత్తర భారత కార్మికులకు హోసూరు పరిశ్రమల్లో ఉద్యోగావకాశం కల్పించరాదని, పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశం కల్పించాలని నినాదాలు చేశారు. జిల్లా అదనపు పోలీసు శంకర్ నేతృత్వంలో సిప్‌కాట్ పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేశారు.

కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం

ఎమ్మెల్యే ప్రకాశ్‌తో నారాయణస్వామి, లోకేష్‌రెడ్డి తదితరులు

హోసూరు : రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న దేవీరపల్లి గ్రామానికి చెందిన కర్ణాటక విశ్రాంత ఉన్నతాధికారి కె.నారాయణస్వామి ఇటీవల డీఎంకే పార్టీలో చేరారు. అతన్ని ఎమ్మెల్యే ప్రకాశ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం హోసూరు-తళి రోడ్డులోని పెద్దబేళగొండపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌ను హోసూరు యూనియన్ డి.ఎం.కె.(ఈస్ట్) కార్యదర్శి అలసపల్లికి చెందిన డాక్టర్ లోకేష్‌రెడ్డి, నారాయణస్వామి కలిశారు. సభ్యత్వం పొందిన కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు ప్రకటించారు.

సంచార రద్దీతో ప్రయాణికుల పాట్లు

బస్సు నిలయం చుట్టూ నిలిపిన కార్లు

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే : డెంకణీకోట తాలూక కెలమంగలం బస్సు నిలయంలో బస్సులు నిలపడానికి స్థలం కనిపించలేదు. కార్లు, ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. దీంతో ప్రయాణికులు రోడ్డులో పరుగులు తీసి బస్సులు ఎక్కుతున్నారు. కొందరు కింద పడి గాయపడ్డారు. వాహనాల రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు నిలయపు ప్లాట్‌ఫాం ఆక్రమించి దుకాణాలు వేశారు. ప్రయాణికులు ఎండ, వానకు నిలవడానికి నీడలేక కష్టాలు పడుతున్నారు.

రోడ్డులో చెత్తను తొలగించరూ..

పోగైన చెత్తకుప్పలు

డెంకణీకోట, న్యూస్‌టుడే : డెంకణీకోట పట్టణం నేతాజీ రోడ్డు, గాంధీరోడ్డు కూడలిలో పట్టణ పంచాయతీ అధికారులు 'ఇక్కడ చెత్త వేయరాదు అలా వేస్తే రూ.5000 జరిమానా' అని బోర్డు ఉంచారు. స్థానికులు మాత్రం రోడ్డుమీదే చెత్త వేస్తున్నారు. ఈగలు, దోమలు, కుళ్లిన వాసనతో దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులో జలకాలాడిన ఏనుగు

డెంకణీకోట, న్యూస్‌టుడే : కర్ణాటక బన్నేరుగట్ట అడవి నుంచి వందకు పైగా ఏనుగులు జవళగిరి, తళి, డెంకణీకోట మార్గంగా వచ్చి ఊడేదుర్గం అడవులు, ఇతర ప్రాంతాల్లో మకాం వేశాయి. అక్కడ పొలాల్లో పంటలను తిని, తొక్కి నాశనం చేస్తున్నాయి. డెంకణీకోట శివారు బెట్టబుగళాలం అడవిలో ఏనుగులు తాగడానికి నీరు, ఆహారం దొరక్క గ్రామాల వైపు వస్తున్నాయి. ఆదివారం ఒక ఏనుగు నీరు కోసం డెంకణీకోట శివారు అయ్యూరు వద్ద గల శామచెరువలో స్నానం చేసి, నీళ్లు తాగి వెళ్లింది. ఈ దృశ్యాలను స్థానికులు చరవాణుల్లో చిత్రీకరించి మాధ్యమాల్లో ఉంచారు.

గంజాయి విక్రేత అరెస్టు

ముళబాగిలు, న్యూస్‌టుడే : గంజాయి కలిపిన చాక్లెట్లు అమ్ముతున్న బిహార్‌కు చెందిన ప్రధాన నిందితుడు అమిత్‌ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. కోలారు జిల్లా మాలూరు నగరంలోని 27వ వార్డు హోసూరు రోడ్డులోని లక్ష్మీ లేఅవుట్‌లో ఒక ఇంట్లో నిలువ చేసిన 243 గ్రాముల గంజాయి, గంజాయి కలిపిన చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అమిత్‌ను జ్యుడీషియల్ కస్టడికి తరలించారు. కోలారు ఎక్సైజ్ అధికారులు శ్రీనివాస మూర్తి, శశికళ తదితరులు దాడిలో పాల్గొన్నారు.

గొలుసుల దొంగ..

ముళబాగిలు, న్యూస్‌టుడే : కోలారు నగరంలో వివిధ ప్రాంతాల్లో గొలుసులను దొంగతనం చేస్తున్న నిందితుడు సయ్యద్ కశ్యప్ (24)ను కోలారు పోలీసులు అరెస్టు చేసి రూ.6 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బెంగళూరిలోని బిస్మిల్లా నగర వాసిగా గుర్తించారు.

మట్టి తొలగింపు పనులకు శ్రీకారం

జయనగర రహదారిలో మట్టి తొలగిస్తున్న కార్మికులు

బెంగళూరు (యలహంక): రహదారుల్లో పేరుకుపోయిన మట్టి తొలగించే పనులను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార చేపట్టింది. మట్టి వల్ల వాహన సంచారానికి ఇబ్బందికరంగా మారింది. దీనివల్ల తరచూ ప్రమాదాలకు జరుగుతున్నాయి. వర్షం నిలిచిన తరువాత రహదారుల్లో మట్టి పేరుకుపోతోంది. తొలగించకపోతే వాహనాలు అదుపు తప్పి కిందపడి పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పలువురు గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మట్టి ఉండే ప్రదేశంలో వేగంగా వాహనాలు నడపటం కష్టం. సమస్యలను పరిశీలించిన అధికారులు ఎక్కడ మట్టి ఎక్కువ ఉందో అక్కడ తొలగింపు పనులు చేపట్టారు. జయనగర, సీవీరామన్‌నగర, జేపీ నగర, బనశంకరి, పద్మనాభనగర, బసవనగుడి, చామరాజపేట, సిటీమార్కెట్, హలసూరు, అశోక్‌నగర, శివాజీనగర, కె.ఆర్.పురం, రింగ్‌రోడ్డు, హెబ్బాళ్, మత్తికెరె, యశ్వంతపుర తదితర ప్రాంతాల్లో మట్టి తొలగించే పనులను ప్రారంభించారు. మట్టితో పాటు పాదచారి మార్గంలో ఉన్న మట్టిదిబ్బలు, పాడైన వాహనాలను తొలగించారు. వర్షం లేకపోవడంతో మట్టి అప్పటికప్పుడు తొలగించి ట్రాక్టర్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు. అన్ని రహదారులను శుభ్రం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యం

సంఘాల ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ రమేష్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రహదారులు, పాదచారిమార్గాల మరమ్మతులు, ఆక్రమణలు తొలగింపు, రాజకాలువ మరమ్మతులు, గుంతలు పూడ్చివేత తదితర మౌలిక సౌకర్యాలకు పెద్దపీట వేయాలని బెంగళూరు నగర అపార్ట్‌మెంట్ నివాసదారులు సంక్షేమ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ బెంగళూరు దక్షిణ నగర పాలికె కమిషనర్ కె.ఎన్.రమేష్‌తో ఆసంఘం ప్రతినిధులు సమావేశమై వివిధ సమస్యలను చర్చించారు. అనుమతులు లేని భవన నిర్మాణాలను గుర్తించి చర్య తీసుకుంటామని, పాదచారి మార్గాల ఆక్రమణలు తొలగించడానికి ప్రాధాన్యమిస్తామని, గుంతలు పూడ్చుతున్నట్లు కమిషనర్ కె.ఎన్.రమేష్ తెలిపారు. ముంపు ప్రదేశాల్లో రాజకాలువలు మరమ్మతులు చేపట్టామని, ముంపు నుంచి విముక్తి కలిగిస్తామన్నారు. పరిసర సంరక్షణకు పచ్చదనం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లను బాగుచేసి అందరు ఉపయోగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. యాలచనహళ్లి, కొణకుంటె, జేపీనగర, బీటీఎం లేఅవుట్, హెచ్.ఎస్.ఆర్ లేఅవుట్, పుట్టనహళ్లి ప్రాంతాలకు చెందిన అపార్ట్‌మెంట్ నివాసదారులు సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

అంకిత సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలను విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : నగరంలోని అంకిత పుస్తక ప్రచురణ సంస్థ ఆరుగురు ప్రముఖ రచయితలు రచించిన ఆరు పుస్తకాలను ఆదివారం విడుదల చేసింది. రుద్రమూర్తి శాస్త్రి-జనభారత, ఉషా నరసింహన్-ఆర్యావర్త, విక్రమ్ హత్వార-ఓదిద్దు నోడిద్దు, ఎస్.సంధ్యారాణి-కెదడిద కొళవు తిరియాగిరలు, హాళెమనె రాజశేఖర్-మాయె యంబుదు మాయెయల్ల, గురురాజ కొడ్కణి-హక్కితంద నెనపుగళు పుస్తకాలను ప్రముఖ నటుడు, డైరెక్టర్ శ్రీనివాస ప్రభు విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా రచయితలు హెచ్.ఎస్.సత్యనారాయణ, వికాస్ నేగిలోణి, శరత్‌భట్ సెరాజె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస ప్రభు మాట్లాడుతూ ఈ పుస్తకాల్లో సమాజంలోని వివిధ కోణాలకు అద్దం పట్టాయన్నారు. తమ ఆలోచనలను, సమాజపు పరిస్థితులను వివిధ వ్యక్తుల భావాలను తమ రచనల్లో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయితలు, అంకిత సంస్థ వ్యవస్థాపకుడు ప్రకాశ్, అసంఖ్యాక సాహిత్యాభిమానులు హాజరయ్యారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన

చింతామణి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ భాజపా జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ అధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించారని, గ్యారంటీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆజాద్ చౌక్ నుంచి పాదయాత్ర చేశారు. నాయకులు వేణుగోపాల్, మాడికెరె అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు చర్చిలో మహిళా క్రిస్మస్ వేడుకలు

వేడుకల్లో వివిధ ప్రాంతాల మహిళలు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగరంలోని పులికేశినగరలో ఉన్న మిస్పా తెలుగు చర్చిలో ఆదివారం మహిళా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. క్రీస్తు పుట్టుక చరిత్రను మహిళలు నాటిక ద్వారా ప్రదర్శించారు. ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా క్రైస్తవ ప్రసంగీకురాలు విజయ జెన్నీ క్రిష్టఫర్ చేసిన ప్రసంగం కన్నువిప్పు కలిగించింది. నైతిక విలువలతో జీవించాలని, మంచి కుటుంబాన్ని నిర్మించుకుంటే ఉత్తమ సమాజం ఏర్పడుతుందన్నారు. స్వార్థం, అసూయ అబద్ధాలతో నిండిన లోకాన్ని బాగు చేసేందుకు ఏసు క్రీస్తు లోకానికి వచ్చి ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ బెరా కాహ్యాండీ, కార్యదర్శి కెప్టెన్ పి.జాన్, మహిళ సమాజం అధ్యక్షురాలు హేమాసుందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

కళోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుధాకర్, తదితరులు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : విద్యార్థుల సృజనశీలత, ప్రతిభ, సంస్కృతి, సామర్థ్యాలను గుర్తించడానికి ప్రతిభాకారంజి, కళోత్సవం వేదిక కాగలదని జిల్లా బాధ్యమంత్రి డి.సుధాకర్ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఇక్కడ తాలూకా స్థాయి ప్రతిభా కారంజి, కళోత్సవాలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు కళలపై అసక్తికలిగేలా ప్రోత్సహించాలని, వారి ప్రవీణ్యతకు గుర్తించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు మానసిక వికాసం పొందగలరన్నారు. విద్యార్థులు తమ ప్రతిభ ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

బహుమతులు ప్రదానం చేస్తున్న ఏకాంబరంనాయుడు, తదితరులు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : విద్యార్థులకు చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యమివ్వాలని, తద్వారా మానసిక ఎదుగుదలతో రాణిస్తారని ఇండో ఆసియా అకాడమీ గ్రూపు విద్యాసంస్థల అధ్యక్షుడు ఆచార్య టి.ఏకాంబరంనాయుడు తెలిపారు. ఆదివారం కళ్యాణనగరలో వార్షిక క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పుస్తకాలు, కంప్యూటర్, చరవాణుల్లో మునిగిపోకుండా మైదానాలకు వచ్చి ఆడుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎగువభద్ర పథకానికి నిధులివ్వాలి

మాట్లాడుతున్న లక్ష్మీకాంత, తదితరులు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : చిత్రదుర్గం జిల్లాకు వరప్రసాదమైన ఎగువ భద్రా పథకానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంత డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎగువభద్రా పథకం పరిధిలోకి రాని చెరువులను ఈ పథకం కింద చేర్చి సాగు నీటిని అందించాలన్నారు. జిల్లాలో మొక్కజొన్నలు తదితర పంటల ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడానికి ఈ నెల 9న బెలగావిలోని సువర్ణసౌధ ఛలో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నిజలింగప్ప, కార్యదర్శి నవీన్, వెంకటేశప్ప, లోకాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాల్లో ఒకరి మృతి

చింతామణి, న్యూస్‌టుడే : కెంచార్లహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిట్టహళ్లి పంచాయతీ గుర్రపల్లిలో ఆస్తి గొడవల్లో కేవెల్ నారాయణస్వామి (60) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. నిందితుడు తమ్ముడు మద్దిరెడ్డి కొడుకు మధుసూదన్ అని పోలీసులు గుర్తించారు. ఇల్లు అమ్మగా వచ్చి డబ్బుల్లో తమకు భాగం ఇవ్వలేదని శుక్రవారం రాత్రి గొడవపడ్డారు. తోపులాటలో మధుసూదన్ పెద్దనాన్నను కిందకు తోయడంతో తలకు తీవ్రగాయమైంది. చింతామణి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుణి కొడుకు కేవెల్ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తైక్వాండోతో శారీరక దృఢత్వం, స్వీయరక్షణ

క్రీడాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న పెంచలయ్య

బెంగళూరు (బ్యాటరాయణపుర), న్యూస్‌టుడే : తైక్వాండోతో క్రీడాకారుల్లో శారీరక దృఢత్వంతో పాటు స్వీయరక్షణ ఉంటుందని జె.పి.పార్కు తైక్వాండో శిక్షణ కేంద్రం మాస్టర్ సి.పి.పెంచలయ్య తెలిపారు. యశ్వంతపురలోని మునిస్వామప్ప కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన జె.పి.పార్కు తైక్వాండో ఛాంపియన్ షిప్ కప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ కేంద్రం ద్వారా ఆంధ్రప్రదేశ్ తిరుపతి తైక్వాండో టైగర్స్ క్రీడకారులు పది బంగారు, 10 రజత పతకాలను సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాస్టర్లు గోపినాయుడు, సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజ్ఞాన వస్తుప్రదర్శనలో రాణించిన విద్యార్థులు

విజేతలకు ప్రశంసా పత్రాలను అందచేస్తున్న ప్రముఖులు

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని గురుభవనలో విద్యాశాఖ నిర్వహించిన తాలూకా స్థాయి విజ్ఞాన వస్తు ప్రదర్శన పోటీల్లో తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభతో రాణించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులు బి.జయశ్రీ, ఎం.రచనలు గ్రూపు విభాగం పోటీలో ద్వితీయ స్థానం కైవసం చేసుకొన్నారు. వ్యక్తిగత విభాగంలో హెచ్.హృతిక్ ద్వితీయ స్థానంలో గెలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా స్థాయి పోటీలు మధుగిరిలో ఈ నెల 9వ తేదీన జరుగనున్నాయి. విజేతలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జి.హెచ్.రేణుకారాజ్, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కవితమ్మ, సభ్యులు, ఉపాధ్యాయులు హనుమేశ్, ఎన్.మోహన్‌కుమార్, జి.కె.కుమార్ తదితరులు అభినందించారు.

రెడ్డి సంఘం ప్రతినిధుల ఆత్మీయ సమావేశం

శ్యామలారెడ్డితో చింతంరెడ్డి సుబ్బారెడ్డి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : సీతారామపురం మండల వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి సేవలు అభినందనీయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్ శ్యామలారెడ్డి తెలిపారు. మారతహళ్లిలో ఆదివారం బెంగళూరు రెడ్డి సంఘ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రెడ్డి కులస్తులు దేశంలో ఎక్కడున్నా సేవాకార్యక్రమాల్లో ముందుంటారన్నారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

15 మంది జూదరుల అరెస్టు

బర్గూరు (డెంకణీకోట) న్యూస్‌టుడే : బర్గూరు శివారు పోచ్చంపల్లి పోలీసులు సంతూరు వద్ద గస్తీ చేస్తుండగా.. అక్కడ జూదం ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.36,750ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం పదవి దళితులకు ఇవ్వాలి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్‌లో దామోదరం సంజీవయ్య తరువాత ఇప్పటి వరకు దళితులు ముఖ్యమంత్రి పదవి చేపట్టలేదని, కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం కోట్లాట ప్రారంభమైందని, అన్ని వర్గాలను పక్కన పెట్టి దళితుడిని ముఖ్యమంత్రి చేయాలని కర్ణాటక మాల మహాసభ అధ్యక్షుడు ఎల్.నాగేశ్వరరావు కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలకు లేఖలు రాసినట్లు తెలిపారు. దళిత వర్గాలకు చెందిన డాక్టర్ పరమేశ్వర్, కె.హెచ్.మునియప్ప, డాక్టర్ మహదేవప్ప తదితరులు ఉన్నారని గుర్తుచేశారు. వారు సాధ్యం కాకపోతే మల్లికార్జున ఖర్గే ఆపదవి చేపట్టాలని కోరారు. అనేక సార్లు ముఖ్యమంత్రి పదవి దళితులకు దక్కినట్లే దక్కి దూరమైన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు.

పెరిగిన బస్సుల టికెట్ ధరలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఇండిగో విమానయాన సంస్థ తన విమానాలను రద్దు చేయడంతో బస్సుల టికెట్ ధరలు పెరిగాయి. బెంగళూరు నుంచి గోవా, పుణె, ముంబయి, శిరిడికి వెళ్లేందుకు రూ.6 వేల వరకు ప్రైవేటు ట్రావెల్స్ వసూలు చేశాయి. ఇప్పటి వరకు రూ.2500 ఉన్న టికెట్ ధరలను శని, ఆదివారాల్లో ఆయా ట్రావెల్స్ పెంచి విక్రయించాయి. కొన్ని సంస్థలు ప్రయాణికుల కోసం చివరి క్షణంలో అదనపు బస్సులను రహదారిపైకి తెచ్చి సొమ్ము చేసుకున్నాయి. పెద్ద మొత్తంలో నగదు పెట్టలేని ప్రయాణికులు ఆర్టీసీ బస్సు, రైళ్లలో బెళగావి వరకు టికెట్ కొనుగోలు చేసుకుని, అక్కడి నుంచి ముందుకు తమ ప్రయాణాలను కొనసాగించారు.

పట్టభద్రులకు పట్టాల ప్రదానం

సత్కార పత్రాలతో కామినిరావు, బాలకృష్ణశెట్టి

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : సంతానోత్పత్తికి సంబంధించిన వైద్య శిక్షణను అందిస్తున్న తన మెడ్‌లైన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న పట్టభద్రులకు సంస్థ వ్యవస్థాపకురాలు, ఆచార్య కామినీరావు పట్టాలు ప్రదానం చేశారు. ప్రపంచంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన 100 మందికి పైగా పట్టభద్రులకు రేడియాలజీ విభాగంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ పి.బాలకృష్ణశెట్టితో కలిసి ఆమె పట్టాలు అందజేశారు. బెంగళూరులో మెరుగైన, ఆధునిక వైద్య సేవలను అందుబాటు ధరలో ఉండడంతో ప్రపంచంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి రోగులు వచ్చి చికిత్సలు చేయించుకుంటున్నారని చెప్పారు. నాలుగు దశాబ్దాలుగా ప్రసూతి వైద్యురాలిగా, సంతానోత్పత్తి విభాగంలో శిక్షణ ఇస్తున్న ఆచార్యురాలిగా గుర్తింపుతో విదేశాల నుంచి ప్రసూతి వైద్యులు శిక్షణకు వస్తున్నారని డాక్టర్ కామినిరావు ఆసుపత్రుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పూజా సిద్ధార్థరావు తెలిపారు. ఈ సందర్భంగా ఇషా డయాగ్నోస్టిక్ సెంటర్‌తో కలిసి మెడ్‌లైన్ ఇశా డయాగ్నోస్టిక్ రేడియాలజీ విభాగాన్ని ప్రారంభించారు.

పాలకులు, అధికారులేమయ్యారు?

బస్టాండ్‌కు వెళ్లే రహదారిలో వ్యర్థాలు

వేపనపల్లి, (బేరికె), న్యూస్‌టుడే : అపరిశుభ్రతకు చిరునామాగా ఈ చిత్రం అద్దం పడుతోంది. కృష్ణగిరి సమీపంలోని వేపనపల్లిలో బస్టాండ్ నుంచి నాడాంపల్లి ప్రధాన రహదారి, గాంధీ విగ్రహం, అంబేడ్కర్ విగ్రహం, ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కుప్పం పట్టణానికి వెళ్లే రహదారిలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పట్టణ వాసులు ఈ రహదారుల్లో వెళ్లాలంటే ఎక్కడ రోగాల బారి నపడతామోనని భయపడుతున్నారు. విగ్రహాల చుట్టూ ముండ్ల పొదలు, గుబురు చెట్లతో కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. వ్యాపారాలు, దుకాణాలు, బేకరీలు, హోటళ్లలోని వ్యర్థాలను రోడ్లపై పడేస్తున్నారు. చెత్తాచెదారం, అపరిశుభ్రత, అధికార పార్టీ నాయకులు, నగరపాలక అధికారులకు కనబడలేదేమో? అని స్థానికులు వాపోయారు. వెంటనే పరిశుభ్రత పనులు చేపట్టకపోతే వేపనపల్లిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పొంచి ఉన్న ప్రమాదం



నియంత్రిక చుట్టూ అల్లుకున్న మొక్కల తీగలు

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని కామనదుర్గ పంచాయతీ బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్తు నియంత్రికకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకొని నిత్యం విద్యుత్తు సరఫరాలు అంతరాయం ఏర్పడుతోంది. ఆంజనేయస్వామి దేవాలయం, శుద్ధ తాగునీరు కేంద్రానికి దగ్గరలో ఉన్న ఈ నియంత్రిక వద్ద తరచూ నిప్పురవ్వలు ఎగిసి పడుతుంటాయి. ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్తు సరఫరా అగినపుడు ఫ్యూజులు వేయడానికి సైతం స్థానికులు భయపడుతున్నారు. నియంత్రిక చుట్టూ ముల్ల కంపలు, తీగలను తొలగించి ప్రమాదం జరుగకుండా కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముగిసిన అంత్యక్రియలు

బెళగావి, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదంలో సజీవంగా కాలిపోయిన లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ పంచాక్షరి సాలిమఠ భౌతికకాయానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. భార్య శీల, తల్లి పార్వతవ్వ, తండ్రి వీరయ్య, పిల్లలు చిన్మయ, తన్మయ బంధువులు, పోలీసు సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఏ ప్రమాదానికి దారితీస్తుందో ఈ పయనం

మనిషికి ప్రతి నిమిషం ఎంతో విలువైన ఈ రోజుల్లో ప్రభుత్వాలు ప్రజలకు తగిన సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యాయనడానికి ఉదాహరణ ఈ బస్సు ప్రయాణం. పట్టణంలోని కురుబరహళ్లి గేటు దగ్గర బీసీఎం ప్రభుత్వ బాలికల వసతిశాల, ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. బాలికలు ఆలస్యంగా వస్తే తరగతులు, భోజనాలు వదులుకోవాల్సిందే. బస్టాండుకు ఆలస్యమైతే ఊర్లకు వెళ్లే బస్సులు తప్పిపోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థినీ విద్యార్థుల పరిస్థితి ఎలా. ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ ప్రతి బస్సును పాఠశాలలు, కళాశాలల వద్ద ఆపాల్సిందేనని చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. నిత్యం ఇలా సర్కస్‌ఫీట్లు చేస్తూ ప్రయాణించాల్సిందేనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.- న్యూస్‌టుడే, పావగడ

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

బెంగళూరులోనే ఆర్‌సీబీ క్రికెట్ పోటీలు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: 2026 నుంచి ఐపీఎల్-ఆర్‌సీబీ క్రికెట్ పోటీలు బెంగళూరు నగరంలో జరుగుతాయని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. ఆదివారం ఇక్కడ జరిగిన కె.ఎస్.సి.ఎ. ఎన్నికల సందర్భంగా చిన్నస్వామి సేడియంలో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తాను, మంత్రులందరూ క్రికెట్‌ను ప్రేమిస్తామని, ఆర్‌సీబీ తమకు గర్వకారణమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఐపీఎల్ క్రికెట్ పోటీలు ఇక్కడ జరగకుండా తప్పి పోయ్యేందుకు అవకాశం ఇవ్వబోమన్నారు. బెంగళూరు చట్టప్రకారం ప్రేక్షకుల రద్దీని నియంత్రిస్తామన్నారు. మరోవైపు కొత్త స్టేడియం నిర్మించేందుకు శ్రీకారం చుడతామన్నారు. ప్రేక్షకుల రద్దీ నియంత్రణకు ఇక నుంచి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రైలుబండిలో సోమణ్ణ

కార్వార, న్యూస్‌టుడే: కార్వార నుంచి గోవాలోకి మడగావ్ వరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి వి. సోమణ్ణ రైల్లో ప్రయాణించారు. కొంకణ రైల్వే విభాగంలో జరుగుతున్న పనులు, స్టేషన్ల మరమ్మతులు, ఉన్నతీకరణను వీక్షించేందుకు రైలు చివరి బోగీలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. నివేదికను పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు ఇస్తూ ఆయన తన ప్రయాణాన్ని పూర్తి చేశారు.

రైలు చివరి బోగీలో అధికారులతో కలిసి ప్రయాణిస్తున్న సోమణ్ణ

జిల్లా సమస్యలపై ఎమ్మెల్యేలు చర్చిస్తారా?

నేడు బెళగావిలో సమావేశాలు

రాయచూరు, న్యూస్‌టుడే : బెళగావి సువర్ణసౌధలో సోమవారం నుంచి అసెంబ్లీ శీతాకాలపు సమావేశాలు మొదలవుతాయి. ఉత్తర కర్ణాటకలో నిర్వహిస్తున్నందున ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులకు చర్చల్లో పాల్గొనేందుకు ప్రాధాన్యం ఇస్తారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భాజపా, దళ్ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు సమావేశాలను ఎలా సద్వినియోగం చేసుకుంటారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాయచూరు జిల్లాకు సంబంధించిన ముఖ్య సమస్యలను ఏమాత్రం ప్రస్తావిస్తారోనన్న ఆసక్తి నెలకొంది. జిల్లాలోని ఏడు మంది శాసనసభ్యుల్లో ముగ్గురు ప్రతిపక్ష సభ్యులు. భాజపా నుంచి శివరాజ్ పాటిల్(రాయచూరు), మానప్ప వజ్జల్(లింగసూగూరు), దళ్ నుంచి కరెమ్మ నాయక్(దేవదుర్గ) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు వసంతకుమార్, బసనగౌడ బాదర్లి ఉన్నారు. ప్రతిపక్ష శాసనసభ్యులపై బాధ్యత అధికంగా ఉంటుంది.

రెండో పంటకు సాగునీటి విషయమై..

తుంగభద్ర జలాశయం పరిధిలోని హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీతో పోలిస్తే తుంగభద్ర ఎడమకాల్వ పెద్దది. గంగావతి నుంచి రాయచూరు వరకు విస్తరించిన కాల్వలపై 6 లక్షల ఎకరాలు సాగు అవుతుందని అంచనా. రెండో పంటకు సాగునీరు ఇవ్వనందున ఎడమకాల్వలో వరి రైతులకు తీరని నష్టం కల్గింది. రబీకి తగినంత నీరు నిల్వ ఉన్నందున విడుదల చేయాలని రైతు సంఘాలు ఆందోళనలు చేశాయి. భాజపా మునీరాబాద్ వద్ద పోరాటాన్ని నిర్వహించింది. దీనిపై నిలదీసే అవకాశముంది. క్రస్ట్‌గేట్లు అమరుస్తున్నందున రెండో సాగుకు ఇవ్వడం కుదరని మంత్రులు ఇది వరకే స్పష్టీకరించారు. నష్టపోయినందున ఎకరాకు రూ.25 వేల పరిహారాన్ని ఇవ్వాలని, వరి ధాన్యం రైతులకు క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహ ధనాన్ని చెల్లించాలని గత నెలలో దళ్(ఎస్) విభాగం రాష్ట్రాధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి సింధనూరులో జరిగిన ర్యాలీలో డిమాండు చేశారు. అక్విడేట్స్‌ను బాగు చేయించాలని, అనధికృత పంపుసెట్లను తొలగించేలా అసెంబ్లీలో ఒత్తిడి తేవాలని రైతు నాయకులు ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. విపత్తు వల్ల నష్టపోయిన కర్షకుల్లో అందరికీ ఫసల్ బీమా పరిహారం అందలేదు. పత్తి సేకరణ కేంద్రాల సంఖ్యను పెంచాలని, ఉల్లి, జొన్న కొనుగోలు కేంద్రాలు తెరవాలని అన్నదాతలు ధర్నాలు నిర్వహించారు. వీటన్నిటికీ చట్టసభల సభ్యులు ఏ మాత్రం స్పందిస్తారో చూడాలి.

శివరాజ్ పాటిల్ మానప్ప వజ్జల్ కరెమ్మ నాయక్

కాకరగల్, జాలహళ్లి టోల్‌గేట్లపై

జాతీయ రహదారి ప్రాధికార నిబంధనల మేరకు 50 కిలోమీటర్ల దూరంలో రెండు టోల్‌గేట్స్ నెలకొల్పరాదు. దేవదుర్గ తాలూకాలోని కాకరగల్, జాలహళ్లిలో టోల్స్‌ను అశాస్త్రీయంగా నిర్మించనందున తొలగించాలని ఎమ్మెల్యే కరెమ్మ అక్కడ ధర్నా చేశారు. అనుకూలంగా ఎంపీ కుమారనాయక్ లేఖ ఇచ్చారు. ఫలితంగా ఒక నెల రోజులు బంద్ చేశారు. తిరిగి కొనసాగిస్తున్నారు. దీనిపై కరెమ్మ గట్టిగా ప్రశ్నిస్తారని భావిస్తున్నారు. కేఎస్‌ఆర్‌పీ (కర్ణాటక స్టేట్ రిజర్వ్ పోలీస్) రాయచూరులో స్థాపించాలన్న ప్రతిపాదనలకు అతీగతీ లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన వేలాది రూపాయలు విద్యుత్తు బిల్లులను సర్కారు జెస్కాంకు బిల్లులు చెల్లించడం లేదు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గుత్తేదార్లకు బిల్లులు రాక పోవంతో అనేక పనులు స్తంభించి ప్రగతి ఆగిపోయింది. వీటిపై చర్చించాలని ప్రజలు కోరుతున్నారు.

వసతి నిలయం పనులు ప్రారంభం

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలోని ఎల్‌వీడీ కళాశాల ఎదురుగా ఉన్న యాదవ్ సమాజం మైదానంలో రెండు తరగతి గదుల, వసతి నిలయం నిర్మాణానికి ఎమ్మెల్సీ వసంతకుమార్ ఆదివారం భూమిపూజ చేశారు. యాదవ్ సామాజికవర్గం ముఖ్యులతో కలసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఎమ్మెల్సీ నిధుల నుంచి వసతి నిలయం పనులకు రూ.50 లక్షలు, తరగతి గదుల నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించినట్లు వివరించారు. రాబోవు రోజుల్లో అదనపు నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వెనుకబడిన వర్గాల ప్రజల పురోగతికి తన వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా యాదవ్ సమాజం అధ్యక్షుడు కె.హనుమంతప్ప మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఒక్క ప్రజా ప్రతినిధి కూడా యాదవ్ సమాజం అభివృద్ధికి సాయం చేయలేదని, వసంతకుమార్ రూ.80 లక్షలు ఇచ్చి పెద్ద మనసును చాటుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగరసభ మాజీ అధ్యక్షుడు మారెప్ప, కాంగ్రెస్ నాయకులు రజాక్, ఖరీం, రామకృష్ణ నాయక్, మురళీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వసంత్ తదితరులు

అన్నదాతల సమస్యలపై దళ్ ఆందోళన

రాయచూరు, న్యూస్‌టుడే : బెళగావి శీతాకాలపు సమావేశాల్లో అన్నదాతల సమస్యలను ప్రస్తావించేలా ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తేవటానికి రాయచూరులో ఆందోళన నిర్వహిస్తామని జిల్లా దళ్ (ఎస్) అధ్యక్షుడు విరూపాక్షి, రాయచూరు గ్రామీణ అధ్యక్షుడు సణ్ణ నరసింహనాయక్ వెల్లడించారు. సోమవారం ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ కూడలి వద్ద పోరాటాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. తుంగభద్ర రైతాంగానికి రెండో పంటకు సాగునీటిని సరఫరా చేయాలని, గిట్టుబాటు ధర లేని వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కేంద్రాలను తెరవాలని, పత్తి ఖరీదు కేంద్రాల్లో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఒత్తిడి తేనున్నట్లు వివరించారు.

శునకాల నియంత్రణపై నేడు సమావేశం

రాయచూరు, న్యూస్‌టుడే : వీధి శునకాల సంచారాన్ని కట్టడి చేయాలన్న సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన మార్గదర్శకాలపై చర్చించేందుకు, కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహోపాత్ర తెలిపారు. జిల్లా పాలనాధికారి పాత కార్యాలయంలోని పాలక సంస్థ సభా భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం మొదలవుతుందని చెప్పారు. నిరాశ్రిత కేంద్రాలకు తరలింపు, దత్తత, సంతానహరణ శస్త్ర చికిత్స, ప్రజల సహకారం, పశుసంవర్ధక శాఖ సేవలు, స్వచ్ఛంద సేవల పాత్రపై చర్చిస్తామని వివరించారు. జంతుప్రేమ సంఘటకులు, సంక్షేమ సమితి సభ్యులు, పశువైద్యులు, ఆసక్తి ఉన్న వారు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్యాలయం తరలింపు ఆపండి

మాట్లాడుతున్న రమేష్

రాయచూరు, న్యూస్‌టుడే : లింగసూగూరులోని వ్యవసాయ శాఖ ఉప నిర్దేశకుడి కార్యాలయాన్ని సింధనూరుకు తరలించవద్దని విధానసభ సమావేశాల్లో ఒత్తిడి తేవాలని, ప్రభుత్వ ఆదేశాన్ని రద్దు చేయించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు లింగసూగూరు ఎమ్మెల్యే మానప్ప వజ్జల్‌పై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయంలో విఫలమైతే తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు రమేష్ వీరాపూర నాయకత్వంలో ప్రతినిధులు పార్టీ కార్యాలయానికి వెళ్లి వ్యక్తిగత కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆర్టీవో, కేపీటీసీఎల్ కార్యాలయాలు, న్యాయాలయంతో సహా పలు కార్యాలయాలు లింగసూగూరు నుంచి తరలి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సొంత అభివృద్ధి చెందారని, తాలూకాలో జరిగిన ప్రగతి శూన్యమని వాపోయారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

07-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1621.46	1629.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	526	4,531
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	9,194	5,164
నీటి నిల్వ (టి.ఎం.సి)	65.521	92.239
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	

కేపీఎస్ పాఠశాలలు వద్దే వద్దు

రాయచూరు, న్యూస్‌టుడే : కర్ణాటక పబ్లిక్ పాఠశాలలు (కేపీఎస్) స్థాపనను వ్యతిరేకిస్తూ ఏఐడీఎస్‌ఓ ఆదివారం రాయచూరు తాలూకా అన్వర గ్రామం ప్రభుత్వ పాఠశాల వద్ద ధర్నాకు దిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు మద్దతు ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి మండలి సభ్యుడు కల్యాణ కుమార్ ప్రసంగిస్తూ 150 మందికి పైగా విద్యార్థులున్న అన్వరలోని బడిని మూడు కిలోమీటర్ల దూరంలోని మంజర్ల పాఠశాలలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అంతదూరం విద్యార్థులు వెళ్లడం అసాధ్యమన్నారు. పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసేందుకు ఉన్నతీకరణ పేరిట రాష్ట్రంలోని 40 వేల బడులను మూసివేతకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఆరోపించారు. ఒక విద్యార్థి ఉన్నా సరే విలీనం చేయబోమన్న హామీని నిలబెట్టుకోవాలని సవాల్ విసిరారు. సర్కారీ స్కూల్స్‌ను రక్షించుకునేందుకు పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రతినిధులు బసవరాజ్, నందగోపాల్, ప్రీతి, పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు భీమయ్య, గ్రామ పెద్దలు ఈరణ్ణ, విరుపణ్ణ, భీమణ్ణ ఆందోళనకు నేతృత్వం వహించారు.

ప్రసంగిస్తున్న కల్యాణ కుమార్

'కార్మికులు ఆర్థిక సబలీకరణ సాధించాలి'

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాలు, సౌలభ్యాలను కార్మికులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక సబలీకరణ చెందాలని రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అభిలషించారు. ఆయన నగరంలోని గ్రామీణ ఎమ్మెల్యే కార్యాలయంలో మేస్త్రీలు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్లకు ఆదివారం వృత్తి ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దద్దల్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రామికులకు సర్కారు చేయూత ఇస్తోందన్నారు. పనులు చేసే సమయంలో సురక్షిత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒక వేళ అనుకోని దుర్ఘటనలు జరిగితే కార్మికుల, వారి కుటుంబాల రక్షణకు కార్మిక శాఖలో అనేక యోజనలు ఉన్నాయని వివరించారు. ప్రతి శ్రామికుడు కట్టడ, నిర్మాణ కార్మిక కల్యాణ మండలిలో సభ్యత్వం తీసుకోవాలని సలహా ఇచ్చారు. సంబంధిత శాఖ మంత్రి సంతోష్‌లాడ్.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కార్మికశాఖ అధికారి ఆరతి, ఇన్‌స్పెక్టర్ ప్రియాంక్, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కృష్ణతత్వంపై నమ్మకం

బెంగళూరు(యశ్వంతపుర): కృష్ణతత్వంపై నమ్మకం ఉందే తప్ప కంసుడి హింసపై నమ్మకం లేదని కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి వ్యాఖ్యానించారు. కుమారస్వామి మనువాది అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనను మనువాది అని పేర్కొన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అహింద సిద్ధాంతానికి వ్యతిరేకమన్నారు. దానికి తాళం వేసిన మంత్రి డాక్టర్ మహదేవప్ప తన ఇద్దరు పిల్లలకు ఏమి బోధించారో వెల్లడించాల్లన్నారు. భగవద్గీత బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. మంత్రి మహదేవప్పకు భగవద్గీత గురించి తెలియదని తెలుసుకునేందుకు ప్రయత్నించలేదని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులందరూ రాజ్యాంగంపై ప్రకారం ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు.

ఏప్రిల్‌లో కమ్మ సముదాయం భారీ సమావేశం

సింధనూరు, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రాజధాని బెంగళూరులో రాష్ట్రవ్యాప్తంగా కమ్మసమాజం ప్రజల బృహత్ సమావేశం జరపాలని ఆదివారం సింధనూరు వేదికగా ఏర్పాటైన అఖిల కర్ణాటక కమ్మ సంఘ ప్రతినిధుల సమావేశం తీర్మానించింది. కమ్మ యువసేనను అన్నిరంగాల్లో ముందు వరుసలోకి తేవాలని తీర్మానించారు. బెంగళూరు పెద్దలు మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్యనాయుడు, గుర్రప్పనాయుడు, హరీశ్, రాజగోపాల నాయుడు, కబడ్డీ బాబుతో పాటు సింధనూరు పెద్దలు బూరుగుపల్లి శ్రీహర్ష, చిట్టూరి శ్రీనివాస్, డా.కె.సుబ్బారావు, కరుటూరి సుబ్బారావు తదితరులంతా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని తాలూకాల్లోని కమ్మసంఘం అధ్యక్ష, కార్యదర్శులు విచ్చేశారు. కార్యక్రమానికి గారపాటి రామకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కట్టా మాట్లాడుతూ 2006 తర్వాత రాష్ట్రంలో కమ్మ సమాజం బృహత్ సమావేశం జరగలేదన్నారు. ఏప్రిల్‌లో బెంగళూరు సమావేశం ముగిశాక 2026 డిసెంబరులో సింధనూరులో కూడా మూడు లక్షల మంది ప్రతినిధులతో మరో సమావేశం జరపాలని తీర్మానించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్యం నాయుడు

వాయుమాలిన్యం నియంత్రణకు చర్యలు

బెంగళూరు(యశ్వంతపుర), న్యూస్‌టుడే: దేశంలో ఉద్యాననగరి, సిలికాన్‌సిటీగా ఖ్యాతి పొందిన రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలో వాయుమాలిన్యం అపాయకరంగా మారకుండా మాలిన్యాన్ని నియంత్రించేందుకు చేపట్టే చర్యలను గురించి అధ్యయనం చేసేందుకు ప్రత్యేక నిపుణులు సమితి తక్షణం ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. వాయుమాలిన్యం ప్రమాదకరమైన స్థాయికి ఢిల్లీ నగరం చేరుకుందని అలాంటి పరిస్థితులు బెంగళూరు రాకూడదని సూచించారు. బెంగళూరు వాయుమాలిన్యం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ దినేశ్‌గూళిగౌడ, డీసీఎంకు లేఖ రాశారు. ఇప్పటి నుంచి చర్యలు తీసుకోకపోతే నగరంలో ప్రజలు జీవించలేని పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. నగర జనసంఖ్య 1.47 కోట్లు ఉండగా వాహనాలు 1.23 కోట్లు ఉన్నట్లు లేఖలో ప్రస్తావించారు. రోజు 2,563 వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని దీంతో ద్విచక్రవాహనాల సంఖ్య 84 లక్షలు దాటినట్లు తెలిపారు. వాయునాణ్యత ఏయూ 50 నుంచి 70 దాటే ప్రమాదం ఉందని, రానున్న ఐదేళ్లలో వాయుమాలిన్యం తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాయుమాలిన్యం బాలలు, వృద్ధులు వ్యాధులకు గురవుతున్నారని అలర్జీ, ఆస్తమా, హృదయ వ్యాధులు పెరుగుతాయన్నారు. పరిసర విజ్ఞానులు, సంచార నిపుణులు, ప్రజారోగ్య నిపుణులతో కూడిన ప్రత్యేక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని డీసీఎం సిఫార్సు చేశారు.

శీతాకాల పర్వం.. సవాళ్ల సమరం

● వ్యూహాలతో అధికార పక్షం ● 'ఉత్తర' సమస్యల పరిష్కారానికి గట్టి పట్టు

ఈనాడు, బెంగళూరు: శీతాకాల సమావేశాలకు కర్ణాటక రెండో రాజధాని బెళగావి సిద్ధమైంది. నేటి (సోమవారం) నుంచి ఈనెల 19 వరకు నిర్వహించే ఈ సమావేశాలు ఎప్పటిలాగానే ఉత్తర కర్ణాటక ప్రాంత సమస్యలపై దృష్టి సారిస్తూనే ఈసారి కొత్త అంశాలపై చర్చలకు వేదిక కల్పిస్తున్నాయి. దిల్లీలోని ఎర్రకోటపై దాడుల నేపథ్యంలో సువర్ణ సౌధ వద్ద భద్రతా వ్యవస్థలు కట్టుదిట్టం చేశారు. గతంతో పోలిస్తే డీఎస్పీ, ఎస్పీ స్థాయి పోలీసు అధికారుల సంఖ్యను పెంచి పర్యవేక్షణను విస్తృతం చేశారు. మరోవైపు విపక్షాల నేతృత్వంలో రైతుల ఆందోళనకు పిలుపునివ్వటంతో సౌధ చుట్టూ పోలీసు బలగాలు మోహరించాయి. ఈసారి ఉత్తర కర్ణాటక సమస్యలపై మాట్లాడేందుకు ఎక్కువ సమయం ఇచ్చేందుకు స్పీకర్లు నిర్ణయించటంతో అన్ని పార్టీల సభ్యులు వీటిపై సర్కారును నిలదీసేందుకు సిద్ధమయ్యారు. సౌధ వద్ద ప్రత్యేక ఉద్యానం, అతి పెద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించటం ఈసారి సమావేశాల ప్రత్యేకత.

సిద్ధమవుతున్న సువర్ణ సౌధ

అధికార పంపిణీ గోల

ఈసారి సమావేశాల్లో అధికార పక్షం ఇబ్బందుల్లో పడుతుందనే అందరూ భావించారు. రెండు వారాలుగా అధికార పంపిణీపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య కొనసాగుతున్న పోరు ఇప్పటికీ సమసిపోలేదు. దిల్లీ స్థాయిలోనూ వీరిద్దరి మధ్య తగవులాటను తీర్చేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయాలకు పరిమితమైన అధికార పక్షాన్ని ఈ సమావేశాల్లో నిలదీయాలని భాజపా, జేడీఎస్‌లు నిర్ణయించుకున్నాయి. అంతలోనే కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు అప్రమత్తమై వరుస అల్పాహార సమావేశాల్లో మేమిద్దరం ఒక్కటేనని ప్రకటించారు. అటు పార్లమెంట్, ఇటు విధానసభ సమావేశాల్లో అధికార పంపిణీ వ్యవహారంతో పార్టీ భంగపడకుండా జాగ్రత్త వహించే ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. అగ్రనేతల మధ్య అనుకోకుండా కుదిరిన ఒప్పందంతో విపక్షాలు కూడా 'అవిశ్వాస' తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సాహసించలేకపోయాయి. విపక్షాలు ఎలాంటి తీర్మానాలు చేసినా వాటిని ఎదుర్కొనేందుకు మేము సిద్ధమని సిద్ధరామయ్య, డీకేలు ప్రకటించటంతో విపక్షాలు తమ ప్రయత్నాలను విరమించుకున్నాయి. పైకి సీనియర్ల మధ్య అగాధం ఉన్నట్లే కనిపించినా సమావేశాల్లో ఐక్యత పాటించాలని నిర్ణయించుకోవటం విశేషం.

శాంతి భద్రతలపై..

ఈ సమావేశాల్లో చర్చకు వచ్చే అంశాల్లో శాంతిభద్రతలు కీలకంగా మారాయి. కేంద్ర కారాగారంలో ఖైదీలకు మొబైళ్లతో పాటు విలాస వ్యవస్థలు ఏర్పాటు చేయటం, ఈ వీడియోలు వైరల్‌గా మారటంతో రాష్ట్ర హోంశాఖ బదులివ్వలేకపోయింది. విపక్షాలు ఈ అంశంపై సభలో గట్టిగా ప్రశ్నించే వీలుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు చర్యలు చేపట్టామని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటక జైళ్లు సురక్షితమని చెప్పేందుకు తన వద్ద దాఖలాలున్నాయని ఇప్పటికే హోంమంత్రి పరమేశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. వీటితో పాటు ధర్మస్థల పరిసరాల్లో శవాల వెలికితీత, ఎస్ఐటీ విచారణ వ్యవహారాలపైనా విపక్షాలు గట్టిగా ప్రశ్నించాలని చూస్తున్నాయి.

రైతు సమస్యలు

ఈసారి సమావేశాల్లో రైతు సమస్యలు పెద్ద ఎత్తున చర్చకు వచ్చే అవకాశముంది. చెరకు, మొక్కజొన్నకు సంబంధించిన గిట్టుబాటు ధరలపై కేంద్ర రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న మనవి పత్రాల పరంపర, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టం, అందుకు పరిహారంపై చర్చలు జోరుగా సాగనున్నాయి. ఇక తుంగభద్ర గేట్ల మరమ్మతుల నేపథ్యంలో రెండో పంట లేని కారణంగా ఏకరానికి రూ.25 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించాలని విపక్షాలు పట్టుబట్టనున్నాయి. ఇక ఉత్తర కర్ణాటక నీటిపారుదల, అభివృద్ధి పనులతో పాటు డీఎం నంజుండప్ప కమిటీ, డా.ఎం.గోవిందరావ్ కమిటీల ప్రగతి, విద్య, సామాజిక అంశాల్లోనూ బెళగావి, కలబురగి వలయాల సదుపాయాల గురించి ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు ప్రశ్నించగలరు. వీటికి బదులిచ్చే క్రమంలో సర్కారు కేంద్రానికి జీఎస్టీ పరిహారంతో పాటు బడ్జెట్‌లో ప్రస్తావించిన తుంగభద్ర, కృష్ణా ఎగువ ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులను విడుదల చేయాలన్న డిమాండ్లను గుర్తు చేయాలని చూస్తోంది.

మరిన్ని అంశాలపై..

ఉత్తర కర్ణాటకతో పాటు బెంగళూరుకు సంబంధించిన అంశాలు ఈ సమావేశాలను కుదిపేయగలవు. ఇందులో రహదారుల దుస్థితి, దేశ విదేశీయులు వీటిపై స్పందించిన తీరు, సొరంగ మార్గ పథకం, పులుల దాడి కేసులు, ప్రభుత్వ పాఠశాలలను కేపీఎస్‌ల్లో విలీనం చేయాలన్న నిర్ణయం, ఇటీవల ఉప లోకాయుక్త విడుదల చేసిన 'అవినీతి' రాష్ట్ర భాగోతం, కుల గణన ప్రక్రియ లోపాలు, రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు, ఈ-ఖాతా తప్పనిసరి చట్టంతో ఎదురయ్యే సమస్యలు తదితరాలపైనా విపక్షాలు ప్రశ్నలను సంధించగలవు.

30కిపైగా బిల్లులు

ఈ సమావేశాల్లో దాదాపు 33 బిల్లులు ప్రవేశపెట్టాలని సర్కారు యత్నిస్తోంది. ఇందులో స్పీకర్ వద్దకు 17 బిల్లుల ప్రతులు చేరాయి. వీటిల్లో విద్వేషపూరిత ప్రసంగాలు, వార్తా కథనాల నిషేధ బిల్లు, గోవధ నిషేధం, కర్ణాటక కార్మిక సంక్షేమ నిధి, గ్రేటర్ బెంగళూరు ప్రాధికార, కర్ణాటక సినీ కార్మికుల సంక్షేమ నిధి తదితర 30కిపైగా బిల్లులను ఈ సమావేశాల్లోనే సర్కారు ప్రవేశపెట్టనుంది.

వేగంగా గుంతలను పూడ్చాల్సిందే

రాయచూరు, న్యూస్‌టుడే : జాతీయ రహదారి, ప్రజా పనులు, పంచాయతీరాజ్ శాఖ, స్థానిక సంస్థల పరిధిలోని రహదారుల్లో గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని జిల్లా పాలనాధికారి నితీష్ అధికారులకు సూచించారు. జిల్లా పాలనాధికారి సభా భవనంలో జరిగిన రహదారి సురక్షతా సమితి సమావేశానికి నితీష్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సురక్షతా నియమాలను తెలియజేసే నామ ఫలకాలను ఉంచాలని ఆదేశించారు. రాయచూరు సమీపంలోని యరమరాస్ బైపాస్‌లో ప్రమాదాలను అరికట్టేందుకు రోడ్డును విస్తరించాలని, రహదారిని ఆక్రమించుకున్న దుకాణాలను తొలగించాలని నిర్దేశించారు. నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహోపాత్ర మాట్లాడుతూ రాయచూరులో గుంతలు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తే ఏ పనికి ఆమోదం తెలపనని ఇంజినీర్లకు స్పష్టం చేశానన్నారు. ఆర్టీవో అధికారులు మాట్లాడుతూ జిల్లాలో 444 పాఠశాలల వాహనాలు ఉంటే.. 175 ఫిట్నెస్ పత్రాలు పొందాయని వివరించారు. మిగిలిన వాహనాలకు తీసుకోవాలని యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ద్విచక్రవాహన చోదకులు శిరస్త్రాణం ధరించాలని చైతన్య పరుస్తున్నామని, ప్రముఖ కూడళ్లు, రహదారుల వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టవద్దని సూచనలు చేసినట్లు పోలీస్ అధికారులు చెప్పారు.

సూచనలు చేస్తున్న నితీష్

హస్తినలో 'కర్ణాటకం'

తాజా రాజకీయంపై పెద్దల చర్చ

ఈనాడు, బెంగళూరు: రాష్ట్రంలో అధికార పంపిణీ లేదంటే లేదని వాదించే అధిష్ఠానం ఎట్టకేలకు నోరు మెదిపింది. అంతే కాకుండా గత రెండు వారాలుగా సీఎం, డీసీఎంల మధ్య కొనసాగుతున్న పోరుపైనా చర్చించేందుకు తొలిసారిగా సమావేశమైంది. దిల్లీలో పార్లమెంటరీ కాంగ్రెస్ సమితి ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ నివాసం 10 జనపథ్‌లో శనివారం రాత్రి ఏఐసీసీ అగ్రనేతలు సమావేశమయ్యారు. ఈ విషయాన్ని ధ్రువీకరించిన కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్..'రాష్ట్ర వ్యవహారాలపై తొలిసారిగా చర్చించాం. ఈ సమావేశంలో ఏం మాట్లాడామో బయటకు చెప్పలేం. పార్లమెంట్ సమావేశాల్లో పార్టీ కార్యాచరణపై సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు ప్రత్యేకంగా చర్చించారు. ఇదే సమయంలో రాష్ట్ర రాజకీయాల ప్రస్తావన కూడా వచ్చిందన్నారు. కానీ ఈ ఒక్క సమావేశంతోనే సమస్య పరిష్కారం కాదని చెప్పారు.

జనవరి తొలివారంలో

ఈనెల 14న దిల్లీలో చేపట్టే 'ఓట్ చోరీ' ఆందోళన సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొంటారు. ఆ సమయంలోనే రాష్ట్ర నాయకత్వ విషయాలపైనా చర్చించే వీలుందని వేణుగోపాల్ తెలిపారు. ఆలోగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మరోసారి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో మలివిడత చర్చల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాన్ని అధిష్ఠానం ముందు నేరుగా ప్రకటిస్తారు. మొత్తంగా పార్లమెంట్, విధానసభ సమావేశాలు ముగిసేంత వరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకునే వీలులేదు. జనవరి తొలివారంలోనే అధిష్ఠానం నుంచి కీలక ఆదేశాలు వెల్లడవుతాయని తెలిసింది.

కుమార ఉదారత

మండ్య, న్యూస్‌టుడే: సుమారు 15 నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్న మైషుగర్ పాఠశాల ఉపాధ్యాయులకు అండగా నిలిచేందుకు కేంద్ర మంత్రి కుమారస్వామి ముందుకు వచ్చారు. గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ఇప్పటి వరకు ఎంపీగా తాను అందుకున్న రూ.19,94,200ల మొత్తాన్ని పాఠశాల పాలక మండలికి అప్పగించారు. ఉపాధ్యాయులకు వేతనాలు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. ఈ పాఠశాలను మాదిరి విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి సహకారంతో పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

తన వేతన చెక్కును అందిస్తున్న కేంద్ర మంత్రి

(c) eenadu

యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉంది..!

మాట్లాడుతున్న గవర్నరు హరిబాబు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందని ఉన్నత విద్యావంతులు స్వీయ ప్రయోజనాలకే పరిమితం కాకుండా జన్మభూమి రుణం తీర్చుకోవాలని గవర్నరు కంభంపాటి హరిబాబు కోరారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని బిర్లా గ్లోబల్ విశ్వవిద్యాలయం 8వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నరు మాట్లాడుతూ రాష్ట్రం ప్రాథమికంగా విస్తరిస్తున్న నేపథ్యంలో సాంకేతిక నిపుణులు అవసరం ఉందన్నారు. పరిశోధకులు వైఫల్యాలకు వెరవకుండా సాధన చేయాలని, కచ్చితంగా విజయాలు వరిస్తాయన్నారు. గ్లోబల్ వర్సిటీ అత్యాధునిక తరహా పరిశోధనలను ప్రోత్సహించాలని, కేంద్ర విద్యా విధానానికి(ఎన్‌ఈపీ) అనుగుణంగా సరికొత్త కోర్సులు ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో పరిశోధనలు చేసిన పీహెచ్‌డీ, ఉత్తమ విద్యార్థులకు పసిడి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల డీన్ నారాయణ్ రాయన్నారు, బిర్లా వర్సిటీ ఉపకులపతి ఆచార్య వీకే మిశ్ర, ప్రముఖ విద్యావేత్త కులభూషణ్ బలూనీ తదితర ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలి వణికిస్తోంది..!

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఉష్ణ, నగరం రెప్పరైలలో ఆదివారం అత్యల్ప ఉష్ణోగ్రత 7.2 డిగ్రీలు నమోదు కాగా, కొందమాల్ జిల్లా దారింగబాడిలో 7.5, ఝార్సుగుడలో 7.6, కొందమాల్ జిల్లా కేంద్రం ఫుల్బాణిలో 8 డిగ్రీలుగా ఉన్నట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం(ఐఎండీ) అధికారి ఉమాశంకర్ దాస్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఇతర కేంద్రాల్లో 10.3 నుంచి 16 డిగ్రీల లోపుగా ఉంటున్నాయి. మరో వారం రోజులు చలి తీవ్రత ఉంటుందని, ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గే సూచనలున్నాయన్నారు. సోమవారం(8న) సుందర్‌గడ్, కొంధమాల్, కొరాపుట్, ఝార్సుగుడ, ఖుర్దా, జగత్సింగ్‌పూర్ జిల్లాల్లో మంచు కురిసే సూచనలున్నందున 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు.

చిన్నారులకు శిశు సంజీవని

రాయగడ, కలహండిలో అమలు చేస్తున్న వేదాంత పరిశ్రమ

శిశు సంజీవని ప్యాకెట్లతో చిన్నారులు, ఆరోగ్య కార్యకర్తలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: చిన్నారులకు పోషకాహారం అందించేందుకు వేదాంత పరిశ్రమ శిశు సంజీవని కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాయగడ, కలహండి జిల్లాల్లో దీనిని అమలు చేస్తోంది. ఇప్పటికే కాశీపూర్(రాయగడ), భవానీపట్న(కలహండి) పరిధిలో 25 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వీటిని పంపిణీ చేసింది. 3 నుంచి 6 ఏళ్ల లోపు 600 మందికి పైగా చిన్నారులకు దీని ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు(ఎన్‌డీడీబీ) రూపొందించిన ఇందులో సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉంటాయి. భారత వైద్య పరిశోధన మండలి మార్గదర్శకాలను అనుసరించి శిశు సంజీవని తయారీ జరుగుతున్నట్లు వేదాంత గుర్తు చేసింది. ఈ విషయమై వేదాంత సీఈవో రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో భాగంగా బాల్యంలో చిన్నారులకు పోషకాలను సమృద్ధిగా అందించాలన్న లక్ష్యంతో పరిశ్రమ కట్టుబడి ఉందన్నారు. ఐసీడీఎస్ 2015లో మహిళా, శిశు సంక్షేమశాఖ భాగస్వామ్యంతో అనిల్ అగర్వాల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి గతంలోనూ నందొఘారొ పరిధిలో వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 531 నందొఘారొలు చిన్నారులకు సేవలందిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

నాలుగేళ్లలో 56 వేల మంది బాధిత చిన్నారులు

ప్రభాతి పరిడా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా గడిచిన నాలుగేళ్లలో పోషకాహార లోపంతో బాధపడుతున్న 56 వేల మందికి పైగా చిన్నారులను గుర్తించినట్లు ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా తెలిపారు. శాసనసభలో ఎమ్మెల్యే ప్రదీప్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. 2022-23 నుంచి 2025-26 వరకు మొత్తం 56,751 మంది బాధిత చిన్నారులను గుర్తించారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని సమకూరుస్తున్నట్లు ప్రభాతి గుర్తు చేశారు. ఇందులో భాగంగా ఛతువా, లడ్డూలు, కోడిగుడ్లు, అరటిపండ్లు తదితర వాటిని అందిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. గడిచిన నాలుగేళ్లలో గుర్తించిన బాధితుల వివరాలిలా ఉన్నాయి.

సంవత్సరం	బాధిత చిన్నారులు
2022-23	23,005
2023-24	13,736
2024-25	10,133
2025-26 (ఇప్పటి వరకు)	9,877

భువనేశ్వర్ చేరుకున్న భారత్, సౌతాఫ్రికా జట్లు

బారాబటి మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీజీపీ, పోలీసు అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ బారాబటి స్టేడియం భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య టీ-20 పోరుకు సిద్ధమైంది. మంగళవారం(9న) జరగనున్న మ్యాచ్‌లో భాగంగా ఆదివారం క్రీడాకారులు భువనేశ్వర్ చేరుకున్నారు. మేఫెయిర్ హోటల్లో బస చేయనున్నారు. సోమవారం బారాబటి మైదానంలో రెండు జట్లు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా, ఇతర పోలీసు అధికారులు క్రీడా మైదానం లోపల, బయట భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఓసీఏ కార్యదర్శి సంజయ్ బెహర విలేకరులతో మాట్లాడుతూ.. బారాబటి బ్యాటింగ్ పిచ్ అని తెలిపారు. భువనేశ్వర్, పూరీల నుంచి కటక్ బారాబటి వరకు బస్సుల సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కటక్‌లో జరిగిన మ్యాచ్‌లో అపశ్రుతులను దృష్టిలో ఉంచుకుని ఓసీఏ ముందస్తు చర్యలు చేపట్టింది.

భువనేశ్వర్ మేఫెయిర్ హోటల్ వద్ద క్రీడాకారులు

కండల వీరుడు గండర గండడు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశాకు చెందిన కండల వీరుడు అమిత్ కుమార్ భుయ్య అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. జాజ్‌పూర్ జిల్లా అల్లార్‌పూర్ గ్రామానికి చెందిన అమిత్‌కు 2021 నుంచి బాడీబిల్డింగ్‌పై ఆసక్తి పెంచుకున్నారు. అప్పటినుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రదర్శనలు ఇచ్చిన విజయకేతనం ఎగురవేస్తున్నారు. ఇండోనేషియాలో ఈ ఏడాది నవంబరులో జరిగిన ప్రపంచ బాడీబిల్డింగ్ పోటీల్లో సత్తా చాటి కాంస్య పతకం గెలుచుకున్నారు. అంతకుముందు అమిత్ 2021 నుంచి ఇప్పటివరకు వివిధ రాష్ట్రాలు, దేశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని కళింగపుత్ర, 'ఉత్కళ శ్రీ ఛాంపియన్', 'మిస్టర్ ఒడిశా', ఫెడరేషన్ కప్, 'మిస్టర్ ఇండియా' 2023, 2025లలో 'మిస్టర్ వరల్డ్', 'మిస్టర్ ఆసియా' పోటీల్లో పసిడి, రజత, కాంస్య పతకాలను గెలుచుకుని ఔరా అనిపించుకున్నాడు. ప్రస్తుతం భువనేశ్వర్‌లో ఉంటూ ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు వివిధ పోటీల్లో పాల్గొంటూ తన క్రీడాస్ఫూర్తిని చాటుతున్నారు.

అదే లక్ష్యం: ఇప్పటివరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఇరవై పసిడితో పాటు యాభైకి పైగా పతకాలు, పలు టైటిళ్లను గెలుచుకున్న అమిత్ ప్రపంచస్థాయి ఒలింపియన్ పోటీల్లో టైటిల్ కొట్టడమే లక్ష్యమని తెలిపారు. మెరుగైన శిక్షణ కోసం తమిళనాడుకు చెందిన సీనియర్ కోచ్ డాక్టర్ పి. శివకుమార్ పర్యవేక్షణలో ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

★ భుయ్య తండ్రి వ్యవసాయం చేసేవారు. పోలీసు లేదా ఆర్మీ ఉద్యోగిగా కుమారుడిని చూడాలన్నది ఆయన కోరిక. 2001లో తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలో అమిత్ ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. వ్యాయామ కేంద్రంలో చేరి నిత్యం సాధన చేసేవారు. రెండేళ్ల తరువాత తండ్రి మరణించడంతో పూర్తి స్థాయిల బాడీబిల్డరుగా మారాలనుకున్నారు. జాజ్‌పూర్‌లో ఓ వ్యాయామశాలలో సాధన ప్రారంభించారు. భువనేశ్వర్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ భువనేశ్వర్‌లోని ఉత్కళ విశ్వవిద్యాలయంలో డిస్టెన్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. బాడీ బిల్డింగ్ పోటీల్లో కెరీర్‌ను ప్రారంభించారు. 2023లో తొలిసారి ఆసియా బాడీబిల్డింగ్‌లో పసిడి పతకం గెలుచుకున్న కండల వీరుడు ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు. క్రీడా కోటలో ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (భువనేశ్వర్) 2023లో తన సంస్థలో అసిస్టెంట్ మేనేజరుగా ఉద్యోగం కల్పించింది. దీంతో మరింత ఆత్మస్థైర్యం పెరిగింది.

తారిణి శక్తిపీఠానికి నూతన సొబగులు

రూ.312 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం

నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం, మంత్రులు

తారిణి అమ్మవారు

శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

కేంఝర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి తారిణిశక్తి పీఠానికి నూతన సొబగులు, సౌకర్యాలు కల్పించడానికి నిర్ణయించారు. రూ.312 కోట్లు విడుదల చేశారు. సమగ్ర కార్యాచరణ ప్రణాళిక(డీటైల్డ్ ప్రాజెక్టు నివేదిక) సిద్ధం చేశారు. ఆదివారం తారిణి సన్నిధికి వచ్చిన సీఎం దంపతులు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి ముందుగా జరిగిన మహాయాగంలో పాల్గొని ఆహుతులిచ్చారు. అమ్మ సన్నిధిలో పూజలు చేశారు.

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంఝర్ జిల్లాలోని ఘటగామ్ తారిణి శక్తిపీఠం మహత్తరమైనది. టెంకాయలంటే అంటే తారిణికి మహాప్రీతి, అందుకే ఒడియాలో 'నొడియా రాణి' అంటారు. స్వయంగా వెళ్లలేని భక్తులు ఒక కొబ్బరికాయకు పసుపు గుడ్డ కట్టి ఘటగాం పంపిస్తారు. దీన్ని మహత్తర కార్యంగా భావించే బస్సు చోదకులు రూపాయి తీసుకోకుండా టెంకాయను తీసుకుంటారు. మరో బస్సుకు అప్పగిస్తారు. ప్రతి నగరం, పట్టణాల్లో అమ్మవారి టెంకాయలను తీసుకెళ్లేందుకు షెడ్లుంటాయి. ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోయినా నిత్యం పెద్దసంఖ్యలో భక్తులొస్తారు. ఇప్పుడు ఈ ఆలయానికిప్పుడు మహర్దశ పట్టనుంది.

అభివృద్ధే మా అజెండా

కేంఝర్ వచ్చిన మోహన్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 5 కిలోమీటర్ల రోడ్డు షో చేపట్టారు. ఘటగామ్‌లో బహిరంగ సభ జరిగింది. ముఖ్యమంత్రి మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ పాలనలో అభివృద్ధే అజెండా కాగా ప్రాచీన ఆలయాలు, ప్రముఖక్షేత్రాల విస్తరణకు ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. తారిణి ఆలయం పనులు 60 ఎకరాల విస్తీర్ణంలో జరుగుతాయని, స్థల సేకరణ పూర్తయిందని, 16 నెలల్లో నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ భక్తులకు వసతి సౌకర్యం, కల్యాణ మండపం, విశాలమైన రోడ్లు, విద్యుద్దీపాలు, గ్రంథాలయం తదితర సౌకర్యాలు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, మంత్రులు పృథ్వీరాజ్ హరిచందన్, గణేశ్ రామ్‌సింగ్ ఖుంటియా, కృష్ణచంద్ర మహాపాత్ర్, కేంఝర్ ఎంపీ అనంతనాయక్, ఇతర ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

ఊట జలం.. గొంతు దిగని గరళం

కొరాపుట్ జిల్లా నందపూర్ సమితిలోని తాగునీరు సమస్య ఉన్న గ్రామాల్లో పోర్జబెడ పోదర్ ఒకటి. ఇక్కడ నీటి వనరులు లేకపోవడంతో సమీపంలోని నది వద్ద వెళ్లి గోతులు తవ్వి ఊటనీరు సేకరిస్తారు. అవే తాగి దాహం తీర్చుకుంటారు. కిలోమీటరు దూరం ఉన్న నదికి కాలినడకన చేరుకుంటున్నారు. బిందెడు నీటికి వర్ణనాతీతమైన బాధలు పడుతున్న తమను చూసి అధికారులు మనసు కరగడం లేదని వాపోతున్నారు. ఊట నీరు తాగుతూ రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమితి అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్ దొర దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిశీలించి, గ్రామంలో బోరు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. –న్యూస్‌టుడే, సిమిలిగుడ

జలపాతం.. ఉత్సాహం..!

గజపతి జిల్లా రాయగడ సమితిలోని పర్యటక కేంద్రమైన గండాహతి జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. జిల్లాలోని చుట్టుపక్కల గ్రామాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాల వారు ఇక్కడికి చేరుకొని ఉత్సాహంగా గడిపారు. ఆదివారం కావడంతో రద్దీ నెలకొంది.
–న్యూస్‌టుడే, పర్లాఖెముండి

స్వర్ణోత్సవం.. కరిగిపోని స్నేహం

సిటీ హైస్కూలు బయట కేరింతలు కొడుతున్న పూర్వ విద్యార్థులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని పురాతన సిటీ హైస్కూల్లో 1975వ సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుకున్న పూర్వ విద్యార్థుల సంఘం 'స్వర్ణోత్సవాలు' ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కూడలి నుంచి మంగళవాయిద్యాలతో నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. చదువుకున్న సిటీ హైస్కూలును తిలకించి సందడి చేశారు. అనంతరం శుభం సెలబ్రేషన్‌కు చేరుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవిత అనుభవాలు, సాధించిన విజయాలు, వారి పిల్లలు తదితర అంశాలను వివరించారు. మధుర గీతాలు ఆలపించారు. ఒడిశాలోని బ్రహ్మపుర, రాయగడ, జయపురంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాదు (తెలంగాణ), బెంగళూరు (కర్ణాటక) తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు, వారి భార్యలు హాజరయ్యారు.

★ పూర్వ విద్యార్థులంతా మధుర స్మృతుల్ని భద్రపరుచుకోవడం స్వర్ణోత్సవాల లక్ష్యమని వేడుకల కమిటీ అధ్యక్షుడు టి.వాసుదేవ రావు, గౌరవ కార్యదర్శి జి.త్రినాథ రావు, కోశాధికారి వీవీకే రాజులు మధ్యాహ్నం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. 48 ఏళ్ల తర్వాత 2023లో పూర్వ విద్యార్థుల తొలి సమ్మేళనం జరిపామని, అప్పుడే స్వర్ణోత్సవాలు జరుపుకోవాలని నిర్ణయించామని వారు పేర్కొన్నారు. 1975లో మెట్రిక్యులేషన్ అనంతరం ఉన్నత చదువులు, ఉద్యోగ, వ్యాపారాలకు పూర్వ విద్యార్థులు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలు, విదేశాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. అంతా ఒకే చోట కలిసి అలనాటి పాత స్మృతులు గుర్తు చేసుకోవడంతో పాటు జీవితాల్లో తాము సాధించిన విజయాల గురించి ఒకరినొకరు పంచుకోవాలన్న లక్ష్యంతో వేడుకలు జరిపామని, ఇందుకు వారి మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు.

సైక్లింగ్‌లో రెండు రజతాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: సంబల్‌పూర్‌లో జరిగిన 30వ జాతీయ రోడ్ సైక్లింగ్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన పలువురు సైక్లిస్టులు పతకాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా చివరిరోజు శనివారం నిర్వహించిన మహిళా ఎలైట్ 30 కిలోమీటర్ల క్రైటేరియమ్ రేస్‌లో పోటీపడిన రాష్ట్ర క్రీడాకారిణి స్వస్తి సింగ్ ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకున్నట్లు రాష్ట్ర క్రీడాశాఖ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇదే పోటీల్లో జరిగిన 30కిలోమీటర్ల వ్యక్తిగత టైమ్ ట్రయల్ అంశంలో స్వస్తి రజత పతకం గెలుచుకున్న సంగతి తెలిసిందే.

గ్రీన్ ఎనర్జీ ధ్యేయంగా పనులు

జ్యోతి వెలిగిస్తున్న సీఎం మోహన్, కేంద్రమంత్రి జోషి, ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్ తదితరులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: గ్రీన్ ఎనర్జీ ధ్యేయంగా తమ ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తోందని విద్యుదుత్పత్తి రంగంలో రాష్ట్రం ముందంజలో ఉందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి చెప్పారు. శనివారం రాత్రి పూరీలో గ్లోబల్ ఎనర్జీ లీడర్స్ సమ్మిట్-2025 రెండు రోజుల సదస్సు సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 వరకు విద్యుతుత్పత్తిలో రాష్ట్రం వెనుకబడిందని, ఇప్పుడు స్వయం సమృద్ధి సాధించిందన్నారు. 2036 నాటికి పర్యావరణానికి ముప్పులేని గ్రీన్ ఎనర్జీ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ దిశగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన జరిగిందన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ప్రహ్లాద జోషి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దూరదృష్టి నేపథ్యంలో 2014 నాటికి 2.8 మెగావాట్ల సౌరశక్తి ఉత్పత్తి జరుగుతుండగా, ప్రస్తుతానికి 130 మెగావాట్లకు పెరిగిందన్నారు. బ్రిటన్ మాజీ ప్రధాని సర్ టోనీబ్లెయర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, దిల్లీ విద్యుత్‌శాఖ మంత్రి ఆశిష్ సుద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా, రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి విశాల్‌దేవ్, ఎనర్జీ రంగ నిపుణులు పాల్గొన్నారు, సంచిక ఆవిష్కరించారు.

ఒకే చితిపై భార్యాభర్తలకు దహన సంస్కారాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపాహండి ఠాణా పరిధిలోని గొణియానాళొ కూడలి సమీపంలోని కురేయిసుణి మందిరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన భార్యాభర్తలు లలితా మల్లిక్ (30), ప్రతాప్ మల్లిక్ (35)ల మృతదేహాలకు శనివారం సాయంత్రం ఒకే చితిపై దహన సంస్కారాలు నిర్వహించారు. సన్నొఖెముండి సమితిలో గంగాపూర్ పంచాయతీలోని ఢెపాగుడ గ్రామ శ్మశానంలో జరిగిన అంత్యక్రియలకు మృతుల బంధువులతోపాటు గ్రామస్థులంతా హాజరై అంతిమ వీడ్కోలు పలికారు. ప్రమాదంలో స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడిన మల్లిక్ దంపతుల మూడేళ్ల కుమార్తె ఆరసి మల్లిక్‌కు తల్లిదండ్రులు ఏమయ్యారో తెలియక రోదిస్తున్న తీరు గ్రామస్థులను కలచి వేసింది. మేస్త్రీగా పనిచేసే ప్రతాప్ భార్య లలితా ఎనిమిది నెలల గర్భిణి. వైద్యుల సూచన మేరకు ఆమెకు స్థానిక ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ పరీక్షలు జరిపించేందుకు శుక్రవారం భార్య, కుమార్తెలతో కలిసి ప్రతాప్ ద్విచక్ర వాహనంపై బ్రహ్మపుర వచ్చాడు. సాయంత్రం గ్రామానికి తిరిగి వెళ్తుండగా.. గొణియానాళొ కూడలి వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో భార్యాభర్తలిద్దరూ అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి మృతి చెందారు. . వారి మూడేళ్ల కుమార్తె ఆరసి స్వల్ప గాయాలతో బయటపడ్డ సంగతి తెలిసిందే.

గజరాజుల బీభత్సం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలోని గుమ్మ సమితి జనిగూడలో ఏనుగుల గుంపు సంచరించి బీభత్సం సృష్టిస్తోంది. గ్రామంలోకి ప్రవేశించి ఇళ్లు, అరటి తోటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ గుంపు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. వాటి కదలికను ఎప్పటికప్పుడు అటవీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వాటిని ఇబ్బంది పెట్టొద్దని స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఏనుగుల వల్ల కలిగే నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందజేస్తామని జిల్లా అటవీశాఖ అధికారి కె.నాగరాజు తెలిపారు.

మీడియా ప్రతినిధులకు ఆరోగ్య పరీక్షలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: మణిపాల్ హాస్పిటల్స్ (భువనేశ్వర్) ఆధ్వర్యంలో బ్రహ్మపుర ప్రెస్ క్లబ్ సహకారంతో ఆదివారం మీడియా ప్రతినిధులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, చైతన్య శిబిరం జరిగింది. నగర శివారున రెవెన్యూ అతిథి భవనం ఆవరణలో నిర్వహించిన ఇందులో వైద్య నిపుణులు పాల్గొని గుండె, ఎముకలు, నరాల బలహీనత, ఎండోక్రినాలజీ ఇతర పరీక్షలు నిర్వహించారు. బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ శిబిరాన్ని సందర్శించి, నిర్వాహకుల్ని అభినందించారు. ప్రెస్ క్లబ్ ప్రతినిధులు అశోక్ బ్రహ్మ, ప్రహ్లాద సాహు, శిబనారాయణ పండా తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

శిబిరంలో పాల్గొన్న బ్రహ్మపుర ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

ఆ రోడ్డులో ప్రయాణం.. నరకం

కకిగాంలో రోడ్డు దుస్థితి

ఆ రోడ్డులో ప్రయాణిస్తే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్టే... ఎన్నికల సమయంలో హామీలిచ్చే అధికారులు అదంతా కేవలం ప్రకటనకే పరిమితమని నిరూపిస్తున్నారు. చిత్రంలో కనిపిస్తున్న సునాబెడ పురపాలిక పరిధిలో ఉన్న ఈ రోడ్డును చూస్తే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 25 వార్డులు ఉన్న పురపాలిక పరిధిలో బిజూ కాలనీ, సుభాష్ నగర్, పీహెచ్ కాలనీ, మాలిగుడ, డీపీ క్యాంప్, సిమిలిగుడ పట్టణంలో సత్యనగర్, కకిగాం, బిలాయిగుడ, గాంధీనగర్, కైలాసనగర్, ట్రాఫిక్ కూడలి, బస్టాండ్ ప్రాంతంలో రహదారులు దారుణంగా ఉన్నాయి. చినుకు పడితే చాలు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పురాధ్యక్షుడు అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్రన్‌ను ప్రశ్నించగా పలు రోడ్ల మరమ్మతులు, రూ.9 కోట్లతో కొత్తవాటి కోసం టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు.
–న్యూస్‌టుడే, సిమిలిగుడ

భంజవిహార్‌లో అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు

మాట్లాడుతున్న రిజిస్ట్రార్ నాయక్. చిత్రంలో ఉపకులపతి ఆచార్య దాస్ తదితరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర విశ్వవిద్యాలయం (భంజ విహార్) క్రీడల మండలి ఆధ్వర్యంలో 57వ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. భంజవిహార్ క్రీడామైదానంలో రెండురోజులు నిర్వహిస్తున్న వీటిని వర్సిటీ ఉపకులపతి ఆచార్య గీతాంజలి దాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వివిధ కళాశాలల నుంచి వచ్చిన పురుషులు, మహిళా క్రీడాకారులు తమ నైపుణ్యం ప్రదర్శించి ఉత్తమ ఆటతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇతర అతిథులుగా వర్సిటీ రిజిస్ట్రార్ సచ్చిదానంద నాయక్, క్రీడల మండలి కార్యదర్శి ధృవచరణ్ పండా తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న 31 కళాశాలలకు చెందిన 250మంది విద్యార్థులు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్, డిస్కస్‌త్రో తదితర అంశాల్లో పోటీపడుతున్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడా శిక్షకులు వీటిని పర్యవేక్షిస్తున్నారు.

సాగరంలో రిడ్లేల సంగమం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా సాగర జలాల్లో విదేశీ అతిథులు 'ఆలివ్ రిడ్లే' (సముద్ర తాబేళ్లు) రాక జోరందుకుంది. జిల్లాలో అర్జిపల్లి నుంచి ప్రయాగి వరకు తీరానికి సమీపంలో సముద్రంలో రిడ్లేల సంగమ ప్రక్రియ కొనసాగుతోందని కళ్లికోట అటవీ రేంజ్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏసీఎఫ్ దిబ్య శంకర బెహర ఆదివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. తాబేళ్ల రాక నేపథ్యంలో సాగరంలో గస్తీ మరింత ముమ్మరం చేశామని, మూడు స్పీడు బోట్లు, రెండు ట్రాలర్‌లతో పరిస్థితిపై గట్టి నిఘా ఉంచామని ఆయన పేర్కొన్నారు.

(c) eenadu

సాహితీ సమావేశం.. పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: సాహితీ సంస్థ 'ఉత్కళిక' ఆధ్వర్యంలో ఆదివారం రెండు విడతల్లో రాష్ట్రస్థాయి సాహితీ సమావేశం, వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక ఉత్కళాశ్రమం ఆవరణలోని భాషాభవన్‌లో తొలి విడత జరిగిన సాహితీ సమావేశానికి శరత్‌చంద్ర పండా అధ్యక్షత వహించారు. డాక్టర్ బనమాలి పాణిగ్రహి, హడిబంధు మాళి, ప్రఫుల్ల కుమార్ త్రిపాఠి, సుశాంత కుమార్ కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రెండో విడత నిర్వహించిన వార్షికోత్సవాలను డాక్టర్ తిరుపతి సాహు ప్రారంభించారు. వేడుకల్లో బిచిత్రానంద ముని, డాక్టర్ పురుషోత్తం మిశ్ర, జామినికాంత్ దాస్, సుశాంత దాస్, కృష్ణాంజలి దాస్, ఇంద్రమణి బారిక్ తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో 'అభినవ ఉత్కళిక', 'ఆసొ అమె పఢిమా' పుస్తకాలు, క్యాలెండరును అతిథులు, నిర్వాహకులు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు, స్థానిక ప్రముఖులు హాజరయ్యారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా

బహుమతులతో వివిధ రాష్ట్రాల విన్నర్, రన్నర్ బాలబాలికలు: చిత్రంలో అతిథులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో దాల్మియ భారత్ గోపీచంద్ బ్యాడ్మింటన్ హెచ్‌పీసీ కేంద్రంలో వారం రోజులు జరిగిన 37వ జాతీయ జూనియర్ అండర్-15, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. బాలికల అండర్-15, 17 విభాగాల్లో నిర్వహించిన సింగిల్స్ ఫైనల్ మ్యాచుల్లో రాష్ట్ర క్రీడాకారిణి తన్విపత్రి తెలంగాణకు చెందిన అవని విక్రమ్, తమిళనాడుకు చెందిన దీక్షా సుధాకర్‌లతో ఆడి విజేతగా నిలిచి డబుల్ క్రౌన్ టైటిల్ సాధించింది. బాలికల విభాగంలో డబుల్స్ ఫైనల్ మ్యాచులో రాష్ట్ర బాలికలు స్వాతినాయక్, నిమిషా ఓరూల జోడీ మహారాష్ట్రకు చెందిన సరయు రంజనె, సాయార సెలార్ జోడీతో ఆడి ఓటమి పాలైంది. అండర్-15 బాలుర విభాగంలో సాయి పుష్కర్ చాంపియన్‌గా నిలిచాడు. ముగింపు కార్యక్రమంలో హాజరైన క్రీడాశాఖ కార్యదర్శి సచిన్ యాదవ్, ఒడిశా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు రాజేష్ ప్రభాకర్ పాటిల్, బీఏఐ ఉపాధ్యక్షుడు శేఖర్ విశ్వాస్ విన్నర్, రన్నర్ క్రీడాకారులకు పతకాలు, బహుమతులు అందజేశారు.

30 వసంతాల 'స్పందన'

జ్యోతిని సత్కరిస్తున్న సభ్యులు

రాయగడ, న్యూస్‌టుడే: సమాజంలో జరుగుతున్న ఘటనలను ఇతివృత్తాలుగా తీసుకొని కవులు రచించిన కవితలు ఆలోచింపజేసే విధంగా ఉన్నాయని ప్రముఖ రచయిత్రి, అటానమస్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు టి.జ్యోతి అన్నారు. ఆదివారం రామలింగేశ్వర ఆలయ కల్యాణ మండపంలో స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం కార్యక్రమంలో ప్రసంగించారు. కవితల్లో ఆవేదన, ఆలోచన, వర్ణన, అభ్యుదయ భావాలు, తల్లిదండ్రులపై ఉన్న ప్రేమతో పాటు 30 వసంతాల స్పందనను వర్ణిస్తూ అనుభవాలు రంగరించి రాసినవిగా ఉన్నాయన్నారు. అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకర ప్రసాద్ కవిత వినిపించగా కవులు గణపతిరావు, రామ్మోహన్ పట్నాయక్, బరాటం గౌరి, బాలకృష్ణ పట్నాయక్, కేకేఎమ్ పట్నాయక్, కిషోర్ కుమార్, భళ్లముడి నాగేశ్వరరావు తదితరులు స్వీయ కవితలు వినిపించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జ్యోతిని సత్కరించారు.

అక్షరం లక్ష మెడల్లకు కదలిక • సీఎం

పుస్తకాలు పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అక్షరం లక్ష మెదళ్లకు కదలికని, మంచి పుస్తకాలు చదివి, పదిమందితో చదివించాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి కోరారు. శనివారం రాత్రి భువనేశ్వర్ యూనిట్-3 పరిధిలోని ప్రదర్శన మైదానంలో 10 రోజుల రాష్ట్రస్థాయి పుస్తక ప్రదర్శన సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పఠనాసక్తి ఉందని మంచి పుస్తకాలు కొనుగోలు చేయడం విద్యార్థి దశనుంచే అలవాటైందని, తన గ్రంథాలయంలో 6 వేల పైచిలుకు పుస్తకాలున్నాయన్నారు. కాస్త సమయం దొరికితే చదువుతానని, నేర్చుకోవడానికి జీవితకాలం సరిపోదని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నత విద్య, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ప్రతిభారాయ్, ఇతర ప్రముఖ కవులు, రచయితలు పాల్గొన్నారు.

బిహార్‌కు బ్రహ్మపుర వర్సిటీ వాలీబాల్ జట్టు

షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ముజఫర్‌పూర్ (బిహార్)లోని బీఆర్ఏ విశ్వవిద్యాలయంలో ఈ నెల 10 నుంచి 14 వరకు జరగనున్న తూర్పుజోన్ అంతర్ వర్సిటీ పురుషుల వాలీబాల్ పోటీలకు బ్రహ్మపుర విశ్వవిద్యాలయం జట్టు సిద్ధమైంది. ఈ మేరకు పోటీల్లో పాల్గొనేందుకు జట్టు క్రీడాకారులు ఆదివారం రాత్రి రైలులో బిహార్‌కు బయలుదేరన్నారు. కేఎస్‌యూబీ కళాశాల (భంజనగర్), ఎంకే డిగ్రీ కళాశాల (గురండి), జేజే మహావిద్యాలయ (రైకియ), పీపుల్స్ కళాశాల (బుగుడ), ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల (ఫుల్బాణి), ఖెముండి కళాశాల (దిగపొహండి)లకు చెందిన పదిమంది క్రీడాకారులు జట్టులో స్థానం పొందారు. వర్సిటీ జట్టుతో కోచ్, మేనేజర్లుగా రశ్మిరంజన్ త్రిపాఠి, జన్‌సెన్ డిగాల్‌లు పయనమయ్యారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గీతాంజలి దాస్, రిజిస్ట్రార్ సచ్చిదానంద నాయక్, క్రీడల మండలి కార్యదర్శి ధ్రువచరణ్ పండా తదితరులు జట్టు క్రీడాకారులకు పోటీల్లో బాగా ఆడాలని శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థుల నృత్య ప్రదర్శన

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి పట్టణంలో మల్యవంత మహోత్సవం జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మల్కాన్‌గిరి పట్టణంలో ఆదివారం రోడ్ షో జరిగింది. కలెక్టర్ కార్యాలయం సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రదర్శించారు. అలారే ఆల్ ఒడిశా మార్షల్ ఆర్ట్స్ తరఫున చిన్నారుల మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శించారు. రెడ్ క్రాస్ తరఫున ప్రమాదంలో ఉన్న సమయంలో ఎలా కాపాడాలనే విషయంపై అవగాహన కల్పించారు. పోలీసు కుక్కల విన్యాసాలు తదితర ప్రదర్శనలు జరిగాయి. పాలనాధికారి సోమేష్ కుమార్ ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్, సబ్ కలెక్టర్ ఆస్మి ఎ.ఎల్., జిల్లా సమాచార, ప్రజా సంబంధ అధికారి ప్రమీలా మాఝి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా వార్షిక క్రీడలు

జ్ఞాపికతో విజేత గంగా హౌస్ సభ్యులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పీఎం కేంద్రీయ విద్యాలయం 1(ఐఐటీ)లో శనివారం 55వ వార్షిక క్రీడలు ఉల్లాసంగా జరిగాయి. మార్చ్ ఫాస్ట్, అతిథులకు విద్యార్థులు స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా జింఖానా అధ్యక్షుడు ఆచార్య జితేంద్ర మహాకుండు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.బౌమిక్ ఉన్నారు. గంగా హౌస్ ఛాంపియన్‌గా నిలిచింది.

సీఎంను కలిసిన తెలంగాణ మంత్రి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తెలంగాణ పాడి శాఖ మంత్రి నకిరి శ్రీహరి శనివారం రాత్రి భువనేశ్వర్ వచ్చారు. లోక్‌సేవా భవన్‌లో సీఎం మోహన్‌చరణ్ మాఝిని కలిశారు. కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. → సీఎం మోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న తెలంగాణ మంత్రి శ్రీహరి

కొసగుముడాలో మండేయి ఉత్సవం ప్రారంభం

ప్రారంభ జ్యోతిని ఊరేగిస్తున్న ఎమ్మెల్యేలు, బీడీవోలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా కొసగుముడా సమితి స్థాయిలో లోక మహోత్సవం 'మండేయి-2025' ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బీడీవో ఆశీష్ త్రిపాఠి అధ్యక్షతన జరిగిన ఉత్సవంలో ముఖ్య అతిథులుగా నవరంగపూర్, డాబుగావ్ ఎమ్మెల్యేలు గౌరీశంకర్‌మాఝి, మనోహర్ రంధారి హాజరై స్థానిక చౌరియా దేవి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రారంభ జ్యోతి వెలిగించారు.

జయీ రాజగురుకు నివాళి

రాజగురు విగ్రహం వద్ద సభాపతి సురమాపాఢి, ఉపముఖ్యమంత్రి ప్రభాతి, ఇతర మంత్రులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బ్రిటిష్ పాలకులను గెరిల్లా తరహా దాడులతో ముప్పు తిప్పలు పెట్టిన విప్లవ వీరుడు జయీ రాజగురు సేవలు చిరస్మరణీయమని శాసనసభాపతి సురమాపాఢి చెప్పారు. ఆదివారం రాజగురు వర్ధంతి పురస్కరించుకుని భువనేశ్వర్‌లోని అమరవీరుల పార్కులో శ్రద్ధాంజలి కార్యక్రమం జరిగింది. ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిఢ, మంత్రులు గణేశ్ రామ్‌సింగ్ ఖుంటియా(అటవీ, పర్యావరణం), సూర్యవంశీ సూరజ్, ఉప సభాపతి భవానీశంకర్ భొయ్ తదితర ప్రముఖులు పాల్గొని రాజగురు విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

'శక్తిమయి' పుస్తకావిష్కరణ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని రాజీవ్ భవన్‌లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో గవర్నరు కంభంపాటి హరిబాబు రాష్ట్ర సాంస్కృతికశాఖ ముద్రించిన 'శక్తిమయి' పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారీశక్తికి అద్దం పట్టే శక్తిమయి పుస్తకం విలువైనది, ప్రతిఒక్కరు చదవాలని కోరారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

భూమిపూజల్లో పాల్గొన్న బ్రహ్మపుర ఎమ్మెల్యే అనీల్‌కుమార్. చిత్రంలో స్థానిక ప్రముఖులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) పరిధిలో 10వ వార్డులోని పాత బ్రహ్మపురలో ఆదివారం బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనీల్‌కుమార్ పర్యటించారు. ఆయన వీధి కూడలిలోని చంద్ర కల్యేశ్వర స్వామి మందిరంలో కల్యాణ మండపం, కాళువా మందిరం నిర్మాణాలకు భూమిపూజ చేశారు. పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

● స్థానిక మీనాక్షినగర్‌లోని మహామాయి మహిళా మహావిద్యాలయను ఆదివారం బ్రహ్మపుర ఎమ్మెల్యే అనీల్‌కుమార్ సందర్శించారు. ఆయన మహా విద్యాలయ ప్రధానాచార్యురాలు, రోడ్లు, భవనాల శాఖ ఇంజినీరు తదితరులతో వివిధ అభివృద్ధి పనులపై చర్చించి, సమస్యల్ని పరిశీలించారు.

దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

జయపురం, న్యూస్‌టుడే: చాలా ఏళ్లుగా జయపురం మహిళా కళాశాల విద్యార్థుల ఎదురుచూపులకు సమయం ముగిసింది. మూతపడిన వసతిగృహం ఇకపై తెరుచుకోనుంది. హాస్టల్‌లో వసతి కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటివరకు 54 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా 46 సీట్లు ఖాళీగా ఉన్నాయని దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ డా.వివేకానంద్ సునా తెలిపారు. రూ.15 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించి పూర్తి సదుపాయాలు కల్పించడంతో తిరిగి దీనిని తెరిచినట్లు సునా తెలిపారు.

సీనియర్ సిటిజన్ల సంఘ కార్యవర్గ ఎన్నిక

కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ సీనియర్ సిటిజన్ల సంఘ కొత్త కార్యవర్గం ఎన్నిక ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా ప్రతాప్ చంద్ర పాత్ర్, ఉపాధ్యక్షుడిగా గజానందా పాణిగ్రహి, వర్కింగ్ అధ్యక్షుడిగా ఈశ్వర్‌చంద్ర గురు, కార్యదర్శిగా భువనేశ్వర్ పట్నాయక్, సహాయక కార్యదర్శులుగా నీలమణి నాయక్, నీలకంఠ డోలియా, కార్యాలయం కార్యదర్శిగా ప్రకాష్ చంద్ర, సాధారణ కార్యదర్శులుగా ప్రదీప్ పాత్ర్, ఫకీర్ చరణ్ రౌత్, ఇతర సభ్యులుగా పలువురు ఎంపికయ్యారు.

జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జయపురం, న్యూస్‌టుడే: పరబ్ ఉత్సవాల్లో భాగంగా జయపురం విక్రమ్‌దేవ్ ఆర్ట్స్ స్కూల్‌లో ఆదివారం జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలు జరిగాయి. సమితి విద్యాశాఖాధికారి చందన్‌కుమార్ నాయక్, ప్రజా సంక్షేమాధికారి జశోద గద్బ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు.

సందడిగా పర్యాటక ప్రాంతాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: చలికాలంలో పర్యాటక ప్రాంతాలు సందడిగా కనిపిస్తాయి. డిసెంబర్ నెల ప్రారంభం నుంచి జనవరి నెల చివరి వరకు దిఘా, మందర్మణి, శంకర్పూర్, చిల్కిఘడ్, ఇతర ప్రాంతాలు కిటకిటలాడుతూ ఉంటాయి. సందడితో పాటు వ్యాపారాలు బాగా జరుగుతాయని స్థానికులు తెలిపారు.

ప్రత్యేక రైలు సేవలు

ఖరగ్‌పూర్: ఇండిగో విమాన సేవలు రద్దవడంతో ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ ప్రత్యేక రైలు సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఆగ్నేయ రైల్వే ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ప్రకటించింది. ఆదివారం మూడు ఈఎంయూ రైలు సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది.

వసతిగృహం నిర్మాణానికి శంకుస్థాపన

రాయగడ గ్రామీణం, మునిగుడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా మునిగుడలో విద్యార్థుల కోసం 200 పడకల వసతిగృహం ఏర్పాటు చేస్తున్నట్లు బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికాక తెలిపారు. ఈ మేరకు ఆయన చేతుల మీదుగా ఆదివారం కళాశాల ఆవరణలో శంకుస్థాపన చేశారు. ఎంపీ ప్రతినిధి రజని పడాల్, ప్రిన్సిపల్ హృదికేష్ జల్లి, కాంగ్రెస్ సమితి కార్యదర్శి మాసన బెహెర హాజరయ్యారు.

హాజరైన ఎమ్మెల్యే తదితరులు

పరబ్‌తో జన జాగృతి

స్టాల్‌ను చూస్తున్న అతిథులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా యంత్రాంగం, జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నడుస్తున్న పరబ్ వేడుకలు జన జాగృతి సృష్టిస్తున్నాయి. సమితి పరబ్ వేడుకల భాగంగా క్రీడా సాంస్కృతిక పోటీలతోపాటు వివిధ విభాగాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఆయా విభాగాల ద్వారా అమలు జరిగే అభివృద్ధి పనులపై స్టాల్స్ ద్వారా ప్రదర్శనను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆ రోజులు.. మళ్లీ రావు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని మహారాజ బాలుర ఉన్నత పాఠశాలలో 1986 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం గండాహతి జలపాతం ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకేచోట సమావేశం కావడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జలపాతం వద్ద సందడి చేశారు.

జలపాతం వద్ద పూర్వ విద్యార్థుల సందడి

ఉత్సాహంగా ముగిసిన క్రీడాపోటీలు

ఛాంపియన్‌కు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఐఐసీ తదితరులు

జయపురం, న్యూస్‌టుడే: క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయి. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలని ఐఐసీ ఉల్లాస్ చంద్రరౌత్ అన్నారు. జయపురం పట్టణం శారదా బిహార్ సరస్వతి శిశుమందిర్ 36వ వార్షిక క్రీడా ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సెఠి, శిక్షకుడు దిలీప్‌కుమార్ గంతాయత్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించకపోతే ఆందోళన

వినతి పత్రంతో కమిటీ సభ్యులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపూర్ సమితిలో గోరక్‌పూర్ పంచాయతీలోని మౌలిక వసతుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలు తీర్చకుంటే ఆందోళన తప్పదని పంచాయతీ అభివృద్ధి కమిటీ హెచ్చరించింది. తాగునీరు, విద్యుత్తు లేక ఇబ్బందులు పడుతున్నామని రహదారి మరమ్మతులకు గురవడంతో అంబులెన్స్ కూడా రావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పాలనాధికారి పేరిట తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. సమస్యలు తీర్చకుంటే ఆందోళన చేస్తామన్నారు.

విజయవంతంగా బీఎస్ఎఫ్ రన్

విజేతలకు చెక్కులు అందజేస్తున్న డీఐజీ సత్యవాన్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో బీఎస్ఎఫ్ 61వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం బీఎస్ఎఫ్ రన్ జరిగింది. డీఐజీ సత్యవాన్ కంచి జెండాను ఎగురవేసి రన్‌ను ప్రారంభించారు. బాలబాలికలు 5, 10 కిలోమీటర్ల విభాగంలో దాదాపు 1500 మందికి పైగా ఈ మారథాన్‌లో పాల్గొన్నారు. డీసీ అమన్ భగత్ నేతృత్వంలో జరిగిన ఈ రన్‌లో 10 కిలోమీటర్ల విభాగంలో రూ.15,000, రూ.10,000, రూ.5,000, 5 కిలోమీటర్ల విభాగంలో రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు చెక్కులు అందజేశారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. 10కి.మీ రన్‌లో బాలురు అశోక్ దండసేనా, రష్మిరంజన్, పవన్‌కుమార్ యాదవ్ వరుస స్థానంలో, బాలికలు సుస్మితా టిగ్గా, దయామని హరిజన్, అంజలి తాడింగి విజేతలుగా నిలిచారు. 5 కి.మీ రన్‌లో బాలురు దయానిధి ముండా, దలమణి బిగూన, రవి ముదులి వరుస స్థానాల్లో, బాలికల్లో అంజనా, చాందిని నాయక్, పూర్ణిమాలిక్ విజేతలుగా నిలిచారు.

EENADU Classifieds JOBS

ఒమెగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:20k. ✆ 89776 39662,89776 39663.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఇది ఎక్కడి అభివృద్ధి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవిత్ర

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో ఖనిజ సంపదలు మెండుగా ఉన్నా అభివృద్ధి కానరావడం లేదని అసెంబ్లీలో ఎమ్మెల్యే పవిత్ర శాంత మాట్లాడారు. వెనకబడిన జిల్లాను రాష్ట్ర ప్రభుత్వం మరింత వనక్కు నెడుతోందని ప్రశ్నించారు. కొరాపుట్ జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోకుంటే ఆందోళన తప్పదని అన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక

ఎంపికైన విద్యార్థినులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: జగత్సింగ్‌పూర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ టోర్నమెంట్‌కు నవరంగపూర్ జిల్లాలో ఎస్ఎస్‌డీ బాలిక ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. క్రీడాకారులు అంజనాపూజారి, గంగాబాలి మెహరా, జశోదమాఝి, గాయత్రి బొత్ర, వందిత బొత్ర, ఊర్మిళా బొత్రలను ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయిని సంజుక్తాదాస్ తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థిని సునామణిశాంతా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు దాస్ తెలిపారు.

ఢీకొన్న ద్విచక్ర వాహనాలు: చిరు వ్యాపారి దుర్మరణం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర సదర్ ఠాణా పరిధిలోని బలిపడ వద్ద శనివారం ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. సన్నాఖెముండి సమితిలోని ఖొల్లింగి బాసుదేవపూర్ గ్రామానికి చెందిన దేబేంద్ర సాహు (45) అనే చిరు వ్యాపారి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆదివారం మృతదేహానికి పరీక్ష జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెరువులో మునిగి బాలిక మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి ఠాణా పరిధిలోని చుడంగపూర్ గ్రామంలో శ్రీ నీలకంఠేశ్వరస్వామి మందిరం ఆవరణలోని చెరువులో ఆదివారం ఆర్.సలోని పాత్ర్ (8) అనే బాలిక స్నానానికి దిగి ఊపిరాడక మృతి చెందింది. స్నేహితురాలు ఎన్.రాజేశ్వరి పాత్ర్ (8) కాపాడేందుకు యత్నించి ఆమె కూడా చెరువులో పడిపోయింది. గ్రామస్థులు ఇద్దరినీ దిగపొహండిలోని ఆరోగ్య కేంద్రానికి తరలించగా.. సలోని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాజేశ్వరికి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలో అలపూర్ సమీపంలో సుళియా కొండ దిగువన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న ఛత్రపురం ఎస్డీపీవో, కళ్లికోట ఠాణా అధికారులు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని శాస్త్రీయ బృందంతో దర్యాప్తు చేపట్టారు. సుమారు మూడు రోజుల కిందట వ్యక్తిని హతమార్చి, ఆ తర్వాత పెట్రోలు పోసి దహనం చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృత్యువాత

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం పంజియాగూడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. మృతుడు కుంద్రా సమితి ఘసర్గా పంచాయతీ కర్ణాగూడ గ్రామానికి చెందిన బలికిచాయి(42)గా గుర్తించారు. శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని చిదానంద వీధికి చెందిన వృద్ధురాలు చెరువులో మునిగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిదానంద వీధికి చెందిన ఆర్.పుణ్యవతి(67) శనివారం సాయంత్రం తలసాహి వీధిలో ఉన్న చెరువులో మునిగి పోయారు. స్థానికులు ఆమెను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అత్తాకోడళ్ల గొడవలే దీనికి కారణంగా తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా కేసులో ఒకరి అరెస్టు

జయపురం, న్యూస్‌టుడే: చెన్నైకి గంజాయి రవాణా చేస్తుండగా జయపురం ఆబ్కారీ అధికారులు ఒకరిని అరెస్టు చేశారు. ఓఐసీ సంజీబ్‌కుమార్ బెహరా తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో బంకబీజ చౌక్ ప్రాంతంలో శనివారం ఆబ్కారీ శాటిలైట్ యూనిట్ తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తిని తనిఖీ చేయగా ఆయన బ్యాగులో 16 కిలోల గంజాయిని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అసోంలోని నగావ్ జిల్లా చిలాంగని ప్రాంతానికి చెందిన ఆసిక్యూల్ ఇస్లామ్(21)గా గుర్తించారు.

కాయకష్టం బూడిద పాలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి చికాంబ పంచాయతీ గాజియాగూడ గ్రామంలో ఐదుగురు రైతులకు చెందిన 10 ఎకరాల పంట బూడిద పాలైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బిజయ్ సౌంటా, నరసింహ సౌంటా, కేశవ్ నచిక, శభ సౌంటా, రాజేంద్ర ఖొరాలు తమ 10 ఎకరాలు పండించిన వరి, రాగులు కోత కోసి తమ పొలాల సమీపంలో కుప్పలుగా వేశారు. ఆదివారం తెల్లవారు జామున వరి చేనుల్లో మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్థులు ఆర్పేందుకు ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. రెండు రోజుల్లో ఆర్ఐలు గ్రామానికి చేరుకొని నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తామని అదనపు తహసీల్దార్ జగుపూజారి, వ్యవసాయ శాఖాధికారి జ్ఞానరంజన్ సాహు అన్నారు.

బాలికపై అత్యాచార యత్నం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ సమితి గారబంద ఠాణా పరిధిలోని గండాహతి జలపాతం వద్ద 12 ఏళ్ల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్యాచారయత్నం ఘటన కలకలం రేపింది. ఆదివారం గండాహతి జలపాతం వద్ద బాలిక స్నానం చేస్తుండగా ఇద్దరు యువకులు మద్యం తాగి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారని, వెంటనే బాలిక కేకలు వేయగా కుటుంబ సభ్యులు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. యువకులు శ్రీకాకుళం జిల్లా కంచిలి ప్రాంతం గోకర్ణపురం గ్రామానికి చెందిన డి.నరేష్, ఎస్.హరీష్‌లుగా గుర్తించినట్లు తెలిపారు. యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై ప్రతాప్ బెహరా తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలి

మాట్లాడుతున్న పాలనాధికారి మనోజ్ సత్యవాన్

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ పాలనాధికారి మనోజ్ సత్యవాన్ మహాజన్, పురపాలిక ఛైర్మన్ లలాట రంజన్ సేఠీ పలు విభాగాల అధికారులతో కలిసి జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక చందన సాగరం వద్ద పర్యాటకులను ఆకర్షించే విధంగా నిర్మాణాలు చేపట్టాలని, స్థానిక రాజీవ్ గాంధీ శిశు ఉద్యానవనం అభివృద్ధి పనులు సమీక్షించారు. పర్యాటకుల తాకిడి జిల్లాలో పెరుగుతుండటంతో జిల్లా కేంద్రాన్ని తీర్చిదిద్దాలని అన్నారు.

ఉత్తమ కళాకారులకు సన్మానం

జ్ఞాపికలతో కళాకారులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా చందాహండి సమితి గంబారిగూడలో ఉన్న సరస్వతి కళాకుంజర్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. పనాబెడ ప్రాంతానికి చెందిన ఐదుగురు కళాకారులకు సరస్వతి అవార్డుతో సన్మానించారు. గాయకుడు దశరథ్‌సాహు, ఘేను సాహు, ప్రదీప్‌కుమార్‌పాత్ర్, నాటక కళాకారుడు ప్రకాష్ ప్రధాన్, గేయ రచయిత కాంబిని బెహ్రా లకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

రహదారిపై జూదం ఆడుతున్న కాంగ్రెస్ నేత

నవరంగపూర్, న్యూస్‌టుడే: చందహండిలో రహదారిపై ఆదివారం జూదం ఆడుతూ కాంగ్రెస్ నేత క్షేమరాజ్ బాగ్ హల్‌చల్ చేశారు. ఏఎస్సై బేణుపాణిమాఝి అక్కడికి చేరుకోగా, అసెంబ్లీలో జూదంపై సవరించిన చట్టాలు తెలియవా అని బాగ్ ప్రశ్నించారు. జూదగాళ్లు ఎక్కడ ఆడుకున్నా అరెస్టు చేయలేరనడంతో ఏఎస్సై వెనుదిరిగారు.

(c) eenadu

ప్రకృతిని కాపాడుకుంటూ జీవిద్దాం

విద్యార్థుల శాస్త్రీయ నృత్యం

పార్వతీపురం పట్టణం, పురపాలక, న్యూస్‌టుడే: ప్రకృతిని కాపాడుకుంటూ జీవించడమే హైందవ ధర్మం ప్రధాన లక్ష్యమని ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హైందవ శంఖారావం కార్యక్రమం జరిగింది. ముందుగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాలలు, మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ.. భారతదేశానికి ఆత్మ హిందూ ధర్మమని పేర్కొన్నారు. రామరాజ్యం కావాలనుకునేవారు ప్రకృతిని రక్షిస్తూ.. ముందుకు సాగాలన్నారు. ముఖ్య అతిథిగా డి.రామ్మోహనరావు, నిర్వాహక సమితి అధ్యక్షుడు బీఎస్‌బీ రావు, ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు, భాజపా జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వై.వివేక్, కార్యదర్శి కె.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి

కేఎస్.పురంలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టరు ప్రభాకరరెడ్డి

సీతానగరం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు, రైతుల ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టరు ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. సీతానగరం మండలంలోని కోటసీతారాంపురంలో ఆదివారం కల్లాల వద్ద ఉన్న రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు, గోనె సంచులు, రవాణా సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఎస్‌కేను సందర్శించి తేమ శాతం గుర్తింపుపై సిబ్బందిని ప్రశ్నించారు. వర్షాభావ ప్రాంతం కావడంతో వెంగళరాయసాగర్ అదనపు జలాలు అందించాలని రైతులు కోరారు. రబీలో ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

నిస్సహాయులకు సాయం చేయండి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నిస్సహాయులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రపడ జిల్లా కన్నార్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త ప్రభుత్వానికి వినతి చేశారు. 2019 నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న జెనా ఇటీవల కాలంలో 1425 మంది ఇబ్బందులను అధ్యయనం చేశారు. రూ. 50 కోట్లు సాయం చేయాలని కోరారు.

కుక్కలు.. పిక్కలు పీకేస్తున్నాయ్..

పార్వతీపురంలో రోజుకు 20 కేసులు నమోదు

- సరిగ్గా రెండు నెలల కిందట పార్వతీపురం పట్టణం కొత్తవలస మణికంఠ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలుడు లోహిత్ కుక్కకాటుకు గురై రేబిస్ టీకా, చికిత్స తీసుకున్నాడు. 13 రోజుల తరువాత తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు.
- ఇటీవల జియ్యమ్మవలస మండలానికి చెందిన ఏడాదిన్నర బాలికపై కుక్క దాడి చేసి గాయపరిచింది.
- పార్వతీపురం పట్టణ పరిసర గ్రామాల్లో ఈనెల 2న 10 మంది కుక్కల బారినపడి గాయాలపాలయ్యారు. బాధితుల్లో పట్టణానికి చెందిన వారే 8 మంది ఉన్నారు.

పార్వతీపురం ప్రధాన రహదారిపై శునకాల సమూహం

జిల్లాలో గ్రామ సింహాలు ప్రజల్ని భయాందోళనకు గురి చేస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు ఒంటరిగా వీధిలో కనిపిస్తే దాడి చేసి కండలు పీకేస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో రోజుకు 15 నుంచి 20 కేసులు నమోదవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గుంపులుగా చేరి వెంబడిస్తున్నాయి. రహదారులపై వెళ్లే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి నియంత్రణ ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అధికారులను జిల్లావాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలక

నియంత్రణకు చర్యలు తీసుకుంటాం

పార్వతీపురం పట్టణంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని గుర్తించాం. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని వెంటనే నివారణ చర్యలు తీసుకుంటాం. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయిస్తాం. – కె.కిశోర్‌కుమార్, కమిషనర్, పార్వతీపురం

జాగ్రత్తలు పాటించాలి

కుక్కకాటుతో మనిషికి ప్రాణాపాయం రాకుండా ఆసుపత్రికి వచ్చిన వారందరికీ యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నాం. కుక్క కరిచిన మొదటి రోజు ఒక డోసు వేసుకున్న తరువాత 3, 7, 28వ రోజున తప్పకుండా మిగిలిన డోసులు తీసుకోవాలి. గాయపడిన వారికి నొప్పి తగ్గడానికి ఏఆర్ఎస్ సీరమ్ ఇంజక్షన్ ఇస్తున్నాం. బాధితుడి పరిస్థితి వారం రోజుల్లో తెలిసిపోతుంది. జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం ఉండదు. – డా.నాగశివజ్యోతి, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు

జిల్లాలో ఈ ఏడాది కుక్కకాటు బాధితులు	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబరు	అక్టోబరు	నవంబరు	డిసెంబరు (3 వరకు)
	185	202	185	155	167	203	143	158	188	204	228	26

శుభకార్యానికి పిలిచేందుకు వెళ్లి.. మృత్యుఒడికి..

కుమార్ (పాతచిత్రం)

పార్వతీపురం పట్టణం, సీతానగరం, మక్కువ, న్యూస్‌టుడే: మూడురోజుల క్రితం సీతానగరం మండలం గుచ్చిమి సమీపంలో ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మక్కువ మండలానికి చెందిన పిన్నింటి కుమార్(36)గా గుర్తించారు. ఇంటి యజమాని దుర్మరణం చెందిన విషయం రెండు రోజుల తర్వాత తెలియడంతో కుటుంబీకులు విలపిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో శుభకార్యం జరగాల్సిన ఇంట్లో కన్నీటి సుడులు నిండుకున్నాయి. మార్కొండపుట్టి గ్రామానికి చెందిన కుమార్ వ్యవసాయ కూలి. భార్య విజయలక్ష్మి, కుమార్తె రేష్మా, కుమారుడు రమేష్. పాప ఇటీవల పుష్పవతి కావడంతో ఈనెల 14న శుభ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్డులు ముద్రించారు. సీతానగరం మండలం రేపటివలసలో బంధువులకు చెప్పేందుకు శుక్రవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సాయంత్రానికి ఇంటికి వచ్చేస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబీకులు ఆరా తీశారు. చేతిలో చరవాణి కూడా లేకపోవడంతో వస్తాడులే అని ఎదురుచూస్తున్నారు. రెండు రోజులైనా రాకపోవడంతో, రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి అని పేపర్లో రావడం చూసి అనుమానం వచ్చి వాకాబు చేశారు. శనివారం రాత్రికి విషయం తెలుసుకున్నారు. ఆదివారం తెల్లవారి జిల్లా ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. శరీరంపై ఉన్న ఆనవాళ్లతో కుమార్ మృతదేహంగా గుర్తించారు. ఇంటి దీపం ఆరిపోయింది.. ఇక తమకు దిక్కెవరని భార్య కన్నీరుమున్నీరు అవుతున్నారు. బాగా చదువుకోవాలని వెన్నుతట్టే తండ్రి ఇక రాడన్న నిజాన్ని పిల్లలు జీర్ణించుకోలేకపోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యత లేదు.. భద్రత పట్టదు..!

బడి బస్సుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న లోపాలు

న్యూస్‌టుడే, బలగ (శ్రీకాకుళం)

నిబంధనల ప్రకారం ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి బడి బస్సులన్నీ ఎఫ్‌సీ(సామర్థ్య పరీక్షలు) చేయించుకొని రోడ్డెక్కాలి. గతంలో రవాణా శాఖాధికారులే సోదాలు చేసేవారు. కొంతకాలం కిందట ఆ బాధ్యతను ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించడంతో పరీక్షలు తూతూమంత్రంగా సాగుతున్నాయి. ఇదే అదనుగా పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. జిల్లాలో రవాణాశాఖాధికారులు చేపడుతున్న తనిఖీల్లో అనేక లోపాలు వెలుగుచూస్తున్నాయి.

బడి బస్సులో తనిఖీ చేస్తున్న రవాణాశాఖ సిబ్బంది

సరి చేసుకోకుంటే సీజ్ చేస్తాం.. జిల్లాలో బడి బస్సులను తనిఖీ చేస్తున్నాం. గుర్తించిన లోపాలను సరి చేసుకోవాలని కొందరికి నోటీసులు జారీచేశాం. పది రోజులు గడువు ఇచ్చాం. పునఃతనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు బయట పడితే వాహనాలను సీజ్ చేస్తాం. – విజయసారథి, జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్

ఏం గుర్తించారంటే..

- శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో నాలుగు బృందాలుగా ఏర్పడి గత నెల 28 నుంచి కళాశాల, పాఠశాల బస్సుల్లో తనిఖీలు చేస్తున్నారు.
- చాలా వాటిల్లో అగ్నిమాపక పరికరాలు లేవు. కొన్ని పని చేయట్లేదు. మరికొన్ని కాలం చెల్లినవిగా గుర్తించారు.
- స్పీడ్ గవర్నర్స్‌లోనూ లోపాలు బయటపడ్డాయి. అత్యవసర ద్వారాలు, ప్రథమచికిత్స పెట్టెల్లో మందులు లేనట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు.

జిల్లాలోని వివరాలిలా.. ● బడి బస్సులు: 582 ● తనిఖీలు చేసినవి: 350 ● నోటీసులు జారీచేసినవి: 208

చూచిరాతలకు దగ్గరగా.. దూరవిద్య!

చూసీచూడనట్లు..

ఉమ్మడి జిల్లాలో పది కేసులు

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం, కొత్తవలస

ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య డిగ్రీ, పీజీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ యథేచ్ఛగా జరుగుతున్నాయి. పలుచోట్ల విద్యార్థులు ఒక్కొక్కరుగా పట్టుబడుతుండడం, మాల్‌ప్రాక్టీస్ కేసులు ఎక్కువగా నమోదవుతుండడం ఇందుకు అద్దం పడుతోంది. ఉమ్మడి జిల్లాలో బృందాల తనిఖీలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఎస్.కోట, కొత్తవలస, గజపతినగరంలో మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేశారు. గత నెల పీజీ పరీక్షల్లో ఎస్.కోటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎమ్మెస్సీ రసాయనశాస్త్రం మూడో సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు డిబార్ అయ్యారు. గత నెల 26న కొత్తవలసలోని ప్రైవేటు కళాశాలలో చూచిరాతలు రాస్తూ పలువురు పట్టుబడ్డారు. వేరొక పరీక్ష రాస్తూ ఒకరు పట్టుబడ్డారు. గజపతినగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైంది. ఇలా పది కేసులు నమోదయ్యాయి.

పరీక్షల కోసం కళాశాలలు పెద్దఎత్తున దందాలకు పాల్పడుతున్నట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. పరీక్ష సమయం తర్వాత ప్రశ్నలకు జవాబులు రాయించడం, ఒకరి పరీక్ష ఇంకొకరు రాయడం జరుగుతోంది. పరీక్ష కేంద్రాలుగా ఉన్న కళాశాలల్లో విద్యాలయం తరఫున ఒక పరిశీలకుడిని నియమిస్తున్నారు. యాజమాన్యంతో కొందరు కుమ్మక్కైపోవడంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిని ఉన్నతాధికారులు గుర్తించారు. 100 కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే వారికి పరీక్ష కేంద్రం ఇవ్వాలన్న నిబంధన ప్రైవేటు వారికి అనుకూలంగా మారుతోంది.

ఏడు కేంద్రాల్లో..

ఉమ్మడి జిల్లాలో పార్వతీపురం, సీతానగరం, ఎస్.కోట, విజయనగరం, కొత్తవలస, గజపతినగరంలో రెండు కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత నెల 25 నుంచి నెల రోజులపాటు ఇవి జరగనున్నాయి. కేంద్రాల్లో ప్రైవేటు కళాశాలలే. పరీక్షల నిర్వహణ వీటికి అప్పగించడంతో కొన్నిచోట్ల చూచిరాతలు జరుగుతున్నాయి. నిర్వహణకు ప్రభుత్వ కళాశాలలు ముందుకు రాకపోవడంతో ప్రత్యామ్నాయం లేక, ప్రైవేటు కళాశాలలే దిక్కవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఏయూ పరిధిలో 43 వేల మంది యూజీ, 11 వేల మంది పీజీ పరీక్షలు రాస్తున్నారు.

ముందుకు రావాలి.. ప్రభుత్వ కళాశాలలు ముందుకు రాకపోవడంతో ప్రైవేటుకి వ్వాల్సి వస్తోంది. ప్రత్యేక బృందాలతో తనిఖీ చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటివరకు పది మందిపై కేసులు నమోదు చేశాం. తదుపరి పరీక్షలను ప్రభుత్వ కళాశాలలకు మార్చాలని యోచిస్తున్నాం. – అప్పలనాయుడు, దూరవిద్య సంచాలకుడు, ఏయూ

ప్రతి నిధులు దోచేస్తున్నారు..!

- పంచాయతీ సొమ్ము దుర్వినియోగం చేస్తున్న సర్పంచులు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

పల్లెల అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను సొంత అవసరాలకు వాడుకుంటున్నారు జిల్లాలోని కొందరు సర్పంచులు. తప్పుడు బిల్లులు పెట్టి.. పనులు చేయకపోయినా చేసినట్లుగా చూపి అక్రమార్కులు రూ.లక్షల్లో సొమ్ము దోచేస్తున్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో కీలక నేతలు వారిస్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారు. 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా..' అన్నచందాన సర్పంచులు సైతం ధనార్జనే లక్ష్యంగా చెలరేగిపోతున్నారు.

- గార మండలం వాడాడ పంచాయతీ పరిధిలోని చిల్లాపు గుంట చెరువుకు సంబంధించి వేలం పాట నిర్వహించారు. ఆ మేరకు రూ.1.30 లక్షల చెక్కు సర్పంచికి ఇస్తే వాటిని పంచాయతీకి జమ చేయకుండా సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు అధికారులు గుర్తించారు.
- మెళియాపుట్టి మండలం జాడుపల్లి పంచాయతీలో గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన కొన్ని పనులకు సంబంధించి రూ.4.47 లక్షల బిల్లులు చూపించలేదు. అందుకు ఈ నెల 1న సర్పంచి చెక్ పవర్‌ను రద్దు చేశారు.

అయినా మారట్లేదు..

నిధుల దుర్వినియోగంలో కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు అక్రమార్కులతో చేతులు కలుపుతున్నారు. అదే కారణంతో ఇటీవల టెక్కలి, నారాయణవలస పంచాయతీ కార్యదర్శులను గతంలో అధికారులు సస్పెండ్ చేశారు. మెళియాపుట్టి మండలం జాడుపల్లి, ఆమదాలవలస నెల్లిపర్తి కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు. పంచాయతీల్లో విజిలెన్స్ విచారణలు జరుగుతున్నా.. చెక్ పవర్‌లు రద్దు చేస్తున్నా ఇంకా చాలా మంది తీరులో మార్పు రావట్లేదు.

జిల్లాలో పంచాయతీలు: 912

అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందినవి: 23చోట్ల

చెక్ పవర్ రద్దు చేసిన సర్పంచులు: 13మంది

మిగిలిన 10 మందిపై త్వరలో చర్యలు తీసుకోనున్నారు.

అక్రమాల పరంపర..

- ఎన్నికలు జరగకపోవడంతో చాలా పంచాయతీల్లో వైకాపా సర్పంచులు కొనసాగుతూ.. అక్రమాల పరంపర కొనసాగిస్తున్నారు.
- 15వ ఆర్థిక సంఘం నిధులను ఎక్కువగా దుర్వినియోగం చేశారు.
- వీధి దీపాలు, బోర్ల మరమ్మతుల, రోడ్ల నిర్మాణం పేరుతో నకిలీ బిల్లులు పెట్టి నిధులు నిబంధలకు విరుద్ధంగా సర్పంచుల సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నారు.

- 'పంచాయతీల్లో నిబంధనలకు అనుగుణంగానే నిధుల చెల్లింపులు, ఖర్చులు చేపట్టాలి. వాటిని అతిక్రమించిన వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం' అని జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీసౌజన్య తెలిపారు.

ప్రైవేటు బడుల్లోనూ 100 రోజుల ప్రణాళిక

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు వందరోజుల ప్రణాళికను రూపొందించి అమలుకు శనివారం నుంచి శ్రీకారం చుట్టింది. దీన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రైవేటు బడుల్లో కూడా అమలుచేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదేశించారు.

★ జిల్లాలో 223 ఉన్నత పాఠశాలల్లో 36 ప్రైవేటు యాజమాన్యంలో నడుస్తున్నాయి. వీటిలో 1,740 మంది పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

★ ప్రైవేటు పాఠశాలల్లోనూ రోజువారీ అమలు తీరును విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించనున్నారు.

★ ప్రభుత్వం అకడమిక్ క్యాలెండరు ప్రకారం అన్ని పాఠశాలల్లో బోధన, అభ్యసన కార్యక్రమాలు కొనసాగాలని కలెక్టరు ఆదేశించారు.

ధాన్యం అదనంగా సేకరిస్తున్నారు

వ్యవసాయ అధికారిని ప్రశ్నిస్తున్న జడ్పీటీసీ బాబ్జి

సీతానగరం, న్యూస్‌టుడే: మిల్లులకు వెళ్లాక తేమ శాతం అధికంగా ఉందంటూ బస్తాకు అదనంగా 5 కిలోల ధాన్యం డిమాండు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ రమణమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జడ్పీటీసీ సభ్యుడు బాబ్జి, ఎంపీడీవో ప్రసాద్, పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

గుణుపురంలో మణిపూర్ బృందం

సబర అక్షరాలతో స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం సబ్ డివిజన్‌లో ఉన్న సబర పండితుడు మంగై ఆశ్రమ పాఠశాలలో మణిపూర్‌కు చెందిన సబర ప్రతినిధి బృందం పర్యటించింది. శనివారం వచ్చిన వీరికి విద్యార్థులు సబర అక్షరాలతో స్వాగతం పలికారు. లిపి లేని భాషకు అక్షర రూపం కల్పించిన సబర పండితుడు మంగై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో వసతులు, భాషాభివృద్ధికి చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.

'గంటేడ'కు తాపీ ధర్మారావు పురస్కారం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన కవి, కథకుడు గంటేడ గౌరునాయుడికి గుంటూరు బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషను 'తాపీ ధర్మారావునాయుడు' స్మారక పురస్కారాన్ని అందించింది. ఈ మేరకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఫౌండేషను అధ్యక్ష, కార్యదర్శులు బి.జమదగ్ని, బి.శ్యామ్‌ప్రసాద్, సాహిత్యకారులు శీరంశెట్టి కాంతారావు, భూసురపల్లి వెంకటేశ్వర్లు, రావి రంగారావు చేతుల మీదుగా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సభకు పుప్పాల శ్రీరామ్ అధ్యక్షత వహించారు.

నిధులు మంజూరుపై హర్షం

సీతానగరం: కొత్తవలస గ్రామంలో శిథిల రామ మందిరం స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి దేవాదాయశాఖ నుంచి రూ.40 లక్షలు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే విజయచంద్రకు సర్పంచి అనిత అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థుల సహకారంతో త్వరలో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

రైతు సేవా కేంద్రాల సందర్శన

సీతానగరం: జానుమల్లువలస, గాదెలవలస రైతు సేవా కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారిణి అన్నపూర్ణ ఆదివారం పరిశీలించారు. ఆయా కేంద్రాల పరిధిలోని రైతులతో మాట్లాడారు. ధాన్యం సేకరణ, తరలింపులో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఉన్నారు.

ప్రగతి పథంలో రయ్..రయ్..!

ఆదివారం ప్రత్యేకం

న్యూస్‌టుడే, పాతబస్టాండ్

కొత్త కారు కొనాలన్నా.. బైక్ తీసుకోవాలన్నా.. వ్యవసాయోపకరణాలు కావాలన్నా రక్కున ఆ ప్రాంతమే గుర్తొస్తుంది.. చిన్న బోల్ట్ నుంచి భారీ పొక్లెయిన్ వరకు అక్కడ సర్వం దొరుకుతాయి.. అన్ని రకాల వాహనాల విడిభాగాలూ అందుబాటులో ఉంటాయి. అవే కాక అనేక హార్డ్‌వేర్ దుకాణాలకు నెలవుగా మారింది.. ఎంతో మందికి ఉపాధి చూపుతోంది శ్రీకాకుళం నగరంలోని పెద్దపాడు రోడ్డు.

పెద్దపాడు రోడ్డులో విస్తరిస్తున్న ఆటోమొబైల్ రంగ సేవలు

పెద్దపాడు రహదారి

ఒకప్పుడు..

ఈ దారి ప్రారంభంలో సుమారు 20 ఏళ్ల కిందట రామలక్ష్మణ కూడలి వద్ద ఓ హోటల్ మాత్రమే ఉండేది. అక్కడి నుంచి ముందుకెళ్తే ఓ ద్విచక్ర వాహనాల షోరూం, ఒకట్రెండు ఆటోమొబైల్స్ దుకాణాలు, చుట్టూ పొలాలతో పరిసర గ్రామాలు కనిపించేవి. బైక్ విడిభాగాలు కావాలంటే పెద్దబరాటం వీధిలోని ఓ మార్వాడీ దుకాణం, దీపమహల్ దగ్గరలో ఓ చోట మాత్రమే లభించేవి.

ఇప్పుడు..

అన్ని ప్రముఖ కంపెనీల ద్విచక్రవాహనాలు, కార్ల షోరూంలు వచ్చేశాయి. మెకానిక్ దుకాణాలూ రెట్టింపయ్యాయి. వ్యవసాయోపకరణాలు, సిమెంట్, ఇనుము, పొక్లెయిన్లు, హార్డ్‌వేర్ షాపులు వెలిశాయి. ఒకప్పుడు వాహనాల విడిభాగాలు కావాలంటే విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి తెప్పించాల్సి వచ్చేది. మోటార్ల సర్వీసింగ్ వంటి కీలక పనులకూ చాలా సమయం పట్టేది. అవన్నీ ఇప్పుడు ఇక్కడే సులువుగా చేసేస్తున్నారు.

ఉపాధి 'బాట' చూపుతోంది..

- కేవలం ద్విచక్ర వాహనాలను మరమ్మతులు చేసుకుంటూ ఎంతో మంది జీవనోపాధి పొందుతున్నారు.
- వాచ్‌మెన్లు, భద్రతా సిబ్బంది, కళాసీలు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్లుగా సుమారు 10 వేల మంది వరకు పని చేస్తున్నారు.
- టీ, వెల్డింగ్, బ్యాటరీలు, ఇతర దుకాణాల ద్వారా పరోక్షంగా కొందరు కుటుంబాలను పోషించుకునేందుకు ఈ దారి దోహదపడుతోంది.

ఇవే కారణాలు..

జాతీయ రహదారికి సమీపంలో ఉండటం, విశాలమైన రహదారి కావడం, రవాణా పరంగా పెద్దగా ఇబ్బందుల్లేకపోవడం, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనువుగా ఉండటంతో ఈ ప్రాంతం ఆటోమొబైల్ రంగానికి అడ్డాగా మారింది.

ఆరోగ్య ఖాతా.. అమలులో నంబరు 1

రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిన జిల్లా ఆసుపత్రి

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి మరో ఘనత దక్కింది. దేశవ్యాప్తంగా అమలవుతున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా(అభా) నమోదు, స్కానింగ్ వైద్య సేవలు అందించడంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ ఆరోగ్య పథకంలో భాగంగా, డిజిటల్ ఆరోగ్య రికార్డు కోసం ఉపయోగపడే ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా అమలు చేస్తోంది. ఇటు రోగులు, అటు వైద్యులకు ఎంతో ఉపయుక్తమైన ఈ విధానం అమలు రాష్ట్రంలో అంతంత మాత్రంగానే ఉన్నా.. మన్యం అందిపుచ్చుకుంది.

అయిదో స్థానంలో పాలకొండ

పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో ప్రతి రోజూ ఓపీకి 800-1,000 మంది వరకు వస్తుంటారు. దాదాపుగా వచ్చిన ప్రతి ఒక్కరి ఆధార్‌ను చరవాణిలో నమోదు చేసి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాను తెరుస్తున్నారు. ప్రభుత్వం ఈ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించడంతో డీసీహెచ్ఎస్ జి.నాగభూషణరావు, అభా జిల్లా నోడల్ అధికారి ఆర్.శ్యామల, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు నాగశివజ్యోతి ప్రత్యేక దృష్టిసారించారు. నమోదుకు ప్రోత్సాహక నగదు కూడా ప్రభుత్వం ఇస్తోంది. మార్చి నుంచి జూన్ వరకు రాష్ట్రంలో ఎక్కువ ఖాతాలు చేసిన వారి జాబితాను విడుదల చేశారు. అందులో జిల్లా ఆసుపత్రికి ప్రథమ స్థానం, పాలకొండ ప్రాంతీయాసుపత్రికి అయిదో స్థానం దక్కింది.

చరవాణిలో ఆధార్ నంబరు నమోదు చేస్తున్న సిబ్బంది

ఉపయోగం ఏంటంటే..

ఆసుపత్రికి వచ్చే రోగి ఆధార్‌ను అనుసంధానం చేసి ప్రత్యేక ఖాతా నంబరు ఏర్పాటు చేస్తారు. వైద్య పరీక్షలు చేసిన తర్వాత రోగి ఆరోగ్య సమస్యలు, వాడిన మందులు కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి, కార్డు అందజేస్తారు. ఆ రోగి అనారోగ్యానికి గురైతే దేశంలో ఎక్కడికెళ్లినా కార్డు ద్వారా ఆరోగ్య చరిత్ర తెలుస్తుంది. దీనివల్ల వైద్యం త్వరితగతిన అందుతుంది.

నమోదుకు రూ.9.27 లక్షల ప్రోత్సాహకం

అభా నమోదు, అందుకు సంబంధించిన సేవలు అందించడంలో జిల్లా ఆసుపత్రికి ప్రోత్సాహకం కింద రూ.9.27 లక్షలు, పాలకొండకు రూ.4.47 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులను ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఆయా ఆసుపత్రుల అధికారులు, సిబ్బందిని కలెక్టరు ప్రభాకరరెడ్డి, ఉన్నతాధికారులు అభినందించారు.

మహిళలపై హింస తగదు

సీతానగరం: మహిళలు, బాలికలపై హింస తగదని, ఈ ధోరణిని అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి డిమాండు చేశారు. మహిళలు-బాలికలపై హింసా వ్యతిరేక వారోత్సవం సందర్భంగా జోగింపేట కేజీబీవీలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

గోడలపై చిత్రలేఖన పోటీలు

నవరంగపూర్ జిల్లా లోక మహోత్సవం 'మండేయి-2025' ఉత్సవంలో భాగంగా పాలనాధికారి కార్యాలయం గోడలపై ఆదివారం జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు జరిగాయి. అదనపు పాలనాధికారి తపన్ కుమార్ ఖుంటియా అధ్యక్షతన టెంటులికుంటిలో ఉన్న ఒడిశా ఆదర్శ విద్యాలయ ఆర్ట్స్ టీచర్ పద్మలోచన్‌బారిక్, పపదహండి ఓఏవీ ఉపాధ్యాయుడు బిశ్వజిత్ గిరి, రిటైర్డ్ ఆర్ట్స్ టీచర్ బసంత్ బెనియా నేతృత్వంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. – న్యూస్‌టుడే, నవరంగపూర్

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఈనాడు క్లాసిఫైడ్స్
జన్మదిన శుభాకాంక్షలు
జయంతి, వర్ధంతి
లీగల్ ప్రకటనలు
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

(c) eenadu

నిండు మనసుతో ఫ్లాగ్ డే విరాళం అందిద్దాం: గవర్నర్

హుండీలో విరాళం వేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, న్యూస్‌టుడే: సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్‌కు నిండు మనసుతో విరాళాలు అందిద్దామంటూ రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఆర్.ఎన్.రవి పిలుపునిచ్చారు. సాయుధ దళాల ఫ్లాగ్‌డే ఫండ్ సందర్భంగా గిండిలోని లోక్‌భవన్‌లో ఆదివారం పబ్లిక్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి రీటా హరిశ్ తక్కర్ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆర్.ఎన్.రవి తనవంతుగా రూ.5 లక్షలను విరాళంగా హుండీలో వేశారు. వెంట గవర్నర్ ముఖ్యకార్యదర్శి కిశోర్‌కుమార్, పబ్లిక్ డిపార్ట్‌మెంట్ అదనపు కార్యదర్శి బాలసుబ్రమణియం, చెన్నై కలెక్టరు రష్మి సిద్ధార్థ్ జగడే తదితరులు ఉన్నారు. గవర్నర్ తన 'ఎక్స్' పేజీలో... మన దేశాన్ని, ప్రజలను సురక్షితంగా ఉంచే సాయుధ దళాల నిస్వార్థ సేవలు, తెగువ, త్యాగం వంటివాటిని గుర్తుకు తెచ్చే రోజు ఫ్లాగ్‌డే అన్నారు. యూనిఫాం ధరించి సేవలందించే సైనికులను మాత్రమే కాకుండా వారి ప్రతి సవాళ్ల వెనుక అండగా ఉన్న కుటుంబాలను గౌరవిద్దామని పిలుపునిచ్చారు. ఫ్లాగ్‌డేకు విరాళం అందించడం ద్వారా మన సాయుధ దళ సైనికుల సంక్షేమానికి అండగా నిలవడంతో పాటు మాజీ సైనికులకు, యుద్ధంలో భర్తను కోల్పోయిన మహిళలకు సహాయపడగలమని తెలిపారు. ఫ్లాగ్‌డే విరాళాన్ని నిండు మనసుతో ధారాళంగా అందించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

100 ఇండిగో విమాన సేవలు రద్దు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయంలో ఆదివారం 100 ఇండిగో విమానాలను రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణానికి ధ్రువీకరించిన టికెట్లు కలిగిన ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకుని అవస్థలు పడ్డారు. ఇతర విమాన సంస్థలు మామూలు ధరకన్నా అయిదింతలు ఛార్జీలు పెంచేశాయి. చివరి నిమిషంలో సేవలు రద్దు, సరైన సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు ఇండిగో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

ఆమ్‌స్టర్‌డామ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆటో క్వీన్స్

- 30 నిమిషాల నిడివితో డాక్యుమెంటరీ ప్రదర్శన
- ఘనత సాధించిన తొలి చిత్రంగా పేరు
- ప్రపంచస్థాయికి వీపీఎంఎస్ మహిళల విజయగాథ

'ఆటో క్వీన్స్' డాక్యుమెంటరీ పోస్టర్

అసలే పేద కుటుంబాలు.. అందులోని కొందరు మహిళలు భర్తల్ని కోల్పోయారు.. ఇంకొందరు వేధింపులకు గురయ్యారు.. మరి కొందరు ఆర్థిక వనరుల్లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.. ఈ క్రమంలో అందరూ ఒక్కటయ్యారు. చేతులు కలిపారు. సంఘంగా ఏర్పడి ఆటోలు నడపడం మొదలుపెట్టారు. వీరి విజయగాథని డాక్యుమెంటరీగా చిత్రీకరించి.. ప్రతిష్ఠాత్మక 'ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్ ఆమ్‌స్టర్‌డామ్ (ఐడీఎఫ్ఏ)'లో ప్రదర్శించారు. - **ఈనాడు-చెన్నై**

వీర పెన్‌గళ్ మున్నేట్ర సంఘం (వీపీఎంఎస్).. అంటే వీర మహిళల సంక్షేమ సంఘం అని అర్థం. ఇప్పుడిది అధికారికంగా గుర్తింపు పొందిన దేశపు తొలి మహిళా ఆటోడ్రైవర్ల సంఘంగా పేరుగాంచింది. వీరిని కుంగుబాటు జీవితం నుంచి బయటకు తీసుకొచ్చిన 'ఏస్' అనే స్వచ్ఛంద సంస్థ వీరి గాథను ప్రపంచవ్యాప్తం చేసేలా సంఘాన్ని మలిచింది. వారిచ్చిన ధైర్యంతో జీవితంలో నిలదొక్కుకుని.. ఆటోలు నడుపుతున్నారు. గతేడాది ఐఐఎం కోళికోడ్‌లో 'కూప్24' మహిళా స్టార్టప్‌ల వేడుకలో తమ గాథను వినిపించి విజేతగా నిలిచారు. ఈ ఏడాది నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలో జరిగిన 'డ్రైవింగ్ ద వరల్డ్ టువర్డ్స్ జెండర్ ఈక్వాలిటీ' సదస్సులో ప్రఖ్యాత కమ్లా భాసిన్ సౌత్‌ఆసియా అవార్డును దక్కించుకున్నారు. తమిళనాడు నుంచి ఈ అవార్డును అందుకున్న తొలి ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షురాలిగా మోహనసుందరి చరిత్రకెక్కారు. ఇలా మరిన్ని అవార్డులూ సాధించారు. ఈ సంఘంలో 600మందిదాకా సభ్యులుండగా.. వీరి విజయగాథను ప్రపంచానికి చూపించాలనే ఆలోచన కలిగింది. అది డాక్యుమెంటరీగా మారింది.

కళ్లకు కట్టినట్టు రూపకల్పన

మహిళలు అధైర్యపడకుండా ముందుకెళ్లాలని తమ కథలతో 'ఆటో క్వీన్స్' పేరుతో 30 నిమిషాల డాక్యుమెంటరీని తీశారు. గార్గి సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా ఉన్న శ్రేయంతి దీనికి దర్శకత్వం వహించారు. సంఘం అధ్యక్షురాలు మోహనసుందరి, కోశాధికారి లీలారాణి ఇందులో నటించారు. నగరంలో ఆటోడ్రైవర్లుగా వీరు చూపిస్తున్న ధైర్యం, ఎదురవుతున్న ఇబ్బందులు, చాలాచోట్ల పురుషాధిక్యత లాంటివి కళ్లకు కట్టినట్లు చూపారు. విధుల సమయాల్లోనూ తమకు వేధింపులు ఎలా ఉంటాయో, ఆటోస్టాండ్లలో చోటివ్వకుండా ఎలా హింసపెడతారో లాంటివన్నీ ప్రదర్శించారు. అన్ని అడ్డంకుల్ని ఛేదించి.. ఆటో డ్రైవర్లు సాధించిన విజయాన్ని ఇందులో చూపించారు. ఈ డాక్యుమెంటరీని 'ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్ ఆమ్‌స్టర్‌డామ్ (ఐడీఎఫ్ఏ)'లో ప్రదర్శించే అరుదైన అవకాశం వచ్చింది. గతనెలాఖరులో దీన్ని అక్కడ వివిధ దేశాలకు చెందిన ప్రముఖుల మధ్య ప్రదర్శించారు. వారి మెప్పు పొందారు. తమిళనాడు నుంచి ఈ వేదికకు ఎంపికైన తొలి చిత్రంగా 'ఆటో క్వీన్స్' రికార్డు సాధించింది.

వీపీఎంఎస్ సభ్యులు

స్ఫూర్తి రాష్ట్రవ్యాప్తం

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న మోహన సుందరి

చెన్నైలో బలమైన సంఘంగా ఏర్పడిన ఈ మహిళా ఆటోడ్రైవర్లు.. రాష్ట్రంలోని కోయంబత్తూరు, ఇతర నగరాల్లోనూ విస్తరించేందుకు చర్యలు జరుపుతున్నారు. తమిళనాడులో ఓ స్థాయికి వచ్చాక.. ఈ ఉద్యమాన్ని ఇతర రాష్ట్రాలకూ విస్తరిస్తామని చెబుతున్నారు. చెన్నైలోని మహిళా డ్రైవర్లు నెలకు రూ.20వేల నుంచి రూ.30వేల దాకా సంపాదిస్తున్నారు. దీన్ని ఇతర నగరాలకు ఉదాహరణగా చూపి సంఘంగా ఏర్పడమని ప్రోత్సహిస్తున్నారు. చెన్నైలో వీపీఎంఎస్ విజయాల్ని చెబుతున్నారు. సభ్యుల్లో కొందరు పింక్ ఆటోలు పొందుతున్నారు. ప్రమాద బీమా రూ.10లక్షలు, రూ.50వేల వరకు రుణాలు, రూ.6లక్షల ఆరోగ్య బీమా లాంటివి ఆటో కారుణంతో కలిసి అందిస్తున్నారు. అనారోగ్యంతో ఇంట్లో ఉన్న డ్రైవర్లకు నెలకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు అందిస్తున్నారు. ఇళ్లలో ప్రత్యేక అవసరాలకూ ఈ సంఘం నిధి నుంచి సాయం అందిస్తున్నారు. ప్రస్తుతం వీరు బిజినెస్ మోడల్‌గా అన్వయిస్తున్నారు. ఆటోలకు వేసే ఆయిల్, విడిభాగాల్ని హోల్‌సేల్‌లో కొని రిటైల్‌గా విక్రయించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇలా వచ్చిన ఆదాయంతో పిల్లల పాఠశాల ఫీజులతో పాటు సొంతంగా ఆటోలే కొనే స్థాయికి ఎదగాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇవన్నీ ఇతర నగరాలకు చెందిన మహిళా ఆటోడ్రైవర్లకి వివరిస్తున్నారు.

భద్రతకు వాట్సాప్ గ్రూప్

మహిళా ఆటోడ్రైవర్లతో ఓ వాట్సాప్ గ్రూప్‌ను నడుపుతున్నారు. చెన్నై నగరంలో వారికి ఎక్కడ ఎలాంటి ఇబ్బంది వచ్చినా అందులో చర్చిస్తారు. ఆకతాయిల వేధింపులు, రోడ్ల సమస్య, రాత్రివేళల్లో మహిళలు ఎదుర్కొంటున్న అవస్థలు ఇలాంటివన్నీ వారు చర్చిస్తుంటారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే సంఘం తరఫునే ఏడాదికి రూ.7500-రూ.12500 అందిస్తున్నారు.

రాష్ట్రానికి రూ.36,660 కోట్ల పెట్టుబడులు

☛ టీఎన్ రైజింగ్ పెట్టుబడిదారుల సదస్సులో ఒప్పందాలు

వీరమంగై వేలునాచ్చియార్ పైవంతెనను ప్రారంభిస్తున్న స్టాలిన్

ప్యారిస్, న్యూస్‌టుడే: టీఎన్ రైజింగ్ పేరుతో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో 91 అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. వీటి ద్వారా తమిళనాడుకి రూ.36,660.35 కోట్ల విలువైన పెట్టుబడులు రానున్నాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చెన్నై నుంచి శనివారం సాయంత్రం మదురై చేరుకున్నారు. ఆదివారం ఉదయం మదురైలో మక్కల్ విడుదలై కట్చి వ్యవస్థాపకుడు మురుగవేల్ రాజన్ ఇంటి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం 'టీఎన్ రైజింగ్' పేరుతో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో పలు సంస్థలతో 91 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా రూ.36,660.35 కోట్ల పెట్టుబడులు తమిళనాడుకి రానున్నాయి. తద్వారా 56,766 మంది యువతకు ఉపాధి లభించనుంది. కార్యక్రమంలో భాగంగా మేలూర్‌లో సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. అనంతరం 63,698 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. రూ.3065 కోట్ల వ్యయంతో చేపట్టి పూర్తయిన ప్రాజెక్టులను ప్రారంభించి, కొత్త వాటికి శంకుస్థాపన చేశారు. రూ.150 కోట్ల వ్యయంతో మేలమడై జంక్షన్‌లో నిర్మించిన వీరమంగై వేలునాచ్చియార్ పైవంతెనను ప్రారంభించారు.

తిరుప్పరంకుండ్రం కొండను పురావస్తుశాఖకు అప్పగించాలి

☛ సుప్రీంకోర్టులో పిటిషన్

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుప్పరంకుండ్రం కొండను పురావస్తు శాఖకు అప్పగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మదురైకి చెందిన కేకే రమేష్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో... తిరుప్పరంకుండ్రం కొండపై కార్తిక దీపం వెలిగించే వ్యవహారం తమిళనాడులో శాంతిభద్రతల సమస్యగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపారు. అంతేకాకుండా మురుగన్ ఆలయం, ఆ ప్రాంతంలో ఉన్న మసీదు తదితర ప్రాంతాలను పూర్తిగా వెంటనే కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలోకి తీసుకువచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న పురాతన దీప స్తంభంపై 24 గంటలపాటు శాశ్వతంగా దీపం వెలిగించాలని, ఏటా కార్తిక మాసంలో ఈ ప్రాంతంలో దీపం వెలిగించి పూజించేందుకు మురుగన్ భక్తులకు అనుమతి ఇవ్వాలని కోరారు.

● **కొనసాగుతున్న పోలీసు భద్రత.. ప్యారిస్:** తిరుప్పరంకుండ్రం కొండపై పటిష్ఠ పోలీసు భద్రత కొనసాగుతోంది. కొండపై ఉన్న దీప స్తంభంపై కార్తిక దీపం వెలిగించాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. కానీ ఉత్తర్వులను అమలుచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తిరుప్పరంకుండ్రం, కొండపై పటిష్ఠ పోలీసు భద్రత ఇంకా కొనసాగుతోంది. భక్తులు కొండపై ఉన్న దర్గాకు, కాశీ విశ్వనాథర్ ఆలయానికి వెళ్లేందుకు అనుమతివ్వలేదు. కొండపైకి వెళ్లేందుకు వచ్చినవారిని పోలీసులు వెనక్కి పంపుతున్నారు.

అన్నాడీఎంకే విషయంలో భాజపా బెదిరించలేదు: టీటీవీ దినకరన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే విషయంలో భాజపా అధికారంతో బెదిరించలేదని ఏఎంఎంకే ప్రధానకార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. ఆయన తిరుప్పూర్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... మాజీ మంత్రి సెంగోట్టైయన్ వంటి దీర్ఘకాలిక అనుభవం కలిగినవాళ్లు టీవీకేలో చేరుతుంటే ఆయా పార్టీలు తమను తాము సంస్కరించుకోవాలన్నారు. కూటమికి నాయకత్వం వహించే పార్టీలు తమతో చర్చలు జరుపుతున్నాయని చెప్పారు. అన్నాడీఎంకే ఐక్యంగా ఉంటేనే మరో వందేళ్ల దిశగా తీసుకెళ్లడం కుదురుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిద్రపోతున్న, నిద్రపోతున్నట్లు నటిస్తున్నవారు ఏకమవుతారని చెప్పారు. అందరినీ ఏకం చేయడానికి భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఒక పార్టీ సమస్యను పరిష్కరించడానికి మధ్యవర్తి అవసరమన్నారు. అన్నాడీఎంకే విషయంలో భాజపా అధికారంతో బెదిరించాలనుకోలేదని తెలిపారు.

మెట్రో రైలు ప్రాజెక్టులు అప్పుడే ఎందుకు అమలు చేయలేదు?

☛ స్టాలిన్‌కు తమిళిసై ప్రశ్న

చెన్నై, న్యూస్‌టుడే: నాడు కేంద్ర మంత్రివర్గంలో భాగస్వామిగా ఉన్నప్పుడే మదురైలో మెట్రో రైలు ప్రాజెక్టు, ఎయిమ్స్ ప్రాజెక్టులను డీఎంకే ఎందుకు అమలు చేయలేదని భాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ ప్రశ్నించారు. ఆమె తన 'ఎక్స్' పేజీలో... డీఎంకే ఐదుసార్లు అధికారంలో ఉండి మదురైకు తెచ్చిన భారీ పరిశ్రమలు ఏంటని ప్రశ్నించారు. నాడు కేంద్ర మంత్రివర్గంలో భాగస్వామిగా ఉన్నప్పుడే మదురైలో మెట్రోరైలు ప్రాజెక్టు, ఎయిమ్స్ గురించి ఎందుకు ఆలోచించలేదని, వాటిని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశించిన తర్వాత కూడా తిరుప్పరంకుండ్రంలోని దీప స్తంభంలో దీపాన్ని వెలిగించకపోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రపంచస్థాయి విద్యను అందించాల్సిన మదురై కామరాజర్ విశ్వవిద్యాలయంలో పరిపాలనా లోపాలు కొట్టుమిట్టాడుతున్న విషయం కూడా ప్రజలకు తెలుసన్నారు.

తమిళనాడు ఆలయాల ఉభయదారుల తరఫున శబరిమలై అయ్యప్ప భక్తుల కోసం గత మూడేళ్లుగా బిస్కెట్లు పంపుతున్నారు. ఆ మేరకు చెన్నై పార్క్ నగర్‌లో ఆదివారం మొదటి విడతగా సమకూర్చిన 5 లక్షల బిస్కెట్ల ప్యాకెట్లతో శబరిమలై బయల్దేరిన కంటైనర్ లారీకి దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు జెండా ఊపి సాగనంపారు.

- వేళచ్చేరి, న్యూస్‌టుడే

దియా.. ప్రదర్శన మైమరపించునయా!

☛ 8 ఏళ్ల ప్రాయంలో 110 వేదికలపై భక్తి పాటల ఆలాపన ☛ ఆధ్యాత్మిక ప్రసంగాలతో అబ్బురపరుస్తున్న బాలిక

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆటలు, చదువుల వైపు సాగే నేటితరం పిల్లల మధ్య భక్తి పాటలతోపాటు, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తూ ఆశ్చర్యపరుస్తోంది చిన్నారి దియా. ఈమె మధురగానం, స్పష్టమైన తమిళ ఉచ్చారణ, జ్ఞాపకశక్తి అబ్బురపరుస్తున్నాయి. పళని మురుగన్ మహానాడులో గానంతో పాటు ప్రసంగం చేసి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఎనిమిదేళ్లకే వందకు పైగా వేదికలపై పాటలు పాడి, ప్రసంగాలు చేసింది. ఇన్ని మంచి లక్షణాలు ఎలా అలవడ్డాయో బాలిక మాటల్లోనే తెలుసుకుందాం..

మురుగన్ ఆలయంలో మొదలు

నేను పుట్టింది మదురై. ఇప్పుడు చెన్నైలోని పోరూర్‌లో ఉంటున్నాం. అమ్మ, నాన్న ఇద్దరూ ఐటీ ఉద్యోగులు. మా ఇంట్లో ఎప్పుడూ దేవుడి పాటలు వినిపిస్తునే ఉంటాయి. అమ్మ, బామ్మ పాటలు పాడుతూ పూజ చేస్తుంటారు. అవి వింటూ పెరిగిన నేను.. పాడటం ప్రారంభించాను. నాకు బామ్మ చిన్నచిన్న శ్లోకాలు, మురుగన్ పాటలు నేర్పించింది. ఓసారి సెలవులకు మదురై వెళ్లాను. అక్కడున్న మురుగన్ ఆలయంలో పాడే అవకాశం దక్కింది. అప్పుడు నాకు ఐదేళ్లు కావడంతో నేను పాడగలనా అని అందరూ వింతగా చూశారు. అక్కడ మురుగన్ పాట పాడి అందరూ ఆశ్చర్యపడేలా చేశాను. నా గాన ప్రయాణం అక్కడి నుంచే ప్రారంభమైంది.

వేదికపై గానం చేస్తున్న దియా

పళని మహానాడుతో జీవితానికి మలుపు

ఇప్పుడు నాకు ఎనిమిదేళ్లు. ఇప్పటివరకు 110 వేదికలపై పాటలు పాడాను. నా ఇష్టదైవం మురుగన్. అందుకే 100 పాటలు ఆయనవే నేర్చుకున్నాను. బామ్మ, అమ్మకు కర్ణాటక సంగీతం తెలుసు. అందువలన నా గురువులు కూడా వాళ్లే. ఓసారి పాడి చూపిస్తే వెంటనే అలానే పాడగలను. గతేడాది పళని ఆలయంలో మురుగన్ మహానాడు జరిగింది. అందులో పాల్గొని పాడటం నా జీవితానికి మరో మలుపు. దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు, అక్కడున్నవారు ప్రశంసించడం మరిచిపోలేను. ఆనాటి నుంచి దేవాదాయ శాఖ తరఫున జరిగే అన్ని కార్యక్రమాలకు నన్ను పిలుస్తున్నారు. ఆలయాల్లో కుంభాభిషేకం వేడుకలకు ప్రత్యేక అతిథిగా ఆహ్వానిస్తున్నారు. తిరుచ్చెందూర్ ఆలయంలో కుంభాభిషేకానికి ఆహ్వానం అందింది. అది నా 100వ వేదికగా నిలిచింది.

నా ఆశయం అదే..

మురుగన్ పాటలే కాకుండా అమ్మవారి పాటలు కూడా బాగా పాడుతాను. అంతేకాకుండా పురాణాలు, ఇతిహాసాలు చదువుతాను. అందులోని వాక్యాలు, కథలను వేదికలపై ప్రవచనాలుగా వినిపిస్తున్నాను. నా ప్రతిభను అభినందిస్తూ ఎలిసై కలైయరసి, భక్తి ఇళవరసి, యువ అచీవర్ లాంటి అవార్డులు వరించాయి. సినిమాల్లో ఇళయరాజా పాటలు బాగా వింటాను. మురుగన్ స్వామికి ప్రత్యేక ఆల్బం సిద్ధం చేస్తున్నాను. నా గొంతు అన్ని ఆలయాల్లో వినిపించాలన్నదే నా ఆశయం.

న్యాయం గెలిచింది: రామదాస్

ట్రిప్లికేన్ న్యూస్‌టుడే: న్యాయం గెలిచిందని, అన్బుమణి పీఎంకే అధ్యక్షుడు కాదని రుజువైందని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో.. తాను దిల్లీ హైకోర్టులో ఈ నెల 4వ తేదీ వేసిన కేసులో తనకు విజయం దక్కిందన్నారు. అన్బుమణి పీఎంకే అధ్యక్షుడిగా ఎన్నికల కమిషన్ ప్రకటన చెల్లదని దిల్లీ హైకోర్టు శనివారం తీర్పునిచ్చినట్లు తెలిపారు. తన నుంచి పార్టీని లాక్కునేందుకు చేసిన కుట్ర విఫలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గుర్తింపును తిరిగి పొంది ప్రజలకు హక్కులను అందించడమే తన పనని తెలిపారు.

వేదికపై శుభవీర పాండియన్, నక్కీరన్ గోపాల్ తదితరులు

జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తిరుప్పరంకుండ్రం కేసులో పక్షపాత తీర్పునిచ్చిన మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌పై అభిశంసన తీర్మానాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని ద్రావిడ తమిళ సంఘం అధ్యక్షుడు శుభవీర పాండియన్ డిమాండ్ చేశారు. ద్రావిడ తమిళ సంఘం తరఫున చెన్నై చేపాక్‌లోని శివానంద రోడ్డులో 'తిరుప్పరంకుండ్రం తదుపరి అయోధ్య' అనే పేరుతో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందులో సీనియర్ జర్నలిస్ట్ నక్కీరన్ గోపాల్, శుభవీర పాండియన్ సహా సంఘానికి చెందిన పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుభవీర పాండియన్ మాట్లాడుతూ.. బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత తలెత్తిన సమస్యలను తమిళనాడులో భాజపా మళ్లీ సృష్టించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్తిక దీపానికి, భాజపాకు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. ఇటీవల 'ఎస్ఐఆర్' ప్రక్రియను తీసుకొచ్చి సమస్యలు సృష్టించారని ఆరోపించారు. ప్రస్తుతం తిరుప్పరంకుండ్రం అంశాన్ని చేతుల్లోకి తీసుకున్నారన్నారు. భాజపా ఏం చెప్పినా ఏకీభవిస్తానని ఎడప్పాడి పళనిసామి అంటున్నారని, తమిళనాడు ఉత్తరప్రదేశ్ కాదని, మతతత్వ శక్తులు ప్రవేశించలేవని, ఇక్కడ అన్ని మతాలవారు ఎలాంటి వివక్ష లేకుండా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమయంలో భాజపా తిరుప్పరంకుండ్రం అంశాన్ని చేతుల్లోకి తీసుకొని లాభం పొందడానికి చూస్తోందని మండిపడ్డారు. ఈ కేసులో పక్షపాత తీర్పునిచ్చిన న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌పై అభిశంసన తీర్మానాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సాంప్రదాయ వరి సాగుకు శ్రీకారం

- ప్రభుత్వ చొరవతో రంగంలోకి మహిళా రైతులు
- తిరునెల్వేలిలో కొత్త ఒరవడి

- న్యూస్‌టుడే, టీనగర్

భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వ్యవసాయంలో సాంప్రదాయ వరి రకాలు కనుమరుగైపోతున్నాయి. ఒకప్పుడు వెయ్యికి పైగా రకాలు ఉండగా, రసాయన ఎరువుల కారణంగా ప్రస్తుతం 180 రకాలు మాత్రమే మిగిలాయి. తక్కువ దిగుబడి, పెట్టుబడి నష్టం భయంతో రైతులు వాటిని పండించడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో తమిళనాడు ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి తెరతీసింది.

పొలం పనికి వెళ్తున్న మహిళా రైతులు

స్వయం సహాయక బృందాలతో..

గ్రామాణాభివృద్ధి శాఖ ద్వారా మహిళా స్వయం సహాయక బృందాలను సాంప్రదాయ వ్యవసాయంలోకి దించింది. ఈ పథకం తిరునెల్వేలి జిల్లాలోని అంబాసముద్రం సమీపం అయన్ తిరువాలీశ్వరం, కపాలీపాళై గ్రామాల్లో మొదలైంది. అయన్ తిరువాలీశ్వరం గ్రామంలోని 10 మంది మహిళా రైతులను ఎంపిక చేసి, సాంప్రదాయ వరి సాగు కోసం వారికి తలా రూ.50 వేల చొప్పున రుణం అందించారు. ఈ రుణంపై వడ్డీ కూడా నామమాత్రమే.

ఆరోగ్య సమస్యలు దూరం

రైతు శంకరమారి మాట్లాడుతూ.. "సాంప్రదాయ వరి ధాన్యంతో అన్నం తింటే రోగాలు రావని, ఆరోగ్యం బాగుంటుందని తెలుసుకున్నాం. అందుకే స్వయం సహాయక బృందాలకు ఇచ్చిన రుణంతో మొదటిసారిగా ఈ సాగు చేస్తున్నాం. మాకు కావాల్సిన ఆహారం మేమే పండించుకుంటే ఎంతో ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. మరో రైతు ముత్తులక్ష్మి మాట్లాడుతూ.. "రసాయన ఎరువుల వల్ల పిల్లలకు ఆరోగ్య సమస్యలు వచ్చాయి. వాటిని మానేసి ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఇది సరైన మార్గం" అని అన్నారు. మహిళా స్వయం సహాయక బృందం అధ్యక్షురాలు మణియమ్మై మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రయత్నంలో ఉత్సాహంగా పని చేసి, అధిక దిగుబడి సాధిస్తామని చెప్పారు. ప్రారంభ దశలో తిరునెల్వేలిలోని రెండు గ్రామాలను ఎంచుకున్నామని, త్వరలో 10కి పైగా గ్రామాలకు ఈ పథకాన్ని విస్తరించనున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. ఈ విధంగా మహిళా రైతులు సాంప్రదాయ వరి వంగడాలను కాపాడుతూ, ఆరోగ్యకరమైన ఆహారానికి మార్గం సుగమం చేస్తున్నారు.

ప్రకృతి సేద్యంతో ప్రయోజనం

ఈ మహిళలు ఇంతకుముందు రసాయన ఎరువులతో వరి పండించేవారు. ఇప్పుడు వారు పూర్తిగా సేంద్రీయ ఎరువులు ఉపయోగించి ఆత్తూర్, కిచడి, సంబా వంటి సాంప్రదాయ వరి రకాలను 15 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. వారికి అంబాసముద్రానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళా రైతు శిక్షణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాన్ని వదిలి ప్రకృతి వ్యవసాయంలోకి దిగిన లక్ష్మీదేవి.. ప్రస్తుతం 120 వరి రకాలను పండిస్తున్నారు. ఆమె స్ఫూర్తితోనే ఈ మహిళలు కొత్త ప్రయత్నం చేపట్టారు.

ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న స్టాలిన్: నయినార్ నాగేంద్రన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, భాజపాకు హిందువులు, ముస్లింలు రెండు కళ్లని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. చెన్నై వడపళనిలోని రాజాంగ సెంట్రల్ రోడ్డులో అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం భాజపా తరఫున సహపంక్తి విందు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నయినార్ నాగేంద్రన్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ... తిరుప్పరంకుండ్రం అంశంలో కోర్టు ఆదేశాల ప్రకారం దీపం వెలిగించడానికి అనుమతివ్వాలని తెలిపారు. దీనికి విరుద్ధంగా 144 సెక్షన్ విధించడం కోర్టు ధిక్కారంతో సమానమన్నారు. అంతేకాకుండా దీపం వెలిగించడంపై ఏ ఒక్క ముస్లింకు బాధ లేదని చెప్పారు.

సహపంక్తి విందులో నయినార్ నాగేంద్రన్ తదితరులు

(c) eenadu

ఒప్పందాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

'పాసో' వర్సిటీతో 'పీయూ' ఒప్పందం

వడపళని, న్యూస్‌టుడే: అంతర్జాతీయ విద్య, పరిశోధనలపై సహకారాన్ని పెంపొందించుకోవడానికి పాండిచ్చేరి విశ్వవిద్యాలయం బ్రెజిల్‌లోని పాసో వర్సిటీతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడిని ప్రోత్సహించడం, వివిధ విభాగాలలో సంయుక్తంగా విద్యాపరమైన కార్యక్రమాలు నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకుందని వర్సిటీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇరు విద్యా సంస్థల మధ్య కుదిరిన ఒప్పంద ప్రాముఖ్యతను వర్సిటీ ఉపకులపతి, ఆచార్యులు ప్రకాశ్‌బాబు వివరించారు. పాసో వర్సిటీ ఆచార్యులు ఓర్‌ట్రుడ్ ఎం. హెర్ట్రాంప్ ఒప్పందం గురించి ఆన్‌లైన్‌లో మాట్లాడారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పాలారు నది

మహాబలిపురం, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెంగల్పట్టు జిల్లాలోని ప్రజాపనుల శాఖ, జలవనరులశాఖ పరిధిలోని అన్ని చెరువులు నిండాయి. అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో మహాబలిపురం సమీపంలోని వాయలూర్ జలాశయం నిండటంతో మిగులు జలాలు పాలారు నదిలోకి వదులుతున్నారు. నదిలో వరద పోటెత్తింది. దీంతో మహాబలిపురం సమీపం వల్లిపురం ప్రాంతంలోని చెక్‌డ్యామ్‌లు నిండి మిగిలిన నీరు సముద్రంలోకి చేరుతోంది.

నైనామలై కొండపైకి రోడ్డు నిర్మాణం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లాలోని ప్రసిద్ధ నైనామలై వరదరాజ పెరుమాళ్ ఆలయానికి వెళ్లాలంటే 3,600 మెట్లు ఎక్కాలి. దేవాదాయశాఖ, పర్యాటకశాఖ తరఫున కొండపైకి చేరుకోవడానికి ఏడాది క్రితం రూ.13 కోట్లతో మట్టి రోడ్డు వేశారు. ఈ నేపథ్యంలో గతేడాది నామక్కల్‌లో పర్యటించిన ముఖ్యమంత్రి స్టాలిన్ నైనామలైకు తారురోడ్డు నిర్మించడానికి రూ.30 కోట్లు కేటాయించారు. అనంతరం టెండరు ఆహ్వానించి సేందమంగళం ఇన్నర్ డివిజన్ రహదారుల శాఖ తరఫున సెప్టెంబరు 20న తేదీ భూమిపూజ జరిపారు. ఈ నేపథ్యంలో తారురోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

వాననీటి కాలువల్లో మొసళ్ల సంచారం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా సేత్తియాతోపు పరిసరాల్లోని వాననీటి కాలువల్లో మొసళ్లు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సేత్తియాతోపు సమీపంలోని విలప్పాడి చెరువు నుంచి ప్రారంభమయ్యే సొగనీటి కాలువ తట్టాంచేడు, ధర్మనల్లూర్, చిన్నకూనం, పెరియకూనం, వీరముదనాథం తదితర ప్రాంతాల గుండా ఆవాలి వాగును చేరుకొని వెల్లరూరాజన్ చానెల్‌కు చేరుతుంది. గత రెండు వారాలుగా కడలూర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వీరాణం చెరువు నిండటంతో జలవనరులశాఖ అధికారులు మిగులు జలాలను వెల్ల నదిలోకి వదిలారు. ఈ క్రమంలో వెల్ల నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న వాననీటి కాలువల్లోకి మొసళ్లు చేరాయి. దీంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ధర్మనల్లూర్, తట్టనోడై ప్రాంతాల్లో రైతులు పంట పొలాలకు వెళ్లగా అక్కడ మొసళ్లు సంచరిస్తుండటాన్ని చూసి చిదంబరం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకొని సాయంత్రం వరకు మొసళ్ల కోసం గాలించారు.

కాలువలో ఉన్న మొసలి

అధునాతన యంత్రం.. వీధుల్లో ధూళి మాయం

రూపొందించిన ఐఐటీ పరిశోధకులు

– న్యూస్‌టుడే, వడపళని

దేశంలోని నగరాలు, పట్టణ ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతున్న తరుణంలో 'ఐఐటీ మద్రాస్' పరిశోధకులు రూపొందించిన అధునాతన సాంకేతిక విధానంతో కూడిన యంత్రం వీధులు శుభ్రంగా ఉంచడానికి, హానికరమైన గాలి, ధూళిని తొలగించడానికి ఉపయోగకరంగా ఉంటుంది. నగరాల్లో వాయు కాలుష్యానికి వీధుల నుంచి బయటికొచ్చే ధూళి కూడా ఓ కారణం. ముఖ్యంగా పీఎం 2.5 అని పిలువబడే సూక్ష్మ కణాలను పీల్చడం వల్ల ఉబ్బసం, దగ్గు, ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతున్నాయి. వీటన్నింటి నుంచి ఉపశమనం పొందేందుకు సరికొత్త యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఐఐటీ మద్రాస్ సివిల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు ఎస్ఎమ్ శివనాగేంద్ర ఐఐటీవిలు దిల్లీలో ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు.

యంత్రం

ఖర్చు తక్కువ.. నిర్వహణ సులువు

కొత్త సాంకేతికతతో తయారైన యంత్రం దుమ్మును కూడిన కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా శ్వాస సంబంధిత వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుతుందని, అదే సమయంలో శుభ్రతా కార్మికులకు కూడా యంత్రం చాలా ఉపయోగకరంగా ఉంటుందని, శారీరక ఒత్తిడి తగ్గుతుందని నాగేంద్ర పేర్కొన్నారు. యంత్రం తక్కువ ఖర్చుతో మన్నికగా ఉంటుందన్నారు. నిర్వహణ కూడా సులువేనని, నగరాలలో ఈ యంత్రం వాడకం ద్వారా ఖర్చు కూడా బాగా తగ్గుతుందని తెలిపారు. గాలిలో కలిసే దుమ్మును తగ్గించి పర్యావరణాన్ని కాపాడుతుందని చెప్పారు. యంత్రాన్ని వాణిజ్యపరంగా మార్కెట్లో వినియోగించేందుకు ఐఐటీ మద్రాస్ అభివృద్ధి చేసిన యంత్రాన్ని 'ఎన్విట్రాన్ స్మార్ట్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్' సంస్థకు బదిలీ చేసింది.

కుండల తయారీకి ఉపయోగం

ఆచార్యులు ఎస్ఎమ్ శివనాగేంద్ర

మన దేశంలో రోడ్లను పొడవైన చీపుర్లతో ఊడుస్తుంటారు. ఈ పని శ్రమతో కూడుకున్నదే అయినా చిమ్ముతున్న వారు ప్రమాదకరమైన ధూళికి లోనవుతుంటారు. మన మార్కెట్లో పెద్ద యంత్రాలు అందుబాటులో ఉన్నా, ధర ఎక్కువగా ఉన్నాయి. ఈ యంత్రాలు ఇరుకైన వీధులు లేదా రద్దీ ప్రదేశాల్లో పనిచేయడానికి అంతగా పనికిరావు. గాలిలో నాణ్యత మెరుగుపరచాలనే ఉద్దేశంతో అధునాతన సాంకేతికతతో యంత్రాన్ని అభివృద్ధి చేశామని శివనాగేంద్ర పేర్కొన్నారు. ఈ యంత్రం చీపుర్లతో చిమ్మే వారి పనిని సులభతరం చేయగలదని ఆయన చెప్పారు. 'రోడ్ డస్ట్ కలెక్టర్(ఆర్డీసీ)' ఓ ప్రత్యేకమైన సైక్లోన్ సెపరేటర్ వ్యవస్థతో పనిచేస్తుందని, ముతకగా ఉన్న ధూళిని సేకరించి, ప్రత్యేక డబ్బాలో నిల్వ చేస్తుందని వివరించారు. ఇలా చేయడంతో మట్టి కుండల తయారీకి కూడా సూక్ష్మ ధూళిని తిరిగి ఉపయోగించే వీలుంటుందన్నారు. రోడ్ల మీద పనిచేసేటప్పుడు తనంతట తానుగా సర్దుకుని పని చేసేందుకు వీలుగా బ్రష్ కూడా యంత్రంలో అమర్చినట్లు తెలిపారు.

రైళ్ల సమాచారం

వడపళని, న్యూస్‌టుడే: దేశంలో పలు ప్రాంతాలకు ఇండిగో విమాన సేవలు స్తంభించిపోవడంతో పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీని జత చేస్తున్నట్టు దక్షిణ రైల్వే శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

● **12695** చెన్నై సెంట్రల్-తిరువనంతపురం సెంట్రల్ 8 నుంచి 11, **12696** తిరువనంతపురం సెంట్రల్-చెన్నై సెంట్రల్ 8 నుంచి 12 వరకు అదనంగా ఒక స్లీపరు బోగీ తగిలిస్తారు. ● **20635** ఎగ్మూరు-కొల్లం 8న, **20636** కొల్లం-ఎగ్మూరు 9వ తేదీ రైలు ఒక స్లీపరు బోగీ జోడిస్తారు. ● **16865** ఎగ్మూరు-తంజావూరు 10వ తేదీ అదనంగా ఒక స్లీపరు బోగీ ఉంటుంది. ● **12076** తిరువనంతపురం సెంట్రల్-కోజికోడ్ 8 నుంచి 11 వరకు అదనంగా ఒక ఛెయిర్ కార్ బోగీ తోడవుతుంది.

● **ప్రత్యేక రైలు... 06011** తాంబరంలో 8న 15.30కి బయలుదేరి మరుసటి రోజు 04.15కి నాగర్‌కోయిల్ చేరుతుంది. ● **06108** ఎగ్మూరులో 8న 13.50కి బయలుదేరి మరుసటి రోజు 08.00కి తిరువనంతపురం నార్త్ చేరుతుంది. ● **06023** చెన్నై సెంట్రల్‌లో 8న 12.20కి బయలుదేరి అదే రోజు 22.30కి చెన్నై సెంట్రల్ వచ్చి చేరుతుంది. అన్ని రైళ్లకు రిజర్వేషన్లు అందుబాటులో ఉన్నాయి.

● **టెర్మినల్‌లో మార్పు... 22661** ఎగ్మూరు-రామేశ్వరం 8 నుంచి ఎగ్మూరులో బయలుదేరుతుంది.

కలెక్టర్ కందసామికి వినతిపత్రం అందజేస్తున్న సెంగోట్టైయ్యన్

16న ఈరోడ్‌లో విజయ్ పర్యటన

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ పర్యటనకు సంబంధించి అనుమతి కోసం పార్టీ చీఫ్ కన్వీనర్ కేఏ సెంగోట్టైయ్యన్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఆదివారం వినతిపత్రం అందజేశారు. కరూర్ దుర్ఘటన తర్వాత టీవీకే అధ్యక్షుడు పర్యటన చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ ఈరోడ్ జిల్లాలో పర్యటించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం పర్యటనకు అనుమతి కోరుతూ సెంగోట్టైయ్యన్ జిల్లా కలెక్టర్ కందసామి, ఎస్పీకి వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీవీకేలో తనకెలాంటి ఆంక్షలు లేవన్నారు. సభకు ప్రైవేట్ ప్రాంతాన్ని ఎంపిక చేసిన నేపథ్యంలో రోడ్ షో ఉండదని చెప్పారు.

అనుమతి నిరాకరణ?.. ప్రచార సభలో 75 వేల మంది పాల్గొంటారని తెలిపిన నేపథ్యంలో అంతమందికి అక్కడ స్థలం చాలదని చెప్పి పోలీసులు అనుమతి నిరాకరించినట్టు సమాచారం.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల విజేత దక్షిణ రైల్వే జట్టు

వడపళని, న్యూస్‌టుడే: ఓవరాల్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో దక్షిణ రైల్వే 15ఏళ్ల తర్వాత ట్రోఫీని కైవసం చేసుకుంది. 2025-26 సంవత్సరానికిగాను పురుషుల 72వ, మహిళల 11వ ఆలిండియా రైల్వేస్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నంలో జరిగాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో.. ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ (ఈసీఓఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో పోటీలు జరిగాయని, మదురై డివిజన్ స్పెషల్ ఆఫీసర్ ఆన్ డ్యూటీ ఆర్.చంద్రశేఖరన్, పెరంబూరు కార్యాలయ సూపరింటెండెంట్ కె.జగదీశన్, చెన్నై చీఫ్ టిక్కెటింగ్ ఇన్‌స్పెక్టర్ టి.ముత్తు పోటీల్లో పాల్గొన్న బృందాలకు కోచ్‌లుగా వ్యవహరించారని తెలిపింది. దక్షిణ రైల్వేలో పురుషులు 200 పాయింట్లు సాధించగా సెంట్రల్ రైల్వే పురుషులు 198 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచారని, పురుషులు మూడు స్వర్ణాలు, ఒక వెండి, మూడు కాంస్య పతకాలు సాధించారని పేర్కొంది.

ట్రోఫీతో విజేత జట్టు సభ్యులు, రైల్వే అధికారులు

తిరుచ్చిలో జంతు ప్రదర్శనశాల నిర్మాణం

కేంద్ర అనుమతి కోసం 'డీపీఆర్' సమర్పణ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చిలోని చెన్నై జాతీయ రహదారిలో సిరుగనూర్ వద్ద ఎమ్మార్‌పాళ్యం ప్రాంతంలో జంతు ప్రదర్శనశాల నిర్మాణానికి 2009లో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చెన్నై వండలూర్ జూ లాగానే వన్యప్రాణులన్నింటినీ ఒకేచోట ఉంచి ప్రజలు వీక్షించేవిధంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా పనుల కోసం సుమారు 20ఎకరాల విస్తీర్ణంలో ప్రహరీ నిర్మించారు. కానీ ఆ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. వన్యప్రాణులను తీసుకురావడంలో ఆచరణాత్మక సమస్యలు, కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందడంలో చట్టపరమైన చిక్కులు తలెత్తాయి. ఆ ప్రదేశం ఇప్పుడు ఏనుగుల పునరావాస కేంద్రంగా పనిచేస్తోంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వృద్ధ ఏనుగులను, ఒంటరి ఏనుగులను ఇక్కడికి తీసుకొచ్చి అటవీశాఖవారు సంరక్షిస్తున్నారు. సుమారు 16ఏళ్ల తర్వాత ఎమ్మార్‌పాళ్యంలో జూ పార్కు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ.120కోట్లతో వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక తయారుచేసి కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపారు.

రాష్ట్ర బీఈడీ విద్యార్థులకు న్యాయం చేయండి

కేంద్రానికి ఎంపీ విల్సన్ లేఖ

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రానికి చెందిన బీఈడీ విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని చక్కదిద్దాలంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజ్యసభ సభ్యుడు విల్సన్ కోరారు. ఈ మేరకు ఆయన రాసిన లేఖలో... రాష్ట్రానికి చెందిన బీఈడీ విద్యార్థులు ఈ ఏడాది 'స్వయం' సెమిస్టర్ పరీక్షలను 15, 16వ తేదీల్లో రాయనున్నారని తెలిపారు. తంజావూర్ జిల్లాకు చెందిన 50 మంది విద్యార్థులు సహా పలువురు తమిళనాడులోనే ఈ పరీక్షలు రాసేందుకు ఎంచుకున్నా వారికి కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని మైసూర్, మంగళూర్, బెంగళూర్ వంటి ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారని పేర్కొన్నారు. పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చర్యలు అన్యాయమని, బాధిత విద్యార్థుల విద్యా సంక్షేమానికి తీవ్రమైన చేటు కలిగిస్తుందని తెలిపారు. వందలాది కిలోమీటర్ల దూరంలోని కేంద్రాలకు ప్రయాణించడం గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కష్టమన్నారు. పరీక్షలకు కొద్దిరోజులు మాత్రమే ఉన్న నేపథ్యంలో ఇది విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేస్తుందని, ఈ అన్యాయాన్ని వెంటనే చక్కదిద్దాలని కోరారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు: ఈపీఎస్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: స్టాలిన్ ద్రావిడ మోడల్ ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి విమర్శించారు. ఆయన ఆదివారం తన ఎక్స్‌లో... కుంభకోణం సమీపం పట్టీశ్వరంలో పాఠశాల విద్యార్థుల ఘర్షణలో ప్లస్‌టూ విద్యార్థి హత్యకు గురయ్యాడని, మైలాడుదురై జిల్లా సీర్గాళిలో కూరగాయల వ్యాపారిని త్రాసుతో కొట్టి హత్య చేశారని, తెన్‌కాశి జిల్లాలో ఆస్తి వివాదంలో రైతును హత్య చేశారని, సేలంలోని తొప్పూర్ ప్రాంతంలో యువకుడిని తల నరికి హత్యచేశారని తెలిపారు. నాగర్‌కోవిల్‌లో పట్టపగలు రోడ్డుపై నడచి వెళుతున్న మహిళ వద్ద దోపిడీయత్నం జరిగిందని, వీటన్నింటిని చూస్తుంటే అసలు రాష్ట్రంలో పోలీస్ శాఖ ఉందా? అనే సందేహం కలుగుతోందన్నారు. శాంతిభద్రతలు క్షీణించడం వలన అభివృద్ధి కుంటుపడుతోందని విమర్శించారు.

చిరుతల సంచారంతో భయాందోళన

విల్లివాక్కం, న్యూస్‌టుడే: పున్‌సెయ్‌పులియంపట్టి సమీపం మారాయిపాళయంలో సంచరిస్తున్న రెండు చిరుతలను పట్టుకోవడానికి మూడు ప్రాంతాలలో అటవీశాఖ సిబ్బంది బోనులు ఏర్పాటు చేశారు. అడవి నుంచి బయటికి వచ్చిన రెండు చిరుతలు మారాయిపాళయం గ్రామంలోకి చొరబడి పశువులను చంపి తింటున్నాయి. దీంతో గ్రామస్థులు పశువులను మేతకు తోలుకెళ్లట్లేదు. రాత్రి సమయాలలో గృహ ప్రాంతాలలో చొరబడి పశువులను వేటాడుతూ పగటి పూట ఆ ప్రాంతంలోని కొండ గుహలలో దాక్కుంటున్నాయి. వాటిని కనిపెట్టడానికి అటవీ శాఖ వారు డ్రోన్లను ఉపయోగించారు. అంతేకాకుండా రెండు చోట్ల బోన్లు ఉంచారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న కొండపైన రెండు చిరుతలు కూర్చొని ఉండటాన్ని చూసిన గ్రామస్థులు అటవీశాఖ వారికి సమాచారం ఇచ్చారు. దీంతో కొండపై చిరుతలు సంచరిస్తున్న ప్రాంతంలో మరో బోను ఉంచి, 5 ప్రాంతాలలో ఆటోమేటిక్ కెమెరాలను అమర్చి పర్యవేక్షిస్తున్నారు.

అటవీశాఖవారు ఏర్పాటు చేసిన బోను

కారైక్కుడి రైల్వే స్టేషను పునరాభివృద్ధి పనులు పూర్తి

వడపళని, న్యూస్‌టుడే: మదురై డివిజన్‌లోని కారైక్కుడి రైల్వే స్టేషనులో అమృత భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద రూ.20.34 కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనులు పూర్తయ్యాయని దక్షిణ రైల్వే సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ స్టేషను రోజుకు సగటున రూ.1.8 లక్షల ఆదాయం గడిస్తోంది. 22 ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లు ఆగుతాయి. నూతన ప్రవేశ ద్వారం, స్టేషను రెండు ప్రవేశ ద్వారాల వైపు చెట్టినాడు తరహాలో రాళ్లతో పరిచిన దారి, కాలినడక పైవంతెన, అదనంగా ఆరు మీటర్ల వెడల్పుతో కూడిన కాలినడక పైవంతెన, ఏసీ వెయిటింగు హాలు, 1 నుంచి 5వ నెంబరు ప్లాట్‌ఫారాల వరకు వెళ్లడానికి వీలుగా మూడు లిఫ్టులు, దివ్యాంగులకు ప్రత్యేకించి ర్యాంపులు, అధునాతన వసతులతో కూడిన మరుగుదొడ్లు, బుకింగు కౌంటర్లు, ప్రతి ప్లాట్‌ఫారంపై తాగునీటి వసతి, పాత రేకులు తొలగించి వాటి స్థానంలో గాల్‌వాల్యూమ్ రేకులు, రైళ్ల రాకపోకలు సూచించే బోర్డులు, డిజిటల్ డిస్‌ప్లే యూనిట్లు, 200 ద్విచక్ర వాహనాలు, 26 కార్లు పార్కు చేసుకునేందుకు వసతి కల్పించారు.

స్టేషను ప్రాంగణం

'కాశీ తమిళ్ సంగమం'లో పాల్గొన్న రాష్ట్ర రచయితల బృందం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కాశీ తమిళ్ సంగమం 4వ వార్షికోత్సవాన్ని ఆదివారం కాశీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు నుంచి కాశీకి వెళ్లిన తమిళనాడు రచయితల బృందం హనుమాన్ పాటిఘాట్ ప్రాంతాన్ని సందర్శించింది. తరువాత గంగా నదిలో స్నానమాచరించింది. అనంతరం అక్కడ ఉన్న మహాకవి భారతీయార్ నివాసాన్ని సందర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భారతీయార్ రచనలను తిలకించారు. తరువాత ఆయన ఇంటికి సమీపంలో ఉన్న గ్రంథాలయాన్ని సందర్శించారు.

పురాతన మురుగన్ కాంస్య విగ్రహం లభ్యం

వేలూరు, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా నాట్రాంపల్లి సమీపం అంసాగరంబరై తాలూకాకు చెందిన తిరుపతి(41) కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం నీటి సంపు తవ్వకం పనులను ప్రొక్లెయినర్‌తో చేపట్టారు. ఐదు అడుగుల లోతులో ఏడు అంగుళాల మురుగన్ కాంస్య విగ్రహం కనిపించింది. సమాచారం మేరకు తహసీల్దార్ కాంచన అక్కడకు చేరుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అది 18వ శతాబ్దానికి చెందినదిగా గుర్తించారు.

IN THE HIGH COURT OF ANDHRA PRADESH:: AMARAVATHI, A.P
SECOND APPEAL NO.424 OF 2025
I.A.NO. 1/2025
I.A.NO. 2/2025
I.A.NO. 3/2025
Between:
S. Dhananjaya Naidu, S/o S. Venkatrama Naidu, aged about 52 years, residing plot No. 100/1, Bank of Baroda Colony, 7th Phase, 3rd Main, JP Nagar, Bangalore. ... **Petitioner**
And:
C. Rajeswari, W/o Chinnabban, aged 58 years, residing at Lathed Village, Katpadi Taluk, Vellore District, Tamilnadu.
......**Respondent**
NOTICE TO RESPONDENT
To
C. Rajeswari, W/o Chinnabban, aged 58 years, residing at Lathed Village, Katpadi Taluk, Vellore District, Tamilnadu.
Madam,
It is to bring to your notice that the above Second Appeal in **S.A.No 424 of 2025** and the miscellaneous applications therein the Honble High Court of Andhra Pradesh was pleased to direct the service of notice on you by the way of substituted service and the matter is directed to be listed on **12.12.2025**, for your appearance. Hence, file your appearance either in person or through your advocate on or before **12.12.2025 at 10.00 A.M** in the above said Second Appeal or else the matter may be heard and disposed off in your absence. Hence, this notice.
Sd/- BALAJI MEDAMALLI,
Advocate
High Court of Andhra Pradesh, Amaravati.
Place:Amaravati Date: 06.12.2025

శ్రీలంక జైలు నుంచి 31 మంది జాలర్ల విడుదల

స్వదేశానికి రాలేక ఇక్కట్లు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నాగపట్నం జిల్లా నంబియార్ ప్రాంతానికి చెందిన 11మంది, అక్కరైపేట్టైకు చెందిన ఆనందకుమార్ పడవలో 10 మంది అక్టోబర్ 30వ తేదీ, అక్కరైపేట్టైకి చెందిన రాజా పడవలో 10 మంది జాలర్లు 31వ తేదీ సముద్రంపైకి చేపల వేటకు వెళ్లారు. నవంబర్ 3న కొడియకరైకు సమీపంలో చేపలు పడుతుండగా శ్రీలంక నావికాదళం సరిహద్దులు దాటి వచ్చారని ఆరోపిస్తూ అందరినీ అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. నవంబర్ 17న కోర్టు అందరినీ విడుదల చేసింది. అయితే వారు ఇంకా రాష్ట్రానికి చేరుకోకపోవడంతో కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శ్రీలంక నుంచి భారతదేశానికి పంపడానికి భారత రాయబార కార్యాలయం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ అక్కడున్న జాలర్లు వీడియోలను కుటుంబీకులకు పంపారు. ఈ నేపథ్యంలో తమవాళ్లను వెంటనే రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో ప్రతిపక్షాలు: సీఎం స్టాలిన్

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రస్తుతం రాష్ట్రంలో దిక్కుతోచని స్థితిలో ప్రతిపక్షాలు ఉన్నాయని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. మదురైలో ఆదివారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. తప్పుడు తీర్పు ఇచ్చిన పాండ్య రాజుకి వ్యతిరేకంగా న్యాయం కోసం కన్నగి పోరాడిన గడ్డ మదురై అని, తిరుచ్చెందూర్ మురుగన్ వేల్ కోసం న్యాయం కోరుతూ కలైజ్ఞర్ పాదయాత్ర ప్రారంభించిన మట్టి మదురై అని తెలిపారు. ఎలాంటి కుట్రలనైనా డీఎంకే ఓడిస్తుందని చెప్పారు. పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఎయిమ్స్' ఇంకా మదురైకి రాలేదన్నారు. కీళడి తవ్వకాలను ఆపడానికి కేంద్ర ప్రభుత్వం యత్నించిందని, రాష్ట్రానికి నిధులు ఇవ్వడానికి నిరాకరించిందని, రాష్ట్రంపై ద్వేషంతో వ్యవహరిస్తోందని విమర్శించారు.

వేదికపైకి వస్తున్న ముఖ్యమంత్రితో కరచాలనం చేస్తున్న ప్రజలు

అది ఆధ్యాత్మికం కాదు.. రాజకీయం

క్రమక్రమంగా తిరుప్పరంకుండ్రం మురుగన్ ఆలయంలో, అదే సమయంలో ఉచ్చిపిళ్లైయార్ ఆలయ దీప మండపంలో దీపం వెలిగించి దేవాదాయ శాఖ తరఫున ఏమేం చేయాలో అన్నీ చేసినట్లు తెలిపారు. ఇవన్నీ స్థానిక ప్రజలకు, నిజమైన భక్తులకు తెలుసన్నారు. ఆధ్యాత్మికం ప్రజలను ఐక్యంగా ఉంచాలన్నారు. తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో ప్రతిపక్షాలు చేస్తున్నది కచ్చితంగా ఆధ్యాత్మికం కాదని, రాజకీయాలని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 3 వేలకి పైగా ఆలయాల్లో కుంభాభిషేకం నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పటికీ పెరియార్ వెలిగించిన సమానత్వ దీపం వెలుగుతుందని, దానిని ఆర్పడం ఎవరితరం కాదన్నారు.

పీఆర్ పాండియన్‌కు 13ఏళ్ల జైలుశిక్ష

నేడు రైతు సంఘాల ఆందోళన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎన్‌జీసీ) ఆస్తి నష్టం కేసులో తమిళనాడులోని అన్ని రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పీఆర్ పాండియన్‌కు తిరువారూర్ కోర్టు శనివారం 13ఏళ్ల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పును పలు రైతు సంఘాలు వ్యతిరేకించాయి. 2015లో తిరువారూర్ జిల్లా విక్కిరవాండిలో ఓఎన్‌జీసీ తరఫున మీథేన్ వెలికితీతకు సర్వే, అన్వేషణ పనులు జరిగాయి. ఇందుకు వ్యతిరేకంగా రైతులు నిరాహారదీక్ష, పోరాటాలు చేశారు. అప్పుడు పీఆర్ పాండియన్ తదితరులు అరెస్టయ్యారు. వారిపై ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినందుకుగాను పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత వారు బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసు విచారణ తిరువారూర్ జిల్లా కోర్టులో 10ఏళ్లుగా నడుస్తోంది. సాక్ష్యులను విచారించిన కోర్టు తీర్పుని వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో శనివారం తుది తీర్పు వెలువరించింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినందుకుగాను పీఆర్ పాండియన్‌కు 13ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు రైతుల మనోభావాలకు వ్యతిరేకంగా ఉందని, అందువలన రాష్ట్ర ప్రభుత్వ తీరుని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సోమవారం ఆందోళన నిర్వహిస్తామని, ఇందులో రాష్ట్ర రైతుల సంఘాల నిర్వాహకులంతా పాల్గొనాలని తమిళనాడు అన్ని రైతుల సంఘ సమన్వయ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దురైస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఎల్జీ కైలాష్‌నాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

నకిలీ మందుల తయారీ కేసు సీబీఐకి అప్పగించాలి

పుదువై ఎల్జీకి కాంగ్రెస్ నేతల వినతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నకిలీ మందుల తయారీ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌కు కాంగ్రెస్ నేతలు వినతిపత్రం అందజేశారు. పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు పుదుచ్చేరి ఎల్జీ కైలాష్‌నాథన్‌ని ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం నారాయణస్వామి విలేకరులతో మాట్లాడుతూ... పుదుచ్చేరిలోని చిల్లర మందుల విక్రయ కేంద్రాలలో నకిలీ మందులను గుర్తించేందుకు అర్హత ఉన్న అధికారుల కమిటీని నియమించాలని ఎల్జీని తాము కోరామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సనాతనం పేరుతో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

మంత్రి శేఖర్‌బాబు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: సనాతనం పేరుతో కొందరు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు పేర్కొన్నారు. చెన్నై మన్నడిలోని కాళికాంబాళ్ సమేత కమటేశ్వరస్వామి ఆలయ రాజగోపురాన్ని రూ.40 లక్షల వ్యయంతో ఎత్తు పెంచనున్నారు. ఇందుకుగాను పనులను ఆదివారం మంత్రి శేఖర్‌బాబు ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాది రాష్ట్రాల్లో భాజపా అనుకున్నది సాధిస్తోందని, కానీ తమిళనాడులో కులం, మతం, జాతి, భాషలకు అతీతంగా నడుచుకొనే ప్రభుత్వం ఉందన్నారు. నయినార్ నాగేంద్రన్ ఎలాగైనా రాష్ట్రంలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పగటి కలలు కంటున్నారని, అవి ఫలించవన్నారు. తమిళనాడు ద్రావిడ భూమని, ఇక్కడ మతపరమైన ఐక్యత, సామరస్యం పదిలంగా ఉన్నాయని తెలిపారు. సనాతనం ప్రజల్లో విభజన సృష్టిస్తుందని, ప్రజల మధ్య విభేదాలకు దారి తీస్తుందన్నారు. సనాతనం పేరుతో ప్రజలను విభజిస్తే దాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అడ్డుకుంటుందని పేర్కొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

పోలీసు చెయ్యి కొరికిన టీవీకే కార్యకర్త

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి జిల్లా పాలక్కోడులోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో మద్యం బార్‌తో కూడిన రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటైంది. దానిని తొలగించాలని డిమాండ్ చేస్తూ టీవీకే తరఫున ఆదివారం ఆందోళన జరిగింది. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకోవడానికి బారికేడ్లను అడ్డుపెట్టారు. వాటిని దాటుకొని క్లబ్ ముట్టడికి కార్యకర్తలు యత్నించారు. అప్పుడు అడ్డుకోబోయిన పోలీసు చేతిని ఓ కార్యకర్త కొరికాడు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో వైరలవుతోంది. ముందే టీవీకే కార్యకర్తలకు స్వీయ నియంత్రణ, క్రమశిక్షణ అవసరమని పలు రాజకీయ పార్టీలకు చెందినవారు చెబుతున్న నేపథ్యంలో ఈ సంఘటన మరోసారి చర్చనీయాంశమైంది.

పోలీసు చెయ్యి కొరుకుతున్న దృశ్యం

EENADU Classifieds
JOBS
ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషంట్స్‌ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ: 20k. ✆ 89776 39662, 89776 39663.

(c) eenadu

12న పడైయప్ప రీరిలీజ్

చెన్నై, న్యూస్‌టుడే: సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని ఇటీవల పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. రజనీకాంత్ సినీరంగ ప్రవేశ స్వర్ణోత్సవాలను జరుపుకునేలా ఆయన పుట్టినరోజైన ఈ నెల 12న బ్లాక్‌బస్టర్ చిత్రం 'పడైయప్ప'ను 4కే ప్రమాణాలతో రీరిలీజ్ చేయనున్నారు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో 1999 ఏప్రిల్ 10న తమిళ నూతన సంవత్సరాది సందర్భంగా విడుదలైన ఈ చిత్రం అప్పట్లో 200 థియేటర్లలో విడుదలై 150 రోజులకుపైగా ప్రదర్శితమై భారీ వసూళ్లను రాబట్టింది. చిత్రంలో దివంగత నటదిగ్గజం శివాజీ గణేశన్, సౌందర్య, రమ్యకృష్ణ, సెంథిల్, మణివణ్ణన్, అబ్బాస్ తదితరులు నటించారు. అరుణాచల సినీ క్రియేషన్స్ పతాకంపై కె.సత్యనారాయణ, ఎం.వి.కృష్ణారావు, కె.విట్టల్ ప్రసాద్ తదితరులు నిర్మించిన ఈ చిత్రానికి సహ నిర్మాతగా తేనప్పన్ పనిచేశారు. చిత్రానికి ఎ.ఆర్.రహమాన్ సంగీతం అందించారు.

సినిమా రీరిలీజ్ పోస్టరు

నమ్మకంతో పోరాడేవారి కోసమే హ్యాపీ రాజ్

మరియా ఇళంచెళియన్



చిత్రం టైటిల్ లుక్ పోస్టరు

చెన్నై: మరియా ఇళంచెళియన్ దర్శకత్వంలో జీవీ ప్రకాశ్‌కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రానికి 'హ్యాపీ రాజ్' టైటిల్ ఖరారు చేశారు. ఈ టైటిల్ నేపథ్యం గురించి దర్శకుడు మాట్లాడుతూ... ఇది లోతైన ఆలోచన నుంచి పుట్టిన టైటిల్ అన్నారు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టే వడపోయని ప్రతికూల భావాలతో మన సహజ జీవనంలో గందరగోళాలు పెరిగాయని తెలిపారు. అలాంటి ప్రపంచంలో చీకట్లు తొలగించి వెలుగును నింపేలా ఓ సినిమా చేయాలని భావించినట్లు పేర్కొన్నారు. చిత్రం సారంశభావాన్ని చెప్పేలా టైటిల్‌ను పెట్టామన్నారు. చిత్రంలో హ్యాపీ అనే పదం 100సార్లకుపైగా ధ్వనిస్తుందని తెలిపారు. అది పదం మాత్రమేకాదని, నమ్మకాన్ని కలిగించే ఓ తాళ లయబద్ధంతో కూడిన మంత్రమని పేర్కొన్నారు. ఈ చిత్రం సంతోషం, ఉత్సాహం, మనసుకు ప్రశాంతత కలిగిస్తుందని తెలిపారు. జీవితంలో నమ్మకంతో పోరాడేవారి కోసమే ఈ చిత్రమని, ఇందులోని సన్నివేశాలు మన జీవితంలోని సంఘటనలను స్ఫురణకు తీసుకొస్తాయని పేర్కొన్నారు. చిత్రంలో శ్రీగౌరి నాయిక. సుదీర్ఘ విరామం తర్వాత నటుడు అబ్బాస్ ఈ చిత్రం ద్వారా తమిళ చిత్రసీమలోకి పునరాగమనం చేస్తున్నారు. జార్జ్ మరియం, ప్రార్థన, అదిర్చి అరుణ్, మదురై ముత్తు, సోఫా బాయ్ రసూల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రానికి దర్శకుడే కథ రాయగా జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తున్నారు. చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు దుల్కర్ సల్మాన్ ఆదివారం సాయంత్రం విడుదల చేశారు.

వా వాత్తియార్ ట్రైలర్ విడుదల

ట్రైలర్‌లోని ఓ సన్నివేశ దృశ్యం

చెన్నై: నలన్ కుమారసామి దర్శకత్వంలో కార్తి, కృతిశెట్టి జంటగా నటించిన చిత్రం 'వా వాత్తియార్'. ఇందులో సత్యరాజ్ ప్రతినాయకుడి పాత్రను పోషించగా రాజ్ కిరణ్ ఓ కీలకపాత్రలో నటించారు. స్టూడియో గ్రీన్ నిర్మించిన ఈ చిత్రానికి సంతోశ్ నారాయణన్ సంగీతం అందించారు. ఈ నెల 5న విడుదల కావాల్సిన చిత్రం అనివార్య కారణాలతో 12కి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో చిత్రం ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. అందులో దివంగత నటుడు ఎంజీఆర్‌కు వీరాభిమానిగా, పోలీసు అధికారి యూనిఫాంతో కార్తి కనిపించే సన్నివేశాలు చోటుచేసుకున్నాయి.

12న 'లాక్‌డౌన్'...

చెన్నై: ఎ.ఆర్.జీవా దర్శకత్వంలో అనుపమ పరమేశ్వరన్ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'లాక్‌డౌన్'. కరోనా లాక్‌డౌన్ కాలంలో జరిగిన ఓ యదార్థ ఘటన ఆధారంగా రూపొందిన ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ నిర్మించింది. చిత్రానికి ఎన్.ఆర్.రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించారు. ఈ చిత్రం 5న విడుదల కావాల్సి ఉండగా భారీవర్షాల కారణంగా వాయిదా పడింది. ఈ నేపథ్యంలో 12వ తేదీ విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ తన 'ఎక్స్' పేజీలో వెల్లడించింది.

సూర్య 47వ చిత్రానికి పూజ

పూజా కార్యక్రమంలో సూర్య తదితరులు

చెన్నై: జిత్తు మాధవన్ దర్శకత్వంలో సూర్య తన 47వ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ ఓ కీలకపాత్రను పోషించనున్నట్లు, సూర్య పోలీసు అధికారి కథాపాత్రలో నటించనున్నట్లు కోలీవుడ్ సమాచారం. మలయాళం, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందనున్న ఈ సినిమా చిత్రీకరణను పూజా కార్యక్రమంతో ఆదివారం ప్రారంభించారు. చెన్నైలో జరిగిన కార్యక్రమంలో దర్శకుడు జిత్తు మాధవన్, నటులు సూర్య, నజ్రియా నజీమ్, చిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో భక్తులు

తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని ప్రసిద్ధ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు దినం కావడంతో భక్తులు భారీగా చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకం, ఆరాధనలు నిర్వహించారు. అనంతరం బంగారు కవచం, వజ్ర కిరీటం తదితరాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అఖిలాండం వద్ద భక్తులు నేతి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

అలంకరణలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

కనులపండువగా అయ్యప్పస్వామి ఊరేగింపు

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోటలోని ప్రసిద్ధ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తిక మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి అరటి మట్టలతో శబరిమలైలోని అయ్యప్ప ఆలయం, 18 మెట్లను రూపొందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకరించిన వాహనంపై స్వామివారి ప్రతిమను కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలంకరణలో మణికంఠస్వామి

'ఫ్లాగ్ డే' విరాళాల అందజేత

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఫ్లాగ్ డే సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో చెన్నై జిల్లా కలెక్టర్ రశ్మీ సిద్ధార్థ్ జగడేకు తన వంతు విరాళం అందజేశారు. దీని గురించి ఆయన తన ఎక్స్‌లో... దేశాన్ని రక్షించే సైనికుల ధైర్యసాహసాల గౌరవార్థం, ప్రాణాలను త్యాగం చేసినవారికి, వారి కుటుంబాలకు సహాయం చేయడానికి తాను విరాళం ఇచ్చినట్లు తెలిపారు. అలానే ప్రజలు మంచి మనసుతో అందించాలని కోరారు. అదేవిధంగా క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా విరాళం అందజేశారు.

హుండీలో విరాళం వేస్తున్న ఉదయనిధి స్టాలిన్

అరక్కోణం: రాణిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫ్లాగ్ డే విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ చంద్రకళ తన వంతు విరాళం అందజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న మాజీ సైనికుల కుటుంబాలకు చెందిన 615 మందికి రూ.1.19 కోట్ల విలువైన ప్రభుత్వ సంక్షేమ సాయం అందజేశారు. అనంతరం వారిని సత్కరించారు.

అరక్కోణం: మాజీ సైనికుడికి సాయం అందజేస్తున్న కలెక్టర్ చంద్రకళ

అన్బుమణిపై దిల్లీ పోలీసులకు రామదాస్ ఫిర్యాదు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: అన్బుమణిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రామదాస్ వర్గం తరఫున పీఎంకే గౌరవాధ్యక్షుడు జి.కె.మణి శనివారం దిల్లీ నగర డిప్యూటీ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు పిటిషన్ అందజేశారు. అందులో.. పీఎంకే అధ్యక్షుడిగా అన్బుమణి పదవీకాలం ముగిసిందని, అయినా ఆయన సమర్పించిన నకిలీ పత్రాల ఆధారంగా ఎన్నికల సంఘం ఆయనను అధ్యక్షుడిగా ప్రకటించిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌లోని పీఎంకే ప్రధాన కార్యాలయం చిరునామాను కూడా అన్బుమణి నకిలీ పత్రాల ద్వారా మార్చారని తెలిపారు. కావున ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరపాలని కోరారు. అన్బుమణిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తోందని, అందువలన ఈ కేసును కూడా సీబీఐకి అప్పగించాలని పేర్కొన్నారు.

● అనంతరం జీకే మణి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఐదు నెలలుగా ఎన్నికల కమిషన్‌కు తమ వైపు నుంచి ప్రామాణిక పత్రాలను అందజేసినా రామదాస్‌కు ద్రోహం చేసిందని ఆరోపించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు కూటమి చర్చలు రామదాస్ నిర్వహిస్తారని తెలిపారు. పార్టీలో ప్రస్తుత సమస్య, గుర్తుకు సంబంధించి న్యాయశాఖను సంప్రదించాలా? వద్దా? అని తాము వెంటనే నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

పరువు నష్టం దావా వేస్తాం

పీఎంకే అన్బుమణి వర్గం ప్రతినిధి బాలు చెన్నైలో విలేకరులతో మాట్లాడుతూ.. అన్బుమణి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జీకే మణి ఎటువంటి ఆధారం లేకుండా దిల్లీ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని విమర్శించారు. పీఎంకేను హస్తగతం చేసుకోవాలనే ఉద్దేశంతో జీకే మణి, ఆయన కుమారుడు పనిచేస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, అన్బుమణికి బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలిపారు. లేకుంటే తాము పరువు నష్టం కేసు వేస్తామన్నారు.

అపహరణకు గురైన బాలికను రక్షించిన పోలీసులు

ప్యారిస్, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌కి చెందిన రంజన్, ముస్కాన్ దంపతులకు మూడేళ్ల కుమార్తె ఉంది. వీరు నాగర్‌కోవిల్‌లోని ఆలయం ముందు బెలూన్లు విక్రయిస్తుంటారు. ఇదిలా ఉండగా సొంతూరికి వెళ్లేందుకు శనివారం సాయంత్రం నాగర్‌కోవిల్ రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. అప్పుడు స్టేషన్ ముందు కూర్చున్న వారి వద్దకి వచ్చిన ఓ వ్యక్తి.. వారి కుమార్తెకి తినుబండారాలు కొనిస్తానని చెప్పి తీసుకెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో రంజన్ రైల్వే పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి వడచేరి బస్టాండు వద్ద ఉన్న యోగేష్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. బాలికను కిడ్నాప్ చేసిన మూడు గంటల్లోనే పోలీసులు గుర్తించి రక్షించారు.

బాలికను కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్న దుండగుడు (సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం)

యూట్యూబర్‌ను అరెస్టు చేయాలని ఆందోళన

పొన్నేరి, న్యూస్‌టుడే: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కామరాజర్‌ను విమర్శిస్తూ యూట్యూబర్ ముక్తార్ అహ్మద్ ఇటీవల ఓ వీడియో పోస్ట్ చేశారు. ఇందుకు నిరసనగా పొన్నేరిలో నాడార్లు ఆదివారం ఆందోళన చేపట్టారు. ముక్తార్ అహ్మద్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఆక్రమణల తొలగింపు

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సాయిబాబా నగర్‌లోని రెండో వీధిలో చెరువు కాలువపై ఉన్న ఆక్రమణలు, రోడ్డును ఆక్రమించి నిర్మించిన భవనాలను రెవెన్యూశాఖ అధికారులు ఆదివారం పోలీసుల భద్రత నడుమ ప్రొక్లెయినర్ల సాయంతో తొలగించారు. ఆక్రమణలతో రోడ్డు ఇరువైపులా కుచించుకుపోయి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

సంక్షేమ సాయం పంపిణీ

కాంచీపురం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని కాంచీపురం సమీపం చెవిలిమేడులో శనివారం సాయంత్రం జిల్లా ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమశాఖల తరఫున తాయుమానవన్ పథకం కింద లబ్ధిదారులకు సంక్షేమ సాయం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కలైసెల్వి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి ఆర్.గాంధీ 1,327 మంది లబ్ధిదారులకు రూ.22.86 కోట్ల విలువైన సాయం పంపిణీ చేశారు.

భగవద్గీత పోటీల్లో విజేతలకు బహుమతులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ ప్రచార పరిషత్ తరఫున చెన్నై టీనగర్ వెంకట నారాయణ రోడ్డులోని తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు శ్రీమద్ భగవద్గీత పోటీలు నిర్వహించారు. సూపరింటెండెంట్ సుమతి, తితిదే స్థానిక పాలకమండలి మాజీ ఛైర్మన్ అనిల్ కుమార్‌రెడ్డి, తితిదే బోర్డు సభ్యుడు శ్రీనివాసరెడ్డి విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. 10 మంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పోటీలలో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెరియపాళ్యం: తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీపం పులియూరుకండ్రిగకు చెందిన వెంకటేశన్(55) రైతు. ఈయన తన పొలంలో ఆదివారం ఉదయం ట్రాక్టరుతో దుక్కి దున్నుతుండగా పైన వేలాడుతున్న విద్యుత్తు తీగ తెగి మీదపడింది. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. 2 ఆవులు కూడా మృత్యువాతపడ్డాయి. వెంగల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశన్ (పాతచిత్రం)

క్రైం కార్నర్

మరో ఘటనలో 17ఏళ్ల బాలిక...

విల్లివాక్కం: కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణం టీఎన్‌హెచ్‌బీ నివాస ప్రాంతానికి చెందిన తిరుపతి కుమార్తె తులసి(17) స్థానికంగా ఉన్న ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతోంది. శనివారం తులసి వంట గదిలో పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు కావేరిపట్టణం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత దాడిలో బాలుడు...

ట్రిప్లికేన్: కోయంబత్తూరు జిల్లా పొళ్లాచ్చి సమీపం వాల్‌పారైలోని ఓ ప్రైవేటు తేయాకు ఎస్టేట్‌లో కార్మికులకు నాలుగు ఇళ్లతో కూడిన క్వార్టర్స్ నిర్మించారు. ఇందులో అసోం రాష్ట్రానికి చెందిన రాజ్‌పుల్ అలీ, షాజిత దంపతులు ఉంటూ తోటలో పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి వీరి కుమార్తె, ఇద్దరు కుమారులు ఇంటి ముందు ఆడుకుంటుండగా అక్కడకు వచ్చిన చిరుత ఐదేళ్ల బాలుడు సైపుల్ ఆలంను తోటలోకి లాక్కెళ్లింది. పిల్లల కేకలు విన్న స్థానికులు అక్కడకు చేరుకుని తేయాకు ఎస్టేట్ అధికారికి విషయం తెలియజేశారు. ఆయన సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తోటలోని చెట్ల పొదలో బాలుడి మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టానికి తరలించారు.

సైఫుల్ ఆలం (పాతచిత్రం)

గుండెపోటుతో వ్యాహ్యాళి చేస్తున్న వృద్ధుడు...

వడపళని: చెన్నై అడయార్ ప్రాంతానికి చెందిన ఏకే సిరాజ్(85) ఆదివారం ఉదయం థియోసాఫికల్ సొసైటీలో వ్యాహ్యాళికి వెళ్లారు. నడుస్తుండగా ఉన్నట్టుండి స్పృహకోల్పోయి పడిపోయారు. తోటివారు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. శాస్త్రి నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు కంచెలో చిక్కుకుని ఏనుగు...

విల్లివాక్కం: ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల అభయారణ్యం సమీపంలోని పెరుంబళ్లం డ్యామ్ పక్కనున్న అటవీ ప్రాంతం నుంచి శనివారం ఓ ఏనుగు బయటకు వచ్చింది. పంట పొలంలోకి చొరబడటానికి యత్నించింది. ఈ క్రమంలో విద్యుత్తు కంచెలో చిక్కుకొని విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయింది. సమాచారం మేరకు సత్యమంగళం అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని పొలాన్ని కౌలుకు తీసుకున్న రైతు పెరియముత్తాన్(75)ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఏనుగు కళేబరం

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

20 మందికిపైగా తీవ్రగాయాలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. తిరువారూర్ జిల్లా తిరుత్తురైపూండి నుంచి మన్నార్‌కుడికి ప్రయాణికులతో ఓ ప్రభుత్వ బస్సు బయల్దేరింది. అదే విధంగా మన్నార్‌కుడి నుంచి తిరుత్తురైపూండికి ప్రైవేట్ బస్సు బయలుదేరింది. ఈ రెండు బస్సులు కొట్టూర్ ప్రాంతంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో రెండు బస్సుల్లో ఉన్న 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనాస్థలిలో వాహనాలు

వైద్యుల నిర్లక్ష్యంతో బాలుడు మృతిచెందాడని తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: టీకా వేయడంతో మూడు నెలల చిన్నారి మృతి చెందిందని కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేసిన ఘటన పుదుచ్చేరిలో చోటుచేసుకుంది. పుదుచ్చేరి నొట్టపాక్కం సమీపంలోని ఎరిపాక్కం పుదుకాలనీకి చెందిన అరుణ్ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈయనకు భార్య నదియా, మూడు నెలల అనుష్ అనే కుమారుడున్నాడు. ఇదిలా ఉండగా గత 4వ తేదీ నొట్టపాక్కం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిశువుకు రెండో టీకా వేయించారు. అప్పటి నుంచి చిన్నారికి జ్వరం వస్తూ అనారోగ్యానికి గురైంది. తల్లిదండ్రులు నొట్టపాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేసిన నర్సు పాలు ఇవ్వాలని చెప్పి పంపించేశారు. ఇంటికి తీసుకొచ్చి పాలిచ్చిన కాసేపటికే బాలుడికి శ్వాస సమస్య తలెత్తింది. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. ఫిర్యాదు నిమిత్తం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యులు, నర్సులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే చిన్నారి చనిపోయినట్లు ఆరోపిస్తూ కుటుంబీకులు, బంధువులు మడుకరై-పుదుచ్చేరి రోడ్డులో శనివారం సాయంత్రం ఆందోళన చేశారు.

పాఠశాలలో చోరీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు సమీపం వయలూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంది. ప్రధానోపాధ్యాయుడు దగ్గరుండి కూలీలతో ఆదివారం కంప్యూటర్ గదిని శుభ్రం చేయించారు. అప్పుడు 2 కంప్యూటర్లు, 2 సీపీయూలు, కీబోర్డులు కనిపించలేదు. హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు మప్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోవై సామూహిక అత్యాచారం కేసు నిందితులు ముగ్గురిపై గూండా చట్టం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసులో అరెస్టైన ముగ్గురు నిందితులపై గూండా చట్టం ప్రయోగించారు. పోలీసుల కథనం మేరకు... కోయంబత్తూరు విమానాశ్రయం సమీపంలో కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన కేసులో శివగంగైకు చెందిన సతీశ్, కాళీశ్వరన్, తవశి అనే వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరు సెంట్రల్ జైలులో ఉన్న ముగ్గురిపై 50 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులపై తిరుప్పూర్, కోయంబత్తూరులోని వివిధ పోలీసు స్టేషన్లలో హత్యాయత్నం, చోరీ, దోపిడీ తదితర కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేర చరిత్ర ఉన్న ముగ్గురిపై గూండా చట్టం కింద చర్యలు చేపట్టాలని కోయంబత్తూరు నగర పోలీసు కమిషనర్ శరవన సుందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమేరకు ఉత్తర్వు కాపీలను కోయంబత్తూరు సెంట్రల్ జైలు అధికారులకు పంపారు.



నిందితులు తవశి, కాళీశ్వరన్, సతీశ్

పోక్సో కేసులో ఆటో డ్రైవరు అరెస్టు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీపం పుళల్ ప్రాంతానికి చెందిన 15ఏళ్ల బాలిక చెన్నై అన్నానగర్‌లోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈమె శనివారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత కదిర్‌వేడు వంతెనపై నడుచుకుంటూ వెళ్తుండగా ఓట్టేరికి చెందిన ఆటో డ్రైవర్ చిన్నతంబి లైంగికంగా వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పుళల్ మహిళా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని పోక్సో చట్టం కింద ఆదివారం అరెస్టు చేశారు.

దిల్లీ ప్రత్యేక ప్రతినిధి ఇంట్లో చోరీ కేసులో నలుగురు...

ఆర్కేనగర్: రాష్ట్ర ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయన్ ఇంట్లో చోరీ చేసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తంజావూర్ శేఖరన్ నగర్‌లోని ఏకేఎస్ విజయ్ నివాసంలో గత వారం 87 సవర్ల నగలు చోరీ అయ్యాయి. దీంతో ఆరు ప్రత్యేక పోలీసు బృందాలు నిందితుల కోసం గాలింపు చేపట్టాయి. ఈ నేపథ్యంలో ధర్మపురికి చెందిన ఒకే కుటుంబానికి చెందినవారు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ధర్మపురికి వెళ్లి ముహ్మద్ యూసఫ్ కుమారులు సాధిక్ బాషా, మెయిదీన్, ఆయిషా ప్రవీణ్, ఫాతిమా రాహుల్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 87 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు షాజహాన్ కోసం గాలిస్తున్నారు.

అరెస్టయిన నిందితులు

బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తి...

ఆర్కేనగర్: బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి పెళ్లి చేసుకొని కాపురం చేస్తున్న 45ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. తిరుచ్చి జిల్లా మణప్పారై సమీపంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. భార్యాభర్తలు ప్రైవేట్ తేయాకు ఎస్టేట్‌లో కూలీలు. ఇదిలా ఉండగా గత ఆగస్టు 20న వారి పెద్ద కుమార్తె 17ఏళ్ల బాలిక అదృశ్యమైంది. పలుచోట్లు వెతికినా కనిపించలేదు. ఫిర్యాదు నిమిత్తం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో.. సెంబ్రాన్‌కుళానికి చెందిన రైతు తొప్పదియాన్ (45) బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి పెళ్లి చేసుకొని కాపురం చేస్తున్నట్లు తెలిసింది. బాలికను కాపాడిన పోలీసులు పోక్సో చట్టం కింద తొప్పదియాన్‌ని శనివారం అరెస్ట్ చేశారు.

లంచం తీసుకున్న వీఏవో...

విల్లివాక్కం: కరూర్ జిల్లా మహానందపురానికి చెందిన వీరమ్మాల్ ఇటీవల మృతి చెందారు. ఆమె కుమారుడు సతీష్‌కుమార్ వారసత్వ ధ్రువపత్రం కోసం గత వారం మహానందపురం నార్త్ వీఏవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు విధులలో ఉన్న వీఆర్‌వో ప్రభు(46) రూ.3 వేలు లంచం అడిగాడు. దీంతో సతీష్‌కుమార్ అవినీతి నిరోధకశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు శనివారం సతీష్‌కుమార్ వీఏవో ప్రభుకి రసాయం పూసిన కరెన్సీ నోట్లు ఇస్తుండగా అక్కడే పొంచి ఉన్న అనిశా అధికారులు ప్రభుని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు.

యువకుడి దారుణహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా కంబిలియంబట్టికి చెందిన పళనిసామి మంగళపట్టిలో రైస్ మిల్లు నిర్వహిస్తున్నారు. ఈయన కుమారుడు సూర్య(27) తండ్రికి సాయంగా మిల్లు పనులు చూసుకుంటున్నాడు. ఇదిలా ఉండగా కరునాచ్చికుళం ప్రాంతంలో ఆదివారం ఉదయం సూర్య హత్యకు గురై కనిపించాడు. తలపై బండరాయితో కొట్టినట్లు ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. శనివారం రాత్రి 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సూర్య తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం హత్యకు గురైనట్లు గుర్తించారు.

తిరుచ్చి విమానాశ్రయంలో విదేశీ పక్షుల స్వాధీనం

వడపళని, న్యూస్‌టుడే: తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి నవంబరు 25న బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుల వద్ద కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఓ ప్రయాణికుడి వద్దనున్న రెండు బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించి విదేశీ పక్షులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒక అల్బినో రకూన్, 6 పిగ్మీ మార్మో సెట్స్, 6 తెల్ల మెడ గల మైనాలు, ఒక సులవేసి మైనా, 4 పసుపు ముఖంతో కూడిన మైనాలు (మృతి చెందాయి) ఉన్నాయి. నిందితుడిని అరెస్టు చేసి బతికి ఉన్న పక్షులను తిరిగి వాటి స్వస్థలానికి తరలించినట్లు అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

చనిపోయి ఉన్న మైనాలు

మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జీఎస్టీ కమిషనరు కార్యాలయంలో అగ్నిప్రమాదం

ప్యారిస్: చెన్నై అన్నానగర్‌లోని జీఎస్టీ కమిషనరు కార్యాలయంలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రమాదం ఏర్పడి పైఅంతస్తులకు మంటలు వ్యాపించాయి. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

ఈనాడు
ఏలూరు
సోమవారం డిసెంబరు 8, 2025

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 86 మంది గైర్హాజరు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని 12 కేంద్రాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)ను ఆదివారం నిర్వహించారు. మొత్తం 2,654 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 2,568 మంది హాజరయ్యారు. మిగతా 86 మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఎక్కడా చూచిరాత కేసు నమోదు కాలేదని ఆమె పేర్కొన్నారు.

నేడు యథావిధిగా 'మీ కోసం'

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. 'మీ కోసం' వినతుల పరిష్కార స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నేరాల కట్టడి.. అక్రమ రవాణా నిరోధానికి ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు సరిగాలేని వాహనాలకు ఈ-చలానా ద్వారా అపరాధ రుసుము విధించారు. ట్రాఫిక్ నిబంధలనపై చోదకులకు అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకొని వివరాలు తెలుసుకున్నారు.

ఫలితం పదింతలు పెరగాలని

సెలవు రోజు కూడా మధ్యాహ్న భోజనం



యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ	09	629
జిల్లా పరిషత్తు	189	10,432
పురపాలక	07	826

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటికే పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పునశ్చరణ తరగతులతో మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో.. ఇప్పటి వరకు పాఠశాల జరిగిన రోజున మాత్రమే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టేవారు. సెలవు రోజున కూడా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం పదో తరగతి విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహించాలి. అయితే విద్యార్థులు సెలవు రోజున కూడా తరగతులకు వస్తున్నందున మధ్యాహ్నం భోజనం పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అక్కడే భోజనం ఉంటుంది కాబట్టి వారికి ఇబ్బంది లేదు.

తర్వాత రోజు మెనూ ప్రకారం.. పాఠశాలకు సెలవు తర్వాత రోజు పెట్టాల్సిన మెనూ ప్రకారం పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఉన్నత పాఠశాలలకు శనివారం ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో పది విద్యార్థులు ఇబ్బంది పడకుండా సెలవు వచ్చిన రోజున కూడా మధ్యాహ్నం భోజనం సమస్య తీరనుంది. ఈ విషయమై కొయ్యలగూడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ.. ఉత్తర్వులు వచ్చాయి. వెంటనే అమలుకు చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు.

బంధువులన్నా పంపొద్దు.. బంధనంలో చిక్కొద్దు

కైకలూరు పరిసరాల్లోని ఓ వసతి గృహంలో ఉంటూ బాలిక చదువుతుండేది. ఆమె వద్దకు వరుసకు సోదరుడైన యువకుడొచ్చి మాట్లాడి వెళ్తుండేవాడు. ఓ రోజు వసతి గృహం నుంచి బయటకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మరో ఇద్దరితో కలిసి బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో.. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మా చుట్టాల అమ్మాయే.. సమీప బంధువే.. వరుసకు మామనే.. పాపను మాతో పంపండంటూ కొందరు వసతి గృహాల్లోని బాలికలను తీసుకెళ్తున్నారు. బయటకెళ్లాక.. వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని వసతి గృహాల్లో ఉంటున్న బాలికలపై ఇలాంటి ఘటనలు గతంలో తరచూ చోటుచేసుకునేవి. అలాంటివి మళ్లీ జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఏలూరు గ్జేవియర్‌నగర్‌లోని బీసీ వసతి గృహం-2 వద్ద సీసీ కెమెరాల మానిటర్

కొరవడిన నిఘా.. ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఎక్కడా అమలు చేయటం లేదు. బుట్టాయగూడెంలోని ఓ వసతి గృహంలో విద్యార్థిని సమాచారం ఇవ్వకుండా బయటకెళ్లిపోయింది. అక్కడ సీసీ కెమెరాల పర్యవేక్షణ లేకపోవడంతో.. ఎవరొచ్చారు? ఎప్పుడు తీసుకెళ్లారన్న వివరాలు తెలుసుకోలేక పోయారు. ఈ ఘటన తర్వాత అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులు హడావుడి చేసినా, ఆ ప్రక్రియ ఎక్కడా పూర్తి చేయలేదు.

నిబంధనలివీ.. విద్యాసంస్థల్లో బాలికల భద్రతకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. వసతి గృహాల్లోని బాలికలను ఇళ్లకు తీసుకెళ్లాలన్నా.. సెలవు రోజుల్లో బయటకు పంపాలన్నా తల్లిదండ్రులే రావాలి. ఒక్కోసారి బంధువులొచ్చి మాట్లాడి వెళ్లడానికి తల్లిదండ్రులు ముందస్తుగా వారి వివరాలు అధికారులకివ్వాలి. వచ్చిన వారి వివరాలు, సంతకం మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఈ తరహా నిబంధనలు చాలాచోట్ల పాటించడం లేదు.

ప్రశ్నార్థకంగా వసతి గృహాల్లోని బాలికల భద్రత

తండ్రొచ్చినా.. కలెక్టర్ ఆదేశానుసారం బాలికల వసతి గృహాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి నాగరాణి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విష్ణుమోహన్ రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులు కలిసొచ్చినా, కేవలం తల్లి వచ్చినా బాలికను పంపాలని.. తండ్రి ఒక్కరే వస్తే పంపించొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

వానొస్తే నిండి.. ఎండొస్తే ఎండి..

మండవల్లి, న్యూస్‌టుడే: కొల్లేరును ప్రస్తుతం పూడిక భయపెడుతోంది. వరదల సమయంలో వచ్చే ఒండ్రు మట్టి, ఇసుకతో నిండిపోతోంది. కొల్లేరులో వరద నీటికి ప్రధాన కారణమైన బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, చంద్రయ్య, పోల్‌రాజ్ డ్రెయిన్లతోపాటు మరో 36 అంతర్గత డ్రెయిన్ల ద్వారా భారీ ఎత్తున వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. మరోపక్క సరస్సులో సహజసిద్ధంగా పెరుగుతున్న గుర్రపు డెక్క, కిక్కిస, తూడు, రాక్షస గడ్డి మొక్కలు కుళ్లిపోయి పూడిక పెరుగుతోంది.

ఎండిపోయి పూడికతో కనిపిస్తున్న కొల్లేరు (జూన్ నెలలో తీసిన చిత్రం)

అక్టోబర్‌లో వచ్చిన వరద నీటిలో పెనుమాకలంక రోడ్డు

పదేళ్లలో ఒక్కసారి కూడా.. కొల్లేరులోని అంతర్గత డ్రెయిన్లు పూర్తిగా పూడిపోయాయి. పదేళ్లలో ఒక్కసారి కూడా వీటిలో పూడిక తీయలేదు. కనీసం పెదఎడ్లగాడి నుంచి సర్కార్ కాలువ వరకు ఉన్న 16 కి.మీ., పూడిక తీస్తే కొంత వరకు వరద ముంపు తగ్గుతుంది. దీనిపై ఇప్పటికే ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అసెంబ్లీలో ప్రస్తావించారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

తగ్గుతున్న నీటి నిల్వ.. కొల్లేరులోనూ పూడిక పెరిగిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం ఏటికేడు తగ్గిపోతోంది. దీనివల్ల సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఒకేసారి వచ్చే నీటిని ఇముడ్చుకోలేక పోవడంతో గ్రామాలతోపాటు రహదారులన్నీ వరద నీటితో నిండిపోతున్నాయి. జనవరి, ఫిబ్రవరి నాటికి పూర్తిగా ఎండిపోయి నెర్రెలు తీస్తోంది. ఐదేళ్లలో పది సార్లు కొల్లేరు వరదల కారణంగా లంక గ్రామాలకు రహదారులు తెగిపోయాయి.

జీవులపై ప్రభావం.. పూడికతో కొల్లేరులో అనుకున్న స్థాయిలో నీరు లేకపోవడంతో సంతానోత్పత్తికి వచ్చే అరుదైన పక్షులకు ఇక్కడ నీరు, ఆహారం, గూడ కరవైంది. జిల్లాలో 77,138 వేల ఎకరాల్లో ఉన్న కొల్లేరు 3లక్షలపైగా 166 రకాల పక్షులకు, 128 రకాల చేపలకు నెలవు. 3లక్షల వరకు ఉన్న మత్స్యకారుల్లో 30శాతం ఉపాధి కరువై ఇతర రాష్ట్రాలకు వలసల బాట పడుతున్నారు. 'కొల్లేరు పరిస్థితిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం' అని మురుగునీటి పారుదలశాఖ కైకలూరు డీఈ రామకృష్ణ తెలిపారు.

రైతు బజారు.. తీరు బేజారు!

→ నియోజకవర్గ కేంద్రం ఉంగుటూరులో రూ.10 లక్షలతో.. సుమారు పది దుకాణాలతో మినీ రైతు బజారు నిర్మించారు. దీన్ని గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో.. అక్కడ దుకాణాల ఏర్పాటుకు రైతులు, వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రతి సోమవారం సంత నిర్వహించుకోవాల్సి వస్తోంది.

పరిశీలన

ఉంగుటూరు, కొయ్యలగూడెం గ్రామీణ, పెదపాడు- న్యూస్‌టుడే: రైతులే తమ పంట ఉత్పత్తులు విక్రయించుకోవాలి.. వినియోగదారులు నాణ్యమైన ఉత్పత్తులు కొనుక్కోవాలి.. విక్రేతలు, కొనుగోలుదారులు ఇద్దరూ లబ్ధి పొందాలన్న సదుద్దేశంతో.. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రైతు బజార్లు ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.కోట్లు కేటాయించింది. 2019లో వైకాపా అధికారంలోకి రావడంతో.. వాటి నిర్వహణ గాలికి వదిలేసింది. ఫలితంగా రైతుబజార్ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు పెరిగిపోయి కనిపిస్తున్నాయి. మండల కేంద్రాల్లో రైతు బజార్లు అందుబాటులో లేకపోవడంతో.. ప్రజలు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కూరగాయలు కొనుగోలు చేసి.. చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తోంది.

పెదపాడులో బస్టాండు సమీపంలో రూ.10 లక్షలతో రైతు బజారు ఏర్పాటు చేశారు. దీన్ని పట్టుమని పది రోజులు కూడా వినియోగించ లేదు. ప్రస్తుతం పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. రాత్రివేళ మందుబాబులు అడ్డాగా చేసుకొని.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

కొయ్యలగూడెంలో సంత మార్కెట్ ఆవరణలో.. తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షలతో ఎనిమిది దుకాణాలతో మినీ రైతు బజారు నిర్మించారు. లబ్ధిదారులను ఎంపిక చేసి గదులు కేటాయించారు. వారు దుకాణాల ఏర్పాటుకు ముందుకు రాకపోవడంతో.. నిరుపయోగంగా మారింది.

మొత్తం 34 మండలాల్లో.. ఉమ్మడి జిల్లాలో 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో 34 మండలాల్లో మినీ రైతు బజార్ల ఏర్పాటుకు 12 సెంట్ల చొప్పున స్థలాలు సేకరించారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు కేటాయించారు. అన్ని చోట్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వాటిల్లో సింహభాగం రైతు బజార్లు వినియోగానికి దూరంగా ఉంటున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయ లోపంతో.. ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

అవగాహన కల్పిస్తున్నాం

మినీ రైతు బజార్లను వినియోగంలోకి తెచ్చేందుకు ఉద్యాన అధికారులతో కలిసి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. స్థానిక ఏఎంసీల కార్యదర్శులకు చెబుతున్నాం. ప్రధాన కూడళ్లకు దూరంగా ఉండటంతో వ్యాపారం సాగడం లేదని రైతులు ఆసక్తి చూపడం లేదు.

- శ్రీనివాస్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

గోదావరిలో పెరిగిన వరద

కోతకు గురవుతున్న ఒడ్డు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: గోదావరిలో నీటి మట్టం ఆరు రోజులుగా పెరుగుతూనే ఉంది. ఓ వైపు సీలేరు నది.. మరో వైపు పోలవరం ప్రాజెక్టు దిగువ కాఫర్ డ్యాం సమీపంలో పనులు జరుగుతున్న నేపథ్యంలో వరద పెరిగింది. దీంతో కాకిసనూరు, టేకుపల్లి ఒడ్డున వేసిన బొబ్బర పంటలు కొంత మేర నీట మునిగాయి. గోదావరి ఇసుక మేటల వద్ద ఏర్పాటు చేసిన ఇంజిన్లను రైతులు ఒడ్డుకు చేర్చుకున్నారు. ఎగపోటు ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గోదావరి ఒడ్డు కోతకు గురవుతోంది. కట్కూరు, కోయిదా, తాట్కూరుగొమ్ము మెట్ల రేవులు కొంత మేర నీటమునిగాయి.

నేడు గిరిజనుల సంప్రదాయ క్రీడా పోటీల ఎంపికలు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: పీసా మహోత్సవంలో భాగంగా శాప్ ఆధ్వర్యాన గిరిజనులకు సోమవారం సంప్రదాయ క్రీడా పోటీల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ తెలిపారు. కేఆర్‌పురంలోని ఐటీడీఏలో పీసా రన్ మారథాన్ 21.5 కిలోమీటర్లు, కబడ్డీ, ఆర్చరీ- రకవర్, గిల్లి దండ విభాగాల్లో పోటీలుంటాయన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, పోలవరం, వేలేరుపాడు మండలాల్లో పద్దెనిమిదేళ్లు నిండిన యువత పాల్గొనవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 83318 73037, 83338 19912 నంబర్లను సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ప్రకృతి ఒడిలో పర్యాటకం

కొరుటూరు వద్ద గుడారాలు పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి

పోలవరం, న్యూస్‌టుడే: పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పాపికొండల్లో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉంగుటూరు మండలం గొల్లగూడెం పర్యటనలో అటవీశాఖ సీసీఎఫ్‌కు సూచించారు. దానిపై ఏలూరు జిల్లా అటవీ శాఖాధికారి సందీప్‌రెడ్డి రెండు రోజుల పాటు కొరుటూరు కాటేజ్‌ల వద్ద మకాం వేశారు. అక్కడ ఉన్న ఉడెన్ కాటేజ్‌లు, వెదురు గుడారాలను పరిశీలించారు. పర్యాటకులకు ట్రెక్కింగ్‌కు అనువైన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. శిరివాక సమీపంలో ప్రవహిస్తున్న కొండవాగుపై చెక్‌డ్యామ్ నిర్మించాలని సిబ్బందికి సూచించారు. గతంలో నిర్మించిన అటవీశాఖ భవనాలను పరిశీలించారు. గెడ్డపల్లి వద్ద ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని తనిఖీ చేశారు. శుక్రవారం రాత్రి పోలవరం నుంచి బయలుదేరిన డీఎఫ్‌వో అర్ధరాత్రి కావడంతో కన్నాపురంలో బస చేసి శనివారం తెల్లవారుజామున రోడ్డు మార్గంలో బయలుదేరి పాపికొండల అభయారణ్యం పరిశీలించి కొరుటూరు కాటేజ్‌ల వద్ద రాత్రి బసచేశారు. తిరిగి ఆదివారం సాయంత్రానికి అటవీశాఖ బోటుపై బయలుదేరి పోలవరం చేరుకున్నారు. డీఎఫ్‌వో సమగ్ర నివేదిక సీసీఎఫ్‌కు అందజేస్తారని పోలవరం రేంజర్ ఎస్కే వలీ చెప్పారు. ఆయన వెంట సబ్ డీఎఫ్‌వో వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఉన్నారు.

పులుల గణనపై ఆరా

పోలవరం, న్యూస్‌టుడే: పులుల గణన కోసం పాపికొండల అభయారణ్యంలో బస చేసిన ప్రపంచ వన్యప్రాణి విభాగం నుంచి వచ్చిన బృందాన్ని జిల్లా అటవీ శాఖాధికారి సందీప్‌రెడ్డి ఆదివారం కలిశారు. ఆరుగురు సభ్యులతో కూడిన ఈ బృందం రెండు రోజులుగా కొరుటూరు వద్ద మకాం వేసినట్లు రేంజర్ ఎస్కే వలీ తెలిపారు. పోలవరం రేంజి పరిధిలోని పది బీట్‌లలో వీరు పులుల గణన మూడ్రోజుల పాటు నిర్వహిస్తారన్నారు. ప్రతి బీట్‌లో రెండు కిలోమీటర్ల పొడవు.. మీటర్ వెడల్పున బాట వేసి.. దాని వెంబడి రెండువైపులా జంతువులు వదిలివేసిన ఆనవాళ్లు సేకరించనున్నారు. అడవుల్లో పెరిగే అరుదైన వృక్షజాతి మొక్కలను వారు గుర్తిస్తారని తెలిపారు.

నిరీక్షించి.. నీరసించి

అల్పాహారం, పాల సరఫరా ఆపేసిన ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి దర్శన క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులకు అల్పాహారం, చిన్నారులకు పాలు ఇచ్చే కార్యక్రమాన్ని ఆలయ అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. స్వామి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా దూర ప్రాంతాల భక్తులు ఏమీ తిన్నకుండా వస్తుంటారు. వీరిలో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఆకలితో ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో ఆలయ అధికారులు గతంలో అల్పాహారం అందించేవారు.

క్యూకాంప్లెక్స్‌లో భక్తులు

తరచూ ఎవరో ఒకరు.. గత నెల 1న విజయవాడకు చెందిన భక్తురాలు కల్యాణి తన కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనానికి వచ్చారు. ఒక్కసారిగా అస్వస్థతకు గురై పడిపోవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇలా చెబుతూ పోతే అనేక మంది తినక నీరసం వచ్చి అస్వస్థతకు గురవుతున్నారు. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పుడు ఇవ్వకపోవడంపై నిరాశ.. రాజమహేంద్రవరం నుంచి సంజు అనే భక్తుడు తన బంధువులు 14 మందితో కలిసి ఆదివారం శ్రీవారి దర్శనానికి వచ్చారు. ఇందులో ముగ్గురు చిన్నపిల్లలు, ఒక వృద్ధురాలు ఉన్నారు. ఉచిత దర్శనం కోసం శ్రీవారి క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్నారు. ఎంత సమయం ఉన్నా.. దేవస్థానం అధికారులు అల్పాహారం, చిన్నారులకు పాలు ఇవ్వలేదు. గతంలో ఈ సౌకర్యాలు ఉండేవి.. ఇప్పుడు లేకపోవడంతో నిరాశ చెందారు.

'శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో కూడా అల్పాహారం, చిన్నారులకు పాలు అందించేలా చర్యలు తీసుకుంటాం.' అని ఈవో మూర్తి తెలిపారు.

మేళంతో తీసుకొచ్చి.. మేడలో కొలిచి!

పడమర వీధిలో..

తూర్పు వీధిలోని మేడలో..

ఏలూరు నగరంలో గంగానమ్మ జాతర కనులపండువగా సాగుతోంది. తూర్పు వీధి, పడమర వీధి, దక్షిణపు వీధి, పవరుపేట ప్రాంతాల్లో ఆదివారం అమ్మవార్లను మేడల్లో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా స్నాన మహోత్సవం, నైవేద్యాల సమర్పణ, సారె అందజేత తదితర కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. గంగానమ్మ, ఆదిమహాలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజుబాబులను వేలాదిగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మేడల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన వివిధ దేవతామూర్తుల ప్రతిమలు ఆకట్టుకున్నాయి. కళా వేదికలపై సంకీర్తనల ఆలాపన అలరించింది. ఏర్పాట్లను జాతర కమిటీల సభ్యులు పర్యవేక్షించారు. **- న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం**

నేత్రపర్వం.. శివ కల్యాణం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శ్రీభ్రమరాంబమల్లేశ్వరస్వామి కల్యాణం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను ఆలయ ముఖ మండపంలో ప్రత్యేక వేదికపై కల్యాణ మూర్తులుగా కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం కల్యాణ క్రతువును నిర్వహించారు.

వారసులకు ఊరట!

భూముల రిజిస్ట్రేషన్ల రుసుం తగ్గింపు



ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. కుటుంబ సభ్యుల మధ్య భాగ పంపిణీ ఒప్పందాల రిజిస్ట్రేషన్ రుసుంలో సమూల మార్పులు తెచ్చింది. ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షల లోపు ఉంటే స్టాంపు డ్యూటీగా రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. రూ.10 లక్షలపైన ఉంటే రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. అదీ వ్యవసాయ భూములకు మాత్రమే. తమ ఆస్తులకు వీలునామా రాయకుండా కుటుంబ పెద్ద మరణిస్తే ఆయన ఆస్తుల్ని భార్య, పిల్లలు భాగ పంపిణీ చేసుకుంటారు. ఇలాంటి కేసులకే ప్రస్తుత ఉత్తర్వులు వర్తించనున్నాయి.

వైకాపా ప్రభుత్వ హయాంలో పెదవేగి మండలానికి చెందిన ఓ చిన్నకారు రైతు తన వారసత్వ వ్యవసాయ భూమిని పిల్లల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలనుకున్నారు. ఆ భూమిలో ఒకరు ఎక్కువ, మిగతా వారు తక్కువ వాటాలు తీసుకుంటే.. ఎక్కువ పొందిన విలువపై 3 శాతం, మిగతా వారి వాటాకు రిజిస్ట్రేషన్ విలువపై 1 శాతం స్టాంపు రుసుము చెల్లించాల్సి ఉంటుందని కార్యాలయ సిబ్బంది తెలిపారు. అదనంగా రూ.వేలల్లో చెల్లించాల్సి రావడంతో.. ఆ రైతు రూ.100 స్టాంపు పత్రంపై ఒప్పందం రాసుకున్నారు.

వేగం కానున్న ప్రక్రియ.. కుటుంబ సభ్యుల మధ్య భాగ పంపిణీకి ప్రభుత్వం ఊరట కల్పించడంతో.. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లు వేగవంతం కానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులు వారసత్వంగా సక్రమించిన వ్యవసాయ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆటో మ్యుటేషన్ జరగనుంది. వారికి పట్టాదారు పాసు పుస్తకాలతో పూర్తి హక్కులు వస్తాయి. రానున్న రోజుల్లో రిజిస్ట్రేషన్లు మరింత పెరగనున్నాయని అధికారులు భావిస్తున్నారు. కొత్త విధానంపై ఇంకా పూర్తిస్థాయి విధి విధానాలు రావాల్సి ఉందని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా వివరాలిలా..
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు: 12
- రోజువారీ రిజిస్ట్రేషన్లు: 300
- ఏప్రిల్- సెప్టెంబరు మధ్య పార్టిషన్లు: 459
- ఆదాయం: రూ.3.82 కోట్లు

(c) eenadu

13, 14 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో పీడీఎస్‌యూ తరగతులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెంలో ఈ నెల 13, 14 తేదీల్లో పీడీఎస్‌యూ జిల్లా విద్యా వైజ్ఞానిక తరగతులు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.భూషణం తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైజ్ఞానిక తరగతులు స్థానిక ధర్మన్న స్మారక భవనంలో ఉంటాయన్నారు. వీటిని విజయవంతం చేయాలని కోరారు. వివిధ అంశాలపై ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు శిక్షణ ఇస్తామన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని, నాయకులు అనిల్, లచ్చిరెడ్డి, దానియేలు, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడేస్తారు.. గెలిచేస్తారు..

జాతీయస్థాయి క్రీడలకు టి.నరసాపురం విద్యార్థులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు టి.నరసాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఇటీవల క్రికెట్, రగ్బీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించి, జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నిత్య సాధనతో..

క్రికెట్ అంటే చాలా మక్కువ. నిత్యం సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి అండర్ - 14 విభాగంలో ఆంధ్ర జట్టులో జాతీయ స్థాయిలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నా. నాన్న హోంగార్డు. ఆయన వద్దే మొదట క్రికెట్ నేర్చుకున్నా. అమ్మ గృహిణి. నేను ఏడు, తమ్ముడు ఆరో తరగతి చదువుతున్నాం. భవిష్యత్తులో చదువుతోపాటు క్రికెట్‌లోనూ రాణిస్తా. **- కాసగాని సాయిదీపక్**

జాతీయ స్థాయిలో..

నేను పదో తరగతి చదువుతున్నా. క్రీడలంటే ఇష్టం. పాఠశాలలో రగ్బీ నేర్చుకుని అండర్ - 17 విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించా. త్వరలో జాతీయ స్థాయిలో రాణిస్తా. అమ్మానాన్న వ్యవసాయ పనులు చేస్తూ నన్ను, అక్కను చదివిస్తున్నారు. **- బి.దయాకర్**

గుర్తింపు సాధిస్తా..

నేను ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాన్న చనిపోయారు. అమ్మ కూలి పని చేస్తూ నన్ను తమ్ముడిని చదివిస్తోంది. అండర్ - 14 విభాగంలో ఇటీవల జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యా. అక్కడ విజయం సాధించి మంచి క్రీడాకారుడిగా గుర్తింపు సాధిస్తా. **- బి.పవన్**

దారి.. దరి చేరి!

నిడమర్రు మండలం పెద నిండ్రకొలను- పత్తేపురం రహదారిని పునర్నిర్మించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్వహణను పూర్తిగా విస్మరించారు. ఫలితంగా దారంతా గుంతలు ఏర్పడి.. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయి చెరువును తలపించేది. ఫలితంగా ఆరు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సహకారంతో రూ.3 కోట్లతో రహదారిని అభివృద్ధి చేశారు. దాంతో ఆరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు**

'డీపీఆర్‌టీయూ' కమిటీ ఏకగ్రీవం

నియామక పత్రాలు అందుకుంటున్న నూతన సభ్యులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: 'డెమొక్రటిక్ పీఆర్ టీయూ'(డీపీఆర్‌టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తలపంటి శ్రీనివాసరావు, శేషపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కోశాధికారిగా వీరబాబు, రాష్ట్ర కార్యదర్శిగా ఆర్.నాగేంద్రసింగ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.గోపికిశోర్, ఉపాధ్యక్షులుగా కె.సూర్యచంద్రరావు, టి.సందీప్, జిల్లా కేంద్రం అధ్యక్షుడిగా ఆర్.నాగ వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌరవ సలహాదారు మరడాని అచ్యుతరావు పర్యవేక్షించారు.

రూ. 50 వేలు దాటితే స్వాధీనం..!

విలీన మండలాల ప్రజలకు తప్పని ఇబ్బందులు

కుక్కునూరు, న్యూస్‌టుడే: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లయింది విలీన మండలాల పరిస్థితి. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు జరుగుతుండటంతో ఈ పరిస్థితికి దారితీసింది. ఇరువైపులా తెలంగాణ ఉండి, మధ్యలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ఉండటంతో ఆ ఎన్నికల ప్రభావం ఈ మండలాలపై కనిపిస్తోంది. ఎన్నికల నియమావళి ప్రకారం ఏ వ్యక్తి రూ.50 వేలకు మించి నగదుతో ఉండరాదు. ఈ నిబంధన తెలంగాణ వాసులకే కాక, విలీన మండలాల ప్రజలకు కూడా వర్తిస్తోంది. అదెలా అంటే.. ఈ రెండు మండలాల ప్రజలు వ్యాపార, వాణిజ్య, వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఎక్కువగా విజయవాడ, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు వెళ్తుంటారు. అందుకోసం నగదు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అలా వెళ్లాలంటే అశ్వారావుపేటలోని ఎన్నికల తనిఖీ కేంద్రం వద్ద అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

ఆధార్ చూపినా..

ఆధార్ కార్డు చూపించి నేను ఆంధ్రా వ్యక్తిని అని చెప్పినా నగదు రూ.50 వేలకు మించితే, సీజ్ చేస్తామంటున్నారు అక్కడి అధికారులు. మరోవైపు భద్రాచలం, కొత్తగూడెం వంటి పట్టణాలకు వెళ్లాలంటే బూర్గంపాడులోని తనిఖీ కేంద్రం వద్ద నిలిపేస్తున్నారు. దీంతో నాలుగు రోజులుగా ఇక్కడి వ్యాపారులు సరకు కొనుగోళ్లకు వెళ్లలేకపోతున్నారు. రైతులు ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లకు పట్టణాలకు నగదుతో ప్రయాణించలేకపోతున్నారు. మొదటి విడతలోని అశ్వారావుపేట ప్రాంతంలో ఈ నెల 11న ఎన్నికలు జరుగుతుండగా, భద్రాచలం వైపు ఎన్నికలు రెండో విడతలో ఈ నెల 14 న జరగనున్నాయి. అప్పటి వరకూ ఎన్నికల నియమావళి అమల్లో ఉంటుంది.. కనుక, విలీన మండలాల ప్రజలు తమ అవసరాలను వాయిదా వేసుకోక తప్పడం లేదు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.

జస్టిస్ గోపాలకృష్ణారావుకు జ్ఞాపిక ఇస్తున్న ఈవో మూర్తి

పెనుగొండ ఆలయాల్లో.. పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని నగరేశ్వర స్వామి, మహిషాసురమర్దని, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు, శైలజ దంపతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నగరేశ్వర స్వామికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు స్థానిక వాసవీశాంతిధాంను సందర్శించి వాసవీమాత మరకత ప్రతిమకు పూజలు చేశారు.

జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు వేద ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడేటి చంటి తదితరులు

'ఇంద్ర ధనుస్సు'తో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం చంద్రబాబునాయుడు ఇంద్ర ధనుస్సుకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో ఏపీ దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులకు సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఏపీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జి.కోటేశ్వరరావు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ మాజీ ఏడీ ప్రసాద్, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు కె.జయరాజు, గౌరవాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటరత్నం, సీపీఐ నాయకులు ఎం.కృష్ణచైతన్య, పి.కిశోర్, జి.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

6 నెలల్లో అందుబాటులోకి డయాలసిస్ కేంద్రం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్య, వైద్య రంగాల్లో ముందున్న భీమవరంలో ప్రభుత్వ రంగా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం లేకపోవడం దురదృష్టకరమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సీఎస్ఆర్ నిధుల రూ.2 కోట్లతో భీమవరంలో 10 పడకలతో డయాలసిస్ కేంద్రం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 6 నెలల్లో పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో డయాలసిస్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తాడేపల్లిగూడెం డయాలసిస్ కేంద్రంలో అదనపు పడకల కోసం రూ.2 కోట్లు, ఆచంటలో డయాలసిస్ కేంద్రానికి రూ.కోటి, అత్తిలిలో డయాలసిస్ యంత్రాల కోసం రూ.75 లక్షలు సీఎస్ఆర్ నిధులు సమకూర్చామన్నారు. త్వరలో రూ.4 కోట్లతో సంచార క్యాన్సర్ పరీక్షల వాహనం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ డయాలసిస్ బాధితులకు ప్రభుత్వ పరంగా సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకుడు లక్ష్మణ్ జీతానంద్, జనసేన, భాజపా జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, అయినంపూడి శ్రీదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

టెట్ నుంచి ఉపాధ్యాయుల్ని మినహాయించండి: ఎమ్మెల్సీ

దెందులూరు, న్యూస్‌టుడే: టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక తితిదే కల్యాణ మండపంలో ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అధ్యక్షత వహించారు. గోపిమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ అవలంబిస్తున్న నియంతృత్వ విధానాలను మానుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. ఉపాధ్యాయ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే సంఘాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా బి.సుభాషిణి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రవికుమార్, గౌరవాధ్యక్షుడిగా ఎం.వి.శ్యామ్‌బాబు, సహాధ్యక్షులుగా జి.వెంకటేశ్వరరావు, ఎస్.సుధారాణి, పలువురు కార్యదర్శులను ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) నగరాధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం నగర కమిటీ సమావేశం నిర్వహించారు. కాకర్ల శ్రీను అధ్యక్షత వహించారు. సోమయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై ఈ నెల 15న నిర్వహించే తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘ నాయకులు నెహ్రూబాబు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, రత్నబాబు, రమణ పాల్గొన్నారు.

9 నుంచి అమరావతి బాలోత్సవం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: అమరావతి బాలోత్సవం-8.. ఈ నెల 9వ తేదీ నుంచి 11 వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎన్వీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమ గోడపత్రికను ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పిల్లల పండుగ పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవం కోసం అనే నినాదంతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 43 అకడమిక్, 17 కల్చరల్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు ప్రాంగణాలు, 5 గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 12 వేల మంది పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు.

9న రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 9న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు దళిత ఐకాస ఛైర్మన్ పి.వరప్రసాద్ తెలిపారు. స్థానిక గన్‌బజార్‌లో ఆదివారం ప్రజా సంఘాల నాయకులతో ఆదివారం ఆయన సమావేశమై మాట్లాడారు. వివిధ డిమాండ్లు నెరవేర్చాలని తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పాత బండి.. కొంటున్నావా గురూ..!

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే

కొత్త వాహనం ధరలో సగానికే రెండు మూడేళ్లు తిరిగిన బండి వస్తుందని.. కొన్నేళ్లు దాంతోనే నెట్టుకొచ్చి తర్వాత కొత్తది కొందామనుకుని చిరుద్యోగులు, పార్ట్‌టైమ్ పనిచేసే కళాశాల విద్యార్థులు ఎక్కువ మంది అనుకుంటారు. కొత్త వాహనాల్లో వస్తున్న మార్పులు.. నాణ్యత లోపాలు ఇతర కారణాలతో కొత్త వాటిని కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపట్లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాల క్రయవిక్రయాలు రోజూ వందల్లో జరుగుతున్నాయి. అయితే బండి కొనేటప్పుడు ముందు చూపు, అవగాహన లేకపోతే జేబుకు చిల్లు తప్పదు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఇటీవల ఉమ్మడి జిల్లాలో తరచూ ద్విచక్ర వాహనాలు చోరీలకు గురవుతున్నాయి. పట్టుపడిన వారి వద్ద ఒక్కొక్కరి నుంచి పదుల సంఖ్యలో బండ్లు దొరుకుతున్నాయి. చాలా వాటికి విడిభాగాలు మార్చేయడం.. నంబరు ప్లేట్లు తీసేయడం.. రంగులు మార్చడం.. ఛాసిస్ నంబరు చెరిపేయడం వంటివి చేస్తున్నారు. బండి కొనేముందు వీటన్నింటిని పరిశీలించుకుంటే మంచిది. ● పోలీసు కేసులు నమోదయ్యాయేమో నిర్ధారించుకోవాలి. ట్రాఫిక్ చలానాలు ఎంతున్నాయో చూసుకోవాలి. ● ఫైనాన్స్ క్లియరెన్స్ అయ్యిందా.. అయితే దానికి సంబంధించిన నిరభ్యంతర పత్రంతో పాటు ఒరిజినల్ ఆర్సీ తీసుకోవాలి. ● పత్రాలన్నీ ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. ఆర్సీ కార్డులోని ఛాసిస్ నంబరు, వాహనంపై ఉన్నది ఒకేలా ఉండాలి. ● బండి మన పేరుపై రిజిస్ట్రేషన్ అవుతుందో లేదో ఆర్టీవో కార్యాలయంలో తెలుసుకోవాలి.

● ఇతర రాష్ట్రాల వాహనమైతే రిజిస్ట్రేషన్‌కు ఎంత అదనపు ఖర్చు అవుతుందో తెలుసుకోవాలి. అన్నీ బాగుంటేనే కొనుగోలు చేయడం ఉత్తమం. **-కె.ఎస్.ఎమ్.కృష్ణారావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, ఏలూరు, పశ్చిమగోదావరి**

ఇంజినే గుండెకాయ.. కొనే వాహనం కండిషన్ ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. నమ్మకమైన మెకానిక్ వద్దకు తీసుకెళ్లి చూపించాలి. వాహనానికి ఇంజిన్ గుండె లాంటిది. దాని పనితీరు సరి చూశాకే కొనుగోలుకు సిద్ధపడాలి. మైలేజీ, గేర్ బాక్స్, విడిభాగాల స్థితి.. వాటి మన్నిక.. టైర్లు.. లైట్లు.. తదితరాలన్నీ జాగ్రత్తగా చూసుకోవాలి. తప్పకుండా కొంత దూరం నడిపితే లోపాలు తెలుస్తాయి. **- సాధిక్, మెకానిక్, ఆగిరిపల్లి**

అన్నదాన ప్రభువే.. సుబ్రహ్మణ్యేశా..

ముగిసిన షష్ఠి మహోత్సవాలు

కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

సింగరాయపాలెం (ముదినేపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చేవూరుపాలెం-సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో 13 రోజులుగా నిర్వహిస్తున్న షష్ఠి మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మహా అన్న సమారాధనను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. భారీస్థాయిలో భక్తులు తరలి రావటంతో సింగరాయపాలెం క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వాహనాల రాకపోకలు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకుని ఎక్కడా ట్రాఫిక్ స్తంభించకుండా చూశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ రవికుమార్, మూడు మండలాల ఎస్సైలు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. డ్రోన్ కెమెరాలతో బందోబస్తీ పర్యవేక్షించారు. స్వామివారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఏసీ ఆర్.గంగాశ్రీదేవి, సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, తెదేపా కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక

మనోజ్

లెనిన్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.మనోజ్, కె.లెనిన్ ఎన్నికయ్యారు. నగరంలో ఆదివారం నిర్వహించిన మహాసభ ముగింపు వేడుకలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.జయంత్, ఎస్.శివాజీ, ఎస్.పవన్, కె.అమచూల్య, సహాయ కార్యదర్శులుగా డి.నాగేంద్ర, జి.రమ్య, పి.సతీశ్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.శివ, ఎస్.రాజు, బి.వీరేంద్ర, సరిత, శేషాద్రి, సందీప్ చరణ్, నాని ఎన్నికయ్యారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ నాయకులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆచూకీ లభ్యం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభ్యమైనట్లు పట్టణ ఎస్సై నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం సాయంత్రం నుంచి విద్యార్థిని కనిపించడం లేదంటూ ట్రిపుల్ ఐటీ పీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. పలు ప్రాంతాల్లో తనిఖీ చేయగా.. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. దర్శనానికి వెళ్లి మానసిక ఒత్తిడితో అక్కడే ఉన్నట్లు తెలుసుకుని నూజివీడు తీసుకొచ్చామన్నారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి.. తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

పోలీసు వాహనాన్ని ఢీకొట్టి చేపల లారీ బోల్తా

పొలంలో పడిన వాహనం, రోడ్డుపై లారీ

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: చేపల లోడుతో వెళ్తున్న లారీ.. పోలీసుల వాహనాన్ని ఢీకొట్టి బోల్తాపడిన ఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో జరిగింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘటనపై పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులోని జిల్లెలగడ్డలో పోలీసులు స్టాటిస్టికల్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పోలీసులు తమ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. సిబ్బంది పక్కనే చలిమంట కాస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి దిల్లీకి వెళ్తున్న లారీ వేగంగా వచ్చి పోలీసు వాహనాన్ని ఢీకొట్టింది. పోలీసు వాహనం రెండొందల మీటర్ల దూరంలోని పొలంలో పడింది. అందులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్లకు గాయాలయ్యాయి. ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మారెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. క్రేన్‌తో కారును బయటకు తీయించారు. లారీలోని క్యాట్‌ఫిష్‌లను కొందరు గ్రామస్థులు తీసుకెళ్లారు. తర్వాత పోలీసులు వారిని వారించారు. రోడ్డు స్టాపర్‌ను తప్పించే క్రమంలో ప్రమాదం జరిగిందా.. లారీని ఆపుతారనే భయంతో వేగంగా వెళ్లే క్రమంలోనా.. అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు తీగలు తగిలి గడ్డి వ్యాన్ దగ్ధం

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం మునిపల్లి-కలవచర్ల మధ్య ఎండుగడ్డితో వెళ్తున్న వ్యాన్ ఆదివారం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం కోరుపల్లి నుంచి పశ్చిమగోదావరి జిల్లా గణపవరానికి కట్టలు కట్టిన ఎండుగడ్డిని తీసుకుని ఆకుల శ్రీరామకృష్ణకు చెందిన ఐషర్ వ్యాన్ బయలుదేరింది. కోరుపల్లి వద్ద ఈ వ్యాన్‌పై ఉన్న ఎండుగడ్డికి విద్యుత్తు తీగలు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. కొంత దూరం వచ్చేసరికి స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో వ్యాన్‌ను ఆపి మంటలు నియంత్రించే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో నిడదవోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోగా, వ్యాన్ క్యాబిన్ కూడా దగ్ధమైంది. ఈ ప్రమాదం కారణంగా సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. ఇదిలా ఉంటే గడ్డి కట్టలు పడి మంటలు వ్యాపించి నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పూర్తిగా పొగతో నిండిపోయింది. ప్రయాణాలు సాగించేవారు ఎగిసిపడుతున్న మంటలకు భయపడి కొద్దిసేపు అక్కడే నిలిచిపోయారు.

ద్వారకా తిరుమల నుంచి సింహాచలం వరకు పాదయాత్ర

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే, ద్వారకాతిరుమల నుంచి సింహాచలం వరకు కాలినడకన వస్తానని ద్వారకాతిరుమల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.లక్ష్మీరమణి మొక్కుకున్నారు. ఈ మేరకు ఆమె నవంబరు 25న ఉదయం ద్వారకాతిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పాదయాత్ర ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం ఎంవీపీకాలనీకి చేరుకోవడంతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఘనస్వాగతం పలికి, అభినందనలు తెలిపారు. ఆమెతో పాటు కుమారుడు సంజీవ్‌చౌదరి కాలినడకన విశాఖ చేరుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పోతన్న రెడ్డి, బాపిరాజు, సత్యనారాయణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు..!

ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం గొల్లవానితిప్ప ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడి వికృత చేష్టలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, వారిని లైంగికంగా వేధించినట్లు తెలియడంతో గ్రామస్థులంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఈ విషయం వెలుగు చూసింది. పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొందరు విద్యార్థినులు భయంగా ఉండటం గమనించి పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్‌తో పాటు పెద్దలు ఆరా తీయగా విషయం బయటపడింది. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు చట్టపరంగానే వెళ్లాలనే ఉద్దేశంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యా శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డీవైఈవో ఆధ్వర్యంలో ఓ కమిటీ శనివారం విచారణ నిర్వహించింది. పాఠశాలలో మొత్తం 170 మంది విద్యార్థులుండగా వారిలో 85 మంది బాలికలే. దాదాపుగా వారంతా సదరు ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన, లైంగిక వేధింపుల గురించి చెప్పి బోరుమన్నట్లు తెలిసింది. దీనిపై ఉప విద్యాశాఖాధికారి రమేశ్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా గ్రామస్థుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించామని.. కొంత మంది విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా సమస్య చెప్పారన్నారు. విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చింతలపూడి, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన లింగపాలెం మండలం కొణిజర్ల సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొణిజర్ల గ్రామానికి చెందిన సీహెచ్.వెంకటేశ్వరరావు గ్రామంలో రహదారి పక్కన నిలబడి ఉన్నారు. ఈ సమయంలో రెండు టిప్పర్లు ఎదురెదురుగా వస్తుండటంతో ఒక టిప్పర్‌ను డ్రైవర్ వెనక్కి రివర్స్ చేశారు. అయితే టిప్పర్ డ్రైవర్ వెనక ఉన్న వెంకటేశ్వరరావును గమనించకుండా వెనక్కు పోనివ్వడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై వెంకన్న ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నం.12(1744533)/2019/డి.బి తేది. 04-12-2025.

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో **షార్ట్ టెండరు నోటీసు నెం: 19 (1-6) /BHI/General/2025-26/E1/E2 & టెండరు నోటీసు నెం: 19 (7-9) /BHI/General/2025-26/E1/E2 లోని జనరల్ నిధుల నుండి 9 పనులకు గాను రూ. 80.16 లక్షలతో** ఇ- ప్రొక్యురుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్. నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వో.ల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇప్రొక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో.జిల్లా (సెల్: 9849906540, 9849906543) వారిని సంప్రదించగలరు.

సం/- **కమిషనరు, భీమవరం పురపాలక సంఘం**

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

ఏలూరులో కొత్తగా ప్రారంభించే రియల్ ఎస్టేట్ సంస్థ నందు పని చేయుటకు లీడర్స్, ఏజెంట్స్ గృహిణిలు, రిటైర్డ్ ఎంప్లాయిస్ కావలెను. కమీషన్, శాలరీ. ✆ 70133 05223.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ:20k. ✆ 89776 39662, 89776 39663.

BUSINESS OFFER

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైం or ఫుల్‌టైం ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర:78160 98199.

JOBS

Wanted Electrical Engineers. Qualified By B.Tech Electrical Engineering, Diploma or ITI Experience 0-3 Years. Place of Work: East and West Godavari Districts, Attractive Salary. Contact: 79950 50571 or Send Resumes To hr@gvsprojectspvtltd.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.50 పైః
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

(c) eenadu

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

విజ్ఞాన.. విహారయాత్ర

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను పీఎంశ్రీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం విజ్ఞాన యాత్రకు రాజమహేంద్రవరం వెళ్లారు. అక్కడి సైన్సు, కాటన్ మ్యూజియాలను సందర్శించారు. అక్కడి సైన్స్ పరికరాలను ఉపాధ్యాయులు చూపించి.. వాటిని ఎలా వినియోగిస్తారన్న అంశంపై అవగాహన కల్పించారు. ఉదయం 8కి బయల్దేరిన విద్యార్థులు.. రాత్రి 7 గంటలకు గ్రామానికి చేరుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ద్వారంపూడి సత్యేంద్ర కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

రాట్నాలమ్మకు అభిషేకం

రాట్నాలకుంట(పెదవేగి): రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజా రుసుము, తీర్థప్రసాదాల విక్రయాలతో రూ. 72,285 ఆదాయం వచ్చిందని ఛైర్మన్ శ్రీనివాసరావు, ఈవో సతీశ్‌కుమార్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ? చల్లాలమ్మ పాత ఆలయం సమీప డ్రెయినేజీ పూడిపోయింది. ఫలితంగా మురుగు నీరంతా రోడ్డు పైకి వచ్చేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. **- నరేశ్, స్థానికుడు**

✔ తక్షణమే డ్రెయినేజీలో పూడిక తీయిస్తాం. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లిస్తాం. **- రవిచంద్ర కుమార్, పంచాయతీ కార్యదర్శి**

? చేబ్రోలు రైల్వే గేటుకు ఇరువైపులా గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. రైల్వే గేటు దాటే క్రమంలో వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోతున్నాయి. **- షా మహ్మద్ హుస్సేన్, గ్రామస్థుడు**

✔ గోతులు పూడ్చిస్తాం. వాహన రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం. **- రవికిశోర్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్**

పాదుల తొలగింపు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక సత్రంపాడు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం వెనుక వైపు ప్రహరీని ఆనుకొని ఉన్న విద్యుత్తు పరివర్తకం చుట్టూ అల్లుకుపోయిన పాదులను ఎట్టకేలకు తొలగించారు. 'పరివర్తకం.. ప్రమాదకరం' శీర్షికన ఆదివారం ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి పిచ్చిమొక్కలు తొలగింపజేయడంతో పాటు పరిసరాలనూ శుభ్రం చేశారు. ప్రమాదాలు జరగకుండా కొత్త ఫ్యూజ్ బాక్సు ఏర్పాటు చేశారు.

ఎంపీ రమేశ్‌కు మహేశ్ కుమార్ పరామర్శ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అనకాపల్లి ఎంపీ, భాజపా నేత సీఎం రమేశ్ కుమార్‌ను ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ పరామర్శించారు. వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంటపల్లి మండలం పొట్లదుర్తిలో సీఎం రమేశ్ మాతృమూర్తి కొన్నాళ్ల క్రితం మృతి చెందగా. . ఆదివారం ఆయన ఇంటికెళ్లిన మహేశ్ కుమార్ ఓదార్చారు.

సాంకేతికమక!

సర్వర్ల మొరాయింపుతో అభ్యర్థుల అవస్థలు

నామమాత్రంగా పూర్తయిన కౌశలం

ఉంగుటూరు, న్యూస్‌టుడే

గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కౌశలం పేరిట ఇంట్లోనే ఉద్యోగం (వర్క్ ఫ్రం హోం) కల్పనకు చర్యలు తీసుకుంది. తొలి విడతలో ఈ నెల 2 నుంచి 6 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా. . సర్వర్ల మొరాయింపుతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. మరికొందరు స్థానికంగా లేకపోవడంతో పరీక్షలు రాయలేదు. ఇంకొందరు అనాసక్తి చూపకపోవడంతో గైర్హాజరయ్యారు.

నాచుగుంటలో పరీక్ష రాస్తున్న అభ్యర్థిని

తరచూ లోపాలు.. అభ్యర్థి ఎక్కణ్నుంచి పరీక్ష రాస్తున్నారో గుర్తించేలా జీపీఆర్ఎస్ తరహాలో లైవ్ లొకేషన్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంది. ఈ విధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఫలితంగా పరీక్షకు అవాంతరంగా మారింది. సమస్య పరిష్కారానికి లైవ్ లొకేషన్ క్యాప్చర్ కోడ్‌ను తొలగించిన చాలా చోట్ల సర్వర్లు పని చేయలేదు. కంప్యూటర్లకు యూపీఎస్, ఇన్వెర్టర్ సదుపాయం, అభ్యర్థులు అందుబాటులో లేకపోవడం, ఆసక్తి చూపకపోవడంతో చాలా మంది పరీక్ష రాయలేదు. అనివార్య కారణాలతో పరీక్ష రాయలేని అభ్యర్థులు వారికిచ్చిన లింక్‌లో ఆధార్ నంబరు ద్వారా రీషెడ్యూల్ చేసుకోవచ్చని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త శ్యాంబాబు తెలిపారు.

రోజుకు ఇద్దరికి చొప్పున.. కౌశల్ పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. రెండు పేపర్లుగా ఇచ్చారు. కమ్యూనికేషన్ స్కిల్ అసెస్‌మెంట్ 15 నిమిషాలు, స్కిల్ అసెస్‌మెట్ 45 నిమిషాలు కేటాయించారు. ప్రతి రోజు ఇద్దరు చొప్పున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, ఆపై మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పరీక్ష నిర్వహించారు. పరీక్ష సమయంలో కెమెరా, మైక్రోఫోన్, ఫుల్ స్క్రీన్, లొకేషన్ యాక్సెస్ తప్పనిసరి. కేటాయించిన సెంటర్ (సచివాలయం)లోని కెమెరాలో పరీక్షకు హాజరయ్యే వారు కాకుండా ఇతరులు కనిపించకూడదు. పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థుల చరవాణులకు ముందుగానే సంక్షిప్త సందేశం పంపారు.

మూడు నియోజకవర్గాల వివరాలిలా..

మండలం	సచివాయాలు	అభ్యర్థులు
ఉంగుటూరు	25	250
భీమడోలు	17	164
నిడమర్రు	13	136
గణపవరం	20	200
ఏలూరు నగరం	79	614
ఏలూరు గ్రామీణ	11	272
దెందులూరు	20	200
పెదవేగి	28	280
పెదపాడు	22	220

నమో సూర్యనారాయణ నమః

పవరుపేట(ఏలూరు నగరం), న్యూస్‌టుడే: స్థానిక పవరుపేటలోని సూర్యభగవాన్ ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి.. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముక్కంటి.. భక్తి మిన్నంటి!

ఏలూరు ఆధ్యాత్మికం, గ్రామీణ- న్యూస్‌టుడే: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా.. తూర్పువీధిలోని బాలాత్రిపుర సుందరీదేవి సమేత సోమలింగేశ్వరాలయంలో ఆదివారం స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా సోమలింగేశ్వరుడికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ★ దొండపాడులోని శ్రీనం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వరస్వామికి రుద్ర, అన్నాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి విశేష పూజలు, అలంకరణ చేపట్టారు.

పెదవేగి: రాట్నాలకుంటలోని రామలింగేశ్వరాలయంలో ఆదివారం వేకువజామున ఆరుద్రాభిషేకం చేశారు. ఆపై ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

భీమడోలు: స్థానిక పార్వతి సమేత భీమేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తెల్లవారుజామున శివాలయ ప్రాంగణంలో పుట్ట మట్టితో స్వామివారి పార్థివ లింగాన్ని తయారు చేసి పంచామృత, రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పార్థివలింగం, పూజా ద్రవ్యాలను మేళతాళాల మధ్య ఊరేగింపుగా గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: చింతమనేని

దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేస్తున్న ప్రభాకర్

దుగ్గిరాల(పెదవేగి) న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల విడిది కార్యాలయంలో ఆయన్ను ఆదివారం పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించిన చింతమనేని.. వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొప్పాకకు చెందిన దివ్యాంగుడు పరసా మంగయ్యకు మూడు చక్రాల సైకిల్ బహూకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు.

వైద్య శిబిరానికి స్పందన

రిబ్బన్ కత్తిరిస్తున్న నవ్య తదితరులు

దెందులూరు, న్యూస్‌టుడే: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు దేవస్థానం ప్రాంగణంలో.. సీతారామస్వామి విశాల సహకార సంఘం సహకారంతో హేలాపురి లయన్స్ క్లబ్, రామకృష్ణ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్య ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు రమేష్, శ్రీలత, డి. సుబ్బారావు పాల్గొని సుమారు 380 మందికి పరీక్షలు చేశారు. నిడదవోలు రాజరాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల సిబ్బంది హాజరై పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు పూజారి వెంకటరత్నం నాయుడు, సమన్వయకర్త కానాల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సులువుగా.. పారదర్శకంగా!

స్వర్ణ పంచాయతీ యాప్ సేవలు ప్రారంభం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో పారదర్శకత పెంచేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. అక్రమాలను అరికట్టేందుకు స్వర్ణ పంచాయతీ యాప్ తీసుకొచ్చింది. తద్వారా నగదు రహిత చెల్లింపులు ప్రారంభించింది. గ్రామంలో పన్నుల చెల్లింపుదారులకు యాప్ ద్వారా సంక్షిప్త సందేశం పంపుతారు. లబ్ధిదారులు క్లిక్ చేసి.. పోర్టల్ ద్వారా నగదు చెల్లించొచ్చు. లేనిపక్షంలో పంచాయతీ సిబ్బందిని సంప్రదిస్తే.. యాప్‌లో వివరాలు సరి చూసుకొని.. క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయొచ్చు. జిల్లాలో అన్ని పంచాయతీల్లోనూ ఈ విధానం అమలు చేస్తున్నారు. ఇల్లు, కుళాయి పన్నులు, ట్రేడ్ లైసెన్సు ఫీజు, సెల్ టవర్లు, వేలం రుసుం ఇలా ఏ పన్నైనా ఇంటి నుంచే కట్టొచ్చు.

వివరాలిలా..	
మండలం	పంచాయతీలు
భీమడోలు	13
నిడమర్రు	16
ఉంగుటూరు	27
దెందులూరు	17
పెదపాడు	23
పెదవేగి	30
ఏలూరు	15

ఆన్‌లైన్‌లో ఎలాగంటే..

యాప్ అందుబాటులోకి రావడంతో గ్రామీణులు ఇంటి నుంచి సులువుగా సేవలు పొందే అవకాశం లభించింది. swarnapanchayat.apcfss.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేమెంట్ ఆప్షన్ క్లిక్ చేస్తే ఏడు రకాల పన్నుల వివరాలు వస్తాయి. వాటిలో చెల్లించాల్సిన దాని వద్ద క్లిక్ చేయాలి. అనంతరం సంవత్సరం, జిల్లా, మండలం, పంచాయతీ, గ్రామం వివరాలు నమోదు చేయాలి. అప్పుడు అసెస్‌మెంట్ నంబరు, యజమాని పేరు చూపిస్తుంది. వీటిలో ఒకదానిపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి పన్ను వివరాలతో పేమెంట్ క్లిక్ ద్వారా నగదు చెల్లించవచ్చు.

ప్రతి పైసా ఖాతాలోకే..

ప్రజలు చెల్లించిన ప్రతి పైసా నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి జమవుతుంది. ప్రతి జమా ఖర్చులు, ప్రతి లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో పారదర్శకత పెరుగుతుంది. 'యాప్ విధానంలో అన్ని రకాల పన్నులు, ఇతర చెల్లింపులు చేయొచ్చు. సేవలు పారదర్శకంగా ఉంటాయి. నిధులు పక్కదారి పట్టవు' అని జిల్లా పంచాయతీ అధికారిణి కె. అనురాధ తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

బాలికకు వస్త్రాలు ఇస్తున్న జయరావు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఆర్సీఎం అగ్ర పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని అమలోద్భవి మాత దేవాలయ వార్షికోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. రెవ ఫాదర్ ఇంజే పాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వసతి గృహంలోని విద్యార్థినులకు నూతన వస్త్రాలు అందజేశారు. బిషప్ జయరావు మాట్లాడుతూ.. బాలికల అభ్యుదయానికి తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

జూద రహిత సంక్రాంతి చేసుకుందాం

మాట్లాడుతున్న సూర్యకిరణ్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రానున్న సంక్రాంతిని కోడి పందేలు, జూదాలు రహితంగా చేసుకుందామని.. ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.సూర్యకిరణ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం డీవైఎఫ్ఐ నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడిన నెల్లూరు జిల్లా యువజన నాయకుడు పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేయడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నాయకులు ఎన్. శరత్‌చంద్ర, పంపన రవికుమార్, మనోజ్, లోకేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కొదమసింహం
అంబిక మినీ	రాజు వెడ్స్ రాంబాయి
సాయిబాలాజీ	దురంధర్
బాలాజీ	జుటోపియా
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మఫ్టీ పోలీస్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఆంధ్రా కింగ్ తాలూకా
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	అమరకావ్యం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఆంధ్రా కింగ్ తాలూకా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రేమంటే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	12ఏ రైల్వేకాలనీ

వానలని.. సాగని పని!

ఉంగుటూరు మండలం రావులపర్రులో పత్తేపురం పంట కాలువపై నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఎమ్మెల్యే ధర్మ రాజు చొరవతో మంజూరైన రూ.70 లక్షలతో పనులు ప్రారంభించారు. ఈలోపు వర్షాలు కురవడంతో ఆపేశారు. తిరిగి పనులు మొదలుపెట్టకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఉంగుటూరు**

దారిలా.. ప్రయాణమెలా!

పెదవేగి మండలం గార్లమడుగు నుంచి సూర్యారావుపేట వరకు సుమారు 2 కిలోమీటర్లు ఉన్న తారు రోడ్డు దెబ్బతింది. మొంథా తుపాను దాటికి కంకర తేలిపోయి అధ్వానంగా తయారైంది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడి గాయపడుతున్నారు. **- న్యూస్‌టుడే, పెదవేగి**

మొక్క.. నిర్లక్ష్యం పక్కా

భీమడోలు మండలం గుండుగొలను, సూరప్పగూడెం వద్దనున్న ఫ్లైఓవర్ వంతెన గోడలపై మర్రి, రావి చెట్ల మొక్కలు పెరుగుతున్నాయి. ఫలితంగా వారధి గోడలు దెబ్బతింటున్నాయి. జాతీయ రహదారుల అధికారులు స్పందించి మొక్కలు మానులుగా మారక ముందే తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, భీమడోలు**

ఇంటి అవరణ.. ప్రమాదం చెంతన!

నిడమర్రు మండలం పెదనిండ్రకొలను ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. పిల్లల చేతికందే ఎత్తులో నియంత్రిక ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈ ప్రసాద్ రాజు తెలిపారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

గోడలు నిలవక.. రక్షణ లేక..!

భీమడోలు మండలం పాతూరులో ఏలూరు కాలువపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు అంచులు దెబ్బతినడంతో.. ఎదురొచ్చే వాహనానికి దారిచ్చే క్రమంలో చోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. వంతెనకిరువైపులా రక్షణ గోడలు నిర్మిస్తామని పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాల్ తెలిపారు. **- న్యూస్‌టుడే, భీమడోలు**

గీతాలు ఆలపిస్తున్న బాలబాలికలు

అలరించిన ఘంటసాల స్వరార్చన

నివాళులర్పిస్తున్న హైఎంహెచ్‌ఏ సభ్యులు

ఏలూరు గ్రామీణ, నగరం- న్యూస్‌టుడే: ఘంటసాల జయంతి సందర్భంగా. . స్థానిక వైఎంహెచ్ఏ హాలులో హేలాపురి సింగర్స్ అసోసియేషన్, ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం స్వరార్చన, సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఘంటసాల స్వరం తెలుగు భాషకు వరమన్నారు. ఆయన ఆలపించిన గీతాలు అజరామరమన్నారు. తెలుగు భాషకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన మహనీయుడు ఘంటసాల అని కొనియాడారు. అనంతరం విద్యార్థులు ఆలపించిన మధుర గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామకృష్ణ, సత్యనారాయణ, వి. రామ్‌కుమార్, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

పేదల కాలనీ.. సమస్యల కహానీ!

సదుపాయాల్లేక నివాసితుల ఇక్కట్లు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు నగరం 25వ డివిజన్ శనివారపుపేటలోని పేదల కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ సుమారు 2,500 మంది నివసిస్తున్నారు. కనీస సదుపాయాలు లేకపోవడంతో.. వారంతా అవస్థలు పడుతున్నారు. అప్పట్లో ప్రభుత్వమిచ్చిన స్థలాల్లో లబ్ధిదారులు రూ. 10-15 లక్షల వరకు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పటి వైకాపా ప్రభుత్వం కేవలం రూ. 1.80 లక్షలిచ్చి చేతులు దులుపుకొన్నట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా మట్టి రోడ్డు

అప్పులు చేసి.. నిర్మించి.. అప్పులు చేసి, పేదల కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్నామని.. ఇక్కడ వసతుల్లేక జీవనం సవ్యంగా సాగడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. రహదారులు, మురుగు కాలువల సదుపాయం లేకపోవడంతో.. చిన్నపాటి వర్షానికే కాలనీ ముంపునకు గురవుతోంది. ఇళ్ల పరిసరాలు బురదమయం అవుతున్నాయి. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ అంధకారం అలముకుంటోంది.

ఇళ్ల మధ్య నిలిచిన నీరు

పాములకు నిలయం.. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో.. సర్పాలు, విష పురుగులకు నిలయంగా మారుతున్నాయి. పందులు, కుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని.. కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. పేదల కాలనీలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదాం

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ.. సమష్టిగా పోరాడదామని వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని విడిది కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షత వహించారు.

దుప్పట్ల పంపిణీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన జీవిస్తున్న పలువురు పేదలకు ఐఎన్‌పీఆర్ ఉద్యోగి నగరగంటి సత్యప్రభాకర్, ఆయన సతీమణి హర్షిణి ఆదివారం రాత్రి దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. చలికి రోడ్డు పక్కన నిద్రించే పేదలు, యాచకులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో తమవంతుగా దుప్పట్లు అందజేసినట్లు వారు తెలిపారు.

దాతల సహకారంతో సౌకర్యాలు

గణపవరం, న్యూస్‌టుడే: దాతల సహకారంతో పాఠశాలలను అభివృద్ధి చేసుకున్న గ్రామాలు అగ్రపథంలో నిలుస్తాయని తహసీల్దార్ అప్పారావు అన్నారు. జల్లికొమ్మర ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో సమకూర్చిన రూ. 56వేలు విలువైన సామగ్రి, బీరువాను ఆయన చేతుల మీదుగా విద్యాలయానికి అందించారు.

వేలం ప్రకటన

In the Court of the 1st Addl Civil Judge cum Additional Judicial First Class Magistrate, Tadepalligudem

EP 73/2024 OS 20/2023

Between:
Kakara Syam Sundar Chirstson - D.H.R.
and
Marothi Srinivasa Rao - J.D.R.

పై నంబరు గల గ్రంథంలో DHR గారి బాకీ వసూలు నిమిత్తం JDR యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని ది. 19-12-2025 తేదీన ఉదయం 10.30 ని॥లకు లగాయితు పై కోర్టు వారు సమక్షంలో వేలం వేయబడును. కావలసినవారు కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

Schedule: An extent of 591 1/2 Sq.Yards of site and old tiled house therein and sheet shed and tiled shed their in with door No. 2-183 in R.S.No. 151, 2nd block situated in West Godavari District (Eluru District) Bhimadolu Sub-Division, Bhimadolu, Bhimadolu Sub-Registrar, Ungutur Mandalam Narayanapuram Village area and is bounded by:- **East:** Site belongs to Matta Srinivasa Rao and Suvadhi Sanyasi Rao - 72.9 Feets, **South:** Site belongs to panchayathi Road - 71 Feets, **West:** Site belongs to Madduri Santhakumar - 81 Feets, **North:** Panchayathi Road - 67.6 Feets

Within the said boundaries and extent of 591 1/2 Sq.Yards of site and old tiled house, sheet shed tiled shed their in with door No. 2-183 and all things therein with black stone roof, both rooms and with all wood things and electrical service number: 133, 531, 1458, 1683, 1313, 1978 and with passage rights and with all easement rights.

DHR Value - 20,00,000/-, Amin Value - 24,00,000/-

Sd/- **Thota Venkata Satya Narayana**
Thota Jagadeesh Kumar
Advocates, Tadepalligudem
Cell: 99482 43686

Tadepalligudem
Date: 3-12-2025

చిత్తశుద్ధి లేక..

మొక్కలు పెంచలేక!

అధికారుల పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యం లేకపోతే ఏ కార్యక్రమమూ విజయవంతం కాదు. దీనికి నిదర్శనమీ చిత్రాలు. ఏలూరు నుంచి చొదిమెల్ల రోడ్డులోని తమ్మిలేరు గట్లపై వ్యర్థాలు తొలగించి.. జూన్‌లో మొక్కలు నాటి రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహణ కొరవడటంతో యథాప్రకారం వ్యర్థాలను కుప్పలుగా పోస్తున్నారు. అధికారులు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలు కనుమరుగై వ్యర్థాల గుట్టలే మిగిలాయి. **- ఈనాడు, ఏలూరు**

జూన్ 24న తమ్మిలేరు గట్టుపై మొక్కలు నాటి ఏర్పాటు చేసిన కంచెలు

డిసెంబరు 7న వ్యర్థాల గుట్టగా మారిందిలా..

పవరుపేట.. నరకమేనట!

రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్

పవరుపేట(ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ఏలూరు నగరంలోని పవరుపేట రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి రైల్వేగేటు చోదకులకు చుక్కలు చూపుతోంది. అయిదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా.. నగరవాసులకు రైల్వే గేటు సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు.

రైల్వే గేటు వద్ద వాహనదారుల అవస్థలు

స్నేహ వారధి పనులతో..

ఏలూరు నగరంలో ప్రధాన రహదారి నుంచి రెండో పట్టణంలోని కొత్తపేట, ఆర్ఆర్ పేట తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే పవరుపేట గేటు, శ్రీనివాస థియేటర్ సమీప రాజీవ్ స్నేహ వారధి ముఖ్య మార్గాలు. ప్రస్తుతం స్నేహ వారధికి మరమ్మతులు చేస్తున్నారు. మరో వారం రోజులపాటు వంతెనను మూసి.. పనులు కొనసాగించనున్నారు. ఫలితంగా నగర వాసులకు పవరుపేట రైల్వే గేటు మాత్రమే దిక్కయింది.

రద్దీ రెట్టింపు..

సాధారణ రోజులతో పోలిస్తే.. ప్రస్తుతం రద్దీ రెట్టింపైంది. ఈ గేటు మీదుగా అరగంట వ్యవధిలో సగటున మూడు రైళ్లే వస్తుంటాయి. ఒక్కసారి గేటు వేసి తీసే లోపు.. ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి గేటు తీయడం ఆలస్యమైతే.. పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. వాహనదారులు అర గంట పైగా వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు కూడా లేకపోవడంతో.. వాహనదారులు అడ్డదిడ్డంగా దూరేస్తున్నారు. పవరుపేట రైల్వే గేటు వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సిబ్బందిని కేటాయిస్తామని ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు తెలిపారు.

(c) eenadu

పోలవరం
•పోలవరం •చింతలపూడి

అంత ఖర్చు చేసి.. మళ్లీ మూలకు చేర్చి..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన పులిరాముడుగూడెంలోని మంచినీటి శుద్ధి కేంద్రం నిర్వహణ సమస్య మళ్లీ మొదటికొచ్చింది. యంత్రాలు పనిచేయక కేంద్రం నిరుపయోగంగా మారింది. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏడేళ్ల కిందట ఎన్టీఆర్ సుజల స్రవంతి కింద దీనిని నెలకొల్పారు. రెండేళ్ల పాటు బాగానే పనిచేసింది. యంత్ర సామగ్రి మరమ్మతులకు గురవడంతో పట్టించుకున్న నాథుడు లేక మరుగున పడింది.

నెలన్నరలోనే పాడై.. ఈ ఏడాది ఏప్రిల్‌లో గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి గ్రామస్థులు సమస్యను తీసుకెళ్లారు. కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి శుద్ధి తాగునీటిని సరఫరా చేయాలని మొరపెట్టుకున్నారు. ఇందుకు స్పందించిన వీరు యంత్రాలు, పరికరాలను బాగు చేయించి సత్వరమే శుద్ధి నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సుమారు రూ.3 లక్షల పంచాయతీ నిధులతో కొత్త మోటారు, ఫిల్టర్లు, యంత్ర పరికరాలు అమర్చి వినియోగంలోకి తీసుకొచ్చారు. సుమారు నెలన్నర బాగానే పనిచేసినా, ఆ తరువాత మళ్లీ పాడైంది. అల్ప విద్యుత్తు కారణంగా చెబుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని పంచాయతీ అధికారి సతీశ్‌కుమార్ తెలిపారు.

నిరుపయోగంగా మంచినీటి శుద్ధి కేంద్రం

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఆపదలో ఆదుకున్న వారిని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుంటారని జడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జీ అన్నారు. శ్రీనివాసపురంలో లూథరన్ మినిస్ట్రీస్ అధినేత జాన్సన్ పాస్టర్ ఆర్థిక సాయంతో ఇటీవల తుపాను నేపథ్యంలో ఇబ్బందులు పడిన జంగారెడ్డిగూడెంలోని ఉప్పలమెట్ట, శ్రీనివాసపురంలోని 150 పేద కుటుంబాలకు నిత్యావసర సరకులను ఆదివారం అందించారు.

అందజేస్తున్న బాబ్జీ తదితరులు

పనులు మానుకుని.. పనికట్టుకుని కూర్చుని..

చింతలపూడిలో తాగునీటికి కటకట

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రంలో గొంతు తడుపుకొనేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు సరఫరా చేస్తారో తెలియక పనులు మానుకుని తాగునీటి కోసం ఎదురుచూస్తున్నామని చెబుతున్నారు.

మూడు రోజులుగా.. చార్లెస్‌నగర్, భట్టువారిగూడెం, వైఎస్సార్ కాలనీ, వెలమపేట కాలనీ, ఎస్వీఎన్ కాలనీల్లో మెరక, శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మూడు రోజులుగా తాగునీరు లేక ఎప్పుడు సరఫరా చేస్తారో తెలియక అర్ధరాత్రి వరకూ ఎదురు చూస్తున్నట్లు సుప్రియన్‌పేట వాసులు చెబుతున్నారు. ప్లాస్టిక్ డ్రమ్ములు అద్దెకు తెచ్చుకుని ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుకొంటున్నామని తుక్కులూరు కాలనీ ప్రజలు చెప్పారు. పట్టణంలో తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతుందని, వెంటనే పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సుప్రియన్‌పేటలో అర్ధరాత్రి తాగునీటికి మహిళల నిరీక్షణ

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం..

పట్టణంలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. సుప్రియన్‌పేటలో మోటార్ మరమ్మతులు చేయిస్తున్నాం.' అని నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు తెలిపారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..

జంగారెడ్డిగూడెం:	80085 74478
కొయ్యలగూడెం:	80085 74947
చింతలపూడి:	76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి మోడల్ కాలనీలో డ్రెయిన్ లేక మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోంది. ఇబ్బంది పడుతున్నాం. దోమలు విజృంభిస్తున్నాయి. **- సురేంద్ర, మోడల్ కాలనీ**

✔ మురుగునీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ? కొయ్యలగూడెంలో దోమల సమస్య అధికంగా ఉంది. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా దోమల నివారణకు ఫాగింగ్ చేయలేదు. రాత్రుళ్లు అయితే ప్రజలు ఇబ్బంది పడుతున్నాం. **- గెద్దా మూర్తి, స్థానికుడు**

✔ దోమల నివారణకు వెంటనే చర్యలు తీసుకుంటాం. **- జగదీశ్, పంచాయతీ కార్యదర్శి**

శివాలయాల్లో రుద్రాభిషేకం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా కొయ్యలగూడెం శివారు అంకాలగూడెం శివాలయంలో భోగలింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. దాదాపు నాలుగు గంటల పాటు వివిధ అభిషేకాల్లో భక్తులు పాల్గొన్నారు. పులివాగు శివాలయం, కన్నాపురం రసలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద కూడా రుద్రాభిషేకం చేశారు.

కామవరపుకోట, న్యూస్‌టుడే: తడికలపూడిలోని గంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్రోత్సవం నిర్వహించారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం శివాలయంలో స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు.

శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఆదివారం కొనసాగింది. సెలవు రోజు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సామాన్య భక్తులు స్వామిని దర్శించుకోవడానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ఆర్వీ చందన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుబ్బల మంగమ్మ గుడికి భక్తుల తాకిడి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గుడికి వెళ్లే అడవిలోని మార్గం భక్తుల రద్దీతో సందడిగా మారింది.

ఆంజనేయస్వామికి సహస్ర పుష్పార్చన

పోలవరం, న్యూస్‌టుడే: గూటాల ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సందర్శించి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపడతామన్నారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేశారు. పోలవరంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర పుష్పార్చన నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు: ఏఎస్పీ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: శాంతి భద్రతలతో పాటు ప్రజల ప్రశాంత జీవనానికి ఎవరైన భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఏఎస్పీ సుస్మిత అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయ ఆవరణలో పాత నేరస్థులు, రౌడీషీటర్లకు ఆదివారం ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు, పాత నేరస్థులు తమ నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. వారి కదలికలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీ సుభాష్, జంగారెడ్డిగూడెం, లక్కవరం, తడికలపూడి ఎస్సైలు ఎన్.వీరప్రసాద్, జబీర్, చెన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న సుస్మిత

ఆదివాసీ ప్రాంతాన్ని కొత్త జిల్లాలో కలపాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పోలవరం రంపచోడవరం పేరుతో కొత్త జిల్లాగా ఏర్పాటు చేసి, అందులో పోలవరం నియోజకవర్గం మండలాల్లోని ఆదివాసీ ప్రాంతాన్ని కలపాలని కోరుతూ బుట్టాయగూడెం మండలం గుంజవరం, అమ్మపాలెం, చీమలవారిగూడెం గ్రామాల్లో జిల్లా సాధన కమిటీ (ఐకాస) ఆధ్వర్యంలో ఆదివారం గిరిజనులు నిరసన తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పోలవరం నియోజకవర్గంలోని ముంపు మండలాలు, ఇతర మైదాన మండలాల్లోని 28 ఆదివాసీ గ్రామాలను కలపాలన్నారు. నాయకులు కొర్ల రామిరెడ్డి, ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చీమలవారిగూడెంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

శుద్ధి చేసిన తాగునీరు సరఫరా

ఈనాడు కథనానికి స్పందన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మారుమూల గ్రామమైన ఉప్పరిల్ల వాసులకు ముంజులూరు పంచాయతీ ఆధ్వర్యంలో శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 'ఉప్పరిల్లలో మంచినీటి ఎద్దడి' అన్న శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఇన్‌ఛార్జి అభివృద్ధి అధికారి సతీశ్‌కుమార్ స్పందించారు. పదకొండు కిలోమీటర్ల దూరంలోని కన్నాపురం నుంచి ట్రాలీ వాహనంలో సింటెక్స్ ట్యాంకు ద్వారా శుద్ధి నీటిని తెచ్చి స్థానికులకు సరఫరా చేస్తున్నారు.

భూ సదస్సు విజయవంతానికి పిలుపు

కామవరపుకోట, న్యూస్‌టుడే: ఏలూరులోని సీపీఐ కార్యాలయంలో ఈ నెల 13న రాష్ట్ర స్థాయి భూ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనరు టి.వి.ఎస్.రాజు తెలిపారు. బంజరు భూమి సాగుదారులు, వన సంరక్షణ సమితి సభ్యులు హాజరు కావాలని కోరారు. సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తదితర ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

జనసేన సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జనసేన పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనరుగా వామిశెట్టి మధు(కొయ్యలగూడెం), కోకన్వీనర్లుగా దాకారపు మధు (కొయ్యలగూడెం మండలం), నాలి చక్రవర్తి, కాల్నీడి వెంకటమురళి(టి.నరసాపురం)లను నియమిస్తూ శాసనసభ్యుడు చిర్రి బాలరాజు నియామక పత్రం జారీ చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

పట్టుకున్నారు.. సగం పక్కనెట్టారు

అటవీ శాఖలో ఇష్టారాజ్యం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అటవీ శాఖ కన్నాపురం రేంజ్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మారుమూల గ్రామం గుమ్ములూరు పరిసర ప్రాంతాల్లోని అడవిలో అక్రమంగా నరికి తరలించేందుకు సిద్ధంగా ఉన్న సుమారు 150 మారుజాతి బాదుల(కర్రలు)ను రేంజ్ సిబ్బంది గత నెలలో పట్టుకున్నారు. పట్టుకున్న కలపను ఓ లారీలో కన్నాపురంలోని కార్యాలయానికి తరలించారు. ఆ తర్వాత ఆ కర్రలను 24 గంటల లోపు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా.. నిబంధనలకు విరుద్ధంగా సుమారు నెల రోజులుగా అక్కడే ఉంచారు. అనంతరం స్థానికంగానే ఓ వ్యక్తికి విక్రయించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో నామమాత్రంగా సీ-ఫీజు(అపరాధ రుసుము)కింద సుమారు రూ.67వేలు వసూలు చేశారు. అది కూడా నిబంధనలకు విరుద్ధంగా ఒకే వ్యక్తికి రెండు రసీదులను రాయడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

70 బాదులకే రసీదులు

పట్టుకున్నది 150 బాదులైతే రసీదులను 70 బాదులకు మాత్రమే రాశారు, మిగిలిన బాదులేమయ్యాయన్న ప్రశ్న తలెత్తుతోంది. బహిరంగ మార్కెట్లో ఒక్కో బాదు విలువ సుమారు రూ.2000 వరకు ఉండగా, 150 బాదుల విలువ రూ.3 లక్షలు ఉంటుందని లెక్కలు కడుతున్నారు. మిగిలిన 80 బాదులకు రూ.1.60 లక్షలకు అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అది కూడా 70 బాదులకు కేవలం రూ.67 వేలు సీ-ఫీజు వసూలు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని విమర్శిస్తున్నారు.

● అడవిలో వివిధ చోట్ల తాము పట్టుకున్నది 70 బాదులేనని, అవకతవకలకు ఆస్కారం లేదని కన్నాపురం రేంజ్ అధికారి వి.భానుప్రకాశ్ స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతం నుంచి రేంజ్ కార్యాలయానికి చేరవేయడానికి వ్యయప్రయాసలు పడ్డామన్నారు. పట్టుకున్న కలపకు సంబంధించి బాధ్యులను గుర్తించని వ్యక్తులకు సీ-ఫీజు కింద అపరాధ రుసుము విధించామన్నారు. ప్రభుత్వ డిపోలో ఒక బాదు విలువ రూ.500 నుంచి రూ.600 వరకు ఉంటుందని, ఆ మేరకు నిబంధనల ప్రకారం విలువ కట్టి ఆ బాదులను అప్పగించామన్నారు.

శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలని ఆందోళన

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బందంచర్లలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన శ్మశాన వాటికలో ఆక్రమణలను తొలగించాలంటూ స్థానికులు ఆదివారం ఆందోళనకు దిగారు. [illegible] తొలగించాలని పట్టుబట్టారు. ఈ విషయమై తహసీల్దార్ సత్యసాయిబాబా మాట్లాడుతూ.. శ్మశాన భూమిలో ఆక్రమణలు తొలగించి, ఆక్రమించిన వారిపై చర్యలు చేపడతామన్నారు.

విసుగెత్తి.. కంచె కట్టి!

'ఇక్కడ చెత్త పోయరాదు. చెత్త పోసిన వారు శిక్షార్హులు' అని గ్రామాల్లో సూచికలు కనిపిస్తూనే ఉంటాయి. అయినా జనం అక్కడే చెత్త కుప్పలు కుప్పలుగా పోస్తూనే ఉంటారు. దీనిపై విసుగెత్తిన ఓ పంచాయతీ కార్యదర్శి చెత్త పోసే ప్రాంతాల్లో ఇలా కంచెలు కట్టించారు. ఆయన ఆలోచన ఫలితం ఇచ్చినట్లే ఉంది. కంచె కట్టి నెల రోజులు కావస్తోంది. ఎవరు అప్పటి వరకు అక్కడ చెత్త వేయలేదు. [illegible] గ్రామ ముఖద్వారంలో రాజా చెరువు దగ్గర, ఊరి చివరలో తూర్పుకాలువ వంతెన దాటిన తర్వాత రహదారి పక్కన చెత్త కుప్పలు కనిపించడంతో కార్యదర్శి అనిల్.. ఆ ప్రాంతాల్లో ఇలా కంచెలు కట్టించారు. గ్రామంలో ప్రవేశించగానే ఆహ్లాదకరంగా ఉండేలా రహదారి పక్కన గ్రామస్థుల సహకారంతో కొబ్బరి మొక్కలు, పూల మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ

శునకాలతో బెంబేలు

పట్టణంలోని సుప్రియన్‌పేటలో శునకాల బెడదతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రతి వీధిలో శునకాలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పిల్లలను పాఠశాలకు పంపించాలంటే కుక్కలు దాడి చేస్తాయేమోనన్న భయంతో తల్లిదండ్రులు తోడుగా వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల కొందరు వ్యక్తులపై దాడి చేశాయని, శునకాలను సుప్రియన్‌పేటలో లేకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. శునకాలకు ఇటీవల కు.ని శస్త్ర చికిత్సలు చేయించామని కమిషనర్ రాంబాబు తెలిపారు. **- న్యూస్‌టుడే, చింతలపూడి**

మూడు పంచాయతీలుగా విభజించాలి

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రగడవరం పంచాయతీని మూడుగా విభజించాలని తెదేపా నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ముత్తారెడ్డి అన్నారు. కూటమి నాయకులు ప్రగడవరం పంచాయతీలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిపాలనా సౌలభ్యంతో పాటు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మేజర్ పంచాయతీ ప్రగడవరాన్ని మూడుగా విభజించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సాయికిరణ్

కుక్కునూరు, న్యూస్‌టుడే: సీపీఎం కుక్కునూరు మండల ప్రధాన కార్యదర్శిగా యర్నం సాయికిరణ్ ఎంపికయ్యారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఎన్నిక నిర్వహించగా, కొత్త కార్యదర్శి ఎన్నిక ఏకగ్రీవమైంది. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పాల్గొని మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు నూతన కార్యవర్గం పనిచేయాలని సూచించారు. పోలవరం పేరుతో ఏర్పాటవుతున్న జిల్లాలో పోలవరం లేకపోవటం విచిత్రంగా ఉందన్నారు. ఈ నియోజకవర్గాన్ని కూడా కొత్త జిల్లాలో కలిపి, గిరిజన జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రరావు, బుయ్యన శ్రీను, పట్లా లక్ష్మయ్య, రమేష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కామవరపుకోట, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కామవరపుకోట మండలం తడికలపూడిలో శనివారం రాత్రి నాలుగు టన్నుల రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని ఎస్సై చెన్నారావు, ఉప తహసీల్దార్ శేషగిరిరావు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవరు ఆదివిష్ణుని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యల వార్డు

28 వార్డు నివేదన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని 28వ వార్డులో మౌలిక వసతుల కొరత ఉంది. ప్రధానంగా డ్రెయిన్లు, రహదారుల సమస్య వేధిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు నాలాల్లో పడేస్తుండటంతో మురుగు నీరు పారడంలేదు. దీంతో దోమల బెడద ఎక్కువై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. చాలా రహదారులు ఇరుకుగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లోవోల్టేజీ సమస్యతో పాటు పలు ప్రాంతాల్లో సింగిల్ ఫేజ్ లైన్లు ఉండటంతో నాణ్యమైన విద్యుత్తు అందడం లేదు. 'ఈ వార్డు పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపుతాం.' అని పురపాలక కమిషనర్ కె.వి.రమణ తెలిపారు. ● దాదాపు ఈ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. పురపాలక సంఘం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే కడుతున్నారు. పర్యవేక్షణ కొరవడడంతో నిర్మాణదారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ● క్వారీ గుంతల్లో నీరు చేరి చెరువులా తయారైంది. అయితే ఇక్కడి నుంచి మురుగు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో నీరు పసరుదేరింది.

జనాభా : 2000

ప్రాంతాలు: రాజీవ్‌నగర్, గుహాలయం, ముత్యాలమ్మ నగర్, లోకేశ్‌నగర్, తల్లాడ-దేవరపల్లి రోడ్డు బైపాస్

రాజీవ్‌నగర్ రామాలయం ఎదురుగా ఇలా..

టైర్లు పెట్టి.. గుంత ఉందని చెప్పి..

కొయ్యలగూడెంలో తితిదే కల్యాణ మండపం సమీపంలో జాతీయ రహదారి 516డీకి సంబంధించిన డ్రెయిన్‌పై ఆర్‌సీసీ శ్లాబ్ దెబ్బతిని పెద్ద గుంత పడింది. ఆ మార్గంలో రాకపోకలు సాగించే స్థానికులు గుంత కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా.. ఫలితం లేకపోవడంతో చేసేది లేక పక్కనే ఉన్న టైర్ల మరమ్మతు దుకాణం నుంచి ట్రాక్టరు టైర్లు పాతవి రెండు తెచ్చి గుంతపై పెట్టి ప్రమాదాల నివారణకు తమ వంతు ప్రయత్నం చేశారు. ఈ విషయమై ర.భ.శాఖ(ఎన్‌హెచ్) డీఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రెయిను శ్లాబ్‌కు త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ

పీఆర్ ఈఈ కార్యాలయం.. ఖాళీ

వేధిస్తున్న ఇంజినీర్ల కొరత

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఒకరా ఇద్దరా అసలు అసిస్టెంట్ ఇంజినీర్లే లేని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయంగా జంగారెడ్డిగూడెం నిలుస్తోంది. ఏఈలు కొందరు డిప్యుటేషన్లపై ఇతర చోట్ల చేస్తుంటే.. మరి కొందరు పదవీ విరమణ చేశారు. మరి కొన్ని ఏళ్ల తరబడి భర్తీ కావట్లేదు. ఈఈ ఆఫీసులో 4 గురు ఏఈలు ఉండేవారు.. ఇప్పుడు ఒక్కరూ లేరు. ఈ కార్యాలయం పరిధిలో 10 మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో జరిగే రోడ్లు, డ్రెయిన్లు, కార్యాలయాల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఇక్కడి ఏఈలే పర్యవేక్షించాలి. అంచనాల నుంచి పనుల నాణ్యత, అవి పూర్తయిన తరువాత జరిగే తనిఖీలు సైతం.. అంతేకాక పాలనాపరమైన పలు సాంకేతిక విషయాల్లోనూ వీరిది కీలక బాధ్యత. ఈ విధంగా ఏఈల కొరతతో ఆయా పనులన్నీ సక్రమంగా జరగడం లేదు.

మరికొందరు.. ఇక్కడి ఈఈ పీఏ శ్రీనివాసరావు ఈఎన్‌సీ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. కీలకమైన పీఐయూ డీఈ బాలకృష్ణ రాజమహేంద్రవరం ఈఈగా ఎఫ్ఏసీపై వెళ్లారు. అక్కడి నుంచి ఆయన ఈ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. కొయ్యలగూడెం డీఈ సీతయ్య కాకినాడ ఈఈగా ఎఫ్ఏసీపై వెళ్లారు. కీలకమైన ఈ విభాగాలలో పనులు ఇతర అధికారులు, ఉద్యోగులపై పడుతున్నాయి.

బిల్లులకూ.. ఇంజినీర్లే కాదు డివిజన్‌లోని పది మండలాల్లో జరిగే రోడ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల మంజూరు తదితరాలకు సంబంధించి డీఏవో (వర్క్స్) కూడా ఏడాదిన్నరగా లేరు. మొత్తంగా కీలకమైన ఇంజినీర్లు, కార్యాలయ అధికారులు లేకపోవడంతో పీఆర్ విభాగంలో పలు పనులు ముందుకు సాగని పరిస్థితి. పరోక్షంగా ఇది అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. 'ఇంజినీర్ల భర్తీ కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.' అని ఈఈ కె.శ్రీను తెలిపారు.

పందేల రహిత సంక్రాంతి చేసుకుందాం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి గోదావరి జిల్లాలో రానున్న సంక్రాంతిని కోడి పందేలు, జూదాలు రహితంగా చేసుకుందామని.. ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.సూర్యకిరణ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం డీవైఎఫ్ఐ నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడిన నెల్లూరు జిల్లా యువజన నాయకుడు పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేయడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నాయకులు ఎన్.శరత్‌చంద్ర, పంపన రవికుమార్, మనోజ్, లోకేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ ట్రోఫీ నూజివీడు ట్రిపుల్‌ఐటీదే

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీ శ్రీకాకుళం స్పోర్ట్స్ బోర్డు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో శ్రీకాకుళం క్యాంపస్‌లో ఇంటర్ యూనివర్సిటీ క్యాంపస్ టోర్నమెంట్ నిర్వహించారు. శ్రీకాకుళం డైరెక్టర్ ధనబాలాజీ పోటీలను శనివారం ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఫైనల్స్‌లో పోటీ పడ్డారు. నూజివీడు విద్యార్థులు ట్రోఫీని కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం సాధించింది. ద్వితీయ స్థానాన్ని నూజివీడు బాలికలు సాధించారు. నూజివీడు డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఆర్సీఎం అగ్ర పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని అమలోద్భవి మాత దేవాలయ వార్షికోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. రెవ ఫాదర్ ఇంజే పౌ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వసతి గృహంలోని విద్యార్థినులకు నూతన వస్త్రాలు అందజేశారు. బిషప్ జయరావు మాట్లాడుతూ.. బాలికల అభ్యుదయానికి తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లిన లారీ

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలోని స్టేట్ బ్యాంకు సమీపంలో ద్విచక్ర వాహనాలపై లారీ దూసుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ప్రమాదంలో దాదాపు 10 వరకు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. జంగారెడ్డిగూడెం వైపు నుంచి కొవ్వూరు వైపు వెళ్తున్న లారీ వేగంగా రావడంతో రహదారి పక్కన నిలిపిన ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయని చెబుతున్నారు.

బురద.. దోమల బెడద

కట్కూరు పంచాయతీ టేకూరులో ఆరు నెలలుగా మంచినీటి కుళాయి వద్ద పైపులైను లీకవడంతో మురుగు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉండటంతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. సమస్యను అధికారులకు తెలియజేసినా.. పట్టించుకోవట్లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వేలేరుపాడు గ్రామీణ**

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: షష్ఠి ఉత్సవాల్లో వాలంటీర్లుగా పని చేసిన కళాశాల విద్యార్థుల సేవలు అభినందనీయమని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. సింగరాయపాలెంలో ఆదివారం సాయంత్రం వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, చిన్న అపశ్రుతులు సైతం జరగకుండా సేవలను విద్యార్థులు సమర్థంగా నిర్వహించారన్నారు. అనంతరం వారికి ఆలయం తరఫున స్వామివారి ప్రసాదాలను అందించారు. కైకలూరు టౌన్ సీఐ రామకృష్ణ, ఎస్సై వీరభద్రరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మా.. శరణు.. శరణు

కైకలూరు, న్యూస్‌టుడే: శరణార్థులను రక్షించే కొల్లేటి కల్పవల్లి పెద్దింట్లమ్మ శరణు.. శరణు అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. కైకలూరు మండలం కొల్లేటికోటలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ దేవస్థానానికి ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో కుంకుమాభిషేకాలు, క్షీరాభిషేకాలు, సహస్ర నామావళి, నిజరూప దర్శనం, మండపప్రాంగణంలో పంచ హారతులు, ధూప సేవ తదితర పూజలు వైభవోపేతంగా నిర్వహించారు. సాధారణ భక్తులు, అమ్మవారి మాలధారులు, మహిళలు పాల పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ భక్తులకు సౌకర్యాలను పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు: 80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు: 93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు: 73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి: 90594 84862	ముదినేపల్లి: 8008574693

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ? ఆగిరిపల్లి-చొప్పరమెట్ల రోడ్డులోని పెట్రోల్ బంక్ పక్కన వీధిలో సుమారు నెల రోజులుగా దీపాలు వెలగక అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. - గోపాల్, ఆగిరిపల్లి.

✔ ఆ ప్రాంతంలో వెంటనే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - జి.ఆనంద్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో.

స్పందనకు వందనం

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు నాలుగో వార్డులో పంచాయతీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని గ్రామస్థుడు 'హేమంత్' 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై.ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కొత్తవి ఏర్పాటు చేయించారు.

వ్యాయామ విద్య.. మిథ్యేనా?

వసతులు లేక అవస్థల ఆటలు

అడవినెక్కలం(ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. మరికొన్ని పాఠశాలల్లో సువిశాలమైన క్రీడా మైదానాలు ఉన్నప్పటికీ వాటిలో అవసరమైన క్రీడా కోర్టులు లేకపోవడం, వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో విద్యార్థుల సాధనకు నిరుపయోగంగా మారాయి. చిన్నపాటి వర్షానికి సైతం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. నియోజకవర్గంలో 261 ప్రభుత్వ పాఠశాలల్లో 16,932 మంది విద్యార్థులు చదువుతున్నారు. సరైన వసతులు లేక పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు.

నియోజకవర్గ వివరాలు..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
నూజివీడు	90	5,660
ఆగిరిపల్లి	51	3,958
ముసునూరు	59	3,275
చాట్రాయి	61	4,019

ఎక్కడెక్కడ ఎలా ఉన్నాయంటే..

ఆగిరిపల్లి మండలం నెక్కలం జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం అంతంత మాత్రమే. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మిగిలిన పాఠశాలల్లో ఎక్కడా సరైన క్రీడా కోర్టులు లేవు. నూజివీడు బాలికల ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం లేదు. బాలుర ఉన్నత పాఠశాలలో సైతం అంతంత మాత్రమే. మిగిలిన పాఠశాలల్లో మైదానాలు ఉన్నప్పటికీ కోర్టులు లేవు. ముసునూరు మండలం రమణక్కపేట, వేల్పుచర్ల, కాట్రేనిపాడు పాఠశాలల్లో మైదానాల కొరత ఉంది. చాట్రాయి మండలం గుడిపాడు ఉన్నత పాఠశాలల్లో క్రీడా స్థలం లేదు. ప్రతి పాఠశాలలో ఒకటి రెండు కోర్టులు మాత్రమే ఉన్నాయి. వాటిపై సరైన పర్యవేక్షణ లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు క్రీడల సాధనకు ప్రోత్సాహం లేక అవకాశాలు కోల్పోతున్నారు.

ప్రహరీ లేని అడవినెక్కలం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానం

దృష్టి పెడతాం..

పాఠశాలల్లో మైదానాలు, కోర్టులు అభివృద్ధిపై దృష్టి పెడతాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - పి.ఎస్.సుధాకర్, డీవైఈవో, నూజివీడు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ముసునూరు, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం ముసునూరు మండలం బలివె రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమరకాశుల, బుర్రారావు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారితో పాటు రాజ రాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో సీతారామయ్య, ఛైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు.

మార్గశిర ఆరుద్ర రుద్రాభిషేకం.. చాట్రాయి, న్యూస్‌టుడే: మార్గశిర మాస ఆరుద్ర నక్షత్రం సందర్భంగా చిన్నంపేట భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేకువ జామునే రుద్రాభిషేకం నిర్వహించారు. సి.గుడిపాడు, చాట్రాయి, జనార్దనవరం, కోటపాడు, పోలవరం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

శివోహం.. కలిదిండి, న్యూస్‌టుడే: ప్రయోధిక ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని కలిదిండిలోని పార్వతి సమేత పాతాళ భోగేశ్వర స్వామి, కోరుకొల్లులోని సోమేశ్వరస్వామి ఆలయాల్లో శివపూజలు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పండ్లతో అభిషేకాలు నిర్వహించారు. రుద్రాభిషేకం చేశారు. ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మల్లికార్జున స్వామి.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని దుర్గాపార్వతీ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో ఆదివారం మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మహాన్యాస పూర్వక ఏకవారాభిషేకం, పంచామృత, ఫలామృత అభిషేకాలు, సహస్ర నమార్చనలను ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చిన్న యంత్రం.. పెద్ద ప్రయోజనం

చాట్రాయి, న్యూస్‌టుడే: కూలీల కొరత అధిగమించడానికి రైతులు ఆధునిక యంత్ర పరికరాలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట సాగు చాట్రాయి, ముసునూరు మండలాల్లో అత్యధికంగా ఉంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే నేపథ్యంలో విత్తడంకు కూలీల సమస్య ఉన్నందున వీడర్ యంత్రాన్ని వాడుతున్నారు. రైతులు చేతితో నెట్టే వీడర్ యంత్రంతో సులువుగా విత్తనాలు నాటుతున్నారు. రెండు కిలోల విత్తనాలు నింపితే రోజుకు రెండెకరాలకు పైగా విత్తేలా చేయొచ్చు. మొక్కజొన్న విత్తడంకు ఎకరాకు రెండు వేల వరకు కూలీలకు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చును అధిగమించడంతో పాటు రైతు కుటుంబాల్లో వృద్ధులు దాన్ని నడిపేయవచ్చు. చాట్రాయి, ముసునూరు మండలాల్లో చాలామంది వీటిని వాడుతూ ప్రయోజనాలను పొందుతున్నారు.

ప్రతిభ చాటి.. బహుమతులు గెలిచి..

'ఈనాడు' ఆధ్వర్యంలో పోటీలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: యువత తమ చేతుల్లో ఉండే మొబైల్ ఫోన్‌ను మంచికి వినియోగిస్తే చదువులోని వివిధ అంశాలపై శ్రద్ధ పెంపొందుతుందని ప్రిన్సిపల్ బ్రదర్ ఎం.కిశోర్‌కుమార్ తెలిపారు. శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రథమ స్థానం బి.మంజుల రాణి(9వ తరగతి), ద్వితీయ ఆర్.లేఖన(8వ తరగతి), తృతీయ స్థానం డి.అపర్ణ(8వ తరగతి) సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ కిశోర్‌కుమార్

గొల్లపల్లి శివార్లలో ఉన్న న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రథమ స్థానం జి.సాయి నివేద్య(9వ తరగతి), ద్వితీయ స్థానం డి.అక్షయ(9వ తరగతి), తృతీయ స్థానం నిఖిత(9వ తరగతి)లు దక్కించుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ శ్రీరమ, కరస్పాండెంట్ రత్నశేఖర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

గెలుపొందిన చిన్నారులతో ప్రిన్సిపల్ శ్రీరమ, ఉపాధ్యాయులు

వాలీబాల్ ట్రోఫీ నూజివీడు ట్రిపుల్‌ఐటీదే

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ ఐఐఐటీ శ్రీకాకుళం స్పోర్ట్స్ బోర్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో శ్రీకాకుళం క్యాంపస్‌లో ఇంటర్ యూనివర్సిటీ క్యాంపస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. శ్రీకాకుళం డైరెక్టర్ ప్రొ. కేవీజీడీ బాలాజీ ఈ పోటీలను శనివారం ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఫైనల్‌లో పోటీ పడ్డారు. నూజివీడు విద్యార్థులు ట్రోఫీని కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం సాధించింది. ద్వితీయ స్థానాన్ని నూజివీడు బాలికలు సాధించారు. నూజివీడు డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఇంటింటా విత్తన శుద్ధి

మండవల్లి, న్యూస్‌టుడే: వరి కోతలు పూర్తయిన వేళ మండవల్లి మండలంలోని అల్లీనగరంలో ప్రకృతి వ్యవసాయ ఆధ్వర్యంలో ఇంటింటా విత్తన శుద్ధి చేపట్టారు. వరి సాగు తర్వాత రైతులంతా మినుము సాగుపై దృష్టి సారించడంతో ప్రకృతి వ్యవసాయ ఎఫ్‌ఎంటీ నాగ విజయ ఆధ్వర్యంలో బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించడంతో అల్లీనగరంతో పాటు కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, కొర్లపాడు గ్రామాల్లో రైతులు ప్రకృతి సాగుపై ఆసక్తిని చూపిస్తున్నారు. ఐసీఆర్పీ నాగవాణి పాల్గొన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియగా అన్ని గ్రామాలను అభివృద్ధి పరచాలన్నదే లక్ష్యంగా సమన్వయంగా పనిచేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. శ్రీహరిపురంలో సుమారు రూ.16 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణం పనులను ఆయన ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. త్వరితగతిన, నాణ్యతతో నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. సర్పంచి విశ్వేశ్వరరావు, వార్డు సభ్యులు నీలం సుబ్బారావు, విష్ణుమూర్తుల నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, సర్పంచి

ప్రమాదం తప్పింది.. చింత తీరింది..

ఈనాడు స్పందన

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి-చొప్పరమెట్ల మార్గంలో పెట్రోల్ బంక్ పక్కన శ్రీనివాసనగర్‌లో విద్యుత్తు స్తంభం ధ్వంసమై ఇనుప చువ్వలు బయటకు వచ్చి కూలేందుకు సిద్ధంగా ఉంది. దాంతో ఆ స్తంభం ఎప్పుడు కూలుతుందోనని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంతో శనివారం 'ఈనాడు'లో 'ఆదమరిస్తే.. అంతే సంగతులు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దాంతో స్పందించిన విద్యుత్తు శాఖ ఏఈ ఎస్.కె.మస్తాన్ ఖాన్ ఆదేశాలతో ఆదివారం లైన్‌మేన్ శోభన్‌బాబు విరిగిన విద్యుత్తు స్తంభాన్ని తొలగించి నూతన విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారమవటంతో స్థానికులు హర్షం తెలిపారు.

శోభనాచలుడి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆదివారం మార్గశిర బహుళ తదియ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు వేదాంతం శేషుబాబు శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మారగాని పూర్ణచంద్రరావు దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు.

కానరాని చెత్త శుభ్రత



కృష్ణారావుపాలెంలో సంపద కేంద్రం

చాట్రాయి, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సేకరణ లక్ష్యానికి పంచాయతీలను చేరువ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అవి చిట్టడివిలో 'శిథిల' కట్టడాల్లా మారాయి. తెదేపా హయాంలో కృష్ణారావుపాలెంలో నిర్మించి చెత్త శుద్ధి కేంద్రం నిర్లక్ష్యానికి చిరునామాగా మారింది. చిన్న పంచాయతీగా ఉన్న ఇక్కడ ఆర్థిక వనరులు అంతం మాత్రంగానే ఉన్నాయి. చెత్త సేకరణకు నిధుల సమస్య పట్టి పీడిస్తోంది. ప్రతి మూడో శనివారం పారిశుద్ధ్యంపై అధికారుల హడావుడి మినహా చేసేది శూన్యమనే విమర్శలు వస్తున్నాయి. వీటి పనితీరును కాగితాలపై నడిచేలా చేస్తున్నారు. వీటిని వినియోగంలోకి తీసుకు వస్తే పంచాయతీకి ఆర్థిక వనరుల్లో చేయూతగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

పాఠశాలలో ప్రమాదకరంగా బావి

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పాడుబడిన బావి ప్రమాదకరంగా మారింది. 1948లో విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు బావిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బావి పాడైపోయి ప్రమాదకరంగా మారింది. బావి సమీపంలోనే విద్యార్థులు ఆటలు ఆడుకుంటున్నారు. కనీసం ఆ బావి పూడ్చివేయడం కానీ, చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయకుండా అలాగే వదిలేశారు. ఆటలాడుకుంటూ తమ పిల్లలు బావిలో పడే ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయురాలు శైలజను వివరణ కోరగా బావిని పూడ్చి వేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దారి అధ్వానం.. ఎలా ప్రయాణం..?

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి-నరసాపురం మధ్య రహదారి అధ్వానంగా తయారైంది. పలుచోట్ల కోతకు గురై కంకర రాళ్లు బయటకు వచ్చాయి. ఎక్కువ చోట్ల గుంతలు పడి వాహనాలు తప్పుకొనే వీల్లేకుండా మారింది. ఎదురుగా వాహనాలు వచ్చే సమయాల్లో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి చోదకులు కింద పడుతున్నారు. రాత్రి సమయాల్లో దారి కనిపించక గోతుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట-వెలగలపల్లి రోడ్డులో భారీ వాహనాలు భారీ ఎత్తున తిరుగుతున్నాయి. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా గోతులు పూడ్చే పనులు చేపట్టడం లేదు. త్వరలోనే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తామని ర.భ.శాఖ నూజివీడు డీఈ సీహెచ్ బాబూరావు తెలిపారు.

తాగునీటి కాలువలో కోళ్ల వ్యర్థాలు

మండవల్లి, న్యూస్‌టుడే: కైకలూరు నియోజకవర్గంలోని లక్షల మంది దాహార్తిని తీర్చుతున్న పోల్‌రాజ్ కాలువపై అక్రమార్కులు మాంసం దుకాణాన్ని ఏర్పాటు చేసినా.. ఆరు నెలలుగా అధికార యంత్రాంగం కనీసం అటు చూడటం లేదు. కోడి వ్యర్థాలు, ఈకలను నేరుగా పోల్‌రాజ్ కాలువలో వేస్తూ నీటిని కలుషితం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మాంసం దుకాణాలను మంచినీటి కాలువ గట్లపై ఏర్పాటు చేస్తుంటే.. పంచాయతీ, జలవనరుల శాఖ అధికారులు అటువైపు చూడకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం. పలుమార్లు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై జలవనరుల శాఖ ఏఈ సత్యనారాయణను సంప్రదించగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమాధానమిస్తున్నారు.

మెరుగైన సమాజాన్ని నిర్మిస్తున్న సహకార రంగం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సహకార సంఘాలు మెరుగైన సమాజాన్ని నిర్మిస్తాయని విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు నూజివీడు బ్రాంచ్ మేనేజర్ యర్రా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం అమర్ భవన్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సహకార సూత్రాలు, విలువలు తు.చ. తప్పకుండా పాటిస్తూ భారత దేశ అర్బన్ బ్యాంకింగ్ రంగంలో ఈ బ్యాంక్ నడుస్తోందని చెప్పారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, బ్యాంక్ వైస్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. బంక వెంకట శివశంకర్, నక్కా రామకృష్ణ, పొట్టిక అన్నవరం, బొబ్బిడి శివగౌరి నీలిమ లు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక పారాయణం పోటీల్లో పాల్గొన్న భక్తులు

ఆసక్తిగా గీతా టాలెంట్ షో నిర్వహణ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సప్తమహర్షి గీతా టాలెంట్ షోను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూజివీడులోని కనకం కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీ తెలంగాణ కర్నాటక రాష్ట్రాల నుంచి హాజరైన భక్తులు భగవద్గీత శ్లోక పారాయణం పోటీల్లో పాల్గొని పోటీ పడ్డారు. సనాతన గురు కృప ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాడుగుల రమ్యశ్రీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గణపతి సచ్చిదానంద ఆశ్రమ పర్యవేక్షకుడు విజయానంద తీర్థ స్వామిజీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై భక్తులకు దిశా నిర్దేశం చేశారు. భగవద్గీత ప్రతి ఇంటిలో ఉండాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు.

అపరాల విత్తనాలకు పాట్లు

లైసెన్సులు లేని ప్రైవేటు వ్యాపారులే దిక్కు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగు అష్టకష్టాలు పడి ఎట్టకేలకు గట్టెక్కుతుంటే మరో పక్క రబీ సాగుకు ఆదిలోనే విత్తనాలు ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో ప్రభుత్వం రబీ సాగుకు ముందుకు సబ్సిడీపై మినుము, పెసర విత్తనాలు రైతులకు సరఫరా చేసేది. ప్రస్తుతం ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం మినీ కిట్లు మినహా విత్తనాలు పంపిణీ చేయలేదు. దీనికి తోడు లైసెన్స్‌డ్ విత్తనాల వ్యాపారులు మినుము విత్తనాలు విక్రయించడం లేదు. దీంతో రైతు వారీ, ప్రైవేటు వ్యాపారులే దిక్కయ్యారు. ఎకరానికి 25కిలోలు నుంచి రూ.30 కిలోల వరకు విత్తనాలు చల్లుతారు. ఆ విత్తనాల కోసం సుమారు 10 నుంచి కిలోమీటర్ల దూరంలో ఉన్న ముదినేపల్లి వచ్చి కొనుక్కుంటున్నారు. దీనిపై వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్‌ను సంప్రదించగా 30 శాతం రాయితీపై వీబీఎన్ రకం అందుబాటులో ఉందన్నారు. అయితే రైతులు గతంలో ఆ విత్తనాలు వల్ల నష్టపోయామని అవి వద్దనడంతో రప్పించలేదని చెప్పారు. ఏ విత్తనం అమ్మాలన్నా లైసెన్సు తప్పక ఉండాలన్నారు. రాయితీపై కంటే బయట మార్కెట్టులోనే మినుము విత్తనాలు తక్కువ ధరకు లభిస్తున్నట్లు రైతులు తెలిపారని ఆయన వివరించారు.

మినుము విత్తనాలు తీసుకెళ్తున్న రైతు

హత్యాయత్నం కేసు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: చిగురుకోట శివారు నరసన్నపాలెంలో శనివారం సాయంత్రం స్వల్ప విషయమై చోటు చేసుకున్న గొడవలో సీసా పగులగొట్టి యువకుడిని పొడిచిన సంఘటనపై ఎస్సై వీరభద్రరావు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరానికి చెందిన బోనం దేవీ కోటేశ్వర ప్రసాద్ గుడివాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అధిక రక్త స్రావం కావడంతో శస్త్రచికిత్స నిర్వహించి సుమారు ఎనిమిది యూనిట్ల రక్తం ఎక్కించారు. క్షతగాత్రుడు మేనమామ కుంచె రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులు బత్తుల సత్యనారాయణ లారీ డ్రైవర్‌గా, బి.రామకృష్ణ కైకలూరు మండలంలో వీఆర్వోగా పని చేస్తున్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా పిచ్చోడు మాస్టారు

మండవల్లి, న్యూస్‌టుడే: యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరిగిరి పిచ్చోడు ఎన్నికయ్యారు. ఆదివారం దెందులూరులో నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో సంఘం నూతన ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పిచ్చోడును సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా నాయకులతో పాటు కైకలూరు నియోజకవర్గంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని బత్తులవారిగూడెంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచి ముసునూరు లక్ష్మీకాంతమ్మ ప్రారంభించారు. తెదేపా మండల మాజీ అధ్యక్షులు ముసునూరు రాజా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం రైతులను ఆదుకునే ఉద్దేశంతో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని రాజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందాడ తిరుపతిరావు, మూడు తిరుపతిరావు, గరికపాటి పూర్ణ, కొలుసు ఆంజనేయులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పందేలు రహిత సంక్రాంతిని చేసుకుందాం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి గోదావరి జిల్లాలో రానున్న సంక్రాంతిని కోడి పందేలు, జూదాలు రహితంగా చేసుకుందామని.. ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.సూర్యకిరణ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం డీవైఎఫ్ఐ నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడిన నెల్లూరు జిల్లా యువజన నాయకుడు పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేయడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నాయకులు ఎన్.శరత్‌చంద్ర, పంపన రవికుమార్, మనోజ్, లోకేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో మొక్కల పెంపకం

కోరుకొల్లు(కలిదిండి), న్యూస్‌టుడే: కోరుకొల్లు సోమేశ్వరాలయంలో ప్రవాసాంధ్రుడు వర్రే వెంకట సత్యనారాయణ, నీరజ దంపతుల సహకారంతో మొక్కల పెంపకం చేపట్టినట్లు వర్రే జగన్నాథం ఛారిటబుల్ ట్రస్టు కార్యదర్శి సీహెచ్ కృష్ణ తెలిపారు. ఆలయ వద్దనున్న ఖాళీ స్థలంలో పండ్లు, పూల మొక్కలు శనివారం నాటారు. గతంలో ఈ ఆలయం వద్ద రూ.2 లక్షలతో నక్షత్ర వనం ఏర్పాటు చేసి, చుట్టూ ఇనుప కంచె నిర్మించినట్లు ఆయన వివరించారు.

విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పదోతరగతి విద్యార్థులకు మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తోందని ఎంఈవో ఎస్.హేబేలు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం సెలవు రోజుల్లో కూడా పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తారని స్పష్టం చేశారు.

వీటి సంగతేంటి సారూ

- రౌడీయిజం చేస్తున్న కోతులు
- రహదారులపై యథేచ్ఛగా జంతువుల విహారం

మండవల్లి, న్యూస్‌టుడే: ఇంట్లో ఆదమరిచి ఉన్నారా..? ఒక్కసారిగా కోతులు వచ్చి ఇళ్లు పీకి పందిరి వేస్తున్నాయి. వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం చేశారా? ఎదురు తిరిగి దాడులు చేస్తున్నాయి. పందులు వచ్చి ఇంటి పరిసరాల్లో దూరి మరీ ఆస్తులను నష్టం కలిగిస్తున్నాయి. రోడ్డు పైనే ఇష్టారాజ్యంగా ఆవులు, ఎద్దులు కుమ్ముకోవడంతో ముగ్గురు వాహనదారులు ఇటీవల మృతి చెందారు. ఇక కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ కనిపించిన ప్రతివారిపై దాడులు చేస్తున్నాయి. వీటిని బాధ్యత తీసుకోవాల్సిన పంచాయతీలు కనీసం పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

ఆనందపురంలో కోతి మూకలు

రోడ్లపై పశువుల హల్‌చల్

కైకలూరు నియోజక వర్గంలోని అన్ని ప్రధాన గ్రామాల్లో రోడ్లపై పశువులు రాత్రి వేళల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ గ్రామాల్లోని ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి. రోడ్డుపై పడుకోవడంతో వాటిని ఢీకొట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవడంతో పాటు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

లోకుమూడిలో రోడ్డుపై ఆవులు

పందులతో బెంబేలు

మండవల్లి మండల కేంద్రం ఎస్సీకాలనీ, కైకలూరు ఎస్సీ, దాణగూడెం, ఆటపాక, దొడ్డిపట్ల, ఆలపాల కలిదిండి మండల కేంద్రం, గుర్వాయిపాలెం, మూలలంక పందుల ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. వీటిని పెంచరాదని పలుమార్లు ఆయా పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేదు.

చర్యలు తీసుకుంటాం

పంచాయతీలలో ఇష్టారాజ్యంగా సంచరిస్తున్న పశువులు, పందులు, కోతుల, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీలను ఆదేశిస్తా. అందుకు తగ్గ ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- వై.అమ్మాజి, డీఎల్‌పీవో**

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

విద్యుద్దీప కాంతులతో బెరాకా ప్రార్థన మందిరం

ఆగిరిపల్లి, ముదినేపల్లి, న్యూస్‌టుడే: నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లోని చర్చిలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. క్రైస్తవుల నివాస కాలనీల్లో, చర్చిల వద్ద క్రిస్మస్ స్టార్లను, ట్రీలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు.

(c) eenadu

రామలింగేశ్వరా కళ వరించగా

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం, ఆదివారం కలిసిరావడంతో శ్రీ ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధాన్యం వరి కంకులతో ధాన్య పరమేశ్వరుడుగా అలంకరణ చేశారు. రైతు బాగుండాలని, పంటలు సక్రమంగా చేతికిరావాలని ప్రత్యేకమైన పూజలు చేసినట్లు ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు. **- న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

ఇక్కడింతే.. 2 తరగతులు x 1 గది = 2 పాఠాలు

గొల్లప్రోలు పాపయ్యచావిడి వీధిలో గల నంబర్-2 ప్రాథమిక పాఠశాలకు రెండు గదులు ఉండగా వాటిలోనే అయిదుగురు ఉపాధ్యాయులు అయిదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ పాఠశాలకు 3 గదుల భవనం మంజూరు చేసినా తరువాత రెండు గదుల నిర్మాణానికి మాత్రమే నిధులు కేటాయించారు. ఈ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోగా కూటమి ప్రభుత్వం పనులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయించింది. ఒక్కొక్క గదిలో రెండేసి తరగతులు నిర్వహిస్తూ మరొక తరగతిని వరండాలో కొనసాగిస్తున్నారు. నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈవో శ్రీనివాసరావు, ఎంఈవో-2 శివప్రసాద్ తెలిపారు. **- న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

వినండి ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అక్కడి విద్యార్థులు 'జేఎన్‌వీ రేడియో' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం ప్రార్థన సమయంలో రేడియోలో వార్తలు చదివే మాదిరిగా.. వివిధ దినపత్రికల్లో వచ్చే ప్రధాన వార్తాంశాలను 10 నిమిషాలపాటు మూడు భాషల్లో చదువుతారు. విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం చేరవేయాల్సిన పలు అంశాలను ఈ మాధ్యమం ద్వారానే అందిస్తున్నారు. రోజూ ఓ గంట పాటు విద్యార్థులు ముఖాముఖి, గీతాలు ఆలపించడం, జోకులు, పుస్తక సమీక్ష, వివిధ ప్రసంగాలు చేస్తున్నారు. వీటి వల్ల విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు పెరగడంతో పాటు, బిడియం పోతుందని ప్రిన్సిపల్ సీతాలక్ష్మి తెలిపారు. **-ఈనాడు, రాజమహేంద్రవరం**

రేడియో సంభాషణలో విద్యార్థులు

సర్వే తప్పులు.. సరిచేయక తిప్పలు

వెబ్‌ల్యాండ్-2.0లో సవరణపై తీవ్ర జాప్యం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

గత ప్రభుత్వంలో హడావుడిగా చేపట్టిన భూముల రీ-సర్వేలో జరిగిన తప్పుల సవరణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినా, రెవెన్యూ, సర్వేశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూ యజమానులు అందుబాటులో లేరని కొన్నిచోట్ల ఇద్దరు, ముగ్గురికి కలిపి జాయింట్ ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్)లు జారీ చేశారు. ఈ ప్రక్రియతో రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్, ఇతర సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు వంటి అనేక సౌకర్యాలను కోల్పోతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం వచ్చాక.. గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. రూ.50కే జాయింట్ ఎల్‌పీఎంల విభజనకు అవకాశం కల్పించారు.

అంతా నత్తనడకన..

కాకినాడ జిల్లాలో 2,580 జాయింట్ ఎల్‌పీఎంలను సబ్ డివిజన్ చేసి, ఈ వివరాలను వెబ్‌ల్యాండ్-2.0లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ, సర్వేశాఖ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసి, వీటిని విభజించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ జిల్లాలో నత్తనడకగా సాగుతోంది. సిబ్బంది తయారు చేసిన పత్రాలను తహసీల్దారు, ఆర్డీవో, సంయుక్త కలెక్టర్ల ద్వారా ఆమోదించి, వాటిని వెబ్‌ల్యాండ్-2.0లో సవరించడం ద్వారా ప్రతి రైతుకు సింగిల్ ఎల్‌పీఎంలు జారీ చేయాలని లక్ష్యంగా చేసుకున్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 2,580 జాయింట్ ఎల్‌పీఎంలకు ఇప్పటికి కేవలం 919 సవరించారు. ఇంకా 1,661 పెండింగ్‌లో ఉన్నాయి. పీజీఆర్ఎస్‌లో దీనిపైనే ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయి. డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ఈ నెల 15లోగా మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

పిఠాపురం మండలంలో జాయింట్ ఎల్‌పీఎంలపై సర్వే చేస్తున్న సిబ్బంది

ఇదీ వెబ్‌ల్యాండ్‌లో సవరణ పరిస్థితి

డివిజన్	జేఎల్‌పీఎంలు	సవరించినవి	పెండింగ్
కాకినాడ	1,761	663	1,098
పెద్దాపురం	819	256	563

కోటనందూరు మండలం, భీమవరపుకోటకు చెందిన కాపారపు రత్నానికి ఆమె తల్లి ద్వారా 23 సెంట్ల భూమి సంక్రమించింది. ఆమె సోదరికి మరో 23 సెంట్లు భూమిని ఇచ్చారు. రీసర్వేలో 46 సెంట్లు భూమికి జాయింట్ ఎల్‌పీఎం జారీ చేశారు. దీని విభజనకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వెబ్‌ల్యాండ్-2.0లో సవరణకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు కలెక్టరేట్ భూ విభాగంలో దాఖలవుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంతో పదుల సంఖ్యలో రైతులు ఇక్కడకు తిరుగుతున్నారు. కొందరు తమ పిల్లల పెళ్లిళ్లు, చదువులు, వైద్య ఖర్చుల నిమిత్తం భూములను అమ్ముకోవాలన్నా.. జాయింట్ ఎల్‌పీఎంలతో సతమతం అవుతున్నారు.

వృద్ధులకు ప్రత్యేక ఓపీ

కాకినాడ జీజీహెచ్‌లో ప్రతి ఆదివారం సేవలు

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సోమవారం నుంచి శనివారం వరకూ 2000-2500 మంది వరకూ చికిత్స నిమిత్తం వస్తుంటారు. క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించాల్సిందే. ఓపీ కౌంటర్లు, మందుల కౌంటర్లు, పరీక్షల గదులు కిక్కిరిసిపోయి ఉంటాయి. దీంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీజీహెచ్‌కు రావాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. ఆయా రోజుల్లో వారి కుటుంబసభ్యులు ఉద్యోగాలు, ఇతర పనుల్లో నిమగ్నమై ఉంటారు. దాంతో వారికి తోడుగా వచ్చే వీలుండటం లేదు. ఈ నేపథ్యంలో 65 ఏళ్లు దాటిన వారికి ఇటీవల ఆదివారం ప్రత్యేక ఓపీని ప్రారంభించారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

గత నెల 23 నుంచి...

గత నెల 23వ తేదీ నుంచి జనరల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఓపీ నంబర్ 4 బ్లాక్‌లో వీరికి సేవలు ప్రారంభించారు. మొదటి వారం మొత్తం 53 మంది వచ్చారు. రెండో వారం 39 మంది, మూడో వారం 34 మంది సేవలు పొందారు. రిటైర్డ్ అయిన జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లను ఆహ్వానించడంతో వారు హాజరై పరీక్షలు చేస్తున్నారు. దీనిని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ లావణ్యకుమారి సూచించారు.

పట్టణాలకు 'అమృత్' ధార..!



ఈనాడు, కాకినాడ : పట్టణ, నగర ప్రాంతాల్లో తాగునీరు, మురుగునీటి సమస్యలకు పరిష్కారంగా తీసుకొచ్చిన అమృత్ పథకానికి ఎదురవుతున్న అవరోధాలు తొలగిపోతున్నాయి. వైకాపా హయాంలో రాష్ట్ర వాటా ఇవ్వకపోగా కేంద్రం నిధులను ఇతర అవసరాలకు మళ్లించారు. ప్రస్తుతం కూటమి సర్కారు ఈ పథకాన్ని గాడిలో పెట్టేలా చర్యలు తీసుకుంటోంది. అమృత్ 2.0 పేరుతో కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్)లో పనులు చేపడుతున్నారు.

18 పనులు రూ.405 కోట్లు..

కాకినాడ, కోనసీమ జిల్లాలోని తాగునీటి వనరుల పునరుద్ధరణ, గ్రావిటీ కాలువల నిర్మాణం, ఇతర అనుబంధ పనులు కలిపి రూ.405 కోట్లతో 18 పనులు చేపట్టనున్నారు. కాకినాడ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థలన్నింటికీ ఏలేరు జలాశయం నుంచే తాగునీటిని అందిస్తారు. కాకినాడకు పైపులైన్ల ద్వారా ముడినీటిని సామర్లకోటలోని సాంబమూర్తి జలాశయానికి తరలించనున్నారు. మిగతా వాటికి గ్రావిటీ కాలువల ద్వారానే నీటిని తరలించి శుద్ధిచేసిన తర్వాత కుళాయిలు ద్వారా సరఫరా చేస్తారు.

చేపట్టే పనులు ఇవీ

- కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలోని దమ్మాలపేట వద్ద 22 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మిస్తారు.
- కిర్లంపూడి నుంచి తాటిపర్తి, అక్కడ నుంచి పిఠాపురం వరకు గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తారు.
- కిర్లంపూడి నుంచి సామర్లకోట అక్కడ నుంచి పెద్దాపురం వరకు గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తారు.
- సామర్లకోటకు కిర్లంపూడి నుంచి నీటిని సరఫరా చేస్తారు. భాస్కర్‌నగర్‌లో నీళ్లట్యాంకు నిర్మిస్తారు.
- గొల్లప్రోలు నగర పంచాయతీ ఈడబ్ల్యూఎస్ కాలనీలో 300 కేఎల్ నీళ్లకుండీ నిర్మిస్తారు. ఈ గ్రామంలో 9.82 ఎకరాల చెరువును, ఏలేశ్వరంలో 2.92 ఎకరాల కప్పలచెరువును అభివృద్ధి చేస్తారు.
- తునిలో 800 కేఎల్ సామర్థ్యంతో కొత్తగా నీళ్లట్యాంకు నిర్మిస్తారు.

ధాన్యం.. ఆరక దైన్యం..

ఖరీఫ్ సీజన్ ముగిసి ఇప్పుడిప్పుడే రైతన్నలకు ధాన్యం పంట చేతికందుతోంది.. ఇందులో తేమను తగ్గించేలా ఆరబెట్టడానికి సరైన కల్లాలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ప్రధాన రహదారుల పైనే పోస్తున్నారు. ఆ పక్కనే వాహనాల రాకపోకలతో ప్రమాదకరంగా ఉన్నా తప్పని పరిస్థితి. దీంతో ఇటు రైతులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాకినాడ బైపాస్ రహదారిలోని చీడిగ వద్ద ధాన్యం ఆరబోసిన దృశ్యమిది. **- ఈనాడు, కాకినాడ**

ఔత్సాహిక.. అందిపుచ్చుకో ఇక..!

పెద్దాపురం ఎంఎస్‌ఎంఈ పార్కులో తక్కువ ధరకే ప్లాట్లు

ఈనాడు, కాకినాడ

పెద్దాపురం ఎంఎస్ఎంఈ పార్క్‌లో ప్లాట్ల ధరలు అందుబాటులో ఉండటంతో ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నారు. వాస్తవానికి ఇక్కడ వ్యవసాయ భూముల ధరలు భారీగానే ఉన్నాయి. జాతీయ రహదారికి అనుకుని రోడ్లు, కాలువలు నిర్మించి విద్యుత్తు సదుపాయం కల్పించి చదరపు మీటరు రూ.1,483 చొప్పున కారు చౌకగా ప్లాట్లను కేటాయిస్తున్నారు.

29 ఎకరాల్లో..

ప్రతి కుటుంబం నుంచి ఒకరిని స్వయం ఉపాధి, వ్యాపారం వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. దీనిలో భాగంగా పెద్దాపురంలో 29 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. 300 చ.మీ చొప్పున 175 ప్లాట్లను సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే రేట్లు నిర్ణయించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీలకు 39 రిజర్వ్ చేశారు. 85 ప్లాట్లలో యూనిట్ల ఏర్పాటుకు ఔత్సాహికులు డీపీఆర్‌లు సమర్పించారు.

పెద్దాపురం : కాలువలు నిర్మించి రోడ్లను అభివృద్ధి చేస్తున్నారిలా

మొత్తం ప్లాట్లు 175
ఎస్సీలకు కేటాయించినవి 28
ఇతరులకు 136
ఎస్టీలకు 11

ఉపాధికి ఊతం

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అడుగులు వేగంగా పడుతున్నాయి. వీటికి అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న ఈ పార్క్ అన్ని విధాలా అనువుగా ఉంటుంది. రాజానగరం నియోజకవర్గంలోని కలవచర్ల పార్క్‌లో చ.మీ రూ.3,241 చొప్పున ప్లాట్లు కేటాయిస్తున్నారు. దీనిలో సగాని కంటే తక్కువ ధరకే పెద్దాపురం పార్క్‌లో కేటాయించడం విశేషం. ఇక్కడ పరిసరాల్లో ఇప్పటికే సిరామిక్, ఫ్యాబ్రికేషన్, సీ ఫుడ్స్, రైస్ మిల్లుల పరిశ్రమలు ఉన్నాయి. బయోగ్యాస్ ప్లాంట్లు త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. వేల మందికి ఉపాధి దక్కనుంది. ఫర్నిచర్, ఆటోమొబైల్,ఫ్యాబ్రికేషన్‌కు సంబంధించి యూనిట్లకు ఎక్కువ దరఖాస్తులొచ్చినట్లు ఏపీఐఐసీ జెడ్ఎం రమణారెడ్డి తెలిపారు.

జిమ్నాస్టిక్స్‌లో అదుర్స్

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

ఒంటిని వింటిగా చేసి, తమ విన్యాసాలతో అదరగొడుతున్నారు కాకినాడ చిన్నారులు. క్లిష్టమైన జిమ్నాస్టిక్స్‌ను ఇష్టంతో సాధన చేసి, తమ ప్రదర్శనతో అందరి చేత శెభాష్ అనిపించుకున్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పతకాలతో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డీఎస్ఏలో కోచ్ సురేష్‌కుమార్ వద్ద సాధన చేస్తున్న వీరు జాతీయస్థాయిలోనూ రాణిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాలికల సత్తా

నాన్న ప్రోత్సాహంతో..

నాన్న సురేష్ జిమ్నాస్టిక్స్ కోచ్, అమ్మ సుగంధి లెక్చరర్. నాన్న ప్రోత్సాహంతో గత ఏడేళ్ల నుంచి జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. తొమ్మిదో తరగతి చదువుతున్నా. ప్రతిరోజూ 4 గంటల పాటు జిమ్నాస్టిక్స్‌లో సాధన చేస్తా. రాష్ట్రస్థాయిలో 9 పతకాలు సాధించా. రెండు సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇటీవల 4 పతకాలు సాధించా. పైలట్ అవ్వాలనేది నా కోరిక.



వెంకట జోష్నిక

జాతీయస్థాయిలో రాణించాలని..

ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాన్న సచిన్‌జైన్ వ్యాపారి, అమ్మ నందిత గృహిణి. మూడేళ్ల నుంచి శిక్షణ పొందుతున్నా. రెండు సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో బాల్, హూప్, రిబ్బన్, క్లబ్ తదితర కేటగిరీల్లో మూడు బంగారు, ఒక రజత పతకం సాధించా. జాతీయస్థాయిలో పతకం సాధించాలనేది నా లక్ష్యం.

ఆన్యజైన్

రాష్ట్ర స్థాయిలో 20 పతకాలు

నాన్న దేముడు డ్రైవర్. అమ్మ దేవి ప్రైవేట్ టీచర్. గత 8 ఏళ్ల నుంచి శిక్షణ పొందుతున్నా. ఇప్పటి వరకు 20 పతకాలు సాధించా. ఏడుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇటీవల 4 పతకాలతో సత్తాచాటాను. జాతీయ స్థాయి పతకంతో పాటు ఐపీఎస్ అవ్వాలనేది నా లక్ష్యం.

మధులత

ప్రతిరోజూ సాధన చేస్తా..

నాన్న అశ్విన్‌కుమార్ జైన్ వ్యాపారి, అమ్మ రుచిత గృహిణి. గత నాలుగేళ్ల నుంచి జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. ప్రతిరోజూ 2 గంటల పాటు సాధన చేస్తా. ఇప్పటివరకు పలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని 4 పతకాలు సాధించా. ఇటీవల ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో క్లబ్స్, రిబ్బన్, హూప్, బాల్ తదితర కేటగిరీల్లో పాల్గొని 2 పతకాలు సాధించా. తద్వారా త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. అక్కడ కూడా పతకం సాధిస్తా. **- మాహి జైన్**

ఏసీ బస్ టికెట్ ధరలో 10 శాతం రాయితీ

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ఏసీ బస్సు సర్వీసుల టికెట్ ధరలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ (నైట్‌రైడర్, వెన్నెల, అమరావతి), కర్నూలు (ఇంద్ర), తిరుపతి(ఇంద్ర), బెంగళూరు(అమరావతి) సర్వీసుల్లో రాయితీ ఈ నెల 7 నుంచి 20వ తేదీవరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌కు రాలేనివారు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని తెలిపారు. అర్జీల ప్రగతిని 1100 కాల్ సెంటర్‌కు ఫోను చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

సజావుగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. కాకినాడలో 11, పెద్దాపురంలో 9 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 4,378 మంది హాజరయ్యారు. 200 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ ఆయా కేంద్రాలను సందర్శించి పర్యవేక్షించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, వసతి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ మండలం, వాకలపూడిలోని డీడీయూజీకేవై కేంద్రంలో వికాస ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల లోపు యువతకు టూ వీలర్ టెక్నీషియన్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో 3 నెలలు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఉచిత వసతి, భోజన సదుపాయంతో పాటు, ఏకరూప దుస్తులు, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 10 లోగా 83284 83297, 89784 75164 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

జగనన్న ఇళ్ల స్థలాల్లో చేపల వేట

వైకాపా ప్రభుత్వ హయాంలో నివాస యోగ్యం కాని స్థలాలను సేకరించి పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇవి కాలనీలు కాదు ఊళ్లు అని ఎంతో గొప్పలు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా సామర్లకోటలోని జగనన్న కాలనీల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు. పల్లపు ప్రాంతం కావడంతో ఇళ్ల స్థలాల్లో వర్షపు నీరు పోవడానికి కాలువలు లేకపోవడంతో మురుగునీరు చేరింది. ఆ నీటిలో చేపలు పెరిగిపోవడంతో యువకులు గాలాలతో చేపల వేట సాగిస్తున్నారు. పెద్దపెద్ద కొర్రమేనులు పెరుగుతున్నాయి. ఆదివారం యువకులు వాటిని పట్టుకున్నారు. దీంతో జగనన్న కాలనీలు ఏస్థితిలోఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. **- న్యూస్‌టుడే, సామర్లకోట**

పులిజాడ అన్వేషణ

మడ అడవుల్లో కాలుమోపేందుకు అవకాశం లేని చిత్తడి నేలలు ఉంటాయి. అడవంతా గుబురుగా ఉంటుంది. ఈ అడవుల్లో ఎక్కువగా నీటి పిల్లిలు, నక్కలు, పక్షి జాతులు ఉంటాయి. వీటిపై ఏటా గణన నిర్వహిస్తారు. ఈసారి కోరింగ అభయారణ్యంలో పులి సంచారంపై వన్యప్రాణి విభాగ సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నారు. కోరింగ అభయారణ్యంలోని మడ అడవుల్లో ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. పులి కాలి గుర్తులు, ట్రాన్స్ సెట్‌లపై వన్యప్రాణి విభాగ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ధనంజయ, గోపీ నాగేంద్రకుమార్, జగదీష్‌లతో కూడిన ఇద్దరు బృంద సభ్యులతో కోరింగ, హోప్ ఐలాండ్, భైరవపాలెం సెక్షన్ పరిధిలోని 58వేల ఎకరాల మడ అడవులో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను ఈ నెల ఒకటిన ప్రారంభించారు. **-న్యూస్‌టుడే, తాళ్లరేవు**

కోరింగ అభయారణ్యంలో పులి అడుగులను గుర్తిస్తూ...

వైకల్య పరీక్షలకు పరికరాల గండం

అంధులకు సదరం రీ-అసెస్‌మెంట్ పరీక్షల్లో జాప్యం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

బోగస్ పింఛన్ల ఏరివేతకు వైద్య పరికరాల కొరత ప్రతిబంధకంగా మారింది. అంధులకు సంబంధించి ఇంతవరకు వైకల్య పరీక్షలు ప్రారంభించలేదు. దీనికి సంబంధించి వైద్యాధికారులు.. జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినా, ఇప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో అంధుల సదరం రీ-అసెస్‌మెంట్ ప్రక్రియ అటకెక్కింది. ఇదిలా ఉండగా అప్పీల్ చేసిన మరో 1,850 మంది దివ్యాంగ పింఛను లబ్ధిదారులకు వైకల్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి జాబితా వచ్చింది. తొలిదశలో పంపిన జాబితా వారికే పరీక్షలు పూర్తికాక సతమతమవుతుంటే.. రెండో జాబితా రావడంతో ఉక్కిబిక్కిరి అవుతున్నారు.

పరీక్షలు చేయించుకుంటున్న దివ్యాంగుడు

తక్కువ వైకల్యం ఉన్నట్లు తేలినవారు:	4,200
ఇతర కేటగిరీ పింఛనుకు మార్పు:	818
అనర్హులుగా గుర్తించినవారు:	3,382
అప్పీల్ చేసుకున్నవారు:	3,294
తొలి దశలో పరీక్షలకు ఎంపికైన వారు:	1,444 మంది
ఇప్పటికి పూర్తయిన వారి సంఖ్య:	629

జిల్లాలో ఇలా...

గత ప్రభుత్వంలో వైకల్యం ఎక్కువగా చూపి పొందిన పింఛన్ల తొలగింపునకు జిల్లాలో ఈ ఏడాది జనవరి 22 నుంచి సెప్టెంబరు 30 వరకు పరీక్షలు (సదరం రీ-అసెస్‌మెంట్) చేపట్టారు.

నెలాఖరు వరకే గడువు

తొలి దశలో మిగిలిపోయిన 815 మంది, రెండో దశలో పంపిన 1,850 మంది మొత్తం 2,665 మందికి సదరం రీ-అసెస్‌మెంట్ చేయాల్సి ఉంది. వీరందరికీ కాకినాడ జీజీహెచ్, తుని ప్రాంతీయ ఆసుపత్రి, పెద్దాపురం సామాజిక ఆసుపత్రిలో పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు లబ్ధిదారులకు నోటీసులిచ్చి, వైకల్య పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ-సెర్ప్ అధికారులు చెబుతున్నారు.

అంతర్వేది హార్బర్‌కు వెలుగులొచ్చాయ్

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: అంతర్వేది పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ విద్యుత్తు వెలుగులతో కళకళలాడుతోంది. దీని అభివృద్ధికి ప్రభుత్వం కలెక్టర్ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి పీపీపీ విధానంలో ఆర్ఆర్ ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో హార్బర్ వెలుగులతో నిండిపోయింది. గంగపుత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

'మత్తు' వద్దు.. సైకిల్ తొక్కు

మాదకద్రవ్యాలను నిర్మూలించడానికి ప్రజలందరూ కలిసి ముందుకు రావాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. ఆదివారం ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 'డ్రగ్స్ వద్దు బ్రో-సైకిల్ తొక్కు బ్రో' అనే నినాదంతో ఎస్పీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పోలీసు పరేడ్ మైదానం నుంచి భానుగుడి కూడలి, మెయిన్‌రోడ్డు మీదుగా బాలాజీచెరువు వరకూ సాగింది. సుమారు 800 మంది విద్యార్థులు, ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పిల్లల నడవడికను, ప్రవర్తనను సరిచేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఎవరైనా గంజాయి వినియోగం, విక్రయం, సరఫరా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా డయల్ 112, స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. **- న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)**

(c) eenadu

సముద్రుడు.. తీరానికి దూరంగా జరిగాడు..

అంతర్వేదిలో సముద్రం వెనక్కి మళ్లింది. గత 40 రోజుల నుంచి వరుస తుపాన్లు(మొంథా, దిత్వా)తో సముద్రం అల్ల కల్లోలంగా మారి ముందుకు చొచ్చుకొచ్చింది. సాగర సంగమం నుంచి కేశవదాసుపాలెం వరకు సుమారు 12 కిలోమీటర్ల తీరంలో వందలాది ఎకరాల భూమి కడలిలో కలిసిపో యింది. ప్రస్తుతం ప్రశాంతంగా తయారై ఇసుక మేటలు వేసి సుమారు 50 మీటర్ల మేర వెనక్కి మళ్లింది. వివిధమైన ప్రకృతి వైప రీత్యాలు సంభవించినపుడు ఉండే ఇసుక మేట లతో చూడముచ్చటగా ఉండటంతో ప్రకృతి ప్రేమికులు ఆశావహం వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, అంతర్వేది

నన్నయ వర్సిటీ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వ విద్యాలయంలో ఆదివారం అంతర్ కళాశాల స్థాయిలో మహిళా క్రీడాకారులకు ఆదివారం బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించి వర్సిటీ జట్టును ఎంపిక చేశారు. వీసీ, ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ మాట్లాడుతూ క్రీడాకారులు లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి ఎనిమిది జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ నెల 29 నుంచి జన వరి 2 వరకు బెంగళూరులోని క్రైస్ట్ యూనివ ర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో మహిళా జట్టు పాల్గొంటుందన్నారు. అంతర్ కళాశాలల పోటీల్లో ఏలూరు సెయింట్ థెరిసా, సీఆర్‌ఆర్, ఆదిత్య మహిళా కళాశాల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవీవీఎస్‌ఎన్ మూర్తి, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

కోరమరీ తలచి.. కోనసీమ రుచి

మూకుడులో మినప పిండి వేసి పైన, కింద కొబ్బరి డొక్కల మంటతో కాల్చే మినప దిబ్బరొట్టె తింటే లొట్టలేయాల్సిందే. 1996 నుంచి పి.గన్నవరంలో ఈ రొట్టె లకు ప్రసిద్ధి. మూడు దశాబ్దాల క్రితం పదాల బ్రహ్మం ఈ రొట్టె లకు శ్రీకారం చుట్టారు. ఆయన కుమారుడు రాము దుకాణం నడిపిస్తున్నారు. దోరగా కాల్చిన దిబ్బరొట్టెకు కొబ్బరి చెట్నీ, బొంబాయిచెట్నీ, కారంత కారపొడి కలిపి తింటే ఆహా ఏమి రుచి.. తినరా మైమ రచి అనాల్సిందే. ఒకసారి ఈ హోట ల్లో దిబ్బరొట్టె తిన్నవాళ్లు మళ్లీ మళ్లీ ఇక్కడికే వస్తారు. రొట్టె ధర రూ.50. సగం తీసుకుంటే రూ.25 చెల్లించాలి. పొద్దున్నే నూనెతో వండిన అల్పాహారం ఇష్టపడ నివారు ఎక్కువగా ఈ దిబ్బరొట్టెలు తినడానికి ప్రాధా న్యమిస్తారు.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం

నేడు ఢిల్లీ విమాన సర్వీసు రద్దు

కోరుకొండ: ఇండిగో విమానయాన సంస్థలో నెలకొన్న సేవల అంతరాయం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఇంకా కొనసాగుతోంది. ఆదివారం సర్వీ సులన్నీ పునరుద్ధరించిన, సోమవారం విమాన సర్వీసుల్లో మార్పులు చోటుచే సుకున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఢిల్లీ ఎయిర్ బస్ విమాన సర్వీసు రాకపోకలను పూర్తిగా రద్దు చేశారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ముందస్తుగానే ప్రయాణికులకు సమాచారం ఇచ్చారు.

104 ఉద్యోగుల ఆందోళన

కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కాకినాడ కలెక్ట రేట్, న్యూస్‌టుడే: తమకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ ఆదివారం కలెక్టరేట్ వద్ద 104 వాహనాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం వీటిని నిర్వహిస్తున్న యాజమాన్యం ఉద్యోగులకు నియామకపత్రాలు, పే స్లిప్‌లు ఇవ్వలేదని, ప్రభుత్వం చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.రాంబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జీ మాట్లా డుతూ అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఔషధాల నిర్వహణ బాధ్యతలు అప్పగించవద్దన్నారు. జీతాల్లో వ్యత్యాసాలు సవరించి, ఇప్పటికే కోత విధించిన సొమ్ములను అరియర్ రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని, ప్రతి డివిజన్‌కు బఫర్ సిబ్బందిని నియమించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి త్రిమూర్తులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, కోశాధికారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

6వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా క్లినిక్ ప్రారంభించి నేటికి ఆరు సంవత్సరాలు అయిన శుభసందర్భంగా మమ్ములను ఎంతగానో ఆదరించిన ప్రతి ఒక్కరికీ మా ధన్యవాదములు.
KAKINADA PHYSIOTHERAPY & REHABILITATION CLINIC
Beside Laxmi Hospital, Godarigunta, Kakinada
Dr. M.Vidya Sagar (PT)
MPT (Neuro) MIAP, MMTFI
పక్షవాతం, నరాల సంబంధిత వ్యాధులకు మరియు కీళ్లనొప్పులు, నడుం నొప్పి & మెడ నొప్పి, సయాటికా కండరాల నొప్పులు మొదలగు సమస్యలకు ఫిజియోథెరపీ ద్వారా పరిష్కారం లభించును.
www.kakinadaphysiotherapy.com ఇన్‌పేషెంట్ సౌకర్యం కలదు Cont: 9700784374

న్యూస్‌టుడే, కొత్తపల్లి

సంక్రాంతి సీజన్‌పై వస్త్ర వ్యాపారుల ఆశలు

ఉప్పాడ జాంధానీ ఊపు అందుకోనుందా..

కరోనా మహమ్మారి రాక ముందు ఉప్పాడ జాంధానీ పట్టు చీరల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉండేది. 2020లో కరోనా రావడంతో చేనేత రంగానికి గడ్డుకాలం ఏర్పడింది. ఆ సమయంలో వైకాపా ప్రభుత్వం ఈ రంగాన్ని అభివృద్ధిలోకి తెచ్చేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఫలితంగా అమ్మకాలు లేక వ్యాపారులు, ఉపాధి లేక నేత కార్మి కులు అనేక ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. అమ్మకాలు లేక యు.కొత్తపల్లి మండలంలోని వందలాది చేనేత వస్త్ర దుకాణాలు బోసిపోయి దర్శనమిస్తు న్నాయి. రానున్న సంక్రాంతి నేప థ్యంలో అమ్మకాలు పెరిగి లాభాలు వస్తాయని వస్త్ర వ్యాపారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో హస్తకళలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఉప్పా డను ఎంపిక చేసింది. దీనికి సంబంధించి ఇప్ప టికే ఉప్పాడలోని నేతన్నలకు అవసరం రీత్యా మౌలిక వసతులు కల్పించేందుకు రూ.5 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగం అభివృద్ధి చేయాలనే ఆలోచనతో రాష్ట్రంలోనే గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ మండలాల్లో చేనేత రంగం అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించింది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి పంపారు.

రూ.100 కోట్ల నుంచి రూ.20 కోట్లకు..

దుకాణంలో ఉప్పాడ పట్టు చీరలు

నాలుగేళ్ల క్రితం చేనేత జాంధానీ పట్టు చీరల వ్యాపారం ఏడాదికి సుమారుగా రూ.100 కోట్ల వరకు లావాదేవీలు జరిగేవి. కరోనా మహమ్మారి, అప్పటి ప్రభుత్వ వైఫల్యం కారణంగా అమ్మ కాలు ఒక్కసారిగా 90 శాతం పడి పోయాయి. ప్రస్తుతం ఏడాదికి కేవలం రూ.20 కోట్లు మాత్రమే వ్యాపారాలు సాగుతున్నట్లు మాస్టర్ వీవర్స్ చెబుతున్నారు. ముడిసరుకు ధరలు అమాంతంగా పెరిగినా చీరల ధరలు పెంచలేక నష్టాలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొంతమంది వ్యాపారం మానుకుని దుకాణాలు మూసేశారు. మరి కొంతమంది నష్టాలను భరిస్తూ సంక్రాంతి సీజన్ కోసం ఎదురుచూస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన లోవ దేవస్థానంలోని మహామండపం

లోవకు భక్తుల తాకిడి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తుల తాకిడితో నిండిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఒక్కరోజే సుమారు 15 వేలకు పైబడి భక్తులు రావడంతో దేవస్థానానికి రూ.5.50 లక్షలు ఆదాయం సమకూరినట్లు డీసీ విశ్వనాథరాజు తెలిపారు.

న్యూస్‌టుడే, గండేపల్లి

పన్ను లావాదేవీలన్నీ చెల్లింపులు సులువుగా...

స్వర్ణ పంచాయతీలోనే..

ప్రస్తుత పన్నులు, బకాయిల వసూళ్లకు అధికారులు అవస్థలు పడేవారు. మాన్యువల్ పద్ధతిలో రసీదులు ఇవ్వడం కూడా ఇబ్బందిగా ఉండేది. ఇళ్లలో లేనివారు, పనులకు వలస వెళ్లినవారి నుంచి పన్నులు రాబట్టడం ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం పన్నుల వసూళ్లు, సులభతర పద్ధతిలో చెల్లించేందుకు, అధికారులు ఒత్తిడికి గురికాకుండా / స్వర్ణ పంచాయతీ యాప్/ వినియోగంలోకి తెచ్చింది. ప్రస్తుతం పాత, మొండి బకాయిలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు వసూళ్లపై అధికారులు నిమగ్నమయ్యారు.

మీ కోసం

యాప్ వాడొచ్చు ఇలా..

గతంలో పన్ను చెల్లించిన వారికి రసీదులు ఇవ్వడం, వాటికి ప్రత్యేకంగా రికార్డులు ఉండేవి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్వర్ణ పంచాయతీ యాప్‌ను చరవాణిలో గూగుల్ ప్లేస్టోర్‌లో నుంచి సులువుగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత పన్ను చెల్లిం చాలనుకుంటే అధికారుల చరవాణికి ఫోన్ చేస్తే వారొక లింక్ పంపుతారు దాని ద్వారా పబ్లిక్ లాగిన్‌లోనికి వెళ్లి ఏపీ, జిల్లా, మండలం, పంచాయతీలను ఎంచుకోవాలి. అందులో న్యూ ఎసెస్మెంట్ నంబరు లేదంటే పేరు, లేదా డోర్ నంబరు లేదా, ఓల్డ్ ఎసెస్మెంట్ నంబర్లలోకి వెళ్లాలి. చెల్లింపులకు ఒక ఐచ్ఛికం (ఆప్షన్), సమాచారం నిజమో కాదో తెలిపేందుకు ఒక ఐచ్ఛికం ఉంటాయి. మన ఫోన్ నంబరుతో చెల్లింపు చేసేందుకు ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్, నెట్ బ్యాంకింగ్‌లోకి వెళ్లి పన్ను బకాయిలు తెలుసుకుని నేరుగా చెల్లించొచ్చు. పంచాయతీ అధికారులైతే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో యాప్‌లో లాగిన్ై పన్ను వసూలు చేస్తున్నారు.

పారదర్శకంగా ఉంటుంది

గతంలో పన్నుల చెల్లింపులో అవకతవకలు ఉండేవి. ప్రస్తుత యాప్‌ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులో పారదర్శకత ఉంటోంది. పన్నులు చెల్లించేందుకు ప్రజలు, వసూలు చేసేందుకు అధికారులకు స్వర్ణపంచాయతీ యాప్ సహాయంగా ఉంటోంది.

- రవికుమార్, డీపీవో, కాకినాడ

15న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గాంధీనగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద జరిగే ప్రదర్శన, ధర్నాలను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పాతబస్టాండ్ సెంటర్‌లోని ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలు నీరుగార్చాయని విమర్శించారు. సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సౌకర్యాలను అదనంగా చేర్చాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు ఆదినారాయణమూర్తి, రాఘవులు, సత్తిబాబు, కృష్ణ, రాము, పి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచ్, విశాఖపట్నం డోర్ నెం.26-15-150, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్: 0891-2537792 / 2537782, మొబైల్ నెంబర్: 93245 17291, ఇ-మెయిల్ ఐడీ: ubin0817295@unionbankofindia.bank

APPENDIX - IV-A [See Proviso to Rule 8 (6)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) ప్రావిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్థుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు **"ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏది ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది: 30.12.2025 న విక్రయించబడుతుందని** ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీ చేస్తూ తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తుల రిజర్వుధర మరియు జమచేయవలసిన ధరావత్తు దిగువ వివరించబడినవి.

ఇ-వేలం తేది & సమయం: 30.12.2025, మ॥ 12.00 గం॥ నుండి సా॥ 05.00 గం॥ వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

1 **ఋణగ్రహీతలు: 1) మెస్సర్స్ సైనా ఎక్సిమ్స్, రిజిష్టర్డ్ ఆఫీస్:** డి.నెం. 38-4-26, టి-1, 4వ అంతస్తు, సత్యసాయి రెసిడెన్సి, తిలక్ రోడ్డు, కాకినాడ-533001. **2) శ్రీ చేకూరి శ్రీ రామమూర్తి, మెస్సర్స్ సైనా ఎక్సిమ్స్ యొక్క మేనేజింగ్ పార్ట్‌నర్:** డి.నెం. 5-123/సి, శ్రీ సాయి గణేష్ గార్డెన్స్, వివేకానంద వీధి సెంటర్, అచ్చంపేట జంక్షన్, తిమ్మాపురం (పోస్ట్), కాకినాడ-533005. **3) శ్రీ బచ్చు సత్యనారాయణ,** తండ్రి: వెంకటేశ్వర్లు (లేటు), మెస్సర్స్ సైనా ఎక్సిమ్స్ యొక్క పార్ట్‌నర్, ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్ 2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533003. **4) శ్రీ బచ్చు అరుణ,** భర్త: సత్యనారాయణ, మెస్సర్స్ సైనా ఎక్సిమ్స్ యొక్క పార్ట్‌నర్, ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్ 2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533003. **హామీదారులు: 1) శ్రీ బచ్చు సత్యనారాయణ,** తండ్రి: వెంకటేశ్వర్లు (లేటు), ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్ 2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533003. **2) శ్రీ బచ్చు అరుణ,** భర్త: సత్యనారాయణ, ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్ 2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533003. **3) శ్రీ చేకూరి శ్రీ రామమూర్తి,** డి.నెం. 5-123/సి, శ్రీ సాయి గణేష్ గార్డెన్స్, వివేకానంద వీధి సెంటర్, అచ్చం పేట జంక్షన్, తిమ్మాపురం (పోస్ట్), కాకినాడ-533005. **4) శ్రీ పులఖండం సూరిబాబు,** తండ్రి: పి.నరసింహారావు, ఫ్లాట్ నెం. 203, చౌరాంగ్ సొసైటీ, ప్లాట్ నెం. 4, సెక్టార్-16, సన్‌పాద, థానే జిల్లా, నావి ముంబయ్, మహారాష్ట్ర-400705. **5) శ్రీ వెలుగుబంటి లచ్చారావు అలియాస్ లక్ష్మణ రావు,** తండ్రి: కాశీవిశ్వనాథ రావు, డి.నెం. 1-73, దుర్గ గుడి దగ్గర, పనసపాడు గ్రామం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా-533005. **6) శ్రీ వెలుగుబంటి రామారావు,** తండ్రి: కాశీవిశ్వనాథ రావు, డి.నెం. 1-74, దుర్గ గుడి దగ్గర, పనసపాడు గ్రామం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా-533005. **7) శ్రీ వెలుగుబంటి సుబ్బారావు,** తండ్రి: కాశీవిశ్వనాథ రావు, డి.నెం. 1-76, దుర్గ గుడి దగ్గర, పనసపాడు, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా-533005. **8) శ్రీ వెలుగుబంటి రాంబాబు,** తండ్రి: కాశీవిశ్వనాథ రావు, డి.నెం.1-77, దుర్గ గుడి దగ్గర, పనసపాడు, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా-533005.

బకాయిమొత్తం: తేది.30.09.2025 నాటికి **రూ.22,78,31,350.10 (అక్షరాల ఇరవై రెండు కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల ముప్పై ఒక్క వేల మూడు వందల యాభై రూపాయలు మరియు పది పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

స్థిరాస్తుల యొక్క వివరములు

1) తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతము కాకినాడ జిల్లా), కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, సర్వే నెం.375/1లోని ప్లాట్ నెం. 183తోగల 311.11 చ॥గ॥లు మరియు సర్వే నెం. 376లోని ప్లాట్ నెం. 189లోని 250.83 చ॥గ॥లు మొత్తం కలిపి 561.94 చ॥గ॥ల నివాస ఖాళీ భూమి **శ్రీ పులఖండం సూరిబాబు, తండ్రి: నరసింహారావు గారి** పేరున కలదు. **హద్దులు: ఐటమ్ నెం-1: 311.11 చ॥గ॥ల ప్లాట్ నెం. 183నకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 182, **పడమర:** ప్లాట్ నెం. 184, **ఉత్తరం :** ప్లాట్ నెం. 176, **దక్షిణం:** 60 అ॥ల వెడల్పు రోడ్డు. **ఐటమ్ నెం-2: 250.83 చ॥గ॥ల ప్లాట్ నెం. 189నకు హద్దులు: తూర్పు:** ఈ ప్లాట్ నెంలోని మిగిలిన స్థలం, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** 60 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ఈ సర్వే నెంలోని మిగిలిన స్థలం. **(రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.973/2017, తేది.06-04-2017)**

రిజర్వుధర: రూ.43,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.4,30,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.43,000/-

2) తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతము కాకినాడ జిల్లా), కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, సర్వే నెం. 380/1లోని ప్లాట్ నెం. 9తోగల 128.33 చ॥గ॥లు మరియు సర్వే నెం.375/1లోని ప్లాట్ నెం. 179తోగల 311.11 చ॥గ॥లు మొత్తం కలిపి 439.44 చ॥గ॥ల నివాస ఖాళీ భూమి **శ్రీ పులఖండం సూరిబాబు, తండ్రి: నరసింహారావు గారి** పేరున కలదు. హద్దులు: **ఐటమ్ నెం-1: 128.33 చ॥గ॥ల ప్లాట్ నెం. 9నకు హద్దులు: తూర్పు:** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **పడమర:** ఈ ప్లాట్‌లోని నందు రాఘవ గారి స్థలం, **ఉత్తరం:** యల్.పి.నెం. 22/2000లోని స్థలం, **దక్షిణం:** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **ఐటమ్ నెం-2: సర్వే నెం. 375/1 లోని 311.11 చ॥గ॥ల ప్లాట్ నెం. 179నకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.178, **పడమర:** ప్లాట్ నెం. 180, **ఉత్తరం:** ప్లాట్ నెం.172, **దక్షిణం:** 60 అ॥ల వెడల్పు రోడ్డు. **(రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.972/2017, తేది.06-04-2017)**

రిజర్వుధర: రూ.31,70,000/- ధరావత్తు సొమ్ము: రూ.3,17,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.31,700/-

3) తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతము కాకినాడ జిల్లా), కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, సర్వే నెం.376, 375/1 లోని ప్లాట్ నెం. 374 (311.66 చ॥గ॥లు), ప్లాట్ నెం. 220 (80 చ॥గ॥లు), ప్లాట్ నెం.198 (294 చ॥గ॥లు) తోగల 685.66 చ॥గ॥ల విస్తీర్ణము గల నివాస ఖాళీ భూమి **శ్రీ పులఖండం సూరిబాబు, తండ్రి: నరసింహారావు గారి** పేరున కలదు. హద్దులు: **ఐటమ్ నెం-1: సర్వే నెం. 376 లోని 294 చ॥గ॥ల ప్లాట్ నెం.198నకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.199, **పడమర:** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం.197, **దక్షిణం:** ఇదే సర్వే నెంబరులోని స్థలము. **ఐటమ్ నెం-2: సర్వే నెం. 376 లోని 80 చ॥గ॥ల ప్లాట్ నెం.220నకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.221, **పడమర:** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం.219, **దక్షిణం:** ఇదే సర్వే నెంబరులోని స్థలము. **ఐటమ్ నెం-3: సర్వే నెం. 375/1 లోని 311.66 చ॥గ॥ల ప్లాట్ నెం.374నకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.375, **పడమర:** ప్లాట్ నెం.373, **ఉత్తరం:** ప్లాట్ నెం.365, **దక్షిణం:** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **(రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.971/2017, తేది.06-04-2017)**

రిజర్వుధర: రూ.52,50,000/- ధరావత్తు సొమ్ము: రూ.5,25,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.52,500/-

4) తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతము కాకినాడ జిల్లా), కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, సర్వే నెం. 380/1లోని ప్లాట్ నెం. 8 (144.83 చ॥గ॥లు), ప్లాట్ నెం. 4 (240.17 చ॥గ॥లు), ప్లాట్ నెం. 3 (264.00 చ॥గ॥లు) తోగల 649.00 చ॥గ॥ల విస్తీర్ణము గల నివాస ఖాళీ భూమి **శ్రీ పులఖండం సూరిబాబు, తండ్రి: నరసింహారావు గారి** పేరున కలదు. హద్దులు: **ఐటమ్ నెం-1: 264 చ॥గ॥ల ప్లాట్ నెం.3నకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.4, **పడమర:** ప్లాట్ నెం.2, **ఉత్తరం:** యల్.పి.నెం. 22/2000లోని స్థలం, **దక్షిణం:** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **ఐటమ్ నెం-2: 240.17 చ॥గ॥ల ప్లాట్ నెం.4నకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.5, **పడమర:** ప్లాట్ నెం.3, **ఉత్తరం:** యల్.పి.నెం. 22/2000లోని స్థలం, **దక్షిణం:** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **ఐటమ్ నెం-3: 144.83 చ॥గ॥ల ప్లాట్ నెం.8నకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.9, **పడమర:** ప్లాట్ నెం.7, **ఉత్తరం:** యల్.పి.నెం. 22/2000లోని స్థలం, **దక్షిణం:** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **(రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.970/2017, తేది.06-04-2017)**

రిజర్వుధర: రూ.44,70,000/- ధరావత్తు సొమ్ము: రూ.4,47,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.44,700/-

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. **(1)** ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ **https://baanknet.com** ద్వారా నిర్వహించబడును. **(2)** రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు **https://baanknet.com** దర్శించండి మరియు లాగిన్ రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింక్‌ను దయచేసి క్లిక్ చేయండి. **(3)** ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: **www.unionbankofindia.co.in** లో లభిస్తాయి.

తేది: 03.12.2025, ప్రదేశము: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మంత్రి లోకేశ్‌పై వైకాపా తప్పుడు ప్రచారం

మాట్లాడుతున్న తెదేపా అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై వైకాపా నాయకులు దిగజారుడు విమర్శలు చేస్తున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మహాసేన రాజేష్ పేర్కొన్నారు. ఇండిగో విమానయాన సర్వీసుల విషయంలో తలెత్తిన వివాదానికి సంబంధించి లోకేశ్‌పై బురద జల్లేందుకు వైకాపా బ్యాచ్ తప్పుడు ప్రచారం సాగిస్తోందన్నారు. కాకినాడలోని జిల్లా తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇండిగో సమస్య పరిష్కారానికి లోకేశ్ కృషి చేస్తున్నారని ఇటీవల తెదేపా జాతీయ అధికార ప్రతినిధి దీపక్‌రెడ్డి చెప్పగా, కేంద్ర రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ వైకాపా గోలగోల చేస్తోందని విమర్శించారు. లోకేశ్‌కు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీతో సహా పలు కీలక నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఇండిగో సమస్యను పరిష్కరించేందుకు ఆయన చొరవ చూపితే తప్పేంటని నిలదీశారు. అతితక్కువ కాలంలో రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయిలో నాయకునిగా రాణిస్తున్న లోకేశ్‌ను చూసి ఓర్వలేక వైకాపా నాయకులు విమర్శలు చేస్తున్నారని రాజేశ్ మండిపడ్డారు. సమావేశంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బంగార్రాజు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు రెండో పర్యాయం ఎన్నికయ్యారు. కడప జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో ఉన్న 39 మంది సభ్యులు ఈ మేరకు తమ నిర్ణయాన్ని ప్రకటించారు. బంగార్రాజు లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. కడపలో ఈ నెల 6న ప్రారంభమైన మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథులుగా పార్టీ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, పొలిట్ బ్యూరో సభ్యుడు స్వదేశ్ భట్టాచార్య, నాయకులు శంకర్, చంద్రమోహన్ తదితరులు హాజరయ్యారు.

భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బోస్

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏలేశ్వరానికి చెందిన బీసీ నాయకుడు పైల సుభాష్‌చంద్రబోస్ ఎంపికయ్యారు. బాధ్యతను అప్పగించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మోర్చా నాయకులు మధుకర్, ఆర్‌పీ శ్రీనివాస్‌లకు ఆదివారం ఆయన కృతజ్ఞతలు చెప్పారు. వార్డు స్థాయి నుంచి భాజపా, అనుబంధ విభాగాలను మరింత బలోపేతం చేస్తానని బోస్ వెల్లడించారు.

ప్రజా చైతన్యమే రాజ్యాంగానికి రక్ష

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రజా చైతన్యమే భారత రాజ్యాంగాన్ని రక్షిస్తుందని మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. కచేరిపేటలోని యూటీఎఫ్ హోంలో ఆదివారం ఆర్వీఎన్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యవక్తగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగ పరిషత్తులో వివిధ ఆర్టికల్స్ రూపకల్పనలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి ఆమోదింపజేయడంలో అంబేడ్కర్ కృషి గణనీయమైందన్నారు. దేశంలో అంతర్గతంగా ఎన్ని సమస్యలున్నా మన రాజ్యాంగం కాలపరీక్షకు నిలబడిందన్నారు. పాలకులు విఫలమైనప్పుడు ప్రజా చైతన్యమే భారత రాజ్యాంగాన్ని రక్షిస్తుందన్నారు. న్యాయవాది జవహర్ అలీ, డాక్టర్ భానుమతి, జవివే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్ తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలన్నారు. రాజ్యాంగ హక్కులు సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు అందేలా కృషి చేయాలని సూచించారు. బాలల కోసం రూపొందించిన రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ గోవిందరాజులు, నగర ప్రముఖులు, పలు ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జవహర్‌అలీ తదితరులు

గొల్లప్రోలులో ఆందోళన

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు కొత్తపేట వీధిలో రెండు ప్రార్థనాలయాల ఎదుట స్థానికులు ఆదివారం ఉదయం నుంచి ఆందోళన చేపట్టారు. లౌడు స్పీకర్ల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపించారు. గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆందోళనకారులను అడ్డుకుని మాట్లాడారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దార్ రామ్‌కుమార్ నగర పంచాయతీ అధికారులతో చర్చించారు. శాంతి భద్రతల దృష్ట్యా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ కార్యక్రమాలు నిలుపుదల చేయాలని ఆర్డీవో ఆదేశించారు. అనంతరం నిర్వాహకులకు నోటీసులిచ్చారు. గొల్లప్రోలు కొత్తపేట వీధిలో 144 సెక్షన్ విధించినట్లు తహసీల్దార్ రామ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రాంతంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		18,500
పాతకాయ:	గండేరా	28,000
	గటగట	25,000
కొత్తకాయ:	గండేరా	27,000
	గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		15,000-16,000
కొత్త (పచ్చి) కాయ		14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		6,000
కిలో		400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 98491 38626.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ. ✆ 73862 01191.

TO LET

COMMERCIAL

కాకినాడ జిల్లా, పెద్దాపురంలో హారిజెంటల్, వర్టికల్ మిషన్స్ కలిగి ఉన్న సామిల్లు అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి. ✆ 86396 91555.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Wanted Electrical Engineers. Qualified By B.Tech Electrical Engineering, Diploma or ITI Experience 0-3 Years. Place of Work: East and West Godavari Districts, Attractive Salary. Contact: 79950 50571 or Send Resumes To hr@gvsprojectspvtltd.com

కాకినాడ, ROY చెస్ అకాడమీ కోచింగ్ సిబ్బంది కావలెను. అర్హత డిగ్రీ, వ: 35 లోపు. జీ: 15,000, చెస్ లేదా టీచింగ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. ✆ 62815 98466.

జీతం: రూ.15,000/- నుండి రూ.25,000/-, సర్వీస్ అడ్వైజర్ & ఇన్‌చార్జ్ కావలెను. కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి. శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ:20k. ✆ 89776 39662,89776 39663.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. జీతం: రూ.12,000/- నుండి రూ.15,000/- వరకు. Contact: శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

వ్యాన్ డ్రైవర్స్ కావలెను. జీతం: రూ.15,000/- + డైలీ రూ.100/-, (వివాహమైన స్థానిక అభ్యర్థులు మాత్రమే). శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. గోకవరం మండలం, పెంటపల్లి గ్రామంలో ఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 7893555551, 9030056553.

హైదరాబాద్‌లో పనిచేయడానికి M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 20,000+ భోజనము + వసతి. ఈ జీతం నెల 20లోపు జాయిన్ అయిన వారికి మాత్రమే. +91 76809 22316.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-50 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా- 27, వంకాయలు- 28, 30, 40, 44, బెండకాయలు- 50, పచ్చిమిర్చి- 44, 48, కాకరకాయ- 50, బీర- 68, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 34, క్యారెట్- 32, 40, దొండకాయలు- 35, బంగాళాదుంపలు- 23, 26, ఉల్లి- 22, 27, -, దోసకాయలు- 22, చిక్కుడు- 40, 48, చేమదుంపలు- 32, బీట్‌రూట్- 36, కీరదోస- 32, బీన్స్‌కాయలు- 80, అల్లం- 74, క్యాప్సికం- 66, బొబ్బర్లు- 50, చిలకడదుంపలు- 34, ఒకటి చొప్పున ఆనపకాయ- 25, 30, పొట్లకాయ- 25, 30, అరటికాయ-5, 6, మునగకాడ- 18, 20, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 24, 30.

తెరపై ఈనాడు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- ఆంధ్ర కింగ్ తాలూకా, దురంధర్, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- ఆంధ్ర కింగ్ తాలూకా, అమరకావ్యం, లక్ష్మీ- అమర కావ్యం, సత్యగౌరి - ఆంధ్ర కింగ్ తాలూకా, తిరుమల- బైసన్, సీఅండ్‌సీ 1- దురంధర్, సీఅండ్‌సీ 2- బిజినెస్‌మేన్, శ్రీప్రియ - ఆంధ్ర కింగ్ తాలూకా, పద్మప్రియ- రాజు వెడ్స్ రాంబాయి, సూర్య1(వాకలపూడి) - రాజు వెడ్స్ రాంబాయి

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ. 10 - మ. 1 కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

వ్యర్థాలు తొలగించారు..

మసీదు సెంటర్: కాకినాడ టూటౌన్ వంతెన కింద రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి పక్కన వ్యర్థాల గుట్టలు పేరుకుపోయి అధ్వానంగా మారింది. 'ఈనాడు'లో కథనం రావడంతో అధికారులు సమస్యను పరిష్కరించారు.

దీపాలు వెలగడం లేదు..

సాంబమూర్తినగర్: కాకినాడ ఆర్టీసీ బస్టాండ్ దారిలో 100 బిల్డింగ్ కూడలి వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేశారు. అందులో ఒక దీపం మాత్రం వెలిగి, మిగిలిన ఐదు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్పందనకు వందనం

అపాయం తప్పించారు..

మసీదుసెంటర్: కాకినాడ వెంకట్‌నగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి ఉన్న ఫ్యూజు బాక్స్ ప్రమాదకరంగా ఉంది. ఇటీవల 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. అధికారులు పరిష్కరించారు.

పశువుల సంచారాన్ని అరికట్టండి..

కాకినాడ వెంకట్‌నగర్ ఉద్యానంలో పశువులు, శునకాల సంచారం అధికంగా ఉంటోంది. సాయంత్రం సమయంలో ఉద్యానంలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి పశువులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి దీపాలు వెలిగించరు

బాలాజీచెరువు, న్యూస్‌టుడే: స్థానిక 40వ డివిజన్, జిల్లా ప్రభుత్వ పశువుల ఆసుపత్రి ప్రాంతంలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. నాలుగురోడ్ల కూడలిలో హైమాస్ట్ దీపం వెలగక రాత్రి పూట వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతంలో చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయని రామారావుపేటకు చెందిన ఎం.కల్యాణ్ పేర్కొన్నారు.

గ్రంథాలయానికి డిజిటల్ పరికరాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: గాంధీనగర్ శాఖా గ్రంథాలయానికి శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.2 లక్షల విలువైన కంప్యూటర్లు, స్మార్ట్‌టీవీ, స్మార్ట్‌ఫోన్‌లను సమకూర్చారు. ఈసందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సౌకర్యాలను గ్రంథాలయ పనివేళల్లో పాఠకులు, విద్యార్థులు సమాచారం, విజ్ఞానం పెంచుకునేందుకు ఉపయోగించుకోవచ్చన్నారు.

అప్రోచ్ రోడ్లు.. ఎన్నాళ్లీ అవస్థలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని కీలకమైన అప్రోచ్‌రోడ్ల నిర్మాణ విషయంలో ఏళ్లతరబడి జరుగుతున్న జాప్యంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. స్థానిక కొండయ్యపాలెం రైల్వేగేటు వద్ద నిర్మించిన పైవంతెనకు, చీడీలపొర ప్రాంతం నుంచి ప్రభుత్వ ఐటీఐ వెనుక భాగం వరకు ఏర్పాటు చేసిన రెండు వరుస రహదారికి అప్రోచ్‌రోడ్లు వేయకపోవడం రాకపోకలకు తీవ్ర ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. దీనిపై కలెక్టరేట్, నగరపాలక సంస్థ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో ప్రజలు, వివిధ సామాజిక సంస్థలు అర్జీలు దాఖలు చేస్తున్నా.. ఎండమావిగానే మిగిలిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పైవంతెన వద్ద ప్రయాస

2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొండయ్యపాలెం పైవంతెన మంజూరయ్యింది. తర్వాత మూడు ప్రభుత్వాల్లోనూ దీనికి శంకుస్థాపనలు చేశారు. అనేక ప్రతిబంధకాల నడుమ 2024లో నిర్మాణం పూర్తి చేశారు. భూసేకరణ, వంతెన నిర్మాణానికి రూ.60కోట్లు ఖర్చు చేశారు. ఇరువైపులా అప్రోచ్‌రోడ్లు మాత్రం నిర్మించలేదు. దీంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. గుత్తేదారుకు రూ.కోటి వరకు బిల్లులు బకాయిలు ఉన్నాయి. వీటిని చెల్లిస్తేనే అప్రోచ్‌రోడ్లు నిర్మిస్తామంటున్నారు.

కొండయ్యపాలెం పైవంతెనకు ఒకవైపున రహదారి దుస్థితి

నిర్మాణంపై దృష్టి

బిల్లులు పెండింగ్‌తో గుత్తేదారు ముందుకు రావడం లేదు. వంతెనకు ఒకవైపున అప్రోచ్‌రోడ్డు స్థలంపై కోర్టు వివాదం ఉంది. వీటన్నింటినీ త్వరగా పరిష్కరించి, అప్రోచ్‌రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- జి.కంఠు, ఎస్ఈ, ఆర్అండ్‌బీ, కాకినాడ.

చీడీలపొర దారిలో ఎవరిదీ పాపం

ప్రభుత్వ ఐటీఐ వెనక ప్రాంతంలో అప్రోచ్ నిర్మించక అవస్థలు

గత వైకాపా ప్రభుత్వంలో కొండయ్యపాలెం పైవంతెనకు అనుసంధానంగా చీడీలపొర ప్రాంతం నుంచి ప్రభుత్వ ఐటీఐ వెనక వరకు రూ.16 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో రెండు వరుసల రహదారిని నిర్మించారు. ఈ రహదారి మధ్యలో భూదాన బోర్డు, ప్రైవేటు భూమి ఉంది. ప్రైవేటు భూమికి టీడీఆర్ బాండ్లు చెల్లించి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. భూదానబోర్డు భూమిలో మాత్రం పనులు చేయలేదు. అలాగే ప్రభుత్వ ఐటీఐ వెనుక ఈ రహదారి అప్రోచ్‌రోడ్డును నిర్మించకుండా వదిలేశారు. పనుల్లో కమీషన్లకు కక్కుర్తిపడి కానిచ్చేశారు. ఇక్కడ అప్రోచ్‌రోడ్డు నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. ఇక్కడ వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

త్వరలో చేపడతాం

అప్రోచ్‌రోడ్డుపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. వీలైనంత త్వరగా పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తాం.

- ఎన్‌వీవీ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్(ఇన్‌ఛార్జి), కాకినాడ

చేయి చేయి కలిపారు.. మొక్కలు నాటారు

'సమాజం కోసం మూడు గంటలు' కార్యక్రమంలో భాగంగా ఆల్‌ఈజ్‌వెల్ సంస్థ కాకినాడ మహాలక్ష్మి నగర్‌లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం శ్రమదాన కార్యక్రమం చేపట్టింది. సంస్థ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ నేతృత్వంలో సభ్యుల బృందం కేంద్రం పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. అనంతరం పలు రకాల మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. మొక్కల సంరక్షణ గ్రీన్ మెష్‌ను ఏర్పాటు చేశారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అన్నవరం సత్యదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

సాగర తీరం.. స్వచ్ఛతే ధ్యేయం

పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలను తొలగించి, సాగర తీరంలో స్వచ్ఛతకు విద్యార్థులంతా తమవంతు కృషి చేశారు. లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ సాగరతీరంలో స్వచ్ఛ సముద్రతీర పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. 60 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా విడిపోయి బీచ్‌లో జలచరాలకు ఇబ్బంది కలిగించే ప్లాస్టిక్ స్పూన్‌లు, వల ముక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు సీసాలను సేకరించారు. బీచ్‌కు వచ్చిన వారికి ప్లాస్టిక్ వాడొద్దంటూ దానివల్ల కలిగే అనర్థాలను వివరించారు. – న్యూస్‌టుడే, గాంధీనగర్

ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

రక్తదానంతో ప్రాణదానం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ట్రస్టు ఆసుపత్రిలో ఓ రోగికి శస్త్ర చికిత్స నిమిత్తం శనివారం రాత్రి 11 గంటల తర్వాత అత్యవసరంగా రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న చేయూత సభ్యులైన ఎండీ అజహర్ ముందుకొచ్చి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి వెళ్లి రక్తదానం చేశారు. ఆయన ఇలా రక్తం అందించడం 47వసారి కావడం విశేషం. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

సెలవులో నగరపాలక సంస్థ కమిషనర్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ సెలవుపై శబరిమల వెళ్లారు. ఆయన నగరంలో అయిదు రోజుల పాటు అందుబాటులో ఉండరు. శనివారం నుంచి విధులకు హాజరవుతారు.

పోటీల్లో విజేతలతో అతిథులు

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘ జిల్లా కార్యవర్గం

కాకినాడ నగరం: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా డా.పీవీ కృష్ణ, ఉపాధ్యక్షునిగా ఎంసీహెచ్ శ్రీనుబాబు, ప్రధాన కార్యదర్శిగా జి.ధనకృష్ణారావు, సహాయ కార్యదర్శిగా బి.శివకృష్ణ, కోశాధికారిగా జి.లక్ష్మీనారాయణ, మహిళా కార్యదర్శిగా కె.శ్రీలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్‌గా ప్రేమకుమారి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

ప్రమాణస్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులు

మానవ జీవితానికి మార్గసూచి భగవద్గీత

గాంధీనగర్, న్యూస్‌టుడే: భగవద్గీత మానవ జీవితానికి మార్గసూచి లాంటిదని, మనకు వచ్చే ప్రతి సమస్యకు అందులో సమాధానం దొరుకుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యుడు గట్టి సత్యనారాయణ అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం భానుగుడి ప్రఖండ భగవద్గీత కంఠస్థ పోటీలను గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాలలో జరిగాయి. సంస్కృత విభాగ్ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీకృష్ణవాణి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్, సహ కార్యదర్శి బి.వెంకటదుర్గ, ఉదయభానోజీరావు, రవి వర్మ, శ్రీదేవి, సునీత, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

నగరంలోని జగన్నాథపురం వంతెన నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వైపు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా దర్శనమిస్తోంది. పలు కారణాలతో రహదారి తవ్వేసి గుట్టలా మట్టి వేసేయడంతో రాకపోకలకు వీలు లేకుండా ఉంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

కార్యాలయం.. భయం భయం

కాకినాడ నాగమల్లితోట ప్రాంతంలోని ఆహార నియంత్రణ విభాగ కార్యాలయం(ఫుడ్ సేఫ్టీ) కళా విహీనంగా దర్శనమిస్తోంది. భవనం పై భాగాన పలు చోట్ల బీటలు వారాయి. సిమెంటు పెళ్లలు ఎక్కడ పడతాయేమోనని ఇక్కడకు వచ్చే వారు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే భవనం మొత్తం చెమాయింపు ఉంటోంది. ఇటీవల ప్రధాన ద్వారం వచ్చిన తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్లాస్టరింగ్ చేయించి అలాగే వదిలేశారు. ఎలాంటి రంగులు వేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టడంతోపాటు రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

బస్టాండులో రద్దీ

శని, ఆదివారాలు వచ్చిందంటే చాలు.. కాకినాడ ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ప్రధానంగా తుని, ద్రాక్షారామ, రావులపాలెం రూట్ల వైపు వెళ్లే ప్రయాణికులకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులే దిక్కు. ఇవి మామూలు రోజుల్లో కన్నా ఈ రెండురోజుల్లో అత్యంత రద్దీగా ఉంటున్నాయి. ఆదివారం కాకినాడ ఆర్టీసీ బస్టాండులో తుని బస్సులో సీటు కోసం జనాలు ఎగబడుతున్న దృశ్యమిది. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

పట్టుతప్పితే కాలువలోకే..!

కాకినాడ నాగమల్లితోట ఎస్‌బీహెచ్ కాలనీ రహదారి నుంచి ఎఫ్‌సీఐ కాలనీకి వెళ్లే దారిలో కాలువపై ఏర్పాటుచేసిన వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాత్రి సమయంలో ఏ మాత్రం ఏమరపాటుగా ఉంటే కాలువలో పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

ఉచిత కంటి పరీక్షలు

పరీక్షలు చేస్తున్న వైద్యనిపుణులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ, వార్డు సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కాకినాడ 36వ డివిజన్ తెదేపా పార్టీ ఇన్‌ఛార్జి నల్లూరి శ్రీనివాస్, తులసి దంపతులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వార్ఫురోడ్డు, పగోడా స్కూల్ ప్రాంగణంలో శ్రీసూర్య కంటి ఆసుపత్రి సీఈవో, ఏఎల్ ఐ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ రామ్‌ప్రకాష్ సౌజన్యంతో ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. 300 మంది ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారని శ్రీనివాస్ తెలిపారు. ఉచితంగా మందులు అందజేసామని, అవసరమైన వారికి త్వరలో ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. తెదేపా నాయకులు ఆకెళ్ల ప్రసాద్, చాట్ల వీరబాబు, ఉప్పులూరి వీరభద్రరావు, అమలకంటి ప్రకాష్, నాగం సుబ్బారావు, దారపు శ్రీను, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలాగ్రామ లక్ష్మీప్రసన్న, జనసేన నాయకులు సుంకర సురేష్ పిలారిశెట్టి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి హోమం

ప్రత్యేక అలంకరణలో భోగి గణపతి స్వామి

గాంధీనగర్: నగరంలోని సూర్యారావుపేటలో స్వయంభూ భోగి గణపతి పీఠంలో ఆదివారం సంకష్టహర చతుర్థి సందర్భంగా గణపతి హోమం నిర్వహించారు. ఈసందర్భంగా గణపతి ప్రతిమ, పూర్ణాహుతి ద్రవ్యాలతో మంగళవాయిద్యాల నడుమ నగర సంకీర్తన జరిగింది. ఉపాసకులు సహస్ర ఉండ్రాళ్లను స్వామివారికి సమర్పించారు. పీఠం సేవకులు సత్య సతీష్ దంపతులు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం గణపతి సహస్రనామ పారాయణ, జ్వాలాతోరణ జరిగింది. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ నిత్య గణపతి హోమాన్ని వచ్చే ఉగాది వరకూ ప్రతిరోజూ నిర్వహిస్తామని తెలిపారు.

నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

ఆనంద నిలయం భూముల రక్షణకు కృషి: ఎమ్మెల్యే

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఆనంద నిలయ వసతి గృహ ఆవరణలోని పిఠాపురం మహారాజా సంస్థానానికి చెందిన భూములను కాపాడేందుకు కృషిచేస్తానని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. నగర పరిధి రంగరాయ వైద్య కళాశాల ఎదురుగా సాంఘిక సంక్షేమశాఖ ఆనంద నిలయ వసతి గృహ ఆవరణలో భూములను ఆదివారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ గల 19 ఎకరాలను కోర్టు నుంచి డిక్రీ పొందటం ద్వారా కొందరు ప్రైవేటు వ్యక్తులు సొంతం చేసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. భూమిని కాపాడుకోవటంలో సంబంధిత అధికారులు, ప్రభుత్వ తరపు న్యాయవాదులు సరిగా వ్యవహరించలేదని ఆరోపించారు. ఇక్కడ మొత్తం 30 ఎకరాల భూమి ఉండేదని, ఇందులో 19 ఎకరాల భూమిలో అనాథ పిల్లలకు వసతి గృహాన్ని నడిపేందుకు సంస్థానం తరపున అందించారని ఎమ్మెల్యే వివరించారు. ఒక ఎకరంలో వసతి గృహం, మిగతా 18 ఎకరాల్లో సర్వే తోట ఉండేదని, దాంతో వసతి గృహ నిర్వహణకు ఆదాయం సమకూరేదన్నారు.

ఆనంద నిలయం వసతి గృహం వద్ద పరిశీలిస్తున్న కొండబాబు

1984లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం ఆధారంగా మొత్తం వసతి గృహంతో పాటు 30 ఎకరాల భూమిని అప్పటి రాష్ట్ర ప్రభుత్వ స్వాధీనం చేసుకుందని తెలిపారు. తర్వాత వివాదాలు వచ్చినప్పటికీ భూమితో పాటు వసతి గృహం సైతం ప్రభుత్వానికే చెందుతుందని 1961లో ఉత్తర్వులు వచ్చాయన్నారు. అయినప్పటికీ కొందరు తప్పుడు ధ్రువీకరణలతో కోర్టు నుంచి డిక్రీ పొందారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వసతి గృహాన్ని, విలువైన భూములను కాపాడేందుకు కృషి చేస్తానని కొండబాబు తెలిపారు.

24న క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు

పెద్దాపురం: ఈనెల 24న పెద్దాపురంలో క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పోటీలు అండర్ 16, 18, 20 బాలురు, బాలికల విభాగాలుగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ రుసుము రూ.300 చెల్లించాలన్నారు. వివరాలకు ఈ నంబర్లకు 9381368116, 9849157020కు సంప్రదించాలన్నారు.

శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధులు

సర్పవరం: శీతాకాలంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నందువల్ల సాధారణ ప్రజలతోపాటు వృద్ధుల్లో శ్వాసకోశ రుగ్మతలు పెరుగుతుంటాయి. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఉపశమనం పొందవచ్చని విశ్రాంత డీఎంఈ డా.రాఘవేంద్రరావు తెలిపారు. కాకినాడ బోటుక్లబ్ ఉద్యానంలో ఆదివారం జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన డా.రాఘవేంద్రరావు శ్వాసకోశ వ్యాధులపై అవగాహన కల్పించారు.

సంక్షేమ బోర్డు పథకాల అమలుకు పోరాటం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు చెల్లిస్తున్న లేబర్ సెస్ నిధులు ఎవరి ఖాతాల్లోకి వెళుతున్నాయో తెలియడం లేదని, ఇకనైనా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు చేయాలంటూ పోరాడదామని ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం అశోక్‌నగర్‌లోని వీర్‌కమల్ థియేటర్ వద్ద జిల్లా యూనియన్ సమావేశాన్ని అన్నవరం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ, అనుబంధ రంగాల కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదు చేయించుకుని గుర్తింపు కార్డు పొందాలన్నారు. ప్రభుత్వం లేబర్ సెస్ దోచుకోవడం ఆపాలని, ఆ నిధులను వెంటనే సంక్షేమ బోర్డుకు జమచేయాలన్నారు. ఈనెల 12న కాకినాడలో జరిగే సదస్సుకు కార్మికులంతా హాజరై జయప్రదం చేయాలన్నారు. సంఘ అధ్యక్షుడు పి.త్రిమూర్తులు, రమణ, బాలకృష్ణ, శ్రీనివాసు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్

బాలికల అదృశ్యంపై కేసు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఇద్దరు బాలికల అదృశ్యంపై కాకినాడ రెండో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కాకినాడ, డెయిరీ ఫాంసెంటర్‌కు చెందిన 14 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతోంది. తన స్నేహితురాలితో కలిసి ఈ నెల 6న జగ్గంపేటలోని పాత స్నేహితురాలి పుట్టిన రోజు కావడంతో ఆమె ఇంటికి వెళ్లారు. తిరిగి బస్సులో ముగ్గురు కలిసి కాకినాడ వచ్చారు. వారిలో ఒక బాలిక కల్పనా సెంటర్ వద్ద బస్సు దిగిపోయింది. మిగిలిన ఇద్దరు బాలికలు ఎక్కడికో వెళ్లారో తెలియలేదు. వారి కోసం వెతగగా ఆచూకీ లభించలేదు. వారి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: వ్యక్తిగత కారణాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కాకినాడ రెండో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ, పేర్రాజుపేటకి చెందిన తోట శ్రీను(41) పెయింటింగ్ పనులు చేస్తుంటారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన గత కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఆదివారం ఉదయం పనినిమిత్తం రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. అనంతరం చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రయోగాలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: పిల్లలు తమ ఆలోచనలకు పదును పెట్టారు. ప్రజలకు ఉపయోగపడేలా ప్రయోగాలు చేశారు. సాలిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను చూసి పలువురు అభినందించారు.

మురుగు నీటిని శుద్ధి చేసి వినియోగించేలా..

ఏడో తరగతి విద్యార్థిని దండు దీక్షిక సత్య సాయి మురుగు నీటిని శుద్ధి చేసే యంత్రాన్ని రూపొందించింది. సమీప ప్రాంతాల్లో ఉండే మురుగు నీటిని సులభ పద్ధతిలో శుద్ధి చేసి ఇళ్లల్లో వాడుక అవసరాలను వినియోగించవచ్చని పేర్కొంది. నాలుగు టబ్బులను తీసుకుని మొదటి దానిలో బొగ్గు, రెండో దానిలో రాళ్లు, మూడో డబ్‌లో ఇసుక, నాలుగో దానిలో దూది ఉంచింది. దీని ద్వారా మొదటి టబ్ లోని మురుగు నీరు చివరి దానిలోకి వచ్చే సరికి శుద్ధనీటిగా మారుతుందని వివరించింది.

సూక్ష్మక్రిముల గుర్తింపు

పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని జి.అక్షయ సూక్ష్మక్రిములను గుర్తించే పరికరాన్ని రూపొందించి ప్రదర్శించింది. దీనికి అందుబాటులో ఉండే అద్దం, అట్టపెట్టె, గమ్ము, ప్లాస్టర్, గ్లాస్, లైటు, స్విచ్, బ్యాటరీలను వినియోగించింది. గొట్టానికి అమర్చిన గ్లాసు ద్వారా లోపల దీపాన్ని వెలిగించి చూస్తే అతి సూక్ష్మక్రిములు సైతం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది సందర్శకులను ఆకట్టుకుంది.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

కంటి శిబిరాన్ని పరిశీలిస్తున్న తుమ్మల రామస్వామి

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: కంటి వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి తెలిపారు. మండలంలోని హుస్సేన్‌పురంలో ఆదివారం కంటి వైద్య శిబిరం జరిగింది. శిబిరాన్ని డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, తెదేపా నాయకులు నిమ్మకాయల రంగనాగ్ పరిశీలించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేసి 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు.

వీఆర్వోలపై ఆర్డీవో ఆగ్రహం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: స్థానికంగా వివాదాలు నెలకొని ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన సమాచారం వీఆర్వోలు అందించకపోవడంపై ఆర్డీవో మల్లిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీవో అధికారులతో కలిసి ఆదివారం గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయానికి రాగా తాళాలు వేసి ఉండడంతో డ్యూటీ సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. విధులు నిర్వహించని సిబ్బందిని సస్పెండ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్ రామకృష్ణారావును ఆర్డీవో ఆదేశించారు. సిబ్బందితో తాళాలు తీయించి లోపలికి ప్రవేశించారు. కొంత సమయానికి కార్యాలయానికి వచ్చిన వీఆర్వోలతో మాట్లాడారు. స్థానికంగా జరుగుతున్న కార్యక్రమాల గురించి వీఆర్వోలు తక్షణం అధికారులకు సమాచారం అందించకుంటే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఎంపీపీ మీరు కాదు.. కూర్చోండి

మాట్లాడుతున్న ఎంపీపీ సుధ భర్త శ్రీనివాసరావు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలానికి ఎంపీపీ ఓ మహిళ కదా.. ప్రతి విషయానికి మీరు మైక్ తీసుకుని ఎందుకు ప్రసంగిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు వైకాపా ఎంపీపీ కారే సుధ భర్త శ్రీనివాసరావును నిలదీశారు. మేం అడిగే ప్రశ్నలకు మీకు సమాధానం చెప్పే అధికారం లేదని అందరితో పాటు మీరు కూడా కూర్చోవాలన్నారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో ఎంపీపీ భర్త శ్రీనివాసరావు సమావేశంలో తెదేపా, జనసేన పార్టీలకు చెందిన సభ్యులు బెదిరించాలని చూస్తున్నారని అనడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదంతా ఆదివారం కొత్తపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో చోటు చేసుకుంది. సమావేశంలో వాకతిప్ప ఎంపీటీసీ సభ్యురాలు నాగమహేశ్వరి మండల నిధులపై ప్రశ్నించగా చెప్పాల్సిన పనిలేదని కావాలంటే ఆర్టీఐలో ఫిర్యాదు చేసుకోవాలని సమాధానం ఇచ్చారు. వివిధ ప్రజా సమస్యల కోసం చర్చించాల్సిన సమావేశం సభ్యుల గొడవల వేదికగా మారింది.

సభ్యులతో పనిలేదు.. సంతకాలు ఉంటే చాలు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: సమావేశంలో పూర్తిస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు లేకుండా జరుగుతుండగా కొండెవరం ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు కోరం లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తున్నారని ఎంపీడీవో లక్ష్మీరెడ్డిని ప్రశ్నించారు. దీంతో ఆయన సభ్యుల సంతకాలు చూపించారు. సంతకాలు కాదు సమావేశంలో ఎక్కడున్నారని నిలదీయగా.. మాకు సభ్యులతో పని లేదు. సంతకాలు ఉంటే చాలని ఎంపీడీవో తెలపడంతో ఆగ్రహానికి గురైన ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశం నుంచి బయటికెళ్లి నిరసన వ్యక్తం చేశారు. బాధ్యతగా సమావేశం నిర్వహించాల్సిన ఎంపీడీవో సభ్యుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీపాద వల్లభుడి ఆలయాభివృద్ధికి నిధులు

పిఠాపురం దత్తాత్రేయుడి జన్మస్థానం కావడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. ముఖ్యంగా స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా వంటి ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తుంటారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి, దత్త జయంతి, శ్రీపాద జయంతి రోజుల్లో దర్శనం కోసం భక్తులు వస్తూపోతూ ఉంటారు. ఇంత ప్రాముఖ్యం పొందిన ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

మెరుగుపడనున్న సౌకర్యాలు

శ్రీపాద వల్లభ మహాసంస్థానం

రూ.2 కోట్లతో ఆధునికీకరణ

దేవాదాయశాఖ కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులు రూ.2 కోట్లు శ్రీపాద వల్లభుడి ఆలయానికి వెచ్చిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఈ నిధులతో అన్నదాన కేంద్రాన్ని పూర్తిగా ఆధునికీకరిస్తారు. ప్రస్తుతం రోజుకు 1,500 మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు. వీరంతా సరైన సౌకర్యాలు లేకపోవడంతో నిలబడే భోజనం చేస్తున్నారు. భక్తులు కూర్చుని, సంతృప్తిగా భోజనం చేసేందుకు అన్నదాన సత్రం, కిచెన్ నిర్మాణం చేయనున్నారు. శ్రీపాద వల్లభుడి సన్నిధిలో భక్తులు పారాయణ, ఇతర పూజలకు 300 మంది మాత్రమే కూర్చునేందుకు ప్రస్తుతం వీలుంది. ఇప్పుడు 500 మంది భక్తులు కూర్చునేందుకు వీలుగా వసతులు మెరుగుపరుస్తున్నారు.

అందుబాటులో 67 గదులు

ప్రస్తుతం ఆలయానికి వచ్చే భక్తులకు ఉచితంగా బస చేసేందుకు 67 గదులు ఉన్నాయి. రెండేళ్ల క్రితం రూ.3 కోట్ల కేటాయింపుతో 15 గదులు, 2 పెద్ద వసతి హాళ్లు నిర్మించాం. ఇటీవల ఓ దాత కూడా రూ.2 కోట్ల విలువైన వసతి గదుల భవనం నిర్మించి ఆలయానికి విరాళం ఇస్తామని చెప్పారు. ఇలా ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఆలయ ప్రాముఖ్యం కూడా పెంపొందించేందుకు పాటుపడుతున్నాం. - ఆర్.సౌజన్య, ఈవో, శ్రీపాదవల్లభ మహాసంస్థానం, పిఠాపురం

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

పిఠాపురం: పిఠాపురం పాడా కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఇన్‌ఛార్జి పీడీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతామని మళ్లీ ఇవ్వనవసరం లేదన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. డివిజనల్ స్థాయి అధికారులంతా హాజరుకావాలన్నారు.

230 మందికి ఉచిత వైద్య పరీక్షలు

తాళ్లరేవు: చొల్లంగి ట్రస్ట్ ఛైర్మన్ తిరుమాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోపూడి వాసుదేవ రాజు, కర్రి నూకరాజు సహకారంతో చినబొడ్డు వెంకటాయపాలెంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. 30 మంది యువకులు రక్తదానంలో పాల్గొన్నారు. కాకినాడ గౌతమి ఆసుపత్రి వైద్యులు సుబాష్, సృజన ఆధ్వర్యంలో 230 మందికి పరీక్షలు నిర్వహించారు. నరసింహరాజు, మణికంఠ పాల్గొన్నారు.

250 మంది పేదలకు దుప్పట్ల అందజేత

కరప, న్యూస్‌టుడే: పేదలను ఆదుకునేలా సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సామాజిక సేవావేత్త పొలిశెట్టి నారాయణ కోరారు. కరపలో దాత రెడ్డి గంగరాజు సమకూర్చిన దుప్పట్లను 200 మంది పేదలకు ఆయన చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. యండమూరులో స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో గుబ్బల రాంబాబు 250 మంది పేదలకు ఉన్ని దుస్తులు పంపిణీ చేశారు. భద్రం, కిరణ్‌కుమార్, జైన్, పురుషోత్తమ్, గుప్తా పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 1990 మంది హాజరు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలంలో ఆదివారం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు తొమ్మిది కేంద్రాల ద్వారా 1990 మంది హాజరైనట్లు ఉప విద్యాశాఖాధికారి ఈరంకి ప్రభాకరశర్మ తెలిపారు. 2075 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 85 మంది హాజరుకాలేదన్నారు.

నేడు కాజులూరులో మంత్రి సుభాష్ పర్యటన

కాజులూరు: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు శీల, మంజేరు, కోలంక, దుగ్గుదూరు, కుయ్యేరు గ్రామాలకు మంజూరైన కొత్త ట్రాక్టర్లు, ట్రక్కులు పంపిణీ చేస్తారని వివరించారు. కోలంకలో నిర్మించిన సీసీరోడ్డుని ప్రారంభిస్తారని తెలిపారు.

100 మందికి నిత్యావసర సరకుల పంపిణీ

పిఠాపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ పేదలకు అండగా నిలవాలని పిఠాపురం అర్బన్ మాజీ ఛైర్మన్ బాలిపల్లి రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక జగ్గయ్యచెరువులోని క్రీస్తు ఎవాంజెలికల్ లూథరన్ మినిస్ట్రీస్ బైబిల్ శిక్షణా కేంద్రంలో క్రిస్మస్ సందర్భంగా పాస్టర్ బి.శామ్యూల్ కుమార్ సమకూర్చిన నిత్యావసర సరకులు పేదలకు జనసేన నేతలు, మహారాజా తనయుడు రామరత్నారావు అందించారు. 100 మంది పేదలకు 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్, ఇతర సరకులు ఇచ్చారు.

24న క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు

పెద్దాపురం: ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న పెద్దాపురంలో క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కాపారెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పోటీలు అండర్ 16, 18, 20 బాలురు, బాలికల విభాగాలుగా నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ రుసుము రూ.300 చెల్లించాలన్నారు. వివరాలకు ఈ నంబర్లకు 9381368116, 9849157020కు సంప్రదించాలన్నారు.

బస్‌షెల్టర్ లేక ఇక్కట్లు

సామర్లకోట బ్రౌన్‌పేట సెంటర్‌లో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మహిళలకు స్త్రీశక్తి పథకంలో భాగంగా నిత్యం అనేక మంది మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. బ్రౌన్‌పేట సెంటర్ వద్ద పూర్వం సత్రం స్థలంలో బస్ షెల్టర్ ఉండేది. దానిని కూలగొట్టి సత్రం స్థలాన్ని ఆక్రమించి భవనాలు నిర్మించడంతో ప్రయాణికులు వేచిఉండేందుకు నీడ లేక వర్షంలోను, వేసవిలో ఎండల్లో బస్సులకోసం పడిగాపులు కాస్తున్నారు. – న్యూస్‌టుడే, సామర్లకోట

బెర్మలు వేయరూ..!

కరప శివారు పేపకాయలపాలెంలో సీసీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌తో బెర్మలు వేయకపోవడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. బెర్మలు వేయక వాహనాలు రోడ్డు అంచుల వరకు వెళ్లి పలువురు పడిపోతున్నారు. పీఆర్ ఏఈ శైలజకు చెప్పగా గ్రావెల్‌తో బెర్మల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కరప

పైపు పగిలింది..

పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయానికి వెళ్లే ముఖద్వారం వద్ద ర.భ.శాఖ రహదారిపై మంచినీటి పైపులైన్ పగిలింది. కొద్దిరోజులుగా కుళాయిల నుంచి నీరు విడుదల చేసిన సమయంలో నీరంతా వృథాగా పోతోంది. మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. మంచినీటి పర్యవేక్షణాధికారి జనార్దన్‌కు తెలుపగా మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

ప్రమాదకరంగా గుంత

పెద్దాపురంలోని మేదరవీధి నుంచి నువ్వులగుంటవీధికి వెళ్లే రహదారిలో గుంత పడి ప్రమాదకరంగా తయారైంది. మేదరవీధికి సమీప రహదారి మార్గం కావడంతో వాహన చోదకులు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. గుంతను పూడ్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి వివరణ ఇస్తూ గుంత పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

రెయిలింగ్ శిథిలం

గొల్లప్రోలు మండలం తాటిపర్తి- వన్నెపూడి మధ్య ర.భ.శాఖ రహదారిలో వంతెనకు రెండువైపులా రెయిలింగ్ శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఈ మార్గంలో నిత్యం అధిక సంఖ్యలో వాహనదారుల రాకపోకలు సాగిస్తున్నారు. దీర్ఘకాలంగా మరమ్మతులు చేపట్టక ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి ఏర్పడింది. వంతెన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ లోవరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325, పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: స్థానిక మంగళవారపుపేటలో రహదారిలో చెత్తకుప్పలున్నాయి. వాటిని తొలగించాలి. - శ్రీనివాసరావు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణ సిబ్బందిని పంపి చెత్త తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: చేబ్రోలు రథంబాట వీధిలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. - స్థానికులు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి రాజు సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: కరప కొత్తపేటవీధిలో వీధి దీపాలు సరిగా వెలగక ఇబ్బందులు పడుతున్నాం. - సత్యనారాయణ

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవికి చెప్పగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు. – న్యూస్‌టుడే, కరప

మార్గశిర మాసం.. ఆరుద్ర నక్షత్రం పూజలు

ఎండు పండ్లతో రామలింగేశ్వరస్వామికి అభిషేకం

అలంకరణలో పెదపూడి సోమేశ్వరస్వామి

నడకుదురులో..

గొల్లప్రోలు: దుర్గాడ శివాలయంలో మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాసపూర్వకంగా ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పళ్లరసాలు, సుగంధ జలాలతో, ఎండు పండ్లతో రామలింగేశ్వరస్వామికి ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ●**పిఠాపురం:** పాదగయ క్షేత్రంలో వేంచేసిన కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాలు నిర్వహించారు. ●**పెదపూడి:** పెదపూడి శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో భక్తులు పూజలు చేశారు. ● **తాళ్లరేవు:** తాళ్లరేవులో సువర్చలా సమేత దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ వ్రత మహోత్సవ పూజలు జరిగాయి. సింధూర కుంకుమార్చనలు చేశారు. ● **కరప:** నడకుదురులోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు సతీష్‌తోపాటు 15 మంది వేదపండితుల ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ● **పెద్దాపురం:** మరిడమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం అన్నసంతర్పణ నిర్వహించారు. దేవాలయం ఏసీ విజయలక్ష్మి, వేదపండితులు నాగదేవర వేంకటశాస్త్రి, ఇంద్రగంటి ప్రసాదశర్మ, ఆసాదుల విజయ్, నాని పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో పోటీపై కసరత్తు

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పిఠాపురం: స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వార్డుల్లో ప్రస్తుత పరిస్థితిపై కసరత్తు చేస్తున్నామని భాజపా పట్టణాధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయంలో పట్టణ కమిటీ సమావేశం జరిగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి మరింత బలోపేతం కావాలన్నారు. ఏయే వార్డుల్లో పోటీ చేద్దాం, అక్కడ విజయం సాధించే విధంగా ఏం చేయాలో చర్చించారు. నాయకులు సత్యకుమారి, బుర్రి మురళీధరరావు, పసుపులేటి సత్యనారాయణ, కర్నీడి తాతీలు, అల్లుబోయిన సూరిబాబు పాల్గొన్నారు.

శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధులు

సర్పవరం: శీతాకాలంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నందువల్ల సాధారణ ప్రజలతోపాటు వృద్ధుల్లో శ్వాసకోశ రుగ్మతలు పెరుగుతుంటాయి. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఉపశమనం పొందవచ్చని విశ్రాంత డీఎంఈ డా.రాఘవేంద్రరావు తెలిపారు. కాకినాడ బోటుక్లబ్ ఉద్యానంలో ఆదివారం జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బుద్దరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన డా.రాఘవేంద్రరావు శ్వాసకోశ వ్యాధులపై అవగాహన కల్పించారు.

రామాయణం మానవాళికి ఆదర్శం

గ్రంథాల ఆవిష్కరణలో విద్య వికాస సేవాసమితి ప్రతినిధులు

రమణయ్యపేట: వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే రామాయణ మహాకావ్యం మానవాళి అంతటికీ ఆదర్శమని, విద్యార్థి దశ నుంచి విలువలపై అధ్యయనాన్ని అలవాటు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని విద్య వికాస సేవాసమితి జిల్లా ప్రముఖ్ ఆర్.రవిశంకర్ పట్నాయక్ తెలిపారు. రమణయ్యపేటలో ఆదివారం సేవాసమితి ఆధ్వర్యంలో సంక్షిప్త రామాయణ గ్రంథాలను ఆవిష్కరించారు. ప్రతినిధులు రెడ్నం రాజా, ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సామాజిక కార్యకర్త రాజేష్ ఖన్నా

క్రికెట్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం: పెద్దాపురం పట్టణం శ్రీవీర్రాజు ఉన్నత పాఠశాలలో 16 రోజులపాటు పెద్దాపురం ఛాంపియన్స్‌లీగ్ 2025 ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను సామాజిక కార్యకర్త రాజేష్ ఖన్నా ప్రారంభించారు. ఈ పోటీలకు 10 టీమ్‌లు పాల్గొన్నాయి. గెలుపొందిన టీమ్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. పురపాలిక మాజీ ఉపాధ్యక్షుడు కొరుపూరి రాజు, తూతిక రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, సాయి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో విజేతలకు బహుమతులు

సామర్లకోట: సామర్లకోట వివేకానంద గ్రంథాలయంలో ఆదివారం భగవద్గీత కంఠస్థ పోటీలను ప్రఖండ అధ్యక్షుడు కర్రి ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, హిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు రాజమహంతి రవిశంకర్‌పట్నాయక్ విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈనెల 14న కాకినాడ భానుగుడి వద్ద గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆశక్తి గల అభ్యర్థులు 9849889359కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. పెద్దాపురం: భగవద్గీత శ్లోకాల చదవడంతో మేధాశక్తి పెరుగుతుందని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. ఆదివారం స్థానిక రాజుగారివీధిలోని మట్టే ఆదినారాయణ, నాగమణి ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో శ్రీహరి శంకరాచార్యులు వేద ట్రస్టు ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతుల ప్రదానం చేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పి.సత్తిబాబు, రావులపర్తి విజయ్, తిరువెంగళాచార్యులు, పాలశంకరం, ఖండవల్లి సూర్యనారాయణ, ట్రస్టు అధ్యక్షుడు సీహెచ్. హరిగోపాలశర్మ పాల్గొన్నారు.

బసవన్నల పోరు

కరప: కరప-రావులపాలెం ప్రధాన రహదారిపై రెండు ఎద్దులు గంటపాటు పొడుచుకుంటూ హల్‌చల్ చేయడంతో అక్కడివారంతా భయాందోళనకు గురయ్యారు. వాహనాలు రోడ్డుపై నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వీటి పోట్లాటతో ఒక తోపుడుబండి హోటల్, ఆటో, మోటారుసైకిళ్లు దెబ్బతిన్నాయి.

ఉద్యానం.. చీకటిమయం

మన చైతన్యం.. జన సౌకర్యం

కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్ రమణయ్యపేట బోటుక్లబ్ ఉద్యానంలో ఆదివారం సాయంత్రం వీధిదీపాలు స్విచ్‌లు ఆన్ చేయకపోవడంతో చీకటి కారణంగా సాయంత్రం తరువాత సందర్శకులు, వ్యాయామంకోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారని వాకర్స్ సంఘం అధ్యక్షుడు రత్నప్రసాదరావు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేషన్ ఏఈ రత్నావళికి చెప్పగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, రమణయ్యపేట

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు మల్లవరం రోడ్డు కూడలిలో ఆదివారం రాత్రి ఆటో బోల్తాపడి తీవ్రంగా గాయపడిన డ్రైవర్ కొరకంటి చిన్న గంగరాజు (38) పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. చేబ్రోలు గ్రామానికి చెందిన గంగరాజు గత కొంతకాలంగా రాజమహేంద్రవరంలో నివసిస్తున్నాడు. ప్రమాదంలో గాయపడిన గంగరాజు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సమాచారం వచ్చిందని గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేస్తామని ఎస్సై వివరించారు.

నేమాంలో ఆరుగురి అరెస్టు

సర్పవరం: కాకినాడ గ్రామీణం నేమాం గ్రామ శివారు శ్మశానవాటిక ప్రాంతంలో ఆదివారం జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నామని తిమ్మాపురం ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. సంక్రాంతి పండగ దగ్గర పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో జూదం, కోడిపందేల నిర్వహణపై గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పిల్లలు.. ప్రతిభా సుమాలు

పెద్దాపురం, తాళ్లరేవు, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణానికి చెందిన ఒకరు అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలోనూ, మరొకరు భగవద్గీత శ్లోకాల పోటీల్లో తమ ప్రతిభను కనబర్చి దూసుకుపోతున్నారు. పోటీలకు హాజరయ్యారంటే పతకంతో తిరిగి వస్తారు. తాళ్లరేవు మండలం చినవలసల, పి.మల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఖోఖో, హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నారు.

జాతీయ స్థాయిలో 3 సార్లు విజయం

- ● **పేరు:** టి.సునందనబాబు
- ■ **ఊరు:** ఆర్బీపట్నం
- ▼ **చదువు:** ఇంటర్ ప్రథమ సంవత్సరం
- ◆ **ఎంచుకున్న క్రీడ:** హేమర్‌త్రో
- ▥ **ప్రతిభ:** గతంలో 9, 10, తరగతులు చదివినప్పుడు బీహార్‌లోని పాట్నా, జార్ఖండ్‌లోని రాంచీలో, కర్నూలులో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలకు పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాలు పొంది జాతీయస్థాయిలో మూడుసార్లు పోటీల్లో పాల్గొన్నాడు. నవంబరు 26 నుంచి 30 వరకు హరియాణాలోని భివానీలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలకు పాల్గొని వచ్చాడు. ఇప్పటివరకు ఈ రంగంలో పదికి పైగా పతకాలు సాధించాడు.
- ✻ **లక్ష్యం:** ఉపాధ్యాయుడిగా స్థిరపడటం.

అనర్గళంగా శ్లోకాలు చెప్తూ..

- ● తామరపల్లి కీర్తన
- ■ పెద్దాపురం
- ▼ ఏడో తరగతి
- ◆ భగవద్గీతలోని 1 నుంచి 18 చాప్టర్స్‌లో 700 శ్లోకాలను అనర్గళంగా చెప్పడం
- ▥ గతంలో పెద్దాపురం, కాకినాడ, ఉత్తరకంచి, సామర్లకోట, మాధవపట్నం, మైసూర్‌లో జరిగిన భగవద్గీత శ్లోకాల పోటీలకు హాజరై ఇప్పటి వరకు సుమారు 12 వరకు పతకాలను కైవసం చేసుకుంది. ఇటీవల మైసూర్‌లో గీతా జయంతి సందర్భంగా అవధూత దత్త పీఠం వారు నిర్వహించిన జాతీయస్థాయి శ్లోకాల పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది.
- ✻ ఉపాధ్యాయురాలిగా స్థిరపడటం.

ఖోఖోలో బంగారు పతకంతో..

- ● పాలెపు దేవి జ్యోతి
- ■ చినవలసల
- ▼ తొమ్మిదో తరగతి
- ◆ ఖోఖో
- ▥ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలు నవంబర్ 22, 23, 24 తేదీల్లో విజయనగరం జిల్లాలో జరిగాయి. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. మండల, జిల్లా, స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరించింది.
- ✻ పీఈటీగా ఉద్యోగం సాధించాలి.

ఆటలపై మక్కువతో..

- ● పెయ్యల సంకీర్తన
- ■ పి.మల్లవరం
- ▼ ఎనిమిదో తరగతి
- ◆ హ్యాండ్‌బాల్
- ▥ చిన్న తనం నుంచి ఆటలపై మక్కువ ఎక్కువ. హ్యాండ్ బాల్ పోటీల్లో బృంద సభ్యులను సమన్వయం చేసుకుని గెలుపు కోసం కృషి చేస్తుంది. కాకినాడలో జిల్లా స్థాయి జట్టుకు ఎంపికైంది. అన్నమయ్య జిల్లా కనిగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది.
- ✻ స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వం ఉద్యోగం.

శ్రద్ధాంజలి

శ్రీ వీర్రాజు ఉన్నత పాఠశాల వైస్‌ప్రెసిడెంట్ శ్రీ ముప్పన లక్ష్మీప్రసాద్ గారు శివసాన్నిధ్యం పొందిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

శ్రీ ముప్పన లక్ష్మీప్రసాద్ గారు
వైస్‌ప్రెసిడెంట్: శ్రీ వీర్రాజు హైస్కూల్, పెద్దాపురం

శ్రీ వీర్రాజు ఉన్నత పాఠశాల, పెద్దాపురం
K.V.లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు
R.సత్యనారాయణ, స్కూల్ అసిస్టెంట్ (లెక్కలు)
Sk.M.బేగమ్, స్కూల్ అసిస్టెంట్ (సైన్స్)
J.సుమరత్నశ్రీ, సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్
P.సునీతారాణి, జూనియర్ అసిస్టెంట్
P.P.జ్ఞానేశ్వరి, (రిటైర్డ్) రికార్డ్ అసిస్టెంట్
మరియు విద్యార్థినీ విద్యార్థులు

(c) eenadu

తుని

•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

తీరంలో సందర్శకుల సందడి

తొండంగి, న్యూస్‌టుడే: దానవాయిపేట సముద్రతీరం సందర్శకులతో కళకళలాడింది. ఆదివారం సెలవురోజు కావడంతో యువత, కుటుంబ సమేతంగా తీరానికి చేరుకుని సముద్రంలో స్నానాలు చేస్తూ సరదాగా గడిపారు. పలువురు స్వీయచిత్రాలు (సెల్ఫీ) తీసుకుంటూ సందడి చేశారు.

సత్యదేవునికి ఆభరణం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుడు, అమ్మవార్ల అలంకరణకు ఓ దాత నెక్లెస్‌ను ఆదివారం అందించారు. నంద్యాల జిల్లా జీనపల్లికి చెందిన సి.రాముడు సుమారు రూ.1.10 లక్షలు విలువైన 24.800 గ్రాముల బరువైన (ఇందులో 8.9 గ్రాములు బంగారం) నెక్లెస్‌ను ఈవో సుబ్బారావుకు అందించారు. దాతను ఈవో అభినందించారు.

ఆభరణాన్ని ఈవో సుబ్బారావుకు అందజేస్తున్న దాతలు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

వీధి దీపాలు లేక ఇబ్బందులు

సమస్య: తూర్పులక్ష్మీపురంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. వీధి దీపాలు ఏర్పాటుచేయాలి.
- రామారావు, తూర్పులక్ష్మీపురం

సమాధానం: వీధి దీపాల సమస్య మా దృష్టికి రాలేదు. అవసరమైన స్తంభాలపై కొత్తగా దీపాలను అమరుస్తాం.
- రామరాజు వర్మ, డిప్యూటీ ఎంపీడీవో, ఏలేశ్వరం
- న్యూస్‌టుడే, ఏలేశ్వరం

ఎన్నాళ్లీ శిథిల భవనంలో వైద్యసేవలు..!

• నిరుపయోగంగా నూతన నిర్మాణం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరం పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోజూ 200 మంది వరకూ రోగులు వైద్యం కోసం వస్తుంటారు. నలభై వేల మంది పట్టణ ప్రజలకు ఆపద్బాంధవిగా ఉండాల్సిన యూహెచ్‌సీ చాన్నాళ్ల నుంచి 1974లో నిర్మించిన పాడుబడిన భవన సముదాయాల్లోనే కొనసాగుతోంది. నిర్మాణం నీరు కారిపోతోంది. పైకప్పు, గోడలు బీటలు వారి నాచుపట్టి ఉన్నాయి. వర్షం వస్తే నీరు కిందకి దిగుతుంది. దీంతో శిథిల భవనంలో సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రికి వచ్చివెళ్లే వారి పరిస్థితి ఇంతే. సామగ్రి, రికార్డులకు భద్రత కరవైంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని దినదిన గండంగా ఉంటుందని పలువురు వాపోతున్నారు.

శిథిలావస్థలో ఏలేశ్వరం అర్బన్ హెల్త్ క్లినిక్

రెండేళ్లయినా..

పట్టణ ఆరోగ్య కేంద్రం ఉన్న భవనాలు పడిపోయే స్థితికి చేరుకోవడంతో నాలుగేళ్ల కిందట రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో సమీపానే ఉన్న స్థలంలో విశాలమైన భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయి రెండేళ్లు గడిచింది. ఎన్నికల ముందు పనులు పూర్తి కాకుండానే వైకాపా నాయకులు హడావిడిగా భవనాన్ని ప్రారంభించారు. వెంటనే తాళాలు వేసి అయిందనిపించారు. విద్యుత్తు సరఫరా ఇవ్వకపోవడం, సామగ్రి లేకపోవడంతో భవనం అందుబాటుకు రాలేదు. రూ.లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించిన నాటి ప్రభుత్వం.. స్వల్ప మొత్తంతో సౌకర్యాలను కల్పించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కళ్లెదురుగా నూతన భవనం ఉన్నా ఉపయోగపడడం లేదనే బాధ అందరిలోనూ ఉంది. ప్రమాదాలు జరగక్కుండానే నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఏలేశ్వరం వాసులు వ్యక్తం చేస్తున్నారు.

వినియోగంలోకి రాని నూతన భవనం

కరాటే పోటీల్లో ప్రతిభ

తుని: అటల్ ఆం.ప్ర.రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తుని పట్టణానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభచూపారు. అనపర్తిలో ఆదివారం జరిగిన పోటీల్లో తుని బుడోకాన్ అకాడమీకి చెందిన 24 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 8 మంది బంగారు, 6 రజత, మరో 10 మంది కాంస్య పతకాలు దక్కించుకున్నారని శిక్షకుడు రమణ తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అన్నవరం: సూర్యోదయ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నవరం గ్రామంలోని పలువురు పేదలు, నిరాశ్రయులకు దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. శ్రీసత్యదేవ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చేతుల మీదుగా వీటిని అందించారు. కార్యక్రమంలో రంగనాయకులు, లోవరాజు, సుబ్బరాజు, అర్జున్, సతీష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు శాంతియుతంగా ఉద్యమం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: డిమాండ్ల పరిష్కారానికి సహకార శాఖ సంఘాల ఉద్యోగులు వచ్చే నెల ఐదో తేదీ వరకు ఉద్యమాలను నిర్వహిస్తారని సీఐటీయూ మండల కార్యనిర్వాహక కన్వీనర్ ఉప్పలపు విజయ్ కుమార్‌రాజు అన్నారు. లింగంపర్తి సొసైటీ వద్ద ఆదివారం జరిగిన ధర్నాలో ఆయన, సిబ్బంది పాల్గొని నినాదాలిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. వేతన సవరణ చేయాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని, గ్రాట్యుటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. సహకార సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులు మాదిరి ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. సొసైటీల ద్వారానే అన్నదాతలకు రుణాలను ఇవ్వాలని సూచించారు. డిమాండ్లపై సానుకూల స్పందన వచ్చేంతవరకు శాంతియుత పద్ధతుల్లో పోరాటాలు చేస్తామన్నారు.

లింగంపర్తిలో నినాదాలిస్తున్న సహకార శాఖ ఉద్యోగులు

ఎన్.సూరవరంలో చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భళా.. చిత్రకళా..!

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: సందేశాత్మక చిత్రాలను గీయడంపై ఎన్.సూరవరం విద్యార్థులు ప్రత్యేక దృష్టిసారించారు. పాఠశాలలోని ప్రతి తరగతిలో విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించడంతో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ, భూగర్భజలాలు పరిరక్షణ తదితర అంశాలపై చిత్రాలను గీసి ప్రదర్శించారు. ఇటీవల పీటీఎం సమావేశంలో వారు గీసిన సందేశాత్మక చిత్రాలను చూసిన వారు అభినందించారు.

దుర్గాదేవి తీర్థమహోత్సవం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జె.కొత్తూరు శివారు దుర్గాదేవి ఆలయం వద్ద 40వ జాతర మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం బాణసంచా, గరగల నృత్యం, కాంతార శక్తివేషాలు, కళాభారతి బుర్రకథ, కోలాటం, తీన్మార్, డీజే, చిన్నారులచే కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి తీర్థమహోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు, నైవేద్యాలు సమర్పించుకున్నారు. జాతరను పురస్కరించుకుని ఎటువంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గండేపల్లి: మురారి గ్రామ శివారు మామిడితోటలోని వేప చెట్టుపై అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, నిర్వాహకులు మొక్కులు చెల్లించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని పలుప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుని, వంట వార్పు నిర్వహించారు.

శివునికి జన్మ నక్షత్ర పూజలు: ఏలేశ్వరం: ఏలేశ్వరంలోని ఏలేరు నదీ తీరాన ఉన్న శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. శివునికి జన్మ నక్షత్ర (ఆరుద్ర) పూజలు జరిగాయి. అర్చకులు కె.మహేష్, వెంకటేష్ వేకువజాము నుంచి స్వామికి విశేష అర్చనలు నిర్వహించారు.

జె.కొత్తూరులో అలంకరణ (అంతర చిత్రం) దుర్గమ్మ

ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు: తుని పట్టణం: పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని దేవస్థానం ఛైర్మన్ కుక్కడపు బాలాజీ తెలిపారు. ఈనెల 16 నుంచి వచ్చే జనవరి 14 వరకు స్వామికి రోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

సత్యదేవుని రథ సేవ: అన్నవరం: అన్నవరం సత్యదేవుని రథ సేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రథంపై ఆశీనులను చేసి అర్చకులు పూజలు నిర్వహించారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు: ప్రత్తిపాడు: రాచపల్లిలోని శ్రీఅపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్ర పూజలు ఆదివారం జరిగాయి. తెల్లవారుజాము నుంచి స్వామికి అభిషేకాలు జరిగాయి.

ఏలేశ్వరంలో రామలింగేశ్వరుడు



అరుణాచలేశ్వరుడు

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: మండలంలోని వీరవరం నుంచి భూపాలపట్నం వరకు రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ తోట రవి ఆదివారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తెదేపా కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ చొరవతో 'ఉపాధి హామీ' నిధులు రూ.1.80 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల కారణంగా వారం రోజులపాటు ఈ మార్గంలో రాకపోకలు మూసివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తోట గాంధీ, వీరంరెడ్డి కాశిబాబు, తోట నారాయణరావు, గొల్లపల్లి సూరిబాబు, పిడుగు జయబాబు, తోట జగన్నధరావు తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ తోట రవి

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: దేశ ఉన్నతికి మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని నన్నయ వర్సిటీ అసిస్టెంట్ ప్రొ. డా.కంబాల యామిని జ్యోత్స్న అన్నారు. కిర్లంపూడి విజ్ఞానభారతి హైస్కూల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సప్తశక్తి సంఘం పేరున మాతృమూర్తుల సమ్మేళనం నిర్వహించారు. దేశ ఉన్నతిలో మహిళల పాత్ర, కుటుంబ ప్రబోధన అంశాలపై ఇరగవరపు పద్మావతి, వనవాసి కల్యాణం, దాడి అనురాధలు ప్రసంగించారు. సుమారు 120మంది మాతృమూర్తులు పాల్గొన్నారు. పలువురిని సత్కరించారు.

విజ్ఞానభారతిలో మాతృమూర్తుల సమ్మేళనం

బండరాళ్లు జారితే అంతే..!

తీరప్రాంత గ్రామాల్లో పరిశ్రమల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో లారీల రాకపోకలు పెరిగాయి. నల్లరాయి లోడుతో వెళ్తున్న లారీలు నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. అన్నవరం-ఒంటిమామిడి ప్రధాన రహదారిలో నల్లరాయి లోడుతో వెళ్తున్న లారీలపై ఎలాంటి పరదాలు కప్పకుండా వేగంగా వెళ్తూ గ్రామస్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. బండరాళ్లు పడి జనం ఇబ్బందులు పడుతున్న ఘటనలు ఇటీవల జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. - న్యూస్‌టుడే, తొండంగి

విద్యుత్తు తీగలు.. పొంచి ఉన్న ప్రమాదం

కూలీలు ప్రమాదాలను గుర్తించి జాగ్రత్తలు పాటించడంలో అలసత్వం వహిస్తున్నారు. గోవిందపురంలో వాహనంపై పత్తి పంటను వేసుకుని వస్తున్న భారీ లోడుపై నలుగురు కూలీలు కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. దారిమార్గంలో పలుచోట్ల విద్యుత్తు తీగలు తలపై వేలాడుతూ ప్రమాదాన్ని తెలుపుతున్నాయి. ఇటీవల గండేపల్లి మండలంలో వరికోత యంత్రానికి తీగలు తగిలి ఇద్దరు మృత్యువాతపడిన సంగతి తెలిసిందే. ప్రమాదం అంచున ప్రయాణాలు సురక్షితం కాదని గుర్తించాలి. - న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

పాఠశాల పరిసరాలు అపరిశుభ్రం

పైడికొండ జడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఆవరణలోని ప్రహరీ లేక పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. ఈ పాఠశాలను ఆనుకుని గడ్డివామి వేయడంతో పాటు అక్కడే పశువులను కడుతున్నారు. దీంతో విద్యార్థులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. ఉపాధ్యాయులు సైతం పరిసరాల శుభ్రతను పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - న్యూస్‌టుడే, తొండంగి

కాలనీలో కాలువలు నిర్మించరూ..!

వైకాపా హయాంలో పేదల కాలనీలంటూ ఏర్పాటైన జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేక నివాసితులు నిత్యం అవస్థలు పడుతున్నారు. గండేపల్లి మండలం సుబ్బయమ్మపేట గ్రామంలోని కాలనీల్లో కాలువలు లేక మురుగు, వాడుక నీరు పోయే దారిలేదు. అధికారులు స్పందించి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. - న్యూస్‌టుడే, గండేపల్లి

జగ్గంపేట అంబేడ్కర్ నగర్‌లో..

క్రిస్మస్ స్టార్, వెలుగులతో సందడి

జగ్గంపేట గ్రామీణం(జగ్గంపేట), న్యూస్‌టుడే: చర్చి, ఇళ్ల వద్ద విద్యుత్తు దీపాలతో నక్షత్రాల వెలుగులతో క్రిస్మస్ సందడి నెలకొంది. జగ్గంపేట అంబేడ్కర్‌నగర్ కాలనీలో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో యూత్‌సభ్యులు స్టార్, క్రిస్మస్ చెట్టు, క్రీస్తు జననాన్ని సూచించే పశువులపాకను ఏర్పాటు చేశారు. ఎన్‌హెచ్ పక్కనే సర్వీసు రోడ్డును ఆనుకుని ఈ స్టార్ ఏర్పాటు చేయడంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

పల్లె ముంగిట చెత్తాచెదారం

ప్రధాన పట్టణాలకు ముఖ్య కూడలి. పేరుకు మేజర్ పంచాయతీ. సమస్యలు మాత్రం బారెడు. మండలంలోని కత్తిపూడి పంచాయతీలో ఏటా మానని సమస్యలే కనిపిస్తాయి. గ్రామంలో కాలువలు లేక మురుగు, వాడకపు నీరు రహదారులపైనే ప్రవహిస్తుంది. గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వినియోగంలో లేకపోవడంతో చెత్త అంతా రహదారులపైనే ఉంటోంది. గ్రామంలో ప్రవేశించేవారికి చెత్త స్వాగతం పలుకుతున్నట్టుగా ఉంది. అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, శంఖవరం

పల్లె కబుర్లు

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: చిన్నింపేటకు చెందిన వేగు వెంకటరమణ జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు ఆదివారం అందాయి. రాజ్యాంగం సమకూర్చిన హక్కులను పరిరక్షించుకోవాలని వెంకటరమణ పేర్కొన్నారు.

12న ఉద్యోగ మేళా

తుని: ఈనెల 12న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, నైపుణ్యాధికారి ఎన్.గోపీకృష్ణ తెలిపారు. కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఉపకరణాలు దగ్ధం

గండేపల్లి: ఓ ఇంట్లో తలెత్తిన విద్యుదాఘాతంతో విద్యుత్తు ఉపకరణాలు దగ్ధమయ్యాయి. జగ్గంపేట అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాలివీ.. నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన తాలూరి గణేష్ కుటుంబం ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆదివారం విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి, రిఫ్రిజిరేటర్ తదితర విలువైన వస్తువులు కాలిపోయాయి.

క్రమబద్ధీకరణకు రారండోయ్..!

• బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌లకు అవకాశం

న్యూస్‌టుడే - తుని, తుని పట్టణం

రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌ను అందుబాటులోకి తెచ్చింది. సుమారు 40 ఏళ్ల నుంచి నిర్మించిన ఆయా నిర్మాణాలను క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. 1985 జనవరి 1 నుంచి ఈ ఏడాది ఆగస్టు 31 వరకు నిర్మించిన అక్రమ కట్టడాలు, అనధికార లేఅవుట్లలో ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని పురపాలక అధికారులు సూచిస్తున్నారు. ఈ విధానం సద్వినియోగం చేసుకుంటే అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయి.

గతంలో అనేక అక్రమ నిర్మాణాలు

క్షేత్రస్థాయిలో పట్టణ ప్రణాళికాధికారులు, సిబ్బంది పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం, రాజకీయ పలుకుబడితో అనేక మంది అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏవిధమైన అనుమతులు, ప్లాన్లు లేకుండానే అంతస్తుకు పై అంతస్తు వేస్తూ వెళ్లారు. కొందరు తమ భూములను ప్లాట్లుగా విడగొట్టి విక్రయించుకున్నారు. వీటిపై అప్పటి అధికారులు పెద్దగా దృష్టి సారించకపోవడంతో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. అయితే ఆ తర్వాత వివిధ అవసరాల కోసం తమ ప్లాట్, భవనం అమ్మకం, తనఖాకు అనేక మంది కొనుగోలుదార్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం), ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) విధానం అమల్లోకి తీసుకురావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇప్పటికి పట్టణంలో సుమారు 100కు పైగా అక్రమ కట్టడాలు గుర్తించగా, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంకా సర్వే కొనసాగిస్తున్నారు.



తుని పట్టణ ప్రాంతంలోని భవనాలు

సకాలంలో స్పందించాలి..

భవనాలు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాలనుకునే వారు సకాలంలో స్పందించి తమ వద్ద ఉన్న దస్త్రాలు, భవనం ప్లాన్, ఇతర పత్రాలు వచ్చే ఏడాది మార్చి 11 నాటికి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలి. బీపీఎస్‌కు ప్రాథమికంగా రూ.10వేలు రుసుము, దరఖాస్తుతో చెల్లించాలి. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఫీజులోని కొంత మొత్తం కట్టాలి. ఆ తర్వాత పరిశీలించి మిగిలింది ఎంత చెల్లించాలో అధికారులు నిర్ధారిస్తారు.
- ఎ.వెంకట్రావు, పురపాలక కమిషనర్, తుని

సాగలేక ఆగడమే..!

ఆర్టీసీ బస్సులకు ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటోంది. స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చాక బస్సుల్లో 60 నుంచి 100 మంది వరకూ ప్రయాణిస్తున్నారు. రద్దీ తట్టుకోలేక బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. తుని డిపో నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురవ్వడం, టైరు పేలడం వంటి అవాంతరాలతో జగ్గంపేట వరకూ వెళ్లి వెనుదిరిగి వస్తూ ఎర్రవరంలో నిలిచింది. ఈ సర్వీసు రద్దీ ఎక్కువ అవ్వడంతో ఈ అవాంతరం ఏర్పడినట్లు చెపుతున్నారు. పగటి పూట మరమ్మతులకు గురైన ఈ బస్సు రాత్రి పది దాటినా ఎర్రవరంలోనే ఉంది. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

ఎర్రవరం కూడలిలో నిలిపిన బస్సు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అన్నవరం బ్రాంచ్(2690), మెయిన్ రోడ్,అన్నవరం, కాకినాడ జిల్లా- 533 406

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)RULE - 8(1)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ , 2002 ప్రకారము స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్నవరం బ్రాంచ్, అన్నవరం యొక్క అధీకృత అధికారి అయిన ఈ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 సందలి సెక్షన్ 13 కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీత: శ్రీమతి దేసిరాజు సాయి కుమారి, భర్త: కృష్ణారావు, డి.నెం. 5-181,కొనేటి గట్టు వీధి,అన్నవరం,శంఖవరం మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్- 533 406, 2) శ్రీ దేసిరాజు పవన్ కుమార్, తండ్రి: కృష్ణారావు, డి.నెం. 6-34, కరణం గారి వీధి, అన్నవరం,శంఖవరం మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్- 533 406 నోటీసులో ఉదహరించబడిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, వారికి తేది.17.09.2025 నాటికి Home Loan లోన్ ఖాతా నెం. 35279429759 నకు చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ. 3,00,756.00 (అక్షరాల మూడు లక్షల ఏడు వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)Suraksha Loan లోన్ ఖాతా నెం. 35279511032 నకు చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.6,366.00 (అక్షరాల ఆరు వేల మూడు వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే)మరియు Home Loan Top-Up లోన్ ఖాతా నెం. 37890452754 నకు చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ. 7,37,717.00 (అక్షరాల ఏడు లక్షల ముప్పై ఏడు వేల ఏడు వందల పదిహేడు రూపాయలు మాత్రమే)చెల్లించవలసిన మొత్తం బకాయి రూ. 10,44,839.00 (అక్షరాల పది లక్షల నలభై నాలుగు వేల ఎనిమిది వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) 17.09.2025 తేదీనుండి భవిష్యవడ్డీ మరియు ఖర్చులు సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది.18.09.2025 న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

ఋణగ్రహీతలు సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించడంలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారము తేది.03.12.2025 న దిగువ పేర్కొన్న ఆస్తిని లాంఛనాత్మక స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారుసు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా బకాయిమొత్తం తేది.17.09.2025 నాటికి Home Loan లోన్ ఖాతా నెం. 35279429759 నకు చెల్లించవలిసిన బకాయి మొత్తం రూ. 3,00,756.00 (అక్షరాల మూడు లక్షల ఏడు వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)Suraksha Loan లోన్ ఖాతా నెం. 35279511032 నకు చెల్లించవలిసిన బకాయి మొత్తం రూ.6,366.00 (అక్షరాల ఆరు వేల మూడు వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే)మరియు Home Loan Top-Up లోన్ ఖాతా నెం. 37890452754 నకు చెల్లించవలిసిన బకాయి మొత్తం రూ. 7,37,717.00 (అక్షరాల ఏడు లక్షల ముప్పై ఏడు వేల ఏడు వందల పదిహేడు రూపాయలు మాత్రమే)చెల్లించవలసిన మొత్తం బకాయి రూ. 10,44,839.00 (అక్షరాల పది లక్షల నలభై నాలుగు వేల ఎనిమిది వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) వడ్డీ మొ॥ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,అన్నవరం బ్రాంచ్, అన్నవరం వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.(డిమాండ్ నోటిసు తదుపరి చెల్లింపులు ఏమైన ఉన్నచో తగ్గించుకొని)

తనఖావుంచిన ఆస్తి వివరములు

తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, తుని సబ్-రిజిస్ట్రీ, తొండంగి మండలం, బెండపూడి గ్రామం మరియు పంచాయితీ,ప్లాట్ నెం.36,రాజమండ్రి ఎల్.పి.సి నెం.2214/2004 నుండి టౌన్ & కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటి డైరెక్టర్ రిఫరెన్స్ నెం34/2004, ఆర్.ఎస్ నెం.113/4, సమీప డి.నెం.9-57లోని 250 చ॥గ॥ల మొత్తం స్థల విస్తీర్ణములో దక్షిణము వైపు 125 చ॥గ॥లు లేదా104.51 చ॥మీ॥ల విస్తీర్ణములో ఆర్.సి.సి రూఫ్ నివాస మరియు క్రింది అంతస్తుతో కూడిన భవనము యావత్తు ఆస్తి రిజిష్టరు సేల్ డిడ్ డాక్యుమెంట్ నెం.6772/2015,అక్టోబర్ 14,2015 ప్రకారం దేసిరాజు పవన్ కుమార్, తండ్రి: కృష్ణారావు గారి పేరున కలదు. హద్దులు రిజిష్టరు సేల్ డిడ్ ప్రకారం: తూర్పు : 22.6 అ॥లు లేదా 6.85 మీ॥-33 అ॥లు రోడ్డు,దక్షిణం :50.0 అ॥లు లేదా 15.24 మీ॥ -33 అ॥లు రోడ్డు, పడమర : 22.6 అ॥లు లేదా 6.85 మీ॥-ప్లాట్ నెం.35 స్థలం, ఉత్తరం :50.0 అ॥లు లేదా 15.24 మీ॥ -ప్లాట్ నెం.36 స్థలం.

ప్రదేశం : అన్నవరం
తేది. 03.12.2025
సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

నగరానికి బాహ్య వలయ మార్గం

• ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు

నగరంలో ట్రాఫిక్ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. కూడళ్ల వద్ద వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బస్సులు, భారీ వాహనాలు వలయ మార్గంలో వెళ్లేలా సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో భారీ వాహనాలు తిరగకుండా నేరుగా బైపాస్ రోడ్డుపై వెళ్లి రింగ్ రోడ్డుకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నగరపాలక, ఆర్‌అండ్‌బీ అధికారులు రింగ్‌రోడ్డు నిర్మిత ప్రాంతాలను పరిశీలించారు. పనులు పూర్తైతే ట్రాఫిక్ సమస్యలు కొంతమేర తీరుతాయి. –న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ



రింగ్‌రోడ్డు ప్రతిపాదిత నమూనా చిత్రం

17 కి.మీ. మేర..

రానున్న రోజులను దృష్టిలో ఉంచుకొని ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రతిపాదనలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మాస్టర్ ప్లాన్ ఆధారంగా రెండు వందల అడుగుల వెడల్పుతో 17 కి.మీ.ల మేర రింగ్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే నగరపాలక, ఆర్‌అండ్‌బీ అధికారులు రింగ్ రోడ్డు ఏర్పాటుచేసే ప్రాంతాన్ని పరిశీలించారు. మూడు నెలల్లో డీపీఆర్ తయారు చేయనున్నారు. రింగ్‌రోడ్డు ప్రతిపాదిత ప్రాంతంలో ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయో అంచనా వేస్తారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తారు.

అనుసంధానం చేసేలా చర్యలు

• కల్లూరు పట్టణ లక్ష్మీపురం బైపాస్ నుంచి కోడుమూరు రోడ్డు పెద్దపాడు సమీపం వరకు 7.2 కి.మీ.లు ఉంటుంది. పెద్దపాడు సమీపంలోని కోడుమూరు రోడ్డు నుంచి హైదరాబాద్ రహదారి ఎన్‌హెచ్-44 వద్ద మునగాలపాడు రోడ్డు వరకు 9.9 కి.మీ.లు మేర రింగ్‌రోడ్డు అనుసంధానం చేస్తారు. సూరత్ హైవే మీదుగా వాహనాలు వెళ్లకుండా కోడుమూరు మార్గాన్ని ఉపయోగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

• భవనాలు, ప్రైవేటు భూములు కోల్పోకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కువ భాగం ప్రభుత్వ భూమిలో వెళ్లేలా సన్నాహాలు చేస్తున్నారు.

• ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తైతే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ తెలిపారు.

గోడ కట్టక.. గోడు పట్టక

వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె వద్ద రైల్వే అండర్ పాస్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గత రెండేళ్లుగా పనులు జరగకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు గోడ పనులు ఆగిపోయాయి. పైనుంచి రాళ్లు జారి పడుతుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. వెంటనే పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. – ఈనాడు, కర్నూలు

గుంతల్లో దారి వెతుక్కోవాల్సిందే

• తరచూ ప్రమాదాలతో ఇబ్బందులు

అనంతపురం జిల్లా గుత్తి మండలం సరిహద్దు నుంచి తుగ్గలి మండలం చెరువుతండా మీదుగా ఆదోని వరకు 64 కి.మీ. మేర జాతీయ రహదారి అధ్వానంగా మారింది. ప్రతిరోజూ 14 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో ఉన్న తారు రోడ్డుపై 15 టన్నులు, సిమెంటు రహదారిపై 30 టన్నులతో వెళ్లే వాహనాలు రాకపోకలు సాగించేవి. కర్ణాటక ప్రాంతం నుంచి కృష్ణపట్నం పోర్టుకు గ్రానైట్ లారీలు నిత్యం వెళ్తుంటాయి. భారీ వాహనాలు సామర్థ్యానికి మించి తిరుగుతుండటంతో రహదారి రూపు కోల్పోయింది. – న్యూస్‌టుడే, పత్తికొండ, తుగ్గలి

వాహనాలు దెబ్బతింటున్నాయి

మద్దికెర మండలం మదనంతపురం బస్టాండు నుంచి జొన్నగిరి వెళ్లే ప్రధాన మార్గం గుంతలమయంగా మారింది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల్లో రాకపోకల కారణంగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. తరచూ రిపేర్లకు వస్తుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

జనానికి భద్రత కరవు..

• తుగ్గలి నుంచి గుత్తి వెళ్లే ప్రధాన మార్గంలోని గిరిగెట్ల వద్ద గుడి వంకపైనున్న లోలెవల్ వంతెనపై రక్షణ గోడ లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

• రెండేళ్లలో పదికిపైగా భారీ వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు డ్రైవర్లు ప్రాణాలు కోల్పోయారు.

• ఇదే మార్గంలో లింగాల వాగుపై నిర్మించిన ఇరుకు వంతెనపై భారీ వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి.

• రాతన-పత్తికొండ మధ్య చెరువు కట్టపై గతంలో నిర్మించిన రక్షణ రెయిలింగ్ శిథిలావస్థకు చేరింది.

చిన్నాపెద్దా కలిపి 1,160 వరకు

బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. కాగా తుగ్గలి మండలం జి.ఎర్రగుడి నుంచి తుగ్గలి వరకు 17 కి.మీ. మేర రహదారి రూపు కోల్పోయింది. మోకాలి లోతున గుంతలు ఉండటంతో వాహనాలు పనికిరాకుండా పోతున్నాయి. చెరువుతండా నుంచి తుగ్గలి వరకు చిన్నాపెద్దా గుంతలు కలిపి 1,160 వరకు ఉండటం గమనార్హం. తుగ్గలి నుంచి పత్తికొండ మండలం రాతన వరకు 119, రాతన నుంచి పత్తికొండ వరకు 10 చోట్ల భారీ గుంతలున్నాయి.

మృత్యు మలుపు

తుగ్గలి-జొన్నగిరి గ్రామాల మధ్యనున్న మలుపులో ఏడాది కిందట ఆటో బోల్తా పడగా ఇద్దరు మృత్యువాత పడ్డారు. మంత్రాలయం నుంచి బెంగళూరు వెళ్లే బస్సు బోల్తా పడి పలువురు గాయపడ్డారు. ఇటీవల తుగ్గలి రైల్వేస్టేషన్ వద్ద కర్ణాటక ఆర్టీసీ బస్సు బోల్తా పడగా ఇద్దరు గాయపడ్డారు.

వాసాపురం.. భక్తుల దివ్యధామం

• రూ.4.50 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం

నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి 2 కి.మీ. దూరంలో.. అప్పనపల్లె రహదారి సమీపంలో వందేళ్ల కిందటి వరకు వాసాపురం గ్రామం ఉండేది. వరదల కారణంగా గ్రామస్థులందరూ సమీప గ్రామాల్లోకి చేరుకోవడంతో ఊరంతా ఖాళీ అయ్యింది. గ్రామంలో వందల ఏళ్ల కిందట నిర్మించిన వాసాపురం వేంకటేశ్వరస్వామి గుడి శిథిలావస్థకు చేరింది. భక్తులు మాత్రం నిత్యం దర్శనానికి వచ్చేవారు. క్రమక్రమంగా రద్దీ పెరగడంతో కొండమాయపల్లె, రుద్రవరం గ్రామస్థులు కలిసి 2016లో ఆలయ పునరుద్ధరణకు నడుం బిగించారు. నంద్యాల, ఆళ్లగడ్డ పట్టణాలకు చెందిన పలువురు దాతలు ముందుకొచ్చారు. మొత్తం రూ.4.50 కోట్ల విరాళాలు సేకరించి 2020లో ఆలయాన్ని పునర్నిర్మించారు. 2022లో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. వేంకటేశ్వరస్వామి, ఈశ్వర ఆలయాలతో పాటు నవగ్రహ, నాగ, ఆంజనేయ, వినాయక తదితర విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రతి శనివారం సుమారు వెయ్యి మంది భక్తులు కాలినడకన సమీప గ్రామాల నుంచి తరలి వస్తుంటారు. ఏటా ఆలయ వార్షికోత్సవం, వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, రుద్రవరం, ఆళ్లగడ్డ

కత్తి దూసి.. పతకాలు పట్టి

• ఫెన్సింగ్‌లో రంగసాయి ఈశ్వర్ ప్రతిభ

నంద్యాల పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన రంగసాయి ఈశ్వర్ ఫెన్సింగ్‌లో సత్తా చాటుతున్నాడు. 9వ తరగతి చదువుతున్న అతను చిన్ననాటి నుంచే ఫెన్సింగ్‌పై దృష్టి సారించాడు. దీనిని గమనించిన తల్లిదండ్రులు ప్రోత్సహించడం ప్రారంభించారు. గత ఏడేళ్లుగా ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ కఠోర సాధన చేస్తున్నాడు. పలు పోటీల్లో పాల్గొని పతకాలు అందుకున్నాడు.

● 2023 డిసెంబరులో నంద్యాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో వెండి పతకం సాధించాడు. గతేడాది అక్టోబరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో బంగారు పతకం అందుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో ఒడిశాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 38వ స్థానంలో నిలవడం విశేషం. జులైలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి పతకంతో మెరిశాడు. సెప్టెంబరులో మణిపూర్‌లో జరిగిన జాతీయస్థాయి స్థాయిలో 61వ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చెప్పాడు. పతకాలు సాధించడమే ధ్యేయంగా నిరంతరం సాధన చేస్తున్నట్లు పేర్కొన్నాడు. – న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్

ఉన్నత విద్యకు ఆసరా

పీజీలో చేరేందుకు అవకాశం



వర్సిటీల పరిధిలో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు	
విశ్వవిద్యాలయం	సీట్లు
రాయలసీమ	426
అబ్దుల్ హక్ ఉర్దూ	231
క్లస్టర్	325

డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చర్యలు చేపట్టింది. పీజీ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గతంలో పీజీలో చేరాలంటే తప్పనిసరిగా పీజీ సెట్ రాయాల్సి వచ్చేది. ఇందులో మంచి ర్యాంకు సాధించిన వారికి కోరుకున్న సీటు లభించేది. ర్యాంకు రాని అభ్యర్థులు నిరాశ చెందేవారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ, ఎంఏ, ఎంకాంలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది పీజీ సెట్‌కు సంబంధించి సడలింపు ఇవ్వడంతోపాటు అర్హులైన అభ్యర్థులు పీజీ చేసేందుకు అవకాశం లభించింది. ఈ మేరకు ప్రకటన వెలువడింది. జిల్లాలోని వర్సిటీల పరిధిలో సీట్ల వివరాలు.. ఏఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటి ఫీజు వివరాలను ఉన్నత విద్యామండలి వెల్లడించింది. పీజీ సెట్‌లో అర్హత సాధించినా.. సాధించకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వర్సిటీల పరిధిలో మొత్తం 982 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాయలసీమ, డా.అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయాల పరిధిలో 10వ తేదీ వరకు, క్లస్టర్ వర్సిటీ పరిధిలో 12వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుంది. అభ్యర్థులు నేరుగా దరఖాస్తు చేసుకుని పత్రాల పరిశీలన చేసుకోవాల్సి ఉంటుంది. –న్యూస్‌టుడే, కర్నూలు విద్య

నాట్యాభినయం

బెంగళూరుకు చెందిన హొసాచిగురు నృత్య అకాడమీ నిర్వాహకులు మమత, శివకుమార్ ఆధ్వర్యంలో మంత్రాలయంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. 130 మంది కన్నడ కళాకారులు నాట్య ప్రదర్శనలిచ్చారు. – న్యూస్‌టుడే, మంత్రాలయం

మురుగు ముంచెత్తి.. రోగాలు పీడించి

వెల్దుర్తి మండలం మల్లెపల్లె ప్రాథమిక పాఠశాల ఎదురుగా తాగునీటి కుళాయి చుట్టూ మురుగు నీరు నిలిచిపోయింది. ఈ నీటినే జనం పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.
– ఈనాడు, కర్నూలు

సాయం అందక.. అరక సాగక

● వేలాది మంది రైతులకు పథకం దూరం

– న్యూస్‌టుడే, కర్నూలు వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పెట్టుబడి సాయం అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందుతున్నా సరే కేంద్రం సాయానికి దూరమయ్యారు. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు అర్హత బదిలీ (డెత్ మ్యుటేషన్) చేపట్టి పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని.. ఎన్‌పీసీఐలో వినియోగంలో లేని ఖాతాలను తిరిగి పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఏళ్లుగా ఎదురుచూపులే..

2019 ఫిబ్రవరి 28 నాటికి పట్టాదారు పాసు పుస్తకాలు ఉండి.. వెబ్‌ల్యాండ్ ఆన్‌లైన్ అడంగల్‌లో ఉన్న వారు మాత్రమే పీఎం కిసాన్ పథకానికి అర్హులు. కాగా కొత్తగా వెబ్‌ల్యాండ్‌లో నమోదైన పట్టాదారులకు ఏళ్లు గడుస్తున్నా పీఎం కిసాన్ పథకం రైతులకు అందకుండా పోయింది.

రూ.27.92 కోట్లు కోల్పోయారు

ఉమ్మడి జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులై ఉండీ పీఎం కిసాన్ అందని రైతులు 69,809 మంది ఉన్నారు. ఈ పథకం కింద ఒక్కో విడతలో రూ.2 వేలు అందుతుంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లా రైతులు ఒక్కో విడతలో రూ.13.96 కోట్లు చొప్పున రెండు విడతల్లో మొత్తం రూ.27.92 కోట్ల పెట్టుబడి సాయం కోల్పోయారు. కర్నూలులో రూ.18.86 కోట్లు, నంద్యాల జిల్లా రైతులకు రూ.9.06 కోట్లు అందకుండాపోయింది.

సమన్వయ లోపమే శాపం

● జిల్లాలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో అన్నదాతలు నష్టపోతున్నారు.

● వెబ్‌ల్యాండ్‌లో ఆధార్, చరవాణి నంబర్లు తప్పుగా నమోదవడం.. పేర్లలో తప్పులు రావడంతో ఉమ్మడి జిల్లాలో 18,666 మంది రైతులు పథకానికి దూరమయ్యారు.

● అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యుటేషన్ చేయాలి. ఈ విషయంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం వహించింది. వ్యవసాయశాఖ దృష్టి పెట్టలేదు. రెండు శాఖల సమన్వయ లోపంతో ఉమ్మడి జిల్లాలో 27,170 మందికి సాయం అందలేదు.

గత నెలలో రెండో విడత పెట్టుబడి సాయం వివరాలు

జిల్లా	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్ లబ్ధిదారులు	పీఎం కిసాన్‌కు దూరమైనవారు
కర్నూలు	2,72,757	2,25,600	47,157
నంద్యాల	2,06,052	1,83,400	22,652

ఆరోగ్య కేంద్రాలకు నిధులు



గుమ్మనూరులో తుది దశలో ఆరోగ్య కేంద్ర భవనం

గత ప్రభుత్వ హయాంలో వివిధ ప్రభుత్వ భవన నిర్మాణాలు చేపట్టారు. నిధులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారులు మధ్యలోనే పనులు ఆపేశారు. అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోకపోవడంతో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని పూర్తి చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 50 శాతం కంటే ఎక్కువ నిధులు ఖర్చు చేసి నిర్మాణాలు ఆగిపోయిన భవనాలకు తొలి దశలో నిధులు కేటాయిస్తోంది. – న్యూస్‌టుడే, చిప్పగిరి

రూ.50 లక్షలకుపైగా కేటాయింపు

చిప్పగిరి మండల పరిధిలో గుమ్మనూరు, బెల్డోణ, దౌల్తాపురం ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలకు ప్రభుత్వం రూ.18 లక్షలు మంజూరు చేసినట్లు మండల ఇంజినీరు సోమప్ప తెలిపారు. ఈ నిధులతో భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. నేమకల్లుల్లో కొత్తగా గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరైంది. పనులన్నీ పూర్తైతే ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి.

క్రెడిట్‌కార్డు మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : క్రెడిట్‌కార్డు పేరుతో సైబర్ నేరగాళ్లు పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఫోన్ చేసి క్రెడిట్ లిమిట్ పెంచుతామని నమ్మించి కార్డు నంబరు, ఓటీపీ, సీవీవీ ఇతర వ్యక్తిగత వివరాలు తీసుకుని ఆన్‌లైన్ కొనుగోళ్లు చేసి నష్టం కలిగిస్తారన్నారు. బ్యాంకు సిబ్బంది ఓటీపీ, పాస్‌వర్డ్, సీవీవీ వంటి వివరాలు అడగరన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఎవరైనా ఫోన్ చేస్తే అది మోసగాళ్ల పనేనని తెలుసుకోవాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్‌కాల్స్ వచ్చినా, సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసానికి గురైనా టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

లోడు పెంచుకో.. రాయితీ అందుకో

● నెలాఖరుతో ముగియనున్న గడువు

వినియోగదారులు తాము వాడుతున్న విద్యుత్తు వినియోగాన్ని బట్టి వివిధ స్లాబుల్లోకి మారిపోతుంటారు. వాస్తవానికి కొత్తగా మీటరు ఏర్పాటు చేసుకునే సమయంలో ఒక కిలోవాట్ సామర్థ్యంతో బిగించుకుంటారు. ఉపకరణాల సంఖ్య పెరిగిపోయేకొద్దీ లోడు పెరిగి ఇతర స్లాబ్‌లోకి మారిపోతుంటారు. – న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

అవకాశమిచ్చి..

● గతంలో లోడు పెంచుకోవాలంటే ఒక కిలోవాట్‌కు రూ.2 వేలు చెల్లించాల్సి వచ్చేది. దీనికితోడు దరఖాస్తు రుసుం రూ.50, డిపాజిట్ రూ.200 చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వం లోడు పెంచుకునే విద్యుత్తు వినియోగదారుల కోసం రాయితీ అందజేస్తోంది.

● గతంలో మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30 వరకు డెవలప్‌మెంటు ఛార్జీల్లో 50 శాతం రాయితీ ఇచ్చింది. మరోసారి అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం లోడు పెంచుకునేవారి సౌకర్యార్థం ఈనెల 31వ తేదీ వరకు సమయం ఇచ్చింది.

● వినియోగదారులు మీసేవ కేంద్రాల ద్వారాగానీ.. ఏపీఎస్పీడీసీఎల్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు.

రాయితీ వివరాలు ఇలా.. (రూ.లలో)

కిలోవాట్	దరఖాస్తు రుసుం	డిపాజిట్	రాయితీ లేకుండా..	రాయితీతో	చెల్లించాల్సిన మొత్తం
1-2	50	200	2,000	1,000	1,250
1-3	50	400	4,000	2,000	2,450
1-4	50	600	6,000	3,000	3,650
1-5	50	800	8,000	4,000	4,850

ఇంటికి దీపం.. పంటకు నేస్తం

● కుటుంబాన్ని నడిపిస్తున్న లక్ష్మి

కొండంత అండగా ఉండే భర్త అనారోగ్యంతో మంచానికి పరిమితమైనా ఆమె కుంగిపోలేదు. ఇంటి కోసం అహర్నిశలు కష్టపడటం ప్రారంభించారు. ఒకపక్క భర్త బాగోగులు చూసుకుంటూ.. మరోవైపు వ్యవసాయ చేస్తూ పిల్లలను కష్టపడి చదివించారు. నూర్పిడి యంత్రం నిర్వహిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.. ఆమే ఎర్రబాడు గ్రామానికి చెందిన లక్ష్మి.

భర్తకు అన్నం తినిపిస్తున్న లక్ష్మి

●గోనెగండ్ల మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన సోమన్న, లక్ష్మి దంపతులది వ్యవసాయ ఆధారిత కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు.. ఇద్దరు కుమార్తెలు. మూడెకరాల పొలం ఉంది. సోమన్నకు ఎనిమిదేళ్ల కిందట మూర్ఛతో మంచానికే పరిమితమయ్యారు. అప్పటి నుంచి ఇంటి భారమంతా లక్ష్మిపై పడింది. కష్టపడి కుమారులకు మంచి చదువులు చెప్పించాలన్న భర్త కోరికను ఆమె గుర్తు చేసుకుంది. వ్యవసాయ పనులు చేసుకుంటూ చదివించడం ప్రారంభించింది. పెద్ద కుమారుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు డిగ్రీ చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేశారు.

నూర్పిడి యంత్రంతో లాభాలు

గ్రామ పరిధిలోని మరో మూడెకరాల దేవాలయ భూమిని రూ.70 వేలు కౌలుకు తీసుకున్నారు. పంటలు సాగు చేసి రూ.లక్ష వరకు సంపాదించారు. రైతులు పండించిన ఆముదం పంటను నూర్పిడి చేయడం ద్వారా రూ.లక్ష వరకు ఆర్జించారు. తన భర్తకు రూ.10 వేల పింఛను మంజూరు చేస్తే కుటుంబ పోషణకు ఆసరాగా ఉంటుందని ఆమె పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, గోనెగండ్ల

అక్రమాలు కనబడితే ఒట్టు

ఎయిడెడ్ పాఠశాలల ఇష్టారాజ్యం ● దృష్టి సారించని విద్యాశాఖ అధికారులు

విద్యార్థులేరీ..

ఈ చిత్రంలోనిది.. ఆళ్లగడ్డ పట్టణంలోని మక్దుమ్ ఎయిడెడ్ ఉర్దూ పాఠశాల. ఇక్కడ ఒక విద్యార్థి కూడా లేరు. ఉపాధ్యాయులు ఇద్దరున్నారు. గతేడాది నుంచి ఒక్క విద్యార్థి కూడా రావడం లేదు. దస్త్రాల్లో మాత్రం ముగ్గురు ఉన్నట్లు చూపుతున్నారు. ఉపాధ్యాయులు రోజూ రావడం.. రిజిస్టరులో సంతకం చేసి వెళ్లడం సాధారణంగా మారింది.

దస్త్రాల్లో మాత్రం పాఠశాలల వివరాలు కనపడుతాయి. విద్యార్థులు చదువుకుంటున్నట్లు చూపుతారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వెతికి చూసినా ఒక్క విద్యార్థి కూడా ఉండడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎయిడెడ్ పాఠశాలల పరిస్థితి ఇది. వీటిని నిత్యం తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

దస్త్రాల్లో అన్నీ బాగున్నట్లు..

నంద్యాల జిల్లాలో 47 ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా ఇందులో 15 ఉన్నత విద్యాలయాలున్నాయి. కర్నూలు జిల్లాలో 38 పాఠశాలలు ఉండగా.. ఇందులో 14 ఉన్నత బడులు ఉన్నాయి. రెండు జిల్లాల్లో కొన్ని ఎయిడెడ్ పాఠశాలలు అంతంతమాత్రంగా నడుస్తున్నాయి. నిర్వాహకులు కనిపించరు. విద్యార్థులు అసలే రారు. విద్యాశాఖ దస్త్రాల్లో మాత్రం పాఠశాలలు రోజూ నడుస్తున్నట్లే 'లెక్క'.

ప్రత్యేక కమిటీల ఏర్పాటు

ఉమ్మడి జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల తనిఖీలకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కమిటీలు వేసింది. ప్రస్తుతమున్న విద్యార్థుల సంఖ్య ఎంత? ఎన్ని పోస్టులు ఉన్నాయి? ఎలాంటి సదుపాయాలున్నాయి తదితర వివరాలను కమిటీలు పర్యవేక్షించనున్నాయి. పిల్లల సంఖ్య ఆధారంగా కొత్త ఉపాధ్యాయుల అవసరం ఉందా? లేదా? కూడా తనిఖీ చేయనున్నాయి.

అంతా బోగస్

ఉమ్మడి జిల్లాలో పలు ఎయిడెడ్ పాఠశాలలు బోగస్ హాజరు నమోదుతో నడుస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని రుద్రవరం, శిరివెళ్ల, జిల్లెల్ల గ్రామాల్లోని ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు లేరు. లేని హాజరు చూపి పాఠశాల రద్దు కాకుండా.. ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలను కొన్ని యాజమాన్యాలు పొందుతున్నాయి. లేని విద్యార్థుల సంఖ్యను చూపి ఉపాధ్యాయులు, సిబ్బంది అవసరమంటూ పోస్టుల భర్తీకి కొన్ని యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. యూడైస్ ప్రకారం విద్యార్థుల సంఖ్యను నమోదు చేయాల్సిన అధికారులు తప్పుడు నివేదికలిచ్చారన్న ఆరోపణలున్నాయి.

స్వర్ణ రథంపై ఆదిదంపతులు

శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబాదేవి మల్లికార్జున స్వామి వార్లకు ఆదివారం స్వర్ణ రథోత్సవం నేత్రశోభితంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని వేకువజామున మల్లికార్జునస్వామివారికి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను స్వర్ణ రథంపై ఉంచి అర్చకులు మంగళహారతులు సమర్పించారు. దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తలు రమణ, దేవకి వెంకటేశ్వర్లు, అర్చకులు ఉత్సవమూర్తులకు కొబ్బరి కాయలు, కర్పూర హారతులు సమర్పించారు. వేలాది మంది భక్తుల జయజయధ్వానాల నడుమ స్వర్ణ రథోత్సవాన్ని గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు లాగారు. రథం ఎదుట కళాకారుల కోలాటాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

(c) eenadu

పడిపోతారు జాగ్రత్త!



వరి ధాన్యాన్ని ట్రాక్టర్లలో తీసుకెళ్లే క్రమంలో కొందరు సంచులపై కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. బనగానపల్లి శివారులో తప్పదన్నట్లు కొందరు కూలీలు ప్రమాదకరమని తెలిసినా ధాన్యం సంచులపై కూర్చొని ప్రయాణం చేస్తున్నారు. జాగ్రత్తలు పాటించక పోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. దీనిపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, బనగానపల్లి

మంచు కమ్ముకుంది.. ప్రయాణం సాగకుంది

రెండు రోజులుగా పొగమంచు దట్టంగా కమ్మేస్తోంది. ఉదయం 7 గంటలు దాటినా వెలుతురు లేక వాహనదారులు విద్యుద్దీపాల వెలుగులతోనే ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం ఆదమరిచినా ఘోరప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. గుంతకల్లు-తుంగభద్ర అంతర్రాష్ట్ర రహదారుల్లో చిప్పగిరి ప్రాంతంలో శనివారం పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. మంచు కారణంగా కాపుకొచ్చిన పప్పుశనగ, పొద్దు తిరుగుడు, మిరప, ధనియాలు, మొక్కజొన్న పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, చిప్పగిరి

చెట్టుపై చల్లని ప్రేమ



నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలోని ఇంటి ఎదుట వేప చెట్టు ఏపుగా పెరిగింది. ఇంటి యజమానులు రేకుల షెడ్డు వేసుకొనే క్రమంలో చెట్టు అడ్డుగా ఉన్నప్పటికీ.. పర్యావరణ స్పృహ, చెట్టుపై ప్రేమతో దాన్ని తొలగించలేదు. దాని ఎదుగుదలకు ఇబ్బంది లేకుండా చెట్టు చుట్టూ రేకులను కత్తిరించి షెడ్డు నిర్మించారు. దీంతో ఏపుగా పెరిగిన వేప చెట్టుతో ఇంటిపై చల్లగా ఉంటుంది. యజమానుల హరితస్ఫూర్తిని గ్రామంలోని ప్రజలు అభినందిస్తున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మట్టి కుప్పలు.. చూడకుంటే తిప్పలు

ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామం నుంచి అహోబిలం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మట్టి కుప్పలు వేశారు. బాచేపల్లెతండా నుంచి దొరకొట్టాల వరకు మట్టి కుప్పలను చదును చేయకుండా అలాగే వదిలేశారు. ఫలితంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక వరుస రోడ్డు కావడంతో వాహనాలు ఎదురుగా వచ్చినపుడు దాటే సమయంలో కుప్పలను ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు మట్టి కుప్పలను చదును చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం)

పీఆర్‌సీ కమిషన్ ప్రకటించాలి

మహానంది, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా క్రిష్ణయ్య డిమాండు చేశారు. నంద్యాలలో ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం నిర్వహించే వంద రోజుల ప్రణాళికల్లో వచ్చే సెలవులను మినహాయించాలన్నారు. మహానంది మండలం తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సరైన వసతులు కల్పించాలన్నారు. అనంతరం వారు మహానందిలో గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవైష్ణవ కురువానిధిమూర్తి, కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్‌వి కృష్ణారెడ్డి, బండిప్రసాదరెడ్డి, ఎస్‌వి భాస్కర్‌రెడ్డి, నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రామసుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా ప్రధానకార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఎస్‌ఎఫ్‌ఐ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. నూతన జిల్లా అధ్యక్షుడిగా సుధీర్, కార్యదర్శిగా ఎంఆర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రాజా, దినేష్, రేణుక, సహాయ కార్యదర్శులుగా హరివర్ధన్, శివకుమార్, హర్షతోపాటు 12 మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అతివల ప్రగతికి ఈ-నారీ

◆ పొదుపు సంఘాల్లో పారదర్శకతకు కృషి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తుండగా ఇప్పుడు ఈ-నారీ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. సంఘాల్లో పారదర్శకత, మహిళలకు జీవనోపాధుల కల్పన, ఆర్థిక అక్షరాస్యత తదితర అంశాలపై ఈ వ్యవస్థ అవగాహన కల్పిస్తుంది. ఆయా సంఘాల్లో డిగ్రీ చదివిన యువతులను 'ఈ-నారీ'లుగా ఎంపిక చేశారు. బ్యాంకింగ్, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చి పది సంఘాలకు ఒకరి చొప్పున నియమించారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ నుంచి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు ఈ నారీలకు నంద్యాల జిల్లాలో నవంబరు నెలలో శిక్షణ ఇచ్చారు.

నంద్యాల జిల్లాలో..

మండలాలు	: 29
సంఘం సభ్యులు	: 39,000
ఈ-నారీలు	: 3,060

మన డబ్బులు-మన లెక్కలు

గ్రామాల్లో వెలుగు గ్రూపులను సీఏలు పర్యవేక్షించేవారు. ఇకపై ఈ బాధ్యతలను ఈ-నారీలుగా ఎంపికైన వారికి అప్పగిస్తారు. సంఘాల్లో సభ్యులు పొదుపు చేయడం, రుణాలు సకాలంలో చెల్లించడం, రికార్డుల నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించేలా చూస్తారు. 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్ ద్వారా సంఘాల ఆర్థిక లావాదేవీలను ప్రతినెల అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుంది.

వీరి విధులు

- జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో ఈ-నారీ ఎంపికలు జరిగాయి. 10 సంఘాలకు ఒకరిని నియమించారు.
- వీరు సంఘాల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.
- సభ్యులు తీసుకున్న రుణం సకాలంలో చెల్లించేలా చూస్తారు.
- కొత్తగా జీవనోపాధులు పొందాలనుకునే వారికి ఏపీ పథకాల ద్వారా రుణాలు అందుబాటులో ఉన్నాయో వివరిస్తారు.
- ఈ-నారీలకు గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

ఆత్మకూరులో ఈ-నారీ శిక్షణకు హాజరైన సంఘాల మహిళలు

మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశం

- శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

పొదుపు సంఘాలను సమర్థంగా నిర్వహించడానికి ఈ-నారీ వ్యవస్థ ఉపయోగపడుతుంది. 'మన డబ్బులు-మన లెక్కలు' అనే యాప్ ద్వారా సంఘాల ఆర్థిక లావాదేవీలను వీరు యాప్‌లో అప్‌గ్రేడ్ చేస్తారు. దీంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశం ఉంది.

పవిత్రమైన మానవజన్మను సార్థకం చేసుకోవాలి

మాట్లాడుతున్న త్రిదండి అష్టాక్షరి రామానుజ జీయర్‌స్వామి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మహాత్ముల దివ్య ఆశీస్సులతో మనకు వచ్చిన పవిత్రమైన మానవజన్మను సార్థకం చేసుకోవాలంటే కైలాసాన్ని గానీ వైకుంఠాన్ని గానీ ఆశ్రయించాలని త్రిదండి అష్టాక్షరి రామానుజ జీయర్‌స్వామి పేర్కొన్నారు. లక్ష్మీవేంకటేశ్వర స్వామి హరి హర క్షేత్రం ఆధ్వర్యంలో కోడుమూరులో ఆదివారం హిందూ సమ్మేళనం మహా పాదయాత్రను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామానుజ జీయర్‌స్వామి, ఆదిత్య పరశ్రీ స్వాములు హాజరవగా ఆలయ సేవకులు ఎద్దుల మహేశ్వరరెడ్డి, తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామాలయంలో పూజలు చేశారు. ఆలయం నుంచి పాత బస్టాండు మీదుగా నిర్మాణ దశలో ఉన్న హరిహర క్షేత్రం వరకు ప్రదర్శన చేపట్టగా హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రామానుజ జీయర్‌స్వామి మాట్లాడుతూ.. కొత్త ఆలయాలను నిర్మించడం కంటే పాత ఆలయాలను జీర్ణోద్ధరణ చేయడం చాలా పుణ్యమని శాస్త్రం చెబుతోందన్నారు. సనాతన ధర్మం, పెద్దలు చెప్పిన మాటలను ఆచరిస్తూ ప్రధాన సేవకుడు హరిహర క్షేత్రాన్ని పునర్ నిర్మించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

డయల్ యువర్ సీఎండీ నేడు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. వినియోగదారులు సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య 8977716661 చరవాణి నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

జె.హొస్సళ్లి (హాలహర్వి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని జె.హొస్సళ్లి గ్రామంలో వెలసిన పట్టదస్వామి ఆలయంలో ఆదివారం లక్ష దీపోత్సవం కనుల పండువగా జరిగింది. పీఠాధిపతి శంభులింగయ్యస్వామి, శ్రీశైలం జగద్గురు అఖండ పరశివ మూర్తి మహాస్వామి అధ్యక్షతన ఆలయంలో స్వామికి జలాభిషేకం, రుద్రాభిషేకం, ఆకుపూజ వంటి విశేష పూజలు చేశారు. అనంతరం మహిళలకు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో లక్ష దీపోత్సవంతో ఆలయం కళకళలాడింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పీఠాధిపతులు ప్రవచన కార్యక్రమం చేపట్టారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొందరు కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆలయ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా గ్రామస్థులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మార్కెట్ కమిటీ ఛైర్మన్ల సంఘం అధ్యక్షుడిగా హరిబాబు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల సంఘం అధ్యక్షుడిగా నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుంటుపల్లి హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో ఆదివారం సమావేశమైన 26 జిల్లాలకు చెందిన ఛైర్మన్లు ఆయన్ను ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబును పలువురు అభినందించి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీల అభివృద్ధితోపాటు ఛైర్మన్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతానని వివరించారు.



హరిబాబును అభినందిస్తున్న మార్కెట్‌యార్డు ఛైర్మన్లు

ఆదోని జిల్లా సాధించే వరకు పోరాడుదాం

◆ 10న బందుకు పిలుపు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన ఆదోని డివిజన్ కేంద్రాన్ని ఆదోని జిల్లాగా ప్రకటించాలని.. అప్పటి వరకు ఆందోళనలు కొనసాగిద్దామని ఆదోని జిల్లా సాధన ఐకాస నాయకులు రఘురామయ్య, ఆదినారాయణరెడ్డి, కృష్ణమూర్తిగౌడు, శ్రీనివాస ఆచారి, లలితమ్మ, విరుపాక్షి, సాయిరాం, కోటి, కోదండ, దస్తగిరినాయుడు తదితరులు పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలో ఆదివారం ఆదోని జిల్లా సాధన ఐకాస ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన చేపట్టనున్న ఆదోని బందులో వ్యాపారులు, ఉద్యోగ, కార్మికులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, ప్రజలు కలిసిరావాలన్నారు. తమ వాణి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫయాజ్‌అహ్మద్, రవిశంకర్, సాయిప్రసాద్, తిరుమలేశు, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, విట్టా సతీశ్, అశోకానందరెడ్డి, సావిత్రి, రేణువర్మ, విజయకృష్ణ, నాగరాజు గౌడు, వీరేశ్, ఎర్రిస్వామి, కృష్ణమూర్తి, సూర్య, హనుమంతు, నరేశ్, బొబ్బిలి, ఉదయ్, బాల, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు. ఆదోని పట్టణంలో ఐకాస చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 22వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో ఆదోని రజక సంఘం నాయకులు సి.పెద్దరామన్న, రవి, నాగరాజు, రంగన్న, వెంకటేశు, తాయన్న, నాగప్ప, ఉమేశ్, గోవిందు, రాఘవేంద్ర, మంజు కూర్చొని తమ మద్దతు తెలిపారు. అంతకుముందు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

ఐకాస ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ఆదోని పట్టణంలో రిలే దీక్షలో రజక సంఘం నాయకులు

సత్యదేవునికి ఆభరణం

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడు, అమ్మవార్ల అలంకరణకు ఓ దాత నెక్లెస్‌ను ఆదివారం అందజేశారు. నంద్యాల జిల్లా జీనపల్లికి చెందిన సి.రాముడు సుమారు రూ.1.1లక్షలు విలువైన బంగారు నెక్లెస్‌ను ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఈవో అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

బనగానపల్లి, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బనగానపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో జిల్లా స్థాయి కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో పిల్లల్లో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం వస్తుందన్నారు. పిల్లలను తల్లిదండ్రులు చదువుతో పాటు ఇష్టమైన క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని సూచించారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా క్రీడల్లో సాధన చేసి వివిధ స్థాయుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, క్రీడా నిర్వాహకులు ప్రతాప్‌కుమార్, కల్యాణ్, సూర్యవంశీ, రామాంజనేయులు, రవితేజారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు 3,960 మంది హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జాతీయ ప్రతిభా ఉపకార వేతన అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు. కర్నూలు నగరంలోని పరీక్ష కేంద్రాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న 4,124 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,960 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. 164 మంది గైర్హాజరయ్యారన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో శామ్యూల్‌పాల్

జ్ఞాపకాలు పదిలం..

★ ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం

ఆత్మీయ సమ్మేళనంతో ఆనందం

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పద్మావతి

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. తరగతి గదుల్లోకి వెళ్లి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రిన్సిపల్ పద్మావతి మాట్లాడుతూ.. జవహర్ నవోదయ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు. పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పలువురు దేశ నాయకులు, ఆ పాఠశాల మొదటి ప్రిన్సిపల్ రెడ్డెప్ప విగ్రహాలను ఆవిష్కరించారు. విద్యార్థులు పాఠశాలకు శుద్ధజలం, సోలార్ వసతి ఏర్పాటు చేశారు. పూర్వ ప్రిన్సిపల్ రామకృష్ణ, పూర్వ విద్యార్థులు రమేష్‌సాగర్, ఉసేన్‌బాషా, సతీష్‌రాజేష్, డాక్టర్ సాయివాణి, మధుమతి, రజినీకాంత్, క్రాంతినాయుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

క్రమశిక్షణతో చదివితే అనుకున్నది సాధిస్తాం

- ప్రవీణ్‌కుమార్, రెడ్డప్ప, ఇతర మిత్రులు

నేను బనవాసి నవోదయలో 1987లో చదివా. నేను, నా స్నేహితుడు షాజిద్ న్యాయవాది వృత్తిలో రాణిస్తున్నాం. మా బ్యాచ్‌లో చదివిన వారంతా సాఫ్ట్‌వేరు ఇంజినీర్లుగా, వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవరుచుకోవాలి. నవోదయ పాఠశాలలు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తాయి. విద్య భవిష్యత్తులో వెలుగులు నింపుతుంది.

ఉన్నత శిఖరాలకు చేరుకున్నాం

- రాజేష్‌నాగేశ్వరం, దివ్యజ్యోతి, సునీల్‌కుమార్

విలువలతో కూడిన విద్య నేర్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగాం. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు కలిసి చదువుకున్నాం. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డాం. మా జూనియర్లు, సీనియర్లు సైతం ఉన్నత హోదాల్లో ఉన్నారు. పాఠశాలలో మాకు వేసిన పునాది ఉద్యోగాలు సాధించేందుకు ఉపయోగపడింది.

సాధన చేసి.. విజేతలుగా నిలిచి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఫెన్సింగ్, పోరాట క్రీడల్లో ఒకటి. చదువుతోపాటు ఫెన్సింగ్‌లో సాధన చేసి నైపుణ్యాలు పెంపొందించుకున్నారు డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.కిశోర్, సుహాక్షితలు అనే విద్యార్థులు. ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్ వద్ద శిక్షణ మెలకువలు పొందుతున్నారు. తమదైన శైలిలో పోటీల్లో రాణిస్తూ అందరి చేత శెభాష్ అనిపించుకుంటున్నారు.

సైన్యంలో చేరి సేవలందిస్తా

- టి.కిశోర్, తొమ్మిదో తరగతి

డోన్ పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్న బండారి చంద్ర, బండారి భారతి దంపతుల కుమారుడు టి.కిషోర్ స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి అభ్యసిస్తున్నారు. తండ్రి హమాలీగా పని చేస్తున్నారు. కిశోర్ క్రీడలపై మక్కువతో ఫెన్సింగ్‌లో తర్ఫీదు పొందుతున్నారు. 2025 అక్టోబరులో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. నవంబరులో తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాడు. భవిష్యత్తులో క్రీడల్లో మరింత నైపుణ్యాలను ప్రదర్శించి సైన్యంలో చేరి దేశ సేవ అందించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు కిశోర్.

జాతీయ స్థాయి పతకమే లక్ష్యం

- సుహాక్షిత, ఏడో తరగతి

డోన్ పట్టణంలోని పాతపేటకు చెందిన హరికృష్ణగౌడ్, పుష్పాంజలి దంపతుల కుమార్తె సుహాక్షిత పాతపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లిదండ్రులు కుమార్తెను చదివించడంతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. 2025 అక్టోబరులో నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించింది. నవంబరులో తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి పతకమే లక్ష్యంగా సాధన చేస్తానంటోంది సుహాక్షిత.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య

వెల్దుర్తి,న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన సుహాసిని(32) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భర్త చంద్రశేఖర్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో ఆమె మనస్తాపం చెందారు. జీవితంపై విరక్తి చెంది క్షణికావేశంలో ఆదివారం తెల్లవారుజామున పురుగు మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి..

ఆదోని నేరవార్తలు, కోసిగి, న్యూస్‌టుడే: ఆదోని రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని కోసిగి రైల్వే స్టేషన్ సమీపంలో తిమ్మప్ప(46) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శివరామయ్య తెలిపారు. రాయచూరు జిల్లా మాన్వి తాలుకా అరోళి గ్రామానికి చెందిన తిమ్మప్ప కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండేవాడని.. ఈ బాధను తట్టుకోలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని భాస్కర్‌నగర్‌లో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందారు. సమీప అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని హోటళ్లలో పనిచేసేవాడని, అతని పేరు రాజారెడ్డి అని స్థానికులు తెలిపారు. ఆదివారం అకస్మాత్తుగా మృతి చెందినట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు కోసం కర్నూలు రెండో పట్టణ పోలీసులు ఆరా తీస్తున్నారు.

చికిత్స పొందుతూ..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని కొత్తపేటకు చెందిన షేక్ మక్బూల్‌బాషా (48) చికిత్స పొందుతూ మృతి చెందారు. లారీ క్లీనర్‌గా పనిచేసే ఆయన్ను ఈనెల 6న స్థానిక ఆర్టీసీకాలనీ వద్ద 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈమేరకు కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని శరీన్‌నగర్‌కు చెందిన వడ్డె రామాంజనేయులు అలియాస్ వడ్డె అంజి, అతని కుమారులపై నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో మరో కేసు నమోదైంది. మార్చి 14న అదే కాలనీకి చెందిన తెదేపా నాయకుడు సంజన్న హత్య కేసులో నిందితులుగా వీరు జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. వడ్డె అంజి, ఆయన ముగ్గురు కుమారులపై నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. ఈనెల 5న రాత్రి సంజన్న బంధువైన అభిషేక్ శరీన్‌నగర్‌లోని ఓ దుకాణంలో చికెన్ పకోడ కొనుగోలు చేస్తుండగా నిందితులు అతని వద్దకు వెళ్లారు. సంజన్న కుమారుల వెంట తిరిగితే చంపేస్తామంటూ బెదిరించారు. బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్లేందుకు యత్నించారు. బాధితునికి తెలిసిన వాళ్లు రావడంతో అతన్ని వదిలేసి ఉడాయించారు. బాధితుడు అభిషేక్ ఆదివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు వడ్డె అంజి, ఇతని కుమారులపై కేసు నమోదు చేశారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

కర్నూలు - శ్రీనగర్ కాలనీ నందు 60 పా X 20 వె గల 2 BHK ఇల్లు అమ్మకమునకు కలదు. సంప్ర: 73828 64823, 70223 35858.

TO LET

For Rent to Hospital, Polyclinics, Diagnostic Centers, 5200 Sft. G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: 89851 32552.

JOBS

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ: 20k. ✆ 89776 39662,89776 39663.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని
●ఆదోని ●ఆలూరు ●పత్తికొండ

మాళమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండలం దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామికి ఆదివారం జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, బండారు అర్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, అమ్మవారికి, కుంకుమార్చన, ఆకు పూజలు చేశారు. కర్ణాటక, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు అన్నదానం నిర్వహించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తుగ్గలి, న్యూస్‌టుడే: సహకార సంఘం ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని సంఘం ఛైర్మన్లకు వినతి పత్రాలు అందజేసినట్లు మారెల్ల, జొన్నగిరి సొసైటీల సీఈవోలు మనోహర్‌నాయుడు, గిడ్డయ్య ఆదివారం తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు ఇచ్చిన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని అమరావతినగర్ రహదారిలో నీటి వాల్వ్ గుంతపై మూత అసంపూర్తిగా మూశారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. **- ఆసిఫ్, ఆదోని**

✔: గుంతను పూడ్చివేయించి, ప్రమాదాలు జరగకుండా చూస్తాం. **- నాసిర్‌హుసేన్, ఇన్‌ఛార్జి కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

తుగ్గలి, న్యూస్‌టుడే: ?: గిరిగెట్ల నుంచి అమీనాబాద్ గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై ఉన్న వంతెన భారీ వర్షాలకు కొట్టుకుపోయి నెలలు గడుస్తోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- గంగాధర్, గిరిగెట్ల**

✔: వంతెన నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులు చేపడతాం. **- శివ రుద్రకుమార్, డీఈ రహదారులు భవనాలు శాఖ పత్తికొండ**

హాలహర్వి, న్యూస్‌టుడే: ?: కొక్కరచేడు గ్రామంలో పలు కాలనీల్లో కాల్వలు లేక మురుగంతా ప్రధాన దారులపై పారుతోంది. **- వెంకటేశ్, కొక్కరచేడు**

✔: గ్రామంలో అవసరమైన చోట మురుగు కాల్వలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. మంజూరైన వెంటనే పనులు చేపడుతాం. **- నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో**

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ?: వెల్దుర్తి జామియా మసీదు సమీపంలో ఇనుప విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. **- షరీఫ్, వెల్దుర్తి**

✔: ఇనుప స్తంభం తొలగించి సిమెంటుది ఏర్పాటు చేస్తాం. **- వీరయ్య, వెల్దుర్తి లైన్‌మెన్**

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని సచివాలయం ఎదుట నీటి పథకం వాల్వ్‌కు ఎలాంటి రక్షణ లేదు. **- రంగనాథరెడ్డి, మద్దికెర**

✔: పరిశీలించి మూత ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో, మద్దికెర**

పంచాయతీ ఎన్నికలు బహిష్కరిస్తాం

■ చిన్నహరివాణం వద్ద ఆందోళన

రహదారిపై బైఠాయించిన చిన్నహరివాణం గ్రామస్థులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాలను ఆదోని మండలంలోనే కొనసాగించాలని, పల్లెల సమస్య పరిష్కరించకపోతే రానున్న పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని ఆయా గ్రామస్థులు స్పష్టం చేశారు. ఆదోని మండలం చిన్నహరివాణం వద్ద ఆదివారం ఆయా గ్రామస్థులు బైఠాయించారు. రహదారిపై రాకపోకలు స్తంభించాయి. 16 గ్రామాలను పెద్దహరివాణం మండలంలో కలపకుండా, ఆదోని లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్నామని, తీరా సమస్య పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల్లో చిచ్చు పెట్టి, ఇబ్బంది గడుపుతున్నారని విమర్శించారు. కర్ణాటక గ్రామాన్ని దాటి పెద్దహరివాణం వెళ్లాల్సి ఉంటుందని, దీంతో సమస్య వస్తుందన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా తమ గ్రామాలను పెద్దహరివాణంలో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కలిసి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంపాపతి, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు రామస్వామి, రామకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, ప్రసాద్, సుజ్ఞానమ్మ, మహబుబ్‌బాషా, చిన్నహరివాణంతో పాటు, మదిరె, గణేకల్, సంతేకుడ్లూరు, చిన్నగోనేహాళ్ తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రసవాలు అధికం.. అసౌకర్యాలతో సతమతం

◆ ఆసుపత్రిలో స్థలాభావ సమస్యలు
◆ వేధిస్తున్న వైద్యుల కొరత

ఆసుపత్రిలో సేవలు పొందుతున్న బాలింతలు

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ మాతా, శిశు ఆసుపత్రిలో ప్రసవాలు అధికంగా జరుగుతున్నా.. అందుకు తగ్గట్లుగా సౌకర్యాలు మాత్రం ఉండటం లేదు. స్థాయి 50 పడకలు.. ప్రసవాలు వందల సంఖ్యలో జరుగుతున్నాయి. ఆసుపత్రి సామర్థ్యం పెంచాలని చాలా ఏళ్లుగా ఉన్న డిమాండ్ నెరవేరడం లేదు. పాలకులు సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. డివిజన్ కేంద్రంలోని ఈ ఆసుపత్రి చుట్టూ ఎనిమిది మండలాలకు పెద్ద దిక్కుగా ఉంది. రోజు వారీ ఓపీ 300, కాన్పుల సంఖ్య సుమారు 10-15 వరకు ఉంటాయి. నెలకు వందకు పైగా సిజేరియన్, 300 వరకు సాధరణ ప్రసవాలు జరుగుతాయి. ఇక ప్రతి నెలా తొమ్మిదో తేదీన జరిగే ఉచిత స్కానింగ్ సేవలకు ఓపీ 500 దాటుతుంది. దీంతో రెండు రోజుల పాటు స్కానింగ్ సేవలు పొడిగించారు. ఈ స్థాయిలో సేవలందిస్తున్న ఆసుపత్రి అభివృద్ధిని పాలకులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ పడకలు, స్థలభావం, సిబ్బంది కొరత వేధిస్తున్నాయి.

అరకొర సిబ్బంది

ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆసుపత్రిలో ఉండాల్సిన సిబ్బంది కన్నా తక్కువగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. సీఏఎస్, డీసీఎస్ స్త్రీ వ్యాధి నిపుణుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీఏఎస్ గైనిక్ ఏడుగురు ఉన్నారు. వీరిలో ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. డీసీఎస్ (చిన్న పిల్లల నైపుణ్యులు) ఒకరున్నారు. సీఏఎస్‌లు నలుగురికి గాను ఇద్దరే ఉన్నారు. మత్తు వైద్యులు సీఏఎస్, సీఏఎస్, డీసీఎస్ ముగ్గురికి గాను ఒక్కరే ఉన్నారు.

ఆ సేవలు రద్దు

ఆసుపత్రిలో హెచ్‌డీయూ (హై డెన్సివ్ యూనిట్) కేంద్ర సేవలు నిలిచిపోయాయి. పది పడకలతో 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఎంతటి కష్టతరమైన ప్రసవాలైనా ఇక్కడే చేయాలనేది ఈ కేంద్రం ఉద్దేశం. గత వైకాపా ప్రభుత్వంలో హెచ్‌డీయూ సేవలను నిలిపివేసింది. దీంతో 18 మంది సిబ్బందిని ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేయడంతో ఆసుపత్రిలో కష్టతరమైన ప్రసవాలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ఇలాంటి వారిని వంద కి.మీ. దూరంలోని కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. దీంతో పేదలకు వ్యయప్రయాసలు తప్పడం లేదు.

రూ.ఏడు కోట్లతో విస్తరించినా..

2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.7 కోట్లు నాబార్డు నిధులతో ఆస్పత్రి భవనాన్ని విస్తరించారు. ఆ సమయంలో ఆసుపత్రి స్థాయి పెంచుతారని అంతా భావించారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ ఊసే పట్టించుకోలేదు. విస్తరించి, వంద పడకలకు పెంచితే.. ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు జరుగుతుంది. దీంతో పాటు వంద కి.మీ. దూరానికి రూ.4-5 వేలు ఆర్థిక భారం తొలగుతుంది.

నెల	సిజేరియన్	సాధారణ ప్రసవాలు
జులై	142	259
ఆగస్టు	114	237
సెప్టెంబరు	135	271
అక్టోబరు	117	273
నవంబరు	113	267

వృద్ధాల తొలగింపు

స్పందనకు వందనం

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని పేట ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న మురుగు, వృద్ధాలు తొలగింపు చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన 'వృద్ధాల మధ్యనే పాఠశాల' అనే కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. స్థానిక పాఠశాల వద్ద పేరుకు పోయిన వృద్ధాలు, మురుగు తొలగింపు చర్యలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు.

అదుపు తప్పితే దిగువకే

హొళగుంద మండల సమీపంలో తుంగభద్ర దిగువ కాల్వ ప్రవహిస్తోంది. దిగువ కాల్వపై మలుపులు ఉన్న చోట రక్షణ గోడలు లేవు. 181 కి.మీ. పరిధిలో మలుపు వద్ద రక్షణ గోడ కూలిపోయి.. ప్రమాదకరంగా మారింది. నిత్యం కాల్వపై రైతులు తమ పంట పొలాలకు ఆటోలు, ట్రాక్టర్లలో కూలీలను, పంట దిగుబడులు తీసుకెళ్తుంటారు. పలు గ్రామాల ప్రజలు సైతం రాకపోకలు సాగిస్తుంటారు. అదుపు తప్పితే దిగువ కాల్వలో పడే ప్రమాదం ఉంది. - న్యూస్‌టుడే, హొళగుంద

చెదిరిన దారిలో సాగని ప్రయాణం

దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల స్టేజి నుంచి పిల్లిగుండ్ల వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా ఉంది. నెల్లిబండ, బండగట్టు, పిలిగుండ్ల, వీరంపల్లె, ఐరన్‌బండ, గాజులదిన్నె తదితర పల్లె ప్రజలు ద్విచక్రవాహనాలు, ఆటోల్లో తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఎమ్మిగనూరు మార్కెట్‌కు పంట దిగుబడులు తరలించేందుకు ఇదే దారి దిక్కు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం గోనెగండ్ల, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. - న్యూస్‌టుడే, దేవనకొండ

అప్పులు కుప్పేసి.. ఆశలు ఆరబోసి

మొక్కజొన్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. హాలహర్వి మండల పరిధిలో చింతకుంట, కొక్కరచేడు, మేదేహాల్, గూళ్యం, సిద్ధాపురం గ్రామాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ప్రకృతి ప్రకోపం కారణంగా పంట దిగుబడి తగ్గింది. దీనికి తోడు ధరలు సైతం పతనమయ్యాయి. దిక్కుతోచక మొక్కజొన్న కంకులను రహదారిపై ఆరబెట్టి, ధరల కోసం ఎదురుచూస్తున్నారు. చాలా వరకు ధర పెరుగుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. - న్యూస్‌టుడే, హాలహర్వి

ఎదురొస్తే.. ఎక్కడి వాహనాలు అక్కడే

ఆలూరు పట్టణంలో గుంతకల్లు వెళ్లే మార్గంలోని ఇరుకు దారిలో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇరుకు దారిలో రెండు భారీ వాహనాలు ఒకే సారి ఎదురు పడితే.. ముందుకు వెళ్లేందుకు వీలుపడదు. ప్రస్తుతం కర్ణాటక నుంచి ఆలూరు మీదుగా ట్రాక్టర్లలో పశుగ్రాసం తరలిస్తున్నారు. గుంతకల్లు వెళ్లే మార్గంలో రెండు ట్రాక్టర్లు ఇలా ఒకే సారి వెళ్లడంతో ఇతర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. - న్యూస్‌టుడే, ఆలూరు

భారత్ విశ్వగురువుగా ఆవిర్భవిస్తుంది

కార్యక్రమం ప్రారంభిస్తున్న కల్లుమఠం మఠాధిపతి గురు సిద్ధలింగ దేవరు, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ పఠంలో భారత్ విశ్వగురువుగా అవిర్భవించబోతుందని, ఇందుకు దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ ప్రచారక్ జనార్దన్ తెలిపారు. స్థానిక విక్టోరియపేటలోని భావసార్ క్షత్రియ సమాజ్ కల్యాణ మండపంలో జరిగిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మన సంప్రదాయాలు, సంస్కృతులను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. హైందవ సంక్షేమమే.. భారత క్షేమమన్నారు. చిన్నతనం నుంచే సన్మార్గం వైపు నడిపించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కల్లుమఠం మఠాధిపతి గురుసిద్ధలింగ దేవరు తెలిపారు. కార్యక్రమంలో మహిళా వక్త మహాలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్, సంఘ్ పరివార్ పెద్దలు మనోహర్, వీరేష్, విజయ్ కుమార్, దేశాయి చక్రవర్తి, మంతాబుగ్గా రమేష్, శేషగిరి, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

'మేమూ తెదేపా కార్యకర్తలమే.. గుర్తించండి'

ఆస్పరి, న్యూస్‌టుడే: 'మేమూ తెదేపా కార్యకర్తలమే.. మమ్మల్ని గుర్తించి సమావేశాలకు, సభలకు పిలవండి' అని తెదేపా ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సంజప్ప, తెదేపా బీసీ సంఘం మండల కన్వీనర్ ఉరుకుంద, తెదేపా యూత్ నాయకులు మేకల రంగనాథ్‌యాదవ్, సతీష్‌కుమార్ కోరారు. స్థానిక గాంధీపార్కులో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువగళం రథసారధి నారా లోకేశ్ మాటలకు కట్టుబడి ఉన్నామన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఇబ్బందులు ఎదురైనా.. తెదేపా తరపున ప్రతి కార్యక్రమాన్ని భుజాలపై వేసుకోని పోరాటం చేశామన్నారు. ఇప్పుడు మాత్రం జరుగుతున్న కార్యక్రమాలకు, సభలకు తమను పిలువక పోవడం చాలా బాధాకరమన్నారు. తమ సేవలను పార్టీ నాయకులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, రాజు, కృష్ణయ్య, ఉశేని, తదితరులు పాల్గొన్నారు.

భాజపాను పల్లెల్లోనూ బలోపేతం చేద్దాం

భాజపాలో చేరిన పచ్చారపల్లె గ్రామ నాయకులు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపాను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ పరమహంస అన్నారు. ఆలూరులోని భాజపా కార్యాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీన కర్నూలులో నిర్వహించే అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా కర్నూలులో వాజపేయి విగ్రహావిష్కరణ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. హాలహర్వి మండలం పచ్చారపర్లపల్లె గ్రామానికి చెందిన వైకాపా నాయకులు గుమ్మనూరు కమలమ్మ, నారాయణ సమక్షంలో భాజపాలో చేరారు. అంతకుముందు భాజపా జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అరికెర సర్పంచి నాగరాజు, నాయకులు వెంకటరాముడు, విట్టా రమేష్, చిదానంద, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బసవరాజు, తిమ్మప్ప, మండల కన్వీనర్ బసవరాజు, రవీంద్రరావు, విరుపాక్షిరెడ్డి, సోమలింగ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించి, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మండల విద్యాధికారి భూపాల్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్లా, కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక సి.మల్లికార్జున విద్యాలయంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి ఇండోర్ ఆటల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిన సృజన వెలికితీసేందుకు క్లబ్ ద్వారా ఏటా పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. క్విజ్, చెస్, వక్తృత్వ, చిత్రలేఖనం తదితర పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో సభ్యులు సాబిర్ అహ్మద్, షణ్ముఖ, జీవన్‌సింగ్, సునీల్‌రెడ్డి, ప్రశాంత్ గాంధీ, భరత్ షా, శ్రీధర్‌రెడ్డి, విట్టా మురళీధర్, రాచోటి సుబ్బయ్య, హుసేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన విద్యార్థులతో రోటరీ క్లబ్ సభ్యులు

దేశరక్షణకు కంకణబద్ధులు కావాలి

ఫారెస్ట్‌లైన్ (ఆదోని పాతపట్టణం), న్యూస్‌టుడే: దేశరక్షణకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని యాదవగిరి శారద దత్తపీఠం పీఠాధిపతులు విద్య అభినవ సుబ్రహ్మణ్య భారతి మహాస్వాములు, నాగభూజంగ సాగర్ మఠాధిపతి ఓంకార్ సాగర్ స్వాములు(దత్తస్వామి)తో పాటు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ ప్రచారక్ జనార్దన్ అన్నారు. ఆదోని పట్టణంలోని ఫారెస్ట్‌లైన్ ప్రాంతంలో అంబాభవాని ఆలయ మైదానంలో ఆదివారం రాత్రి హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్‌డీ.గిరి, మరియాని చెన్నబసప్ప, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న మఠాధిపతులు, తదితరులు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: తిరుపతి నగరంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర 25వ మహాసభలు జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు సంజయ్ తెలిపారు. ఆదివారం ఆదోనిలో ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలకు సంబంధించిన గోడపత్రాలను నాయకులు విడుదల చేశారు.

నిరుపేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్స



కోనంకి సతీష్‌ను సన్మానిస్తున్న వైద్యాలయ సిబ్బంది

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఎల్‌వీ ప్రసాద్ వైద్యాలయం ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్స చేయిస్తున్నామని తెదేపా నాయకుడు కోనంకిసతీష్, ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి మేనేజరు వాసు, వైద్యులు మల్లికార్జున, మారన్న అన్నారు. చిప్పగిరి మండలం, బెల్డోణలో ఆదివారం ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. ఇందులో 30 మందికి కంటి శస్త్రచికిత్స చేయనున్నారు. కోనంకిసతీష్‌ను వైద్యాలయ సిబ్బంది సన్మానించారు.

దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించాలి

జీపుజాతాను ప్రారంభిస్తున్న గిడ్డయ్య

ఆస్పరి, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య డిమాండు చేశారు. స్థానిక బస్టాండు వద్ద ఆదివారం జీపుజాతా ప్రారంభించారు. అధిక వర్షాలతో రైతులు సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. పత్తి, వేరుసెనగ, పంటలతో పాటు ఇతర పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన ఆస్పరి చౌరస్తాలో రహదారుల దిగ్బంధం కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. రైతులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి, రమేష్, రామాంజని, ధనుంజయ, నల్లన్న, నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ పనులపై మాట్లాడటం విడ్డూరం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని బైపాస్ పనులు తామే పూర్తిచేశామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఆదోని తెదేపా ఎస్సీ విభాగం నాయకులు మదిరె వీరేష్ అన్నారు. ఆదోనిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం పోయిన తర్వాత కూడా ప్రధాని మోదీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో బైపాస్ రహదారి పనులు చేశామని చెబుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండి సొంత డబ్బా కొట్టుకోవడం సరైన విధానం కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పనులు పూర్తి చేశామన్నారు.

జొన్నగిరిలో ఉరుసు ప్రారంభం

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: జొన్నగిరి గ్రామంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు ఆదివారం గంధంతో ప్రారంభమైనట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి పూలచాదర్‌ను అశ్వంపై సోమవారం రాత్రి ఊరేగిస్తామన్నారు. దర్గాను విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. గ్రామ ప్రధాన కూడలి గ్రామ చావిడి వద్ద తినుబండరాలు, ఆటవస్తువులు, గాజుల దుకాణాలు ఏర్పాటు చేశారు.

నీటి కుంటలు.. సిరుల పంటలు

ఆ గ్రామాల్లో అత్యధికంగా..

వర్షాకాలంలో వృథాగా పోయే నీటికి అడ్డుకట్ట వేసి నీటిని ఒడిసిపట్టి సంరక్షించడం వల్ల భూగర్భజలాలు పెంచే లక్ష్యంతో చేపట్టిన పథకం సత్ఫలితాలనిస్తోంది. పత్తికొండ మండలంలోని నలకదొడ్డి, జూటూరు, దేవనబండ, చిన్నహుల్తి, ఆర్.మండగిరి, పెద్దహుల్తి, హోసూరు, పుచ్చకాయలమడ తదితర ప్రాంతాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసి 200లకు పైగా పంట కుంటలు, నీటి కుంటలు తవ్వారు.

జూటూరు సమీపంలో నిండుగా ఉన్న నీటి కుంట

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ ముగిసిందంటే చాలు ఎక్కడా చుక్క నీరు కనిపించని పరిస్థితి. మూగజీవాలు సైతం కి.మీ. దూరంలో వాగులు, వంకలకు వెళ్తే తప్ప దాహం తీరదు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు తప్ప మిగతా వారు రబీ సాగు ఎరుగరు. కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన పత్తికొండ పరిసర గ్రామాల్లో సాగునీటి సంగతేమో గానీ.. తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్న రోజులవి. వేసవిలో నీటి కష్టాలు చెప్పనలవి కాదు. ఈ ప్రాంతంలో ఏటా నెలకొంటున్న కరవు పరిస్థితుల నుంచి అన్నదాతను గట్టెక్కించాలన్న సంకల్పంతో 2017-18 మధ్య కాలంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పల్లెజీవం పథకం పేరుతో భూసంరక్షణకు శ్రీకారం చుట్టారు.

బెట్ట సమయాల్లో ఉపయోగం - మౌలాలి, రైతు. జూటూరు

అటు వర్షాకాలంలోనూ.. ఇటు రబీలోనూ బెట్ట పరిస్థితులు తలెత్తినప్పుడు కుంటల్లోని నీటితో తడులందిస్తున్నాం. రబీలో రెండెకరాల్లో సాగుచేసిన పత్తికి నీరందిస్తున్నాం. ఖరీఫ్‌లో వర్షాలు ఎక్కువై పత్తి చేను మొత్తం కుళ్లిపోయింది. ఇప్పుడు నీటి తడుల వల్ల పత్తిపైరు ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఎంతో ముందు చూపుతో చేపట్టిన ఈ పథకంతో అటు రైతులకు, వేసవి సమయంలో మూగజీవాలకు ఎంతో ఉపయోగంగా ఉంది.

కొందరు రైతులు వద్దన్నారు - బత్తిన లోక్‌నాథ్, మాజీ సర్పంచి, నలకదొడ్డి

పథకంలో భాగంగా పంట, నీటి కుంటలు ఏర్పాటు చేసే సయమంలో కొందరు రైతులు తమ పొలంలో వద్దన్నారు. ఎలాగోలా ఒప్పించి కొందరు రైతుల పొలాలతో పాటు, సమీపంలోని వాగుల్లో, వంకల్లో కుంటలు తవ్వించాం. అవి ఏర్పాటు చేసి ఏడెనిమిదేళ్లు గడుస్తున్నా.. ఏటా పంట కుంటల్లో చేరుతున్న నీటితో ఆయా గ్రామాల రైతులు వినియోగించుకుంటున్నారు. వాటిలో నీరు ఇంకిపోయే సమయానికి అప్పుడప్పుడూ కురిసే వానలకు తిరిగి నీరు చేరుతుంది.

సుపరిపాలన యాత్ర జయప్రదం చేయాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన అటల్-మోదీ సుపరిపాలన యాత్రను జయప్రదం చేయాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ కోరారు. పత్తికొండ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం జరిగిన భాజపా నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ. . జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సుపరిపాలన ఈ నెల 12న కర్నూలుకు చేరుకుంటుందన్నారు. అటల్ బిహారీ వాజపేయి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలో చేపట్టిన ఈ యాత్ర ఓ మైలురాయిగా నిలిచేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేనప్పయాదవ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసాచారి, నియోజకవర్గ కో-కన్వీనర్ గోవర్ధన్‌నాయుడు, ముఖ్య నేతలు పూనా మల్లికార్జున, దండి మల్లికార్జున, వీరేశ్, బ్రహ్మయ్య, గోరంట్ల, చంద్రన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకుడు సంధ్య విక్రమ్‌కుమార్

జనసేన పార్టీని బలోపేతం చేయాలి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాబోయే రోజుల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ నాయకులు సంధ్య విక్రమ్‌కుమార్ సూచించారు. మండలంలోని చనుగొండ్ల, గుడిపాడు గ్రామాల్లో ఆదివారం 'కాఫీ విత్ కార్యకర్త' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జనసేన పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ అశోక్, జయరాజు, వెంకటేష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక జీవీఆర్ పాఠశాల 1977-78 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించారు. ముందుగా మరణించిన తమ గురువులు, మిత్రులను గుర్తు చేసుకుని 2 నిమిషాలు మౌనం పాటించారు. 47 ఏళ్ల తరువాత విద్యార్థులు ఒకచోట చేరి ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. అప్పటి అధ్యాపకుడైన సుంకయ్య దంపతులను సన్మానించుకున్నారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధి కోసం సాయమందిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం సరిగా లేక ఈ కార్యక్రమానికి రాలేకపోయిన నాటి ఉపాధ్యాయుడు శివరామయ్య గృహానికి వెళ్లి విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో జీవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.రామచంద్రుడు, విద్యార్థులు విక్రమ్ సింహారెడ్డి, సుధాకర్, రామకృష్ణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తమ గురువు సుంకయ్య దంపతులను సన్మానించిన పూర్వవిద్యార్థులు

స్నేహితుడికి చేయూత

గోనెగండ్ల,న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన చిన్ననాటి స్నేహితుడు బోయ మల్లికార్జునకు గోనెగండ్లలోని 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.40 వేలు ఆర్థిక సాయం చేసి చేయూతనిచ్చారు. ఆదివారం ఎమ్మిగనూరు మండలంలోని రాళ్లదొడ్డి గ్రామంలో నివాసం ఉన్న బాల్యమిత్రుడి ఇంటికి వెళ్లి వారు పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించి, అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అక్బరు, కరుణాకర్, బడేసావలి, ప్రకాష్, పాండు, ఫక్రుద్దీన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునకు నగదు అందజేస్తున్న స్నేహితులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు కోరారు. కార్యాలయంలో సోమవారం నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ప్రజలు అందించే వినతులను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

రబీలోనైనా గట్టెక్కేనా?

✦ వాతావరణ మార్పులతో దెబ్బతింటున్న పంటలు
✦ ఆందోళనలో అన్నదాతలు

గూడూరు, న్యూస్‌టుడే: ఈ ఏడాది రైతన్నలకు ప్రకృతి సహకరించలేదు. అధిక వర్షాలు, తుపాన్లతో పంటలు నష్టపోయారు. ఖరీఫ్‌లో పత్తి సాగు చేయగా.. అధిక వర్షాలతో పొలాల్లోనే కాయలు కుళ్లి దిగుబడులు పడిపోయాయి. ఉల్లికి విపణిలో ధర లేక చాలామంది కర్షకులు పొలాల్లోనే వదిలేశారు. పొగాకు, సజ్జ, కొర్ర పంటల పరిస్థితి అంతంతమాత్రమే. కనీసం రబీ సీజన్‌లో అయినా గట్టెక్కుదామనుకుంటే పొగమంచుతో పంటలు నాశనం అవుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూత లేని కంది పంట

కంది పోయింది.!

నియోజకవర్గంలో వర్షాధారంగా సుమారు రెండు వేల హెక్టార్లలో కంది పంట సాగైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఖరీఫ్‌లో కురిసిన వర్షాలకు పంట ఏపుగా పెరిగింది. మంచి దిగుబడి వస్తుందని ఆశించిన అన్నదాతలకు నిరాశే మిగిలేలా ఉంది. డిసెంబరులో సంభవించిన వాతావరణ మార్పులతో పూత రాలిపోయింది. కాయలను పురుగు అశించడంతో పంట దెబ్బతింటోంది. కనీసం ఎకరానికి రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి కనబడటం లేదు. దీంతో వేల రూపాయలు ఖర్చు చేసి పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు.

పప్పు శనగ రైతుల కలవరం

నీటి వసతి ఉన్న రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంటను తొలగించి పప్పు శనగ సాగు చేశారు. మొలకలు వచ్చి పెరుగుతున్న దశలో తుపాను, ప్రస్తుతం పొగమంచు కారణంగా మొక్కలు చనిపోతున్నాయి. అక్టోబరు నెలలో సాగు చేసిన శనగ పంట పూత, కాయ దశలో ఉంది. వాతావరణ మార్పులతో పూత రాలిపోయి మొక్కలకు కాయలు కనిపించడం లేదని కర్షకులు ఆవేదన చెందుతున్నారు.

నష్టాలు తప్పడం లేదు – నరసన్న, పోలకల్లు

అకాల వర్షాలు కురవడంతో పత్తి పూర్తిగా దెబ్బతింది. రెండు ఎకరాల్లో సాగు చేసి రూ.70 వేలు నష్టపోయాను. ఆ పంటను తొలగించి సేద్యం చేసేందుకు రూ.10 వేలు ఖర్చయింది. మరో రూ.20 వేలు ఖర్చుతో శనగ పంట సాగు చేస్తే వాతావరణం మార్పు ముప్పుగా మారింది. ఈ ఏడాది ఏ పంట సాగు చేసినా నష్టాలు తప్పడం లేదు.

పురుగుమందులు పిచికారీ చేసుకోండి – మల్లేష్‌కుమార్, వ్యవసాయాధికారి, సి.బెళగల్

ఈ ఏడాది అకాల వర్షాలతో అందరికీ ఒకే మాదిరిగా దిగుబడులు రాలేదు. కొందరు రైతులు నష్టపోగా మరికొందరికి లాభాలు వచ్చాయి. ప్రస్తుతం కంది పంటకు మరక మచ్చ పురుగు ఆశిస్తోంది. నివారణకు మార్కెట్లో చాలా పురుగుమందులు ఉన్నాయి. డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే మేలు.

మట్టి దారి.. అడుసు చేరి

మండలంలోని పెసలదిన్నెలోని ఎస్సీ కాలనీలో మురుగునీరు రహదారిపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అపరిశుభ్రత నెలకొని దోమల బెడద అధికమైందని ప్రజలు వాపోతున్నారు. మురుగు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. కాల్వలు నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

దెబ్బతిన్న కల్వర్టు.. రాకపోకలకు ఇక్కట్లు

నగర పంచాయతీలోని పడమర బీసీ కాలనీలో ఉన్న పంప్ హౌస్ పక్కన ఉన్న రహదారిలో కల్వర్టు సగం పగిలి ప్రమాదకరంగా మారింది. వాహనాలు ఎదురెదురుగా వస్తే ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళల్లో కల్వర్టుపై ఏర్పడిన గుంతను గుర్తించలేక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

మురుగులో తాగునీటి పైపులు

మండలంలోని ఎర్రదొడ్డి మజరా గ్రామం చిల్లబండలో కుళాయిల తాగునీటి సరఫరా చేసే ప్రధాన గొట్టాలు మురుగులో ఉన్నాయి. నీటి పథకం సమీపంలో ప్రజలకు అందించే నీటి కుళాయిల సముదాయం వద్దే అధ్వానంగా మారింది. మురుగు మధ్యే ప్రజలు నీటిని తీసుకొనే పరిస్థితి. కూత వేటు దూరంలోనే సర్పంచి ఇల్లు ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం. – న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

భౌమంటే వణుకే

మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీధుల్లో గుంపులుగా చేరి.. ఎక్కువగా చిన్నారులపై దాడి చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు పదుల సంఖ్యలో ప్రజలు కుక్కకాటుకు గురవుతున్నారు. కుక్కల సంతతి ఏటేటా పెరుగుతున్నందున నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: క్లబ్ ఏరియాలో కల్వర్టు నిర్మించి సమస్య తీర్చండి. -ఆంజనేయులు, కాలనీవాసి

?: లక్ష్మీపేట రెండోలైన్‌లో దారి గుంతలు పడి అధ్వానంగా మారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - నాగరాజు, స్థానికుడు

✔: కల్వర్టు పనులను త్వరగా పూర్తి చేస్తాం. గుంతల దారిని పరిశీలించి మరమ్మతులు చేపడతాం. అవసరమైతే నూతన రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. - గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: మిలటరీ కాలనీలో విద్యుత్తు దీపం వెలగడంలేదు. - వీరేష్, స్థానికుడు

✔: నూతన వీధి దీపం ఏర్పాటు చేస్తాం. -నీరజ, డీఈ

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: నగర పంచాయతీలో ఎమ్మిగనూరు- కర్నూలు ప్రధాన దారిలో తెలుగు వీధి వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పైపులను తొలగించి కల్వర్టు నిర్మించాలి. - రవికుమార్, గూడూరు

✔: ఆర్అండ్‌బీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. - రమేష్‌బాబు, కమిషనర్

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని రాజా వీధిలో కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. -వీరేష్, స్థానికుడు

✔: కార్మికులను పంపి మురుగు తొలగిస్తాం.
- రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మంత్రాలయం, న్యూస్‌టుడే: ?: రామచంద్రనగర్‌లో మురుగు కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. -స్థానికులు

✔: కాల్వలు శుభ్రం చేయిస్తాం.
- ఉపేంద్రరెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి

నందవరం, న్యూస్‌టుడే: ?: నాగలదిన్నె కొత్త కాలనీలో తాగునీటి సమస్య ఉంది. రోజూ సరఫరా చేయండి. - ఫిరోజ్, నాగలదిన్నె

✔: విషయం సంబంధిత అధికారులకు తెలియజేసి, రోజువారీగా తాగునీరు సరఫరా చేయిస్తాం.
- పుల్లయ్య, ఎంపీడీవో, నందవరం మండలం

కౌతాళం న్యూస్‌టుడే: ?: మండలంలోని హాల్వి నుంచి కౌతాళం వెళ్లే రహదారికి ఇరువైపులా మలుపుల వద్ద ముళ్లపొదలు పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. - పంపాపతి, గ్రామస్థుడు

✔: రహదారిని పరిశీలించి ముళ్లపొదలను త్వరలోనే తొలగింపజేయిస్తాం. - సాయి సురేష్, ఆర్అండ్‌బీ ఏఈ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: మల్లారవీధిలో కంకర తేలిన రహదారితో ఇబ్బందులు పడుతున్నాం. -శంకర్, కాలనీవాసి

✔: పరిశీలించి రహదారికి మరమ్మతులు చేయిస్తాం
- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: అబ్బాస్ టాకీస్ ప్రాంతంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. - రంగన్న, స్థానికుడు

✔: నీటి సమస్య తీరుస్తాం. - నీరజ, డీఈ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ?: ఎర్రబాడు గ్రామ శివారులో చెరువు కట్టపై ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోయాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. - మౌలాలి, ఎర్రబాడు

✔: సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. -అనంతశయన, డిప్యూటీ ఎంపీడీవో, గోనెగండ్ల.

?: గోనెగండ్ల గ్రామ శివారులో గంజహళ్లి రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల ఇద్దరు రోడ్డు ప్రమాదాల బారిన పడ్డారు. - లక్ష్మన్న, గంజహళ్లి

✔: మరమ్మతులకు తగు చర్యలు తీసుకొంటాం.
- అనంతశయన, డిప్యూటీ ఎంపీడీవో, గోనెగండ్ల.

ఆటలతో చదివి.. ఆనందంగా ఎదిగి

✦ పిల్లలకు వినూత్న వస్తువులతో బోధన

గోనెగండ్ల, న్యూస్‌టుడే: పునాది దశలోనే పిల్లలు ఆటల ద్వారా చదువును అభ్యసించేలా ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వారిలో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు 'జాదుయి పిటారా కిట్టు' మంజూరు చేసింది. నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లోని పాఠశాలలకు ఈ కిట్లు మంజూరయ్యాయి. వీటిని 1, 2 తరగతుల వారికి అందజేశారు. సృజనాత్మకత, ఆలోచనాశక్తి, సంభాషణ నైపుణ్యాలు పెంచి అభ్యసనాన్ని ఆనందదాయకంగా చేయడమే దీని ఉద్దేశం. బొమ్మల పజిల్స్, కథలు, తోలుబొమ్మలు వంటి వాటితో ఆడుకుంటూ అక్షరాలు నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

ప్రభుత్వం మంజూరు చేసిన ఆట వస్తువులను చూపుతున్న ఎంఈవోలు

కిట్టులో 62 రకాల వస్తువులు

ప్రభుత్వం మంజూరు చేసిన జాదుయి పిటారా కిట్టులో ఒక్కోదానిలో 62 రకాల ఆట వస్తువులు ఉంటాయి. రంగుల బొమ్మలు, బోధన పరికరాలు, అంకెలు, రంగు పెన్సిళ్లు, తెలుగు, ఆంగ్ల భాషలో కూడిన అక్షరాలు, గణిత అంశాలను సులువుగా గుర్తించేవిధంగా ఆకారాలను అందుబాటులో ఉంచారు. వీటిని అంగన్వాడీ కేంద్రాలకు అనుబంధంగా విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకటి, రెండు కిట్లు అందిస్తారు. తరగతి గదిలో ఉత్సాహకర వాతావరణంలో విద్యాబోధన సాగడానికి దోహదపడతాయని విద్యాధికారులు రామాంజనేయులు, నీలకంఠ చెప్పారు.

☛ గోనెగండ్ల ప్రాథమిక పాఠశాలకు మంజూరైన 'జాదుయి పిటారా' కిట్లను ఎంఈవోలు ప్రారంభించారు. మండలంలో 40 పాఠశాలలకు 59 బాక్సులు మంజూరయ్యాయన్నారు. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' సందర్భంగా పిల్లలకు పుస్తకాలు లేకుండానే ఆట పాటల ద్వారా విద్యాబోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నైపుణ్యాల పెంపునకు దోహదం – రామాంజినేయులు, ఎంఈవో, గోనెగండ్ల

పిల్లల్లో విద్యా నైపుణ్యాలకు పునాది వేయడమే కాకుండా సామర్థ్యాలు, ఇంద్రియ గ్రహణ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. తమ చుట్టూ ఉన్న గ్రామీణ వాతావరణం, కుటుంబ వ్యవస్థ, పండగలు, సంప్రదాయాలను తెలుసునేందుకు పిల్లలకు అవకాశం ఉంటుంది.

సంక్షిప్త సమాచారం

సి.బెళగల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వెంకటలక్ష్మి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కారిక వేదిక నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దారు పురుషోత్తమ్ తెలిపారు గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వినతులు అందించి పరిష్కరించుకోవాలని కోరారు.

పోలకల్: గ్రామంలో శైవక్షేత్రమైన సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్కరించుకొని పురోహితుడు రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

మంత్రాలయం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సూగూరుకు చెందిన తెదేపా కార్యకర్త కురువ చిన్న వీరనాగుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. దీంతో మాజీ సర్పంచి రఘునాథ్ రెడ్డి, తెదేపా నాయకులు గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేసి, ఆయన కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక పార్టీ నాయకులు గోపాల్, హనుమంతు, నరసింహ, శేఖర్, రజాక్, ఇస్మాయిల్, బొజ్జప్ప, రవి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తెదేపా నేత రఘునాథ్ రెడ్డి, నాయకులు

బడి చెంత.. ప్రమాద చింత

పాఠశాల ముఖ ద్వారం దగ్గర మురుగు నీటి కుంట

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అమడగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖ ద్వారం దగ్గర నీటి కుంట ప్రమాదకరంగా ఉంది. పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయి విష పురుగులకు ఆవాసంగా మారింది. విద్యార్థులు ఏ మాత్రం ఆదమరిచిన ప్రమాదం పొంచి ఉంది. విద్యార్థులకు వసతి సౌకర్యం ఉండటంతో పలు గ్రామాల నుంచి వచ్చి ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రమాదం దృష్ట్యా గుంతను పూడ్చి వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

రేపటి నుంచి ప్రారంభం

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: డిసెంబరు నెల వచ్చిందంటే చాలు జిల్లాలో పశ్చిమప్రాంతంలో గ్రామదేవతలకు ప్రజలు సంబరాలు నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలో గ్రామదేవతలు మారెమ్మ, దుర్గాదేవి, సుంకులమ్మ, దేవమ్మ తదితర అమ్మవార్లకు కుంభాలతో ఆలయాలకు వెళ్లి మొక్కుబడుల తీర్చుకోవడం ఆనవాయితీ. గ్రామస్థులంతా మేళతాళాలతో కుంభాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో సమృద్ధిగా పంటలు పండి గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని ప్రజల నమ్మకం. ఈ నెల 9 నుంచి కౌతాళం, కోసిగి, మంత్రాలయం, పెద్దకడుబూరు, ఆదోని, హాళగుంద, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల హాలహర్వి, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ తదితర మండలాల్లో గ్రామ దేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో కౌతాళం మండలంలోని గోతులదొడ్డి, పొదలకుంట గ్రామాల్లో దుర్గాదేవి, మారెమ్మ అమ్మవార్ల ఉత్సవాలు జరగనున్నాయి.

కుంభాలతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న గ్రామస్థులు, పూజలందుకుంటున్న దుర్గాదేవి

సొంతింటి కల తీరేనా..?

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు గృహాలు మంజూరు చేసింది. ఆర్థికస్థోమత లేని లబ్ధిదారులను గుర్తించి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయించి ఇస్తామని గొప్పలు చెప్పింది. ఐదేళ్ల పాలన ముగిసినా మండలంలో ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం గమనార్హం. దీంతో పేదలకు సొంతింటి కల.. కలగానే మిలిగిపోయింది. మండలంలో చిన్ననెలటూరు, కులుమాల, కైరవాడి, ఎర్రబాడు, చిన్న మర్రివీడు గ్రామాల్లో వందల గృహ నిర్మాణాలను గుత్తేదారులకు అప్పగించింది. నాసిరకంగా, ఇష్టానుసారంగా గుత్తేదారులు నిర్మాణాలు చేపట్టి బిల్లులు స్వాహా చేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన గృహాల పనులు నిర్మాణం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

చిన్ననెలటూరు గ్రామ శివారులో నిలిచిపోయిన గృహనిర్మాణాలు

నిధులు మంజూరైనా మొదలుకాని పనులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రహదారి పనులకు అధికారుల నిర్లక్ష్యం వహించారు. ఎమ్మిగనూరు పట్టణంలో రద్దీలో ఉండే రహదారిలో ప్రయాణికులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. పట్టణంలో గంజహళ్లి రహదారి పనుల కోసం రూ.కోటి నిధులు మంజూరు చేశారు. టెండర్లు పూర్తి చేసి 9 నెలలు గడిచినా పనులు మొదలు కాలేదు. దారిలో ఎమ్మిగనూరు, గూడూరు, కోడుమూరు, కర్నూలుకు చెందిన వాహనాలు అధికంగా తరలివెళ్తాయి. అధికారులు స్పందించి గుంతల పడిన రహదారికి బాగు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

గంజహళ్లి మార్గంలో కంకర వేసి వదిలేసిన దారి

ఆరోగ్య ఉపకేంద్రం.. అసంపూర్ణం

ఈర్లదిన్నె (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో రూ.17 లక్షల నిధులతో ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని నాలుగేళ్ల కాలంలో అడపాదడపా పైకప్పు పనులు పూర్తి చేసి వదిలేశారు. కొద్దిపాటి నిధులు వెచ్చించి రంగులు, విద్యుత్తు, అసంపూర్తి పనులు చేస్తే వినియోగంలోకి తెస్తే ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలోని ఇరుకుగదుల్లో ఎంఎల్‌హెచ్‌పీతో వైద్య సేవలు కొనసాగిస్తున్నారు.

ఈర్లదిన్నెలో నిరుపయోగంగా ఉన్న ఆరోగ్యఉప కేంద్రం భవనం

పారిశ్రామికవేత్త మృతికి నివాళి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పారిశ్రామికవేత్త మాచాని సోమప్ప కుమారుడు మాచాని రఘురామప్రసాద్ మృతి చెందడంపై డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలో రాజేంద్రప్రసాద్ మృతదేహానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ.. రాజేంద్రప్రసాద్ ప్రజలకు నిత్యం సేవలు అందించారని కొనియాడారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట సుధాకర్‌రెడ్డి, ఆదెన్న, పురుషోత్తంరెడ్డి, మురళీకృష్ణంరాజు, మాణిక్యరాజు తదితరులు ఉన్నారు.

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.8,292

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.8,292 మధ్యస్థ ధర రూ.7,509 కనిష్ఠ ధర రూ.3,080కు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,960 మధ్యస్థ ధర రూ.5,840 కనిష్ఠ ధర రూ.5,690 పలికింది.

ఇల్లు కాదండోయ్.. ప్రభుత్వ కార్యాలయం

ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏదో ఇల్లు అనుకుంటే పొరపాటే సుమా. ఇది ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం. భవనానికి ఇటీవల మరమ్మతులు చేసి రంగులు వేశారు. అయితే కార్యాలయం పేరు బోర్డు ఏర్పాటు చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులు కార్యాలయానికి బోర్డు లేకపోవడంతో గుర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

మాళమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హోళగుంద: మండలంలోని దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామికి ఆదివారం జలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, అమ్మవారికి, కుంకుమార్చన, ఆకు పూజలు చేశారు. కర్ణాటక, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేరుకే ఆదర్శం.. వసతులు శూన్యం

■ ఆదర్శ పాఠశాలలో సౌకర్యాల కరవు

ప్రహరీ లేని జూలకల్లు ఆదర్శ పాఠశాల

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గూడూరు- ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలో జూలకల్లు గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాలలో పలు సమస్యలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల గ్రామానికి దూరంగా ఉండటం, చుట్టూ ముళ్ల పొదలు ఉండటంతో మైదానంలో విషకీటకాలు, పాములు సంచరిస్తున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయంలో ఉపాధిహామీ నిధులు రూ.25 లక్షలు నిధులు మంజూరు చేశారు. పనులు చేపట్టేలోపే ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి వచ్చింది. ఉన్న నిధులతో పనులు మొదలు పెట్టినా.. నిధుల విడుదలకు కచ్చితమైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో అవి మధ్యలోనే నిలిచిపోయాయి.

☛ ఈ పాఠశాలలో 652 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడే ఉన్న వసతి గృహంలో 100 మంది విద్యార్థులు ఉంటున్నారు. మిగతావారు ఇళ్ల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. జూలకల్లు గ్రామ బస్టాండు నుంచి పాఠశాలకు వెళ్లే మార్గం కి.మీ మేర కంకర తేలి ఉంది. మార్గానికి ఇరువైపులా కంపచెట్లతో అధ్వానంగా తయారైంది.

చుట్టూ అసౌకర్యాలే..

పాఠశాల భవనం గ్రామానికి దూరంగా ఉండటం, వెనుక భాగంలో చెక్ డ్యాం వద్ద నీటి నిల్వ ఉండటంతో పాఠశాల వసతిగృహం సముదాయంలోకి విష ప్రాణులు వస్తున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు పాఠశాలలోకి పాములు వచ్చాయంటున్నారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారుతోందని చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు, ఉపాధ్యాయ బృందం కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం – దిల్షాద్, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల

పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి సమస్యను విన్నవించి పరిష్కారానికి కృషి చేస్తాం.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కర్నూలు డిపో-2లో సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి జి.మహేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఆదివారం రెండోరోజు సంఘం నాయకులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సంఘం డిపో అధ్యక్షుడు జీవీరెడ్డి, నాయకులు రామకృష్ణ, సులోచన, రామలక్ష్మమ్మ, విజయ సాయినాథ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, పాణ్యం : 85000 05408, ఓర్వకల్లు : 63004 66875

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : ?: నన్నూరు గ్రామం కొండారెడ్డి సత్రం సమీపంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - ప్రభాకరరావు, నన్నూరు

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - నాగ అనసూయ, ఎంపీడీవో, ఓర్వకల్లు

?: గుట్టపాడు నుంచి ఎన్.కొంతలపాడుకు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయమైంది. మరమ్మతులు చేయించాలి. - యుగంధర్, ఎన్.కొంతలపాడు

✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డుకు మరమ్మతులు చేస్తాం. - గాయత్రి, పంచాయతీ కార్యదర్శి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: గణేశ్‌నగర్ వీధుల్లో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. - రమణ

?: గీతానగర్, గురురాఘవేంద్రనగర్‌లో మురుగు కాలువలను శుభ్రం చేయాలి. - విక్రమ్

?: బళ్లారి చౌరస్తా వెళ్లే దారి శ్రీరామనగర్‌లో వర్షం నీరు రహదారి దెబ్బతినింది. రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. - మోహన్

?: వీకర్‌సెక్షన్ కాలనీలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. - వెంకటేశ్వర్లు

✓: వీధిదీపాలను మరమ్మతులు చేయిస్తాం. కాలువల్లో పూడిక తొలగిస్తాం. - నగరపాలక అధికారులు

నిరంతర పరిశోధనలతో ఉత్తమ ఫలితాలు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : వైద్య విద్యలో నిరంతర పరిశోధనలతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ పేర్కొన్నారు. స్థానిక వైద్య కళాశాలలో యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ప్రోస్టేట్ క్యాన్సర్‌పై వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని మెరుగైన వైద్య విధానాలను అభ్యాసం చేయాలని సూచించారు. యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ముత్యాలి, డాక్టర్ సీతారాం బాలరవితేజ, అపోలో హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ సంజయ్ అడ్డాల, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ శివప్రసాద్ ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

సదస్సులో మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా ఉషా సంఘం అధ్యక్షుడు విజయేంద్ర సందీప్ ఆకాంక్షించారు. ఈనెల 8 నుంచి 9వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరుగుతున్న సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ రాష్ట్రస్థాయి ఉషా పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులుతో కలిసి ఆదివారం ఆయన క్రీడా దుస్తులు అందజేశారు. సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఉపాధ్యక్షులు టి.కృష్ణ, గీతాంజలి, మాస్టర్లు క్రాంతి, శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా చెత్త.. ఊసేలేని సంపద

◆ పంచాయతీల్లో వినియోగంలోకి రాని కేంద్రాలు ◆ పల్లెలను వేధిస్తున్న పారిశుద్ధ్య లోపం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు.. పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు దిష్టిబొమ్మలుగా మారాయి. తడి, పొడి చెత్తను వేరు చేసి.. వర్మీ ఎరువులు తయారు చేయాలన్న లక్ష్యంతో గత తెదేపా హయాంలో 2014 వీటి నిర్మాణం చేపట్టారు. కొన్ని పూర్తయినా.. చాలా కేంద్రాలు అసంపూర్తిగా మిగిలాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024 అక్టోబరు 2న వీటిని పునః ప్రారంభించాలని ఆదేశించింది. ఒక్క కేంద్రాన్ని కూడా వినియోగంలోకి తేలేకపోయారు. తర్వాత ఈ ఏడాది గాంధీ జయంతి నాటికైనా అసంపూర్తి కేంద్రాలను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని.. చెత్త, వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ ప్రారంభించాలని ఆదేశించినా ఫలితం లేకుండాపోయింది. అధికారుల చిత్తశుద్ధి లోపించడంతో.. పంచాయతీలకు సంపద కలగా మారగా.. ఊరూరా చెత్త పేరుకుపోయి పారిశుద్ధ్య లోపం వేధిస్తోంది.

నిరుపయోగంగా సుంకేసుల వర్మీ కంపోస్టు షెడ్డు

ఎటుచూసినా అధ్వానంగా..

మండల పరిధిలోని ఉల్చాల, ఈ.తాండ్రపాడు, వెంకాయపల్లె, గొందిపర్ల గ్రామ పంచాయతీ పూలతోట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కన ఎటుచూసినా చెత్తకుప్పలు పేరుకుపోయాయి.

◆ నందనపల్లె, బాపూజీనగర్, దిన్నెదేవరపాడు గ్రామాల్లో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులుగా మారాయి. పారిశుద్ధ్య లోపంతో దుర్వాసన, దోమల సమస్య అధికమయ్యాయి. సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్నీ.. అలంకారప్రాయమే

కర్నూలు మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు తెదేపా ప్రభుత్వ హయాంలో 23 చెత్త సంపద కేంద్రాలు మంజూరయ్యాయి. వీటిలో 14 కేంద్రాల నిర్మాణం పూర్తయింది. మరో 9 కేంద్రాల నిర్మాణం నేటికీ పూర్తికాలేదు.

◆ పూర్తయిన కేంద్రాలు కూడా నిర్వహణా లోపంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. షెడ్లు దెబ్బతిన్నాయి. వానపాముల ఎరువుల తయారీ కోసం నిర్మించిన తొట్టెలు పగుళ్లు ఏర్పడ్డాయి. వీటిచుట్టూ ఒప్పచెట్టు, పిచ్చిమొక్కలు పెరిగాయి. కొన్ని కేంద్రాలకు చెత్తను వేరుచేసేందుకు మంజూరు చేసిన యంత్రాలు నిరుపయోగంగా మారి తుప్పుపడుతున్నాయి.

◆ మండలంలో 86 మంది క్లాప్ మిత్రలు, డంపింగ్ యార్డు వద్ద పనిచేసేందుకు వీలుగా 20 మంది గ్రీన్‌గార్డులు ఉన్నా పంచాయతీల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. ఒక్క కేంద్రంలో కూడా వర్మీ ఎరువులు తయారు చేయడం లేదు. కొన్నిచోట్ల మొక్కుబడిగా సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించకుండా రహదారుల పక్కన పడేస్తున్నారు.

ఏపీ హాకీ ప్రతినిధిగా సుధీర్

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : చెన్నైలో జరుగుతున్న జూనియర్ ప్రపంచ కప్ హాకీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా దాసరి సుధీర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జి.సురేందర్, రైఫిల్ షూటింగ్ సంఘం నాయకుడు ఎంఎండీ బాషా, మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధి వాసుదేవరావు, వెయిట్ లిఫ్టింగ్ సంఘం కార్యదర్శి పాపా ఆయన్ను సన్మానించారు.

రౌడీషీటర్లకు మంత్రణం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసుస్టేషన్లలో సీఐలు, ఎస్సైలు ఆదివారం రౌడీషీటర్లకు మంత్రణం చేశారు. నేరాలకు పాల్పడితే ఎదురయ్యే పరిణామాలను వివరించి హెచ్చరికలు జారీ చేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కర్నూలు సచివాలయం : అశోక్‌నగర్ పంప్‌హౌస్ సమీపంలో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతిగృహానికి ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురారి శంకరప్ప, రాయపాటి శ్రీనివాస్, విశ్రాంత డీఎస్పీ ఆదివారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

షెడ్యూలు

[illegible] స్థలములో నిర్మించిన నెం.46/1-L-J-57, నంబరు ఇల్లుకు చెక్కుబంది.

తూర్పు: 61 నెం.ప్లాటు స్థలము, **పడమర:** ప్లాను దాఖలా రోడ్డు, **ఉత్తరం:** 58, 59 నెం.లు గల ప్లాట్ల స్థలము, **దక్షిణం:** 56 నెం. ప్లాటు స్థలము.

తూర్పు-పడమర: 48 అడుగులు, **ఉత్తరం- దక్షిణం:** 30 అడుగులు

విస్తీర్ణం: 1440 చ॥అ॥లు లేదా 160 చ॥గ॥లు

Sd/- S.SANDEEP KUMAR, Advocate
Kurnool. Cell: 72878 93352.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విత్తన చట్టం, విద్యుత్తు చట్టం తీసుకొచ్చి రైతులు, ప్రజలపై భారం మోపాలని చూస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రైతు కూలీ సంగం నాయకులు బొల్లవరం వెంకటస్వామి, పోతుల శేఖర్ తెలిపారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 8న నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : అంగన్‌వాడీల వేతనాలను పీఆర్‌సీకి అనుసంధానం చేయాలని.. జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని ఇతర సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 12న సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపునిచ్చినట్లు నాయకులు సుబ్బరావమ్మ, లలితమ్మ, వి.ఆర్.జ్యోతులు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : 104 సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం అశోక్‌నగర్, పాలకొట్టాల, లేబర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కరపత్రాలను పంచుతూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు రాముడు, నరసింహులు, నగేష్ తెలిపారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ నగరం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ప్రజల సహకారంతోనే స్వచ్ఛ, హరిత నగరం సాధ్యమవుతుందని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం పేర్కొన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి నగరపాలక కార్యకలాపాలకు వినియోగించుకునే విధానాన్ని ఈనెల 14వ తేదీ నుంచి పునఃప్రారంభిస్తామన్నారు. రహదారులపై పశువుల సంచారాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వాటి కారణంగా ఎవరికైనా ప్రమాదాలు జరిగితే యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని ఎస్బీఐ కాలనీలో ఉన్న నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలపై వినతులు ఇస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : నగరంలోని ఎస్‌పీజీ మైదానంలో ఉన్న క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్‌కు స్వాగతం పలుకుతూ చిన్నారులు ఆదివారం నృత్య ప్రదర్శన చేశారు. ముందుగా పాస్టర్ మేకల రాజేంద్ర క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ శారద తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999- 2000 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం కల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక వేదికపైకి చేరి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

అభివృద్ధి చూసి ఓర్వలేకనే ఆరోపణలు

ఓర్వకల్లు న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైకాపా నాయకులు ఆరోపణలు చేస్తున్నారని తెదేపా మండల కన్వీనర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. ఓర్వకల్లులో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి యువతా మేలుకో కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆధ్వర్యంలో మండలంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైకాపా హయాంలో దాడులు, దౌర్జన్యాలతో అట్టుడికిపోయిన గ్రామాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశాంతత నెలకొందన్నారు. తెదేపా సీనియర్ నాయకుడు సుధాకరరెడ్డి, మండల మాజీ కన్వీనర్ గోవిందరెడ్డి, ఆర్‌యూ జేఏసీ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, సుధాకరరావు, నాగేశ్వరరెడ్డి, విజయుడు, లక్ష్మీకాంతారెడ్డి, పెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల్లోకి ఇతర కులాలను చేరిస్తే అడ్డుకుంటాం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేరిస్తే అడ్డుకుంటామని గోర్ బంజారా జేఏసీ నాయకులు హెచ్చరించారు. నగరంలోని డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం గోర్ బంజారా సంఘం సమావేశం జరిగింది. రాష్ట్ర నాయకుడు కైలాష్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉద్యోగాల్లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాయలసీమలో ఎంతో అభివృద్ధి చెంది రాజకీయంగా పదవులు అనుభవిస్తున్న వారిని ఎస్టీ జాబితాలో చేరిస్తే ఒప్పుకొనే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బద్దునాయక్, నాగరాజునాయక్, రంగనాయక్, సీమకృష్ణ, సోమ్లానాయక్, సేవాలాల్ నాయక్, జైరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కైలాష్‌నాయక్

నగరంలో మంత్రి పర్యటన నేడు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ సోమవారం కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను ప్రారంభించనున్నారు. 11 గంటలకు బి.క్యాంపులో బీసీ భవన్, కాపు భవన్‌ల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు.

శాలివాహనులకు ఎక్కువ సీట్లు కేటాయించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : శాలివాహన కులస్థులకు వచ్చే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కేటాయించాలని కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య రాజకీయ పార్టీలను కోరారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సంఘం జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కేసీ నాగన్న, ప్రధాన కార్యదర్శిగా కె.రమేష్, కోశాధికారిగా వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా విశ్వనాథ్, నగర అధ్యక్షుడి మధు ప్రమాణం చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

వీరశైవుల అభ్యున్నతికి కృషి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : వీరశైవుల అభ్యున్నతికి కృషి చేస్తామని వీరశైవ అభ్యుదయ సమాజం నగర నూతన అధ్యక్షుడు యాసం నవీన్‌కుమార్ చెప్పారు. కర్నూలులో ఆదివారం సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా యాసం నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా విజయకుమార్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వీరశైవ అభ్యుదయ సమాజం కార్యవర్గ సభ్యులతో నగర అధ్యక్షుడు నవీన్‌కుమార్

తెలుగు సినీరంగంలో మేటి నటి సావిత్రి

ఇంద్రజాలికుడు శివశంకర్‌ను సత్కరిస్తున్న డీఈవో శామ్యూల్‌పాల్

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : అద్భుతమైన నటనతో తెలుగు సినీ రంగంలో మేటి నటిగా సావిత్రి ఖ్యాతిగాంచారని డీఈవో శామ్యూల్‌పాల్ పేర్కొన్నారు. నటి సావిత్రి జయంతిని పురస్కరించుకుని స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి శివశంకర్ ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ పాఠశాల వార్షికోత్సవాలు, ప్రత్యేక దినాల్లో ఇంద్రజాల ప్రదర్శనల నిర్వహణకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం డీఈవో, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఇనాయతుల్లా తదితరులు శివశంకర్‌ను సత్కరించారు.

అధ్యక్ష ఎన్నికపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వై.నాగేశ్వరరావు ఎన్నిక చెల్లదని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడి పదవీకాలం గతేడాది ఆగస్టుకే ముగిసిందన్నారు. 15 నెలల తర్వాత, ఎన్నికల షెడ్యూల్ ఇవ్వకుండా అధ్యక్ష ఎన్నిక ఎలా నిర్వహిస్తారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రూ.కోట్లలో సంఘం నిధుల ఖర్చుల వివరాలు తెలపలేదని, దీనిపై పూర్వ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ విచారణ పూర్తవకుండానే సంఘ అధ్యక్ష ఎన్నిక ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. దొంగచాటుగా అధ్యక్ష ఎన్నిక నిర్వహించుకొని తనంతట తానే సంఘం అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారని ఆరోపించారు. దీనిపై సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

గుంతల దారులు.. అడుగేయాలంటే గుబులు

అమీన్ అబ్బాస్‌నగర్ ప్రధాన రహదారిపై గుంత

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలోని పలు కాలనీల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. సీసీ రహదారులు ఛిద్రమయ్యాయి. రూ.కోట్ల వ్యయంతో నిర్మించినవి ప్రయాణానికి కొరగాకుండాపోయాయి. ఏళ్ల కిందట నిర్మించిన సీసీ రోడ్లు ఎటుచూసినా గుంతలమయం అయ్యాయి. కొన్ని కాలనీల్లో పైపులైన్ల పనుల కోసం రోడ్లను మధ్యలో తవ్వారు. వాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే మార్గాల్లో దెబ్బతిన్న రోడ్లపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరపాలక అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మొక్కుబడి మరమ్మతులు

నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో 500 కి.మీ మేర సీసీ రోడ్లు నిర్మించారు. నాసిరకం పనుల వల్ల వీటిలో చాలా రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. దారి పొడవునా పగుళ్లు చీలి గుంతలమయం అయ్యాయి. వీటి మరమ్మతుల కోసం ఏడాది కాలంలో రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారు. గుంతలను కాంక్రీటు మిశ్రమంతో పూడ్చి వదిలేశారు. క్యూరింగ్ చేయకపోవడంతో కొన్నాళ్లకే కాంక్రీటు పోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి.

బాలాజీనగర్‌లో స్టేట్‌బ్యాంకు పక్కన తవ్వి వదిలేశారిలా..

ఎటుచూసినా అధ్వానమే..

వెంకటరమణ కాలనీ పరిధిలోని రైతుబజార్‌కు సమీపంలో, అమీన్‌అబ్బాస్ నగర్‌లోని సాయిబాబా ఆలయం మీదుగా వెళ్లే రహదారిలో మొత్తం గుంతలతో నిండిపోయింది. ఎప్పుడూ రద్దీగా ఉండే నాలుగు రోడ్ల కూడలిలో దారి ఛిద్రం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

◆ బాలాజీనగర్ పరిధిలోని స్టేట్‌బ్యాంకు పక్కన ప్రధాన రహదారిని తవ్వి వేగ నిరోధకం ఏర్పాటు చేశారు. స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో దానిని తొలగించారు. గుంతను పూడ్చకుండా వదిలేశారు. పలు కాలనీల్లో పైపులైన్ల ఏర్పాటు, మరమ్మతుల పేరుతో సీసీరోడ్లను తవ్వి వదిలేయడంతో స్థానికులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు.

◆ ఆనంద్ థియేటర్ నుంచి కోట్ల ఘాట్ మీదుగా వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు వేసిన ఆరు నెలల్లోపే పైపులైను కోసం తవ్వి సరిగా మరమ్మతులు చేయకపోవడంతో గుంతలు ఏర్పడి ప్రయాణం సాగడం లేదు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. కార్యవర్గ సభ్యుల ఆమోదంతో నాగేశ్వరరావు మూడోసారి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించి ఎన్జీవో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.జవహర్‌లాల్ నియామక పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు, రాష్ట్ర నాయకులు పాపారావు, జిల్లా నాయకులు పి.రామకృష్ణారెడ్డి, హంస సంఘం జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు వెంకోబ తదితరులు ఆయన్ను సత్కరించారు.



నాగేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న జవహర్‌లాల్, తదితరులు

(c) eenadu

పంటకు తెగులు.. పెట్టుబడులు నేలపాలు

అమడాలలో దెబ్బతిన్న పంటను దున్నేసిన రైతు

ఉమ్మడి రైతును కష్టాలు వెంటాడుతున్నాయి. ఏటా దిగుబడులు వచ్చే సమయంలో భారీ వర్షాలు పడటం.. ధర పతనమవడం.. మరోవైపు తెగుళ్లు సోకడంతో పంటను దున్నేస్తున్నారు. జిల్లాలో గతేడాది 25 వేల ఎకరాల్లో రైతులు మిరప సాగు చేయగా.. ఈఏడు రబీ సీజన్‌లో 12 వేల ఎకరాలకు పడిపోయింది. గతంలో ధర బాగా ఉండటంతో ఎక్కువ మంది మిరప సాగుకు ఆసక్తి చూపారు. పలితంగా సాగు విస్తీర్ణం పెరిగింది. పెట్టుబడులు పెరిగిపోవడం.. ధరలు క్రమంగా పతనమవడంతో చాలామంది మొక్కజొన్న, మినుము తదితర పంటల వైపు మొగ్గు చూపారు. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

తేమ శాతం పెరిగి..

గత నెలలో మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. మిరప పంటలో పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. భూమిలో తేమ శాతం పెరగడంతో మొక్క కుళ్లిపోతోంది. తెగుళ్ల కారణంగా ఆకులు ముడుచుకుపోయి పెరుగుదల లేక క్రమంగా ఎండిపోతోంది. ప్రస్తుతం మిరప.. పూత, కాయ దశలో ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. పంట ఎండిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి చేయిదాటుతుండటంతో కోవెలకుంట్ల మండల పరిధిలోని లింగాలలో 50, అమడాల గ్రామంలో 30 ఎకరాల్లో పంటను ట్రాక్టరుతో దున్నేశారు.

1.5 ఎకరాల్లో దున్నేశా – అల్లాబకాష్, లింగాల

నేను 1.5 ఎకరాల్లో మిరప సాగు చేశా. పంట ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుని కాయలు కాస్తున్న సమయంలో భారీ వర్షాలు కురిశాయి. ఆకులు ముడుచుకుపోయి ఎదుగుదల లేకపోవడంతో మొత్తం దున్నేశా. నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

ఉన్నత విద్యకు ఆసరా

పీజీలో చేరేందుకు అవకాశం

వర్సిటీల పరిధిలో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు	
విశ్వవిద్యాలయం	సీట్లు
రాయలసీమ	426
అబ్దుల్ హక్ ఉర్దూ	231
క్లస్టర్	325

డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చర్యలు చేపట్టింది. పీజీ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గతంలో పీజీలో చేరాలంటే తప్పనిసరిగా పీజీ సెట్ రాయాల్సి వచ్చేది. ఇందులో మంచి ర్యాంకు సాధించిన వారికి కోరుకున్న సీటు లభించేది. ర్యాంకు రాని అభ్యర్థులు నిరాశ చెందేవారు. ఈ క్రమంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ, ఎంఏ, ఎంకాంలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది పీజీ సెట్‌కు సంబంధించి సడలింపు ఇవ్వడంతోపాటు అర్హులైన అభ్యర్థులు పీజీ చేసేందుకు అవకాశం లభించింది. ఈ మేరకు ప్రకటన వెలువడింది. జిల్లాలోని వర్సిటీల పరిధిలో సీట్ల వివరాలు.. ఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటి పీజీ వివరాలను ఉన్నత విద్యామండలి వెల్లడించింది. పీజీ సెట్‌లో అర్హత సాధించినా.. సాధించకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వర్సిటీల పరిధిలో మొత్తం 982 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాయలసీమ, డా.అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయాల పరిధిలో 10వ తేదీ వరకు, క్లస్టర్ వర్సిటీ పరిధిలో 12వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుంది. అభ్యర్థులు నేరుగా దరఖాస్తు చేసుకుని పత్రాల పరిశీలన చేసుకోవాల్సి ఉంటుంది. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య

పడగొట్టారు.. విడగొట్టారు

సూపర్‌ప్యాసేజ్ నిర్మాణాల్లో జాప్యం ● కేసీ ఆయకట్టుకు అందని నీరు

కేసీ కాల్వ కింద రెండు పంటలు పండించుకునే రైతులకు విస్తరణ పనులు ఆటంకంగా మారాయి.. గుత్తేదారుల స్వార్థం వారికి శాపంగా మారింది. సుమారు రెండు దశాబ్దాలవుతున్నా పనులు పూర్తికాకపోవడం. . సూపర్ ప్యాసేజ్ పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు.
– న్యూస్‌టుడే, పాణ్యం, నందికొట్కూరు

తలముడిపి చెరువుకు నీరందించే సూపర్ ప్యాసేజ్ అసంపూర్తిగా..

డీజిల్ ఇంజిన్లతో ఆర్థిక భారం

పాములపాడు, వెలుగోడు, జూపాడు బంగ్లా మండలాల పరిధిలో సుమారు 15 సూపర్‌ప్యాసేజ్‌లను కూలగొట్టి వదిలేశారు. పంట పొలాలకు నీరందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని.. డీజిల్ ఇంజిన్లతో మళ్లించుకోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

● తలముడిపి చెరువుకు సుద్దగుండాల, గన్నేరు వంకల ద్వారా నీరు వచ్చేది. ఎస్సార్బీసీ నిర్మాణ సమయంలో వాటిపై సూపర్‌ప్యాసేజ్‌లు నిర్మించి చెరువుకు నీరందించేవారు. ఎస్సార్బీసీ విస్తరణ సమయంలో రెండు సూపర్‌ప్యాసేజ్‌లను తొలగించారు. నేటికీ పనులు పూర్తి చేయలేదు. నీరు లేకపోవడంతో గత ఐదేళ్లుగా చెరువు ఎండిపోయింది.

కూల్చేసి.. నిర్లక్ష్యం చేసి

భూమికి 50 అడుగుల లోతులో ఎస్సార్బీసీ ఉంది. ఈ కాలువ నిర్మాణం నేపథ్యంలో కేసీ కాల్వ కింద ఉన్న పంట పొలాలు రెండు భాగాలుగా విడిపోయాయి. ఎస్సార్బీసీ అవతలివైపునున్న కేసీ ఆయకట్టుకు నీరు అందేందుకు సూపర్ ప్యాసేజ్‌లు నిర్మించారు. 2006లో విస్తరణ పనుల్లో వీటిని కూల్చేశారు. నేటికీ పనులు మాత్రం చేపట్టలేదు.

పనులు ముందుకు సాగక..

ఎస్సార్బీసీ ప్రధాన కాల్వను మొదట్లో 7 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మించారు. 2006లో 22 వేల క్యూసెక్కులు ప్రవహించేలా రూ.450 కోట్లతో పనులు చేపట్టారు. బనకచర్ల నుంచి గోరుకల్లు జలాశయం వరకు చేపట్టిన పనులు నేటికీ పూర్తి కాలేదు. 2022లో 34 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో రూ.500 కోట్లతో మరోసారి పనులు ప్రారంభించారు. మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించారు. 25వ ప్యాకేజీలో భాగంగా 1-26 కి.మీ. ల మేర కాల్వ పనులను ఇప్పటివరకు చేపట్టలేదు. 26వ ప్యాకేజీలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇప్పటికీ 20 శాతం కూడా పూర్తికాలేదు.

వాసాపురం.. భక్తుల దివ్యధామం

● రూ.4.50 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం

నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి 2 కి.మీ. దూరంలో.. అప్పనపల్లె రహదారి సమీపంలో మండల్ల కొండల వరకు వాసాపురం గ్రామం ఉండేది. వరదల కారణంగా గ్రామస్థులందరూ సమీప గ్రామాల్లోకి చేరుకోవడంతో ఆలయం బీడుగా మారింది. గ్రామంలో వెలసిన ఏళ్ల కిందట నిర్మించిన వాసాపురం వెంకటేశ్వరస్వామి గుడి శిథిలావస్థకు చేరింది. భక్తులు మాత్రం నిత్యం దర్శనానికి వచ్చేవారు. క్రమక్రమంగా రద్దీ పెరగడంతో కొండమాయపల్లె, రుద్రవరం గ్రామస్థులు కలిసి 2016లో ఆలయ పునరుద్ధరణకు నడుం బిగించారు. నంద్యాల, ఆళ్లగడ్డ పట్టణాలకు చెందిన పలువురు దాతలు ముందుకొచ్చారు. మొత్తం రూ.4.50 కోట్ల విరాళాలు సేకరించి 2020లో ఆలయాన్ని పునర్నిర్మించారు. 2022లో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. వేంకటేశ్వరస్వామి, ఈశ్వర ఆలయాలతో పాటు నవగ్రహ, నాగ, ఆంజనేయ, వినాయక తదితర విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రతి శనివారం సుమారు వెయ్యి మంది భక్తులు కాలినడకన సమీప గ్రామాల నుంచి తరలి వస్తుంటారు. ఏటా ఆలయ వార్షికోత్సవం, వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, రుద్రవరం, ఆళ్లగడ్డ

కత్తి దూసి.. పతకాలు పట్టి

● ఫెన్సింగ్‌లో రంగసాయి ఈశ్వర్ ప్రతిభ

నంద్యాల పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన రంగసాయి ఈశ్వర్ ఫెన్సింగ్‌లో సత్తా చాటుతున్నాడు. 9వ తరగతి చదువుతున్న అతను చిన్ననాటి నుంచే ఫెన్సింగ్‌పై దృష్టి సారించాడు. దీనిని గమనించిన తల్లిదండ్రులు ప్రోత్సహించడం ప్రారంభించారు. గత ఏడేళ్లుగా ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ కఠోర సాధన చేస్తున్నాడు. పలు పోటీల్లో పాల్గొని పతకాలు అందుకున్నాడు.

● 2023 డిసెంబరులో నంద్యాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో వెండి పతకం సాధించాడు. గతేడాది అక్టోబరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో బంగారు పతకం అందుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో ఒడిశాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 38వ స్థానంలో నిలవడం విశేషం. జులైలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి పతకంతో మెరిశాడు. సెప్టెంబరులో మణిపుర్‌లో జరిగిన జాతీయస్థాయి స్థాయిలో 61వ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చెప్పాడు. పతకాలు సాధించడమే ధ్యేయంగా నిరంతరం సాధన చేస్తున్నట్లు పేర్కొన్నాడు. – న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏదశలో ఉందో తెలుసుకునేందుకు బాధితులు ఆన్‌లైన్ ద్వారాగానీ.. టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

స్టీరింగ్ పట్టించి.. ఉపాధి చూపించి

నంద్యాల మండల పరిధిలోని మిట్నాల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ ఆర్టీసీ హెవీ మోటారు డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్‌లో 22వ బ్యాచ్‌లో శిక్షణ పొందాడు. ప్రస్తుతం హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో డ్రైవర్‌గా పనిచేస్తూ నెలకు రూ.30 వేలు సంపాదిస్తున్నాడు.

బస్సులు నడపడంలో అవసరమైన శిక్షణను ఆర్టీసీ శిక్షణ సంస్థ ఇస్తోంది. దీనిద్వారా ఆర్టీసీ (ప్రజా రవాణా సంస్థ)కు ఆదాయం సమకూరుతుండగా.. మరోవైపు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కర్నూలు జిల్లా పరిధిలో 19, నంద్యాల జిల్లా పరిధిలో 29వ బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

శిక్షణ కాలం	32 రోజులు
అర్హత వయస్సు	20 ఏళ్లు
ఫీజు	రూ. 23,600
శిక్షణ తీసుకున్నవారు	724

శిక్షణ పూర్తి చేసుకున్న యువకులు

724 మందికి శిక్షణ

చోదక రంగంలో స్థిరపడాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఏడాది అయి ఉండాలి. తగిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బ్యాచ్‌కు 16 మంది చొప్పున ఇప్పటివరకు శిక్షణ ఇచ్చారు. వీరిలో సుమారు 700 మంది వివిధ రంగాలు, కంపెనీల్లో చోదకులుగా ఉద్యోగాలు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి
– మాధవీలత, డీఎం, నంద్యాల

ఆర్టీసీ ద్వారా అందించే డ్రైవింగ్ శిక్షణను అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. నంద్యాల ఆర్టీసీ డిపో పరిధిలో 28 బ్యాచ్‌లకు శిక్షణ అందించాం. ప్రస్తుతం 29వ బ్యాచ్‌కు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వెంటనే ఉపాధి లభిస్తుంది.

వివిధ అంశాలపై తర్ఫీదు

32 రోజులపాటు శిక్షణ కాలంలో 16 పనిదినాల చొప్పున థియరీ (బోధన), ప్రాక్టికల్స్ రూపంలో శిక్షణ తరగతులు ఉంటాయి. వాహనాల విడి భాగాలు, వాటి పని విధానం, ప్రమాదాల నివారణ చర్యలు, ఇంధన పొదుపు, రహదారి సూచికలు తదితర అంశాలపై సుశిక్షితులైన నిపుణులతో తరగతులు నిర్వహిస్తారు. అనంతరం బస్సు నడిపే విధానంపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఉంటుంది. బస్సులోని విడిభాగాల్లో తలెత్తే సమస్యలు, వాటి లోపాలు.. పరిష్కార మార్గాలను వివరించి తర్ఫీదు ఇస్తారు. అనంతరం అభ్యర్థులకు ధ్రువపత్రం అందిస్తారు. రవాణా శాఖ ద్వారా డ్రైవింగ్ లైసెన్సు పొందేందుకు అవకాశం కల్పిస్తారు. దీనిద్వారా సులువుగా ఉపాధి పొందొచ్చు. ఆసక్తిగలవారు కర్నూలు, నంద్యాల డిపోల పరిధిలోని హెవీ మోటారు డ్రైవింగ్ స్కూల్‌ను సంప్రదించొచ్చు.

పట్టించుకోకుంటే కట్టమే

హంద్రీనీవా కాలువ విస్తరణతోపాటు లైనింగ్‌కు ప్రభుత్వం రూ.696 కోట్లు మంజూరు చేసింది. బ్రాహ్మణకొట్కూరు-గార్గేయపురం మధ్యలో లైనింగ్ చేయకపోవడంతో నీటి ఉధృతికి మట్టి కట్ట దెబ్బతింటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

ఓ పట్టాన మాట వినరు

బేతంచెర్ల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం వంతెనలు నిర్మించారు. జనం మాత్రం ప్రమాదకరంగా రైలు పట్టాలను దాటుతున్నారు. ప్రయాణికులు ఇకనైనా స్పందించి వంతెనలను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది.
– న్యూస్‌టుడే, బేతంచెర్ల

సాయం అందక.. అరక సాగక

● వేలాది మంది రైతులకు పథకం దూరం

– న్యూస్‌టుడే, కర్నూలు వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పెట్టుబడి సాయం అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందుతున్నా సరే కేంద్రం సాయానికి దూరమయ్యారు. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు అర్హత బదిలీ (డెత్ మ్యుటేషన్) చేపట్టి పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని.. ఎన్‌పీసీఐలో వినియోగంలో లేని ఖాతాలను తిరిగి పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఏళ్లుగా ఎదురుచూపులే..

2019 ఫిబ్రవరి 28 నాటికి పట్టాదారు పాసు పుస్తకాలు ఉండి.. వెబ్‌ల్యాండ్ ఆన్‌లైన్ అడంగల్‌లో ఉన్నవారు మాత్రమే పీఎం కిసాన్ పథకానికి అర్హులు. కాగా కొత్తగా వెబ్‌ల్యాండ్‌లో నమోదైన పట్టాదారులకు ఏళ్లు గడుస్తున్నా పీఎం కిసాన్ పథకం రైతులకు అందకుండా పోయింది.

రూ.27.92 కోట్లు కోల్పోయారు

ఉమ్మడి జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులై ఉండీ పీఎం కిసాన్ అందని రైతులు 69,809 మంది ఉన్నారు. ఈ పథకం కింద ఒక్కో విడతలో రూ.2 వేలు అందుతుంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లా రైతులు ఒక్కో విడతలో రూ.13.96 కోట్లు చొప్పున రెండు విడతల్లో మొత్తం రూ.27.92 కోట్ల పెట్టుబడి సాయం కోల్పోయారు. కర్నూలులో రూ.18.86 కోట్లు, నంద్యాల జిల్లా రైతులకు రూ.9.06 కోట్లు అందకుండాపోయింది.

సమన్వయ లోపమే శాపం

● జిల్లాలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో అన్నదాతలు నష్టపోతున్నారు.

● వెబ్‌ల్యాండ్‌లో ఆధార్, చరవాణి నంబర్లు తప్పుగా నమోదవడం.. పేర్లలో తప్పులు రావడంతో ఉమ్మడి జిల్లాలో 18,666 మంది రైతులు పథకానికి దూరమయ్యారు.

● అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యుటేషన్ చేయాలి. ఈ విషయంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం వహించింది. వ్యవసాయశాఖ దృష్టి పెట్టలేదు. రెండు శాఖల సమన్వయ లోపంతో ఉమ్మడి జిల్లాలో 27,170 మందికి సాయం అందలేదు.

గత నెలలో రెండో విడత పెట్టుబడి సాయం వివరాలు			
జిల్లా	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్ లబ్ధిదారులు	పీఎం కిసాన్‌కు దూరమైనవారు
కర్నూలు	2,72,757	2,25,600	47,157
నంద్యాల	2,06,052	1,83,400	22,652

లోడు పెంచుకో.. రాయితీ అందుకో

● నెలాఖరుతో ముగియనున్న గడువు

వినియోగదారులు తాము వాడుతున్న విద్యుత్తు వినియోగాన్ని బట్టి వివిధ స్లాబుల్లోకి మారిపోతుంటారు. వాస్తవానికి కొత్తగా మీటరు ఏర్పాటు చేసుకునే సమయంలో ఒక కిలో వాట్ సామర్థ్యంతో బిగించుకుంటారు. ఉపకరణాల సంఖ్య పెరిగిపోయేకొద్దీ లోడు పెరిగి ఇతర స్లాబ్‌లోకి మారిపోతుంటారు.
– న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

రాయితీ వివరాలు ఇలా.. (రూ.లలో)					
కిలోవాట్	దరఖాస్తు రుసుం	డిపాజిట్	రాయితీ లేకుండా..	రాయితీతో	చెల్లించాల్సిన మొత్తం
1-2	50	200	2,000	1,000	1,250
1-3	50	400	4,000	2,000	2,450
1-4	50	600	6,000	3,000	3,650
1-5	50	800	8,000	4,000	4,850

అవకాశమిచ్చి..

● గతంలో లోడు పెంచుకోవాలంటే ఒక కిలోవాట్‌కు రూ.2 వేలు చెల్లించాల్సి వచ్చేది. దీనికితోడు దరఖాస్తు రుసుం రూ.50, డిపాజిట్ రూ.200 చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వం లోడు పెంచుకునే విద్యుత్తు వినియోగదారుల కోసం రాయితీ అందజేస్తోంది.

● గతంలో మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30 వరకు డెవలప్‌మెంటు ఛార్జీల్లో 50 శాతం రాయితీ ఇచ్చింది. మరోసారి అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం లోడు పెంచుకునేవారి సౌకర్యార్థం ఈనెల 31వ తేదీ వరకు సమయం ఇచ్చింది.

● వినియోగదారులు మీసేవ కేంద్రాల ద్వారాగానీ.. ఏపీఎస్పీడీసీఎల్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంటికి దీపం.. పంటకు నేస్తం

● కుటుంబాన్ని నడిపిస్తున్న లక్ష్మి

కొండంత అండగా ఉండే భర్త అనారోగ్యంతో మంచానికి పరిమితమైనా ఆమె కుంగిపోలేదు. ఇంటి కోసం అహర్నిశలు కష్టపడటం ప్రారంభించారు. ఒకపక్క భర్త బాగోగులు చూసుకుంటూ.. మరోవైపు వ్యవసాయ చేస్తూ పిల్లలను కష్టపడి చదివించారు. నూర్పిడి యంత్రం నిర్వహిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.. ఆమే ఎర్రబాడు గ్రామానికి చెందిన లక్ష్మి.

భర్తకు అన్నం తినిపిస్తున్న లక్ష్మి

●గోనెగండ్ల మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన సోమన్న, లక్ష్మి దంపతులది వ్యవసాయ ఆధారిత కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు.. ఇద్దరు కుమార్తెలు. మూడెకరాల పొలం ఉంది. సోమన్నకు ఎనిమిదేళ్ల కిందట మూర్ఛతో మంచానికే పరిమితమయ్యారు. అప్పటి నుంచి ఇంటి భారమంతా లక్ష్మిపై పడింది. కష్టపడి కుమారులకు మంచి చదువులు చెప్పించాలన్న భర్త కోరికను ఆమె గుర్తు చేసుకుంది. వ్యవసాయ పనులు చేసుకుంటూ చదివించడం ప్రారంభించింది. పెద్ద కుమారుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు డిగ్రీ చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేశారు.

నూర్పిడి యంత్రంతో లాభాలు

గ్రామ పరిధిలోని మరో మూడెకరాల దేవాలయ భూమిని రూ.70 వేలు కౌలుకు తీసుకున్నారు. పంటలు సాగు చేసి రూ.లక్ష వరకు సంపాదించారు. రైతులు పండించిన ఆముదం పంటను నూర్పిడి చేయడం ద్వారా రూ.లక్ష వరకు ఆర్జించారు. తన భర్తకు రూ.10 వేల పింఛను మంజూరు చేస్తే కుటుంబ పోషణకు ఆసరాగా ఉంటుందని ఆమె పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, గోనెగండ్ల

అక్రమాలు కనబడితే ఒట్టు

ఎయిడెడ్ పాఠశాలల ఇష్టారాజ్యం ● దృష్టి సారించని విద్యాశాఖ అధికారులు

విద్యార్థులేరీ..

ఈ చిత్రంలోనిది.. ఆళ్లగడ్డ పట్టణంలోని మక్దుమ్ ఎయిడెడ్ ఉర్దూ పాఠశాల. ఇక్కడ ఒక విద్యార్థి కూడా లేరు. ఉపాధ్యాయులు ఇద్దరున్నారు. గతేడాది నుంచి ఒక్క విద్యార్థి కూడా రావడం లేదు. దస్త్రాల్లో మాత్రం ముగ్గురు ఉన్నట్లు చూపుతున్నారు. ఉపాధ్యాయులు రోజూ రావడం.. రిజిస్టరులో సంతకం చేసి వెళ్లడం సాధారణంగా మారింది.

దస్త్రాల్లో మాత్రం పాఠశాలల వివరాలు కనపడుతాయి. విద్యార్థులు చదువుకుంటున్నట్లు చూపుతారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వెతికి చూసినా ఒక్క విద్యార్థి కూడా ఉండడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎయిడెడ్ పాఠశాలల పరిస్థితి ఇది. వీటిని నిత్యం తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

దస్త్రాల్లో అన్నీ బాగున్నట్లు..

నంద్యాల జిల్లాలో 47 ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా ఇందులో 15 ఉన్నత విద్యాలయాలున్నాయి. కర్నూలు జిల్లాలో 38 పాఠశాలలు ఉండగా.. ఇందులో 14 ఉన్నత బడులు ఉన్నాయి. రెండు జిల్లాల్లో కొన్ని ఎయిడెడ్ పాఠశాలలు అంతంతమాత్రంగా నడుస్తున్నాయి. నిర్వాహకులు కనిపించరు. విద్యార్థులు అసలే రారు. విద్యాశాఖ దస్త్రాల్లో మాత్రం పాఠశాలలు రోజూ నడుస్తున్నట్లే 'లెక్క'.

ప్రత్యేక కమిటీల ఏర్పాటు

ఉమ్మడి జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల తనిఖీలకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కమిటీలు వేసింది. ప్రస్తుతమున్న విద్యార్థుల సంఖ్య ఎంత? ఎన్ని పోస్టులు ఉన్నాయి? ఎలాంటి సదుపాయాలున్నాయి తదితర వివరాలను కమిటీలు పర్యవేక్షించనున్నాయి. పిల్లల సంఖ్య ఆధారంగా కొత్త ఉపాధ్యాయుల అవసరం ఉందా? లేదా? కూడా తనిఖీ చేయనున్నాయి.

అంతా బోగస్

ఉమ్మడి జిల్లాలో పలు ఎయిడెడ్ పాఠశాలలు బోగస్ హాజరు నమోదుతో నడుస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని రుద్రవరం, శిరివెళ్ల, జిల్లెల్ల గ్రామాల్లోని ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు లేరు. లేని హాజరు చూపి పాఠశాల రద్దు కాకుండా.. ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలను కొన్ని యాజమాన్యాలు పొందుతున్నాయి. లేని విద్యార్థుల సంఖ్యను చూపి ఉపాధ్యాయులు, సిబ్బంది అవసరమంటూ పోస్టుల భర్తీకి కొన్ని యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. యూడైస్ ప్రకారం విద్యార్థుల సంఖ్యను నమోదు చేయాల్సిన అధికారులు తప్పుడు నివేదికలిచ్చారన్న ఆరోపణలున్నాయి.

స్వర్ణ రథంపై ఆదిదంపతులు

శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబాదేవి మల్లికార్జున స్వామి వార్లకు ఆదివారం స్వర్ణ రథోత్సవం నేత్రశోభితంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని వేకువజామున మల్లికార్జునస్వామివారికి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను స్వర్ణ రథంపై ఉంచి అర్చకులు మంగళహారతులు సమర్పించారు. దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తలు రమణ, దేవకి వెంకటేశ్వర్లు, అర్చకులు ఉత్సవమూర్తులకు కొబ్బరి కాయలు, కర్పూర హారతులు సమర్పించారు. వేలాది మంది భక్తుల జయజయధ్వానాల నడుమ స్వర్ణ రథోత్సవాన్ని గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు లాగారు. రథం ఎదుట కళాకారుల కోలాటాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

పడిపోతారు జాగ్రత్త!

వరి ధాన్యాన్ని ట్రాక్టర్లలో తీసుకెళ్లే క్రమంలో కొందరు సంచులపై కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. బనగానపల్లి శివారులో తప్పదన్నట్లు కొందరు కూలీలు ప్రమాదకరమని తెలిసినా ధాన్యం సంచులపై కూర్చొని ప్రయాణం చేస్తున్నారు. జాగ్రత్తలు పాటించక పోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. దీనిపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, బనగానపల్లి

మంచు కమ్ముకుంది.. ప్రయాణం సాగకుంది

రెండు రోజులుగా పొగమంచు దట్టంగా కమ్మేస్తోంది. ఉదయం 7 గంటలు దాటినా వెలుతురు లేక వాహనదారులు విద్యుద్దీపాల వెలుగులోనే ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం ఆదమరిచినా పొరపాట్లు జరిగే అవకాశాలు లేకపోలేదు. గుంతకల్లు-తుంగభద్ర అంతర్రాష్ట్ర రహదారుల్లో చిప్పగిరి ప్రాంతంలో శనివారం పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. మంచు కారణంగా కాపుకొచ్చిన పప్పుశనగ, పొద్దు తిరుగుడు, మిరప, ధనియాలు, మొక్కజొన్న పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, చిప్పగిరి

చెట్టుపై చల్లని ప్రేమ

నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలోని ఇంటి ఎదుట వేప చెట్టు ఏపుగా పెరిగింది. ఇంటి యజమానులు రేకుల షెడ్డు వేసుకొనే క్రమంలో చెట్టు అడ్డుగా ఉన్నప్పటికీ, పర్యావరణ స్పృహ, చెట్టుపై ప్రేమతో దాన్ని తొలగించలేదు. దాని ఎదుగుదలకు ఇబ్బంది లేకుండా చెట్టు చుట్టూ రేకులను కత్తిరించి షెడ్డు నిర్మించారు. దీంతో ఏపుగా పెరిగిన వేప చెట్టుతో ఇంటిపై చల్లగా ఉంటుంది. యజమానుల హరితస్ఫూర్తిని గ్రామంలోని ప్రజలు అభినందిస్తున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మట్టి కుప్పలు.. చూడకుంటే తిప్పలు

ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామం నుంచి అహోబిలం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మట్టి కుప్పలు వేశారు. బాచేపల్లెతండా నుంచి దొరికొట్టాల వరకు మట్టి కుప్పలను చదును చేయకుండా అలాగే వదిలేశారు. ఫలితంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక వరుస రోడ్డు కావడంతో వాహనాలు ఎదురుగా వచ్చినపుడు దాటే సమయంలో కుప్పలను ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు మట్టి కుప్పలను చదును చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం),

పీఆర్సీ కమిషన్ ప్రకటించాలి

మహానంది, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ వేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య డిమాండు చేశారు. నంద్యాలలో ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పదోతరగతి విద్యార్థుల కోసం నిర్వహించే వంద రోజుల ప్రణాళికల్లో వచ్చే సెలవులను మినహాయించాలన్నారు. మహానంది మండలం తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సరైన వసతులు కల్పించాలన్నారు. అనంతరం వారు మహానందిలో గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవత్సవ కరుణానిధిమూర్తి, కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎన్‌వీ కృష్ణారెడ్డి, బండిఆత్మకూరునాగిరెడ్డి, ఎన్‌వీ భాస్కరరెడ్డి, నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.రామమూర్తిరెడ్డి, నంద్యాల జిల్లా ప్రధానకార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఎస్‌ఎఫ్‌ఐ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. నూతన జిల్లా అధ్యక్షుడిగా సుధీర్, కార్యదర్శిగా ఎంఆర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రాజా, దినేష్, రేణుక, సహాయ కార్యదర్శులుగా హరివర్ధన్, శివకుమార్, హర్షతోపాటు 12 మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అతివల ప్రగతికి ఈ-నారీ

◆ పొదుపు సంఘాల్లో పారదర్శకతకు కృషి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తుండగా ఇప్పుడు ఈ-నారీ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. సంఘాల్లో పారదర్శకత, మహిళలకు జీవనోపాధుల కల్పన, ఆర్థిక అక్షరాస్యత తదితర అంశాలపై ఈ వ్యవస్థ అవగాహన కల్పిస్తుంది. ఆయా సంఘాల్లో డిగ్రీ చదివిన యువతులను 'ఈ-నారీ'లుగా ఎంపిక చేశారు. బ్యాంకింగ్, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చి పది సంఘాలకు ఒకరి చొప్పున నియమించారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ నుంచి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు ఈ నారీలకు నంద్యాల జిల్లాలో నవంబరు నెలలో శిక్షణ ఇచ్చారు.

నంద్యాల జిల్లాలో..

మండలాలు	: 29
సంఘం సభ్యులు	:39,000
ఈ-నారీలు	: 3,060

మన డబ్బులు-మన లెక్కలు

గ్రామాల్లో వెలుగు గ్రూపులను సీపీలు పర్యవేక్షించేవారు. ఇకపై ఈ బాధ్యతలను ఈ-నారీలుగా ఎంపికైన వారికి అప్పగిస్తారు. సంఘాల్లో సభ్యురాళ్ల పొదుపు చేయడం, రుణాలు సకాలంలో చెల్లించడం, రికార్డులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించేలా చూస్తారు. 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్ ద్వారా సంఘాల ఆర్థిక లావాదేవీలను ప్రతినెలా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుంది.

వీరి విధులు

◆ జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో ఈ-నారీల ఎంపికలు జరిగాయి. 10 సంఘాలకు ఒకరిని నియమించారు.

◆ వీరు సంఘాల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

◆ సభ్యురాలు తీసుకున్న రుణం సకాలంలో చెల్లించేలా చూస్తారు.

◆ కొత్తగా జీవనోపాధులు పొందాలనుకునే వారికి ఏఏ పథకాల ద్వారా రుణాలు అందుబాటులో ఉన్నాయో వివరిస్తారు.

◆ ఈ-నారీలకు గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

ఆత్మకూరులో ఈ-నారీ శిక్షణకు హాజరైన మహిళలు

మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశం

- శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

పొదుపు సంఘాలను సమర్థంగా నిర్వహించడానికి ఈ-నారీ వ్యవస్థ ఉపయోగపడుతుంది. 'మన డబ్బులు-మన లెక్కలు' అనే యాప్ ద్వారా సంఘాల ఆర్థిక లావాదేవీలను వీరు యాప్‌లో అప్‌గ్రేడ్ చేస్తారు. దీంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశం ఉంది.

ఓంకారంలో న్యాయమూర్తి పూజలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల అటవీప్రాంతంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో నంద్యాల డివిజన్ సీనియర్ ప్రిన్సిపల్ న్యాయమూర్తి తంగమణి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దర్శనార్థం వచ్చిన న్యాయమూర్తికి ఆలయ ఛైర్మన్ అల్లే చెన్నారెడ్డి, ఈవో నాగప్రసాద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి గంగాఉమాసమేత సిద్ధేశ్వరస్వామి అమ్మవార్లకు, పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. దేవస్థానం తరుపున న్యాయమూర్తిని సన్మానించారు.

న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పూజారులు

అహోబిలం సీఏవోగా రామానుజన్

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయం సీఏవో(చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా వి.ఎల్.రామానుజన్ నియమితులయ్యారు. అహోబిలం మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆదేశాల మేరకు ఆయన సీఏవోగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రామానుజన్ దేవాదాయశాఖ ఈవోగా పని చేసి ఇటీవల పదవీ విరమణ పొందారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న వి.ఎల్.ఎన్ రామానుజన్

వైభవంగా లక్ష దీపోత్సవం

జె.హొస్సళ్లి (హాలహర్వి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని జె.హొస్సళ్లి గ్రామంలో వెలసిన పట్టదస్వామి ఆలయంలో ఆదివారం లక్ష దీపోత్సవం కనుల పండువగా జరిగింది. పీఠాధిపతి శంభులింగయ్యస్వామి, శ్రీశైలం జగద్గురు అఖండ పరశివమూర్తి మహాస్వామి అధ్యక్షతన ఆలయంలో స్వామికి జలాభిషేకం, రుద్రాభిషేకం, ఆకుపూజ వంటి విశేష పూజలు చేశారు. అనంతరం మహిళలకు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో లక్ష దీపోత్సవంతో ఆలయం కళకళలాడింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పీఠాధిపతులు ప్రవచన కార్యక్రమం చేపట్టారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొందరు కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆలయ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా గ్రామస్థులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మార్కెట్ కమిటీ ఛైర్మన్ల సంఘం అధ్యక్షుడిగా హరిబాబు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీల ఛైర్మన్ల సంఘం అధ్యక్షుడిగా నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుంటుపల్లి హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో ఆదివారం సమావేశమైన 26 జిల్లాలకు చెందిన ఛైర్మన్లు ఆయన్ను ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబును పలువురు అభినందించి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీల అభివృద్ధితోపాటు ఛైర్మన్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతానని వివరించారు.

హరిబాబును అభినందిస్తున్న మార్కెట్‌యార్డు ఛైర్మన్లు

ఆదోని జిల్లా సాధించే వరకు పోరాడుదాం

◆ 10న బందుకు పిలుపు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన ఆదోని డివిజన్ కేంద్రాన్ని ఆదోని జిల్లాగా ప్రకటించాలని.. అప్పటి వరకు ఆందోళనలు కొనసాగిద్దామని ఆదోని జిల్లా సాధన ఐకాస నాయకులు రఘురామయ్య, ఆదినారాయణరెడ్డి, కృష్ణమూర్తిగౌడు, శ్రీనివాస ఆచారి, లలితమ్మ, విరుపాక్షి, సాయిరాం, కోటి, కోదండ, దస్తగిరినాయుడు తదితరులు పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలో ఆదివారం ఆదోని జిల్లా సాధన ఐకాస ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన చేపట్టనున్న ఆదోని బందులో వ్యాపారులు, ఉద్యోగ, కార్మికులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, ప్రజలు కలిసిరావాలన్నారు. తమ వాణి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫయాజ్‌అహ్మద్, రవిశంకర్, సాయిప్రసాద్, తిరుమలేశు, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, విట్టా సతీశ్, అశోకానందరెడ్డి, సావిత్రి, రేణువర్మ, విజయకృష్ణ, నాగరాజు గౌడు, వీరేశ్, ఎర్రిస్వామి, కృష్ణమూర్తి, సూర్య, హనుమంతు, నరేశ్, బొబ్బిలి, ఉదయ్, బాల, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు. ఆదోని పట్టణంలో ఐకాస చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 22వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో ఆదోని రజక సంఘం నాయకులు సి. పెద్దరామన్న, రవి, నాగరాజు, రంగన్న, వెంకటేశు, తాయన్న, నాగప్ప, ఉమేశ్, గోవిందు, రాఘవేంద్ర, మంజు కూర్చొని తమ మద్దతు తెలిపారు. అంతకుముందు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

ఐకాస ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ఆదోని పట్టణంలో రిలే దీక్షలో రజక సంఘం నాయకులు

సత్యదేవునికి ఆభరణం

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడు, అమ్మవార్ల అలంకరణకు ఓ దాత నెక్లెస్‌ను ఆదివారం అందజేశారు. నంద్యాల జిల్లా జీనపల్లికి చెందిన సి.రాముడు సుమారు రూ.1.1లక్షలు విలువైన బంగారు నెక్లెస్‌ను ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఈవో అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

బనగానపల్లి, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బనగానపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో జిల్లా స్థాయి కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో పిల్లల్లో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం వస్తుందన్నారు. పిల్లలను తల్లిదండ్రులు చదువుతో పాటు ఇష్టమైన క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని సూచించారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా క్రీడల్లో సాధన చేసి వివిధ స్థాయుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, క్రీడా నిర్వాహకులు ప్రతాప్‌కుమార్, కల్యాణ్, సూర్యవంశీ, రామాంజనేయులు, రవితేజారెడ్డి పాల్గొన్నారు.

శ్రీగిరిలో కళారాధన

శ్రీశైలం, నంది సర్కిల్, న్యూస్‌టుడే: ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో దేవస్థానం నిర్వహిస్తున్న కళారాధనలో భాగంగా ఆదివారం నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన శ్రీఉమామహేశ్వర కళాక్షేత్రం బృందం వారు పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు.

నృత్యం చేస్తున్న కళాకారులు

'బలవంతపు మతమార్పిడి రాజ్యాంగ విరుద్ధం'

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఏటా డిసెంబరులో అమాయకులైన వారికి మాయమాటలు చెప్పి బలవంతంగా మత మార్పిడి చేస్తున్నారని విశ్వహిందూ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి ఆరోపించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. వీహెచ్‌పీ కార్యాలయంలో ఆదివారం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..దేశ సమైక్యతకు ఇలాంటి చర్యలు భంగం కల్గిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బజరంగ్‌దళ్ కన్వీనర్ పోలేపల్లి సందీప్, జిల్లా కార్యదర్శి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించి ఏడేళ్లుగా ఉన్న రూ.వేల కోట్ల బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్, రాష్ట్ర కార్యదర్శులు గోపాలకృష్ణ, ఇక్బాల్ బాషా పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం సరెండర్ లీవుకు బిల్లులు పెట్టుకున్నా.. పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం నేషనల్ పీజీ కళాశాలలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మౌలాలి, అజాం బేగ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. 11వ పీఆర్సీని సరిచేయడంలో, 12వ పీఆర్సీ కమీషన్ వేసి మధ్యంతర భృతి చెల్లించడంపై ప్రభుత్వం దృష్టి సారించలేదన్నారు. అనంతరం సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎస్.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా అజాం బేగ్, ఆర్థిక శాఖ కార్యదర్శిగా నూరుల్లా, ఉపాధ్యాయ వాణి కన్వీనరుగా అమీర్, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సమావేశంలో ఎస్టీయూ నాయకులు

సెలవు రోజుల్లో మినహాయింపు ఇవ్వాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో రెండో శనివారం, ఆదివారం సెలవు రోజుల్లో మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, కేవీ శివయ్య అన్నారు. జిల్లా కార్యాలయంలో ఆదివారం వారు సమావేశమై మాట్లాడారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయలేదన్నారు. డీఎస్సీ 2025 ఉపాధ్యాయులకు లీప్ యాపు ద్వారా సెలవు పెట్టుకోవడంలో ఇబ్బందులను తొలగించేందుకు డీఈఓలకు సూచనలు చేయాలన్నారు.

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ వద్దు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: టెట్ నుంచి సీనియర్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఎస్టీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..టెట్ విషయంపై ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. కేంద్రం చట్ట సవరణ చేసేలా రాష్ట్రం ఒత్తిడి తేవాలన్నారు. నాగరాజు, రాము, రామకృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

సాధన చేసి.. విజేతలుగా నిలిచి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఫెన్సింగ్, పోరాట క్రీడల్లో ఒకటి. చదువుతోపాటు ఫెన్సింగ్‌లో సాధన చేసి నైపుణ్యాలు పెంపొందించుకున్నారు డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.కిశోర్, సుహాక్షితలు అనే విద్యార్థులు. ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్ వద్ద శిక్షణ మెలకువలు పొందుతున్నారు. తమదైన శైలిలో పోటీల్లో రాణిస్తూ అందరి చేత శెభాష్ అనిపించుకుంటున్నారు.

సైన్యంలో చేరి సేవలందిస్తా

- టి.కిశోర్, తొమ్మిదో తరగతి

డోన్ పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్న బండారి చంద్ర, బండారి భారతి దంపతుల కుమారుడు టి.కిషోర్ స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి అభ్యసిస్తున్నారు. తండ్రి హమాలీగా పని చేస్తున్నారు. కిశోర్ క్రీడలపై మక్కువతో ఫెన్సింగ్‌లో తర్ఫీదు పొందుతున్నారు. 2025 అక్టోబరులో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. నవంబరులో తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాడు. భవిష్యత్తులో క్రీడల్లో మరింత నైపుణ్యాలను ప్రదర్శించి సైన్యంలో చేరి దేశ సేవ అందించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు కిశోర్.

జాతీయ స్థాయి పతకమే లక్ష్యం

- సుహాక్షిత, ఏడో తరగతి

డోన్ పట్టణంలోని పాత పేటకు చెందిన హరికృష్ణగౌడ్, పుష్పాంజలి దంపతుల కుమార్తె సుహాక్షిత పాతపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లిదండ్రులు కుమార్తెను చదివించడంతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. 2025 అక్టోబరులో నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించింది. నవంబరులో తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి పతకమే లక్ష్యంగా సాధన చేస్తానంటోంది సుహాక్షిత.

అప్పుల బాధ తాళలేక బలవన్మరణం

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యాడికి మండలం నగరూరు గ్రామానికి చెందిన జయరాముడు, ఆనందకుమారి దంపతుల కుమారుడు శరత్‌కుమార్(25) బెంగళూరులో దుకాణం నిర్వహించేవాడని తెలిపారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో బెంగళూరులో ఉండలేక అతడి మిత్రుడిని కలిసేందుకు కొలిమిగుండ్లకు వచ్చాడు. శనివారం రాత్రి మిత్రుడు పని నిమిత్తం బయటికి వెళ్లగా వెంట తెచ్చుకున్న విషగుళికలు శరత్‌కుమార్ మింగేశాడు. చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగు మందు తాగి వివాహిత..

వెల్దుర్తి,న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన సుహాసిని(32) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భర్త చంద్రశేఖర్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో ఆమె మనస్తాపం చెందారు. జీవితంపై విరక్తి చెంది క్షణికావేశంలో ఆదివారం తెల్లవారుజామున పురుగు మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి..

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని కోసిగి రైల్వే స్టేషన్ సమీపంలో తిమ్మప్ప(46) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శివరామయ్య తెలిపారు. రాయచూరు జిల్లా మాన్వి తాలుకా అరోళి గ్రామానికి చెందిన తిమ్మప్ప కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండేవాడని.. ఈ బాధను తట్టుకోలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని భాస్కర్‌నగర్‌లో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందారు. సమీప అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని హోటళ్లలో పనిచేసేవాడని, అతని పేరు రాజారెడ్డి అని స్థానికులు తెలిపారు. ఆదివారం అకస్మాత్తుగా మృతి చెందినట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు కోసం కర్నూలు రెండో పట్టణ పోలీసులు ఆరా తీస్తున్నారు.

చికిత్స పొందుతూ..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని కొత్తపేటకు చెందిన షేక్ మక్బూల్‌బాషా (48) చికిత్స పొందుతూ మృతి చెందారు. లారీ క్లీనర్‌గా పనిచేసే ఆయన్ను ఈనెల 6న స్థానిక ఆర్టీసీకాలనీ వద్ద 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈమేరకు కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

కర్నూలు - శ్రీనగర్ కాలనీ నందు 60 పా X 20 వె గల 2 BHK ఇల్లు అమ్మకమునకు కలదు. సంప్ర: 73828 64823, 70223 35858.

TO LET

For Rent to Hospital, Polyclinics, Diagnostic Centers, 5200 Sft. G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: 89851 32552.

JOBS

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ: 20k. ✆ 89776 39662,89776 39663.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ప్రతిభా పోటీలతో విజ్ఞానం పెంపు

ఉపన్యాస పోటీలో విద్యార్థి

బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల విజ్ఞానాన్ని పెంచుతాయని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్‌ఐ కోటయ్యచౌదరి, వైస్ ప్రిన్సిపల్ రాధమ్మ పేర్కొన్నారు. నంద్యాల పట్టణం రైతు బజారు సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఎస్ 2 బ్రాంచ్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన గిరి, షణ్ముఖప్రీతి, నితీశ్‌రామ్‌లకు వైస్ ప్రిన్సిపల్‌తోపాటు డీన్ దస్తగిరి, ఏం జునైద్ బహుమతులు అందజేశారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: బ్రాహ్మణకొట్కూరు విజ్ఞాన్ పాఠశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో బి. మురళి, కె.సత్యశ్రీ, జి. అమృత మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ఏవో మౌలాలి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

ప్రజల రక్షణ, భద్రత ప్రధాన లక్ష్యం

నంద్యాల నేరవిభాగం: ప్రజల రక్షణ, భద్రత లక్ష్యంగా కట్టడిముట్టడి నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సునీల్ షెరాణ్ అన్నారు. నంద్యాల మూడో పట్టణ, ఆత్మకూరు, బ్రాహ్మణకొట్కూరు, పాములపాడు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆదివారం కట్టడిముట్టడి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆయా ఠాణాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చిన్నారులపై నేరాలు, బాల్య వివాహాలు, సీసీ కెమెరాల ప్రాధాన్యంపై అవగాన కల్పించినట్లు చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తిమ్మాపురం, (మహానంది): క్రీడలతోనే మానసిక ఉల్లాసమని కర్నూలు ప్రభుత్వాసుపత్రి సీనియర్ వైద్యుడు డాక్టర్ సుంకరి విజయశంకర్ అన్నారు. ఎం.తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు, మండల ఉపాధ్యాయులు సంయుక్తంగా సమావేశం, ఆత్మీయ క్రీడా పోటీలు నిర్వహించారు.

చీకట్లు.. ప్రయాణ పాట్లు

★ నంద్యాల పట్టణంలో వెలగని విద్యుత్తు దీపాలు

నంద్యాల రైతునగరం, పురపాలకం, న్యూస్‌టుడే: చలికాలంలో ఓ వైపు దట్టమైన పొగమంచు కురుస్తుండగా.. రోడ్లపై దీపాలు వెలగకపోవడంతో చీకట్లు అలుముకుని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నంద్యాల పట్టణంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జాతీయ, అనుబంధ, అంతర్గత రహదారుల్లో వెలగడం లేదు. రాత్రి సమయంలో వాహనదారులు అంధకారంలోనే ప్రయాణిస్తున్నారు. కొన్నిచోట్ల ఒకవైపే వెలుగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా తయారైంది. దీపాలు కాలిపోతే మరమ్మతులు చేయడం లేదు. కొత్తవి వేయడం లేదు. దీంతో అంధకారంలోనే ప్రయాణిస్తూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఎంఎస్‌నగర్ ప్రధాన రహదారిపై వెలగని విద్యుత్తు దీపం

కానరాని సూచికలు

సర్వీసు రోడ్డు, కూడళ్లలోకి వెళ్లే మార్గాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజూ కనీసం ఇద్దరు, ముగ్గురైనా ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకట్లో ముఖ్య కూడళ్లలో రోడ్లపై సూచికలు, దీపాలు వెలగక ఏ దిశలో వెళ్లాలో తెలియక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు, సూచిక దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పురపాలక సంఘం : నంద్యాల	వార్డులు : 42
కాలనీలు	: దాదాపు 100
మొత్తం వీధి దీపాలు	: 10 వేలకు పైగా
వెలగనివి	: సుమారు 600
ఇంకా అవసరమైనవి	: 2 వేలు

ఎక్కడెక్కడంటే..

● రైల్వే స్టేషన్ నుంచి చామకాల్వ రోడ్డులో ఎంఎస్‌నగర్, పెద్ద చర్చి వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. ఈ దారిలో మరమ్మతుల కోసం కొన్ని విద్యుత్తు దీపాలు తొలగించారు. వాటిని తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిళ్లు అంధకారం అలుముకుంటోంది.

● పద్మావతినగర్ స్టేడియం ఎదురుగా ప్రధాన రహదారిపై రాత్రి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఇక్కడ వీధి దీపాలు లేకపోవడంతో అంధకారంలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పద్మావతినగర్‌లో కొన్ని విద్యుత్తు దీపాలు వెలగడం లేదు.

● పట్టణంలోని పద్మావతినగర్, శ్రీనివాస సెంటర్ నుంచి సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి వరకు కొన్ని విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. కొన్ని ఒకవైపే వెలుగుతున్నాయి. చీకట్లోనే గుంతల రహదారుల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

● పట్టణంలోని పలు ప్రాంతాల్లో రాత్రిళ్లు పశువులు సంచరిస్తున్నాయి. వీధి దీపాలు వెలగని ద్విచక్ర వాహనదారులు వాటిని ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నారు.

● శివారు ప్రాంతాలైన నందమూరినగర్, వైఎస్సార్‌నగర్, ఆటోనగర్, కాంతినగర్, అయ్యలూరు మెట్ట, రైతునగరం వంటి ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. కొన్ని చాలాకాలం నుంచి వెలగకున్నా మరమ్మతులు చేయడం లేదు. కొత్తవి వేయలేదు. మరికొన్ని చోట్ల విద్యుత్తు దీపాలు లేవు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) నందికొట్కూరు : 94403 61729, ఆత్మకూరు : 90149 09024, నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం: ?: నంద్యాల పట్టణంలోని గిరినాథ్ సెంటర్, భగత్‌సింగ్ కాలనీలో కుక్కల బెడద అధికమైంది. - శ్రీనివాసులు, యూసఫ్, స్థానికుడు

?: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ కాల్వలు శుభ్రం చేయడం లేదు. - నారాయణమ్మ

?: పట్టణంలోని సలీంనగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. - జయభారత్‌రెడ్డి

✔: త్వరలోనే కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం. కాల్వలు శుభ్రం చేయిస్తాం. - లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

పగిడ్యాల, న్యూస్‌టుడే: ?: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ముచ్చుమర్రి కాలనీలో దర్గా సమీపంలో రోడ్డు బురదమయంగా మారడంతో దోమల బెడద అధికమైంది. - సానికుడు, ఖాజాహుసేన్

✔: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. - గురుతురున్, గ్రామ కార్యదర్శి

?: మండలంలోని పాలమర్రి గ్రామంలో మినీ ట్యాంకులో పాచి పేరుకుపోయింది. - స్థానికుడు, శ్రీను

✔: పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. - వీరన్నయాదవ్, గ్రామకార్యదర్శి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: అప్పలరావుపేట వీధిలో డీపీఈపీ పాఠశాల వద్ద వీధి దీపం వెలగక ఇబ్బందులు పడుతున్నాం. - షేక్‌షాకీర్, స్థానికుడు

✔: వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. - షాకీర్‌బాషా, పురపాలక ఏఈ

?: పద్మపేటలోని మురుగు కాల్వల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. - రమణ, స్థానికుడు.

✔: కాల్వల్లో పూడిక తొలగిస్తాం. - జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే: ?: మండలంలోని మద్దూరు ఎస్సీ కాలనీలో మురుగు కాలువల సమస్య తీవ్రంగా ఉంది. - రంగస్వామి స్థానికుడు

?: మద్దూరులో దోమల బెడద అధికమైంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

✔: గ్రామాల్లో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. - వరలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

నిర్వహణ లేక.. కుండీలు ఖాళీ

నంద్యాల పట్టణంలో సుందరీకణకు శ్రీనివాస సెంటర్ నుంచి సాయిబాబానగర్ వరకు నడకదారులపై వంద వరకు పూల కుండీలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో పూల కుండీల్లోని మొక్కలు ఎండిపోయి ఖాళీ కుండీలు మిగిలాయి. అధికారులు కుండీల్లో మొక్కలు నాటి, ఆహ్లాదం, పచ్చదనం పెంపొందించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

బస్టాండులో అక్రమ పార్కింగ్

ఆత్మకూరులోని ఆర్టీసీ బస్టాండు ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఆర్టీసీ బస్టాండులో పార్కింగ్ కోసం స్థలం కేటాయించకపోవటంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో ప్రాయాణ ప్రాంగణంలో బస్సులు వెనక్కు, ముందుకు కదిలే సమయంలో ఇబ్బంది తలెత్తుతోంది. ద్విచక్ర వాహన పార్కింగ్ కోసం స్థలం కేటాయిస్తామంటూ ఆర్టీసీ అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణకు నోచుకోవటం లేదు.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

పేరుకున్న చెత్త.. కదలని మురుగు

నందికొట్కూరు పురపాలకలోని కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుంటున్నాయి. మారుతీనగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపాన ఉన్న ప్రధాన కాల్వలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళు పేరుకున్నాయి. కాల్వల్లో నీరు ముందుకు సాగక నిల్వలు చేరుకున్నారు. దోమలకు నిలయాలుగా మారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాల్వల్లో పేరుకున్న చెత్తాచెదారం తొలగించి నిల్వలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు

పశువైద్యశాలలో వసతులు కరవు

పాణ్యంలోని ఏరియా పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వైద్యశాలలో వసతులు, భవనాలు లేకపోవడంతో సరైన సేవలు అందడం లేదు. వర్షం వస్తే కారుతుంది. ప్రహరీ, స్టోర్‌రూం, మీటింగ్‌హాలు, ఆపరేషన్ థియేటర్, బాత్‌రూంలు లేవు. ఏరియా వెటర్నరీ వైద్యశాలగా మారి నాలుగేళ్లవుతున్నా.. ఇప్పటివరకు ఎలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో రైతులకు అందడం లేదు. – న్యూస్‌టుడే, పాణ్యం గ్రామీణం

ముఖ్యమంత్రిని కలిసిన లక్ష్మాపురం సర్పంచి

సమస్యలు విన్నవిస్తున్న సర్పంచి సుజాత

నందికొట్కూరు, పగిడ్యాల, న్యూస్‌టుడే: పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామ సర్పంచి బేడ బుడగ జంగం సిరిగిరి సుజాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఎంపీ బైరెడ్డి శబరి చొరవతో ముఖ్యమంత్రిని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నందికొట్కూరు నుంచి పగిడ్యాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలన్నారు. బేడ బుడగ జంగాల కులస్థులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతోపాటు ఎం. తిమ్మాపురం, గాజులపల్లె ఆర్. ఎస్. గ్రామంలోని మరకత లింగేశ్వర నవగ్రహ దేవాలయాల సముదాయం నుంచి అయ్యప్ప దీక్షా భక్తులు ఇరుముడులతో శబరిమల క్షేత్రానికి వెళ్లారు. గురుస్వాములు అశోక్, శ్రీనివాసులు, భాస్కరరెడ్డి, కృష్ణబాబు స్వాములతో అయ్యప్పస్వామికి అభిషేకాలు, అర్చనలు చేయించారు.

నందికొట్కూరు గ్రామీణం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్సై సురేశ్‌బాబు తెలిపారు. పాములపాడు మండలంలోని మిట్టకందాలో నాకాబందీ నిర్వహించారు. అనుమానితులు, గతంలో నేర చరిత్ర ఉన్న వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాల్లేని ద్విచక్రవాహనాలు, అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

నంద్యాల పాతపట్టణం: నంద్యాల మండలం చాబోలు జడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగశేషులు తెలిపారు. సెప్టెంబరులో నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సురేంద్ర ద్వితీయ స్థానం, మహీధర్, కబీనా తృతీయస్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

ఆత్మకూరు పట్టణం: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించటంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంఘం పట్టణాధ్యక్షుడు ఎన్. ఎస్. జిలానీ, తెదేపా కార్యాలయం ఆవరణలో తెదేపా నాయకులతో కలిసి కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు ప్రసాదరావు, షాకీర్, ఓబులేసు, ఇబ్రహీం ఖలీలుల్లా రమణ పాల్గొన్నారు.

మిడుతూరు: మండలంలోని మాసపేట గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయించినట్లు జడ్పీటీసీ సభ్యుడు యుగంధర్ రెడ్డి తెలిపారు. ఆల్కేమ్ ఇంటర్నేషనల్ పల్లీ అండ్ టుబాకో ట్రేడర్స్ అధినేతలు అబ్దుల్ సలాం, వలి బాషాలు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 155 మందికి చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నంద్యాల గాంధీచౌక్: నంద్యాల పట్టణం ఆత్మకూరు బస్టాండులో ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఆదివారం సంకష్టహర చతుర్థిని నిర్వహించారు. స్వామికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, విశేషమైన పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు.

నంద్యాల పట్టణం: పట్టణంలో భద్రావతి భావన రుషి ఆలయంలో చింతలపల్లె వాసు ఆధ్వర్యంలో ఆదివారం గురు భవానీ పూజ నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున దుర్గాభవానీ మాతకు పూజలు చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి తులసీరెడ్డి, శ్రీశైలం బోర్డు సభ్యులు మురళీధర్, శ్రీదేవి, శ్రీరాములు, సుబ్బారావు పాల్గొన్నారు.

గడివేముల: శ్రీదుర్గాభోగేశ్వరంలో ఆదివారం స్వామివారికి ఆరుద్రా నక్షత్రపూజలు నిర్వహించారు. మార్గశిరమాసంలో వచ్చే ఆరుద్రా నక్షత్రానికి విశేష ప్రాధాన్యం ఉండడంతో పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, రుద్రహోమం, చేశారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి

మహానంది, న్యూస్‌టుడే: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆదివారం పలు ప్రాంతాలకు చెందిన యాత్రికులు, అయ్యప్ప భక్తులు, దుర్గాభవానీ, గోవింద దీక్షాస్వాములు గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు.

బండిఆత్మకూరు: ఓంకార పుణ్యక్షేత్రంలో రద్దీ పెరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. పంచబుగ్గల కోనేరులో స్నానాలు ఆచరించి, ఓంకార సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

మరకత లింగేశ్వరస్వామి

భక్తిశ్రద్ధలతో హోమాలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పట్టణంలోని గుడిపాటిగడ్డలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మండల విళక్కు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, విశేషమైన పూజలు చేశారు. లక్ష్మీగణపతి, సుబ్రహ్మణేశ్వర, అయ్యప్ప, నవగ్రహ, శాస్త్ర భైరవ హోమాలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

గోడపత్రాల ఆవిష్కరణ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ నాయకుడు మాదాల నారాయణ స్వామి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నంద్యాల జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. పట్టణంలోని ఎపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సీపీఐ ఎంఎల్ నాయకులు వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. శంకర్, చౌడప్ప, రాంబాబు, రఫీ, ఖాజామియా పాల్గొన్నారు.

రాయితీ రుణాలు ఇవ్వాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఆదరణ పథకం కింద చేతి వృత్తిదారులందరికీ రాయితీ రుణాలు ఇవ్వాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండు చేశారు. పట్టణంలోని నిశాంత్ భవన్‌లో ఆదివారం ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం వ్యాక్సిన్‌లు, నట్టల మందులను సకాలంలో ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా బాల నరసింహులు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వెంకట శివుడు, జిల్లా కార్యదర్శిగా రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా రంగస్వామి, శివనాగయ్య, సహాయ కార్యదర్శులుగా బాలు, హరిలను ఎన్నుకున్నారు.

సంప్రదాయాలు ఆచరించాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని 'మన ఊరు మన గుడి మన బాధ్యత' వ్యవస్థాపకులు శివకుమార్‌రెడ్డి అన్నారు. నంద్యాల పట్టణం పద్మావతినగర్ స్వచ్ఛ భారత్ పార్కులో ఆదివారం పాతదేవుడి పటాలకు శాస్త్రోక్తంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లలో పూజలు అందుకొని ఛిద్రమైన దాదాపు 300 దేవుడి పటాలకు అర్చకులు సుధీంద్రాచార్యులు పూజలు చేశారు. అనంతరం వాటి గ్లాస్‌లు, ఫ్రేమ్‌లను విడదీసి నీటిలో నిమజ్జనం చేసినట్లు ఆయన తెలిపారు.

16 నుంచి నంద్యాలలో తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు తిరుప్పావై దివ్య ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు నంది రైతు సమాఖ్య గౌరవ సలహాదారులు డా.కాదరబాద్ రవీంద్రనాథ్ తెలిపారు. సంజీవనగర్ కోదండ రామాలయంలో నిర్వహించే ప్రవచనాల కరపత్రాలను ఆయన ఆదివారం విడుదల చేశారు. డా. హయగ్రీవాచార్యులు, డా. కిశోర్‌కుమార్, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, నీలకంఠమాచారి, కృష్ణారెడ్డి, ఓబుళపతి, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల చేస్తున్న అతిథులు

మాట్లాడుతున్న రంగనాయుడు

ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం

గోస్పాడు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటాలు సాగిస్తుందని జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గోస్పాడులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన మండల కార్యదర్శిగా షేక్ జిలానీబాషా, ఉప కార్యదర్శిగా షేక్ మౌలాను నియమించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, వ్యకాస జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగంపై ప్రతికూల ప్రభావం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: విద్యుత్తు, విత్తన బిల్లులతో వ్యవసాయరంగంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో ఆదివారం ఏపీ రైతు సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆమోదించడానికి ప్రతిపాదనలు తెచ్చిన విత్తన, విద్యుత్తు బిల్లులను దగ్ధం చేశారు. రైతులంతా ఈ బిల్లులను వ్యతిరేకించాలన్నారు. సుబ్బరాయుడు, వెంకటేశ్వరరావు, రామేశ్వరరావు, సురేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల పత్రాలను దగ్ధం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

బాలికలు.. బరిలో విజేతలు

★ బాల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థినులు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతానికి చెందిన పాములపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. పట్టుదలతో ఆటలు నేర్చుకొని.. కఠోర సాధనతో నైపుణ్యం మెరుగుపరుచుకుంటున్నారు.

● పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ ప్రిన్సిపల్ నాగరవీంద్ర, పీడీ సాయికృష్ణ ప్రోత్సాహంతో పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలుస్తున్నారు. మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి బాల బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఆగస్టులో ప్రకాశం జిల్లా చేవూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని సత్తా చాటి ప్రశంసలు అందుకున్నారు.

పూజవైష్ణవి.. పోటీల్లో మేటి

పాములపాడు మండలంలోని కృష్ణారావుపేట గ్రామానికి చెందిన ఆవుల రవీంద్ర, అనురాధ దంపతుల కుమార్తె పూజవైష్ణవి. బాల్ బ్యాడ్మింటన్‌పై మక్కువ. పాఠశాలలో పీడీ శిక్షణతో బాల బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటుతోంది. 'జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి పథకాలు సాధిస్తా' నంటోంది పూజ వైష్ణవి.

సానియా.. ఆటలో మాయ

పాములపాడు మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన ఫజరుల్లా, శాజహాన్ దంపతుల కుమార్తె షేక్ సానియా. చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తుంది. బాల్ బ్యాట్మింటన్‌పై ఆసక్తితో సాధన చేస్తోంది. తల్లిదండ్రులు, శిక్షకుడి సహకారంతో రాష్ట్రస్థాయిలో రాణిస్తోంది. 'క్రీడల్లో ప్రతిభ చూపి క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్య'మంటోంది సానియా.

సబియా.. క్రీడలో సత్తా

పాములపాడు గ్రామానికి చెందిన మక్బుల్, ఆస్మా దంపతుల కుమార్తె సబియా. చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. బాల్ బ్యాడ్మింటన్‌పై ఇష్టంతో సాధన చేస్తుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని, మంచి గుర్తింపు తెచ్చుకుంది. 'క్రీడల్లో ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి చేరుకోవడమే లక్ష్య' మంటోంది సబియా.

జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు అటవీ ప్రాంతంలోని జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నట్లు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావుజీ స్పష్టం చేశారు. బైర్లూటిలోని ఎకోటూరిజంలో ఆదివారం అటవీ, విద్యుత్తు శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ హైటీకోస్ సంస్థ ప్రతినిధి ఇమ్రాన్ సిద్ధిఖీ అటవీ భూభాగం సరిహద్దుల గుర్తింపు, అనధికార విద్యుత్తు కనెక్షన్లపై ఉద్యోగులకు వివరించారు.

సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖాధికారులు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు..'వెలుగోడు పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఈనెల 2వ తేదీన అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన ఎన్.నాగమణి అనే మహిళా బ్యాగ్‌లో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 25 గ్రాముల బంగారు ఆభరణాన్ని దొంగిలించారు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నిందితులు ఈశ్వరి, ప్రతాప్, రిబ్కాను శనివారం వెలుగోడు పట్టణ శివారులోని డిగ్రీ కళాశాల సమీపంలో అదుపులోకి తీసుకున్నాం. రూ.2.25 లక్షలు విలువ చేసే 25 గ్రాముల బంగారు ఆభరణం స్వాధీనం చేసుకున్నాం. వీరిని బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించాం. ముగ్గురిని కోర్టులో హాజరుపరిచాం.' అని ఎస్సై తెలిపారు.

వాహనదారులకు జరిమానా

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం శిఖరం అటవీ చెక్‌పోస్టు వద్ద నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు మంత్రణం చేసి, జరిమానా విధించినట్లు శ్రీశైలం రేంజర్ పరమేశులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం శిఖరం చెక్‌పోస్టును శనివారం రాత్రి విజయవాడ, గుజరాత్, మహారాష్ట్రకు చెందిన 15 మంది వాహనదారులు తెరుచుకొని దోర్నాల వైపు వెళ్లినట్లు గుర్తించామన్నారు. దోర్నాల అటవీ చెక్‌పోస్టు వద్ద పట్టుకొన్నామన్నారు. దోర్నాల-శ్రీశైలం చెక్ పోస్టులలో రాత్రి 9 గంటల నుంచి వాహన రాకపోకలకు అనుమతి లేదు.

బహిరంగ ప్రకటన

మా కక్షిదారుడైన Dr. వల్లంకొండ రమేష్‌బాబు తరపున Instructions పొంది తెలియజేయు పబ్లిక్ నోటీస్ ఏమనగా!

మా కక్షిదారుడు క్రింద కనబరిచిన షెడ్యూలు దాఖల ఆస్తులలో 1/6th భాగం కలదని Partition కోరి నంద్యాల II Addl. Senior Civil Judge గారి కోర్టులో O.S.203/2006 అను దావాను వారి సోదరుడైన వల్లంకొండ నాగేశ్వరావు వారి తల్లిగారైన వల్లంకొండ నాగరత్నమ్మ మరియు ఇతర కుటుంబసభ్యులపైన Partition కోరి దావా దాఖలు చేసినారు. సదరు దావాలో మా కక్షిదారునికి మరియు ప్రతివాదులైన వల్లంకొండ నాగేశ్వరావు వగైరాలకు ఒక్కొక్కరికి 1/6వ భాగం కలదని హైకోర్టు వారు Preliminary Decree పాలించి ఉంటున్నారు. సదరు Judgement పైన వల్లంకొండ నాగేశ్వరావు నంద్యాల III Addl. District కోర్టు నందు A.S.15/2020 గా అపీల్ దాఖలు చేశారు. సదరు అపీల్ A.S.15/2020 పై జిల్లా కోర్టువారు Allow చేసి ఉంటున్నారు. తదుపరి మా కక్షిదారుడు మరియు ఇతర ప్రతివాదులు AP High Court లో సెకండ్ అపీల్ S.A.569/2012 దాఖలు చేసి ఉంటున్నారు. సెకండ్ అపీల్ Hon'ble High Court నందు పెండింగ్‌లో ఉన్నది. సదరు సెకండ్ అపీల్‌లో SAMP No. 1277/2012 నందు Hon'ble High Court వారు "Directed Both Parties to maintain status co in all respects pending further orders" అని order ఇచ్చిఉంటున్నారు. పై ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికిని పై సెకండ్ అపీల్ (S.A) లో ప్రతివాదైన వల్లకొండ నాగేశ్వరావు గారు షెడ్యూలు దాఖల ఆస్తులు ఇతరులకు అమ్మటకు మరియు బిల్డింగ్ Structure మార్చుటకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసినది.

కావున యావన్మంది ప్రజలకు తెలియచేయడం ఏమనగా క్రింద తెలిపిన షెడ్యూలు దాఖల ఆస్తులు ఎవరైన కొనినసూ మరియు Lease కు తీసుకున్న చెల్లదని వారికి ఎటువంటి హక్కులు సంక్రమించవని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

షెడ్యూలు

ITEM No.1: House property situated in Nandyal Sub District, Kurnool District, Srinivasa Nagar Colony, D.No. 25-600. **East:** Road, **West:** House of Yelisetty Subramanyam, **North** : Road, **South:** House of Venkatappa Naidu.

ITEM No.2: Shop room situated in Nandyal Municipal Limits in Street No.4 bearing D.No.4-306 (Old 4-178) situated in M.H.School Road with the following boundaries. **East:** Road, **West:** House of Kharim, **North :** Meda Ramakrishnaiah, **South:** Kuraku Subbarayudu and his son Sudarsanam.

ఇట్లు: G.జయకృష్ణ, అడ్వకేట్, నంద్యాల. సెల్ : 98495 92424

(c) eenadu

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

వాసవీ క్లబ్ జిల్లా కార్యదర్శి ఎంపిక

బల్లాని సూర్య

బేతంచెర్ల, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ 2026 జిల్లా కార్యదర్శిగా బేతంచెర్ల పట్టణానికి చెందిన బల్లాని సూర్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన సమావేశంలో జిల్లా గవర్నర్‌గా లింగం నాగశైలజ, జిల్లా కార్యదర్శిగా బల్లాని సూర్య ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, ఆర్యవైశ్యులు సూర్యని అభినందించారు. సమాజాభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తానని సూర్య పేర్కొన్నారు. వాసవీ క్లబ్ సభ్యులు, పుర ప్రజలు సేవాకార్యక్రమాలకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నేడు అర్జీల స్వీకరణ

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ ఆదివారం పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు వారు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: అహోబిలం గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి దారిలోని నీటి కుళాయి వద్ద మురుగు నిల్వ ఉండి అపరిశుభ్రంగామారింది. - **సంజీవ, అహోబిలం**

✔: పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.
- **సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి.**

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన గేటు దగ్గర చెత్తకుండీ ఏర్పాటు చేయాలి. - బాషా, స్థానికుడు.

✔: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.
- **ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.**

బనగానపల్లి, న్యూస్‌టుడే: ?: ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఓ ప్రయివేటు స్థలంలో ముళ్లచెట్లు పెరిగిపోయి అపరిశుభ్రంగా తయారైంది. - **బషీర్, స్థానికుడు.**

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -**బాలాంజనేయులు, ఈవోఆర్డీ.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని ఖాదరబాదర గ్రామంలో ప్రధాన రహదారిపైనే మురుగు నీరు నిల్వ ఉంటోంది. - **చరణ్.**

✔: మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
- **అశ్విన్‌కుమార్, ఈవో, శిరివెళ్ల.**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: బేతంచెర్ల నుంచి బలపాలపల్లె వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. - **బలపాలపల్లె గ్రామస్థులు.**

✔: ముళ్లపొదలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - **నాగప్రసాద్, పంచాయతీ కార్యదర్శి.**

?: పట్టణంలో చాకలిపేట కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలి. - **కాలనీవాసులు.**

✔: త్వరలో రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
- **మధుతేజరెడ్డి, ఏఈ మున్సిపల్.**

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పలుకూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేయాలి. - **ఓబులమ్మ, కాలనీవాసి, పలుకూరు.**

✔: కాలనీలోని సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం. - **నాగరాజు, ఎంపీడీవో, బనగానపల్లి.**

వాలీబాల్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న సీఐ మురళీధర్‌రెడ్డి

ముత్యాలపాడు(చాగలమర్రి), న్యూస్‌టుడే: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని ఆళ్లగడ్డ గ్రామీణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పురాతన చర్చి పరిశుద్ధ జన్మోత్సవాలయం వార్షికోత్సవం సందర్భంగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డేవిడ్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది జట్లు పోటీల్లో పాల్గొన్నాయన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయం రూ.15వేల నగదు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీనరీ ఛైర్మన్ రెవ.చంద్రశేఖర్, డేవిడ్, లక్ష్మీరెడ్డి, గోపాల్‌రెడ్డి, బ్రహ్మం, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు వసతిపై హర్షం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించటంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంఘం పట్టణాధ్యక్షుడు ఎన్.ఎస్. జిలానీ, తెదేపా కార్యాలయం ఆవరణలో ఆదివారం తెదేపా నాయకులతో కలిసి కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు ప్రసాదరావు, షాకీర్, ఓబులేసు, ఇబ్రహీం, ఖలీలుల్లా, మోటారు షఫీ, చెన్నయ్య, రమణ పాల్గొన్నారు.

కంకర దారులు.. జనం బేజారు

బేతంచెర్ల, బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పలు గ్రామాల అభివృద్ధి కలగా మారుతోంది. రహదారులు కంకర తేలి అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. మారుమూల గ్రామాలైన కనుమకింది కొట్టాల, యాగంటికి వెళ్లే రహదారులు ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా దృష్టి సారించి రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేక నిలిచిన పనులు

రాళ్లు తేలిన బేతంచెర్ల- అంబాపురం రహదారి

బేతంచెర్ల మండలంలోని అంబాపురం గ్రామం మీదుగా 2018లో రూ.5 కోట్ల ఎస్డీఎఫ్ నిధులతో మద్దిలేటి స్వామి ఆలయ క్రాస్ రోడ్డు నుంచి యాగంటి ఆలయం వరకు బీటీ రహదారి నిర్మించారు. అంబాపురం గ్రామ సమీపంలో కి.మీ. మేర అటవీ ప్రాంతంలో ఉండటంతో అనుమతులు రాక రహదారి వేయకుండా నిలిపివేశారు. రహదారి రాళ్లు తేలడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కటికవానికుంట, అంబాపురం గ్రామాల మధ్యన బీటీ రోడ్డు దెబ్బతింది. అధికారులు స్పందించి రహదారిని నిర్మాణం పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

నిధులకు ప్రతిపాదనలు పంపాం – మల్లికార్జున, డీఈ

బేతంచెర్ల మండలంలో రోడ్ల అభివృద్ధికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధుల కోసం ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణంపై దృష్టి సారిస్తాం.

పెరిగిన ముళ్లపొదలు

☛ రహదారులకు మరమ్మతులు చేసిన యంత్రాంగం రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను తొలగించడంలో శ్రద్ధ చూపలేదు. అవుకు మండలంలోని చనుగొండ్ల-కాశీపురం, ఆకుమళ్ల-సుంకేసుల, కాశీపురం- ఆల్వకొండ రహదారుల్లో 5 కి.మీ. రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోయాయి. ద్విచక్ర వాహన చోదకులు తిప్పలు పడుతున్నారు.

☛ ఉయ్యాలవాడ నుంచి కుందుపల్లె గ్రామానికి బీటీ రోడ్డు వేశారు. ఏడాది గడిచినా పనులు పూర్తి చేయలేదు. మార్చి చివరిలోగా పనులు సాగించక పోతే నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

☛ డోన్ మండలంలోని బి.రామదుర్గం గ్రామానికి గత ప్రభుత్వం మల్యాల క్రాస్‌రోడ్డు నుంచి బి.రామదుర్గం వరకు బీటీ రోడ్డు వేశారు. మధ్యలో అర కి.మీ. మేర రహదారి వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు నిర్మించారు కానీ బీటీ రోడ్డును అనుసంధానం చేయకుండా వదిలివేశారు.

ఆరోగ్య కేంద్రం.. అసంపూర్తి నిర్మాణం

కోవెలకుంట్లలోని సచివాలయం-3 పరిధిలో గత వైకాపా హయాంలో హెల్త్ క్లినిక్ సెంటర్‌ను సుమారు రూ.17.50 లక్షల అంచనాతో నిర్మించారు. భవన నిర్మాణం పూర్తి కాగా విద్యుత్తు, నీటి వసతి, ప్లంబింగ్ పనులు చేయకపోవడంతో సుమారు రెండేళ్లుగా భవనం నిరుపయోగంగా మారింది. పనులు అసంపూర్తిగా ఉండటంతో అద్దె భవనంలో సేవలు కొనసాగిస్తున్నారు. పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

తవ్వారు.. మరమ్మతులు మరిచారు

బేతంచెర్ల పట్టణంలో పలు వీధుల్లో సీసీ రహదారులు నీటి గొట్టాల ఏర్పాటుకు తవ్వడంతో అధ్వానంగా మారాయి. స్థానిక ప్రజలు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్టాండు రెడ్డి హోటల్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనబడుతోంది. నగర పంచాయతీ అధికారులు వీటికి మరమ్మతులు చేపట్టడంలో విస్మరిస్తున్నారు. అధికారులు స్పందించి గొట్టాల కోసం తవ్విన రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, బేతంచెర్ల

వెలగని విద్యుత్తు దీపాలు

డోన్ జాతీయ రహదారి పక్కనున్న సర్వీస్ రోడ్డులో ఉన్న విద్యుత్తు దీపాలు చాలా రోజులుగా వెలగడం లేదు. దీంతో ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్డులో చీకటిగా ఉండటంతో రాత్రి వేళల్లో వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఎటు వైపు నుంచి ఏ ప్రమాదం జరుగుతుందోనని అర్థం కాని పరిస్థితి. అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, డోన్ నేరవిభాగం

దారి దుర్భరం.. జీవనం అస్తవ్యస్తం

ఆళ్లగడ్డ మండలంలోని దొరకొట్టాల గ్రామంలోని ప్రధాన రోడ్డు ఇది. రోడ్డంతా మురుగుతో నిండి దుర్భరంగా మారింది. కాల్వలు లేకపోవడంతో మురుగు నీరు పారేందుకు వీలులేక రోడ్డుపై నిల్వ ఉండి సమస్య తలెత్తుతోంది. నడిచేందుకు కూడా వీలులేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల వ్యాప్తితో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు రోడ్డుపై మురుగును తొలగించి కాల్వలు నిర్మించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, దొరకొట్టాల(ఆళ్లగడ్డ గ్రామీణం)

సంక్షిప్త సమాచారం

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలో రెండు అనాథ మృతదేహాలను ద్రోణాచలం సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసుల సమక్షంలో అంత్యక్రియలు జరిపారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: గ్రామంలో అవసరమైన చోట్ల వీధి దీపాలను గ్రామ సర్పంచి ఓబులేసు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో కర్షా సుబ్బారెడ్డి ఫౌండేషన్, మానవత సంస్థ ఆధ్వర్యంలో సంస్థ పాఠశాల ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డా.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పేదలకు చేయూతనందించేందుకు దాతలు ముందుకురావాలని ప్రార్థనా సమయం నిర్వాహకుడు జాన్ ప్రఖార్ అన్నారు. దాత రాధాకృష్ణ ఆర్థిక సాయంతో డోన్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, బాలింతలకు ఆహారాన్ని అందించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఈవో, ఆలయ ఉప కమిషనర్ గుత్తిలో రాష్ట్ర బీడీ సెక్రటరీ విజయానందను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మద్దిలేటిస్వామి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు.

వేగంగా నిర్మాణం.. తీరనున్న కష్టం

◆ చివరిదశలో షాదీఖానా పనులు

బనగానపల్లెలో జరుగుతున్న షాదీఖానా నిర్మాణం

బనగానపల్లె, న్యూస్‌టుడే: బనగానపల్లె పట్టణంలో ఏళ్ల తరబడి ఉన్న షాదీఖానా సమస్య కొన్ని నెలల్లో తీరనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగిపోయిన షాదీఖానా భవనానికి మంచి రోజులు వచ్చాయి. పునాదులకే పరిమితమైన భవనానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. రూ.కోటి నిధులకు పైగా వెచ్చించి నిర్మాణాన్ని శరవేగంగా నిర్మిస్తున్నారు.

మంత్రి చొరవతో ముమ్మరంగా..

అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో మంత్రి బీసీ సొంత నిధులు రూ.30 లక్షలు షాదీఖానాకు విరాళంగా ఇచ్చారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్లలో నిర్మాణం ఆగిపోయింది. పాతబస్టాండు సమీపంలో అప్పటి తెదేపా హయాంలో ఆగిపోయిన నిర్మాణ స్థానంలోనే నూతన భవనం నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.కోటితో కలిపి అదనపు సదుపాయాలతో భవనం నిర్మిస్తున్నారు. పక్కనే ఉర్దూ పాఠశాల భవనం నిరుపయోగంగా మారి ఉండేది. దీన్ని షాదీఖానాకు అనుసంధానంగా నిర్మాణం చేస్తున్నారు. భోజన వసతి ఇతర సదుపాయాలు కల్పించేందుకు ముమ్మరంగా పనులు చేస్తున్నారు. స్థానికంగా ముస్లింల జనాభా 20వేలకు పైగానే ఉంది. షాదీఖానా పూర్తయితే పేద ముస్లింలకు ఉపయోగపడనుంది.

కోవెలకుంట్లకు రూ.కోటి మంజూరు

కోవెలకుంట్ల పట్టణంలో షాదీఖానా నిర్మాణం చేపట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త భవనం కోసం రూ.కోటి మంజూరు చేసింది. పట్టణంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీపంలోని సాయినగర్‌లో భవనం నిర్మించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమయాన్ని బట్టి అక్కడ త్వరలోనే భూమి పూజ చేసే అవకాశం ఉంది.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ గ్రామీణం: పూజలందుకుంటున్న ధరణి సీతారామస్వామి

ఎస్.లింగందిన్నె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ఎస్. లింగందిన్నె గ్రామంలోని ధరణి సీతారామ స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి సేవ నిర్వహించారు. ఉదయం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊయల సేవ జరిపారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కాత్యాయనమ్మ భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురంలోని రామలింగ పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనృసింహస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వాములను దర్శించుకున్నారు. తలనీలాలు, బోనాలు, బియ్యం బేడలు వంటి చిరుకానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం మూల పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

బనగానపల్లె గ్రామీణం, న్యూస్‌టుడే: నందవరం చౌడేశ్వరీదేవి ఆలయం, యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయాలు ఆదివారం భక్తుల సందడితో కనిపించాయి. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే, భాజపా ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు దర్శించుకున్నారు. ఎగువ, దిగువ ఆలయాల్లోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. స్వామి హస్తాన్ని పార్వేటోత్సవాన్ని ప్రాచీన వారసత్వంగా యునెస్కో గుర్తింపు దక్కేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ఆళ్లగడ్డ గ్రామీణం: స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని ఆల్వకొండ సమీపంలో కాశీనాయన ఆశ్రమంలో ఆరాధన వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 12 జతల ఎద్దు పాల్గొన్నాయి. బీటీ మధ్య సాగిన పోటీలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంజామల మండలం పేరుసోముల చిన్నశేఖర్‌రెడ్డి ఎద్దు ప్రథమ, ఉయ్యాలవాడకు చెందిన ఓబుల్‌రెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. నిర్వాహకులు విజేతల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు.

బండను లాగుతున్న వృషభాలు

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్నేహభావంతో మెలగాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగే పనులు ఏవి చేసినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఉమ్మాయపల్లెలో మహిళపై దాడి

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఉమ్మాయపల్లె గ్రామంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా సుధారాణిపై ఆమె భర్త లక్ష్మీనారాయణరెడ్డితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఆదివారం దాడి చేసినట్లు సీఐ రమేష్‌బాబు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం సమీపంలో నివాసం ఉంటున్న ఆపతి లక్ష్మీరెడ్డిపై శనివారం ఆరుగురు కలిసి దాడి చేసి కొట్టిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పరిశుభ్రత విషయంలో లక్ష్మీరెడ్డిపై ఇమాం ఖాశీంతో పాటు మరో ఐదుగురు కలిసి కొట్టి గాయపరిచి, బెదిరించారని బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు ఆదివారం తెలిపారు.

రోటరీ సేవలు అభినందనీయం

చిన్నారికి చలికోటు అందజేస్తున్న డీఎస్పీ ప్రమోద్‌కుమార్

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ రోటరీ సేవలు అభినందనీయంగా ఉన్నాయని డీఎస్పీ కె.ప్రమోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బాలసదన్‌లోని చిన్నారులకు రోటరీ ఆధ్వర్యంలో చలికోట్లను డీఎస్పీ అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిస్వార్థ సేవలకు ప్రతిరూపంగా రోటరీ క్లబ్ నిలుస్తోందన్నారు. ప్రజలకు సేవలందించడమే పరమావధిగా ఉన్న ఇలాంటి సేవా సంస్థ ఆళ్లగడ్డలో ఉండడం స్వాగతించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు పోలేపల్లి సత్యనారాయణ, కార్యదర్శి భైసాని రవి, ఇన్నర్‌వీల్ కార్యదర్శి ఉమామహేశ్వరి, రోటరీ సహాయ గవర్నర్ దేవిశెట్టి హరీష్, దాతలు శబరీష్ సత్యం, డా.వరప్రసాదు, ధనలక్ష్మి సత్యం, టీఎంసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తేయాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పల్నాడులోని గణపవరం పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులపై ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఎత్తేయాలని ఎన్జీవో సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు వి.దస్తగిరిరెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన హెల్త్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి 12 మంది ఉద్యోగులను సస్పెండ్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం తాలూకా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సెక్రటరీ బాలస్వామి, కోశాధికారి శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కడపలో రక్తదాతకు సన్మానం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో గత పదేళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న మహమ్మద్ హుస్సేన్‌కు కడపలో సన్మానం జరిగింది. ఆదివారం కడపలోని ఖూన్ కా రిస్తా అనే ఛారిటబుల్ సంస్థ మహమ్మద్ హుస్సేన్ చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారం అందించింది. ఛారిటబుల్ సంస్థ తమ పదో వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన కార్యక్రమాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి సన్మానించారు. గత పదేళ్లలో 1200 మంది సభ్యులతో మహమ్మద్ హుస్సేన్ వేలాది మందికి అవసరమైన సమయంలో రక్తం అందించారని నిర్వాహకులు ప్రశంసించారు.

మహమ్మద్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

ఏళ్ల కల.. నెరవేరుతున్న వేళ

పాలేరువాగు పరివాహంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సంజామల మండలంలోని ముదిగేడు, ముక్కమల్ల గ్రామాల మధ్యనున్న పాలేరువాగుపై నిర్మించిన వంతెనలు, ఏర్పాటైన రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులకు రహదారి ప్రాణసంకటంగా మారింది. కూటమి ప్రభుత్వం చొరవతో మరమ్మతులకు రూ.1.25 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో వాగులో దెబ్బతిన్న ప్రదేశంలోని రహదారిని తొలగించి కొత్తది నిర్మిస్తున్నారు. రహదారి కష్టాలు తీరనుండటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, సంజామల

జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు అటవీ ప్రాంతంలోని జీవ వైవిధ్య పరిరక్షణపై ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నట్లు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావుజీ స్పష్టం చేశారు. బైర్లూటిలోని ఎకోటూరిజంలో ఆదివారం అటవీ, విద్యుత్తు శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. . అటవీ సమీప గ్రామాల్లో విద్యుత్తు సరఫరాను వేటగాళ్లు దుర్వినియోగం చేస్తూ జంతువులను వేటాడుతున్నారన్నారు. అనధికార విద్యుత్తు కనెక్షన్లను అరికట్టాలని విద్యుత్తుశాఖ అధికారులకు సూచించారు. హైదరాబాద్ హైటీకోస్ సంస్థ ప్రతినిధి ఇమ్రాన్ సిద్ధిఖీ అటవీ భూభాగం సరిహద్దుల గుర్తింపు, అనధికార విద్యుత్తు కనెక్షన్లపై ఉద్యోగులకు వివరించారు.

విమర్శలు చేయడం మానుకోవాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నల్లగట్ల చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణ వ్యవహారాలపై ప్రతిపక్ష పార్టీ నాయకులు విమర్శలు మానుకోవాలని తెదేపా నాయకుడు గుర్రప్ప యాదవ్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవ తీసుకుని దేవాదాయ శాఖ అనుమతులతో గుడి నిర్మాణాన్ని ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించారన్నారు. గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కల్గించేలా వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిపక్ష పార్టీలు సహకరించాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనరు హరికుమార్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

బోడెమ్మనూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బోడెమ్మనూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వి. రమణయ్య ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. సీపీఎస్ విధానం రద్దు, పాత పింఛను విధానాన్ని వర్తింపు తదితర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరి విషయంపై ప్రభుత్వం ఆలోచించాలన్నారు. బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులకు భారంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, రమేష్, శ్రీనివాసులు ఉన్నారు.

రమణయ్యను సత్కరిస్తున్న నాయకులు

పల్లె విద్యార్థులు.. ఆటల్లో మెరికలు

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: శిరివెళ్ల మండల యర్రగుంట్ల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. వివిధ స్థాయిల్లో ఆటల పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతున్నారు. పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు డిసెంబరు రెండో వారంలో అనకాపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి 19వ విభాగం ఎస్‌జీఎఫ్ థాంగ్-టా(సంప్రదాయ యుద్ధ కళ) పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున పాల్గొనబోతున్నారు. పాఠశాల హెచ్ఎం విజయ్ కుమార్, పీడీ సురేష్, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నారు.

జాతీయ స్థాయి పతకమే లక్ష్యం – ప్రణీత, ఎనిమిదో తరగతి

ఆళ్లగడ్డ మండలంలోని బత్తులూరు గ్రామానికి చెందిన శేఖర్, శ్యామల దంపతుల కుమార్తె ప్రణీత యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. నవంబరులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ 19వ విభాగం 50 కేజీల విభాగం థాంగ్-టా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున ఎంపికైంది. నిత్యం సాధనతో జాతీయ స్థాయి పతకమే లక్ష్యమని చెబుతోంది ప్రణీత.

పోలీసు కొలువు సాధిస్తా - భార్గవ నరసింహ, తొమ్మిదో తరగతి

రుద్రవరం మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన బాలయ్య, చెన్నమ్మ దంపతుల కుమారుడు భార్గవ నరసింహ స్థానిక జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ నవంబరులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ 19వ విభాగం 62 కేజీల థాంగ్-టా పోటీలో ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నిత్య సాధనతో జాతీయ స్థాయి పోటీల్లో రాణించి భవిష్యత్తులో క్రీడాకోటాలో పోలీసు ఉద్యోగం సాధించాలని చెబుతున్నాడు భార్గవ నరసింహ.

(c) eenadu

ఈనాడు పల్నాడు
సోమవారం డిసెంబరు 8, 2025

త్రికోటేశ్వరుడికి మహాభిషేకం

అన్నాభిషేకం అనంతరం అలంకరణ

గంధంతో..

పసుపుతో..

పంచదారతో..

కోటప్పకొండపై శ్రీత్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి ఆరుద్రోత్సవం వైభవంగా సాగింది. అర్ధరాత్రి తర్వాత త్రికోటేశ్వర స్వామికి మహన్యాస పూర్వకంగా మహారుద్రాభిషేకం నిర్వహించారు. జలం, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పంచదార, తేనె, గంధం, విభూది, పసుపు, కుంకుమ, ఎండు ఫలాలు, సుగంధద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం చేపట్టారు. అంతకు ముందు పాత కోటయ్య స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే అరవిందబాబు స్వామిని దర్శించుకున్నారు. **- న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్**

విద్యుత్తు బిల్లు.. గడువు దాటొద్దు

యడ్లపాడు: ఒక్క నెలే కదా అని విద్యుత్తు బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారా.. అయితే జరిమానా చెల్లించక తప్పదు. ప్రతీ కరెంటు బిల్లుపై గడువు తేదీ ఉంటుంది. రీడింగ్ తీసిన రోజు నుంచి 15 రోజులు లోగా బిల్లు చెల్లించాలని విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారు. ☛ గడువులోగా చెల్లించకుంటే కనెక్షన్‌ను బట్టి రూ.25 నుంచి రూ.150 వరకు జరిమానా విధిస్తారు. కేటగిరీల వారీగా తర్వాత బిల్లులో ఆటోమేటిక్‌గా అదనపు నగదు బిల్లులో వస్తుంది. రెండు నెలలైనా బిల్లు చెల్లించకుంటే మరో 15 రోజుల సమయం ఇచ్చి కరెంటు సరఫరా నిలిపివేస్తారు. కనెక్షన్ తొలగింపు సమయంలో కటింగ్ చార్జీల కింద రూ.75 వినియోగదారుల నుంచే వసూలు చేస్తారు.

బాలికలూ.. హాయిగా చదువుకోండి

బాలికల చదువుకు కూటమి ప్రభుత్వం నిండైన భరోసా ఇస్తోంది. ఏపీ ఆదర్శ పాఠశాలలు, కళాశాలల్లోని బాలికల వసతి గృహాల అభివృద్ధి, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసింది.

ఒక్కో ఆదర్శ పాఠశాలకు రూ.15 లక్షలు మంజూరు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో (ఏపీఎంఎస్) ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధన సాగుతోంది. పదిచోట్ల బాలికల వసతి గృహాలు ఉండగా.. ఒక్కోచోట తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే 100 మంది విద్యార్థినులు ఉన్నారు. వీటిని టైప్-4 కేజీబీవీలుగా ప్రభుత్వం గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంది.

బొల్లాపల్లి, నూజండ్ల, చీకటిగలపాలెం (వినుకొండ), చిరుమామిళ్ల (నాదెండ్ల), క్రోసూరు, దేచవరం (నకరికల్లు), దాచేపల్లి, గురజాల, కారంపూడి, విప్పర్లరెడ్డిపాలెం(రొంపిచర్ల)లోని ఏపీఎంఎస్ వసతి గృహాల్లో సదుపాయాల కల్పనకు ఒక్కో విద్యాలయానికి రూ.15 లక్షల చొప్పున మంజూరు చేశారు. తొలివిడతగా రూ.6 లక్షలు ఇప్పటికే విడుదల చేశారు. వీటిని ఖర్చు చేసి వినియోగ పత్రాలు (యూసీలు) సమర్పిస్తే మిగిలిన నిధులు విడుదల చేస్తారు.

❖ వసతిగృహం అంతటికి దోమల మెస్ ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చడం, మరుగుదొడ్లకు తలుపుల ఏర్పాటు.. మరమ్మతులు, విద్యుదీకరణ, తాగునీటితోపాటు పైపులైన్లు లాంటి సివిల్ పనుల్ని చేపట్టనున్నారు. బాలికల చదువుకు ప్రతిబంధకాలు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. ఏపీ ఆదర్శ పాఠశాలల వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరైనట్లు జిల్లా సమన్వయకర్త రేవతి తెలిపారు. పది వసతిగృహాల్లో పకడ్బందీగా పనులు జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలని, చదువులో వెనుకబడిన(సీ, డీ గ్రేడ్) విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని డీఈవో చంద్రకళ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో వంద రోజుల ప్రణాళిక అమలు తీరును ఆదివారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసనా స్థాయిలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా విద్యాబోధన చేయాలన్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపకల్పన చేసిన స్టడీ మెటీరియల్ అందజేసి స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. అంతకు ముందు పట్టణంలోని ఎన్ఎంఎంఎస్ పరీక్షల కేంద్రాలను డీఈవో సందర్శించారు. ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్.. తక్షణ వైద్యమే రక్ష

ఉమ్మడి జిల్లాలో కేసులు నమోదు

జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు

ఈనాడు, అమరావతి

గుంటూరు శివారు గ్రామాన్ని పట్టిపీడించిన మెలియాయిడోసిస్ వేదన మరువక ముందే రాష్ట్రవ్యాప్తంగా మరో వ్యాధి తెరపైకి వచ్చింది. అన్ని జిల్లాల్లోనూ స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కావడంతో ఇక్కడా ఉలికిపాటు మొదలైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 50 మందికి ఈ వ్యాధి సోకగా.. పలువురు ఇప్పటికే కోలుకున్నారు. ఆదివారం సాయంత్రానికి 14 మంది జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. శనివారం ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలు ఇదే వ్యాధితో చనిపోగా, అదే రోజు అర్ధరాత్రి పల్నాడు జిల్లాకు చెందిన మరో మహిళ ప్రాణాలు కోల్పోయారు. ఈమెకు కిడ్నీ సంబంధ సమస్యలూ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక, పల్నాడు జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 11 కేసులు నమోదు కాగా.. ఇద్దరు చనిపోయి, 9 మంది కోలుకున్నారు. బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు 3 కేసులు నమోదు కాగా.. ఇద్దరు చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఇద్దరిలోనూ ఒకరికి ఇతర అనారోగ్య కారణాలు ఉన్నాయన్నది వారి మాటల సారాంశం. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ప్రత్యేక బృందాల ఏర్పాటు అనుమానిత లక్షణాలతో గుంటూరు జీజీహెచ్‌కు వచ్చే వారిని ప్రత్యేకవార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షల కోసం ప్రత్యేక ప్రయోగశాల సిద్ధం చేశారు. వ్యాధి నిర్ధారణ అయినంతనే వారి ఆరోగ్య పరిస్థితులను బట్టి చికిత్స ఉంటోంది. అలాగే, వారి చిరునామాల ఆధారంగా ఆయా ప్రాంతాలకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను పంపించి పరిసరాల్లోని ప్రజలకూ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

లక్షణాలు ఇలా.. స్క్రబ్ టైఫస్ అనేది ఒక రకమైన జ్వరం. ఇది మైట్ (నల్లి తరహా పురుగు) కరిచినప్పుడు వస్తుంది. అడవులు, పంట పొలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుంది. పురుగు కరిచిన ప్రదేశంలో చర్మంపై చిన్నపాటి నల్లని పుండు ఏర్పడుతుంది. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, దద్దుర్లు దీని ప్రధాన లక్షణాలు.

జాగ్రత్తలతో దూరం.. ✦ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ✦ ఇంట్లో తడి దరి చేరనీయకూడదు ✦ కాళ్లు, చేతులు కప్పి ఉండేలా దుస్తులు ధరించాలి ✦ పంట పొలాల్లో పనిచేసే వారిని ఏదైనా పురుగు కరిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఆలస్యం చేయొద్దు

స్క్రబ్ టైఫస్ లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే పరీక్షలు చేయిస్తే నిర్ధారణ చేయొచ్చు. తద్వారా సరైన చికిత్స తీసుకొని కోలుకోవచ్చు. అలా కాకుండా ఆలస్యం చేస్తే అవయవాల వైఫల్యానికి దారితీసి ఇబ్బందిగా మారడానికి అవకాశం ఉంది.

- డాక్టర్ అనిల్, జనరల్ మెడిసిన్, గుంటూరు జీజీహెచ్

దాచుకోలేరని.. దోచుకుంటున్నారు

ధాన్యం దిగుబడులు ప్రారంభమైన తొలినాళ్లలో బహిరంగ మార్కెట్‌లో 75 కిలోల ధాన్యం బస్తాను రూ.1500 వరకు ప్రైవేటు వ్యాపారులు కొన్నారు. తాజాగా తేమశాతాన్ని సాకుగా చూపి వ్యాపారులు ప్రస్తుతం రూ.1300కే కొంటున్నారు. వాతావరణ మార్పులతో ధర తగ్గించడంతో రైతులు నష్టపోతున్నారు.

75 కిలోల ధాన్యం బస్తా రూ.1300కే కొనుగోలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లాలో ఈ ఏడాది 53,090 హెక్టార్లలో వరి సాగు చేశారు. సుమారు 4.30లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ముందుగా సాగు చేసిన నకరికల్లు, ఈపూరు, రొంపిచర్ల, దాచేపల్లి, పిడుగురాళ్ల తదితర మండలాలతో పాటు బుగ్గవాగు కింద సాగు చేసిన వరి పొలాలు కోతకు వచ్చాయి. కొందరు రైతులు కోత కోసి ధాన్యాన్ని ఆరబోశారు. తొలినాళ్లలో ప్రైవేటు వ్యాపారులు 75 కిలోల ధాన్యం రూ.1500కు కొన్నారు. తర్వాత వాతావరణ మార్పులు, తీవ్ర మంచు తదితర పరిస్థితులు ధాన్యం నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు ఒక్కసారిగా ధర తగ్గించారు. బస్తాకు రూ.200 వరకు తగ్గించారు. జిల్లా వ్యాప్తంగా 100 క్లస్టర్లలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించి పలు చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. అక్కడ ధాన్యంలో తేమశాతాన్ని సాకుగా చూపి కొనడం లేదు. పంటను నిల్వ చేసుకునే వెసులుబాటు లేక రైతులు ప్రైవేటు వ్యాపారులు చెప్పిన ధరకే ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

బస్తాకు రూ.వందల్లో నష్టం.. ప్రభుత్వం ఈ ఏడాది ఏ గ్రేడు ధ్యానం 75 కిలోల బస్తా ధర రూ.1791గా నిర్ణయించింది. సాధారణ రకానికి 75 కిలోల బస్తాకు రూ.1776 ధర ఉంది. వ్యాపారులు 75 కిలోల బస్తా ధాన్యానికి రూ.1300 నుంచి రూ.1400కు మించి చెల్లించడం లేదు. దీంతో రైతుకు నష్టం తప్పడం లేదు.

ఆన్‌లైన్‌లోనూ అర్జీలు పంపొచ్చు

నరసరావుపేట అర్బన్: ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించేందుకు వీలుగా కలెక్టరేట్‌లో ఈనెల 8న సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన సమాచారం ఫోన్‌కు వస్తుందని తెలిపారు. గతంలో అర్జీలు ఇచ్చిన వారు సమస్య పరిష్కారం కాకుంటే పాత రసీదు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అర్జీలపై పరిష్కారానికి సంబంధించిన అంశంపై సమాధానాలు, నోటీసులు వాట్సప్‌కు అందుతాయని, అర్జీదారులు గమనించాలన్నారు. దీంతో పాటు కాల్ సెంటర్ 1100 సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్‌లో Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

చచ్చినా చావే!

చిలకలూరిపేట సమీపంలోని ఓగేరు వాగు వద్ద ఉన్న శ్మశాన వాటికలకు వెళ్లే దారిలేక వాగు ఒడ్డునే అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. మరుభూమికి వెళ్లేదారి వర్షాలకు దెబ్బతినడంతో పాటు చుట్టూ మురుగు చేరి ముళ్లపొదలతో నిండి ఉంది. శ్మశాన వాటికకు వెళ్లేలా దారిని అభివృద్ధి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

- ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ. 6 వేలు

వినుకొండ రూరల్: గర్భిణులు రెండో కాన్పులో ఆడపిల్లకు జన్మనిస్తే ఇక నుంచి మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా రూ.6వేలు అందనున్నాయి. ప్రధానమంత్రి మాతృవందన యోజన కింద లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిరుపేద గర్భిణులందరికీ ఈ పథకం ద్వారా నగదు అందించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఈ బాధ్యతను ప్రభుత్వం ఇటీవల ఆరోగ్య శాఖ నుండి మహిళా శిశు సంక్షేమ శాఖకు మార్పు చేసింది. ఈ పథకంలో భాగంగా మొదటి కాన్పులో మహిళ ఏ శిశువుకు జన్మనిచ్చినా రూ.5వేలు చెల్లిస్తారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే మాత్రం మరో రూ.6 వేలు అందుతాయి. ఈ మొత్తాన్ని బాలింతలకు పోషకాహారం, శిశువుల టీకాలకు వినియోగించాలని సూచిస్తున్నారు. తెల్లరేషన్ కార్డులు ఉన్న వారంతా ఈ పథకానికి అర్హులే. గర్భం దాల్చగానే వైద్యశాలలో పేరు నమోదు చేయించుకుని ఆ వివరాలను గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,254 మంది పేర్లు నమోదు చేశామని, ఇంకా 4,235 మంది వివరాలు నమోదు చేయాల్సి ఉందని పీడీ ఉమాదేవి తెలిపారు.

నాటి సకలేశవరం నేటి రొంపిచర్ల

పూర్వం రెడ్డిరాజులు, చోళులు కోటకట్లను కేంద్రంగా చేసుకొని సకలేశవరాన్ని పరిపాలించారు. శత్రువుల నుంచి తమ ప్రాంతాన్ని రక్షించుకోవటానికి అప్పటి పాలకులు కోట కట్ల చుట్టూ పెద్ద కందకాలు తీయించారు. ఈ కందకాలు లోతుగా తీయటం వల్ల ఊట నీరు వచ్చి పల్లపు ప్రాంతంగా ఉన్న సకలేశవరం బురదగా మారింది. ఈక్రమంలో సకలేశవరంను రొంపాచర్లగా పిలవబడింది. కాలక్రమేణా రొంపాచర్ల కాస్తా రొంపిచర్లగా స్థిరపడిందని గ్రామంలోని పెద్దలు చెబుతున్నారు.

- రొంపిచర్ల, న్యూస్‌టుడే

విద్యుత్తు విభాగంలో లంచాల షాక్

నగదు ఇవ్వకపోతే పని చేయని అధికారి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, అమరావతి

సీఆర్డీఏ పరిధి విద్యుత్తుశాఖలో పనిచేసే ఓ అధికారి కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తెస్తూ అక్రమంగా వసూళ్లు చేస్తున్నారు. పని ఏదైనా తనకు రావాల్సినవి ఇవ్వకపోతే నిలిపేస్తున్నారు. ఉద్యోగ విరమణ లోపు వీలైనంత సంపాదించుకోవడానికి సహకరించాలని బహిరంగంగానే చెబుతున్నారు. రెండునెలల క్రితం సీఆర్డీఏ పరిధిలో విద్యుత్తుశాఖలో అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రెండో రోజే కిందిస్థాయి వారిని పిలిపించుకొని తన లక్ష్యం వివరించారు. మండలాల పరిధిలో ప్రతి పనికి తనకు వాటా రావాలని ఆదేశాలిచ్చారు.

అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు వెళ్లాయి. అయినా సీఎండీలోని ఓ ఉన్నతాధికారి అండదండలు ఉండటంతో ఆయనను ఎవరూ ఏమీ చేయలేక పోతున్నారని విద్యుత్తు శాఖలోనే చర్చ నడుస్తోంది. ఆ అధికారి ధనదాహానికి తట్టుకోలేక కొంతమంది కిందిస్థాయి సిబ్బంది సెలవుపై వెళ్లేందుకు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది.

☛ సీఆర్డీఏ పరిధిలోని అధికారి కావడంతో రాజధాని అమరావతి పరిధిలో జరుగుతున్న పనులకు కూడా లంచం ఇవ్వకపోతే అర్ధంతరంగా నిలిపేస్తున్నారని గుత్తేదారులు వాపోతున్నారు.

☛ ఆయా మండలాల పరిధిలో విద్యుత్తు పనులు చేసే గుత్తేదారులను పిలిపించుకుని తాను కొత్త కారు కొనాలని, ఒక్కొక్కరు తనకు రూ.లక్షన్నర చొప్పున ఇవ్వాలని చెప్పారు. పనులు పరిశీలించేందుకు సొంతంగా కారు పెట్టి తీసుకెళతామని అంత ఇచ్చుకోలేమని చెప్పడంతో కొంత మందికి పనులు రాకుండా అడ్డుకున్నారు.

☛ ఇటీవల అమరావతిలో ఓ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి నియంత్రిక ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోగా అందుకు సదరు అధికారి రూ.50 వేలు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు చేశారని చెప్పినా వినలేదు. చివరకు ఆ అధికారికే ప్రజాప్రతినిధి పీఏ ఫోన్ చేసినా నగదు ఇవ్వనిదే పని చేయలేదు.

☛ ధరణికోటలోని ఓ దేవాలయానికి సంబంధించి అధికలోడు కోసం ఆలయ నిర్వాహకులు దరఖాస్తు చేసుకోగా దానికి మండల స్థాయి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అందుకు రూ.30 వేలిస్తే కానీ ప్రతిపాదనలు ఆమోదించనని చెప్పడంతో చేసేది లేక అడిగినంత ఇచ్చారు.

☛ మండలాల్లో వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. తనకు తెలియకుండా ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వడానికి వీలు లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సమస్య ఉన్న చోట స్తంభం మార్చినా తనకు రావాల్సినవి ఇవ్వాలని లేకపోతే పని చేయవద్దని చెప్పడం గమనార్హం.

☛ అదే అధికారి ఇటీవల అమరేశ్వరాలయ దర్శనానికి వచ్చిన సీఎండీకి ఏర్పాట్లు చేయడానికి అమరావతి మండల వైకాపా అధ్యక్షుడికి బాధ్యతలు అప్పజెప్పాడు. దీంతో ఆ వైకాపా నేత సీఎండీ పర్యటనలో హడావుడి చేశాడు ఈ విషయం పెద్దఎత్తున చర్చనీయాంశమైనా ఇంత వరకు చర్యల్లేవు. సదరు అధికారి కుటుంబ సభ్యులు పత్తిపాడు నియోజకవర్గంలో వైకాపా ప్రజాప్రతినిధులుగా ఉండటంతో ఆ పార్టీ నేతలకు అంటకాగుతున్నారనే విమర్శలున్నాయి.

దీపాల వెలుగులో.. బాక్స్ క్రికెట్

దీపాల వెలుగులో బంతి, బ్యాట్‌తో జిల్లాలోని యువత సందడి చేస్తోంది. ఉద్యోగాలు, వివిధ పనుల్లో పగలు బిజీబిజీగా గడిపే యువకులు రాత్రికి జట్లుగా బాక్స్ క్రికెట్‌లో పోటీపడుతున్నారు. కొందరికి ఇది ఉపాధి చూపిస్తుండగా క్రీడాకారులకు సాధనతో పాటు ఆహ్లాదం అందిస్తోంది. సత్తెనపల్లి, నరసరావు పేట, చిలకలూరిపేటతో పాటు వివిధ పట్టణాలు, నగర పంచాయతీలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ బాక్స్ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతోంది. తక్కువ విస్తీర్ణంలో క్రికెట్ మజాను ఆస్వాదించే అవకాశం ఉంటుంది. దీనికితోడు బ్యాట్లు, బంతులు, వికెట్లను నిర్వాహకులే అందిస్తున్నారు. తీరిక వేళల్లో బాక్స్ క్రికెట్ ఆడేందుకు పిల్లలు, యువకులు ఆసక్తి చూపిస్తున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి, నరసరావుపేట క్రీడలు**

అనుమతుల్లేని పురుగుమందులు తరలిస్తే కఠిన చర్యలు

తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖ అధికారులు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: గుర్తింపు, అనుమతుల్లేని పురుగు మందులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి ఆదినారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కార్యాలయంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ, హైదరాబాద్ నుండి నరసరావుపేటకు సుమారు 60 పురుగుమందుల పెట్టెలు వచ్చాయని తెలిపారు. వీటికి సరైన పత్రాలు ఉంటేనే సంబంధిత వ్యాపారులకు అప్పగిస్తామని, లేకుంటే సీజ్ చేస్తామన్నారు. పల్నాడు జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో కార్గో విభాగంలో తనిఖీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ ఉన్నారు.

వందేళ్లు దాటినా పటిష్ఠంగా..

వినుకొండలో సుమారు 127 ఏళ్ల క్రితం ఆంగ్లేయుల పాలనలో నిర్మించిన రెండు కట్టడాలున్నాయి. ఒకదానిలో నాటి ఉమ్మడి కృష్ణా జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఉండేది. స్వాతంత్ర్యం అనంతరం సమితి కార్యాలయంతో పాటు ఎంప్లాయిమెంట్ నమోదు కేంద్రంగా వినియోగించారు. అది ఇప్పుడు మండల పరిషత్తు కార్యాలయమైంది. మరోదానిని నాటి నుంచి తహసీల్దార్ కార్యాలయంగానే వినియోగిస్తున్నారు. అప్పట్లో తాలూకా ఆఫీసు అని పిలిచేవారు. దీనిని 1898లో నిర్మించినట్లు గోడపై రాసి ఉంది. పైకప్పు పెంకులు కొన్ని దెబ్బతినడం తప్ప సున్నంతో నిర్మించిన గోడలు ఇప్పటికీ పటిష్ఠంగానే ఉన్నాయి. చెక్క తలుపులు, కిటికీలు చెక్కు చెదరలేదు. సుమారు 20 అడుగుల ఎత్తు పైకప్పు ఉన్నందున వేసవిలోనూ లోపల చల్లగా ఉంటుంది. **- న్యూస్‌టుడే, వినుకొండ**

కంటైనర్‌ను ఆపింది ఏఎస్సై కుమారుడే!

బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌నంటూ అక్రమంగా వసూళ్లు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే: చిలకలూరిపేట గ్రామీణ చిలకలూరిపేట బైపాస్‌లో ఈనెల 4న ఘోర ప్రమాదం.. ఐదుగురు బీటెక్ విద్యార్థుల మృతి చిక్కుముడి వీడింది. ట్రాక్టర్ల లోడుతో వెళ్తున్న భారీ కంటైనర్‌ను ఓ కారులో వెళ్తున్న వ్యక్తి ఆపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. కంటైనర్‌ను ఆపిన వ్యక్తి నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో పనిచేసే ఏఎస్సై కుమారుడే అని గుర్తించారు. ట్రాక్టర్ల లోడ్ కంటైనర్‌ను పక్కన ఆపాలని కారులోంచి దిగి చేతితో సైగచేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌గా అవతారం ఎత్తి జాతీయ రహదారులు, బైపాస్‌ల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఏఎస్సై కుమారుడి లీలలు బయటకు వస్తున్నాయి. 2023లో తక్కువ ధరకే బంగారం పేరిట కారు, రూ.40 లక్షలతో ఉడాయించాడు. ఇందులో తండ్రి హస్తం కూడా ఉందని అప్పట్లోనే నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఈ కేసు ఎస్పీ వద్ద ఉంది. కుర్రాళ్లతో ఓ గ్యాంగ్ ఏర్పాటు చేసుకుని వారి ద్వారా తన నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నాడు. గంజాయి సరఫరా, విక్రయాలు చేస్తూ కాలేజీ విద్యార్థులను మత్తులోకి దింపుతున్నాడు. వేర్వేరు చోట్ల రిజిస్టర్ అయిన ఖరీదైన కార్లు ఇతని వద్ద అయిదు ఉన్నాయి. ఇవి ఎలా సంపాదించాడు? ఎవరిపేర రిజిస్టర్ అయి ఉన్నాయనేది పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది. పలుకుబడి ఉపయోగించుకుని కొన్నేళ్లుగా నరసరావుపేటలోనే పోస్టింగ్ వేయించుకుంటూ కుమారుడి నేరాలకు తండ్రి సహకరిస్తున్నట్లు పోలీసుశాఖలోనే చర్చ నడుస్తోంది. ఆదివారం చిలకలూరిపేట గ్రామీణ పోలీసులు ఏఎస్సై కుమారుడిని నరసరావుపేట నుంచి తీసుకెళ్లి రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం.

సాయం అందదు.. పౌష్టికాహారం ఉండదు

క్షయ రోగులకు తొమ్మిది నెలలుగా నిలిచిన ప్రోత్సాహకం

నరసరావుపేట, న్యూస్‌టుడే

సత్తెనపల్లి ఆసుపత్రిలో టీబీ విభాగం సేవలపై జిల్లా పర్యవేక్షణ అధికారి పరిశీలన

క్షయ(టీబీ)తో బాధపడే రోగులు పౌష్టికాహార నగదు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి రెండు కాదు ఏకంగా తొమ్మిది నెలల నుంచి ప్రోత్సాహక సాయం అందడంలేదు. ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందజేసే మందులు వాడితే టీబీ నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆ కాలంలో ఔషధాలతో పాటు పౌష్టికాహారం తీసుకునేలా కేంద్ర ప్రభుత్వం నిక్షయ్ పోషణ యోజన కింద నగదు సాయం అందజేస్తోంది. 2018లో క్షయ రోగులకు ఆర్థికసాయం అందజేతకు శ్రీకారం చుట్టారు. మొదట్లో నెలకు రూ.500 చొప్పున అందజేశారు. ఆ తర్వాత 2024లో సాయాన్ని రూ.వెయ్యికి పెంచారు. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు సక్రమంగా అందజేశారు. మార్చి నుంచి నగదు పంపిణీ ఆగిపోయింది.

జిల్లాలో సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, గురజాల, ఈపూరు, క్రోసూరులో టీబీ యూనిట్లున్నాయి. సత్తెనపల్లి యూనిట్ పరిధిలో 150 మంది మందులు వాడుతున్నారు. మిగిలిన కేంద్రాల్లోనూ 150 నుంచి 250 మంది వరకు రోగులు ఔషధాలు అందుకుంటున్నారు.

☛ రూ.వెయ్యి సాయం పెంచిన మొదట్లో ఒకేసారి రూ.3 వేలు నగదును మందులు వాడటం ప్రారంభించిన వెంటనే అందజేశారు. తరువాత క్రమంగా రూ.వెయ్యి చొప్పున ఆరు నెలల్లోపు అందించేవారు. మార్చిలో మందులు వాడటం ప్రారంభిస్తే ఆగస్టుకే చికిత్స కాలం పూర్తవుతుంది. ఈలోపు ప్రోత్సాహకం అందాల్సి ఉండగా పైసా రాలేదు.

☛ గతంలో జిల్లా అధికారులు చొరవ తీసుకుని నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా క్షయ వ్యాధిగ్రస్థులకు ఫుడ్ బాస్కెట్లు (నిత్యావసర సరకులు, పౌష్టికాహారం) అందజేసేవారు. ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై రోగులను దత్తత తీసుకుని వారికి అవసరమైన సరకులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ కార్యక్రమం కూడా నిలిచిపోయింది.

☛ పౌష్టికాహారం నగదు అందజేసేందుకు బిల్లులు సమర్పించినట్లు టీబీ యూనిట్ల బాధ్యులు 'న్యూస్‌టుడే' బృందానికి చెప్పారు. ఉన్నతస్థాయి నుంచి నిధులు మంజూరైన వెంటనే బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

ధాన్యం కొనుగోలుకు నూతన మార్గదర్శకాలు

పెరిగిన రూ.52 మద్దతు ధర

వెల్లటూరు యార్డులో ధాన్యం రాశులు

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. ధాన్యంలో తేమ శాతం 17కు మించకూడదు. రైతుకు నాణ్యమైన ధాన్యం 75 కిలోల బస్తాకు గత సంవత్సరం కంటే అదనంగా రూ.52 మద్దతు ధర పెంచారు. సీజనులో ఎదురయ్యే కొరత సమస్య అధిగమించడానికి నేరుగా రైతులు ట్రాక్టర్లతో తరలించుకునే అవకాశం కల్పించారు. ఈ విధానంలో ధాన్యాన్ని మిల్లుకు తరలించే ట్రాక్టరుకు కొనుగోలు కేంద్రం అధికారులు జి.పి.ఎస్ అనుసంధానం చేస్తారు. దీంతో రైతు ధాన్యం లోడింగ్ పూర్తి చేసిన తరువాత ట్రాక్‌షీట్ రూపొందించి కేటాయిస్తారు. ఈ విధానంలో ప్రభుత్వం అందించే రవాణా చార్జీలు కూడా నేరుగా రైతు బ్యాంక్ ఖాతాకు జమ అవుతాయి. గతంలో హమాలీల కూలీ బస్తాకు రూ.17 ఉండేది. ఇప్పుడు దాన్ని రూ.22 కు పెంచారు. వాతావరణం పొడిగా ఉన్నందున పొలంలో పంట పూర్తిగా ఎండిన తరువాత కోత కోసి ఆరబెట్టి కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని వ్యవసాయాధికారి అంబారావు, జీసీఎస్ఎస్ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు వివరించారు.

ప్రత్యేక హుండీ ఎందుకు తెరిచారో..?

అధికారులు ఎవరూ లేకుండా ప్రత్యేక హుండీ తెరుస్తున్న సిబ్బంది

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతిలోని అమరేశ్వరాలయంలో దేవుని సొమ్ముకు భద్రత లేకుండాపోతోంది. ప్రత్యేక ఉత్సవాల సమయంలో ఆలయానికి వచ్చే భక్తులకు అనువుగా కానుకల కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక హుండీ ఆదివారం ఏర్పాటు చేయడం, దాన్ని అధికారులు ఎవరూ లేని సమయంలో తెరవడం చర్చనీయాంశమైంది. ప్రత్యేక ఉత్సవాల సమయంలో ఏర్పాటు చేసే హుండీ వివరాలు రికార్డుల్లో నమోదు చేసుకొని తరువాత అధికారుల సమక్షంలో తెరుస్తుంటారు. ఆదివారం ఉత్సవాలేవీ లేకపోయినా నిఘా కెమెరాలు లేని చోట ప్రత్యేక హుండీ ఏర్పాటు చేయడం, హుండీలో వేసిన నగదును ఎవరి పర్యవేక్షణ లేకుండా ఆలయ సిబ్బందే తీయడంపై విమర్శలు వచ్చాయి. ఈ విషయంపై ఆలయ ఈవో రేఖను వివరణ కోరగా ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక హుండీ ఏర్పాటు చేశామన్నారు. ఆ హుండీలోని కానుకలు ప్రధాన హుండీలో వేయడానికే సిబ్బంది తీసినట్లు చెప్పారు.

బండలాగుడులో చుండూరు ఎడ్లు ప్రథమం

గురజాల, న్యూస్‌టుడే: పాతపాటమ్మ తిరునాళ్ల పురస్కరించుకుని నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. న్యూకేటగిరి విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అల్లూరి శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత మొదటి బహుమతిని దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత రెండో బహుమతి, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన మంగు రమాదేవి ఎడ్లజత మూడో బహుమతి కైవసం చేసుకున్నాయి. పోటీలను రైతు కమిటీ సభ్యులు ఎన్.లక్ష్మయ్య, టి.బుచ్చిబాబు, ఎన్.మల్లయ్య, పి.నాగేశ్వరరావులు పర్యవేక్షిస్తున్నారు.

చురుగ్గా కదులుతూ.. గెలుపు గోల్ చేస్తూ..

బాస్కెట్‌బాల్‌లో రాణిస్తున్న విద్యార్థినులు

ఏఎన్‌యూ అంతర కళాశాల మహిళల బాస్కెట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన జట్టు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే

బరిలో దిగారంటే.. ప్రత్యర్థికి హడలే. బంతి పట్టారంటే.. గోల్‌లోకి పంపే వరకు విశ్రమించరు. మెరుపు వేగంతో మైదానంలో కదులుతూ ప్రత్యర్థి వ్యూహాలను తిప్పికొడతారు. పీడీ డాక్టర్ రాజా మెర్సిన్ వద్ద శిక్షణ పొందుతూ అతి కష్టమైన బాస్కెట్‌బాల్ క్రీడలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. నరసరావుపేట పట్టణానికి చెందిన వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన క్రీడాకారిణులు పలు పోటీల్లో పతకాలు కైవసం చేసుకుంటూ తమ ప్రత్యేకత చాటుతున్నారు. ఇటీవల నిర్వహించిన ఏఎన్‌యూ అంతర కళాశాల మహిళల బాస్కెట్‌బాల్ పోటీల్లో షేక్ దిల్‌అఫ్రోజ్, చిలకా సింధూర, కుంచాల నందిని చక్కని ఆట తీరుతో జట్టును ద్వితీయ స్థానంలో నిలపడంలో కీలక పాత్ర పోషించి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు తమ లక్ష్యాలను ఇలా వివరించారు.

క్రీడాకోటాలో ఉద్యోగం సాధిస్తా..

పట్టణానికి చెందిన కుంచాల నందిని చిన్నతనం నుంచి ఆటలపై ఆసక్తి ఎక్కువ. ప్రస్తుతం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. చదువుతో పాటు బాస్కెట్‌బాల్ క్రీడపై ఆసక్తితో ఇప్పటి వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17, 19 విభాగాల్లో ఆడింది. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాదేశ్వరంలో ఛత్తీస్‌గఢ్, పంజాబ్, తమిళనాడులో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. బంతి పట్టుకొని బరిలో దిగితే ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తుంది. ఆల్‌రౌండర్ పాత్రను సమర్థంగా నిర్వహిస్తోంది. తాజాగా ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైంది. క్రీడా కోటాలో రైల్వే ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని చెబుతోంది.

రెండు సార్లు ఏఎన్‌యూ జట్టుకు..

నరసరావుపేటకు చెందిన చిలకా సింధూర డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు భవన నిర్మాణ కార్మికులు. బాస్కెట్‌బాల్‌లో ఫీడర్ పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023లో జరిగిన అండర్-19 పోటీల్లో మహారాష్ట్రలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. 2024, 2025లో వరుసగా ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైంది. బంతిని పాస్ చేస్తూ తమ జట్టు క్రీడాకారులు గోల్స్ చేసేందుకు సహకరిస్తుంది. ప్రత్యర్థులు ఎంత అడ్డుకున్నా వెనకడుగు వేయకుండా దూసుకెళ్లింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో క్రీడలను ఎంచుకున్నానని తెలిపింది.

ఐపీఎస్‌పై గురి

పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కుమార్తె షేక్ దిల్ అఫ్రోజ్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో 2023లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పోటీలో జాతీయ జట్టులో ఆడింది. 2024, 2025లో ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైంది. షూటర్, డిఫెండర్, ఫీడర్ ఇలా ఏ స్థానంలో ఆడినా ప్రత్యర్థులు గోల్స్ చేయకుండా వారికి అడ్డుగోడలా నిలుస్తోంది. ఆల్‌రౌండర్‌గా జట్టుకు సేవలందిస్తుంది. ఐపీఎస్ సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు క్రీడాకారిణి చెబుతోంది.

ఐదు వేల పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న తితిదే బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి

రెంటచింతల, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల బూత్‌లపై తెదేపా ప్రత్యేక దృష్టి సారించినట్లు తితిదే బోర్డు సభ్యుడు, బూత్ కమిటీల కన్వీనర్ జంగా కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం పాలువాయి, రెంటచింతలలో పర్యటించారు. పాలువాయి 197 బూత్‌లో 2019లో వైకాపాకు 470 ఓట్ల మెజార్టీ రాగా 2024కు 158 ఓట్లకు మెజార్టీ తగ్గిందని, రెంటచింతల 227 బూత్‌లో 2019లో వైకాపాకు 319 ఓట్ల మెజార్టీ రాగా 2024కు 42కు తగ్గించిన తెదేపా బూత్ కన్వీనర్లను ఆయన అభినందించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు పార్టీలకు అతీతంగా అందజేయాలని, ఆమేరకు అర్హుల జాబితాను సచివాలయం, ఎంపీడీవో కార్యాలయాలలో అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో తెదేపా నేతలు అబ్బిరెడ్డి, సుమంత్ రెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణ, ప్రభురాజు, నాళం బాబు, నరసింహారావు పాల్గొన్నారు.

హోంగార్డుపై దాడి

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): మండలంలో గురవాయపాలేనికి చెందిన గర్నెపూడి రవితేజ ఆదివారం ఓ దుకాణానికి వెళ్లాడు. తన పాత చెప్పులను విడిచి కొత్త బూట్లు తొడుక్కొని వెళ్తుండగా సిబ్బంది గమనించి ప్రశ్నించారు. ఈ విషయమై అతను వారితో వాగ్వాదానికి దిగగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న హోంగార్డు ప్రసాద్ దొంగతనం విషయమై రవితేజను ప్రశ్నించగా అతను దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందుల అక్రమ రవాణాపై కేసు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ప్రముఖ కంపెనీల ఉత్పత్తులను పోలిన రూ.3లక్షల విలువైన రెండు రకాల పురుగు మందులను వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కార్యాలయంలో వ్యవసాయాధికారులు ఈనెల 5న స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన మేరకు వివరాలు.. కార్గో పార్సిల్ ద్వారా పురుగు మందులు అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించి పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు ఏడీఏ రవికుమార్, ఏవో వరలక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. మందులు ల్యాబ్‌కు పంపామని అవి నకిలీవా? కాదా? అనేది తేలాల్సి ఉందని వాటి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై వివరించారు.

సెలవులో ఉన్నా సస్పెండ్ చేస్తారా?

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం గణపవరం పీహెచ్‌సీకి తాళాలు వేసిన సంఘటనలో విచారణ సందర్భంగా సెలవులో ఉన్న వారిని సస్పెండ్ చేయడం సరికాదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్వర్ణ రామిరెడ్డి అన్నారు. సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఈనెల 3న సాయంత్రం 5.30 గంటల సమయంలో పీహెచ్‌సీని సందర్శించారని ఆ సమయంలో తాళాలు వేసి ఉండడాన్ని గమనించి సిబ్బంది మొత్తాన్ని సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చారన్నారు. అయితే ఆ రోజు విధులు నిర్వహించిన తొమ్మిది మందితో పాటు ముందస్తు అనుమతితో సెలవు తీసుకున్న వారిని కూడా తొలగించడం సరైన చర్య కాదన్నారు. కనీసం విధి నిర్వహణలో ఉన్న వారి వివరణ కూడా తీసుకోలేదన్నారు. ఉన్నతాధికారులు తమ నిర్ణయంపై పునః సమీక్షించాలన్నారు. సంఘం నేతలు కుంచాల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, షేక్ బాజీ, ఫ్లారెన్స్, చలమారెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

10 నుంచి పెదకూరపాడులో రాష్ట్రస్థాయి క్రీడలు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య పాఠశాలలో ఈనెల 10 నుంచి రాష్ట్ర స్థాయి అండర్-20 క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుత్తా కవిత, రాము ఆదివారం వెల్లడించారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పురుషుల విభాగంలో మందడి శివరామ కాళిబాబు మెమోరియల్ వారి సహకారంతో డేఅండ్‌నైట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాయపూడి పాపయ్య-వెంకటసుబ్బమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో అండర్-20 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు పురుష, మహిళల విభాగంలో నిర్వహిస్తున్నామన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ పురుష విభాగంలో తూములూరి ఆదినారాయణ మెమోరియల్ ఆధ్వర్యంలో పోటీలు ఉంటాయన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని, కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచలి శ్రీకాంత్‌లు పాల్గొంటారని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

యూటీఎఫ్ ప్రాంతీయ శాఖల ఏర్పాటు

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ఎన్జీవోకాలనీ (నరసరావుపేట అర్బన్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల సంక్షేమం గురించి ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కారం చేయాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ఎన్జీవో కాలనీలోని టైనీటాట్స్ పాఠశాలలో యూటీఎఫ్ నరసరావుపేట ప్రాంతీయ శాఖల మహాసభలు నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని అందుకు సంబంధించిన చట్టసవరణ చేయాలన్నారు. ఉపాధ్యాయలకు బోధనేతర విధులు తొలగించాలని కోరారు. పదోతరగతి పరీక్షల వంద రోజుల ప్రణాళిక అమలులో సెలవు దినాలను మినహాయించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రణాళిక అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నరసరావుపేట పట్టణం, నరసరావుపేట మండలం, రొంపిచర్ల, నకరికల్లు మండలాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం నేతలు భాగేశ్వరిదేవి, సుందరరావు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

FINANCIAL SERVICES

నూతన ఇండస్ట్రీ ఏర్పాటుకు కావలసిన Term Loans Working Capital పాత GST Returns పై OD, CC, E.P.C Loans Distributers Expotersకి Loans ఇప్పించబడును. 94944 02285.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT, వృద్ధులకు, పేషెంట్ల సేవకు ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

గుంటూరు, పేరేచర్ల NRI ITకాలేజి ప్రక్కన ORR కి మధ్య APCRDA ప్లాట్లుకలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ. 77290 75959, 99591 27008.

JOBS

Lakshmi Spares Corporation Vijayawada. Authorised Dealer for Atlas Copco Air Compressors Wanted: Service Engineers Qul: B.Tech/ Diploma. Location: Krishna, Guntur & Prakasam. Note: Complete Field Work Send Your Resumes : hr.lakshmispares@gmail.com ✆ 90325 74443.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆: 97039 71968

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్, క్లాస్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయి ఉండాలి. సంప్ర. ఫోన్ నెంబర్: 89784 80429.

పద్మప్రియ ఆటోఫైనాన్స్ నందు పనిచేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్స్ మరియు ఆఫీస్ స్టాఫ్ కావలెను. 7 లైను, గుంటూరువారి తోట, సాయికృష్ణ లాడ్జి ప్రక్కన, గుంటూరు. 93944 46449.

గుంటూరు &నరసరావుపేటలోని ప్రముఖ అడ్వకేటు ఆఫీసునందు లీగల్ Openions టైపుచేయుటకు అనుభవంకలిగిన అభ్యర్థులు కావలెను. Ph: 93469 83822.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 20k. ✆ 89776 39662, 89776 39663.

అకౌంటెంట్స్, సూపర్ వైజర్స్ ఐషర్ డ్రైవర్స్ కావలెను. చిలకలూరిపేట మం. యడవల్లి గ్రామంలోఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 93906 33593, 90595 14555.

E-Kart నందు అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Qly: Inter Any డిగ్రీ జీః 15,000 Online are Available. 90141 20139.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

ఆటలు చక్కని వ్యాయామం

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ అండర్-17 ఫుట్‌బాల్ పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆటలు శరీరానికి చక్కని వ్యాయామమని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బాలుర విభాగంలోని పోటీలు డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో, బాలికల పోటీలను స్థానిక ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. క్రీడాకారులు, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బాలుర విభాగంలో 13, బాలికల విభాగంలో 13 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు ఎన్.సురేష్‌కుమార్, వి.పద్మావతి తెలిపారు.

మైదానంలో ప్రకాశం-గుంటూరు బాలికల జట్లు

విశాఖ బాలికల జట్టు సభ్యులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చదలవాడ

బాలుర విభాగంలో విజేతల వివరాలు

హాజరైన జట్లను నాలుగు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. చిత్తూరు- శ్రీకాకుళం జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. తూర్పుగోదావరి- వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన పోటీలో 1-0 తేడాతో తూర్పుగోదావరి జట్టు, విజయనగరం- ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్‌లో ప్రకాశం 1-0 తేడాతో గెలిచింది. నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య పోటీలో నెల్లూరు 2-0 తేడాతో గెలిచింది. పశ్చిమగోదావరి- కృష్ణా జట్ల మధ్య పోరులో 0-4 తేడాతో కృష్ణా జట్టు గెలవగా, గుంటూరు- ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు గెలిచింది. తూర్పుగోదావరి- శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. చిత్తూరు- వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైఎస్సార్ కడప గెలిచింది.

★ బాలికల విభాగంలో విశాఖపట్నం, నెల్లూరు, గుంటూరు జట్లు గెలిచాయి.

రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్‌లో పల్నాడు శుభారంభం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 19వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఫ్లోర్‌బాల్ అంతర్ జిల్లాల పోటీలను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఆదివారం ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. నరసరావుపేటలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 14 జట్లు పాల్గొన్నాయి. మహిళల విభాగంలో పల్నాడు - నెల్లూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయానికి ఇరు జట్ల స్కోర్లు సమానంగా ఉండటంతో షూట్ అవుట్ నిర్వహించగా పల్నాడు జిల్లా జట్టు 2-1 తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. కడప-తిరుపతి జిల్లా జట్ల మధ్య మ్యాచ్‌లో కడప జట్టు 2-0 తేడాతో గెలిచింది. పురుషుల విభాగంలో బాపట్ల జట్టుపై కడప జట్టు 1-0 తేడాతో గెలుపొందగా, తిరుపతి- కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లో కర్నూలు జట్టు 3-0తో విజయాన్ని సొంతం చేసుకుందని నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుబ్బరాయ గుప్తా, ఎంఏఎం కళాశాల ఛైర్మన్ శేషగిరిరావు, ఐడీపీఎస్ స్కూల్ ఛైర్మన్ నాగోతు ప్రకాష్, డైరెక్టర్ సబిత, ప్రిన్సిపల్ రేఖా పూలేఖర్, ఏపీ ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రత్నకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్‌బాబు, పీడీ సురేంద్ర, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పురుషుల జట్ల ఆటగాళ్ల మధ్య పోరు

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

వివాహేతర సంబంధమే కారణం

వివరాలు వెల్లడిస్తున్న గ్రామీణ సీఐ సుబ్బారావు

నరసరావుపేట సెంట్రల్: పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద గత నెల 24న జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ సుబ్బారావు తెలిపారు. ఆదివారం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలో కొండలరావుపేటకు చెందిన షేక్ పెద్దబాజీ (34) పట్టణంలోని పెద్ద చెరువు ప్రాంతానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఆమె భర్త అతనిపై కక్షపెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 24న పెద్దబాజీ ఎస్ఆర్‌కేటీ కాలనీకి వద్దకు వెళుతుండటాన్ని గమనించిన మహిళ భర్త తన అత్తను వెంటబెట్టుకొని కాలనీ వద్దకు చేరుకున్నారు. పెద్దబాజీ ఒంటరిగా ఉండటం గమనించి అతనిపై కత్తితో దాడి చేసి హత్య చేశారు. సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రక్తపుమడుగులో ఉన్న పెద్దబాజిని ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. మృతుడి తండ్రి సుభాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో నిందితులు బాలసుబ్రహ్మణ్యచారి, వి.రాంబాయమ్మ వల్లప్పచెరువు వద్ద ఉన్నారని తెలుసుకొని వారిని అదుపులోకి తీసుకొని హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. సమావేశంలో గ్రామీణ ఎస్సైలు సీహెచ్ కిషోర్, ఫాతిమా ఉన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

గొడ్డలితో దాడి.. ఒకరికి గాయాలు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: బెల్లంకొండ మండలం పాపాయపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. తన తండ్రిని దూషించాడన్న కోపంతో కుమారుడు గొడ్డలితో దాడిచేశాడు. ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో దాచేపల్లి కోటయ్య అలియాస్ సంక్రాంతి కోటయ్యకు ఓర్సు కృష్ణయ్యకు ఆదివారం సాయంత్రం చిన్న వివాదం తలెత్తింది. ఒకరినొకరు దూషించుకున్నారు. స్థానికులు వివాదం పెద్దది కానివ్వకుండా చేసి ఇంటికి పంపించారు. విషయం తెలుసుకున్న కోటయ్య కుమారుడు గోపాలకృష్ణ తన బావమరిదితో కలసి కృష్ణయ్యతో వాదనకు దిగాడు. మాటా మాటా పెరిగి తనతో తెచ్చుకున్న గొడ్డలితో దాడి చేశాడు. కృష్ణయ్య తలపై గాయమైంది. అచేతన స్థితిలో పడిపోయిన కృష్ణయ్యను స్థానికులు 108 వాహనంలో సత్తెనపల్లి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బెల్లంకొండ ఎస్సై ప్రవీణ్ స్థానికంగా విచారిస్తున్నారు.

తగవు తీర్చేందుకు వచ్చి ప్రాణాలు కోల్పోయి..

స్థలం వివాదంలో ఒకరు హతం

నరసరావుపేట సెంట్రల్: ఇద్దరి మధ్య నెలకొన్న స్థలం వివాదం ఒకరి హత్యకు దారితీసింది. నరసరావుపేట మండలం ములకలూరు-కేఎం అగ్రహారం గ్రామాల మధ్య ఆదివారం ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించి గ్రామీణ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. మండలంలో కేఎం అగ్రహారానికి చెందిన ఓర్సు ముసలయ్య అదే గ్రామానికి చెందిన వేముల వెంకటేశ్వర్లు మధ్య ఓ స్థలం విషయమై కొన్నేళ్లుగా గొడవలున్నాయి. తరచూ వారి మధ్య గొడవ జరుగుతోంది. ఇదే క్రమంలో ఆదివారం కూడా ఘర్షణ చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ముసలయ్య నకరికల్లు మండలం దేచవరంలో ఉండే తన అన్న ఓర్సు పర్వతాలు (55)కు తెలియజేశాడు. దీనిపై మాట్లాడేందుకు పర్వతాలు కేఎం అగ్రహారానికి వచ్చాడు. వేముల వెంకటేశ్వర్లు తన కుమారుడితో కలిసి కేఎం అగ్రహారం-ములకలూరు గ్రామాల మధ్య చెరువు సమీప పొలంలో ఉన్నారని తెలుసుకుని తమ్ముడు కుమారుడు కోటేశ్వరరావుతో కలిసి పర్వతాలు అక్కడికి వెళ్లారు. స్థలం గొడవ విషయమై జరిగిన వెంకటేశ్వర్లును నిలదీయగా కోపోద్రిక్తుడైన అతను తన చేతిలో ఉన్న ఇనుపరాడ్డుతో పర్వతాలు తలపై మోదాడు. అడ్డొచ్చిన కోటేశ్వరరావుపై అతని కుమారుడు దాడి చేశాడు. ఈ ఘర్షణలో తలకు బలమైన గాయమై పర్వతాలు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే వెంకటేశ్వర్లు, అతని కుమారుడు అక్కడి నుంచి పరారయ్యారు. ములకలూరు-కేఎం అగ్రహారం గ్రామాల మధ్య వ్యక్తి మృతి చెందాడన్న సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. పర్వతాలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 162, చికెన్ విత్‌స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 274 చికెన్ స్కిన్‌లెస్ - 284.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

శంకరమఠంలో భగవద్గీత ప్రవచనం

సంకీర్తనలు పాడుతున్న ఇస్కాన్ సభ్యులు

వినుకొండ, న్యూస్‌టుడే: స్థానిక పాతమార్కెట్ రోడ్డులోని శంకరమఠంలో ఆదివారం ఇస్కాన్ సంస్థ సభ్యులు గంగావతి హరిదాస్ భగవద్గీత ప్రవచనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైదిక జ్ఞానం, భగవద్గీత విశిష్టతను ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించి జపం, ప్రవచనం, హారతి, సంకీర్తన అనంతరం ప్రసాద వితరణతో ముగిస్తామని నిర్వాహకులు శ్రీనివాసరావు, బాలరాజు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలోని భావనారుషినగర్ శివారు ప్రాంతంలో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు మొలిచాయి. విషసర్పాలు, దోమలకు ఆవాసంగా మారాయి. దీంతో వ్యాధుల బారిన పడుతున్నాం. **- రమేష్, స్థానికుడు** ✓ ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి, దోమల నివారణ మందులు చల్లిస్తాం. యజమానులకు వారికి ఇబ్బంది లేకుండా చేస్తాం. **- రమణారావు, పారిశుద్ధ్య అధికారి**
– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

బకాయిలు పేరుకున్నా పట్టదా?

బినామీలదే హవా

ఎస్సీ కార్పొరేషన్ దుకాణాల తీరు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం నరసరావుపేటలోని ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని వాణిజ్య సముదాయంలో దుకాణాల అద్దె బకాయిలు పేరుకుపోతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. అధికారుల తనిఖీలు, అద్దె వసూళ్లు నామమాత్రంగా మారాయి. బినామీల పేరుతో అనర్హులు వ్యాపారాలు చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. అయినా కార్పొరేషన్ దుకాణాల అద్దెలు చెల్లించడం లేదు. వైకాపాకు చెందిన ఓ వ్యక్తి ఆధీనంలో ఐదు దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో ఒక దుకాణ హక్కుదారుడు మృతి చెందాడు. అయినా ఆ వ్యాపారి అనధికారికంగా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇలా పలు దుకాణాల పరిస్థితి ఉంది. దీనిపై అధికారులు దృష్టిసారించి పేరుకున్న అద్దె బకాయిలు వసూలు చేసి దుకాణ సముదాయాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. అనర్హులను తొలగించి అర్హులకు దుకాణాలు కేటాయిస్తే ఆదాయం పెరిగే వీలుంటుంది.

ఆర్డీవో కార్యాలయం కూడలిలో దుకాణ సముదాయం

పూర్తిగా వసూలు చేస్తాం..

నరసరావుపేటలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని దుకాణాల అద్దెలు పూర్తిగా వసూలు చేస్తాం. అనర్హులు, బినామీలు ఉంటే తొలగిస్తాం. అంతే కాకుండా దుకాణాల పైకప్పు నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీలు కొనసాగుతాయి. **- శ్రీనివాస్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్, గుంటూరు**

నామమాత్రంగా తనిఖీలు

నరసరావుపేటలో మూడు ఎస్సీ దుకాణ సముదాయాలు ఉన్నాయి. వాటిల్లో 64 దుకాణాలు నిర్మించారు. వాటి నుంచి రూ.20లక్షల వరకు అద్దెలు కార్పొరేషన్‌కు రావాల్సి ఉంటుందని అంచనా ఉంది. దుకాణాలు పొందిన వారు దానిలో వ్యాపారం నిర్వహించి స్వయం ఉపాధి పొందాల్సి ఉండగా వాటిని అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. ఆదాయం సక్రమంగా రాకపోవడంతో అధికారులు దుకాణ సముదాయాల ఆలనా, పాలన పూర్తిగా విస్మరించారు. కొన్ని దుకాణాల పైకప్పు కూలిపోయాయి. అద్దెలు వసూలు చేసి వాటికి మరమ్మతులు చేయించాలన్న ఎస్సీ కార్పొరేషన్ అధికారుల లక్ష్యం నెరవేరడం లేదు. ఇటీవల కార్పొరేషన్ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి రెండు దుకాణాలకు సీల్ వేసి మిగిలిన వాటిని వదిలేశారనే విమర్శలు ఉన్నాయి.

తెలుగు ప్రజల గుండెల్లో అమరజీవి

సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఆర్యవైశ్య ప్రముఖులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: కుల, మతాలు, వర్గ ప్రాంతీయ తత్వాలకు అతీతంగా అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ చిరస్మరణీయులని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు పై శ్రీ పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ చిలకలూరిపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా అమరజీవి చిత్రపటానికి, విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్‌తో కలిసి పాలాభిషేకం చేశారు. అమరావతి నడిబొడ్డున కాంస్య విగ్రహంతో పాటు స్మృతివనం, మ్యూజియం, లైబ్రరీ ఏర్పాటు ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉన్నంత వరకు వారి ఎదుగుదలను ఎవరూ అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మాట్లాడుతున్న జిల్లా సంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరమ్మ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించి ప్రజలు, దేశానికి పేరు తీసుకురావాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి ఇ. రాజేశ్వరమ్మ అన్నారు. అమరావతి, నాదెండ్ల, మురికిపూడి, చిలకలూరిపేట వసతిగృహాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 'ప్రేరణ' పేరిట చిలకలూరిపేట అంబేడ్కర్ కాలనీలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై ఆమె మాట్లాడారు. మాజీ ఐఆర్ఎస్ అధికారి బి.రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఓ యజ్ఞంలా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. అనంతరం వసతిగృహ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బాలల రచయిత దార్ల బుజ్జిబాబు, ఏఎస్‌డబ్ల్యూవో కె.తిరుపతయ్య, వసతిగృహ వార్డెన్లు పాల్గొన్నారు.

కొవ్వొత్తులు వెలిగించి గీతాలాపన

గురుకులంలో సెమీ క్రిస్మస్ సందడి

నూజండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పలపాడు అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు ప్రపంచానికి అందించిన సందేశాలను విద్యార్థులకు వివరించారు. కొవ్వొత్తులు వెలిగించి గీతాలాపన చేశారు. క్రిస్మస్ ట్రీ అలంకరించి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ప్రార్థనలు నిర్వహించారు. తల్లిదండ్రులు కూడా వేడుకల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ రమణమ్మ, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినుకొండ: రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రభాకర్

నేర ప్రవృత్తి మార్చుకోకుంటే ఉపేక్షించం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: నేరస్థులపై నిత్యం నిఘా ఉంటుందని, ప్రవర్తనను మార్చుకుని సాధారణ జీవితం గడపాలని పట్టణ సీఐ ప్రభాకర్ రౌడీషీటర్లను హెచ్చరించారు. పట్టణ పరిధిలోని రౌడీషీటర్లకు ఎస్సై బాలకృష్ణతో కలిసి ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించినా శాంతిభద్రతలకు ఆటంకం కలిగించినా, గొడవలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఏడు నుంచి పదేళ్లలో ప్రవర్తనలో మార్పు ఉంటే అలాంటి వారిపై రౌడీ షీట్ తొలగించే అవకాశం ఉందన్నారు.

చిలకలూరిపేట గ్రామీణ: మండలంలో మురికిపూడి, కావూరు, వేలూరు, పసుమర్రు తదితర గ్రామాల్లో 14 మంది రౌడీషీటర్లకు గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు రాత్రిళ్లు బయటకు వెళ్లాలంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఏదైనా కేసుల్లో ప్రమేయం ఉంటే పీడీ యాక్టు నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

ఎస్టీయూ బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎస్టీయూను బలోపేతం చేయడం ద్వారా విద్యారంగ సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయుల హక్కుల సాధన సాధ్యమవుతుందని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈసారి తమ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశాల్లో భాగంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్వీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏమండి, ఆర్థిక కార్యదర్శిగా మహబూబ్‌సుభాని, గౌరవాధ్యక్షుడిగా యేసయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అవీ ఇవీ

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: 11 కేవీ విద్యుత్తు లైన్ల నవీకరణ, ఆధునీకరణ పనుల్లో భాగంగా నేడు నాలుగు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు వినుకొండ రూరల్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం, జాలలపాలెం గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

రొంపిచర్ల: మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. మండల అధ్యక్షురాలిగా మర్రిచెట్టుపాలెం ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయిని కె.కార్మెల్‌మేరీ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సంతగుడిపాడు ఎంపీపీఎస్ (ఎఎ) పాఠశాల ఉపాధ్యాయుడు ఎం. రామాంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా ఎంపీవీ సుబ్రహ్మణ్యచారి, సహ అధ్యక్షులుగా కొత్తపల్లి రవి, టి.అనూష, కోశాధికారిగా ఎన్.లింగారావుతో పాటు మరో 9మందిని మండల కార్యదర్శులుగా, ఏడుగురిని జిల్లా మహాసభల ప్రతినిధులుగా ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు. ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రతిజ్ఞ చేసింది.

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ

రొంపిచర్ల, న్యూస్‌టుడే: లుసిడ చేతిరాతపై శిక్షణతో అక్షరాల్లో అందం, శ్రద్ధ, ఏకాగ్రత, సృజనాత్మకత పెంపొందుతాయని శిక్షకులు డాక్టర్. జన్నుసాహెబ్, ఎం.బురాన్ అన్నారు. మండలంలోని బుచ్చిపాపన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. అందంగా రాసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.సుబ్రహ్మనేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చైతన్యభారతి పాల్గొన్నారు.

బూత్ వ్యవస్థ పటిష్ఠతకు తెదేపా ప్రణాళిక

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: పోలింగ్ బూత్ స్థాయిలో ప్రతి ఓటరుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకుల విజయానికి తోడ్పాటు అందించాలని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరు మద్దిరాల గంగాధర్ అన్నారు. మండలంలో మూగచింతలపాలెం, సరికొండపాలెం గ్రామాల్లో ముఖ్య నాయకులు బూత్ కన్వీనర్లతో ఆదివారం ఆయన బొల్లాపల్లిలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల కార్పొరేషన్ డైరెక్టరు పెమ్మసాని నాగేశ్వరరావు, తెదేపా నాయకులు వడ్లమూడి బ్రహ్మం, కామిశెట్టి ఏడుకొండలు తదితరులున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని మురికిపూడిలో గ్రామస్థులకు ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇళ్లకు తాళాలు వేసి ఊరికి వెళ్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో గస్తీ ముమ్మరం చేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

పీహెచ్‌సీలో కొనసాగిన వైద్య సేవలు

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ): నాదెండ్ల మండలం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం కూడా వైద్య సేవలు కొనసాగాయి. డాక్టర్ హరిహరన్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో పాఠశాలల నిర్వహణ తగదు

వినుకొండ, న్యూస్‌టుడే: వంద రోజుల ప్రణాళిక పేరుతో సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించడం సహేతుకం కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అన్నారు. స్థానికంగా ఓ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ నిబంధన విద్యార్థులు, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేయడమేనన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి మాట్లాడుతూ గత ఏడాది ప్రణాళికలో పనిచేసిన ఉపాధ్యాయులకు సీసీఎల్ ఇప్పటి వరకు ఇవ్వలేదని ప్రభుత్వ వైఖరి పాఠశాలలను కాపాడే విధంగా లేదన్నారు. ఫెడరేషన్ సీనియర్ నాయకుడు సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంపత్‌బాబు, గౌరవ అధ్యక్షుడు వెంకటరెడ్డి, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రబీలో ఈ-పంట నమోదు చేయించరూ!

కారుమంచి(శావల్యాపురం), న్యూస్‌టుడే: వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు చేయక రైతులు తీవ్రంగా నష్టపోయారని భాజపా కారుమంచి శక్తి కేంద్రం అధ్యక్షుడు సోమేపల్లి ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం ఆయన కారుమంచిలో మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఈ-పంట నమోదు చేయకపోవడంతో దళారులు కేవలం రూ.1300కు అడుగుతున్నారన్నారు. రబీలో ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న, పొగాకు సాగుచేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు స్పందించి ఈ-పంట నమోదు చేయించాలని కోరారు.

న్యాయాధికారి పర్వీజ్‌కు పీహెచ్‌డీ

లేఖ అందుకుంటున్న జడ్జి అబుతాలిబ్ పర్వీజ్

వినుకొండ, న్యూస్‌టుడే: ఏలూరులో ప్రిన్సిపల్ సివిల్ జూనియర్ జడ్జి (జూనియర్ డివిజన్)గా పనిచేస్తున్న ఎస్కే ఎండీ అబుతాలిబ్ పర్వీజ్ న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. వినుకొండకు చెందిన ఆయన న్యాయాధికారిగా ఎంపికైన తర్వాత వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నా పరిశోధనపై మక్కువతో ఏఎన్‌యూ ఆచార్యుడు డాక్టర్ ఎ.గురవయ్య పర్యవేక్షణలో 'ఎ క్రిటికల్ అనాలసిస్ ఆఫ్ లీగల్ ఎయిడ్ అండ్ అవేర్నెస్ ఇనిషియేటివ్స్ ఫర్‌ది రూరల్ పూర్ త్రూ ది ఇన్వాల్‌మెంట్ ఆఫ్ పారా లీగల్ వాలంటీర్స్ అండ్ లా స్టూడెంట్స్', స్పెషల్ ఫోకస్ ఆన్ గుంటూరు డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్' అంశంపై పరిశోధన పూర్తి చేశారు. పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ పి.సుధాకర్ ఆమోదించిన అనంతరం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.సింహాచలం చేతుల మీదుగా పీహెచ్‌డీ అవార్డు లేఖ అందుకున్నారు.

పేదల ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యం

శిబిరం వద్ద బారులు తీరి నిలబడిన బాధితులు

పండరీపురం (చిలకలూరిపేట పట్టణం), న్యూస్‌టుడే : పేదల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు పీ-4 కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ శ్రవణ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన 39వ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 3వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. శిబిరానికి వచ్చిన వారికి రూ.వెయ్యి నుంచి రూ.20వేల విలువైన వినికిడి యంత్రాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించే వెసులుబాటు కూడా కల్పించామన్నారు. ఈ నెలలోనే క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. రూ.5,200 విలువైన వ్యాక్సిన్‌ను క్యాన్సర్ బాధితులకు ప్రత్తిపాటి ఫౌండేషన్, ఇన్నర్‌వీల్ సంయుక్త సహకారంతో ఉచితంగా అందజేస్తామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవల కింద 17 నెలల్లో రూ.12 కోట్లకు పైగా సీఎం సహాయ నిధి నుంచి సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి తోట రాజా రమేష్, తెదేపా సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పురపాలక ఛైర్మన్ ఎస్కే రఫాని, యార్డు ఛైర్మన్ ఎస్కే కరీముల్లా, తెదేపా నాయకులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శిబిరానికి హాజరైన వారందరికీ భోజన సౌకర్యం కల్పించారు.

వైద్యుల క్రీడా సంబరం

టేబుల్ టెన్నిస్ ఆడుతున్న వైద్యులు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: వైద్య వృత్తిలో క్షణం తీరిక లేకుండా గడిపే వైద్యులు ఆదివారం ఆటల్లో మునిగి తేలారు. వారికి ఇష్టమైన ఆటలాడుతూ సరదాగా గడిపారు. అందుకు ఐఎంఏ భవనం వేదిక అయింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఐఎంఏ భవనంలో ఆదివారం డాక్టర్స్ స్పోర్ట్స్ మీట్-2025 నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ప్రారంభించగా, ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, దానిని అధిగమించటానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతాయన్నారు. ఐఎంఏ వైద్యులు, ఐఎంఏ సభ్యులు క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చదరంగం తదితర ఆటలాడారు. విజేతలకు ఎమ్మెల్యే చదలవాడ, ఐఎంఏ అధ్యక్షుడు నాగోతు ప్రకాష్, కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు.

యువత భాగస్వామ్యం పెరగాలి

వినుకొండ: చిన్నారి వైష్ణవి నృత్యప్రదర్శన

నరసరావుపేట అర్బన్, వినుకొండ, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న అంతర్జాతీయ రోటరీ సంస్థలో యువత భాగస్వామ్యం పెంచేందుకు కృషి చేయాలని రోటరీ క్లబ్ 3150 జిల్లా గవర్నర్ ఎంవీ రాంప్రసాద్ అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం నరసరావుపేట, వినుకొండ వచ్చారు. ఈ సందర్భంగా నరసరావుపేటలో క్లబ్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా 20 మంది వృద్ధులకు దుప్పట్లు, కుట్టుమిషన్లు, చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. క్లబ్ మాజీ గవర్నర్లు తాళ్ల రాజశేఖరరెడ్డి, కేపీ రంగారావు, క్లబ్ అధ్యక్షుడు కరీమ్‌మొహిద్దీన్, కార్యదర్శి భవనం మునీందర్‌రెడ్డి, కోశాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు వినుకొండ కారంపూడి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షుడు యేరువ వెంకటనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో గవర్నరు రాంప్రసాద్ మాట్లాడారు. తొలుత ఎన్నెస్పీ కాలనీలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో దాత గంగినేని రామయ్య, రోటరీక్లబ్ సంయుక్తంగా సుమారు రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. నూజండ్ల మండలం తెల్లబాడు పాఠశాలకు ఫ్యాన్‌లు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం 2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. అసిస్టెంట్ గవర్నర్ జె.మురళి, ఏపీ రీజియన్ గవర్నర్ ఎయిడ్ అధ్యక్షుడు పి.రమేష్, వినుకొండ క్లబ్ కార్యదర్శి ఎస్కే బాజీ, ఆర్థిక కార్యదర్శి పొత్తూరి నవీన్ సుధాకర్ పాల్గొన్నారు. కూచి రామాంజనేయులు అతిథులకు స్వాగతం పలకగా చిన్నారి టి.వైష్ణవి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది.

నరసరావుపేట: కుట్టుమిషన్ అందించిన గవర్నర్ రాంప్రసాద్, రోటరీ ప్రతినిధులు

ఎండుతున్న మొక్కజొన్న.. ఆందోళనలో రైతులు

గడ్డిమందు కారణం అంటున్న వ్యవసాయశాఖ అధికారులు

పైరు పరిశీలిస్తున్న ఏవో రామారావు

ఈపూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొచ్చెర్లలో సుమారు 40 ఎకరాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న మొక్కలు ఎండుముఖం పట్టాయి. మొలక వచ్చిన నాటి నుంచి మొక్కలు ఎరుపు, పసుపు రంగులోకి మారి వాడిపోతున్నాయి. ఆందోళన చెందిన రైతులు వ్యవసాయశాఖ అధికారులకు విన్నవించారు. దీంతో ఏవో రామినేని రామారావు ఆదివారం గ్రామాన్ని సందర్శించి దెబ్బతిన్న పైరును పరిశీలించారు. మొక్కజొన్న విత్తడానికి ముందు నేలపై గడ్డి మందు చల్లామని, వెంటనే దుక్కిదున్ని విత్తనం విత్తుకున్నామని రైతులు తెలిపారు. దుకాణదారు చెప్పడంతో ఇలా చేశామనివాపోయారు. ఈ విషయాన్ని ఆయన వ్యవసాయ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. పొలంలో గ్రామాక్సిన్, జిటసు గడ్డిమందు పిచికారీ చేసినందున మొక్కలు వాడిపోతున్నట్లు వారు తెలిపారు. గడ్డి మందు పిచికారీ చేసిన 40రోజుల వరకు పొలంలో విత్తనాలు నాటకూడదని, కానీ రైతులు పదిహేను రోజుల వ్యవధిలో విత్తనాలు నాటడం వల్ల మొక్కలు వాడుముఖం పడుతున్నాయన్నారు. దీనికి నివారణగా పొలంలో నీళ్లు పెట్టి 2శాతం యూరియా, ట్యాంకుకు 400గ్రాముల చొప్పున ఎకరానికి పది ట్యాంకులు పిచికారీ చేస్తే పైరు 20రోజుల్లో తిప్పుకొనే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏ తోటపూల చిన్నకోటేశ్వరరావు, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి నలబోతుల వీరయ్య పాల్గొన్నారు.

ఎంపీ రమేష్‌కు కేంద్ర మంత్రి పరామర్శ

ఎంపీ రమేష్ తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కమలేష్ పాశ్వన్, ఎంపీలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సభ్యులను కేంద్ర సహాయ మంత్రి, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు పరామర్శించారు. ఎంపీ రమేష్ తల్లి రత్నమ్మ ఇటీవల తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చేరుకుని చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి కమలేష్ పాశ్వన్, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తమిళనాడుకు చెందిన మంత్రి ఆర్.గాంధీ, ఎంపీలు పుట్టా మహేష్ యాదవ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, సుప్రియాసూలే, నిషికాంత్‌దూబె శ్రీకాంత్ షిండే, భోలాసింగ్, సంజయ్‌జైశ్వాల్, నీరజ్‌శేఖర్, మాజీ మంత్రి సంజయ్ బాల్యాన్, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి తదితరులు ఎంపీ రమేష్‌ను పరామర్శించారు.

సుబాబుల్ తోటల ధ్వంసంపై ఆందోళన

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం గణపవరం పరిధిలోని సుబాబుల్ తోటలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వెలిబుచ్చారు. చెట్ల కొమ్మల చివర్లు తుంచేయడంతో తోటలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోటలు ధ్వంసం చేస్తున్న వారిని పట్టుకోకపోతే రైతులంతా మూకుమ్మడిగా పోలీసుస్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

యల్లమంద వద్ద కార్లు ఢీ

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలో యల్లమంద బైపాస్ వద్ద ఆదివారం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కార్లలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. విషయం తెలుసుకున్న గ్రామీణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అదుపు తప్పి లారీ బోల్తా

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలో కాకాని సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఓ లారీ అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. వివరాలు ఇలా... సిమెంటు లోడుతో బళ్లారి నుంచి అమరావతికి బయల్దేరిన లారీ మార్గంమధ్యలో నరసరావుపేట మండలం కాకాని సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలోని డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గ్రామీణ పోలీసులు తెలిపారు.

బాలుడి కోసం కొనసాగుతున్న గాలింపు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలో రావిపాడు సమీపంలో గోవిందాపురం మేజరు కాలువలో పడి రొంపిచర్ల మండలం కొత్తపల్లికి చెందిన త్రివేణి మృతిచెందగా ఆమె కుమారుడు ఏడు నెలల పసికందు శరత్ గల్లంతైన విషయం తెలిసిందే. బాలుడి ఆచూకీ కోసం ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆదివారం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదని గ్రామీణ పోలీసులు తెలిపారు.

ఒక్కసారి అమ్మతో మాట్లాడు..!

సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరు

వినుకొండ, న్యూస్‌టుడే: 'నాన్న.. ఒక్కసారి ఈ అమ్మతో మాట్లాడు..' అంటూ రోదించిన ఆ తల్లి మాటలు విన్న అక్కడి వారి గుండెలు బరువెక్కాయి. విహారయాత్రకు వెళ్లి అసోంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందిన కుందుర్తి హనుమంత్ శాండిల్య మృతదేహం ఆదివారం వినుకొండకు చేరింది. తల్లిదండ్రులు రమాదేవి, వెంకటరవి ఉపాధ్యాయులు కావడంతో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కొత్తపేటలోని వారి ఇంటికి తరలివచ్చారు. స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్తానంటే వద్దని వారించామని, రెండ్రోజులు బతిమాలి ఒప్పించి వెళ్లాడని ఇలా అవుతుందనుకోలేదని తండ్రి వాపోయారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ సురేష్, మున్సిపల్ కౌన్సిలర్ పోలూరి అంజలీదేవి, యూటీఎఫ్ నాయకులు నాగేశ్వరరావు, సత్తెనపల్లి డిప్యూటీ డీఈవో ఏసుబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

విద్యా సామగ్రి అందజేత

విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే లోపాలు జయించవచ్చని మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ వికలాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాచర్ల పట్టణంలోని సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు చైతన్య దివ్యాంగుల సంస్థ నేతృత్వంలో పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అన్వర్ బాషా, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నరసింహారావు, కరుణాకర్, హరి, గురుమూర్తి, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌కు సెల్‌గాటం

చరవాణులతో కుస్తీ పడుతున్న రైతులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్ బుకింగ్ తప్పనిసరి కావడంతో చరవాణులతో రైతులు కుస్తీ పడుతున్నారు. రోజుకు కేటాయించే స్లాట్లు తక్కువ సమయంలోనే బుక్ అయిపోతుండటంతో ఎలాగైనా తమ సరుకు అమ్ముకోవాలనే తాపత్రయం అన్నదాతల్లో ఉంది. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనలేని రైతులు స్లాట్ బుకింగ్ విధానంతో ఇబ్బంది పడుతున్నారు. తెలిసిన వారి వద్దకు పరుగులు తీస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? అమరావతి నుంచి సత్తెనపల్లి వెళ్లే రహదారిలో అక్కడక్కడ పెద్ద గుంతలు పడ్డాయి. వాటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారికి మరమ్మతులు చేపట్టాలి. - **సుబ్బారావు, లింగాపురం** ✔ మరమ్మతులకు త్వరలో చర్యలు తీసుకుంటాం. -**సురేష్, ఏఈ, ఆర్అండ్‌బీ.** -న్యూస్‌టుడే, అమరావతి

? గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. ప్రమాదం జరగకముందే సరిచేయాలి. - **ఎస్సీ కాలనీ వాసులు, మందాడి.** ✔ కాలనీలో పరిశీలించి విద్యుత్తు సిబ్బందిని పంపించి వేలాడుతున్న తీగలు సరి చేయిస్తాం. - **ఓంకార్, లైన్‌ఇన్‌స్పెక్టర్.** - న్యూస్‌టుడే, వెల్దుర్తి

? దాచేపల్లి రోడ్డులోని రాజారావుపేటలో 6 నెలలుగా మంచినీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు.- **సుబ్బారావు, కారంపూడి** ✔ దాచేపల్లి రోడ్డులోని రాజారావుపేటలో ఉన్న పైప్‌లైన్ మధ్యలో బ్లాక్ అయింది. పైపులు బయటకు తీసి మరమ్మతులు చేయాల్సి ఉంది. నూతన పైపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.- **కిశోర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి** -న్యూస్‌టుడే, మాచర్ల

తర్ఫీదు సరే.. ఉపాధి ఎలా..?

★ కుట్టు శిక్షణతో సరిపెట్టిన ఏజెన్సీ

★ మిషన్లు, ధ్రువపత్రాల కోసం మహిళల ఎదురుచూపు

పెదకూరపాడు, బెల్లంకొండ, అమరావతి, న్యూస్‌టుడే

మహిళలు స్వయం ఉపాధి సాధించాలనే ఉద్దేశంతో ఉచితంగా కుట్టు శిక్షణ అందించారు. వారందరికీ ఉచితంగా మిషన్లు పంపిణీ చేస్తామని అధికారులు చెప్పడంతో మహిళలు ఆసక్తి కనబరిచారు. కుట్టులో తర్ఫీదు పొందారు. నెలలు గడుస్తున్నా మిషన్లు అందకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. ప్రారంభం నుంచి ముగింపు వరకు శిక్షణకు హాజరైన ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ. 25వేలు చొప్పున ఏజెన్సీకి అందజేస్తుంది. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు కుట్టుకు అవసరమైన సామగ్రితో పాటు ఒక్కో మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ అందివ్వాలి. ముఖ ఆధారిత హాజరు 75శాతం ఉన్న వారికి మాత్రమే మిషన్ ఇవ్వాలన్నది నిబంధన. శిక్షణ ఇచ్చారే గాని చాలా చోట్ల మిషన్లు పంపిణీ చేయలేదు.

పెదకూరపాడు: కుట్టులో శిక్షణ తీసుకుంటున్న మహిళలు (పాత చిత్రం)

నియోజకవర్గానికి 500మంది

వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ బాధ్యతలు తీసుకున్నారు. ఒక్కో నియోజకవర్గానికి సరాసరి 500మంది ఉండే విధంగా, కొన్ని నియోజకవర్గాల్లో డిమాండ్‌ను బట్టి 1000 మందికి తర్ఫీదు ఇచ్చారు. మహిళలకు కుట్టు శిక్షణ, అల్లికపై మూడు నెలలపాటు రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒక విడత, ఒంటిగంట నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు విడతలుగా నేర్పించారు. అవసరాన్ని బట్టి 4 నుంచి 5 టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిషన్ కుట్టడంతోపాటు డిజైన్ ఆధారంగా దుస్తులు కత్తిరించడం, ప్రస్తుత మహిళల అభిరుచికి అనుగుణంగా మెలకువలతోపాటు ఇతర అంశాలపై నైపుణ్యం కలిగిన శిక్షకులతో తర్ఫీదు ఇచ్చారు. నెలలుగా శిక్షణ పొందిన మహిళలు మిషన్లు అందక, వేరేచోట పనిచేసుకోవడానికి ధ్రువపత్రాలు అందక ఇబ్బంది పడుతున్నారు. మిషన్లు, ధ్రువపత్రాలు త్వరగా అందజేస్తే ఉపాధి చూసుకుంటామంటున్నారు. మహిళలకు గడువు లోపు శిక్షణ పూర్తిచేశామని, తమకు ఇంకా నిధులు రావాల్సి ఉందని, నిధులు రాగానే మిషన్లు పంపిణీ చేస్తామని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కిరణ్

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : సత్ప్రవర్తనతో మెలగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి గ్రామీణ సీఐ కిరణ్ మండలంలోని రౌడీషీటర్లను హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కొందరు ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలతో ఎలా వ్యవహరిస్తున్నారని ఆరా తీశారు. శాంతియుత జీవనం సాగించకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్సై అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలలో ఉత్సవం

గోశాలలో యువశక్తి బాధ్యులు, ఆర్యవైశ్య నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : స్థానిక శ్రీవాసవి యువశక్తి ఆధ్వర్యంలో పట్టణంలోని గోశాలలో ఆదివారం గోసేవ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోశాలలోని శివలింగానికి పూజలు చేశారు. గోపూజ, గోసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువశక్తి బాధ్యులు కొల్లిపర నరసింహారావు, సుబ్బారావు, రామకృష్ణ, ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

పోయినవి

మొండితోక [illegible] వట్టిచెరుకూరు మండలం, పల్నాడు జిల్లా, గ్రామ కాపురస్తులు తెలియజేయునది ఏమనగా [illegible] పుస్తకము నెం.2119-(752281) [illegible] డి.27-11-2025 [illegible] లావా దేవిలు జరిపిన చెల్లవనియు ఇందు మూలముగా తెలియజేయుచున్నాము.

అడ్రస్: యమ్.ప్రసన్న, అడ్వకేట్ మరియు నోటరీ చిలకలూరిపేట. సెల్: 99080 61367.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

పల్లకీ సేవలో ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు తదితరులు

అడిగొప్పల(దుర్గి), న్యూస్‌టుడే : పల్నాట ప్రసిద్ధి చెందిన అడిగొప్పల శ్రీనిదానంపాటి అమ్మవారికి ఆదివారం వేలది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రెండు తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అభిషేకాలు, నక్షత్రహారతి, పల్లకీ సేవ, చండీ హోమం కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఈవో, ఏసీ ఆదినారాయణ పర్యవేక్షించారు.

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీనగర్ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో వైభవంగా ఆరుద్రోత్సవం నిర్వహించారు. మల్లికార్జున స్వామి వారికి విశేష అభిషేకాలు, పంచామృతాలతో నమక చమక సహితంగా మహాన్యాస రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

సినిమా షూటింగ్ సందడి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణంలోని విద్యాకేంద్రం పాఠశాలలో ఆదివారం విజయ్ బంకా ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న బోరన్ రీ బోరన్ సినిమాలోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. తరగతి గదిలో హాస్య సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. సినిమా డైరెక్టర్ విజయ్, నటులు జాన్, జూనియర్ రాజశేఖర్, లక్ష్మీ చెన్నకేశవరావు, రత్నరాజు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

సేవామూర్తులను సత్కరిస్తున్న వాసవి విజ్ఞానజ్యోతి సభ్యులు

సత్తెనపల్లి: శ్రీవాసవి విజ్ఞాన జ్యోతి వార్షిక ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక వాసవి గార్డెన్స్‌లో నిర్వహించారు. 45 మంది విద్యార్థులకు రూ. 1.75 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువుకు ఏటా ఉపకార వేతనాలు అందజేస్తామని సంఘ అధ్యక్షుడు పద్మాకర మురళీకృష్ణ చెప్పారు. వివిధరంగాల్లో ఆదర్శంగా సేవలందిస్తున్న డాక్టర్ షకీలా శ్రీధర్, సమాజ సేవకులు తటపర్తి రాంబాబు(అమరావతి), ప్రముఖ విద్యావేత్త ఎంపీ వెంకట్రావు(భట్టిప్రోలు), శింగరి మధుసూదనరావు దంపతులను సత్కరించారు. యూనియన్ బ్యాంక్ ఉప మేనేజర్ ఉదయశంకర్, విశ్రాంత ప్రిన్సిపల్ సుబ్బరాయుడు, రాఘవేంద్ర బాలకుటీర్ ప్రిన్సిపల్ గీతాంజలి, పెద్దలు లక్ష్మయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న భక్తులు, విద్యార్థులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణంలోని సియోను లూథరన్ దేవాలయం(చర్చి) నూరు వసంతాల విజయోత్సవ ర్యాలీని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగే చర్చి వందేళ్ల వేడుకలో విశ్వాసులందరూ పాల్గొనాలని సంఘ బాధ్యులు కోరారు. ప్రదర్శనలో చర్చి పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

పోలీసులు క్రమశిక్షణతో మెలగాలి

రికార్డులు పరిశీలిస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, పక్కన సీఐ, ఎస్సై, సిబ్బంది

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు వీలైనంత త్వరగా పరిష్కరించాలని సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆదేశించారు. ఆదివారం ఆయన క్రోసూరు పోలీసు స్టేషన్, క్రోసూరులో ఉన్న పెదకూరపాడు సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు, క్రైమ్ రికార్డులు తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, భద్రతా చర్యలు, వసతులు అంశాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని ఇన్‌స్పెక్టర్ సురేష్, సబ్‌ఇన్‌స్పెక్టర్ రవిబాబుకు సూచించారు. విధినిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వైద్య సేవలు అందుకుంటున్న ప్రజలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : స్థానిక ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం, హైదరాబాద్‌కు చెందిన యశోద ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవి అమ్మవారి కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 245 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సేవలందించిన వైద్యులు సూర్యప్రకాశరావు, వెంకటస్వామి, రాజశేఖర్, రాజాలను ఆర్యవైశ్య సంఘ పెద్దలు సన్మానించారు. నిర్వాహకులు బచ్చు వెంకటేశ్వర్లు(కొండలు), కాశీమల్లేశ్వరరావు, సుబ్బారావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము



దేవరంపాడు గ్రామము, రాజుపాలెం మండలము, పల్నాడుజిల్లా.

పత్రిక ప్రకటన

2026 ఫాల్గుణ మాసము శనివారము ఉత్సవములు సందర్భముగా బహిరంగ వేలం పాటలు మరియు సీల్డ్ టెండరు

శ్రీ స్వామి వారికి భక్తులు సమర్పించిన ఈ క్రింది అయిటములకు దేవరంపాడులోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షములో **తేదీ: 22/12/2025** అనగా **సోమవారము** మధ్యాహ్నం **2.00** గంటలు నుండి సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం పాటలు జరుపబడును.

క్రమ సంఖ్య	పాట పెట్టబడు అయిటములు వివరములు	పాట కాలపరిమితి ది 21/02/2026 నుండి 19/03/2026	పాటకు ముందు చెల్లించవలసిన ధరావత్తు నగదు
1.	దేవస్థానము వద్ద కొబ్బరికాయలు అమ్ముకోను హక్కు	ఫాల్గుణమాసము శనివారములు	రూ. 30,000/-
2.	దేవస్థానము వద్ద కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకొను హక్కు	-డు-	రూ. 30,000/-
3.	తలనీలాలు ప్రోగుచేసుకోను హక్కు	-డు-	రూ. 30,000/-
4.	నెయ్యి కొనుగోలు హక్కు కిలో 1 టికి రేటు	-డు-	రూ. 20,000/-
5.	బియ్యం కొనుగోలు హక్కు కిలో 1 టికి రేటు	-డు-	రూ. 20,000/-
6.	బెల్లం ముక్కలు కొనుగోలు హక్కు కిలో 1 టికి రేటు	-డు-	రూ. 10,000/-
7.	చింతపండు, పప్పు, ఎండు మిర్చి వగైరాలు (మిస్‌లేనియస్)	-డు-	రూ. 5,000/-
8.	పాదరక్షకుల భద్రపరచుకొను హక్కు	-డు-	రూ. 10,000/-

ఉత్సవములు జరుగు తేదీలు ది.21.02.2026, ది.28.02.2026, ది.07.03.2026, ది.14.03.2026 మరియు 19.03.2026

శనివారములకు గాను ది.01/04/2026 నుండి 2027 మాఘమాసము బహిరంగ వేలం పాటలు మరియు సీల్డ్ టెండర్లు

పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలము, దేవరంపాడు కొండపైన శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము నందు విడి శనివారములకు గాను ది.01/04/2026 నుండి 2027 మాఘమాసం చివరి శనివారం వరకు కొబ్బరికాయలు, పూజ ద్రవ్యములు అమ్ముకోను హక్కునకు, కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కునకు, నెయ్యి, బియ్యం, బెల్లం ముక్కలు, తలనీలాలు ప్రోగుచేసుకోను హక్కునకు, వేలం పాటలను దేవస్థానము కార్యాలయము వద్ద దేవాదాయ దర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షములో తేది: 22/12/2025 అనగా సోమవారము ఉదయం 10.00 గంటలు నుండి బహిరంగ వేలం పాటలు జరుపబడును.

గమనిక: ఫాల్గుణ మాసం నెల ఎలక్ట్రికల్ లైటింగ్, పందిళ్ళకు, సంబంధించినవి బాదులు తాటాకు సప్లై ఫోటోలు మరియు వీడియోలు, గ్రౌండ్ క్లీనింగ్, దేవస్థానమునకు వచ్చు వెళ్ళుమార్గమునకు దుమ్ములేవకుండా నీళ్ళు కొట్టుట, లడ్డు ప్రసాదం సరుకులు మరియు తయారు చేయుట, అన్నదానం సరుకులు మరియు తయారు చేయుట, దేవస్థానమునకు రంగులు వేయుట రంగులు కొనుగోలుతో సహా, కూలీలను సప్లై చేయుట, 1(ఒక) కూలీకి రేటు, షామియానా వగైరాలుకు కొటేషన్లు మరియు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి వివరములకు శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము, దేవరంపాడు నందు పనివేళలలో సంప్రదించగలరు. ఒక్క టెండర్ షెడ్యూల్ ఖరీదు రూ.100/-

టెండర్ షెడ్యూల్స్ తేది : 08.12.2025 నుండి 19.12.2025 వరకు దేవస్థానము కార్యాలయము నందు పనివేళలో పొందగలరు.

దేవరంపాడు
తేది: 06.12.2025

ఇట్లు, కార్యనిర్వహణాధికారి
93474 63671

ట్యాంకు శుభ్రం మరిచారు..!

ఈచిత్రంలో కనిపిస్తున్నది మంచినీటి ట్యాంకు. దాచేపల్లి మండలంలోని తంగెడ గ్రామంలోని ఓ వీధిలో ఉన్న ఈ ట్యాంకు నుంచి నిత్యం వంద కుటుంబాలు నీటిని వినియోగించుకుంటున్నాయి. నెలలుగా శుభ్రం చేయకపోవడంతో ట్యాంకుచుట్టూ పాచిపట్టి రూపుకోల్పోయింది. కలుషిత నీటి భయంతో ఈ ట్యాంకు నీటిని కేవలం వినియోగానికి మాత్రమే వాడుతున్నా దురద, ఇతర చర్మసమస్యలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ట్యాంకు శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. గ్రామంలోని అన్ని ట్యాంకులు ఇలానే పాచి పట్టి అధ్వానంగా ఉన్నాయని, ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నార - **దాచేపల్లి, న్యూస్‌టుడే**

బస్సులు రావు.. సీట్లు దొరకవు

మాచర్ల క్రాస్ రోడ్డు వద్ద బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

నిత్యం రద్దీగా ఉండే దాచేపల్లి పట్టణంలో బస్సుల కోసం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి వివిధ పనుల కోసం వచ్చే ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు నిత్యం బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గంటల తరబడి ఎదురుచూడాల్సి రావడంతో పాటు వచ్చిన బస్సు కిక్కిరిసి ఉండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మాచర్ల - గుంటూరు రూట్లలో బస్సులు వచ్చినా ఎక్కే వీలు లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో రద్దీ పెరిగిపోయిందని, ఆ మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడమే సమస్యకు కారణమని ప్రయాణికులు అంటున్నారు. ప్రజల రాకపోకలు దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.- **దాచేపల్లి, న్యూస్‌టుడే**

నేడు బాలోత్సవ పోటీలు

రెంటచింతల: మాచర్ల - గురజాల నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాల బాలికలకు సోమవారం రెంటచింతలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన్ యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ కోకో, చెస్ అథ్లెటిక్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

తుప్పు వదిలితేనే ఆటలు..!

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణంలోని వావిలాల స్మృతివనంలో చిన్నారుల ఆట పరికరాలు తుప్పుపట్టి పాడైపోయి అధ్వానంగా ఉన్నాయి. వారాంతాల్లో తల్లిదండ్రులు పిల్లలను ఇక్కడికి తీసుకొచ్చి పాడైన పరికరాలను చూసి హడలిపోతున్నారు. పిల్లల చేత శారీరక, మానసిక ఆరోగ్యానికి వ్యాయామాలు అలవాటు చేయిద్దామనుకున్నా అనువైన వాతావరణం లేదని వాపోతున్నారు. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం పిల్లల ఆట పరికరాలతో ప్లేజోన్‌ను ఏర్పాటు చేసింది. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లపాటు దీన్ని పట్టించుకోలేదు. దీంతో ఆట పరికరాలు దెబ్బతిన్నాయి. కొత్తవి ఏర్పాటు చేయాలని, మరికొన్ని నూతన పరికరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ డీఈ మధుసూదనరావు మాట్లాడుతూ రూ.5 లక్షలతో పార్కులో ఆట పరికరాల మరమ్మతులు చేయిస్తామని, త్వరలోనే కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు.

వివాహితను వేధిస్తున్న యువకుడిపై కేసు

మేడికొండూరు, న్యూస్‌టుడే: చదువుకునే రోజుల్లో తీసుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమంలో ఉంచుతూ ఓ వివాహితను ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తిరుపతి చంద్రశేఖర్‌కు మండలంలోని ఒక వివాహితకు గతంలో పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో వారు ఫొటోలు తీసుకున్నారు. వాటిని 'ఎక్స్'లో పోస్టు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యంత్రాల మోత.. గ్రాసం కొరత..!

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గురజాల డివిజన్ ప్రాంతంలోని రైతులు వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపై ఎక్కువ మొగ్గుచూపుతారు. గురజాల డివిజన్ ప్రాంతంలోని ఖరీఫ్‌లో సాగుచేసిన వరి నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయంలో యాంత్రీకరణ నేపథ్యంలో సాగు ఖర్చులు తగ్గించడానికి యంత్రాలు ఉపయోగిస్తున్నారు. దీంతో పాడి రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. రైతులు వరి కోతకు వచ్చిన సమయంలో యంత్రాల ద్వారా నూర్పిడి చేయడంతో పశువులకు గడ్డి దొరకని పరిస్థితి నెలకొంది. యంత్రాల ద్వారా కోసిన గడ్డిలో ఎక్కువ భాగం వృథా అవుతుండటంతో కొరత వస్తోంది. దీంతో వరిగడ్డి టన్ను ధర రూ.8వేల నుంచి రూ.10వేలు పలుకుతోంది. దీనికి తోడు గడ్డి కుళ్లిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తాగునీటి వృథా.. కలుషితనీటి వ్యథ

నకరికల్లు,న్యూస్‌టుడే: నకరికల్లు మంచినీటి పథకం పరిధిలో పలుచోట్ల పైపుల నుంచి మంచి నీరు వృథాగా పోతోంది. ఐదు బొమ్మలు కూడలి వద్ద పైపులైనుకు లీకుల ద్వారా తాగునీరు వృథా అవుతోంది. అక్కడే వ్యర్థాలు వేస్తుండటంతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు వాపోతున్నారు. నీరు వృథాగా పోకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతోపాటు కలుషిత నీటితో ప్రజల అనారోగ్యం పాలు కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

దుర్గి, న్యూస్‌టుడే : మాచర్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జడ్పీపాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 80 మందికి కాకాని శంకరకంటి వైద్యశాల వైద్యులు జ్యోత్స్న, చరిత వైద్యపరీక్షలు నిర్వహించారు. మొత్తం 80 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని కాకాని వైద్యశాలకు తీసుకు వెళ్లారు. ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తారని రోటరీ అధ్యక్షుడు సత్యప్రసాద్ తెలిపారు. రోటరీ సభ్యులు కోటేశ్వరరావు, రామకోటయ్య, దశరథ్‌చౌహాన్, నాగూర్‌వలి పాల్గొన్నారు.

లారీని తప్పించబోయి బస్సు బోల్తా

తిరుపతి (చిల్లకూరు), న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో రైటర్‌సత్రం సమీపాన జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని తప్పించబోయి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఆదివారం తెల్లవారుజామున ఘటన జరిగింది. పల్నాడు జిల్లా గురజాల నుంచి 36 మంది అయ్యప్ప భక్తులతో శనివారం రాత్రి బస్సు శబరిమలకు బయలుదేరింది. రహదారిపై మరమ్మతుకు గురై ఆగి ఉన్న ఓ లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి రహదారి కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న అయ్యప్ప భక్తులు లింగా ఆదినారాయణ, కోడెల సతీష్, సిరసనంగుల్ల నాగేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. ఎస్సై సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపక్కన లారీ నిలిచిన విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ అత్యవసర నంబరుకు డ్రైవర్ సమాచారం ఇచ్చినా వారు సకాలంలో స్పందించలేదని సమాచారం.

అవీ ఇవీ

ఆధార్ చూపమంటే ఆగ్రహం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : కండక్టర్‌తో ప్రయాణికురాలు దురుసు ప్రవర్తనతో ఆర్టీసీ బస్సు పోలీసు స్టేషన్ వద్ద ఆగిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. నరసరావుపేట నుంచి సత్తెనపల్లికి వచ్చిన బస్సులో స్థానిక తాలుకా సెంటర్‌లో కొందరు మహిళలు బస్సు ఎక్కారు. ఆధార్ కార్డు చూపించమని కండక్టర్ కోరడంతో ఓ మహిళ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బస్సును స్టేషన్ వద్ద నిలుపుదల చేశారు. ప్రయాణికురాలికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

బేబిరాణికి అభినందన

రెంటచింతల, న్యూస్‌టుడే : ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం పల్నాడు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా రెంటచింతలకు చెందిన ఎం.బేబిరాణి ఎన్నికయ్యారు. ఆదివారం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో రాణి గెలుపొందినట్లు వెల్లడించారు. వీరికి నాగేశ్వరరావు, అమలబాబు, అహమ్మద్, శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

కవితల పోటీలో అవార్డు

అచ్చంపేట, న్యూస్‌టుడే: గత నెలలో శ్రీశ్రీకళా వేదిక హైదరాబాద్ వారు కవులకు నిర్వహించిన దగ్గరైన దూరాలు బంధాలు బంధుత్వాలు కవితా వ్యాసానికి అచ్చంపేట మండలం కోగంటివారిపాలెంకు చెందిన కవి చింతలపాటి పురుషోత్తమ ప్రసాదశర్మ టాప్ 20 విజేతగా నిలిచారు. అవార్డుకు ఎంపికైనట్లు ప్రసాదశర్మకు లేఖ ద్వారా తెలిపారు.

మూడు నియంత్రికలు ధ్వంసం

వెల్దుర్తి(మాచర్ల), న్యూస్‌టుడే: మాచర్ల మండలంలోని రాయవరం గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మూడు నియంత్రికలు ధ్వంసం చేసి విలువైన రాగితీగను అపహరించారు. రైతులు మట్టారావు, మంగయ్య, ఆంజనేయులుకు చెందిన పొలాల వద్ద ఏర్పాటు చేసిన నియంత్రికల నుంచి రాగితీగను, ఆయిల్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు.

నేడు రెడ్‌క్రాస్ కార్యవర్గ సమావేశం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సత్తెనపల్లి శాఖ నూతన కార్యవర్గం తొలి సమావేశాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని మాడా విశ్వేశ్వరరావు ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ జిల్లా సభ్యుడు పుట్టి సాంబశివరావు తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతున్న సమావేశానికి క్లబ్ బాధ్యులు, సభ్యులు అందరూ తప్పక హాజరవ్వాలని ఆయన కోరారు.



మీరు వినండి చదవండి అప్పజెప్పండి

పార్వతీపురం మండలం కొత్తఊరు ప్రాథమిక పాఠశాలను తరగతి గదుల కొరత వేధిస్తోంది. ఒక గదిలోనే మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 54 మంది విద్యార్థులు చదువుతున్నారు. నలుగురు ఉపాధ్యాయులున్నారు. ఒక్కటే భవనం ఉంది. అదనపు భవనం మంజూరైనా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో వరండాలో ఒకటి, పక్కన మరోటి, మధ్య గదిలో మూడు తరగతులు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు తెలిపారు. పరిస్థితిని పరిశీలించి, నిర్మాణదారులను అప్రమత్తం చేస్తామని ఎంఈవో-2 ప్రసాద్ చెప్పారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

13 నుంచి జేఎన్‌టీయూలో హ్యాకథాన్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం, జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14వ తేదీల్లో విజయనగరంలోని విశ్వవిద్యాలయంలో హ్యాకథాన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉపకులపతి సుబ్బారావు తెలిపారు. బీటెక్, ఎంటెక్, బీసీఏ, ఎంసీఏ, బీఎస్సీ, బీఏ, ఎంఎస్సీ, ఎంఏ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొనవచ్చు. ముందుగానే https://shorturl.at/UWsA1 లో నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థినికి అరుదైన అవకాశం

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కురుపాం మండలం సప్పగొత్తిలి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని గేదెల భువనేశ్వరికి అరుదైన అవకాశం లభించింది. పదో తరగతి వరకు గుమ్మలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన ఆమె ఆస్ట్రేలియాలోని ప్రముఖ విశ్వవిద్యాలయం క్వీన్స్‌ల్యాండ్‌లో ఎమ్మెస్సీ-అగ్రికల్చర్ చేసేందుకు ఎంపికైంది. 20 శాతం స్కాలర్‌షిప్‌తో చేరేందుకు ఇటీవల లేఖ వచ్చిందని ఆమె చెప్పింది.

ప్రైవేటు బడుల్లోనూ 100 రోజుల ప్రణాళిక

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు వందరోజుల ప్రణాళికను రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టింది. దీన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రైవేటు బడుల్లో కూడా అమలుచేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదేశించారు. జిల్లాలో 223 ఉన్నత పాఠశాలల్లో 36 ప్రైవేటు యాజమాన్యంలో నడుస్తున్నాయి. వీటిలో 1,740 మంది పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

పారిశ్రామికవాడ.. ఏదీ ప్రగతి జాడ!

ఈనాడు, విజయనగరం

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించిన గత వైకాపా ప్రభుత్వం. ఆచరణలో మాత్రం అలసత్వం వహించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉమ్మడి జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) పార్కులు నిర్మించాలని నిర్ణయించింది. రెండు నెలల కిందట అయిదు చోట్ల శంకుస్థాపనలు చేసి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వివిధ కారణాలతో అభివృద్ధికి పూర్తిస్థాయిలో అడుగు పడడం లేదు.

సీతంపేట: పనుకువలస ఎంఎస్‌ఎంఈ పార్కులో జరుగుతున్న పనులు

కొత్తవలస మండలం బలిఘట్టం

ఎంఎస్‌ఎంఈ పార్కు కోసం 57.09 ఎకరాలు సేకరించారు. ఫేజ్-1 కింద 22.12 ఎకరాల్లో ఒక్కో ప్లాటు 300 చ.మీ. చొప్పున 83 ప్లాట్లు ఏర్పాటు చేస్తారు. ● ఇక్కడ చ.మీ. రూ.988కు ఇవ్వనున్నారు. ● రోడ్లు, కాలువలు, విద్యుత్తు సరఫరా తదితర అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.3.51 కోట్లు విడుదల చేయగా.. రూ.54 లక్షలతో 16 శాతం కాలువ నిర్మాణం చేపట్టారు.

రామభద్రపురం మండలం కొట్టక్కి...

ఈ పార్కుకోసం వంద ఎకరాలు గుర్తించారు. ఫేజ్-1 పనులకు 25.81 ఎకరాలు కేటాయించారు. ● 300 చ.మీ. చొప్పున 139 ప్లాట్ల ఏర్పాటుకు లేఅవుట్ వేశారు ● చ.మీ. ధర రూ.1,112 గా నిర్ణయించారు ● మౌలిక సదుపాయాలకు 3.44 కోట్లు కేటాయించారు. రూ.12 లక్షలతో మూడు శాతం పనులు చేపట్టగా, స్థానికుల అడ్డగింతతో ఆగాయి.

బొండపల్లి మండలం కొండకిండాం..

ఇక్కడ 57.49 ఎకరాలు గుర్తించారు. తొలి దశలో 26.28 ఎకరాల్లో 173 ప్లాట్లు నిర్మించనున్నారు. 300 చ.మీ. విస్తీర్ణంలో ఒక్కో ప్లాటు వేయగా, చ.మీ. ధర రూ.863 గా నిర్ణయించారు. ఇక్కడ రూ.4.92 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించగా, రూ.28 లక్షలు వెచ్చించి 6 శాతం పనులే చేశారు.

రెండో దశలో ఆరు

● చీపురుపల్లి నియోజకవర్గం కుమరాంలో గుర్తించిన స్థలం అనువుగా లేదు. విజయనగరం గ్రామీణ మండలం కొండకరకంలో ఎంపిక చేసిన 12 ఎకరాలకు బదులు మరో చోట స్థలమివ్వాలని ఉన్నతాధికారులు కోరారు. సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల్లో సమస్య పరిష్కారానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

● రెండో దశలో రాజాం నియోజకవర్గం సంకిలి వద్ద 20 ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు స్థలం గుర్తించారు. ఇందులో డీకేటీ భూములు ఉన్నందున ప్రత్యామ్నాయ స్థలానికి అన్వేషిస్తున్నారు.

నెల్లిమర్ల..

ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో మూడెకరాలు కేటాయించారు. ఇక్కడ ఫ్లాటర్ ఫ్యాక్టరీ సముదాయంలో 28 గదులు నిర్మించనున్నారు. ఒక్కో గది 900 చ.అ.లో నిర్మిస్తారు ● ప్రభుత్వం రూ.15.55 కోట్లు మంజూరు చేయగా, రూ.74 లక్షలతో 10 శాతం పని మాత్రమే పూర్తి చేశారు.

పాలకొండ నియోజకవర్గం పనుకువలస..

ఇక్కడ 27.26 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణం ప్రారంభించారు. 170 ప్లాట్లు వేయనున్నారు. అభివృద్ధి పనులకు రూ.3.42 కోట్లు మంజూరయ్యాయి.

జనవరి నాటికి పూర్తి చేస్తాం.. ప్రారంభించిన అయిదు పార్కులను జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించాం. భూ వివాదాలతో జాప్యం జరుగుతోంది. వీటిని త్వరలో పరిష్కరిస్తాం.. – ఎం.మురళీమోహన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు

ఆహ్లాద ఆదివారం

మన్యంలోని పర్యాటక ప్రదేశాలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాలు, స్నేహితులు, సంఘాలు, విద్యా సంస్థలకు చెందిన బాలలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో సాలూరు మండలం శివారు, దళాయివలస జలపాతాల వద్ద, సీతంపేట పర్యాటక కేంద్రాలకు చేరుకుని ఆనందంగా గడిపారు.



సీతంపేటలో స్కై సైక్లింగ్

దళాయివలస జలపాతం వద్ద పర్యాటకుల సందడి

ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో బోటింగ్ చేస్తూ.. క్రీడల్లో పాల్గొంటూ.. ఆనంద డోలికల్లో మునిగారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి, ఈతమానుగూడ జలపాతాల వద్ద జలకాలాడుతూ సరదాగా గడిపారు. తితిదేకు చెందిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, సీతంపేట, సాలూరు గ్రామీణం

ఉద్యోగులూ.. అప్రమత్తతే ఔషధం

వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

ఏ రంగంలో అయినా ఆరోగ్యం సహకరిస్తేనే అనుకున్న ఫలితాలు సాధించవచ్చు. ప్రస్తుత కాలంలో ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు ఉరుకులు, పరుగులు. ఇంటాబయటా పని ఒత్తిడితో ప్రభుత్వ ఉద్యోగులు అనారోగ్యాల బారినపడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాల్లో ఈ విషయం స్పష్టమైంది.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

వైద్య శిబిరంలో అధికారులు, నిపుణులు

కలెక్టరేట్, జేసీ, ఐటీడీఏ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం కలెక్టర్ ప్రభాకరరెడ్డి జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో గత నెల 17 నుంచి ఈనెల 1వ తేదీ వరకు వివిధ దశల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో దీర్ఘకాల, తాత్కాలిక అనారోగ్య సమస్యలకు దరిచేరినవారు ఎక్కువగానే ఉన్నట్లు వెల్లడైంది. ప్రతిఒక్కరూ అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఎంత మందికి ఏయే రకాల పరీక్షలు చేశారు..

ఏ రుగ్మతలు బయటపడ్డాయో చూస్తే...

మొత్తం ఓపీ	1,132
రక్త పరీక్షలు	280
ఈసీజీ	480
రక్తపోటు ఉన్నవారు	174
మధుమేహం	131
గుండె సమస్యలు	58
గ్యాస్ట్రోఎంటరాలజీ సమస్యలు	9
నరాల ఇబ్బందులు	5

జిల్లా ఆసుపత్రి వైద్యులు, సూపర్‌స్పెషాలిటీ వైద్య నిపుణులు డీసీహెచ్‌ఎస్ నాగభూషణరావు ఆధ్వర్యంలో 1,132 మంది ఉద్యోగులకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. 377 మందికి పలు రకాల రుగ్మతలు ఉన్నట్లు గుర్తించారు.

మన్యం గజ..గజ

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు.. పెరుగుతున్న బాధితులు

పార్వతీపురం పట్టణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే

శీతల గాలులతో మన్యం జిల్లా వణుకుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని కురుపాం, కొమరాడ, పాచిపెంట, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, భామిని, సీతంపేట తదితర మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. పగటిపూట కొన్నిచోట్ల ఎండ కనిపించడం లేదు. సాయంత్రం 5 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు దట్టమైన మంచు పడుతోంది. చిన్న పిల్లలు, వృద్ధులు వేగంగా అనారోగ్యం బారినపడుతున్నారు.

● సీతానగరం మండలానికి చెందిన 55 ఏళ్ల వ్యక్తి మూడు రోజుల క్రితం ఇంటి వద్ద కుప్పకూలిపోయాడు. పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా.. చలికి రక్తం చిక్కగా మారి పక్షవాతానికి గురైనట్లు నిర్ధారించారు. చల్లగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

● గరుగుబిల్లి మండలం కొత్తపల్లికి చెందిన బాలిక పార్వతీపురంలో ఇంటర్ చదువుతోంది. ఉదయం 7 గంటలకే బయలు దేరడం, సాయంత్రం 6 గంటలకు ఇంటికి చేరడంతో మంచుదెబ్బ తగిలి.. అనారోగ్యం పాలైంది.

జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఎదురవుతున్న సమస్యలు

● చల్లగాలిలో తేమ ఎక్కువగా ఉండటంతో ఊపిరితిత్తులు ప్రభావితం అవుతున్నాయి.

● జలుబు, జ్వరం, తలనొప్పి, కళ్ల నొప్పులు, న్యుమోనియా, చర్మ, మూత్రపిండాలు గుండె సమస్యలు.

కృత్రిమ శ్వాసతో చికిత్స

జిల్లా ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో 20 మంది చిన్నారులుంటే అందులో 10 మంది జలుబు, దగ్గు, ఆయాసం వంటి రుగ్మతలతో చికిత్స పొందుతున్నవారే. అత్యవసర విభాగంలో ఆరు పడకలు ఉండగా ఎనిమిది మంది కృత్రిమ శ్వాసతో చికిత్స పొందుతున్నారు.

జాగ్రత్తలు అవసరం

● దీర్ఘకాల రోగులు ఉదయం 8 గంటల కంటే ముందు, సాయంత్రం 6 తర్వాత బయట ప్రయాణాలు మానుకోవాలి.

● అత్యవసరమైతే చలికోటు, చేతి తొడుగులు, చెవులు..ముక్కులోకి గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

● వేడి నీరు తాగాలి. నిల్వ ఆహారానికి దూరంగా ఉండాలి.

● శ్వాస సంబంధ ఇబ్బందులు ఉన్నవారు వెచ్చని పరిసరాల్లో ఉండాలి.

శ్వాస సమస్యలే ఎక్కువ... శ్వాస సంబంధ ఇబ్బందులతో ఆసుపత్రులకు వచ్చేవారు పెరిగారు. జలుబు, దగ్గు, జ్వరం బాధితులు ఎక్కువగా ఉన్నారు. పొగమంచుతో ఊపిరితిత్తులు ప్రభావితమయ్యే ప్రమాదముంది.– నాగశివజ్యోతి, రాజీవ్, వైద్యులు

గుండె, మూత్రపిండాలు, బ్రెయిన్ స్ట్రోక్ సమస్యలతో వచ్చిన వారు: 30 మంది

జిల్లాలో గత వారం రోజుల్లో.. శ్వాస సంబంధ ఇబ్బందులతో జిల్లా, ప్రాంతీయ, పీహెచ్‌సీలకు వచ్చినవారు: 630 మంది

దగ్గు, జలుబు, జ్వరం బారినపడినవారు: 2,780 మంది

పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు: 22-16 డిగ్రీలు

నేడు పీజీఆర్‌ఎస్

పార్వతీపురం, న్యూస్‌టుడే: కలెక్టరు కార్యాలయం పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నారు. కలెక్టరు ప్రభాకరరెడ్డి, డీఆర్వో హేమలత, ఉపకలెక్టర్లు పాల్గొని సాధారణ అర్జీలు స్వీకరిస్తారు. సెల్లారులోని నాలుగో సమావేశ మందిరంలో రెవెన్యూ క్లినిక్కు జరుగుతుంది. ఇందులో రెవెన్యూ సమస్యలను పరిశీలించి పరిష్కారం చూపిస్తారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్లు పాల్గొంటారు.

వాలీబాల్ విజేత చిలకలపల్లి

బొబ్బిలి, న్యూస్‌టుడే: అంబేడ్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో శని, ఆదివారాల్లో ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. పలు ప్రాంతాలకు చెందిన 20 జట్లు పాల్గొన్నాయి. రసవత్తరంగా సాగిన పోటీల్లో బలిజిపేట మండం చిలకలపల్లి ప్రథమ, బొబ్బిలి మండలం రంగరాయపురం ద్వితీయ, బలిజిపేట తృతీయ, బొబ్బిలి పట్టణం జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు రాంబాబు, అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరుసాంబయ్య చేతుల మీదుగా విజేతలకు నగదు, బహుమతులు అందజేశారు.

తలపడుతున్న రంగరాయపురం-చిలకలపల్లి జట్లు

ఆ 40 బస్తాల ధాన్యం ఏమైంది

● మిల్లులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
● సిబ్బందికి షోకాజ్‌లు ఇవ్వాలని ఆదేశం

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండల కేంద్రంలోని జయలక్ష్మి రైసుమిల్లును కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. పెదపెంకి గ్రామం నుంచి మిల్లుకు 200 బస్తాల ధాన్యం వచ్చినట్లు ట్రక్‌షీటు చూపించినా.. 160 బస్తాలు మాత్రమే దించారు. మిగిలిన ఆ 40 బస్తాలు ఏమయ్యాయని కలెక్టర్ ట్రాక్టరు యజమాని, పీసీసీ కేంద్రాల నిర్వాహకులను ప్రశ్నించారు. అనంతరం అక్కడికి వచ్చిన ధాన్యం బస్తాలను తూకం వేయించారు. అందులో ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యం కన్నా 1.5 కిలోలు అదనంగా ఉన్నట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రక్‌షీటులో 200 బస్తాలు చూపించారని, మరో ట్రాక్టరుపై మిగతా ధాన్యం బస్తాలు వస్తాయని, వేబ్రిడ్జి ద్వారా తూకం వేయడంతో తూకంలో తేడా ఉందని రైసు మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బూరాడ రామ్మోహనరావు కలెక్టరుకు వివరించారు. దీంతో బస్తాలు రైసుమిల్లుకు తరలించడంలో అలసత్వం వహించిన పెదపెంకి పీసీసీ కేంద్రం వీఏవో, టెక్నికల్ అసిస్టెంట్‌కు షోకాజు నోటీసులు జారీ చేయాలని తహసీల్దారు బాలమురళీకృష్ణను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఏవో శివగణేష్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

జీపును చెబుతున్నా.. జీవితాలతో ఆటలొద్దు!

ముందు.. వెనక.. పైన.. ఎక్కడైనా ఖాళీ ఉందా?
ఎందుకీ ప్రయాణాలు చెప్పండి?
మీరు ఎంతమంది ఉన్నా తీసుకెళ్లడం నాకేం భారం కాదు.
నా కళ్లు(అద్దం) కూడా కనిపించకుండా కూర్చుంటే ఎట్లా?
చోదకుడికి ఏం పోయింది చెప్పండి!
నాలుగు డబ్బులొస్తాయని ఎందరొచ్చినా నో చెప్పడు.
ఘాట్ రోడ్‌లో ఒంపులు తిరగాలంటే ఎంతో భయమేస్తోంది..
అప్పటికీ పైన మీరున్నారనే ఆలోచనతో..
కాళ్లకు చక్రాలున్నా కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా..
పొరపాటున కాలుజారితే పరిస్థితేంటి చెప్పండి?
మిమ్మల్ని క్షేమంగా చేర్చాలని నిత్యం మొక్కని దేవుడు లేడు
మీ అందరినీ బతిమలాడుతున్నా.. ఈ ప్రయాణాలు ఆపేయండి
ఇంతమంది వాహనం ఎక్కే ప్రసక్తే లేదని చోదకుడికి చెప్పేయండి
మీ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లండి
ఇంటిదగ్గర మీకోసం ఎదురుచూసే ప్రాణాలకు దూరం కాకండి.

– ఇట్లు మీ జీపు

(రవాణా సౌకర్యాలు లేని గిరిశిఖర గ్రామాల నుంచి మైదాన ప్రాంతాలకు చేరాలంటే ఇలాంటి వాహనాలే దిక్కు. సాలూరు మండలంలోని గిరిజనం ఘాట్‌రోడ్డులో ఆదివారం కనిపించిన చిత్రమిది).

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

సైనిక సంక్షేమానికి చేయూతనిద్దాం రండి

న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి

దేశ సరిహద్దులను రాత్రింబవళ్లు రక్షిస్తున్న సైనికుల సేవలు ఎనలేనివి. కుటుంబాలకు దూరంగా ఉంటూ క్లిష్ట పరిస్థితుల్లోనూ మేమున్నామంటూ రక్షణగా నిలుస్తుంటారు. ఈ నేపథ్యంలో వారితో పాటు సంబంధిత కుటుంబ సభ్యులకు అండగా నిలిచేందుకు కేంద్రం సైనిక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసింది. ఏటా విరాళాలు సేకరిస్తుంటుంది. అందులో భాగంగా డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈసారి ఆదివారం పడడంతో 8న చేపడుతున్నారు. సోమవారం ఉదయం మాజీ సైనికుల ర్యాలీ, ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

రూ. 14.91 లక్షలు..

2017 నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా నుంచి సంక్షేమ నిధికి రూ.14.91 లక్షలు సమకూరింది. ఈసారి 112 హుండీలను అందుబాటులో ఉంచారు. ప్రతిఒక్కరూ ముందుకొచ్చి సైనికులకు చేయూతనివ్వాలని సంక్షేమాధికారి సాయిప్రసాద్ తెలిపారు. వారి పిల్లలకు వివాహాలు, ఉపకార వేతనాలు, చనిపోయిన జవాన్ల అంత్యక్రియల నిర్వహణ, బాధితులకు పింఛను సదుపాయం.. తదితర వాటికి ఖర్చు చేస్తున్నారు.

ఓటీపీ చెబితేనే గ్యాస్ డెలివరీ

వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు జిల్లాలో నూతన విధానం అమల్లోకి రానుంది. ఇప్పటివరకు గ్యాస్ బుక్ చేసుకుంటే నగదు చెల్లించి.. ఎవరైనా సిలిండర్ తీసుకునే వెసులుబాటు ఉండేది. ఇకపై ఓటీపీ(వన్ టైం పాస్‌వర్డ్) చెబితేనే అందించే విధానాన్ని ఇంధన కంపెనీలు తప్పనిసరి చేశాయి. ఇప్పటికే వంద స్మార్ట్‌సిటీల్లో ఇది అమలవుతుండగా త్వరలో దేశవ్యాప్తం చేయనున్నట్లు ఎల్‌పీజీ సంస్థ పేర్కొంది. వినియోగదారులు ఆధార్ ఈకేవైసీ పూర్తి చేసుకుని గ్యాస్ కనెక్షన్ మనుగడలో ఉంచుకోవాలని ఏజెన్సీల డీలర్లు సూచిస్తున్నారు. జిల్లాలో 10 వేల వరకు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

నృత్య నందనం

సాంప్రదాయ నృత్య కళలతో ఆ వేదిక పులకించింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంత వేడుకను పురస్కరించుకుని పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం హైందవ శంఖారావం నిర్వహించారు. ఈ సందర్భంగా జట్టు ఆశ్రమ పాఠశాల బాలికలు ప్రదర్శించిన నృత్యం అలరించింది. కోటిపాం, నర్సిపురం గ్రామాల మహిళలు కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

– న్యూస్‌టుడే,పార్వతీపురం పురపాలక

(c) eenadu

ఇనుప కుర్చీతో కొట్టి చంపేశాడు

విశాఖలో జిల్లా మహిళ దారుణ హత్య

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. విజయనగరంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన అల్లాదేవి(34)తో సహజీవనం చేస్తున్న వి.శ్రీనివాసరావు అనే వ్యక్తి శనివారం ఆమెను పాత గోశాల సమీపంలోని సూర్యకాంతం లేఅవుట్‌లో అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె ముఖంపై ఇనుప కుర్చీతో మోదడంతో పాటు పదునైన వస్తువుతో మెడ, ముఖంపై దాడి చేసినట్లు తెలిసింది. ఆ క్రమంలో ఆమెకు పలుచోట్ల తీవ్ర గాయాలు కావడంతో పాటు ముఖం ఛిద్రమైపోయింది. గతంలో ఆరిలోవ స్టేషన్ పరిధిలో ఒక మోసం కేసు విషయంలో శ్రీనివాసరావు జైలు కెళ్లి వచ్చాడు. ఈ వ్యవహారంలోనే అల్లాదేవితో అతడికి విభేదాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చినముషిడివాడ లక్ష్మీనగర్‌లో ఉంటున్న నిందితుడి కుటుంబానికి కూడా వీరిద్దరి సహజీవనంపై సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. అతడు ఇంకా పరారీలోనే ఉన్నాడు. ఆచూకీ కోసం పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు సాగుతోందని సీఐ తెలిపారు.

శుభకార్యానికి పిలిచేందుకు వెళ్లి.. మృత్యుఒడికి

పార్వతీపురం పట్టణం, సీతానగరం, మక్కువ, న్యూస్‌టుడే: మూడు రోజుల క్రితం సీతానగరం మండలం గుచ్చిమి సమీపంలో ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనండీకొన్న ఘటనలో మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మక్కువ మండలానికి చెందిన పిన్నింటి కుమార్(36)గా గుర్తించారు. ఇంటి యజమాని దుర్మరణం చెందిన విషయం రెండు రోజుల తర్వాత తెలియడంతో కుటుంబీకులు విలపిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో శుభకార్యం జరగాల్సిన ఇంట్లో కన్నీటి సుడులు నిండుకున్నాయి.

కుమార్ (పాతచిత్రం)

మార్కొండపుట్టి గ్రామానికి చెందిన కుమార్ వ్యవసాయ కూలి. అతడికి భార్య విజయలక్ష్మి, కుమార్తె రేష్మా, కుమారుడు రమేష్ ఉన్నారు. పాప ఇటీవల పుష్పవతి కావడంతో ఈనెల 14న శుభ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్డులు ముద్రించారు. సీతానగరం మండలం రేపటివలసలో బంధువులకు చెప్పేందుకు శుక్రవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సాయంత్రానికి ఇంటికి వచ్చేస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి రాత్రయినా రాకపోవడంతో కుటుంబీకులు ఆరా తీశారు. చేతిలో చరవాణి కూడా లేకపోవడంతో వచ్చేస్తాడని ఎదురుచూశారు. రెండు రోజులైనా రాకపోవడం, రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి అని పత్రికల్లో రావడంతో అనుమానం వచ్చి వాకబు చేశారు. శనివారం రాత్రికి విషయం తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం జిల్లా ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. శరీరంపై ఉన్న ఆనవాళ్లతో కుమార్‌గా గుర్తించారు. బాగా చదువుకోవాలని వెన్నుతట్టిన తండ్రి ఇక రాడన్న నిజాన్ని పిల్లలు జీర్ణించుకోలేకపోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదుకుంటాడనుకుంటే.. అందని లోకాలకు

జలపాతం వద్ద యువకుడి దుర్మరణం

సాలూరు గ్రామీణం, రామభద్రపురం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబం వారిది. కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమారులను పెంచి, పెద్ద చేశారు. చిన్నవాడు ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ కుటుంబ బాధ్యతను మోస్తున్నాడు. ఆ యువకుడు జలపాతం చెంత ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన సాలూరు మండలంలో చోటుచేసుకుంది.

రామభద్రపురం మండల కేంద్రంలోని మారుతీనగర్ కాలనీకి చెందిన జి.గోవిందరావు, మంగమ్మకు ఇద్దరు కుమారులు. పెద్దవాడు గోవిందరావు తాపీమేస్త్రీ. రెండో కుమారుడు హరి(24) స్థానికంగా ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేసేవాడు. స్నేహితులతో కలిసి ఆదివారం సాలూరు మండలం కురుకుట్టి పంచాయతీ దళాయివలస గ్రామ సమీపంలో ఉన్న జలపాతానికి వెళ్లాడు. అందరూ ఉన్న దగ్గర కాకుండా కొంచెం దూరంలో నీరు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో స్నానం చేయాలని భావించాడు. అక్కడ భారీ మడుగు ఉండడంతో ఈత రాక మరణించాడు. స్నేహితులు స్పందించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ప్రాంతీయాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింహమూర్తి తెలిపారు.

జి.హరి (పాతచిత్రం)

ఆటో బోల్తా: 12 మందికి గాయాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో 12 మందికి గాయాలైన ఘటన గంట్యాడ మండలంలోని ఎగువ కొండపర్తి మార్గంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. విజయనగరంలోని జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన కొందరు భక్తులు ఆటోలో గంట్యాడ మండలం ఎగువ కొండపర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 12 మంది గాయపడ్డారు. స్థానికులు స్పందించి వెంటనే ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి తరలించారు. వైద్యులు స్నేహ, మధు ప్రథమ చికిత్స అందించారు. పి.అన్నపూర్ణ, ఎస్.లక్ష్మికి తీవ్ర గాయాలవగా.. విజయనగరం రిఫర్ చేశారు. పి.దినేష్, జి.జయమ్మ, కె.సత్యవతి, జి.విజయలక్ష్మి, ఎం.రూప, కె.ఉదయ్‌కుమార్, డి.సాయి, కె.బంగారమ్మ, కె.నవీన్, ఐశ్వర్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

దుకాణాల్లో చోరీ

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పలు దుకాణాల్లో శనివారం అర్ధరాత్రి ఓ దొంగ చొరబడ్డాడు. తనకున్న రెండు చరవాణి దుకాణాల్లో ముప్పావు తులం బంగారం ఉంగరాలు, రూ.25 వేలు చోరీకి గురైనట్లు శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం దాలెంరాజువలసకు చెందిన పి.వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన దర్జీ దుకాణంలోకి చొరబడినా, ఏమీ పోలేదని మరో వ్యక్తి తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి షట్టర్లు పైకి లేపి, నగలు, నగదు తీసుకుని ఉడాయించినట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌కుమార్, ఏఎస్సై జనార్దనరావు తెలిపారు.

అపూర్వ జ్ఞాపకాల నవోదయం!

సందడిగా జేఎన్‌వీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రిన్సిపాళ్లు, గురువులతో పూర్వ విద్యార్థులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట మండలం కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2000-07 మధ్య చదివిన వారు ఆదివారం సందడి చేశారు. 220 మంది పూర్వ విద్యార్థులు, 20 మంది పూర్వ ఉపాధ్యాయులు, 20 మంది బోధనేతర సిబ్బంది, నలుగురు పూర్వ ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. నవోదయ పూర్వ విద్యార్థి, పశ్చిమ బెంగాల్ కేడర్ ఐఆర్ఎస్ అధికారి డి.సతీష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సివిల్ సర్వీసులకు సంబంధించి అన్నివిధాలా కెరీర్ గైడెన్స్ అందిస్తామన్నారు. ఏటా పదో తరగతిలో మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10,000 ప్రోత్సాహకం అందిస్తామని ప్రకటించారు. ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, పూర్వ ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, అంజయ్య, మల్లేశ్వరరావు పాల్గొన్నారు. పూర్వవిద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. విద్యాలయానికి రూ.లక్ష విలువైన పోటీ పరీక్షల పుస్తకాలు అందించారు. కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గురువులను సత్కరించారు.

యాస వేరైనా తెలుగువారంతా ఒక్కటే

పచ్చదం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న తదితరులు

రాజాం, న్యూస్‌టుడే: సమ సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని తెలంగాణ శాసనమండలి సభ్యుడు, కవి, గాయకుడు గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాజాం రచయితల వేదిక 11వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కవిత్వంతో చెడుకు మేలు, మంచికి కీడు జరగకూడదన్నారు. కవులు సమాజంలోని హెచ్చుతగ్గులను కవిత్వీకరించాలని కోరారు. ప్రాచీనకాలం నుంచి నేటి వరకు సమాజ స్థితిగతులను అధ్యయనం చేసి, రచనలు సాగించిన వారే మనుగడ సాగించారని గుర్తు చేశారు. యాస వేరైనా తెలుగువారంతా ఒక్కటేనని చెప్పారు. పిల్లా తిరుపతిరావు రచించిన సాహిత్య వ్యాసాల పుస్తకం 'పచ్చదం'ను ఆవిష్కరించారు. గోరటిని వేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. గార రంగనాథం, పి.శ్రీనివాస్, ఎస్.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు 4,009 మంది హాజరు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ ప్రతిభ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారు. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 19 కేంద్రాల్లో 4094 మందికి గానూ 4009 మంది (97.92శాతం) హాజరయ్యారు. డీఈవో యు.మాణిక్యం నాయుడు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ టి.సన్యాసిరాజు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీ చేశారు.

విజయనగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో తనిఖీ చేస్తున్న డీఈవో మాణిక్యం నాయుడు, ఏసీ సన్యాసిరావు తదితరులు

సరకులకు శ్రీకాకుళం.. వైద్యానికి విశాఖ

● మాజీ సైనికులు, వితంతువులకు అవస్థలు
● ఉమ్మడి జిల్లాలో కొరవడిన సేవలు

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

ఉమ్మడి జిల్లాలో నివాసం ఉంటున్న త్రివిధ దళాలకు చెందిన మాజీ ఉద్యోగులు, జవాన్ల కుటుంబ సభ్యులు, వితంతువులు.. తదితరులకు సేవలు అందడం లేదు. సైనిక క్యాంటీన్, ఆసుపత్రి లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పొరుగు జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వైద్యానికైతే విశాఖకు, సరకులేమైనా కావాలంటే దగ్గర్లోని శ్రీకాకుళం కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

నగరంలోని సైనిక సంక్షేమాధికారి కార్యాలయం

అనుమతులు వచ్చినా..

సైనిక సంక్షేమ బోర్డు, మాజీ సైనికుల సంఘాల సభ్యులంతా ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. దీంతో 2023లో డిఫెన్స్ విభాగం స్పందించింది. ఆసుపత్రితో పాటు క్యాంటీన్, నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు అనుమతులిచ్చింది. అప్పట్లో రెవెన్యూ అధికారులు గాజులరేగ సమీపంలో 22 సెంట్లను కేటాయించారు. అది సరిపోదని మరో 40 సెంట్లు కోరగా.. ఆమేరకు ఆదేశాలొచ్చాయి. అన్నీ ఒకే దగ్గర ఉండేలా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ విధానంలో నిర్మాణాలు చేపట్టాలని భావించారు. టెండర్లు సైతం పిలిచారు. అక్కడి నుంచి ముందుకు కదల్లేదు.

ఏళ్ల నుంచి అంతే..

2017లో క్యాంటీన్ ఏర్పాటుకు అనువైన అద్దె భవనాలు చూడాలని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కానీ చర్యల్లేవు. 2023లో మరోసారి తెరపైకి వచ్చినా మరుగున పడేశారు. ఈ పరిస్థితికి గల కారణాలు మాత్రం తెలియరావడం లేదు.

ఉపయోగాలివీ..

రెండు జిల్లాల్లో ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు, మాజీలు, వితంతువులు.. ఇలా వివిధ కేటగిరీల కింద 17,556 మంది సైనిక సంక్షేమ శాఖలో నమోదయ్యారు. నిత్యావసరాలు, వైద్యం.. ఇతరత్రా సేవలు పొందేందుకు 5 వేల మంది వరకు కార్డులు పొందారు. కానీ కార్యాలయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. విజయనగరం జిల్లా వారు విశాఖ, శ్రీకాకుళం మధ్యలో ఉండడంతో కొంతమేర దూరాభారం తగ్గుతున్నా.. మన్యం వాసులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు.

● పిల్లలకు నైపుణ్యాలు నేర్పించేందుకు ఏర్పాటు చేయాలని భావించిన స్కిల్ కేంద్రానిదీ అదే దుస్థితి.

ప్రస్తుతానికి ఈసీహెచ్ఎస్..

విజయనగరంలో ప్రస్తుతానికి ఈసీహెచ్ఎస్(పాలీ క్లినిక్) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సంబంధిత సిబ్బందిని ఇటీవల విశాఖలో ఎంపిక చేశారు. వారు వచ్చాక అద్దె భవనాన్ని కేటాయిస్తాం. క్యాంటీన్, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల సమస్యను మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– సాయి ప్రసాద్, సైనిక సంక్షేమాధికారి, ఉమ్మడి విజయనగరం జిల్లా

మరణాలు తగ్గించేందుకు చర్యలు అవసరం

ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: 'మానవుడి ఆరోగ్యంపై కృత్రిమ మేధ ప్రభావం' అనే అంశంపై మూడు రోజుల పాటు విజయనగరం వేదికగా జరిగిన జీపీకాన్- 2025 సదస్సు ఆదివారంతో ముగిసింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వైద్య నిపుణులు, వైద్య రంగ ప్రముఖులు పాల్గొన్నారు. కాలిన గాయాలు, జీవన విధానం, వర్క్‌లైఫ్ బ్యాలెన్స్, గుండె సంబంధిత అంశాలపై సూచనలు చేశారు. గుండె దడ, బ్రెయిన్ స్ట్రోక్, క్యాన్సర్, కాలేయ, కిడ్నీ సమస్యల కారణంగా దేశంలో ఎక్కువ మంది మరణిస్తున్నారని సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డా.వెంకటేశ్వరరావు అన్నారు. తగ్గించేందుకు తగిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. వైద్యులు వీఎస్.ప్రసాద్, జేసీ.నాయుడు, కుమారస్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి అవతారమెత్తిన కలెక్టర్

బలిజిపేట, న్యూస్‌టుడే: మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఉపాధ్యాయుడి అవతారం ఎత్తారు. సుమారు రెండు గంటల పాటు విద్యార్థినులతో ముచ్చటించి.. విద్యాబుద్ధులు చెప్పారు. ఆదివారం రాత్రి బలిజిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. బాలికలతో మాట్లాడి, వారితో పాటలు పాడించి, నృత్యాలు చేయించారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. క్రమశిక్షణ, సహనం కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఎంఈవో సింహాచలం, తహసీల్దారు బాలమురళీకృష్ణ, ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఏవో శివగణేష్, కస్తూర్బా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గౌరీ సంతోషి పాల్గొన్నారు.

బాలికలతో మాట్లాడుతున్న ప్రభాకరరెడ్డి

ప్యాలెస్‌లో కాకుండా ప్రజల్లోకి రావాలి: ఎంపీ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: దేశ, విదేశాలకు చెందిన కంపెనీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒప్పందాలు చేసుకుని, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. అశోక్‌బంగ్లాలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ పరకామణి కేసును చిన్నదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన బాబాయ్ హత్య కేసునే పట్టించుకోనప్పుడు.. ఇలాంటివన్నీ చిన్నవిగానే కనిపిస్తాయని ఎద్దేవా చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. ప్యాలెస్‌లలో కాకుండా ప్రజల్లోకి వస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. నాయకులు గంటా రవి, గాడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు

డోలీ కట్టి.. ఆసుపత్రికి తరలించి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ శివారు గాదెల్లోవ గిరిజన గ్రామానికి చెందిన గర్భిణిని పురిటినొప్పులకు తోడు డోలీ కష్టాలు వేధించాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గర్భిణి అంటపర్తి భజంతికి ఆదివారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. ఆ ప్రాంతానికి వాహనాలు వచ్చే దారి లేదు. దీంతో చేసేది లేక, భర్త సన్యాసిరావు, బంధువులు కలిసి డోలీ కట్టి ఆమెను కాలినడకన 108 వాహనం వచ్చే మార్గం వరకు మోసుకెళ్లారు. అక్కడి నుంచి వాహనంలో ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. ఏళ్లు గడిచినా గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదని గి.సం. నాయకుడు గౌరీష్ వాపోయారు.

గర్భిణిని మోసుకెళ్తున్న బంధువులు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	147	264	274

లాకులకు సోకులెప్పుడో?

గరుగుబిల్లి మండలం తోటపల్లి కాలువ పైనున్న లాకులు(మదుము) దుస్థితి ఇది. ఏళ్ల నాటిది కావడంతో ఇనుప నిర్మాణాలన్నీ తుప్పుపట్టాయి. ప్రవాహానికి తిరిగిపోకుండా అడ్డంగా కర్ర పెట్టారు. దీంతో షట్టర్లు ఎత్తిదించే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామని ప్రాజెక్టు ఏఈ వెంకటరమణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

– న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

జాతీయస్థాయి పోటీల్లో మనోళ్ల సత్తా

ప్రతిభ చాటిన క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం గొర్లెవానిపాలెంలోని ఇండోర్ స్టేడియంలో రెండ్రోజుల పాటు జరిగిన 69వ రాష్ట్రస్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో 7 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన 36 మందిని జనవరి 17 నుంచి 22 వరకు దిల్లీలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఇందులో విజయనగరం జిల్లా నుంచి.. బాలికల్లో అండర్-17లో ఝాన్సీ, అండర్-19లో శ్రీహిత, బాలురులో అండర్-14 విభాగంలో ఎస్.కె.అయాన్, అండర్-17లో ఆకాశ్, అండర్-19లో వినయ్‌కుమార్, రోహిత్, వెంకటేశ్ ఉన్నారు.

జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఏపీ పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులు 2026 సంవత్సరానికి సంబంధించి జనవరి 1 నుంచి జీవన ప్రమాణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్స్) సమర్పించాలని ఉప ఖజానాధికారి వెంకటపద్మనాభం తెలిపారు. ఆదివారం బొబ్బిలిలో మాట్లాడారు. 2025 నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించిన పత్రాలు 2026కు చెల్లుబాటు కావన్నారు. ఉపఖజానా కార్యాలయంలోని జీవన ప్రమాణ యాప్ ద్వారా సమర్పించవచ్చన్నారు. పీపీవో, ఆధార్, బ్యాంకు అకౌంట్ నంబర్లను చరవాణి నంబరుకు అనుసంధానించాలని తెలియజేశారు. కార్యాలయంలో ఉచితంగా సేవలు అందిస్తామని, రాలేనివారు సమాచారం అందిస్తే, ఇంటివద్దకే వచ్చి పత్రాలు స్వీకరిస్తామని వెల్లడించారు.

తరగతి గదిలో ఉపాధ్యాయుడిపై చెప్పు విసిరిన విద్యార్థి!

విద్యావిభాగం: ఉపాధ్యాయుడిపై ఓ విద్యార్థి చెప్పు విసిరిన ఘటన విజయనగరంలోని ఓ పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. తరగతి గదిలో బాలుడు అల్లరి చేస్తుండడంతో సదరు ఉపాధ్యాయుడు ప్రశ్నించాడు. దీంతో చెప్పు విసిరాడు. బాధితుడు మండిపడగా.. దమ్ముంటే కొట్టి చూడు.. అన్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

అనధికార భవనమా.. క్రమబద్ధీకరణ ఇలా..

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఉమ్మడి జిల్లాలో బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రచారం లేకపోవడం, తెలిసినా కొందరు యజమానులు ముందుకు రాకపోవడంతో దరఖాస్తులు రావడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పురపాలికలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి.

విజయనగరంలోని బాబామెట్టలో కొలతలు తీసేందుకు వెళ్లిన ప్లానింగ్ కార్యదర్శులు

బీపీఎస్‌కు 39 దరఖాస్తులే

ముందుకొస్తే మేలంటున్న అధికారులు

స్పందన అంతంతే..

రెండు జిల్లాల్లో గత అయిదేళ్లలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు వెలిశాయి. విజయనగరంలో భారీగా ఉన్నాయి. కానీ దరఖాస్తు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు 28 మంది మాత్రమే స్పందించారు. బొబ్బిలిలో ఏడు, రాజాంలో ఒకటి, పార్వతీపురంలో మూడు దరఖాస్తులు అందాయి. సాలూరు, నెల్లిమర్ల, పాలకొండ నుంచి ఒక్కటీ రాలేదు. అక్రమ భవనాల క్రమబద్ధీకరణకు పురపాలక పరిపాలన శాఖ నవంబరు 12న నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పటి నుంచి 120 రోజుల వ్యవధిలో దరఖాస్తులు చేసుకోవాలని గడువు నిర్దేశించింది. దీని ప్రకారం గుర్తింపు పొందిన టెక్నికల్ పర్సన్ల ద్వారానే దరఖాస్తులు అప్లోడ్ చేయాల్సి ఉంది. ప్రాథమిక రుసుము రూ.10 వేలతో పాటు ఇతర ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

ఇవి అవసరం..

★ యాజమాన్య ధ్రువీకరణ పత్రం(ఈసీ) ★ గతంలో మంజూరు చేసిన ప్లాన్(అందుబాటులో ఉంటే) ★ ప్రస్తుత తేదీలతో స్టాంప్‌లు, ఫొటోలు ★ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మించిన అక్రమ కట్టడాల ప్రాంతాన్ని గుర్తిస్తూ డ్రాయింగ్లు, రోడ్ల విస్తరణకు సమర్పించాల్సిన బాండ్, కట్టడం స్థిరత్వ ధ్రువీకరణ పత్రం ★ వివిధ విభాగాల నుంచి నిరభ్యంతర పత్రాలు

విక్రయాలకు అవకాశం

● క్రమబద్ధీకరణకు గత నెల 12న నోటిఫికేషన్ విడుదలైంది. 120 రోజుల వ్యవధిలో ముందుకు రావాలి. దరఖాస్తుల ఆధారంగా వార్డు సచివాలయాలకు చెందిన ప్లానింగ్ కార్యదర్శులు పరిశీలిస్తారు. భవనాన్ని తనిఖీ చేసి, నివాసయోగ్యంగా ఉంటే బీపీఎస్ అని రాస్తారు. ● పథకంలో చేరాలంటే ప్రాథమిక రుసుము కింద రూ.10 వేలతో పాటు ఇతర ఛార్జీలు చెల్లించాలి. ● పురపాలిక పరిధిలోకి వెళ్లాక బ్యాంకు రుణాలు పొందేందుకు అవకాశం కలుగుతుంది. ● ఇంటిపన్నుపై పెనాల్టీ తగ్గుతుంది ● రాయితీలు దక్కుతాయి ● క్రయవిక్రయాలకు ఇబ్బందులుండవు.

ప్రత్యేక సమీక్ష..

గడిచిన శుక్రవారం విజయనగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ నల్లనయ్య, బుడా అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష జరిగింది. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది, ఎల్టీపీలు హాజరయ్యారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చామంతి సూచనలు చేశారు. అవగాహన కల్పించి, ఎక్కువ మంది ముందుకొచ్చేలా చూడాలని ఆదేశాలు జారీ చేసినట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

EENADU Classifieds

FINANCIAL SERVICES

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 9121314141.

REAL ESTATE

PLOT FOR SALE

40x60 East Facing Plot in Padmavathi Nagar, Vizianagaram for sale. Cont No: 7036396917.

High way facing 261 Sq.Y Site (VMRDA Approved) Akshaya Nagar in Nelivada Vill, Bondapalli MD, VZM Dt. for sale.C:9676743732.

JOBS

Leading Jr. College Hiring Marketing Executives for its Operations in Vizag, Vizianagaram, Bobbili, Saluru, Parvathipuram. Ph: 7396158725. Vizag.

డాక్‌యార్డ్‌లో పనిచేయుటకు హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను. PVC తప్పనిసరి. జీ॥ 16,000/- (26 రో) + PF. ✆ 8247036280, 9502686907.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం. జీ:20k. ✆ 89776 39662,89776 39663.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణాకాలం 3నెలలు శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజనం. * ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ ఎడ్యుకేషన్ గ్రూప్ వైజాగ్. 9121232326.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

FACULTY/ TEACHERS

VZMజిల్లాలో మండలాల వారీగా కొత్తగా ప్రారంభిస్తున్న The ABC Bridge ప్లేస్కూల్‌లో పనిచేయుటకు B.Ed, డైట్‌చేసిన మహిళలు కావలెను ✆ 8639457893

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖస్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీగార్డ్స్ 150 మంది 8గం॥ డ్యూటీ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది (Ex -Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం:30,000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

(c) eenadu

వరండాలోనే చదువులు

పాచిపెంట మండలంలోని మాతుమూరు మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 166 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి పాఠశాలలోని తరగతి గదులు సరిపడక, ఇబ్బందులు పడుతున్నారు. వరండాలో పాఠాలు చెబుతున్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయులు పైడిరాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. గదుల సమస్య, బెంచీల ఏర్పాటుకు అవకాశం లేదని తెలిపారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

మురుగు కదలనంటోంది!

సాలూరు పట్టణంలోని రామాకాలనీకి వెళ్లేదారి, లెప్రసీ ఆసుపత్రి, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో మురుగునీరు ముందుకు సాగక.. వ్యర్థాలు కాలువలో పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. పూడిక తొలగిస్తామని పారిశుద్ధ్య అధికారి బాలకృష్ణ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు

భవనం సరే.. ప్రారంభం ఎప్పుడు?

వీరఘట్టంలో కేజీబీవీ టైప్-4 వసతిగృహం నిర్మాణానికి 2018లో రూ.2 కోట్లు మంజూరు చేశారు. నిర్మాణం ప్రారంభించారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా పక్కన పెట్టింది. 2024లో కూటమి వచ్చాక అన్ని హంగులతో పూర్తి చేసింది. భవనం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోలేదు. విద్యాలయంలోకి వస్తే 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న బాలికలకు వసతి లభిస్తుంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎంఈవోలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు తెలిపారు. –న్యూస్‌టుడే, వీరఘట్టం

రహదారి నిర్మించండి సార్..

గురుగుబిల్లి నుంచి ఉడ్డవోలు గ్రామానికి సుమారు 3 కి.మీ. మేర రోడ్డు ఉంది. ఇక్కడ రెండు చెరువుల గట్టు, పంట పొలాల మధ్య నుంచి రహదారి పొడవునా రాళ్లు తేలి తుప్పలు దట్టంగా పెరిగాయి. ఉడ్డవోలు నుంచి గురుగుబిల్లి ఉన్నత పాఠశాలకు విద్యార్థులు నడిచి వెళ్తున్నారు. మార్గంలో పాముల బెడద ఉంది. రోడ్డు నిర్మించాలని ప్రజాప్రతినిధులను స్థానికులు కోరుతున్నా ఫలితం లేదు. నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని ఏఈ గౌరీశంకరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, గురుగుబిల్లి

అసంపూర్తి పనులతో పాట్లు

ఏగోటివలస ప్రాథమిక పాఠశాల అదనపు భవనం, రక్షణ గోడ నిర్మాణం మూడేళ్లుగా అసంపూర్తిగా ఉంది. పనులు చేపట్టిన గుత్తేదారుకు బిల్లులు సకాలంలో రాకపోవడంతో వదిలేశారు. ఇక్కడ శిథిల భవనాన్ని తొలగించి అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత పనులు ముందుకు సాగలేదు. దీంతో విద్యార్థులకు ప్రస్తుతం ఉన్న ఒకటే గదుల్లోనే బోధిస్తున్నారు. అసంపూర్తి పనులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు ఎంఈవో సూరి దేముడు తెలిపారు.– న్యూస్‌టుడే, సీతానగరం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	-8008566244
పాలకొండ	-8008574299
సాలూరు	-8008786820
కురుపాం	-9849044696

?: లచ్చయ్యపేట పంచాయతీ ఆనందం గ్రామ గుమ్మిడివరం రహదారి అధ్వానంగా ఉంది. - వెంకటరావు, స్థానికుడు ★ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాం. - చంద్రమౌళి, ఏఈ - న్యూస్‌టుడే, సీతానగరం

?: జమ్మదేవలస బీసీ కాలనీ కాలువల్లో వాడుకనీరు వెళ్లడం లేదు. బాగా చెత్త పేరింది. - వెంకటరావు, జమ్మదేవలస ★ కార్యదర్శిని అప్రమత్తం చేస్తాం. - పాపారావు, ఉప ఎంపీడీవో - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: పాలకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రహదారి సదుపాయం లేదు. - రమ్య, విద్యార్థిని ★ సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - దేవీవరప్రసాద్, నగర పంచాయతీ ఏఈ - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

పైపులు మార్చారు

స్పందనకు వందనం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సిపురం బీసీ కాలనీకి తాగునీరందించే పైపులైను పాడైపోవడంతో ప్రజల ఇబ్బందులపై ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన కథనానికి ఎంపీడీవో సత్యం, సర్పంచి బంగారమ్మ స్పందించారు. ఆదివారం సిబ్బందితో పైపులు మార్చి, మరమ్మతులు చేయించారు.

కాసులు రాలవు.. కష్టాలు తీరవు

పట్టణ వాసులను వీడని సమస్యలు

సాలూరు పట్టణాభివృద్ధికి కేంద్రం ఆర్థిక సంఘం నిధులు రూ.కోట్లు కేటాయిస్తోంది. కానీ, పుర ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు. సమస్యల పరిష్కారానికి ఆర్భాటంగా ప్రతిపాదనలు చేస్తున్నారే తప్ప.. పనులు జరగడం లేదు. నిధులు బ్యాంకు ఖాతాలకే పరిమితం అవుతున్నాయి. రోడ్లు, కాలువలు, తాగునీరు, సామాజిక మరుగుదొడ్లు, వీధి దీపాల సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయి. ఏటా పన్నులు చెల్లిస్తున్నా సదుపాయాలు లేవని పట్టణవాసులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, సాలూరు

రాళ్లు తేలిన సాలూరు ప్రభుత్వాసుపత్రి దారి

గుత్తేదారుల వెనకడుగు

పట్టణంలో గుత్తేదారులు చేసిన పనులకు ఏడాదిన్నరగా బిల్లులు చెల్లించలేదు. దీంతో కొత్త పనులకు టెండర్లు వేసేందుకు వారు వెనకడుగు వేస్తున్నారు. ఈ చిన్నపాటి సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రూ.1.24 కోట్లతో 15 పనులకు మంత్రి జి.సంధ్యారాణితో శంకుస్థాపనలు చేశారు. కేవలం రూ.33 లక్షలు విలువైన పనులు మాత్రమే జరిగాయి.

రోడ్లు గోతులమయం.. కాలువలు శిథిలం

పురపాలికలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 కోట్లతో సుమారు 120 వరకు పనులు ప్రతిపాదించారు. వాటిలో 30కి టెండర్లు పిలిచారు. మిగిలిన పనులు పాలన, సాంకేతిక అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. టెండర్లు ఖరారై పాలకవర్గం ఆమోదం పొంది.. ఆరు నెలలైనా తారు రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. సాధారణ నిధులతో నీటి పథకాలు, సామాజిక మరుగుదొడ్ల పనులకు ఇప్పటికే 10 సార్లు టెండర్లు పిలిచారు. కానీ, గుత్తేదారులు ముందుకు రాలేదు. పారిశుద్ధ్య వాహనాల మరమ్మతుల ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. రోడ్లు పాడయ్యాయి. కాలువలు కంపుకొడుతున్నాయి. చెత్త డబ్బాలు పాడై రోడ్డుపైనే వేయాల్సిన దుస్థితి.

మూడేళ్లుగా మూతపడిన పురపాలిక దుకాణ సముదాయ మరుగుదొడ్లు

అత్యవసరమైతే ఆరుబయటకే..

పట్టణంలోని 29 వార్డుల్లో సుమారు 20 వరకు సామాజిక మరుగుదొడ్లు మరమ్మతుల్లో ఉన్నాయి. రూ.21 లక్షలకు టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదు. దీంతో ఆరుబయట మూతపడే ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితిలో ప్రజలు, ప్రయాణికులు ఆరుబయటకు వెళ్తున్నారు. పురపాలిక షాపింగ్ కాంప్లెక్స్ మరుగుదొడ్డి పాడై మూడేళ్లు కావస్తున్నా పట్టించుకోలేదు. పుర కార్యాలయంలో మహిళా ఉద్యోగుల మరుగుదొడ్డి తలుపులు పాడైనా బాగు చేయలేదు. అంటే పురపాలికలో పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

బిల్లులు చెల్లిస్తాం

ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్లు, కాలువలు, మరుగుదొడ్ల సమస్యలు పరిష్కరిస్తాం. బిల్లులు పెండింగ్ ఉన్నాయని గుత్తేదారులు వెనకడుగు వేస్తున్నారు. బిల్లులు చెల్లిస్తాం.. పనులు చేయాలని కోరుతాం. – ప్రసాద్, పుర డీఈ

తెరపై ఈనాడు

★ శ్రీ సినిమా(ఎస్‌వీసీ): రాజు వెడ్స్ రాంబాయి, ఆంధ్ర కింగ్ ★ టీవీఆర్: ధురంధర్ – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో ఆదివారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో రూపాయల్లో..) టమాటా: 43, వంకాయలు: 36, బెండ: 35, బీర: 40, దొండ: 45, చిక్కుడు: 36, పచ్చిమిర్చి: 38, కాకర: 34, క్యాబేజీ: 58, బీట్‌రూట్: 50, ఉల్లి: 23, బంగాళాదుంపలు: 20, అల్లం: 80 వెల్లుల్లి: 65, క్యాప్సికం: 80, అరటి కాయ: 5, ఆనపకాయ: 12 – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

గిరిజనులకు వితరణ

రగ్గులు అందజేస్తున్న కృష్ణయ్య తదితరులు

పాచిపెంట, న్యూస్‌టుడే: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాలు బంగారుగుడి, కొంట్రగుడ్డి, గాజులరేగ గ్రామాల్లోని పేదలకు విజయనగరం ఎయిర్ ఫోర్స్ అసోసియేషన్ ఆదివారం రగ్గులు, నిత్యావసర సరకులు అందించింది. సుమారు 80 గిరిజన కుటుంబాలకు సాయం చేసినట్లు అధ్యక్షుడు రామకృష్ణారావు, కృష్ణయ్య తెలిపారు. సంఘం ప్రతినిధులు రమణరావు, ఫాతిమా, సురేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిధులు మంజూరుపై హర్షం

సీతానగరం: కొత్తవలస గ్రామంలో శిథిల రామమందిరం స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.40 లక్షలు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే విజయచంద్రకు సర్పంచి అనిత అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థుల సహకారంతో త్వరలో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

రైతు సేవా కేంద్రాల పరిశీలన

సీతానగరం, న్యూస్‌టుడే: జానుమల్లువలస, గాదెలవలస రైతు సేవా కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారిణి అన్నపూర్ణ ఆదివారం పరిశీలించారు. ఆయా కేంద్రాల పరిధిలోని రైతులతో మాట్లాడారు. ధాన్యం సేకరణ, తరలింపులో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఉన్నారు.

మహిళలపై హింస తగదు

సీతానగరం: మహిళలు, బాలికలపై హింస తగదని, ఈ ధోరణిని అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి డిమాండు చేశారు. మహిళలు-బాలికలపై హింసా వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా జోగింపేట కేజీబీవీలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని దోనుబాయి కూడలి వద్ద ఆదివారం ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేశారు. మద్యం, సారా తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవన్నారు.

నేడు సీతంపేటలో పీజీఆర్ఎస్

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు సమస్యలపై వినతులు అందించాలని కోరారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ అధ్యక్షుడిగా శేఖర్

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా పాలకొండ మండలం మల్లివీడు గ్రామానికి చెందిన యువర్న శేఖర్ నియమితులయ్యారు. ఈ సంఘ ఎన్నిక విజయవాడలో ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. ఆయన సీతంపేట మండలం పెదపొల్ల గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాయుడు

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టంకు చెందిన గుణుపూరు వెంకటినాయుడుని భాజపా ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన ఓబీసీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

జట్టు ఆశ్రమ విద్యార్థినుల నృత్యం

ప్రకృతిని కాపాడుకుంటూ జీవిద్దాం

పార్వతీపురం పట్టణం, పురపాలక, న్యూస్‌టుడే: ప్రకృతిని కాపాడుకుంటూ జీవించడమే హైందవ ధర్మం ప్రధాన లక్ష్యమని ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హైందవ శంఖారావం కార్యక్రమం జరిగింది. ముందుగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాలలు, మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ.. భారతదేశానికి ఆత్మ హిందూ ధర్మమని వివరించారు. రామరాజ్యం కావాలనుకునేవారు ప్రకృతిని రక్షిస్తూ.. ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి.రామ్మోహనరావు హాజరయ్యారు. నిర్వాహక సమితి అధ్యక్షుడు బీఎన్‌బీ రావు, ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు, భాజపా జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వై.వివేక్, కార్యదర్శి కె.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వేదికపై మాట్లాడుతున్న భరత్‌కుమార్

చెత్తశుద్ధి ఇదేనా..?

పట్టణంలోని డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తని విభజించే ప్రక్రియలో భాగంగా అంతర్రాష్ట్ర రహదారిని చెత్తతో నింపేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం డంపింగ్‌యార్డుని పరిశీలించి.. చెత్తశుద్ధి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టిస్తుంటే పురపాలక సంఘం ఈ విధానం అమలు చేయడంలో విఫలమైందన్నారు. చెత్త విభజన కనీస స్థాయిలో ఇక్కడ జరగడం లేదన్నారు. అంతర్రాష్ట్ర రహదారి పక్కనే చెత్తవేయడం వల్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నాయకులు వి.దాలినాయుడు, కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలక

'వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి'

పాలకొండ, న్యూస్‌టుడే: వైకాపా మాజీ ప్రజాప్రతినిధులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆదివారం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ, ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా సూపర్-6పై ఆరోపణలు చేస్తున్న వారు ఆధారాలు చూపాలన్నారు. ఇనాం భూములకు సంబంధించి 600 మంది రైతులకు పథకం అందించినట్లు చెప్పారు. జిల్లా మంత్రి సంధ్యారాణిపై మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని, అది చూడలేక వైకాపా నాయకులు విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. భామిని మండలంలో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తమ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన మర్యాద ఇస్తోందని, నిజాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి

సీతానగరం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు, రైతుల ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టరు ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. సీతానగరం మండలం కోటసీతారాంపురంలో ఆదివారం కల్లాల వద్ద ఉన్న రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు, గోనె సంచులు, రవాణా సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఎస్‌కేను సందర్శించి తేమ శాతం గుర్తింపుపై సిబ్బందిని ప్రశ్నించారు. వర్షాభావ ప్రాంతం కావడంతో వెంగళరాయసాగర్ అదనపు జలాలు అందించాలని రైతులు కోరారు. రబీలో ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ❖ పాలకొండ: రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలని సబ్‌కలెక్టరు స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశించారు. తుమరాడ వద్ద మారుతి రైస్ మిల్లును తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియ, రికార్డులు తనిఖీ చేశారు.

ఎమ్మెల్యే మానవత్వం

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ మానవత్వం చాటుకున్నారు. మండల పరిధిలోని అట్టలి కూడలి సమీపాన ఆదివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న ఆటోలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో దండాసి ఈశ్వరరావు, కార్తిక్‌లకు తీవ్ర గాయాలై రోడ్డుపై రక్తస్రావంతో పడి ఉన్నారు. ఆ సమయంలో పాలకొండ నుంచి వీరఘట్టం వైపు వెళ్తున్న ఎమ్మెల్యే వారిని చూసి ప్రాథమిక చికిత్స అందించారు. రక్తస్రావం జరగకుండా బాధితులకు రుమాలు కట్టి అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు, పోలీసులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందేలా చూశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

తిరుపతిలో వలస కార్మికుడి మృతి

మల్లేశ్వరరావు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి కోసం వలస వెళ్లిన కార్మికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన ఏనుగుతల మల్లేశ్వరరావు(59) శనివారం రాత్రి గుండెపోటుతో తిరుపతిలో మృతి చెందారు. అయిదేళ్లుగా తిరుపతిలో గృహ నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ భార్య పద్మావతితో కలిసి జీవనం సాగిస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తున్నట్లు కుమారుడు నర్సింగరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం గుమ్మలక్ష్మీపురం మండలంలో చేటుచేసుకుంది. ఎదురెదురుగా వెళ్తున్న కురుపాం మండలం పట్టాయిదొరవలస గ్రామానికి చెందిన గౌరీశంకర్, గుమ్మలక్ష్మీపురం మండలం కొల్లిగూడ గ్రామానికి చెందిన పి.మహేష్ ద్విచక్ర వాహనాలు బుడ్డెమ్మఖర్జ గ్రామం సమీపంలో ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడ్డ వారిని స్థానికులు కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

నదులున్నా.. నీటికి చింతే!

పాలకొండ, గ్రామీణం, భామిని, న్యూస్‌టుడే: పాలకొండ నియోజకవర్గంలో నాగావళి, వంశధార నదులు ఉన్నా సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. తోటపల్లి రిజర్వాయరు పాత రెగ్యులేటర్ ద్వారా కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ నిలిచిపోయింది. రూ.193 కోట్ల అంచనాతో 2018లో పనులు ప్రారంభించారు. 2019లో వైకాపా సర్కారు వచ్చిన తర్వాత ఆపేయడంతో ముందుకు సాగలేదు. ఈ రెండు కాలువల పరిధిలో వీరఘట్టం, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలాలకు చెందిన 70 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వందేళ్ల పైబడడంతో కాలువలు పూర్తిగా రూపుమారాయి.

ఏళ్లుగా సాగుతున్నాయ్..: పాలకొండ మండలంలో జంపరకోట ప్రాజెక్టుకు 1984లో తెదేపా హయాంలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినా.. నేటికీ పూర్తికాలేదు. వంశధార పక్కనే ఉన్నా భామిని మండలానికి సాగు నీరందని పరిస్థితి. కాట్రగడ నుంచి పారాపురం వరకు వంశధార కాలువ ఉంది. పిల్ల కాలువలు ఏర్పాటు చేయక ప్రయోజనం ఉండటం లేదు. నేరడి ప్రాజెక్టు నిర్మాణానికి 103 ఎకరాలు సేకరించినా పనులు ప్రారంభించలేదు. ఒడిశా అభ్యంతరాలతో నిలిచిపోయిన పనులు 2019లో కోర్టులో ఏపీ ప్రభుత్వం గెలుచుకుంది. ఇరు రాష్ట్రాలు నీటిని పంచుకోవాలని ట్రైబ్యునల్ ఆదేశించింది. దీనిపై ఒడిశా ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లడంతో పనులు ప్రారంభం కాలేదు. కాట్రగడ వద్ద ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి గత తెదేపా హయాంలో నిధులు మంజూరు కావడంతో శంకుస్థాపన చేశారు. పనులు చేయలేదు.

ఆధునికీకరణకు నోచుకోని తోటపల్లి కాలువ

పోలీసు నిజాయతీ.. పర్సు అప్పగింత

పార్వతీపురం పట్టణం, పురపాలక, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన ఎం.వేణుగోపాలరావు పర్సు పోగొట్టుకున్నారు. అది బలిజిపేట పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.త్రినాథకు దొరికింది. ఆయన దాన్ని నిజాయతీగా పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. వివరాలు సేకరించి బాధితునికి సమాచారం ఇచ్చారు. పర్సులో రూ.5,200 నగదు, ఏటీఎం కార్డులను బాధితునికి పట్టణ స్టేషన్‌లో అందజేశారు. కానిస్టేబుల్ నిజాయతీని సిబ్బంది కొనియాడారు.

పద్మావతి, స్వాతిని సన్మానిస్తున్న సభ్యులు

కుటుంబాన్ని నడిపేది అతివే

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మామిడిపల్లి గ్రామంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం జరిగిన 'సప్తశక్తి సంగమం' సమావేశానికి ప్రముఖ న్యాయవాది పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుటుంబాన్ని సక్రమమైన మార్గంలో నడిపే శక్తి మహిళని, అటు దేశాన్ని తీర్చిదిద్దడంలోనూ ముఖ్య భూమిక పోషిస్తోందని చెప్పారు. ఝాన్సీలక్ష్మీబాయి, రాణీ రుద్రమదేవి లాంటి సాహసవంతమైన వారితోపాటు, సతీ సావిత్రి గొప్పతనాన్ని సభకు వివరించారు. సాధారణ గిరిజన కుటుంబంలో పుట్టి రాష్ట్రపతి స్థానంలో నిలిచిన ద్రౌపది ముర్ము స్త్రీజాతికి వన్నె తెచ్చారని కొనియాడారు. ఆపై మరో వక్త కేతిరెడ్డి స్వాతి మాట్లాడారు. ముఖ్య అతిథులను సన్మానించారు. డొంక అన్నపూర్ణ, రజని తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కొమరాడ, న్యూస్‌టుడే: ఇటీవల జంఝావతి రబ్బరు డ్యాం వద్ద స్నానానికి వెళ్లి ముగ్గురు గల్లంతైన నేపథ్యంలో నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వారం క్రితం సివిని గ్రామానికి చెందిన ముగ్గురు, 2024 ఆగస్టులో ఇద్దరు వ్యక్తులు ఇక్కడ నీటిలో మునిగి మృత్యువాతపడ్డారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. డ్యాం వద్ద నిరంతరం కాపలాదారులను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తామన్నారు.

ధాన్యం అదనంగా సేకరిస్తున్నారు

వ్యవసాయ అధికారిని ప్రశ్నిస్తున్న బాబ్జి

సీతానగరం, న్యూస్‌టుడే: మిల్లులకు వెళ్లాక తేమ శాతం అధికంగా ఉందంటూ బస్తాకు అదనంగా 5 కిలోల ధాన్యం డిమాండు చేస్తూ.. రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ రమణమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జడ్పీటీసీ సభ్యుడు బాబ్జి, ఎంపీడీవో ప్రసాద్, పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యంగా మద్దతు ధర సాధిస్తాం

పాలకొండ, న్యూస్‌టుడే: రైతులమంతా ఐక్యంగా ఉండి మద్దతు ధర సాధిద్దామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం పాలకొండ మండలంలోని లుంబూరులో రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. మిల్లర్లంతా రైతుల వద్ద నుంచి అదనంగా ధాన్యం దోచుకుంటున్నారని, దీనివల్ల ఎకరాకు రూ.ఆరు వేలు నష్టపోతున్నామని చెప్పారు. దీనిపై ఇప్పటికే సబ్‌కలెక్టర్ స్వప్నిల్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అదేవిధంగా తోటపల్లి ఎడమ సాగునీటి కాలువకు తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరారు.

రైతు సంఘం నాయకుల ఆందోళన

ఆకర్షణకు లోనైతే అంధకారమే

అవగాహన కల్పిస్తున్న సీఎంవో చిరంజీవులు

సీతంపేట, న్యూస్‌టుడే: పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థినులు తెలిసీ తెలియని వయసులో ప్రేమ, ఇతర ఆకర్షణలకు లోనైతే బంగారు భవిష్యత్తు చీకటిమయం అవుతుందని సీఎంవో చల్ల చిరంజీవులు అన్నారు. సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆదివారం 8, 9, 10 తరగతుల వారికి ఈ మేరకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.వసంతలక్ష్మి, వసతి గృహ సంక్షేమాధికారిణి పి.అమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గంటేడ'కు తాపీ ధర్మారావు పురస్కారం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన కవి, కథకుడు గంటేడ గౌరునాయుడికి గుంటూరు బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ 'తాపీ ధర్మారావు నాయుడు' స్మారక పురస్కారాన్ని అందించింది. ఈ మేరకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.జమదగ్ని, బి.శ్యామ్‌ప్రసాద్, సాహిత్యకారులు శీరంశెట్టి కాంతారావు, భూసురపల్లి వెంకటేశ్వర్లు, రావి రంగారావు చేతుల మీదుగా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సభకు పుప్పాల శ్రీరామ్ అధ్యక్షత వహించారు.

(c) eenadu

ఈనాడు
ప్రకాశం
సోమవారం 8 డిసెంబరు 2025

రక్త పరీక్షలకు ప్రైవేటుకు పరుగులు

చిత్రంలో కనిపిస్తోంది ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మరమ్మతులకు గురై మూలకు చేరిన థైరాయిడ్ పరీక్ష పరికరం. పరికరం స్ట్రింగ్ పోయి వారం కావస్తున్నా ఇంతవరకు బాగుచేయించకపోవడం గమనార్హం. ఆసుపత్రిలోని రక్త పరీక్షల ప్రయోగశాలలో రసాయనాల కొరత నెలకొంది. గత 20 రోజులుగా రోగులు ప్రైవేటు ప్రయోగశాలలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇక్కడ రెండేళ్ల కిందట అత్యాధునికమైన కేంద్రీయ ప్రయోగశాలను ప్రారంభించారు. అన్ని రకాల పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలున్నా నిర్వహణకు సంబంధించిన రీ ఏజెంట్స్ (రసాయనాల కిట్లు) అందుబాటులో లేకపోవడంతో సమస్య తలెత్తింది. ఆసుపత్రికి రోజుకు 900 నుంచి 1100 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తుంటారు. ఇన్ పేషెంట్లు 300 మందికి పైగా ఉంటారు. ఇక్కడి ప్రయోగశాలల్లో 1,500 వరకు వివిధ రకాల పరీక్షలు జరుగుతుంటాయి. వీటిలో కొన్ని పరీక్షలకు రీ ఏజెంట్ కిట్లు తప్పనిసరి. ఏబీజీ, ఎలక్ట్రోలైట్, లిపిడ్ ప్రొఫైల్, కిడ్నీ, లివర్ ఫంక్షన్ టెస్టులకు రీ ఏజెంట్స్ అవసరం. ఇవి అయిపోయినప్పుడు హెచ్‌డీఎస్ నిధులతో కొనుగోలు చేయాల్సి ఉన్నా పట్టించుకునే దిక్కు లేకుండాపోయింది. సుమారు నెల రోజులుగా శీతల యంత్రాలు పనిచేయడంలేదు ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ ప్రయోగశాలలో అవసరమైన పరికరాలు, రసాయనాలు కొనుగోలుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఎన్ఎంఎంఎస్‌టీకు 3,813 మంది హాజరు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని 19 కేంద్రాల్లో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు 3,813 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 4,009 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 196 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కనిగిరి డివిజన్ పరిధిలోని కేంద్రాలను డీఈవో ఎ.కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఆయా చోట్ల కల్పించిన వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని కేంద్రాల్లో పకడ్బందీగా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ వేడుకలు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ఆలయంలో వెలసిన నాగమయ్య విగ్రహాల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు.

కర్షకుల కన్నీటి సాగు!

- చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి దయనీయం
- ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి నివేదించిన కాగ్

ఓ దినసరి వ్యవసాయ కూలీ ఏడాది ఆదాయం రూ.50 వేల పైమాటే. అదే ఓ రైతు కుటుంబ వార్షిక ఆదాయం ఎంతో తెలుసా? కనిష్ఠంగా రూ.17 వేలు కాగా, గరిష్ఠంగా రూ.57 వేలు. ఈ గణాంకాలు ఏదో స్వచ్ఛంద సంస్థ సర్వే చెప్పింది కాదు. సాక్షాత్తు కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా) తేల్చిన వాస్తవమిది. దేశవ్యాప్తంగా రైతుల ఆర్థిక స్థితిగతులు, పంటల సాగు, దిగుబడి తదితర అంశాలపై అధ్యయనం చేసిన అనంతరం తాజాగా కేంద్రానికి ఇచ్చిన నివేదిక తేటతెల్లం చేసింది.

-న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

నలిగిపోతున్న అన్నదాతలు

సాగు కమతాల్లో 80 శాతం సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. వీరి వార్షిక ఆదాయం రూ. 17 వేల నుంచి రూ.57 వేలే. కరవు కాటకాలు, అకాల వర్షాలు, తెగుళ్లు, సరైన పంట ఎంపిక లేకపోవడం తదితర కారణాలతో ఆశించిన దిగుబడులు రావడంలేదు. జిల్లాలో హెక్టారులోపు భూములున్న రైతులు 2,62,344 మంది ఉండగా, 1-2 హెక్టార్ల లోపున్నవారు 1,28,584 మంది, 2-4 హెక్టార్లు సాగు భూములున్నవారు 66,638 మంది ఉండగా 4-10 హెక్టార్ల లోపు గలవారు 18,776 మంది, 10 హెక్టార్లకుపైగా భూములున్నవారు 1,327 మంది ఉన్నారు. వ్యవసాయ, దాని అనుబంధ రుణాలు దాదాపు రూ.17 వేల కోట్లు దాటిపోవడం గమనార్హం.

ఏటా కష్టనష్టాలే...

ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లతో జిల్లా రైతులు ఏటా నష్టపోతున్నారు. ఇటీవల మొంథా తుపాను ధాటికి 13 వేల హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. 2024లో 9,500 హెక్టార్లు, 2023లో 10 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 33 శాతానికి పైగా నష్టపోయిన రైతులనే పరిగణనలోకి తీసుకుంటారు. తక్కువ నష్టం వచ్చి చూస్తే పరిహారం అందని పరిస్థితి. ఇలాంటి రైతులకు పెట్టుబడి సాయమూ దక్కడం లేదు. కరవు కాటకాలతో నష్టపోయిన రైతులకు మండలం, జిల్లా యూనిట్‌గా పరిహారం ఇస్తుండడంతో వ్యక్తిగతంగా నష్టం వాటిల్లితే అంతే సంగతులు. రైతులు అప్పులపాలు కావాల్సిన పరిస్థితి నెలకొంది.. అంతర పంటలు, కాలానుగుణ వ్యవసాయ సాగు విధానాలు, యాంత్రీకరణ, చదువుకున్న వారు వ్యవసాయంలోకి వస్తే మరింత అవగాహనతో వ్యవసాయం చేస్తారన్నది కాగ్ నివేదిక సారాంశం.

భళా బాలోత్సవ్!

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని కొప్పోలు రోడ్డులో గల నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన బాలోత్సవ్ కనువిందు చేసింది. ఉత్సవాల్లో జిల్లాలోని 90కిపైగా విద్యాసంస్థల నుంచి 1,100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 27 అంశాలతో సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో 64 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్య ప్రతినిధులు మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌బాబు, అరవింద, శ్రీవిద్య, ప్రిన్సిపల్ రమేష్ తదితరులు అభినందించారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

పెదఉల్లగల్లులో ఇద్దరికి స్క్రబ్ టైఫస్ లక్షణాలు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెదఉల్లగల్లులోని ఇద్దరు మహిళల్లో స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు కనిపించాయి. వీరిలో ఒకరికి నెల రోజుల క్రితం పురుగు కుట్టడంతో ఒంటిపై దద్దుర్లు, జ్వరం, జలుబు, ఇతర లక్షణాలు కనిపించాయి. దీంతో ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అప్రమత్తమై ప్రత్యేకంగా చికిత్స అందించారు. దీంతో ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగానే ఉన్నారు. ఇటీవల మరో మహిళకు కూడా వ్యాధి లక్షణాలు కనిపించడంతో ఆమె నుంచి రక్తం సేకరించి పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు పంపించారు. ప్రస్తుతం ఈమె ఆరోగ్యం కూడా బాగానే ఉంది. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఉన్నతాధికారులకు దీనిపై సమాచారం అందించారు. దీంతో ఆదివారం డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు గ్రామాన్ని సందర్శించి బాధిత మహిళలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చికిత్స అందిస్తామని తెలిపారు.

కళ్లెదుటే ముప్పు.. ఎప్పటికో కనువిప్పు?

చిత్రంలో కనిపిస్తోంది వెల్లంపల్లి-తాళ్లూరు రహదారిలో తెల్లబాడు సమీపంలోని ప్రమాదకరంగా మారిన పెద్ద కుంట. మద్దిపాడు మండల పరిధిలోని గుండ్లకమ్మ జలాశయం నుంచి చీమకుర్తి మండలం ఇలపావులూరుతోపాటు వివిధ గ్రామాలకు తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ లీక్ అయి నీరు వృథాగా పోతుండడంతో మరమ్మతుల నిమిత్తం 20 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పుతో ఇలా పెద్ద గుంత తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా తయారైంది. రహదారిలో నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. - న్యూస్‌టుడే, మద్దిపాడు

కంభం.. జలసంపదకు ప్రతిబింబం!

- మరమ్మతులపై దృష్టిసారిస్తే మరింత అభివృద్ధి

- న్యూస్‌టుడే, కంభం

ఆసియాలోనే రెండో అతిపెద్దదైన కంభం చెరువు నిండుకుండలా దర్శనమిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ప్రవహించడంతో సుమారు నెల రోజుల పాటు అలుగు పారింది. తటాకం నీటి నిల్వ సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా, అర టీఎంసీ మేర పూడిక ఏర్పడింది. ప్రస్తుతం 2.975 టీఎంసీల నీరు నిల్వ ఉంటోంది.

చెరువును శ్రీకృష్ణదేవరాయల సతీమణి, గజపతుల కుమార్తె రుచీదేవి 1522లో నిర్మాణ పనులు ప్రారంభించి 1524లో పూర్తిచేశారు. 1525 నుంచి వినియోగంలోకి వచ్చినట్లు ఆధారాలున్నాయి. దీని చిత్రం బ్రిటిష్ మ్యూజియంలో ఇప్పటికీ ఉంది. ఈ చెరువు 1917, 1919, 1948, 1949, 1950, 1966, 1975, 1983, 1996, 2006, 2013, 2020లలో పూర్తిస్థాయిలో నిండింది. ప్రస్తుతం పూర్తి నీటి సామర్థ్యంతో ఉంది. దీని కింద అధికారికంగా 7 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా.. అనధికారికంగా మరో 3,500 ఎకరాలుంది. దీని ఆధారంగా కంభం, బేస్తవారపేట, తర్లుపాడు, మార్కాపురం తదితర ప్రాంతాల్లోని సుమారు 35 గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతున్నాయి. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే దీనికి ఏటా 0.5 టీఎంసీలు నీరందించనున్నారు. చెరువు పొడవు 7 కిలోమీటర్లు, వెడల్పు 3.5 కిలోమీటర్లు కాగా, చెరువులో 23.95 స్క్వేర్ కిలోమీటర్లల విస్తరించి ఉంది. చెరువుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పూడిక తొలగిస్తే పూర్తి స్థాయి నీటి సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. ప్రధానంగా మూడు తూములు లీకేజీల ద్వారా నిత్యం 25 క్యూసెక్కుల మేర జలాలు వృథాగా కిందకు పోతున్నాయి. లీకేజీలను అరికట్టి కాలువలను బాగు చేయాల్సి ఉంది. చెరువు మరమ్మతులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు నీటిపారుదలశాఖ డీఈ వేమిరెడ్డి తెలిపారు.

అరచేతిలో స్వర్ణ పంచాయతీ

జిల్లాలో మండలాలు: 38
గ్రామపంచాయతీలు: 729
అసెస్‌మెంట్లు: 4,75,474
ఇంటి పన్నులు: రూ.37 కోట్లు

గ్రామపంచాయతీల్లోని ఏడు రకాల పన్నులను చరవాణి నుంచే చెల్లించవచ్చు. ఇందుకోసం ఇటీవల కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్‌ను ప్రారంభించింది. పన్నులు చెల్లించాల్సినవారు పోర్టల్ నుంచి డిజిటల్ చెల్లింపులు చేయొచ్చు. ఇల్లు, కుళాయి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, సెల్ టవర్లు, వేలం రుసుం ఇలా ఏరకమైన పన్నులైనా ఇంటి నుంచే కట్టొచ్చు. ఆన్‌లైన్‌లో swarnapanchayat.apcfss.in వెబ్‌సైట్లోకి వెళ్లి పేమెంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే ఏడు రకాల పన్నుల వివరాలు కనిపిస్తాయి. వీటిలో చెల్లించాల్సి ఒకదానిపై క్లిక్ చేయాలి. సంవత్సరం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, గ్రామం వివరాలు నమోదు చేయాలి. దీంట్లో అసెస్‌మెంట్ నంబరు, యజమాని పేరు, ఇంటి నంబరు, పాత అసెస్‌మెంట్ నంబరుతో సహా చూపిస్తుంది. ఒక దానిపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే పన్ను వివరాలతో పేమెంట్ ఆప్షన్‌తో సులువుగా నగదు చెల్లింపులు చేయొచ్చు. - న్యూస్‌టుడే, అర్ధవీడు

బంతి... ధరల భ్రాంతి

బంతి పూల ధరల పతనంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. దిగుబడులు బాగున్నా ధరల తగ్గిపోవడంతో నష్టాలొస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఎకరా సాగుకు రూ.80 వేల వరకు పెట్టుబడి అవుతుందని, బాగా పండితే 4 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుందని, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ధర రూ.25 వరకు పలుకుతుండగా పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో సుమారు 100 ఎకరాలకుపైగా తోటలు సాగవుతుండగా, కంభం, గిద్దలూరు, మార్కాపురం, ఒంగోలు, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మరోపక్క మంచు కురుస్తుండడంతో తెగుళ్లు వ్యాపిస్తున్నాయని, పూత నల్లగా మారిపోతోందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. - న్యూస్‌టుడే, కంభం

పక్కాగా ఇంటింటా చెత్త సేకరణ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీపీవో వెంకటేశ్వరరావు సూచించారు. సంతనూతలపాడులో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆదివారం పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఇంటి నుంచి కచ్చితంగా తడి, పొడి చెత్త సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ బావికి 83 ఏళ్లు

చిత్రంలో కనిపిస్తోంది సంతనూతలపాడులోని శివాలయం వద్దనున్న మంచినీటి బావి. దీనిని 1942లో నిర్మించగా, అప్పటి నుంచి బావినీటిని ఇక్కడి గ్రామస్థులు తాగుతున్నారు. బావి పక్కనే చెరువు ఉండడంతో ఇప్పటివరకు ఎండిపోయిన దాఖలాల్లేవని.. తీవ్ర కరువులోనూ తాగునీరుండేదని చెబుతున్నారు. మరో వందేళ్లయినా ఎండిపోదని నమ్మకంగా చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, సంతనూతలపాడు

ఇల్లు చూశాకే బిల్లు

- ఐచ్ఛికం-3 కింద నిర్మించిన గృహాల తనిఖీ

జిల్లాలోని పక్కాగృహాలు : 63,041
- ఐచ్ఛికం-3 కింద ఇచ్చినవి: 3,586
- ఇప్పటివరకు పరిశీలించినవి : 3,521
- పూర్తయిన పక్కాగృహాలు: 2,162
- వివిధ దశల్లో ఉన్నవి : 1,400

న్యూస్‌టుడే, కలెక్టరేట్

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఐచ్ఛికం-3 కింద చేపట్టిన పక్కాగృహాల నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగాయి. కొన్ని చోట్ల నివాసయోగ్యం లేకపోవడంతోపాటు నిర్మాణపనులు కూడా నాసిరకంగా జరుగు తున్నాయని ఫిర్యాదులొచ్చాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పక్కాగృహాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు నిరంతరం సమీక్షిస్తోంది. తాజాగా వీటి నాణ్యతను పరిశీలించి సంతృప్తికరంగా ఉంటేనే బిల్లులు చెల్లించాలని, లేకుంటే నిలిపివేయాలని ఆదేశించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం లేఅవుట్ల వారీగా క్షేత్రస్థాయిలో ఐచ్ఛికం-3 చేపట్టిన గృహనిర్మాణాలు పరిశీలిస్తోంది. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు అదనంగా లబ్ధిదారుల నుంచి రూ.35 వేలు చొప్పున డీఆర్‌డీఏ ద్వారా నేరుగా వారికిచ్చేవిధంగా నగదు విడుదల చేశారు. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి గృహ నిర్మాణానికి అదనంగా నగదు తీసుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు చొప్పున అదనపు సాయం అందిస్తున్న నేపథ్యంలో కొందరు సొంతంగా కట్టుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని మార్కాపురం, ఒంగోలు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఐచ్ఛికం-3 కింద పక్కాగృహాల నిర్మాణాలను గుత్తేదారులకు అప్పగించారు. మండల స్థాయిలో గృహనిర్మాణశాఖ ఏఈ జాబితాలో చూపిన ఐచ్ఛికం-3 ఇళ్లన్నింటినీ నూరు శాతం పరిశీలించాలి. డీఈ 30, ఈఈ 15, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి 5 శాతం చొప్పున ఇళ్ల నమూనాలు తనిఖీలు చేయాలి. నాణ్యత ఎలా ఉంది, ఒప్పందం ప్రకారం నిర్మించారా..లేదా? పరిశీలించి, అంతా బాగుందని భావిస్తే రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తారు. అప్పుడే బిల్లుల చెల్లింపు ప్రక్రియ ముందుకెళ్లనుంది.

కదంబ వృక్షం.. త్రిపురాంతకం ప్రత్యేకం

ఎరుపు రంగు కదంబ పూలు జిల్లాలోని త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారి ఆలయం వద్దే కనిపించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ చెట్టును సాక్షాత్తూ పార్వతీదేవి స్వరూప మని భక్తులు నమ్ముతారు. అమ్మవారిని కదంబ వనవాసినిగా కొలుస్తుంటారు. నిత్యం పచ్చగా ఉండే చెట్టు సంరక్షణకు ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- ఈనాడు, ఒంగోలు న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

అర్ధ శతాబ్దపు అనుబంధం

చిత్రంలో కనిపిస్తున్న వీరందరూ 50 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. అనంతరం వివిధ రంగాల్లో స్థిరపడగా, తమ బాల్య స్నేహాన్ని మాత్రం మరిచిపోలేదు. ఎక్కడ ఉన్నా తమ చిన్ననాటి స్నేహితులను ఒకసారి కలుసుకోవాలని భావించారు. ఇందుకు ఆదివారం కొండపి మండలం కె.ఉప్పలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. 1975-76 విద్యాసంవత్సరంలో పదోతరగతి విద్యనభ్యసించిన 'పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం' సందడిగా సాగింది. తమ అనుభవాలు, కష్టసుఖాలను పరస్పరం పంచుకుని ఆనందంగా గడిపారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి చేయూతనందించాలని తీర్మానించుకున్నారు. - న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

రాత్రి బసకు చీకట్లు

రిమ్స్‌లో నిరుపయోగంగా వసతి కేంద్రం

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) నిధులతో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న నిరాశ్రయుల రాత్రి వసతి కేంద్రం (రాత్రి బస) సేవలకు దూరమైంది. మెప్మా అధికారులు పట్టించుకోకపోవడం, రెడ్‌క్రాస్ సొసైటీ పాలకవర్గం లేకపోవడంతో కేంద్రం నిరుపయోగంగా మారింది. 2023లో రూ.1.25 లక్షలతో రెండంతస్తులతో భవనం నిర్మించారు. కేంద్రం ప్రారంభమైన అనంతరం కొంతకాలం బాగానే నడిచింది. ఆసుపత్రికి రోగుల వెంట వచ్చేవారికి ఇబ్బంది లేకుండా రాత్రి బస కల్పించవచ్చునని భావించారు. ఆచరణలో లోపాలతో లక్ష్యం నీరుగారింది. ఆసుపత్రికొచ్చే రోగుల సహాయకులు వరండాలు, కాలిబాటలు, సైకిల్‌స్టాండ్లలో తలదాచుకోవాల్సి వస్తోంది. అన్ని వసతులున్నా: కేంద్రంలో 50 మంది పురుషులు, మహిళలు వేర్వేరుగా బస చేయడానికి పడకలున్నాయి. తాగునీటి వసతి, ఫర్నీచర్ ఉంది.

ఖాళీగా ఉన్న పడకలు

అధికారుల పర్యవేక్షణ లేక ...

ఆసుపత్రికి వచ్చేవారికి ఇక్కడ కేంద్రం ఉన్నట్లు కూడా తెలియకపోవడం గమనార్హం. రాత్రి 7 గంటల నుంచి సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉండగా, గత కొన్ని రోజులుగా తలుపులు తెరవడంలేదు. వీరికి మెప్మా ద్వారా వేతనాలు చెల్లించాల్సి ఉండగా, గత కొన్ని నెలలుగా బిల్లులు సమర్పించక పోవడంతో వేతనాలు నిలిచిపోయాయి. కనీస ప్రచారం లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.

నల్లమలకు అడవి దున్న

జీవ వైవిధ్యానికి నెలవైన నల్లమలలో అడవి దున్నలు (ఇండియన్ బైసన్)ను ప్రవేశపెట్టేందుకు అటవీశాఖ సన్నద్ధమవుతోంది. వీటి సంరక్షణకు వీలుగా గిద్దలూరు పరిధిలోని గుండ్ల బ్రహ్మేశ్వరం, నంద్యాల జిల్లా ఆత్మకూరు అభయారణ్యంలో వంద ఎకరాల్లో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్ల ఏర్పాటుకు సిద్ధమవుతోంది.

అనుకూల వాతావరణం...

సింహాలను ఎదిరించే శక్తి గల అడవి దున్నలు 800 కిలోలకు పైగా బరువుంటాయి. ముదురు గడ్డి, లేత వెదురు చిగుళ్లను ఆహారంగా తీసుకుంటాయి. ఇలాంటి మైదానాలు నల్లమల అటవీ ప్రాంతంలో విస్తారంగా ఉన్నాయి. అవి ముదురు గడ్డి పైభాగాన్ని తింటే కొత్తగా లేతగడ్డి మొలిచి జింకలు, దుప్పులకు ఆహారంగా ఉపయోగపడుతుంది. ఇవి జీవించడంతో పాటు ఇతర శాకాహార జీవుల మనుగడకూ సహకారిగా ఉంటాయి. తద్వారా వాటి సంతతీ పెరుగుతుంది.

ఎన్‌క్లోజర్లలో సంరక్షించి...

పాపికొండలు, మధ్యప్రదేశ్‌లో అడవి దున్నలు అధికం. అక్కడి నుంచి ఒక్కో విడతలో 40 చొప్పున మూడు విడతల్లో 120 దున్నలను నల్లమలకు తీసుకురానున్నారు. ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో నెల రోజుల పాటు సంరక్షించి ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేలా చేస్తారు. అనంతరం అడవిలోకి విడిచి పెడతారు. వాటి మెడకు శాటిలైట్ పరికరాలు అమర్చి ఆరోగ్య పరిస్థితి, ఎక్కడ, ఎలా ఉన్నాయన్నది నిరంతరం పర్యవేక్షిస్తారు.

వ్యాధులతో అంతరించాయి..

1867 వరకు నల్లమలలో వేల సంఖ్యలో అడవి దున్నలు సంచరించేవని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం పేర్కొన్న గజిట్ మార్కాపురం అటవీ డివిజన్ కార్యాలయంలో ఉంది. తరువాత అవి పూర్తిగా కనుమరుగయ్యాయి. 20వ శతాబ్దంలో వచ్చిన గాలికుంటు, ఇతర ప్రాణాంతక వ్యాధులతో అంతరించి ఉంటాయన్నది అధికారుల విశ్లేషణ. ఈ నేపథ్యంలో గతేడాది జనవరిలో దట్టమైన అటవీ ప్రాంతమైన పెచ్చెరువులో ఓ అడవి దున్న ప్రత్యక్షమైంది. పశ్చిమ కనుమల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి వచ్చినట్లు అటవీశాఖాధికారులు, సిబ్బంది గుర్తించారు. - న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

(c) eenadu

కోట సత్యమాంబదేవికి విశేష పూజలు

కంభం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కోట సత్యమాంబ దేవి అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీచక్రం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, పుట్టాలమ్మ వద్ద మహిళలు పూజలు చేశారు.

మాట్లాడుతున్న బహుజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా ఉన్న అపరిష్కృత సమస్యలను సమష్టిగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని బహుజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తేళ్ల అంజయ్య పేర్కొన్నారు. ఒంగోలు హైదరీక్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న వేధింపులపై పోరాడాలన్నారు. అన్ని శాఖల్లో ఆర్.వో.ఆర్.ను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు, సలహాదారులు ఎస్.జాన్సన్, ఎం.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తేళ్ల అంజయ్య, ఉపాధ్యక్షులుగా నక్కా కాంతారావు, జి.అవినాష్, ప్రధాన కార్యదర్శిగా మిడసల నాగార్జున, సహాయ కార్యదర్శిగా జె.నారాయణరావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.తిరుపాలు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జె.వీరాంజనేయులు, కోశాధికారిగా ఎస్.లలితకుమారి ఎంపికయ్యారు.

రీసర్వేకు నిధులు విడుదల చేయాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చేపడుతున్న రీసర్వేకు అవసరమైన ఖర్చుల నిమిత్తం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాళం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా సర్వేయర్ల సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నూతన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్లకు సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగోన్నతి కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు చెల్లించాలని కోరారు. అనంతరం సంఘం నూతన భవన నిర్మాణం పూర్తి చేయాలని తీర్మానించారు. జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వై.బాబూరావు, కోశాధికారి బి.పరిశుద్ధరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ఆగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

❖ ప్రయాణికులకు అవస్థలు

పొదిలి, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి అనంతపురం వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పొదిలి మండలం కంభాలపాడు వద్ద ఆదివారం రాత్రి ఆగిపోయింది. 'మరమ్మతులు చేస్తున్నాం.. ఆగండంటూ' డ్రైవర్ సుమారు రెండు గంటల పాటు నిలిపాడు. దీంతో మా ప్రయాణ ఛార్జీలు మాకు ఇస్తే ఇతర వాహనాల్లో వెళ్తామని ప్రయాణికులు ఒత్తిడిచేశారు. ఎంతసేపటికీ డ్రైవర్ సరైన సమాధానం చెప్పకపోవడంతో అతడిని పొదిలి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులున్నారు. అక్కడ నుంచి ట్రావెల్స్ యాజమాన్యంతో మాట్లాడి ఆన్‌లైన్‌లో ప్రయాణికుల ఛార్జీలు తిరిగి ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

గొడవలో అడ్డొచ్చాడని వ్యక్తిపై గొడ్డలితో దాడి..

బేస్తవారపేట, న్యూస్‌టుడే: భార్య భర్తల మధ్య గతంలో జరిగిన గొడవ విషయంలో అడ్డు వచ్చాడనే కారణంతో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన సంఘటన మండలంలోని పూసలపాడులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వడ్డే లాజర్‌కు అతని భార్య కుమారికి మధ్య గతంలో గొడవ జరిగింది. ఆ సమయంలో వారిరువురికి సర్ది చెప్పి గొడవను సద్దుమణిగించేందుకు అదే గ్రామానికి చెందిన బొగ్గు రంగయ్య జోక్యం చేసుకున్నాడు. దీంతో అతనిపై పగ పెంచుకున్న లాజర్ గొడ్డలితో బొగ్గు రంగయ్యపై దాడి చేశాడు. ఈ ఘటనలో రంగయ్య మోచేతికి తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు చికిత్స కోసం మొదట కంభం ప్రభుత్వ వైద్యశాలకు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు దుర్మరణం పాలైన సంఘటన ఒంగోలు స్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. సదరు యువకుడు అయిదో లైన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ ఎస్సై కె.మధుసూదన్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయనను గుర్తించేందుకు ఎలాంటి ఆధారమూ లభించలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ శవాగారానికి తరలించారు. వివరాలు తెలిసినవారు జీఆర్‌పీ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

విజ్ఞాన కిట్లు.. విద్యార్థి ప్రగతికి మెట్లు

న్యూస్‌టుడే, కంభం

● బలమైన పునాదికి దోహదం

ఎంఈవో కార్యాలయంలో ఉన్న కిట్లు

ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థులు చదువుతున్న తరగతికి అనుగుణంగా వారిలో సామర్థ్యాలు లేవని ప్రభుత్వం గుర్తించింది. ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఒకటి, రెండు తరగతుల్లోనే పూర్తిస్థాయిలో చదవడం, రాయడం, ప్రాథమిక స్థాయి గణిత సామర్థ్యాలను పెంపొందించాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా వారికి 'జాదూయి పిటారా (మాయా పెట్టె)' పేరుతో ప్రత్యేకమైన విద్యా సామగ్రి ఉన్న పెట్టెను సరఫరా చేస్తోంది. దీనివల్ల కలిగే ప్రయోజనాలు ఇవి.

జిల్లాకు 822 బాక్సుల పంపిణీ..

సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలోని 822 బాక్సులను పంపిణీ చేస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి ఒక్కో బడికి ఒక్కో పెట్టెను అందజేస్తున్నారు. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా 12 వేల పెట్టెలను సరఫరా చేస్తున్నారు.

మూడో తరగతికి వెళ్లేలోగా చదవడం, రాయడం రావాలి

విద్యార్థులు ఒకటి, రెండు తరగతులు పూర్తి చేసేలోగా తెలుగు, ఆంగ్ల భాషల్లో పూర్తిగా చదవడం, రాయడం నేర్చుకునేలా తీర్చిదిద్దడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు నేర్చుకునేలా ఈ పెట్టెల్లో సామగ్రి ఉంది.

● పెట్టెలో 62 రకాల వస్తువులు ఉంటాయి. వాటిల్లో కిట్ మాన్యువల్, కిట్ బాక్స్, డప్పు, పెద్ద బంతి, రోప్ లాడర్, బిల్డింగ్ బాక్స్, పెద్ద రంధ్రాలున్న ముత్యాలు, దారం, 2, 3, 5, 6 పీసుల పజిల్స్, తెలుగు, ఆంగ్ల సౌండ్స్‌కు సంబంధించిన డొమినోస్, అమ్మాయి, అబ్బాయి బొమ్మలు, వేణువు, ఇంగ్లిషు ఆల్ఫాబెట్ కార్డులు, వర్గీకరణ, తెలుగు వర్ణమాల కార్డులు, సంఖ్యల ట్రేసింగ్ కార్డులు, స్మృతి కార్డులు, వర్ణమాల స్వర, వ్యంజన, బర్కాబుక్ సెట్ (40 పుస్తకాలు), బాలవాటిక కార్యకలాప పుస్తకం తదితర సామగ్రి ఉన్నాయి.

సామర్థ్యాల వృద్ధికి ఉపయోగం

విద్యార్థుల సామర్థ్యాల పెంపుదలకు ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఐఈ కో ఆర్డినేటర్ నాగేంద్రనాయక్ తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

తెలుగు మహా సభల జయప్రదానికి పిలుపు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: 'ప్రతి నోట తెలుగు మాట' అన్న నినాదంతో మూడో ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర సారస్వత సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. సంబంధిత కరపత్రాలను నెక్స్ట్‌జెన్ పాఠశాలలో ఆదివారం ఆవిష్కరించారు. అమరావతిలోని శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సొసైటీలో జనవరి 3, 4, 5 తేదీల్లో మహాసభలు కొనసాగుతాయని... పద్య, వచన, అవధాన, భక్తి, జానపద, విజ్ఞాన, చలనచిత్ర, బాలల సాహిత్యం తదితర అంశాలపై సదస్సులు ఉంటాయని వివరించారు. వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, వివిధ రాష్ట్రాల గవర్నర్లు పాల్గొంటారని తెలిపారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, పాఠశాల డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్ అరవింద, శ్రీవిద్య, ప్రిన్సిపల్ రమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేతన కమిటీ వెంటనే వేయాలి

నూతన కమిటీ సభ్యులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రామిక మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి మాట్లాడుతూ వేతన కమిటీని వెంటనే వేయాలని కోరారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకంపై సిబ్బంది, తమ సంఘాలతో చర్చించాలని కోరారు. రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ సీతాలక్ష్మి, ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు జిలానీబాషా, అధ్యక్షులు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, కృష్ణారావు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

అజరామరుడు... ఘంటసాల

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: గాన గంధర్వుడు ఘంటసాల అజరామరుడని, కళా రంగానికి చేసిన సేవలు మరువలేనివని త్రివిక్రమ అభ్యుదయ కళాశాల సంఘం సభ్యులు కొనియాడారు. పట్టణంలోని ఎన్జీవో గృహంలో ఆయన జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన అమృత గాత్రంతో వేలాది పాటలు పాడి తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సంఘం సభ్యులు సి.రంగనాయకులు, జి.హరిహరరావు, నాగరాజు, కె.వెంకటేశ్వర్లు, ఎంవీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న త్రివిక్రమ అభ్యుదయ సంఘం సభ్యులు

శిర్డీసాయి మహా సమాధి పుస్తకావిష్కరణ

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి నివాసంలో గురుమాతాజీ, శుద్ధచైతన్యానంద స్వామీజీ, మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డిలు ఆదివారం శ్రీశిర్డీసాయి మహా సమాధి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురుమాతాజీ మాట్లాడుతూ.. ప్రతి భక్తుడు సాయి నాథుని మహిమలు, ఆయన చేసిన సేవల గురించి తెలుసుకోవాలంటే తప్పనిసరిగా ఈ పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రచయిత విజయకిశోర్, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు మడతల కస్తూరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ పోటీల్లో మార్కాపురం వాసికి బంగారు పతకం

లక్ష్మీ వెంకటనారాయణకు పతకం, ప్రశంసా పత్రం అందజేసిన తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ మెంటర్ భార్గవ్, తదితరులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన ఫొటోగ్రఫీ ఆర్ట్ పోటీల్లో మార్కాపురం వాసి బంగారు పతకం సాధించారు. ఈనెల 6, 7 తేదీల్లో నిజామాబాద్‌లోని గాంధారీ మండలంలో గాంధారీ జీవన విధానంపై నిర్వహించిన ఈ పోటీల్లో మార్కాపురానికి చెందిన ఎస్.లక్ష్మీ వెంకటనారాయణ తీసిన చిత్రానికి బంగారు పతకం లభించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ మెంటర్ భార్గవ్ హెగ్డే, తదితరులు పతకం, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

బహుమతి అందుకున్న గాంధారీ జీవన విధాన చిత్రం

పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలి

బాలికల నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

కనిగిరి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని డీఈవో కిరణ్‌కుమార్ విద్యార్థినులకు సూచించారు. ఆదివారం కనిగిరి మున్సిపాలిటీలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించారు. బాలికల చేతి రాత పుస్తకాలను, స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నో అవకాశాలను పేద విద్యార్థులకు కల్పిస్తుందని వివరించారు. వాటిని చక్కగా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, పీసీపల్లి, వెలిగండ్ల ఎంఈవోలు నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, సంజీవి కేజీబీవీ ఎస్‌వో హసీనా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరు

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపా ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మతాన్ని రాజకీయాలకు ముడిపెట్టి ప్రజలను విభజించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను మరుగున పడేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు పునాటి ఆంజనేయులు, ఎస్కే మాబు, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో మార్పులను అందిపుచ్చుకోవాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వైద్యరంగంలో కొత్తగా వస్తున్న పరీక్షా పరికరాలపై వైద్యులు అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని కేబీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన గ్యాస్ట్రోఎంటరాలజీ సదస్సులో మాట్లాడారు. గ్యాస్ ట్రబుల్ అన్నది ప్రస్తుతం అందరిలోనూ సమస్యగా మారిందని... ఈ విషయమై ప్రజల్లో సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ నరేంద్రబాబు... ఈ రంగంలో వచ్చిన అధునాతన మార్పులు, మెరుగైన వైద్యం దిశగా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అరవింద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మందలపు నరేంద్రబాబు, భానుతేజ నేతృత్వంలో ఒలంపస్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. పీడీసీసీబీ ఛైర్మన్ డాక్టర్ సీతారామయ్య, ఐఎంఏ అధ్యక్షుడు నాగయ్యనాయుడు, సుబ్బానాయుడు, ఎం.వీరయ్య చౌదరి, మణిబాబు, సుధాకర్, విజయరాఘవరావు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 135, రిటైల్ లైవ్ - 162, చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్- 267

ద్విచక్ర వాహనం పైనుంచి పడి యువకుడి మృతి

కంభం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం పైనుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలకు గురై మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన పట్టణ సమీపంలో సీఎల్‌ఆర్ కళాశాల సమీపంలో అమరావతి - అనంతపురం జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నరసింహారావు కథనం మేరకు.. చింతగుంట్ల గ్రామానికి చెందిన ఆకాశ్ (23) ద్విచక్ర వాహనంపై సొంతూరి నుంచి గిద్దలూరు వైపు వెళ్తుండగా మార్గమధ్యలో అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కంభం వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఇతనికి మూడు నెలల కిందట వివాహమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెళ్లిన దుండగులు

పీసీపల్లి, న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన సంఘటన మండలంలోని వెంగళాపురం సమీపంలోని గంగమ్మ దేవాలయం వద్ద శనివారం రాత్రి జరిగింది. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బి.ఆదిలక్ష్మమ్మ అనే వృద్ధురాలు దేవాలయం సమీపంలో చిల్లర దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తోంది. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి పాన్‌పరాగ్‌లు కావాలని అడిగారు. ఒంటరిగా ఉండడాన్ని గమనించి ఆమె పాన్‌పరాగ్ ఇచ్చే క్రమంలో మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు గొలుసును తెంచుకొని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

ప్రేమ పేరిట వంచన... యువతి బలవన్మరణం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట వంచనకు గురై, పెళ్లికి ప్రియుడు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురైన యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు కబాడీపాలేనికి చెందిన మైరాల నళిని (33) ఎంటెక్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. మహేంద్రనగర్‌కు చెందిన సింగోతు శ్రీనివాస్... ప్రేమ పేరిట ఆమెను ముగ్గులోకి దించి లొంగదీసుకున్నాడు. ఇటీవల వివాహ ప్రస్తావన తేవడంతో... వేర్వేరు కులాలు కావడంతో పెద్దలు అంగీకరించడం లేదని చెప్పాడు. దీంతో కుటుంబీకులతో మాట్లాడదామని శ్రీనివాస్ ఇంటికి శనివారం వెళ్లగా... వారు ఆమెను లోపలకు రానివ్వలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. రాత్రి... తన గదిలోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుంది. ఆదివారం ఉదయం 9.30 గంటలైనా ఆమె బయటకు రాకపోవడం, పిలిచినా స్పందన లేకపోవడంతో తండ్రి దేవదానం చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగలగొట్టారు. అప్పటికే విగతజీవిగా ఉరికి వేలాడుతుండడంతో రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌ఛార్జి సీఐ వై.నాగరాజు అక్కడకు చేరుకుని పరిశీలించగా సూసైడ్ నోట్ లభించింది. గత పన్నెండేళ్లుగా శ్రీనివాస్‌తో సాగిన ప్రేమ వ్యవహారం, అతడి కుటుంబసభ్యుల తిరస్కరణను అందులో ప్రస్తావించారు. మృతదేహాన్ని జీజీహెచ్ శవాగారానికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టేషన్‌కు పిలిచారని ఆత్మహత్య

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: భార్య ఫిర్యాదుతో తనను పోలీసు స్టేషన్‌కు పిలిచారన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిపాడు మండలం కూచిపూడికి చెందిన చేగిరెడ్డి పుల్లారెడ్డి (35) బేల్దారు పనులు చేస్తుంటారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య రాజ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో... వారు స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో మనస్తాపానికి గురై పేర్నమిట్టలో ఉంటున్న బావ రామాల మధు ఇంటికి వచ్చారు. బెంగళూరు వెళ్తున్నానంటూ ఈ నెల 4న బయటకు వచ్చి... పేర్నమిట్ట చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం... ఆ సమీపంలో చేపలు పడుతున్న వారికి దుర్వాసన రావడంతో పరిశీలించగా విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న తాలూకా ఎస్సై హరిబాబు సిబ్బందితో సహా అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బావ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దిగొచ్చిన పొగాకు నారు ధర..

❖ ముమ్మరంగా నాట్లు

న్యూస్‌టుడే, పొదిలి:

పొగాకు నారు తీస్తున్న కూలీలు

పశ్చిమ ప్రాంతంలోని రైతులు ముమ్మరంగా పొగాకు నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో ఒడిదుడుకుల నేపథ్యంలో రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

12 నుంచి 10 ఎకరాలకే పరిమితం

నెలరోజులుగా నారు దొరక్క రైతులు ఇబ్బంది పడ్డారు. మూట నారు ధర రూ.6,000కు పైగా పెట్టి ఇతర ప్రాంతాల నుంచి తెచ్చారు. ప్రస్తుతం పశ్చిమ ప్రాంతంలో కొనకనమిట్ల, పొదిలి, కొండపి ప్రాంతాల్లో నారు అందుబాటులోకి వచ్చింది. పొగాకు నారు మూట రూ.3,000కు అమ్ముతున్నారు. గతంలో బ్యారన్‌కు 10 నుంచి 12 ఎకరాలు సాగుచేసిన రైతులు ఈఏడాది 10 ఎకరాలకే పరిమితమవుతున్నారు. పొగాకు నాట్లకు, ముందస్తు నాటిన తోటలకు ప్రస్తుతం నీటి తడులు అవసరం. అందుకోసం రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. కొంతమంది రైతులు పైపులు వేసి బోరునీటిని పెడుతున్నారు.

ఇప్పటి వరకు 6,500 హెక్టార్లలో నాట్లు

పొదిలి వేలం కేంద్రం పరిధిలో ఇప్పటి వరకు 6,500 హెక్టార్ల మేర పొగాకు నాట్లు వేశారు. ఎస్‌ఎల్‌ఎస్ పరిధిలోని వేలం కేంద్రాల్లో గత ఏడాది బ్యారన్‌కు 42.75 మి.కిలోలు పంటకు అనుమతించగా ఈ ఏడాది 36.65 మి.కిలోలకు తగ్గించారు. పొదిలి వేలం కేంద్రంలో 4,332 మంది రైతులు, 2,400 బ్యారన్లు ఉన్నాయి. పశ్చిమ ప్రాంతంలో సాగునీటి వనరులు లేనందున వర్షాధారంపై పండే పొగాకు సాగు వైపే ఈ ప్రాంత రైతులు మొగ్గుచూపుతున్నారు.

పరిమితికి మించి సాగు చేయవద్దు

పొగాకు రైతులు నారు అందుబాటులో ఉందని పరిమితికి మించి నాట్లు వేసుకోవడం శ్రేయస్కరం కాదు. పెట్టుబడులు పెంచుకోవద్దు. వచ్చే ఏడాది మార్కెట్‌ను ముందుగా అంచనా వేయలేం. బోర్డు అనుమతించిన మేరకు పంట సాగు చేయాలి. కొద్ది విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకోవాలి. - గిరిరాజ్‌కుమార్, వేలం కేంద్రం నిర్వహణాధికారి, పొదిలి

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

FINANCIAL SERVICES

నూతన ఇండస్ట్రీ ఏర్పాటుకు కావలసిన Term Loans Working Capital పాత GST Returns పై OD, CC, E.P.C Loans Distributers Expoters కి Loans ఇప్పించబడును. 94944 02285.

REAL ESTATE

ఇల్లు అపార్ట్‌మెంట్సు ల్యాండ్ డెవలప్‌మెంట్ కొరకు సంప్రదించండి. మాచే నిర్మించబడే నిర్మాణాలకు 5సంవత్సరాలవరకు వారంటీ లభించును. www.mistermason.in ✆6300923212

PLOT FOR SALE

ఒంగోలు మంగమూరు రోడ్డు, మిలటరీ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో ఈస్ట్ ఫేస్ 13 గదులు. 16 వెడల్పు 61 లోతు స్థలం అమ్మబడును. సెల్: 92478 46496.

JOBS

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. చిలకలూరిపేట మం. యడవల్లి గ్రామంలోఉన్న పేపర్‌మిల్లులో పనిచేయుటకు. 9390633593, 9059514555.

SNIRD-TI మైగ్రెంట్స్- APSACS వారి సహకారంతో నిర్వహిస్తున్న ప్రాజెక్ట్ చీమకుర్తి నందు పని చేయుటకు MPHW చదివిన Male/ Female హెల్త్ వర్కర్స్ -1 కావలెను. బయోడేటా ఈ క్రింది ఈ మెయిల్ అడ్రస్‌కు 10వ తేది లోపు పంపించవలెను. snirdruraldevelopment@gmail.com

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:20k. ✆ 89776 39662,89776 39663.

అగ్రికల్చర్‌కు సంబంధించిన ప్రాజెక్ట్‌లో ఫీల్డ్ వర్క్ చేయుటకు మండలాల వారీగా PROలు, జిల్లాకో ఆర్డినేటర్‌లు అర్జెంటుగా కావలెను. Q: 10 to డిగ్రీ. జీ|| 15వేలు - 18వేలు. సంప్ర|| 9391989399, 08592 460954.

రాఘవ ఆటో ఫైనాన్స్, మార్కాపురం నందు బిజినెస్ & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర|| T.D.P ఆఫీస్ ప్రక్కన, ఒంగోలు. 9100904979, 7680015749.

ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ ఫీల్డ్‌లో ఒంగోలుటౌన్‌లో పనిచేయుటకు అనుభవం/ఫ్రెషర్స్ గల అభ్యర్థులు కావలెను. Q: Any Degree. Attractive Salary. ✆ 9703402722

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

THE EENADU WAY CLASSIFIEDS
అధిక స్పందనలు పొందండి.
వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

మార్కాపురం
• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

కేజీబీవీల్లో వృత్తి విద్యా శిక్షకుల ఖాళీల భర్తీ ఎప్పుడు?

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) అమలు చేస్తోన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థులకు వృత్తి కోర్సులను నిర్వహిస్తున్నారు. అయితే శిక్షకుల ఖాళీలు భర్తీ చేయడంలో జాప్యం జరగడంతో ఆ ప్రభావం శిక్షణపై పడుతోంది. బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఐటీ- సెల్ ఫోన్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఎలక్ట్రానిక్స్ రిటైల్, అగ్రికల్చర్, ఆటోమోటివ్, హెల్త్‌కేర్, ఫుడ్ ప్రాసెసింగ్, తదితర 10 కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఈ వృత్తి విద్యా కోర్సులను ప్రభుత్వం ప్రారంభించింది. అయితే జిల్లాలో 10 పాఠశాలల్లో 11 ఒకేషనల్ ట్రైనర్స్ లేరు. ఆయా చోట్ల విద్యార్థులు ఒకేషనల్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అవకాశం ఉన్నప్పటికీ బోధకుల నియామకం చేపట్టకపోవడంతో ఇబ్బందిగా ఉంటోంది. పథకం లక్ష్యాన్ని, విద్యార్థుల భవిష్యత్తును గుర్తించి ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒకేషనల్ ట్రైనర్స్ నియామకాన్ని త్వరితగతిన చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

‘వేధింపులు ఆపకపోతే.. సీఎం దృష్టికి తీసుకెళ్తాం’

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పార్టీకి కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలపై వేధింపులు ఆపకపోతే సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు పోతామని తెదేపా జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నె రవీంద్ర అన్నారు. ఆదివారం ఆయన ఇంట్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్టీ కోసం 30 ఏళ్ల కష్టపడి పనిచేసిన పార్టీకి బలిపశువులు నాపైనే కావాలని నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురికావాల్సి వస్తోందన్నారు. మాజీ ఎంపీటీసీ రంగనాయకులు మాట్లాడుతూ తన గ్రామంలో రహదారి పింఛన్లు మంజూరైతే రద్దు చేయించారని వాపోయారు. సీనియర్ నాయకులు బాబూరావు మాట్లాడుతూ తన సొంత 15 ఎకరాల పొలాన్ని వైకాపా నాయకులు ఆక్రమించుకున్నా తనకు న్యాయం జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మాజీ త్రిసభ్య కమిటీ నాయకులు అంబటి వీరారెడ్డి, రమణారెడ్డి, ఎన్నెం జిలాని, వెంకటరెడ్డి, అయిదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా నాయకుడు రవీంద్ర తదితరులు

ప్రసన్న రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: తంగిరాల మెట్ట, గుండ్లకమ్మ నది వద్ద వెలసిన ప్రసన్న రామలింగేశ్వర స్వామికి త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొంథా తుపానుతో కురిసిన భారీ వర్షాలకు విగ్రహం గుండ్లకమ్మ నదిలో బయల్పడింది. ఈ నేపథ్యంలో ఆ విగ్రహాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు చేసి గంగా పార్వతి సమేత ప్రసన్న రామలింగేశ్వర స్వామిగా నామకరణం చేశారు.

కాటమరాజు స్వామికి మొక్కులు..

పెద్దారవీడు: గుండంచర్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కాటమరాజు గంగాభవాని మాతకు ఆదివారం మహిళలు పూజలు జరిపారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ప్రదక్షిణలు చేసి పొంగళ్లు మొక్కులు తీర్చుకున్నారు.

21 నుంచి రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 21 నుంచి 23 వరకు కాకినాడ జేఎన్‌టీయూలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ సీనియర్ ప్రతినిధి ఏవీ పుల్లారావు తెలిపారు. ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సంబరాల గోడప్రతులను ఆవిష్కరించారు. శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా విద్యార్థులకు ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జేవీవీ నాయకులు సీహెచ్.జయప్రకాష్, యు.వెంకటరావు, జి.శ్రీనివాసరెడ్డి, వి.మాలకొండారెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, ఎస్వీ.రంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రాచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఆకవీడు, జేపీ చెరువు విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ విషయాన్ని ఆ శాఖ ఏఈ బాలగురయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ పనులు నిర్వహిస్తున్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. కోతల వేళ ప్రజలు సహకరించాలని కోరారు.

ఆరోగ్య కేంద్రాలు.. అరకొర సేవలు

న్యూస్‌టుడే, కంభం

అవస్థల్లో రోగులు

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'విలేజ్ హెల్త్ క్లినిక్‌లను' ఏర్పాటు చేసింది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పల్లె ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదు.

సరైన సమాచారం ఇవ్వడంలేదు

గ్రామాల్లో ఏదైనా విషజ్వరంతో మృతి చెందినా ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడంలోనూ సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో ఇటీవల ఓ బాలిక విష జ్వరం, అనారోగ్యంతో మృతి చెందినా ఉన్నతాధికారులకు తెలియజేయలేదు. దాంతో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమయపాలన ఏదీ..

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పనిచేయాలి. సమయపాలన ఉండడం లేదు. కేంద్రాలకు సమీపంలోనే సిబ్బంది అందుబాటులో ఉండాలి. కానీ దూర ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండాలి. వీరు సక్రమంగా ఉండటంలేదని ఆరోపణలున్నాయి.

పర్యవేక్షణ కొరవడటంతో..

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 73, జిల్లాలో 536 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. చాలా చోట్ల సొంత భవనాలు లేవు. ఇరుకైన అద్దె గదుల్లో అరకొర వసతుల నడుమ సేవలు కొనసాగుతున్నాయి. ఇక్కడి వచ్చే రోగులకు 14 రకాల పరీక్షలు చేయాలి. 175 రకాల మందులు ఇవ్వాల్సి ఉంది. సిబ్బంది ఇలాంటి పనులు ఏమీ చేయక పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వెళ్లాలని సిఫార్సు చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. టీబీ వంటి పరీక్షలు చేయకుండానే చేసినట్లుగా నమోదుచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కంభంలో మూసివేసిన హెల్త్ క్లినిక్

కఠిన చర్యలు తీసుకుంటాం

విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేస్తే సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. హెల్త్ క్లినిక్‌లలో చాలా రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. – డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ బైబిల్ సువార్తికులు రవికుమార్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. ఎరిక్షన్‌బాబు క్రిస్మస్ కేకు కోశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని క్రైస్తవ పాస్టర్లు మాకం జీవయ్య, అబ్రహం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు వస్త్రాల పంపిణీ

పొదిలి: క్రిస్మస్‌ను పురస్కరించుకుని పొదిలి సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి కమ్యూనిటీ హాలులో ఏబీఎం పాఠశాల కరస్పాండెంట్ జి.పి. జోసఫ్ పాస్టర్లకు వస్త్రాలు పంపిణీ చేశారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ కౌన్సిల్ జిసి రెవ.డాక్టర్ జి.కిషోర్‌కుమార్, చర్చి అధ్యక్షులు పి.జ్ఞానసుందరరావు, సంఘ కాపరి రెవ.టి.జాన్‌విక్టర్, సహాయ కాపరి రెవ.డాక్టర్ జి.సురేష్ కుమార్‌లు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

దర్శి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సుమారు 25 లక్షల భవన నిర్మాణ రంగ కార్మికులు పని చేస్తున్నారని, వారి శ్రమతో ఏర్పాటైన సంక్షేమ బోర్డును పాలకులు మూసివేశారని, వెంటనే పునరుద్ధరించి ఆ నిధులను కార్మిక అవసరాలకు వినియోగించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఆదివారం దర్శిలోని గుజ్జుల సరళాదేవి భవనంలో ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తుందని విమర్శించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని యర్రగొండపాలెం నియోజకవర్గ తెదేపా బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను ఆదివారం తెదేపా శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ర.భ. శాఖ భవనం వద్ద నుంచి తెదేపా శ్రేణులు ర్యాలీ చేపట్టాయి. ఎరిక్షన్‌బాబు మెడలో గజమాల వేసి నాయకులు, కార్యకర్తలు తన అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఎరిక్షన్‌బాబు పాలాభిషేకం చేశారు. అభిమానుల మధ్య ఆయన కేకు కోశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి రూ.కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, అయిదు మండలాల తెదేపా అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, మేకల వలరాజు యాదవ్, మెట్టు శ్రీనివాసరెడ్డి, పొట్ల గోవింద్, షేక్.మాబు, డీసీ ఛైర్మన్ దేవినేని చలమయ్య, కాకర్ల కోటయ్య, శనగా నారాయణరెడ్డి, రెంటపల్లి సుబ్బారెడ్డి, గొట్టం శ్రీనివాసరెడ్డి, దొడ్డా శేషాద్రి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేకు కోస్తున్న ఎరిక్షన్‌బాబు

◗ పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచి హారిక తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

జిల్లా రాకతో అన్ని విధాలుగా అభివృద్ధి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా రాకతో ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లాగా ప్రకటించిన సందర్భంగా ఆదివారం రాత్రి పట్టణంలోని 10, 11వ వార్డుల్లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో ఉద్యమాలు, నిరసన, ధర్నాలు చేసినా ఈ ప్రాంతాన్ని విస్మరించి జిల్లా విషయంలో మొండి చేయి చూపారన్నారు. చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు తెదేపాకు మద్దతు పలకాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాన్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తాం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా నెలకొన్న మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన భారత నౌకాదళ దినోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఒంగోలులో అమర జవాన్ల స్తూపం, కమిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఇతర అంశాలపైనా చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?: నాగులవరం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించారు. కానీ కాలువలు నిర్మించటం మరిచారు. వర్షాకాలం వస్తే గృహాల ముందు నీరు నిలిచిపోయి ఇబ్బందిగా ఉంటోంది. దీంతో సమస్యలు ఎదురవుతున్నాయి. వెంటనే కాలువలు ఏర్పాటు చేయాలి.
–ప్రసాద్, నాగులవరం.

✓: కాలువల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం..నిధులు మంజూరైతే నిర్మాణాలు చేపడతాం. – ఎంపీడీవో ఖాశింపీరా, అర్ధవీడు.

?: కలనూతల ఎస్సీ కాలనీలో విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిపూట వెళ్లిరావడానికి కష్టంగా ఉంటోంది. సమస్యను వెంటనే పరిష్కరించగలరు. – యోహాన్, కలనూతల

✓: క్షేత్రస్థాయిలో సిబ్బందిని పంపి పరిశీలించి, వెలగని విద్యుత్తు దీపాలు తొలగిస్తాం. వాటి స్థానంలో కొత్తవి రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. ఇక్కట్లు పడకుండా చూస్తాం.
– శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో, పెద్దారవీడు.

?: కొత్తూరులోని ఇస్లాంపేట నుంచి బీసీకాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. పనిమీద వెళ్లి వచ్చే సమయంలో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఖర్చులు భరించలేకపోతున్నాం. వెంటనే అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు మంజూరు చేయగలరు.
- నాసర్‌వలీ పొదిలి.

✓: నగర పంచాయతీలో నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యతా క్రమంలో రోడ్డు వేయిస్తాం. ఈలోపల తాత్కాలిక మరమ్మతులు చేయించి రాకపోకలకు సమస్య లేకుండా చూస్తాం.
– కె.ఎల్.నారాయణరెడ్డి, కమిషనరు, పొదిలి.

?: పట్టణంలోని ఆల్ఫా కొత్త క్యాంపస్‌కు వెళ్లే దారి ఇటీవల సిమెంట్ రోడ్డు వేశారు. దానికి రెండు వైపులా మట్టి పోయలేదు. దాంతో విద్యార్థులు, స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట మరింత కష్టంగా ఉంటోంది. వెంటనే చర్యలు తీసుకోగలరు.
– నాగార్జున,, రాజ్యలక్ష్మి, స్థానికులు

✓: ఇటీవలే సిమెంట్ రోడ్డు వేశాం. త్వరలోనే రోడ్డుకు రెండువైపులా మట్టి పోయించేందుకు చర్యలు తీసుకుంటాం.
- డేవిడ్, పంచాయతీరాజ్ జేఈ, కంభం

- న్యూస్‌టుడే, అర్ధవీడు, పెద్దారవీడు, పొదిలి, కంభం

చెత్త తొలగదు.. నీరు పారదు

పొదిలి పెద్దచెరువుకు నీరు చేరే పల్లెకంటేరు వాగులో భారీగా చెత్త పేరుకుపోయింది. కొన్నేళ్లుగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువులకు నీరు చేరే కాలువల మరమ్మతులు చేయించకపోవడంతో చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. పెద్దబస్టాండ్, పుల్లరపేట వద్ద ఉన్న నీటిపారుదలశాఖ కాలువల్లో స్థానికులు వ్యర్థాలు వేస్తున్నారు. వీటితో కాలువలు నిండిపోతున్నాయి. ఎంతో అవసరం ఉన్న నీటిపారుదల కాలువల్లో జంగిల్ క్లియరెన్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, నిధులు మంజూరు చేసి కాలువలు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదిలి

బురద దారి.. దాటేదెలా మరి?

గిద్దలూరు పురపాలకంలోని నల్లబండ వీధిలోని జంగాల కాలనీ నుంచి నాయీబ్రాహ్మణ కాలనీకి వెళ్లే రహదారి బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. జంగాల కాలనీ వద్ద ఉన్న పబ్లిక్ టాప్ వద్ద వృథా నీరు, గృహాల్లోని మురుగు నీరు రహదారిపైకి చేరుతున్నాయి. దీంతో నాయీబ్రాహ్మణ కాలనీకి, సమీప నివాస గృహాల వారు నడిచి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు బురదలో నడుస్తూ జారిపడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రహదారిలో మురుగు నీరు నిల్వ లేకుండా పక్కా కాలువ వ్యవస్థను మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

అల్లుకున్న నిర్లక్ష్యం

యడవల్లి సమీపంలోని పెద్దదోర్నాల-ఆత్మకూరు రహదారి పక్కన ఉన్న విద్యుత్తు పరివర్తకం చుట్టూ చెట్ల తీగలు అల్లుకున్నాయి. దీంతో గాలి వీచినప్పుడు విద్యుత్తు తీగలు ఒకదానికొకటి తగులుకుని మంటలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే పరివర్తకం చుట్టూ ఉన్న మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. - పెద్దదోర్నాల, న్యూస్‌టుడే

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు

ప్రజల కలను సాకారం చేశారు

పొదిలి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాను ఏర్పాటుచేసి ప్రజల కలను సాకారం చేశారని తెదేపా నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని మల్లవరం గ్రామంలో తెదేపా నాయకులు సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు డి.అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖుద్దూస్, మెడికల్ బోర్డు కమిషన్ సభ్యురాలు ఎస్.గీత, సొసైటీ అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

గాండ్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

పొదిలి, న్యూస్‌టుడే: స్థానిక ఎన్జీవో సమావేశమందిరంలో ఆదివారం పొదిలి యూనిట్ గాండ్ల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులుగా చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, ప్రధానకార్యదర్శిగా దాసరి గురుస్వామి, సహాధ్యక్షులుగా ఎం.హారిక, సహాయ కార్యదర్శిగా సీహెచ్.శ్రీనివాసులు, కోశాధికారిగా బి.నిమ్మేశ్వరరావు, మరికొంతమంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం గౌరవ సలహాదారులు టి.నాగభూషణం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గాండ్ల కార్పొరేషన్, ప్రధాన పట్టణాల్లో సామాజిక భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన ఏడాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.రామారావు, ఎ.విక్రమార్క్, చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు కూలీ మృతి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలం కాటూరివారిపాలెంకు చెందిన మాదాల రాంబాబు (42) గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఇతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. జీవనాధారం కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు, స్థానికులు విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: మార్కాపురంలో 8 కేంద్రాల్లో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలకు 1,588 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఈ పరీక్షలు నిర్వహిస్తుంటారు. పట్టణంలోని జడ్పీబాలురు, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు పీఎస్‌కాలనీ మున్సిపల్, ఎస్సీబీసీ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ట్రైబల్ గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల రాయవరం, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల ఉన్నత పాఠశాలల్లో పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 కె.శర్వాణి, పెద్దారవీడు ఎంఈవో సుబ్రమణ్యంలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో-2 శర్వాణి, తదితరులు

పగటి వెలుగు.. ప్రగతికి భారం

పంచాయతీలకు రూ.వేలల్లో అదనపు వ్యయం

న్యూస్‌టుడే, బేస్తవారపేట

డివిజన్లో వీధి వీధిదీపాల నిర్వహణ గాడి తప్పింది. పట్ట పగలూ వెలుగుతూ ప్రభుత్వ ఖజానాకు అదనపు ఖర్చు పడేలా చేస్తున్నాయి.

బిల్లుల భారం తగ్గించాలని లక్ష్యం

ప్రభుత్వ ఖజానాకు బిల్లుల భారం తగ్గించడానికి గతంలో తెదేపా ప్రభుత్వం ఎల్ఈడీ వీధిదీపాలు తెరపైకి తెచ్చింది. రహదారులు, నగరాలు, పట్టణాలు, పల్లెల వీధుల్లో వీటిని ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్వహణ గాడి తప్పింది.

ఏజెన్సీలకు బాధ్యతలు..

గిద్దలూరు, మార్కాపురం, పొదిలి తదితర ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్తు సరఫరా చేయాలని, వృథాను అరికట్టి ఆదా చేయాలనే ఉద్దేశంతో గతంలో వీధిదీపాల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. పట్టణాల్లో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. అనంతరం ఆ దిశగా అడుగులు పడలేదు. మరోవైపు థర్డ్ లైన్‌పై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా దీపాలు రాత్రింబవళ్లూ వెలుగుతూనే ఉన్నాయి.

◗ ప్రస్తుతం నగర పంచాయతీలు, మున్సిపాలిటీలే వీటి నిర్వహణ చూసుకుంటున్నాయి. దీంతో కొత్త దీపాల కొనుగోలుకు అదనపు వ్యయం తప్పడం లేదు. ◗ బేస్తవారపేట మండలంలో 43 గ్రామాల్లో వందలాది దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో మండల వ్యాప్తంగా వాటి విద్యుత్తు ఛార్జీల కింద నెలకు సుమారు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వస్తోంది. కాగా ప్రతి పంచాయతీకి నెలవారీ రూ.వేలల్లో విద్యుత్తు ఛార్జీల రూపంలో వ్యయం జరుగుతోంది.


గొట్టమిండ్లులో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపం

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం

గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలగకుండా ఉండేందుకు థర్డ్ లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు ఇటీవలే విద్యుత్తుశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపాం.
– రంగనాయకులు, ఎంపీడీవో, బేస్తవారపేట.

మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళల ఆగ్రహం

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తూరు జాతీయ రహదారి, మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వద్ద నూతనంగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని స్థానిక కొత్తూరు మహిళలు ఆదివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి, అందులోనూ గృహాల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మద్యానికి బానిసలైన తమ ప్రాంతాల్లోని యువకులు, పెద్దవారు అప్పులు, అనారోగ్యం పాలై తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తే అడ్డుకున్నామని, తిరిగి ఇప్పుడు బలవంతంగా పలుకుబడిని ఉపయోగించి ఇక్కడ దుకాణం ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక వేళ ఇక్కడ దుకాణాన్ని ఏర్పాటు చేస్తే ధ్వంసం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

సోమవారపేట.. సూచిక బోర్డు లేదేంటి..!

బేస్తవారపేట: మండల పరిధిలోని సోమవారపేట గ్రామ ప్రవేశం వద్ద ఊరు పేరును తెలిపే సూచిక బోర్డు ఏర్పాటుచేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్థులకు అలవాటైంది కాబట్టి పెద్దగా అవస్థలు పడటంలేదు. పనుల నిమిత్తం ఆ గ్రామానికి వచ్చే ఇతర ప్రాంతాలకు చెందిన వాహనదారులు మాత్రం ఎటు వెళ్లాలో తెలియక దారి తప్పుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డును ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. ఆ దిశగా ఆర్అండ్‌బీ, జాతీయ రహదారి సంస్థలను గ్రామస్థులు కోరుతున్నారు.

సోమవారపేట ప్రవేశ మార్గం

(c) eenadu

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మర్రిపూడి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలని వైద్యాధికారి విద్యాసాగర్ సూచిం చారు. ఆదివారం మండలంలోని వేమవరంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి పరి సరాలు పరిశీలించారు. జ్వర సర్వే చేశారు. కాలువల్లో బ్లీచింగ్, అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. జ్వర పీడితులకు మందులు పంపిణీ చేశారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సింగరాయకొండ ఉప సర్పంచి రాజీనామా

సింగరాయకొండ గ్రామీణం: సింగరాయకొండ గ్రామ పంచా యతీ ఉప సర్పంచి షేక్ కరీమున్ అనారోగ్య కారణాలతో రాజీ నామా చేసినట్లు ఎంపీడీవో జయమణి ఆదివారం తెలిపారు. ఆమె వెల్లడించిన వివరాల మేరకు.. ఈ నెల 11న తేదీన ఉప సర్పంచి ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదే శాలు జారీ చేసినట్లు వివరించారు. ఆరోజు సర్పంచి, వార్డు సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. గ్రామంలోని 11వ వార్డు నుంచి కరీమున్ వైకాపా పార్టీ బలపరిచిన సభ్యు రాలిగా ఎన్నికయ్యారని ఎంపీడీవో తెలిపారు.

పాఠశాలకు నీటి డబ్బాల పంపిణీ

సి.ఎస్.పురం: మండలంలోని అంబవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు తెదేపా నాయకుడు గుంటి మడుగు వెంకటరామరాజు నీటి డబ్బాలను ఆది వారం అందజేశారు. విద్యార్థుల తాగునీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా రూ.20 వేలకు పైగా విలువచేసే 10 స్టీల్ డ్రమ్ములను, 10 స్టాండ్లను పాఠశాల ప్రధానోపాధ్యాయునికి వీటి అందజేశారు. దాతను ప్రధానోపాధ్యా యుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: కురిచేడు మండలం అలవలపాడు పంచాయతీ పెంగమూరు కాలనీలో సిమెంట్ రహదారులు వేసినా పక్కా కాలువలు నిర్మించలేదు. దీంతో నివాసాల్లో నుంచి వచ్చే మురుగునీరు రహదారి పక్కన చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – సురేష్, స్థానికుడు

✓: పక్కా కాలువలు నిర్మించాలని ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. – కోటేశ్వరరావు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

?: కొండపి ప్రధాన రహదారికి ఇరువైపులా వీధి దీపాలు వారం రోజులుగా వెలగడం లేదు. – సూర్య, గ్రామస్థుడు

✓: త్వరలో వీధి దీపాలకు మరమ్మతులు చేపడతాం. కొన్ని ప్రాంతాల్లో నూతన దీపాలు అమర్చుతాం. –రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి

?: జరుగుమల్లి మండలం బిట్రగుంటలో చాలా కాలంగా పారి శుద్ధ్య పనులు చేపట్టపోవడంతో రోడ్లు, కాలువల వెంట చెత్త పేరుకుపోయింది. –సుబ్బయ్య, స్థానికుడు

✓: గ్రామంలో వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టి కాలువలు, రోడ్లు శుభ్రం చేస్తాం. –షఫి, పంచాయతీ కార్యదర్శి

?: మర్రిపూడి మండలం కాకర్ల బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగక చీకట్లో తిరగాల్సి వస్తోంది. –గోపాల్‌రెడ్డి, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధి దీపాలకు మర మ్మతులు చేయిస్తాం. –నాగూరవలి, ఎంపీడీవో

-న్యూస్‌టుడే, కురిచేడు, కొండపి గ్రామీణం, జరుగుమల్లి, మర్రిపూడి

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 960 మంది హాజరు

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని 5 పరీక్ష కేంద్రాల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, జడ్పీ బాలికోన్నత పాఠ శాల, పంతులపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ల్లోని కేంద్రాల్లో మొత్తం 960 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను డీఈవో కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలలోపే ఆయా మండలాలకు చెందిన 8వ తరగతి విద్యా ర్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

దర్శి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సుమారు 25 లక్షల భవన నిర్మాణ రంగ కార్మికులు పని చేస్తున్నారని, వారి శ్రమతో ఏర్పాటైన సంక్షేమ బోర్డును పాలకులు మూసివేశారని, వెంటనే పునరుద్ధరించి ఆ నిధులను కార్మిక అవసరాలకు వినియోగించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఆదివారం దర్శి లోని గుజ్జుల సరళాదేవి భవనంలో అంజనే యులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్రంలో అధి కారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మిక చట్టా లను కాలరాస్తుందని విమర్శించారు. కనీస వేతనం అమలుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కార్మికులు ఉద్యమ బాట పట్టా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు, హనుమంతరావు, మల్లికార్జున, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

లంచాలపైనే ఆశ.. అర్జీలపై లేని ధ్యాస

☛ డబ్బులిస్తేనే రెవెన్యూ సమస్యల పరిష్కారం
☛ లేదంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే

నిఘా

సింగరాయకొండ మండలం మీదుగా 16వ జాతీయ రహ దారి ఏర్పడిన నాటి నుంచి అక్కడి భూములకు రెక్కలొ చ్చాయి. ఒంగోలు, కందు కూరు, నెల్లూరు మార్గాలకు ఈ గ్రామం కూడలిగా ఉండ డంతో ఎక్కువ మంది ఇక్కడ స్థిరనివాసం ఏర్పర చుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో భూముల క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. దీంతో బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వీఆర్వోలకు నగదు ఆశచూపి తమ పనులు చేయించుకుంటు న్నారు. మ్యుటేషన్లు, ఆన్‌లైన్ సబ్‌డివిజ న్‌లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లు వంటి వాటికోసం సాధారణ పౌరులు ఎవరైనా సరే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిర గాల్సిన పరిస్థితి ఉంది. ఎందుకంటే అందా లకు ఆలవాటు పడిన వీఆర్వోలు వీరి నుంచి కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో సన్న చిన్నకారు రైతులు, ఇతరులు అడిగినంత డబ్బులు ఇచ్చుకోలేక పనులు జరగక ఆవేదన చెందుతున్నారు.

సింగరాయకొండ తహసీ ల్దార్ కార్యాలయ పరిధిలో పనిచేసే కొందరు వీఆ ర్వోలు, ఇతర సిబ్బంది ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్‌కు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు మామూలు చేస్తున్నారు. మ్యుటేషన్లకు రూ.5 వేల నుంచి రూ.10 వేల మధ్య డిమాండ్ చేస్తున్నారు. ఇక ఆన్ లైన్ సబ్ డివిజన్, లేట్ బర్త్ సర్టిఫికేట్‌కు ఒక రేటు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారు. నగదు ఇస్తేనే పని చేస్తామని భీష్మించుకు కూర్చుంటున్నారు. దీనిపై సింగరాయకొండ తహసీల్దార్ రాజేష్‌ను వివరణ కోరగా.. కార్యాలయ సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పౌర సేవల్లో ఇబ్బం దులు లేకుండా మరింత జాగ్రత్తలు తీసు కుంటామని తెలిపారు.

సింగరాయకొండ ఆయ్యప్పనగర్‌కు చెందిన ఓ యువతికి కుటుం బానికి సోమరాజుపల్లి పరిధిలో రెండెకరాల భూమి ఉంది. మ్యుటే షన్ చేయించేందుకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం అర్జీ పెడితే సంబంధిత వీఆర్వో రూ.3 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అడిగినంత ఆ డబ్బులివ్వాల్సి వచ్చింది.

సింగరాయకొండ మండలం శానం పూడి గ్రామానికి చెందిన మహిళకు పూర్వీకులు కట్టం కింద ఇచ్చిన ఆస్తిని ఆమె పేరుపై ఆన్‌లైన్ చేయిం చేందుకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫి కేట్ కావాల్సి వచ్చింది. దరఖాస్తు పెట్టుకున్న మూడు నెలలకు తహసీ ల్దార్ కార్యాలయంలోని ఆర్‌ఐ స్పందిస్తూ కొంత ఖర్చవుతుందని మహిళ కుమారుడిని నగదుకు డిమాండ్ చేశారు.

ఇవీ.. సింగరాయకొండ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో జరుగుతున్న తంతు. ఇక్కడ పని జరగాలంటే చేయి తడపాల్సిందే. లేదంటే ప్రజలు చేసుకున్న దరఖాస్తులను ఏమాత్రం పట్టించుకోరు.

-న్యూస్‌టుడే, టంగుటూరు, సింగరాయకొండ గ్రామీణం

రోడ్డు పక్కన చిల్లచెట్ల తొలగింపు

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని శివారు ప్రాంతాల్లో సమస్యలపై ఈ నెల 4న 'ఈనాడు'లో 'చుట్టూ నమ స్యలు.. చూపలేని పరిష్కారాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు ఆదివారం పట్టణంలోని ఎన్జీవో కాల నీలో రోడ్డు పక్కన పెరిగిన చిల్లచెట్లను యంత్రం సాయంతో తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, తెదేపా నాయకులు చంద్రశేఖర్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

మండల కేంద్రం.. సమస్యల నిలయం

❑ వెలిగండ్లలో వెక్కిరిస్తున్న వసతుల లేమి

న్యూస్‌టుడే, వెలిగండ్ల

మండల కేంద్రం వెలిగండ్లలో ఎటు చూసినా మురుగు, రోడ్లకి రువైపులా చిల్లచెట్లే దర్శనమిస్తు న్నాయి. సరైన కాలువలు లేక మురుగునీరంతా రహదారుల పైనే పారుతోంది. దీనికితోడు చాలా వీధుల్లో రాళ్లు తేలిన రోడ్లే కనిపిస్తున్నాయి. 400లకు పైగా కుటుంబాలు నివాసం ఉండే ఈ గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు అధికంగా ఉన్నారు. గ్రామం నడిబొడ్డున ఉండే మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు 20 ఏళ్ల క్రితం నిర్మించినది. ఇది శిథిలావస్థకు చేరింది. ఏ క్షణ మైనా కూలిపోయే స్థితిలో ఉంది. దీన్ని కూల్చి వేసి నూతన ట్యాంకు నిర్మించాలని కోరుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకో వడం లేదని స్థానికులు వాపోతు న్నారు. బస్టాండ్ సెంటర్లో ఎప్పుడో వేసిన రోడ్డు కావడంతో రాళ్లు తేలి.. వాహనదారులు, ప్రజల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మురుగు నీరు పేరుకుపోవ డంతో దోమల వ్యాప్తి ఎక్కువై రాత్రిపూట నిద్రలేకుండా చేస్తున్నా యని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక పొలా లకు వెళ్లే డొంకరోడ్లు చిల్లచెట్లతో మూసుకుపోయాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి వెలిగండ్ల నిధులు కేటా యించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతు న్నారు. ఈ విషయమై ఎంపీడీవో గంగాధర్‌ను వివరణ కోరగా.. కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధుల కోసం ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

కూలే స్థితిలో ఓవర్ హెడ్ ట్యాంకు

తూర్పు వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నీలకంఠేశ్వరుడికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని మాధవ రంలో గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామికి ఆదివారం పంచామృతాలతో అభి షేకాలు నిర్వహిం చారు. ఆరుద్ర నక్షత్రం ప్రాధాన్యతను పురస్క రించుకొని వేకువ జామునే పూజారి బి.శ్రీను అభి షేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవ, దేవుళ్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రకాశం పరి సర జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు రాకతో రద్దీ నెలకొంది. భక్తులు అమ్మవారికి పొంగళ్ల నైవేద్యంగా సమ ర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మాధవరంలో నీలకంఠేశ్వర స్వామి

గుంటిగంగలో గంగమ్మకు..: గుంటిగంగలో కొలువుదీరిన గంగాభవాని అమ్మవారికి ఆది వారం విశేష పూజలు నిర్వహిం చారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారాయణ స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆది వారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఈ సందర్భంగా అర్చకులు నారాయణ స్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. దేవస్థానంలో గోపూజ చేశారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకం, మహా నివేదన, హారతి పూజలు జరిగాయి. నారాయణస్వామి పల్లకీసేవ, రథోత్సవం జరిగాయి. భక్తులు ఉత్సాహంగా పల్లకీ మోసి రథాన్ని లాగారు. దేవస్థానం ఆధ్వ ర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పూజలు, అన్నదానం వద్ద ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కె.చినబడి నారాయణ, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆలయంలో ప్రదక్షిణలకు బయలు దేరిన భక్తులు

మురుగు తొలగదు.. దోమలు వదలవు

తాళ్లూరు మండలం తూర్పుగంగవరం పంచాయతీ పరిధి హరిదాసునగర్‌లో మురుగునీరు పోయేం దుకు కాలువలు సరిగా లేకపోవడంతో దుస్థితి నెలకొంది. ఎక్కడికక్కడే మురుగు నిల్వ ఉండ డంతో వ్యాధులు ప్రబలుతాయని కాలనీవాసులు ఆందోళ నకు గురవుతున్నారు. సీసీ రోడ్డుపైనే మురుగునీరు నిలి చిపోయిన పరిస్థితిని చిత్రంలో చూడవచ్చు. కొందరు స్థానికులు కాలువల్లో మట్టితో అడ్డు కట్టలు వేయడంతో ఇబ్బందులు అధికమయ్యాయి. దీనిపై డీపీవో వెంకటేశ్వ రరావుని సంప్రదించగా.. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

అసంపూర్తి పనులు.. తేలిన రాళ్లు

కనిగిరి మున్సిపా లిటీలోని దేవాం గ్‌నగర్ నుంచి మండలంలోని తుమ్మగుంటకు వెళ్లే రహదారి రాళ్లుతేలి అధ్వానంగా తయారైంది. వైకాపా ప్రభుత్వంలో ఏఐఐబీ పథకం కింద 2.3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మా ణానికి రూ.1.56 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారుడికి బిల్లులు చెల్లించక పోవడంతో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి నేటి వరకు నాలుగు గ్రామాల ప్రజలు కని గిరి పట్టణానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పీఐయూ సబ్‌డివిజన్ ఏఈఈ ఎలీషాను వివరణ కోరగా.. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తిచేస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, కనిగిరి

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి

పోలీసు అధికా రులు, సిబ్బం దిలో శారీరక దృఢత్వం పెంపొందించేం దుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధ న్‌రాజు ఆదేశాల మేరకు ఆదివారం పామూరులో సీఐ మాకినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉరుకులపరుగుల జీవితంలో ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. సైక్లింగ్ కూడా ఇందుకు దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై షేక్ జిలానిబాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, పామూరు

కాలువ ఇలా.. నీరు వెళ్లేదెలా?

మండల కేంద్రం హెచ్‌ఎంపాడులో మురుగు కాలువలు శుభ్రం చేయకపో వడంతో దుర్వాసన వస్తోంది. వైకాపా ప్రభుత్వంలో కాలువల నిర్మాణం చేప ట్టినా పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో గుత్తేదారు అసం పూర్తిగానే పనులు చేశారు. దీంతో కాలువలు శిథిల స్థితికి చేరి ఇళ్ల నుంచి వచ్చిన మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులకు వేతన చెల్లింపులు ఏడా దిగా లేకపోగా వారు పట్టించుకోవడం లేదు. దీనిపై ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. ఇటీవలే కాలువల పనులు చేసిన గుత్తేదారుకు బకాయి బిల్లులు చెల్లించామన్నారు. మళ్లీ అంచనాలు వేసి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, హనుమంతునిపాడు



తప్పుకోవడానికి తప్పని పాట్లు

తాళ్లూరు-తూర్పుగంగ వరం రహదారి ఇరు కుగా మారింది. రెండు వరుసలుగా అభివృద్ధి పర్చాలని ఎన్నోసార్లు ఈ ప్రాంత ప్రజలు విన్నవి స్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. తాళ్లూరు, దర్శి, ముండ్ల మూరు, ఒంగోలు, చీమకుర్తితోపాటు బాపట్ల జిల్లా అద్దంకి, కొరిశపాడు, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి ప్రయాణి కులు ఇటువైపుగా రాకపోకలు సాగిస్తుంటారు. మాధవరం-లింగాలపాడు, కొత్తపాలెం-మాధవరం గ్రామాల మధ్య ఇరు వైపులా చెట్లు పెరగడం వల్ల వాహనాలు తప్పుకొనేందుకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయమై ర.భ.శాఖ డీఈ గోపీకృ ష్ణను సంప్రదించగా.. సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

మూలగుంటపాడు పోలేరమ్మ ఆలయం వద్ద గ్రామస్థులు

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మూలగుంటపాడు పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి దేవా దాయ శాఖ ద్వారా రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు గ్రామస్థులు ఆది వారం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్థానిక జాతీయ రహ దారి విస్తరణలో భాగంగా అధికారులు ఆలయ స్థలాన్ని కొంతమేర స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. శతాబ్దం నాటి గ్రామ దేవత ఆలయం తొలగిస్తున్నారనే సమాచారం మంత్రి స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య లకు తెలియజేశామన్నారు. దీంతో వారు దేవాదాయ శాఖ అధికారులతో సంప్ర దించి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి శ్రీని వాసులు, మసలయ్య, సుధాకర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామభద్రాపురంలో ఆది వారం కోతుల దాడిలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయాల పాల య్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కోట లక్ష్మమ్మ, చిన్నమ్మాయిలు ఉదయాన్నే వారి ఇళ్ల ముందు నిల్చొని ఉన్నారు. అటువైపుగా వచ్చిన కోతులు వెంటబడి కరవ డంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే వారిని తూర్పుగంగ వరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. ఇటీవల కాలంలో కోతుల బెడద అధికమైందని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సత్వరం స్పందించి కోతల బెడద నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్ర మాజీ మంత్రికి నివాళి

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పీవీఆర్ పార్కులో ఆది వారం కేంద్ర మాజీ మంత్రి పులి వెంకటరెడ్డి వర్ధంతిని నిర్వహిం చారు. ఆయన మనవరాలు, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ శాంతి ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేంద్రమంత్రిగా, కనిగిరి ఎమ్మెల్యేగా, ఒంగోలు, కావలి ఎంపీగా ఆయన కనిగిరి ప్రాంతానికి ఆయన చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పట్టణానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళల ఆగ్రహం

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణం లోని కొత్తూరు జాతీయ రహ దారి, మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వద్ద నూతనంగా మద్యం దుకాణం ఏర్పాటు చేయ డాన్ని స్థానిక కొత్తూరు మహిళలు ఆదివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి, అందులోనూ గృహాల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మద్యా నికి బానిసలైన తమ ప్రాంతా ల్లోని యువకులు, పెద్దవారు అప్పులు, అనారోగ్యం పాలై తల్ల డిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తే అడ్డుకు న్నామని, తిరిగి ఇప్పుడు బలవంతంగా పలుకుబడిని ఉపయోగించి ఇక్కడ దుకాణం ఏర్పాటు చేస్తు న్నారని మండిపడ్డారు. ఒక వేళ ఇక్కడ దుకాణాన్ని ఏర్పాటు చేస్తే ధ్వంసం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

నూతనంగా ఏర్పాటు చేయనున్న దుకాణం వద్ద అభ్యంతరం తెలుపుతున్న మహిళలు

అనుమానితులపై సమాచారమివ్వండి

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో అను మానితంగా, కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసు లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై మాధవరావు కోరారు. మండలంలోని మిట్టపాలెంలో ఆదివారం పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమయ్యారు. సైబర్‌నేరాలు, బంగారం పేరుతో మోసం చేయడం వంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. సీసీ కెమెరాల పనితీరు, అన్యాయం జరిగినపుడు న్యాయం కోసం ఫిర్యాదు చేయడం తదితర అంశాలను వివరించారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితులపై ఆరాతీ శారు. గొడవలు లేకుండా సామర స్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుబ్బారా యుడు, గ్రామపెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిట్టపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మాధవరావు

స్వామియే.. అయ్యప్పో!

తాళ్లూరు, దొనకొండ: తాళ్లూరులో ఆది వారం అయ్యప్ప దీక్షాధారులు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. గురుస్వాములు సుమారు 70 మందిపైగా స్వాములకు ఇరు ముళ్లు ఏర్పాటు చేశారు. అనంతరం వారంతా పలు వీధుల్లో అయ్యప్పస్వామి చిత్రపటాలతో ఊరేగింపు వెళ్లారు. దొనకొండ మండలం ఇండ్ల చెరువులో నలభై మంది అయ్యప్ప భక్తులు గురుస్వాముల సహకారంతో ఇరుముళ్లను ఏర్పాటు చేయించుకున్నారు. ప్రదర్శనగా శబరి మలకు బయలుదేరి వెళ్లారు. దీంతో ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

దొనకొండ: ఇండ్లచెరువులో ఇరుమళ్లతో శబరిమలకు బయలుదేరిన స్వాములు

రహదారి కూడలి.. రక్తసిక్తంగా మారి!

ప్రమాదాలకు నిలయంగా మారిన సింగరాయకొండలోని బాలయోగి నగర్ రోడ్డు కూడలి

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

మండల కేంద్రం సింగరాయకొండకు ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనికి సమీపంలోనే పాకల సముద్ర తీరం ఉన్నందున సందర్శకులు కూడా వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఇలాంటి చోట తరచూ రోడ్డు ప్రమాదాలు ప్రయాణికులను కలవరపా టుకు గురిచేస్తున్నాయి. సింగరాయకొండలో రెండు నెలల క్రితం రూ.2 కోట్లతో నిర్మించిన ఊళ్లపాలెం-వేములపాడు (ఓవీ) రోడ్డులో బాలయోగినగర్ కూడలి వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు, వేగ నిరోధ కాలు నేర్పాటు చేయలేదు. ర.భ.శాఖ అధికారుల పర్య వేక్షణ లేమితో గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేయడంతో నాణ్యత లోపించి రహదారి వెంబడి గుంతలు దర్శనమిస్తున్నాయి. కూడలి సమీపంలో బాలికల గురుకుల పాఠశాల వద్ద వాహనాలు నియం త్రణ లేకుండా వేగంగా వస్తుండటంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసు కోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలు..

- రెండు నెలల క్రితం కొండపి మండలానికి చెందిన ఒక మహిళ తమ కుటుంబ సభ్యులతో ద్విచక్ర వాహ నంపై సింగరాయకొండ వస్తున్న క్రమంలో స్థానిక గురుకుల పాఠశాల వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో రహదారిపై పడిపో యారు. ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.
- నాలుగు రోజుల క్రితం ఉలవపాడు మండలానికి చెందిన మత్స్యకారుడు ద్విచక్ర వాహనంపై సింగరా యకొండ వస్తున్న క్రమంలో బాలయోగినగర్ కూడలి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు.
- ఇటీవల బాలయోగినగర్‌కు చెందిన విద్యార్థి ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్లే క్రమంలో కూడలి వద్ద వేచి ఉండగా.. వెనుక నుంచి మరో ద్విచక్ర వాహన దారుడు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం..

ఓవీ రోడ్డు పరిధిలోని సింగరాయకొండలో రోడ్డు ప్రమా దాలు జరగకుండా త్వరలో కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాము. గుత్తేదారుడు పనులు పూర్తిస్థాయిలో చేయకుండా అర్ధాంతరంగా నిలిపివే శాడు. అతనికి నోటీసులు అందజేసి పనుల పూర్తికి చర్యలు చేపడతాం. –మాధవరావు, ఏఈ, ర.భ.శాఖ

ప్రథమ వర్ధంతి

08.12.2025

కీ॥శే॥ శ్రీమతి ఆంద్ర రంగమ్మ గారు
మరణం: 19.12.2024

మా హృదయ ఫలకాలపై
చెక్కిన సజీవ శిల్పం
మీ రూపం..
అనురాగానికి చిరునామా..
మీ హృదయం
మీరు వేసిన ప్రతి అడుగు
మాకు ఆదర్శం..
నడిచిన ప్రతిదారి సదాశయం..
చేరిన ప్రతి గమ్యం
స్ఫూర్తి శిఖరం..
మీరే మాకు మార్గదర్శి..
ప్రేమానురాగాలతో
మా అందరికీ వెలుగునిచ్చి..

జీవనజ్యోతిగా ఆఖరి వరకుదారి చూపావు.. అలసి సొలసిపోయి..
విశ్రమించిన.. మీ పాదాలకు మా హృదయ నివాళులు అర్పిస్తూ..
మీ జ్ఞాపకాలతో ముందుకు సాగుతూ..
మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ శోకతప్త హృదయాలతో..
కుటుంబ సభ్యులు

ప్రథమ వర్ధంతి: తేదీ 8-12-2025 సోమవారం ఉదయం 10 గం॥లకు
తూర్పు గంగవరం హరిదాస్ నగర్‌లోని మా స్వగృహం నందు జరుగును.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

ఇతిహాసాలు... జీవన మార్గదర్శకాలు

ఒంగోలు సాంస్కృతికం న్యూస్‌టుడే: మనిషి నడవడిక, జీవన విధానం ఎలా ఉండాలన్నది రామాయణం మనకు తెలియజెబుతుందని చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పేర్కొన్నారు. శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బాల విహార్ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందేలా రామాయణం, భారత, భాగవతాల్లోని పలు అంశాలను తెలియజేశారు. ఈ తరగతులను పిల్లలంతా సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఆలయ ప్రతినిధి ఆలూరు ఝాన్సీరాణి కోరారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని కర్నూలురోడ్డు, శ్రీనగర్ కాలనీ, మారుతి నగర్, ఎస్‌బీఐ, జడ్పీకాలనీ, శివప్రసాద్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, మంగమూరు రోడ్డు, మర్రిచెట్టు కాలనీ, ప్రగతినగర్ తదితర ప్రాంతాలకు... సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ పాండురంగారావు తెలిపారు.

జూద శిబిరంపై దాడి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: లక్ష్మీపురం శివారులో నిర్వహిస్తున్న జూద శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.22 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు.

సెమీ క్రిస్మస్ సంబరం

ఒంగోలు నగరంలోని జేఎంబీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ జాన్ కెనడీ దైవ సందేశం వినిపించారు. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కేకు కోశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, క్రిస్మస్ గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

తీరంలో కోలాహలం

మార్గశిర మాసం... ఆధ్యాత్మికంగా ప్రాధాన్యం ఉండడం... ఆపై సెలవు రోజు కావడంతో ఆదివారం కె.పల్లెపాలెం బీచ్‌కు భక్తులు, సందర్శకులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాలతో సహా తరలివచ్చి సముద్ర స్నానాలు చేశారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. రాత్రి పొద్దుపోయే వరకు ఈ కోలాహలం కొనసాగింది. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా మెరైన్, పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు. – న్యూస్‌టుడే, కొత్తపట్నం

అమ్మవారి నగరోత్సవం

చీమకుర్తి పట్టణంలో కనక దుర్గమ్మ నగరోత్సవం వైభవంగా సాగింది. విద్యుత్తు దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి చిత్రపటాన్ని కొలువుదీర్చి వేడుక ఆరంభించారు. హరిహర క్షేత్రం నుంచి సాక్షి రామలింగేశ్వర స్వామి దేవస్థానం వరకు ఊరేగింపు సాగింది. బాలికలు జ్యోతులతో ముందు నడిచారు. సర్వ మాలధారులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, చీమకుర్తి

ఉత్సాహంగా అండర్‌-17 ఫుట్‌బాల్ పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్‌-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు నరసరావుపేటలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలురకు డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం, బాలికలకు ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులు, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఐదు విభాగాల్లో 13 జట్లు పోటీపడుతున్నాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు ఎస్.సురేష్‌కుమార్, వి.పద్మావతి తెలిపారు. విజయనగరం, గుంటూరుతో తలపడిన ప్రకాశం జట్టు జయకేతనం ఎగురవేసింది.

ప్రకాశం – గుంటూరు బాలికల జట్ల మధ్య పోరు

నిరుపేద కుటుంబానికి అండ

ఒంగోలు నగరం, గ్రామీణం – న్యూస్‌టుడే: అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బిహార్ వాసి షేక్ దిల్దార్ కుటుంబానికి ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ అండగా నిలిచింది. బాధితుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు. ఆధారమైన వ్యక్తి ఆసుపత్రి పాలవ్వడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో సొసైటీ వారు రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలతో పాటు దుస్తులు, దుప్పట్లను ఆదివారం అందజేశారు. టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు షరూన్ హనీఫ్‌ఖాన్, సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌వలీ, షేక్ ఫరూక్, ఆయూబ్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేస్తున్న మైనార్టీ నాయకులు

జంగంకుంటపై అక్రమార్కుల కన్ను!

❖ వ్యర్థాలతో పూడ్చేసి ఆక్రమణకు యత్నం

న్యూస్‌టుడే – ఒంగోలు, చీమకుర్తి

ఒంగోలు – కర్నూలు రహదారిలో చీమకుర్తి బైపాస్ తూర్పువైపు కూడలిని ఆనుకొని ఉన్న జంగంకుంటపై కబ్జాదారుల కన్ను పడింది. గృహ నిర్మాణ వ్యర్థాలతో క్రమంగా పూడ్చేస్తూ ఆక్రమణకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. విలువైన ఈ భూమిని పరిరక్షించి కుంటను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించిన తరువాత ఆదిశగా చర్యలు లేకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు.

కుంటను పూడ్చేస్తూ వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

విలువైన స్థలం...

కీలకమైన కూడలి ప్రాంతంలో సర్వే నెంబరు-1లో సుమారు 60 సెంట్ల విస్తీర్ణంలో ఈ కుంట విస్తరించి ఉంది. ఇందులో దాదాపు పది సెంట్లు బైపాస్ రహదారి నిర్మాణంలో పోయింది. ఇక్కడ ఎకరం భూమి ధర రూ.కోటికి పైగానే పలుకుతుండడంతో... స్థలం ఆక్రమణకు గతంలో కొందరు ప్రయత్నించారు. దీంతో సర్వే నిర్వహించి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఆ మేరకు రెవెన్యూ వారు సర్వే చేపట్టి హద్దు రాళ్లు ఏర్పాటు చేసినా... ఫెన్సింగ్ పనులు చేపట్టలేదు. దీంతో కొందరు వ్యక్తులు రోజుకు కొద్దికొద్దిగా నిర్మాణ వ్యర్థాలను తెస్తూ కుంటను క్రమంగా పూడ్చేసి... ఆక్రమణకు యత్నిస్తున్నారు.

పార్కు ఏర్పాటుకు నిర్ణయించినా...

పేరుకు చీమకుర్తి పట్టణమైనా స్థానికులు సేద తీరేందుకు ఒక్క ఉద్యానవనమూ లేదు. ఈ నేపథ్యంలో కుంట స్థలంలో పార్కు ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు నిర్ణయించిన తరువాత కార్యాచరణ కొరవడింది. ఇప్పటికైనా స్థలం పరిరక్షణకు చొరవ చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య స్పందిస్తూ... కుంటను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నెప్పలి నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తాం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా నెలకొన్న మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన భారత నౌకాదళ దినోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఒంగోలులో అమర జవాన్ల స్తూపం, కమిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఇతర అంశాలపైనా చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎస్‌బీఐ ఆర్.ఎం. వి.శ్రీనివాసరావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి అబ్దుల్ రహీం, కల్నల్ పాలేటి రాంబాబు, సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కేంద్రం నుంచి సేవా పురస్కారం అందుకున్న ఏపీ యునైటెడ్ డిఫెన్స్ వెటరన్స్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ నెప్పలి నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

ప్రతిభ చాటిన పిల్లలతో గ్రంథాలయ సిబ్బంది

సందడిగా 'చదవడం... మాకిష్టం'

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమం సందడిగా సాగింది. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు సభ్యుడు రాసాని వెంకట రమణయ్య ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కథలు చెప్పడం, ఆటల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ సంపూర్ణ, కోటేశ్వరరావు, తిరుపతిరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 21 నుంచి 23 వరకు కాకినాడ జేఎన్‌టీయూలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ సీనియర్ ప్రతినిధి ఏపీ పుల్లారావు తెలిపారు. ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సంబరాల గోడప్రతులను ఆవిష్కరించారు. శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా విద్యార్థులకు ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జేవీవీ నాయకులు సీహెచ్.జయప్రకాష్, యు.వెంకటరావు, జి.శ్రీనివాసరెడ్డి, వి.మాలకొండారెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, ఎస్వీ.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

వాకర్స్‌కు ఉచిత వైద్య సేవలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ ఆధ్వర్యంలో... భాగ్యనగర్ పార్కు వాకర్స్ కోసం ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, ఈసీజీ, ఎముకల పటుత్వ పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ శిబిరాన్ని ప్రారంభించారు. ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, పార్కు కమిటీ ప్రతినిధి ఆళ్ల వెంకటేశ్వరరావు, నాగులుప్పలపాడు ఎంపీడీవో రవికుమార్, కాజా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

దంత సంరక్షణపై శ్రద్ధ అవసరం

మద్దిపాడు, న్యూస్‌టుడే: నటరాజ కళాకేంద్రంలో ఆదివారం ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. వరసిద్ధి వినాయక మెడికల్ షాపు వారు వాసవి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యుడు సందీప్ నేతృత్వంలో 216 మందికి సిబ్బంది పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. పితాని యష్, కాకుమాను అచ్యుత్, షేక్ అబ్దుల్ కలామ్, రెహమాన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **మద్దిపాడు:** వెల్లంపల్లి - తాళ్లూరు రహదారిలో గుంతలు పూడ్చేందుకు కంకర తోలి కుప్పలుగా పోసి వదిలేశారు. రాత్రి వేళ ఇవి కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.– జె.శ్రీనివాసరావు, తెల్లబాడు
✓: వెంటనే కంకరతో గుంతలు పూడ్పించి సమస్య పరిష్కరిస్తాం.
– వెంకటేశ్వరరెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ

?: **మద్దిపాడు:** సాయిబాబా ఆలయానికి వెళ్లే దారిలో వ్యర్థాలు పారబోస్తుండడంతో అటుగా రాకపోకలు సాగించేవారు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు.– ఎన్.సతీష్
✓: సిబ్బందిని పంపి ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపడతాం.
– నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

?: **మద్దిపాడు:** దొడ్డవరం పంచాయతీ తెల్లబాడు రహదారిలో గుంత తవ్వి వదిలేయడంతో సమస్యగా మారింది.– ఇ.సునీల్
✓:పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి గుంతను పూడ్పిస్తాం.
– పూనూరి సుబ్బారావు, సర్పంచి

?: **మద్దిపాడు:** గుండ్లకమ్మ జలాశయం కుడి కాలువలో మద్దిపాడు వద్ద జమ్ము, పూడిక పేరుకుపోయి ప్రవాహం సరిగా సాగడం లేదు.– నూనె శ్రీను
✓:ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– రామాంజనేయులు, జలాశయం ఏఈ

?: **ఒంగోలు అంజయ్య రోడ్డు:** శ్రీనివాస కాలనీలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. వెంటపడి తరుముతుండడంతో బయటకు రావాలంటేనే స్థానికులు భయపడుతున్నారు.
– సుబ్బారావు
✓: కుక్కలను పట్టించి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, టీకాలు వేస్తున్నారు. మీ ప్రాంతంలోనూ ఆ ప్రక్రియ చేపడతాం.
– బాబ్జీ, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్

దుమ్మూధూళి మధ్య స్వచ్ఛ వికాసం

❖ రాష్ట్ర స్థాయిలో ఆర్.ఎల్.పురం ఘనత

చెత్త సంపద కేంద్రంలోని ఎరువును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

న్యూస్‌టుడే – చీమకుర్తి

నిత్యం గ్రానైట్ వాహనాల రాకపోకలు, అనుబంధ పరిశ్రమల రణగొణధ్వనులతో నిండి ఉండే రాజుపాలెం లక్ష్మీపురం (ఆర్ఎల్‌పురం) పంచాయతీ... స్వచ్ఛత విషయంలో మాత్రం రాష్ట్రస్థాయిలో మిన్నగా నిలిచి పురస్కారం అందుకుంది. పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ, నిత్య పర్యవేక్షణతో ఇది సాకారమైంది.

ఉద్యానంలా చెత్త సంపద కేంద్రం...

మినీ గెలాక్సీపురిగా పిలిచే ఆర్ఎల్‌పురం పంచాయతీ చుట్టూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ గనులు, కర్మాగారాలు విస్తరించి ఉంటాయి. దీంతో గ్రామంలోకి వెళ్లే దారులన్నీ దుమ్మూధూళితో నిండి ఉంటాయి. ఊరిలోకి అడుగు పెట్టాక మాత్రం ఆహ్లాదకరమైన వాతావరణం స్వాగతం పలుకుతుంది. రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం సమకూరే పంచాయతీల్లో ఒకటి కావడంతో పక్కాగా స్వచ్ఛ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో డంపింగ్ యార్డు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మించారు. ఆ పరిసరాలను సైతం పచ్చదనంతో ఉద్యానంలా తీర్చిదిద్దారు.

పార్కును తలపిస్తున్న డంపింగ్ యార్డు పరిసరాలు

వ్యర్థాలతో అదనపు ఆదాయం...

చెత్త సేకరణకు అయిదుగురు హరిత రాయబారులు, మరో పాతిక మంది వరకు పంచాయతీ సిబ్బంది ఉన్నారు. వీరంతా రోజూ ఉదయాన్నే ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తారు. ఏరోజు వ్యర్థాలను ఆరోజే యార్డుకు తరలించి... తడి, పొడి, హానికారక చెత్తను వేరు చేస్తారు. తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి అవసరమైన రైతులకు విక్రయిస్తున్నారు. చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో కలెక్టరేట్ వద్దా అమ్మకాలు సాగిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వాటిని సేకరించే దుకాణాల వారికి విక్రయిస్తున్నారు. ఇలా అదనపు ఆదాయం పొందుతున్నారు. ఈ కారణంగానే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికై ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా... సర్పంచి విజయలక్ష్మి, కార్యదర్శి నరేంద్ర అవార్డు అందుకున్నారు.

మొంథా గుంతలు... కావాలి మరమ్మతులు

పేర్నమిట్టలో చెరువు సమీపంలో కర్నూలు రోడ్డులోని కల్వర్టు వద్ద పరిస్థితి ఇది. మొంథా తుపాను ప్రభావంతో కట్ట తెగి రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున నీరు ప్రవహించడంతో రహదారి అంచులు దెబ్బతిన్నాయి. పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వీటి మరమ్మతుల దిశగా చర్యలు లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ దగ్గరగా వచ్చేవరకు ఇవి కనిపించకపోవడం సమస్యగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఒంగోలు అర్బన్

వసతిగృహం షెడ్లకు మరమ్మతులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ కాలనీలోని బీసీ బాలుర వసతి గృహం షెడ్లకు మరమ్మతులు చేపట్టారు. రేకులు దెబ్బతిని వర్షాల సమయంలో కారుతుండడంతో పాటు... ఫ్లోరింగ్, స్నానాల గదులు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను కలిసి విజ్ఞప్తి చేశారు. వారు స్పందించి వసతి గృహం మరమ్మతులకు రూ.22 లక్షలు మంజూరు చేశారు. ఆ మొత్తంతో రెండు రోజులుగా పనులు చేపడుతున్నారు.

నారాయణస్వామి సన్నిధిలో భక్తుల రద్దీ

సి.ఎస్.పురం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు నారాయణ స్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. దేవస్థానంలో గోపూజ చేశారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకం, మహానివేదన, హారతి పూజలు జరిగాయి.

నిర్వహణ లోపం... వెన్నాడుతున్న భారం!

☛ అవసాన దశలో మద్దిపాడు మహిళా మార్టు

న్యూస్‌టుడే – మద్దిపాడు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమంటూ గత వైకాపా ప్రభుత్వం... డ్వాక్రా గ్రూపుల భాగస్వామ్యంతో మద్దిపాడులో ఏర్పాటు చేసిన మహిళా మార్టు అవసాన దశకు చేరింది. గతంలో పేరుకుపోయిన భారం, నిర్వహణ లోపంతో రోజువారీ మనుగడ సాగించడమూ కష్టంగా మారింది.

ఆర్భాటానికి పోయి...

2022లో మార్టును ప్రారంభించారు. మద్దిపాడు మండల పరిధిలోని 1,368 స్వయం సహాయక సంఘాల్లోని 13,680 సభ్యులను ఇందులో భాగస్వాములను చేశారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.200 చొప్పున మొత్తం రూ.25.02 లక్షలు సేకరించారు. ఇందులో దుకాణం ఇంటీరియర్‌కే రూ.16.50 లక్షలు వెచ్చించారు. దుకాణం అడ్వాన్స్‌గా రూ.లక్ష చెల్లించారు. అప్పటి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో ఆర్భాటంగా ప్రారంభించారు. ఇందుకోసం ఏకంగా రూ.1.50 లక్షల మేర ఖర్చు చేశారు. మిగిలిన మొత్తంతో సరకులు తెచ్చి విక్రయానికి పెట్టారు. ఆరంభ సమయంలో అక్కా చెల్లెమ్మల కళ్లలో ఆనందం చూడాలంటూ... రూ.60 వేల విలువైన వస్తువులు బహుమతిగా ఇస్తున్నట్లు నాటి ఎమ్మెల్యే టీజేఆర్ ఘనంగా ప్రకటించారు. ఆ మేరకు మార్టులోని నూనె ప్యాకెట్లను మహిళలకు పంపిణీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా... తరువాత ఆయన ఆ మొత్తం చెల్లించకపోవడంతో భారమంతా మార్టుపైనే పడింది.

జీతాలు ఇవ్వలేని దుస్థితి

ప్రస్తుతం దుకాణం అద్దె, విద్యుత్తు బిల్లు, సిబ్బంది జీతాలు, ఇతరత్రా నిర్వహణకు నెలకు రూ.60 వేలు అవసరమవుతోంది. ఆ మేరకు ఆదాయం రాకపోవడంతో సిబ్బందికి వేతనాలు సక్రమంగా చెల్లించలేని దుస్థితి నెలకొంది. అమ్మకానికి అవసరమైన సరకులు తెచ్చేందుకూ అవస్థలు పడాల్సి వస్తోంది. ఇటీవల మార్టును సందర్శించిన రాష్ట్ర సెర్ప్ అధికారులు ఈ అంశాలను గుర్తించారు. మూతపడే దశలో ఉన్న మార్టును నిలబెట్టేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలని సభ్యులు విన్నవిస్తున్నారు.

మార్టులో క్రయవిక్రయాల వివరాలను పరిశీలిస్తున్న సెర్ప్ అధికారులు

విద్యుత్తు పనులు... ఇష్టారాజ్యం

సంతనూతలపాడు మండలం చంద్రపాలెంలో విద్యుత్తు సరఫరా మెరుగుకు చర్యలు తీసుకున్నారు. తక్కువ ఎత్తులో ఉన్న స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... అడ్డదిడ్డంగా పనులు సాగించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన మార్గంలో రెండు చోట్ల ఏకంగా కాలువ మధ్యలో స్తంభాలు వేయడంతో... మురుగు ప్రవాహం ఎలా సాగుతుందని, శుభ్రత పనులు ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులూ పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, సంతనూతలపాడు

(c) eenadu

ఖో కొడితే పతకమే

న్యూస్‌టుడే, నెల్లూరు (క్రీడా విభాగం)

మైదానంలో అడుగుపెడితే.. ప్రత్యర్థికి చెమటలే. ఏ జట్టులో ఉంటే అది విజయం సాధించాల్సిందే. జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాదు.. జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించి 'ఖో' అంటూ పతకాలు సాధిస్తూ గుర్తింపు నిలుస్తున్నాడు.. నగరానికి చెందిన ఆషిష్ కమల్.

ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించి దేశానికి పేరు తీసుకురావడమే లక్ష్యమని చెబుతున్నాడు. ఆషిష్ కమల్.

● నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఆషిష్.. ఖో-ఖో క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నాడు. పోలీసు శాఖలో ఆర్‌ఐగా పనిచేస్తున్న పాల్ రాజు, పావని దంపతుల కుమారుడే ఈ యువకుడు. చిన్నప్పటి నుంచే ఖోఖో అంటే ఇష్టం.. అదే ఇష్టం అతనికి ఆసక్తిగా మారింది. తల్లిదండ్రుల సహకారం, కోచ్ సుకుమార్ ప్రోత్సాహంతో క్రీడలో మెలకువలు నేర్చుకున్నాడు. ఇప్పటి వరకు రెండుసార్లు జాతీయస్థాయి, నాలుగు దఫాలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. 2022లో మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో, ఈ ఏడాది అక్టోబరులో కర్ణాటకలో జరిగిన సీనియర్ సౌత్‌జోన్ జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొని కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాడు.

కాలినడక.. అడుగు పడక..

అధ్వాన రహదారికి దిత్వా తుపాన్ తోడైంది.. ఇసుక లారీల రాకపోకలతో అధ్వానంగా మారింది. సంగం నుంచి సిద్ధిపురం గ్రామం తోపాటు వ్యవసాయ భూములకు వెళ్లే దారిపై ఇసుక రీచ్ నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అభివృద్ధికి దూరంగా గుంతలతో ఉన్న మట్టి రోడ్డు ఇటీవలి వర్షాలకు బురదమయమైంది. దానిమీద భారీ బరువుతో ఇసుక లారీలు వెళ్లడంతో కర్షకులు కనీసం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. -న్యూస్‌టుడే, సంగం

వృత్తి శిక్షణ.. భవితకు రక్షణ

ఖైదీల జీవనోపాధికి చొరవ

"తెలిసీ తెలియక తప్పులు.. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలతో కొందరు జైలు జీవితం గడుపుతూ.. పశ్చాత్తాప పడుతుంటారు. శిక్ష అనంతరం జీవనోపాధి ఇబ్బందులు ఎదుర్కోకుండా చేతివృత్తులు నేర్పిస్తూ వారి కాళ్లమీద వారు నిలబడేలా తీర్చిదిద్దుతున్నారు.. జైలు అధికారులు."

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

సుడాల్ కంపెనీ పేరుతో జిల్లా కేంద్ర కారాగారంలో తయారయ్యే కొబ్బరినూనె, షాంపులు, టూత్‌పేస్ట్, టాయిలెట్ క్లీనర్, సెంటెడ్ ఫినాయిల్ రాష్ట్రంలోని 68 జైళ్లలో ఉండే ఖైదీలకు సరఫరా చేస్తున్నారు. ఏషియన్ పెయింట్స్‌తో నెల్లూరు కేంద్ర కారాగారం ఒప్పందం కుదుర్చుకుంది. మూడు దఫాలుగా ఖైదీలకు పెయింటింగ్ శిక్షణ పూర్తయింది. సర్టిఫికెట్‌తో కూడిన శిక్షణ తీసుకున్న వారికి ప్రత్యేకంగా పేరుతో పాటు కిట్ వస్తుంది. తాజాగా జాగ్వార్ కంపెనీతో ఒప్పందం జరిగింది. ప్లంబింగ్‌లో కంపెనీ ప్రతినిధులు ఖైదీలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి కంపెనీయే ఉద్యోగావకాశాలు కల్పించనుంది.

35 ఎకరాల్లో నర్సరీ

కేంద్ర కారాగారంలో 35 ఎకరాల భూమి ఉంది. ఇక్కడ నూతనంగా నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మామిడి మొక్కలు నాటారు. ఇప్పటికే కారాగారంలో పండించిన కూరగాయలు విక్రయిస్తున్నారు.

కారాగారంలో టైలరింగ్ శిక్షణ

ప్రారంభించనున్న పవర్ కోటింగ్ యంత్రం

కేంద్ర కారాగారంలో స్టీల్ ఫర్నిచర్ యూనిట్ ఉంది. విద్యాసంస్థలు, కార్యాలయాలకు స్టీల్ కుర్చీలు, బెంచీలు కావాలంటే ఇక్కడి నుంచే సరఫరా చేస్తుంటారు. తయారీలో ఫినిషింగ్ రాకపోవడంతో చాలా మంది మొంటుగా ఉందంటూ చెప్పడంతో జైళ్లశాఖ డీఐజీ ఎం.వరప్రసాద్ చొరవతో కారాగారానికి పవర్ కోటింగ్ యంత్రాన్ని మంజూరు చేయించారు. దీని ద్వారా ఎంఎన్‌సీ కంపెనీలు మాదిరి ఉత్పత్తులు తయారు చేయవచ్చు. త్వరలో దీన్ని ప్రారంభించనున్నారు.

సత్ప్రవర్తనతో మెలిగితే.. భవిష్యత్తు

ఎంఎన్‌సీ కంపెనీలతో కారాగారంలో శిక్షణ అందిస్తున్నాం. ఇది ఖైదీలకు ఎంతో ఉపయోగపడుతోంది. శిక్షణలో మంచి ఫలితాలు చూపితే కంపెనీ వారే నేరుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. సత్ప్రవర్తనతో మెలిగితే భవిష్యత్తు ఉంటుంది. - డాక్టర్ వి. సన్యాసిరావు, సూపరింటెండెంట్, కేంద్ర కారాగారం

కేంద్ర కారాగారంలో ఖైదీలు: 973 మంది | మహిళలు: 30 | జీవిత ఖైదీలు: 250 | రోజువారి కూలీ చేసే వారు: 430

ప్రసన్నా.. పాలకవర్గమేదీ!

న్యూస్‌టుడే, బిట్రగుంట: మండలంలోని బిలకూట క్షేత్రం కొండ బిట్రగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అడుగులు పడటం లేదు. మరోవైపు వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఆలయానికి రెండేళ్లుగా పాలకవర్గం లేదు. బ్రహ్మోత్సవాల సమయంలో తాత్కాలికంగా ఉత్సవ కమిటీ నియమిస్తున్నారు. ఇక్కడ భక్తుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. అంతేకాదు.. అర్చకులు, సిబ్బంది లేరు. సుమారు రూ.10కోట్లతో చేపట్టిన 8 పనులు బ్రహ్మోత్సవాల లోపే పూర్తయ్యేలా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఈవో రాధాకృష్ణ ఉన్నారు. ఉత్సవాలకు 90 రోజుల సమయం మాత్రమే ఉంది. పాలకవర్గం లేకపోవడంతో అతిథులు, దాతలు, భక్తులకు సౌకర్యాల కల్పన వంటివి భారంగా మారుతున్నాయి. ఏటా రూ.1.50 కోట్లకు పైగా ఆదాయం వస్తున్న ఆలయానికి కేవలం ఈవో, ఇద్దరు ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు. పైగా ఆరుగురు ఒప్పంద ఉద్యోగులను నియమించుకోవాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ అనుమతులు ఉన్నా ఆ ప్రక్రియ జరగలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని బ్రహ్మోత్సవాల లోపు పాలక మండలి నియామకంతోపాటు ఉద్యోగులను నియమించాలని భక్తులు కోరుతున్నారు.

మొంథా.. నిధుల స్వాహాకు పంథా..

ఉత్తుత్తి పనులతో కాజేసేందుకు పన్నాగం

న్యూస్‌టుడే, సంగం

మొంథా తుపాన్ కారణంగా ఏర్పడిన వరద నష్టాలకు మరమ్మతుల పేరిట నిధులు మింగేందుకు రంగం సిద్ధమైంది. సంగం మండలంలో జలవనరుల శాఖ పరిధిలో 67 పనులకు కలెక్టర్ రూ.2.6 కోట్లతో పరిపాలనామోదం ఇచ్చారు. జాబితా పరిశీలిస్తే పనులు చేయకనే చేసినట్లు చూపేందుకు ప్రణాళికతో ఉన్నట్లు తెలిసింది.

నీరుంటే కాలువ పూడిక ఎలా..

సంగం ఆనకట్ట నుంచి కనిగిరి జలాశయానికి సాగునీటి సరఫరాకు అయిదువేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన 9 కి.మీ. పొడవైన కాలువ తవ్వారు. నాటి నుంచి నేటి వరకు పూడిక కారణంగా సాగునీటి సరఫరా సమస్యలు తలెత్తిన పరిస్థితి లేదు. ప్రస్తుతం అందులో 1.8 కి.మీ నుంచి 8.1 కి.మీ వరకు మొంథా తుపాన్‌తో ఇసుక తిన్నెలు ఏర్పడ్డాయని, వాటిని తొలగించేందుకు సుమారు రూ.30 లక్షలతో ఆరు భాగాలుగా పనులు ప్రతిపాదించారు. తుపాన్ కారణంగా కాలువకి సంగం బ్యారేజీ నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. ఈ పరిస్థితుల్లో ఎలా పూడిందో అధికారులకే తెలియాలి.

కనిగిరి జలాశయం ప్రధానకాలువలో సాగునీటి ప్రవాహం

బీరాపేరులో ఇసుక తిన్నెల తొలగింపా?

గత అక్టోబరు 29న సుమారు 20 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం బీరాపేరు వాగులోకి రాగా.. సుమారు 100 టన్నుల బరువైన పడవలు సంగం ఆనకట్ట వద్దకు కొట్టుకొచ్చాయి. వాగులో ఇసుక తిన్నెలు అడ్డుగా ఉన్నాయని, వాటిని తొలగించేందుకు రూ.9.75 లక్షలకు ఆమోదం పొందారు. వాస్తవంగా మంత్రి ఆనం సూచనతో రూ.20 వేలతో గుర్రపు డెక్క తొలగించారు. అక్కడ ఇసుక తిన్నెలే లేవు. ప్రస్తుతం పూడిక తొలగింపు పేరుతో సొమ్ము చేసుకునే ప్రయత్నం చేశారని విమర్శలు ఉన్నాయి.

నష్టం జరగకపోయినా..

మక్తాపురం వద్ద పెన్నానది ఎడమ వైపు గట్టు వరద ప్రవాహానికి దెబ్బతినిందంటూ మరమ్మతులకు రూ.4.9లక్షలు ప్రతిపాదించారు. అక్కడ ఎటువంటి నష్టం జరగలేదు. దువ్వూరు చెరువు నింపేందుకు ఎగువ నుంచి కాలువ ఉంది. జలవనరుల శాఖాధికారులు సంగంలో దిగువ నుంచి కూడా అటువంటి కాలువ ఉందని, అందులో పూడిక తొలగించాలని ప్రతిపాదించడం గమనార్హం. కనిగిరి జలాశయం కాలువ ప్రధాన రెగ్యులేటరులో ఇటీవల షట్టరు దెబ్బతినింది. దాన్ని మార్చితే సరిపోతుంది. ప్రస్తుతం రెండు రెగ్యులేటర్ల మరమ్మతులకు రూ.9.75లక్షలు కేటాయించడం గమనార్హం.

● పనుల విషయమై జలవనరుల శాఖ ఏఈ వినయ్‌కుమార్‌తో మాట్లాడగా కొన్ని పనుల్లో అచ్చుతప్పులు ఏర్పడ్డాయని, మిగిలిన పనులు అన్నీ సంపూర్ణంగా చేయిస్తామని తెలిపారు.

దీపం.. దిక్సూచి

ఆంగ్లేయుల పాలనలో ఏర్పాటైన దీపస్తంభాలు (లైట్ హౌస్) సముద్ర ప్రయాణికులకు గమ్యాన్ని నిర్దేశించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఉలవపాడు మండలం రామాయపట్నంలో దీప స్తంభాన్ని 1980లో నిర్మించారు. ఇందులోని దీపం పది సెకన్లకోసారి తిరుగుతూ ఉంటోంది. దీని వెలుగు సుమారు 46 కి.మీ. దూరం కనిపిస్తుంది. బంగాళాఖాతంలో రాకపోకలు చేసే ఓడలు వెలుగును చూసి ఏ తీరంలో ఉన్నామో తెలుసుకుంటారు. దీపస్తంభం చుట్టు పక్కల ప్రాంతాల వారికి పర్యాటక ప్రదేశంగా మారింది. సాయంత్రం మూడు నుంచి 5 గంటలవరకు సందర్శకులను అనుమతిస్తారు. ఆ సమయంలో లైట్‌హౌస్ పై భాగానికి ఎక్కొచ్చు.

– న్యూస్‌టుడే, ఉలవపాడు

నీటిలోనే నారుమడి.. రైతు కంటతడి

న్యూస్‌టుడే, నెల్లూరు(వ్యవసాయం)

రబీ ప్రారంభంలోనే దిత్వా తుపాను రైతులను కన్నీరు పెట్టించింది.. నారుమడులు, నాట్లు నీళ్లపాలయ్యాయి. మళ్లీ వ్యవసాయ పనులు చేపట్టాల్సి రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విత్తనం కోసం కర్షకులు అన్వేషణ ప్రారంభించి.. ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది రబీలో 4లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా. నారుమడుల సాగుతోపాటు నాట్లు వేయడంలో రైతన్నలు తలమునకలయ్యారు. ఈ క్రమంలో తుపాన్ వారి ఆశలపై నీళ్లు చల్లింది. ఈనెల 4వ తేదీ నాటికి 19 మండలాల్లోని 183 గ్రామాల్లో 4,135 ఎకరాల్లో నారుమడులు, 14,065 ఎకరాల్లో వరినాట్లు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలు తయారు చేసింది.

నీటిలోనే నారుమడులు

తీరని నష్టం..

ఎకరాకు అవసరమైన వరినారుకు 30కేజీల విత్తనాలకు రూ.1100, 5కేజీల రసాయన ఎరువులు తదితర ఖర్చులు ఇలా.. మొత్తంగా రూ.1800, వరి నాట్లు వేసేందుకు గట్ల ఏర్పాటుకు రూ.6300, దుక్కి చేసేందుకు రూ.6వేలు, ఎరువులకు రూ.1800 ఖర్చయింది. తుపాను కారణంగా నారుమడులు, నాట్లు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు.

విత్తనం, నారుకు తప్పని తిప్పలు

ఈ ఏడాది ఎక్కువగా కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 వరి రకాలు సాగు చేపట్టారు. తుపాను కారణంగా నారుమడులు దెబ్బతినడంతో మళ్లీ నాట్లు వేసేందుకు అవసరమయ్యే నారు కోసం మడులు తయారు చేయాల్సి వచ్చింది. ఇందుకోసం విత్తనాలు అవసరమయ్యాయి. మళ్లీ వరిపైరు సాగుకు విత్తనం, నారు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 11052.6 క్వింటాళ్ల కేఎన్ఎం, 4236.1 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ రకం విత్తనాలు అవసరమవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అంటే 40 వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు సరిపడా నారును సిద్ధం చేయవచ్చు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి పంట నష్టం గణనకు ఇంకా అనుమతి రాలేదు. దీంతో సాయం అందడంపై మీమాంస నెలకొంది.

● వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాం. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి తెలిపారు.

మెగా జాబ్‌మేళా రేపు

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 9న ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు నగరంలోని వీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్టడీస్, వైఎంసీఏ గ్రౌండ్, వీఆర్సీ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం ప్రకటనలో పేర్కొన్నారు. మేళాలో 15 కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తాయని తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ చదివిన వారు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 63016 28681, 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ కిచెన్‌లు

విద్యార్థులకు నాణ్యమైన, రుచికర ఆహార పదార్థాలు

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య): విద్యాశాఖలో ఇప్పటికే పలు కీలక మార్పులు తెచ్చిన కూటమి ప్రభుత్వం- తాజాగా స్మార్ట్ కిచన్ల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. మంత్రి లోకేశ్ ఆదేశాలతో.. అందుకు అనుకూలమైన పాఠశాలల నుంచి ప్రతిపాదనలు కోరారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ ఆయా వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు.

మొదటి విడత 16 మండలాల్లో...

కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు, కలిగిరి, కందుకూరు, ఉలవపాడు తదితర 16 మండలాల్లోని పాఠశాలల క్లస్టర్ కేంద్రాల్లో విశాలమైన స్థలం ఉన్నచోట స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేయనున్నారు. వీటిల్లో వండిన ఆహార పదార్థాలను ఆయా మండలాల్లో తక్కువ దూరంలో ఉన్న 817 పాఠశాలలకు అందిస్తారు. తద్వారా 48,387 మంది విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన వేడి వేడి ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి. ● దీనిపై డీఈవో ఆర్.బాలాజీరావు మాట్లాడుతూ.. విద్యాశాఖ ఆదేశాల మేరకు మొదటి విడత జాబితా ఉన్నతాధికారులకు పంపించాం.

ఓటరు కార్డులో చేర్పులా.. ఇలా చేసుకోండి

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

ఓటరు కార్డు ఎన్నికల సమయంలోనే ఉపయోగపడుతుందని అందరూ భావిస్తారు. కానీ దాన్ని వ్యక్తిగత గుర్తింపు కార్డుగానూ వినియోగించుకోవచ్చనే విషయం చాలా మందికి తెలియదు. నగరం, పట్టణాల్లో అద్దెకు ఉండేవారు తరచూ ఇళ్లు మారుతుంటారు. వీరు ఆ కార్డులో చిరునామా మార్చుకోవాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుగా దాని ప్రాధాన్యం తెలిసిన వారు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటారు. అందులోని చిరునామా (ఫారం-8)ని మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఒకప్పుడు ఎన్నికల సంఘం నిర్ణీత సమయాల్లోనే అనుమతించేది. తాజాగా ఆన్‌లైన్ (ఓటర్స్ సర్వీస్ పోర్టల్) ద్వారా ఎప్పుడైనా మార్చుకునే వెసులుబాటు కల్పించింది.

మార్పు ఇలా..

ఆన్‌లైన్‌లో ఓటరు కార్డు చిరునామా మార్చుకునేందుకు ఆధార్, పాస్‌పోర్టు, పాన్‌కార్డు తదితర గుర్తింపు కార్డులు అనుమతిస్తారు. ఆధార్‌కార్డులో పేరు ఎలా ఉందో అలాగే ఓటరు కార్డులోనూ ఉండాలి. చిన్నపాటి మార్పులు ఉన్నా. . తీసుకోదు. ఆన్‌లైన్‌లో ఫారం-8 పూర్తి చేసిన తర్వాత చివరిలో ఓటీపీ వెరిఫికేషన్ ఈ-సైన్ చేయాల్సి ఉంది. దాన్ని క్లిక్ చేయగానే పేరులో మార్పు ఉంటే దరఖాస్తు తిరస్కరణ అవుతుంది. అదే విధంగా పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నా తీసుకోదు. పేరులో తేడా ఉంటే ముందే సరి చేసుకుని తర్వాత చిరునామా మార్చుకోవాలని చెబుతుంది. పేరులో తేడా ఉంటే.. సమీపంలోని బీఎల్వోను సంప్రదించాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు తిరస్కరణకు గురైతే..

దరఖాస్తు తిరస్కరణకు గురైన వారు వెంటనే స్థానిక బూత్‌లెవల్ అధికారిని సంప్రదించాలి. వారు తమ ప్రాంత సచివాలయంలో ఉన్న బీఎల్వోను సంప్రదించి చిరునామా మార్పునకు తగిన పత్రాలు ఇస్తే ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూరించి చిరునామా మారుస్తారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జరుగుతోంది. ఆఫ్‌లైన్‌లో చిరునామా మార్చుకోవాలంటే ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే ఓటరు కార్డులో మారుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకుంటే గుర్తింపు కార్డుగా ఉపయోగించుకోవచ్చని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

ఏదీ నాణ్యత.. ఎవరిది బాధ్యత?

న్యూస్‌టుడే, కావలి : రోడ్డు నిర్మాణ పనుల్లో ప్రమాణాలకు పాతరేయడంతో మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. పోరాటాల ఫలితంగా కావలి- తుమ్మలపెంట రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణ సహాయ పథకం కింద రూ.14.76 కోట్లతో 8.3 కి.మీ. పొడవున రోడ్డు పనులు ప్రారంభించారు. ఇవి ఇంకా పూర్తి కాలేదు. రహదారి మార్జిన్లకు గ్రావెల్ వినియోగించాలి. చెంతనే సముద్రం ఒడ్డున లభించే తువ్వ ఇసుకను కొంత ప్రాంతం నింపడంతో ఇటీవలి వర్షాలకు ఇసుక కొట్టుకుపోయి తారురోడ్డు కంకర లేచిపోయింది. ప్రస్తుతం ఇరువైపులా మార్జిన్లు దెబ్బతినడంతో మధ్యలో ఉన్న రహదారి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

దెబ్బతిన్న రహదారి మార్జిన్

గుత్తేదారుదే బాధ్యత

పనులు పూర్తై చివరి బిల్లులు చెల్లించే వరకు గుత్తేదారుడిదే బాధ్యత. దెబ్బతిన్న మార్జిన్లు గుత్తేదారుడితో తిరిగి నిర్మించేలా చేస్తాం.

– చక్రధర్, డీఈఈ, ర.భశాఖ, కావలి

గర్భిణులకు వరం.. మాతృవందనం

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే, : ప్రధాన మంత్రి మాతృవందన యోజన పథకం గర్భిణులకు వరంగా మారింది. అర్హులైన వారు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుంటే పథకం వర్తిస్తుంది. మొదటి ప్రసవానికి రూ.5వేలు, రెండో ప్రసవానికి రూ.6వేలు అందజేస్తారు.

అంగన్‌వాడీల ఆధ్వర్యంలో..

పథకం కింద లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గర్భిణులకు పథకం ద్వారా నగదు, పోషకాహారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో అందిస్తారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ గతంలో వైద్యారోగ్యశాఖ నిర్వహించేది. ప్రస్తుతం ఈ బాధ్యతలను ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు ప్రభుత్వం అప్పగించింది. గర్భిణిగా నమోదైన 5నెలల్లోపు రూ.2వేలు, అన్ని రకాల టీకాలు వేయించుకుని, వైద్య పరీక్షలు చేయించుకుంటే 9నెలలలోపు మరో రూ.2వేలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగితే రూ.1000 అందజేస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే. . పుట్టిన మూడున్నర నెలల తర్వాత మొత్తం రూ.6వేలు బాలింత వ్యక్తిగత ఖాతాలో జమ చేస్తారు.

వీరు అర్హులు..

తెల్లరేషన్ కార్డుదారులంతా అర్హులు. గర్భిణులకు 18 ఏళ్ల 7నెలల వయసు నిండితేనే పథకం వర్తిస్తుంది. పోషణ్ ఖాతాలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది, అర్హులు బ్యాంకు ఖాతాలకు ఆధార్, ఫోన్ నంబర్లు లింక్ చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా నాలుగు నెలల్లో వేలాది మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు ఐసీడీఎస్ గణాంకాలు చెబుతున్నాయి.

6 కేంద్రాల్లో టెట్

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో ఆరు కేంద్రాల్లో ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు టెట్ జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రానికి ముందుగా చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

మద్యం మత్తులో యువకుల కిరాతకం

సిటీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై బ్లేడుతో విచక్షణారహితంగా దాడి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే

మద్యం మత్తులో యువకులు కిరాతకులుగా మారారు. విచక్షణ కోల్పోయారు. బైకులపై వెంబడించారు. నడిరోడ్డులో సిటీ బస్సులో ఎక్కారు. ప్రయాణికుల సమక్షంలోనే వీరవిహారం చేశారు. డ్రైవర్, కండక్టర్‌పై బ్లేడ్లతో దాడి చేసి గాయపరిచారు. సంచలనం సృష్టించిన ఈఘటన ఆదివారం నెల్లూరులోని బోసుబొమ్మ కూడలిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. ఎస్ఏఎస్ సిటీ బస్సు సర్వీసులో నెల్లూరు గ్రామీణ మండలంలోని మహాత్మాగాంధీనగర్‌కు చెందిన మన్సూర్ డ్రైవరుగా, ఇందుకూరుపేటకు చెందిన సలాం కండక్టరుగా పనిచేస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు బాబు ఐస్‌క్రీమ్ వద్ద రోడ్డుపై బైక్‌లు నిలిపి మాట్లాడుకుంటున్నారు. ఆ మార్గంలో వస్తున్న బస్సుకు బైక్‌లు అడ్డం తీయాలని డ్రైవరు హారన్ కొట్టినా వారు పట్టించుకోలేదు. దీంతో డ్రైవరు, యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. వారు దుర్భాషలాడగా.. డ్రైవరు బస్సు దిగి ద్విచక్ర వాహనాల్లో ఒకదాని తాళం తీసుకుని వెళ్లిపోయారు. మద్యం మత్తులో ఉన్న యువకులు మరో వాహనంపై వెంబడించి బోసుబొమ్మ వద్ద అడ్డుకున్నారు. లోపలకు వచ్చి డ్రైవరు, కండక్టర్‌పై బ్లేడ్లతో దాడి చేసి పరారయ్యారు. బస్సు మొత్తం రక్తంతో తడిసిపోయింది. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం పలువురు ఆసుపత్రికి తరలించారు. ఈఘటనతో ప్రయాణికులు వణికిపోయారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులు నగరానికి చెందిన మదన్, అతని స్నేహితులుగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో అయిదుగురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో జి. అజయ్, ఆర్. నితిన్, ఎన్. తేజను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ గిరిధర్ తెలిపారు.

గాయాలతో ఉన్న డ్రైవరు.. చికిత్స పొందుతున్న కండక్టర్

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
THE EENADU WAY CLASSIFIEDS
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

అధికారులూ... పట్టించుకోరేం..!

ఇటీవల కురిసిన వర్షాలకు తోటపల్లిగూడూరు మండల కార్యాలయ ఆవరణం దుర్గంధమయంగా మారింది. వర్షపునీరు నిల్వ చేరి అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఒకే ఆవరణలో మండల పరిషత్తు, తహసీల్దారు, డ్వాక్రా కార్యాలయాలతో పాటు మహిళా బ్యాంకు ఉంది. నిత్యం వందల సంఖ్యలో పలు సమస్యలపై ప్రజలు కార్యాలయాలకు వస్తున్నా.. అన్ని శాఖల అధికారులు చూస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా శుభ్రంగా ఉండేలా చూడాలని పలువురు విన్నవిస్తున్నారు. –న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ప్రమాదాలు జరుగుతున్నా స్పందించరా..

సోమశిలలోని బస్టాండ్ సెంటర్ వద్ద గల ప్రాథమిక పాఠశాలలో 84 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు వచ్చే ముఖ ద్వారం వద్ద మురుగు కాలువ నిర్మించారు. కొంత మేరకు మాత్రమే సిమెంట్ పనులు చేసి వదిలేశారు. నిత్యం రాకపోకలు సాగించే చిన్నారులకు తెలియక కాలువలో పడి గాయాలబారిన పడుతున్నారు. కళ్లెదుట సమస్య కనిపిస్తున్నా పట్టించుకోకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బండరాళ్లు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, అనంతసాగరం

అధ్వానం.. అనుసంధాన మార్గం

నగరంలోని హరనాథపురంలో ముత్తుకూరు రోడ్డు నుంచి జాతీయ రహదారికి వెళ్లే అనుసంధాన మార్గం అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు పెద్దవి కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో స్థానికులు భవన నిర్మాణ వ్యర్థాలు, మట్టి పోశారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

కోనేరు.. ఇదేం తీరు

బుచ్చిరెడ్డిపాలెంలోని పురాతన శ్రీ కోదండరామస్వామి ఆలయం పక్కనే ఉన్న కోనేరు నిర్వహణను విస్మరించడంతో మురికికూపంలా తయారైంది. ఆలయం నుంచి కోనేరుకు వెళ్లే మెట్ల మార్గంలో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. గట్టు మందుబాబులకు అడ్డాగా తయారైంది. పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

–ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, బుచ్చి

పదోతరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా 100 రోజుల ప్రణాళిక అమలుచేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు పేర్కొన్నారు. ఇందుకు ఉప, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిరోజు బోధనకు యాక్షన్ ప్లాన్ తయారుచేయాలన్నారు. విద్యార్థులకు రోజు వారీ నిర్వహించే పరీక్షల్లో వచ్చిన మార్కులను మీ మార్క్‌లో నమోదు చేయాలని, వీన్ని ప్రధానోపాధ్యాయులు, ఉప, మండల విద్యాశాఖాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బీఎల్వో విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: బీఎల్వో విధుల నుంచి గ్రామ సర్వేయర్లకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర సర్వే ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు రాము కోరారు. ఆదివారం నెల్లూరులోని ఆ సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రీసర్వేకు సంబంధించిన టీఏ, డీఏ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి వీఎస్ నవీన్, జాయింట్ సెక్రటరీ ముని రామకృష్ణ, ట్రెజరర్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం గౌరవాధ్యక్షుడు రాము

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా సుదర్శనం

కావలి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడిగా ఎం.సుదర్శనం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నెల్లూరులో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో భాగంగా ఆయనను సభ్యులు ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆయన కావలి మండలం రుద్రకోట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ రహదారులపై రక్తపాతం

న్యూస్‌టుడే, సంగం, బుచ్చిరెడ్డిపాళెం

కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ(మోర్త్) జాతీయస్థాయిలో ఈ ఏడాది జరిగిన ప్రమాదాలు తీరుతెన్నులను పరిశీలించి టాప్ 100 జిల్లాలను గుర్తించగా.. నెల్లూరు జిల్లా 75వ స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో పరిశీలిస్తే జిల్లాలో ఎక్కువ మంది మృతిచెందారు. రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్న ఐదు జిల్లాల్లో ఒకటిగా నెల్లూరు జిల్లాలో రాష్ట్ర సగటు కన్నా ఎక్కువగా చోటు చేసుకున్నాయని సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రహదారి భద్రత మండలి సమావేశంలో ఇటీవలే వెల్లడైంది. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయరహదారులపై 42 శాతం ప్రమాదాలు జరిగితే జిల్లాలోనే యాభై శాతం వరకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన వాహనం

రెండేళ్లలో 1588 సంఘటనలు పరిశీలిస్తే మృతుల్లో 42శాతం మంది ఇక్కడి వారే ఉండడం దురదృష్టకరం.

జాతీయ స్థాయిలో జిల్లాకు 75వ స్థానం.. మరణిస్తున్న వారిలో రాష్ట్రంలోనే ప్రథమం!

ప్రాణాంతక రహదారులు..

జిల్లాలో కోల్‌కతా-చెన్నై, నెల్లూరు-ముంబయి, వెంకటగిరి-పామూరు, సీతారామపురం-దుత్తలూరు జాతీయరహదారులపై ప్రమాదాలు గణనీయంగా చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్ర రహదారుల్లోనూ ఇదే విధంగా ఉంది. నెల్లూరు-ప్రకాశం జిల్లా అనుసంధానంగా ఉన్న సంగం-కలిగిరి రహదారిలో సంగం సమీపంలో ప్రమాదకర మలుపు వద్ద లెక్కకు మిక్కిలిగా ప్రమాదాలు జరుగుతున్నా పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామాలకు మధ్య వెళుతున్న జాతీయ రహదారుల్లో పైవంతెనలు లేకపోవడమే ప్రధాన కారణమని అధికారులు గుర్తించారు.

రెండేళ్లుగా జరిగిన ప్రమాదాల వివరాలు

రహదారి	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
జాతీయరహదారి	806	515	894
రాష్ట్రరహదారి	286	129	298
ఇతర	496	245	440

వాహనాల వారీగా ప్రమాదాలు...

ద్విచక్రవాహనాలు	504
కారు లైట్ వాహనాలు	316
లారీ	259
ఆటో	161
గుర్తుతెలియనివి	134
ఆర్టీసీ	53
ప్రైవేట్ బస్సులు	39
ట్రాక్టర్లు	79
ఇతర	43

ప్రభుత్వ నిర్ణయాలు అమలైతే ప్రమాదాలకు చెక్..

రహదారి భద్రత మండలి సమావేశంలో అతివేగాన్ని నియంత్రించేందుకు వాహనాల్లో స్పీడ్ గవర్నర్ ఏర్పాటు చేయాలని, వేగాన్ని ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రతి అరకిలోమీటరు పరిధిని కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించారు. అతి వేగంతో వెళ్లే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. సేవ్‌లైఫ్ ఫౌండేషన్ సంస్థ అధ్యయనం మేరకు మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, అతివేగం కారణాలుగా గుర్తించింది. వాహన సామర్థ్యానికి మించి రవాణా చేస్తే కేసులతో అరికట్టాలని, డ్రైవర్లకు శిక్షణ ఇప్పించాలని సూచించింది. ట్రామాకేర్ సెంటర్లను బలోపేతం చేయాలని, బ్లాక్‌స్పాట్లను సరిచేయాలని, సత్వర రక్షణ ఏర్పాట్లు చేయాలని పేర్కొంది. జాతీయ రహదారుల్లో మద్యం దుకాణాలు లేకుండా కట్టడి చేయాలని సూచించింది.

జిల్లాలో వివిధ మార్గాల్లో బాక్‌స్పాట్లు 76 | జాతీయ రహదారుల్లో 54 | రాష్ట్ర రహదారుల్లో 32

సివిల్ సర్వీస్ శిక్షణకు అర్హత పరీక్ష

పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నిరుద్యోగ యువతకు ఇచ్చే సివిల్ సర్వీస్ ఉచిత శిక్షణకు ఆదివారం నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో అర్హత పరీక్ష నిర్వహించారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన వారు 46 మంది దరఖాస్తు చేసుకోగా 39 మంది హాజరయ్యారని బీసీ వేల్ఫేర్ జిల్లా అధికారిణి వెంటలక్ష్మమ్మ తెలిపారు.

ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర కార్యవర్గం ఎంపిక

నూతన కమిటీ సభ్యులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రామిక మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి మాట్లాడుతూ వేతన కమిటీని వెంటనే వేయాలని కోరారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకంపై సిబ్బంది, తమ సంఘాలతో చర్చించాలని కోరారు. రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ సీతాలక్ష్మి, ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు జిలానీ బాషా, అధ్యక్షులు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, కృష్ణారావు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

మానవతకు ప్రతీక వీపీఆర్ ఫౌండేషన్: నారాయణ

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: మానవతకు ప్రతీక వీపీఆర్ ఫౌండేషన్ అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి నెల్లూరు నగరంలో 90 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1050 మందికి వీటిని అందించడం అభినందనీయమన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆధ్యాత్మిక రంగాల్లో వేమిరెడ్డి దంపతులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో వీపీఆర్ నేత్ర కార్యక్రమంలో 5,257 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 2,845 మందికి అద్దాలు అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కల్యాణచక్రవర్తి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటరులో పురపాలక శాఖ మంత్రి నారాయణ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ తహసీన్, నాయకులు మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రైసైకిల్ అందిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 130 మంది విద్యార్థులు కొన్నేళ్ల తరువాత పూర్వ విద్యార్థులుగా ఒకచోట చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువులను సన్మానించారు. అనంతరం విద్యాలయానికి తమవంతు సాయంగా రూ.5 లక్షల వ్యయంతో బాలికల వసతి గృహం నుంచి విద్యాలయం వరకు కాలి నడక దారి, రూ.2.5 లక్షలతో శుద్ధ జల కేంద్రం, రూ.10 లక్షలతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చూడటానికి వచ్చినప్పుడు కూర్చునేందుకు విశ్రాంత ప్రాంగణం, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు.

కృష్ణాపురంలో గురువులతో పూర్వ విద్యార్థులు

గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలో గంజాయి విక్రేతను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజేశ్వరరావు వివరాల మేరకు ఒడిశాకు చెందిన పాస్ శేఖర్ పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో ఉంటున్నారు. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అతను ఉంటున్న ఇంటిపై దాడి చేశారు. 2.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఎం.బాజీబాబు, తిరుమలరెడ్డితో పాటు సిబ్బంది హాజరైనట్లు తెలిపారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ.12,288
సవర ధర:	రూ.98,304
వెండి గ్రాము :	రూ.188.60

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	150
లేయర్	125
బ్రాయిలర్స్	270
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	294
లేయర్ మాంసం	212

తండ్రిని చూడాలని వచ్చి.. బాణసంచా పేలి బాలుడికి తీవ్రగాయాలు

చేజర్ల, న్యూస్‌టుడే: కుటుంబ పోషణకు దైవ ప్రచార రథంతో ఊరూరా తిరిగే తండ్రిని చూడాలని వచ్చిన బాలుడికి బాణసంచా పేలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, తల్లిదండ్రుల కథనం మేరకు... కావలి తుపాను నగర్‌కు చెందిన శివలింగం రమేశ్ తన బావమరిదితో కలిసి అక్కదేవతల వైభవాన్ని వివరిస్తూ ఊరూరా తిరుగుతూ చందాలు, సరకులు సేకరిస్తుంటారు. మొక్కులు తీర్చాలని వీరు తమ రథాలతో కావలి నుంచి కడప జిల్లా పలకలకోనకు బయల్దేరారు. ఇటీవల వర్షాలకు నాలుగు రోజులుగా ఆదూరుపల్లిలోని గ్రామ దేవత మందిరం వద్ద ఉన్న షెల్టర్లలో వారుంటున్నారు. తండ్రిని చూడాలన్న కోరికతో రమేశ్ కుమారుడు రూపేశ్ శనివారం తల్లి ఉమతో ఆదూరుపల్లికి వచ్చారు. వంటకు కూరగాయలు తెచ్చేందుకు ఆదివారం తల్లి గ్రామంలోకి వెళ్లింది. ఈ సమయంలో గ్రామ దేవత మందిరం వద్ద కాల్చేసిన ఆకాశచువ్వల పుల్లలను ఏరుకుంటూ ఆడుతున్న బాలుడికి పేలని బాణసంచా దొరికింది. దానిలోని పొడిని పొయ్యిలో వేసి ఆనందిస్తున్నాడు. ఇంతలోనే అది కాస్తా బాలుడి చేతిలో ఉన్నది పేలడంతో ఛిద్రమైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తీసుకెళ్లి అక్కడి నుంచి చెన్నైకు తరలించారు. రూపేశ్ తన సోదరితో కలిసి కావలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. యాచనతో పోషణ సాగించే తమకు పెద్ద కష్టం వచ్చిందని బాలుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

అదృశ్యమై.. పెన్నానదిలో శవమై

ఇందుకూరుపేట: విధులకు వెళ్లి అదృశ్యమైన వ్యక్తి మృతదేహం ముదవర్తిపాళెం వద్ద పెన్నానదిలోని తేలిన ఘటన ఆదివారం కలకలం రేపింది. ఎస్సై నాగార్జునరెడ్డి వివరాల మేరకు.. లింగసముద్రం మండలం పెదపవని నివాసి గుత్తి మల్లికార్జునరావు(47) చెన్నైలోని ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారు. ఈనెల 2న ఆఫీసుకు వెళుతున్నానని చెప్పి చరవాణిని ఇంట్లో పెట్టి వెళ్లారు. రాత్రి ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మి 3న అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం భర్త మృతదేహం లభ్యమైందని బంధువులిచ్చిన సమాచారంతో నెల్లూరు జీజీహెచ్‌కు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

విష జ్వరంతో మహిళ మృతి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి పురపాలక పరిధిలో విష జ్వరంతో బాధపడుతూ వారం రోజుల క్రితం ఒక మహిళ(32) మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణ పరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఒక మహిళ ఇంటికి వెళ్లగా జ్వరం ఉండడంతో సర్వే సిబ్బందికి చెప్పగా వారు జ్వరం మాత్రలు ఇవ్వడంతో రెండు రోజులకు తగ్గింది. తిరిగి మళ్లీ జ్వరం రావడంతో నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్ మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతూ మల్టీ ఆర్గాన్స్ విఫలమై మృతిచెందారని పేర్కొన్నారు.

చెరువులకు జలకళ

జిల్లాలో 2.8 లక్షల ఎకరాలకు పుష్కలంగా సాగు నీరు

న్యూస్‌టుడే, సంగం, కోవూరు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో చెరువుల్లో జలకళ ఏర్పడింది. సుమారు 2.8 లక్షల ఎకరాలకు సాగునీటి లభ్యతకు ఢోకా లేదని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అన్నీ చెరువుల్లో 26 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, నవంబరు నెలాఖరుకు కేవలం 79 చెరువుల్లో పూర్తిగా, 629లో 75 శాతం కన్నా అదనంగా, 196 చెరువుల్లో తక్కువగా నీరుండేది. 74 చెరువుల్లో 50 శాతం వరకు, 30 చెరువుల్లో 25 శాతం ఉండగా మొత్తం 20 టీఎంసీల నీరుంది.

22 టీఎంసీల మేరకు...

నీటిపారుదల శాఖ అధికారుల వివరాల ప్రకారం చెరువుల్లో 22 టీఎంసీల నీరు నిల్వ చేరింది. మొంథా తుపానుతో ఆయకట్టు రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధం చేసి నారుమడులు తయారు చేశారు. కొంత మేర చెరువుల్లో నీటి నిల్వ తగ్గిన సమయంలో దిత్వా తుపాను ప్రభావంతో భర్తీ అయింది.

● మెట్ట ప్రాంతాల్లో ఉపయోగకరం... జలవనరుల శాఖ ఎస్ఈ దేశీనాయక్ మాట్లాడుతూ... చెరువుల్లో నీటి నిల్వ పెరగడంతో సాగు, తాగు నీటి రంగాలకు ఎంతో ఉపయోగకరమన్నారు. భూగర్భ జలాలు అధికమైతే, ఆయా ప్రాంతాల్లో తాగునీటి లభ్యత పెరుగుతుందన్నారు. సాగునీరు పుష్కలంగా ఉండడంతో మెట్ట ప్రాంతాల్లో పంట సాగుకు ఢోకా లేదని పేర్కొన్నారు.

నీటి నిల్వతో కళకళలాడుతున్న సంగంలోని ఎర్ర చెరువు

జిల్లాలో మొత్తం చెరువులు	:1008
వాటిలో నీటి నిల్వ సామర్థ్యం	:26 టీఎంసీలు
ప్రస్తుత నిల్వ	:22 టీఎంసీలు
వందశాతం నిండిన చెరువులు	:221
వందశాతం లోపు	:561
75 శాతానికి దిగువన	:155
50 శాతం వరకు	:47
25 శాతం లోపు	:24

కంటి వ్యాధులకు ఆధునిక చికిత్స

నెల్లూరు (జీజీహెచ్), న్యూస్‌టుడే: కంటి వ్యాధులకు ఆధునిక చికిత్సపై వైద్యులకు అవగాహన అవసరమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నేత్ర వైద్య విభాగంలో ఆర్బిట్ అండ్ ఆక్యులోప్లాస్టీ అనే అంశంపై వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులకు సీఎంఈ కార్యక్రమం ఆదివారం నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో జరిగింది. ఆసుపత్రి నేత్ర విభాగాధిపతి డాక్టర్ వసంత నేత్ర సమస్యలు వాటి చికిత్స విధానాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మణికుమార్, వైద్యులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న ముఖ్యఅతిథులు

చమురు, సహజవాయువుల అన్వేషణకు ఓఎన్జీసీ తవ్వకాలు

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీరామపురంలోని రైతుల పొలాల్లో ఓఎన్జీసీ సిబ్బంది ఆదివారం డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు.. అక్కడికి వెళ్లి సమాచారం ఇవ్వకుండా మా భూముల్లో ఎలా తవ్వకాలు చేస్తారని వారిని ప్రశ్నించారు. భూగర్భంలో ఆయిల్,సహజవాయువుల అన్వేషణలో భాగంగా డ్రిల్లింగ్ చేపడుతున్నట్లు సిబ్బంది వారికి వివరించారు.

పొలాల్లో డ్రిల్లింగ్ చేస్తున్న సిబ్బంది

క్షేత్ర పర్యటనలు.. సేవా శిబిరాలు

న్యూస్‌టుడే, విడవలూరు

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సమాజంలోని సమస్యలు గమనిస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. విడవలూరు పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు యువత గ్రామాల్లో పర్యటించి పరిసరాల శుభ్రత, వివిధ ప్రభుత్వ పథకాల అమలు గమనిస్తూ అవగాహన పెంచుకుంటున్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య మాత్రమే కొలమానం కాదని.. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల్లో చురుగ్గా పాల్గొని తమవంతు సహకారమందిస్తున్నారు.

పార్లపల్లి పాఠశాలలో పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

క్రమశిక్షణ, సమయపాలన: సంగీత, బీఎస్సీ

విద్యార్థులకు క్షేత్ర పర్యటనలు ఎంతో ఉపయోగపడతాయి. ఏడు రోజులు నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నా. సమయపాలన పాటించడం, క్రమశిక్షణ, సమాజంలో వ్యక్తులతో ఎలా మాట్లాడాలి.. తదితర విషయాలు నేర్చుకున్నా. గ్రామాల్లో పరిసరాలు, జీవన విధానాలు, ఆర్థిక స్థితిగతులు ఎలా ఉంటాయో అవగాహన కలిగింది.

గ్రామాల్లో వివిధ అంశాలపై అవగాహన : సాయి అభిషేక్, బీఎస్సీ

విద్యార్థులు పుస్తకాలు, తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజంపై అవగాహన కలిగి ఉండాలి. పార్లపల్లిలో వారం రోజులు నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నా. గ్రామంలో సర్వే నిర్వహించి, వివిధ ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై ఆరా తీసి వాటి వివరాలు నమోదు చేసుకున్నాం. ప్రజలతో మాట్లాడి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నా.

సమాజంలో మార్పులు గమనించాలి: హరిణి, బీఏ

జీవితంలో ఎదగాలంటే మన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే పలు అంశాలను నిశితంగా గమనించాలి. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులందరితో కలిసి పనికి రాని మొక్కలు తొలగించి శుభ్రం చేసి వారి పేర్లతో మొక్కలు నాటాం. ఇలాంటి శిబిరాల్లో విద్యార్థులు పాల్గొంటే అనేక అంశాలు నేర్చుకోవచ్చు.

'పెత్తందారీ భాషను ఉపయోగిస్తున్న జగన్'

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భాష సరిగా లేదని, ఇలాగే కొనసాగితే అసెంబ్లీలో వైకాపా సీట్లు 11 నుంచి ఒకటికి పరిమితమవుతుందని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర జోస్యం చెప్పారు. ఆదివారం నెల్లూరులోని తెదేపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను పేదల పక్షమని చెప్పిన జగన్ నేడు పెత్తందారీ భాషను ఉపయోగిస్తున్నారన్నారు. పి.కృష్ణయ్య, గోపీనాథ్‌జెట్టిలకు క్షమాపణలు చెప్పాలని, లేకుంటే బుద్ధి చెప్పేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో తెదేపా జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT, LLB, BA LLB, D.Pharmacy, B.Pharmacy. 9030030125

REAL ESTATE

PLOT FOR SALE

NH5, పడుగుపాడు ... 9030650916

JOBS

Wanted Male Marketing Staff (Incharges and Executives), Administrative staff and Female Tele-callers. Salary: 10000/- to 25000/-. Qualification any Degree, Age limit: 25 to 45 years. Working location: Master Minds College, Nellore. Contact Number: 89784 80430.

Ladies with Computer Knowledge to Work at Kids Indoor Play Zone (11AM-9PM) Beside B.P.Bunk, Children's Park Road. 9392829709

DRIVERS

8309556900, 8309683533

9858698555

SECURITY GUARDS

9581299916, 9492934103

9441699083, 8247036280

MARKETING/ SALES

89776 39862, 89776 39663

9963630236

80080 01790

B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

కావలి
•కావలి •ఉదయగిరి •కందుకూరు

పాఠశాలలో ఫుడ్ ల్యాబ్
ఒకేషనల్ కోర్సుతో విద్యార్థులకు నైపుణ్యాలు

ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు

దగదర్తి, న్యూస్‌టుడే: చదువులకు, ఆటలకే కాకుండా ఆ పాఠశాల రుచికరమైన ప్రయోగాల వేదికగా మారింది. విద్యార్థులు ఫుడ్ ప్రాసెసింగ్(ఆహారశుద్ధి)లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. వారిలో నైపుణ్యాలను వెలికి తీయడమే కాకుండా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు బాటలు వేసేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇప్పిస్తున్నారు. అంతకీ అది ఎక్కడ అనుకుంటున్నారా... అయితే దగదర్తి ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సిందే.

తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు

ఈ పాఠశాల పీఎం శ్రీ పథకానికి ఎంపిక కావడంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో మౌలిక వసతులు సమకూరయ్యాయి. వైద్యుల ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, హోలిస్టిక్ లైఫ్ స్కిల్ ఆర్ట్(జీవితంలో అవసరమైన నైపుణ్యాలు) వంటి వాటిలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. పీఎంశ్రీ (ప్రైమ్ వర్క్)లో ఒకేషనల్ కోర్సు తప్పని సరి. అందులో భాగంగా ఇక్కడి విద్యార్థులు వ్యవసాయ ఆధారిత ఆహార పదార్థాలను ప్రాసెసింగ్ చేసే కోర్సును ఎంచుకున్నారు. ఇందుకు ఇద్దరు ఉపాధ్యాయులను పొరుగుసేవల కింద నియమించారు.. తొమ్మిది, పది తరగతులు చదువుతున్న 100 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన ఫుడ్ ఫెస్టివల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు శ్రీ లక్ష్మి, ఆర్య, ఆయేషా పాల్గొని తృతీయ బహుమతి సాధించడం విశేషం.

అమలు ఇలా..

ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సులో భాగంగా విద్యాసంవత్సరం మొత్తం రోజూ రెండు పీరియడ్లు కేటాయించి శిక్షణ ఇస్తున్నారు. ప్రాక్టికల్‌గా వంటలు చేయిస్తున్నారు. కేకులు, జ్యూస్‌లు వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నారు. దీనితోడు ఆహార పదార్థాలను ఉపయోగించి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే పరిజ్ఞానం సైతం నేర్పుతున్నారు. ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పించారు. కోర్సులు పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. తద్వారా ఉపాధి అవకాశాలకు ఇది ఉపయోగంగా ఉంటుంది.

ఎంతో ఉపయోగం

విద్యార్థులకు ఒకేషనల్ కోర్సుల వల్ల ఎంతో ఉపయోగం ఉంది. భవిష్యత్తులో వారు మెరుగైన ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంది. వృత్తి విద్యలో రాణించేందుకు డెమో సందర్భంగా, ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహణ వంటివి నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం.
- వెంకట సూరయ్య, ప్రధానోపాధ్యాయుడు

వివాదాస్పద పోస్టులు పెడితే కఠిన చర్యలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో అనుచిత, వివాదాస్పద పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీహెచ్.బాలసుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, పుకార్లు, విద్వేషపూరిత వ్యాఖ్యలను పెట్టకూడదన్నారు. ప్రతి గ్రూప్‌లోని పోస్టులపై అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. రాజకీయంగా రెచ్చగొట్టే సందేశాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి: 80080 51666, 91548 46698
కందుకూరు: 70939 81624, ఉదయగిరి: 80085 73944

సమస్య: పెదపవనిలో వీధిదీపాలు మరమ్మతులకు గురయ్యాయి. - **శేషయ్య, గ్రామస్థుడు**
సమాధానం: వెంటనే పరిశీలిస్తాం. సిబ్బందికి తెలిపి మరమ్మతులు చేయిస్తాం.- **శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, లింగసముద్రం**

? మండలంలోని చెడిపిడిపాడు సచివాలయం మార్గంలో చివరి వీధిలో దీపాలు వెలగడం లేదు. - **వర్షితేష్‌కుమార్, సానికుడు**
✓ వెంటనే మరమ్మతులు చేయించి వెలిగించే ఏర్పాటు చేయిస్తాం. - **చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, గుడ్లూరు**

? కావలి పట్టణం బుడమగుంటలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. - **ఈశ్వరయ్య**
✓ సమస్యను పరిష్కరిస్తాం. తాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తాం. - **సాయిరాం, డీఈఈ, పురపాలక సంఘం, కావలి**

? పట్టణంలోని డంపింగ్‌యార్డు సమీపంలో ఉన్న కాలువలో చెత్త పేరుకుపోయి మురుగు నీరు సక్రమంగా పారడం లేదు. - **సుబ్బారావు**
✓ సిబ్బందితో కాలువ శుభ్రం చేయిస్తాం. ఇబ్బంది లేకుండా చూస్తాం. - **కె.అనూష, మున్సిపల్ కమిషనర్, కందుకూరుపట్టణం**

పండు ఈగ దాడి.. రైతన్న కంటతడి
నష్టాలతో తోటలు తొలగింపు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పండు ఈగ.. కూరగాయలు, పండ్ల తోటల రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఒకప్పుడు చలికాలంలో కొద్దిరోజులు మాత్రమే మామిడి తోటల్లోనే కనిపించేది. ప్రస్తుతం సంవత్సరమంతా అన్నిపంటలను ఆశిస్తోంది. తైవాన్ రకం వచ్చాక జామలో ఈ పురుగు విపరీతంగా పెరిగిపోయిందని రైతులు వాపోతున్నారు. ఉద్యానశాఖాధికారులు, శాస్త్రవేత్తలు కేవలం కంటితుడుపు చర్యలు చేపడుతున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఉద్ధృతి

● మామిడి, జామ, అరటి, బొప్పాయి, సపోట, సీతాఫలంతోపాటు బీర, సొర, పొట్ల, కాకర వంటి తీగజాతి కూరగాయలపైన.. పండుఈగ దాడిచేస్తోంది. ఇటీవల దీని ఉద్ధృతి పెరగడంతో గుడ్లూరు మండలంలో సుమారు 200 ఎకరాల్లో జామతోటలను ఆశించడంతో రైతులు చేసేది లేక తొలగించేశారు. తిరిగి సాగు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ● మామిడి తోటలను పీడిస్తోంది. కాయ బయటకు మెరిసిపోతున్నా లోపల కుళ్లిపోయి పురుగులు దర్శనమిస్తుండటంతో కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దిగుబడి సగానికి పైగా పడిపోయింది. రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. దీని ప్రభావంతో గత సీజన్‌లో సుమారు 500 ఎకరాల్లో తోటలను తొలగించారు. రెండేళ్ల నుంచి ఉలవపాడు మండలంలో సపోటా తోటలను సైతం ఆశించడంతో దిగుబడులు తగ్గిపోతున్నాయని కర్షకులు వాపోతున్నారు.

గుడ్లూరులో తొలగిస్తున్న జామ తోట

పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది

ఉలవపాడు మామిడికి అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. ప్రస్తుతం పండుఈగ దాని ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. అధికారులు, శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి నివారించాలి. మరో పదేళ్ల తర్వాత ఇక్కడి మామిడిని మ్యూజియంలో చూసుకోవాల్సి వచ్చేలా ఉంది.
సీహెచ్.వెంకటసుబ్బారెడ్డి, రైతు, చినిరేవారిపాలెం

నివారణ చర్యలు చేపట్టాలి

పండుఈగ ఆశించిన కాయలను తోటల నుంచి ఏరి నాశనం చేయాలి. పిందె దశ దాటినప్పటి నుంచి మిథైల్ యూజినాల్ ట్రాపులను 6-8 చొప్పున ఒక ఎకరానికి అమర్చి నెలకోసారి మార్చితే ఉద్ధృతి తగ్గు ఉంది. ఫ్రూట్ ఫ్లై కవర్లను సీసాలో దారంతో వేలాడదీసి సీసా అడుగున పులిసిన గంజి ఉంచితే జామలో నష్టాన్ని నివారించవచ్చు. మామిడికాయలు పిందె దశలో(నిమ్మకాయ సైజు) ఉన్నపుడు ఫ్రూట్ కవర్లు తొడిగితే దీన్ని అరికట్టొచ్చు. మామిడిచెట్ల కింద దున్ని కోశస్థ దశను బయటపడేయాలి. ఏ పంట దగ్గర ఈగను ఆకర్షించే బుట్టలను ఎకరాకు 5 చొప్పున కొమ్మలకు కట్టాలి.
డాక్టర్ జి.ప్రసాద్‌బాబు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త

అనివేటి మండప నిర్మాణానికి విరాళం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: గ్రామదేవత అంకమ్మ ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అనివేటి మండప నిర్మాణానికి పట్టణానికి చెందిన మోరుదుపు సాయిస్వరూప్ దంపతులు ఆదివారం రూ.25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధి పిడికిటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యకు పాతికేళ్లు.. పరిష్కారానికి ఇంకెన్నేళ్లు..?

బిట్రగుంట, న్యూస్‌టుడే: బిట్రగుంట సోమశిల సబ్‌డివిజన్ పరిధిలోని తాళ్లూరు సమీపంలో దగదర్తి-ముంగమూరు కాలువపై నిర్మించిన శ్రీవెంకటేశ్వరపాళెం మేజర్ ఛానల్ అక్విడెక్ట్ కూలే స్థితికి చేరింది. పాతికేళ్లుగా ఈ సమస్య ఉంది. మొదట్లో మరమ్మతులు చేస్తే సరిపోతుందని భావించినా అడుగులు ముందుకు పడలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింత దెబ్బతింది. దీంతో ఏకంగా కొత్త నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇది ఆమోదం పొంది మరమ్మతులు పనులు జరగాల్సి ఉంది. ఇదీ కాస్త ఆలస్యమైతే అక్విడెక్ట్ కూలే ప్రమాదం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం సాగునీరు విడుదల చేసినా భరించే పరిస్థితి అక్విడెక్ట్‌కు లేదన్న వాదనలు ఉన్నాయి. ఈ క్రమంలో కొండ, పాతబిట్రగుంట, ముంగమూరు తదితర ప్రాంతాల రైతులకు చెందిన ఏడు వేల ఎకరాలు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై సోమశిల సబ్‌డివిజన్ బిట్రగుంట డీఈఈ సత్యప్రసాద్‌ను వివరణ కోరగా తాజాగా అక్విడెక్ట్ నిర్మాణానికి రూ.30 లక్షలు అవసరమవుతాయన్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతులు రాగానే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

శిథిలమైన దీపం కాలువపై ఉన్న ఎస్వీపాళెం ఛానల్ అక్విడెక్ట్

చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు

ఉదయగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో మదరసాలో యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులు ఇచ్చారు. వారిని ఈనెల 14వ తేదీన నెల్లూరులో జరగబోయే జిల్లాస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అక్కడ గెలుపొందిన వారికి ఫిబ్రవరిలో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా మౌలానా సయ్యద్ అష్రఫ్ హఫీజ్, షరీఫ్ వ్యవహరించారు.

ప్రశంసాపత్రాలు చూపుతున్న చిన్నారులు

శబరిమలకు తరలిన మాలధారులు

ఊరేగింపుగా వెళుతున్న అయ్యప్ప మాలధారులు

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఉదయగిరి ప్రాంతానికి చెందిన పలువురు అయ్యప్ప మాలధారులు ఆదివారం శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక పార్వతీపరమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు కట్టించుకున్నారు. ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు తరలివెళ్లారు. **గుడ్లూరు:** మండలంలోని అయ్యప్ప దీక్షాధారులు ఇరుముడి ధారణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఇరుముడికట్టుకున్నారు. వందకుపైగా స్వాములు ప్రదర్శనగా శబరిమల తరలివెళ్లారు. గుడ్లూరు సందడిగా మారింది.

అంబేడ్కర్ విగ్రహానికి మందకృష్ణ నివాళి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదివారం కందుకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పందలపాడులో ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు వడ్డెమేకల ఇంటిలో జరిగిన కార్యక్రమానికి ఆయన వచ్చారు.

పూలమాల వేస్తున్న మందకృష్ణ

జిల్లా హాకీ జట్టుకు విద్యార్థి ఎంపిక

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా హాకీ జట్టుకు పట్టణంలోని బాలురోన్నత పాఠశాల విద్యార్థి ఎస్.కె.తాజుద్దీన్ ఎంపికయ్యాడని పాఠశాల హెచ్‌ఎం ఎం.నరసింహమూర్తి తెలిపారు. తాజుద్దీన్ ఈనెల 9వ తేదీ నుంచి పులివెందులలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థితో ఉపాధ్యాయులు

వైద్యశాల ఆవరణలో కొండచిలువ

గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆదివారం భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. అక్కడ పని చేసే సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వైస్ ఎంపీపీ మాలకొండయ్య సూచన మేరకు వైద్యశాల ఆవరణను జేసీబీతో శుభ్రం చేయిస్తుండడంతో కొండచిలువ కనిపించింది. స్థానికులు అలజడి సృష్టించటంతో కొండచిలువ సమీపంలో ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లింది. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. - **న్యూస్‌టుడే, ఉదయగిరి**

గుంతల దారి.. నీరు చేరి!

మొగిలిచర్ల రోడ్డు నుంచి ఆర్.ఆర్.పాలెం గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలు సాగించడం కష్టంగా ఉంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరింది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, లింగసముద్రం**

పూడిక తీయక... విద్యార్థులకు అవస్థ

దుత్తలూరు సెంటర్‌లోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారిలోని కాలువలో మురుగునీటి నిల్వ పేరుకుని ఉండటంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దోమల ఉద్ధృతి అధికంగా ఉంది. పాఠశాల పక్కనే అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉండడంతో ఎక్కడ రోగాలు ప్రబలుతాయోనని చిన్నారుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి నజీముల్లా మాట్లాడుతూ వెంటనే కాలువలో మురుగునీటి నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, దుత్తలూరు**

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా..!

కలిగిరి పంచాయతీలోని పాపనముసిలిపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు ఒకవైపు కొద్దిదూరం దారుణంగా ఉంది. కలిగిరిలోని సీసీకేఆర్ నగర్ మీదగా పాపన ముసిలిపాలెం ప్రజలు ఎల్లవేళలా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు నిల్వ చేరుతుంది. కొంతభాగ సిమెంట్ రోడ్డు ఉన్నా.. ఈ కొద్దిదూరం వేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. **న్యూస్‌టుడే, కలిగిరి**

బిరడా లేదు.. వృథా ఆగదు

మండలంలోని తూర్పుబోయమడుగుల ప్రధాన వీధిలో కుళాయికి బిరడా లేకపోవడంతో తాగు నీరంతా రోడ్డుపై వృథాగా పోతోంది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బిరడా ఏర్పాటు చేసి నీరు వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, వరికుంటపాడు.**

విద్యావ్యవస్థకు మంచి రోజులు: ఎమ్మెల్యే

ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: యువనాయకుడు లోకేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆ వ్యవస్థకు మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని దాచూరిరామిరెడ్డి భవనంలో యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వైకాపా ప్రభుత్వం సక్రమంగా జీతాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అన్నీ అవమానాలే జరిగాయన్నారు. విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. అనంతరం కందుకూరు యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కొండపనాయుడు, వెంకటేశ్వర్లను సంఘం నాయకులు ఎన్నుకున్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

ఉదయగిరి : మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 12వ పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం మండల మహాసభను నిర్వహించారు. విద్యారంగంలో సమస్యలు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై సమష్టిగా పోరాడాల్సిన అవసరముందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అరవ సురేష్, షేక్ మహమ్మద్‌హనీఫ్, గౌరవాధ్యక్షుడిగా షేక్ మున్నా, ట్రెజరర్‌గా ఉదయ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. **వరికుంటపాడు:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలరాఘవులు ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా పి.మనోహర్, సహఅధ్యక్షులుగా ఎల్.చలపతిరావు, శ్యామలతోపాటు, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు ఎల్వీనారాయణ, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి

వరికుంటపాడులో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

పరిశుభ్రంగా రాళ్లపాడు నీరు

గుడ్లూరు, న్యూస్‌టుడే: రాళ్లపాడు తాగునీటి పథకానికి మంచిరోజులొచ్చాయి. గత కొంతకాలంగా నీరు కలుషితమై ఎర్రగా వస్తుండడంతో కందుకూరు నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల రాళ్లపాడుప్రాజెక్టులో నీరు పూర్తిస్థాయిలో చేరింది. దీనికి తోడు తాగునీటి పథకంలో బ్లీచింగు కలపడంతో పరిశుభ్రంగా దుర్వాసన లేకుండా వారం రోజులుగా నీరు సరఫరా అవుతోంది. దీంతో సుమారు ఏభైకి పైగా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కలిగిరి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కలిగిరి పంచాయతీ జిర్రావారిపాలెం గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త గోసాల మల్లికార్జున(51) నెల్లూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారు. వివరాల మేరకు గత నెల 27న ఎన్‌హెచ్ 167బీజీపై జిర్రావారిపాలెం చర్చి సమీపంలో ద్విచక్రవాహనంపై మరో వ్యక్తితో కలిసి వెళ్తుండగా.. కారు ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ఇద్దరు గాయపడడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ క్రమంలో మల్లికార్జున మృతిచెందారు. ఆయన మృతిపట్ల తెదేపా నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతారామపురం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దనాగంపల్లి వద్ద ఆదివారం ద్విచక్రవాహనం, ఆటో బోల్తాపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల మేరకు సీతారామపురానికి చెందిన కల్యాణ్, బాలాజీలు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. రోడ్డుకు అడ్డంగా అకస్మాత్తుగా కుక్క రావటంతో బైకు బోల్తా పడడంతో వారిద్దరికి గాయాలయ్యాయి. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో సైతం అదుపుతప్పి బోల్తాపడటంతో మనోజ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సీతారామపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.

శ్రీ మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, కావలి.
ఇ.పి.నెం. 49/2018
ఒ.ఎస్.నెం. 672/2006

బిట్వీన్:
నూరేపల్లి శ్రీనివాసులు
S/o **పెద్ద మాలకొండయ్య,** హిందువు, వయస్సు:45 సం॥లు, గంగిరెడ్డిపాళెం గ్రామం & పోస్టు, కలిగిరి మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ...డి.హెచ్.ఆర్.
వర్సెస్
1) **లెక్కల ఎరుకలమ్మ** మరియు ఇతరులు ..జె.డి.ఆర్.లు

నోటీసు

టు:
జె.డి.ఆర్.-4: **తిమ్మారెడ్డి కామేశ్వరమ్మ**
భర్త: **మాధవరెడ్డి,** వయస్సు 40 సం॥లు, హిందువు, గొట్టిగుండాల గ్రామం & పోస్టు, కొండాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
జె.డి.ఆర్.-5: **లెక్కల విజయలక్ష్మి**
డాటర్ ఆఫ్ (లేట్) **నరసింహారెడ్డి,** వయస్సు 38 సం॥లు, హిందువు, గంగిరెడ్డిపాలెం గ్రామం & పోస్టు, కలిగిరి మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
యీ నెంబరున డి.హెచ్.ఆర్. అను అతను మీపై పైన కనపరిచిన ఇ.పి. దాఖలు చేసుకొని ఉండి ఉన్నందున సదరు ఇ.పి.లో ఆర్డర్ 21, రూల్ 22 ఆఫ్ CPC ప్రకారం శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం **తే: 15-12-2025**దినకు వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆ రోజు **ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు నందు స్వయముగా గానీ లేక మీ తరపు వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై తెలిపిన కేసు మీపైన పరోక్షమున తీర్మానము కోర్టు వారు చేయగలరు.

వాయిదా తేది: 15-12-2025
//కోర్టు ఉత్తర్వుల మేరకు//
జి.రాజేంద్రవరప్రసాద్, B.Com., B.L.,
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది, కావలి,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పూడిక తీయరూ !

ఈ చిత్రంలో కనిపించేది కావలి పెద్ద చెరువుకు సోమశిల నీటిని తీసుకొచ్చే కాలువ. చెరువుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న జలదంకి మండలంలోని చిన్నకాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొస్తుంది. అయితే, అందులో సోమశిల ప్రాజెక్ట్ తరపున 11 కిలోమీటర్ల వరకు పూడిక తొలగింపు పనులు చేపట్టారు. మిగిలిన నాలుగు కిలోమీటర్లు జలవనరులశాఖ పరిధిలో ఉండగా ఇంకా పూడికతీత పనులు చేపట్టలేదు. దీనిపై కావలి జలవనరులశాఖ సహాయక ఇంజినీర్ జంపాని కిరణ్ స్పందిస్తూ ఇప్పటికే రూ.10లక్షల అంచనాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపాము. నిధులు మంజూరైన వెంటనే తొలగింపు పనులు చేపడతామన్నారు. – **న్యూస్‌టుడే, కావలి**

గ్రామీణ విద్యార్థులు.. క్రీడా దీపికలు

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: వారంతా పేద కుటుంబాల్లో జన్మించారు. బాల్యం నుంచి ఆటలపై ఆసక్తి పెంచుకున్నారు. పట్టుదల, కృషి, క్రమశిక్షణలతో నిత్యం సాధన చేస్తున్నారు. తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చదువు, క్రీడల్లో సత్తా చాటుతున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు.. వలేటివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు.

జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటా: సంతోష్

వలేటివారిపాలెం గాంధీ నగర్‌కు చెందిన గుడూరి సంతోష్ పదో తరగతి చదువుతున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరులో మచిలీపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు మూడో స్థానాన్ని దక్కించుకోవడంలో కీలక పాత్ర పోషించారు. గతంలో రెండు సార్లు జిల్లా జట్టు తరుపున పోటీలో పాల్గొని పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలనే లక్ష్యంతో నిత్యం సాధన చేస్తున్నానని తెలిపారు.

ఐఏఎస్ అవుతా: మణివిష్ణువర్ధన్

కావలిలోని బుడంగుంటకు చెందిన మర్రి మణివిష్ణువర్ధన్.. వలేటివారిపాలెం బీసీ వసతిగృహంలో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సబ్ జూనియర్స్ విభాగంలో గత నెలలో కర్నూలులో జరిగిన పోటీలో పాల్గొన్నారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని ప్రతిభచూపారు. క్రీడలతో మానసిక, శారీరకంగా దృఢంగా ఉంటామని చెబుతున్నాడు. భవిష్యత్తులో ఐఏఎస్ అవడమే తన ధ్యేయమని చెబుతున్నారు.

పోలీసు అధికారినవుతా: సీహెచ్.అస్మిత

వలేటివారిపాలెం పంచాయతీలోని బండివారిపాలెం గ్రామానికి చెందిన సీహెచ్.అస్మిత పదో తరగతి చదువుతోంది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 విభాగంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికయ్యారు. అనంతరం నవంబరులో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని రాణించారు. మరిన్నీ విజయాలు సాధించి.. క్రీడా కోటాలో పోలీస్ అధికారిణి కావడమే తన కల అని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము, వింజమూరు
ఆర్.సి. నెం. 37/ఎ1/2025 తేది: 06.12.2025

వేలం ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వింజమూరు మండలం, వింజమూరు గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద తేది: 15-12-2025 ఉదయం 10.30 గంటల నుండి గ్రామ పంచాయతీకి చెందిన 6 (ఆరు) షాపు నెం. 2, 3, 7, 17, 18, 19 వరకు తేది: 01-12-2025 నుండి 30-09-2027 వరకు ఒక సంవత్సర పది నెలలు కాలమునకు బహిరంగ వేలం వేయబడును. వేలం పాటలో పాల్గొనువారు రూ. 1,00,000/-లు ఆస్తి విలువ ఇంటిపై పంచాయతి కార్యదర్శి వారి నుండి, పొలంపై శ్రీ తహసిల్దారు, వింజమూరు మండలం వారి నుండి వాల్యుయేషన్ సర్టిఫికెట్ పొంది రూ. 20,000/-లు డిపాజిట్టు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను. వేలం అధికారికి ముందుగా ఆస్థి విలువ సర్టిఫికేటు ఇవ్వవలెను. మిగతా వివరములు గ్రామ పంచాయతీ కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ. నెం.	వేలం వివరములు	లీజు కాలము	ధరావతు రూ.లలో
1.	షాపు నెం. 2, 3, 7, 17, 18, 19 వరకు వేలములు (తేది: 01-12-2025 నుండి తేది: 30-09-2027 వరకు)	తేది:01-12-2025 నుండి తేది: 30-09-2027 వరకు	రూ. 20,000/-

నోట్: 1. వేలం నిర్వహించు తేదిని ప్రభుత్వము వారు అనివార్య కారణముల వలన సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటి కార్యాలయము పని దినమున వేలం నిర్వహించబడును.
2. వేలం పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు లేదా వాయిదా వేయుటకు లేదా నిలుపుదల చేయుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు.
3. వేలందారులు గ్రామ పంచాయతి విధించు నియమ నిబంధనలు మరియు ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి యుండు పద్ధతిపైనే వేలం దాఖలు పరచవలయును.

సం/- **పంచాయతీ కార్యదర్శి,** వింజమూరు గ్రామ పంచాయతీ, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

యూటీఎఫ్ మండల కమిటీల ఎన్నిక

మర్రిపాడు, కొడవలూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ ముందు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మోహన్ ప్రసాద్ అన్నారు. ఆదివారం మర్రిపాడులోని కార్యాలయ భవనంలో మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ మర్రిపాడు మండల గౌరవ అధ్యక్షుడిగా భాస్కర్, మండలాధ్యక్షుడిగా విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా మునాఫ్, ఎడ్‌బ్యూవ్ఎఫ్ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ● కొడవలూరు మండలం నార్త్‌రాజుపాలెంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తిరుపాలు, గౌరవాధ్యక్షుడిగా మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా గోపీబాషా, కీర్తన, కోశాధికారిగా ఖాజామస్తాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

గొడవలకు దిగితే ఉపేక్షించం

పొదలకూరు రూరల్ న్యూస్‌టుడే : మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎస్సై హనీఫ్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు.. ఆదివారం స్థానిక పోలీసు కార్యాలయంలో 24 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. రానున్న పంచాయతీ ఎన్నికల దృష్ట్యా రౌడీ షీటర్లు, అనుమానితులపై నిఘా ఉంచామన్నారు. దొంగతనాలు, దాడులు, గొడవలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: తోటపల్లిగూడూరు మండలం ముంగల దొరువు వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. రోడ్డు పక్కనే పేడ దిబ్బలు, వ్యర్థాలు వేస్తున్నారు. వర్షాలకు రోడ్డుపై నీరు చేరి దుర్గంధం వస్తోంది. - మోహన్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. రోడ్డు పక్కన వ్యర్థాలు వేయకుండా చూస్తాం. - లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో

? వెంకటాచలం మండలం ఎగువమిట్టలో గ్రామ మధ్యలో ఉన్న దొరువులో నీరు కలుషితమై, వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన నెలకొంది. - నాగయ్య, ఎగువమిట్ట

✓ అధికారులతో చర్చించి శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకుంటాం. - కల్పన, ఎంపీడీవో

? వెంకటాచలంలోని నెల్లగుంట వద్ద నుంచి తిక్కవరప్పాడుకు వెళ్లే కాలువపై చెత్త తెచ్చి పోస్తున్నారు. -వెంకటేశ్వర్లు, రైతు

✓ పంట కాలువపై అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటాం. - ఓబులేశ్, ఇరిగేషన్ ఏఈ

? అనంతసాగరం మండలం బొమ్మవరంలోని ఎస్సీ కాలనీలో ముళ్ల చెట్లు పెరిగి విష సర్పాలకు ఆవాసంగా మారాయి. -భాస్కర్, గ్రామస్థుడు

✓ సిబ్బందిని పంపి ముళ్ల చెట్లను తొలగిస్తాం. - తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి

? సంగంలో పెట్రోల్ బంకు సమీపంలో గిరిజన కాలనీకి వెళ్లే మార్గం వద్ద కాలువ పూడిపోయింది. - వెంకటేశ్వర్లు, సంగం

✓ పరిశీలించి కాలువ తవ్వించే ఏర్పాటు చేస్తాం. - నరసయ్య, పంచాయతీ కార్యదర్శి

? మర్రిపాడు మండలం రామానాయుడుపల్లిలో నిర్మించిన డిజిటల్ గ్రంథాలయం అసంపూర్తిగా ఉంది. -రమణ, స్థానికుడు

✓ పూర్తిచేస్తాం. -శ్రీవాస్, పీఆర్ ఏఈ

? అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఎదుట వ్యర్థాలు వేస్తున్నారు. - విజయ్

✓ పాఠశాల ఎదుట వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపడతాం. -పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు రూరల్ పరిధిలోని బాలాజీ నగర్లో కాలువలు వ్యర్థాలతో నిండిపోయి అధ్వానంగా ఉన్నాయి. -రాఘవ, స్థానికుడు

✓ పంచాయతీ సిబ్బందికి చెప్పి శుభ్రం చేయిస్తాం. -నరసింహారావు, ఎంపీడీవో

? ఇందుకూరుపేట మండలం మైపాడు గేట్ సెంటర్‌లో విద్యుత్తు దీపాలు పది రోజులుగా వెలగడం లేదు. - నారాయణ, స్థానికుడు

✓ బాగుచేస్తాం. -నాగేంద్రబాబు, ఎంపీడీవో

? రాపూరు మండలం గుండవోలులోని పాతూరులో వీధి దీపాలు వెలగడం లేదు. విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. -ఆనంద్,గుండవోలు

✓ తీగలు సరిచేయిస్తాం. వీధిదీపాలు వెలిగేలా చూస్తాం. -భవాని, ఎంపీడీవో

శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకోండి : డీఎస్పీ

హెల్మెట్ అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మనుబోలు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనచోదకులు శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎస్సై శివ రాకేశ్ ఆధ్వర్యంలో దాతలు ధనుంజయరెడ్డి, పద్మనాభరెడ్డి దాతృత్వంతో సుమారు 200 మంది ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణాలు అందజేశారు. అనంతరం ద్విచక్రవాహన చోదకులతో కలిసి భారీ మోటారుసైకిల్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్సైలు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో కలపొద్దు

కలువాయి, సైదాపురం, న్యూస్‌టుడే: కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ ఆదివారం వికాస సభ్యులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. కలువాయి బస్టాండ్ కూడలిలో చొక్కాలు విప్పి నినాదాలతో నిరసన తెలిపారు. కలువాయిని తిరుపతి జిల్లాలో గూడూరు డివిజన్‌లో కలపడం ద్వారా ప్రజలు పడే కష్టాలు, నష్టాల గురించి ప్రభుత్వం ఆలోచించాలని వికాస సభ్యులు పేర్కొన్నారు. * సైదాపురం మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలంటూ జనసేన మండల అధ్యక్షుడు రవీంద్ర.. పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శికి వినతి పత్రాన్ని అందించారు. వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలు నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.

వికాస సభ్యుల అర్ధనగ్న ప్రదర్శన

రూ.లక్షలు వెచ్చించి.. మూలనపడేసి..!

గ్రామ సచివాలయాలకు అందని ఏపీ ఫైబర్ సేవలు

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, కోవూరు

గ్రామాల్లో సచివాలయాల ద్వారా అంతర్జాల సదుపాయం అందించాలనే ఆలోచనతో గత ప్రభుత్వం ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది.. ఇందుకు అవసరమైన పరికరాలను సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో అమర్చారు. దీని కోసం ఒక్కో చోట రూ.2 లక్షల మేర ఖర్చయినట్లు అంచనా. అంతా బాగున్నా నిర్వహణ గాలికొదిలేయడంతో పరిస్థితి మొదటికొచ్చింది. పరికరాలు మూలన చేరి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో సిబ్బంది ప్రైవేట్ కంప్యూటర్ సెంటర్లు, చరవాణుల ద్వారా పనులు చేయాల్సి వస్తోంది. ● సర్వేపల్లి, కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని 16 మండలాల్లో 250 గ్రామ సచివాలయాలున్నాయి. వీటిలో వందకు పైగా కార్యాలయాల్లో అంతర్జాల సమస్యలు ఉన్నాయి. వీటిల్లో పది శాతం మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా చోట్ల ఉపయోగం లేకుండా మూలనపడ్డాయి. సచివాలయాల ద్వారా అందించాల్సిన సేవలు అంతర్జాల సదుపాయం ఆధారంగా ఉండటంతో డిజిటల్ సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ పాలనలోనూ ఇదే సమస్య ఎదురవుతోంది. ● చరవాణుల ద్వారా అంతర్జాల సౌకర్యాన్ని హాట్‌స్పాట్ ద్వారా కంప్యూటర్‌కు కనెక్ట్ చేసి సేవలందించాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కార్యదర్శులు వాపోతున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలకు వీటి ద్వారా సేవలందించాలని భావించినా సాధ్యపడలేదు. పాలకులు దృష్టి సారించి వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ● ఎంపీడీవో వెంకటేశ్వర్లరావు మాట్లాడుతూ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో ఉన్న ఫైబర్ నెట్‌వర్క్ పరికరాలు పనిచేయడం లేదని, టీటీపై ఉన్న చరవాణి నంబర్లకు కార్యదర్శులు పలుమార్లు సంప్రదించారని అయినా స్పందన లేదన్నారు. జిల్లా అధికారులకు సమస్య తెలియజేశామని పేర్కొన్నారు.

పోతిరెడ్డిపాలెం సచివాలయంలో ఏర్పాటు చేసిన అంతర్జాల సామగ్రి

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

సమస్యలు తెలుసుకుంటున్న సీఐ గంగాధర్

అనంతసాగరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పర్యటనలు, పల్లెల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ గంగాధర్ హెచ్చరించారు. ఆదివారం పలు ఫిర్యాదుల మేరకు మండల పరిధిలోని కమ్మవారిపల్లి, పడమటి కంభంపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పలు విషయాలపై కొంత మంది వివాదాలకు పాల్పడుతుంటే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే స్థానిక పోలీసుస్టేషన్‌లో లేదా తనకు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం సోమశిల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు.

జొన్నవాడలో దాహం..దాహం

బుచ్చిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జొన్నవాడలోని తూర్పువీధి, బ్రాహ్మణవీధిలో తాగునీరు రాక అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, కనీస అవసరాలకు సైతం మంచి నీరు లేదని అధికారులు స్పందించి తాగు నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రిక మార్పు దృష్ట్యా సోమవారం పొదలకూరులోని మారుతీనగర్‌లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కమిటీ సభ్యురాలు మంజుల.. గాంధీ విగ్రహానికి పట్టు వస్త్రాలు, ఆశ్రమ స్థల దాత పొనకా కనకమ్మకు పట్టు, నూలు వస్త్రాలు సమర్పించారు. విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలను వివరించారు. ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణం బైపాస్ రహదారిపై బురదలో జారి ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. పట్టణంలోని జట్టివారి రహదారి కూడలి నుంచి చాదివి సెంటర్ వైపు కలపతో వెళుతున్న ట్రాక్టర్ రహదారిపై ఉన్న బురద మట్టిలో దిగబడి బోల్తా పడింది. ఈ మార్గంలో కొన్ని రోజులుగా కురిసిన వర్షాలతో మట్టిరోడ్డు గుంతలతో దుర్భరంగా ఉంది. సీసీ రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

బురద దారిలో బోల్తాపడిన ట్రక్కు

వరుస విపత్తులతో ఉక్కిరిబిక్కిరి

న్యూస్‌టుడే, సైదాపురం, ఇందుకూరుపేట

మొన్న మొంథా.. నిన్న దిత్వా తుపాను వరుస విపత్తులతో జన జీవనం ఉక్కిరిబిక్కిరిగా మారింది. వర్షాలు అధికంగా పడడంతో ఒకవైపు రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. రైతులకు చెరువుల్లో నీరు చేరానే ఆనందం కన్నా నారుమడులు దెబ్బతినడంతో మళ్లీ వేయక తప్పడం లేదు. కలువాయి, సైదాపురం, రాపూరు, ఇందుకూరుపేట మండలాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. సైదాపురం - దేగపూడి రోడ్డు గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా వచ్చిన నిధులు వెనక్కు వెళ్లాయి. ఈ రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో బావులను తలపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు.

సైదాపురం-దేగపూడి రోడ్డులో ఏర్పడిన గుంతలు

చివరి మజిలీలో చిక్కులేనా!

ఇందుకూరుపేట మండలం కుడితిపాళెంలోని వైకుంఠధామం ముళ్లచెట్లతో నిండిపోయి అడవిని తలపిస్తోంది. సుమారు మూడు వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. దీని నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రాంగణం మొత్తం ముళ్ల చెట్లతో అధ్వానంగా మారింది. ఖననం చేసే సమయంలో ఈ మార్గంలో వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఇందుకూరుపేట

కూలితేనే స్పందిస్తారా

సంగంలో శివాజీ సెంటరు నుంచి ముదిరాజ్‌పాళేనికి వెళ్లే వీధిలో భూమి వర్షపునీటితో కోసుకుపోతుండడంతో అక్కడే ఉన్న విద్యుత్తు స్తంభానికి ప్రమాదం ఏర్పడింది. దీంతో అది కూలే అవకాశముంది. డిస్కం అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డిస్కం ఏఈ మన్మథరావు మాట్లాడుతూ వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సంగం

ఎనీ టైం మూత

విడవలూరులోని కెనరా బ్యాంకు ఏటీఎం కొన్నినెలలుగా వినియోగంలో లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఖాతాదారుల్లో వయోధికులు నగదు కోసం వచ్చి లేకపోవడంతో నార్తురాజుపాళెం వెళుతున్నారు. ఎప్పుడూ చూసిన మూసి ఉంటోందని, బ్యాంకు సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విడవలూరు

చెత్త తొలగించరూ..

కోవూరు పట్టణంలోని శివాలయం వద్ద చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. చెత్త తొలగించకపోవడంతో నిత్యం వచ్చే భక్తులు, వివిధ ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

రోడ్డు ఆక్రమించి నిర్మిస్తున్నా పట్టదా..!

కోవూరు పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం సమీపంలో ఒక భారీ భవన నిర్మాణం చేపట్టారు. ముందు రోడ్డుపైకి ర్యాంపు నిర్మించడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో కనిపించక అదుపుతప్పి బోల్తాపడుతున్నారు. పంచాయతీ, మండల అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

ఆరోగ్య జాగ్రత్తలు పాటిద్దాం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు పాటించాలని నెల్లూరు రామచంద్రా రెడ్డి వైద్యశాల సీనియర్ వైద్యులు రమణారెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరులో జనవిజ్ఞానవేదిక, జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు చేసి, రెండు నెలలకు సరిపడ మందులు అందజేశారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 840 మంది హాజరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష ఆదివారం ఆత్మకూరులో నాలుగు కేంద్రాల్లో జరిగింది. 840 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ప్రతిభ చూపి ఉపకారవేతనానికి ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల్లో మొత్తం రూ.50 వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

మనుబోలు, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన గురివిందపూడి అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది. స్థానికుల వివరాలమేరకు.. నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న లారీ గురివిందపూడి వద్ద హైవే పక్కన ఆపి మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో అదే మార్గంలో వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి ఇద్దరిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన పరమశివతో పాటు మరొకరిని చికిత్స నిమిత్తం రహదారి అంబులెన్సులో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

సంగం, న్యూస్‌టుడే: తరుణవాయి సమీపంలో జాతీయరహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ షామీర్ అనే యువకుడు గాయపడ్డారు. బుచ్చి నుంచి సంగంకు ద్విచక్రవాహనంలో వస్తుండగా, ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. సంగం పోలీసులు 108 ద్వారా బుచ్చి సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేశారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

మాజీ ఎమ్మెల్యే విజయరామిరెడ్డితో సమావేశమైన నాయకులు

అనంతసాగరం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు తెదేపా నాయకులు సిద్ధంగా ఉండాలని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, తెదేపా మండల పరిశీలకులు కంభం విజయరామిరెడ్డి అన్నారు. అనంతసాగరంలోని తెదేపా కార్యాలయంలో మండలాధ్యక్షుడు మెట్టుకూరి కృష్ణారెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ బీఎల్వోల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుజాతమ్మ, తెదేపా నాయకులు మెట్టుకూరి శ్రీహరి, మనోజ్ కుమార్, ప్రభాకర్, ఖాసీం బాషా తదితరులు పాల్గొన్నారు.

పూడ్చని గండి... సాగుదారుల సతమతం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి, కళాయకాగొల్లు మధ్య కాలువ గండి పడిన విషయం తెలిసిందే. నాలుగు రోజులైనా గండి పూర్చకపోవడంతో రైతుల పొలాల్లో నీరు చేరి నార్లు పాచిపోయాయి. ఇంకా వరదనీరు ప్రవహిస్తూనే ఉందని నీటిపారుదల, వ్యవసాయ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గండి పూడ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

మునిగిన నారుమళ్లు.. రైతుల్లో దిగులు

విడవలూరు శివారులో నీటమునిగిన పొలాలు

న్యూస్‌టుడే, విడవలూరు

దిత్వా తుపాను కారణంగా కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల నారుమడులు ముంపునకు గురయ్యాయి. నాట్లు వేసిన పొలాల్లో నీరు నిలిచి నారు దెబ్బతింది. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే రైతులు నష్టపోతారని ఆందోళన చెందుతున్నారు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాలెం, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు మండలాల్లో వరి నార్లు వేశారు. నియోజకవర్గంలో పది వేల హెక్టార్లలో నాట్లు వేయగా.. 850 హెక్టార్లలో నార్లు నీట మునిగాయి. సుమారు 2,600 హెక్టార్లలో నారుమళ్లు వేయగా 300 హెక్టార్లలో వర్షాలకు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేశారు. విడవలూరు మండలంలో పలుచోట్ల వరి పొలాలు నీట మునిగాయి. పొలాల్లో నీటిని బయటకు పంపేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నార్లు కుళ్లిపోతున్నాయని, ఇప్పటికే విత్తనాలకు, నాట్లుకు చాలా ఖర్చుచేశామని సాగుదారులు చెబుతున్నారు. ● ఏడీఏ అనిత మాట్లాడుతూ దెబ్బతిన్న నారుమడులు, నీట మునిగిన నారు వేసిన పొలాలు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ప్రభుత్వం రాయితీపై వరి విత్తనాలు అందజేస్తుందని పేర్కొన్నారు.

గుంత.. చింత

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే : మండలంలోని పాతకోడూరు నుంచి నెల్లిమిట్టకండ్రిగ, ఈదూరు గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మార్గంలోనే తోటపల్లిగూడూరు, ముత్తుకూరు ప్రాంతాలకు ప్రజలు ప్రయాణిస్తుంటారు. భారీ వర్షాలకు పెద్ద గుంతలు పడడంతో పాటు వర్షపు నీరు గుంతల్లో చేరింది. ఏ మాత్రం అదుపుతప్పినా పడిపోక తప్పదు. ద్విచక్ర వాహనం వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇలాగైతే పారేదెలా..!

వ్యర్థాలు పేరుకుపోయిన వరవ కాలువ

పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే: రమణారెడ్డి నగర్ నుండి పొదలకూరు చెరువుకు అనుసంధానమైన వరవ కాలువ పూర్తిగా వ్యర్థాలు పేరుకుపోయి పారుదలకు అడ్డంకిగా మారింది. దిత్వా తుపాను కారణంగా కురిసిన వర్షాలతో కాలువ కుడివైపున తెగిపోయి నీళ్లు ఖాళీ స్థలాల్లో చేరింది. దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. కాలువ దుస్థితిని పరిశీలించి నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇరిగేషన్ ఏఈ అనిల్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

మహారాజశ్రీ వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

E.P.No.46/2012
GOS.No.8/2010

పాడి కృష్ణయ్య (died)
గొర్ల అమరావతి మరియు ఇద్దరు...డి.హెచ్.ఆర్

VS

వేముల పుల్లయ్య ...జె.డి.ఆర్
తండ్రి వెంకట సుబ్బయ్య, అక్కమాంబాపురం, రాపూరు మండలం, SPSR నెల్లూరు జిల్లా

వేలం ప్రకటన

డిక్రీ హోల్డర్లు (DHR) పై E.P లో బాకీ రాబట్టుకొనుటకు జడ్జిమెంట్ డెటారు (JDR) కు చెందిన కింద షెడ్యూలులో కనబరిచిన ఆస్తిని 23-12-2025 తేది పై కోర్టులో ఉదయం 10.30 గంటల నుండి బహిరంగ వేలము వేయబడును. షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనదలచినవారు ఈ వేలంపాటలో పాల్గొని సదరు ఆస్తిని కొనవచ్చును.

షెడ్యూలు

శ్రీ పొట్టిశ్రీరాములు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ (ప్రస్తుతం తిరుపతి రిజిస్ట్రేషన్), రాపూరు సబ్ రిజిస్ట్రేషన్, చెర్లోపల్లి పంచాయతీ, అక్కమాంబాపురం గ్రామం, 12 అంకణముల స్థలంలో 7 అంకణముల R.C.C మిద్దె.

హద్దులు

తూర్పు: వీధి మరియు చేతబావి, **పడమర:** స్కూల్, **ఉత్తరం:** పాతగ్రామం ప్రస్తుతం ఖాళీ, **దక్షిణం:** వీధి

విస్తీర్ణం

12 అంకణాల ఖాళీ స్థలంలో 7 అంకణాల R.C.C మిద్దె ఇల్లు.

Amin Value: 1,20,000-00,
DHR Value: 1,30,000-00

TAYI. VIJAYA KUMAR
B.Com, BL., Advocate,
9/297, Teachers Colony,
Venkatagiri-524132, SPSR Nellore (D.T)
Ph.No: 9030837221

కాలువకు మరమ్మతులు

బుచ్చి: దామరమడుగు నుంచి గంగవరానికి వెళ్లే చెరువు మిట్టకాలువ పూడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సాగునీటి సంఘం అధ్యక్షులు లక్ష్మీనరసారెడ్డి దృష్టికి స్థానిక రైతులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో మాట్లాడారు. ఆమె ఆదేశాలతో చెరువుమిట్ట కాలువ పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి.

పెన్‌కాక్ చిలాట్‌లో విద్యార్థినుల ప్రతిభ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పెన్‌కాక్ చిలాట్‌లో ఆత్మకూరు బాలికలు ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. పెన్‌కాక్ చిలాట్ ఖేలో ఇండియా బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో ఆసియా, అస్మిత, ఇరం అబ్రాలు ప్రతిభ చూపారు. వీరిని సాదిక్ హుస్సేన్, పురపాలక సందాని, మల్లికార్జున తదితరులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

బీసీలు ఎదుగుతుంటే జగన్ ఓర్వలేకున్నారు

విడవలూరు, న్యూస్‌టుడే: బీసీలు ఉన్నత స్థాయికి ఎదుగుతుంటే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తట్టుకోలేకున్నారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు వైకాపాను ఛీకొట్టి 11 సీట్లకు పరిమితం చేసినా జగన్ బుద్ధి మారలేదని ఆయన పేర్కొన్నారు.

తారకేశ్వర ఆలయంలో రుద్రాభిషేకాలు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని గంగపట్నం భవానిసమేత గంగా తారకేశ్వర ఆలయంలో ఆదివారం మహన్యాస పూర్వ ఏకాదశి సందర్భంగా రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కసుమూరులో పోలీసుల తనిఖీలు

వెంకటాచలం, న్యూస్‌టుడే: పోలీసు అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కసుమూరులో సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాలతో పాటు, అద్దెగదులను తనిఖీ చేశారు. పత్రాలు లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అద్దె గదుల్లో ఉన్న రెండు జంటలను అదుపులోకి తీసుకున్నారు.

నేటి నుంచి వీఎస్‌యూలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూ పరిధిలో పీజీ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు సోమవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు రిజిస్ట్రార్ సునీత తెలిపారు. వీఎస్‌యూలో, కావలి పీజీ సెంటర్‌లో ప్రత్యేక అడ్మిషన్ల కౌంటర్ ఏర్పాటు చేశామని, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 10వ తేది వరకు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు విశ్వవిద్యాలయంలోని అడ్మిషన్స్ సంచాలకుని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తోటపల్లిగూడూరు: నారుమడులు, వరి నాట్లు నీటమునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సుబ్బయ్య పేర్కొన్నారు. పలు గ్రామాల్లో దెబ్బతిన్న వరి పొలాలను మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రథమ వర్ధంతి

మంచికి మారుపేరుగా నిలిచి మా కుటుంబ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన శ్రీ తెనాలి రాంప్రసాద్‌రావు గారు స్వర్గస్తులై నేటికి సంవత్సరకాలం గడిచినా వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడలు
తెనాలి శశిధర్ -క్రిస్టినా
తెనాలి రాహుల్ బాబు

మనవడు :
తెనాలి లియోన్

శ్రీ తెనాలి రాంప్రసాద్‌రావు గారు
జననం : 01-07-1959 మరణం : 18-12-2024

ప్రథమ వర్ధంతి : 08-12-2025 తేదీన సోమవారం నెల్లూరు జిల్లా మనుబోలు మండలం KR పురం సాయిబాబాగుడి నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

పార్లుకట్ట ప్రాంతంలో పర్యటిస్తున్న నందన్

పార్కుల్లో వసతుల కల్పన

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని పార్కుల్లో వసతులు కల్పించాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం 48వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంతంలో పర్యటించారు. స్థానికంగా ఉన్న పార్కు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటరును పరిశీలించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

సేవల్లో భాగస్వాములు కావాలి

నెల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ సుధాకర్ సూచించారు. బుజబుజనెల్లూరులోని ఎంపీపీ పాఠశాలలో డీకే కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఆదివారం సందర్శించారు. విద్యార్థులు పారిశుద్ధ్య పనులు నిర్వహించి, గ్రామంలో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భారతి, ప్రధానోపాధ్యాయులు జయరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: సుందరయ్య కాలనీలో కుక్కలు, పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. – శరత్‌బాబు, స్థానికుడు

సమాధానం: ఈ సమస్య వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? పొదలకూరురోడ్డు ప్రగతినగర్ బి-బ్లాక్ ఏడో వీధిలో విద్యుత్తు స్తంభానికి రెండు నెలలుగా దీపం వెలగడం లేదు. రాత్రిళ్లు చీకటిగా ఉంటుంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - సాయికృష్ణ, స్థానికుడు

✓ విద్యుద్దీపాన్ని వెంటనే ఏర్పాటు చేస్తాం.
– ముజాహిద్దీన్, నగరపాలక సంస్థ డీఈ
– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముక్కు రాధాకృష్ణగౌడ్

నెల్లూరు (స్టోన్ హౌస్ పేట), న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన ముక్కు రాధాకృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

రూ.1.80 కోట్లతో సోలార్ దీపాలు

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: పీ4 కార్యక్రమంలో భాగంగా ఎస్ఈఐఎల్ కంపెనీ సీఎస్సార్ నిధులు రూ.1.80 కోట్లతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 22 పార్కుల్లో సోలార్ దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం 27వ డివిజన్ రిత్విక్ ఎన్‌క్లేవ్ పార్కులో వీటి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మురహరి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌ఛార్జి దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

ముఖాముఖి

'న్యూస్‌టుడే'తో సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

ప్రతి వారం రౌడీలకు ప్రత్యేక కౌన్సెలింగ్.. నిత్యం వాహన తనిఖీలు.. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు.. డ్రోన్‌తో నిఘా.. తదితర చర్యలతో శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నాం. గంజాయి విక్రయం, రవాణా నిరోధానికి చర్యలు తీసుకుంటున్నాం.. ఇవీ సంతపేట సర్కిల్ పోలీసుస్టేషన్ **ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య** చెప్పిన మాటలు. తన స్టేషన్ పరిధిలో ఆయన తీసుకుంటున్న చర్యలపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలుఆయన మాటల్లోనే..

పాత నేరస్థుల జాబితా బయటకు తీశాం.. స్టేషన్ పరిధిలో ఉన్న పాత నిందితుల జాబితాను బయటకు తీశాం. అందులో ఉన్న వారి కదలికలపై నిఘా పెట్టాం. గంజాయి కేసుల్లో ఉన్న నిందితులపై దృష్టి సారించాం. వారంరోజులపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు మూడు కేసులు నమోదు చేశాం. పది మందిని అదుపులోకి తీసుకున్నాం. ఎవరెవరితో మాట్లాడుతున్నారు? వారి వివరాలు పూర్తిస్థాయిలో తీసుకున్నాం. గతంలో పెన్నా నది ఒడ్డున జూద స్థావరాలు ఉండేవి. ప్రస్తుతం ఎక్కడా లేవు. జంట హత్యలు జరిగిన నేపథ్యంలో స్టేషన్ పరిధిలో అప్రమత్తమయ్యాం. నెల్లూరు బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో నిత్యం డ్రోన్‌తో నిఘా చేస్తున్నాం. రౌడీ షీటర్లు, గంజాయి కేసుల్లో యాక్టివ్‌గా ఉన్న వారిని గుర్తిస్తున్నాం. త్వరలో వీరిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం.

డ్రోన్‌తో రోజూ ఆరు గంటల నిఘా

స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది వెళ్లలేరు. ఆ ప్రాంతాల్లో డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్నాం. ఎస్పీ ఆదేశాలతో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం రెండేసి గంటలు చొప్పున నిఘా పెడుతున్నాం. రోజూ ఒకే సమయం కాకుండా మార్పు చేస్తున్నాం. దీంతో బహిరంగ మద్యం ఎక్కడా జరగడం లేదు. జూద స్థావరాలు కూడా నిర్వహించడం లేదు. స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఉన్నాయి. మరిన్ని కావాల్సి ఉంది. ప్రజల సహకారంతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం కూడా త్వరలో మంజూరు చేయనుంది.

నిర్బంధ తనిఖీలతో కట్టడి

కపాడిపాలెంలో గంజాయి విక్రయాలకు పేరు. ప్రస్తుతం ఎలాంటి కార్యకలాపాలు జరగడం లేదు. ఇటీవల ఆకస్మికంగా ఈ ప్రాంతంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించాం. ఏమీ దొరకలేదు. ఇక నుంచి నిత్యం ఈ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు చేస్తాం. రైల్వే స్టేషన్ స్టేషన్ పరిధిలో ఉండడంతో గంజాయి, బంగారం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. రైల్వే పోలీసుల సహకారంతో నిత్యం తనిఖీ చేస్తున్నాం. నైట్‌బీట్, బ్లూ కోల్ట్, మొబైల్ వాహనాలతో పహారా కాస్తున్నాం. డయల్ 112కు కాల్స్ రాగానే వెంటనే సిబ్బంది అప్రమత్తమై ఘటనా స్థలానికి వెళుతున్నారు.

'హామీలు విస్మరించిన ప్రభుత్వం'

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : మీసేవ ఒప్పంద ఉద్యోగులను ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడం దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మీసేవ ఒప్పంద ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు అమరావతిలో జరగనున్న రిలే నిరాహార దీక్ష శిబిరాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఆదుకుంటామని ఎన్నికల సమయంలో నారా లోకేశ్ హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటై రెండో సంవత్సరం జరుగుతున్నా పట్టించుకోలేదని అసోసియేషన్ నాయకురాలు కె.సునీత ఆరోపించారు. ఇందుకు నిరసనగా తిరుపతి నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమైందని, 17వ తేదీ జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లికార్జున, భువనేశ్వరి, ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.

గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెంచలయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నెల్లూరుగ్రామీణం: మాఫియా చేతిలో ప్రాణాలు కోల్పోయిన పెంచలయ్య కుటుంబాన్ని ఆర్డీటీ కాలనీలో కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. అసోసియేషన్ తరఫున రూ.10 వేల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. పెంచలయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీడబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రతాప్‌కుమార్, గౌరవాధ్యక్షుడుశ్రీనివాసులు పాల్గొన్నారు.

నాణ్యతగా పనులు: మంత్రి

నెల్లూరు (నగరపాలకసంస్థ): అభివృద్ధి పనులు నాణ్యతగా చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సిబ్బందికి సూచించారు. ఆదివారం నగరంలోని 48వ డివిజన్ పొర్లుకట్టలో పలు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వైవో నందన్, డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్‌యాదవ్, తహసీన్, నాయకులు తాళ్లపాక అనూరాధ, విజేతరెడ్డి పాల్గొన్నారు.

శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకోండి : డీఎస్పీ

మనుబోలు: ద్విచక్ర వాహనచోదకులు శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎస్సై రాకేశ్ ఆధ్వర్యంలో దాతలు ధనుంజయరెడ్డి, పద్మనాభరెడ్డి దాతృత్వంతో సుమారు 200 మంది ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణాలు అందజేశారు. అనంతరం ద్విచక్రవాహన చోదకులతో కలిసి ర్యాలీ చేపట్టారు.

11 నుంచి సంకల్ప యాత్ర

నెల్లూరు (పద్మావతి సెంటర్): మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అటల్- మోదీ సుపరిపాలన సంకల్ప బస్సు యాత్ర ఈ నెల 11వ తేదీ ధర్మవరం నుంచి ప్రారంభమవుతుందని భాజపా జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర డిసెంబరు 15తేదీ నెల్లూరుకు చేరుకుంటుందన్నారు. ఈసందర్భంగా జరిగే కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్, పలువురు నాయకులు పాల్గొంటారని వివరించారు.

ప్రథమశక్తిగా గ్రామ దేవత

అమ్మవారిని దర్శించుకున్న రామానందతీర్థ భారతి స్వామి

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: గ్రామశక్తిని ప్రథమ దేవతగా భావించి పూజించాలని రామానంద తీర్థ భారతి స్వామి పేర్కొన్నారు. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మ వారిని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పాలకులు, అధికారులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కోటంరెడ్డి సుజితమ్మ, ఆలయ కమిటీ ఛైర్మన్ సురేంద్రయాదవ్, ఈవో గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బిల్లులు లేకుండా గ్రానైట్ తరలిస్తే ఫిర్యాదు చేస్తాం'

నెల్లూరు (నవాబుపేట), న్యూస్‌టుడే: బిల్లులు లేకుండా గ్రానైట్ రాళ్లు తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని మార్బుల్, గ్రానైట్స్ వ్యాపారులు కోరారు. నగరంలోని కొండాయపాలెంలో రాజస్థాన్ మార్బుల్స్ గ్రానైట్స్ కార్యాలయంలో సమావేశం ఆదివారం జరిగింది. వ్యాపారుల జిల్లా నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ బయట ప్రాంతాల నుంచి బిల్లులు లేకుండా తీసుకొచ్చి అమ్ముతున్నారని, దీంతో దుకాణాలు, ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని వాపోయారు. అనధికారిక తరలింపును అడ్డుకోవాలని అధికారులను కోరారు. తెలిస్తే సమాచారం ఇస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గణేష్, రాజేష్, తారకేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం.. అనుసంధాన మార్గం

నగరంలోని జీఎన్‌టీ రోడ్డులో నుంచి ఏకే నగర్ వెళ్లే మార్గం వర్షాలకు దెబ్బతింది. గుంతలు పడడంతో వాహనచోదకులు రాకపోకలకు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కంకర రాళ్లు తేలడంతో రాత్రిళ్లు ద్విచక్రవాహనచోదకులు అదుపు తప్పి పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

పూడిక చేరి.. మురుగు పారక

నగరంలోని మూలాపేట రామయ్య బడి వద్ద కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. ఈ ప్రాంతంలో ఆక్రమణలకు గురైంది. వంతెన వద్ద చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు చేరడంతో ప్రవాహం సాగడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. -న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

కూలితే ప్రమాదమే

నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో ఓ చెట్టు ప్రమాదకరంగా మారింది. బస్సులు బస్టాండులోకి వెళ్లే మార్గంలో ఆవరణలో పూర్తిగా ఎండిపోయి ఉంది. రాకపోకలు సాగించే సమయంలో ఎక్కడ కూలి పడుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(ఆర్టీసీ)

గేటు తీయరు.. కష్టాలు తీరవు

నగరంలోని విజయమహల్ వద్ద రైల్వే గేటు ఏడాది క్రితం మూసేశారు. ఆత్మకూరు బస్టాండు వద్ద అండర్ బ్రిడ్జి, వంతెన మరమ్మతుల కారణంగా మూసివేయడంతో వాహనదారులు విజయమహల్ గేటు మీదుగా నగరంలోకి వస్తున్నారు. బాక్స్ టైప్ బ్రిడ్జిలో వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. ఇందులో నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

నిరుపయోగంగా చేతిపంపు

నగరంలోని 12వ డివిజన్ చింతారెడ్డిపాళెంలో సాల్వేషన్ ఆర్మీ చర్చి సమీపంలో బోరు నిరుపయోగంగా మారింది. కార్పొరేషన్ అధికారులు నిర్వహణను విస్మరించడంతో దాని చుట్టూ ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. స్థానికులు నీటిని పట్టుకునేందుకు వీలు లేక అవస్థలు పడుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

సమాజంపై అవగాహన కల్పించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

మాట్లాడుతున్న ఉన్నత విద్యాశాఖ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్

నెల్లూరు (నవాబుపేట), న్యూస్‌టుడే: యువతకు సమాజంపై అవగాహన కల్పించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎమ్.సుధాకర్ తెలిపారు. నారాయణ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆదివారం నగరంలోని సౌత్‌రాజుపాలెంలో ప్రత్యేక శిబిరం నిర్వహించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అప్సడా రాష్ట్ర కో వైస్ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, నారాయణ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, మేల్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల లీడర్ నరసింహరెడ్డి, ఫిమేల్ వాలంటీర్ల లీడర్ వైదేహి, విజువల్ కమ్యూనికేషన్, పబ్లిక్ రిలేషన్ విభాగం హెచ్‌వోడీ శేఖర్‌రెడ్డి, నారాయణ హాస్పిటల్ రీజనల్ ఇన్‌ఛార్జి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దేవుడి భూములు కూడా ఆక్రమణ: కాకాణి

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ భూములతో పాటు దేవుడి భూములు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

పొంగిన ఉప్పవాగు.. రాకపోకలకు అంతరాయం

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ మండలం ఉప్పవాగు పొంగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు నిలిచిపోయినా.. వాగులో నీరు పెద్దఎత్తున ప్రవహిస్తూ పంట పొలాలను ముంచెత్తుతోంది. పొదలకూరు మండలం తోడేరు, రత్నగిరి, అయ్యగారి పాళెం ప్రాంతాల్లో వర్షాల కారణంగా ఎల్లవ నీరు ఉప్పవాగు ద్వారా నెల్లూరు రూరల్ మండలం ఉప్పుటూరు- కందమూరు మధ్య సౌత్‌మోపూరులోని కొత్త, పాత చెరువులకు చేరుతోంది. రూరల్ మండల పరిధిలో మూడు కిలోమీటర్ల మేర ఈ వాగు వెళుతోంది. దీని వెంబడి పరిసర ప్రాంతాల్లో వందల ఎకరాల పంట పొలాలున్నాయి. పూడిక తీయకపోవడం, ఎటు చూసినా జమ్ము, కంప చెట్లతో వాగు నిండిపోయింది. పలుచోట్ల వాగు పూడింది. దీంతో వారం రోజులపాటు భారీ వర్షాలు కురవడంతో వాగు పొంగి ఎల్లవ నీరు పొలాల్లోకి ప్రవహిస్తున్నాయి. ఇసుకమేటలు వేసి నారుమడులు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. కందమూరు- ఉప్పుటూరు మధ్య కాజ్‌వేపై పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటు రాకపోకలు సాగిస్తున్నారు. వాగులో పూడిక తీయించడంతో పాటు కాజ్‌వే వద్ద చిన్నపాటి బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కందమూరు - ఉప్పుటూరు మధ్య కాజ్‌వేపై ప్రవహిస్తున్న నీరు

117 మద్యం బాటిళ్లు స్వాధీనం

నెల్లూరు (నేర విభాగం): మద్యం బాటిళ్లు నిల్వ చేసిన ప్రాంతంలో సంతపేట పోలీసులు ఆదివారం దాడులు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కావలి ముసునూరుకు చెందిన సీహెచ్ మల్లికార్జున కామాటి వీధిలో చైతన్య ధర్మకాటా నిర్వహిస్తున్నారు. ఆయన దుకాణంలో మద్యం బాటిళ్లు ఉంచారని సమాచారం అందింది. దీంతో సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య నేతృత్వంలో ఎస్సై బాలకృష్ణ దాడి చేశారు. వివిధ కంపెనీలకు చెందిన 117 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వీటిపై లేబుళ్లు లేకపోవడంతో ఎక్కడి నుంచి వచ్చాయి.. ఎవరు తెచ్చారనే దానిపై ఆరా తీస్తున్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

జూదరుల్లో మహిళ

నెల్లూరు (నేర విభాగం): జూద స్థావరంపై పోలీసులు దాడులు చేసి నలుగురు జూదరులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఎన్టీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్నారని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావుకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. జూదం ఆడుతున్న కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాలేనికి చెందిన జి.ఆదిశేషయ్య, ఎం.అన్వర్, నెల్లూరు చంద్రమౌళినగర్‌కు చెందిన ఇ.నాగరాజుతో పాటు ఓ మహిళని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

రైలు కింద పడి మహిళ దుర్మరణం

నెల్లూరు (నేర విభాగం): వెళుతున్న రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు రైలు, ప్లాట్‌ఫారం మధ్యలో ఇరుక్కుపోయి ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. అస్సాం రాష్ట్రం నాగాన్ ప్రాంతానికి చెందిన సోనా బోర్డోలాయ్ తమిళనాడులోని తాంబరంలో పనులు చేసేందుకు రైలులో వెళుతున్నారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఆపగా.. తాగునీరు తెచ్చుకునేందుకు దిగిన ఆమె తిరిగి ఎక్కే ప్రయత్నంలో రైలు బయల్దేరడంతో రైలు, ప్లాట్‌ఫారం మధ్యలో పడి దుర్మరణం చెందింది. రైల్వే ఎస్సై హరిచందన మృతదేహాన్ని పరిశీలించారు.

నిబంధనలపై ట్రాక్టర్ల డ్రైవర్లకు అవగాహన

డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని, ప్రతిఒక్కరూ పాటించాలని సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరెడ్డి సూచించారు. ఆదివారం నగరంలోని ట్రాక్టరు, ట్రక్కు డ్రైవర్లకు పొట్టేపాలెం వద్ద అవగాహన కల్పించారు. రేడియం స్టిక్కర్లు అంటించి నియమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం ప్రమాదాలకు దారి తీస్తుందని సూచించారు. ట్రక్కుపై పట్టాలు కప్పాలన్నారు. విధిగా లైసెన్సులు ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్సై చంద్రమౌళి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదుకోవాలని కళాకారుల వినతి

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: డ్యాన్స్ పైనే ఆధారపడి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమను ఆదుకోవాలని డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వేమిరెడ్డి దంపతులను కోరారు. ఈమేరకు నెల్లూరులో ఆదివారం ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాయి, కోశాధికారి చంద్ర, కన్వీనర్లు కోదండపాణి, రమణయ్య, కరిముల్లా, రూప, మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలను ఆదుకోవాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 54వ డివిజన్‌లో ఆవాజ్ జిల్లా అయిదో మహాసభలు జరిగాయి. జిల్లా నూతన కమిటీ కార్యదర్శి రషీద్ మాట్లాడుతూ అందరినీ కలుపుకొని ఉద్యమం చేసి హక్కులు సాధిస్తామని తెలిపారు. మహాసభల్లో ఏడు తీర్మానాలను ఆమోదించారు. 27 మందితో జిల్లా నూతన కమిటీని ఏర్పాటుచేశారు. వెంకటేశ్వరపురం సెంటర్‌లో జెండా ఆవిష్కరించి.. ర్యాలీగా మహాసభల ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం గంజాయి మాఫియా చేతిలో హతమైన పెంచలయ్య కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నూతన అధ్యక్షులు సయ్యద్ రఫీ, కోశాధికారి మహమ్మద్ సర్దార్, షేక్ రియాజ్, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటరుపై పీడీ యాక్ట్

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఎన్నిసార్లు హెచ్చరించినా నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటరుపై వేదాయపాలెం పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో గాంధీనగర్‌కు చెందిన షేక్ జాకీర్‌బాషాపై హత్య కేసుతో పాటు ఏడు నేరాలు ఉన్నాయి. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఆదివారం వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు పీడీ యాక్ట్ నమోదు చేసి కేంద్ర కారాగారానికి తరలించారు. ఇప్పటివరకు స్టేషన్ పరిధిలో అయిదుగురిపై ఈ యాక్ట్ ప్రయోగించామని సీఐ తెలిపారు.

కానరాని స్వచ్ఛత దోమలతో కలత

పోలీసు కాలనీలో డంపింగ్ యార్డుగా మారిన రైల్వే స్థలం

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

నగరంలో ఇటీవల నాలుగు రోజులు భారీ వర్షాలు కురిశాయి. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. మెరుగుపరచడంలో నగరపాలకసంస్థ ఆరోగ్య విభాగం నిర్లక్ష్యం వహిస్తోంది. 14 ఏళ్ల కిందట నగరపాలకసంస్థగా మారిన నగరంలో ఇప్పటికీ చెత్త సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈమేరకు సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఏటా రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా సమస్య తీరడం లేదు. ఆదివారం వస్తే చెత్త సేకరణకు సెలవు ప్రకటించేస్తున్నారు.

నగర విస్తీర్ణం:	150 కి.మీ
డివిజన్లు:	54
శానిటరీ డివిజన్లు:	21
సొసైటీ కార్మికులు:	877
శాశ్వత కార్మికులు:	344
కాంట్రాక్టు కార్మికులు:	200

రోజుకు ఎంతంటే.. నగరంలో 10 లక్షల జనాభా ఉన్నారు. ప్రతిరోజూ కనీసం 320 మెట్రిక్ టన్నుల చెత్త వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీన్ని సేకరించి నగరానికి దూరంగా తరలించాల్సిన బాధ్యత నగరపాలకసంస్థపై ఉంది. వందల సంఖ్యలో కార్మికులు, పదుల సంఖ్యలో వాహనాలు.. రూ.కోట్లలో ఖర్చు చూపుతున్నారు. సిబ్బందికి జీతాల రూపేణా ప్రతి నెలా రూ.2 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇవి కాక చెత్త సేకరణ కోసం ఏడాదికి రూ.10 కోట్లు వెచ్చిస్తున్నట్లు నగరపాలకసంస్థ లెక్కలు చూపుతోంది.

ఖాళీ స్థలాలు.. రోగాలకు నిలయాలు: నగరంలో అయిదు వేలకు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఎక్కడ చూసినా మురుగు, వర్షపు నీరు చేరి ఇవి చెరువులను తలపిస్తున్నాయి. మరికొన్నింటిని స్థానికులు డంపింగ్ యార్డులుగా మార్చివేశారు. కొందరు చెత్త అక్కడే కాల్చి వేస్తున్నారు. పిచ్చిమొక్కలు మొలిచి అడవులను తలపిస్తున్నాయి. విషపురుగులు చేరి స్థానికులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. వీటిని చదును చేయించాల్సిన యజమానులు పట్టించుకోవడం లేదు.

విలువిద్య క్రీడాకారులకు అభినందనలు

క్రీడాకారులతో నిర్వాహకులు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల సబ్ జూనియర్, సీనియర్ విలువిద్య పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓ కల్యాణ మండపంలో అభినందన సభ జరిగింది. పతకాలు సాధించిన వెంకటలోకేష్, మహీధర్, దీత్యాచండిక, పి.రాజేష్, తరుణీష్‌జాత్యా, తన్విసాయి అశ్విని, సాయి మౌర్యను అభినందించారు. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి డీఎస్‌డీవో జసీమ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం మహేష్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు పాల్గొన్నారు. అంతర్జాతీయ చెస్‌లో రేటింగ్ సాధించడం అభినందనీయమని రాష్ట్ర చదరంగం సమాఖ్య ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. ఇటీవల బెంగళూరు, విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫిడే చెస్ రేటింగ్ టోర్నమెంటులో నగరానికి చెందిన ఎస్వీ చెస్ అకాడమీ క్రీడాకారులు ఆర్.నేహ, ఎం.సుదీక్ష, వి.క్షవిక్, సయ్యద్ షహీజ్, నితీష్, చెరిష్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆదివారం అకాడమీలో క్రీడాకారులకు అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు ఎస్.వంశీకృష్ణ, సుధాశ్రీ, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

(c) eenadu

పెట్రోలు బంకుల్లో మొక్కజొన్న కంకులు

జిల్లాలోని చాలా గ్రామాలకు కర్ణాటక రాష్ట్రంతో సరిహద్దు ఉంటుంది. అనంతపురం జిల్లా విడపనకల్లు మండల కేంద్రం నుంచి 3 కి.మీల దూరంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రారంభమవుతుంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో పెట్రోలు రూ.109.80, డీజిల్ రూ.97.49 ఉంటే.. కర్ణాటకలో రూ.104.06, డీజిల్ రూ.92.16కే లభిస్తోంది. దీంతో మన రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న పెట్రోలు పంపులు రెండున్నరేళ్లుగా మూతపడ్డాయి. ఇలా మూతబడిన ఓ బంకులో ఓ రైతు మొక్కజొన్న కండెలను ఎండబెట్టుకుంటున్నాడు.

- ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, ఉరవకొండ

సజావుగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కొత్తచెరువు,న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు 2632 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప, జిల్లా పరీక్షల విభాగం ఏడీ లాజర్ తెలిపారు. ఆదివారం 2696 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 64 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మొత్తం 13 పరీక్షల కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. ప్రభుత్వ పరీక్షల సంచాలకుడి కార్యాలయం వెబ్‌సైట్‌లో 8వ తేదీ నుంచి ప్రాథమిక కీ అందుబాటులో ఉంటుందన్నారు.

భారీగా హవాలా నగదు జప్తు?

పుట్టపర్తి, ఈనాడు: ముంబయి నుంచి బెంగళూరుకు ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.కోటికి పైగా హవాలా నగదును ఐదు రోజుల క్రితం పెనుకొండ శివారులో పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిసింది. గత మంగళవారం పెనుకొండ మండలంలోని హరిపురం శివారులో 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు ఓ కారును ధ్వంసం చేసి.. ఓ వ్యక్తిని బలవంతంగా మరో కారులో ఎక్కించి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు పట్టణ శివారులో అనుమానాస్పదంగా వెళుతున్న ఓ కారును అడ్డగించి సోదాలు నిర్వహించారు. అందులో రూ.కోటికి పైగా హవాలా నగదు గుర్తించి సీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసు బృందాలు బెంగళూరు, చెన్నైల్లో విచారణ చేస్తున్నట్లు సమాచారం.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కదిరి, పెనుగొండ, ధర్మవరం ఆర్డీఓ కార్యాలయాలతో పాటు పురపాలిక, మండల కేంద్రాల్లోనూ అధికారులు వినతులు స్వీకరిస్తారని, వాటిని ప్రజావేదిక అర్జీలుగానే పరిగణించి పరిష్కరిస్తామన్నారు. వివరాలకు కాల్ సెంటర్ నంబర్ 1100ను సంప్రదించాలన్నారు. అర్జీదారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డులు తేవాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని ఆయన వెల్లడించారు.

అన్నదాతల ఆశలకు గండి

- తెగిన హెచ్చెల్సీ ప్రధాన, పీఏబీఆర్ కుడి కాలువల గట్లు
- పంట పొలాల్లోకి చేరిన నీరు
- అధికారుల నిర్లక్ష్యవైఖరి ఫలితం

కూడేరు మండలం జల్లిపల్లి సమీపాన తెగిపోయిన పీఏబీఆర్ కుడి కాలువ గట్టు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), బొమ్మనహాళ్, ఉరవకొండ, న్యూస్‌టుడే: అధికారుల్లో ముందుచూపు కొరవడింది. కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. వారి నిర్వాకం.. నిర్లక్ష్యం మూలంగా ఒకే రోజులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎంతో కీలకమైన హెచ్చెల్సీ ప్రధాన కాలువ, పీఏబీఆర్ కుడి కాలువ గట్లు తెగిపోయాయి. ఆదివారం ఉదయం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు 113-507 కిలోమీటర్ల వద్ద హెచ్చెల్సీ కాలువకు గండి పడి సుమారు 100 క్యూసెక్కుల నీరు వృథాగా పోయింది. 2023లోనూ ఇక్కడే కాలువకు రంధ్రం పడినప్పుడు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతోనే మళ్లీ పరిస్థితి పునరావృతమైంది. నిరంతరం కోతకు గురై వరి మళ్లలోకి వెళ్లడంతో సుమారుగా 200 ఎకరాల్లో పంటకు నష్టం కలిగినట్లు అన్నదాతలు వాపోయారు. అధికారులు టీబీ డ్యాం ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి ప్రవాహాన్ని నిలిపివేయించి గండిని తాత్కాలికంగా పూడ్చారు. ఇదిలా ఉండగా దిగువన కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ గట్టు కోతకు గురైంది. నీరు పెద్దఎత్తున పంట పొలాల్లోకి వెళ్లడంతో సుమారు 50 ఎకరాల్లో కంది, వరికి నష్టం వాటిల్లింది. కొర్రకోడు డ్యాం సమీపంలోని ఎస్కేప్ ఛానల్ ద్వారా నీటిని పెన్నానదికి మళ్లించడంతో ప్రవాహం తగ్గింది. అంతకుముందు.. కాలువ తెగిన ప్రదేశంలో వెంటనే మరమ్మతు పనులను చేపట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు జిల్లా జలవనరులు అధికారులను ఆదేశించారు.

ఉద్దేహాళ్ వద్ద కోతకు వచ్చిన వరి పొలంలోకి చేరిన నీరు

కాలువ గట్ల దుస్థితిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

● రెండు కాలువల గట్లు బలహీనంగా ఉన్నాయని.. ముప్పు పొంచి ఉందని, శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సిన తీరుపై 'ఈనాడు' పలు కథనాలను ప్రచురించింది. కూటమి ప్రభుత్వం సైతం అత్యవసర మరమ్మతుల కోసం రూ.కోట్లల్లో నిధులు ఇచ్చింది. అధికారులు నిర్వహణపై మొదటి నుంచి నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఇప్పటికే ప్రధాన కాలువపై పర్యవేక్షణ కొరవడింది. దీనివల్లే ప్రాథమిక దశలోనే నీటి లీకేజీ, గండ్లను గుర్తించలేకపోయారు.

బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద కాలువకు గండిపడి వాగులోకి వెళుతున్న నీరు

గేట్లు దయనీయం.. గట్లు బలహీనం

రెండు వారాలకుపైగా కఠోరంగా శ్రమిస్తే తప్ప.. పీఏబీఆర్ కుడి కాలువ గేటు (షట్టర్) పైకి లేవలేదు. నానా అవస్థలతో తెరిచి ఈనెల ఒకటో తేదీన కుడి కాలువకు నీటిని విడుదల చేశారు. కాలువ పొడవు 112 కి.మీ. ఉండగా.. ఆదివారం ఉదయం 8 గంటలకు 80.7 కి.మీ. దాకా నీరు వెళ్లాయి. ఈలోగా కాలువ మొదట్లోనే 4.460 కి.మీ. వద్ద తెగిపోయింది. కాలువ ప్రవాహ సామర్థ్యం 821 క్యూసెక్కులు కాగా.. ఆదివారం ఉదయం నాటికి 790 క్యూసెక్కులు కొనసాగింది. కాలువ బలహీనంగా ఉందని తెలిసినా ప్రవాహం ఎక్కువ పెంచడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

● కుడి కాలువ, దీని అనుబంధ ధర్మవరం ఉప కాలువ, బి.పప్పూరు కాలువలను శుభ్రం చేయడానికి, నిర్దేశిత మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం రూ.2.12 కోట్లు మంజూరు చేసింది. కాని.. ఈ కాలువ 0-40 కి.మీ వరకు అసలు శుభ్రంతోపాటు చిన్నపాటి మరమ్మతులు చేయలేదు. 0-25 కి.మీ. దాకా అసలు పనుల అంచనాలే తయారు చేయకపోవడం గమనార్హం. ఇందుకు హెచ్చెల్సీ డివిజన్ అధికారుల నిర్లక్ష్యమే కారణం. కాలువలో జమ్ముగడ్డి, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. గట్లన్నీ శిథిలం అయ్యాయి. గట్టుపై తిరగడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది.

ప్రధాన కాలువపై పర్యవేక్షణ లోపం

హెచ్ఎల్సీ ప్రధాన కాలువపై పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 2023లో తెగిన చోటే.. తాజాగా కాలువ గట్టు తెగిపోవడం గమనార్హం. అప్పట్లో తూతూమంత్రంగా మరమ్మతులు చేసినట్లు తేటతెల్లమైంది. అంతేకాదు... ఈ ఏడాది నీటి సీజన్‌కు ముందే అత్యవసర మరమ్మతు పనుల కోసం కూటమి ప్రభుత్వం రూ.33.89 కోట్లు మంజూరు చేసింది. 11 కీలక పనులకు సదరు నిధులను వెచ్చించారు. ఇదే క్రమంలో హెచ్చెల్సీ ప్రాజెక్టు పరిధిలో 181 పనులకు మరో రూ.14.88 కోట్లు ఇచ్చింది. మరమ్మతులతోపాటు కాలువలను సకాలంలో శుభ్రం చేయలేదు. ఒక్క రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోనే 36 పనులు చేశారు. అయినా ప్రధాన కాలువనే తెగిపోయింది. కాలువ ప్రవాహం సామర్థ్యం 2400 క్యూసెక్కులు.. ఆదివారం నీటి ప్రవాహం 1746 క్యూసెక్కులు మాత్రమే. అయినప్పటికీ కోతకు గురికావడం నిర్వహణ లోపానికి నిదర్శనం.

పట్టుచీరకు జరీ ధరాఘాతం

అదనపు భారంతో నేతన్న కుదేలు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టు చీరల తయారీలో ఉపయోగించే జరీ ధరలు అమాంతం పెరగడం చేనేత కార్మికులకు భారంగా మారింది. వెండి, బంగారం ధరలకు రెక్కలు రావడమే దీనికి కారణం. ఒక్కో జరీ మార్కుపై రూ.150 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. పట్టుచీర తయారీలో పట్టుదారంతో పాటు జరీ వాడుతారు. ఒక్కో చీరకు రెండు నుంచి మూడు జరీ మార్కులు అవసరమవుతాయి. దీనివల్ల ఒక్కో చీరకు రూ.300 నుంచి రూ.400 వరకు తయారీదారుడు అదనంగా వెచ్చించాలి. ఇప్పటికే ముడిపట్టు కిలో రూ.6500కు చేరడంతో ఒక్కో పట్టుచీరపై రూ.వెయ్యి, జరీతో అదనంగా మరో రూ.400 భారం పడుతోంది. మరోవైపు విపణిలో చీర ధర పెరగడం లేదు. ఫలితంగా అటు చేనేత ఇటు మరమగ్గాలపై చీరలు రూపొందిస్తున్న కార్మికులపై ఆర్థిక భారం పడుతోంది.

మగ్గంపై జరీతో పట్టుచీర నేస్తున్న కార్మికుడు

- ఉమ్మడి జిల్లాలో చేనేత మగ్గాల సంఖ్య: **24 వేలు**
- మరమగ్గాలు: **22 వేలు**
- మగ్గాలపై ప్రతి నెలా తయారయ్యే పట్టుచీరలు: **96 వేలు**
- మరమగ్గాలపై రూపొందించే చీరలు: **5.5 లక్షలు**
- 6 నెలల క్రితం జరీ మార్కు ధర: **రూ.500**
- ప్రస్తుతం ధర: **రూ.650 నుంచి రూ.700 వరకు**

పెరిగిన వెండి ధరతోనే...

గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో జరీ తయారీ పరిశ్రమలు అధిక సంఖ్యలో ఉన్నాయి. పట్టుదారంపై వెండి, బంగారు, రాగి పూతతో అక్కడి కార్మికులు నైపుణ్యంగా జరీ తయారు చేస్తున్నారు. ఆరు నెలలుగా వెండి, బంగారు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. జరీ తయారీలో అధికంగా వెండి వినియోగిస్తుంటారు. దీనివల్ల వెండి జరీ మార్కుపై రూ.150 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఆరు నెలల క్రితం బంగారు జరీ మార్కు రూ.30వేలు పలికేది. ప్రస్తుతం రూ.35వేలకు చేరింది. అదనంగా రూ.5వేలు పెరగడంతో బంగారు జరీతో తయారు చేయించే పట్టుచీరల వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రభుత్వం స్పందించి జరీ మార్కు ధరలు స్థిరంగా ఉండేలా చూడాలని వ్యాపారులు, నేతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సొంతిల్లు కల సాకారానికి అవకాశం

● 14 వరకు దరఖాస్తుకు గడువు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన కింద అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈమేరకు వేలాదిగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈనేపథ్యంలో దరఖాస్తు గడువును ఈనెల 14 వరకు పొడిగించారు. ఈనెల ఒకటో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 55,199 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి వెంకటనారాయణ తెలిపారు. పట్టణ పరిధిలో ఇల్లు మంజూరైతే రూ.2.50 లక్షలు, గ్రామీణంలో రూ.1.80 లక్షలు చొప్పున అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇంటి స్థలం లేదా ప్రభుత్వం ఇచ్చిన పట్టా కలిగి ఉండాలి. స్థలంలో లేకపోయినా నమోదు చేసుకోవచ్చు. రేషన్‌కార్డు, ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు, ఆధార్ ప్రతులు అందజేయాల్సి ఉంటుంది. గతంలో లబ్ధిపొందిన వారికి ప్రస్తుత పథకం వర్తించదు.

జిల్లాలో ఇలా..

నియోజకవర్గం	దరఖాస్తులు
మడకశిర	16,915
పెనుకొండ	9,352
కదిరి	7,484
ధర్మవరం	6,216
పుట్టపర్తి	6,179
రాప్తాడు	5,432
హిందూపురం	3,621

అతివల భవితకు ఉషస్సు!

గుంతకల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని, సాధికారత సాధన కోసం ఎన్డీయే ప్రభుత్వం గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసింది. రాష్ట్రంలో గుంతకల్లుతోపాటు శృంగవరపుకోటలోని కళాశాలలను పీఎం ఉష పథకం కింద ఎంపిక చేసి అమలు చేయడం ప్రారంభించింది. మహిళలు విద్యతోపాటు, వివిధ అంశాల్లో శిక్షణ పొందడానికి ఇబ్బందులు పడుతున్నారని.. మధ్యలో చదువు నిలిపివేస్తున్నారని సర్కారు గుర్తించి... వారి అభ్యున్నతికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోంది.

రూ.10 కోట్లు కేటాయింపు

మహిళలకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలుగజేయడానికి రూ.10 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో రూ.6కోట్లతో హాస్టల్ భవనాల నిర్మాణం సాగుతోంది. శిక్షణ పరికరాలు కొనుగోలుకు రూ.2.50 కోట్లు, ఇతర సామగ్రికి రూ.1.50 కోట్లు వ్యయం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం 25 కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్లు, ప్రింటర్లు, ఎల్ఈడీ స్క్రీన్‌లు, ప్యానళ్లు సరఫరా చేసింది. హాస్టల్ భవనాల పనులు పూర్తయితే ఇతర సామగ్రిని సరఫరా చేయనుంది.

★ ఇప్పటికే అధికారులు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వసతిగృహాలు అందుబాటులోకి వస్తే కొత్త కోర్సుల్లోనూ తర్ఫీదు ఇస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మహిళలే కాకుండా రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా నివసిస్తున్న వారు హాస్టల్‌లో చేరడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

ఎందులో తర్ఫీదు ఇస్తారంటే..

- డ్రోన్‌ల వినియోగం
- కృత్రిమ మేధస్సు
- ఆత్మవిశ్వాసం
- ఆరోగ్య పరిరక్షణ
- స్వీయరక్షణ
- చట్టాలపై అవగాహన

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరిన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర సామగ్రి

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-డాక్టర్ లక్ష్మయ్య, ప్రధానాచార్యులు

ఉష పథకాన్ని మహిళలు పూర్తిగా సద్వినియోగం చేసుకుని జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గుంతకల్లులోని ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ఆసక్తి ఉన్న మహిళలు అవకాశాన్ని అందిపుచ్చుకుని ముందడుగు వేయాలి.

ముగిసిన రష్యా భక్తుల పర్తియాత్ర

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి మానవాళి పట్ల చూపిన ప్రేమ, వాత్సల్యాలను వివరిస్తూ నిర్వహించిన సంగీతగాన కచేరి భక్తులను కట్టిపడేసింది. ఆదివారం సాయికుల్వంత్ మందిరంలో రష్యా భక్తబృందం ప్రేమ.. సాయికి వందనం పేరిట సంగీతకచేరి నిర్వహించింది. వంద వసంతాల ప్రేమపేరుతో మధురమైన సాయికీర్తనలను ఆలపించారు. రష్యా భక్తులకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ వస్త్రాలను అందజేశారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. రెండు రోజుల రష్యా భక్తుల పర్తియాత్ర ఆదివారంతో ముగిసింది.

ప్రశాంతి నిలయంలో రష్యా భక్తులకు వస్త్రాలు అందజేస్తున్న ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని అధిగమించడానికి అనంతపురం మీదుగా చెర్లపల్లి - యలహంక మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు డివిజన్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న రైలు (07187) చెర్లపల్లిలో రాత్రి 10 గంటలకు బయలుదేరి కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, ప్రశాంతి నిలయం గుండా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 11.45కు యలహంక చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో రైలు (07188) యలహంకలో 9న మధ్యాహ్నం 1 గటకు బయలుదేరి ఇదే మార్గంలో ప్రయాణించి చెర్లపల్లికి మరుసటి రోజ తెల్లవారుజామున 4.30కు చేరుకుంటుందన్నారు.

27 నుంచి ఇస్తెమా నిర్వహణ

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సున్నపుగుట్ట తండా బాహ్యవలయ రహదారి సమీపంలో 27, 28 తేదీల్లో ముస్లిం సోదరుల ఆధ్యాత్మిక కార్యక్రమం ఇస్తెమా నిర్వహించనున్నారు. ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇస్తెమా నిర్వహించే ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ముస్లిం మతపెద్దలు, నిర్వాహకులతో కలిసి పరిశీలించారు. అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్తు సరఫరా, నీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇస్తెమాకు హాజరయ్యే ముస్లిం సోదరులకు అన్ని సదుపాయాలు ప్రభుత్వపరంగా కల్పిస్తామన్నారు. డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐలు నిరంజన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రెవెన్యూ, విద్యుత్తు శాఖల సిబ్బంది, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఇర్షాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

తలనీలాల సొమ్మేది స్వామీ!

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ఏటా లక్ష మంది వరకు భక్తులు దర్శించుకుంటుంటారు. వారిలో ఏడాది కాలంలో దాదాపు 20 వేల మంది వరకు తలనీలాలు సమర్పిస్తుంటారు. ఏటా తలనీలాల సేకరణ ప్రక్రియకు ఆలయ అధికారులు వేలం పాట నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 2023-24 ఏడాదికిగాను రూ.52.5లక్షలకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దక్కించుకున్నాడు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉరవకొండ ప్రాంతానికి చెందిన గుత్తేదారు రూ.27 లక్షలకు సేకరణ హక్కులను పొందాడు. ఈఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు మూడుసార్లు టెండర్లను నిర్వహించగా వాయిదా పడుతూ వస్తున్నాయి.

కొంతే చెల్లింపు.. మిగతాది మమ

తలనీలాల టెండర్లలో ఖరారైన పూర్తి మొత్తం ఆలయ ఖాతాకు చేరడం లేదు. 2023-24లో రూ.52.5లక్షలకు గాను రూ.36.5లక్షలు, 2024-25లో రూ.27లక్షలకు గాను రూ.9.5లక్షలు గుత్తేదారు చెల్లించారు. అందులో రూ.6.5లక్షలు ఆలయ ఖాతాకు జమ చేసి, మిగతా రూ.3లక్షలు ఓ అధికారి తన సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి సంబంధించి గుత్తేదారుకు రసీదు ఇవ్వలేదని తెలిసింది. ఇదిలా ఉండగా టెండరు కాలం ముగిసిపోయి నెలలు గడుస్తున్నా... వారి నుంచి పూర్తి మొత్తాన్ని వసూలు చేయడంలో ఆలయ అధికారులు చొరవ చూపడం లేదు. భక్తులు ఎంతో నమ్మకంతో తలనీలాలను సమర్పిస్తే వాటిలోనూ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తున్నా ఉన్నతాధికారులు సైతం తమకేదీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆలయంలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

● గుత్తేదారులకు కనీసం నోటీసులు జారీ చేస్తున్న సందర్భాలు లేవు. ఈ ఏడాదికి సంబంధించి ఆగస్టులోనే టెండర్లు పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటివరకు కొలిక్కి రాలేదు. కొందరు గుత్తేదారులు సిండికేటుగా ఏర్పడి తక్కువ ధరకు దక్కించుకోవడానికి ఎత్తుగడ వేస్తుండటంతో వేలం ప్రక్రియ వాయిదా పడుతూవస్తోంది.

● ఈ అంశంపై దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ సుధారాణిని వివరణ కోరగా... టెండరు మొత్తం వసూలు చేయడంలో అలసత్వం చూపినా, పక్కదారి పట్టించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి

మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు

పూర్తి వివరములకు:
8008709784

నిత్యం పుస్తక పఠనం చేయాలి

కమలానగర్, న్యూస్‌టుడే: జీవితాలలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే నిత్యం పుస్తక పఠనం చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో 'చదువంటే మా కిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో పాటు గ్రంథాలయ సంస్థ అధికారిణి రమ, శిక్షకులు విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీరాములు, డాక్టర్ రామలింగయ్య హాజరై మాట్లాడారు. జీవితాలకు ఉపయోగపడే పుస్తకాలను విద్యార్థి దశ నుంచే చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించి, కథలు, పుస్తక విశ్లేషణ చేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, గోవింద, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీకు కారు ఉందా? ఎందుకు ఇంట్లో నిలబెట్టాలి. హ్యాపీ Car ఇప్పుడు అనంతపురంలో మీ కారుని జోడించి, నెలకు 32,000/- వరకు సంపాదించండి. కాల్: 6301174565.

JOBS

Opportunity for Male Hindi Age 20 to 30 Managers with good Pay in Sainagar, Anantapur. Cell: 8096000222.

Wanted Teachnicians 10th/ Inter/ ITI Pass/ Fail Work at Crompton Service Center Opportunity earn 10K to 12K Per Month Training will Provide ATP. 8330942076

ఇంటర్ కాలేజీలో పనిచేయుటానికి టెలికాలర్స్, ట్యూటర్లు, వార్డెన్లు మరియు పీఆర్వోలు కావలెను. సెల్: 80199 89913, 94400 45441.

ATP ప్లైవుడ్ షాపు నందు అకౌంటింగ్‌లో Tally Input, Output మరియు GST Returns వేయడంలో అనుభవం గల జెంట్స్ మాత్రమే కావలెను. సెల్: 9676358269.

ఓమ్నీ హోంకేర్ నందు వృద్ధులను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 20K. © 89776 39662, 89776 39663.

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు సేల్ ఎగ్జిక్యూటివ్స్ (ఓన్లీ గర్ల్స్) కావలెను. ఇంటర్, డిగ్రీ మాత్రమే. జీతం 14K to 20K. ఇంటర్వ్యూ: 17, 18 తేదీలలో ATP. 9573588092.

పెనుకొండ పట్టణం గ్లోబల్ హోటల్ నందు పనిచేయడానికి అనుభవజ్ఞులయిన ఆల్‌రౌండ్ వంటమాస్టర్లు, కటింగ్ మరియు సప్లయ్ చేయడానికి సప్లయర్లు కావలెను. ప్రతిరోజు పేమెంట్ వసతి భోజనం ఫ్రీ సంప్రదించండి. © 9000559668.

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff For Science and English Subject (3 to 5 Classes) to Work in Blossoms School, Aravind Nagar, ATP. Mob: 9030777676.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నేరాలను కట్టడి చేసి నేరస్థులను జైలుకు పంపించాల్సిన పోలీసుల్లో కొందరు అవినీతికి పాల్పడుతున్నారు. అక్రమార్జనకు అలవాటుపడి కాసుల కక్కుర్తితో కేసులను తారుమారు చేస్తున్నారు. సివిల్ పంచాయతీలు సైతం చేస్తుండటం వివాదాస్పదంగా మారాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం సబ్‌డివిజన్ పరిధిలోని ఎంతోమంది పోలీసులపై విమర్శలు గుప్పుమంటున్నాయి.

పోలీసులు.. దారితప్పి ప్రజల నుంచి వసూళ్లు
పిండేస్తున్నారు కాసులు!

● తాడిపత్రి సబ్‌డివిజన్‌లో ఓ అధికారిని ఉన్నతాధికారులు మూడోసారి వీఆర్‌కు పంపినా ఆయన తీరులో మార్పు రాలేదు. గుంతకల్లు సబ్ డివిజన్‌లో పనిచేసే క్రమంలో వైకాపా నాయకులను అడ్డం పెట్టుకుని ఇసుక దందా చేయించారు. జూదం పెచ్చరిల్లినా మామూళ్లు తీసుకుని పట్టించుకునేవాడు కాదు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను బూతులు తిట్టడం, ప్రశ్నిస్తే చేయి చేసుకోవడం వంటివి ఉండేవి. ఇతని వ్యవహారం తెలిసి వీఆర్‌కు పంపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి సబ్ డివిజన్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరు కానిస్టేబుళ్లను వసూళ్లకు పంపి.. ప్రతి కేసుకూ లెక్క కట్టి వసూలు చేసేవాడు. తాజాగా ఓ ప్రేమజంట విషయంలో పంచాయితీ చేసి డబ్బులు వసూలు చేశాడు. ఎస్పీకి ఫిర్యాదులు అందడంతో పది రోజుల క్రితం మరోసారి వీఆర్‌కు పంపారు.

● అనంతపురం సబ్ డివిజన్‌లో ఓ అధికారి ఏ స్టేషన్‌లో చేరినా వివాదాస్పదమే. ప్రభుత్వం ఏదైనా, అధికారి ఎవరైనా అక్రమాలకు పాల్పడుతుంటాడు. గతేడాది నగరంలో ఓ స్టేషన్‌నుంచి మరో స్టేషన్ బదిలీ అయ్యాడు. మట్కా, జూదం, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా ఉండే ఆ ప్రాంతంలో అక్రమార్కులతో చేతులు కలిపి నెలవారీ వసూళ్లు చేసేవాడు. బియ్యం మాఫియాతో రూ. లక్షల్లో లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపారు.

ఐడీ పార్టీ ముసుగులో..!

ఉరవకొండ సర్కిల్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ ఐడీ పార్టీలో విధులు నిర్వహిస్తున్నాడు. అతడు గత వైకాపా ప్రభుత్వంలో ఉరవకొండలోనే పనిచేశాడు. అప్పట్లో తెదేపా నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేశాడు. ప్రభుత్వం మారాక బదిలీ అయ్యాడు. కొందరు నాయకుల అండతో తిరిగి పాత సర్కిల్‌కు వచ్చాడు. ఆ కానిస్టేబుల్ జనాన్ని వేధిస్తూ, వ్యాపారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. ఎక్కడైనా రద్దీ ప్రాంతం కనిపిస్తే చాలు.. నిలబడి అనధికారిక తనిఖీలు చేసి సొమ్ము చేసుకుంటున్నాడు.

● కళ్యాణదుర్గంలో ఓ కానిస్టేబుల్ జూదం, మట్కా, నాటుసారా కాసేవాళ్లలో మామూళ్లు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడు. స్టేషన్‌కు వచ్చే బాధితులను డబ్బులు తీసుకుని బయటే పంచాయితీ చేసి పంపుతున్నాడు. శెట్టూరు స్టేషన్‌లో ఓ హెడ్‌కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్ ప్రజాకంఠకులుగా మారారు. ఆ స్టేషన్‌కు కొంతకాలం అధికారి లేదు. కేసుకో రేటు నిర్ణయించి బాధితులతో డబ్బులు వసూలు చేశాడు. అదే స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ మద్యం అక్రమార్కులు, జూదం, మట్కా మాఫియాలతో సన్నిహితంగా మెలుగుతూ చేతికందినంత పోగేసుకుంటున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

కనులపండువగా ఖాద్రీశుడి కల్యాణం

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయంలోని కల్యాణ మండపంలో ఆదివారం భక్తులు శ్రీవారికి ఆర్జిత కల్యాణోత్సవాన్ని జరిపించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను వధువూరులుగా శోభాయమానంగా అలంకరించారు. తొలుత హోమం నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామివారి వివాహం శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు స్వామివార్లకు పెళ్లి కానుకలు చదివించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. - **న్యూస్‌టుడే, కదిరి**

పంపనూరు ఆలయ అభివృద్ధే లక్ష్యం

పాలక మండలి సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి భక్తులు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే నేడు ఉచిత బస్సుల కారణంగా భక్తుల సంఖ్య పూర్తిగా పెరిగిపోయిందన్నారు. భక్తులకు అనుగుణంగా ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. భక్తుల కోసం రూ. 30 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. వీటితోపాటు ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 14.50 కోట్లతో ప్రణాళికలు తయారు చేశామని త్వరలోనే దేవదాయశాఖ మంత్రిని కలిసి అనుమతులు తీసుకుంటామన్నారు. అనంతరం నూతన ఆలయ కమిటీ ఛైర్మన్‌గా వేణుగోపాల్ రెడ్డిని ఎంపిక చేసి 11 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ధర్మవరం బాలుర జట్టు ఘన విజయం

89 పరుగులతో రాణించిన గణేష్

మూడు వికెట్లు తీసిన కుందన్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని క్రీడా మైదానంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రూరల్ క్రికెట్ లీగ్ (ఆర్‌సీఎల్) పోటీల్లో ఆదివారం ధర్మవరం బాలుర జట్టు హిందూపురంపై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన హిందూపురం బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌లో ధర్మవరం జట్టు 40 ఓవర్లలో 242 పరుగులు చేసి ఆలౌట్ అయింది. బ్యాటర్లు గణేష్ 89, జావీద్ 43, కుందన్ 31 పరుగులతో రాణించారు. ఛేదనలో హిందూపురం జట్టు 187 పరుగులకే ఆలౌటై ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని చరణ్ అర్ధ సెంచరీ చేశాడు. ధర్మవరం జట్టు బౌలర్లు కుందన్ మూడు, సాయిసంతోష్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బకొట్టారు. ఆస్ట్రో ఫ్యాషన్ యజమాని ఆటగాళ్లకు భోజన వసతి కల్పించారు. ఆల్‌రౌండర్ ప్రతిభ చూపిన కుందన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు, అత్యధిక పరుగులు చేసిన గణేశ్‌కు క్రికెట్ అభిమాని శంకర్ ధావన్ క్రీడా దుస్తులు బహుకరించారు. ఆర్డీటీ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, కోచ్ రాజశేఖర్ మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

క్రికెట్ శిక్షణ వేదికను ప్రారంభించిన డీఆర్ఎం చంద్రశేఖర్, ఏడీఆర్ఎం సుధాకర్

గుంతకల్లు, న్యూస్‌టుడే : క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకుంటూ ఆటల్లో సత్తా చాటుకోవాల్సిన బాధ్యత క్రీడాకారులపై ఉందని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ అన్నారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్మించిన క్రికెట్ శిక్షణ వేదికతో పాటు లాన్‌టెన్నిస్, షటిల్, చిత్రలేఖనం శిక్షణ శిబిరాలను ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైల్వే ఉద్యోగులతో పాటు వారి పిల్లలు క్రీడా వేదికలను వినియోగించుకుంటేనే వాటి కోసం వ్యయం చేసిన నిధులకు సార్థకత ఉంటుందన్నారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయంగా మారడానికి కమిటీ కృషి చేయాలన్నారు. డివిజన్ క్రీడాధికారి, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి ఎల్లప్ప, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి నేతానియల్, కమిటీ సభ్యులు, ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఆర్.ఎన్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

కుంటలో పడి సోదరుల మృత్యువాత

నరేంద్ర

చరణ్

ప్రమాదానికి కారణమైన కుంట ఇదే..

కళ్యాణదుర్గం గ్రామీణం, బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కుంటలో పడి అన్నదమ్ములు నరేంద్ర (22), చరణ్ (18) మృత్యువాత పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం వాల్మీకి సర్కిల్‌లో నివాసం ఉంటున్న వెంకటేశులు- లలితమ్మ దంపతులు పాలవెంకటాపురం గ్రామంలో మామిడి తోపును గుత్తకు తీసుకున్నారు. వీరి కుమారులు నరేంద్ర (భవన నిర్మాణ కూలి), చరణ్ (ద్విచక్ర వాహన మెకానిక్) అవసరమైనప్పుడు తల్లిదండ్రులకు సాయంగా తోటలో పనులకు అప్పుడప్పుడు వెళ్లేవారు. ఆదివారం మామిడి చెట్లకు పురుగుమందు పిచికారీ చేయాలని కూలీలతో కలిసి వెళ్లారు.

ఈత రాకపోవడంతో..

అందరూ పనుల్లో నిమగ్నమైనప్పుడు నరేంద్ర నీటి కుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. దీనిని గుర్తించిన తమ్ముడు చరణ్ అన్నను రక్షించేందుకు నీటిలో దిగాడు. ఇరువురికి ఈత రాకపోవడంతో మునిగిపోయి మృత్యువాతపడ్డారు. కుమారులు ఎంతసేపటికి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతకగా కుంటలో విగత జీవులుగా కనిపించారు. ఎస్సై నరేంద్రకుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాలను పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకసారి చూడవయ్యా.. నాకు దిక్కెవరూ..!

పెళ్లై ఏడాది కాకముందే నన్ను వదలి వెళ్లిపోయావా? తోడు, నీడగా ఉంటావని చెప్పి అంతలోనే కానరాని లోకాలకు వెళ్లిపోతివా? ఇక నాకు దిక్కెవరంటూ నరేంద్ర భార్య చిట్టి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతపురానికి చెందిన చిట్టికి కళ్యాణదుర్గానికి చెందిన నరేంద్రతో 8 నెలల కిందట వివాహమైంది.

కన్నవారికి కడుపుకోత

వెంకటేశులు- లలితమ్మ దంపతులు కుమారులిద్దరిని కంటికి రెప్పలా చూసుకునేవారు. బతుకుదెరువు నిమిత్తం మామిడి తోపులను గుత్తకు తీసుకుంటున్నారు. ఆదివారం సంతోషంగా తోట వద్దకు వెళ్లిన సమయంలో కుమారులిద్దరి మృతితో 'మాకు కడుపుకోత మిగిల్చారా' అంటూ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈఘటనతో కళ్యాణదుర్గంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

హోయసల రాజ్యచిహ్నం గుర్తింపు

చిహ్నం చూపిస్తున్న ఉపాధ్యాయుడు గోపి

బుక్కపట్నం, న్యూస్‌టుడే: బుక్కపట్నంలోని పురాతన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 11వ శతాబ్దానికి చెందిన హోయసల రాజ్యచిహ్నం వ్యాలను గుర్తించినట్లు ఉపాధ్యాయుడు గోపి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ వ్యాల అనేది క్రీ.శ. 11 నుంచి 14వ శతాబ్దం వరకు కర్ణాటకను పాలించిన హోయసల రాజుల రాజ్య చిహ్నమన్నారు. దీన్ని ధైర్యం, శక్తికి ప్రతీకగా భావిస్తారన్నారు. విజయనగర సామ్రాజ్యానికి ముందు బుక్కపట్నం ప్రాంతం హోయసల రాజ్యంలో అంతర్భాగంగా ఉండేదన్నారు. ఇక్కడ మూడు వైష్ణవ దేవాలయాలను నిర్మించారని, వీటిలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఒకటన్నారు. క్షేత్రపాలకుడిగా ఆంజనేయస్వామి ఉన్నారన్నారు. ఈ ఆలయ స్తంభాలపై అద్భుత దేవతా శిల్పాలను చెక్కారని, హోయసల తర్వాత విజయనగర రాజులు రాజపోషకులుగా ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోందని వివరించారు.

చేతివృత్తి కళాకారులను ప్రోత్సహిద్దాం

నేడు నుంచి హస్తకళల వారోత్సవాలు

అరటి నారతో తయారు చేసిన వివిధ రకాల సంచులు

తోలుతో తయారు చేసిన శివాజీ, ఆంజనేయుడి చిత్రాలు

రుద్రంపేట, న్యూస్‌టుడే: చేతి వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న హస్తకళాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. హస్తకళాకారులను ప్రోత్సాహించేందుకు బాధ్యత ప్రజలందరిపై ఉంది. సోమవారం జాతీయ హస్తకళల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా లేపాక్షి ఎంపోరియం విక్రయ కేంద్రాల్లో ఈ నెల 14 వరకు హస్తకళల వారోత్సవాలు నిర్వహణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గడియారం స్తంభం సమీపంలోని లేపాక్షి ఎంపోరియంలో ప్రత్యేక అమ్మకాలు ప్రారంభిస్తున్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచి పుట్టపర్తి (జిల్లా) నిమ్మలకుంట గ్రామంలో తోలుబొమ్మలతో తయారు చేసిన దేవతామూర్తులు, లైటింగ్ ల్యాంప్‌లతోపాటు వివిధ రకాల బొమ్మలు, అనంతపురం జిల్లా కురుగుంట గ్రామంలో అరటి నారతో తయారు చేసిన సంచులు, అల్లికలు, దేవతామూర్తులతోపాటు ఇతర జిల్లాల్లో ప్రసిద్ధి గాంచిన ఏటికొప్పాక బొమ్మలపై 20 నుంచి 30 శాతం రాయితీతో వినియోగదారులకు విక్రయించనున్నట్లు మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. అవకాశాన్ని పుర ప్రముఖులు వినియోగించుకోవాలని కోరారు.

సైనికుల త్యాగాలను ప్రజలంతా గుర్తించాలి

హుండీలో నగదు వేస్తున్న కలెక్టర్ ఆనంద్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దేశ రక్షణలో మన సైనికుల త్యాగాలు ప్రజలు ఎప్పటికీ మరువకూడదని కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. ప్రజల రక్షణ కోసం వారు ప్రాణాలను తెగించి పోరాడుతున్నారు. వారి సంక్షేమం కోసం అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం సాయుధ త్రివిధదళాల పతాక దినోత్సవ ప్రదర్శన ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైంది. కలెక్టర్ విరాళం అందజేసి ప్రసంగించారు. తొలుత జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి. తిమ్మప్ప కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ పతాక నిధికి విరాళం అందజేశారు. అర్హులైన మాజీ సైనికులకు ఇంటిపట్టాలు ఇవ్వడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత ఏడాది దాతలు రూ. 6.68 లక్షల విరాళాలు అందించారు. ఈసారి కూడా దాతలు స్పందించి పెద్దఎత్తున విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రదర్శనకు ముందు తిమ్మప్ప మాట్లాడుతూ.. సరిహద్దుల్లో కాపలా కాస్తూ మరణించిన కుటుంబాల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

విరాళాలు ఇవ్వాలని సూచన

యుద్ధంలో అమరులైన మాజీ సైనికుల కుటుంబాలు, యుద్ధాల్లో పాల్గొని పింఛను లేని వారి కోసం విద్యార్థులు కూడా విరాళాలు ఇవ్వాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి చిరంజీవి రెడ్డి పిలుపునిచ్చారు. ఎరా అంతర్జాతీయ పాఠశాల, ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులతో మాట్లాడి సైనిక సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా విరాళాలు అందించి ఇబ్బందుల్లో ఉన్న సైనిక కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

జై సీతారాం రచనలు అమృతవాక్కులు

మాట్లాడుతున్న కవి శాంతినారాయణ

అనంత సాంస్కృతికం: స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం అనంత సాహితీ సంస్థల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో 'కదలిక' గా పేరెన్నిక గన్న కోగిర జై సీతారాం జయంతిని కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త తూముచెర్ల రాజారాం మాట్లాడుతూ.. జైసీతారాం రాయలసీమ మాండలిక భాషకు కవిత్వ గౌరవాన్ని సాధించిన సహజ వాగ్గేయకారుడని కొనియాడారు. జైసీతారాం రచించిన పద్య కవిత్వాన్ని చంద్రశేఖరశాస్త్రి విశ్లేషిస్తూ.. వాడుక భాషలో అందమైన పద్యాన్ని నిర్మించడం గొప్ప పద్యంలో వ్యంగ్యాన్ని సమర్థంగా ప్రయోగించారన్నారు. ఏలూరు యంగన్న మాట్లాడుతూ.. దుర్భర పేదరికం అనుభవించి ప్రకాశించిన కవితా పుష్పం జై సీతారామ్ అని ప్రశంసించారు. 'అక్షర వైభవం' అనే పవన కవితా సంపుటి రాయలసీమ నుంచి వచ్చిన విప్లవ కవిత్వానికి తొలి రుజువుగా ఉందని అంకె శ్రీనివాస్ పేర్కొన్నారు. రాయలసీమలో తొలి విప్లవ ప్రజాకవి అని, రాయలసీమ ఏ విధంగా నిర్లక్ష్యానికి గురైందో ఆ విధంగానే గుర్తింపునకు నోచకోని మహాకవి కోగిర జై సీతారాం అని శాంతి నారాయణ అభివర్ణించారు. 'చలి మంట' అనే రచనలోని హాస్యాన్ని సంభాషణాత్మక రచనను అనంతపురం మాండలికంలోని యాసతో కోగిర జయచంద్ర వినిపించారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా రవీంద్ర

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గంతో జేఏసీ జిల్లా ఛైర్మన్ దివాకర్ రావు, ప్రధాన కార్యదర్శి పాపారావు, తదితరులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అనంత నగరం డ్రైవర్ల హోం ఆవరణలో ఆదివారం ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపారావు ఎన్నికల అధికారిగా, ముఖ్య అతిథిగా ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ ఆర్ఎన్ దివాకర్ రావు హాజరయ్యారు. తొలుత సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల నియమ, నిబంధనలను వివరించారు. ఆ తర్వాత పోటీదారుల నుంచి నామపత్రాలు స్వీకరించారు. అధ్యక్షుడి పదవికి ఒకరు మాత్రమే నామినేషన్ వేశారు. మొత్తం కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. కొత్త కమిటీ వివరాలను ఎన్నికల అధికారి పాపారావు ప్రకటించారు. అధ్యక్షుడిగా గృహ నిర్మాణ శాఖ డ్రైవర్ డి. రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా సి. కె. లక్ష్మన్న, కోశాధికారిగా ఆర్. ఎం. బాష, గౌరవాధ్యక్షుడిగా రాంగోపాల్, సహాధ్యక్షుడిగా ఎస్. డేవిడ్, ఉపాధ్యక్షులుగా పి. మాబూసాబ్, శ్రీనివాసుల నెహ్రూ, సహాయకార్యదర్శిగా పెంచలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా సురేశ్, ప్రచార కార్యదర్శిగా ఆదివరం, కార్యవర్గ సభ్యులుగా వెంకటరమణను ఎంపిక చేశారు.

రమేశ్ ఎన్నిక చెల్లదు..

ఈ కమిటీ ఎంపిక తర్వాత ఎన్నికల అధికారి పాపారావు, జేఏసీ ఛైర్మన్ దివాకర్‌రావు విలేకరులతో మాట్లాడారు. డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా తాను ఎంపిక అయ్యానంటూ రమేశ్‌బాబు అనే వ్యక్తి సొంతంగా ప్రకటించుకున్నారని, ఇతని ఎన్నిక అసలు చెల్లదన్నారు. రెండున్నరేళ్లగా ఎన్నికలు నిర్వహించలేదు. రాష్ట్ర కమిటీ అనుమతి లేకపోవడమే కాదు.. సంఘం మార్గదర్శకాలను తుంగలో తొక్కారన్నారు.

సైకిల్‌పై 11వ సారి శబరిమలకు...

కుమారస్వామి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోటవీధికి చెందిన మఠం కుమారస్వామి అయ్యప్ప దీక్షతో 11 ఏళ్లుగా ప్రతిఏటా సైకిల్‌పై శబరిమలకు వెళ్లి వస్తున్నారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, బంధువులు, అయ్యప్ప స్వాములు కుమార స్వామిని రాయదుర్గం నుంచి శబరిమలకు సాగనంపారు. కుమారస్వామి ప్రతిఏటా సుమారు 1600ల కిలోమీటర్ల దూరంలోని శబరిమలకు సైకిల్ పైనే వెళ్లి వస్తుండటంతో ఆయనను ప్రజలు 'సైకిల్ స్వామిగా' పిలుస్తున్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రమణారెడ్డి

రమణారెడ్డి

అనంతపురం విద్య: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడుగా రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా మల్లికార్జున ఎన్నికయ్యారు. ఆ ఉపాధ్యాయ సంఘం 79వ కౌన్సిల్ సమావేశం ఆదివారం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జరిగింది. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2 సంవత్సరాలపాటు కార్యవర్గం ఉంటుంది.

రోటావేటర్ బోల్తాపడి యువకుడి దుర్మరణం

ఎంజారప్ప

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కోతులగుట్ట వద్ద ట్రాక్టరు రోటావేటర్ బోల్తా పడి ఎంజారప్ప(31) దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ లావణ్య అందించిన వివరాల మేరకు గుడిబండ మండలం సీసీగిరి గ్రామానికి చెందిన బండిమనే తిప్పన్న కుమారుడు ఎంజారప్పకు కోతులగుట్ట గ్రామంలో వివాహమైంది. ఇతను బెంగళూరులో మెడికల్ రెప్‌గా పనిచేసేవాడు. భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కోసం కోతులగుట్ట గ్రామానికి వచ్చాడు. ఆదివారం పొలం పనుల కోసం బావ మల్లికార్జునతో కలిసి వెళ్లాడు. పనుల అనంతరం తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ మలుపు వద్ద ట్రాక్టరును తిప్పుతుండగా బోల్తాపడింది. పక్కనే ఉన్న మల్లికార్జున అక్కడి నుంచి పక్కకు దూకడంతో గాయపడ్డాడు. ట్రాక్టరు నడుపుతున్న ఎంజారప్ప రొటావేటర్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు. భార్య గాయిత్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాద్రిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో చంద్రమౌళి(65) మృతిచెందారు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం బెళుగుప్పకు వచ్చి అంగడి సరకులు తీసుకుని వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తిప్పేస్వామి అనే వ్యక్తి కొట్టాల నుంచి బెళుగుప్పకు వస్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రమౌళిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమాధ్యంలో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

తెదేపా వర్గీయులపై వైకాపా నాయకుల దాడి

బాధితులను పరామర్శిస్తున్న తెదేపా నాయకులు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రంపల్లికి చెందిన తెదేపా మద్దతుదార్లు గొల్ల శివానంద, గొల్ల వినోదమ్మ, గొల్ల సునందమ్మలపై వైకాపా నాయకులు పురుషోత్తంరెడ్డి, వారి మద్దతుదారులు కలసి తోవ(రాస్తా) విషయమై ఆదివారం దాడులు చేసినట్లు తెలిసింది. కట్టెలు, ఇతర ఆయుధాలతో దాడులు చేసుకున్నారు. గ్రామంలో రాస్తా విషయమై కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. స్థానిక ఎస్సై ఈశ్వరయ్య మాట్లాడుతూ దాడి విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తెదేపా మండల కన్వీనర్ కాలవ సన్నన్న, మాజీ ఎంపీపీ గిరిమల్లప్ప, సర్పంచ్‌లు నాగరాజు, సదాశివ, నాయకులు బేలోడు సంజీవ, రాజు, లోకేష్, బంజోభ, శ్రీధర్ మూర్తి, చారుకి పాలయ్య, మూర్తి, నరసింహ యాదవ్‌లు బాధితులను పరామర్శించారు.

వాహనం ఢీకొని జీవాలు మృత్యువాత

బెళుగుప్ప, న్యూస్‌టుడే: గొర్రెలపై తుఫాన్ వాహనం దూసుకెళ్లిన ఘటనలో 40 గొర్రెలు మృతిచెందిన ఘటన మండలంలోని కాలువపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. ఆత్మకూరు మండలం యాలేరు గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డికి చెందిన జీవాలు మేత కోసం రోడ్డుపై వెళ్తున్నాయి. జీవాలు పెన్నానది వంతెనను దాటుతుండగా గుర్తించిన డ్రైవర్ తన బస్సును పక్కన నిలిపేశారు. ఇదే సమయంలో వేగంగా వచ్చిన తుఫాన్ వాహనం బస్సు ముందు భాగాన్ని పాక్షికంగా ఢీకొని గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సూమారు 40 గొర్రెలు మృతిచెందగా 15 జీవాలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనివల్ల రైతుకు సూమారు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిల్లింది. సీఐ మహానంది, ఎస్సైలు శివ, మహేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదే సమయంలో వైకాపా నాయకుడు అక్కడికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి.. దీనికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని నినాదాలు చేశారు. అక్కడే ఉన్న తెదేపా నాయకులు వారితో వాదనకు దిగటంతో సూమారు 3 కిలోమీటర్లు మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి వారిని అక్కడి నుంచి పంపించేశారు.

హంద్రీనీవా కాలువలో వ్యక్తి గల్లంతు!

ఆత్మకూరు, న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువలో వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని పంపనూరు తండా వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. పంపనూరుకు చెందిన ఎగ్గిడి మల్లన్న (70) మతి స్థిమితంతో ఇబ్బంది పడేవాడు. ఆదివారం గ్రామం సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద తిరుగుతున్నట్లు గ్రామస్థులు గుర్తించారు. ఎంతవెతికినా కనిపించకపోవడంతో కాలువలోకి పడి ఉంటాడని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది భావించి గాలింపు చర్యలు చేపట్టారు. హంద్రీనీవా కాలువలో నీటి వేగం పైకి కనిపించేదాని కంటే ఎక్కువ వేగం ఉందని ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. లైనింగ్ పనులు పూర్తి చేసిన నాటి నుంచి మూడు నెలల్లో నలుగురు కాలువలో పడి మృతి చెందారన్నారు. ఇప్పటికే కాలువలోకి దిగేందుకు ఏర్పాటు చేసిన ర్యాంప్‌లు, మెట్ల వద్ద ముళ్లకంపలు వేశామని అయినా ఏదో ఒక ప్రాంతంలో కాలువలోకి దిగుతున్నారని చెప్పారు. ఎంత ఈత వచ్చినప్పటికి కాలువ నీటి వేగాన్ని తట్టుకోలేరని ఎవరూ కాలువలోకి దిగరాదని కోరాడు.

(c) eenadu

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

పూజలందుకున్న ఉమా మహేశ్వరుడు

సంకష్టహర చతుర్థి పూజలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం మండలంలోని పలు శివాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి శివలింగాలకు మంత్రోచ్ఛారణల నడుమ అభిషేకాలు, అర్చనలు అనంతరం ప్రతిమలను పలురకాల పూలతో అందంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని పిల్లిగుండ్ల ప్రాంతం దేవరబండ వద్ద ఆదివారం వేంకటేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని నూతనంగా నిర్మించి రెండు రోజులుగా వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి విశేష పూజలు చేశారు. ఈకార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: పట్టణంలోని ఆర్టీసీ రోడ్డులో ఉన్న విశ్వతేజ ఆస్పత్రి ఎదురుగా గుల్జార్‌పేటలో రెండు రోజుల క్రితం కాలువలను శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని రోడ్డుపైనే వేశారు. -రాఘవేంద్ర

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా. - శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, -న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

సమస్య: నాచేపల్లి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. - తిప్పేస్వామి

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా తొలగిస్తాం. - తిప్పేస్వామి, సర్పంచి, మోరుబాగల్

సమస్య: కరికెర బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు.- తిమ్మప్ప

సమాధానం: రెండు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. -గౌరమ్మ, సర్పంచి, - న్యూస్‌టుడే, గుడిబండ

సమస్యలకు పరిష్కారం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలో వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు' 'ఈటీవీ' తేదీ(ఆదివారం) ఇలా ఉంటూ రోగాలు రావా.. అన్న శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ మున్సిపల్ కార్మికులను పంపి హౌసింగ్ బోర్డులోని ఉద్యానం పక్కన ఉన్న రహదారిలో నిలిచిన మురుగు, చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను తొలగించారు. దుర్వాసన రాకుండా ఆ ప్రాంతంలో బ్లీచింగ్ పొడి చల్లించారు. చుట్టుపక్కల కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రయాణికుల ప్రాంగణం.. పట్టని వైనం!

◆ విస్తరణ పనుల్లో తొలగింపు ◆ పునరుద్ధరణకు చర్యలు శూన్యం

పెద్దమ్మ దేవాలయం వద్ద రహదారిపైనే ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే : సోమందేపల్లిలోని పెద్దమ్మ దేవాలయం వద్ద ప్రయాణికుల ప్రాంగణం (బస్టాండ్ షెడ్డు) లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నేళ్లుగా దుకాణాలు, వ్యాపార సముదాయాల ఎదుట గాలి, దుమ్ము, ధూళి, మండుటెండలు, వర్షాలకు నిల్చోలేక విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, పిల్లలు పడుతున్న బాధలు వర్ణనాతీతమని పలువురు వాపోతున్నారు. గతంలో గుడికి ఎదురుగా ప్రయాణికుల ప్రాంగణం ఉండేది. నిర్వహణ సరిగా లేక అధ్వానంగా ఉండటంతో ఎవరూ వినియోగించడం లేదు. గతంలో రహదారి విస్తరణ పనుల కారణంగా బస్టాండ్ షెడ్డు పడగొట్టినా తర్వాత పునరుద్ధరణ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ప్రయాణికుల అవస్థలను ఎవరూ పట్టించుకునే పాపానపోవడం లేదని వామపక్ష నాయకులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రహదారులపైనే వ్యాపారాలు!

ఒకవైపు బస్టాండ్ లేకపోవడం, మరోవైపు రహదారికి ఇరువైపులా ఆటోలు, ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు అడ్డుగా పెడుతున్నారు. ఇది ప్రజలకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ప్రయాణికులకు ఎలాంటి మరుగుదొడ్ల వసతి లేదు. ప్రధానంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

ఉన్నది నిరుపయోగంగా..

గతంలో జడ్పీ పాఠశాల వద్ద ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన బస్సు ప్రాంగణంలోకి ఆర్టీసీ బస్సులు రాకపోకలు లేక, ప్రయాణికులు వేచి ఉండటానికి కనీస సౌకర్యాలు కల్పించక వృథాగా ఉంది. పిచ్చిమొక్కలు, కంపచెట్లకు నిలయంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా అధికారులకు నివేదిస్తాం

ప్రయాణికులకు విడిది కేంద్రం లేక పడుతున్న ఇబ్బందుల గురించి జిల్లా అధికారులకు వెంటనే నివేదిస్తాం. అనువైన స్థలం ఉండి, ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే నిర్మాణానికి చర్యలు చేపడతాం. ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరిస్తాం. -వెంకటలక్ష్మమ్మ, ఎంపీడీవో

ఆలయాల అభివృద్ధికి రూ.5.27 కోట్లు

పెనుకొండ, న్యూస్‌టుడే : దేవదాయశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాలుగు ఆలయాల అభివృద్ధికి రూ.5.27 కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఐమూక్తేశ్వరాలయాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెదేపా నాయకులు త్రివేంద్రనాయుడు, కన్నా శివమాల దీక్ష ఇరుముడితో శ్రీశైలం బయలుదేరుతుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెనుకొండలోని ఐమూక్తేశ్వరాలయానికి రూ.3.06 కోట్లు, గోరంట్ల మండలంలోని వానవోలు కస్తూరిరంగనాథస్వామి ఆలయానికి రూ..1.90 కోట్లు, రాగిమేకలపల్లిలోని ఆంజనేయస్వామి రూ.40 లక్షలు, గంగమ్మదేవత ఆలయానికి రూ.40 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఈకార్యక్రమంలో కూటమిశ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న మంత్రి సవిత, తదితరులు

అయ్యప్పమాలధారులకు అన్నదానం

లేపాక్షి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో దీక్ష చేపట్టిన మాలధారులకు ఆదివారం తెదేపా మైనార్టీ నాయకుడు సైపుల్లా అన్నదానం చేశారు. దీక్షలో ఉన్న స్వాములకు ఇలా సేవ చేయడం తన పూర్వజన్మ సుకృతమని ఆయన పేర్కొన్నారు.

పరిగి: పరిగిలో అయ్యప్ప మాలధారులకు ఆదివారం మండల పరిధిలోని ఊటుకూరుకు చెందిన మేస్త్రీ నంజప్ప కుటుంబ సభ్యులు ఆంజనేయులు, గురుస్వామి నరసింహప్ప, లింగారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేడుకగా రంగనాథుడి గిరిప్రదక్షిణ

రథంలో ఊరేగుతున్న రంగనాథుడు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, అభిషేకార్చనలు, విశేషపూజలు, అలంకరణ చేశారు. రాత్రి శ్రీదేవిభూదేవి సమేతుడైన రంగనాథుని ఉత్సవమూర్తులను అందంగా అలంకరించిన పూల రథంలో ఉంచి భక్తుల గోవింద నామ స్మరణలతో, మంగళవాయిద్యాలతో ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేంద్రుడు, అర్చకులు గోవిందశర్మ, శ్రీమన్నారాయణ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కళలు వారసత్వ సంపద'

హిందూపురం, న్యూస్‌టుడే : కళలు తమ వారసత్వ సంపదని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య అన్నారు. ఆదివారం చిన్మయ విద్యాలయంలో తెలుగు కూచిపూడి నృత్య సాంస్కృతిక సేవా సంస్థ, యశోదయఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ కవి సమ్మేళనం, సినీ విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. సంగీతం, కళలకు ఎప్పటికీ ఆదరణ ఉంటుందన్నారు. పూర్వీకులు కళల ప్రాధాన్యం గుర్తించి కవులు, కళాకారులను ఎంతో ప్రోత్సహించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వీటికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం కొనసాగిన కవి సమ్మేళనం, సంగీత విభావరిలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. కవులు నాగిరెడ్డి, ఆది, కంచెప్ప, రఘురామయ్య, మనోహర్, లక్ష్మీనారాయణ, గాయకులు డాక్టర్ ఏహెచ్ గంగప్ప, మల్లేశ్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నృత్యకారిణులకు జ్ఞాపికలు అందిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యదర్శి వీరయ్య

ఆడబిడ్డలకు దాతల ఆర్థిక సాయం

పరిగి, న్యూస్‌టుడే : తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా మిగిలిన 'ఆడబిడ్డల కన్నీటి వ్యథ' అనే శీర్షికతో 'ఈనాడు'లో ఇచ్చిన వార్తకు పలువురు దాతలు స్పందించారు. ఆదివారం భగత్‌సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థినులకు రూ.12వేలు ఆర్థిక సాయం చేశారు. మరో వైపు పరిగి మండలానికి చెందిన ఫార్మసిస్టేయులు రూ.9వేలు ఆర్థిక సాయం అందించారు. భగత్‌సేవా సమితి అధ్యక్షుడు కార్తిక్ మాట్లాడుతూ విద్యార్థినుల విద్యాభివృద్ధికి తమ వంతు బాధ్యతగా చేయూత నందిస్తామని హామీ ఇచ్చారు.

కొలుకొంటున్న స్క్రబ్ టైఫస్ బాధితురాలు

హిందూపురం: హిందూపురంలో స్క్రబ్ టైఫస్ బారిన పడిన బాధితురాలు ప్రభుత్వ ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో వైద్యసేవలు అందిస్తుండటంతో ఆమె సాధారణ స్థితికి చేరుకుంటున్నారు. ఆదివారం కూడా పలు పరీక్షలు నిర్వహించగా అన్ని నార్మల్ స్థాయిలో వస్తున్నాయన్నారు. ఆదివారం ఇద్దరు చిన్నారులకు ఈ వ్యాధి సోకిందనే అనుమానం కలిగిందని, నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చిందన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 34 మంది గైర్హాజరు

పెనుకొండ, న్యూస్‌టుడే: ఎన్ఎంఎంఎస్(జాతీయ ఉపకారవేతనం) ఎంపిక కోసం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బడుల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న 1128 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఆదివారం నిర్వహించిన పరీక్షకు 1094 మంది హాజరయ్యారు. 34 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో రాఘవయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి

పరిగి: గ్రామ స్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ సురేష్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం పరిగిలోని ఆర్యవైశ్య కల్యాణమంటపంలో జనసేన పార్టీ మండల కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయిలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసేందుకు మండలంలోని ప్రతి గ్రామంలోనూ పర్యటించి గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, పరిగి ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ అశ్వర్థనారాయణ, నాయకులు అమర్‌నాథ్, రవితేజ, రంగప్ప, బీరలింగప్ప, నవీన్, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

దీపిక సన్మాన సభకు ఏర్పాట్లు

మడకశిర: భారతదేశ ఖ్యాతిని చాటిన మడకశిర ముద్దుబిడ్డ కుమారి దీపికకు 8న ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తిలు ఆదివారం పరిశీలించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా జలహారతి

గుడిబండ, న్యూస్‌టుడే: మండలంలోని సింగేపల్లి వద్ద హంద్రీనీవా కాలువలో ఆదివారం తెదేపా నాయకులు, రైతులు జలహారతి నిర్వహించారు. సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఆసుపత్రి కమిటీ మాజీ ఛైర్మన్ శివకుమార్, జయరామ్, జయన్న, శ్రీరామ్, కిష్టప్ప, మల్లికార్జున, శివన్న తదితరుల ఆధ్వర్యంలో కృష్ణా జలాలకు పూజలు చేసి జలహారతి నిర్వహించారు. తెదేపా జెండాలతో సంబరాలు జరుపుకొన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

గోరంట్ల, న్యూస్‌టుడే : రాష్ట్రంలో దివ్యాంగుల ప్రతిభావంతులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఇంద్రధనస్సు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రారంభానికి చర్యలు తీసుకున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు గోరంట్ల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండు ప్రాంతంలో పాలాభిషేకం నిర్వహించి, ఇద్దరు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. తెదేపా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, మాజీ ఎంపీపీ విద్యాధరణి, తెదేపా నాయకులు, దివ్యాంగ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చిత్రపటాలకు అభిషేకం చేస్తున్న దివ్యాంగులు

ఘనంగా కనకదాస జయంతి వేడుకలు

రొద్దం, న్యూస్‌టుడే : కురుబల ఆరాధ్య దైవం శ్రీభక్త కనకదాస జయంతి వేడుకలను గోనిమేకలపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పలువురు మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను ప్రదర్శించారు. గొరవయ్యలు నృత్యాలతో ముందుకు సాగారు. తిరిగి సాయంత్రం వెండి రథంలో కనకదాస చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఊరేగింపు చేశారు. రొద్దం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

హిందూపురంసాంస్కృతికం: పట్టణంలోని సడ్లపల్లిలో కనకదాస జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ పుష్పాలతో అందంగా తయారు చేసిన జ్యోతులను మహిళలు నెత్తిన ఉంచుకుని బీసీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, బెంగళూరు రోడ్డు గుండా ఊరేగించారు. అనంతరం కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, మున్సిపల్ మహిళా కౌన్సిలర్ సునీత, గోపాల్, నారాయణప్ప, లింగారెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, సడ్లపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హిందూపురం : జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, గ్రామ ప్రజలు

శ్రమదానంతో దారి నిర్మాణం

మరాపురం చెరువు తూము నుంచి నీరు వెళ్లే ప్రధాన కాలువ పక్కన గతంలో ఉన్న దారిని పలువురు రైతులు ఆక్రమించారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలువ ద్వారా అమరాపురం చెరువుకు నీరు నింపేదుకు ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో మడకశిర నుంచి కృష్ణజలాలు కాలువ గుండా వస్తున్నాయి. ఇక్కడి రైతులు కాలువలో నీరు పారే సమయంలో ఇబ్బందులు వస్తే వెళ్లి చూడటానికి దారి లేకపోవడంతో ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయకట్టు రైతులు ఆక్రమణకు గురైన రోడ్డుకు చందాలు వేసుకుని మట్టిని తోలి దారి ఏర్పాటు చేశారు. -న్యూస్‌టుడే, అమరాపురం

వాహనదారుల బెంబేలు

పట్టణంలోని ప్రధాన రోడ్లపై నడిచే అడ్డూఅదుపులేకుండా ఆవులు సంచరిస్తుండడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని పాతజాతీయ రహదారిని ఇటీవల నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించి, మధ్యలో డివైడర్ నిర్మించారు. ఆవులు నిత్యం రోడ్లపై తిరుగుతూ ప్రజలు, వాహనదారులను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోంది. అధికారులు, పాలకులు స్పందించి ఆవుల యజమానులకు హెచ్చరికలు జారీ చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెనుకొండ

నీటి వృథా అరికట్టండి!

గొడనకుంట గ్రామంలోని తమ్మడేపల్లి రోడ్డులో తాగునీటి బోరు పైప్‌లైన్‌కు రంధ్రం పడి నీరు వృథా అవుతోంది. విద్యుత్తు సరఫరా ఉన్న సమయంలో లీకేజీ అయిన నీరు రోడ్డుపై నిలిచి బురదగుంతగా మారుతోంది. నెలరోజులుగా నీరు లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై సర్పంచి గిరిజమ్మను వివరణ కోరగా రెండు రోజుల్లో మరమ్మతు చేస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, అమరాపురం

కేజీబీవీ నిర్వహణ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

మడకశిర, మడకశిర (గ్రామీణం), న్యూస్‌టుడే : కేజీబీవీ ఎస్ఓపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రధానంగా కుళ్లిన కూరగాయలతో వంటలు చేయడంపై మండిపడ్డారు. సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా 250 మంది విద్యార్థినులకుగాను రెండే స్నానపు గదులు ఉండడంతో ఇందులో ఇంత మంది విద్యార్థినులు ఎలా సర్దుకుపోతారని ప్రశ్నించారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా ఎందుకు సద్వినియోగం చేసుకోవడం లేదని ఆగ్రహించారు.

విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

'హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి'

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే : హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని కోరుతూ బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం కూడలిలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తంచేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఆదినారాయణ మాట్లాడుతూ గత పాలకులు జిల్లా కేంద్రం చేయకుండా హిందూపురం ప్రజలకు అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించాలన్నారు. నాయకులు వెంకటరామప్ప, మూర్తి పాల్గొన్నారు.

కృతి ఫౌండేషన్ చేయూత

లేపాక్షి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పదోతరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు ఆదివారం కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు గోవర్ధన్, సుధాకర్ 120 అట్టలు పంపిణీ చేశారు. విద్యాలయానికి 5 ఫ్యాన్లను ప్రత్యేకాధికారిణి నీలిమకు అందించారు.

జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా గోపీనాథ్

పెనుకొండ, న్యూస్‌టుడే : భాజపా జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కె.గోపీనాథ్‌ను నియమించారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం.శేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నియమించడానికి సహకరించిన ఆయన్ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జీఎం శేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్సీమోర్చా అధ్యక్షుడు కె.గోపీనాథ్

వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే : చౌళూరు గ్రామంలో యువనాయకులు ప్రసన్న, మనీశ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.6666, ద్వితీయ బహుమతిగా రూ.4444, తృతీయ బహుమతిగా రూ.2222లను అందజేశారు. యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసుకురావాలనే ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

విజేతలుగా నిలిచిన వారితో గ్రామ యువ నాయకులు

మాజీ సర్పంచి మృతికి సంతాపం

పెనుకొండ,న్యూస్‌టుడే: పట్టణంలోని పాతపోస్టాఫీసు వీధిలో నివాసం ఉంటున్న పెనుకొండ మాజీ సర్పంచి జయలక్ష్మమ్మ(75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెదేపా పట్టణ కన్వీనర్ శ్రీరాములు పార్టీశ్రేణులతో కలిసి ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నారాయణప్ప, శ్రీనివాసులు, నంజుండ, ప్రభంజన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

లేపాక్షి, న్యూస్‌టుడే : కొండూరులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన తెదేపా యువ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.10 వేలు అందజేశారు.

అకుంఠిత దీక్ష.. సేవాతత్పరత

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

హిందూపురం గ్రామీణం, హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తారతమ్యం లేకుండా ఆర్యవైశ్యులకే కాదు అన్ని వర్గాల ప్రజలకు హిందూపురం వాసవీ క్లబ్ సభ్యులు సేవలు అందిస్తూ సామాజిక బాధ్యతను కర్తవ్యంగా ఎంచుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. 1998లో క్లబ్‌ను ప్రారంభించారు. మొదట్లో ఏడాది పాటు ఆర్యవైశ్యులకే సేవలందించేవారు. ఆ తర్వాత అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చి 27 ఏళ్లుగా సేవలను విస్తృతం చేయడం విశేషం.

క్లబ్ సేవా పరంపర

- 150 ఉచిత దంత వైద్యశిబిరాలు నిర్వహించగా 75 వేల మంది సద్వినియోగం చేసుకున్నారు.

సత్కార్యాలకు వాసవీక్లబ్ ప్రత్యేక ముద్ర

- 40 సాధారణ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో ఎముకలు, నరాలు, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, స్థూలకాయం, ఇతర రోగాలతో బాధపడే 9 వేల మందికి ఉపయోగపడింది.
- ఏటా పాఠశాలల్లో చదివే 1000 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, 250 మందికి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు.

రుణాలు సమకూరుస్తున్నాం

సంస్థలో అధ్యక్షకార్యదర్శి, కోశాధికారిలతో పాటు 120 మంది వివిధ హోదాల్లో సభ్యులుగా ఉంటూ సేవలు అందిస్తున్నాం. చిన్నవ్యాపారాలు చేసుకునే వారికి 2020లో వడ్డీ లేని రుణాలు ఇవ్వటాన్ని ప్రారంభించాం. తద్వారా వందలాది మంది వ్యాపారులుగా మారి జీవనాన్ని సాగిస్తున్నారు. దాతల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలు చేయడానికి కృషి చేస్తాం. **- రాజేంద్రనాథ్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు, హిందూపురం**

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చివరి రోజు జిల్లడగుంట గ్రామంలో వెలిసిన కంబాలనరసింహస్వామి జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామిని వివిధ పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు జ్యోతులతో స్వామి వారి వెంట ఊరేగింపుగా వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి జ్యోతులు సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జ్యోతులతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

అన్ని సేవల కంటే అన్నదానం శ్రేష్ఠం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే : అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలితో అలమటిస్తున్న వారికి ఆహారం అందిస్తే వారికి భగవంతుడు ఏదో ఒక రూపం సాయం చేస్తారన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని మున్సిపల్ ఛైర్మన్, అన్నదాన కేంద్ర అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డులో అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో మణికంఠుడికి పడి పూజ, 18 మెట్ల పూజ, పుష్పార్చన చేశారు. వందలాదిమంది మాలధారణ భక్తులు నడుమ అఖండ అయ్యప్ప భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం 700మంది భక్తులకు అన్నదానం చేశారు. భిక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కేంద్రం సభ్యులు శ్రీరాములు, కొండయ్య, రవితాగూర్, సంజీవ, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

నియంత్రిక చుట్టూ రక్షణేదీ?

కదిరిలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రిక చుట్టూ రక్షణ కంచె దెబ్బతింది. విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతుండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందంటూ స్థానికులతో కలిసి సీపీఐ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. వెంటనే ఆ శాఖ అధికారులు స్పందించి నియంత్రిక చుట్టూ రక్షణ కంచె ఎత్తు పెంచి ప్రమాదానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. –న్యూస్‌టుడే, కదిరి పట్టణం

కనులపండువగా అయ్యప్ప గ్రామోత్సవం

పట్టణంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. కేశవనగర్‌లోని ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పూలరథంలో అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ఉంచారు. పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో మాలధారులు అయ్యప్ప నామస్మరణ చేస్తూ పూలరథాన్ని లాగారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అయ్యప్పను దర్శించుకొని పూజలు చేశారు. –న్యూస్‌టుడే, ధర్మవరం

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: చెన్నేకొత్తపల్లి నుంచి చిన్నపల్లి మీదుగా హర్యాయాన్ చెరువు గ్రామానికి వెళ్లే దారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కంకర తేలింది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. - **రామాంజనేయులు, చిన్నపల్లి**

సమాధానం: రోడ్డు పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు వస్తే నిర్మాణ పనులు చేపడతాం. - **అబ్దుల్ ఖాదర్, పంచాయతీరాజ్, మండల ఇన్‌ఛార్జి ఏఈ**

సమస్య: మండలంలోని న్యామద్దల గ్రామానికి వెళ్లే దారిలో చెరువు కట్ట కింది వైపు పెరిగిన కంప చెట్ల వల్ల వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. - **శ్రీరాములు, న్యామద్దల**

సమాధానం: కంపచెట్లు తొలగిస్తాం. - **సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వారం ముందు వర్షపు నీరు నిల్వతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. - **రామ్మోహన్‌రెడ్డి, స్థానికుడు**

సమాధానం: నీరు నిల్వకుండా చర్యలు చేపడతాం. - **అశోక్‌నాయక్, ఈఓఆర్డీ**
- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

శివారు కాలనీలంటే అలుసా..!

మౌలికవసతులకూ నోచని వైనం

కేతిరెడ్డి కాలనీలో వెలగని వీధిదీపాలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ పురపాలిక పరిధిలోని శివారు కాలనీల అభివృద్ధిపై పురపాలిక శాఖాధికారులు శీతకన్ను వేశారు. అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి, తాగునీటి పన్నులతో పాటు విద్యుత్తు బిల్లులు కడుతున్నా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని శివారు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో కేతిరెడ్డి, ఇందిరమ్మకాలనీ, మహాత్మాగాంధీ, ఎల్‌సీకే పురం, ప్రియాంక నగర్, సుందరయ్యనగర్, చిన్నూరు కాలనీ, శారదనగర్, తారకరామాపురం ప్రాంతాలు శివారు కాలనీలుగా ఉన్నాయి. ఈ కాలనీల్లో ఎక్కువగా చేనేత కార్మికులు, దినసరి కూలీలు, చిరుద్యోగులు నివసిస్తున్నారు. కాలనీలు ఏర్పడి సంవత్సరాలు దాటుతున్నా సరైన వసతులకు నోచుకోక అవస్థలు పడుతున్నారు. నాయకులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసమే ఇక్కడ పర్యటించి తర్వాత పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పురపాలక కార్యాలయం	ధర్మవరం
శివారు కాలనీలు	16
వీధుల సంఖ్య	721
నివాస గృహాలు	14,610
జనాభా	26,600లకుపైగా

కాలనీల అభివృద్ధికి రూట్‌మ్యాప్

పట్టణ శివారు కాలనీల అభివృద్ధికి రూట్‌మ్యాప్ రూపొందించాం. ఇప్పటికే పలు పనులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. నిధులు రాగానే క్రమపద్ధతిలో పనులు చేపడతాం.
-వీరేష్‌కుమార్, పురపాలిక డీఈ, ధర్మవరం

ఇందిరమ్మ కాలనీలో మట్టిరోడ్డు

వేధిస్తున్న ప్రధాన సమస్యలు ఇవే..

- చెత్త సేకరణ ఊసే ఉండదు. కాలనీల్లో ఏ వీధిలో చూసినా చెత్తాచెదారం, వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి కనిపిస్తాయి. మురుగు కాలువలను కనీసం నెలకొకసారైనా శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి.
- దాదాపు ఎనభై శాతం మట్టి రోడ్లు కావడంతో చిన్నపాటి వానలు కురిసినా బురదగా మారుతుండటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.
- ఇక తాగునీటి పైపులు అన్నిచోట్లా లేవు. కుళాయిలు ఎప్పుడు నీరు వదులుతారో దేవుడికే తెలియాలి. వీధిదీపాలు ఎప్పుడు వెలుగుతాయో తెలియదు. చీకటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు.

ముఖ్యమంత్రికి దివ్యాంగుల కృతజ్ఞతలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం చాలా సంతోషంగా ఉందని ఏపీ దివ్యాంగ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు పీఎండీ షఫీ, జిల్లా అధ్యక్షుడు ఎంకే రామాంజినేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని గణేశ్ కూడలిలో వారి ఆధ్వర్యంలో దివ్యాంగులు చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా సీఎం ఏడు వరాలు ప్రకటించారన్నారు. స్త్రీ శక్తి పథకం కింద ప్రత్యేక ప్రతిభావంత మహిళలు ఇప్పటికే ఉచిత ప్రయాణం సాగిస్తున్నారని, పురుషులకూ ఈ సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌నాయక్, జిల్లా సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు భూదేవి, కన్వీనర్ మారుతి, ఈశ్వర, గజేంద్ర, గంగాద్రి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

బత్తలపల్లి (ధర్మవరం), న్యూస్‌టుడే: తమకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంతో బత్తలపల్లి నాలుగు రహదారుల కూడలిలో తెదేపా నాయకులతో కలిసి దివ్యాంగులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కోసి అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చంద్రశేఖర్, క్రిష్టయ్య, దివ్యాంగుల సంఘం మండల నాయకులు జనార్దన్ నాయుడు, శివయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు చేయించడంపై ఆరా

గాండ్లపెంట, న్యూస్‌టుడే: కస్తూర్బా టైప్-4 వసతిగృహంలో విద్యార్థులతో పనులు చేయిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడంతో ఆదివారం సర్వశిక్షా ఏపీసీ మారెక్ తనిఖీ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న కస్తూర్బా టైప్-4 వసతిగృహంలో విద్యార్థులు ఉంటున్నారు. వారితో నిర్వహణ సిబ్బంది వంట తయారీకి అవసరమైన పనులు చేయిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. ఇది ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో వారి ఆదేశాలతో మారెక్ వసతిగృహాన్ని సందర్శించారు. వార్డెన్ జ్యోత్స్నతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీడియోలపై విద్యార్థులను విచారించామని, హాస్టల్ ప్రారంభ సమయంలో సిబ్బంది లేకుంటే తమ ఇష్టంతోనే పనులు చేసినట్లు చెప్పారన్నారు. ఇప్పుడు ఎలాంటి పనులు చేయించడం లేదని విద్యార్థులు లిఖిత పూర్వకంగా తెలిపారన్నారు. ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ వంట మనిషి, సహాయ వంటమనిషి, కాపలాదారుల మధ్య సఖ్యత లేకపోవడంతో ఈ వీడియోలు బయటకు వచ్చినట్లు తెలిపారు. అందరూ కలిసిమెలిసి పనులు చేసుకోవాలని హెచ్చరించారు. ప్రస్తుతం ఎలాంటి పనులు వారు చేసేలా జీసీడీఓ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇది జరిగిన మూడ్రోజులకు పాత వీడియోలు బయటకు వచ్చాయని వెల్లడించారు.

వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సర్వశిక్షా ఏపీసీ మారెక్

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. బెంగళూరు నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు హాజరైన 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 46 మందిని ఉచిత కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారికి నేత్రజ్యోతి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, జయరామ్, క్యాంపు చైర్మన్ వెంకటనారాయణ తెలిపారు. అనంతరం వైద్య శిబిర నిర్వహణకు ఏర్పాట్లు చేసిన దాత నందకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్‌బాబు, ప్రభాకర్, వైజే శ్రీనివాసులు, రాధాకృష్ణ, కేశ లోకేష్, సీకే రామాంజినేయులు, మల్లికార్జున, షేక్ సికిందర్ పాల్గొన్నారు.

వాల్మీకి ఉద్యోగుల కొత్త కార్యవర్గం ఎన్నిక

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం నియోజకవర్గ వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక ఎన్జీవో సమావేశ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. బీసీ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా బి.నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా కె.చంద్రశేఖర్, కోశాధికారిగా జె.భాస్కర్, గౌరవాధ్యక్షుడిగా వెంకటశివ ఎన్నికైన వారిలో ఉన్నారు. ధర్మవరం డివిజన్‌లోని మండలాల కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందని రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య, బీకే ముత్యాలప్ప తెలిపారు. అనంతరం వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరణ చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లాధ్యక్షుడు నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, నాయకులు శివయ్య, సోమశేఖర్, జగదీష్, రామకృష్ణ, వెంకటేష్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన కమిటీ కార్యవర్గ సభ్యులు వీరే..

రేపు జూడో జూనియర్, క్యాడెట్ జట్ల ఎంపిక

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా జూడో క్రీడా విభాగంలో జూనియర్, క్యాడెట్ జట్ల ఎంపిక 9న పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో (కాళ్జొతి సర్కిల్) నిర్వహించనున్నట్లు జూడో సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్‌నాయుడు తెలిపారు. ఆయన ఆదివారం ఇక్కడ మాట్లాడుతూ బాలబాలికల విభాగంలో జరిగే ఎంపిక పోటీలకు క్రీడాకారులు ఉదయం 9 గంటలకే ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బత్తలపల్లి (ధర్మవరం), న్యూస్‌టుడే: బత్తలపల్లి మండలం కట్టకిందపల్లి వద్దనున్న 33 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఆ శాఖ మండల ఏఈ శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

నల్లమాడ, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-93 ఏడాదిలో చదివిన పూర్వ విద్యార్థులు అప్పటి డ్రిల్ మాస్టరుగా పనిచేసిన నాగభూషణం సార్ జ్ఞాపకార్థంగా రూ.10వేలు విలువచేసే ఫర్నిచర్ వితరణ చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ వేమనారాయణ, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా టీ-20 క్రికెట్ పోటీ

కదిరి, న్యూస్‌టుడే: ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన టీ20 క్రికెట్ పోటీలు ఉత్కంఠంగా సాగాయి. టీచర్స్ క్లబ్ జట్టుపై కోచింగ్ క్యాంపు జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కోచింగ్ క్యాంపు జట్టు 20 ఓవర్లలో 139 పరుగులు చేసింది. బ్యాటర్లు రామ్ ప్రణయ్ 52, సాధిక్ 38, సంతోష్ 25 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టు బౌలర్లు శ్రీనివాసులు రెండు, యోగి, అనిల్ చెరో వికెట్ తీశారు. ఛేదనలో టీచర్స్ క్లబ్ జట్టు పోరాడింది. చివరికి 136 పరుగులు చేసి ఓడింది. క్రీడాకారులు నందకిషోర్, సాధిక్‌కు కదిరి మండల క్రికెట్ సంఘం స్పాన్సర్ చేసిన బూట్లను ఉపాధ్యాయులు ఆజమ్, గంగాధర్ అందజేశారు.

గెలుపొందిన కోచింగ్ క్యాంపు జట్టు క్రీడాకారులు

వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

తాడిమర్రి, న్యూస్‌టుడే: దివంగత మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయీ దేశానికి ఎనలేని సేవలు చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన తాడిమర్రిలోని భాజపా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ధర్మవరం పట్టణంలోని కాలేజీ కూడలిలో 11న జరిగే వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడి ఎంపిక

ముదిగుబ్బ: ముదిగుబ్బకి చెందిన సోమల ప్రకాష్‌నాయుడు కిసాన్ మోర్చా జిల్లాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆదివారం పుట్టపర్తిలో భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్, మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపకార వేతన పరీక్షకు అనూహ్య స్పందన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సాయి స్టూడెంట్ ఉపకార వేతన పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇంజినీరింగ్ ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పిస్తామని సంస్కృతి విద్యా సంస్థల చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఉపకార వేతన పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. ఉమ్మడి అనంత జిల్లాతో పాటు కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, కాకినాడ, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, పిఠాపురం తదితర ప్రాంతాల నుంచి 4,300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక పరిమితులు లేకుండా ఉన్నత విద్య అభ్యసించవచ్చన్నారు. పదేళ్లుగా తమ ఇంజినీరింగ్ కళాశాలలో 350 మంది విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. త్వరలోనే పరీక్షా ఫలితాల జాబితా విడుదల చేస్తామన్నారు.

పరీక్షకు హాజరైన విద్యార్థులు

పనిచేసిన వారికే గుర్తింపు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: పార్టీ కోసం పని చేసే వారికే గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. బుక్కపట్నం మండలం తెదేపా ప్రధాన కార్యదర్శిగా సిద్ధరాంపురానికి చెందిన చంద్రమాణిక్యాన్ని ఆయన ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లెను కలిసి సత్కరించారు. చంద్రమాణిక్యం మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వెంకటనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ బాలు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు జయరాం, ఉల్లక్కి, కుమార్, సుధీర్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పల్లెను సత్కరిస్తున్న తెదేపా నాయకులు

జాతి అభ్యున్నతికి కృషి చేయాలి

కదిరి, న్యూస్‌టుడే: జాతి అభ్యున్నతికి మాదిగ ఉద్యోగులు అందరూ కృషి చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిలుమూరు శ్రీనివాసులు తెలిపారు. కదిరిలోని ఎన్జీఓ హోంలో ఆదివారం మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదిగ జాతి సమగ్రాభివృద్ధి సాధించాలంటే ప్రతి ఉద్యోగి తమ వంతు బాధ్యతగా సాయం చేయాలన్నారు. సామాజిక, విద్య, ఆర్థిక చైతన్య కార్యక్రమాలతో పాటు యువతకు మార్గదర్శకం చేయాలని, విద్యార్థులు, పేద కుటుంబాలకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు ఆనంద్, నాగేంద్రనాథ్, శ్రీనివాసులు, పెద్దన్న, చిన్నప్పయ్య, నాగప్ప, రామకృష్ణ, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసులు

బస్సుల కోసం ప్రయాణికుల ఇక్కట్లు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి నుంచి అనంతపురం వెళ్లేందుకు ప్రయాణికులకు తగినన్ని బస్సు సర్వీసులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పుట్టపర్తికి వచ్చారు. ధర్మవరం, అనంతపురం వెళ్లేందుకు గంటలకొద్దీ నిరీక్షించారు. బస్సు లోపలికి రాగానే పరుగులు తీసి సీట్ల కోసం పోటాపోటీ పడటం కనిపించింది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు పడిన బాధలు అన్నీఇన్నీ కావు. జిల్లా కేంద్రం నుంచి అనంతపురానికి రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో అనంతపురానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం ఇనాయతుల్లా తెలిపారు.

సొంతూరుపై మమకారంతో ఉచిత వైద్యశాల ఏర్పాటు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని కనిశెట్టిపల్లికి చెందిన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరనారాయణ సొంతూరుపై మమకారంతో నిర్మించిన ఉచిత వైద్యశాలను ఆదివారం ప్రారంభించారు. ఆయన సోదరుడు డాక్టర్ సూర్యనారాయణ డీఎంహెచ్ఓవగా పదవీ విరమణ చేసి కొంతకాలం క్రితం చనిపోయారు. సోదరులిరువురూ ఉన్నత స్థాయిలో ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. స్వగ్రామంపై అభిమానంతో గ్రామానికి, స్థానికులకు తమవంతు సాయం చేయాలని అనుకున్నారు. ఈక్రమంలో శంకరనారాయణ ఎనిమిది పదుల వయసులో దగ్గరుండి ఆసుపత్రి భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎంహెచ్‌వో బీవీఎన్ చౌదరి, రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ శంకర్, చిక్కబళ్లాపురం వైద్యశాల అసోసియేట్ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి, హిందూపురం కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపల్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కనిశెట్టిపల్లిలో ప్రారంభించిన వైద్యశాల భవనం

గోరంట్లపల్లి కాలువకు నీటి విడుదల

కొత్తచెరువు, న్యూస్‌టుడే: బుక్కపట్నం చెరువు ఆయకట్టుకు అక్కమ్మగారి కొండ దగ్గరున్న ప్రధాన తూము నుంచి ఆదివారం సాగు నీరు విడుదల చేశారు. చెరువు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సంఘం సంచాలకుల ఆధ్వర్యంలో కొత్తచెరువు మేజరు పంచాయతీలోని గోరంట్లపల్లి గ్రామ రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రబీ సాగులో భాగంగా బోర్ల కింద నవంబరు నెలాఖరులో ఆయకట్టు రైతులు వరి నారు కయ్యలు వేశారు. దాదాపు 500 ఎకరాల సాగున్న ప్రధాన కాలువలో పది రోజులుగా రైతుల ఆధ్వర్యంలో పూడికతీత పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం చెరువు నీరే ఆధారంగా ఉన్న పొలాల్లో వరి నారు సాగు చేయడానికి నీటిని విడుదల చేశారు. నారు నాటడానికి ట్రాక్టర్లతో దమ్ము చేసే పనులు మొదలయ్యాయి. డిసెంబరు, వచ్చే ఏడాది జనవరి నెలల్లో వరి నాట్లు వేయడానికి రైతులు నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో డైరెక్టర్ మధు, నీరుగట్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అక్కమ్మగారి తూము నుంచి నీరు వదులుతూ...

వీధికుక్కల దాడిలో జింక పిల్లకు గాయాలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం వీధికుక్కల దాడిలో గాయపడిన జింక పిల్లను స్థానికులు కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. సాయంత్రం ధర్మవరం రోడ్డులో జింక పిల్లను వీధి కుక్కలు వెంబడించడాన్ని స్థానికులు శ్రీనివాసులు, మహేష్, సొహైల్, కొండప్ప, గోపాల్ గుర్తించారు. వెంటనే వారు కుక్కలను తరిమేసి దాన్ని కాపాడారు. గాయాలు ఉండటం గమనించి పసుపు వేశారు. అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత దాన్ని అప్పగించారు. జింక పిల్ల ఇక్కడికి ఎలా వచ్చిందో పోలీస్, అటవీ శాఖల అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

జింక పిల్లను అటవీశాఖ సిబ్బందికి అప్పగిస్తున్న స్థానికులు

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని కోయిలగుట్లపల్లిలో భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్యకు యత్నించిన భార్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై లింగన్న తెలిపిన వివరాల మేరకు.. ఎనుములపల్లికి చెందిన చిన్ననారాయణ కుమార్తె శైలజ(26)కు కోయిలగుట్లపల్లి వాసి నరేంద్రతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది తర్వాత భర్త తాగుడుకు బానిసై భార్యను నిత్యం వేధించేవాడు. పలుమార్లు పెద్దమనుషులు పంచాయితి చేసినా భర్తలో మార్పురాలేదు. వేధింపులు భరించలేక గత నెల 29న శైలజ ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కిందికి దించి పుట్టపర్తిలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరు రామయ్య ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతురాలికి రెండేళ్ల పాప ఉంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శైలజ

బోరు బావి ధ్వంసంపై ఫిర్యాదు

బత్తలపల్లి (ధర్మవరం), న్యూస్‌టుడే: బత్తలపల్లి మండలం పోట్లమర్రి వద్ద తన వ్యవసాయ తోటలోని బోరు బావిని పూడ్చి నాశనం చేశారని, ధర్మవరం మండలం గొట్లూరుకు చెందిన రైతు పోతలయ్య ఆదివారం బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పొలంలోకి వెళ్లి చూడగా బోరు బావి ధ్వంసమైన విషయం తెలిసిందన్నారు. నాగలూరుకు చెందిన శివశంకర్ అనే వ్యక్తిపై తనకు అనుమానం ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తామని బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్ వెల్లడించారు.

నిరుపయోగంగా పాల సేకరణ కేంద్రం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పట్నం గ్రామ సచివాలయ భవనం సమీపంలో 2023లో పాల సేకరణ కేంద్ర భవనాన్ని నిర్మించి పంచాయతీకి అప్పగించారు. నిర్వహణ లోపంతో ఏడాదిపైగా భవనం నిరుపయోగంగా మారింది. భవనం ప్రధాన గదికి అనుబంధంగా ఉన్న మరో గదికి ఏర్పాటు చేసిన తలుపును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయం ఇప్పటివరకు స్థానిక పంచాయతీ అధికారుల దృష్టికి రాలేదు. పాల సేకరణ కేంద్రంలో తలుపులేని ఆ గదిని మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. ఇప్పటికైనా తలుపు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీన్ని ఎంపీడీఓ పోలప్ప దృష్టికి తేగా భవనాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తలుపు చోరీకి గురవడంతో మందుబాబుల అడ్డాగా మారిన గది

కాలువ శుభ్రతకు రైతుల శ్రమదానం

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండలంలోని పేదాంపల్లి సమీపంలోని కాలువ మట్టితో పూడుకుపోయింది. ప్రస్తుతం హంద్రీనీవా నీళ్ల కాలువకు విడుదలవడంతో రైతులే ముందుకొచ్చి యంత్రం సాయంతో పూడికతీత, మరమ్మతు పనులు చేపట్టారు. ఇందుకోసం వంకమద్ది, మర్రికొమ్మదిమ్మె గ్రామాల కర్షకులు రూ.లక్ష విరాళం సేకరించుకున్నారు. తొలుత మట్టి తొలగించి హంద్రీనీవా జలాలను వంకమద్ది చెరువులోకి పంపే ప్రయత్నం చేస్తున్నారు. చెరువులో నీరు చేరితే రబీలో వరి సాగుకు అనూకూలం అవుతుందని అన్నదాతలు అంటున్నారు. అధికారుల పట్టించుకోకపోవడంతో తామే శ్రమదానంతో పనులు చేపట్టినట్లు చెప్పారు. కాలువలో నీరు వస్తుండడంతో పనులు చేయలేమని, నీటి పరిమాణం తగ్గిన తర్వాత చేయిస్తామని ఎమ్మెల్యే కందికుంట చెప్పినట్లు రైతులు వెల్లడించారు.

కాలువ మట్టిని శుభ్రం చేయిస్తున్న రైతులు

చలికి విద్యార్థులు గజగజ

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండలంలోని గూటిబైలు గ్రామంలోని ప్రభుత్వ వసతి గృహం కిటికీలకు రెక్కలు లేకపోవడంతో విద్యార్థులు చలికి గజగజ వణుకుతున్నారు. ప్రస్తుతం చలికాలం కావడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. వసతిగృహంలో 70మంది విద్యార్థులు ఉన్నారు. లావుపాటి మందం కలిగిన దుప్పట్లు వాడుతున్నా చలి ఆగడం లేదని, నిద్రలేకోతున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం కిటికీలు సన్నపాటి రేకులు బిగించినా పూర్తిస్థాయిలో చలిని ఆపలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వార్డెన్ పెద్దన్నను ప్రశ్నించగా నిధులు వచ్చాయని త్వరలోనే కిటికీలకు రెక్కలు బిగించి సమస్య లేకుండా చూస్తామన్నారు.

వసతిగృహంలో రెక్కలులేని కిటికీలు

(c) eenadu

నేడు ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు

తెలుగువారి ప్రియపుత్రిక 'ఈనాడు' దినపత్రిక 50 వసంతాలు పూర్తి చేసుకుంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. 'ఈటీవీ.. మీటీవీ' అనగానే మూడు దశాబ్దాలుగా తెలుగు ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఈనాడు@50, ఈటీవీ@30 వసంతాల వేడుకలకు శ్రీకాకుళం నగరం వేదిక కాబోతోంది. ఈ నెల 8న(నేడు) కోడి రామ్మూర్తి స్టేడియంలో సాయంత్రం 6 గంటల నుంచి ఈ వేడుకలు జరగనున్నాయి. సినీ గీతాలు, స్కిట్స్, కడుపుబ్బ నవ్వించే హాస్యం, డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లతో ఉర్రూతలూగించేలా పలు కార్యక్రమాలు ఇందులో ఉంటాయి. వేడుకల్లో ప్రముఖ హాస్యనటుడు ఆలీ హాస్యాన్ని పండించనున్నారు. బుల్లితెర వ్యాఖ్యాత ప్రదీప్ మాచిరాజు, జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది ఈవెంట్ యాంకర్లుగా వ్యవహరిస్తారు. సినీ నేపథ్య గాయనీ, గాయకులు వందేమాతరం శ్రీనివాస్, రామ్ మిరియాల, కల్పన, మాళవిక, సమీర భరద్వాజ్, సాకేత్, అనుదీప్ దేవ్ తదితరులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. - న్యూస్‌టుడే, పాతబస్టాండ్(శ్రీకాకుళం)

★ అంగరంగ వైభవంగా వేడుకలు జరిగేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాదాపు పది వేల మంది ప్రేక్షకులు కూర్చొని వీక్షించేలా సర్వం సిద్ధం చేశారు. శ్రవణానందంగా ఉండేలా అధునాతన ఆడియో సిస్టమ్‌లు అందుబాటులో ఉంచారు. ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక గ్యాలరీలు, డిజిటల్ తెరలు సిద్ధమయ్యాయి.

★ ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ వేడుకలో పాల్గొనాలంటే పాస్‌లు తప్పనిసరి. పాస్‌తో పాటు ప్రత్యేక ఆకర్షణగా ఇచ్చిన రిస్ట్ బ్యాండ్‌లు ధరించిన వారికే ప్రవేశం ఉంటుంది.

రైలు ప్రయాణంలో సమస్యా 139కు ఫోన్ చేయండి..!

★ ఇచ్ఛాపురం నుంచి రైల్లో తిరుపతి వెళ్తున్న ఓ వృద్ధుడు విశాఖపట్నం దాటాక మరుగుదొడ్డికి వెళ్లి వస్తుండగా తలకు చిన్న గాయమైంది. ఆయన కుటుంబ సభ్యులు 139కు ఫోన్ చేసి సమాచారమివ్వడంతో అనకాపల్లిలో వైద్యులు చికిత్స చేశారు.

రైలులో ప్రయాణం చేస్తున్నప్పుడు అస్వస్థతకు గురైతే వైద్య సేవలు పొందొచ్చు. టోల్ ఫ్రీ నంబరు 139కు ఫోన్ చేస్తే ఆ తర్వాత స్టేషన్‌లో వైద్యం అందుతుంది.

★ టికెట్ కలెక్టర్, ఆర్పీఎఫ్, రైల్వే సిబ్బందికి తెలియజేసినా స్పందిస్తారు. వైద్యులు మందుల పెట్టెతో వచ్చి పరీక్షిస్తారు. పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటే అంబులెన్స్‌లో దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తరలిస్తారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

క్రిస్మస్ సందడి

జిల్లాలో క్రిస్మస్ సందడి మొదలైంది. చర్చిలు, మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాకుళం నగరం డగ్లస్ స్కూల్ ఆవరణలోని కీస్టోన్ చర్చిలో క్రిస్మస్ ముందస్తు వేడుకలు కనుల పండువగా సాగాయి. కొవ్వొత్తులతో ఆరాధన అనంతరం ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. యువతుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. విశ్వాసులు భారీగా పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

అన్నదాత తప్పని అవస్థ

ఖరీఫ్‌లో నాట్లు నుంచి నూర్పిడి వరకు అవాంతరాలు అధిగమించిన అన్నదాతలు ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అవస్థలు పడుతున్నారు. రెక్కల కష్టాన్ని ఆరబెట్టడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. కోటబొమ్మాళి నుంచి శ్రీకాకుళం వెళ్లే వరకు జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ఆదివారం ధాన్యాన్ని ఆరబెడుతూ కనిపించారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

నవోదయ నమూనా పరీక్షకు స్పందన

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జవహర్ నవోదయ నమూనా పరీక్షకు 917 మంది హాజరయ్యారు. శ్రీకాకుళం నగరం, సోంపేట, పాతపట్నం, పలాస, టెక్కలి కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టడమే లక్ష్యంగా దీనిని నిర్వహించినట్లు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ★ జిల్లాలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్లలో 5,516 మంది హాజరయ్యారని డీఈవో ఎ.రవిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. 101 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

శ్రీకాకుళం నగరంలో నవోదయ నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మాటల్లోనే ప్రోత్సాహం.. నిధులందక నిరుత్సాహం..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం, మెళియాపుట్టి

ఎన్నికలు లేకుండా పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవం చేసుకుంటే నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. అంతా ఏకతాటిపైకి వచ్చి ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకుంటే అభివృద్ధికి అవకాశముంటుందని భావించి జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల ప్రజలు ఏకగ్రీవానికి ముందుకొచ్చారు. పాలకవర్గాల పదవీకాలం ముగింపు దశకు వచ్చినా నిధులు మంజూరు చేయకపోవడంతో ఆయా పంచాయతీలకు నిరాశే మిగిలింది.

★ సర్పంచులు పోరుబాట పట్టడంతో జగన్ ప్రభుత్వం దిగివచ్చి 2 వేలు దాటిన (రూ.10 లక్షలు చొప్పున), 5 వేలకు (రూ. 15 లక్షలు) పైగా జనాభా కలిగిన పంచాయతీలకు అప్పట్లో నిధులు కేటాయించారు.

★ చిన్న పంచాయతీలకు సొమ్ము అందకపోవడంతో తాగునీటి అవసరాలు, సీసీ కాలువలు, రహదారులు, ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో అభివృద్ధికి దూరమయ్యాయి. వీధి దీపాల మరమ్మతులు చేపట్టలేని దుస్థితి నెలకొంది.

మెళియాపుట్టి మండలం సుందరాడలో కాలువలు లేక ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు నీరు

అభివృద్ధికి దూరం

ఏళ్లుగా ఏకగ్రీవ పంచాయతీలు ఎదురుచూపులు

★ మెళియాపుట్టి మండలం మారడికోట, పద్ద, లావేరు మండలం చిన్న రొంపివలస పంచాయతీల్లో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ప్రోత్సాహక నిధులు మంజూరైతే అభివృద్ధికి అవకాశం ఉండేదని ఆయా సర్పంచులు అభిప్రాయపడ్డారు.

★ 2 వేల జనాభా కంటే తక్కువ ఉన్న ఏకగ్రీవ పంచాయతీలు 118 ఉన్నాయి. వైకాపా, కూటమి ప్రభుత్వాలు దశల వారీగా 62 పంచాయతీలకు రూ. 5 లక్షలు చొప్పున మంజూరు చేశాయి. వచ్చే ఏడాది మార్చి 26 నాటికి పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. ఈలోగా ప్రోత్సాహకాలు అందుతాయనే ఆశాభావంతో మిగిలినవి ఎదురుచూస్తున్నాయి.

★ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 1,190 పంచాయతీలున్నాయి. 2021 ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్నికల్లో 137 చోట్ల ఏకగ్రీవమయ్యాయి.

ప్రభుత్వానికి నివేదించాం..

ఇప్పటివరకు ప్రోత్సాహకాలు మంజూరు కాని 56 పంచాయతీల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే సంబంధిత ఖాతాలకు జమ చేస్తాం. - కె.భారతీసౌజన్య, డీపీవో, శ్రీకాకుళం

పశువులకూ వసతిగృహాలు..

న్యూస్‌టుడే, పాతపట్నం

గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించడం, రైతుల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చింది. జిల్లాలో నియోజకవర్గానికి ఒక వసతిగృహాన్ని నిర్మించి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టనుంది. పశు పోషకులకు చేయూత అందించడమే లక్ష్యంగా అమలు చేయడానికి ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు.

జిల్లాలో ఆవులు:	3,41,362
గేదెలు:	25,451
గొర్రెలు:	6,41,522
మేకలు:	3,24,665

రూ.10 లక్షలు కేటాయింపు

● పాడి పరిశ్రమ ప్రగతికి ప్రత్యేక పథకం

★ పాడి పరిశ్రమ అభివృద్ధికి తెదేపా పాలనలో మెగా గోకులాల పేరిట షెడ్లు నిర్మించి రైతులకు చేయూత అందించారు.

★ ఆ తర్వాత ఏర్పడిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

★ కూటమి ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో పశువులకు వసతి గృహాలు నిర్మించడానికి చర్యలు చేపట్టింది.

★ పశువుల సంరక్షణ, పోషణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 10 లక్షలు కేటాయించే అవకాశం ఉంది.

★ సుమారు 20 నుంచి 30 పశువులకు వసతి కల్పించనున్నారు.

★ నీరు, పశు గ్రాసం, పాలు పితికే, గడ్డి కోసే యంత్రాలు సమకూర్చనున్నారు.

★ పేడ నుంచి బయోగ్యాస్, సేంద్రియ ఎరువు తయారీ, పాల ఉత్పత్తితో ఆదాయం పెంపొందించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

★ వీటి నిర్వహణను మహిళా, రైతు సంఘాలకు అప్పగిస్తారు.

★ అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లిన రైతులకు చెందిన, పట్టణాల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో తిరుగుతున్న పశువుల్ని ఇక్కడ సంరక్షిస్తారు.

★ పశువుల్ని సంరక్షించడానికి ఈ పథకం ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని ఆ శాఖ జేడీ కంచరాన రాజగోపాల్ తెలిపారు.

జలసోయగం.. ఆనంద పరవశం

గండాహతి జలపాతం వద్ద పర్యాటకులు

మహేంద్రగిరులపై భీముని కొండ వద్ద..

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని పర్యాటక కేంద్రాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. గండాహతి జలపాతం వద్ద, మహేంద్రగిరులపై సందడి నెలకొంది. గండాహతి జలపాతంలో పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. మహేంద్రగిరులపై భీముని ఆలయం వద్దకు పర్యాటకులు పోటెత్తారు. ఇక్కడి ప్రకృతి అందాలను చూసి పరవశించిపోయారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఆదరణ-3 అమలుకు అభిప్రాయ సేకరణ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఆ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదరణ-3 పథకం అమలుకు త్వరలో అభిప్రాయ సేకరణ జరుగుతుందని తెలిపారు. బీసీ రక్షణ చట్టం ముసాయిదాను సిద్ధం చేస్తున్నామన్నారు. పలువురు కుల సంఘాల నాయకులు సూచనలు చేశారు. డీఆర్వో ఎస్వీ లక్ష్మణమూర్తి, జిల్లా బీసీ సంక్షేమాధికారి అనురాధ, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, జిల్లా ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

డంపింగ్ యార్డులు ఇకపై ఉద్యానాలు..!

● చెత్త నుంచి ఎరువు తయారీకి కార్యాచరణ

న్యూస్‌టుడే, పలాస

జిల్లాలోని పురపాలక సంఘాల డంపింగ్ యార్డుల్లో టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయింది. వచ్చే ఏడాది జనవరి 2 నాటికి వాటిని ఖాళీ చేసి ఉద్యానాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస పురపాలక సంఘాలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలను వేరు చేసే ప్రక్రియ మొదలైంది.

విశాఖకు తరలింపు

★ ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను వేరు చేసి విశాఖపట్నంలోని జిందాల్ కంపెనీకి అప్పగించేలా ఓ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత అప్పగించింది.

★ రాళ్లను పురపాలక సంఘాల పరిధిలో గుంతలు, గండ్లు పడిన ప్రాంతాల్లో వినియోగిస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలను విశాఖపట్నంలోని జిందాల్ కంపెనీకి అప్పగిస్తారు.

★ డంపింగ్ యార్డుల వద్ద వేబ్రిడ్జి ఏర్పాటు చేసి వ్యర్థాలను తరలించే టిప్పర్ల బరువు లెక్కిస్తారు. యూనిట్‌కు తీసుకెళ్లిన తర్వాత వివరాలు నమోదు చేస్తారు. రాళ్లు, మట్టి, ప్లాస్టిక్, సీసాలు, బండరాళ్లు వేరు చేస్తారు. మట్టిని పూల మొక్కలకు ఎరువుగా వినియోగించేలా చూస్తారు.

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం డంపింగ్ యార్డ్‌లో చెత్తను వేరు చేస్తున్న యంత్రాలు

మొక్కలు నాటేలా ప్రణాళిక

★ డంపింగ్ యార్డులను పూర్తిగా ఖాళీ చేసి ఉద్యానాలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

★ ఇందులో భాగంగా వచ్చే ఏడాది జనవరి 2 నాటికి ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది.

శరవేగంగా పనులు

డంపింగ్ యార్డుల్లో చెత్తను వేరు చేసి నెలాఖరుకు తరలించేలా చర్యలు తీసుకున్నాం. వ్యర్థాలను సకాలంలో తొలగించే బాధ్యతను ప్రభుత్వం ఏజెన్సీలకు అప్పగించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు డంపింగ్ యార్డులను అభివృద్ధి చేస్తాం. - ఇ.శ్రీనివాసులు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

★ యార్డుల్లో చెత్త నిల్వ ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు దుర్వాసన, వ్యర్థాలకు నిప్పు పెట్టినప్పుడు వస్తున్న పొగతో ఇబ్బంది పడుతున్నారు.

★ ఈ నేపథ్యంలో చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు వేరు చేసి తరలించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఇచ్ఛాపురం	6,260
పలాస-కాశీబుగ్గ	9,625
ఆమదాలవలస	6,678
శ్రీకాకుళం నగరపాలక సంస్థ	1.34 మెట్రిక్ టన్నులు

■ పురపాలక సంఘం
■ డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్త (టన్నుల్లో..)

కొండల్ని పిండి చేసేస్తున్నారు..!

మణిగాం మెట్ట వద్ద పొక్లెయిన్‌తో కంకర తవ్వకాలు

న్యూస్‌టుడే, నందిగాం

నందిగాం మండలం వల్లభరాయపాడు పంచాయతీ పరిధి మణిగాం మెట్ట, కర్లపూడి సమీపంలో అడ్డుకొండ, మాదిగాపురం సరిహద్దులోని అడ్డుకొండలపై కన్నేసిన అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. యంత్రాలను ఉపయోగించి 3 కొండల నుంచి టన్నుల కొద్దీ మట్టి, రాళ్లు, కంకర తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పచ్చదనం కనుమరుగవడంతో జీవాలకు మేత పెట్టడానికి పోషకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై కర్లపూడికి చెందిన పశు పోషకుడు స్పందిస్తూ 'మేత అందుబాటులో లేకపోవడంతో 120 పైగా మేకల్లో 100కు పైగా విక్రయించాను. ప్రస్తుతం సరైన జీవనాధారం లేక అవస్థలు తప్పడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశాడు.

అక్రమార్కులను వదిలిపెట్టం..

అనుమతి లేకుండా తవ్వకాలు చేపట్టకూడదు. నిఘా పెట్టి అక్రమార్కులను గుర్తించి ఎంతటి వారైనా వదిలిపెట్టం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆయా కొండల్ని పరిశీలించడానికి ఆర్ఐ, వీఆర్వోల బృందాన్ని పంపుతాం. - పి.సోమేశ్వరరావు, తహసీల్దారు, నందిగాం

ఉపాధి కార్డు పొందడం సులువే..!

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రక్షాళనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. సాంకేతికతను అనుసంధానించి నిధులు పక్కదారి పట్టకుండా ఉన్నతాధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. లెక్కకు మించి ఉన్న కార్డులను ఈకేవైసీ చేయడం ద్వారా అర్హులైన వేతనదారులకు పని కల్పించాలని నిర్ణయించారు.

దరఖాస్తు చేసిన 48 గంటల్లో మంజూరు

అక్రమాలకు అడ్డుకట్ట

★ పథకం అమలులో అక్రమాలకు తావు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. ★ గతంలో జాబు కార్డు కావాలంటే స్థానిక నాయకులు, కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే మంజూరు చేస్తున్నారు.

★ జిల్లాలో ఈకేవైసీ చేయించుకోని 1,42,337 జాబ్ కార్డులను తొలగించనున్నారు. చాలా గ్రామాల్లో పలువురు కార్డులు లేక పనులకు దూరంగా ఉన్నారు.

★ అలాంటి వారి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జాబు కార్డు కావాలంటే ఆధార్ కార్డు తీసుకుని ఉపాధి కార్యాలయంలో, గ్రామంలో క్షేత్ర సహాయకుడిని కలిస్తే ఈకేవైసీ చేస్తారు. ★ ఆ దరఖాస్తును ఉపాధి కార్యాలయంలో అందజేస్తే మరుసటి రోజే కార్డు అందజేస్తారు. ★ వెంటనే పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథకం పలాస క్లస్టర్ ఏపీడీ సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

తీరంలో మృత్యుఘోష..!

అంతరించిపోతున్న సముద్ర తాబేళ్లు

న్యూస్‌టుడే, సోంపేట, వజ్రపుకొత్తూరు

అరుదైన సముద్ర తాబేళ్లకు (ఆలివ్‌రిడ్లే) రక్షణ కరవైంది. జిల్లాలో తీరప్రాంతానికి కొట్టుకొస్తున్న వాటి కళేబరాలే దీనికి నిదర్శనం. గుడ్లు పెట్టడానికి వచ్చి తిరిగి సముద్రంలోకి వెళ్లలేక మృత్యువాత పడుతున్నాయి. వీటిని పక్షులు, కుక్కలు పీక్కుతింటూ మిగిలిన భాగాలను వదిలేస్తుండటంతో సిక్కోలు తీరంలో దుర్వాసన వ్యాపిస్తోంది. వాటిని పూడ్చే పరిస్థితి లేకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు, వేట సాగించే మత్స్యకారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇచ్ఛాపురం మండలం డొంకూరు తీరంలో ఆలివ్‌రిడ్లే కళేబరాలు

ఇదీ పరిస్థితి

★ జిల్లాలో 193 కి.మీ. మేర తీర ప్రాంతం ఉంది. ఇక్కడ ఇసుక తిన్నెలు, ప్రత్యేక వాతావరణం, సముద్రం నుంచి వచ్చి తిరిగి వెళ్లడానికి అనువైన పరిస్థితులు ఉండటంతో పెద్దఎత్తున ఆలివ్‌రిడ్లేలు వస్తున్నాయి.

★ ఏటా 2.80 లక్షలకు పైగా పిల్లల్ని సముద్రంలోకి వదులుతున్నారు. లోపల ఆక్సిజన్ శాతం పెంచి చేపలు, వాటి పిల్లలకు నష్టం కలిగించే జెల్లీఫిష్ మొక్కల్ని తినడం ద్వారా మేలు చేస్తున్నాయి.

★ డిసెంబరు నుంచి మార్చి వరకు ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, గార మండలాల పరిధిలో ఏటా తీరానికి వచ్చి ఇసుకలో బొరియలు చేసి 4 లక్షలకు పైగానే గుడ్లు పెడతాయి. ★ ట్రీ ఫౌండేషన్, అటవీ శాఖ సంయుక్తంగా వాటిని సేకరించి హేచరీల్లో పెంచుతున్నాయి.

★ సముద్ర తీరానికి 8 నాటికల్ మైళ్ల దూరం వరకు సంప్రదాయ వేట సాగించాల్సి ఉండగా ఒడిశాలోని పారాదీప్, గోపాల్‌పూర్, విశాఖపట్నం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి మెకనైజ్డ్ బోట్లు, స్టీమర్లలో వస్తున్న వారు నిషేధిత వలలు వినియోగిస్తుండటంతో ఎక్కువగా మృతి చెందుతున్నాయి.

★ గాలి పీల్చుకోడానికి 45 నిమిషాలకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వస్తుంటాయి. ఆ సమయంలో వలలు, బోట్లు కింద పడి మృతి చెందుతున్నాయి. మర పడవల వేట కారణంగా ఏటా 10 వేలకు పైగా మృత్యువాత పడుతున్నాయి.

★ ప్లాస్టిక్, పరిశ్రమల వ్యర్థాలతో సముద్ర జలాలు కలుషితమవుతుండటంతో మృతి చెందుతున్నాయి. గుడ్లు పెట్టడానికి వచ్చే సమయంలో కుక్కలు, నక్కలు వాటిపై దాడి చేస్తున్నాయి.

సంరక్షణకు చర్యలు తీసుకుంటాం..

సముద్ర తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారులకు అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించేలా పర్యవేక్షిస్తాం. - సత్యనారాయణ, జేడీ, మత్స్య శాఖ, శ్రీకాకుళం

(c) eenadu

విద్యా రంగానికి పెద్దపీట

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఉపాధ్యాయులు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని, ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మెళియాపుట్టి మండలం దావర జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ 41వ జిల్లా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యారంగంలో సమస్యలు పరిష్కారానికి ఉపాధ్యాయులు చేపడుతున్న ఉద్యమాలను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, గౌరవాధ్యక్షుడిగా వైకుంఠరావు, కోశాధికారిగా సూర్యప్రకాశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు కిశోర్‌కుమార్, గిరిధర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు మహర్దశ!

రూ.49 కోట్లతో పనులు ప్రారంభం

- న్యూస్‌టుడే, లావేరు, ఎచ్చెర్ల

గ్రామీణ ప్రాంత ప్రజలకు సత్వర వైద్య సేవలందించేందుకు గత ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మంజూరు చేసింది. సకాలంలో బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో చాలా చోట్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చాక వాటిపై దృష్టి సారించింది. జిల్లాలో వివిధ దశల్లో ఆగిన 284 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల పూర్తికి రూ.49 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు పలు మండలాల్లో పనులు ప్రారంభించారు. మరికొన్ని చోట్ల టెండర్లు పిలుస్తున్నారు.

లావేరు మండలం తాళ్లవలసలో నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్

★ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు.
★ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త అందుబాటులో ఉంటారు.

★ 'మండలాల వారీగా పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి.. నిధులు కేటాయిస్తున్నాం. త్వరితగతిన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ వీరం నాయుడు తెలిపారు.

అందుబాటులోకి వస్తే...

★ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకం కిందకు వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.
★ ఈ క్లినిక్‌లో జనరల్ ఓపీ, ఈఎన్‌టీ, మధుమేహం, బీపీ, ప్రాథమిక చికిత్స ఇలా 14 రకాల వైద్య సేవలందిస్తారు.

జిల్లాలో వివరాలిలా..	మంజూరైన హెల్త్ క్లినిక్‌లు: 535	గతంలో పూర్తయినవి: 147	అప్పట్లో ఖర్చు చేసిన నిధులు: రూ.54.72 కోట్లు	ప్రస్తుతం నిధులు మంజూరైన క్లినిక్‌లు: 284

ఉత్తమ ప్రదర్శన అమ్మ చెక్కిన బొమ్మ

ముగిసిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ముగిశాయి. ఆదివారం సహన, మంచి మనసులు నాటికల ప్రదర్శన జరిగింది. ఉత్తమ ప్రథమ ప్రదర్శనగా 'అమ్మచెక్కిన బొమ్మ' నాటిక ఎంపికైందని న్యాయ నిర్ణేతలు అబ్బూరి ఉప్పలనాయుడు, మెట్ట పోలినాయుడు, సీహెచ్ తిరుమలరావు ప్రకటించారు. సహన, మంచి మనసులు నాటికలు ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా నిలిచాయి. వివిధ విభాగాల్లో పలువురిని జ్యూరీ అవార్డులు వరించాయి. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాకారుల జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, డా.సనపల నరసింహమూర్తి, పారిశ్రామికులు, జ్యూయలర్స్ అండజేసి అభినందించారు. సమాఖ్య ప్రతినిధులు పన్నాల నరసింహమూర్తి, బంటుపల్లి రామచంద్రుడే తదితరులు పాల్గొన్నారు.

మంచి మనసులు నాటికలోని ఓ సన్నివేశం

ఆదిత్యాలయానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శన టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.8.77 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ తెలిపారు.

- న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచ్, విశాఖపట్నం డోర్ నెం.26-15-150, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్: 0891-2537792 / 2537782, మొబైల్ నెంబర్: 93245 17291, ఇ-మెయిల్ ఐడీ: ubin0817295@unionbankofindia.bank

APPENDIX - IV-A [See Proviso to Rule 8 (6)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) ప్రావిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం. 2002 ప్రకారం స్థిరాస్థుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏది ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది: 30.12.2025 న విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీ చేస్తూ తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తుల రిజర్వుధర మరియు జమచేయవలసిన ధరావత్తు దిగువ వివరించబడినవి.

ఇ-వేలం తేది & సమయం: 30.12.2025, మ॥ 12.00 గం॥ నుండి సా॥ 05.00 గం॥ వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

1 ఋణగ్రహీతలు: 1) మెస్సర్స్ అప్సర స్టోన్ క్రషర్స్ యూనిట్-I, తరపున యజమాని: శ్రీ పిసిని సూర్యనారాయణ, యూనిట్ అడ్రస్: సర్వే నెం. 371-33, కృష్ణాపురం, మెయిన్ రోడ్డు, పొందూరు, శ్రీకాకుళం-532168, ఎ.పి. 2) శ్రీ పిసిని సూర్యనారాయణ, తండ్రి: లేటు సూరయ్య (మెస్సర్స్ అప్సర స్టోన్ క్రషర్స్ యూనిట్-I యొక్క యజమాని), డి.నెం.1-171, బురిడి కాచారం గ్రామము & పోస్ట్, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి. 3) మెస్సర్స్ అప్సర స్టోన్ క్రషర్స్ యూనిట్-II, తరపున యజమాని: శ్రీమతి పిసిని శ్యామల, యూనిట్ అడ్రస్: సర్వే నెం. 373-30, కృష్ణాపురం, మెయిన్ రోడ్డు, పొందూరు, శ్రీకాకుళం-532168, ఎ.పి. 4) శ్రీమతి పిసిని శ్యామల, భర్త: లక్ష్మణనాయుడు (మెస్సర్స్ అప్సర స్టోన్ క్రషర్స్ యూనిట్-II యొక్క యజమాని), డి.నెం.1-171, బురిడి కాచారం గ్రామము & పోస్ట్, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి. హామీదారులు: 1) శ్రీమతి చింత రమణమ్మ, భర్త: తవిటి నాయుడు (హామీదారు), డి.నెం.5-102, రాపాక గ్రామము, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి. 2) శ్రీ పిసిని సూర్యనారాయణ, తండ్రి: లేటు సూరయ్య, డి.నెం.1-171, బురిడి కాచారం గ్రామము & పోస్ట్, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి.
బకాయిమొత్తం: తేది.31.10.2025 నాటికి రూ.89,21,032.00 (అక్షరాల ఎనభై తొమ్మిది లక్షల ఇరవై ఒక్క వేల ముప్పై రెండు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
స్థిరాస్తుల యొక్క వివరములు
(పొందూరు యస్.ఆర్.ఓ. నందు 25-07-2011 తేదీగల విక్రయ దస్తావేజు నెం.2555/2011 ప్రకారము శ్రీ పిసిని సూర్యనారాయణ, తండ్రి: లేటు సూరయ్యకు చెందిన ఆస్తి). శ్రీకాకుళం జిల్లా, పొందూరు మండలం, బురిడికాంచారం గ్రామము & గ్రామ పంచాయతీ, యస్.నెం.222-3, డి.నెం.1-10, 1-11, 1-12 సందు య॥ 0.15 సెంట్లు లేదా 0.060 హెక్టార్స్ లేదా 726 చ॥గ॥ (వాస్తవముగా 528.00 చ॥గ॥) విస్తీర్ణముగల రెసిడెన్షియల్ స్థలము మరియు అందలి భవనమునకు సంబంధించిన యావదాస్తి. పొందూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ క్రింద శ్రీ పిసిని సూర్యనారాయణకు చెందిన ఆస్తి. దీనికి హద్దులు: ఉత్తరం : మజ్జి సింహాద్రి మరియు ఇతరుల యొక్క స్థలము, దక్షిణం: పైలా సూర్యనారాయణ మరియు ఇతరుల యొక్క స్థలము, తూర్పు: గొర్లె సూర్యనారాయణ యొక్క స్థలము, పడమర: పైలా లక్ష్మమ్మ యొక్క ఆస్తి. Latitude:18.18158 N, Longitude:83.48111 E
రిజర్వుధర: రూ.37,50,000/- ధరావత్తు సొమ్ము: రూ.3,75,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.38,000/-

2 ఋణగ్రహీత: శ్రీమతి చిప్పడి గౌరీ, భర్త: బాలమురళీకృష్ణ - అప్లికెంట్, అడ్రస్: అడివరపుపేట స్ట్రీట్, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా-532421. సహ-ఋణగ్రహీత: శ్రీ బాలమురళీకృష్ణ చిప్పడి - కో-అప్లికెంట్, అడ్రస్: అడివరపుపేట స్ట్రీట్, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా-532421. హామీదారు: 1) మరణించిన శ్రీమతి కొరద సుజాత యొక్క ఎస్టేట్ తరపున చట్టబద్ధవారసులు: శ్రీ కె.వి.రామచంద్రరావు, కాలివరపు పేట, నరసన్నపేట-532421, మరణించిన హామీదారు తరపున చట్టబద్ధవారసులు. 2) మరణించిన శ్రీమతి కొరద సుజాత యొక్క ఎస్టేట్ తరపున చట్టబద్ధవారసులు: శ్రీ కె.వి.భాగ్యరాజు, తండ్రి: కె.వి.రామచంద్రరావు, కాలివరపు పేట, నరసన్నపేట-532421, మరణించిన హామీదారు తరపున చట్టబద్ధవారసులు.
బకాయిమొత్తం: తేది.30.09.2025 నాటికి రూ.32,98,555.00 (అక్షరాల ముప్పై రెండు లక్షల తొంభై ఎనిమిది వేల ఐదు వందల యాభై ఐదు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
స్థిరాస్తుల యొక్క వివరములు
(నరసన్నపేట జె.యస్.ఆర్.ఓ. నందు రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.289/2017 ప్రకారము). శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట పంచాయతీ మరియు మండలం, బొరిగివలస రెవెన్యూ గ్రామము, బొంతలవీధి రోడ్డు యొక్క పడమర దిశలో, బ్లాక్ నెం.10, వార్డు నెం.9, న్యూ డోర్ నెం.9-53, సర్వే నెం.18/1 నందు 194.44 చ॥గ॥ విస్తీర్ణము గల రెసిడెన్షియల్ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. నరసన్నపేట యస్ఆర్ఓ క్రింద శ్రీమతి చిప్పడి గౌరీకి చెందిన ఆస్తి. దీనికి హద్దులు: తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: సున్నపు రాంబాబు యొక్క శ్లాబ్ ఇల్లు, ఉత్తరం: అంపోలం వసంతకుమారి యొక్క శ్లాబ్ ఇల్లు, దక్షిణం: నడకమార్గము.
రిజర్వుధర: రూ.26,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.2,60,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.26,000/-

3 ఋణగ్రహీతలు: 1) మెస్సర్స్ రాజ్యలక్ష్మి క్రషర్స్, దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్నది దాని ప్రొప్రయిటర్ శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, యూనిట్ అడ్రస్: సర్వే నెం. 298-21, మెయిన్ రోడ్, పొందూరు, శ్రీకాకుళం-532 168, ఎ.పి. 2) శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, భర్త శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి (ప్రొప్రయిటర్: మెస్సర్స్ రాజ్యలక్ష్మి క్రషర్స్), డోర్ నెం.1-15, మెయిన్ రోడ్, పొందూరు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి. 3) శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి, తండ్రి శ్రీ నారాయణ మూర్తి (ప్రొప్రయిటర్: మెస్సర్స్ శ్రీ ఎం.పి. బాలాజీ స్టోన్ క్రషర్స్), డోర్ నెం.1-15, మెయిన్ రోడ్, పొందూరు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి. 4) మెస్సర్స్ శ్రీ విజయ దుర్గా రా మెటీరియల్ సప్లయర్స్, దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్నది దాని ప్రొప్రయిటర్ శ్రీమతి సీపాన స్వాతి, యూనిట్ అడ్రస్: సర్వే నం. 27-1, మెయిన్ రోడ్, పొందూరు గ్రామం మరియు మండలం, శ్రీకాకుళం-532 168, ఎ.పి. 5) మెస్సర్స్ శ్రీ ఎం.పి. బాలాజీ స్టోన్ క్రషర్స్, దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్నది దాని ప్రొప్రయిటర్ శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి, యూనిట్ అడ్రస్: సర్వే నం. 299-8, మెయిన్ రోడ్, పొందూరు గ్రామం, శ్రీకాకుళం జిల్లా-532 168, ఎ.పి. 6) శ్రీమతి సీపాన స్వాతి, భర్త శ్రీ శంకర మూర్తి (ప్రొప్రయిటర్: మెస్సర్స్ శ్రీ విజయ దుర్గా రా మెటీరియల్ సప్లయర్స్), మెయిన్ రోడ్, బాలాజీ థియేటర్ ప్రక్కన, పొందూరు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి. హామీదారులు: 1) శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, భర్త శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి (గ్యారెంటర్: మెస్సర్స్ శ్రీ విజయ దుర్గా రా మెటీరియల్ సప్లయర్స్), డోర్ నెం. 1-15, మెయిన్ రోడ్, పొందూరు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి. 2) శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి, తండ్రి శ్రీ నారాయణ మూర్తి (గ్యారెంటర్: మెస్సర్స్ రాజ్యలక్ష్మి క్రషర్స్), డోర్ నెం. 1-15, మెయిన్ రోడ్, పొందూరు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి. 2) శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, భర్త శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి (గ్యారెంటర్: మెస్సర్స్ శ్రీ ఎం.పి. బాలాజీ స్టోన్ క్రషర్స్), డోర్ నెం. 1-15, మెయిన్ రోడ్, పొందూరు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా-532168, ఎ.పి.
బకాయిమొత్తం: తేది.31-10-2025 నాటికి రూ.1,57,98,776.00 (అక్షరాల ఒక కోటి యాభై ఏడు లక్షల తొంభై ఎనిమిది వేల ఏడు వందల డెబ్భై ఆరు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
స్థిరాస్తుల యొక్క వివరములు
1) (తేదీ 26.12.2006 నాటి సేల్ డీడ్ నం. 04/2007, శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, భర్త శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి గారి పేరిట చేయబడింది). శ్రీకాకుళం జిల్లా, పొందూరు మండలం, పొందూరు గ్రామం, పొందూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో, రాజాం నుండి చిలకపాలెం వెళ్లే రోడ్డుకు ఉత్తరం వైపు, సర్వే నం. 203, డోర్ నం. 1-15 లో గల 2771.58 చదరపు గజాలు లేదా 2317.40 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన మొత్తం భూమి మరియు ఆర్‌సిసి రూఫ్ కలిగిన షెడ్డు. దీని సరిహద్దులు: ఉత్తరం: బండి దారి, దక్షిణం: పి. గుణవతి గారి ఆస్తి స్థలం, తూర్పు: టేకి నాగరాజు గారి గోడౌన్, పడమర: చిట్టవలస జ్యూట్ మిల్స్ & స్థలం.
రిజర్వుధర: రూ.1,30,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.13,00,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.1,30,000/-

4 ఋణగ్రహీత: మెస్సర్స్ శ్రీ సీతారామ క్యాష్యూ ఇండస్ట్రీస్, డోర్ నెం. 4-58, వెంకటాపురం గ్రామం, లావేరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-532407. ప్రొప్రయిటర్: శ్రీమతి కింతడ అప్పాయమ్మ, భర్త కె. లక్ష్మ, డోర్ నెం. 4-58, వెంకటాపురం గ్రామం, లావేరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-532407. హామీదారులు: 1) కీ.శే. శ్రీమతి కానూరు దుర్గ, భర్త కానూరు నారాయణ రావు గారి చట్టబద్ధమైన వారసులు, డోర్ నం. 1-23, వెంకటాపురం గ్రామం, లావేరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-532407. 2) శ్రీ కింతడ రాంబాబు, తండ్రి కె. లక్ష్మ, డోర్ నెం. 4-58, వెంకటాపురం గ్రామం, లావేరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-532407. 3) శ్రీ కానూరు నారాయణ రావు, డోర్ నం. 1-23, వెంకటాపురం గ్రామం, లావేరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-532407.
బకాయిమొత్తం: తేది.30.09.2025 నాటికి రూ.90,94,621.00 (అక్షరాల తొంభై లక్షల తొంభై నాలుగు వేల ఆరు వందల ఇరవై ఒకటి రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
స్థిరాస్తుల యొక్క వివరములు
1) శ్రీకాకుళం జిల్లా, రణస్థలం యస్ఆర్ఓ పరిధిలోని, లావేరు మండలం, వెంకటాపురం గ్రామం, సర్వే నం. 103/33B నందు శ్రీమతి కింతడ అప్పాయమ్మ గారికి చెందిన ఎకరా 0.10 సెంట్లు లేదా 484 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన వ్యవసాయేతర భూమి మరియు షెడ్డు. ఆస్తి సరిహద్దులు: తూర్పు: కానూరు నారాయణ రావు గారి ఆస్తి, దక్షిణం: కె. అప్పారావు గారి ఆస్తి, పడమర: శ్రీ ఆంజనేయ క్యాష్యూ ఇండస్ట్రీ, ఉత్తరం: రోడ్డు.
రిజర్వుధర: రూ.9,50,000/- ధరావత్తు సొమ్ము: రూ.95,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.9,500/-
2) శ్రీకాకుళం జిల్లా, రణస్థలం యస్ఆర్ఓ పరిధిలోని, లావేరు మండలం, వెంకటాపురం గ్రామం, సర్వే నం. 60/1 నందు శ్రీమతి కానూరు దుర్గ గారికి చెందిన 133.33 చదరపు గజాల స్థలంలో నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్ కలిగిన గ్రౌండ్ ఫ్లోర్ & ఫస్ట్ ఫ్లోర్ నివాస భవనం. ఆస్తి సరిహద్దులు: తూర్పు: కానూరు సూర్యనారాయణ గారి ఆస్తి, దక్షిణం: నంబన నీలయ్య గారి స్లాబ్ ఇల్లు, పడమర: రోడ్డు, ఉత్తరం: రోడ్డు.
రిజర్వుధర: రూ.19,50,000/- ధరావత్తు సొమ్ము: రూ.1,95,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.19,500/-
3) శ్రీకాకుళం జిల్లా, రణస్థలం యస్ఆర్ఓ పరిధిలోని, లావేరు మండలం, వెంకటాపురం గ్రామంలోని సర్వే నెం. 105/19, 18, 17, 16, 15, 13 మరియు 20 నందు శ్రీమతి కానూరు దుర్గ గారికి చెందిన మొత్తం ఎకరా 0.93 సెంట్ల విస్తీర్ణం కలిగిన కన్వర్టెడ్ భూములు. ఆస్తి సరిహద్దులు: తూర్పు: వారణాసి కాంతారావు గారి ఆస్తి, దక్షిణం: గెడెల రమణమ్మ గారి ఆస్తి, పడమర: రస్తా (దారి), ఉత్తరం: గెడెల అప్పల నాయుడు మరియు ఇతరుల ఆస్తి.
రిజర్వుధర: రూ.43,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.4,30,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.43,000/-

5 ఋణగ్రహీత: శ్రీ సూరు శ్యామ సుందరరావు, తండ్రి: సూరు దానయ్య, డి.నెం.1-270, పాండురంగ స్ట్రీట్, కేషుపురం గ్రామము, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా, ఎ.పి., పిన్-532312. సహ-ఋణగ్రహీత: శ్రీమతి డి.సుజాత, భర్త: శ్రీ సూరు శ్యామ సుందరరావు, డి.నెం.1-270, పాండురంగ స్ట్రీట్, కేషుపురం గ్రామము, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా, ఎ.పి., పిన్-532312.
బకాయిమొత్తం: తేది.30.09.2025 నాటికి రూ.34,91,229.00 (అక్షరాల ముప్పై నాలుగు లక్షల తొంభై ఒక్క వేల రెండు వందల ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
స్థిరాస్తుల యొక్క వివరములు
ఇచ్ఛాపురం మండలం, కేశపురం రెవెన్యూ గ్రామం, కేశపురం పాండు రంగ వీధి పడమర వైపు, సర్వే నం. 352/33 లో, సమీప డోర్ నం. 1-270 నందు శ్రీ సూరు శ్యామసుందర రావు గారికి చెందిన 266.60 చ॥ గ॥ లేదా 223.944 చ॥ మీ॥ విస్తీర్ణం కలిగిన నివాస స్థలం మరియు భవనం. సరిహద్దులు: తూర్పు: రహదారి (రోడ్డు), దక్షిణం: సూరు ఊర్వశి గారి ఖాళీ స్థలం, పడమర: రహదారి (రోడ్డు), ఉత్తరం: రోడ్డు.
రిజర్వుధర: రూ.45,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.4,50,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.45,000/-

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింక్‌ను దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది: 06.12.2025, ప్రదేశము: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

హామీలను నెరవేర్చకుంటే ఉద్యమిస్తాం

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తులసీదాస్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేకుంటే ప్రజల మద్దతుతో ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.తులసీదాస్ హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐటీడీఏ, జీడి బోర్డుల ఏర్పాటు, వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ అందించడంతో పాటు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేస్తామని ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోలేదన్నారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నాయకులు పి.తేజేశ్వరరావు, కె.మోహనరావు, బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం తదితరులు ఉన్నారు.

15, 16 తేదీల్లో చలో దిల్లీ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: కరెన్సీ నోటుపై అంబేడ్కర్ చిత్రం ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15, 16 తేదీల్లో చలో దిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నారు. దిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కరెన్సీ నోటుపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జె.పరశురాం పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లీసుపేట అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సంఘాల నాయకులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. సమితి నాయకులు కె.వెజలు, పి.రాంబాబు, కె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరశురాం, చిత్రంలో ఇతర నాయకులు

ఫిబ్రవరిలో సహస్ర చండీ మహాయాగ మహోత్సవాలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఫిబ్రవరిలో పది రోజుల పాటు సహస్ర చండీ మహాయాగ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.ఉపారాణి, వైదిక్ల ధర్మపురి గౌరీశంకరశర్మ, అర్చకులు బంకుపల్లి చరణ్ శంకర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుంచి 11 వరకు చండీయాగం జరుగుతుందని చెప్పారు. ఉత్సవమూర్తుల నిమజ్జనోత్సవంతో కార్యక్రమాలు పూర్తవుతాయని స్పష్టం చేశారు.

శుద్ధ అబద్ధం..!

అంగన్‌వాడీ కేంద్రాల్లో నిరుపయోగంగా ఆర్వో యంత్రాలు

- న్యూస్‌టుడే, పాతపట్నం, శ్రీకాకుళం గ్రామీణం

అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన శుద్ధజల యంత్రాలు మూలకు చేరాయి. వాటిని అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు వివరణ య్యారు. కొన్ని అంటారాల ప్రాయాం మారగా.. మరి కొన్ని మరమ్మతులతో మూలన చేరాయి. జిల్లాలో 60 శాతానికిపైగా కేంద్రాల్లో శుద్ధ జలం అందుబాటులో ఉండట్లేదు. చిన్నారులు ఇంటి నుంచే మంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో వివరాలిలా..
★ ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 16
★ అంగన్‌వాడీ కేంద్రాలు: 3,385
★ చిన్నారులు: 85,981

శ్రీకాకుళం గ్రామీణ మండలం బెండిపేట కేంద్రంలో నిరుపయోగంగా శుద్ధజల యంత్రం

వైకాపా ప్రభుత్వం 2022లో సొంతం పథకంలో భాగంగా 813 శుద్ధ జల యంత్రాలను అందజేసింది. రెండేళ్లలోపు వాటిల్లో 540 యంత్రాలు మూలకుచేరాయి. యంత్రాలు మూలకుతులకు గురైనా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక అలాగే వదిలేశారు. మిగిలిన 273 యంత్రాల్లోనూ నీటి సరఫరా ఉన్న కేంద్రాల్లో మాత్రమే కొన్ని వినియోగంలో ఉన్నాయి.

ఎలా వాడాలో తెలీదు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది ఫిబ్రవరిలో 14 మండలాల్లోని 153 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన శుద్ధజల యంత్రాలను అందించింది. విద్యుత్తు, నీటి సౌకర్యం ఉన్న చోట మాత్రమే వీటిని ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల వాటిని ఎలా ఉపయోగించాలో తెలియక సిబ్బంది పక్కన పెట్టేశారు. సమస్యలను గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ ఎ.విమల మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

చలికాలం.. జర భద్రం..!

- న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

శీతల గాలుల తీవ్రతతో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. రెస్పిరేటరీ సెన్సిటివ్ వైరస్(ఆర్ఎస్‌వీ), ఇతర బ్యాక్టీరియా, వంగస్‌ల వంటి వ్యాప్తి వల్ల వ్యాధులు విసురుతున్నాయి. వాటి కారణంగా ఊపిరితిత్తుల్లో వాపు, నీరు కట్టడం వంటి లక్షణాలతో న్యుమోనియా ముప్పు ముంచుకొస్తుంది. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తొలిదశలోనే లక్షణాలను గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే సమస్య తీవ్రం కాకుండా నివారించొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

❖ శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి సాధారణ రోజుల్లో 2, 3 న్యుమోనియా కేసులు వస్తుండేవి. ప్రస్తుతం ఓపీకి 10 నుంచి 15 మంది బాధితులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

వ్యాధి లక్షణాలిలా..

❖ జ్వరం ❖ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ❖ ఛాతిలో నొప్పి ❖ అలసట ❖ దగ్గు ❖ చిన్నారులు పాలు తాగకపోవడం, ఆకలి తగ్గడం, రుచి తెలియకపోవడం, నిద్రమత్తు, ఉబ్బసం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

❖ ఎక్కువగా నీరు తాగడం ❖ పూర్తిగా విశ్రాంతి ❖ పొగ తాగే అలవాటు మానేయాలి ❖ ఫ్లూ టీకా వేసుకోవాలి ❖ వైద్యులు సిఫార్సు మేరకు మందులు వాడాలి.

నిర్లక్ష్యం చేయొద్దు..

శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. న్యుమోనియా లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటే.. మందులు వాడితే తగ్గిపోతుంది. - పి.రాము, చిన్న పిల్లల విభాగాధిపతి, శ్రీకాకుళం సర్వజనాసుపత్రి

జిల్లాలో ఉష్ణోగ్రత వివరాలిలా..

తేదీ	కనిష్ఠ	గరిష్ఠ
1	20	26
2	18	26
3	21	27
4	21	27
5	19	27
6	19	26
7	17	26

పారా ఆసియా క్రీడా పోటీలకు ఎంపిక

పాతపట్నం, న్యూస్‌టుడే: పారా ఆసియా క్రీడా పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. టీ-42 కేటగిరీ హైజంప్‌లో పలాస మండలం రెంటికోటకు చెందిన మంత్ర లోకేశ్, టీ-11 కేటగిరీ 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్‌లో నందిగాం మండలం దేవుపురానికి చెందిన అంబటి స్వరాజ్ దేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. దుబాయ్‌లో నేటి నుంచి పోటీలు జరగనున్నాయి.

మంత్ర లోకేశ్



అంబటి స్వరాజ్

సాఫ్ట్ టెన్నిస్ శిక్షకురాలిగా సుజాత

హిరమండలం, న్యూస్‌టుడే: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ పోటీలకు సంబంధించి సాఫ్ట్ టెన్నిస్ క్రీడలో రాష్ట్ర జట్టుకు శిక్షకురాలిగా గులుమూరు జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయురాలు ఎస్.సుజాత ఎంపికయ్యారు. ఈమె మహిళా జట్టుకు శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 11 నుంచి 14 వరకు మధ్యప్రదేశ్‌లో పోటీలు జరగనున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, గులుమూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.దాలయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా నావికాదళ దినోత్సవం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం కుశాలపురం పంచాయతీలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం నావికాదళ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన నేవీలో ఉద్యోగ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ బలగాల్లో చేరిన యువత క్రమశిక్షణ, సామాజిక బాధ్యత అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు, నావెల్ వెటరన్స్ ఎం.సతీష్, పైడి రామారావు, పైడి తవిటిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అధికారిని సన్మానిస్తున్న నేవీ అధికారులు, సిబ్బంది

నెరవేరనున్న చిరకాల వాంఛ

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన మందస, సోంపేట, కంచిలి, ఒడిశా సరిహద్దు ప్రాంతం పాత్రపురం సమితి గ్రామాల ప్రజల చిరకాల వాంఛ రాష్ట్ర సరిహద్దులోని మహేంద్రతనయనదిపై వంతెన కల త్వరలో నెరవేరనుంది. మందస నుంచి అంబటికంబారం వరకు రూ.2 కోట్లతో ఏపీ ప్రభుత్వం తారురోడ్డు అభివృద్ధి పనులు చేపడుతుంది. రహదారి చివరి భాగం మహేంద్రతనయనదిపై ఒడిశా ప్రభుత్వం రూ.7 కోట్లతో వంతెన నిర్మిస్తోంది. మార్చి నాటికి పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. - న్యూస్‌టుడే, మందస

బాలికపై అత్యాచారయత్నం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఒడిశా గజపతి జిల్లా రాయగడ సమితి గండాహతి జలపాతం వద్ద 12 ఏళ్ల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం గండాహతి జలపాతం వద్ద బాలిక స్నానం చేస్తుండగా ఇద్దరు యువకులు మద్యం తాగి అత్యాచారానికి యత్నించారు. వెంటనే కేకలు వేయగా కుటుంబ సభ్యులు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. యువకులు కంచిలి ప్రాంతం గోకర్ణపురం గ్రామానికి చెందిన డి.నరేశ్, ఎస్.హరీశ్‌లుగా గుర్తించారు. యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై ప్రతాప్ బెహరా తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	160	275	295

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

EENADU Classifieds

FINANCIAL SERVICES

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్లు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 9121314141.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

డాక్‌యార్డ్‌లో పనిచేయుటకు హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను. PVC తప్పనిసరి. జీ॥ 16,000/- (26 రో) + PF. ✆ 8247036280, 9502686907.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:20k. ✆ 89776 39662, 89776 39663.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణాకాలం 3నెలలు శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజనం. * ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ ఎడ్యుకేషన్ గ్రూప్ వైజాగ్. 9121232326.

MEDICAL

ఫార్మసిస్ట్ (M/F) కావలెను. 2-3 సం॥లు అనుభవం ఉండవలెను. జీతం: 18వేలు, సంప్ర॥ Medplus, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా ✆ 9959991783.

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖస్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీగార్డ్స్ 150 మంది 8గం॥ డ్యూటీ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది (Ex -Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం:30,000/- యూనీఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

సమస్యల ఒడిలోనే సందడి

అక్కుపల్లి శివసాగర పర్యాటక తీరం నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. కుటుంబాలతో వచ్చే వారంతా నానా తంటాలు పడుతున్నారు. అసంపూర్తిగా వదిలేసిన పర్యాటక శాలలు పూర్తిగా పాడయ్యాయి. పరిసరాలన్నీ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తాగి పడేసిన మద్యం సీసాలతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఆదివారం ఒడిశా, జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు పోటెత్తారు. భోజనాలు సిద్ధం చేయడానికి అవకాశం లేకపోవడంతో మత్స్యకార విశ్రాంత భవనం లోపల, చేపల ఆరబెట్టే ప్లాట్‌ఫాం మీద వంటలు వండుకున్నారు. పాడైన శాలలు, అపరిశుభ్ర ప్రదేశాల మధ్య ఆట, పాటలతో గడిపారు. పార్కింగ్ స్థలం లేక తీర రహదారి పొడవునా వాహనాలు నిలిపారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తీరం నుంచి ప్రధాన రహదారి వద్దకు చేరాలంటే గంటలకొద్ది నిరీక్షించాల్సిన పరిస్థితి. తీరం అభివృద్ధిపై ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

పొగ పెడుతున్నారు..

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలు కాలుష్యకోరల్లో చిక్కుకుంటున్నాయి. యార్డ్‌లో చెత్తను రాత్రివేళ తగలబెడుతుండటంతో తెల్లారేసరికల్లా పొగమంచు మాదిరిగా కాలుష్య పొగ కమ్ముకుపోవడంతో ఆయా ప్రాంత నివాసితులంతా గగ్గోలు పెడుతున్నారు. కొద్దిరోజుల్లో డంపింగ్‌యార్డ్‌లో చెత్త పూర్తిగా తొలగించే పనులు చేపడుతున్నామని పారిశుద్ధ్య విభాగ ఇన్‌ఛార్జి హెల్త్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

పెళ్లి వద్దు.. చదువే ముద్దు..

పద్దెనిమిదేళ్ల లోపు బాలికలు చదువుకోవాలని, పెళ్లి చేస్తామంటే వద్దని చెప్పే హక్కు ఉందని అందరినీ చైతన్య పరిచేలా ఇచ్ఛాపురం ఐసీడీఎస్ సీడీపీవో ఎం.రాజేశ్వరి ప్రచార చిత్రాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. కాదా లక్ష్మీకాంతమ్మ పుర బాలికోన్నత పాఠశాల ప్రహరీపై బాలికలను చదివించాలని, పెళ్లి చేయడం నేరమని బొమ్మలతో కూడిన రంగుల చిత్రాలు వేయించారు. ఇప్పటికీ గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయని, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సదస్సులు, ర్యాలీలతోపాటు ఈ గోడచిత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నామని సీడీపీవో పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

చెత్త సంపదపై నిర్లక్ష్యపు నీడ

పల్లెలను స్వచ్ఛగ్రామాలుగా తీర్చిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీని ద్వారా గ్రామాల్లో చెత్త సేకరించి సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించాలనే సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పథకమిది. అపరిశుభ్రతతోనే అనారోగ్యాలు, ఇతర సమస్యలొస్తున్నాయని భావించి స్వచ్ఛ పంచాయతీల కోసం వీటిని ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ నిధులు రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించినా చెత్త సేకరణ సక్రమంగా అమలు కావడం లేదు.

నియోజకవర్గ వివరాలు				
మండలం	సంపద కేంద్రాలు	నిర్మాణంలో ఉన్నవి	పూర్తయినవి	ప్రారంభించనవి
ఇచ్ఛాపురం	18	03	15	-
కవిటి	23	02	18	3
కంచిలి	31	06	25	-
సోంపేట	23	01	22	-

ఇదీ పరిస్థితి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 98 పంచాయతీల్లో సుమారు రూ.4 కోట్ల ఉపాధి హామీ నిధులతో 95 కేంద్రాలు నిర్మించారు. కొన్ని పంచాయతీల్లో కేంద్రాలు పునాది దశలోనే దర్శనమిస్తున్నాయి. పలు పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయినప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. మరి కొన్ని పనికిరాని మొక్కల నడుమ శిథిలావస్థకు చేరుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో ఈ పథకం విఫలమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సన్యాసిపుట్టుగ సమీపంలో ఖాళీగా దర్శనమిస్తున్న సంపద కేంద్రం

'మా పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మించారు. ఇప్పటి వరకు చెత్త సేకరణ జరగలేదు. నిర్మాణం చేపట్టి ఏళ్లు కావస్తున్నా ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంద'ని బెనుగానిపేట వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'పంచాయతీల్లో ప్రభుత్వం చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకొస్తున్నాం. దీనిపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నాం. మరి కొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తాయ'ని ఇచ్ఛాపురం ఎంపీడీవో వై.ప్రభాకరరావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
8008574279
9063144707

? : ఇచ్ఛాపురం పురపాలక సంఘం బెల్లుపడ నుంచి జాతీయరహదారికి వెళ్లేమార్గంలో దేవాలయం వద్ద పాతకాలువ ప్రమాదకరంగా ఉంది. - నిరంజన్‌సాహు, ఇచ్ఛాపురం

★ : పరిశీలించి, కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. - ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? : కంబాలరాయుడుపేట సచివాలయం వద్ద జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. వర్షం పడితే నీరంతా కాలనీలోకి ప్రవేశిస్తోంది. - టి.సరస్వతి, కేఆర్‌పేట

★ : సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సీసీ రోడ్డు అభివృద్ధికి కృషిచేస్తా.
- ఎన్.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, కేఆర్‌పేట
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

? : కంచిలి మండలం జాడుపూడి గ్రామంలో నీటి సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది.
- బి.వల్లభరావు, జాడుపూడి

★ : నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా పాత ట్యాంకును తొలగించి, కొత్తది నిర్మిస్తాం.
- మోహన్, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కంచిలి
– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

మూసేస్తోంది..

పూండి-నౌపడా రోడ్డు నుంచి సీతంపేట వెళ్లే బీటీ రహదారి ఇరువైపులా పెరిగిన పొదలతో మూసుకుపోతోంది. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, నందిగాం మండలంలోని పలు గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ జగదీష్‌ను వివరణ కోరగా పొదలు తొలగించి, రహదారిని శుభ్రం చేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

దారి.. అధ్వానంగా మారి

నగరంపల్లి నుంచి పెద్దబాడం వైపు వెళ్లే రోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. తారు ఊడి రాళ్లు తేలిపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ నాగభూషణం తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

శిథిలం.. భయం భయం

పూండి గోవిందపురం సంతమైదానం వద్ద ఉన్న తుపాను రక్షిత భవనం ప్రస్తుతం శిథిలమై పొదల మధ్య నిరుపయోగంగా ఉంది. గతంలో రైతు భరోసా కేంద్రంగా ఉపయోగపడేది. భవనానికి ఆనుకుని వారపు సంత జరగడం, ప్రధాన రహదారి చెంతనే భవనం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సీతారామయ్యను వివరణ కోరగా భవనం పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

అల్లుకున్న నిర్లక్ష్యం

కవిటి మండలం జల్లుపుట్టుగ, భైరిపురం రోడ్డుల్లో పలు చోట్ల విద్యుత్తు స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో నిత్యం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ యు.శ్రీనివాసరావును వివరణ కోరగా జంగిల్ క్లియరెన్స్ చేసి అల్లుకున్న తీగలు తొలగిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

విరుద్ధంగా.. విచ్చలవిడిగా..

నిబంధనలు తుంగలో తొక్కి ఇరుకు దారుల్లో అధిక లోడ్లతో లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండటంతో పూండి బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మరో వైపు ఇటీవల టోల్ రుసుం ఎగ్గొట్టేందుకు ఇసుక లారీలు పూండి మీదుగా పలు ఉద్దానం ప్రాంతాలకు అధిక లోడ్లతో వెళ్తుండటంతో గ్రామీణ ప్రాంత రహదారులపై ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై ఎస్సై నిహార్‌ను వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

స్పందనకు వందనం

ప్రయాణికులకు రక్షణ

ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో భవనానికి, ప్లాట్‌ఫాంపై ఉన్న రేకుల షెడ్ మధ్య ఖాళీ భర్తీ చేస్తూ, రేకుల అమర్చే పనులు ప్రారంభించారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో పలు కథనాలు రావడంతో రైల్వే అధికారులు స్పందించారు. గతంలో రెండింటి మధ్య ఖాళీ వల్ల వర్షంపడితే ప్రయాణికులు తడిచిపోయే వారు, ఎండకు ఇబ్బంది పడేవారు. ఈ సమస్య పరిష్కార చర్యలు చేపడుతుండటంతో ప్రయాణికులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మరమ్మతులు చేపట్టారు

సుమారు పదేళ్లకు పైగా కంచిలి-సోంపేట రోడ్డులోని రైలు పైవంతెన సమీపంలోని తారు రోడ్డు మలుపు వద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో పలు మార్లు కథనాలు ప్రచురితమవ్వగా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ఇటీవల జరుగుతున్న సోంపేట తారు రోడ్డు పనుల్లో భాగంగా మరమ్మతులు చేపట్టి సమస్యకు పరిష్కారం చూపారు. – న్యూస్‌టుడే, కంచిలి

ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు

గరుడభద్ర రహదారి సమీపంలో కేబుల్ విస్తరణ పనుల్లో భాగంగా తవ్విన గోతిలో ఆవు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంపై గతనెల 28న 'గోతిలో పడి ఆవు మృతి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధితాధికారులు స్పందించారు. రహదారులు ఆనుకొని తీసిన గోతుల చుట్టూ ప్రమాద హెచ్చరిక రిబ్బన్లు, సూచిక బోర్డులు పెట్టి నివారణ చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

బోరు బాగైంది

పలాస-కాశీబుగ్గ పుర పరిధి పొందరవీధిలో పవర్‌బోరు మరమ్మతులు చేపట్టారు. దీనిపై ఇటీవల 'మూలకు చేరిన బోరు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రూ.30వేలతో కొత్తమోటారు కొనుగోలు చేసి అమర్చారు. – న్యూస్‌టుడే, పలాస

ధనరాజతులసమ్మ ఆలయం కిటకిట

లొద్దపుట్టి కూడలి వద్ద కొలువైన ధనరాజతులసమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి ఒడిశాతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బారులు తీరారు. గ్రామ చల్లదనం కోసం గ్రామస్థులు డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక ఘటాలు సమర్పించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలు 12న

ఇచ్ఛాపురం సేచ్ఛావతి అమ్మవారి ఆలయవీధిలో కొలువైన అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, తిరువీధి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మందిర వార్షిక వేడుకల్లో భాగంగా ఈనెల 12న వేకువజాము నుంచి అభిషేకాలు, శాంతిహోమాలు, అలంకరణ, పూజలు, భజనలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆశి కృష్ణారెడ్డి, ధర్మకర్త మణికంఠస్వామి తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అంగరంగ వైభవంగా గాయత్రి మహాయజ్ఞం

మందసలో నిర్వహిస్తున్న గాయత్రి మహాయజ్ఞం ఆధ్యాత్మిక కార్యక్రమం రెండో రోజు ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. ఈ పూజల్లో మందసతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మందస

బాహుదాను కాపాడేందుకు అన్నదాతలు యత్నం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: బాహుదానదిలో ఇసుక తవ్వకాల వల్లే సాగు, తాగునీరు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, తవ్వకాలను అడ్డుకోవడం అందరి బాధ్యతని ప్రభుత్వ విప్ డా.బెందాళం అశోక్ తుపాను సమయంలో అధికారులు, రైతుల సమావేశంలో ప్రకటన చేశారు. దీంతో ఇసుక తవ్వకాలపై అధికారులు అప్రమత్తమైనా సెలవురోజుల్లో, రాత్రివేళ అక్రమార్కులు యథాతథంగా తవ్వేస్తున్నారు. ముఖ్యంగా బాహుదానది పాత, రైలు వంతెనలతోపాటు జాతీయరహదారిపై ఉన్న కొత్త వంతెన వద్ద ఇసుకను దోచేస్తుండటంతో బెల్లుపడ రైతులు అప్రమత్తమయ్యారు. బెల్లుపడ నీటి సంఘ అధ్యక్షుడు కొచ్చెర్ల ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో ట్రాక్టర్లు, పొక్లెయిన్లు వినియోగించి, నది నుంచి రోడ్డు వరకు ఉన్న మార్గంలో 30 చోట్ల పెద్దగుంతలు తవ్వించారు. ఇంకా ఎవరైనా నది నుంచి ఇసుకను తవ్వినా, తరలించినా తామే పట్టుకుని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని రైతులు హెచ్చరించారు.

సీపీఎస్ జిల్లా కన్వీనర్‌గా నల్లాన రవి

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సీపీఎస్ జిల్లా కమిటీ కన్వీనర్‌గా కంచిలి మండలానికి చెందిన ఉపాధ్యాయుడు నల్లాన రవి ఎన్నికయ్యారు. మెళియాపుట్టిలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 41వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. రవి ఎన్నికపై కంచిలి మండల ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీనాయక్, పి.లక్ష్మణరావు, సుదర్శన బెహరా, త్రినాథ్‌సాహు, శ్యామలరావు, పురుషోత్తమరెడ్డి, భగవతిరావు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 1,668 మంది హాజరు

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల పరిధిలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు 1,668 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఎస్, నారాయణ, గురుకుల, చైతన్య, భాష్యం, కాశీబుగ్గ ఉన్నత పాఠశాల, పలాస ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,696 మంది విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. వీరిలో 28 మంది గైర్హాజరైనట్లు పలాస మండల విద్యాశాఖాధికారి సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ పట్టణ సీఐగా **వై.రామకృష్ణ** ఆదివారం విధుల్లో చేరారు. ఈయన విజయనగరం పోలీసు శిక్షణ కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. రామకృష్ణ 2015-2016లోనూ కాశీబుగ్గలో పనిచేశారు. ఈ సందర్భంగా రామకృష్ణను పలువురు తెదేపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన సూర్యనారాయణను వీఆర్‌లో ఉంచారు.

ఆలోచన అదిరింది.. వృథా ఆగింది..

శిథిల పరుపునకు రక్షణగా లోపలి నుంచి వేసిన మట్టికట్ట

డబార్సింగి జలాశయం పరుపు శిథిలావస్థకు చేరి వరదొస్తే కొట్టుకుపోయే పరిస్థితికొచ్చింది. దీనికి ఆయకట్టు రైతులు చెక్ పెట్టారు. ఖరీఫ్ పనులకు ముందు యంత్రాల సహాయంతో జలాశయం లోపలి నుంచి పరుపునకు రక్షణ కవచంలా మట్టికట్ట వేశారు. దీంతో పరుపు రంధ్రాల నుంచి వృథాగా పోయే సాగునీరు ఆగింది. జలాశయం ఇప్పుడు నిండుకుండలా దర్శనమిస్తూ రబీ పంటలకు పూర్తి స్థాయి నీరు సరఫరాకు అవకాశం ఏర్పడింది. – న్యూస్‌టుడే, మందస

ఆర్థిక చేయూత

బూర్జపాడు గ్రామానికి చెందిన సూరు సన్యాసి కుమార్తె జోగమ్మ కిడ్నీ వ్యాధితో కొంత కాలంగా బాధపడుతోంది. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ యువజన సంఘం ప్రతినిధులు ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.43 వేలు ఆర్థిక సాయం అందించారు. యువజన సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

జల్‌జీవన్ పనులు

హంసరాలిలో నత్తనడకన ట్యాంకు నిర్మాణ పనులు

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ.750 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పలాస నియోజకవర్గంలో మాత్రం ఇవి నత్తనడకన సాగుతున్నాయి.

★ నియోజకవర్గ పరిధిలో రెండో విడతలో 225 గ్రామాలకు పైపులైను పనులు జరగాల్సి ఉండగా ప్రస్తుతం 117 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మరో 108 గ్రామాల్లో జరగాల్సి ఉంది. ఓవర్‌హెడ్ ట్యాంకులు 400కి 200 ట్యాంకుల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 200 ట్యాంకుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం 60 ట్యాంకుల నిర్మాణ పనులు వివిధ దశల్లో నత్తనడకన సాగుతున్నాయి.

★ ఈ ఏడాది మార్చికి మొత్తం పనులు పూర్తి చేసి ప్రజలకు శుద్ధజలం అందించేలా చూడాలని ప్రభుత్వం గడువు విధించింది. పనుల తీరు చూస్తే మాత్రం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఈ పథకం ప్రారంభించి రెండేళ్లలో 200 ట్యాంకులు నిర్మించారు. నాలుగు నెలల్లో 200 ట్యాంకుల నిర్మాణాలు పూర్తి చేయడం సాధ్యమైన పనేనా అని వాదనలు వినిపిస్తున్నాయి.

ఏజెన్సీ ప్రజల ఎదురుచూపులు

జల్‌జీవన్ మిషన్ ద్వారా శుద్ధజలం అందుతుందని ఏజెన్సీ ప్రజలు ఆనంద పడినా అది ఎప్పటికి వస్తుందోనని ఎదురుచూస్తున్నారు. డబార్సింగి, కాళింజనగర్, చీపి తదితర ప్రాంతాల్లో పైపులైను పనులు, ట్యాంకుల నిర్మాణాలు పూర్తయ్యాయి. నెలలు కావస్తున్నా శుద్ధజలం సరఫరా జరగడం లేదు. దీంతో అడవి బిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్చికి పూర్తి చేస్తాం

పలాస నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పనులు మార్చికి పూర్తి చేస్తాం. పైపులైను పనులు, ట్యాంకుల నిర్మాణాలు త్వరితగతిన సాగేలా చర్యలు తీసుకుంటాం. వేసవికి శుద్ధజలం అందిస్తాం.
- సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్, డీఈఈ, పలాస

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కంచిలి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి బూరగాం సమీపంలో రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ 24నార్త్ పరగణాలు జిల్లాకు చెందిన పూర్ణమహి ఠాకూర్ బూరగాం జాతీయ రహదారి పక్కన లారీని ఆపి బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. తెలంగాణకు చెందిన లారీ డ్రైవర్ అతివేగంతో వాహనాన్ని నడుపుతూ ఠాకూర్‌ను ఢీకొనడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సోంపేట సామాజికాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బ్రహ్మపుర ఎంకేసీజీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కంచిలి ఎస్సై పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

శాసనాం జాతీయ రహదారిపై...

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస మండలం శాసనాం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారని ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఈశ్వరరావు, సునీల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనక నుంచి వస్తున్న లారీ వారిని ఢీకొంది. దీంతో యువకులిద్దరూ గాయాలపాలయ్యారు. కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

జీపు ఢీకొని..

మందస, న్యూస్‌టుడే: మందస మండలం సందూరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెళియాపుట్టికి చెందిన సవర మురళీకృష్ణకు గాయాలయ్యాయి. కుడుమా సింగి నుంచి సియాలుట్టి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న జీపు ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీకృష్ణకు కుడికాలు విరిగింది. క్షతగాత్రుడిని పలాస ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మందస ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు.

దాబాల్లో మద్యం విక్రయించినా, తాగినా చర్యలు

దాబాలు, అనధికార స్థలాల్లో మద్యం విక్రయించినా, తాగినా చర్యలు తప్పవని సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి.రమణ హెచ్చరించారు. సోంపేటలో దాబాలు, పాన్‌షాపులు, ఇతర ప్రాంతాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. కొర్లాంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న మహిళ నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఇటీవల బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై 45 కేసులు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు. గతంలో నిర్వహించే వారిపైనా నిఘా ఉంచడంతోపాటు 63 మందిపై బైండోవర్ చేయించామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

ప్రతిభకు అభినందన

రణస్థలం మండలంలో బాలి వెంకటరమణ జ్ఞాపకార్థం పదో తరగతి ఆంగ్ల మాధ్యమం విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ పరీక్షలో కవిటి మండలం ముత్యాలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రియా మురహరి సత్తా చాటి రూ.4 వేలు నగదు పురస్కారం పొందాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థిని ఆదివారం పాఠశాల వద్ద అభినందించారు. ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ రెయ్యి లోకనాథం, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, కృష్ణ, గోపి, అప్పలరాజు, సింహాచలం, నాగమణి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

విద్యార్థుల భవిష్యత్తుకు సంకల్పం

పలాస, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎర్రన్న విద్యాసంకల్పం ఎంతగానే ఉపయోగపడుతుందని టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాస మదర్‌థెరిసా విద్యాలయంలో ఆదివారం ఎర్రన్న విద్యా సంకల్పం నవోదయ నమూనా పరీక్షలు నిర్వహించారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన 151 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస మదర్‌థెరిసా విద్యాలయం వద్ద నవోదయ మాక్ పరీక్షలకు హాజరైన విద్యార్థులతో టీపీసీ ఛైర్మన్ బాబూరావు

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అంపురం నుంచి ఘాటిముకుందపురం వెళ్లే రహదారికి చేపడుతున్న మరమ్మతు పనులను ఆదివారం కూటమి నాయకులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. అంపురం నుంచి డీజీపురం వరకు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈ విక్రమ్ తెలిపారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

పలాస, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం 31వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జి కొరికాన శంకరరావు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు టి.ప్రశాంత్, గోపయ్య పాల్గొన్నారు.

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

పిల్లర్లకే పరిమితం..!

ఎల్‌ఎన్‌పేట మండలం బసవరాజుపేట ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయింది. మూడేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని గ్రామస్థులు వాపోతున్నారు. బడిలో 28 మంది విద్యార్థులు చదువుతున్నారు. వేరే దారిలేక ఉపాధ్యాయులు శిథిల భవనంలో బోధన సాగిస్తున్నారు. అధికారులు స్పందించి, పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో చంద్రమౌళి వద్ద ప్రస్తావించగా.. చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్‌ఎన్‌పేట

అయ్యప్పను దర్శించుకున్న దీక్షాపరులు

సారవకోట, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ గ్రామానికి చెందిన అయ్యప్ప దీక్షాపరులు కోదడ్డపనస గ్రామ సమీప కొండపై కొలువైన అయ్యప్ప స్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నా భర్త మృతి చెందడంతో ఏడాది కిందట వితంతు పింఛను కోసం దరఖాస్తు చేశాను. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేకు వినతులు సమర్పించినా ఫలితం లేదు.

- లక్కోజి కృష్ణవేణి, కొసమాల

★ పింఛనుకు అర్హత ఉన్నా.. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఆమె అల్లుడి పేరు చేరిపోవడంతో సాంకేతిక సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభించగానే సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుంది.

- రామకృష్ణ, ఈవోపీఆర్డీ, మెళియాపుట్టి

– న్యూస్‌టుడే, మెళియాపుట్టి

?: నందిగాం మండలం పెద్దతామరాపల్లి కొత్త వీధిలో 4 దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- యర్ర తిరుపతిరావు, స్థానికుడు**

★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మణరేఖ, పంచాయతీ కార్యదర్శి, పెద్దతామరాపల్లి**

– న్యూస్‌టుడే, నందిగాం

ఆదర్శవంతంగా వసతిగృహాలు

నరసన్నపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

నరసన్నపేట, కొత్తూరు, న్యూస్‌టుడే: వసతిగృహాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. నరసన్నపేట, కొత్తూరు మండలం కడుము బీసీ వసతిగృహాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింహాచలం, అనంతపురంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. కడుము వసతిగృహంలో రెగ్యులర్ సంక్షేమాధికారి నియామకానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి అనురాధ, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ రవినాథ్ తిల్హరీకి స్వాగతం పలుకుతున్న ఈవో, అర్చకులు

జలుమూరు, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం, దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖ లింగేశ్వర ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏడుకొండలు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను వివరించారు. ఈవో స్వామి చిత్రపటం, శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అడగలేవని అలుసా..?

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, నరసన్నపేట, సారవకోట, పోలాకి, జలుమూరు

నరసన్నపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని పూర్తిగా అధ్వానంగా మారగా, మరికొన్ని భవనాలు ఏళ్ల తరబడి నిర్మాణ దశలో ఉండి వినియోగంలోకి రాలేదు. దీంతో సిబ్బంది, పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూగజీవాలకు సేవలందించడం గగనంగా మారింది.

అధ్వానంగా ఉర్లాం పశువైద్య కేంద్రం

శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు

● జలుమూరులో సురవరం, రాణా పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళా ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు.

తప్పని అవస్థలు

నరసన్నపేట, నడగాంలో మాత్రమే పూర్తి స్థాయిలో భవనాలున్నాయి. మడపాం పశువైద్యశాల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. చోడవరంలోనూ పనులు పూర్తికాక పంచాయతీ కార్యాలయంలో సేవలందిస్తున్నారు. కంబకాయ కేంద్రం అద్దె గదుల్లో కొనసాగుతోంది.

● ఉర్లాం కేంద్రం పైకప్పు విరిగి, గోడలు బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. వర్షాకాలంలో దస్త్రాలు, మందులు భద్రపరచడం సిబ్బందికి తలకు మించిన భారంగా మారింది. దేవాదిలో భవనం పూర్తిగా శిథిలమైంది. మాకివలసలో నిర్మాణానికి నోచుకోలేదు.

● పోలాకి, ప్రియాగ్రహారంలో కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. నీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. సారవకోటలోని నవతల, బద్రిలో గ్రామీణ పశువైద్య కేంద్రాలు నిర్మించినా. విద్యుత్తు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించలేదు. మందులు సారవకోట కేంద్రంలో భద్రపరుస్తున్నామని వైద్యాధికారి కిశోర్ తెలిపారు.

నరసన్నపేట నియోజకవర్గం వివరాలు

మండలం	పశువైద్య కేంద్రాలు	శిథిలమైనవి	మూగజీవాలు (వేలల్లో)
నరసన్నపేట	7	5	37
పోలాకి	4	1	37
సారవకోట	4	2	22
జలుమూరు	6	2	50

చోడవరంలో అసంపూర్తిగా నిర్మాణం

ప్రభుత్వానికి నివేదించాం

శిథిలమైన, నిర్మాణాలు నిలిచిన కేంద్రాలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. సిబ్బంది లేని చోట పక్క పశువైద్య కేంద్ర సిబ్బందితో సేవలందిస్తున్నాం. **– జి.ప్రసాద్, సహాయ సంచాలకుడు, పశు సంవర్ధక శాఖ**

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే.. నరసన్నపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు సతీమణి బగ్గు సుగుణమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నీరు వృథా.. పట్టని వ్యథ

జలుమూరు మండలం కెల్లివానిపేట రక్షిత మంచినీటి పథకం వద్ద పైపులైన్ లీకైంది. శ్రీముఖలింగం ప్రాజెక్టు ద్వారా చుట్టుపక్కల గ్రామాలకు అందాల్సిన తాగునీరు అధికారులు నిర్లక్ష్యంతో ఇలా వృథాగా పోతోంది. దీంతో శివారు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని గ్రామీణ తాగునీటి విభాగం డీఈ జె.సుదర్శనరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు

కోనేరు.. ఇదేమి తీరు..!

నరసన్నపేట మండలం పాలకొండపేటలో మంచినీటి కోనేరు పరిస్థితి ఇది. కొంత కాలంగా నిర్వహణను పట్టించుకోక పోవడంతో మురుగుకూపంలా మారింది. కాసారాన్ని బాగుచేసి వినియోగానికి వీలుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ సర్పంచి పట్ట ప్రభాకరరావు వద్ద ప్రస్తావించగా.. ఉపాధి హామీ పథకంలో భాగంగా తటాకాన్ని శుభ్రం చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

గండి.. దయ చూపండి

నందిగాం మండలం పెద్దతామరాపల్లి గ్రామ సమీపంలో కొండల నుంచి వచ్చే నీరు ఊర చెరువులోకి వెళ్లేందుకు వంశధార ప్రధాన ఎడమ కాలువపై 1989లో సైఫాన్ నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దీని గోడకు గండి పడింది. దీంతో కాసారంలోకి వెళ్లాల్సిన నీరు నేరుగా కాలువలోకి ప్రవేశిస్తోంది. గండి పూడ్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చర్యలు తీసుకుంటామని వంశధార శాఖ ఈఈ శేఖరరావు పేర్కొన్నారు - న్యూస్‌టుడే, నందిగాం

అసంపూర్తి.. తీరని దాహార్తి

మెళియాపుట్టి మండలం దీనబంధుపురం పంచాయతీ గేదెలపోలూరులో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. రూ.7.50 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని బోరునీటిపైనే ఆధారపడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవస్థలు తీరుస్తామని తాగునీటి సరఫరా అధికారి ఉదయ్‌భాస్కర్ చెప్పారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

తాగునీటి వెతలు తీరాయి

జలుమూరు, న్యూస్‌టుడే: గుగ్గిలి పంచాయతీలో పైపులైన్లు మరమ్మతులకు గురవడంతో తాగునీటి సమస్యతో ప్రజలు అవస్థలు ఎదుర్కొనే వారు. సమస్యపై పలుమార్లు ఈనాడులో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, గ్రామీణ తాగునీటి విభాగం డీఈ సుదర్శనరావు స్పందించారు. సిబ్బందికి తెలియజేసి, కొత్త పైప్‌లైన్ అమర్చారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్పందనకు వందనం

పనికిరాని మొక్కల తొలగింపు

హిరమండలం, న్యూస్‌టుడే: నవతల- శ్రీముఖలింగం రహదారిలో హిరమండలంలోని గొట్టాబ్యారేజీ నుంచి అక్కరాపల్లి వరకు పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడేవారు. దీనిపై ఈనెల 5న 'ప్రమాదాల మలుపు' శీర్షికతో వార్త రావడంతో ర.భ.శాఖ ఏఈ సరోజ చర్యలు తీసుకున్నారు. రోడ్డుకి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నరసన్నపేటలో కేకు కోస్తున్న తెదేపా నాయకులు

నరసన్నపేట, సారవకోట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జన్మదిన వేడుకలు ఆదివారం నరసన్నపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో కేకు కోసి, మిఠాయిలు పంచారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కళింగ, పొందర కార్పొరేషన్ల అధ్యక్షులు రోణంకి కృష్ణంనాయుడు, దామోదర నర్సింహులు పాల్గొన్నారు.★ సారవకోట మండలం సవరడ్డపనస తెదేపా కార్యక్రమంలో జరిగిన వేడుకల్లో పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సారవకోట పీఏసీఎస్ అధ్యక్షుడు సురవరపు తిరుపతిరావు ఉన్నారు.

దొంగల అరెస్టు, చోరీ సొత్తు స్వాధీనం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడిలోని శాంకరి మాత ధ్యాన మందిరంలో గతనెల 5న జరిగిన చోరీ కేసులో పోలీసులు ఇద్దరు దొంగలను అరెస్టుచేశారు. అమ్మవారి మెడలోని పుస్తెలతాడు, బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సీఐ సతీష్‌కుమార్ ఎస్సై రమేష్, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీతానగరం మండలానికి చెందిన పి.భాస్కరరావు, హిరమండలానికి చెందిన సవర సూర్యంను బొబ్బిలిలో అరెస్టు చేశారు. చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితులిద్దరూ సీతానగరం మండలం లచ్చయ్యపేట వెంకటేశ్వర ఆలయంలోనూ బంగారం, వెండి వస్తువులు తస్కరించినట్లు అంగీకరించారని సిబ్బంది చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

జలుమూరు, న్యూస్‌టుడే: కళింగపట్నం- పాతపట్నం 326ఏ జాతీయ రహదారిలో లింగాలవలస పెట్రోలు బంకు వద్ద ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో జలుమూరు మండలం చిన్నదూగాం గ్రామానికి చెందిన గొల్లంగి నర్సింహమూర్తి, జి.సిగడాం మండలం శ్రీరామ్ కాలనీకి చెందిన విజయకుమారి, కృష్ణమోహన్ గాయపడ్డారు. స్థానికులు వీరిని నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.అశోక్‌బాబు తెలిపారు.

వంతెన పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కురుడు పంచాయతీ పాకివలస- కొత్తపల్లి మధ్య వంశధార ప్రధాన కాలువపై ఉన్న వంతెన బలహీనంగా ఉంది. దీని మీద నుంచి భారీ వాహనాలు రాకపోకలు చేస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేసేవారు. సమస్యపై ఈనెల 5న 'బలహీనమని తెలిసినా వినరే' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఎస్సై సత్యనారాయణ వంతెనను పరిశీలించారు .

రేవతీపతి చిరస్మరణీయుడు

రేవతీపతి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైకాపా నాయకులు

టెక్కలి, న్యూస్‌టుడే: దివంగత ఎమ్మెల్యే కొర్ల రేవతీపతి సేవలు చిరస్మరణీయమైనవని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా స్థానిక తొలుసూరుపల్లి రోడ్డులోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేవతీపతి ఆశయసాధనకు కృషిచేద్దామని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, అన్నెపు రామారావు, సత్తారు సత్యం, యర్రా చక్రవర్తి, దుబ్బ వెంకటరావు పాల్గొన్నారు.

గుంత.. ప్రయాణికుల చింత

జలుమూరు మండలం జర్జంగి- పింద్రువాడ రహదారి నుంచి సుబ్రహ్మణ్యపురం వెళ్లే రోడ్డు పక్కన గొయ్యి ఏర్పడింది. వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతుండటంతో స్థానికులు అక్కడ సూచిక ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై ప్రాజెక్టు జేఈ లావణ్యను వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తెలియజేస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, జలుమూరు

లోఓల్టేజీ సమస్యతో ఇక్కట్లు

కొత్తూరు, న్యూస్‌టుడే: మెట్టూరు పంచాయతీ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న బీసీ కాలనీలో లోఓల్టేజీ సమస్యతో విద్యుత్తు వినియోగదారులు ఇక్కట్లు పడుతున్నారు. సుమారు 150 ఇళ్లల్లో ఈ సమస్య ఉందని వాపోతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. పరిశీలించి కొత్త నియంత్రిక ఏర్పాటు చేయిస్తామని అధికారులు చెప్పారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆరు కేంద్రాల్లో 1,315 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు పరీక్ష రాశారు. ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి పర్యవేక్షించారు. పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రభుత్వం 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా ఉపకారవేతనం అందించనుంది.

వైద్య శిబిరానికి స్పందన

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక నరసన్నపేట సిటిజన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. జెమ్స్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేశారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు పుచ్చల విశ్వేశ్వరరావు, అధ్యక్షుడు సువ్వారి మురళి, ప్రతినిధులు ఉప్పాడ పూర్ణారావు, మార్పు విజయ్ పాల్గొన్నారు.

ఒకే చోట ఓటు వేసేలా చూడాలి

పోలాకి, న్యూస్‌టుడే: ఒకే ఇంటి నంబరు కలిగిన వారందరూ ఒకే చోట ఓటు వేసేలా చూడాలని మండల బీఎల్‌వోలకు తహసీల్దార్ పి.శ్రీనివాసరావు ఆదివారం సూచించారు. పోలాకిలో ఆయన మాట్లాడుతూ.. ఒకే చోట లేని వారి వివరాలు సేకరించి వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ నెల 11లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

రాయితీని వినియోగించుకోండి

పోలాకి, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా దూడలను ఉత్పత్తి చేసే వీర్య నాళికలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ప్రసాదరావు ఆదివారం తెలిపారు. పోలాకిలో ఆయన మాట్లాడుతూ... పశువుల ఆసుపత్రిలోనూ, గోపాలమిత్రల వద్ద ఇవి రూ.150లకు లభ్యమవుతాయన్నారు. పోలాకి, నరసన్నపేట మండలాలకు సంబంధించి 400, 450 నాళికలు అందించడమే లక్ష్యమని చెప్పారు. భవిష్యత్తులో పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం ఈ పథకం ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు.

జాగిలంతో తనిఖీలు

సారవకోట, న్యూస్‌టుడే: అర్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు ఆదివారం జాగిలంతో తనిఖీలు చేపట్టారు. ఆటోలు, కార్లు, బస్సులు, ఇతర వాహనాలను నిశితంగా పరిశీలించారు. మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై బి.అనిల్‌కుమార్ తెలిపారు.

పాఠశాల సందర్శన

సారవకోట, న్యూస్‌టుడే: పదోతరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళిక అమలు తీరును ఎంఈవో ఎం.వెంకటరమణ పరిశీలించారు. చిన్నకిట్టాలపాడు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టికను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఏ రోజు ఏ అంశం బోధించాలో కమిషనర్ జారీ చేసిన సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఉపాధ్యాయులను కోరారు.

ఘనంగా ఇరుముడుల కార్యక్రమం

కొత్తూరు, న్యూస్‌టుడే: పారాపురం గ్రామంలో శివాలయం ఆవరణలో అయ్యప్ప దీక్షాపరుల ఇరుముడుల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు పిన్నింటి ప్రసాదరావు, మునకాల అప్పలరాజుల ఆధ్వర్యంలో జరిగిన క్రతువులో వివిధ గ్రామాలకు చెందిన మాలాధారులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

నిర్లక్ష్యం.. కలగదా మోక్షం

కొత్తూరు మండలంలోని బమ్మిడి కూడలిలో కలిగాం- అంగూరు రహదారిలో ప్రయాణికుల విశ్రాంతి భవనం నిరుపయోగంగా ఉంది. చుట్టూ పనికిరాని మొక్కలు పెరగడంతో ప్రజలు ఇందులో వేచి ఉండేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎండైనా, వానైనా అగచాట్లు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యపై పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

తెర వేద్దాం.. తరుముదాం..!

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

రోజురోజుకు చలి పెరుగుతోంది. రాత్రి అయితే చాలు గజగజ వణికిస్తోంది. దీనికి తోడు దోమల మోతతో వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్ణయంతో ఎట్టకేలకు వీరికి కాస్త ఊరట లభించనుంది. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఒక్కో వసతిగృహానికి రూ.15 వేలు మంజూరు చేసింది. వీటిని వసతిగృహాల సంక్షేమాధికారుల ఖాతాల్లో జమచేశారు.

కురుడు వసతిగృహంలో మెష్‌లు లేని కిటికీలు

డివిజన్‌లో వసతిగృహాలు

టెక్కలి డివిజన్ పరిధిలో నిమ్మాడ, తిలారు, కురుడు, కోటబొమ్మాళి, నౌపడ, సంతబొమ్మాళి, పాత టెక్కలి, పీఎల్ పురం, నందిగాం, పోలవరం, టెక్కలి (బాలురు), టెక్కలి (బాలికలు) వసతిగృహాలున్నాయి. వీటిలో 1,150 మంది విద్యార్థులున్నారు.

తక్షణమే చేపట్టాలి

ఇప్పటికే వాతావరణం మారిన నేపథ్యంలో మంజూరైన నిధులతో తక్షణం పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కిటికీలకు మరమ్మతులు, చిరిగిన మెష్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. వెంటిలేటర్ల నుంచి దోమలు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.

రెండు రోజుల్లో పూర్తి

నిధులు మంజూరైన నేపథ్యంలో రెండు రోజుల్లో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరితగతిన పూర్తిచేస్తే విద్యార్థుల ఇబ్బందులు తీరుతాయి.

– త్రినాథరావు, ఏఎస్‌డబ్ల్యూవో, టెక్కలి

సందడిగా వన మహోత్సవం

ఎమ్మెల్యే గోవిందరావును సత్కరిస్తున్న కళింగ వైశ్య సంఘ సభ్యులు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం కళింగ వైశ్య కుటుంబ సమ్మేళనం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో ఆ సామాజిక వర్గ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పలువురు పెద్దలు మాట్లాడుతూ.. ఐకమత్యంగా ఉంటూ కళింగవైశ్యుల ప్రగతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మామిడి గోవిందరావును సత్కరించారు.

టెక్కలిలో నవోదయ నమూనా పరీక్ష

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా టెక్కలిలో విద్యార్థులకు నవోదయ మాక్‌టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. స్థానిక విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల కేంద్రంగా జరిగిన పరీక్షలో 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అవకాశం కల్పించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఆహ్లాదమా.. అదెక్కడ?

శ్రీకాకుళం నగరంలోని కృష్ణాపార్కు నిర్వహణను నగరపాలక సంస్థ అధికారులు గత కొన్నేళ్లుగా విస్మరించారు. గతంలో విద్యుత్తు దీపాలు, వాటర్ ఫౌంటెయిన్‌తో ఆహ్లాదకరంగా ఉండేదని, పార్కును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్, ఈఈ బి.శ్రీనివాసులును వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

తెరపై ఈనాడు

❖ మారుతి: మరువ తరమా ❖ సరస్వతి: ఆంధ్ర కింగ్ తాలూకా ❖ కిన్నెర: అమర కావ్యం ❖ కీర్తన: జనతా బార్ ❖ కీర్తిక: ధురంధర్ ❖ సన్‌మ్యాక్స్: మమ్మీ ఈజ్ బ్యాక్ ❖ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): ది గర్ల్ ఫ్రెండ్ ❖ సూర్యమహల్: రాజు వెడ్స్ రాంబాయి

- న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

?: శ్రీకాకుళం నగరంలోని విశాఖ బి కాలనీలో తాగునీటి పైపులైను మరమ్మతులతో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతోంది. - పి.చిన్నారావు ❖ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - బి.శ్రీనివాసులు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్, ఈఈ

- న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

?: పట్టణ ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారు. - రాము, ఆమదాలవలస ❖ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

?: చింతాడలో వారానికి ఒక రోజు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారు. - గురువులు, స్థానికుడు ❖ రోజూ తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపడతాం. - జాన్సన్, పుర ఏఈ, ఆమదాలవలస - న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆదిత్యుని సేవలో ప్రముఖులు

జస్టిస్ రవినాథ్ తిలహరికి స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో ప్రసాద్, శంకరశర్మ

శ్రీకాకుళం నగరం, గార, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి, శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరి, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణలు ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆశీర్వదించారు. ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ★ లండన్‌లో స్థిరపడిన జిల్లాకు చెందిన ఆకుల మహేశ్వరరావు ఆదిత్యాలయంలోని నిత్యాన్నదాన కేంద్రంలో స్టీల్ బెంచీలకు రూ.లక్ష, నగరానికి చెందిన మర్రపు వెంకటనాయుడు, సత్యదేవి రూ.20 వేల చొప్పున ఈవోకు విరాళం అందజేశారు.

బాధిత రైతులకు పరామర్శ

దగ్ధమైన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూన రవి

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన మజ్జి సూర్యనారాయణ, పాలక శ్రీరాములుకు చెందిన వరి కుప్పలు ఇటీవల దగ్ధమైన ఘటన తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, రైతులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

12న సామూహిక పారాయణం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం బలగలోని బాల త్రిపుర కాలభైరవాలయంలో 12న 5 వేల మంది భక్తులతో కాలభైరవాష్టక సామూహిక పారాయణం ఉంటుందని గణేష్ స్వామి తెలిపారు. ఆదివారం ఉదయం కాలభైరవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు గణేష్ స్వామి ఆధ్వర్యంలో ప్రవచనం జరిగింది.

సొంతింటి కల నెరవేరుతున్న వేళ

★ 14 వరకు లబ్ధిదారుల గుర్తింపునకు అవకాశం

- న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారికి బిల్లులు మంజూరు చేసేందుకు గృహనిర్మాణ సంస్థ అధికారులు గత నెల 30 వరకు లబ్ధిదారుల నుంచి వినతులు సేకరించారు. ప్రస్తుతం ఈ నెల 14న వరకు మరోసారి గడువు పెంచారు. అర్హత ఆధారంగా బిల్లులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సరుబుజ్జిలిలో లబ్ధిదారులను గుర్తిస్తున్న గృహనిర్మాణ సంస్థ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్

★ లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.2.50 లక్షలు బిల్లులు అందజేస్తారు. గ్రామాల్లో అర్హత ఉన్నవారిని గుర్తిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

★ ఆమదాలవలస నియోజకవర్గంలో ఇప్పటి వరకు 8,614 మంది లబ్ధిదారుల పేర్లను ఇంజినీరింగ్ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారిని గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గ వివరాలు

మండలం	గుర్తించిన లబ్ధిదారులు
సరుబుజ్జిలి	1,441
ఆమదాలవలస	2,093
పొందూరు	3,243
బూర్జ	1,837

అవగాహన కల్పిస్తున్నాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కొత్త నిబంధనలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. - ఎన్.ధర్మారావు, డి.సన్యాసిరావు, డి.బాబూరావు, నియోజకవర్గ గృహనిర్మాణ ఏఈలు

థర్మల్ ప్లాంటుకు వ్యతిరేకంగా కవితాస్త్రాలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కార్గో విమానాశ్రయం, థర్మల్ పవర్ ప్లాంట్ స్థాపనకు వ్యతిరేకంగా పలువురు రచయితలు కవితాస్త్రాలు సంధించారు. నగరంలో యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సాహితీ స్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పోరుబాట కైత కవిసమ్మేళనం జరిగింది. ప్రసిద్ధ కథారచయిత అట్టాడ అప్పలనాయుడు [illegible] కవులు [illegible] కవితలను చదివారు.

బాబోయ్ కుక్కలు..

పొందూరు మార్కెట్ రోడ్డులో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే విద్యార్థులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు వీధుల్లో కుక్కలు గుంపులుగుంపులుగా సంచరించడంతో స్థానికులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

సంపదకు దూరం..

సరుబుజ్జిలి గ్రామానికి సమీపంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రం అలంకారప్రాయంగా మారింది. తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. చెత్త నిల్వ చేయాల్సిన కుండీల్లో పనికిరాని మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ రామారావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

అధ్వానంగా పారిశుద్ధ్యం

శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. రహదారి పక్కన, నివాసాల మధ్యలో మురుగునీరు నిలిచిపోతోంది. దోమల బెడదతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి టి. తిరుమలాదేవి మాట్లాడుతూ కాలువల నిర్మాణానికి ప్రణాళికలు పంపించామని, మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

అల్లుకున్న నిర్లక్ష్యం..

పొందూరు మండలం కోటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మజ్జిలపేట వద్ద విద్యుత్తు నియంత్రిక చుట్టూ పనికిరాని మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆ శాఖ ఏఈ సుధీర్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి మొక్కలు తొలగిస్తామని తెలిపారు - న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

బహిరంగ ప్రకటన

[illegible] S/o. లేటు సూర్యనారాయణ, [illegible] Regd. G.P.A [illegible] O.S.373/2024, IA 285/2024, శ్రీకాకుళం IIIrd Additional Civil Judge (PRO & Excise) Court [illegible] Honourable High Court, Amaravathi [illegible] Appeal [illegible] CMA 18/2024 [illegible] Dismiss [illegible] High Court [illegible]

షెడ్యూల్ దాఖలు ఆస్తి

[illegible] R.S. No: 496-1, T.S. No: 414-1 [illegible] 0.16 సెంట్లు [illegible]

A.L.NARAYAN, ADVOCATE
Official Colony, SRIKAKULAM.
Ph: 9110529193

సందడిగా 'తెరవే' సాహితీ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం తెలుగు రచయితల వేదిక(తెరవే) నెలవారీ సాహితీ సమ్మేళనం, పుస్తక పరిచయం, కవితాపఠనం, కిల్లాన శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు జరిగాయి. వేదిక కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, విశ్రాంత సెట్‌శ్రీ సీఈవో సురంగి మోహనరావు అతిథులుగా హాజరయ్యారు. టి.విజయ్ లక్ష్మణ్ శబ్ద బ్రహ్మ పుస్తక పరిచయం జరిగింది. పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

నవోదయ నమూనా పరీక్షకు స్పందన

బూర్జ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బూర్జ ఉన్నత పాఠశాల్లో ఆదివారం జిల్లా స్థాయి జవహర్ నవోదయ నమూనా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారులు శ్యామసుందరరావు, ధనంజయరావు తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన 40 మంది విద్యార్థులకు ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంతి ఉప విద్యాశాఖ అధికారి ఐ.వెంకటరావు, తదితరులు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. స్థానిక ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు

శ్రీకాకుళం నగరంలోని శివాలయాల్లో ఆదివారం ఆరుద్ర నక్షత్ర పూజలు నిర్వహించారు. పాతశ్రీకాకుళం నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరాలయంలో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

రమణారావుకు సన్మానం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నాగవంశ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎరుబోతు రమణారావుకు ఆదివారం పొందూరులో తెదేపా నాయకులు సత్కరించారు. పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగనాయకులు, తెదేపా నాగవంశ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపనిషన్మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం

శ్రీకాకుళం సాంస్కృతికం: శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డులోని ఉపనిషన్మందిరంలో విశ్రాంత అధ్యాపకుడు నిష్టల నరసింహమూర్తి భగవద్గీత గ్రంథి శ్లోకాలు అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. కార్యక్రమంలో డా.సనపల నారాయణమూర్తి, బాబూరావు, డా. నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే వైద్యం అత్యవసరం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రోగులు ప్రాథమిక దశలోనే వైద్య చికిత్సలు చేయించుకోవాలని ప్రముఖ ఫిజీషియన్ అన్నెపు శశిధర్ కోరారు. ఆదివారం పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో కొత్తగా ఏర్పాటైన ఆసుపత్రిని ప్రారంభించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు సంపతిరావు చిన్నంనాయుడు, అనకాపల్లి పావని, సర్పంచి రేగిడి లక్ష్మి, నాగవంశ కార్పొరేషన్ డైరెక్టరు అనకాపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

శ్రీకాకుళం నగరం కోడిరామ్మూర్తి స్టేడియం సమీపంలోని లూథరిన్ చర్చిలో ఆదివారం మహిళా క్రిస్మస్ వేడుకలు సందడిగా జరిగాయి. మహిళలు క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. పేదలకు నిత్యావసర సరకులు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

- న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

వైభవంగా గురుపూజోత్సవాలు

శ్రీకాకుళం సాంస్కృతిక: శ్రీకాకుళం నగరం బాలభాను విద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం మహాగణపతి పూజ, ప్రార్థనలు, ప్రవచనాలు, సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

విజేతలకు అభినందన

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఘట్కా పోటీల విజేతలను ఆదివారం స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు అభినందించారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ నగరానికి చెందిన 11 మంది బంగారు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. ఘట్కా అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.శ్యామ్‌సుందర్, కార్యదర్శి బి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి స్పెల్‌బీ పోటీల్లో ప్రతిభ

విజేతలతో నిర్వాహకులు

గార (కళింగపట్నం), న్యూస్‌టుడే: గార మండలం కళింగపట్నం - మత్స్యలేశం పంచాయతీ శ్రీబుద్ధా పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి స్పెల్‌బీ పోటీలు జరిగాయి. వేదం ఇంటర్నేషనల్ ఏఐ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల నుంచి 850 మంది హాజరయ్యారు. విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. మత్స్యలేశం సర్పంచు బి.లలిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై వైకాపా నాయకుల ఫిర్యాదు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కూన రవికుమార్ తనపై అనవసర విమర్శలు మానుకోవాలని వైకాపా నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఆయన ఫిర్యాదు చేశారు. కొన్ని రోజుల కిందట తనపై వ్యక్తిగత విమర్శలు చేయడంపై పూర్తి విచారణ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైకాపా నాయకులు పాల్గొన్నారు.

పైడిభీమవరం పంచాయతీని విభజించండి

రణస్థలం, న్యూస్‌టుడే: పైడిభీమవరం పంచాయతీని రెండు పంచాయతీలుగా విభజించాలని పలువురు రణస్థలం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో వరిశాం, పైడిభీమవరం, డి.పాలవలస, ఎం.పాలవలస, సరగడపేట, చిల్లపేట తదితర గ్రామాలున్నాయని, భౌగోళికంగా గ్రామాలు దూరంగా ఉండటంతో విభజించాలని కోరారు

సత్యసాయి సేవాసమితి సభ్యుల వితరణ

నిత్యావసర సరకులు అందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల సభ్యులు

బూర్జ, న్యూస్‌టుడే : బూర్జ సత్యసాయి భజన మండలి కన్వీనర్ బి.రామారావు ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరకులు, దుస్తులను అందించారు. ముఖ్య అతిథిగా సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జోనల్ కన్వీనర్ ఎం.రవీంద్రబాబు, జిల్లా విద్యాజ్యోతి ఇన్‌ఛార్జి ఎం.జనార్దనరావు, వివిధ గ్రామాల భజన మండలి కన్వీనర్లు పాల్గొన్నారు.

జెమ్స్ వైద్య కళాశాలలో సదస్సు

మాట్లాడుతున్న జెమ్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుధీర్

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు జెమ్స్ వైద్యకళాశాలలో ఆదివారం నిరంతర వైద్య విద్య సదస్సు (జోనల్ సీఎంఈ) జరిగింది. కృత్రిమ మేధ పాత్ర, ఆధునిక పరిణామాలు, రోగి సంరక్షణలో మెరుగైన విధానాలపై చర్చలు సాగాయి. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం తరపున పర్యవేక్షకుడిగా డాక్టర్ మురళీకృష్ణ, వైద్య కళాశాల డైరెక్టర్లు డాక్టర్ సుధీర్, శ్రీధర్ రెడ్డి, అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ డీవీజీ శంకరరావు పాల్గొన్నారు.

నగరంలో మట్టి రోడ్లు..

ఏళ్లుగా ప్రజలకు అవస్థలే

- న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

శ్రీకాకుళం నగర పరిధిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రజల నుంచి ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులు, ఇళ్ల నిర్మాణ అనుమతులు కోసం రుసుము వసూలు చేసే నగరపాలక సంస్థ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవుతోందని పలువురు మండిపడుతున్నారు. నగర పాలక సంస్థగా మారి ఏళ్లు కావొస్తున్నా నేటికీ అన్ని డివిజన్లలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు నిర్మించలేని దుస్థితిలో ఉందని పేర్కొంటున్నారు.

సీసీ రహదారికి నోచుకోని తోటపాలెం ప్రభుత్వ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి

ప్రభుత్వంలో కాస్త పలుకుబడి ఉన్న అధికార పార్టీ నాయకులు, చెప్పిన చోట, ప్రజాప్రతినిధులు నివాసం ఉండే ప్రాంతాల్లో రూ.లక్షలు వెచ్చించి సీసీ రహదారులు నిర్మిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

❖ నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ రోడ్లు దుర్భరంగానే ఉన్నాయి. తోటపాలెం, కుశాలపురం, చాపురం తదితర విలీన ప్రాంతాలతో పాటు నగరంలోని పి.ఎన్.కాలనీ, చౌదరి సత్యనారాయణ కాలనీ, నాయుడుచెరువుగట్టుకాలనీ, ఫాజుల్‌బేగ్‌పేట, బైరివానిపేట, సోడా లేఅవుట్, బలగ వరం కాలనీ, బుచ్చిపేట, బలగ పొందరవీధి, మండలవీధి, డీసీసీబీ కాలనీ తదితర ప్రాంతాలు పూర్తిస్థాయిలో సీసీ రహదారులకు నోచుకోలేదు.

పలు ప్రాంతాల్లో రహదారుల నిర్వహణను విస్మరించడంతో గుంతలతో శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో నగరంలో పలుమార్లు మంచినీటి పైపులైన్లు, వీధి కుళాయిలు, వ్యక్తిగత కుళాయిల కోసం రోడ్లను అప్పట్లో ఇష్టానుసారం తవ్వేసి, తర్వాత వాటిని పూడ్చకపోవడంతో అధ్వానంగా మారాయి.

❖ డివిజన్లలో కుటుంబాలు, జనాభా, వాహనాల రద్దీ తదితర ప్రాతిపదికన ప్రాధాన్యత క్రమంలో రహదారులు నిర్మించాల్సి ఉండగా నగరపాలక సంస్థలో అందుకు విరుద్ధంగా అధికారులు సిఫార్సులకే పెద్దపీట వేస్తున్నారు. ప్రతి

జనాభా: 1.85 లక్షల మంది, డివిజన్లు: 50

అభివృద్ధి చేస్తాం..

నగరంలో అన్ని కాలనీల్లో మట్టి రహదారులను నగర పాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేయించారు. వాటిని సీసీ రోడ్లుగా మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. కొన్నింటికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాం. అందుబాటులో ఉన్న నిధులతో దశల వారీగా పనులు చేయిస్తాం. - బి.శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

సైనికుల సేవలు కీలకం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: దేశ భద్రతలో సైనికుల సేవలు కీలకమని సైనికాధికారి, సుబేదార్ సంపతిరావు కృష్ణారావు అన్నారు. పట్టణంలో ఓ ఆడిటోరియంలో రెజిమెంట్ అవతరణ దినోత్సవం సందర్భంగా భారతమాత, అబ్దుల్‌కలాం చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సైనిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పూరిళ్లు దగ్ధం

రణస్థలం, న్యూస్‌టుడే: మండలంలోని జీరుపాలెంలో విద్యుత్తు షార్టు సర్క్యూట్‌తో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. మైలపల్లి కొర్లమ్మ, మైలపల్లి చిలకమ్మలకు చెందిన పూరిళ్లు కాలిబూడిదయ్యాయి. ఈ ఘటనతో నడిరోడ్డున పడ్డామని బాధితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు.

అంబళ్ల వలసలో గడ్డివాములు.. గార (అంబళ్లవలస), న్యూస్‌టుడే: గార మండలం అంబళ్లవలసలో ఆదివారం గడ్డివాము దగ్ధమైంది. పూసర్లపాడు గ్రామం గదిలి సురేష్ పశుగ్రాసం కోసం సిద్ధం చేసుకుంటున్న సమయంలో ఘటన జరిగిందని, ఆకతాయిలు ఇలా చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పశువుల వ్యాను అడగింత

రణస్థలం: శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న పశువుల వ్యానును ఆదివారం ఉదయం రామతీర్థం కూడలి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. 10 పశువులను స్వాధీనం చేసుకుని గోశాలకు పంపినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

ఈనాడు తిరుపతి

సోమవారం డిసెంబరు 8, 2025

రంగు మారిన జలాలు

కడలి ఒడిలో.. స్వర్ణకాంతులు

దిత్వా తుపాను అనంతరం ఏర్పడిన అల్పపీడనంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. స్వర్ణముఖి నది నిండుకుండను తలపిస్తూ ఉద్ధృతంగా ప్రవహించింది. వరదనీరు వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద పెద్దఎత్తున సముద్రంలో కలిసి కొత్త, పాత నీరు బీచ్ వద్ద ఇలా వేరువేరుగా కనిపించాయి. బంగాళాఖాతంలో వంద మీటర్ల వరకు నదీజలాలు విస్తరించడం, పర్యాటక ప్రాంతం కావడంతో ఆదివారం సందర్శకులు తీరంలో సరదాగా గడుపుతూ ఇక్కడి అందాలను తమ చరవాణుల్లో బంధిస్తూ ఆనందించారు. - ఈనాడు, తిరుపతి

నేడు డయల్ యువర్ సీఎండీ

తిరుపతి (నగరం): విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారంకోసం సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో సంస్థ పరిధిలోని వినియోగదారులు ఫోన్‌చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

ఫోన్ నంబరు : 89777 16661

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: మండల, రెవెన్యూ కేంద్రాలు, కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు వినతులు స్వీకరిస్తారన్నారు.

మాకొద్దు.. ఈ క్వారీ..

క్వారీ ప్రాంతానికి బయలుదేరిన ఎగువపూడి వాసులు

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎగువపూడి సమీపంలో ఏర్పాటు చేయనున్న క్వారీకి వ్యతిరేకంగా గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలోని చిన్నపిల్లలు, మహిళలు, యువత ఏకమై క్వారీ ప్రాంతానికి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో క్వారీ నిర్వాహణకు అనుమతులు ఇచ్చారన్నారు. పంచాయతీ తీర్మానం లేకుండానే కొంతమంది స్వార్థానికి ఇక్కడ క్వారీ ఏర్పాటుకు సిద్ధపడినట్లు తెలిపారు. దీనిపై ఉద్యమానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారులు స్పందించి క్వారీ ఏర్పాటును నిలిపివేయాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

దారంతా గుంతలు.. తొలగని గంతలు

సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామంలోని గుంతలివి. సూళ్లూరుపేట నుంచి కోట, వాకాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో దారంతా గుంతలే ఉన్నాయి. ఈ రహదారిలో శ్రీసిటీలోని కంపెనీలకు బస్సులు నడపలేమని డ్రైవర్లు ఇటీవల రోడ్డుపై నిరసన తెలిపారు. ఇతర వాహనదారులదీ ఇదే ఆవేదన. **-న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

బినామీ రిజిస్ట్రేషన్లు.. బోగస్ దందా

- వెలుగులోకి తుక్కు వ్యాపారి సీజీఎస్టీ అక్రమాలు
- నకిలీ బిల్లులతో రూ.కోట్లు దోపిడీ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: జీఎస్టీ రిటర్న్స్‌లో అక్రమాలకు పాల్పడిన తుక్కు మాఫియా ముఠా నాయకుడిని అధికారులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించడం లేదు. కాకి లెక్కలతో రూ.కోట్ల లావాదేవీలు చూపి పన్ను మినహాయింపు మొత్తాన్ని రిటర్న్స్ ద్వారా దోచుకున్నట్లు గుర్తించారు. అమాయకులకు నగదు ఆశ చూపి వారి పేరుతో నాలుగు బోగస్ సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో క్రయవిక్రయాలు చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సీజీఎస్టీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సొమ్ము దోచుకున్నారు. చిత్తూరు కేంద్రంగా ఇటీవల వెలుగు చూసిన ఈ వ్యవహారం సంచలనం సృష్టించింది.

తుక్కు వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించి అక్రమ మార్గంలో రూ.కోట్లు గడిస్తున్న బోగస్ సంస్థలన్నింటికీ అంతిమ ముఠా నాయకుడు చిత్తూరు వాసిగా గుర్తించారు. గతంలోనూ అతడి అక్రమాలు గుర్తించి కేసులు నమోదు చేసినా, తనకున్న పలుకుబడి, ఆర్థిక బలంతో పాటు వాణిజ్య పన్నుల శాఖలోని కొందరి అధికారుల సహకారంతో తన అక్రమ వ్యాపారాన్ని కొనసాగించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. అమాయకులు, దినసరి కూలీలు, తోపుడు బండ్లపై చిరు వ్యాపారం చేసుకునే పేదలకు మధ్యవర్తుల ద్వారా రూ.10 వేల నుంచి రూ.20 వేలు ఇవ్వడం, వారి ఆధార్, పాన్, చరవాణుల నుంచి ఓటీపీ నంబర్లు తీసుకుని బినామీ సంస్థలు రిజిస్ట్రేషన్ చేయించారు. బ్యాంకుల్లోనూ వారి ఖాతాలకు సీజీఎస్టీ రిటర్న్స్ చేయించి ఆ మొత్తాన్ని దోచుకున్నట్లు గుర్తించారు.

అక్రమాలకు పాల్పడిన సంస్థలు ఇవే..

చిత్తూరు నగరానికి చెందిన అరహం పెట్రో అండ్ నాన్ పెట్రో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మదీనా స్టీల్స్, జెడ్‌ఎఫ్ ట్రేడర్స్, యార్ స్టీల్స్, ఎమ్మార్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్.. ఇవన్నీ బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ అయ్యాయి. వాటి ద్వారా పెద్దఎత్తున వ్యాపారం చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సీజీఎస్టీ రిటర్న్స్ చేయించుకుని ప్రభుత్వ సొమ్ము రూ.కోట్లలో కాజేసినట్లు విచారణ బృందాలు తేల్చాయి.

ఎలా గుర్తించారంటే..

తుక్కు మాఫియా ముఠా నాయకుడి ఫోన్ నంబరు ఆధారంగా కాల్ రికార్డులు సేకరించి నిత్యం మాట్లాడే వారి నంబర్లు, జరిగిన సంభాషణ, బినామీ పేర్లతో రిజిస్టరైన సంస్థలు, సీజీఎస్టీ ఇన్‌పుట్ టాక్స్ రిటర్న్స్ చేయించిన ఖాతాలు, వారి ఆర్థిక లావాదేవీలతో పాటు, మధ్యవర్తులుగా వ్యవహరించిన కొందరిని అదుపులోకి తీసుకుని వివరాలు రాబడుతున్నారు. త్వరలో ఈ దందాలో ముఠా నాయకుడితో పాటు, మరికొందరిని అదుపులోకి తీసుకుని మొత్తం వ్యవహారాన్ని గుట్టురట్టు చేయనున్నారు.

ముఠా నాయకుడు చిత్తూరు వాసి..

వాహనదారులూ.. ఈ సేవలు తెలుసా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎటువైపు ప్రయాణం చేయాలన్నా జాతీయ రహదారుల్లో వెళ్లాల్సిందే. టోల్‌గేట్ల వద్ద రుసుము చెల్లిస్తూ.. దాటాల్సిందే. మరి ఇలా వసూలు చేసే డబ్బులతో వాహనదారులకూ పలు సౌకర్యాలు కల్పిస్తారని తెలుసా.. అవేంటో తెలుసుకుందామా..! **- న్యూస్‌టుడే, పుత్తూరు**

- జిల్లాలో జాతీయ రహదారి పొడవు: **350** కి.మీ.
- వాహనం ఆగితే.. **1033**

జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగినా.. వాహనం బోల్తాపడినా.. మరమ్మతుకు గురై ఆగిపోయినా 1033 నంబరు సంప్రదించాలి. ఫోన్ చేసిన వెంటనే దిల్లీలోని కేంద్ర కార్యాలయానికి సమాచారం చేరుతుంది. సమీపంలోని టోల్‌గేట్ నిర్వాహకులు స్పందించి తక్షణమే సిబ్బంది వచ్చి సాయం చేస్తారు. వాహనంలో పెట్రోల్, డీజిల్ అయిపోయినా ఈ నంబరు ద్వారా సాయం పొందవచ్చు.

తిరుపతి-చెన్నై జాతీయ రహదారి ఎస్పీ పురం వద్ద ఉన్న టోల్‌ప్లాజా

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులు

- పూతలపట్టు- నాయుడుపేట
- తిరుపతి- చెన్నై
- చిత్తూరు- బెంగళూరు
- చెన్నై- గూడూరు

పోలీసుల సాయం.. 112

జాతీయ రహదారుల్లో అనుకోని సంఘటనలు జరిగిన సమయంలో 112ను సంప్రదిస్తే పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటారు. దీనికితోడు టోల్‌ప్లాజాల వద్ద 24 గంటలు అంబులెన్స్, క్రేన్, హైవే పెట్రోలింగ్ వాహనం అందుబాటులో ఉంటాయి. వాహనాల పార్కింగ్ స్థలాలు, డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు గదులు ఉంటాయి. ఈ సేవలన్నీ ఉచితమే.

ఫొటో పెట్టు.. రివార్డు పట్టు

జాతీయ రహదారుల సంస్థ ఇటీవల ఓ ప్రకటన చేసింది. టోల్‌ప్లాజాల వద్ద పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. అదే సమయంలో అవి అపరిశుభ్రంగా ఉంటే ఫొటో తీసి రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రివార్డు కూడా ఇస్తారు.

సేవలకు ఎస్‌వోఎస్..

జాతీయ రహదారిపై ప్రతి 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో రోడ్డు పక్కన పసుపు రంగు స్తంభాల వద్ద ఎస్‌వోఎస్ పెట్టెలు ఉంటాయి. ఎలాంటి అవసరమైనా దానిపై ఉండే మీటను నొక్కితే సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని సేవ లందిస్తారు.

రాజీవ్‌నగర్ ప్రాంతం విహంగ వీక్షణం

- ప్రాంతం: రాజీవ్‌నగర్
- పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు: **6500**
- ఇళ్ల నిర్మాణాలు జరిగినవి: **4700**
- ఖాళీగా ఉన్న ప్లాట్లు: **1800**
- విభజించిన బ్లాక్‌లు: **12**
- సర్వే బృందాలు: **7**

సర్వే ఆలస్యం.. అనుమానాలే సమస్తం

- రాజీవ్‌నగర్‌లో కొలిక్కి రాని ఖాళీ స్థలాల లెక్కలు

గత ప్రభుత్వ హయాంలో కాళహస్తి పరిధి రాజీవ్ నగర్‌లో పేదలకు పంపిణీ చేసిన పట్టాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లాయి. 2007లో ఇక్కడ దాదాపు 6500 ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో చాలావరకు వైకాపా నేతలు దక్కించుకున్నారు. ఎవరికి వారు అడ్డగోలుగా పట్టాలు అమ్ముకోవడం, సొమ్ము చేసుకోవడం సర్వసాధారణంగా మారింది. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన సమగ్రమైన సర్వేకు ఆదేశించడంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అందుకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికి రెండు దఫాలు సర్వే జరిగింది. 12 బ్లాక్‌ల్లో ఏడు సర్వే బృందాలతో ఇంటింటా సర్వే చేయించారు. అయినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో జరగకపోవడం గమనార్హం. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

ఒక పట్టా.. ఐదారుగురి పేర్లు

ప్రస్తుతం ఖాళీగా ఉన్న దాదాపు 1800 ఇళ్ల స్థలాలకు సంబంధించి సర్వే పూర్తి కావాల్సి ఉంది. ఇక్కడ లబ్ధిదారులు ఒకరైతే.. పట్టాలు దాదాపు ఐదారుగురు పేర్లపై ఉన్నాయి. పట్టాలు లేకుండా చేతులు మారిన స్థలాలూ ఉండటం గమనార్హం. ఖాళీ స్థలాల సర్వే అధికారులకు శిరోభారంగా మారింది. వైకాపా హయాంలో అక్రమాలకు పాల్పడిన కొందరు తాజాగా కూటమి నేతలతో జతకట్టారు. వారి సహకారంతో అవినీతి, అక్రమాలు వెలుగులోకి రాకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కారణంగానే సర్వే ఆలస్యం అవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. వరుసగా వర్షాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ఇతర కారణాలతో కొంత ఆలస్యమైందని అధికారులు చెబుతున్నా.. వివాదాస్పదంగా ఉన్న ఖాళీల పట్టాలు ఇంకనూ లెక్క తేలకపోవడం విమర్శలకు తావిస్తోంది.

తిన్న ఆహారం శరీరానికి పూర్తిగా ఉపయోగపడాలంటే మన జీర్ణ వ్యవస్థ(గట్ హెల్త్) సరిగా పని చేయాలి. 70 శాతం ఆరోగ్యం దీనిపైనే ఆధారపడి ఉంటుంది. లేకుంటే ఎంత మంచి ఆహారం తిన్నా ప్రయోజనం ఉండదు. ప్రజల జీర్ణవ్యవస్థ మెరుగుపరచాలని మహిళా వర్సిటీ ఆచార్యుల కృషి చేస్తున్నారు. వర్సిటీ పీఎం ఉష పథకం నుంచి తీసుకున్న రూ.9 లక్షల నిధులతో వర్సిటీ ఆచార్యులు ఎన్.రజిని, ఎస్.శాంతిశ్రీ, కిమీర, పి.ఉమామహేశ్వరి, సుమలత, సౌగంధి ఓ ప్రాజెక్టు చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తిరుపతి (మహిళా వర్సిటీ)**

బాగుందా జీర్ణవ్యవస్థ.. పడొద్దు అవస్థ

- కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు మహిళా వర్సిటీ ఆచార్యుల కృషి

4 గ్రామాల్లో సర్వే..

అవగాహన కల్పిస్తున్న శాంతిశ్రీ

తిరుపతి చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ కూలీలను ప్రాజెక్టు నిర్వహణకు ఎంచుకున్నారు. 500 మందిని సర్వే చేశారు. నడుమునొప్పి, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, జలుబు, దగ్గుతో బాధపడుతున్న 200 మందిని ఎంపిక చేసుకున్నారు. వీరి జీర్ణవ్యవస్థ మెరుగు, రక్తహీనత నిర్మూలనకు మజ్జిగ, నిమ్మకాయ, బార్లీ, అవిసె గింజలతో తయారు చేసిన గంజి ఇస్తున్నారు.

న్యూట్రిషన్ అనాలసిస్ చేసి..

బార్లీ, అవిసె గింజలతో చేసిన పౌడర్‌ను, మజ్జిగను చెన్నైలోని రీసెర్చ్ ల్యాబ్‌కు పంపించి న్యూట్రిషన్ అనాలసిస్ చేయించారు. వారి నుంచి మంచి రిపోర్ట్ వచ్చిన తర్వాతే ఈ రసాయనాలను ఇస్తున్నారు. 200 మందిని 50 మందిగా విడదీసి 4 గ్రూపులు చేశారు. వీరిలో కొంత మందికి మజ్జిగ, కొంతమందికి బార్లీ, అవిసె గింజలతో చేసిన గంజి, మరో 50 మందికి రెండింటినీ ఇస్తున్నారు. ఆరు నెలలుగా వీరికి రోజూ అందిస్తున్నారు.

ఇవీ సత్ఫలితాలు..

3 నెలలుగా సాయంత్రం వీరు గంజి, మజ్జిగ తాగుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రయోగశాలల నుంచి గత నెలలో సీఆర్‌పీ, హెచ్‌బీ, సీబీసీ టెస్టులు చేశారు. దాదాపు 60శాతం మందిలో రక్తహీనత, నొప్పుల సమస్య తగ్గినట్లు గుర్తించారు. త్వరలో వీరి ప్రాజెక్టుపై పేటెంట్‌కు దరఖాస్తు చేయనున్నారు.

ఎందుకీ దాపరికం.. ఎవరిదీ అలక్ష్యం

- సంస్కృత వర్సిటీ ఘటనపై తీవ్ర విమర్శలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఘటనపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బీఈడీ విద్యార్థినిని అక్కడి అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కుమార్ మానసికంగా, శారీరకంగా వేధించిన ఘటనపై అందరివేళ్లు అక్కడి పాలకుల నిర్లక్ష్యంవైపే చూపుతున్నాయి.

సెమిస్టర్ జవాబుపత్రంలో ఫిర్యాదు

ఘటనపై బాధిత విద్యార్థిని నవంబర్ 24న లిఖితపూర్వకంగా వర్సిటీ వీసీకి ఫిర్యాదు చేసింది. అదే సమయంలో సెమిస్టర్-1 పరీక్షలు జరుగుతుండటంతో.. తనను నిత్యం ప్రొఫెసర్ లక్ష్మణ్ కుమార్ వేధిస్తున్నారంటూ జవాబుపత్రాల్లో పేర్కొనడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఘటన జరిగి రెండువారాలు గడిచినా వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లు ఈ అంశంలో ఎందుకు మౌనం దాల్చారో అంతుపట్టడం లేదు. గుట్టుచప్పుడు కాకుండా బాధిత విద్యార్థినిని నవంబరు 26న ఇంటికి పంపించారు. అసలు ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం బయటకు వెల్లడించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.

విచారణాధికారిగా డీఎస్పీ భక్తవత్సలం

లక్ష్మణ్‌కుమార్ చేతిలో మోసపోయిన విద్యార్థిని గర్భం దాల్చలేదని, కేవలం శారీరకంగా మాత్రమే హింసించారని వర్సిటీ పాలకులు మీడియాకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు ప్రొఫెసర్ల చరవాణులు స్వాధీనం చేసుకుని నిజానిజాలు వెలికితీసే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో విచారణ అధికారిగా తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం నియమితులయ్యారు. మరో ఇద్దరు మహిళా ఎస్సైలను సహాయకులుగా నియమించారు. కేసును పూర్తిస్థాయిలో విచారించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విమాన టికెట్ ధరలకు రెక్కలు

- కేంద్రం ఆదేశాలు బేఖాతరు

రేణిగుంట, న్యూస్‌టుడే: ఇండిగో విమాన సంస్థ సంక్షోభంతో ప్రయాణికులపై భారం పడుతోంది. పలు సర్వీసుల రద్దుతో గమ్యస్థానాలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా ఇతర విమాన సంస్థలు టికెట్ ధరలు భారీగా పెంచేశాయి. ధరల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.



న్యూదిల్లీ నుంచి తిరుపతికి రూ.45 వేలు చూపుతున్న టిక్కెట్

దిల్లీ నుంచి రేణిగుంటకు రూ.45 వేలు

- దూరాన్ని బట్టి దేశంలో రూ.7500 నుంచి రూ.18 వేల మధ్య విమాన టిక్కెట్ల ధరలు ఉండాలని శనివారం కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ పేర్కొంది.
- ఇది బిజినెస్ తరగతి, ఉడాన్ విమానాలకు వర్తించదు.
- దిల్లీ నుంచి రేణిగుంటకు సుమారు రూ.8వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటుంది. దీనిని ఒక సంస్థ సోమవారం రూ.45 వేలు ధర నిర్ణయించింది.
- హైదరాబాదుకు టిక్కెట్లు లేవని ట్రావెల్స్ వెబ్‌సైట్లో చూపిస్తుంది.
- మంగళవారం నాటికి దిల్లీ నుంచి రేణిగుంటకు ఎకానమీ అందుబాటులో లేదని బిజినెస్ క్లాస్ మాత్రం రూ.91 వేల వరకు నిర్ణయించింది.

మందుగుండు గిడ్డంగి.. పకడ్బందీ

వెంకటగిరి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో అతి పెద్దదైన వెంకటగిరి సంస్థానంలో నాడు నిర్మించిన మందుగుండు గిడ్డంగి నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. పట్టణ నడిబొడ్డున వెంకటగిరి రాచరికపాలనకు నిదర్శనంగా భవన నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ అతి పెద్దదైన సైనిక సంపత్తి ఉండేది. మందుగుండు సామగ్రి నిల్వ ఉంచేందుకు సంస్థానానికి ఉత్తరం వైపు గోడ్డేరు వాగు సమీపంలో గిడ్డంగిని నిర్మించారు.

గంగమ్మా.. ఉప్పొంగేనమ్మా..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలాచోట్ల భూగర్భ జలాలు పెరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని రామానుజపల్లిలో ఓ వ్యవసాయ బోరు నుంచి ఇలా నీరు ఉబికి వస్తోంది. చెరువు కింది భాగంలో ఉండటంతో నీటి ఊట ఎక్కువగా ఉంటుందని.. డిసెంబర్ నుంచి మార్చి వరకు జలాలు పైకి వస్తాయని స్థానిక రైతులు తెలిపారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు)

కొండకు.. ఎకో ముద్ర

సీఎం చొరవతో రానున్న మరో 300 ఎలక్ట్రిక్ బస్సులు

తిరుమల క్షేత్రాన్ని సంపూర్ణ కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు భారీ కార్యాచరణ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ విధానంలో భాగంగా 2029 నాటికి ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్ మయం చేయాలన్న లక్ష్యంతో ఆర్టీసీ అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నూతన సంవత్సరంలో తిరుపతి, తిరుమలకు అదనపు బస్సులు రానున్నాయి.

- ఈనాడు డిజిటల్, తిరుపతి

ప్రస్తుతం ఆర్టీసీ వినియోగిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు

ప్రస్తుత సేవలు ఇలా..

- మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు: **100**
- కొత్తగా వచ్చే ఈవీ బస్సులు: **350**
- ఒకరోజులో డీజిల్ బస్సులు సహా తిరిగే ట్రిప్పులు: **2,600**
- ప్రయాణికులు: **1,20,000**

ముందుగా 50.. ఆపై 300

తిరుమల ఘాట్ రోడ్లలో ప్రస్తుతం 64 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. కడప, నెల్లూరు, మదనపల్లె మార్గాల్లో మరో 36 సర్వీసులు తిరుగుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తగా మరో 50 బస్సులకు ఆర్టీసీ టెండర్లు ఖరారు చేసింది. 'ఈకా' సంస్థ ఈ బస్సులను సరఫరా చేయనుండగా.. రానున్న 3-6 నెలల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఇవి కాకుండా.. తిరుమలకు ప్రత్యేకంగా మరో 300 బస్సులు కేటాయించాలని సీఎం కేంద్రాన్ని కోరడంతో అందుకు ఆమోదం లభించింది. వాటికి సంబంధించిన రూట్‌మ్యాప్, ప్రతిపాదనల ప్రక్రియ 95 శాతం పూర్తయిందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

కేంద్రమే నోడల్ ఏజెన్సీ

ఎలక్ట్రిక్ బస్సుల ధరలు, నిర్వహణ వ్యయం అధికంగా ఉండటంతో.. కేంద్ర ప్రభుత్వమే నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. పీఎం ఈ - సేవ కింద దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వివరాలు సేకరించి, కేంద్రమే టెండర్లు పిలుస్తుండటంతో తక్కువ ధరకే బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన 11 నగరాల్లో తిరుపతికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం విశేషం.

కొండపైనే ప్రత్యేక డిపో

ప్రస్తుతం అలిపిరి డిపో, తిరుపతి బస్టాండ్ పరిధిలో 36 ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో బస్సుల సంఖ్య భారీగా పెరగనుండటంతో కొండపైనే ప్రత్యేకంగా డిపో ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇందుకోసం 5 ఎకరాలు కేటాయించాలని తితిదేని కోరగా.. ప్రాథమికంగా అంగీకారం లభించింది. కొత్తగా నిర్మిస్తున్న శ్రీనివాసం, అచ్యుతం కాంప్లెక్సుల వద్ద కూడా ఛార్జింగ్ సదుపాయాలు కల్పించనున్నారు.

అప్పటిలోగా డీజిల్ బస్సులు బంద్

ప్రస్తుతం ఘాట్ రోడ్లలో 323 డీజిల్ బస్సులు నడుస్తున్నాయి. కొండ పైకి కిందికి కలిపి 2,600 ట్రిప్పులు తిరుగుతూ.. సుమారు 1.20 లక్షల మంది భక్తులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. రాష్ట్ర ఈవీ పాలసీ ప్రకారం 2029 నాటికి డీజిల్ బస్సులన్నింటినీ తొలగించి, నూటికి నూరు శాతం ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

104FM Tirupati

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

8008555167, 9154991499

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

లీగల్ ప్రకటనలు

ఈనాడు క్లాసిఫైడ్స్

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

పదవీ విరమణ శుభాకాంక్షలు

అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి

జన్మదిన శుభాకాంక్షలు

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

జీఎస్‌టీ 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధుడి వినాయక ఆలయంలో

నిజరూప దర్శనం: ఉ.: 7-7.30, 8.30-9.00, 10.30-11.00, సా. 4.30- 5.00

సర్వదర్శనం: ఉ: 6- 7, 8-8.30, 9.30 -10.30, మధ్యాహ్నం: 12.00 సాయంత్రం: 4.30, రాత్రి: 7-9 గంటలు.

నిత్య సేవలు

సుప్రభాత సేవ, గోపూజ: వేకువజామున 4.00 బిందుతీర్థ అభిషేకం: 4.30 పంచామృతాభిషేకాలు: ఉ.5.30 ప్రథమ, 9.00 ద్వితీయ, 11.00 తృతీయ కాలాభిషేకాలు క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45 ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు. నిత్య కల్యాణం: 11.00 గంటలకు (ప్రత్యేక మండపంలో)

– న్యూస్‌టుడే, కాణిపాకం

తిరుమల శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు: తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురు వారం ఉ.3.45కు తోమాలసేవ, 4.45కు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2 డోలోత్సవం, 3 ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5 సహస్ర దీపాలంకార సేవ నిర్వహిస్తారు.

సర్వదర్శనం: తెల్లవాజామున 3.30-5.45, ఉ.8-9.30 గంటలకు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

వారోత్సవాలు: ప్రతి సోమ వారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. బుధవారం సహస్ర కలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

–న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 4.00: మంగళవాయిద్యాలు 4.30:సుప్రభాతసేవ, 4.45:గోమాత పూజ 5.00: సర్వదర్శనం 5.00: ప్రథమ, 6.00: ద్వితీయ, 9.00 తృతీయ కాల అభిషేకాలు 10.30:నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు 11.00: నిత్య కల్యాణం

సాయంత్రం: 3.30: ప్రదోష కాలాభిషేకం

రాత్రి: 7.00: నీరాజన మంత్రపుష్పం 9.00: ఏకాంతసేవ

సర్వదర్శనం: ఉ.5 నుంచి రా.9 వరకు

రాహు, కేతు పూజలు: ఉ.6 నుంచి సా.5 గంటల వరకు

అభిషేకాలు: శ్రీమృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళవారం), శ్రీమేధా దక్షిణామూర్తికి (గురువారం), శనిభగవానునికి (శనివారం), సూర్యనారాయణమూర్తికి (ఆదివారం). శుక్రవారం: మనోన్మణికి ఊంజల్‌సేవ

● ఏడుగంగల జాతరకు సంబంధించి మంగళవారం ముక్కంటి ఆలయం తరపున ఏడుగంగలకు సారె సమర్పణ జరగనుంది.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే): శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 82,007 మంది దర్శించుకున్నారు. రూ.3.13 కోట్ల హుండీ కానుకలు లభించాయి. తిరుమలలో చలితీవ్రత కొనసాగుతోంది.

16వేల టోకెన్లు జారీ : శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు సర్వదర్శన టోకెన్లు ఆదివారం 16 వేలు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువజామున మూడు నుంచి రాత్రి 10 వరకు దర్శనం జరగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు మరో రెండు వేల టోకెన్లు జారీ చేశారు.

బహిరంగ వేలం

డిసెంబర్ నెల తేది : 10-12-2025, 17-12-2025, 24-12-2025 & 31-12-2025

Vehicle No.	Description	Year
AP03TB3323	MAHINDRA BOLERO MAXI TRUCK	2012
AP03TC9507	AL 1616 IL FBT	2015
AP03TE9697	TATA LPT 3718 CUMMINS FBT	2017
AP16TH0854	BHARAT BENZ 3123 FBT	2015
AP03BE8989	VERNA CRDI SX(O) 1.6 DIESEL 5 SEATER	2012
AP39TN9214	TATA ACE GOLD BS6 PETROL	2020
AP11Y1728	TOYOTA INNOVA-P	2010
AP03BG4161	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP39TM3764	TATA ACE GOLD BS6 DIESEL	2020
AP03TK3036	TATA ACE	2018
AP39TS-3033	EICHER PRO 2114 XP FBT	2020
AP31CA-0999	VERNA (FLUDIC) CRDI EX 1.6 DIESEL 5 SEATER	2012
AP03BK-0477	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP02TB9329	EICHER 11.10 FBT	2014
AP39TV2405	MAHINDRA BOLERO PICK UP 1.7T BS6	2021
AP04TU0221	MAHINDRA 275 DI	2021
AP27CC9713	ETIOS GD DIESEL 5 SEATER	2011
AP26AX5464	TAFE 241	2013
AP39NS8433	ETIOS G PETROL 5 SEATER	2011
AP21CJ4514	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2013
AP02TC0207	TAFE 241	2010
AP39HA1383	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2015
AP05TF0567	TATA LPT 3118 CUMMINS FBT	2016
AP39UA5541	TATA ACE GOLD BS6 DIESEL	2021
AP39UK4025	APE AUTO HT DX BS6 CNG-P	2022
AP39TK7961	JOHN DEERE 5105	2019
AP39TD8022	ETIOS D 4D GD DIESEL 5 SEATER	2012
AP03BL7778	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP31TP1832	AL U TRUCK 2518 FBT-T	2018
AP39NQ7626	DZIRE TOUR DIESELS SEATER	2014
AP39TS4593	MAHINDRA 475 DI	2011
AP31AW6777	INNOVA EURO 3 2.5 G DIESEL 7 SEATER	2008
AP03TD5452	AL DOST	2016
AP03BK9628	JCB 3DX	2013

గమనిక : పైన తెలిపిన వాహనముల ... [illegible] ... శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, NH No.205, ... తిరుపతి-517320

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

డి.నెం.19-03-13/8, ... తిరుపతి - 517501, ఆం.ప్ర. ఫోన్ : 0877-2221287, 90000 80798

సాదాబైనామాకు మరో అవకాశం

సన్న, చిన్నకారు రైతులకు ఊరట

గూడూరు, నాయుడుపేట, న్యూస్‌టుడే: ఒప్పంద పత్రాల ద్వారా కొనుగోలు చేసిన భూములను సాదాబైనామా ద్వారా క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గ్రామాల్లో ఈ తరహాలో తక్కువ విస్తీర్ణంలో భూములు కొనుగోలు చేసిన సన్న, చిన్నకారు రైతులకు ఊరట కలిగింది.

జిల్లాలో రైతుల సంఖ్య	రెవెన్యూ గ్రామాలు	సాదాబైనామా భూములున్న వారి సంఖ్య
69,628	1051	7433

క్రమబద్ధీకరణకు వెసులుబాటు భూమి రకం (ఎకరాల వరకు)

రైతులు	మాగాణి	మెట్ట
సన్న	1.25	2.5
చిన్న	2.5	5.0

తాళ్వాయిపాడులో సాదాబైనామాల అర్జీలు పరిశీలిస్తున్న అధికారులు (పాతచిత్రం)

ప్రోత్సాహకాలకు దూరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకంగా ఇస్తోన్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీల ద్వారా ఇచ్చే యంత్ర పరికరాలు, ఎరువులు, ఇతర రాయితీలు.. ఒప్పంద పత్రాలపై భూములున్న సన్న, చిన్నకారు రైతులు పొందలేకపోతున్నారు. చివరికి బ్యాంకులు పంట రుణాలు కూడా ఇవ్వడం లేదు.

2024 జూన్ 15 లోపు వాటికే

2024 జూన్ 15 లోపు తెల్ల కాగితాలు, స్టాంపులపై ఒప్పంద పత్రాలు రాసుకున్న భూములను సాదాబైనామా ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ఉంది. 2027 డిసెంబరు వరకు రైతులు తమ దగ్గర ఉన్న పత్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు 90 రోజుల్లో పరిశీలించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపి క్రమబద్ధీకరణ చేస్తారు. అనుభవదారునిగా ఉన్న అడంగల్, ఇతర పత్రాలు ఉంటే పరిగణలోకి తీసుకుంటారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూసమస్యలు కొన్ని సాదాబైనామా ద్వారా పరిష్కారం చేసుకునే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

వాన వెలిసింది.. వరి మొలిచింది

జిల్లాలో వరి నాట్లు ఊపందుకున్నాయి. దిత్వా తుపాను పోవడంతో వర్షపునీరు లేని పొలాల్లో ఆదివారం రైతులు యంత్రాలతో పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట వ్యవసాయ డివిజన్‌లోని కొన్ని పొలాలు ఇంకా వరదలోనే ఉన్నాయి. **-ఈనాడు, తిరుపతి**

ఆలయ పేష్కార్ రామకృష్ణకు విరాళం డీడీ అందిస్తున్న ఎన్ఆర్ఐ దాత శివప్రసాద్. చిత్రంలో తితిదే బోర్డు సభ్యుడు ఎన్.సదాశివరావు, మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తదితరులు

తితిదేకు రూ.10 లక్షల విరాళం

తిరుమల: తితిదే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు శివప్రసాద్ రూ.10,01,116 విరాళం అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో పేష్కార్ రామకృష్ణకు విరాళం డీడీ సమర్పించారు. తితిదే బోర్డు సభ్యుడు ఎన్.సదాశివరావు, మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని కేంద్రమంత్రి శ్రీపాద్ నాయక్ ఆదివారం దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవాణి దర్శన సమయంలో కేంద్ర మంత్రి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ● వీఐపీ బ్రేక్‌లో కేరళ జ్యుడీషియల్ మెంబర్ జస్టిస్ కె.హరిపాల్, ఏపీ మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, తెలంగాణ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్వామిని దర్శించుకున్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఎన్ఎంఎంఎస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు డివిజన్ల పరిధిలోని 14 కేంద్రాల్లో మొత్తం 2,958 మంది విద్యార్థులకుగాను 2,860 మంది హాజరైనట్లు వెల్లడించారు.

చిట్టి చేతులు.. గట్టి చేతలు

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తిరుపతి బాలోత్సవం సహకారంతో నిర్వహించిన సైన్స్ ఫెస్టివల్లో చిన్నారులు తమ ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. విజేతలకు సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జె.విక్రమ్‌కుమార్‌రెడ్డి, బాలోత్సవం వ్యవస్థాపకుడు నాగార్జున, గౌరవ అధ్యక్షుడు నారాయణ బహుమతులు అందజేశారు.

వ్యర్థాల నుంచి విద్యుత్తు



రేణిగుంటలోని శ్రీవేంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ విద్యార్థులు లక్షిత, ప్రియ వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి సంబంధించిన వర్కింగ్ మోడల్‌ను ప్రదర్శించారు. పనికిరాని వస్తువుల నుంచి పనికొచ్చే విద్యుత్తును తయారు చేసి, మానవాళికి మేలు చేసేలా తమ ప్రాజెక్టు ఉపకరిస్తుందని తెలిపారు.

వర్ష పునీటి సంరక్షణ.. నిర్వహణ

తిరుపతిలోని శ్రీపద్మావతి బాలికల హైస్కూల్ విద్యార్థినులు హర్షిత, వరలక్ష్మి వర్షపు నీటి సంరక్షణ, నిర్వహణకు సంబంధించిన నమూనాను ప్రదర్శించారు. వర్షాకాలంలో ప్రత్యేకంగా నిర్మించే ట్యాంకుల ద్వారా నీటిని సమీకరించి, తద్వారా పంట పొలాలకు, ఇళ్ల అవసరాలకు ఎలా ఉపయోగించుకోవాలో తమ ప్రదర్శన ద్వారా తెలియజేశారు.

జీవన విధానంలో రోబోలు

తిరుపతికి చెందిన గీతం చిల్డ్రన్స్ స్కూల్ విద్యార్థులు ఏషిత, జ్ఞానశేఖర్ రోబోట్ లైఫ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు సంబంధించిన నమూనాను ప్రదర్శించారు. సాంకేతికంగా మారుతున్న ప్రపంచంలో మనిషి జీవన విధానాన్ని రోబోలు ఎలా ప్రభావితం చేస్తాయి. రోబోల సాయంతో లైఫ్ మేనేజ్‌మెంట్ ఎలా చేయవచ్చో వివరించారు.

చరవాణి సాంకేతికతతో

టెక్నాలజీ ఆఫ్ సైన్స్ నేపథ్యంలో తిరుపతిలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ నంబర్‌వన్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇషార్ ఆలమ్, కార్తికేయ లైఫై వర్కింగ్ మోడల్‌ను ప్రదర్శించారు. మొబైల్ సాంకేతికతతో మనిషి రోజువారీ పనులు ఎలా నిర్వహించవచ్చు? ఏ సమయానికి ఏ పనులు చేయాలి? ఇతర సేవలు ఎలా పొందవచ్చో వివరించారు.



విద్యార్థినుల నాటిక ప్రదర్శన

ఆలోచించేలా... ఆనందించేలా

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో జరుగుతున్న వార్షిక క్రీడా, సాంస్కృతిక పోటీలు అలరిస్తున్నాయి. పలు నాటక పోటీలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. అన్నిరకాల పోటీలు ఆదివారం ముగింపుదశకు చేరుకోగా సోమవారం బహుమతులు అందజేయనున్నారు. రాష్ట్రంలోని 19 వ్యవసాయ, ఇంజినీరింగ్, కమ్యూనిటీ సైన్స్ కళాశాలల నుంచి 650 మంది వరకు విద్యార్థులు ఇక్కడ పోటీ పడుతున్నారు. డా.ఎం.రెడ్డిశేఖర్, డా.హరిప్రసాద్, డా.రవికాంత్‌రెడ్డి ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

శవం ముందు ఆర్కెస్ట్రాతో..

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE:10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 93812 87629.

DISTANCE EDUCATION

10th/Inter, BA,B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D, BNYS, BPT, D.Pharmacy, B.Pharmacy, LLB, BA LLB, 9032030124

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

[illegible] ✆ 82470 75857, 94943 92069.

TO LET

AJANADRI RESIDENCY Flat No. 304, IIIrd Floor Lift & Car Parking. Thondawada, Chandragiri. Ph: 73824 86926, Rent: 8000/-.

[illegible] 3BHK ... 2 BHK Individual Houses ... ✆ 80086 25907.

JOBS

We are Hiring Field Debt Recovery Agentsfor Banking Process. Location: Kadapa, Mydukur, Proddatur, Rajampet, Tirupati, Srikalahasti, Palamaner. Salary 15K - 22K + Incentives. 99639 59854.

REQUIRE FEMALE Admission Counsellors for Nakshatra Overseas. Sal: 16K + Incentives Work Place: Tirupati. ✆ 63042 89989.

WANTED: SALES Executives for a reputed Agency, Part & Full Time in Tirupati. Two Wheeler must. Good Salaries & Incentives. 9849130906.

Wanted Ex-Servicemen for managing Depot operations at Tirupati. Call- 8074967705.

[illegible] Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

[illegible] ✆ 89776 39662, 89776 39663.

[illegible] Con: 99495 32652.

E-Kart [illegible] Qly: Inter Any ... ₹15,000. Online are Available. 9704146558.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

80085 13290

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కుమార్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ఎన్నికల అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక ఎన్జీవో భవన్‌లో ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కుమార్(పర్యవేక్షకులు, సమగ్ర శిక్షా, చిత్తూరు), ప్రధాన కార్యదర్శిగా చైతన్య(డీఈవో ఆఫీస్, చిత్తూరు), కోశాధికారిగా గోపాల్, సహాధ్యక్షుడిగా రామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రమేష్, నాగరాజ, రెడ్డిశేఖర్, రహ్మత్‌బాషా, కుమార్ ఎన్నికయ్యారు.

10న పౌర చైతన్య వేదిక రాష్ట్ర సదస్సు

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: డిసెంబర్ 10వ తేదీ తిరుపతిలో పౌర చైతన్య వేదిక రాష్ట్ర ప్రథమ సదస్సు నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు వాకా ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

కొందరి ఇళ్లే కూల్చివేత

రెవెన్యూ అధికారుల వింత ప్రవర్తన

రేణిగుంట, న్యూస్‌టుడే: కొందరు ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని రెవెన్యూ అధికారులు కూల్చివేయడం విమర్శలకు దారితీస్తోంది. రేణిగుంట మండలంలో వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు కొందరు అప్పటి రెవెన్యూ అధికారులతో కలిసి ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లు వేసి విక్రయించారు. పంచాయతీ, విద్యుత్తు శాఖల నుంచి అనుమతులు పొంది పేదలు ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెరువులు, గుంతలు, వాగు పోరంబోకు స్థలాలను రక్షించే క్రమంలో నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల కొత్తపాళెం వద్ద సుమారు 60 ఇళ్లను నేలమట్టం చేసిన రెవెన్యూ అధికారులు ఆరు గృహాలను మాత్రం వదిలేశారు.

ఇంటిని కూల్చివేయడంతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

● తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా ఆ మహిళకు నోటీసులు ఇచ్చామని, పంచాయతీ నుంచి తప్పుడు పత్రాలు ఇవ్వడంతో కూల్చివేసినట్లు తెలిపారు. మిగతా ఇళ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కూటమిలో వైకాపా నాయకులు

గురవరాజుపల్లె గ్రామ సమీపంలో కొత్తపాళెం లెక్కదాఖల్లో సర్వే నంబర్ 45-2లోని 2.37 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఐదారు ఏళ్లుగా కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పట్లో వైకాపాలోని వారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నాయకులుగా చలామణి అవుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఉన్న కొన్ని ఇళ్లను వదిలేసి ఒకే ఒక మహిళ కుటుంబం ఉంటున్న ఇంటిని మాత్రమే ఆదివారం తెల్లవారుజామున జేసీబీతో కూల్చివేశారు. దీంతో బాధిత మహిళ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నాయకుల సంతోషం కోసమని రెవెన్యూ అధికారులు ఇటువంటి చర్యకు పాల్పడ్డారని, ఇక్కడ మిగతా ఇళ్లు ఇదే సర్వే నంబర్‌లో ఉన్నా కూల్చివేయలేదన్నారు.

తల్లికి భారం కావొద్దని

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తల్లికి భారం కాకూడదని భావించిన ఓ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూర్పు ఎస్సై హేమాద్రి వివరాల మేరకు.. స్థానిక తెలుగునగర్‌లో మాధవీలత నివాసం ఉంటున్నారు. భర్తతో విభేదాల కారణంగా ఇద్దరు పిల్లలతో వేరుగా కాపురం పెట్టారు. రెండేళ్ల కిందట పెద్ద కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆమె ఓ ప్రైవేటు మొబైల్ స్టోర్‌లో పనిచేస్తూ రెండో కుమారుడు మోనీష్ (17)ని స్థానిక ఎమరాల్డ్స్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివిస్తోంది. తన చదువుల ఖర్చు నీకు భారం అవుతోందని.. అన్నలాగా చనిపోతే భారం తగ్గుతుందని తరచూ తల్లితో చెప్పేవాడు. ఈ నేపథ్యంలో శనివారం తల్లిని ద్విచక్ర వాహనంలో మొబైల్ షోరూమ్ వద్ద వదిలి ఇంటికి వచ్చాడు. లోపల తాళం వేసుకుని బ్లేడ్‌తో చేతిపై గాయపరుచుకున్నాడు. అనంతరం పంకాకు చీరతో ఉరివేసుకున్నాడు. రాత్రి పది గంటలకు ఇంటికి వెళ్లిన మాధవీలత పిలిచినా స్పందించకపోవడంతో.. తన వద్ద ఉన్న మరో తాళంచెవితో తలుపులు తెరిచి లోపలికి వెళ్లింది. ఉరికి వేలాడుతున్న కుమారుడిని స్థానికుల సహకారంతో కిందకు దించి రుయా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై మత్తుపొడి చల్లి దోపిడీ

బాధితురాలు మల్లిక

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు షేర్ ఆటో ఎక్కిన మహిళ దారుణ ఘటనకు గురైంది. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు, స్థానికుల వివరాల మేరకు.. 'పెరుమాళ్లపల్లికి చెందిన మల్లిక (60) ఎస్వీ వ్యవసాయ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తోంది. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు తిరుపతి - చంద్రగిరి ప్రధాన రోడ్డుపైకి వచ్చింది. అటుగా వచ్చిన ఆటో ఎక్కి పెరుమాళ్లపల్లికి వెళ్లాలని చెప్పింది. అప్పటికే అందులో ఇద్దరు మహిళలు ఉన్నారు. చెర్లోపల్లి కూడలి వద్ద వెళ్తుండగా మల్లికకు ఆటోలోని మహిళ మల్లిక ముఖంపై మత్తుపొడి చల్లింది. బాధితురాలు కళ్లు మంటగా ఉందని అరవడంతో.. ముందుగా తెచ్చుకున్న రాడ్‌తో ఆమె తలపై కొట్టారు. ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కున్నారు. ఆటో నుంచి కిందకు తోసేసి వెళ్లిపోయారు. స్థానిక మహిళలు గుర్తించి 108లో రుయాకు తరలించారు. ఆటో డ్రైవర్, మరో ఇద్దరు మహిళలు పక్కా ప్రణాళికతో దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అలా అతికించడం.. ఇలా తొలగించడం

అవినీతిపై పోరాటంలో దాగుడుమూతలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు పౌరసేవలు ఉచితంగా అందించాలి.. కానీ ఆయా శాఖల్లోని కొందరు అధికారులు, కింది స్థాయి సిబ్బంది ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. చేయి తడపందే ఏ ఒక్క పని కావడం లేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏమాత్రం తగ్గడం లేదు. దీన్ని చక్కదిద్దేందుకు అవినీతి నిరోధకశాఖ టోల్‌ఫ్రీ నంబరు 1064ను అందుబాటులోకి తెచ్చింది. రెండు నెలల కిందట రాష్ట్రమంతటా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 'అవినీతిని అంతమొందిద్దాం.. ఆదర్శ ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం' అన్న నినాదంతో గోడప్రతులు అతికించారు. ఆ వెంటనే వాటిని తొలగించారు. ఈ విషయమై ఏసీబీ తిరుపతి జిల్లా సీఐ విద్యాసాగర్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

గోడప్రతి

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం

గాయాలతో బయటపడిన అయ్యప్ప భక్తులు

చంద్రగిరి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. అగరాల సమీపంలోని ప్రైవేట్ కళాశాల వద్ద ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డుప్రమాదంలో అయ్యప్ప భక్తుడు తీవ్రగాయాలకు గురయ్యారు. మరో ఐదుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... రైల్వేకోడూరు ప్రాంతానికి చెందిన ఆరుగురు అయ్యప్ప భక్తులు శబరిమలలో స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఘటన జరిగింది. డ్రైవరు రెప్పపాటులో కునుకుతీయడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. సాయికుమార్(25) తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితికి చేరుకున్నారు. అజయ్‌కుమార్, జస్వంత్, మణికంఠ, నితీష్, యోగేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితులను రుయా ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీలో తరలిస్తున్నట్టు.. కెమెరా కనికట్టు

నాయుడుపేట రింగురోడ్డు కూడలిలో జాతీయ రహదారి పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. ఆదివారం మధ్యాహ్నం భోజనం చేయడానికి వెళ్తూ లారీని డ్రైవర్ ఇక్కడ పార్కింగ్ చేశాడు. దూరం నుంచి చూసినప్పుడు విగ్రహాన్ని లారీలో తరలిస్తున్నట్లు ఉంది. **-ఈనాడు, తిరుపతి**

విద్యార్థులపై దురుసు ప్రవర్తన: ఉపాధ్యాయుల సస్పెన్షన్

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలో వెంకటరెడ్డిపాళెం సమీపంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులు పట్ల దురుసుగా ప్రవర్తించడంతో వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాల మేరకు గురుకులంలో ఇద్దరు విద్యార్థులు గోడలపై అసభ్యకరంగా చిత్రాలు గీయడంతో ఉపాధ్యాయులు ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో 20 మందిని ఉపాధ్యాయులు కఠినంగా శిక్షించారు. దీంతో కొంతమంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఆదివారం గురుకులానికి వెళ్లిన తల్లిదండ్రులకు విద్యార్థులు విషయం తెలపడంతో వారు ఉపాధ్యాయుల తీరుకు నిరసగా గురుకులం ముందు ఆందోళన చేశారు. విషయం తెలిసి వెంటనే ఎస్సై శ్రీకాంత్, మండల విద్యాశాఖ, గిరిజన సంక్షేమ అధికారులు గురుకులానికి చేరుకున్నారు. ఘటనపై విచారణ జరిపి గాయపడిన వారికి చికిత్స చేయించారు. బాధ్యులైన వైస్ ప్రిన్సిపల్ అరుణ కుమార్, ఉపాధ్యాయుడు హరికృష్ణను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ శాఖపరమైన విచారణకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

(c) eenadu

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

ముగిసిన చదరంగం పోటీలు

పాకాల, న్యూస్‌టుడే: ఆంధ్రా చెస్ అసోసియేషన్ సహకారంతో సహచర సమాంతర ఆలోచనల వేదిక, సత్యం ఛారిటబుల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంటు నిర్వహించారు. ఇందులో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫలితాలను సోమవారం తెలియజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

అన్నమయ్య మార్గంలో అనుమతించాలి

తిరుమల: పదకవితా పితామహుడు అన్నమయ్య నడిచిన మార్గంలో గోవిందమాల భక్తులను అనుమతించాలని వైకాపా మాజీమంత్రి పేర్నినాని కోరారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. దశాబ్దాల నుంచి భక్తులు అన్నమయ్య మార్గంలో శ్రీవారిని దర్శించుకోవడం సంప్రదాయంగా వస్తోందన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి (జీవకోన) : రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చి దీర్ఘకాలికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తిరుపతికి చెందిన ఏపీ రజకజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి లక్ష్మయ్య కోరారు. ఆదివారం సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. వెంట తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు టి.డి.జనార్దన్ ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి: 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: సీతమ్మ మార్గంలో కొత్తగా నిర్మించిన రోడ్డు పైనా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలతో సీతమ్మ మార్గం ఇరుకుగా మారుతోంది. **- దినేష్, శ్రీకృష్ణనగర్**

సమాధానం: పరిశీలించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపడతాం. **-అమరయ్య, నగరపాలక ఉప కమిషనర్**

సమస్య: బైరాగిపట్టెడలో వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. కుక్కలు గుంపులుగా రోడ్లపైనే ఉంటున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలను కరిచేందుకు ఎగబడుతున్నాయి. **- సురేంద్ర, బైరాగిపట్టెడ**

సమాధానం: ప్రమాదకరంగా ఉన్న వీధి కుక్కలను తరలించేందుకు చర్యలు చేపడతాం. **- గుణశేఖర్, పశువైద్యాధికారి**

చంద్రగిరి, న్యూస్‌టుడే: సమస్య: ఆర్ఎఫ్ రోడ్డుపక్కన చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు ఉద్ధృతి ఎక్కువగా ఉంది. చర్యలు చేపట్టాలి. **-రాంప్రసాద్, స్థానికుడు**

సమాధానం: ఆ మార్గంలోని దుకాణాల యజమానులకు చెప్పి పంచాయతీ ట్రాక్టర్ సిబ్బందికి చెత్త, వ్యర్థాలు అందించాలని సూచించాం. అక్కడ నిల్వ ఉన్న చెత్తాచెదారం తొలగించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. **- శివ, పంచాయతీ పారిశుద్ధ్య కార్మిక మేస్త్రీ**

భగవద్గీత పఠనంతో సన్మార్గం

బహుమతులు అందుకున్న విద్యార్థులతో తితిదే అధికారులు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: మానవ సమాజాన్ని సన్మార్గంలో నడిపేశక్తి భగవద్గీతకు ఉందని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి కార్యదర్శి శ్రీరాంరఘునాథ్ అన్నారు. తితిదే, హిందూధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల కంఠస్థం పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఆధ్యాత్మిక కోణంలో మనిషి ఎలా జీవించాలో భగవద్గీత తెలియజేస్తుందన్నారు. కె.పి.ముకుంద, కేపీ శ్రీ, ఎం.వైష్ణవి.. డి.నిశాంత్ చక్రవర్తి, ఎం.జస్వంత్, ఎస్.నాగవేణి.. వెంకటనారాయణ, ఎం.లహరి, ఎస్.ఉమామహేశ్వరిలు ఆయా విభాగాల్లో వరుసగా మూడుస్థానాల్లో నిలిచి బహుమతులు గెలుపొందారు. దాదాపు 8,500 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆముదాల మురళి, కేటీవీ రాఘవన్, సునీత తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

చిల్లులతో ఛిద్రం

వరుస వర్షాలతో తప్పని తిప్పలు

▶ ముత్యాలరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్ కూడలిలో గుంతలు ▶ (అంతర చిత్రంలో) రాయలచెరువు రోడ్డు నుంచి మల్లంగుంటకు వెళ్లే ప్రధాన రహదారి

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: వరుస తుపాన్లు, వాయుగుండాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ఎస్‌హెచ్, మండలాలను కలిపే ప్రధాన రహదారులు, పలు గ్రామాల రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. చీకటిపడితే ఏది గుంతో, ఏది రోడ్డో తెలియక వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని నియోజకవర్గంలోని ప్రజలు కోరుతున్నారు.

చంద్రగిరి నియోజకవర్గంలో తిరుపతి గ్రామీణం, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాల్లో మొంథా, దిత్వా తుపాన్ల దెబ్బకు ఎస్‌హెచ్, ర.భ.శాఖ, జడ్పీ పరిధిలోని రహదారులు గుంతలమయంగా మారాయి. అన్నమయ్య కూడలి నుంచి రాయలచెరువు వరకు ఉన్న రోడ్డు వర్షాలకు గుంతమయంగా మారింది. రామానుజపల్లి కూడలి నుంచి పైడిపల్లి వరకు ఉన్న రోడ్డు, రాయలచెరువు రోడ్డు నుంచి మల్లంగుంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి, తిరుపతి, చంద్రగిరి బైపాస్ రోడ్డు నుంచి సి.మల్లవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి, తాజ్ హోటల్ నుంచి కంట్రపాకానికి వెళ్లే ప్రధాన రహదారి, తిరుచానూరు నుంచి బ్రాహ్మణపట్టుకు వెళ్లే దారి, రామాపురం నుంచి కమ్మకండ్రిగకు వెళ్లే దారి, శ్రీనివాసమంగాపురం నుంచి భాకరాపేటకు వెళ్లే దారులు గుంతలమయంగా మారడంతో వాహన చోదకులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడుతున్నారు.

● నియోజకవర్గంలో 450 కి.మీ. పరిధిలోని రహదారులు గుంతలు పడినట్లు ర.భ.శాఖ అధికారులు గుర్తించారు.

జనవరిలోపు మరమ్మతులు

రెండు వరుసలున్న రాష్ట్ర రహదారులకు కి.మీ.కు రూ.40 వేలు, ర.భ.శాఖ, జడ్పీ పరిధిలోని రహదారులకు కి.మీ.కు రూ.20 వేలు చొప్పున గుంతలు పూడ్చడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. గుత్తేదారుకు పనులు అప్పగించాం. వర్షాల కారణంగా పనులు ప్రారంభించలేదు. మరో వారంరోజుల తర్వాత పనులు ప్రారంభించి జనవరి నెలాఖరులోపు పూర్తి చేస్తాం. **- శైలజ, ఏఈ, ర.భ.శాఖ**

కనువిందు చేసిన నృత్య ప్రదర్శన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన కనువిందు చేసింది. ఆదివారం బెంగళూరుకు చెందిన నృత్య విహార్ అకాడమీ కళాకారుల భరతనాట్య ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు వీక్షకులను అబ్బురపరిచాయి. ఇన్‌ఛార్జ్ ఏవో సూర్యతేజ, ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాస్ సేవలకు సేవా పురస్కారం

పురస్కారం అందుకుంటున్న సీనియర్ శాస్త్రవేత్త డా.శ్రీనివాసులు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) వివిధ రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా బ్రహ్మకుమారీస్ సేవా పురస్కారం లభించింది. ఆదివారం సికింద్రాబాద్ మహదేవపూర్‌లోని సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో జరిగిన ఆంధ్ర, తెలంగాణ స్వచ్ఛంద సంస్థల సదస్సులో బ్రహ్మకుమారీస్ సామాజిక సేవా కార్యక్రమాల కార్యదర్శి ప్రేమ్ ఈ పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని రాస్ సంస్థ తరఫున హాజరైన రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులుకు ప్రదానం చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం వివిధ ప్రాజెక్టు అధికారులను, సిబ్బందిని అభినందించారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

విద్యార్థి ప్రదర్శనను తిలకిస్తున్న వీజీవో రామ్‌కుమార్, కొండలరావు తదితరులు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని తితిదే వీజీవో తిరుమల రామ్‌కుమార్ పేర్కొన్నారు. కాలూరు క్రాస్ వద్ద ఉన్న నారాయణ ఉన్నత పాఠశాలలో ఆదివారం నారాయణ ప్రీమియర్ లీగ్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల అభిరుచి కలిగి ఉండాలన్నారు. తద్వారా శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. నారాయణ పాఠశాలల కార్యనిర్వహణాధికారి కొండలరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతోపాటు క్రీడల్లో ప్రవేశం ఉండాలన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కోర్‌డీన్ ఏఎస్ఆర్, ఏజీఎంలు శ్రీనివాసులు, రవీంద్రఫణికుమార్, ప్రిన్సిపాళ్లు రవికాంత్, గుప్తా, లీలాధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో మురుగు తొలగింపు

స్పందనకు వందనం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: భూమా కాంప్లెక్స్ సమీపంలోని నెహ్రూనగర్‌లో మురుగు సమస్య పరిష్కారమైంది. 'దుర్వాసన భరించాల్సిందేనా..?' శీర్షికన ఈనెల 5న సమస్యం ప్రచురితం కావడంతో కమిషనర్ ఎన్.మౌర్య స్పందించారు. సమస్యను పరిష్కరించాలని నగరపాలిక వైద్యాధికారి డా.యువ అన్వేష్‌రెడ్డిని ఆదేశించడంతో కార్మికులు మురుగు తొలగించడంతోపాటు కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించారు.

రహదారిలో పిచ్చిమొక్కల తొలగింపు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రాయలచెరువు కట్ట నుంచి దిగువకు వెళ్లే తిరుపతి - పచ్చికాపల్లం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను అధికారులు తొలగించారు. ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేయడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యేవారు. 'ఈనాడు' ఇటీవల వచ్చిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించి తొలగించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: పాతిక సంవత్సరాల అనంతరం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఆదివారం సమావేశం అయ్యారు. 1996-99లో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. స్నేహితులందరూ తాము చదువుకున్న కళాశాలలో కలియతిరిగి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. బాలాజి ప్రశాంత్, భాస్కర్, రమేష్, రెడ్డయ్య, మోహన్‌బాబు, భానుప్రతాప్, మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కిషోర్‌నాయక్, రియాజ్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల వితరణ

దుప్పట్లు, పరుపులు పంపిణీ చేస్తున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్ తదితరులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: పట్నాలువీధిలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి అధ్వర్యంలో పరుపులు, దిండ్లు, దుప్పట్లు అందజేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవలో భాగంగా నిరాశ్రయుల బస కేంద్రానికి అండగా నిలవడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. క్లబ్ ప్రతినిధులు బెల్లంకొండ సురేష్, జగన్నాథం, శాంతి నాడార్, ఈశ్వర్‌రెడ్డి, శేషాద్రి, బస కేంద్ర నిర్వాహకులు మునికృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వర్సిటీకి ప్రథమ బహుమతి

బహుమతి తీసుకుంటున్న అనిత, రమాజ్యోతి

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: ఈనెల 2న విజయవాడలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగిన ఐఐసీ రీజినల్ మీట్-2025లో పోస్టర్ ప్రజంటేషన్ విభాగంలో శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఆచార్యులకు మొదటి బహుమతి వచ్చింది. వర్సిటీ ఐఐసీ సభ్యురాలు అనిత, ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలు రమాజ్యోతి 'ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్' అంశంపై పోస్టర్ ప్రజంటేషన్ చేసి ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, ఐఐసీ కన్వీనర్ రజిత, ఐఐసీ ఉపాధ్యక్షులు నాగరాజు తదితరులు ఆదివారం వారికి అభినందనలు తెలిపారు.

అమరావతి సైకిల్ యాత్ర ప్రారంభం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మీసేవా ఉద్యోగులు ఆదివారం తిరుపతి టు అమరావతి సైకిల్ యాత్ర చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. నాయకులు నాగేశ్వరరావు, రవికిరణ్, పవన్‌కుమార్, వెంకటరమణ, శ్రీధర్, భాస్కర్, మోహిని, రేవతి, సురేష్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దని చంద్రగిరి వైకాపా బాధ్యుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి డిమాండు చేశారు. వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణలో పాలుపంచుకున్న నాయకులకు, కార్యకర్తలకు ఆదివారం తుమ్మలగుంటలోని నివాసంలో కృతజ్ఞతాభివందన సభ నిర్వహించారు. నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, చంద్రబాబు ప్రభుత్వంపై చంద్రగిరి నుంచే యుద్ధం మొదలైందని తెలిపారు. ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ మునిక్రిష్ణయ్య, లోకనాథరెడ్డి, సర్పంచి భారతి, ఎంపీటీసీ సభ్యుడు జయకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నియోజకవర్గ బాధ్యుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

'దేశం ముక్కలు కాకుండా అడ్డుకుంటాం'

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ పీఠికలోని లౌకిక, సోషలిస్టు పదాలు తొలగించే భాజపా కుట్రలతో దేశం ముక్కలు కాకుండా అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభలో ఇందుకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని... దేశ ఐక్యతకు, అభ్యుదయ భావజాలానికి ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు రాజ్యాంగాన్ని కాపాడుతామంటూ చెప్పి మరోవైపు మనువాద రాజ్యాంగం తీసుకురావాలని ఆర్ఎస్ఎస్- భాజపాలు కుట్రలు చేస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులుగా మాదేహాలు ముక్కలైనా దేశాన్ని మాత్రం ముక్కలు కానీయమంటూ ఉద్ఘాటించారు. అమరావతి రాజధాని పేరుతో రైతుల నుంచి మరో 1600 ఎకరాలు సేకరించే ప్రయత్నాలు దారుణమన్నారు. ఈనెల 18న వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు రామానాయుడు, మురళి, చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

'నిందారోపణలు తగవు'

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆధ్యాత్మిక ముసుగులో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయన అవినీతిని బయటపెడతామని వైకాపా ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లాని బాబు తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిపై నిత్యం నిందారోపణలు చేయడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. కార్పొరేటర్ అమర్నాథ్ రెడ్డి, తలారి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐచ్ఛిక సెలవుల్లో తీవ్ర వివక్ష

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2026 సెలవుల జాబితాలో ఇచ్ఛిక సెలవుల విషయంలో తీవ్ర వివక్ష కనబడుతోందని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నరక చతుర్దశి సెలవు తొలగిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కార్తిక పౌర్ణమి సెలవు తొలగించిందన్నారు. పలు పండగలను ఇచ్ఛిక సెలవుల జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. రమాదేవి, మల్లీశ్వరి, మునిరామిరెడ్డి, లోకనాథం, వెంకటరమణ, శేషగిరిరావు, మాధవరావు పాల్గొన్నారు.

దాసరి మఠంలో సామూహిక తనిఖీలు

ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి దాసరి మఠం ప్రాంతంలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తూర్పు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. కొత్తగా వచ్చిన వారి ఆధార్‌కార్డులు పరిశీలించారు. ప్రతి ఇంటి ముందున్న వాహన రికార్డులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలు, ఆటోను సీజ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు, నేరాలకు పాల్పడే వారిని గుర్తిస్తే వెంటనే డయల్ 112కు ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐలు హేమాద్రి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో వాహన చోదకుల వాగ్వాదం

టోల్‌ప్లాజా వద్ద వాహన చోదకుల ఆందోళన

చంద్రగిరి, న్యూస్‌టుడే: గాందంకి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం వాహన చోదకులు ఆందోళన చేపట్టారు. సిబ్బంది ఇష్టారాజ్యంపై వారు మండిపడ్డారు. కొన్ని ప్రైవేటు వాహనాల నుంచి ఎలాంటి రుసుం వసూలు చేయకుండా పంపిస్తున్నారని, అసలైన 'ప్రభుత్వ వాహనం', ఆన్ డ్యూటీలో ఉన్న వాహనాలను నిలిపి అధికారిని కారు దిగి రావాలంటూ అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రగిరి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, స్థానికులు తమ ఆధార్‌కార్డు చూపినా లెక్కచేయడం లేదని, అధికారులు స్పందించాలని వారు డిమాండు చేశారు.

విధుల్లో ఇద్దరు ఎస్సైలు

పాకాల : ఇద్దరు ఎస్సైలు విధుల్లో చేరారు. అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జ్యోతిరాం ఉద్యోగోన్నతిపై ఎస్సైగా ఇక్కడ చేరారు. 2010లో ఏడాదిన్నర పాటు ఆయన ఇక్కడ ఏఎస్సైగా బాధ్యతలు నిర్వహించి వెళ్లారు. మరో మహిళా ఎస్సై నాగమంజుల శిక్షణ నిమిత్తం ఇక్కడ చేరినట్లు సీఐ సుదర్శనప్రసాద్ తెలిపారు.

ఎస్వీయూలో ఆగని లీకేజీలు

తిరుపతి (ఎస్వీయూ) : ఇటీవల కురిసిన వరుస వర్షాలతో ఎస్వీయూలోని పలు కార్యాలయాల్లో లీకేజులు ఏర్పడి సమస్యలు ఎదురవుతున్నాయి. రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో ఇటీవల విద్యాదాఘాతంతో స్వల్ప నష్టం జరిగింది. పరిపాలన భవనంలో మరమ్మతులు చేయాలని ఉద్యోగులు విన్నవిస్తున్నారు.

ఆటలపై పట్టు... ఆరోగ్యానికి మెట్టు

క్రీడల్లో పాల్గొన్న బాలికలు

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై శ్రద్ధ వహించాలంటే కుటుంబంతోపాటు కళాశాలలో క్రీడల వాతావరణం, అధ్యాపకుల ప్రోత్సాహం తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ ఏటా రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించి వారిలో క్రీడాసక్తిని పెంపొందిస్తోంది. తిరుపతిలోని వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల వేదికగా ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు రెండోవిడత రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి 650 మంది వరకు విద్యార్థులు హాజరయ్యారు. హోరాహోరీగా జరుగుతున్న ఈ పోటీల్లో విద్యార్థినుల మనోగతం.

ఆస్వాదిస్తున్నాం

వ్యవసాయ వర్సిటీలో చదువుతోపాటు క్రీడలు తప్పనిసరి కావడంతో తొలుత ఇష్టం లేకపోయినా పాల్గొన్నా. క్రీడలతో ఎన్నో ప్రయోజనాలు ఉండటంతో ఆసక్తి పెరిగి టెన్నికాయిట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, పరుగు పోటీల్లో తలపడే స్థాయికి చేరా. ఒక్కసారి క్రీడలతో పరిచయం ఏర్పడితే వాటిని వదులుకోలేం. **- ఆర్.రూప, రాజమహేంద్రవరం**

క్రీడలు ఆడటం ఓ వరం

విద్యార్థులు క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబరిచేందుకు వ్యవసాయ వర్సిటీ ఏటా క్రీడోత్సవాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. పలు ఇతర విద్యాసంస్థల్లో చదివే మా స్నేహితులు మీకు అదో వరం అంటుంటారు. వాలీబాల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్నా. స్నేహితులతో కలిసి నాలుగురోజులు ఉత్సాహంగా పాల్గొంటున్నాం. **- కె.లావణ్య, పులివెందుల**

డిగ్రీకి వచ్చాకే పరిచయం

ఇంటర్ వరకు చదువు, ర్యాంకులు తప్ప ఏరోజూ మైదానంవైపు కన్నెత్తి చూడలేదు. వ్యవసాయ కళాశాలలో చేరాక మార్పు వచ్చింది. సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో క్రీడలపై ఆసక్తి కలిగింది. డిస్కత్రోలో మంచి గుర్తింపు సాధించడం లక్ష్యంగా ఇక్కడికి వచ్చా. **- జె.మౌనిక, బాపట్ల**

బాలికలే ఎక్కువ

తిరుపతిలో జరుగుతున్న రెండో విడత క్రీడా, సాంస్కృతిక పోటీలు బాలికల కోసం ప్రత్యేకం అన్నట్టు ఉంది. మాలో ఉన్న ప్రతిభనే కాకుండా మా సహచరుల్లో ఉన్న ప్రతిభను తెలుసుకోగలిగాం. వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్‌తో పాటు వచ్చే ఏడాది సాంస్కృతిక పోటీలకు సిద్ధం అవుతున్నా. **- నవీన, గుంటూరు**

పోలీసులకు నగదు రహిత వైద్యం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: శ్రీరమాదేవి హాస్పిటల్‌లో పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు వంద శాతం నగదు రహిత వైద్యసేవలు అందిస్తామని హాస్పిటల్ డైరెక్టర్ డా.డీబీ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో అంకితభావంతో సేవలందించే పోలీసుల సంక్షేమం కోసం హాస్పిటల్ కట్టుబడి ఉందని తెలిపారు. పరికరాలు, సర్జికల్ వస్తువుల పేరుతో ఏ విధమైన వసూళ్లు ఉండవని పేర్కొన్నారు. అవసరం మేరకు ప్రత్యేక ఏసీ గదులు కేటాయిస్తామని చెప్పారు. ఉచిత ఓపీ, ఆహారం, అత్యవసర సమయాల్లో ఉచిత అంబులెన్స్ సదుపాయాలు అందిస్తామని తెలిపారు.

'రైతులను దగా చేస్తున్న ప్రభుత్వాలు'

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని... రైతులను దగా చేస్తున్నాయని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. ఆదివారం గంధమనేని శివయ్య భవనంలో ఉమ్మడి జిల్లాకు చెందిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి 750 మంది రైతులను బలి చేసిందన్నారు. కొత్తగా విత్తన, విద్యుత్తు చట్టాలు, బిల్లులు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసేలా ఉన్నాయంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో రామానాయుడు, జనార్దన్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, మునిరత్నం నాయుడు, చిన్నిరాజ్, గురవయ్య, మునిరత్నం, గోవిందస్వామి, పద్మనాభరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం స్వాధీనం

దుంగలతో అటవీశాఖ అధికారులు

భాకరాపేట, న్యూస్‌టుడే: వాహనం సహా 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట అటవీశాఖ అధికారి వెంకటరమణ ఆదివారం తెలిపారు. అక్రమ రవాణాపై తమకు వచ్చిన సమాచారం మేరకు భాకరాపేట- మంగళంపేట రోడ్డులో శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులోని వ్యక్తులు దూరంగా వాహనం ఆపి దిగి పారిపోయారని, కారులో వెతకగా 160 కిలోల బరువుగల తొమ్మిది దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారుగా రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

అంత్యక్రియలు

జననం 12-03-1936
మరణం 07-12-2025

శ్రీ దేశినేని రామచంద్ర నాయుడు గారు
మాజీ సహకార సంఘం సభ్యులు, కందులవారిపల్లె, చంద్రగిరి (మం)

ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరిని ఆప్యాయంగా పలకరించే మంచి మనిషి మా ఇంటి దైవం, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా నాన్న గారు శ్రీ దేశినేని రామచంద్ర నాయుడు గారు 7-12-2025 ఆదివారం రాత్రి 9 గంటలకు స్వర్గస్తులైనారు. తదుపరి దహనక్రియలు 08-12-2025 సోమవారం మ: 2 గంటలకు స్వగ్రామం కందులవారిపల్లె, చంద్రగిరి (మం) నందు జరుగును అని తెలియజేయుచున్నాము.

బాధాతప్త హృదయులు..

కుమారులు: జగదీష్ చంద్రబోస్, శేఖర్ నాయుడు, నవీన్ కుమార్
కోడళ్ళు: శోభ, ప్రమీల, రాధ
మనవరాలు: శశి వినీత
కుమార్తెలు: లత, లోకేశ్వరి
అల్లుళ్లు: బి.బాలాజి, ఎన్.ప్రసన్న కుమార్

శ్రీకాళహస్తి
•శ్రీకాళహస్తి • సత్యవేడు

బావుల్లో జలకళ

బావిలో నేల మట్టానికి నీరు

నాగలాపురం, న్యూస్‌టుడే: ఇటీవల వర్షాలకు మండలంలోని బావుల్లో జలకళ సంతరించుకుంది. పలుగ్రామాల్లోని బావులు నేలమట్టానికి సమాంతరంగా నీటితో దర్శనమిస్తున్నాయి. పిట్టగోడల్లేని బావులు ప్రమాదకరంగా మారాయి. వేంబాకంలోని బావులు పూర్తి స్థాయి నీటితో గుంతల్లా ఇదుగో ఇలా కనిపిస్తున్నాయి.

మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ ఛైర్మన్లు

మంత్రి డోలా బాలవీరాంజనేయులుతో చెంచయ్యనాయుడు, విశ్వనాథం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు చెంచయ్యనాయుడు(శ్రీకాళహస్తి), విశ్వనాథం(వెంకటగిరి)లు ఆదివారం మంత్రి డోలా బాలవీరాంజనేయులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఒంగోలులో ఆయన్ను కలిసి కలంకారీ కండువాతో పాటు శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలు బహూకరించారు. వీరిని మంత్రి అభినందించారు. మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్ర మార్కెట్ కమిటీ ఛైర్మన్ల సదస్సులోను చెంచయ్యనాయుడు పాల్గొన్నారు. **13న ప్రమాణ స్వీకారోత్సవం..:** మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా చెంచయ్యనాయుడు ఈ నెల 13వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ ఆవరణలో భారీ బహిరంగ సభతో పాటు ర్యాలీ నిర్వహణకు పార్టీ శ్రేణులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

వచ్చింది వచ్చినట్లే.. 29.9 అడుగుల్లో అరణియార్

నాగలాపురం, న్యూస్‌టుడే: అరణియార్ జలాశయానికి 400 క్యూసెక్కుల మేర వరదనీరు వచ్చి చేరుతుండగా.. అదే మోతాదులో నీటిని రెండు గేట్లతో దిగువకు విడుదల చేస్తున్నట్లు డీఈ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల వర్షాలకు జలాశయ నీటి మట్టం పూర్తి స్థాయికి చేరువ కానుండటంతో గేట్లతో దిగువకు నీటి విడుదల చేశామన్నారు. పరిస్థితుల ఆధారంగా 800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల ప్రారంభించి ప్రస్తుతం 400 క్యూసెక్కులకు కుదించామన్నారు. జలాశయంలో 1.853 టీఎంసీలతో 31 అడుగుల నీటి మట్టాన్ని నిల్వ చేసే అవకాశం ఉందా.. ప్రస్తుతం 29.9 అడుగులతో స్థిరంగా 1.698 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఇలాగైతే.. సాగు ఎలాగండి

పులిబొంద కాలువ గండి నుంచి పంట పొలాలకు మళ్లుతున్న వరదనీరు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో వరదల కారణంగా పలు కాలువలకు గండి పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టక పోవడం రైతుల పాలిట శాపంగా మారింది. వర్షాలకు వర్షపునీరు గండి ద్వారా పంట పొలాలకు మళ్లుతుండటంతో వేసిన పంటలు నీట మునిగి నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో గండ్లు మరమ్మతులకు నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా.. ఇంత వరకు పనులు చేపట్టక పోవడంతో మంజూరైన నిధులు వెనక్కిమళ్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

● బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాల వద్ద కాళంగి నది నుంచి ప్రతి ఏటా వర్షాలకు పొలాల వైపు మళ్లడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక్కడ ఆనకట్ట దెబ్బతిని అయిదేళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టక పోవడంతో ఆ ప్రాంత రైతులు సేద్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది.

కూటమి పాలనతో ఆశలకు ఊపిరి

కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మండలంలోని పులిబొంద, మార్లమడుగు కాలువల మరమ్మతులకు రూ.30లక్షలు నిధులు మంజూరు చేయడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభించక పోవడంతో నిధులు వెనక్కిమళ్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కన్నీటి కష్టాలకు ఏడేండ్లు

2017 నవంబరులో కురిసిన వరదల కారణంగా నీటి ప్రవాహ ఉద్ధృతికి మండలంలోని సంతవేలూరు సమీపంలోని పులిబొంద, మార్లమడుగు కాలువలకు గండి పడింది. 2018లో నాటి ప్రభుత్వం ఈ గండి పడిన కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియలో జాప్యంతో ఆలస్యం కావడం, ఇంతలో ఎన్నికలు సమీపించడంతో పనులు నిలిచిపోయాయి. తదనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం జలవనరులశాఖకు ఒక్కపైసా నిధులు మంజూరు చేయక పోవడం రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో ప్రతిఏటా రైతులు వరినార్లు వేసి సాగు చేయడం, వర్షాలకు గండి కారణంగా నీటమునగడం రివాజుగా మారింది. దీంతో రైతులు పంట సాగుకు చేసిన అప్పులతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఏటా నష్టం.. రైతన్నకు శాపం

వ్యవసాయమే జీవనాధారంగా సాగిస్తున్న రైతులకు గండ్లు కారణంగా సాగు చేయలేని దుస్థితి నెలకొంది. కళ్ల ముందు నీళ్లున్నా ఆ నీళ్లే వారికి కన్నీళ్లను మిగిలిస్తున్నాయి. పులిబొంద, మార్లమడుగు కాలువలకు పక్కనే పొలాలు ఉండటం వారి పాలిట శాపంగా మారింది. ప్రతి ఏటా సాగు చేయడం వరదలకు గండి పడిన కాలువల నుంచి వరదనీరు పొలాలకు మళ్లడంతో వేలాది రూపాయలు వెచ్చించి వేసిన పంట నిలువునా నీట మునిగి నష్టపోతున్నారు.

● ఈ విషయమై జలవనరులశాఖ ఏఈ నాగరాజు మాట్లాడుతూ గండి పడిన కాలువల మరమ్మతులకు నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నీరు నిల్వతో పనులు చేపట్టలేక పోతున్నామని, నీటి నిల్వలు తగ్గాక పనులు పూర్తి చేస్తామన్నారు.

గంగమ్మ ఆలయాల్లో పూజలు.. శ్రీకాళహస్తి: ఏడుగంగల జాతరను పురస్కరించుకుని పట్టణ పరిధిలోని తెట్టురాళ్ల గంగమ్మలకు విశేష పూజలు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చాటింపు ఉత్సవం జరపనున్నారు. ఈ ఉత్సవానికి నాందిగా పట్టణ పరిధిలో గంగమ్మ నిలబడే ప్రదేశాల్లో ఆయా గంగమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్య: తెలుగుగంగ కాలనీలో వరాహాల బెడద ఎక్కువైంది. నివాస గృహాల మధ్య పందులు తిరుగుతున్నాయి. వ్యర్థాలన్నీ రోడ్లపై పడేస్తున్నాయి. – శ్రీనాథ్, తెలుగుగంగ కాలనీ

సమాధానం: పందుల పెంపకం దారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తాం. నివాస గృహాల సముదాయాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. – మోతీలాల్, పారిశుద్ధ్య విభాగ అధికారి, పురపాలక సంఘం

ఏర్పేడు, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని పాపానాయుడుపేటలో మంచినీటి ట్యాంకు నుంచి ఉదయం ఆలస్యంగా నీరు సరఫరా చేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు సకాలంలో కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లలేక పోతున్నారు. – చిట్టివేలు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో చర్చించి వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
– రమణకుమార్, ఈవోపీఆర్డీ, ఏర్పేడు

నాగలాపురం, న్యూస్‌టుడే: సమస్య: వేంబాకం ఎస్సీకాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. జనావాసాల నడుమ నీటిగుంట మురుగుతో దోమల ఆవాస కేంద్రంగా మారింది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. – యశోద

సమాధానం: నీటిగుంట వద్ద వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ పొడర్‌ను పిచికారీ చేయిస్తాం.– ధనపాల్‌తెన్నరసు, సర్పంచి

వంతెనకు మరమ్మతులు

స్పందనకు వందనం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండల కేంద్రం గోవర్థనపురంలో మారేడు కాలువపై వంతెనకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల వర్షాలకు వంతెనపై రహదారి కంకరతేలి గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు అవస్థలు ఏర్పడ్డాయి. దీనిపై ఆదివారం ‘ఈనాడు’లో ‘మేమున్నాం.. మీకు తోడుగా’ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మండల తెదేపా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి తన సొంత నిధులతో గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో రాకపోకల సమస్యకు పరిష్కారం ఏర్పడింది.

వారం రోజులుగా ముంపు

మండలంలోని బసవయ్య పాలెంలో వీధి వారం రోజులుగా ముంపులోనే ఉంది. దిత్వా తుపాను ప్రభావంతో ఎడతెరపిలేని వర్షాలు వరద ముంచెత్తింది. మురుగుకాలువ లేక పోవడంతో నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికే ఒకటిన్నర అడుగుల నీరు నిలిచి ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతుండటంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలిందిగా విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

గుంతల రహదారిలో విద్యార్థుల శ్రమదానం

నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్‌ఎస్‌పురం వద్ద టీపీ కోట రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి గుంతలమయమై బురదతో నిండి పోవడంతో వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. సమస్యను పరిష్కరించడంలో నేతలు, అధికారులు తీవ్రజాప్యం చేస్తుండటంతో ఆదివారం అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు తమవంతుగా శ్రమ దానంతో కొంతమేర పరిస్థితిని చక్కదిద్దారు. గుంతలలో గ్రావెల్ వేసి కొన్ని గుంతలను పూడ్చారు. అధికారులు స్పందించి టీపీకోట రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఉదయ్‌కుమార్, అధ్యాపకులు డిల్లీ, కార్తీక్‌లు పాల్గొన్నారు.

గుంతలను చదును చేస్తున్న విద్యార్థులు

క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

తగ్గని రద్దీ
● ముప్పై వేల మంది దర్శనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టడం లేదు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయానికి దాదాపు ముప్పై వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. 4,378 రాహు, కేతు పూజలు జరగ్గా అందులో 111 మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు తీసుకున్నారు. అంతరాలయ దర్శనం 455, శీఘ్ర దర్శనం 2,625, ప్రత్యేక దర్శనం 2,693 టికెట్లు అమ్ముడు పోయాయి. ఆలయం మూత వేసే సమయం వరకు రద్దీ కొనసాగింది.

త్రిమూర్తులకు ఆరుద్ర అభిషేకం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఏకశిలపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కొలువుదీరిన ఏర్పేడు మండలంలోని గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారు నిజరూప దర్శనమివ్వడంతో పాటు బయట ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీసూర్యభగవానుడికి క్షీరం, నారికేళం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు.

శ్రీపరశురామేశ్వరస్వామి నిజరూప దర్శనం

100 రోజుల శ్రమ.. 100 శాతం ఉత్తీర్ణత

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: 100 రోజుల పాటు శ్రమిస్తే విద్యాశాఖ నిర్దేశించిన 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యాన్ని సాధించవచ్చని తహసీల్దారు శ్రీదేవి సూచించారు. ఆదివారం ఆమె ఎంఈవో రవీంద్రనాథ్‌తో కలిసి పల్లమాల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం చదివితే పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త తీయరు.. చెప్పినా పట్టించుకోరు..!

పేరుకే మేజరు పంచాయతీ అయినా అధికారులకు సమస్యలు పట్టడం లేదు. స్థానిక కృష్ణయ్యశెట్టి వీధిలో చెత్త పేరుకుపోయి వారం దాటినా పారిశుద్ధ్య కార్మికులు తొలగించడం లేదు. పలుమార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలకు చెత్త దుర్వాసన రావడంతో నివాస ప్రాంత ప్రజలు, పాదచారులు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

ప్రమాదాలు జరిగితేనే.. పట్టించుకుంటారా?

శ్రీకాళహస్తి- పిచ్చాటూరు ప్రధాన మార్గానికి ఆనుకుని ఏపుగా పెరుగుతున్న పిచ్చిమొక్కలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన మార్గానికి ఉన్న మలుపులు, కాజ్‌వేల వద్ద పిచ్చిమొక్కలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వాటిని తొలిగించి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **- న్యూస్‌టుడే, కేవీబీపురం**

తీగలు తొలగించలేరా..?

ప్రస్తుత వర్షాలతో అరణియార్ జలాశయం పట్ల నిత్య పర్యవేక్షణ కొనసాగుతోంది. జలాశయంలో నీటి నిల్వ, విడుదలపై అధికారులు, రైతుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. జలాశయంలోని విద్యుత్ ఉపకరణాలకు విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు, తీగల పట్ల మాత్రం నిర్లక్ష్యం వెంటాడుతోంది. ప్రాజెక్టు వద్ద ఉన్న విద్యుత్‌స్తంభాలు, కేబుల్‌కు పిచ్చిమొక్క తీగలు అల్లుకోవడంతో పాటు స్తంభాలు పొదల్లో ఉన్నాయి. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా అత్యావశ్యకంగా ఉన్న తరుణంలో స్తంభాలు, కేబుళ్ల విషయంలో శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పిచ్చాటూరు**

గుంత.. ప్రమాదాల చింత

శ్రీకాళహస్తి- పంగూరు ప్రధాన రహదారిపై బావులు తలపించే గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాళహస్తి- వెంకటగిరితో పాటు పరిశ్రమలకు భారీ వాహనాలు ఈ రహదారిలో ప్రయాణిస్తుంటాయి. సుమారు ఏడు కి.మీ పొడవునా అడుగడుగునా ఇదే పరిస్థితి. దీంతో ప్రయాణం చేయాలంటే ప్రజలు భయపడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

‘క్షత్రియులకు సముచిత స్థానం కల్పించాలి’

ఆలయంలో సమావేశమైన వన్నెకుల క్షత్రియ సంఘం నేతలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు వన్నెకుల క్షత్రియ కులానికి చెందిన వాళ్లకు రాజకీయ పరంగా సముచిత స్థానం కల్పించాలని పలువురు నేతలు కోరారు. పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం నియోకవర్గ సంఘ నేతలందరూ సమావేశం అయ్యారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరంగా అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు పార్టీ అధినేతలు చంద్రబాబునాయుడు, లోకేశ్‌లు హామీలిచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి హోదాలో బొజ్జల సుధీర్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికలు పూర్తయి ఏడాదిన్న కాలం గడుస్తున్నా ఎలాంటి ప్రాధాన్యమైన హోదా ఇవ్వలేదని పలువురు నేతలు వాపోయారు. సమావేశంలో తెదేపా అధికార ప్రతినిధి గురవారెడ్డి, రవి, బాలాజీరెడ్డి, దొరైరాజ్‌రెడ్డి, మునిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళి, గంగిరెడ్డి, నాగరాజు, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రేణిగుంట, న్యూస్‌టుడే: పోలీసులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు.. ఆదివారం గాజులమండ్యం పోలీసు స్టేషన్‌లో పోలీసులకు హెల్మెట్లు అందజేశారు. పోలీసులే ముందుగా నిబంధనలు పాటిస్తే ప్రజలు పాటిస్తారని, హెల్మెట్ వినియోగం ప్రాణాలను రక్షించే అత్యంత ముఖ్యమైన అంశమని గుర్తు చేశారు. రేణిగుంట గ్రామీణ సీఐ మంజునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద భూములపై అధికారుల విచారణ

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీకాళహస్తి-తడ రహదారి వెంబడి భూమిలో నెలకొన్న వివాదంపై రెవిన్యూ, పోలీసు అధికారులు ఆదివారం విచారణ చేపట్టారు. ఏఎస్పీ రవిమనోహరాచారి, ఆర్డీవో కిరణ్మయి సిబ్బందితో కలసి వివాదాస్పద భూమిని పరిశీలించారు. నీర్పాకోట రెవిన్యూలోని సర్వే నెం.87-9లో ఎ.0.29 సెంట్ల భూమిపై నీర్పాకోట, కాంపాళెం గ్రామాల మధ్య రెండు నెలల క్రితం వివాదం చోటు చేసుకుంది. దీనిపై జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ఏఎస్పీ, ఆర్డీవోలు ఇరువర్గాల వారిని విచారించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. వివాదాస్పద భూమిలో ప్రవేశించరాదని ఇది వరకే ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి, తహసీల్దారు శ్రీదేవి, ఎస్సై హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రాస్‌కు బ్రహ్మకుమారీస్ పురస్కారం

పురస్కారం అందుకుంటున్న రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట, న్యూస్‌టుడే: మహిళలకు, రైతులకు, వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవలకుగాను రాస్ స్వచ్ఛంద సేవా సంస్థకు బ్రహ్మకుమారీస్ సేవా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆదివారం సికింద్రాబాదులోని మహాదేవపూర్‌లోని ‘సైలెన్స్ రిట్రీట్ సెంటర్’లో నిర్వహించిన కార్యక్రమంలో బహ్మకుమారీస్ సామాజిక సేవా కార్యక్రమాల కార్యదర్శి ప్రేమ్ చేతుల మీదుగా రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. ఎస్.శ్రీనివాసులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని ప్రజలకు తాము అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రాజెక్టు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రథోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో రథగమనానికి ఆదివారం చురుగ్గా ఏర్పాట్లు సాగించారు. రథగమన మార్గంలో అడ్డుగా ఉన్న ఇండ్ల యజమానులకు ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు పరిహారాన్ని చెల్లించారు. తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శంకర్‌రెడ్డి అందించిన రూ.15 లక్షలు, మునిశేఖర్‌నాయుడు అందించిన రూ.10 లక్షలను నిర్వాసితులకు అందించిన అనంతరం వారి ఇండ్లను ఛైర్మన్ చదును చేయించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వామి వారికి రథోత్సవాన్ని నిర్వహిస్తామని ఛైర్మన్ పేర్కొన్నారు. అతిథిగృహాలను ఈ నెల 25వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నారాయణవనం, న్యూస్‌టుడే: కీలగరం బీసీ కాలనీ సమీపంలోని పెద్ద బండ మర్రిచెట్టు వద్ద పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.ఐదు వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనాలోచితం.. అవస్థలమయం
● అసంపూర్తి పనులతో ఇక్కట్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: భవనాలు బాగున్న పాఠశాలల్లో విద్యార్థులు తక్కువ. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో అవసరమైన వసతులు లేక పోవడంతో అవస్థలు తప్పడం లేదు. వైకాపా హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రస్తుతం విద్యార్థులు, ఉపాధ్యాయులు సంకట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

వర్షం.. తప్పని సంకటం..

వరుస వర్షాలతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు సంకట పరిస్థితులు తప్పలేదు. పురపాలక సంఘ పరిధిలో గతంలో 21 ప్రాథమిక పాఠశాలలు, ఏడు ప్రాథమి కోన్నత, మూడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం చేపట్టిన విలీన ప్రక్రియతో 20 ప్రాథమిక పాఠశాలలు, మూడు ఉన్నత పాఠశాలలు మాత్రమే మిగిలాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక 20 పాఠశాలల్లో 15 పాఠశాలలను ప్రీమోడల్ పాఠశాలలుగా, ఐదు స్కూళ్లను బేసిక్ స్కూళ్లుగా మార్చింది. మూడు ఉన్నత పాఠశాలలు అలాగే కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ పుణ్యమానంటూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ప్రాథమికోన్నత పాఠశాలలు లేకుండా పోయాయి. అయితే ఇటీవల వర్షాలకు విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చింది. సాధారణ రోజుల్లో ఎక్కువ మంది విద్యార్థులున్న తరగతులను ఆరు బయట నిర్వహించుకుంటూ వచ్చేవారు. రోజుల తరబడి వర్షం కారణంగా పిల్లలు తరగతి గదుల్లో ఇరుక్కుని కూర్చొనేందుకు నానా తంటాలు పడ్డారు.

శ్రీకాళహస్తి పట్టణం మిట్టకండ్రిగలో పిల్లలకు పరిమితమైన అదనపు గది నిర్మాణం

నిధుల్లేక.. పనులు సాగక..

పురపాలక సంఘ పరిధిలో నాడు-నేడు పథకం ద్వారా తొలి విడతలో పాఠశాలకు రూ.366.94 లక్షలు వ్యయం చేశారు. అలాగే రెండో విడతలో 18 పాఠశాలలకు రూ.639.27 లక్షలు వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. పలు పాఠశాలల్లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రధాన ఉన్నత పాఠశాలలైన బాబుఅగ్రహారం, భాస్కరపేట, ఎన్టీఆర్‌నగర్‌తో పాటు పలు పాఠశాలల్లో ఇంకా అదనపు భవనాలు పూర్తి కాలేదు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో అందుకు తగ్గ మౌలిక వసతులు కల్పించేలా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

బాధ్యతలు తీసుకున్న 24 గంటల్లోపే..!
సిమ్ సరెండర్ చేసి వెళ్లిన ఎస్సై

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కొన్ని నెలలు ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకుని పోలీసుశాఖ ఉత్తర్వులు మేరకు శనివారం తొట్టంబేడు స్టేషన్ ఎస్సైగా వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఐతే ఆదివారం ఉదయానికల్లా తనకు ప్రభుత్వం ఇచ్చిన సిమ్‌ను పోలీసు స్టేషన్‌లో సిబ్బందికి అందజేసి గుట్టు చప్పుడు కాకుండా వెళ్లిపోయారు. దీనిపై సీఐ తిమ్మయ్యను వివరణ కోరగా..ఎస్సై స్టేషన్ జనరల్ రికార్డులో అనారోగ్య సమస్యలతో దీర్ఘకాలిక సెలవులపై వెళ్తున్నట్లు నమోదు చేసి వెళ్లినట్లు తెలిపారు.

గంజాయి వాడకందారులపై పీడీ కేసులు

మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఉన్నతాధికారుల సూచనల మేరకు గంజాయి వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలన్న ఉద్దేశంతో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. వన్ టౌన్, రెండో పట్టణ పోలీసు స్టేషన్ల పరిధిలో సాయికుమార్, వంశీ, వేణుగోపాల్, పరందాములపై పీడీయాక్టు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నేరపూరిత వ్యవహారాలకు దూరంగా ఉండాలన్నారు. పుల్లారెడ్డికండ్రిగ మహిళ హత్య కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. శిరస్త్రాణం వాడకంపై డిగ్రీ, జూనియర్ ఇంటర్ కళాశాలల్లో చైతన్యం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. శిరస్త్రాణం ఉంటేనే పెట్రోలు పంపిణీ చేయాలన్న విషయమై దుకాణదారులకు నోటీసులు ఇచ్చినట్లు వివరించారు. తొట్టంబేడులో ఇటీవల జరిగిన చోరీ ఘటన అసత్యంగా నిర్ధారణకు వచ్చినట్లు వివరించారు. ఏడుగంగల జాతర నిర్వహణకు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ సీఐ ప్రకాష్‌కుమార్, ఎస్సైలు రవి, వెంకటసుబ్బారెడ్డి, జ్యోతి, ఇమాన్యుయల్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం విరమించుకోవాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: నెల్లూరు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం విరమించుకోవాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని గడియార స్తంభం కూడలి వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గిరిజన మహిళపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టడం అన్యాయమని ఆవేదన చెందారు.

నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 25 వరకు

రెండో రకం: కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	150
లేయర్	125
బ్రాయిలర్స్	270
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	294
లేయర్ మాంసం	212

నిర్బంధ తనిఖీ

వెంకటగిరి: టిడ్కో గృహ సముదాయం వద్ద పోలీసులు ఆదివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను సీజ్ చేసినట్లు సీఐ వెంకటరమణ చెప్పారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ, ఆసుపత్రిలో చేరి, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా చేయూతను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని పలువురు బాధితులకు రూ.23.74 లక్షల విలువజేసే సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.4 కోట్లు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం చేశామని చెప్పారు. శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లురాజు, వాటంబేటి శివకుమార్, రహీమ్ పాల్గొన్నారు. **చిల్లకూరు, న్యూస్‌టుడే:** మండలంలోని తిప్పగుంటపాలేన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదివారం సందర్శించారు. గ్రామానికి వెళ్లేందుకు వీలుగా కండలేరు కాలువపై ఏర్పాటు చేసిన చప్టాపై వరద ప్రవాహం ఉండటంతో రాకపోకలు నిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే బోటు ద్వారా గ్రామానికి చేరుకొని స్థానికులను పరామర్శించారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ముంపులో పైరు.. రైతు కన్నీరు

✦ ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు

కోట, వాకాడు, న్యూస్‌టుడే: కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 15 వేల ఎకరాల్లో నారు గత వారం రోజులుగా నీటిలోనే మగ్గిపోతోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

✦ నవంబరు నెలలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని అన్నదాతలు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు భూములు చదును చేసి నార్లు వేశారు.

మూడు మండలాల్లో ఇదీ పరిస్థితి

✦ కోట మండలంలోని 21 పంచాయతీలు, వాకాడు మండలంలోని 19 పంచాయతీలు, చిట్టమూరులో 23 పంచాయతీల్లో 15 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఎకరాకు ఇప్పటికే రూ.10వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. నవంబరు 30న బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో డిసెంబరు 5 నాటికి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 1500 మి.మీల వర్షపాతం నమోదైంది. దీంతో స్వర్ణముఖి, చల్ల కాలువ, రొయ్యల కాలువ, మామిడి కాలువలతోపాటు చెరువులు, ఉప్పుటేర్లు పొంగిపొర్లాయి. దీంతో పొలాలు ముంపునకు గురై చెరువులను తలపించాయి. అందులో భాగంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 9500కు పైగా ఎకరాల్లో వరి ముంపునకు గురై ఇప్పటికీ నీటిలోనే మగ్గిపోతున్నాయి. వ్యవసాయశాఖ అధికారుల బృందం సర్వేలు చేసి, నష్టాలను అంచనా వేశారు. అధికారులు కేవలం వరి విత్తనాలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. మళ్లీ సాగు చేయాలంటే ఎరువులు, కూలీలు ఇతర ఖర్చులు ఎలా భరించాలని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పుచ్చలపల్లిలో నీటిలో నానుతున్న నారు

వరిసాగు వివరాలిలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	ముంపునకు గురైనవి (ఎకరాల్లో)	వర్షపాతం మి.మీలలో
కోట	5 వేలు	3000	600
చిట్టమూరు	5 వేలు	3000	400
వాకాడు	5 వేలు	3500	500

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే: సమస్య: కోట అడ్డరోడ్డు సమీపంలోని చల్లకాలువ వంతెన అంచులు ఇరువైపులా కోతకు గురయ్యాయి. – మనోహర్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం. – మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ఏఈ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: గూడూరు పట్టణంలోని జాండ్ర వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. – సురేష్, గూడూరు

పరిష్కారం: వీధి దీపాలను వెంటనే సిబ్బందితో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్లు, కమిషనర్

పింఛన్లు పునరుద్ధరించండి

వెంకటగిరి, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, చెంచయ్యనాయుడు కోరారు. ఆదివారం మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి బాల వీరాంజనేయస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెటింగ్ కమిటీ పరంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చించారు.

పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, చెంచయ్యనాయుడు

వైభవంగా అఖండ జ్యోతి పూజోత్సవం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: జువ్వలపాళెం గ్రామంలో ఆదివారం రాత్రి శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి 38వ అఖండ జ్యోతి పూజోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి హోమం నుంచి 108 కలశాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం అఖండ కర్పూర జ్యోతిని వెలిగించారు. దేవతా మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

గ్రామోత్సవంలో అయ్యప్పస్వామి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని షార్ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ప్రాంగణంలో ఆదివారం శ్రీ అయ్యప్పస్వామి వారికి నెయ్యి అభిషేకం, 18 మెట్ల పడిపూజ పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

కార్మికుల అందరికీ పెన్షన్ వర్తింపచేయాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: 2014కు ముందు పదవీ విరమణ పొందిన ఆర్టీసీ కార్మికులందరికీ పెన్షన్ అందించాలని ఆర్టీసీ విశ్రాంత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు బీవీ రమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. బాలసుబ్రహ్మణ్యం, నరసింహరెడ్డి, రామసుబ్బయ్య, చంద్రమౌళి, శంకరయ్య, శేషయ్య, రత్నం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీవీ రమణయ్య

స్వశక్తితో కదిలి.. రోడ్డు బాగుచేసి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఆటకానితిప్ప నుంచి కొరిడి, పేర్నాడుకు వెళ్లే గ్రావెల్ రోడ్డు ఇటీవల వర్షాలకు గుంతలమయంగా మారింది. దీంతో వాహనాలు నడపలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు బస్సు సర్వీసును నిలుపుదల చేయడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. స్థానిక సర్పంచులు, నాయకులు యంత్రాల సహాయంతో గుంతలను పూడ్చివేసి రోడ్డును సరిచేశారు. ఆదివారం నుంచి బస్సు సర్వీసును యథావిధిగా ప్రారంభించారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న దాతలు, సేవాసమితి ప్రతినిధులు

ఇది దేనికి సూచిక

నాయుడుపేట నుంచి మర్లపల్లి వెళ్లే మార్గం పొడవునా ముళ్లపొదలు కమ్ముకొని ఉన్నాయి. సింగిల్ రోడ్డుపై వాహనాలు మాదాలని వీల్లేకుండా చొచ్చుకొచ్చాయి. రోడ్డు అంచుల్లోని సూచిక బోర్డులను సైతం పొదలు కమ్మేశాయి. కొన్నేళ్లుగా ర.భ. శాఖ అధికారులు రహదారుల అంచున ఉన్న చెట్లను తొలగించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

– న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి

తడ: పాఠశాలల విలీనం జరిగిన నేపథ్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని యూటీఎఫ్ తడ మండల శాఖ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. యూటీఎఫ్ అధ్యక్షులు కె.రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎన్.రవికుమార్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ

తడ: పెరియవట్టు ఎస్టీ కాలనీలో ఆదివారం అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు చీరల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవస్థాపకులు ఉపేంద్ర, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'ఏకవచనంతో మాట్లాడటం సరికాదు'

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ ఉన్నతాధికారులను ఏకపక్షంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని యాదవ సంఘం అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం యాదవ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, చంద్రమోహన్, చెంచయ్య, అమరేంద్రలు మాట్లాడారు. బీసీలను తక్కువ చేసి మాట్లాడితే, ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

9న ఏపీ ఎన్జీజీవోఎస్ ఎన్నిక

వెంకటగిరి, న్యూస్‌టుడే: వెంకటగిరి తాలూకా సంబంధించి ఏపీ ఎన్జీజీవోఎస్ ఎన్నికల ప్రక్రియ 9న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి శ్రావణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. అదే రోజు ఎన్నికైన అభ్యర్థుల ప్రకటన చేస్తామని వెల్లడించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

కోట, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం షిరిడిసాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యాన దాతలు ఆత్మకూరుకు చెందిన నందిని అనే ఇంజినీరింగ్ విద్యార్థినికి రూ.50 వేలు విలువజేసే ల్యాప్‌టాప్‌ను అందజేశారు. దాతలు రత్నం, సుబ్బరాయుడు, భాస్కర్‌రెడ్డి, నవీన్, వెంకటేశ్వర్లు, చంద్రాచారి, గిరిధర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టికరగకుండా.. ప్లాస్టిక్ పట్ట పరిచారిలా

ధాన్యం రాశులు తడిచి పోకుండా రైతులు ప్లాస్టిక్ పట్టాలను అత్యవసరంగా ఉపయోగిస్తారు. దీనికి భిన్నంగా చెరువుకట్టలు దెబ్బతినకుండా ఉండేందుకు జలవనరుల శాఖ అధికారులు ప్లాస్టిక్ పట్టలను కట్టపై పరచి నీటి తాకిడికి కరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చెంబేడు చెరువు కట్ట వర్షాలకు కుంగడంతో తహసీల్దారు హరికృష్ణ ఆధ్వర్యంలో జలవనరులశాఖ అధికారులు ఇసుక బస్తాలు వేసి పటిష్ఠం చేశారు. వర్షానికి బస్తాలు కరగకుండా పైభాగంలో ఇలా రక్షణగా పరిచారు.

– న్యూస్‌టుడే, పెళ్లకూరు

పాఠశాల ప్రాంగణం.. జలమయం

సోమసానిగుంట పంచాయతీ పరిధిలోని బ్యాండు పాళెంలో ప్రాథమిక పాఠశాల చుట్టూ వరద నీరు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు పాఠశాల ప్రాంగణమంతా జలమయం అయింది. సమీప పొలాల్లోని వర్షపునీరు పాఠశాల ప్రాంగణం, చర్చి ప్రాంగణంలోకి చేరుతున్నాయి. విద్యార్థులు ఈ నీటిలోనే నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు. ప్రాంగణంలోనే తాగునీటి ట్యాంక్‌కు సంబంధించిన మోటారు తీగలు వేలాడుతుండటంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.– న్యూస్‌టుడే, వెంకటగిరి

అల్లుకున్న నిర్లక్ష్యం

సూళ్లూరుపేట మండలంలోని ఉగ్గుమూడి గ్రామంలో విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. అసలే వర్షాకాలం ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

గుంతలు.. ప్రమాదాలకు హేతువులు

సూళ్లూరుపేట- బుచ్చినాయుడు కండ్రిగకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై గుంతలు ఏర్పడటంతో రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు మరింత పెద్దగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

బురదదారి.. వాహనం చేజారి

సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి వెళ్లే మార్గంలో సీసీఎల్ ప్రైవేటు కర్మాగారం ముందు, ర.భ శాఖ రహదారి పక్కన భారీ వాహనాల రాకపోకల కారణంగా బురదమయమైంది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. ర.భ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

రిలే దీక్షలు చేస్తున్న ఐకాస నాయకులు

రిలే దీక్షలు ప్రారంభం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరును జిల్లా చేయాలి, లేనిపక్షంలో నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని ఐకాస నాయకులు తెలిపారు. పట్టణంలోని గడియార స్తంభం కూడలి వద్ద ఐకాస నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించాలని చెప్పారు. ఐకాస, ఉపాధ్యాయ, ఉద్యోగ, మీడియా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయాల్లో పూజలు

శ్రీకాళహస్తి: ఏడుగంగల జాతరను పురస్కరించుకుని పట్టణ పరిధిలోని తెట్టురాళ్ల గంగమ్మలకు విశేష పూజలు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చాటింపు ఉత్సవం జరపనున్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సీఎస్ తేజా థియేటర్ ఎదురుగా నిర్మిస్తున్న ఎన్టీఆర్ విగ్రహానికి రూ.50 వేలను తెదేపా సీనియర్ నాయకులు అత్తికాయల సుబ్రహ్మణ్యం ఆదివారం నిర్వాహకులకు అందించారు. ఇ.వెంకటసుబ్బానాయుడు, వైస్ ఛైర్మన్ షేక్.రఫీ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వర్షం వస్తే.. రాకపోకలు సాగించలేం

✦ కోతకు గురైన ఊనుగుంటపాళెం - రుద్రవరం రోడ్డు

కోట, న్యూస్‌టుడే: మండలంలోని ఊనుగుంటపాళెం- రుద్రవరం ర.భ శాఖ రోడ్డు భారీ వర్షం కురిస్తే 200 మీటర్లకు పైగా కోతకు గురవుతోంది. దీంతో రెండు పంచాయతీల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

పొలాల్లో ఇసుక మేటలు

ఊనుగుంటపాళెం- రుద్రవరానికి 5 కి.మీల ర.భ శాఖ రోడ్డు ఉంది. ఇక్కడ మామిడి కాలువతోపాటు సమీపంలోనే స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. 2016, 2023, 2024లో వచ్చిన తుపాన్లు, భారీ వర్షాలకు కాలువలు ఉద్ధృతంగా ప్రవహించడంతో రోడ్డు కోతకు గురైంది. దీంతో వారం రోజులు పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడం పరిపాటిగా మారుతోంది. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపుల ఉన్న వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు వేస్తోంది. అప్పట్లో మంత్రులు, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించి రహదారి కోతకు గురికాకుండా ఉండేందుకు ఎత్తుగా రివిట్‌మెంట్‌తో కూడిన రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. తాజాగా దిత్వా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు మళ్లీ మామిడి కాలువ ఉగ్రరూపం దాల్చడంతో రోడ్డు కోతకు గురైంది. రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు.

గుంపులుగా సంచరించి.. దాడి చేసి

✦ ఏటా పెరుగుతున్న శునకాల కాట్లు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు డివిజన్ వ్యాప్తంగా, పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువ అవుతోంది. ప్రాంతాలకతీతంగా గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు దిగి, భయాందోళనకు గురిచేస్తున్నాయి. పలువురు కుక్కకాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. పురపాలిక, పంచాయతీ అధికారులు కాలయాపన చేస్తుండటంతో సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. కుక్కకాటుకు గురైన వారు ఏఆర్‌వీ వ్యాక్సిన్ల కోసం ప్రాంతీయ వైద్యశాలకు పరుగులు పెడుతున్నారు.

గూడూరులో (అక్టోబరు నాటికి) వివరాలిలా..

సంవత్సరం	గాయపడింది	టీకా డోసులు
2023	633	3135
2024	657	3087
2025	946	4730

వెంటపడి మరీ

గూడూరు డివిజన్‌లో 183 పంచాయతీలతోపాటు, వెంకటగిరి, గూడూరు పురపాలక సంఘాలున్నాయి. వీటి పరిధిలో ద్విచక్ర, కార్లలో వెళ్లే వాహనదారులను శునకాలు వెంబడిస్తూ దాడులు చేస్తున్నాయి. పలువురు చోదకులు కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో గత మూడేళ్లుగా నమోదైన టీకాలు వివరాలు చూస్తే సమస్య ఏ స్థాయి తతలో ఉందో అర్థమవుతుంది.

✦ ఇవి కాకుండా, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు, చెన్నూరు, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి పరిధిలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో చూస్తే పరిస్థితి తీవ్రత తెలుస్తుంది. అధికారులు నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలుచేసి శునకాల బెడద తగ్గించేలా పంచాయతీ, పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెన్నూరులో వీధికుక్కలు

❖ నవంబరు 3న బాలాయపల్లి మండలం కయ్యూరు గ్రామంలో రెండేళ్ల బాలికపై వీధి కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. అదే గ్రామంలో మూడేళ్ల బాలుడిపై శునకాలు దాడిచేశాయి.

❖ నవంబరు 14న గూడూరు పట్టణంలోని నల్లజాలమ్మ వీధిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి నలుగురు చిన్నారులపై దాడి చేసింది.

రక్తదాన శిబిరం

కోట, న్యూస్‌టుడే: చెందోడులో ఆదివారం ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గూడూరులోని మేడిపల్స్ రక్తనిధి సంస్థ వారు రక్తం సేకరించారు. ఫౌండేషన్ ఛైర్మన్ లీలామోహన్‌కృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మి రక్తనిధి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

లారీని తప్పించబోయి బస్సు బోల్తా

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని రైటర్‌సత్రం సమీపాన జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని తప్పించబోయి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు పల్నాడు జిల్లా గురజాల నుంచి 36 మంది అయ్యప్ప భక్తులతో శనివారం రాత్రి బస్సు శబరిమలకు బయలుదేరింది. ఇక్కడకు రాగానే రహదారిపై మరమ్మతుకు గురై ఆగి ఉన్న ఓ లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి రహదారి కిందకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న అయ్యప్ప భక్తులు లింగా ఆదినారాయణ, కోడెల సతీష్, సిరసనంగుల్ల నాగేశ్వరరావు స్వల్పంగా గాయపడ్డారు. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. ఎస్సై సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. లారీ మరమ్మతులకు గురై రహదారిపై నిలిచిన విషయం సంబంధిత డ్రైవర్ ఎన్‌హెచ్ఏఐ అత్యవసర నంబరుకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో స్పందించలేదని సమాచారం.

ఘటనాస్థలంలో బోల్తా పడిన బస్సు

(c) eenadu

వుడా పార్కులోని స్కేటింగ్ రింక్ వేదికగా జరుగుతున్న జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఆదివారం క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. స్కేటింగ్ బూట్లతో రింక్‌లో రివ్వున దూసుకుపోతూ అద్భుత విన్యాసాలు ప్రదర్శిస్తూ వీక్షకులను కట్టిపడేశారు. – న్యూస్‌టుడే, విశాఖ క్రీడలు

ఏ జాతి మొక్కో ఇట్టే తెలుసుకోవచ్చు..

మొక్క వద్ద పెట్టిన క్యూఆర్ కోడ్

సాధారణంగా ఔషధ వనాలు పెంచే చోట ఇది ఫలానా జాతి మొక్కగా సూచించే బోర్డులు మనకు కనిపిస్తాయి. కాని గీతం విశ్వవిద్యాలయంలో నాటిన ప్రతి మొక్క వద్ద వినూత్నంగా క్యూఆర్ కోడ్‌తో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. చరవాణిలో గూగుల్ ఓపెన్ చేసి క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేస్తే ఆ మొక్క శాస్త్రీయ నామం, తెలుగు పేరు, ఏ జాతి మొక్క, పూచే పూలు, నాటిన ప్రదేశం తదితర వివరాలన్నీ ఇట్టే తెలుసుకోవచ్చు. –న్యూస్‌టుడే, మధురవాడ

ఈనాడు విశాఖపట్నం

సర్కారు విద్యార్థి.. విజయీభవ..!

గురుకులాల్లో నీట్, జేఈఈల్లో ఉచిత శిక్షణ

ప్రత్యేకంగా మెటీరియల్ తయారీ

జిల్లాల వారీగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు..	
శ్రీకాకుళం: 24	విశాఖ: 14
విజయనగరం: 36	

కోర్సుల వారీగా..
నీట్: 14
జేఈఈ: 60

ఆరిలోవ, న్యూస్‌టుడే: పేద విద్యార్థులు నీట్, జేఈఈలో ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురుకుల పాఠశాలల్లో శిక్షణ ఇవ్వడానికి ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి జిల్లాలు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం విద్యార్థుల(బాలురు)కు శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో, అమ్మాయిలకు విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని గురుకుల పాఠశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో మన్యం ప్రాంత విద్యార్థులకు అవకాశం ఇచ్చారు.

తరగతి గదిలో బోధిస్తున్న అధ్యాపకుడు

నీట్, జేఈఈ మెటీరియల్

ఎంపిక ఇలా: పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులను నియమించారు. అంతేకాకుండా ఇంజినీరింగ్, మెడిసిన్‌లకు వేర్వేరుగా ప్రత్యేక మెటీరియల్ రూపొందించారు. వాటిని విద్యార్థులకు ఇచ్చి సాధన చేయిస్తున్నారు. వారు అర్థం చేసుకునేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో బోధిస్తున్నారు.

కార్పొరేట్ సంస్థల నుంచి అధ్యాపకులు: మొదటి దశ జేఈఈ మెయిన్ పరీక్షలు వచ్చే ఏడాది జనవరి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. కేవలం 40రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కోర్సును పూర్తి చేసి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల చేత పాత ప్రశ్నపత్రాలను సాధన చేయిస్తున్నామని అధ్యాపకురాలు వాణి తెలిపారు. నారాయణ అకాడమీ ప్రత్యేక మెటీరియల్ అందజేసిందని, ఇన్ఫినిటీ అకాడమీ టైఅప్‌తో కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థల నుంచి అధ్యాపకులను రప్పించి శిక్షణ ఇప్పిస్తున్నామని శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల/కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మురళి తెలిపారు.

పక్కాగా సమయ పాలన
- ఉదయం 5 గంటలకు నిద్రలేవడం.
- 5.30 గంటల వరకు కాలకృత్యాలు
- 5.30 గంటల నుంచి ఆసనాలు, ధ్యానం, వ్యాయామం..
- ఉదయం 6 నుంచి 8 వరకు విద్యార్థుల సాధన.
- సాయంత్రం 6 నుంచి 7వరకు, రాత్రి 9 నుంచి 10 వరకు పునశ్చరణ.
- పోషకాహారం, నిద్ర, ఆరోగ్యంపై జాగ్రత్తలు.

పార్కింగ్ వద్దు.. 'వాణిజ్యం' ముద్దు..!

★ 'ది డెక్' భవనంలో ఓ అంతస్తు మార్పు
★ సౌకర్యాల కల్పనకు రూ.5 కోట్ల ఖర్చు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సిరిపురంలో నిర్మించిన ది డెక్ భవనంలో మార్పులు చేర్పులకు సిద్ధమవుతోంది. పార్కింగ్ కోసం కేటాయించిన ఒక అంతస్తును వాణిజ్య అవసరాలకు అనుగుణంగా మార్పు చేస్తున్నారు. ఇందుకోసం మళ్లీ రూ.5 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా నిర్మాణం చేపట్టడంతో ప్రజాధనం వృథా అవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

ప్రాజెక్టు ఉద్దేశం ఇదీ..: మొదట్లో బహుళ అంతస్తుల కార్ల పార్కింగ్ ప్రాజెక్టుగా దీన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.80కోట్లతో రెండేళ్లలో దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పలు కారణాలతో బాగా ఆలస్యమైంది. దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.5 కోట్ల వరకు అదనంగా పెరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీన్ని పట్టాలెక్కించి త్వరితగతిన పూర్తి చేసింది.

'ది డెక్' భవనం ఇలా..	
అంతస్తులు: 11	వాణిజ్య అవసరాలకు..: 6 అంతస్తులు
పార్కింగ్‌కు కేటాయించినవి: 5	విస్తీర్ణం: 1.64లక్షల చ.అడుగులు
స్థలం: 1.90 లక్షల చ.అడుగులు	
సామర్థ్యం: 430 కార్లు, 400 బైక్‌లు	

టెండర్లకు కొరవడిన స్పందన..

పార్కింగుకు కేటాయించిన కింది అంతస్తును ఆరేళ్లకు లీజుకు ఇవ్వాలని రెండు నెలల కిందట వీఎంఆర్‌డీఏ ప్రకటన ఇచ్చింది. వాహనాల పార్కింగ్ నిర్వహణకు టెండర్లు పిలిచారు. స్పందన లేకపోవడంతో పార్కింగ్ స్థలం కొంత ఖాళీగా ఉంటుంది. దీంతో ఓ అంతస్తును వాణిజ్య అవసరాలకు అనుగుణంగా మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రూ.5కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో పార్కింగ్ ప్రాంతాన్ని వాణిజ్య అవసరాలకు కేటాయించడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పెరిగిన కమర్షియల్ డిమాండ్: నగరం నడిబొడ్డున ఉన్న ది డెక్ భవనం ఆకర్షణీయంగా మారింది. పలు సంస్థలు అక్కడ ఆఫీసు స్పేస్ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ప్రస్తుతం ఒక అంతస్తును ప్రైవేటు వర్సిటీకి కేటాయించారు. మరో రెండు ఫ్లోర్లు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు, మరొకటి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అప్పగించారు. మరో కేంద్ర ప్రభుత్వ సంస్థకు ఒక అంతస్తు కేటాయించారు. మరికొన్ని సంస్థలు ఇక్కడ కార్యాలయాలు, రెస్టారెంట్ల నిర్వహణకు ఆసక్తి చూపుతున్నాయి.

ఒక యంత్రం.. ఆరు వ్యవసాయ పనులు..!

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఈ రోజుల్లో వ్యవసాయ పెట్టుబడులు తడిసి మోపెడవుతున్నాయి. రైతులకు వ్యవసాయ కూలీలు లభించడంలేదు. ఒక వేళ వచ్చినా అధిక కూలీ చెల్లించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి రైతులను గట్టెక్కించడానికి క్రేన్ సంస్థ 'క్రాప్ సికర్' అనే యంత్రాన్ని రూపొందించింది. ఇది ఆరు రకాల వ్యవసాయ పనులను చేసి రైతుకు సహాయకారిగా ఉపయోగపడనుంది.

★ దుక్కి దున్నడం మొదలు కలుపుతీత, ఎరువులు వేయడం, పొలాల్లో చిన్న చిన్న కాలువలు తవ్వడం, గోతులు తీయడం, పండిన పంటను కోయడానికి ఇది ఉపయోగపడుతుంది. దీనికి డీజిల్, పెట్రోల్ అవసరం లేదు. బ్యాటరీ సాయంతో పనిచేస్తుంది. నాలుగు గంటలు ఛార్జింగ్ చేస్తే ఒక ఎకరం దుక్కిదున్నుతుంది. ఈ యంత్రాన్ని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆగ్రాటెక్ మేళాలో ప్రదర్శించారు. పలువురు దీని పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు.

క్రాప్ సికర్ యంత్రం

అడ్డగోలుగా ప్రతిపా'ధనం'..!

★ గుత్తేదారులకు లబ్ధి చేకూరేలా నిర్ణయాలు
★ జీవీఎంసీకి రూ.లక్షల్లో నష్టం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీలో అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు చేస్తున్న ప్రతిపాదనలు గుత్తేదారులకు ప్రయోజనం కలిగించేలా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని పనులకు నాలుగైదు రెట్లు ధరలు పెంచుతున్నారని సమాచారం. భాగస్వామ్య సదస్సు కోసం బీచ్‌రోడ్డులో చేసిన పనుల్లో ఆయా అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

నడక మార్గంలో పెయింటింగ్ పనులు

విజిలెన్స్ విచారణకు ఆదేశాలు: భాగస్వామ్య సదస్సు సందర్భంగా బీచ్‌రోడ్డులో రహదారికి ఇరువైపులా ఉన్న నడక మార్గంపై 300 మీటర్ల మేర రంగులు వేయడానికి జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగ అధికారులు రెండు దఫాలుగా రూ.4.75 లక్షలు, రూ.4.80లక్షలు వ్యయం చేశారు. రంగులు వేయడంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో స్థాయీ సమావేశంలో మేయరు పీలా శ్రీనివాసరావు సంబంధిత ఇంజినీరింగ్ అధికారిని వివరణ కోరారు.

సీసీ రహదారిలోనూ..: ఆరిలోవ శ్రీకాంత్‌నగర్ లేఅవుట్ సమీపంలో 250మీటర్ల మేర సీసీ రహదారి నిర్మాణానికి రూ.16లక్షలు ఖర్చవుతుందని ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. అనుమానంతో కమిషనర్ కేతన్‌గార్గ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అక్కడ భౌతిక పరిస్థితులలో తేడాలుండటం గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

★ ఎస్‌ఎస్‌ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ రేట్) ప్రకారం చ.అడుగుకు రూ.192 చొప్పున ప్రతిపాదించినట్లు అధికారి తెలిపారు. వరదల్లు అడుగుకు రూ.42 నుంచి రూ.45 మాత్రమే వ్యయం అవుతుందని, ఎక్కువ మొత్తంలో ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్ విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

పర్యవేక్షణ పక్కదారి: జీవీఎంసీలో ఏటా రూ.180 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ప్రతిపాదనల నుంచి పని పూర్తయ్యేంత వరకు ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. సహాయ ఇంజినీరు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంత వ్యయమవుతుందో ప్రతిపాదించాల్సి ఉంటుంది. కాని ఆయా పనులకు వర్క్ ఇన్‌స్పెక్టర్లు అప్పగిస్తుండగా వారు గుత్తేదారులు ఇచ్చిన ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నారు. వారు ధరలు 40శాతం నుంచి 45 శాతం పెంచి చూపిస్తున్నారు.

అప్రమత్తం చేస్తాం..: పనుల పర్యవేక్షణపై అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ప్రతిపాదనలు తయారు చేసేనాటి ఆయా మొత్తాలను గుత్తేదారులకు అప్పగించడం జరగదు. తేడా ఉంటే బిల్లులు నిలిపివేస్తాం. పనుల నాణ్యతలో రాజీపడవద్దని సూచించాం. బీచ్‌రోడ్డులో నడక దారుల పెయింటింగ్‌లపై విచారణ జరుపుతాం. - పీవీవీ సత్యనారాయణరాజు, జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు

కైలాసగిరిపై ఏర్పాటు చేసిన గాజు వంతెనకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. పర్యాటకులను ఆకట్టుకోవడానికి ఆదివారం వంతెనను త్రివర్ణ దీపాలతో అలంకరించారు. వెయ్యి మంది పైగా వంతెనపై విహరించి మధురానుభూతులను సొంతం చేసుకున్నారు. – న్యూస్‌టుడే, కైలాసగిరి

అనుభవం గల
కావలెను
ఇ.ఓ.టి.గాంట్రీ క్రేన్ ఆపరేటర్
స్టీల్ హ్యాండ్లింగ్ కొరకు వెంటనే కావలెను.
ప్లాంటు వద్ద వసతి లభిస్తుంది.
సంప్రదించండి: శ్వేతల్ లాజిస్టిక్స్
భండార రోడ్, మహల్‌గావ్, నాగపూర్. మొబైల్: 9822239884.

బొంబేడయింగ్
స్టాకిస్టు మానస ద్వారకానగర్ 27వ వార్షికోత్సవ సేల్
15% సంపూర్ణ వస్త్రశ్రేణిపై డిస్కౌంట్ స్పెషల్ ఆఫర్
8 డిసెంబర్ 25 నేడే ఆఖరి రోజు
కింగ్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2999 / క్వీన్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2699
1 కొనండి 2 ఉచితం
మీడియం డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ 2కొనండి 60% డిస్కౌంట్ పొందండి. | రూ.799ల సింగిల్ బెడ్‌షీట్ 3కొనండి కేవలం రూ.1000లు మాత్రమే
ఫ్యాంట్ బిట్స్ 3 కొనండి కేవలం రూ.1000లు మాత్రమే | పిల్లో 1కొనండి 1ఉచితం
రూ.149ల హ్యాండ్‌టవల్ రూ.79లు మాత్రమే | రూ.799ల టర్కీటవల్ రూ.299లు మాత్రమే
ఫ్లోర్‌మాట్స్ 1కొనండి 1ఉచితం | రూ.250ల పిల్లో కవర్స్ పెయిర్ 1కొనండి 1ఉచితం
సుందరం / శ్రీమాన్ లుంగి 1కొనండి 1ఉచితం
గమనిక: ప్రత్యేక స్కీములున్న వాటికి 15% డిస్కౌంట్ వర్తించదు.
ది బొంబేడయింగ్ షాప్
పొట్లూరి కేసిల్, ద్వారకానగర్, విశాఖపట్నం ఫోన్ : 2710471

మహాత్ముని జీవితం కళ్లకు కట్టే గ్రంథం

ఏయూ వీఎస్ కృష్ణ గ్రంథాలయంలో సంరక్షణ

భార్య కస్తూరీబాయితో బాపూజీ (1915లో)

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మా గాంధీ జీవిత చరిత్రపై వెలువరించిన పుస్తకాలు చరిత్ర సృష్టించాయి. దేశవిదేశీ భాషల్లో తర్జుమా అయ్యాయి. తొలిగా 'మహాత్మా(లైఫ్ ఆఫ్ మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ)' అనే పేరుతో ఉన్న పుస్తకాన్ని డి.జి. తెందూల్కర్ రాయగా 1951లో ముద్రించారు.

★ ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ వి.ఎస్.కృష్ణ గ్రంథాలయంలో ఆ పుస్తకం చూడవచ్చు. ఈ పుస్తకంలో మహాత్మాగాంధీ 7ఏళ్ల ప్రాయంనాటి చిత్రాలతో పాటు భార్య కస్తూరీబాయి, తల్లిదండ్రులు పుత్లీబాయి, కరమ్‌చంద్ ఉత్తమ్ గాంధీ, సోదరుడు లక్ష్మీదాస్, చిన్నతనంలో చదువుకున్న పాఠశాల, లండన్, డర్బన్ వంటి విదేశీ నగరాల్లో స్నేహితులతో కలిసి ఉన్న చిత్రాలు కనువిందు చేస్తాయి.

★ 21.10.1947లో స్వయంగా రాసిన లేఖ (దస్తూరి) కనిపిస్తుంది. ఇటీవల జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏయూ డాక్టర్ వి.ఎస్.కృష్ణ గ్రంథాలయంలో ఈ పుస్తకాన్ని ప్రదర్శించారు. పలు విద్యా సంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు, సందర్శకులను ఈ పుస్తకం ఎంతగానో ఆకట్టుకుంది. సుమారు 70ఏళ్ల క్రితం ఆయా పుస్తకాలను ఆంధ్రవిశ్వకళాపరిషత్ సేకరించింది. అప్పటి నుంచి భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఎంతో భద్రంగా కాపాడుకుంటూ వస్తున్నారు.


మహాత్మాగాంధీ దస్తూరి

రుషికొండ, సాగర్‌నగర్: బీచ్‌లో స్నానాలు చేయడానికి వెళ్లే పర్యాటకులు కెరటాల్లో కొట్టుకుని పోకుండా పోలీసులు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆరు చోట్ల ఎరుపు జెండాలు ఏర్పాటు చేశారు. –న్యూస్‌టుడే, సాగర్‌నగర్

స్టీల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

కోకోవెన్ బ్యాటరీలో మంటలు

ఉక్కునగరం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలోని కోకోవెన్ బ్యాటరీ-3లో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఓ ఛార్జింగ్ కారు మంటల్లో దగ్ధమైంది. 305 నంబర్ ఓవెన్‌కు ఛార్జింగ్ జరుగుతుండగా.. అది పూర్తైన తర్వాత లిఫ్ట్ కాకపోవడంతో సమస్య తలెత్తింది. ఈ లోపు కారు ఇంగా ఓవెన్ నుంచి వచ్చిన మంటలు ఛార్జింగ్ కారుకు అంటుకున్నాయి. దీంతో ఛార్జింగ్ కారు సహా ఎంసెస్ పూర్తిగా కాలిపోయాయి. సి.ఐ.ఎస్.ఎఫ్. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కొంత సేపు ఇబ్బంది తలెత్తినా వెంటనే మళ్లీ పనులు కొనసాగాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

100వ జయంతి
మహాభాష్యం శేషాద్రి శాస్త్రి
(రిటైర్డ్ డిఐజి రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్)
08-12-1925 | 26-11-2000
మహాభాష్యం పిల్లా బాయి
1932-2015
ఇట్లు
మహాభాష్యం సుధాకర్ నిర్మల | సూరి సుజాత డా. నరసింహం | మహాభాష్యం జయకర్ మంజుల
మహాభాష్యం శ్రీనివాస్ సురేఖ మాధురి | మహాభాష్యం నరసింహమూర్తి అరుణ | మరియు మనుమలు, మనుమరాళ్ళు

సింహాద్రి నాథుడి సేవలో భారత బృందం

మూడో వన్డేలో దక్షిణాఫ్రికాపై విజయం సాధించిన భారత జట్టు ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకుంది. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూజల్లో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సింహాచలం

శ్రద్ధాంజలి

మాటలకందని ఆప్యాయతానురాగాలతో
మంచికి మారుపేరుగా మా అందరి
హృదయాలలో చెరగని ముద్రవేసి
మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి
ఆకస్మికంగా మమ్మల్ని వీడి దైవసన్నిధికి చేరిన మీ
పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థిస్తూ...
నాన్న: హనుమంతరావు, అమ్మ: శివమ్మ
భార్య: శోభ, పిల్లలు: నిఖిలేష్, సుశాంత్
తమ్ముడు: రవికుమార్
మరదలు: సుమ ప్రియ
అక్క: రేణుక
బావ: వెంకట లక్ష్మీనారాయణ తిరుపతి
తమ్ముడు పిల్లలు: ఆధ్యశ్రీ, అద్వైత
అక్క పిల్లలు: నిత్య
కీ॥శే॥ గుంజి నాగార్జున గారు
మేనేజింగ్ పార్టనర్:
M/s. GRK CONSTRUCTIONS
జననం: 22-12-1982 మరణం: 07-12-2025
కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు సిబ్బంది

ఓపెన్‌టాప్ డబుల్‌డెక్కర్.. రయ్ రయ్

బీచ్‌రోడ్డులో వెళ్తున్న ఓపెన్‌టాప్ బస్సు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: పర్యాటక శాఖ, జీవీఎంసీ స్మార్ట్ సిటీ విభాగాల ఆధ్వర్యంలో ఓపెన్‌టాప్ డబుల్‌డెక్కర్ బస్సు ఆదివారం ప్రారంభమైంది. ప్రస్తుతం నడుస్తున్న రెండు డబుల్‌డెక్కర్ బస్సులకు అదనంగా దీన్ని ఇక్కడికి తీసుకొచ్చారు. వీటిని వన్యప్రాణులు, పుణ్య క్షేత్రాలు, లైట్‌హౌస్ వంటి చిహ్నాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బీచ్‌రోడ్డులో ఆర్కేబీచ్ నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు, కైలాసగిరి రోప్ వే, ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల, రుషికొండ మీదుగా తొట్లకొండ వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. పెద్దలకు రూ.263, పిల్లలకు రూ.105 చెల్లించి ఆన్‌లైన్‌లో లేదా నేరుగా బస్సుల్లో టికెట్లు తీసుకోవచ్చు. టికెట్ తీసుకున్న సమయం నుంచి 24 గంటల వరకూ విహరించొచ్చు.

★ బీచ్‌రోడ్డులో పిక్నిక్‌లు, విహారయాత్రలకు వచ్చే పర్యాటకులు ఈ బస్సుల్లో విహరించేందుకు ముందుగానే బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు.

పరిశుద్ధ మరియ.. ప్రేమతో దీవించు..! | 6లో

ప్రథమ వర్ధంతి

కీ॥శే॥ ప్రొఫెసర్ మేడిచర్ల నర్సింహారావు గారు
M.Tech., Ph.D
Andhra University Professor (Rtd.)
మంచికి మారుపేరుగా నిలిచి, మా అందరికీ మీ ప్రేమ,
ఆప్యాయత, అనురాగాలు మిగిల్చి దైవ సన్నిధికి చేరిన
మీ రూపం మా మనస్సులలో సదా పదిలం
We Miss You Daddy
ప్రేమతో.. కుటుంబ సభ్యులు

(c) eenadu

'ప్రకృతి' వైపు సాగుదాం..

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జనరద్దీ

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ ఉత్పత్తుల(ప్రకృతి ఆధారిత పంటల) మేళాకు విశేష స్పందన లభించింది. మేళాలో భాగంగా ఆదివారం నిర్వాహకులు మైదానాన్ని గానుగ, కుండల తయారీ, పంటల సాగు, ఆవులు.. ఇలా పల్లె వాతావరణం ఉట్టిపడేలా మార్చేశారు. వీటిని నగరవాసులు ఆసక్తిగా గమనించారు. జనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో స్టాల్స్‌లోనే కాకుండా ఆరు బయట ఉత్పత్తులను విక్రయించారు. – ఈనాడు, విశాఖపట్నం

పుస్తక ప్రాధాన్యంపై ప్రచారం

కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి అప్పారావు, రచయిత విశ్వనాథం తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తక ప్రాధాన్యంపై ప్రచారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ డి.విశ్వనాథం రచించిన విశ్వదర్శనం-1,-2, జ్ఞాననేత్రం నుంచి ఉద్భవించిన ఖగోళశాస్త్రం-1,-2 పుస్తకాలను ఆదివారం సాయంత్రం విశాఖ జిల్లా పింఛనుదారుల సంఘం సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆర్.అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశ్రమల శాఖ జేడీ ఎస్వీ.గిరిధరరావు, అటవీశాఖ విశ్రాంత అధికారి డి.చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో రాగుల పంపిణీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ఉన్న రేషన్ డిపోల ద్వారా రాగుల పంపిణీ మొదలైంది. ఒక్కో కార్డుకు 3 కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 642 డిపోలు ఉండగా, 15,77,303 కిలోల రాగులు కేటాయించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

पूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పెందుర్తి MPDO బ్రాంచ్ (14261), బిఆర్‌టిఎస్ రోడ్డు, పెందుర్తి, విశాఖపట్నం-530051. ఫోన్ : 8355814261. ఇ-మెయిల్ : ubin0814261@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లో రూలు 8 (6) ప్రావిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే లాంఛనంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 09.01.2026, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సొమ్మును సమర్పించుటకు ఆఖరి తేది: 08.01.2026, సా॥ 4.00 గం.ల లోపు

ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/తనఖాదారు(లు): 1) M/s క్లాసిక్ పేపర్ డిజైనర్ టైల్స్, ప్రొప్రయిటర్ : శ్రీమతి ముత్యాల సుధా రాణి, శ్రీ సంతోషి ట్రేడర్స్, సర్వే నెం.218/6, కనకవానిపాలెం, గొరపల్లి, పెందుర్తి, విశాఖపట్నం–531173. 2) శ్రీమతి ముత్యాల సుధారాణి, నెం.6–92, కృష్ణరాయపురం, చినముషిడివాడ, పెందుర్తి, విశాఖపట్నం–531173. 3) శ్రీ ముత్యాల జగదీష్, తండ్రి : ఎమ్. కనక రాజు, నెం.6–92, కృష్ణరాయపురం, చినముషిడివాడ, పెందుర్తి, విశాఖపట్నం–531173. బకాయి మొత్తం : రూ.26,72,899/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల డెబ్బై రెండు వేల ఎనిమిది వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే)+ తేది.31.05.2025 నుండి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు

గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.363/2008, తేది.27.02.2008 ప్రకారం ముత్యాల జగదీష్ పేరున గల ఆస్తి: విశాఖపట్నం జిల్లా, గోపాలపట్నం ఎస్ఆర్‌ఓ పరిధి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కృష్ణరాయపురం గ్రామం, పట్టా నెం.85, 52, సర్వే నెం.34/3A, 4A ప్రకారం మొత్తం విస్తీర్ణం 1270.42 చ॥గ॥లు లేదా 1062.236 చ॥మీ॥లులోని 31.26 చ॥గ॥లు లేదా 26.137 చ॥మీ॥లు అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో గ్రీన్ ట్రీస్ అపార్ట్‌మెంట్–3 యొక్క గ్రౌండ్ ఫ్లోర్‌లోని విస్తీర్ణం 1100 చ॥అ॥లుతో రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.G–3. స్థలం హద్దులు: తూర్పు: విశాఖపట్నం నుండి అరకు రోడ్డు మరియు మీసాల జల్లు ముత్యాలమ్మ గారి ఆస్తి, దక్షిణం: 20 అ॥ల రోడ్డు, పడమర: ఇతరులకు చెందిన స్థలంతో పాటు ఆర్‌సిసి స్లాబ్ ఇల్లు, ఉత్తరం: 40 అ॥ల రోడ్డు. ఫ్లాట్ హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.G–2, దక్షిణం: 20 అ॥ల రోడ్డు, పడమర: ఫ్లాట్ నెం.G–4, ఉత్తరం: కామన్ కారిడార్ & లిఫ్ట్.

రిజర్వు ధర: రూ. 27,27,000/- ధరావత్తు: రూ. 2,72,700/- బిడ్ పెంపుదల: రూ. 27,300/-

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియను నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ & రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింక్‌ను దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది : 04.12.2025, స్థలం: విశాఖపట్నం సం/– అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచ్, విశాఖపట్నం డోర్ నెం.26-15-150, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్: 0891-2537792 / 2537782, మొబైల్ నెంబర్: 93245 17291, ఇ-మెయిల్ ఐడి: ubin0817295@unionbankofindia.bank

APPENDIX - IV-A [See Proviso to Rule 8 (6)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) ప్రావిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్థుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన బకాయి దానిపై తదుపర వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏది ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది: 30.12.2025 న విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీ చేస్తూ తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తుల రిజర్వుధర మరియు జమచేయవలసిన ధరావత్తు దిగువ వివరించబడినవి.

ఇ-వేలం తేది & సమయం: 30.12.2025, మ॥ 12.00 గం॥ నుండి సా॥ 05.00 గం॥ వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

1 రుణగ్రహీత: మెసర్స్. JMR ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్, ఫ్లాట్ నెం. 303, వాల్తేరు హైట్స్ అపార్ట్‌మెంట్స్, A.U అవుట్ గేట్ ఎదురుగా, చిన్న వాల్తేరు, విశాఖపట్నం, పిన్–530003. మేనేజింగ్ పార్ట్‌నర్: శ్రీ కొణతాల అప్పల నాయుడు, తండ్రి కీ.శే. నూక రాజు, ఫ్లాట్ నెం. 303, వాల్తేరు హైట్స్ అపార్ట్‌మెంట్స్, A.U అవుట్ గేట్ ఎదురుగా, చిన్న వాల్తేరు, విశాఖపట్నం–530003. పార్ట్‌నర్: శ్రీమతి గంగుల రోహిణి, భర్త రమేష్, ఫ్లాట్ నెం.303, వాల్తేరు హైట్స్ అపార్ట్‌మెంట్స్, A.U అవుట్ గేట్ ఎదురుగా, చిన్న వాల్తేరు, విశాఖపట్నం–530003. హామీదారులు: 1) మెసర్స్ జయ కృష్ణ స్టీల్స్, (దీని ప్రొప్రయిటర్ శ్రీ కొణతాల అప్పల నాయుడు గారిచే ప్రాతినిధ్యం వహించబడుచున్నది), డి.నెం.26–8–63, రాజా రామ్ మోహన్ రాయ్ రోడ్, వెలంపేట, మున్సిపల్ స్టేడియం దగ్గర, విశాఖపట్నం–530001. 2) శ్రీమతి గంగుల రోహిణి, భర్త రమేష్, ఫ్లాట్ నెం. 303, వాల్తేరు హైట్స్ అపార్ట్‌మెంట్స్, A.U అవుట్ గేట్ ఎదురుగా, చిన్న వాల్తేరు, విశాఖపట్నం–530003. 3) శ్రీ కొణతాల అప్పల నాయుడు, తండ్రి కీ.శే. నూక రాజు, ఫ్లాట్ నెం. 303, వాల్తేరు హైట్స్ అపార్ట్‌మెంట్స్, A.U అవుట్ గేట్ ఎదురుగా, చిన్న వాల్తేరు, విశాఖపట్నం–530003.
బకాయిమొత్తం: తేది.31.10.2025 నాటికి రూ.5,84,26,250.00 (అక్షరాల ఐదు కోట్ల ఎనభై నాలుగు లక్షల ఇరవై ఆరు వేల రెండు వందల యాభై రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

స్థిరాస్తుల యొక్క వివరములు

విశాఖపట్నం, జి.వి.ఎం.సి., భీమునిపట్నం మండలం, కుమ్మరిపాలెం గ్రామ పరిధిలోని జిరాయితీ పట్టా నెం. 05, సర్వే నెం. 48/2 లో నందు 3388 చదరపు గజాలు (డాక్యుమెంట్ ప్రకారం), 3080 చదరపు గజాల (వాస్తవముగా ఉన్నది) విస్తీర్ణం గల ఖాళీ స్థలము. ఇది దీని ప్రొప్రైటర్ శ్రీ కొణతాల అప్పల నాయుడు గారిచే ప్రాతినిధ్యం వహించబడుచున్న మెసర్స్ జయకృష్ణ స్టీల్స్ పేరున ఉన్నది. (భీమునిపట్నం యస్ఆర్ఓ లో రిజిస్టర్ అయిన సేల్ డీడ్ నెం. 2177/2011, తేదీ: 06.07.2011 ప్రకారం). ఆస్తి సరిహద్దులు (డాక్యుమెంట్ ప్రకారం): ఉత్తరం: కనకల సన్యాసమ్మ మరియు జేమ్స్ చాకో లకు చెందిన భూమి, దక్షిణం: కొండ్రు పెంటయ్య కు చెందిన భూమి మరియు ప్రభుత్వ భూమి, తూర్పు: బర్ల అప్పారావు కు చెందిన భూమి మరియు టి. శ్రీనివాస రావు గారిచే ఉత్తరం వైపున గల మెయిన్ రోడ్డుకు వెళ్ళడానికి వదిలిన రోడ్డు స్థలం, పడమర: కగుపాటి కమల లక్ష్మి కి చెందిన భూమి. Coordinates: 17.892055N, 83.429762E

రిజర్వుధర: రూ.1,43,80,300/- ధరావత్తు సొమ్ము: రూ.14,38,030/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.1,44,000/-

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింక్‌ను దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ–వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది: 04.12.2025, ప్రదేశము: విశాఖపట్నం సం/– అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పరిశుద్ధ మరియ.. ప్రేమతో దీవించు..!

- నేడు కొండగుడి మేరీమాత ఉత్సవం
- విశ్వాసుల ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : విశాఖ పాతనగరంలోని పాత పోస్టాఫీసు సమీప రోజ్‌హిల్‌పై ఉన్న విశాఖపురి మేరీమాత (అమలోద్భవిమాత) పుణ్యక్షేత్రం ప్రధాన ఉత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్ని స్థానికంగా 'కొండ గుడి' పండగ అని పిలుస్తుంటారు. విశ్వాసుల ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు హాజరై మేరీ మాతను కొలుస్తారు.


దివ్యబలి పూజలు జరిగే లూర్థుమాత గుహ

ప్రత్యేక కార్యక్రమాలు..!

★ తెల్లవారుజామున 4.30 గంటలకు లూర్థుమాత గుహ వద్ద తెలుగులో, ప్రధాన దేవాలయం వద్ద ఆంగ్లంలో దివ్యబలి పూజ నిర్వహించి, ఉత్సవాన్ని ప్రారంభిస్తారు.

★ ఉదయం 7.30 గంటలకు లూర్థుమాత గుహ వద్ద విశాఖ అగ్రపీఠాధిపతులు డాక్టర్ ఉడుమల బాలశౌరి ఆధ్వర్యంలో మహోత్సవ దివ్య బలిపూజ చేస్తారు.

★ ఉదయం 10, 11, మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని వివిధ చర్చిలకు చెందిన ఫాదర్లు దివ్య బలిపూజ నిర్వహిస్తారు.

★ మధ్యాహ్నం 1.30 గంటలకు పాతపోస్టాఫీసు వద్ద ఉన్న సెయింట్ అలోషియస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల నుంచి పుణ్యక్షేత్రంలోని చర్చి ప్రధాన ఆలయం వరకు అమలోద్భవిమాత స్వరూప తేరుతో ప్రదక్షిణ చేస్తారు.

★ అనంతరం దివ్య సత్ప్రసాద ఆరాధన కార్యక్రమంతో, ఫాదర్ కె. విజయశేఖర్ ప్రసంగం ఉంటుంది.

★ విశాఖపురి మేరీ మాత త్రైమాస పత్రిక ఆధారంగా నిర్వహించిన బైబిల్ క్విజ్, బైబిల్ పద కేళి పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందిస్తారు.

★ సాయంత్రం 5, 6 గంటలకు లూర్థుమాత గుహ వద్ద చివరి దివ్య బలిపూజలు నిర్వహించి, ఉత్సవాలను ముగిస్తారు.

భక్తులకు సౌకర్యాలు ఇలా..

★ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే క్రైస్తవ భక్తుల కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

★ చర్చి పరిసరాల్లో తాగునీటి సరఫరా కేంద్రాలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నారు.

★ కాన్వెంట్ కూడలి మీదుగా పోర్టు మార్గంలో వచ్చే వాహనాలకు పోర్టులోని అదానీ రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో, ఫిషింగ్ హార్బర్ మీదుగా వచ్చే వాహనాలకు వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, వన్‌టౌన్ నుంచి వచ్చే వాహనాలకు, బస్సులకు విక్టోరియా రాణి విగ్రహం వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

అలంకరణలో అమ్మవారు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జరిగిన పంచామృతాభిషేకం సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ అనివేటి మండపంలో శ్రీచక్రనవ వర్ణార్చన, లక్ష్మీహోమం, శప్తపతీ, వేద పారాయణం తదితర పూజాధికాలు జరిగాయి. సాయంత్రం సంజన ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. గర్భిణులు, దివ్యాంగులు, బాలింతలు గురువారం మినహా మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల మధ్యలో దర్శనాలకు రావాలని ఆలయ ఈఓ శోభారాణి సూచించారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

రోలర్ హాకీలో తలపడుతున్న విశాఖ-కర్ణాటక జట్లు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు ఆదివారం ఉత్కంఠంగా జరిగాయి. వుడా పార్కు, శివాజీపార్కు స్కేటింగ్ రింక్‌ల వద్ద వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు నువ్వా-నేనా అంటూ హోరాహోరీగా తలపడ్డారు. స్పీడ్, రోలర్ హాకీ, స్కేట్‌బోర్డు విభాగాల్లో పలువురు సత్తా చాటారు. రోలర్ హాకీ పోటీల్లో ఏపీ, తమిళనాడు, పంజాబ్ జట్లు విజయాలు నమోదు చేశాయి. స్పీడ్ విభాగంలో (8 నుంచి 10 ఏళ్లు) ఆకుల కావ్యశ్రీ (ఏపీ) స్వర్ణం, షాజహాన్ (మహారాష్ట్ర) రజతం, అఫ్రాబింద్ (కేరళ) కాంస్య పతకాలు గెలుపొందారు. 8 నుంచి 10 ఏళ్ల బాలుర విభాగంలో పి.విజయడానియేల్ (ఏపీ) స్వర్ణం, రిహాన్‌రాజు (కర్ణాటక) రజతం, వినాయక్ (తమిళనాడు) కాంస్యం పతకాలు సొంతం చేసుకున్నారు. 10 నుంచి 12 ఏళ్ల బాల,బాలికల విభాగంలో ఎం.సాధన(తమిళనాడు)స్వర్ణం, సీహెచ్.తన్మయ్ నాగదుర్గ(ఏపీ) రజతం, సీహెచ్.నాగజ్యోత్స్న(ఏపీ) కాంస్యం, సంతోష్ (పుదుచ్చేరి) స్వర్ణం, టి.ఎస్.టి.దేవర్షన్(తమిళనాడు) రజతం, ఎం.ప్రభాకరన్(తమిళనాడు) కాంస్యం పతకాలు సాధించారు.

పరారీలో హత్య కేసు నిందితుడు

గాలిస్తున్న పెందుర్తి పోలీసులు

నిందితుడు శ్రీనివాసరావు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి పాత గోశాల సమీపంలోని సూర్య కాంతం లేఅవుట్‌లో హత్యకు గురైన మహిళ కేసులో నిందితుడు వనుము శ్రీనివాసరావు(43) ఇంకా పరారీలోనే ఉన్నాడు. నిందితుడి ఆచూకీ కోసం పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ నేతృత్వంలో మూడు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. సహజీవనం చేస్తున్న అల్లాదేవి(34)ని శ్రీనివాసరావు అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె ముఖంపై ఇనుప కుర్చీతో మోదడంతో పాటు పదునైన వస్తువుతో మెడ, ముఖంపై దాడి చేసినట్లు తెలిసింది. ఆ క్రమంలో ఆమెకు పలు చోట్ల తీవ్ర గాయాలు కావడంతో పాటు ముఖం ఛిద్రమైపోయింది. గతంలో ఆరిలోవ స్టేషన్ పరిధిలో ఒక మోసం కేసు విషయంలో శ్రీనివాసరావు జైలుకెళ్లి వచ్చాడు. ఈ వ్యవహారంలోనే అల్లాదేవితో ఆతడికి విభేదాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చినముషిడివాడ లక్ష్మీనగర్‌లో ఉంటున్న శ్రీనివాసరావు కుటుంబానికి కూడా వీరిద్దరి సహజీవనం పై సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆతడిని పట్టుకుంటామని సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

ఎంపీ రమేష్‌కు కేంద్ర సహాయ మంత్రి పరామర్శ

ఎంపీ రమేష్ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వన్, ఎంపీలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సభ్యులను కేంద్ర సహాయ మంత్రి, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు పరామర్శించారు. ఎంపీ రమేష్ తల్లి రత్నమ్మ ఇటీవల తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చేరుకుని చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తమిళనాడు రాష్ట్ర చేనేత టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఆర్.గాంధీ, ఎంపీలు పుట్టా మహేష్ యాదవ్, లావు శ్రీకృష్ణదేవరాయులు, సుప్రియాసూలే, నిషికాంత్‌దూబె శ్రీకాంత్ షిండే, భోలాసింగ్, సంజయ్‌జైశ్వాల్, నీరజ్‌శేఖర్, మాజీ మంత్రి సంజయ్ బాల్యాన్, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, తదితరులు ఎంపీ రమేష్‌ను పరామర్శించారు.

వర్సిటీలకు పూర్వ విద్యార్థుల మద్దతు అవసరం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : పూర్వ విద్యార్థుల కృషితో విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతాయని కాకినాడ జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సీఎస్ఆర్‌కె.ప్రసాద్, విజయనగరం జేఎన్‌టీయూ వీసీ ఆచార్య వి.వి.సుబ్బారావు అన్నారు. ఆదివారం ఎంవీపీకాలనీలోని ఐఐఎం భవన్‌లో జేఎన్‌టీయూ కాకినాడ పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలకు పూర్వ విద్యార్థుల మద్దతు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో 1965, 1975, 1980 సంవత్సరాలకు చెందిన పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు రామ్మోహన్‌రావు, బి.అప్పలనాయుడు, పీకే.శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్లు సీఎస్ఆర్‌కె.ప్రసాద్, వి.వి.సుబ్బారావు, పూర్వవిద్యార్థులు

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

ప్రారంభోత్సవంలో డీసీపీ ప్రభాకర్, వైద్యులు విద్యారావు, సుబ్బారావు, తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్ జార్జ్ ఆసుపత్రి సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన వీఎన్ఎస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని (న్యూరో సెంటర్) ఆదివారం డీసీపీ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన వైద్యసేవలతో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ ప్రసూతి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ విద్యారావు, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బారావు, ఆసుపత్రి ప్రతినిధులు డాక్టర్ టి.ప్రశాంత్, డాక్టర్ బీటీ.భరత్‌సింగ్‌నాయక్, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతిపై బాలింత ఆందోళన

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

బాధితురాలు ఉమాదేవి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కేజీహెచ్ ప్రసూతి విభాగంలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మగ శిశువు మృతి చెందాడని బాలింత పి.ఉమాదేవి ఆరోపించారు. వైద్యుల తీరుపై ఆమె కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, వన్‌టౌన్ పోలీసులు, సామాజిక మాధ్యమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. డీజీపీ ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు ఆదివారం కేజీహెచ్‌కు చేరుకుని మహిళ నుంచి ఆరా తీశారు. ఆ వివరాలు... సింహాచలానికి చెందిన గర్భిణి పి.ఉమాదేవికి నెలలు నిండడంతో కుటుంబసభ్యులు ఈనెల 1న గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం 2న కేజీహెచ్ ప్రసూతి విభాగంలో చేర్పించారు. అదే రోజు సాయంత్రం 6.19 గంటల సమయంలో గర్భిణికి ప్రసవం అయిందని, మగబిడ్డ పుట్టినట్టు చెప్పిన వైద్యులు, రాత్రి 7 గంటలకు ఆ బిడ్డ చనిపోయాడని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంతో సరైన వైద్యం అందించక బిడ్డ మృతి చెందాడని, తనకు న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు ఆమె నుంచి వివరాలు సేకరించారు. దర్యాప్తు చేస్తున్నారు.

★ ఈ ఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ... శిశువు మృతిపై విచారణకు త్రిసభ్య కమిటీ వేశామని, వారిచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

వన్‌టౌన్, కార్పొరేషన్, జగదాంబకూడలి, న్యూస్‌టుడే : కలెక్టరేట్, జీవీఎంసీ కార్యాలయాల్లో, నగర పోలీసు కమిషనరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జీవీఎంసీ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, కమిషనరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు.

కూలిన స్లాబ్.. తప్పిన ప్రమాదం..

మాధవధార, న్యూస్‌టుడే: జాతీయ రహదారి బిర్లా కూడలిని ఆనుకొని ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద నిర్మాణ దశలో ఉన్న వీఎంఆర్ మెగా మాల్ సంబంధించిన స్లాబ్ కూలిపోవడంతో స్థానికుల్లో కలకలం రేగింది. సమయంలో స్లాబ్ కింద మనుషులు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత మూడేళ్ల నుంచి ఈ మాల్ నిర్మాణం జరుగుతోంది. మాల్‌కు ఆనుకొని ఉన్న భాగంలో పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఆదివారం కాంక్రీట్ మిక్సర్ ద్వారా స్లాబ్ వేస్తుండగా రెండు పిల్లర్ల అనుసంధానం వద్ద వరసగా వేసిన డెకింగ్‌కు సరైన సపోర్టు లేకపోవడంతో స్లాబ్ కూలిపోయింది. భారీ మాల్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేయాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం ఐరన్ పోల్స్‌తో డెకింగ్ వేసి వదిలేశారని దాని సామర్థ్యం పరిశీలించకుండా నేరుగా కాంక్రీట్ వేయడంతో స్లాబ్ అమాంతం కూలిపోయిందని సిబ్బంది చెబుతున్నారు. ఘటనకు సంబంధించి స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కూలిన షాపింగ్ మాల్ స్లాబ్

EENADU eClassifieds

BUSINESS SERVICES

లోన్స్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్న బంగారాన్ని విడిపించి అధికరేటుకు కొనుగొలు. ☏ 9848488068, 7799223300.

క్రిష్ణ గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్న బంగారాన్ని విడిపించి అధికరేటుకు మార్కెట్ రేటుకు కొనుగొలు. ☏ 9908546224.

FINANCIAL SERVICES

అంధ్రప్రదేశ్ Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు ఎటువంటి లోన్లు ఇవ్వబడును. ☏ 73862 01191.

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకి ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, పరిశ్రమలు, హౌసింగ్ లోన్లు ఇవ్వబడును. M.S.R. గ్రూప్, వైజాగ్. ☏ 9121314141.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

Vastu Consultants genuine India's best vastu for Industries / houses rural / urban Ph:9676119507, 9014285369.

REAL ESTATE

GENERAL

FLAT FOR SALE

GENERAL

First Floor Apartment with Covered Parking in Madhurawada. Ph: 7013705474.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

Building for Sale. 121 Sq.Yds. Cellar+ G+1 North East Corner Excellent Vastu. Prime Location Atchuthapuram. 9885824528.

PLOT FOR SALE

KURMANNAPALEM

WANTED

GENERAL

JOBS

Wanted Staff in Saree Store Sales Boys, Sales Girls experience must be 2 to 3 years. Contact: 9394311123.

Required M/F Candidates for Admin Managers, Working or Retd/ VRS From any field can call above 40yrs. Salary + Inc; to be Finalised on : 8th & 9th During Interview. Ph: 8919140915.

ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పని చేయుటకు 18-35 సంవత్సరాల యువతీయువకులు కావలెను. జీతం 10,000-13500 ఫోన్: 9704637370, 9949904532.

SECURITY GUARDS

FACULTY/ TEACHERS

Tutors for Full Stack Python, Java Tutors for B.Tech,ECE, EEE Subjects PDC, SS, CS, EDS, Physics, ICSE, CBSE (6-10th) 9397955328.

గమనిక

అప్పన్న సన్నిధిలో సినీ నటులు

కప్పస్తంభం వద్ద ఆది సాయికుమార్, అర్చనా అయ్యర్

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ కథానాయకుడు ఆది సాయికుమార్, కథానాయిక అర్చనా అయ్యర్ ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదాశీస్సులు అందజేశారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

ఏపీహెచ్‌హెచ్‌ఈఏ జిల్లా కార్యవర్గ సభ్యులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కలెక్టరేట్ ఆవరణలోని ఎన్జీవో హోంలో ఆదివారం ఉదయం ఏపీ హెల్త్ హౌస్‌కీపింగ్ ఉద్యోగుల సంఘం (ఏపీహెచ్‌హెచ్‌ఈఏ) జిల్లా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్.రమణారావు, సహ అధ్యక్షుడిగా ఎమ్.బేగ్, ఉపాధ్యక్షులుగా ఎం.బాబ్జీ, కార్యదర్శిగా ఇ.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా జి.రామసుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఆర్.కరక్, ఈసీ సభ్యులుగా వి.సూరిబాబు, పి.వేణుగోపాల్, బి.వెంకటరావు ఎన్నికయ్యారు. ఏపీఎన్జీవో సంఘం విశాఖ నగర కమిటీ అధ్యక్షుడు జి.రామ్‌ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం నాయకులు పి.బిజ్జు, పి.అప్పారాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ప్రభుత్వ వైద్యుడి మృతి


డాక్టర్ కె.ఎస్.జీ.జె. శాస్త్రి (పాతచిత్రం)

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : నగరంలోని ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్(ఆర్.ఎమ్.ఓ.)గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.ఎస్.జీ.జె. శాస్త్రి (57) 6వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. జీవితం ఆయన గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. గతంలో కేజీహెచ్‌లో కూడా సి.ఎస్.ఆర్.ఎం.ఓ.గా విధులు నిర్వహించారు. కుమారుడు అమెరికా నుంచి రావాల్సి ఉండటంతో 8న అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఛాతీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో - రూ.ల్లో)	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
ఫారం గేటు	126	125
లైవ్	153	145
డ్రెస్డ్	222	260
స్కిన్‌లెస్	252	270

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
రాజు వెడ్స్ రాంబాయి
స్క్రీన్-2 - ఆంధ్ర కింగ్ తాలూకా

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న నిత్య కల్యాణోత్సవం ఆదివారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3): ఉక్కు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విశాఖ ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కోలార్ ఎంపీ ఎం.మల్లేశ్‌బాబు, బెంగళూరు రూరల్ ఎంపీ డాక్టర్ సి.ఎస్.మంజునాథ్‌ను దిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. కాటం ఎస్.ఎస్. చంద్రరావు, కేవీడీ. ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు వినతిపత్రం అందిస్తున్న ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు

ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీపై దర్యాప్తునకు డిమాండ్

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న విశాఖ ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీ ఎ.కె.సక్సేనాపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి కర్మాగారానికి, కార్మికులకు నష్టం కలిగించే చర్యలే చేపట్టారన్నారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని, కర్మాగారాన్ని కాపాడాలని ఉక్కు మంత్రిత్వశాఖను డి.ఆదినారాయణ(ఏఐటీయూసీ), పాడి త్రినాథరావు(వీఎస్ఈయూ), ఎం.రాజశేఖర్(ఇంటక్), ఎన్.రామారావు(సిటూ)డిమాండ్ చేశారు.

ఆటలో అదరగొట్టి.. పతకాలు చేతపట్టి..

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గొర్లెవానిపాలెం ఇండోర్ స్టేడియంలో ఈ నెల 6 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 7 ఉమ్మడి జిల్లాల నుంచి 250కి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. పసిడి పతకాలు సాధించి త్వరలో జరిగే జాతీయ స్థాయికి ఎంపికైన పలువురి క్రీడాకారులతో 'న్యూస్‌టుడే' మాట్లాడగా వారి నేపథ్యాన్ని, ఈ క్రీడపై ఉన్న ఆసక్తిని వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే...

ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

ఏడాదిగా మెలకువలు నేర్చుకుంటా: తండ్రి సింహాచలం ఎన్టీపీసీ ఉద్యోగి. తల్లి ద్యూన్సీరాణి గృహిణి. థాంగ్‌టాలో ఏడాది న్నర కాలంగా మెలకువలు నేర్చుకుంటున్నా. ఉక్కు నగరం శ్రిష్టి వరల్డ్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నా. ప్రస్తుత అండర్-14 విభాగంలో 40 కేజీల కేటగిరీలో లీగ్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్‌లో రాణించి స్వర్ణ పతకం సొంతం చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యా. క్రీడల్లో రాణించి నేవీలో ఉద్యోగం సాధించాలని ఉంది. - షణ్ముక్ సాత్విక్

తొలి పోటీల్లోనే స్వర్ణం తెచ్చుకున్నా..: తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏడాది కాలంగా థాంగ్‌టా క్రీడపై సాధన చేస్తున్నా. పరవాడ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. తండ్రి త్రిమూర్తులు లారీడ్రైవర్. తల్లి కనకదుర్గ ఫ్రాండిక్స్ పరిశ్రమలో పని చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగంలోని 49 కేజీల థాంగ్‌టా పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యా. చాలా సంతోషంగా ఉంది. - కొరుపోలు తులసి

ఈ క్రీడ అంటే చాలా ఇష్టం: స్వగ్రామం వాడ చీపురుపల్లి. తండ్రి శ్రీనివాసరావు కారు డ్రైవర్. తల్లి శివలక్ష్మీదేవి గృహిణి. ఎన్టీపీసీ బాల భారతి పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నా. థాంగ్‌టా అంటే చాలా ఇష్టం. అండర్-17 థాంగ్‌టా పోటీల్లో ఫైనల్లో స్వర్ణ పతకం సొంతం చేసుకుని జాతీయ క్రీడలకు ఎంపికయ్యా. రాష్ట్ర స్థాయిలో 3 పసిడి, ఎస్‌జీఎఫ్ పరుగు పోటీలో రజతం సాధించా. - సాయిరాగిని

అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతా: అమ్మానాన్నల ప్రోత్సాహంతో థాంగ్‌టా నేర్చుకున్నా. స్వగ్రామం రామన్నపాలెం. తిమ్మరాజుపేట ఇంటర్నేషనల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నా. నాన్న దీప్‌సింగ్ ప్రైవేట్ ఉద్యోగి. తల్లి ఇందుమతి ప్రైవేట్ టీచర్. అండర్-17 పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యా. గతంలో నిర్వహించిన జాతీయ పోటీల్లో కాంస్యం, రాష్ట్ర స్థాయిలో స్వర్ణం కైవసం చేసుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటేందుకు కఠోర సాధన చేస్తున్నా. - పవన్‌కుమార్‌సింగ్

ముగిసిన రాష్ట్ర థాంగ్‌టా పోటీలు

36 మంది జాతీయ స్థాయికి ఎంపిక

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం గొర్లెవానిపాలెంలోని ఇండోర్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 69వ రాష్ట్ర స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో 7 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు రాష్ట్ర అబ్జర్వర్లు శ్రీహరిరాజు, ప్రసాదు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఎం.నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రతిభ చాటిన 36 మందినిజనవరి 17 నుంచి 22 వరకు దిల్లీలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరావు, ఏపీ థాంగ్‌టా అసోసియేషన్ అధ్యక్షుడు గొర్లె పుష్పారావు, కార్యదర్శి తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైనవారు వీరే..

బాలికలు: అండర్-14 విభాగంలో: ప్రణీత(విశాఖ), అమీరా ఇరాన్(కర్నూలు), సుదీక్ష(తూర్పుగోదావరి), తులసి(విశాఖ), త్రివేణి(విశాఖ), మేఘన(విశాఖ), అండర్-17లో సాయిరాగిని(విశాఖ), ద్యూన్సీ(విజయనగరం), మణికర్ణిక(కృష్ణా), ప్రవల్లిక(విశాఖ), హర్షిణి(విశాఖ), సుహానా(కర్నూలు), అండర్-19లో సుల్తానా(కర్నూలు), శ్రీహిత(విజయనగరం), శ్రీలత(గుంటూరు), మానస(విశాఖ), జ్యోతి(విశాఖ), సురేఖ(కర్నూలు).

బాలురు: అండర్-14 విభాగంలో: షణ్ముకస్వాతిక్(విశాఖ), వి.సాత్విక్(కృష్ణా), హరీష్(విశాఖ), ఎస్.కె.అయాన్(విజయనగరం), వై.మోక్షిత్(కృష్ణా), రఫీక్(తూర్పుగోదావరి), అండర్-17లో పవన్‌కుమార్ సింగ్(విశాఖ), ఆకాశ్(విజయనగరం), హరివెంకటఅఖిల్(గుంటూరు), చరణ్ తేజ(విశాఖ), జాన్‌పాల్(గంటూరు), టి.చరణ్(కర్నూలు), అండర్-19లో వినయ్‌కుమార్(విజయనగరం), చెన్నకేశవ(కడప), రోహిత్(విజయనగరం), అఖిల్(గుంటూరు), వెంకటేశ్(విజయనగరం), లక్ష్మీప్రణీత్(కృష్ణా).

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 93వ వార్డు సమతా కాలనీలో రహదారులు బాగు లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలి. - సత్యారావు. ✓: రహదారులను కాలనీలో చాలా వరకు నిర్మించాం. కొద్ది రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - రాపర్తి కన్నా, కార్పొరేటరు

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి చెత్త తొలగించేలా చూడాలని కోరుతున్నాం. - ఎన్.భీమారావు ✓: పరిశీలించి పేరుకుపోయిన చెత్తను తొలగించే ఏర్పాటు చేస్తాం. - పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి సబ్బవరం

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: గొట్టివాడ కాలనీలో సంపద కేంద్రానికి తరలించాల్సిన చెత్తను రోడ్డు పక్కన పడేస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాల్సిందిగా కోరుతున్నాం. - స్థానికులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ నుంచి భరణికం వెళ్లే రహదారిలో వీధి దీపాలు లేవు. రాత్రుళ్లు పరిసర గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. - నాయుడు ✓: దీపాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం. - రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

స్పందనకు వందన

ఎట్టకేలకు పిచ్చిమొక్కల తొలగింపు

భరణికం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ నుంచి భరణికం వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను ఎట్టకేలకు తొలగించారు. కొద్ది నెలలుగా రహదారి పక్కన తుప్పలు పెరిగిపోవడంతో అటుగా రాకపోకలు సాగించడానికి వాహనదారులు నానా ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై పలు మార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురించడంతో అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి సమస్యను పరిష్కరించారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాటం'

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేసేవరకు కార్మిక సంఘాలంతా ఐక్యంగా ఆందోళనలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. చినముషిడివాడ అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక వర్గానికి నష్టం కలిగించే ఆయా చట్టాలను రద్దు చేసే వరకు పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.గీత, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, కార్యదర్శి సీహెచ్.వెంకటరావు, జిల్లా కమిటీ సభ్యులు చిన్నారి, శ్రీనివాసరావు, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు

తక్షణమే వీఆర్ఎస్ బకాయిలు చెల్లించాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కులో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వారికి తక్షణమే బకాయిలను చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మొదటి విడత జూన్ 2025లో 1137 మంది, రెండో విడత ఆగస్టు 2025లో 486 మంది ఉద్యోగ విరమణ చేశారన్నారు. వీరికి రెండు దఫాలుగా కేవలం 50 శాతం మాత్రమే చెల్లించారన్నారు. మిగతా 50 శాతమైన ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాల్సి ఉందన్నారు. డీపీఈ గైడ్‌లైన్స్‌ను అనుసరించి తక్షణమే వీరికి అన్ని బకాయిలు చెల్లించాలని ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!

దర్పణం

లక్ష్మీపురం(వేపగుంట), న్యూస్‌టుడే: లక్ష్మీపురం కూడలిలో చింతలగ్రహారం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో మంచినీటి పైపులైను సంపు ప్రమాదకరంగా మారింది. సంపు చుట్టూ రక్షణ పలకలు ఏర్పాటు చేయకుండా అడ్డుగా చెట్ల కొమ్మలను పెట్టి వదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ఈ గొయ్యిలో పడి గాయాలపాలవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సంపును సరిచేసి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిల దారి.. అవస్థలు తెచ్చి..

పరవాడ, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కూడలి నుంచి సబ్‌స్టేషన్‌కి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి శిథిలావస్థకు చేరుకుంది. దారిలో పెద్ద పెద్ద గుంతలు పడటంతో పాటు రాళ్లు తేలి ప్రయాణం చేయడానికి అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వర్షం పడితే అందులో నీరు చేరి రహదారి మరింత అధ్వానంగా మారుతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారిలో భారీ గుంతలు

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ముమ్మన దేముడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన వార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం, భవానీనగర్, బీసీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శివగాయత్రినగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భూగర్భ మురుగు నీటి వ్యవస్థ మ్యాన్‌హోల్ నుంచి పొంగి పొర్లుతున్న మురుగు నీటికి అడ్డుకట్ట వేయాలన్నారు. అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తానని ముమ్మన వివరించారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు అయితి ఎర్నిబాబు, 95, 97 వార్డుల భాజపా అధ్యక్షుడు చిక్కాల సతీశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మురుగు నీటిని పరిశీలిస్తున్న ముమ్మన దేముడు, తదితరులు

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరే రామ..హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి మహిమల్ని అభివర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీ నితాయి సేవిని పర్యవేక్షణలో అన్నసమారాధన చేపట్టారు.

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ

వేపగుంట, న్యూస్‌టుడే: కాలనీల్లో నేరాలు జరగకుండా నియంత్రించేందుకు ప్రజల సహకారం అవసరమని పెందుర్తి క్రైం సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. పెందుర్తి క్రైం విభాగం ఆధ్వర్యంలో 95వ వార్డు వరలక్ష్మీనగర్‌లోని కాలనీవాసులతో నేరాల నియంత్రణ - ప్రజల సహకారం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనుమానితులు కాలనీల్లో సంచరిస్తే వెంటనే ఎవరికి సమాచారం ఇవ్వాలనే విషయాలపై కాలనీవాసులకు తెలియజేశారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు గంట్ల నరసింహమూర్తి, కార్యదర్శి ఆర్ఆర్‌బీ వర్మ సారథ్యంలో జరిగిన సదస్సులో కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వరలక్ష్మీనగర్‌లో కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ ఎం.చంద్రమౌళి

ఆధ్యాత్మికం

రామలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

పూజలు అందుకుంటున్న శ్రీరామలింగేశ్వరుడు

సబ్బవరం, న్యూస్‌టుడే: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని సబ్బవరంలోని రామలింగేశ్వర ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేయించారు. మహాశివుడి జన్మతార, శివపార్వతుల వివాహం జరిగిన నక్షత్రం ఆరుద్ర కావడంతో ప్రత్యేక పూజలు జరిపినట్లు అర్చకులు తెలిపారు.

వైభవంగా దుర్గాదేవి పూజ

పూజలు చేస్తున్న భక్తులు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట సమీప గంగిరెడ్లకాలనీలో నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం దుర్గాదేవి పూజను మాలధారణ భక్తులు వైభవంగా నిర్వహించారు. విజయదుర్గా భవానీ పీఠం రమణ భవానీ ఆధ్వర్యంలో వేచలం గురూజీ సారథ్యంలో నర్సింహమూర్తి, కనకరాజు పర్యవేక్షణలో పెద్దఎత్తున పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి భక్తిపాటలతో కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో జరిపించారు.

శరణుఘోషతో మార్మోగిన చింతలగ్రహారం

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: అయ్యప్ప శరణు ఘోషతో చింతలగ్రహారం గ్రామం ఆదివారం మార్మోగింది. వంశీ స్వామి సారథ్యంలో గురుస్వాములు కాళ్ల వెంకటరావు, ఎస్.సత్తిబాబు, పెంటకోట బల్లు అప్పారావు సారథ్యంలో అయ్యప్ప మహాసన్నిధానం పూజలను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో వేపగుంట, పెందుర్తి, గోపాలపట్నం, నరవ, సింహాచలం ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

అయ్యప్ప భక్తులు ఏర్పాటు చేసిన సన్నిధానం

బీచ్‌రోడ్డులో స్పిరిట్ రన్

పరుగులో పాల్గొన్న నగరవాసులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వాలంటీర్స్ డేను పురస్కరించుకొని బీచ్‌రోడ్డులో ఆదివారం వాలంటీర్ స్పిరిట్ రన్ నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి, యూత్ ఆఫ్ భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరుగు జరిగింది. ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం వద్ద ఈ పరుగు ప్రారంభమైంది. ఈ సందర్భంగా భాజపా పూర్వ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా స్ఫూర్తితో స్వచ్ఛంద సేవ చేయాలన్నారు. ఈ రన్‌లో పురుషుల విభాగంలో వేదవ్యాస్(ప్రథమ), వి.రమేష్(ద్వితీయ), వి.కిరణ్‌కుమార్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో కె.జీవనతన్య(ప్రథమ), స్వాతిరతన్(ద్వితీయ), సి.నిర్మల(తృతీయ) స్థానాల్లో నిలిచారు. యూత్ ఆఫ్ భారత్ వ్యవస్థాపకులు చందన్‌మచ్చా, జంపన రంగరాజు పాల్గొన్నారు.

5కె రన్‌లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సీనరేజీ భారం.. నిలిచిన పనులు..

పెందుర్తి, న్యూస్‌టుడే: కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన సీనరేజీ విధానంతో అభివృద్ధి పనులకు అవరోధంగా మారింది. జీవీఎంసీ వార్డుల పరిధిలో అమలవుతున్న పలు అభివృద్ధి పనులు నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. పనులు ప్రారంభించిన గుత్తేదారులు అదనపు భారం పడుతోందన్న కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. దీంతో అసంపూర్తి రహదారి పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రహదారి నిర్మాణం పనులు చేసే గుత్తేదారుల నుంచి జీవీఎంసీ సీనరేజీ రుసుమును వసూలు చేస్తోంది. ఆ సొమ్మును గనుల శాఖకు చెల్లిస్తుంది. ఆ మేరకు అధికారులు జారీ చేసిన ధ్రువీకరణల ద్వారా గుత్తేదారులు గ్రావెల్, తదితర ముడి సరకును గనుల నుంచి తీసుకుంటారు. ఇంత వరకు ఈ విధానం కొనసాగింది. తాజాగా గనుల వద్ద జీఎస్టీ, సీజీఎస్టీ అధికారులు నిర్మాణ ముడి సరకును తీసుకొచ్చే వాహనాల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఈ భారం గుత్తేదారులపై పడుతోంది. దీంతో రెండు సార్లు సీనరేజీ చెల్లించాల్సిన పరిస్థితి వస్తోందని గుత్తేదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పనులు నిలిపివేశారు. జీవీఎంసీ 95, 96, 97 వార్డుల పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టిన బీటీ రహదారుల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చినముషిడివాడ వుడా కాలనీ, 95వ వార్డు ఎన్‌ఏడీ లేఅవుట్, పెందుర్తి జనచైతన్య లేఅవుట్, తదితర ప్రాంతాల్లో రహదారులు సగంలో ఆగిపోయాయి. కంకర తేలిన రోడ్లపై జారి పడుతున్నారని ద్విచక్ర వాహనదారులు, పాదచారులు చెబుతున్నారు.

చినముషిడివాడ వుడాకాలనీలో నిలిచిపోయిన రోడ్డు పనులు

సమస్య పరిష్కారానికి చర్యలు

ఇప్పటికే జీవీఎంసీ అధికారులు ఈ సమస్య పరిష్కారంపై దృష్టిసారించినట్లు తెలిసింది. అధికారులు గుత్తేదారులతో సమావేశమై గనుల నుంచి ముడి సరకులు తీసుకువచ్చేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని నిర్ణయించారు. దీనిపై ఆయా శాఖల అధికారులతో చర్చించినట్లు సమాచారం. పెద్ద పనులు చేస్తున్న గుత్తేదారులపైనే దీని ప్రభావం అధికంగా ఉంది. ప్రధానంగా బీటీ రహదారుల నిర్మాణాలు నిలిచిపోయాయి. త్వరలోనే ఆయా పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.

నిర్మాణానికి ఏడేళ్లు.. ప్రారంభానికి ఎన్నేళ్లో..!

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో బాలికల డ్రాప్ అవుట్స్ తగ్గించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోంది. క్షేత్ర స్థాయిలో అవి పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. సబ్బవరం ఉన్నత పాఠశాలలో ఎక్కువమంది బాలికలు చదువుతున్నారు. వీరంతా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తుంటారు. వీరంతా రోజూ వెళ్లి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఇక్కడి పాఠశాలను టైప్-4(కేజీబీవీ) తరహాలో అభివృద్ధి చేసి వసతి గృహం నిర్మించాలని 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికోసం రూ.1.94 కోట్లతో వసతి గృహ నిర్మాణం ప్రారంభించింది.

నిర్మాణం పూర్తి చేసుకున్న బాలికల వసతి గృహం

వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో:

ఫోకస్

2019లో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ వసతి గృహం వంక కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. 2024లో మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ఊపందుకున్నాయి. ఆరు నెలల క్రితమే వసతి గృహం నిర్మాణాన్ని పూర్తి చేశారు. 2025 జూన్‌లో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ మేరకు వసతి గృహంలో ఉండేందుకు విద్యార్థినులను కూడా ఎంపిక చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 50 మందిని, మిగిలినవారిని మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలికలను ఎంపిక చేశారు. అవసరమైన వంట పాత్రలు, రుబ్బు మిషన్లు, సుమారు 100 బియ్యం బస్తాలు సమకూర్చారు. అదేవిధంగా వార్డెన్, కుక్, సహాయ కుక్, ట్యూటర్ వాచ్‌మెన్లను నియమించారు. అయినప్పటికీ వసతి గృహాన్ని మాత్రం ప్రారంభించలేదు. ఇక్కడ ఉంచిన పురుగులు పట్టే అవకాశం ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వీటితో మంజూరు చేసిన అనేక వసతి భవనాలు ఇప్పటికే ప్రారంభించారు. అధికారులు, నేతలు వెంటనే స్పందించి వసతి గృహాన్ని ప్రారంభించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భవనంలో ఉంచిన బియ్యం బస్తాలు

ఆసుపత్రుల అభివృద్ధికి రూ.6.18 కోట్లు మంజూరు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాల పరిధిలోని 21 ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.6.11 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కార్యాలయం అధికారులు తెలిపారు. పరవాడ మండలంలోని ఎనిమిది ఆరోగ్య కేంద్రాలు, సబ్బవరం మండలంలో 13 ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గతంలో మంత్రిని ఎమ్మెల్యే కోరినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ ఇటీవల లేఖ ద్వారా సమాచారం తెలియజేసినట్లు వివరించారు. ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత విస్తరించడంతో పాటు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నిధులతో ఆసుపత్రి భవనాల నిర్మాణంతో పాటు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, పబ్లిక్ హెల్త్ యూనిట్లను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

హెచ్చరికలు బేఖాతరు..!

వేపగుంట, న్యూస్‌టుడే: ఎవరెన్ని హెచ్చరికలు చేసినా మా సరదాలు మావే అంటున్నారు కొందరు యువకులు. ఆ సరదా కోసం ప్రమాదమని సెలవు దినాల్లో యువకులు మేహాద్రి రిజర్వాయరులో స్నానాలకు దిగుతున్నారు. కొంతమంది మద్యం సేవించి స్నానాలకు దిగడంతో మరణాలు సంభవిస్తున్నాయని రిజర్వాయర్ సిబ్బంది అంటున్నారు. పోలీసులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేహాద్రి రిజర్వాయరులో హెచ్చరిక బోర్డు పక్కనే స్నానాలు చేస్తున్న యువకులు



భీమిలి

సి ని మా లు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేష్- **రివాల్వర్ రీటా**
రాములమ్మ- **జనతా బార్**
తాతా- **రాజు వెడ్స్ రాంబాయి**
సప్తగిరి- **ఆంధ్ర కింగ్ తాలూకా**

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి మండలంలో ఆదివారం నిర్వహించిన ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. భీమిలి పండిట్ నెహ్రూ మున్సిపల్ హైస్కూలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిట్టివలస బాలుర జెడ్పీ హైస్కూల్ కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. 573 మందికి 549 మంది పరీక్షలకు హాజరయ్యారని భీమిలి మండల ఎం.ఇ.ఓలు ఎం.శివరాణి, ఎ.జయప్రద పేర్కొన్నారు.

సోమన్నపాలెంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: భీమిలి బీచ్ రోడ్డు నాలుగో వార్డు సోమన్నపాలెంలో విశాఖ గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) శిబిరాన్ని ఆదివారం ప్రారంభించింది. ప్రిన్సిపల్ ఎ.బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో మొదటి రోజు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తాగునీరు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య వంటి అంశాలపై సర్వే చేపట్టారు. ఇందుకు రోజుకో కార్యక్రమాన్ని చేపడతామని ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారి వంశీ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.రాజేంద్రప్రసాద్, ఎన్.ఎల్లాజీ, సి.హెచ్.రాఘవ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: జోన్-2 మిథిలాపురి వుడాకాలనీ ఖుషి షాపింగ్‌మాల్ ప్రాంతంలో విద్యుత్తు తీగలు నివాస సముదాయాలు, చెట్ల కొమ్మలను తగిలి తరచూ నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయి. – **మధు**
✓: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – **హేమ** (విద్యుత్తు ఏఈ, పీఎంపాలెం)

?: ఎనిమిదో వార్డు వైఎల్పీ లేఅవుట్‌లోని జీవీఎంసీ బృందావనమ్ ఫామ్ గార్డెన్ పార్కు దరి రహదారి పక్కన వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. – **రమణరాజు**
✓: చెత్త తొలగించి శుభ్రత చర్యలు చేపడతాం. – **రవి** (వార్డు శానిటరీ అధికారి).

?: రెండు నెలలుగా కాలనీలో జీవీఎంసీ కుళాయిలు రాక, ట్యాంకర్లతో సరఫరా చేయక మధురవాడ దరి నగరంపాలెం రోడ్డులో వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని ఆదిత్యనగర్ మూడో వీధిలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. – **కాలనీవాసి**
✓: రోడ్డు వెడల్పు సమస్య కారణంగా తాగునీటి సరఫరా ఇబ్బందిగా ఉంది. ట్యాంకర్లతో నీటిని పంపిస్తాం. – **శ్రీనివాస్**(నీటి సరఫరా విభాగం, ఏఈ).

?: ఎండాడ పెట్రోల్ బంకు నుంచి ట్యాంక్ బండ్ వరకు సేవా మార్గం అభివృద్ధి చేయక పోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – **జి.రాజేంద్రకుమార్, ఎండాడ**
✓: రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. – **శ్రీనివాస్** (వార్డు ఇంజినీరింగ్, డీఈ).

స్పందనకు వందనం

ఎట్టకేలకు దీపాలకు వెలుగులు

ఎండాడ, న్యూస్‌టుడే: ఆరోవార్డు శిల్పారామం దరి సాయిప్రియా గార్డెన్స్‌లో వీధి దీపాల సమస్యకు పరిష్కారం లభించింది. ఇక్కడ పలు వీధుల్లో కొద్ది రోజులుగా దీపాలు వెలగకపోవడంతో ఇటీవల 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' లో వార్త ప్రచురితమైంది. స్పందించిన జీవీఎంసీ వీధిదీపాల విభాగం అధికారులు సమస్యను పరిష్కరించారు.

మురుగునీటి సమస్యకు మోక్షం

భీమునిపట్నం, న్యూస్‌టుడే

భీమిలిలో పూడుకుపోయిన భూగర్భ డ్రైనేజీ స్థానంలో ప్రత్యామ్నాయంగా కొత్త కాలువ నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. దీని స్థానే కొత్త కాలువ నిర్మాణానికి జీవీఎంసీ రూ.14 లక్షలను మంజూరు చేసింది. ఫలితంగా రోడ్డు మీదకు వస్తున్న మురుగునీటి ప్రవాహంతో నెలకొన్న దుర్గంధానికి శాశ్వత పరిష్కారం లభించనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువ నిర్మాణ దృశ్యం

✦ భీమిలిలో మురుగు కాలువల ద్వారా వచ్చే నీరు నేరుగా ఉప్పుటేరులోకి పోయేందుకు ఆంగ్లేయులు వందేళ్ల క్రితం నాలుగు చోట్ల భూగర్భ డ్రైనేజీని నిర్మించారు. ఇందులో గౌడవీధి నుంచి పెట్రోల్ బంక్ రోడ్డు మీదుగా ఉప్పుటేరుకు అనుసంధానమయ్యే డ్రైనేజీ నాలుగు నెలల క్రితం పూడుకుపోయింది. దీంతో ఇక్కడ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అత్యంత లోతుగా నిర్మించిన భూగర్భ డ్రైనేజీ నుంచి మురుగునీరు బయటకు ఉబికి వస్తూ రోడ్డంతా బురదమయంగా మారుతోంది. దీంతో చుట్టు పక్కల నివాసితులు దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. అటుగా రాకపోకలు సాగించేవారు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ డ్రైనేజీ ఉన్న ప్రాంతంలో గడిచిన వందేళ్ల కాలంలో అనేక ఇళ్ల నిర్మాణాలు జరిగిపోయాయి. దీంతో పూడికలు ఎక్కడ చోటుచేసుకున్నాయనే విషయాన్ని విశాఖ నుంచి తీసుకొచ్చిన యూజీడీ సిబ్బంది సైతం ఆచూకీ తీయలేక చేతులెత్తేశారు. దీంతో మురుగునీటి దుర్గంధంతో స్థానికులు సహజీవనం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ఓపెన్ కాలువ నిర్మాణానికి చర్యలు..: భూగర్భ కాలువకు మరమ్మతులు చేసే అవకాశం లేకపోవడంతో సమస్య తీవ్రతను తెలియజేస్తూ స్థానికులు భీమిలి జోనల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో పలుమార్లు వినతిపత్రాలను సమర్పించారు. దీంతో బయటకు వస్తున్న మురుగునీటిని ఇతరత్రా మళ్లించేందుకు జీవీఎంసీ అధికారులు నిధులు మంజూరు చేసి ఓపెన్ కాలువను నిర్మిస్తున్నారు.

దీనిపై భీమిలి జెడ్పీ వి.అయ్యప్పనాయుడు మాట్లాడుతూ మురుగునీటి బెడదను తప్పించేందుకు కొత్త కాలువ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తిచేసి సమస్యను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఏడో వార్డు పరిధి డాక్‌యార్డు కాలనీలోని భవానీపీఠం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తులు, ఘటాల ఊరేగింపు మేళతాళాలతో వేడుకగా నిర్వహించారు. గురు భవానీలు దమ్ము రాజు, నామాల భవాని, దమ్ము వాసుల ఆధ్వర్యంలో డాక్‌యార్డు కాలనీతో పాటు సమీప కాలనీల మీదుగా మధురవాడ మార్కెట్ వరకు ఈ ఉత్సవం సాగింది. సుమారు 200 మంది భవానీ దీక్షాధారులు వివిధ వేషధారణల్లో ఊరేగింపులో పాల్గొని జై భవానీ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కాలనీలో పీఠం వద్ద దీక్షాధారులు అగ్నిగుండం తొక్కి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా గురుభవానీల నేతృత్వంలో ప్రసాద వితరణ చేశారు.

మధురవాడ డాక్‌యార్డు కాలనీలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భవానీ భక్తులు

అలరించిన నృత్య ప్రదర్శనలు

మధురవాడ, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయిలో పిల్లలకు విద్యతో పాటు క్రీడలు, సంప్రదాయ కళల పట్ల ఆసక్తిని పెంపొందించి వారిలో ప్రతిభను ప్రోత్సహించాలని సింబయాసిస్ టెక్నాలజీ వ్యవస్థాపకులు, సీఈఓ ఒ.నరేష్‌కుమార్ అన్నారు. మధురవాడలోని బాలాజీ హైఫీల్డ్స్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విభిన్న సంస్కృతులు మేళవించేలా సంప్రదాయ నృత్యాలు, సైనికుల త్యాగాలను గుర్తు చేస్తూ దేశభక్తి గేయాలు, నాటికలతో అలరించారు. అనంతరం పోటీల విజేతలకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. పాఠశాల డైరెక్టర్ మండవ రవికుమార్, డైరెక్టర్ ఎం.ప్రణీత్, జనరల్ మేనేజర్ జక్కి అహ్మద్‌ఖాన్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

భీమిలి డైట్‌కు రూ.13.65 కోట్లతో ఆధునిక భవనాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కార్యాలయానికి రూ.13.65 కోట్లతో సరికొత్త భవన సముదాయం నిర్మించనున్నారు. డైట్ ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి కొత్త భవనాలకు భూమి పూజలతో పాటు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ భవనాలను ఇంజినీరింగ్ అధికారులు నాణ్యతతో నిర్మించి ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇందులో భాగంగా ఛాత్రోపాధ్యాయులకు హాస్టల్ భవనాలతో పాటు అకడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, ఆడిటోరియంలను నిర్మిస్తామని సమగ్ర శిక్షా పథకం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వి.చిరంజీవిరావు, జి.శ్రీనివాసులునాయుడు, ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో ప్రేమకుమార్, సమగ్ర శిక్షా పథకం ఏపీసీ జె.చంద్రశేఖర్, డైట్ ప్రధానాచార్యులు ఎల్.సుధాకర్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా తదితరులు

సందడిగా వనసమారాధన

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం(జాతర)లో ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం జర్నలిస్ట్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఆదివారం జర్నలిస్టుల వనసమారాధన సందడిగా జరిగింది. ముఖ్య అతిథిగా నార్త్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎస్.అప్పలరాజు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు వినోద, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం ఏసీపీతో పాటు జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఎన్ఐఎస్ఎఫ్ సీఈఓ సునీల్ మహంతి, తెదేపా నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకట్రావు తదితరులు విజేతలకు బహుమతులు అందించారు.

'రైల్వే కార్మికులు సహకరించాలి'

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ కేంద్రంగా ఏర్పడనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల నిర్వహణకు రైల్వే ఉద్యోగులు, కార్మికులు సహకరించాలని వాల్తేర్ డీఆర్‌యూసీసీ సభ్యులు చలసాని గాంధీ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఆరోవార్డు రామా ఆలయం దరి జీవీఎంసీ కల్యాణ మండపంలో చిన్న జియర్ స్వామి మంగళశాసనాలతో వికాసతరంగిణి మహిళా ఆరోగ్య వికాస్, శ్రీ శ్రీనివాస చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆర్‌హెచ్ కాలనీ, హౌసింగ్‌బోర్డు, లక్ష్మీనిపాలెం, ముస్లింకాలనీ, గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలకు ప్రముఖ వైద్యుల సమక్షంలో పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు జి.హేమసుధ, నిర్వాహకులతో పాటు వార్డు తెదేపా అధ్యక్షుడు గరే గురునాథ్, శ్రీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, పోతిన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రావెల్ లారీల అడ్డగింత

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం సమీపంలోని ఒక క్వారీ నుంచి తగరపువలస వద్ద నున్న ఒక ప్రైవేటు లేఅవుట్‌కు గ్రావెల్ తరలిస్తున్న లారీలను పద్మనాభం కూడలిలో స్థానికులు ఆదివారం రాత్రి అడ్డుకున్నారు. పరిమితికి మించి గ్రావెల్ లోడ్ చేయడంతో రోడ్డుపై రాళ్లు పడుతున్నాయని, దీంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు అదుపు తప్పుతున్నాయని వాపోతూ నిలదీశారు. ఈ క్రమంలో లారీ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా క్వారీ నుంచి భారీ లారీల ద్వారా ప్రైవేటు లేఅవుట్‌కు గ్రావెల్ రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో ట్రిప్పులు కలిసి రావాలన్న ఉద్దేశంతో రాత్రి పగలూ తేడా లేకుండా అతి వేగంగా వెళ్తున్నారు. దీంతో స్థానికులు, పాఠశాలల బస్సుల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పద్మనాభం, రేవిడి వంటి కూడళ్ల వద్ద అయినా వేగం తగ్గించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ గ్రావెల్ తరలింపు మొదలైన తర్వాత పద్మనాభం-తగరపువలస రోడ్డు పలుచోట్ల ఛిద్రమై గోతులు కూడా పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లారీలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న పద్మనాభం కూడలి వాసులు

హెచ్చరికల జారీ.. లేదిక బేజారు

సాగర్‌నగర్ తీరంలో హెచ్చరిక బోర్డు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: పర్యాటక రంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్న తరుణంలో రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌ల్లో సముద్ర ప్రమాదాల నివారణ దిశగా టూరిజం, పోలీసు అధికారులు ఇటీవల పలు రక్షణ చర్యలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయా తీరాల్లోకి వస్తున్న సందర్శకుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది సముద్రస్నానాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. చాలాకాలం క్రితం నాటి హెచ్చరిక ప్రచారమాధ్యమాల పరికరాలు మరమ్మతులకు గురై దాదాపు పనిచేయకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

✦ ఈ మేరకు మెరైన్ పోలీసులు, టూరిజం, జీవీఎంసీ లైఫ్‌గార్డులు విధులు నిర్వర్తిస్తున్న వాచ్ టవర్లు ప్రధాన కేంద్రాలుగా 12 మైక్ లౌడ్ స్పీకర్లు ప్రచార మాధ్యమాల్ని జనసంచార సదరు తీరప్రదేశాల్లోని స్తంభాలకు అమర్చారు. ఇచ్చట సముద్రం ఎంతో లోతైందని స్నానాలు చేస్తూ కెరటాల్లో కొట్టుకుపోయి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని తెలుగు, ఆంగ్లం, హిందీ తదితర భాషల్లో ఎప్పటికప్పుడు హెచ్చరికల జారీతో అప్రమత్తం చేసేలా ఈ ప్రక్రియ చేపట్టారు.

✦ గతంలో స్నానాలు చేస్తూ పలువురు యువత మృత్యువాత పడ్డ సదరు ప్రమాదకర లోతైన తీర ప్రదేశాల్లో ఆ బోర్డు ఎరుపు జెండాలు నెలకొల్పారు. సముద్ర ప్రమాదాలు జరగకుండా పోలీసులు, లైఫ్‌గార్డులు సమన్వయంతో విధులు నిర్వర్తించేలా ఈ చర్యలు చేపట్టామని అధికారులు పేర్కొన్నారు.

స్తంభానికి అమర్చిన మైక్

బుద్ధుడు, కస్తూర్బా గాంధీ విగ్రహాల ఆవిష్కరణ

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం.. రాష్ట్రంలో ఆదర్శ విద్యాలయంగా నిలుస్తుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పట్టుమనేని సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ఆయన సొంత నిధులతో విద్యాలయంలో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడు, కస్తూర్బా గాంధీ విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆడ పిల్లలు అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలవాలన్నారు. ఉన్నత స్థానాల్లో నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తెదేపా యువ నాయకుడు గంటా రవి తేజ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు విద్యాలయాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్జేడీ విజయ్‌బాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గంటా రవితేజ, చిత్రంలో సీపీ

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. భీమిలి పెట్రోల్ బంకుకు బర్రి సిద్ధు అనే వ్యక్తి ఈనెల 4న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్రవాహనం ఢీకొంది. సిద్ధు కుడికాలు విరగడంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

★ అలాగే సంగివలస సర్వీసు రోడ్డులో ఈనెల 5న నడిచి వెళ్తున్న తిరుపతిరావు అనే వ్యక్తిని వెనుక నుంచి బుల్లెట్‌ను డ్రైవ్ చేస్తున్న వ్యక్తి ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం తగిలిన తిరుపతిరావును స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా రుషికొండ బీచ్

రుషికొండ బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. మత్స్యరాశుల పార్కు, పోలీసు టవర్, బోటింగ్ కేంద్రం తదితర ఆహ్లాదకర ప్రదేశాల్లో వన భోజనాలు ఆచరించి ఉత్సాహంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ పోలీసులు, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు ప్రచారమాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు. - న్యూస్‌టుడే, సాగర్‌నగర్,

విష జీవులకు ఆవాసంగా బస్‌షెల్టర్

ఎండాడ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఎండాడ కూడలిలో మధురవాడ మార్గంలో ఉన్న బస్‌షెల్టర్ పిచ్చిమొక్కలు పెరిగి విష జంతువులకు ఆవాసంగా మారింది. కంబాలకొండ అభయారణ్యానికి చేరువగా ఉన్న బస్‌షెల్టర్ చాలా కాలంగా శిథిలావస్థకు చేరింది. దీంతో పక్కనే మరో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసిన డిపో అధికారులు పాత షెల్టర్‌ను కూల్చకుండా విడిచి పెట్టారు. దీంతో తీగజాతి మొక్కలు అల్లుకుని పాములు, తేళ్లు తదితర విషజంతువులు సంచరిస్తున్నాయి. రెండు రోజుల క్రితం అక్కడ బస్ కోసం నిలబడిని ప్రయాణికుల మధ్యకు పాము రావడంతో వారు భయంతో అటూ, ఇటూ పరుగులు తీశారు. ఈ నేపథ్యంలో బస్సుల కోసం వేచి ఉండాల్సిన ప్రయాణికులు భయాందోళనకు లోనవుతున్నారు. దీనిపై ఆర్టీసీ, జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి షెల్టర్‌ను కూల్చివేయాలని పలువురు కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న బస్‌షెల్టర్

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

స్వామి, అమ్మవార్లు

నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న నిత్య కల్యాణోత్సవం ఆదివారం సింహగిరిపై కనుల పండువగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరేరామ..హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి మహిమల్ని అభివర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీ నితాయిసేవిని పర్యవేక్షణలో అన్నసమారాధన చేపట్టారు.

అబ్బురపరిచిన స్కేటర్ల విన్యాసాలు

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు ఆదివారం వుడాపార్కు, శివాజీపార్కులో ఉత్సాహంగా సాగాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. స్పీడ్, రోలర్ హాకీ, స్కేటుబోర్డు పోటీల్లో క్రీడాకారుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. – విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే

స్కేట్‌బోర్డుపై క్రీడాకారుల విన్యాసాలు

డీఈవో చిట్టివలస జెడ్పీ పాఠశాల సందర్శన

తగరపువలస, న్యూస్‌టుడే: చిట్టివలస బాలుర జెడ్పీ హైస్కూలును డీఈవో ప్రేమకుమార్ ఆదివారం సందర్శించి అక్కడ జరుగుతున్న ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. ఇందు కోసం నిర్దేశించిన వంద రోజుల ప్రణాళికను సక్రమంగా వినియోగించుకుని శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమకుమార్

కరుణకుమారికి సత్కారం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: భారత అంధ మహిళల క్రికెట్ టీ-20 ప్రపంచకప్ సాధించడంలో కీలకపాత్ర వహించిన పి.కరుణకుమారిని ఏలూరు (జోన్-2) కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎ.రాణి ఆదివారం సత్కరించారు. గతంలో సాగర్‌నగర్ ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన రాణి ప్రస్తుతం ఉన్నతస్థానంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థినిగా ఆమె హాజరై కరుణకు సొంత నిధులు రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు.

✦ కరుణ క్రీడా ప్రతిభను ప్రశంసిస్తూ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ రూ.లక్ష, ప్రెసిడెంట్ ఆఫ్ ఏపీ (సీఏబీఐ) శరత్‌బాబు రూ.లక్ష, చింటల్స్ ఇండియా లిమిటెడ్ (ఢిల్లీ) ప్రతినిధులు రూ.లక్ష అందజేశారని ప్రిన్సిపల్ డి.విజయ పేర్కొన్నారు. ఈ మేరకు మొత్తం రూ.3 లక్షల చెక్కులు కరుణ బ్యాంక్ ఖాతాలో జమ చేశామన్నారు.

కరుణకుమారిని సత్కరిస్తున్న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ రాణి తదితరులు

ముగిసిన జాతీయ 'హ్యాకథాన్' పోటీలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాలలో సీఎస్ఈ, సీఎస్ఈ ఏఐ అండ్ ఎమ్ఎల్ విద్యార్థులు సంయుక్తంగా రెండు రోజుల పాటు జాతీయస్థాయిలో నిర్వహించిన 'హగ్‌వార్ట్స్ హ్యాకథాన్-24 గంటల కోడింగ్ మారథాన్' పోటీలు ఆదివారంతో ముగిశాయి. ప్రథమ స్థానంలో కొమ్మాది జీవీపీ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ ఏఐ అండ్ ఎమ్ఎల్ జట్టు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గీతం, అనిట్స్, రఘు, విజ్ఞాన్ మహిళా కళాశాల జట్లు నిలిచాయి. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.ఎస్.బోస్, కన్వీనర్ ప్రొఫెసర్ డి.సరిత, విభాగాధిపతులు ప్రొఫెసర్లు ఎన్వీ రమణమూర్తి, జీఆర్ఎస్ మూర్తి విజేత జట్లుకు నగదు ప్రోత్సాహకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. దేశాభివృద్ధికి దోహదపడే లక్ష్యంగా యువతలో వినూత్న ఆలోచనల్ని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ తరహా హ్యాకథాన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమస్థానం సాధించిన కొమ్మాది జీవీపీ కళాశాల విద్యార్థులకు ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బోస్

రెడ్డిపల్లిలో భగవద్గీత ప్రచారం

పద్మనాభం, న్యూస్‌టుడే: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం నిర్వహించారు. భగవద్గీత పఠనం ద్వారా సంపూర్ణ జ్ఞానం తెలుసుకోవచ్చునని, ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టతను తెలుసుకోవాలని ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు కె.త్రినాథరావు, కె.సురేష్, జి.సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

వైద్యానికి నగదు సహాయం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలికి చెందిన ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫాబ్) ఆధ్వర్యంలో మృతి చెందిన తమ స్నేహితుడు తల్లి లక్ష్మి వైద్యం కోసం రూ.15 వేల నగదును అందించారు. ఫాబ్‌లో సభ్యుడైన పలుకూరి శ్రీనివాసరావు (క్లబ్ శ్రీను) కొవిడ్‌తో మృతి చెందాడు. ఆయన తల్లి లక్ష్మికి ఇటీవల అనారోగ్యం కారణంగా వైద్యం చేయించుకోవాల్సి రావడంతో ఫాబ్ సహాయాన్ని కోరారు. సంస్థ ప్రతినిధులు కాళ్ల సన్నీ, ముసునూరి సూర్య శ్రీనివాస్ స్పందించి ఫాబ్ తరఫున వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష్మి కుమార్తె రాజ్యలక్ష్మికి రూ.15 వేలు నగదు అందించారు.

శ్రీనివాసరావు కుటుంబీకులకు నగదు సహాయం అందిస్తున్న ఫాబ్ ప్రతినిధులు

ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: యువత ఆధ్యాత్మిక భావం అలవర్చుకుని చక్కటి నడవడిక, క్రమశిక్షణ ద్వారా చదువులో రాణించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని అక్షయపాత్ర స్వామీజీ జితామిత్ర దాస్ పేర్కొన్నారు. రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ (జీవీపీ) కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఆదివారం పెద రుషికొండలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామీజీ మాట్లాడారు. సమాజాభివృద్ధికి దోహదపడేలా మానవతా విలువలు, నిత్యజీవితంలో విద్యార్థులు పాటించాల్సిన విధానాల్ని వివరించారు. దీనిలో భాగంగా ఎన్ఎస్ఎస్ విభాగాధికారి డాక్టర్ జి.లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో వాలంటీర్లు ఇంటింటి సర్వే చేపట్టి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని నమోదు చేసుకున్నారు.

స్వామీజీని సత్కరిస్తున్న విద్యార్థులు

(c) eenadu

విశాఖ తూర్పు

14న హిందూ సమ్మేళన కార్యక్రమాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : హిందూ సమాజాన్ని చైతన్యం చేసేందుకు హిందూ సమ్మేళనం పేరిట 14న మద్దిలపాలెం కృష్ణా కళాశాల సమీపంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు అచ్చి రమేష్‌రెడ్డి, రామకృష్ణ తెలిపారు. ఆదివారం మద్దిలపాలెంలో కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: విశాలాక్షినగర్ ఎస్సీ ఎస్టీ కాలనీలో రోజు విడిచి రోజు కుళాయిలు ఇస్తున్నారు. ధార చాలా తక్కువగా వస్తోంది. – స్థానికులు ✓: పరిశీలించి సమస్య లేకుండా చూస్తాం. – శ్రీనివాస్, ఏఈ

?: పదోవార్డు పరిధిలోని ఆదర్శనగర్ కొండవాలులో దోమలు బెడద తీవ్రంగా ఉంది. – వీఎన్ మూర్తి, ఆదర్శనగర్ ✓: దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. – మంగరాజు, మలేరియా అధికారి

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్, శివాజీనగర్‌లో కొన్ని వీధి దీపాలు రెండు వారాలుగా వెలగటం లేదు. – సంతోష్, శ్రీకాంత్‌నగర్ ✓: సిబ్బందిని పంపించి వెలగని దీపాలు స్థానే కొత్తవి మారుస్తాం. – ఎం.రామకృష్ణ, వీధి దీపాల పర్యవేక్షకులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 22వ వార్డు ఆరు కుళాయిల వీధిలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ఇటీవల నిర్మించిన కల్వర్టుల వద్ద లోతట్టు ప్రాంతంలో నీరు నిలిచిపోతుంది. రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. – జయరాం, శివాజీపాలెం ✓: తక్షణమే సిబ్బందిని పంపి, సమస్య పరిష్కరిస్తాం. – సుజాత, పబ్లిక్ వర్క్స్ విభాగం, ఏఈ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: చినవాల్తేరు రజకవీధిలో చెత్త పేరుకుపోయింది. దోమలు, ఈగలు వృద్ధిచెందుతున్నాయి. పరిసరాలు దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణం తొలగించాలి. – రమేష్, స్థానికుడు ✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి చెత్త తొలగిస్తాం. – ప్రకాశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 15వ వార్డు ఎంవీపీ కాలనీలోని ముగదు కాలువల్లో వ్యర్థాలు తొలగించలేదని 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ కిషోర్ స్పందించారు. తమ సిబ్బందిచే శుభ్రత పనులు చేయించారు.

అవీ ఇవీ

■ **ఏడుగురు జూదరుల అరెస్టు**

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : బహిరంగ ప్రదేశంలో కొందరు జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు చేశారు. ఆరిలోవ గణేష్‌నగర్ ప్రాంతంలో సి.ఐ. భాస్కరరావు, ఎస్.ఐ. హరీష్, సిబ్బంది కలిసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.48 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు ఆరుగురిని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. ★ ఆనందపురం పోలీసు స్టేషన్ పరిధిలో బహిరంగంగా జూదమాడుతుండగా.. ఏడుగురిని అరెస్టు చేశారు. రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆనందపురం పోలీసులకు నగదుతో పాటు ఏడుగురు వ్యక్తులను అప్పగించారు.

■ **గిరిజన ప్రాంతాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు**

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : విశాఖపట్నం, అరకు వై.ఎం.సి.ఎ. సంయుక్తంగా వైద్యశిబిరాలు నిర్వహించినట్లు వై.ఎం.సి.ఎ. ఉపాధ్యక్షులు డైసి బాబు తెలిపారు. బీచ్‌రోడ్డు వై.ఎం.సి.ఎ.లో ఆదివారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనంతగిరి మండలం వలసి గ్రామంలో జనరల్, దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డాక్టర్ ఆనందమోహన్, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ విన్ను రమాలి, డాక్టర్ ప్రజ్ఞ, స్టాఫ్‌నర్స్ సుకన్య పాల్గొన్నారు.

■ **'రైల్వే కార్మికులు సహకరించాలి'**

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ కేంద్రంగా ఏర్పడనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల నిర్వహణకు రైల్వే ఉద్యోగులు, కార్మికులు సహకరించాలని వాల్తేర్ డీఆర్‌యూసీసీ సభ్యులు చలసాని గాంధీ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కొత్త జోన్‌లోని వివిధ విభాగాల్లో పని చేసేందుకు దాదాపు 1100 మంది అవసరం ఉంటుందన్నారు.

■ **సభ్యుల ఐక్యతతో సంఘాలు బలోపేతం**

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : శివాజీపార్కులో ఆదివారం శ్రీ కృష్ణసేవా సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభ్యుల ఐక్యతతో సంఘాలు బలోపేతం అవుతాయని, అందరూ కలిసి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్, తదితరులు

ఆదర్శనగర్ రహదారికి మోక్షమెప్పుడో..?

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

పదోవార్డు పరిధిలోని రవీంద్రనగర్ నుంచి గ్రామీణ తహసీల్దారు కార్యాలయం వరకు అటవీశాఖ స్థలంలో నిర్మించ తలపెట్టిన రహదారి మూడడుగులు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందాన తయారైంది. జిల్లా, రాష్ట్ర అటవీ శాఖ అనుమతులు పొందినా కేంద్ర స్థాయి అటవీ శాఖ అనుమతుల కోసం నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. దీంతో ఎక్కడి పనులు అక్కడే అన్నట్లుగా మారింది.

రవీంద్రనగర్ కొండ చివరి భాగంలో రాళ్లు తేలిన రహదారి

■ **రూ.ఆరు కోట్లతో ప్రతిపాదనలు..:** పదేళ్ల క్రితం రవీంద్రనగర్ నుంచి పాతడెయిరీఫారం కూడలి వరకు ఇరుకు రహదారిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రవీంద్రనగర్ నుంచి గ్రామీణ తహసీల్దార్ కూడలికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో మూడు కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించగా అటవీశాఖ నిబంధనలతో పనులు ఆగిపోయాయి. నాటి నుంచి సమస్య మరింత జటిలం అవుతున్నా ప్రతిపాదన మాత్రం అలాగే ఉండిపోయింది. రూ.25 లక్షలతో పనులు ప్రారంభించగా తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవటంతో వేసిన కంకరపోయి మట్టి దర్శనమిస్తోంది. అంచనా వ్యయం ఆరు కోట్ల రూపాయలకు చేర్చి ప్రతిపాదనలు పంపించినా పనులు మాత్రం ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

■ **ప్రత్యామ్నాయ స్థలం చూపినా..:** రవీంద్రనగర్ నుంచి గ్రామీణ తహసీల్దారు కూడలి వరకు కంబాల కొండ అభయారణ్య స్థలంలో రహదారి నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. ఇందుకు అటవీశాఖ కోల్పోతున్న నాలుగు ఎకరాల స్థలానికి కేంద్ర కారాగారం ఎదురుగా కంబాలకొండకు ఆనుకుని ఉన్న జీవీఎంసీ ఆరు ఎకరాల స్థలం చూపించారు. దీనికి రాష్ట్ర అటవీ శాఖ ఆమోదం తెలిపింది. రవీంద్రనగర్ నుంచి గ్రామీణ తహసీల్దారు కూడలి వరకు వన్యప్రాణులు నివాసప్రాంతాలకు రాకుండా కాంటూరు కందకం, రక్షణ కవచం నిర్మించాలని కేంద్ర అటవీశాఖ నిబంధన విధించింది. దానికి అంగీకారం తెలిపినా నిధులు విడుదల ఆలస్యం కారణంగా రహదారి నిర్మాణం ముందుకు కదలడం లేదు.

■ **త్వరలోనే రహదారికి మోక్షం..:** రహదారి నిర్మాణానికి నిధుల విడుదలకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. ఇందుకు అన్ని ప్రయత్నాలు జరిగాయి. నిధులు విడుదల కాగానే వన్యప్రాణుల రక్షణకు తీసుకునే చర్యలు వివరించి పనులు ప్రారంభించి దశాబ్దాల కల నెరవేరుస్తాం. – వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే

శ్రమదానం చేసిన సంఘం సభ్యులు

శుభ్రతకు చేయి చేయి కలిపి..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పెదవాల్తేరు గ్రామ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సంఘ సభ్యులు పెదవాల్తేరు శ్మశానంలో తుప్పలు, ముళ్లపొదలు తొలగించారు. సుమారు 2 గంటల పాటు శ్రమదానం చేశారు. గ్రామ సేవాసంఘం అధ్యక్షులు బి.టి.రెడ్డి, సభ్యులు శ్రీనివాసరెడ్డి, పోతన్నరెడ్డి, నీలారెడ్డి, రామిరెడ్డి, ఎన్.పోలిరెడ్డి, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కైలాసగిరి.. పర్యాటకుల సిరి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కార్తిక మాసం ముగిసినా కైలాసగిరికి పర్యాటక శోభ తగ్గటం లేదు. మధ్యాహ్నం నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో పాల్గొని వనభోజనాలతో సందడి చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన గాజువంతెనకు సందర్శకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం సుమారు 1100 మంది పర్యాటకులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. గాజువంతెనను త్రివర్ణ ఆకారంలో విద్యుత్ అలంకరణ చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రోడ్డు మార్గంలో కన్నా రోప్‌వే ద్వారా అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. శివపార్వతులు, వ్యూపాయింట్ల వద్ద అధికసంఖ్యలో సందర్శకులు సందడి చేశారు.

వనభోజనం చేస్తున్న సందర్శకులు

ముగిసిన జాతీయ 'హ్యాకథాన్' పోటీలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాలలో సీఎస్‌ఈ, సీఎస్‌ఈ ఏఐ అండ్ ఎమ్ఎల్ విద్యార్థులు సంయుక్తంగా రెండు రోజుల పాటు జాతీయస్థాయిలో నిర్వహించిన 'హాగ్‌వార్ట్స్ హ్యాకథాన్-24 గంటల కోడింగ్ మారథాన్' పోటీలు ఆదివారంతో ముగిశాయి. ప్రథమ స్థానంలో కొమ్మాది జీవీపీ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌ఈ ఏఐ అండ్ ఎమ్ఎల్ జట్టు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గీతం, అనిట్స్, రఘు, విజ్ఞాన్ మహిళా కళాశాల జట్లు నిలిచాయి. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.ఎస్.బోస్, కన్వీనర్ ప్రొఫెసర్ డి.సరిత, విభాగాధిపతులు ప్రొఫెసర్లు ఎన్వీ రమణమూర్తి, జీఆర్ఎస్ మూర్తి విజేత జట్లుకు నగదు ప్రోత్సాహకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. దేశాభివృద్ధికి దోహదపడే లక్ష్యంగా యువతలో వినూత్న ఆలోచనల్ని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ తరహా హ్యాకథాన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల నుంచి సింహాచలం వరకు పాదయాత్ర

మొక్కు తీర్చుకున్న తెదేపా నాయకురాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే, ద్వారకాతిరుమల నుంచి సింహాచలం వరకు కాలినడకన వస్తానని ద్వారకా తిరుమల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.లక్ష్మీరమణి మొక్కుకున్నారు. ఈ మేరకు ఆమె నవంబరు 25న ఉదయం ద్వారకాతిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పాదయాత్ర ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం ఎంవీపీకాలనీకి చేరుకోవడంతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఘనస్వాగతం పలికి, అభినందనలు తెలిపారు. ఆమెతో పాటు కుమారుడు సంజీవ్‌చౌదరి కాలినడకన విశాఖ చేరుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పోతన్నరెడ్డి, బాపిరాజు, సత్యనారాయణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరమణి, సంజీవ్‌చౌదరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

హోమియో వైద్యమే మేలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : దీర్ఘకాలిక గుండె జబ్బుల్ని నయం చేసేందుకు హోమియో వైద్యం దోహదపడుతుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ విశాఖ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి.రాఘవేంద్రరావు అన్నారు. ఆదివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హోమియో వైద్యుల కార్యనిర్వాహక కార్యక్రమాలపై మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు బీఎస్. వెంకటేశ్వరరావు, వి.సునీత, సీతల్‌మదన్, జి.రాజేంద్రప్రసాద్, ఎం.చంద్రశేఖర్, కె.రాధిక తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రాఘవేంద్రరావు

బీచ్‌రోడ్డులో స్పిరిట్ రన్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : అంతర్జాతీయ వాలంటీర్స్ డే పురస్కరించుకొని ఆదివారం బీచ్‌రోడ్డులో వాలంటీర్ స్పిరిట్ రన్ నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి, యూత్ ఆఫ్ భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరుగు జరిగింది. ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం వద్ద ఈ పరుగు ప్రారంభమైంది. ఈ సందర్భంగా భాజపా పూర్వ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా స్ఫూర్తితో స్వచ్ఛంద సేవా చేయాలన్నారు. ఈ రన్‌లో పురుషుల విభాగంలో వేదవ్యాస్ మొదటి, వి.రమేష్ రెండో, వి.కిరణ్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో కె.జీవన తన్య మొదటి, స్వాతిరతన్ రెండో, సి.నిర్మల మూడో స్థానంలో నిలిచారు. యూత్ ఆఫ్ భారత్ వ్యవస్థాపకులు చందన్ మచ్చా, జంపన రంగరాజు పాల్గొన్నారు.

పరుగులో పాల్గొన్న నగరవాసులు

5కె రన్‌లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

అబ్బురపరిచిన స్కేటర్ల విన్యాసాలు

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు ఆదివారం వుడాపార్కు, శివాజీపార్కులో ఉత్సాహంగా సాగాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. స్పీడ్, రోలర్ హాకీ, స్కేటుబోర్డు పోటీల్లో క్రీడాకారుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. – విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే

స్కేట్‌బోర్డుపై క్రీడాకారుల విన్యాసాలు

అలరించిన సినీసంగీత విభావరి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు ఎంజీఎం పార్కులో ఆదివారం రాత్రి గాయకుడు కార్తిక్ సంగీత విభావరి యువతను ఉర్రూతలూగించింది. పెద్దసంఖ్యలో యువత కార్యక్రమానికి హాజరయ్యారు. కొన్ని పాటలకు అతనితో గొంతు కలిపారు.

కార్యక్రమానికి హాజరైన జనాలు

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

పూర్ణమార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే : రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. 'మసీద్ ఏ ఫుర్‌కాన్' విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పూర్ణమార్కెట్ ప్రధాన రహదారిపై 'ఒక్కరోజు ఇస్లాం' సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దక్షిణంలో కూటమి గెలుపునకు సహకరించిన అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో దక్షిణం తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

లెజెండ్స్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

టీషర్ట్స్‌తో ఫుట్‌బాల్ క్రీడాకారులు, అతిథులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : లెజెండ్స్ లీగ్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం విశాఖ వేలీ పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. అండర్-14 విభాగంలో ఆరు జట్లు పోటీ పడుతున్నాయి. ఏపీ, జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ప్రతి ఆదివారం పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో విశాఖ జోన్ కన్వీనర్ సుస్మిత, నిర్వాహకులు రాజారావు, ఎస్.జి.రామకృష్ణ, బాబు, సన్నీ, సతీష్, శ్రీను, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు ఆదివారం పోర్టు స్టేడియంలో జరిగాయి. విజేతలు ఈనెల 24 నుంచి పెద్దాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లాస్థాయి విజేతలకు విశాఖపట్నం అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షుడు పవన్‌కార్తీక్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, క్రీడాకారుడు ఎంవీ.మాణిక్యాలు, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎ.నారాయణరావు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఆరిలోవ, న్యూస్‌టుడే: 11వ వార్డు పరిధి ఆరిలోవ ముస్తఫా కాలనీలో ఆదివారం ఎస్‌కేడీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. ముస్తఫాకాలనీ, ప్రశాంత్‌నగర్, టీఐసీ పాయింట్ పరిసర ప్రాంతాలు నుంచి సుమారు 283 మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారని నిర్వాహకులు కాకి గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ఒ.అప్పలరాజు జి.సత్యం, ఎం రాజారావు ఆర్ అచ్యుతరావు, కె.గంగరాజు పాల్గొని పర్యవేక్షించారు. వైద్యులు కిరణ్‌చంద్, హర్షిత, కె.రాహుల్, వైద్య సిబ్బంది పరీక్షలు జరిపారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

వేడుకలో పండితులు, ఈఓ శోభారాణి, ఈఈ రమణ తదితరులు

వేద పండితులకు ఘన సత్కారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగిన వేద, అర్చక పండిత సభ ఆకట్టుకుంది. రాష్ట్రంలోని వివిధ ఆలయాల నుంచి వచ్చిన వేదపండితులు, అర్చకులు వేదమంత్రాలు పఠించారు. అనంతరం వేద, అర్చక పండితులను ఆలయ ఈఓ కె.శోభారాణి, ఈఈ సీహెచ్.వి.రమణ, ఏఈఓ ఆనంద్‌కుమార్, ఇతర అధికారులు సత్కరించారు. ఆలయ పండితులు భీమశంకరశాస్త్రి, వెంకటేశ్వర శర్మ, పంచముఖిశర్మ, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

27 మంది యాచకులకు ఆశ్రయం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న యాచకులను పోలీసులు చేరదీసి, జీవీఎంసీ భీమ్‌నగర్ ఆశ్రమంలో చేర్పించారు. ఆదివారం మేరీమాత చర్చి, పాతపోస్టాఫీసు, కాన్వెంట్‌కూడలి, జ్ఞానాపురం, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఉన్న 27 మంది యాచకులను గుర్తించారు. కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్, ఎస్ఐ ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల్లో భిక్షాటన చేస్తున్న వారిని తీసుకెళ్తున్న పోలీసులు

ముడసర్లోవ పార్కులో వనభోజనాల సందడి

ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవ పార్కులో కాపుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఉత్తరాంధ్ర కాపు నాయకులు పాల్గొని కాపుల ఐక్యత ఆవశ్యకత గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యన్నారాయణ, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ చిరంజీవిరావు (ఎమ్మెల్సీ), వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ యశస్విని, కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ పంచకర్ల సందీప్, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, జనసేన కార్పొరేటర్ పి.ఉషశ్రీ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, తెదేపా నాయకులు ఏడువాక సన్యాసిరావు, కాపు యువసేన ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం సామూహిక వన భోజనాలు జరిగాయి. వివిధ సంఘాలకు చెందిన సభ్యులు వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు అయిదువేల మంది సందర్శకులు వచ్చారని ఉద్యానవనం నిర్వాహకులు తెలిపారు.

కాపుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

పొంచిఉన్న ప్రమాదం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే

పెదవాల్తేరు చేపలబజారు వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే కొంత మంది ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేపల విక్రయాలు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు పట్టించుకొని కంచె ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు కోరారు.

చేపలబజారు ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్

పూర్వ విద్యార్థుల సహకారంతో ముందడుగు

జ్యోతి వెలిగిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల డాక్టర్ వైవీఎస్.మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఏయూ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థుల సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం, ఆత్మీయ సమ్మేళనంలో వీసీ పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు ఐవీఎన్ఎస్‌కే.విశ్వనాథరావు మాట్లాడుతూ.. శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తమ సహకారం ఉంటుందన్నారు. వసతి గృహం భవన నిర్మాణానికి సాయం అందిస్తామన్నారు. కార్యదర్శి ఆచార్య జి.రాంబాబు, కోశాధికారి బి.భాస్కరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏయూ పూర్వ విద్యార్థి, లాన్‌సమ్స్ ప్రాజెక్ట్స్ ఛైర్మన్ కె.ఉమేష్ చంద్ర, సంఘం వ్యవస్థాపకులు వి.వి.రావు, ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.పద్మశ్రీ, ఆచార్య మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పూర్వ విద్యార్థులే ప్రచారకర్తలని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. ఏయూ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, టెక్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో 1975వ సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఏయూ భౌతిక శాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగింది.

1975నాటి పూర్వ విద్యార్థులతో వీసీ ఆచార్య రాజశేఖర్

ప్రతిభ చూపిన వారితో నిర్వాహకులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. !

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : క్వీన్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జూనియర్ మోడల్ సీజన్-6 మెగా ఫైనల్ ఫ్యాషన్ షో పోటీలు ఆదివారం సాయంత్రం మద్దిలపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. బాలల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకురాలు ఉషారాణి తెలిపారు. అనంతరం చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆర్.వి.వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'సమస్య పరిష్కారంలో కేంద్రమంత్రి విఫలం'

విశాఖపట్నం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : విమాన ప్రయాణికులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు బహిరంగ క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖలోని మద్దిలపాలెం వైకాపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. ఫ్లైట్ డ్యూటీ టైం లిమిటేషన్స్ (ఎఫ్.డి.టి.ఎల్) అమలులో తలెత్తిన ఇబ్బందుల్ని పరిష్కరించడంలో కేంద్రమంత్రి పూర్తిగా విఫలమయ్యారన్నారు. విమానాల సమస్యను మంత్రి లోకేశ్ పరిష్కరిస్తారంటూ తెదేపా అధికార ప్రతినిధులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రమంత్రి రీల్స్ చేయడం తప్పా, పరిష్కార మార్గాలను చూపడం లేదని విమర్శించారు.

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

ఆర్టీసీ ఆర్ఎం పాపాహోం సందర్శన

కార్యక్రమలో పాల్గొన్న ఆర్ఎం బి.అప్పలనాయుడు

గురుద్వార, న్యూస్‌టుడే: పాపాహోంలోని చిన్నారులు క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తూ, పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన పాపాహోంను సందర్శించి చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే తీసుకోవల్సిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఓ చిన్నారి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

న్యూస్‌టుడే, జగదాంబకూడలి : ?: జీవీఎంసీ 36వ వార్డు పంజాబ్‌కూడలి సమీప జీవీఎంసీ పాఠశాల ఎదురుగా ఉన్న చెత్తకుండీలో పేరుకుపోయిన వ్యర్థాలను తరలించకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. – రామబ్రహ్మం, స్థానికుడు ✓: పరిశీలించి శుభ్రత పనులు చేయిస్తాం. అలాగే చెత్తకుండీని మరో చోటుకు తరలించే అంశాన్ని పరిశీలిస్తాం. – అప్పలరాజు, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: గురుద్వారా నుంచి సత్యం కూడలికి వెళ్లే రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – రమణ ✓: సిబ్బందిని తరలించి చెత్తను తరలించేలా చూస్తాం. – వెంకటేశ్వరరావు, 24వ వార్డు పారిశుద్ధ్య అధికారి

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు అశోక్‌నగర్ గెడ్డలో వ్యర్థాల నిల్వతో మురుగు నీరు నిలిచి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. – ఎస్.మాధవ ✓: మా సిబ్బందిని పంపించి గెడ్డను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. – బి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-8లోని 21బీ/7, 8 నెంబర్ల విద్యుత్తు స్తంభాలకు ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో బయటకు రావడానికి భయపడుతున్నాం. – రాజేంద్ర ✓: సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – అర్చన, వీధి దీపాల ఏఈ

స్పందనకు వందన

రహదారికి మరమ్మతులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 31వ వార్డు ఎస్‌బీఐకాలనీ నుంచి డ్వాక్రాబజార్‌కు వెళ్లే రహదారి గోతులమయంగా మారిందని ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తమ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

పది విద్యార్థులకు.. తప్పిన భోజన భారం..

ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

మాధవధార, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు డిసెంబరు 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజులైన రెండో శనివారం, ఆదివారం ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెలవు రోజుల్లో ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు, అనంతరం 1.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బోధన చేస్తున్నారు. ఈ విరామం సమయంలో విద్యార్థులు ఇంటికెళ్లి భోజనం చేసి మళ్లీ తరగతులకు హాజరవ్వాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే బాలికలు భోజనానికి వెళ్లకుండా అర్ధాకలితో ఉంటున్నారు. దీనివల్ల ఏకాగ్రత కోల్పోయే అవకాశం ఉంది. ఈ సమస్యను గుర్తించిన అధికారులు సెలవు రోజుల్లో నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల వద్దనే మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించారు. దీనివల్ల విద్యార్థులు కూడా చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి మెరుగైన ఫలితాలను సాధిస్తారని ఆశిస్తున్నారు.

ఇదీ ప్రణాళిక.. : ఎఫ్-1, 2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీలుగా విభజించి సీ, డీ గ్రూపుల్లోని వారిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. రోజువారీగా పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్ర 5 గంటల వరకు ఆరు పీరియడ్లు, స్టడీ అవర్స్ నిర్వహించాల్సి ఉంటుంది. పాఠ్యాంశ నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని ప్రతిరోజు విద్యార్థులతో పరీక్ష రాయించాలి. ప్రీఫైనల్, గ్రాండ్ టెస్ట్ పరీక్షలు నిర్వహిస్తారు. అంతర్గత పరీక్షల్లో వచ్చిన మార్కులను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి, పూర్తి స్థాయిలో తర్ఫీదు ఇస్తున్నారు.

ఉత్తరం నియోజకవర్గంలో..	వార్డులు 17	ఉన్నత పాఠశాలలు 8	పదో తరగతి విద్యార్థులు 635

రౌడీషీటర్లు పరివర్తనతో మెలగాలి

కౌన్సెలింగ్ చేస్తున్న నాలుగో పట్టణ ఎస్సై వెంకట్రావ్

గురుద్వారా, న్యూస్‌టుడే: నేరాలకు పాల్పడితే కేసులు తప్పవని రౌడీషీటర్లకు నాలుగో పట్టణ స్టేషన్ ఎస్సై వెంకట్రావ్ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి కేసులు బారినపడుతున్నారన్నారు. సమాజంలో మంచి వ్యక్తులుగా మెలగాలని సూచించారు. పోలీసులు ఎప్పటికప్పుడు కదలికలను గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వీధుల్లో దందాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాధవధార, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు కొట్లాటల్లో తలదూర్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ చట్టం అమలు చేస్తామని కంచరపాలెం సీఐ కె.రవికుమార్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రవర్తన మార్చుకొని, పరివర్తనతో నడుచుకోవాలని అలాంటి వారికి రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న కంచరపాలెం సీఐ కె.రవికుమార్

కనీస వేతనాల చెల్లింపునకు విన్నపం

విజయనగరం ఎంపీ అప్పలనాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

పూర్ణమార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే : విశాఖ పోర్టు అథారిటీలో శాశ్వత ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న పోర్టు పూల్ కలాసీలకు కనీస వేతనాలు చెల్లించాలని పోర్టు కలాసీల సంఘం గౌరవ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ కోరారు. ఆదివారం విశాఖ వచ్చిన విజయనగరం ఎంపీ అప్పలనాయుడుకి వినతిపత్రం అందించారు. వేతనాలకు సంబంధించి పోర్టు ఛైర్మన్ అంగముత్తు, కేంద్రంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని ఎంపీని కోరారు. సంఘం సభ్యులు పోతురాజు, అప్పారావు, భీమా తదితరులు పాల్గొన్నారు.

మహిళా సేవకులకు అవార్డులు

మురళీనగర్, న్యూస్‌టుడే: నిత్యం సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న మహిళ, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులకు అవార్డులు వరించాయి. పీఎంపాలెంలోని ఇందిరావిహార్‌లో ఆదివారం నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 101 వార్షిక సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి, జిల్లా గవర్నర్ కె.ద్వారకానాథ్, జిల్లా కాన్ఫరెన్స్ ఛైర్మన్ కమల్‌బైద్ చేతులమీదుగా మహిళా వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు అవార్డులు అందుకున్నారు. ఉచిత వైద్య, వేసవి శిక్షణ శిబిరాలు, పేద విద్యార్థులకు ఆర్థిక వితరణ వంటి కార్యక్రమాలను గుర్తిస్తూ ఉత్తమ అధ్యక్షులు, ఉత్తమ కార్యదర్శి, ఉత్తమ యోగా టీచర్, బెస్ట్ బులెటిన్, బెస్ట్ సమ్మర్ క్యాంప్, పర్మినెంట్ ప్రాజెక్ట్స్ వంటి సేవలకు అవార్డులు వచ్చినట్లు రెండు క్లబ్‌ల అధ్యక్షులు కె.మాధవి, పి.ప్రభావతి తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఎస్.పి.రవీంద్ర, సెక్రటరీ జనరల్ శీలం ఐజాక్, అడిషనల్ సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, నందూరి రామకృష్ణ, ఆర్.ఆర్.ఎస్.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అతిథుల చేతులమీదుగా అవార్డులు అందుకున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

లెజెండ్స్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

టీషర్ట్స్‌తో ఫుట్‌బాల్ క్రీడాకారులు, అతిథులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : లెజెండ్స్ లీగ్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం విశాఖ వేలీ పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. అండర్-14 విభాగంలో ఆరు జట్లు పోటీ పడుతున్నాయి. ఏపీ, జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ప్రతి ఆదివారం పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో విశాఖ జోన్ కన్వీనర్ సుస్మిత, నిర్వాహకులు రాజారావు, ఎస్.జి.రామకృష్ణ, బాబు, సన్నీ, సతీష్, శ్రీను, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు ఆదివారం పోర్టు స్టేడియంలో జరిగాయి. విజేతలు ఈనెల 24 నుంచి పెద్దాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లాస్థాయి విజేతలకు విశాఖపట్నం అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షుడు పవన్‌కార్తీక్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఐ.ఎ.రాజు, క్రీడాకారుడు ఎం.వి.మాణిక్యాలు, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎ.నారాయణరావు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

క్రాస్‌కంట్రీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

పూర్ణమార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే : రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. 'మసీద్ ఏ ఫుర్‌కాన్' విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పూర్ణమార్కెట్ ప్రధాన రహదారిపై 'ఒక్కరోజు ఇస్లాం' సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దక్షిణంలో కూటమి గెలుపునకు సహకరించిన అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యమిస్తూ, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో దక్షిణ తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ముస్లింలు

'శంబాల' ఏ ఒక్కరిని నిరాశపర్చదు

సమావేశంలో మాట్లాడుతున్న హీరో ఆది, చిత్రంలో హీరోయిన్ అర్చనా అయ్యర్, నటుడు ఇంద్రనీల్

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 'శంబాల' చిత్ర యూనిట్ ఆదివారం విశాఖలో సందడి చేసింది. ఆది సాయికుమార్ హీరోగా, అర్చనా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ థ్రిల్లర్ చిత్రాన్ని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. ఈనెల 25న రిలీజ్ కాబోతున్నందున డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో చిత్ర బృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో ఆది మాట్లాడుతూ టీజర్‌కు అన్నిచోట్లా మంచి స్పందన వస్తోందని, ఈ సినిమా ప్రేక్షకులను నిరాశపర్చదన్నారు. హీరోయిన్ అర్చనా అయ్యర్ మాట్లాడుతూ ఈ సినిమాలో మంచిపాత్ర పోషించడం ఆనందంగా ఉందన్నారు. నటుడు ఇంద్రనీల్, పలాస నటుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'ఘంటసాల స్వర నీరాజనం'

గీతాలు ఆలపిస్తున్న గాయకులు

అల్లిపురం, న్యూస్‌టుడే : తెలుగు సినీ చరిత్రలో గాయకుడిగా ఘంటసాల చెరగని ముద్ర వేశారని పారిశ్రామిక వేత్త సీహెచ్.రామకోటయ్య అన్నారు. కళాంజలి, న్యూ రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఆదివారం ఘంటసాల జయంతిని పురస్కరించుకుని డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఘంటసాల స్వర నీరాజనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు, నిర్వాహకులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గాయకులు గీతాలు ఆలపించారు. విశాఖ సకల కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, ఇతరులు కిషోర్‌కుమార్, శ్రీరంగం పద్మిని, చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.

'రైల్వే కార్మికులు సహకరించాలి'

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ కేంద్రంగా ఏర్పడనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల నిర్వహణకు రైల్వే ఉద్యోగులు, కార్మికులు సహకరించాలని వాల్తేర్ డీఆర్‌యూసీసీ సభ్యులు చలసాని గాంధీ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కొత్త జోన్‌లోని వివిధ విభాగాల్లో పని చేసేందుకు దాదాపు 1100 మంది అవసరం ఉంటుందన్నారు.

27 మంది యాచకులకు ఆశ్రయం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న యాచకులను పోలీసులు చేరదీసి, జీవీఎంసీ భీమ్‌నగర్ ఆశ్రమంలో చేర్పించారు. ఆదివారం మేరీమాత చర్చి, పాతపోస్టాఫీసు, కాన్వెంట్‌కూడలి, జ్ఞానాపురం, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఉన్న 27 మంది యాచకులను గుర్తించారు. కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్, ఎస్ఐ ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల్లో భిక్షాటన చేస్తున్న వారిని తీసుకెళ్తున్న పోలీసులు

వాహనాలు ఇలా.. ప్రయాణమెలా..!

ముస్లిం తాటిచెట్లపాలేనికి వెళ్లే రహదారిలో ఉంచిన వాహనాలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: పోర్టు ఆసుపత్రి ఎదురుగా జాతీయ రహదారి పక్కనుంచి జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలేనికి వెళ్లే వీధుల్లో కార్లు, ద్విచక్ర, ఇతర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లే వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు ప్రయాణించేందుకు కూడా దారి లేదని స్థానికులు వాపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో నానా అవస్థలు పడుతున్నామని, జీవీఎంసీ, పోలీస్ విభాగాల అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రహదారి ఛిద్రం.. ప్రయాణాలు కష్టం..

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14వ వార్డు హిల్‌వ్యూ పార్కు పక్కన రహదారి ధ్వంసమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు తారు కొట్టుకుపోయి రాళ్లు పైకి తేలాయి. అటుగా ప్రయాణం కత్తిమీద సాములా మారిందని స్థానికులు వాపోతున్నారు. పల్లపు ప్రాంతం కావడంతో రాత్రి సమయాల్లో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు ఇంత అధ్వానంగా ఉన్నా మరమ్మతులకు నోచుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా బాగుచేయాలని కోరుతున్నారు.

రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉన్న రహదారి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కె.కాలనీ పోర్టు ఎంసీహెచ్ పాఠశాల పూర్వ విద్యార్థులు

కంచరపాలెం, న్యూస్‌టుడే: వారంతా 1986-87 విద్యా సంవత్సరంలో కె.కాలనీలోని పోర్టు ఎంసీహెచ్ పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత వారంతా దొండపర్తిలో ఓ హోటల్‌లో ఆదివారం ఆత్మీయ వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాటలతో, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.శ్రీనివాసరావు, కె.మూర్తి, చందక చలపతి, కె.ఎ.మురళి, కోసూరి శ్రీనివాస్, కె.మంగ, జి.వందన, ఎం.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

14న హిందూ సమ్మేళన కార్యక్రమాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : హిందూ సమాజాన్ని చైతన్యం చేసేందుకు హిందూ సమ్మేళనం పేరిట 14న కృష్ణా కళాశాల సమీపంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు అచ్చి రమేష్‌రెడ్డి, రామకృష్ణ ఆదివారం తెలిపారు.

ఈ గెడ్డ.. శుభ్రతకు ఆమడ దూరం

గెడ్డలో నిలిచిన మురుగు నీరు

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 51వ వార్డు వుడాకాలనీ శాంతి ల్యాండ్‌మార్క్‌కు ఆనుకొని ఉన్న గెడ్డలో గత కొన్ని రోజులగా వ్యర్థాలు పేరుకుపోయాయి. కొంతమంది నివాసితులు ఇష్టానుసారంగా వ్యర్థాలను గెడ్డలో పారబోస్తుండటంతో పాటు, పారిశుద్ధ్య కార్మికుల సేకరించిన చెత్తను సైతం గెడ్డలో వేయడంతో వ్యర్థాలు ఎక్కడికక్కడ నిల్వ ఉంటున్నాయి. దీంతో మురుగు ముందుకు కదలడం లేదు. తీవ్ర దుర్వాసనతో పాటు దోమలకు ఆవాసంగా మారి విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు శానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, మిషన్ అందుబాటులో లేదని, ఇతర కారణాలు తెలియజేస్తూ సమస్యను పరిష్కరించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని గెడ్డను శుభ్రం చేసి, ఇందులో వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేద పండితులకు ఘన సత్కారం

వేడుకలో పండితులు, ఈఓ శోభారాణి, ఈఈ రమణ తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగిన వేద, అర్చక పండిత సభ ఆకట్టుకుంది. రాష్ట్రంలోని వివిధ ఆలయాల నుంచి వచ్చిన వేదపండితులు, అర్చకులు వేదమంత్రాలు పఠించారు. అనంతరం వేద, అర్చక పండితులను ఆలయ ఈఓ కె.శోభారాణి, ఈఈ సీహెచ్.వి.రమణ, ఏఈఓ ఆనంద్‌కుమార్, ఇతర అధికారులు సత్కరించారు. ఆలయ పండితులు భీమశంకరశాస్త్రి, వెంకటేశ్వర శర్మ, పంచముఖిశర్మ, శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రి సేవలు మరువలేనివి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కేజీహెచ్ సీఎస్ఆర్ఎంఓగా, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారిగా డాక్టర్ కేఎస్ఎల్‌జీ.శాస్త్రి అందించిన సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులోని ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, భాజపా వైద్య విభాగం ఆధ్వర్యంలో శాస్త్రి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయా సంస్థల సభ్యులు ఆర్.రవికుమార్, డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీలక్ష్మి, చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సభ్యులు

ట్రాఫిక్ బారికేడ్ల వితరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలకు ఉపకరించేలా ద్వారకానగర్ మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో బారికేడ్లను వితరణగా అందించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఆసుపత్రి సీనియర్ జనరల్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, తూర్పు ట్రాఫిక్ సీఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రిబ్బను కత్తిరిస్తున్న ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

చైతన్యంతో మానవ హక్కుల సాధన

సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య రవి

సీతంపేట, న్యూస్‌టుడే: మానవ హక్కులు ఎవరి భిక్ష కాదని, వాటిని చైతన్యంతో సాధించుకోవాలని ఏయూ అకడమిక్ స్టాఫ్ కాలేజీ పూర్వ సంచాలకులు ఆచార్య రవి అన్నారు. బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎన్‌యూ పూర్వ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ మనిషికి హక్కులు పుట్టుకతోనే వస్తాయని పేర్కొన్నారు. వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ప్రియాంక తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కడిమిళ్లకు 'చిన్నయ సూరి' పురస్కారం

కడిమిళ్ల వరప్రసాద్

సీతంపేట, న్యూస్‌టుడే: గురు సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్‌కు తెలుగు వ్యాకరణ భేరి పరవస్తు చిన్నయ సూరి పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారానికి ఎంపిక చేసినట్లు పరవస్తు పద్య పీఠం వ్యవస్థాపకుడు పరవస్తు ఫణిశయన సూరి ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నయ సూరి జయంతిని పురస్కరించుకొని ఈనెల 20న విశాఖ పౌర గ్రంథాలయంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. తెలుగు భాషాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గాజువాక

● గాజువాక ● విశాఖ పశ్చిమం

చిన్నారులకు భగవద్గీత పోటీలు

విజేతలతో భజన మంజరి ప్రతినిధులు, నిర్వాహకులు

చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే : భజన యజ్ఞం-10లో భాగంగా చినగంట్యాడ త్రిశక్తి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి త్రిశక్తి భజన మండలి, భజరంగీ భజన మంజరి, హిందూధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో చిన్నారులకు భగవద్గీత, కోలాట పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. విజేతలకు సాహిత్య సుధ వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు, నిర్వాహకులు రాజారావు, బి.రామలక్ష్మి, నాగేశ్వరి, లక్ష్మి, లలితలు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు.

రక్తదానంతో ఆరోగ్య సమాజం

శిబిరంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

నెల్లిముక్కు (పెదగంట్యాడ), న్యూస్‌టుడే : యువత రక్తదానానికి ముందుకు రావాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ఆదివారం వార్డులో చైతన్య మహిళా కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. తెదేపా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, పలువురు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్‌ఎస్ఎస్ పీఓలు సంతోషి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : సమస్య: విద్యుత్తు కేబుళ్లు, ఫ్లెక్సీలకు తప్పకాలతో చినగంట్యాడ, పుడకాలనీ, పెదగంట్యాడలో ఎక్కడికక్కడ తెగిపోయి ఇబ్బందులు కలిగిస్తున్నారు. –మోహన్‌కుమార్, గాజువాక సమాధానం: సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలిస్తాం. –షేఖ్, జేడీ; ?: పుడకాలనీ బీసీసీ రోడ్డులో చెత్త కుప్పలు ఎక్కువగా ఉన్నాయి. –సుడివాడ శ్రీనివాస్, పుడకాలని ✓: సిబ్బందిని పంపి శుభ్రత పనులు చేపడతాం. –కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 89వ వార్డు డీఎల్‌బీనగర్‌లో మురుగుకాలువల్లో సిల్ట్ తొలగించాలి. – సురేశ్, డీఎల్‌బీనగర్ ✓: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ?: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో వీధిదీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. – గోపీ, వెంకటాపురం, ✓: దీపాల మరమ్మతులు చేపడతాం. – గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గాజువాక 64వ వార్డు గంగవరం మత్స్యకార కాలనీల్లో శిథిలావస్థకు చేరుకున్న కాలువలు అభివృద్ధి చేస్తున్నారు. రూ.12 లక్షలతో గంగవరం, పల్లెపాలెం, చుట్టుపక్క కాలనీల్లో ఈ పనులు జరుగుతున్నాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆగిన పనులతో అవస్థలెన్నో..

ఆరు గదులు అందుబాటులోకి వస్తే పిల్లలకు సౌలభ్యం

రంగులకు కూడా నోచుకోని భవనం

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోవడంతో మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆరు అదనపు గదుల నిర్మాణానికి నాడు.. నేడులో సుమారు రూ.55లక్షల నిధులు కేటాయించారు. పాఠశాల హెచ్‌ఎం, కమిటీ ఆధ్వర్యంలో గుత్తేదారు పనులు మొదలు చేశారు. పనులు చివరి దశకు చేరుకున్న సమయంలో గుత్తేదారు పనులు అర్ధంతరంగా ఆపేశారు. తర్వాత ప్రభుత్వం మారడంతో గుత్తేదారు పూర్తిగా పాఠశాల పరిసరాల్లో కనిపించలేదు.

అదనపు గదులు లేక అవస్థలు: పాఠశాలలో సుమారు 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ సంఖ్య ప్రకారం ఆరు గదులు అదనంగా అవసరం. పనులు పూర్తయితే ఎటువంటి ఇబ్బంది ఉండదు అనుకున్న సమయంలో పనులు ఆగిపోయాయి. ముఖ్యంగా గదుల నిర్మాణం, ప్లాస్టింగ్ పనులు పూర్తయ్యాయి. కిటికీలు, రంగులు వేయడం, గదులకు మెట్లు ఏర్పాటు పనులు మిగిలాయి. పిల్లలకు అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో ఆదే గదుల్లో నిత్యం తరగతులు నిర్వహిస్తున్నారు. గదుల్లోకి వెళ్లేటప్పుడు, గదుల్లో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు పూర్తి పర్యవేక్షణ చేస్తుండడంతో తాత్కాలికంగా తరగతులు జరుగుతున్నాయి.

దాతలను సంప్రదిస్తున్నాం..:

గదులు అసంపూర్తిగా నిలిపోవడంతో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అదే గదుల్లో క్లాసులు నిర్వహిస్తున్నాం. రంగులు వేసి, కిటికీలు, మెట్లు పూర్తయితే మరింత రక్షణగా ఉంటుంది. నాడు-నేడు పనులు ఆగిపోవడంతో కరమాండల్ యాజమాన్యాన్ని కలిసి సీఎస్ఆర్ నిధుల్లో పూర్తి చేయమని కోరాం. వారు ఇంజినీరింగ్ సిబ్బందిని పంపించి పరిశీలించే అవకాశం ఉంటే పూర్తి చేస్తామన్నారు. వారితో పాటు మరి కొంతమంది దాతల దృష్టికి తీసుకెళ్తున్నాం.

–హెచ్‌ఎం ఆంజనేయ

తీరం కోలాహలం..

మల్కాపురం, న్యూస్‌టుడే : యారాడ తీరం ఆదివారం పర్యాటకులతో నిండిపోయింది. పెద్ద సంఖ్యలో నగరం నుంచి ఈ ప్రాంతానికి సందర్శకులు తరలివచ్చారు. అయితే భక్తుల రద్దీకి తగ్గట్లు ఇక్కడ సౌకర్యాలు లేవు. దీంతో పర్యాటకులు అసహనం వ్యక్తంచేశారు. సౌకర్యాలు కల్పించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

న్యూస్‌టుడే, సింధియా : పారిశ్రామిక ప్రాంతం 61వ వార్డు ప్రకాశ్‌నగర్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌కు రెండు డోర్లు ఊడిపోయాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు పరిసరాల్లోనే ఎక్కువగా పశువుల సంచారం ఉంటోంది. అలాగే ఎవరైనా ఆకతాయిలు గాని, చిన్న పిల్లలు అటు వెళ్లినా తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్సు వల్ల ప్రమాదం జరిగే ఆస్కారం ఉండొచ్చని స్థానికులు అంటున్నారు. తక్షణం ఫ్యూజ్ బాక్సుకి డోర్లు బిగించాలని కోరుతున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : పదో తరగతి సార్వత్రిక పరీక్షల్లో భాగంగా ప్రభుత్వం 100 రోజుల ప్రణాళిక నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా గోపాలపట్నం మండల పరిధిలోని జిల్లా పరిషత్, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలను ఆదివారం మండల విద్యాశాఖాధికారి డి.దివాకర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాప్రగతిపై ఆరా తీశారు. ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఒత్తిడితో కాకుండా ఆటపాటలతో చదివించాలని కోరారు.

వంద రోజుల ప్రణాళికపై ఆరా తీస్తున్న ఎంఈవో దివాకర్

జన సైనికుని కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న నాయకులు

అగనంపూడి, న్యూస్‌టుడే : ఇటీవల నగరంలో జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పాత అగనంపూడికి చెందిన జన సైనికుడు తలారి సాయి మహర్షి కుటుంబానికి స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచారు. సమష్టిగా సేకరించిన రూ.75వేల మొత్తాన్ని ఆదివారం గాజువాక జనసేన నాయకుడు విందుల వెంకటరమణ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. జీవీఎంసీ 79వ వార్డు పార్టీ అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్, నాయకులు దాసరి శ్రీను, నక్కా చినదేముడు, గల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సాయి సేవా సమితి ఆధ్వర్యంలో 'విలువల ర్యాలీ'

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : సత్యసాయి సేవా సమితి విద్యా విభాగం ఆధ్వర్యంలో బాల వికాస్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గురువులతో కలిసి ఆదివారం 'విలువల ర్యాలీ' నిర్వహించారు. సమాజంలో ఐదు మానవ విలువలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసల గొప్పతనాన్ని ఈ ర్యాలీ ద్వారా ప్రచారం చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పడాల ప్రసాద్, పీఆర్ఎస్.నాయుడు, జి.రామకృష్ణ పద్మ, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న సాయి భక్తులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి ఊరేగింపు

ఊరేగింపులో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : శీలానగర్ అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప ఊరేగింపు ఘనంగా జరిగింది. అయ్యప్ప ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి హారతులిచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఎస్‌పి నాయుడు, ప్రధాన అర్చకులు కృష్ణన్ నంబూద్రి, నాగార్జున రాజు, విశ్వేశ్వరరావు, నంబారు రమణ, వెంకటరమణ, అప్పలరాజు, భూశిరాజు, కొండలరావు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు వినతిపత్రం అందిస్తున్న ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విశాఖ ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కోలార్ ఎంపీ ఎం.మల్లేశ్‌బాబు, బెంగళూరు రూరల్ ఎంపీ డాక్టర్ సి.ఎస్.మంజునాథ్‌ను దిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. కాటం ఎస్.ఎస్.చంద్రరావు, కేవీడీ. ప్రసాద్ పాల్గొన్నారు.

ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీపై దర్యాప్తునకు డిమాండ్

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న విశాఖ ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీ ఎ.కె.సక్సేనాపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి కర్మాగారానికి, కార్మికులకు నష్టం కలిగించే చర్యలే చేపట్టారన్నారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని, కర్మాగారాన్ని కాపాడాలని ఉక్కు మంత్రిత్వశాఖను డి.ఆదినారాయణ(ఏఐటీయూసీ), పాడి త్రినాథరావు(వీఎస్ఈయూ), ఎం.రాజశేఖర్(ఇంటక్), ఎన్.రామారావు(సిటూ)డిమాండ్ చేశారు.

తక్షణమే వీఆర్ఎస్ బకాయిలు చెల్లించాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కులో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వారికి తక్షణమే బకాయిలను చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మొదటి విడత జూన్ 2025లో 1137 మంది, రెండో విడత ఆగస్టు 2025లో 486 మంది ఉద్యోగ విరమణ చేశారన్నారు. వీరికి రెండు దఫాలుగా కేవలం 50 శాతం మాత్రమే చెల్లించారన్నారు. మిగతా 50 శాతమైన ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాల్సి ఉందన్నారు. డీపీఈ గైడ్‌లైన్స్‌ను అనుసరించి తక్షణమే వీరికి అన్ని బకాయిలు చెల్లించాలని ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

అనధికార కట్టడాల తొలగింపు

గాజువాక, న్యూస్‌టుడే: రాత్రికి రాత్రే నిబంధనలకు విరుద్ధంగా గాజువాకలో పలుచోట్ల అనధికార నిర్మాణాలు జరుగుతుండడంతో జీవీఎంసీ జోన్-6 పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది కఠిన చర్యలకు దిగారు. దీనిలో భాగంగా శ్రీనగర్, అఫీషియల్ కాలనీలో ప్లాన్‌కు విరుద్ధంగా చేపడుతున్న అనధికార కట్టడాలను ప్రత్యేక స్క్వాడ్ తొలగించింది. ఏసీపీ వెంకటరావు, ప్రణాళిక టీపీఎస్ బాలరాజు స్పెషల్ డ్రైవ్‌లో పాలుపంచుకున్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని వీరు స్పష్టం చేశారు.

కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది : సుమన్

బ్లాక్ బెల్టులను ప్రదానం చేసిన ప్రముఖ సినీ నటుడు సుమన్

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెరుగుతాయని ప్రముఖ సినీ హీరో, మార్షల్ ఆర్ట్స్ ఛైర్మన్ సుమన్ అన్నారు. ఉక్కునగరం సీభవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వడోకాయ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కరాటే గ్రేడింగ్ బెల్ట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం పలువురు క్రీడాకారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాజపా గాజువాక ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నరసింగరావు, సీనియర్ కోచ్ సతీష్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు రాము, ప్రధాన కార్యదర్శి అంబు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు... వాహనదారులకు తిప్పలు..

ఫోకస్

పూర్తికాని రహదారి..

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి టోల్‌గేటు వద్ద చేపట్టిన రహదారి పునర్నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్.హెచ్.ఎ.ఐ) ఆధ్వర్యంలో పది నెలల క్రితం ఇక్కడ పనులు మొదలుపెట్టారు. టోల్‌గేటుకు ఇరువైపులా పాత మార్గాన్ని తవ్వి తొలగించారు. దాని స్థానంలో సిమెంట్ రహదారి వేశారు. రెండింటిని సరిగా అనుసంధానం చేయకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడ మార్గం ఎత్తుపల్లాలుగా ఉండడంతో ప్రయాణానికి వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. సిమెంట్ దిమ్మెలను సేవా రహదారిపై ఉంచి వదిలేశారు. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించడానికి వీలు పడడం లేదు. విభాగినుల వద్ద ఇసుక మేటలతో వాహనాలు పట్టుతప్పుతున్నాయి.

సేవా మార్గానికి అడ్డంగా సిమెంట్ దిమ్మెలు

★ టోల్‌గేటులో ఏడాది క్రితం కార్యకలాపాలు నిలిచిపోగా షెడ్డును తొలగించలేదు. దీంతో పైన అమర్చిన రేకులు ప్రమాదకరంగా మారాయి. పట్టుతప్పి గాలికి వేలాడుతుండడంతో ఎప్పుడు మీద పడతాయోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ ప్రయాణం కష్టంగా మారుతోంది.

★ ఇకనైనా ఎన్‌హెచ్ఏఐ అధికారులు తక్షణం స్పందించి సాఫీ ప్రయాణానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ఆరుద్ర నక్షత్ర పూజలు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అలంకరణలో శివయ్య

పెదమడక కాలనీలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం గాజువాక బీసీరోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పుల్లల కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, మహా అర్చనలు జరిపారు. భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. ★ పాతగాజువాక కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఆరుద్ర నక్షత్ర పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. శివలింగాన్ని పురోహితులు ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక కాలనీలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఏకాదశ రుద్రాభిషేకంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మరుగుదొడ్ల చెంత.. వ్యర్థాల చింత

దర్పణం

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మెయిన్‌రోడ్డులో ఉన్న మరుగుదొడ్ల చెంతనే వ్యర్థాల పోగులు పేరుకుపోయాయి. శనివారం ఉదయం తొలగించి ఊరుకున్నారు. తర్వాత తిరిగి సోమవారం ఉదయం వరకు వాటిని అలాగే ఉంచారు. దీంతో రెండురోజులు తొలగించేవారు లేక స్థానికులు దుర్వాసనకు ఇబ్బందులు పడ్డారు.

–న్యూస్‌టుడే, సింధియా

బాధిత కుటుంబానికి బాసట

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నమ్మిదొడ్డి ప్రాంతానికి చెందిన కిడ్నీ బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం ఉక్కు సత్యసాయి మందిరంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ డి.కృష్ణంరాజు, కన్వీనర్ రామకృష్ణ చేతుల మీదుగా చెక్ అందజేశారు. వసుధ సంస్థ సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.

లంబసింగి ఫ్యామిలీ క్యాంప్ విజయవంతం

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఉక్కునగరం శాఖ) ఆధ్వర్యంలో ఉక్కునగరం పరిసర ప్రాంతాలకు చెందిన కుటుంబాలు శని, ఆదివారాలు లంబసింగి ఫ్యామిలీ క్యాంప్‌ను నిర్వహించాయి. మొత్తం 26 మంది ఈ క్యాంపులో పాల్గొన్నట్లు యూనిట్ ప్రతినిధి వి.ఆర్.కె.రాజు తెలిపారు.

ప్లాస్టిక్ నష్టాలపై అవగాహన

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగంపై వడ్లపూడి చేపల బజారులో తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వస్త్ర, నార సంచులు, స్టీల్ బాక్సులు ఉపయోగించాలన్నారు. ఒకసారి వినియోగించిన పాలిథిన్ సంచుల వల్ల ప్రాణాంతకమైన క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, పరమానందరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, నాగేష్, శ్రీరాములు, కామరాజు, మహేష్, భద్రారావు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో ట్రాఫిక్ మెరుగు : సీపీ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, చిత్రంలో ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, సౌత్ ఏసీపీ శ్రీనివాస్

గాజువాక, న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతగా ట్రాఫిక్ విధులు నిర్వహించడానికి పౌరులు ముందుకు రావడం అభినందనీయమని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. ఆదివారం సాయంత్రం పాత గాజువాక కూడలిలో ట్రాఫిక్ సోల్జర్స్ పేరుతో స్వచ్ఛంద ట్రాఫిక్ విధుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ట్రాఫిక్ విధులకు వచ్చిన సుమారు 35 మందితో సీపీ స్వయంగా మాట్లాడారు. రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతున్న తరుణంలో వాలంటీర్ సోల్జర్స్ పేరుతో గాజువాక నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సిబ్బంది కొరత వల్ల ట్రాఫిక్ నియంత్రణ కష్టతరమవుతోందన్నారు. సోల్జర్స్ విధానంతో చాలావరకు ఈ సమస్య తీరుతుందన్నారు. సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు, గాజువాక ట్రాఫిక్ సీఐ షేక్ హుస్సేన్, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

రహదారి విస్తరణలో కదలిక

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గాజువాక 65వ వార్డు బీసీరోడ్డు నుంచి వికాస్‌నగర్ మీదుగా ఇండోర్ స్టేడియం వరకూ రహదారి విస్తరణ పనులకు కదలిక వచ్చింది. సుమారు రూ.2.5 కోట్లతో జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి రహదారి ఆధునికీకరణకు చర్యలు చేపట్టడంతో నివాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో శిథిలావస్థకు చేరిన వంతెనను పునరుద్ధరించి అనంతరం సీసీరోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ఇటీవల గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేపట్టగా.. జోన్-6 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి. దారికి ఇరువైపులా కాలిబాటలు, సెంటర్ డివైడర్, విద్యుద్దీకరణ చేపడతారు. మరో నెల రోజుల్లో రహదారి ప్రారంభించే యోచనలో ఉన్నారు. ఆయా పనుల దృష్ట్యా వికాస్‌నగర్, ప్రియదర్శినికాలనీ వాసులు ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు.

కొనసాగుతున్న వంతెన పనులు

స్టీల్‌సిటీ డిపోను కొనసాగించాలి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్‌సిటీ డిపోను తరలించకుండా యథావిధిగా కొనసాగించాలని ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో డిపోలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిపో తరలించవద్దంటూ 101 రోజులుగా రిలే దీక్షలు కొనసాగాయని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడం వల్ల దీక్షలు విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏకే శివ, పీఎన్ మూర్తి, ప్రదీప్‌రావు, పీవీవీ మోహన్, రామారావు, శంకరరావు, తెదేపా నాయకులు బొండా జగన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న పరశురామరాజు

మల్కాపురం, న్యూస్‌టుడే : పేద ప్రజలకు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు అందించడంలో ప్రతిఒక్కరూ ముందుండాలని జిల్లా భాజపా అధ్యక్షులు పరశురామరాజు అన్నారు. తెదేపా పశ్చిమ యువత అధ్యక్షులు, అనార్గనైజ్డ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుత్తుల మధుబాబు ఆధ్వర్యంలో.. 40వ వార్డు ఏకేసీకాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 350 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మౌర్యసింహ, గాజువాక భాజపా ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నర్సింహరావు, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు ప్రకాశ్, మేఘన దుర్గా, వైద్యులు పాల్గొన్నారు.

వేద పండితులకు ఘన సత్కారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగిన వేద, అర్చక పండిత సభ ఆకట్టుకుంది. రాష్ట్రంలోని వివిధ ఆలయాల నుంచి వచ్చిన వేద పండితులు, అర్చకులు వేదమంత్రాలు పఠించారు. అనంతరం వేద, అర్చక పండితులను ఆలయ ఈఓ కె.శోభారాణి, ఈఈ సీహెచ్.వి.రమణ, ఏఈఓ ఆనంద్‌కుమార్, ఇతర అధికారులు సత్కరించారు. ఆలయ పండితులు భీమశంకరశాస్త్రి, వెంకటేశ్వర శర్మ, పంచముఖిశర్మ, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలో పండితులు, ఈవో శోభారాణి, ఈఈ రమణ తదితరులు

'రైల్వే కార్మికులు సహకరించాలి'

రైల్వే స్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ కేంద్రంగా ఏర్పడనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల నిర్వహణకు రైల్వే ఉద్యోగులు, కార్మికులు సహకరించాలని వాల్తేర్ డీఆర్‌యూసీసీ సభ్యులు చలసాని గాంధీ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కొత్త జోన్‌లోని వివిధ విభాగాల్లో పని చేసేందుకు దాదాపు 1100 మంది అవసరం ఉంటుందన్నారు.

పార్కులో 'అల్లూరి' విగ్రహం ఏర్పాటు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 76వ వార్డు హౌసింగ్‌బోర్డుకాలనీలోని ఆధునిక ఉద్యానవనంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం నుంచి సుమారు 7 అడుగుల ఎత్తున విగ్రహాన్ని క్రేన్ సాయంతో తెచ్చారు. సుమారు 300 కిలోల బరువుగల విగ్రహాన్ని పార్కులోని ఫౌంటెయిన్ మధ్యలోని ప్రత్యేక ప్లాట్‌ఫారంపై అమర్చారు. తుది మెరుగులు దిద్దాక ఫౌంటెయిన్‌ను విద్యుద్దీకరించి వినియోగంలోకి తెస్తామని జోన్-6 ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

(c) eenadu

ఈనాడు
విజయనగరం
సోమవారం డిసెంబరు 8, 2025

ఆహ్లాద ఆదివారం

సాలూరు గ్రామీణం: మన్యంలోని పర్యాటక ప్రదేశాలు ఆదివారం కళకళలాడాయి. సాలూరు మండలం దళాయివలస జలపాతాల వద్ద సందర్శకుల ఉత్సాహమిది.

నృత్య సౌరభం

గజపతినగరం: రానున్న తరాలకు హిందుత్వ గొప్పదనం తెలియజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ అన్నారు. ఆదివారం గజపతినగరంలోని నిర్వహించిన హిందూ సమ్మేళనంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కమలాత్మానంద స్వామి చంద్రశేఖర్, లక్ష్మి, భాజపా రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దొగ్గ దేముడు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడ.. ఏదీ ప్రగతి జాడ!

ఈనాడు, విజయనగరం

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించిన గత వైకాపా ప్రభుత్వం. ఆచరణలో మాత్రం అలసత్వం వహించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉమ్మడి జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కులు నిర్మించాలని నిర్ణయించింది. రెండు నెలల కిందట అయిదు చోట్ల శంకుస్థాపనలు చేసి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వివిధ కారణాలతో అభివృద్ధికి పూర్తిస్థాయిలో అడుగు పడడం లేదు.

సీతంపేట: పనుకువలస ఎంఎస్ఎంఈ పార్కులో జరుగుతున్న పనులు

కొత్తవలస మండలం బలిఘట్టం

ఎంఎస్ఎంఈ పార్కు కోసం 57.09 ఎకరాలు సేకరించారు. ఫేజ్-1 కింద 22.12 ఎకరాల్లో ఒక్కో ప్లాటు 300 చ.మీ. చొప్పున 83 ప్లాట్లు ఏర్పాటు చేస్తారు. ● ఇక్కడ చ.మీ. రూ.988కు ఇవ్వనున్నారు. ● రోడ్లు, కాలువలు, విద్యుత్తు సరఫరా తదితర అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.3.51 కోట్లు విడుదల చేయగా.. రూ.54 లక్షలతో 16 శాతం కాలువ నిర్మాణం చేపట్టారు.

రామభద్రపురం మండలం కొట్టక్కి...

ఈ పార్కుకోసం వంద ఎకరాలు గుర్తించారు. ఫేజ్-1 పనులకు 25.81 ఎకరాలు కేటాయించారు. ● 300 చ.మీ. చొప్పున 139 ప్లాట్ల ఏర్పాటుకు లేఅవుట్ వేశారు ● చ.మీ. ధర రూ.1,112 గా నిర్ణయించారు ● మౌలిక సదుపాయాలకు 3.44 కోట్లు కేటాయించారు. రూ.12 లక్షలతో మూడు శాతం పనులు చేపట్టగా, స్థానికుల అడ్డగింతతో ఆగాయి.

బొండపల్లి మండలం కొండకిండాం.. ఇక్కడ 57.49 ఎకరాలు గుర్తించారు. తొలి దశలో 26.28 ఎకరాల్లో 173 ప్లాట్లు నిర్మించనున్నారు. 300 చ.మీ. విస్తీర్ణంలో ఒక్కో ప్లాటు వేయగా, చ.మీ. ధర రూ.863 గా నిర్ణయించారు. ఇక్కడ రూ.4.92 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించగా, రూ.28 లక్షలు వెచ్చించి 6 శాతం పనులే చేశారు.

రెండో దశలో ఆరు

● చీపురుపల్లి నియోజకవర్గం కుమరాంలో గుర్తించిన స్థలం అనువుగా లేదు. విజయనగరం గ్రామీణ మండలం కొండకరకాంలో ఎంపిక చేసిన 12 ఎకరాలకు బదులు మరో చోట స్థలమివ్వాలని ఉన్నతాధికారులు కోరారు. సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

● రెండో దశలో రాజాం నియోజకవర్గం సంకిలి వద్ద 20 ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు స్థలం గుర్తించారు. ఇందులో డీకేటీ భూములు ఉన్నందున ప్రత్యామ్నాయ స్థలానికి అన్వేషిస్తున్నారు.

నెల్లిమర్ల.. ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో మూడెకరాలు కేటాయించారు. ఇక్కడ ఫ్లాటర్ ఫ్యాక్టరీ సముదాయంలో 28 గదులు నిర్మించనున్నారు ● ఒక్కో గది 900 చ.అ.ల్లో నిర్మిస్తారు ● ప్రభుత్వం రూ.15.55 కోట్లు మంజూరు చేయగా, రూ.74 లక్షలతో 10 శాతం పని మాత్రమే పూర్తి చేశారు.

పాలకొండ నియోజకవర్గం పనుకువలస.. ఇక్కడ 27.26 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణం ప్రారంభించారు. 170 ప్లాట్లు వేయనున్నారు. అభివృద్ధి పనులకు రూ.3.42 కోట్లు మంజూరయ్యాయి.

జనవరి నాటికి పూర్తి చేస్తాం.. ప్రారంభించిన అయిదు పార్కులను జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించాం. భూ వివాదాలతో జాప్యం జరుగుతోంది. వీటిని త్వరలో పరిష్కరిస్తాం.. - ఎం.మురళీమోహన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు

13 నుంచి జేఎన్‌టీయూలో హ్యాకథాన్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం, జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14వ తేదీల్లో విజయనగరంలోని విశ్వవిద్యాలయంలో హ్యాకథాన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉపకులపతి సుబ్బారావు తెలిపారు. బీటెక్, ఎంటెక్, బీసీఏ, ఎంసీఏ, బీఎస్సీ, బీఏ, ఎంఎస్సీ, ఎంఏ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ముందుగానే https://shorturl.at/UWsA1లో నమోదు చేసుకోవాలన్నారు.

ఇకపై విజిబుల్ పోలీసింగ్

ఎస్పీ దామోదర్

శిరస్త్రాణం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: రహదారి భద్రతా నియమాలను పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. చోదకుల వద్ద తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన అన్నిరకాల ధ్రువపత్రాలు ఉండాలని, శిరస్త్రాణాలు, సీట్‌బెల్టులు ధరించాలని సూచించారు.

◆ జిల్లాలో ఇక నుంచి రోజూ విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం ఉంటుందని ఎస్పీ తెలిపారు. వాహన తనిఖీలు చేపట్టి, అవగాహన కల్పిస్తామని.. చట్టాలు, శిక్షలు గురించి తెలియజేస్తామన్నారు.

◆ ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తున్నట్లు చెప్పారు.

◆ ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో బ్లాక్‌స్పాట్లను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లు, రేడియం స్టిక్కర్లతో కూడిన డ్రమ్ములు పెడుతున్నామన్నారు.

◆ చరవాణి చోదకంపై కఠినంగా వ్యవహరిస్తామని, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 2,370 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

◆ మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులే బాధ్యులవుతారన్నారు. ఇప్పటికే 1020 యజమానులకు జరిమానాలు వేశామన్నారు.

పిల్లలూ.. అలసిపోయేదాకా ఆడేద్దాం

పాఠశాలలకు 27 రకాల క్రీడా కిట్లు

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం విద్యాలయాలకు క్రీడా కిట్లను అందజేస్తోంది. బాలలను ఆటల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా వారిలో శారీరక, మానసిక వికాసాన్ని పెంపొందించాలన్నది ఉద్దేశం. అందుబాటులో ఉన్న ఆట స్థలం, అక్కడివారికి ఆసక్తి ఉన్న క్రీడలకు సంబంధించిన పరికరాలను గతంలోనే ఆయా ప్రధానోపాధ్యాయుల ద్వారా వివరాలు సేకరించారు. ఈ మేరకు పరికరాలను అందించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

క్రీడా కిట్టులో పరికరాలు

విద్యాశాఖ పరిధిలో 131 క్లస్టర్లలో 1,785 పాఠశాలలున్నాయి. కేంద్రీకృత విధానంలో రాష్ట్ర స్థాయి నుంచే వెండార్ ద్వారా పాఠశాల సముదాయాలకు కిట్లు పంపిణీ జరుగుతోంది. అక్కడి నుంచి పాఠశాలలకు చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈవో యు.మాణిక్యం నాయుడు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే పది మండలాలకు కిట్లు చేరాయి. ఎల్.కోట, వేపాడ, కొత్తవలస, గంట్యాడ, బొండపల్లి, విజయనగరం, నెల్లిమర్ల మండలాలకు సంబంధించి పరికరాలు క్లస్టర్లకు రావడంతో వీటిని పాఠశాలలకు అందించే చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు.

క్రీడాంశాలివే..

జిల్లాలో 27 క్రీడలకు సంబంధించి 67 రకాల ఆట పరికరాలు అందజేయనున్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, బీచ్ వాలీబాల్, బాక్సింగ్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, నెట్‌బాల్, రోప్ స్కిప్పింగ్, రగ్బీ, సెపక్‌తక్రా, సాఫ్ట్‌బాల్, ఇతర క్రీడలకు సంబంధించిన పరికరాలు కిట్లలో ఉన్నాయి. ఆటస్థలం ఆధారంగా ఒక్కో పాఠశాల ఒక్కో క్రీడను ఎంపిక చేసుకుంది.

అడ్డగోలుగా తవ్వకాలు.. అడిగేవారే లేరు!

చంపావతి, గోస్తనీ నదుల్లో ఇసుక దోపిడీ

న్యూస్‌టుడే, నెల్లిమర్ల, ఎస్.కోట, భోగాపురం, గుర్ల, డెంకాడ

జిల్లాలోని నదీ గర్భాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల మొంథా తుపాను తర్వాత నదుల్లో ఇసుక చేరడంతో తవ్వకాల జోరు పెరిగింది. జిల్లాలోని చంపావతి, గోస్తనీ, నాగావళి నదుల నుంచి రాత్రీపగలూ తేడా లేకుండా నాటుబళ్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. మరోవైపు ఊటబావులు, వంతెనలకు 500 మీటర్ల దూరం వరకూ తవ్వకాల నిషేధం ఉన్నా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఫలితంగా నిర్మాణాలు శిథిలస్థితికి చేరుతున్నాయి. తాగునీటి పైపులైన్లు ధ్వంసమవుతున్నాయి.

నెల్లిమర్ల ఆర్టీసీ సముదాయం వద్ద అక్రమ నిల్వలు

భవన నిర్మాణ రంగం అభివృద్ధి, ప్రభుత్వ నిర్మాణాలు, పేదలకు గృహయోగం కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోంది. కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తూ.. ఉచితం పేరుతో తరలిస్తున్నారు.

మామిడిపల్లి వద్ద తవ్వకాలతో ధ్వంసమైన తాగునీటి పైపులైను

ఇదీ పరిస్థితి..

● ఎస్.కోట మండలంలో గోస్తనీ నదిలో ధర్మవరం, మామిడిపల్లి ఊటబావుల వద్ద తవ్వకాలు జరుగుతున్నాయి.

● జామి మండలం భీమసింగి వద్ద నదిలో రాత్రి సమయాల్లో ఇసుక తవ్వి, తరలిస్తున్నారు.

● గుర్ల మండలంలోని నడుపూరు, భూపాలపురం, సీతారాంపురం, కోటగండ్రేడు ప్రాంతాల్లో చంపావతి నది నుంచి రవాణా చేస్తున్నారు.

● భోగాపురంలో కోటభోగాపురం, పూసపాటిరేగ మండలం రెల్లివలస, డెంకాడ మండలంలో నాతవలస, చోల్లంగిపేట, ప్రాంతాల్లో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

● నెల్లిమర్లలోని ఫుట్‌బాల్ మైదానం సమీపంలోనూ ఇదే పరిస్థితి.

● కొండపేట సమీపంలో వేకువజామున కుప్పలుగా ఒడ్డున నిల్వ చేసి, సాయంత్రం బళ్లతో విజయనగరానికి తరలిస్తున్నారు.

● నెల్లిమర్ల బృందావన్ వ్యాలీ వెనుక భాగంలో ఈ పరిస్థితితో ఊటబావులు ధ్వంసం అవుతున్నాయి.

● నీలంరాజుపేట వద్ద చంపావతి నదిలో తవ్వి, జగ్గరాజుపేట కొండ సమీపంలో నిల్వ చేసి, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.

● మొయిద నారాయణపట్నం ప్రాంతంలో వంతెన పిల్లర్ల సమీపంలో తోడేస్తున్నారు.

వాల్టా చట్టం అతిక్రమిస్తే చర్యలు..: చంపావతి, గోస్తనీ, నాగావళి నదీ గర్భాల్లో ఊటబావులు, వంతెనల వద్ద తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు. అక్రమంగా ఇసుక నిల్వ చేస్తే కేసులు నమోదుచేస్తాం. విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం. వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తాం. - కె.సూర్యచంద్రరావు, గనులు, భూగర్భశాఖ జిల్లా అధికారి

జై కాకు జై

వెంగళరాయసాగర్‌కు రూ.8 కోట్లు విడుదల

ఈనాడు ఈటీవీ పరిశీలన

న్యూస్‌టుడే, బొబ్బిలి

జిల్లాలో జైకా నిధులున్నా గత ప్రభుత్వ నిర్వాకంతో జలాశయాలు ఆధునికీకరణకు నోచుకోలేదు. చేసిన పనులకు బిల్లులు కూడా చెల్లించకపోవడంతో పూర్తిగా నిలిచిపోయాయి. ప్రారంభించి, ఆరేళ్లవుతున్నా.. ఇంతవరకు 30 శాతం కూడా కాలేదు. కూటమి ప్రభుత్వం పరిస్థితులను తెలుసుకుని, పెండింగ్ బిల్లులకు ఆమోదం తెలిపింది. వెంగళరాయసాగర్‌కు ఇటీవల బిల్లులు విడుదల చేశారు. దీంతో గుత్తేదారులకు మిగతావాటికి నిధులు వస్తాయనే భరోసా దక్కింది. కాలువల్లో నీరు తగ్గాక పనులు ప్రారంభమయ్యే అవకాశముంది.

పెద్దగెడ్డ జలాశయం పరిధిలో ఆగిపోయిన లైనింగ్ పనులు

బిల్లులు వచ్చాయ్..

జైకాలో వెంగళరాయసాగర్ ఆధునికీకరణకు రూ.63.50 కోట్లు మంజూరయ్యాయి. హెడ్‌వర్క్స్, అక్విడక్టు పనులు, జలాశయం చుట్టూ రక్షణగోడ, రెగ్యులేటర్ లీకులు అరికట్టడం, విద్యుత్తు సౌకర్యం, తూములు, షట్టర్ల ఏర్పాటు వంటి పనులు జరగాలి. హెడ్‌వర్క్స్ చేపట్టారు. కుడి ప్రధాన కాలువలో రెండు కిలోమీటర్లు, ఎడమ ప్రధాన కాలువలో 500 మీటర్లు లైనింగు చేపట్టారు. గోముఖి నదిపై ఎడమ ప్రధాన కాలువలో అక్విడెక్టు పనులు ప్రారంభించాలి. కుడి కాలువ పరిధిలో సీతానగరం, బొబ్బిలి మండలాల్లో ప్రారంభించాల్సి ఉంది. రూ.12 కోట్ల మేర పనులు జరిగాయి. వీటిలో రూ.8 కోట్లు బిల్లులు జరిగాయి.

శివారుకు అందని సాగునీరు

పెద్దగెడ్డ జలాశయ ఆధునికీకరణకు రూ.28.18 కోట్లు మంజూరయ్యాయి. గేట్ల మరమ్మతులు, లైనింగ్ పనులు, మట్టికట్ట పటిష్ఠం వంటివి చేయాలి. సుమారు రూ.2.50 కోట్ల విలువైన పనులు చేపట్టారు. శివారు వరకు లైనింగు జరగాలి. కొన్నిచోట్ల తూములకు షట్టర్లు అమర్చాలి. సైఫాన్లు నిర్మించాలి. కాలువ చదును చేసి, లోపాలు సవరించాలి. శివారు ఆయకట్టు రామభద్రపురం మండలానికి సాగునీరు అందడంలేదు. కాలువ పనికిరాని మొక్కలతో నిండి ఉంది.

ఆది నుంచీ జాప్యమే..

వట్టిగెడ్డ జలాశయానికి రూ.44.85 కోట్లు, పెదంకలాంకు రూ.17.30 కోట్లు మంజూరయ్యాయి. వట్టిగెడ్డలో స్పిల్‌వేల వద్ద గేట్ల మరమ్మతుల పనులు చేపట్టారు. కాలువల పరిధిలో లైనింగ్, సైఫాన్లు చేపట్టాలి. మట్టిగట్టు పటిష్ఠం చేయాలి. గుత్తేదారుకు సుమారు రూ.2 కోట్ల మేర చెల్లింపులు చేయాలి. పెదంకలాం పరిధిలోని పనుల్లో ఆది నుంచీ జాప్యం జరుగుతూనే ఉంది. సుమారు రూ.50 లక్షల విలువ చేసే పనులు జరిగాయి.

జనవరి తర్వాత నిర్మాణాలు: పెండింగ్‌లో ఉన్న జైకా పనులు ప్రారంభించాలని గుత్తేదార్లను ఆదేశించాం. కాలువల్లో నీరు తగ్గాక చేస్తామని స్పష్టం చేశారు. జనవరి తర్వాత ప్రారంభిస్తారు. అన్ని ఏర్పాట్లు చేపడుతున్నాం. వెంగళరాయసాగర్‌కు బిల్లుల చెల్లింపులు జరిగాయి. మిగిలిన బిల్లులకు సిఫార్సు చేశాం. - ప్రదీప్, జలవనరులశాఖ ఈఈ

వాలీబాల్ విజేత చిలకలపల్లి

బొబ్బిలి, న్యూస్‌టుడే: అంబేడ్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో శని, ఆదివారాల్లో ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. పలు ప్రాంతాలకు చెందిన 20 జట్లు పాల్గొన్నాయి. రసవత్తరంగా సాగిన పోటీల్లో బలిజిపేట మండం చిలకలపల్లి ప్రథమ, బొబ్బిలి మండలం రంగరాయపురం ద్వితీయ, బలిజిపేట తృతీయ, బొబ్బిలి పట్టణం జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు రాంబాబు, అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరుసాంబయ్య చేతులమీదుగా విజేతలకు నగదు, బహుమతులు అందజేశారు.

సైనిక సంక్షేమానికి చేయూతనిద్దాం రండి

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: దేశ సరిహద్దులను రాత్రింబవళ్లు రక్షిస్తున్న సైనికుల సేవలు ఎనలేనివి. కుటుంబాలకు దూరంగా ఉంటూ క్లిష్ట పరిస్థితుల్లోనూ మేమున్నామంటూ రక్షణగా నిలుస్తుంటారు. ఈ నేపథ్యంలో వారితో పాటు సంబంధిత కుటుంబ సభ్యులకు అండగా నిలిచేందుకు కేంద్రం సైనిక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసింది. ఏటా విరాళాలు సేకరిస్తుంటుంది. అందులో భాగంగా డిసెంబరు 7న సాయుధ దళాల పతక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈసారి ఆదివారం పడడంతో 8న చేపడుతున్నారు. సోమవారం ఉదయం మాజీ సైనికుల ర్యాలీ, ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

రూ.14.91 లక్షలు..: 2017 నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా నుంచి సంక్షేమ నిధికి రూ.14.91 లక్షలు సమకూరింది. ఈసారి 112 హుండీలను అందుబాటులో ఉంచారు. ప్రతిఒక్కరూ ముందుకొచ్చి సైనికులకు చేయూతనివ్వాలని సంక్షేమాధికారి సాయిప్రసాద్ తెలిపారు. వారి పిల్లలకు వివాహాలు, ఉపకార వేతనాలు, చనిపోయిన జవాన్ల అంత్యక్రియల నిర్వహణ, బాధితులకు పింఛను సదుపాయం.. తదితర వాటికి ఖర్చు చేస్తాన్నారు.

మొంథా గాయం.. అందని సాయం

రూ.1.93 కోట్ల మేర రావాల్సిన పరిహారం

న్యూస్‌టుడే, వ్యవసాయ విభాగం

తుపాను కారణంగా విజయనగరం మండలం కొండకరకాంలో దెబ్బతిన్న వరి

ప్రకృతి ప్రకోపం రైతులకు నష్టాన్ని తెచ్చిపెడుతోంది. పరిహారం సైతం సకాలంలో రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వచ్చిన మొంథా తుపాను కారణంగా జిల్లాలోని 3,649 మంది అన్నదాతలకు చెందిన 776.97 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, ఉలవలు, పెసర, మినుము, శెనగ తదితర పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రూ.1.93 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తేల్చారు. నెల గడుస్తున్నా ఇప్పటివరకు సాయం అందకపోవడంతో.. ఆశగా ఎదురు చూస్తున్నారు.

◆ వరి, చెరకు, పత్తి నష్టపోతే హెక్టారుకు రూ.25,000 చొప్పున, మిగిలిన వాటికి రూ.15 వేల చొప్పున ఇవ్వాలి. ఈమేరకు ప్రభుత్వానికి నివేదించామని, త్వరలోనే నిధులు విడుదలవుతాయని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తెలిపారు.

అంచనా ఇలా..

పంట (రకం)	నష్టం (హెక్టార్లలో)	పరిహారం (రూ.లక్షల్లో)
వరి	756.990	189.248
మొక్కజొన్న	9.103	1.365
పత్తి	7.523	1.881
మినుము	1.194	0.179
పెసర	0.214	0.032
చెరకు	0.699	0.175
ఉలవలు	1.012	0.101
కొమ్ముశెనగ	0.243	0.024

వస్తున్నారు.. డిజిటల్ లక్ష్మలు

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి.. ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం. ఇందులో భాగంగా పేద మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు మెప్మా ప్రారంభించిన పథకం డిజి లక్ష్మి. సాంకేతికతతో వనితలు లక్ష్మీ కటాక్షం పొందాలన్నది దీని ఉద్దేశం. తొలుత జిల్లాకొకటి ప్రయోగాత్మకంగా కామన్ సర్వీసు సెంటర్(కియోస్క్)ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా విజయనగరంలోని 30వ డివిజన్ పరిధిలోని ధర్మపురి పెద్దవీధి శ్రీ లక్ష్మీ మహిళా పొదుపు సిరి సంఘానికి చెందిన ఎస్ఎల్ఎఫ్ సభ్యురాలు ఎల్.నిరీషకు అవకాశం కల్పించారు.

డిజి-లక్ష్మిగా ఎంపికైన మహిళకు కేటాయించిన కియోస్క్

డిజి లక్ష్మలుగా ఎంపికైన స్వయం సహాయక సంఘ మహిళలు.. ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్, ఆరోగ్యం, విద్య తదితర రంగాల్లో ప్రజలకు డిజిటల్ సేవలు అందజేస్తారు. జిల్లా కేంద్రం విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో స్వయం సహాయక సంఘాల(ఎస్ఎల్ఎఫ్) సభ్యులు, వారి కుటుంబానికి చెందిన 175 మందిని ఇలా ఎంపిక చేశారు. వారిలో సీఎస్‌సీ ఐడీ 129 మందికి జనరేట్ అయ్యింది. ఒక ఎస్ఎల్ఎఫ్‌లో 25 నుంచి 30 వరకు స్వయం సహాయక సంఘాలుంటాయి. ఒక ఎస్ఎల్ఎఫ్‌నకు ఒక డిజి-లక్ష్మిని ఎంపిక చేస్తారు. వీరు సుమారు 250 ఇళ్లకు మీ-సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండే సేవలను అందజేస్తారు. తద్వారా ఒక డీజీ-లక్ష్మి రూ.25 వేల నుంచి 30 వేలు వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

కేంద్రాల్లో ఈ సేవలు: విద్యుత్తు బిల్లు, ఆస్తి పన్ను, నీటి ఛార్జీల చెల్లింపు.. రైలు, బస్సు, సినిమా టికెట్లు, టెలిఫోన్ బిల్లు, ఈ-శ్రమ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్ రుణాలు, బీమా, పెట్టుబడులు, చెల్లింపులు, వ్యవసాయం, ఆరోగ్యం తదితర 250 రకాల సేవలు ఇక్కడ పొందే వెసులుబాటు ఉంది.

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కల్పించండి

విజయనగరం బాబామెట్ట న్యూస్‌టుడే: స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. తీవ్రత, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీరంలో పలుచోట్ల నొప్పులు, అలసట, కళ్లు ఎర్రబడడం, దగ్గు, శ్వాసలో ఇబ్బంది ఉంటే వెంటనే ఆసుపత్రులకు వెళ్లాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు క్షేత్రస్థాయికి వెళ్లి అప్రమత్తం చేయాలన్నారు.

1100తో అర్జీలకు పరిష్కారం

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కార్యాలయాల్లో ఇచ్చే అర్జీలు పరిష్కారం కాకపోతే 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి సూచించారు. కార్యాలయాలకు వెళ్లకుండానే వినతులను 'మీ కోసం' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.

(c) eenadu

ఇనుప కుర్చీతో కొట్టి చంపేశాడు

విశాఖలో జిల్లా మహిళ దారుణ హత్య

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. విజయనగరంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన అల్లాదేవి(34)తో సహజీవనం చేస్తున్న వి.శ్రీనివాసరావు అనే వ్యక్తి శనివారం ఆమెను పాత గోశాల సమీపంలోని సూర్యకాంతం లేఅవుట్‌లో అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె ముఖంపై ఇనుప కుర్చీతో మోదడంతో పాటు పదునైన వస్తువుతో మెడ, ముఖంపై దాడి చేసినట్లు తెలిసింది. ఆ క్రమంలో ఆమెకు పలుచోట్ల తీవ్ర గాయాలు కావడంతో పాటు ముఖం ఛిద్రమైపోయింది. గతంలో ఆరిలోవ స్టేషన్ పరిధిలో ఒక మోసం కేసు విషయంలో శ్రీనివాసరావు జైలు కెళ్లి వచ్చాడు. ఈ వ్యవహారంలోనే అల్లాదేవితో అతడికి విభేదాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చినముషిడివాడ లక్ష్మీనగర్‌లో ఉంటున్న నిందితుడి కుటుంబానికి కూడా వీరిద్దరి సహజీవనంపై సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. అతడు ఇంకా పరారీలోనే ఉన్నాడు. ఆచూకీ కోసం పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు సాగుతోందని సీఐ తెలిపారు.

శుభకార్యానికి పిలిచేందుకు వెళ్లి.. మృత్యుఒడికి

కుమార్ (పాతచిత్రం)

పార్వతీపురం పట్టణం, సీతానగరం, మక్కువ, న్యూస్‌టుడే: మూడు రోజుల క్రితం సీతానగరం మండలం గుచ్చిమి సమీపంలో ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనండీకొన్న ఘటనలో మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మక్కువ మండలానికి చెందిన పిన్నింటి కుమార్(36)గా గుర్తించారు. ఇంటి యజమాని దుర్మరణం చెందిన విషయం రెండు రోజుల తర్వాత తెలియడంతో కుటుంబీకులు విలపిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో శుభ కార్యం జరగాల్సిన ఇంట్లో కన్నీటి సుడులు నిండుకున్నాయి.

మార్కొండపుట్టి గ్రామానికి చెందిన కుమార్ వ్యవసాయ కూలి. అతడికి భార్య విజయలక్ష్మి, కుమార్తె రేష్మా, కుమారుడు రమేష్ ఉన్నారు. పాప ఇటీవల పుష్పవతి కావడంతో ఈనెల 14న శుభ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్డులు ముద్రించారు. సీతానగరం మండలం రేపటివలసలో బంధువులకు చెప్పేందుకు శుక్రవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సాయంత్రానికి ఇంటికి వచ్చేస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి రాత్రయినా రాకపోవడంతో కుటుంబీకులు ఆరా తీశారు. చేతిలో చరవాణి కూడా లేకపోవడంతో వచ్చేస్తాడని ఎదురు చూశారు. రెండు రోజులైనా రాకపోవడం, రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి అని పత్రికల్లో రావడంతో అనుమానం వచ్చి వాకబు చేశారు. శనివారం రాత్రికి విషయం తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం జిల్లా ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. శరీరంపై ఉన్న ఆనవాళ్లతో కుమార్‌గా గుర్తించారు. బాగా చదువుకోవాలని వెన్నుతట్టిన తండ్రి ఇక రాడన్న నిజాన్ని పిల్లలు జీర్ణించుకోలేకపోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదుకుంటాడనుకుంటే.. అందని లోకాలకు

జలపాతం వద్ద యువకుడి దుర్మరణం

జి.హరి (పాతచిత్రం)

సాలూరు గ్రామీణం, రామభద్రపురం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబం వారిది. కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమారులను పెంచి, పెద్ద చేశారు. చిన్నవాడు ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ కుటుంబ బాధ్యతను మోస్తున్నాడు. ఆ యువకుడు జలపాతం చెంత ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన సాలూరు మండలంలో చోటుచేసుకుంది.

రామభద్రపురం మండల కేంద్రంలోని మారుతీనగర్ కాలనీకి చెందిన జి.గోవిందరావు, మంగమ్మకు ఇద్దరు కుమారులు. పెద్దవాడు గోవిందరావు తాపీమేస్త్రీ. రెండో కుమారుడు హరి(24) స్థానికంగా ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేసేవాడు. స్నేహితులతో కలిసి ఆదివారం సాలూరు మండలం కురుకుట్టి పంచాయతీ దళాయివలస గ్రామ సమీపంలో ఉన్న జలపాతానికి వెళ్లాడు. అందరూ ఉన్న దగ్గర కాకుండా కొంచెం దూరంలో నీరు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో స్నానం చేయాలని భావించాడు. అక్కడ భారీ మడుగు ఉండడంతో ఈత రాక మరణించాడు. స్నేహితులు స్పందించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ప్రాంతీయాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింహమూర్తి తెలిపారు.

ఆటో బోల్తా: 12 మందికి గాయాలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో 12 మందికి గాయాలైన ఘటన గంట్యాడ మండలంలోని ఎగువ కొండపర్తి మార్గంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. విజయనగరంలోని జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన కొందరు భక్తులు ఆటోలో గంట్యాడ మండలం ఎగువ కొండపర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 12 మంది గాయపడ్డారు. స్థానికులు స్పందించి వెంటనే ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి తరలించారు. వైద్యులు స్నేహ, మధు ప్రథమ చికిత్స అందించారు. పి.అన్నపూర్ణ, ఎస్.లక్ష్మికి తీవ్ర గాయాలవగా.. విజయనగరం రిఫర్ చేశారు. పి.దినేష్, జి.జయమ్మ, కె.సత్యవతి, జి.విజయలక్ష్మి, ఎం.రూప, కె.ఉదయ్‌కుమార్, డి.సాయి, కె.బంగారమ్మ, కె.నవీన్, ఐశ్వర్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

దుకాణాల్లో చోరీ

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పలు దుకాణాల్లో శనివారం అర్ధరాత్రి ఓ దొంగ చొరబడ్డాడు. తనకున్న రెండు చరవాణి దుకాణాల్లో ముప్పావు తులం బంగారం ఉంగరాలు, రూ.25 వేలు చోరీకి గురైనట్లు శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం దాలెం రాజువలసకు చెందిన పి.వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన దర్జీ దుకాణంలోకి చొరబడినా, ఏమీ పోలేదని మరో వ్యక్తి తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి షట్టర్లు పైకి లేపి, నగలు, నగదు తీసుకుని ఉడాయించినట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌కుమార్, ఏఎస్సై జనార్దనరావు తెలిపారు.

EENADU Classifieds

FINANCIAL SERVICES

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 9121314141.

REAL ESTATE

PLOT FOR SALE

40x60 East Facing Plot in Padmavathi Nagar, Vizianagaram for sale. Cont No: 7036396917.

High way facing 261 Sq.Y Site (VMRDA Approved) Akshaya Nagar in Nelivada Vill, Bondapalli MD, VZM Dt. for sale.C:9676743732.

JOBS

Leading Jr. College Hiring Marketing Executives for its Operations in Vizag. Vizianagaram, Bobbili, Saluru, Parvathipuram. Ph: 7396158725. Vizag.

డాక్‌యార్డ్‌లో పనిచేయుటకు హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను. PVC తప్పనిసరి. జీ॥ 16,000/- (26 రో) + PF. ✆ 8247036280, 9502686907.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ని పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం. జీ:20k. ✆ 89776 39662,89776 39663.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణాకాలం 3నెలలు శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజనం. * ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ ఎడ్యుకేషన్ గ్రూప్ వైజాగ్. 9121232326.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

FACULTY/ TEACHERS

VZMజిల్లాలో మండలాల వారీగా కొత్తగా ప్రారంభిస్తున్న The ABC Bridge ప్లేస్కూల్‌లో పనిచేయుటకు B.Ed, డైట్‌చేసిన మహిళలు కావలెను ✆ 8639457893

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖస్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీగార్డ్స్ 150 మంది 8గం॥ డ్యూటీ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది (Ex -Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం:30,000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

అపూర్వ జ్ఞాపకాల నవోదయం!

సందడిగా జేఎన్‌వీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రిన్సిపాళ్లు, గురువులతో పూర్వ విద్యార్థులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట మండలం కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2000-07 మధ్య చదివిన వారు ఆదివారం సందడి చేశారు. 220 మంది పూర్వ విద్యార్థులు, 20 మంది పూర్వ ఉపాధ్యాయులు, 20 మంది బోధనేతర సిబ్బంది, నలుగురు పూర్వ ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. నవోదయ పూర్వ విద్యార్థి, పశ్చిమ బెంగాల్ కేడర్ ఐఆర్‌ఎస్ అధికారి డి.సతీష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సివిల్ సర్వీసులకు సంబంధించి అన్నివిధాలా కెరీర్ గైడెన్స్ అందిస్తామన్నారు. ఏటా పదో తరగతిలో మొదటిస్థానంలో నిలిచిన వారికి రూ.10,000 ఇస్తామని ప్రకటించారు. ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, పూర్వ ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, అంజయ్య, మల్లేశ్వరరావు పాల్గొన్నారు. పూర్వవిద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. విద్యాలయానికి రూ.లక్ష విలువైన పోటీ పరీక్షల పుస్తకాలు అందించారు. కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గురువులను సత్కరించారు.

యాస వేరైనా తెలుగువారంతా ఒక్కటే

పచ్చడం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న తదితరులు

రాజాం, న్యూస్‌టుడే: సమ సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని తెలంగాణ శాసన మండలి సభ్యుడు, కవి, గాయకుడు గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాజాం రచయితల వేదిక 11వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కవిత్వంతో చెడుకు మేలు, మంచికి కీడు జరగకూడదన్నారు. కవులు సమాజంలోని హెచ్చుతగ్గులను కవిత్వీకరించాలని కోరారు. ప్రాచీనకాలం నుంచి నేటి వరకు సమాజం స్థితిగతులను అధ్యయనం చేసి, రచనలు సాగించిన వారే మనుగడ సాగించారని గుర్తు చేశారు. యాస వేరైనా తెలుగువారంతా ఒక్కటేనని చెప్పారు. పిల్లా తిరుపతిరావు రచించిన సాహిత్య వ్యాసాల పుస్తకం 'పచ్చడం'ను ఆవిష్కరించారు. గోరటిని వేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. గార రంగనాథం, పి.శ్రీనివాస్, ఎస్.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరకులకు శ్రీకాకుళం.. వైద్యానికి విశాఖి

- మాజీ సైనికులు, వితంతువులకు అవస్థలు
- ఉమ్మడి జిల్లాలో కొరవడిన సేవలు

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

ఉమ్మడి జిల్లాలో నివాసం ఉంటున్న త్రివిధ దళాలకు చెందిన మాజీ ఉద్యోగులు, జవాన్ల కుటుంబ సభ్యులు, వితంతువులు.. తదితరులకు సేవలు అందడం లేదు. సైనిక క్యాంటీన్, ఆసుపత్రి లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పొరుగు జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వైద్యానికైతే విశాఖకు, సరకులేమైనా కావాలంటే దగ్గర్లోని శ్రీకాకుళం కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

నగరంలోని సైనిక సంక్షేమాధికారి కార్యాలయం

అనుమతులు వచ్చినా..

సైనిక సంక్షేమ బోర్డు, మాజీ సైనికుల సంఘాల సభ్యులంతా ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. దీంతో 2023లో డిఫెన్స్ విభాగం స్పందించింది. ఆసుపత్రితో పాటు క్యాంటీన్, నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు అనుమతులిచ్చింది. అప్పట్లో రెవెన్యూ అధికారులు గాజులరేగ సమీపంలో 22 సెంట్లను కేటాయించారు. అది సరిపోదని మరో 40 సెంట్లు కోరగా.. ఆమేరకు ఆదేశాలొచ్చాయి. అన్నీ ఒకే దగ్గర ఉండేలా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ విధానంలో నిర్మాణాలు చేపట్టాలని భావించారు. టెండర్లు సైతం పిలిచారు. అక్కడి నుంచి ముందుకు కదల్లేదు.

ఏళ్ల నుంచి అంతే..

2017లో క్యాంటీన్ ఏర్పాటుకు అనువైన అద్దె భవనాలు చూడాలని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కానీ చర్యల్లేవు. 2023లో మరోసారి తెరపైకి వచ్చినా మరుగున పడేశారు. ఈ పరిస్థితికి గల కారణాలు మాత్రం తెలియరావడం లేదు.

ఉపయోగాలివీ..

రెండు జిల్లాల్లో ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు, మాజీలు, వితంతువులు.. ఇలా వివిధ కేటగిరీల కింద 17,556 మంది సైనిక సంక్షేమ శాఖలో నమోదయ్యారు. నిత్యావసరాలు, వైద్యం.. ఇతరత్రా సేవలు పొందేందుకు 5 వేల మంది వరకు కార్డులు పొందారు. కానీ కార్యాలయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. విజయనగరం జిల్లా వారు విశాఖ, శ్రీకాకుళం మధ్యలో ఉండడంతో కొంతమేర దూరాభారం తగ్గుతున్నా.. మన్యం వాసులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు.

- పిల్లలకు నైపుణ్యాలు నేర్పించేందుకు ఏర్పాటు చేయాలని భావించిన స్కిల్ కేంద్రానిదీ అదే దుస్థితి.

ప్రస్తుతానికి ఈసీహెచ్‌ఎస్..

విజయనగరంలో ప్రస్తుతానికి ఈసీహెచ్‌ఎస్(పాలీ క్లినిక్) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సంబంధిత సిబ్బందిని ఇటీవల విశాఖలో ఎంపిక చేశారు. వారు వచ్చాక అద్దె భవనాన్ని కేటాయిస్తాం. క్యాంటీన్, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల సమస్యను మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– సాయి ప్రసాద్, సైనిక సంక్షేమాధికారి, ఉమ్మడి విజయనగరం జిల్లా

మరణాలు తగ్గించేందుకు చర్యలు అవసరం

ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: 'మానవుడి ఆరోగ్యంపై కృత్రిమ మేధ ప్రభావం' అనే అంశంపై మూడు రోజుల పాటు విజయనగరం వేదికగా జరిగిన జీపీకాన్- 2025 సదస్సు ఆదివారంతో ముగిసింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వైద్య నిపుణులు, వైద్య రంగ ప్రముఖులు పాల్గొన్నారు. కాలిన గాయాలు, జీవన విధానం, వర్క్‌లైఫ్ బ్యాలెన్స్, గుండె సంబంధిత అంశాలపై సూచనలు చేశారు. గుండె దడ, బ్రెయిన్ స్ట్రోక్, క్యాన్సర్, కాలేయ, కిడ్నీ సమస్యల కారణంగా దేశంలో ఎక్కువ మంది మరణిస్తున్నారని సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డా.వెంకటేశ్వరరావు అన్నారు. తగ్గించేందుకు తగిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. వైద్యులు వీఎస్.ప్రసాద్, జేసీ.నాయుడు, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 4,009 మంది హాజరు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారు. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 19 కేంద్రాల్లో 4094 మందికి గానూ 4009 మంది (97.92శాతం) హాజరయ్యారు. డీఈవో యు.మాణిక్యం నాయుడు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ టి.సన్యాసిరాజు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీ చేశారు.

విజయనగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో తనిఖీ చేస్తున్న డీఈవో మాణిక్యం నాయుడు, ఏసీ సన్యాసిరావు తదితరులు

ఉపాధ్యాయుడి అవతారమెత్తిన కలెక్టర్

బాలికలతో మాట్లాడుతున్న ప్రభాకరరెడ్డి

బలిజిపేట, న్యూస్‌టుడే: మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఉపాధ్యాయుడి అవతారం ఎత్తారు. సుమారు రెండు గంటల పాటు విద్యార్థినులతో ముచ్చటించి.. విద్యాబుద్ధులు చెప్పారు. ఆదివారం రాత్రి బలిజిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. బాలికలతో మాట్లాడి, వారితో పాటలు పాడించి, నృత్యాలు చేయించారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. క్రమశిక్షణ, సహనం కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఎంఈవో సింహాచలం, తహసీల్దారు బాలమురళీకృష్ణ, ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఏవో శివగణేష్, కస్తూర్బా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గౌరీ సంతోషి పాల్గొన్నారు.

ప్యాలెస్‌లో కాకుండా ప్రజల్లోకి రావాలి: ఎంపీ

మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: దేశ, విదేశాలకు చెందిన కంపెనీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒప్పందాలు చేసుకుని, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. అశోక్‌బంగ్లాలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ పరకామణి కేసును చిన్నదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన బాబాయ్ హత్య కేసునే పట్టించుకోనప్పుడు.. ఇలాంటివన్నీ చిన్నవిగానే కనిపిస్తాయని ఎద్దేవా చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. ప్యాలెస్‌లలో కాకుండా ప్రజల్లోకి వస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. నాయకులు గంటా రవి, గాడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డోలీ కట్టి.. ఆసుపత్రికి తరలించి

గర్భిణిని మోసుకెళ్తున్న బంధువులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ శివారు గాదెల్లోవ గిరిజన గ్రామానికి చెందిన గర్భిణిని పురిటినొప్పులకు తోడు డోలీ కష్టాలు వేధించాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గర్భిణి అంటపర్తి భజంతికి ఆదివారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. ఆ ప్రాంతానికి వాహనాలు వచ్చే దారి లేదు. దీంతో చేసేది లేక, భర్త సన్యాసిరావు, బంధువులు కలిసి డోలీ కట్టి ఆమెను కాలినడకన 108 వాహనం వచ్చే మార్గం వరకు మోసుకెళ్లారు. అక్కడి నుంచి వాహనంలో ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. ఏళ్లు గడిచినా గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదని గి.సం. నాయకుడు గౌరీష్ వాపోయారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	147	264	274

లాకులకు సోకులెప్పుడో?

గరుగుబిల్లి మండలం తోటపల్లి కాలువ పైనున్న లాకులు(మదుము) దుస్థితి ఇది. ఏళ్ల నాటిది కావడంతో ఇనుప నిర్మాణాలన్నీ తుప్పుపట్టాయి. ప్రవాహానికి తిరిగిపోకుండా అడ్డంగా కర్ర పెట్టారు. దీంతో షట్టర్లు ఎత్తిదించే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామని ప్రాజెక్టు ఏఈ వెంకటరమణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

– న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

జాతీయస్థాయి పోటీల్లో మనోళ్ల సత్తా

ప్రతిభ చాటిన క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం గొర్లెవానిపాలెంలోని ఇండోర్ స్టేడియంలో రెండ్రోజుల పాటు జరిగిన 69వ రాష్ట్రస్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో 7 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన 36 మందిని జనవరి 17 నుంచి 22 వరకు దిల్లీలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఇందులో విజయనగరం జిల్లా నుంచి.. బాలికల్లో అండర్-17లో యూన్సీ, అండర్-19లో శ్రీహిత, బాలురలో అండర్-14 విభాగంలో ఎస్.కె.అయాన్, అండర్-17లో ఆకాశ్, అండర్-19లో వినయ్‌కుమార్, రోహిత్, వెంకటేశ్ ఉన్నారు.

జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఏపీ పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులు 2026 సంవత్సరానికి సంబంధించి జనవరి 1 నుంచి జీవన ప్రమాణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్స్) సమర్పించాలని ఉప ఖజానాధికారి వెంకటపద్మనాభం తెలిపారు. ఆదివారం బొబ్బిలిలో మాట్లాడారు. 2025 నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించిన పత్రాలు 2026కు చెల్లుబాటు కావన్నారు. ఉపఖజానా కార్యాలయంలోని జీవన ప్రమాణ యాప్ ద్వారా సమర్పించవచ్చన్నారు. పీపీవో, ఆధార్, బ్యాంకు అకౌంట్ నంబర్లను చరవాణి నంబరుకు అనుసంధానించాలని తెలియజేశారు. కార్యాలయంలో ఉచితంగా సేవలు అందిస్తామని, రాలేనివారు సమాచారం అందిస్తే, ఇంటివద్దకే వచ్చి పత్రాలు స్వీకరిస్తామని వెల్లడించారు.

తరగతి గదిలో ఉపాధ్యాయుడిపై చెప్పు విసిరిన విద్యార్థి!

విద్యావిభాగం: ఉపాధ్యాయుడిపై ఓ విద్యార్థి చెప్పు విసిరిన ఘటన విజయనగరంలోని ఓ పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. తరగతి గదిలో బాలుడు అల్లరి చేస్తుండడంతో సదరు ఉపాధ్యాయుడు ప్రశ్నించాడు. దీంతో చెప్పు విసిరాడు. బాధితుడు మండిపడగా.. దమ్ముంటే కొట్టి చూడు.. అన్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

అనధికార భవనమా.. క్రమబద్ధీకరణ ఇలా..

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

బీపీఎస్‌కు 39 దరఖాస్తులే

ముందుకొస్తే మేలంటున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రచారం లేకపోవడం, తెలిసినా కొందరు యజమానులు ముందుకు రాకపోవడంతో దరఖాస్తులు రావడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పురపాలికలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి.

విజయనగరంలోని బాబామెట్టలో కొలతలు తీసేందుకు వెళ్లిన ప్లానింగ్ కార్యదర్శులు

స్పందన అంతంతే..

రెండు జిల్లాల్లో గత అయిదేళ్లలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు వెలిశాయి. విజయనగరంలో భారీగా ఉన్నాయి. కానీ దరఖాస్తు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు 28 మంది మాత్రమే స్పందించారు. బొబ్బిలిలో ఏడు, రాజాంలో ఒకటి, పార్వతీపురంలో మూడు దరఖాస్తులు అందాయి. సాలూరు, నెల్లిమర్ల, పాలకొండ నుంచి ఒక్కటీ రాలేదు. అక్రమ భవనాల క్రమబద్ధీకరణకు పురపాలక పరిపాలన శాఖ నవంబరు 12న నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పటి నుంచి 120 రోజుల వ్యవధిలో దరఖాస్తులు చేసుకోవాలని గడువు నిర్దేశించింది. దీని ప్రకారం గుర్తింపు పొందిన టెక్నికల్ పర్సన్ల ద్వారానే దరఖాస్తులు అప్లోడ్ చేయాల్సి ఉంది. ప్రాథమిక రుసుము రూ.10 వేలతో పాటు ఇతర ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

ఇవి అవసరం..

★ యాజమాన్య ధ్రువీకరణ పత్రం(ఈసీ) ★ గతంలో మంజూరు చేసిన ప్లాన్(అందుబాటులో ఉంటే) ★ ప్రస్తుత తేదీలతో స్టాంప్‌లు, ఫొటోలు ★ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మించిన అక్రమ కట్టడాల ప్రాంతాన్ని గుర్తిస్తూ డ్రాయింగ్స్, రోడ్ల విస్తరణకు సమర్పించాల్సిన బాండ్, కట్టడం స్థిరత్వ ధ్రువీకరణ పత్రం ★ వివిధ విభాగాల నుంచి నిరభ్యంతర పత్రాలు

విక్రయాలకు అవకాశం

- క్రమబద్ధీకరణకు గత నెల 12న నోటిఫికేషన్ విడుదలైంది. 120 రోజుల వ్యవధిలో ముందుకు రావాలి. దరఖాస్తుల ఆధారంగా వార్డు సచివాలయాలకు చెందిన ప్లానింగ్ కార్యదర్శులు పరిశీలిస్తారు. భవనాన్ని తనిఖీ చేసి, నివాసయోగ్యంగా ఉంటే బీపీఎస్ అని రాస్తారు. ● పథకంలో చేరాలంటే ప్రాథమిక రుసుము కింద రూ.10 వేలతో పాటు ఇతర ఛార్జీలు చెల్లించాలి. ● పురపాలిక పరిధిలోకి వెళ్లాక బ్యాంకు రుణాలు పొందేందుకు అవకాశం కలుగుతుంది. ● ఇంటిపన్నుపై పెనాల్టీ తగ్గుతుంది ● రాయితీలు దక్కుతాయి ● క్రయవిక్రయాలకు ఇబ్బందులుండవు.

ప్రత్యేక సమీక్ష..

గడిచిన శుక్రవారం విజయనగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ నల్లనయ్య, బుడా అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష జరిగింది. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది, ఎల్టీపీలు హాజరయ్యారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చాముంతి సూచనలు చేశారు. అవగాహన కల్పించి, ఎక్కువ మంది ముందుకొచ్చేలా చూడాలని ఆదేశాలు జారీ చేసినట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

(c) eenadu

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? కొప్పర గ్రామంలో కాలువలు శుభ్రం చేయడంలేదు. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - **గ్రామస్థులు** ★ కార్యదర్శితో మాట్లాడి, శుభ్రం చేయిస్తాం. - **రాజారావు, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, వంగర

? ఎం.సీతారాంపురం రహదారి పక్కన చెత్త నిల్వలు వేస్తున్నారు. సంపద కేంద్రానికి తరలించకుండా తలగాం వెళ్లే రహదారిలో పడేస్తున్నారు. ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ★ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, చర్యలు తీసుకుంటాం. - **రామారావు, పంచాయతీ విస్తరణాధికారి** – వంగర

? రాజాం- రామభద్రపురం రహదారిలో వస్త్ర పురికాలనీ వద్ద దారి పక్కన చెత్తకు నిప్పు పెడుతున్నారు. ఇబ్బంది పడుతున్నాం. - **గ్రామస్థులు** ★ చర్యలు తీసుకుంటాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – రాజాం పట్టణం

? లక్కిడాం కూడలి మీదుగా రావివలస గ్రామానికి వెళ్లే కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **స్థానికులు** ★ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతాం. - **విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో** – గంట్యాడ గ్రామీణం

? సోంపురం గ్రామంలో ప్రధాన రహదారిపై కల్వర్టు పాడైపోయింది. వర్షం కురిస్తే నీరు నిలిచిపోతోంది. - **స్థానికులు** ★ ప్రతిపాదనలు పంపిస్తాం. - **రమేష్, ఏఈ** – రామభద్రపురం

? గొల్లలపాలెం- అలకనారాయణపురం దారిలో రెండు చోట్ల కల్వర్టులు లేవు. పంటను ఇంటికి తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. - **రైతులు** ★ కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - **పి.చంద్రశేఖర్, జేఈఈ** – న్యూస్‌టుడే, చీపురుపల్లి గ్రామీణం

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సాయం

మెరకముడిదాం, గరివిడి, న్యూస్‌టుడే: మెరకముడిదాం మండలం గర్భాం ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.25 వేలు విలువైన 10 పంకాలు, 40 ట్యూబ్ లైట్లు, 5 ఫ్లడ్ లైట్లు కొనుగోలు చేసి ఆదివారం అందించారు. ఉపాధ్యాయులు ఉమ, హేమలత, పూర్వ విద్యార్థులు టీవీవీఎల్ నరసింహం, ఎస్.శంకరరావు, పి.మురళీకృష్ణ, జె.శ్రీను, ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో) ★ టమాటా: 52 ★ వంకాయలు: 42 ★ దొండ: 31 ★ బీర: 60 ★ బెండ: 72 ★ కాకర: 50 ★ చిక్కుడు: 42 ★ ఆనపకాయ (ఒకటి): 25 ★ అరటి (జత): 20 ★ మునగ: 70 ★ ఉల్లి: 30 ★ బంగాళదుంపలు: 30 ★ అల్లం: 80 ★ వెల్లుల్లి: 80 ★ పచ్చిమిర్చి: 60 ★ క్యాబేజీ: 32 –న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్‌వీసీ సీతారామా: **ఆంధ్రా కింగ్ తాలూకా** ★ ఎస్‌వీసీ సీతారామా మినీ: **రాజు వెడ్స్ రాంబాయి** ★ ఎస్‌వీసీ అప్సర: **అమరకావ్యం** – న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలిలో.. ★ లక్ష్మీ: **ఆంధ్రా కింగ్ తాలూకా** ★ వాసవి: **రాజు వెడ్స్ రాంబాయి** – న్యూస్‌టుడే, బొబ్బిలి

భూసారం.. నిప్పుతో నిస్సారం

న్యూస్‌టుడే– సంతకవిటి

మండవకురిటిలో వరి దుబ్బులు కాల్చిన రైతులు

నగరాలన్నీ ఇప్పటికే వాయు కాలుష్యానికి నిలయాలుగా మారాయి. పల్లెలైనా స్వచ్ఛమైన గాలితో ప్రశాంతంగా ఉంటాయనుకుంటే.. రైతుల అవగాహనా రాహిత్యంతో కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. పంట పొలాల్లోని గడ్డికి నిప్పు పెట్టి చేతులారా భూసారాన్ని తగ్గించేస్తున్నారు.

రాజాం నియోజకవర్గంలోని రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 62,388 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో పంటను పొలంలోనే నేరుగా యంత్రాలతో కోయడం, నూర్పు ఒకేసారి చేస్తున్నారు. దాదాపు అందరూ ఎండు గడ్డిని మంట పెట్టి కాల్చి వేస్తున్నారు. దీంతో పంట పొలాల్లో సారం తగ్గిపోతోంది. వాతావరణానికి ముప్పు వాటిల్లుతోంది.

మండలం	సంతకవిటి	రేగిడి	రాజాం	వంగర
సాగు విస్తీర్ణం హెక్టార్లలో	8,969	7,457	5,322	4,207

తగ్గిన గడ్డి వినియోగం..

ఒకప్పుడు కోతలు అయ్యాక, పశువులతో నూర్పులు చేపట్టి, గడ్డిని మేతగా వినియోగించేవారు. కొంతమంది వ్యాపారులు వరి గడ్డిని కొనుగోలు చేసి, ట్రాక్టర్లపై దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించేవారు. భూసారం పెంచేందుకు పొలంలో వేసి, కలియదున్నేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగింది. అన్ని పనులకూ పశువుల స్థానంలో యంత్రాలు వచ్చాయి. పని సులభమైంది. దీంతో మూగజీవాల పెంపకం కూడా తగ్గింది. వరి గడ్డి వినియోగించకుండా తగలబెడుతున్నారు.

ఇవీ అనర్థాలు..

★ గడ్డిని కాల్చడం వల్ల వచ్చే పొగతో గాలిలో కాలుష్యం పెరుగుతుంది. ★ పొగను పీల్చడం ద్వారా చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలకు గురవుతారు. ఇప్పటికే శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ★ గడ్డిని తగలబెట్టడంతో భూమికి మేలు చేసే క్రిమి కీటకాలు, మిత్రపురుగులు, సూక్ష్మజీవులకు ప్రమాదం వాటిల్లుతుంది. ★ భూమిలోని ఖనిజాలకు నష్టం కలిగి, సారం తగ్గుతోంది. తర్వాత పెట్టే పంటల దిగుబడులు తగ్గే అవకాశముంది.

కలియదున్నితే లాభాలు..

★ ఎండు గడ్డిని పొలమంతా చల్లి భూమిలో కలియదున్నటం వల్ల సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. ★ భూసారం పెరుగుతుంది. ★ తర్వాత పెట్టే పంటకు నత్రజని, ఇతర ఎరువులు ఎక్కువగా వాడాల్సిన అవసరం లేదు. ★ దిగుబడులు పెరుగుతాయి. ★ కలుపు మొక్కలు నివారించవచ్చు.

అవగాహన కల్పిస్తాం..

రైతులు కోత, నూర్పులు చేసిన తర్వాత ఎండి గడ్డిని పొలంలో వేయడం వల్ల భూసారం పెరుగుతుందని సంతకవిటి ఏవో యశ్వంత్‌రావు తెలిపారు. కొంతమందికి అవగాహన లేకపోవడం వల్ల మంటలు పెడుతున్నారని, దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు మేలు

చెక్కులు అందిస్తున్న మంత్రి కొండపల్లి

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు మేలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గంట్యాడలోని పార్టీ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సహాయనిధి చెక్కులు అందించారు. జగ్గాపురం పంచాయతీ గొర్లిపేట గ్రామానికి చెందిన బొత్స మణికంఠకు రూ.1,58,918.. రామవరానికి చెందిన పొట్నూరు ప్రవీణ్‌కు రూ.1,00,578 మంజూరయ్యాయన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కరరావు, కొప్పలవెలమ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ అల్లు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రమిస్తేనే రాజ్యాధికారం

మాట్లాడుతున్న రచయిత రాజేష్

బొబ్బిలి, న్యూస్‌టుడే: శ్రమిస్తేనే రాజ్యాధికారం సాధించగలమని రచయిత, కవి రాజేష్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బొబ్బిలి తాండ్రపాపారాయ కూడలిలో బహిరంగ సభ జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రశ్నించేతత్వం అందరిలో అలవాడాలన్నారు. పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య, ప్రతినిధులు బొద్దన అప్పారావు, యండ గోపాలరావు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎం.కృష్ణ తదితరులు మాట్లాడారు.

ఆరుబయట సైకిల్

రాజాం పట్టణంలోని డోలపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు స్థల సమస్య పీడిస్తోంది. విద్యార్థులు సైకిళ్లను నిలపడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 472 మంది చదువుతున్న ఈ బడిలో సమస్యలు వేధిస్తున్నాయి. సైకిళ్లను ఆరుబయట రోడ్డుపై ఉంచుతున్నారు. ఎండా వానకు దెబ్బతింటున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలం లేకపోవడంతో షెడ్డు ఏర్పాటు చేయలేకపోతున్నట్లు హెచ్‌ఎం మురళీకృష్ణ తెలిపారు. దాతలు ముందుకొస్తే సమస్య తీరుతుందన్నారు. – న్యూస్‌టుడే, రాజాం

దొంగల అరెస్టు : చోరీ సొత్తు స్వాధీనం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం పిరిడిలోని శాంకరి మాత ధ్యాన మందిరంలో నవంబరు 5న దొంగతనం జరిగింది. దేవీ మెడలోని పుస్తెలతాడు, శతమానాలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సతీష్‌కుమార్‌కు ఆదివారం వచ్చిన సమాచారం మేరకు ఎస్సై రమేష్, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీతానగరం మండలానికి చెందిన పి.భాస్కరరావు, శ్రీకాకుళం జిల్లా హిరమండలానికి చెందిన సవర సూర్యంను బొబ్బిలిలో అరెస్టు చేశారు. వారి వద్ద దొంగలించిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరూ సీతానగరం మండలం లచ్చయ్యపేట వేంకటేశ్వర ఆలయంలో కూడా బంగారం, వెండి వస్తువులు దొంగలించినట్లు అంగీకరించారన్నారు. ఇరువురిపై ఇదివరకు పలు కేసులు ఉన్నట్లు సమాచారం.

మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.90 లక్షలు

చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో మరుగుదొడ్డు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ మిషన్ కింద చీపురుపల్లి మండలంలోని పలుచోట్ల 30 మరుగుదొడ్ల యూనిట్ల నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్‌కు రూ.3 లక్షల చొప్పున కేటాయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో 7, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బీసీ బాలికల వసతిగృహంలో 6 చొప్పున, మండల పరిషత్తు కార్యాలయం, మెట్టపల్లి ఉన్నత పాఠశాలలో 2 చొప్పున, కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో 4, నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద 2, అగ్నిమాపక కేంద్రంలో ఒకటి చొప్పున మంజూరయ్యాయి. పలుచోట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సంక్రాంతి నాటికి పూర్తి చేయనున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ఐ.రామకృష్ణ తెలిపారు.

యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక

దత్తిరాజేరు: మండల యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక ఆదివారం కోమటిపల్లిలో జరిగింది. అధ్యక్షుడిగా చంద్రరావు, ఉపాధ్యక్షుడిగా జి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా వానపల్లి సత్యనారాయణ, కోశాధికారిగా ఆదినారాయణ, మహిళా అధ్యక్షురాలిగా పెంకి రోజ్‌నళిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

ధాన్యం మిల్లుల తనిఖీ

బొబ్బిలి గ్రామీణం: మండలంలోని పలు మిల్లులను తహసీల్దార్ శ్రీను, సీఎస్‌డీటీ సాయి కృష్ణ, డీటీ సుబ్బారావు తనిఖీ చేశారు. మిల్లర్లు కొనుగోలు చేయడానికి అభ్యంతరం చెప్పకూడదని హెచ్చరించారు. బ్యాంకు గ్యారెంటీలు లేకపోయినా వచ్చిన ధాన్యం దించాలని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ట్యాంకు ఉంది.. కుళాయిలు లేవు

వంగర మండలం చినరాజుల గుమ్మడ గ్రామంలో తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు పదేళ్ల క్రితం రూ.లక్షలు ఖర్చుచేసి ట్యాంకు నిర్మించారు. నీటిని సరఫరా చేసేందుకు కుళాయిలు ఏర్పాటు చేయలేదు. దీంతో పథకం అలంకార ప్రాయంగా మిగిలిపోయింది. గ్రామంలోని 110 కుటుంబాల ప్రజలు సమీపంలోని నాగావళి నదిపై ఆధారపడుతున్నారు. దూరం నుంచి నీరు తెచ్చుకోవడానికి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిలు ఏర్పాటు చేసి, తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నయ్య వద్ద ప్రస్తావించగా.. రూ.22 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. – న్యూస్‌టుడే, వంగర

రహదారి పనుల్లో నాణ్యత ముఖ్యం

తెర్లాం, న్యూస్‌టుడే: రహదారి మరమ్మతుల పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులను ఎమ్మెల్యే బేబీనాయన సూచించారు. చిలకపాలెం- రాజాం, రామభద్రపురం రహదారిలో జరుగుతున్న మరమ్మతు పనులను ఆదివారం పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని గుత్తేదారులకు సూచించారు. రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు.

రైతులకు నష్టం కలగకుండా చూస్తాం

రామభద్రపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో రైతులకు నష్టం కలగకుండా చూస్తామని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఆదివారం రామభద్రపురంలోని తెదేపా కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గంలో పలువురు మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై కలెక్టర్, పౌరసరఫరాల అధికారులతో మాట్లాడానని, చర్యలు తీసుకుంటామన్నారన్నారు.

ప్రవాసాంధ్రుల సేవలు ప్రశంసనీయం

బొబ్బిలి, న్యూస్‌టుడే: పాతబొబ్బిలిలోని దయగలగోడ సేవలకు ప్రవాసాంధ్రులు చేయూతనివ్వడం గొప్పవిషయమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఆదివారం బొబ్బిలి అయ్యప్పస్వామి ఆలయం వద్ద దయగలగోడ సభ్యుల ప్రేరణతో ప్రవాసాంధ్రుడు మంగళం కృష్ణన్ విశ్వనాథన్ కుటుంబసభ్యులు పంపిన సుమారు రూ.20 వేలు విలువైన దుస్తులను పంపిణీ చేశారు. అధ్యక్షుడు విజయమోహన్, సభ్యులు కృష్ణదాస్, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: వాహనదారులు రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని చీపురుపల్లి ఎస్సై దామోదరరావు అన్నారు. చీపురుపల్లి-గరివిడి ప్రధాన రహదారిలో ఆదివారం తనిఖీ చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి జరిమానాలు విధించారు.

బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఎన్నిక

రాజాం: రాజాంలోని గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రంప జగదీశ్వరశర్మ, కొల్లూరు తిరుమలేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కె.మధు, వై.సత్యశ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రవి, చంటి, కోశాధికారిగా ఎం.వేణుగోపాలరావు ఎన్నికైనట్లు అధ్యక్షుడు జగదీశ్వరశర్మ తెలిపారు.

మిల్లర్లు రైతులకు సహకరించాలి

తెర్లాం, న్యూస్‌టుడే: రైస్ మిల్లర్లు రైతులకు సహకరించాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ అన్నారు. ఆదివారం తెర్లాంలోని రైస్‌మిల్లును పరిశీలించి, యజమాన్యం, రైతులు, సాంకేతిక సిబ్బందితో మాట్లాడారు. క్వింటా కంటే ధాన్యం ఎక్కువగా తూకం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉప తహసీల్దారు జి.సత్యనారాయణ, సీఎస్‌డీటీ స్వర్ణలత, ఆర్‌ఐ కృష్ణమూర్తి వేర్వేరుగా మిల్లులను తనిఖీ చేశారు.

'రెండో సిలెండర్ ఏది?'

గజపతినగరం, న్యూస్‌టుడే: సూపర్-6 అమలు చేశామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ప్రజలకు రెండో సిలెండర్ ఎప్పుడు ఇచ్చారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఆదివారం గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా నియోజకవర్గంలో ఇప్పటివరకు 70 వేల సంతకాలు సేకరించామన్నారు. ఈనెల 10న పార్టీ జిల్లా కార్యాలయానికి అప్పగిస్తామన్నారు. దివ్యాంగులను ధ్రువపత్రాల పరిశీలన పేరుతో అవస్థలకు గురిచేస్తున్నారన్నారు. నాయకులు గారతవుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల బిల్లులు అందేదెన్నడో?

న్యూస్‌టుడే– బొబ్బిలి గ్రామీణం

రాముడువలసలో తొట్టెలో నీరు తాగుతున్న పశువులు

ఆవులు, మేకలు, గొర్రెలు మేతకు వెళ్లి వచ్చిన తరువాత నీరు లేక దాహంతో అలమటించేవి. వీటి దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నిధులతో నీటి తొట్టెలను మంజూరు చేసింది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పల్లెల్లో నిర్మాణాలు చేపట్టారు. కానీ ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి.. ఒక్కో నీటితొట్టెకు రూ.30 నుంచి రూ.35 వేల చొప్పున నిధులు కేటాయించారు. బొబ్బిలి డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో 79 నిర్మించారు. పశుసంవర్ధక శాఖ, ఉపాధిహామీ పథకం అధికారుల పర్యవేక్షణలో నిర్మాణాలు చేపట్టారు. పశువులు మేతకు వెళ్లి వచ్చే మార్గంలో రహదారికి సమీపంలో ఏర్పాటు చేశారు.

మండలం	మంజూరు చేసిన తొట్టెలు
బొబ్బిలి	14
బొండపల్లి	11
దత్తిరాజేరు	09
గజపతినగరం	19
మెంటాడ	10
రామభద్రపురం	02
తెర్లాం	07
బాడంగి	07

బిల్లులు పంపించాం.. నిర్మించిన మేరకు బిల్లులు పంపించాం. నిధులు విడుదల కాగానే నిర్మించినవారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరితగతిన వచ్చేలా చూస్తాం. – **రమామణి, ఉపాధి పథకం ఏపీడీ**

ఈ దారికో దండం

దత్తిరాజేరు మండలంలోని పాచలవలసకు వెళ్లే రహదారి అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి అర కిలోమీటరు మేర ఉన్న రోడ్డు గోతులతో దారుణంగా తయారైంది. రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. విషయం ఎంపీడీవో కిశోర్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, దత్తిరాజేరు

అప్పలస్వామి సేవలు మరువలేనివి

తెర్లాం, న్యూస్‌టుడే: ఉద్యోగిగా, రాజకీయ నాయకుడిగా ప్రజలకు అప్పలస్వామి చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. ఎమ్మెల్యే బేబీనాయనతో కలిసి ఆదివారం తెర్లాంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సుపల్లి అప్పలస్వామి సంతాప సభలో పాల్గొన్నారు. చిత్రపటానికి నివాళులర్పించారు. ఏఎంసీ ఛైర్మన్ నర్సుపల్లి వెంకటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆంగ్ల ప్రతిభా పరీక్ష..

రాజాం: రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పదోతరగతి విద్యార్థులకు ఆదివారం ఇంగ్లీష్ ఫోరం ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ (ఫెల్ట్) ఆధ్వర్యంలో ఆంగ్ల ప్రతిభా పరీక్ష నిర్వహించారు. రాజాం, రేగిడి, సంతకవిటి, అరసాడ ఉన్నత పాఠశాలల్లో 162 మంది విద్యార్థులు హాజరైనట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీవీ అచ్యుత్‌కుమార్, ఆర్‌వీజే నాయుడు తెలిపారు. ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం పూర్తి

ఈనాడు కథనానికి స్పందన

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ మండలం కొర్లాం చెరకు కాటా మీదుగా కొండతామరాపల్లి వెళ్లే జాతీయ రహదారిలో అసంపూర్తిగా పనులు ఉండడంతో చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. అధికారులు స్పందించి, రోడ్డు పనులు పూర్తి చేయించారు. ప్రయాణికుల అవస్థలు తీరాయి.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కార్యకర్తలతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి

రామభద్రపురం, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. ఆదివారం రామభద్రపురం మండల కేంద్రంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. జనసేన బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. నాయకులు మహంతి ధనుంజయ, కనకల శ్యామ్, చీమల సతీష్, అల్లు రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ చేస్తున్నారని నిరసన

బాడంగి: మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారని రైతు సంఘాల నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. బాడంగి మండలం ఎత్తుఖానా సమీపంలోని ఓ రైస్ మిల్లు వద్ద ధర్నా చేపట్టారు. ట్రక్కు సీట్లు పట్టుకొని రైతులు వస్తున్నారని, బియ్యం ముక్కలు అవుతున్నాయని, అదనంగా ధాన్యం ఇవ్వాలని డిమాండు చేస్తున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని నాయకులు గోపాలం, శంకరరావు కోరారు.

చిట్టి చేతులు.. పెద్ద సాయం

దుప్పట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు, సత్యసాయి భక్తులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని రెడ్డిపేటకు చెందిన 9 మంది సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు దాతృత్వం చాటుకున్నారు. అందరూ కలిసి కూడబెట్టుకున్న సొమ్ముతో దుప్పట్లు, తువాళ్లు కొనుగోలు చేసి 22 మంది రిక్షా కార్మికులకు ఆదివారం పంపిణీ చేశారు. వారిని సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఏవీ రవిప్రసాద్, సమన్వయకర్త శ్రీధరమూర్తి తదితరులు అభినందించారు.

నామమాత్రంగా బడ్జెట్ సమావేశం

సమావేశంలో నాయకులు

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం మండల పరిషత్తులో ఆదివారం ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం జరిగింది. కో-ఆప్షన్ సభ్యుడితో కలిపి 17 మంది సభ్యులు ఉండగా.. 10 మంది మాత్రమే హాజరయ్యారు. అధికారులు ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధిహామీ ఈసీ మాత్రమే వచ్చారు. సర్పంచులు ఒక్కరూ హాజరు కాలేదు. 2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.

అగ్నివీర్‌కు ఎంపికైన యువతకు సత్కారం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలో యువత ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ పొంది, అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైన 13 మంది, సీఐఎస్‌ఎఫ్ ఎస్సై, ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన యువకులను మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఉచితంగా శిక్షణ ఇవ్వటం గొప్పవిషయమని శిక్షకులు బి.నవీన్‌కుమార్, కంది హేమంత్‌కుమార్‌లను అభినందించారు. శ్రీనివాసరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శునకాల సంచారం.. భయంతో ప్రయాణం

రాజాం పట్టణంలోని శ్రీకాకుళం, పాలకొండ రహదారులు, మల్లికార్జునకాలనీ, వాసవీనగర్‌లలో వీధి శునకాల బెడద ఎక్కువగా ఉంది. రాత్రివేళల్లో వెంబడిస్తుండడంతో చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దాడి చేస్తున్నాయని పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలు సాగించాలంటే భయంగా ఉందని వాపోతున్నారు. పురపాలక సంఘ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. శునకాల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

చీరకు నిప్పు అంటుకొని వృద్ధురాలికి గాయాలు

రాజాం, న్యూస్‌టుడే: చీరకు దీపం నిప్పు అంటుకొని వృద్ధురాలు గాయపడిన ఘటన రాజాంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజాం పట్టణంలోని మల్లికార్జునకాలనీకి చెందిన వృద్ధురాలు ఎస్.విజయరత్నం (78) ఈనెల 6న ఉదయం తులసికోట వద్ద దీపం పెట్టారు. ప్రమాదవశాత్తు నిప్పు చీరకు అంటుకుంది. ముఖం, శరీరంపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు రాజాంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించారు. కుమారుడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని రాజాం సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మృతదేహాల కోసం ఎదురుచూపు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం రామనాథపురంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు రెండు రోజులుగా ఎదురు చూస్తున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో తమిళనాడు నుంచి అంబులెన్సుల్లో తిరుపతి తీసుకొచ్చారు. అక్కడి నుంచి మృతదేహాలను స్వగ్రామాలకు చేర్చేందుకు చిత్తూరు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయానికి వచ్చే అవకాశముందని తెలిపారు.

బోరు.. కూరుకుపోయింది..!

గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం పశువైద్యకేంద్రంలో తాగునీటి బోరు మట్టిలో కూరుకుపోయింది. నీరు పట్టుకునేందుకు అవస్థలు పడుతున్నామని సిబ్బంది, రైతులు వాపోతున్నారు. చుట్టూ రెండు అడుగుల మేర మట్టి చేరడంతో నీరు పట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై పశువైద్యాధికారి సత్యనారాయణను వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు చెప్పి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పెదమజ్జిపాలెం (గంట్యాడ గ్రామీణం)

వార్షికోత్సవ శుభాకాంక్షలు
సుధా జ్యూయలరీ
మెయిన్ రోడ్, బొబ్బిలి, సెల్: 9440540401
GOLD & SILVER Ornament
Merchants 91.6 KDM
Order Suppliers
ప్రొ॥ పూసర్ల సుధాకర్

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జామి, న్యూస్‌టుడే: జామి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1981-82 పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అలమండ సంత సమీపంలో ఒక మామిడితోటలో కలిశారు. సుమారు 43 ఏళ్ల తర్వాత కలిసిన వీరు రోజంతా ఆనందంగా గడిపారు. మధుర జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. భీమసింగి సహకార చక్కెర కర్మాగార ఎండీ వేమల సన్యాసినాయుడు పూర్వ విద్యార్థిగా ఇక్కడికి హాజరయ్యారు.

ఆత్మీయ సమావేశం

కార్యక్రమంలో పాల్గొన్న వివిధ వర్గాల నాయకులు

ఎస్.కోట: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ వర్గాలు, పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం తాటిపూడిలో వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో భోజనాలు చేసిన ఎమ్మెల్యే రమారాజు, సుబ్బలక్ష్మి దంపతులు, ఎంపీపీ సోమేశ్వరరావును నిర్వాహకులు సన్మానించారు.

యోగాతో మేలు

విజయనగరం కోట, కంటోన్మెంట్: ఎయిమ్ రామ యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయనగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉచిత యోగా తరగతులు జరిగాయి. బ్రెయిన్ యోగాపై అవగాహన కల్పించినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాస్ తెలిపారు. ఆసనాలు ఆయుష్ సంస్థ ఆధ్వర్యంలో డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు ప్రారంభించినట్లు చెప్పారు.

హాజరైన విద్యార్థులతో శ్రీనివాస్

నూతన కార్యవర్గం ఎన్నిక

కార్యవర్గ సభ్యులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: హిందీ మంచ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం విజయనగరంలోని పూల్‌బాగ్ సరస్వతి శిశుమందిర్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నందివాడ చిన్నాదేవి, గౌరవ అధ్యక్షురాలిగా పి.ఉమాబాల, సహాధ్యక్షురాలిగా భోగరాజు సూర్యలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా కె.రోజా, కె.శారద పద్మావతి, ఉపాధ్యక్షులుగా ఎ.చంద్రరావు, విజయలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా సాలూరి సంతోషి, వై.సూర్యకుమారి, శ్రీదేవి, ముఖ్య సలహాదారుడిగా కుసుమంచి సుబ్బారావు, గౌరవ సలహాదారుడిగా దవళ సర్వేశ్వరరావు నియమితులయ్యారు. మంచ్ ఉత్తరాంధ్ర కార్యదర్శి కోనె శ్రీధర్ ఎన్నికల సమన్వయకర్తగా వ్యవహరించారు. సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

తెరపై ఈనాడు

● ఎస్ఎస్ఎస్: ఆంధ్రా కింగ్ తాలూకా ● శ్రీకృష్ణ: రాజా వెడ్స్ రాంబాయి ● ఆదిత్య: మాస్ జాతర ● లీలామహల్: రివాల్వర్ రీటా ● రంజని స్క్రీన్- 1: ఆంధ్రా కింగ్ తాలూకా ● శివరంజని స్క్రీన్–2: అవతార్ కావ్యం ● హిమగిరి: 12ఎ రైల్వే కాలనీ ● సప్తగిరి: 12ఎ రైల్వే కాలనీ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం... మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం- 80089 02900
విజయనగరం గ్రామీణం- 80085 74317
ఎస్.కోట- 8008574326
భోగాపురం- 70959 54646

?: రాజీవ్‌నగర్ కాలనీలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. - స్థానికులు ● నివారణకు చర్యలు తీసుకుంటాం. - పి.నల్లనయ్య, కమిషనర్

?: విజయనగర్‌లో పెద్దచెరువు అదనపు నీటి పారుదల కాలువ పూర్తిగా నిండిపోయింది. - స్థానికులు ● పరిశీలించి, తొలగిస్తాం. - పి.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి

?: దాసన్నపేట కాళీమాత కోవెల నుంచి రాజీవ్‌నగర్ కాలనీకి వెళ్లే దారి పొడవునా గుంతలున్నాయి. - స్థానికులు ● పూడ్చేలా చూస్తాం. - పి.నల్లనయ్య, కమిషనరు

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

? గుంకలాం శివారుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. - స్థానికులు ● పరిశీలించి శుభ్రం చేయిస్తాం. - శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

పాఠాలు వినాలా.. పైకి చూడాలా?

శిథిల బడుల్లో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తాం.. అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం.. నాడు-నేడులో రూ.కోట్లు ఖర్చుచేశామంటూ గత వైకాపా ప్రభుత్వం ప్రకటనలు చేసినా అయిదేళ్లలో పాఠశాలల కనీస అవసరాలు తీర్చలేకపోయింది. కొత్త నిర్మాణాలు కాదుకదా.. భవనాల మరమ్మతులూ చేయలేకపోయింది. శిథిల భవనాలూ తొలగించని కారణంగా గత్యంతరం లేక కొన్నిచోట్ల అందులో తరగతులు నిర్వహిస్తుండగా, మరికొన్నిచోట్ల పక్కనే ఉన్న భవనాల్లో బోధన సాగిస్తున్నారు. ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు.

అన్నంరాజుపేట శివారు చెరువు లోపల పాఠశాల స్లాబు పరిస్థితి

నిధుల రాగానే చర్యలు..

భవనాల తొలగింపునకు విద్యాశాఖ నుంచి నిధులివ్వాలి. పంచాయతీ నిధులు కేటాయించేందుకు ముందుకొస్తే.. సమగ్ర శిక్షా ఈఈ శిథిల భవనాలు పరిశీలించి వినియోగానికి పనికిరావని నిర్ధారిస్తే తొలగింపునకు అనుమతి ఇస్తాం. నిధులు రాగానే పనులు చేయిస్తాం. - మాణిక్యంనాయుడు, డీఈవో విజయనగరం

ఎస్.కోటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కనే ప్రమాదకరంగా శిథిల భవనం

నిధులెక్కడివి?

శిథిల భవనాలు తొలగిస్తే పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆడుకోవడానికి, కిచెన్ గార్డెన్ల నిర్వహణకు వీలుంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు. వీటిని తొలగించడానికి అయ్యే ఖర్చు ఎవరు భరించాలో తెలియక వీటిని ముట్టుకోవడానికి ఎవరూ సిద్ధపడడం లేదు. శృంగవరపుకోట డివిజన్‌లోని ఎస్.కోట నియోజకవర్గంలో 19 వరకు ఇలాంటి భవనాలు దర్శనమిస్తున్నాయి.

మండలాల్లో పాడైన భవనాలు ఇలా..

మండలం	శిథిలాల సంఖ్య
ఎస్.కోట	6
కొత్తవలస	3
ఎల్.కోట	3
వేపాడ	4
జామి	3

ఇవీ అవస్థలు..

● ఎస్.కోటలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గతంలో జూనియర్ కళాశాల కోసం నిర్మించిన మూడు గదులు నిరుపయోగంగా ఉంచడంతో శిథిలావస్థకు చేరాయి. ఇందులో ఒక గదిని స్టోర్ రూం చేశారు. ఉసిరి, వినాయకపల్లి, శివరామరాజుపేట, ధర్మవరం ఎస్సీ కాలనీ, కృష్ణాపురం పాఠశాలల్లో పాడైన భవనాలు చెంతనే ఉండడంతో విద్యార్థులకు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

జామి మండలం అన్నంరాజుపేట బడి స్లాబు పెచ్చులూడుతుండడంతో రామకోవెలలో తరగతులు నిర్వహిస్తున్నారు. శిరికిపాలెం భవనం వర్షం పడితే కారుతోంది. ప్రత్యామ్నాయం లేక అందులోనే పాఠాలు బోధిస్తున్నారు. జన్నివలస స్కూలులో పెచ్చులు పడుతున్నా అక్కడే నిర్వహిస్తున్నారు.

వేపాడ మండలం బంగారయ్యపేట బడి శిథిలమైనా, గత్యంతరం లేక అక్కడే తరగతులు నిర్వహిస్తున్నారు.

ఎల్.కోట, కొత్తవలస మండలాలోన్లి రెల్లి, కంటకాపల్లి, కంటకాపల్లి ఆర్ఎస్, గేదెలవానిపాలెం, లచ్చంపేట, ఆర్‌జీపేట బడుల్లో ఇదే పరిస్థితి.

పరిశుభ్రతతో ఆరోగ్యం

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం, ఆహ్లాదం ఉంటుందన్నారు. అందరికీ అవగాహన కల్పించాలన్నారు.

ముఖ్యమంత్రికి సమస్య వివరిస్తాం

ఎస్.కోట: సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కలిసి విన్నవిస్తామని జిందాల్ నిర్వాసితులు అన్నారు. ఆదివారం బొడ్డవరలో నిరసన శిబిరంలో పాల్గొన్న వారంతా మాట్లాడారు.

బాబోయ్.. భరించలేని దుర్గంధం

నగరంలోని పెద్ద చెరువు నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతంలోని ప్రజలు దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి చెరువులో గొరస చేపలు ఎక్కువగా మృత్యువాత పడుతుండడంతో ట్యాంక్‌బండ్ రోడ్డు, రామారాయుడు మార్గంలో దుర్వాసన వెదజల్లుతోంది. పరిసర కాలనీల ప్రజలు భరించలేక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తితో కలిసి పెద్ద చెరువు పరిశీలించారు. ప్రజారోగ్య, మత్స్యశాఖ సంయుక్తంగా మృత చేపలను తొలగించి బాగు చేయాలని ఆదేశించారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఇంకా మట్టిదారులే!!

విజయనగరం మండలం గుంకలాంలో నగరపాలక సంస్థకు చెందిన పేదలకు కేటాయించిన గృహనిర్మాణ కాలనీలో పక్కా రోడ్లు లేవు. ఏళ్ల నుంచి మట్టిదారులే దర్శనమిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సమయంలో అడుగు తీసి వేయలేని పరిస్థితి. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అక్కడి నివాసదారులు వాపోతున్నారు. ఈ సమస్యను గృహనిర్మాణ డీఈ రంగారావు వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

గోతులు పూడ్చక ఇక్కట్లు

ఎస్.కోట పట్టణంలో శ్రీనివాసాకాలనీలో ఇంటింటి కుళాయిల కోసం రోడ్డు పక్కన తవ్వి వదిలేశారని కాలనీ వాసులు వాపోతున్నారు. కొన్ని చోట్ల సీసీ రోడ్డు కూడా తవ్వేశారు. రోడ్లు, గోతులను పూడ్చకపోవడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీకి చెందిన శీరాపు శ్రీనివాసరావు వాపోయారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యకిశోర్ వద్ద ప్రస్తావించగా కాలనీలో దాదాపు 60శాతం వరకు తవ్విన రోడ్లు కప్పేశామని, త్వరలో మిగతావి కూడా పూడ్చుతామన్నారు.

- న్యూస్‌టుడే, శృంగవరపుకోట

పేదలకు అండగా సీఎం సహాయనిధి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆదివారం ఆమె ఎల్.కోటలో వివిధ గ్రామాలకు చెందిన 20 కుటుంబాలకు రూ.18,67,605 చెక్కులను తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్‌ప్రసాద్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల తెదేపా నాయకులు, నేతలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్‌ప్రసాద్

జనసేన లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయాలి

సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త సత్యనారాయణ తదితరులు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం రేగ గ్రామంలోని గుహలింగేశ్వర స్వామి (రాతి కొండ ప్రాంగణం) ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆదివారం నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు ఆర్.నాయుడు, పి.సంతోష్ తదితరులు సరదాగా గడిపారు. అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు అంశాల గురించి చర్చించుకున్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు

కొత్తవలస: రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కొత్తవలసలో పోలీసులు పలు వాహనాలను ఆపి వాటికి రేడియం స్టిక్కర్లు అంటించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్‌రావు ఆదేశాల మేరకు సీఐ షణ్ముఖరావు సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు.

సేవకు ముందుండాలి

జరజాపుపేట(నెల్లిమర్ల): సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ రామారావు అన్నారు. ఆదివారం జరజాపుపేటలో దివంగత మద్దిల శశివర్ధన్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన రక్తదాన, వైద్య శిబిరాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం యువత రక్తదానం చేశారు. ఉచిత వైద్య చికిత్సలు అందజేశారు. వాసు, రాజశేఖర్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

బంగారు గొలుసు అప్పగింత

పూసపాటిరేగ: ఓ మహిళ పోగొట్టుకున్న బంగారు గొలుసును పోలీసులు ఆమెకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇటీవల గాజువాక డ్రైవర్స్ కాలనీకి చెందిన విజయలక్ష్మి ఆర్టీసీ బస్సులో శ్రీకాకుళం వెళ్తున్నారు. పూసపాటిరేగ వచ్చేసరికి ఆమె మెడలో ఉన్న 18 గ్రాముల బంగారు గొలుసు కనిపించకపోవడంతో వెంటనే 112కి కాల్ చేశారు. ఎస్సై దుర్గాప్రసాద్, సిబ్బంది ఆ బస్సును ఆపి తనిఖీ చేశారు. వాహనంలోనే దొరకడంతో ఆమెకు అప్పగించారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

కొత్తవలస, న్యూస్‌టుడే: తుమ్మికాపల్లి పంచాయతీ శివారు వినాయకనగర్‌లో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 45 మంది వృద్ధులకు నిత్యావసర సరకులు అందించినట్లు ఛైర్మన్ హరికుమార్ తెలిపారు. దివంగత రాజులమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె రత్నకుమారి ఆర్థిక సాయంతో పంపిణీ చేశామన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేసినట్లు తెలిపారు. రైల్వే విశ్రాంత ఉద్యోగి రమణ, ట్రస్ట్ సహాయక కార్యదర్శి రవి, కోశాధికారి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారన్నారు.

భవానీ భక్తుల సైకిల్ యాత్ర

నెల్లిమర్ల: మండలంలో అలుగోలు, ఒమ్మి గ్రామాలకు చెందిన భవానీ భక్తులు కె.గోవర్ధన్, ఎ.అప్పలనాయుడు విజయవాడ దుర్గమ్మ దర్శనానికి ఆదివారం సైకిల్‌యాత్ర ద్వారా బయలుదేరారు. ఇలా దర్శనానికి మూడోసారి వెళ్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప, భవానీ భక్తులు పాల్గొన్నారు.

10న హిందూ సమ్మేళనం

కొత్తవలస: కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీ ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 10న హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామని నిర్వహణ సమితి అధ్యక్షుడు జగదీశ్‌కుమార్, ఉపాధ్యక్షులు అప్పారావు, రామన్నపాత్రుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల సమతానంద దుర్గా పీఠానికి చెందిన శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

కరుణించమ్మా.. దుర్గమ్మ

జరజాపుపేట(నెల్లిమర్ల): జరజాపుపేట ప్రాంతంలో భవానీ భక్తుల సామూహిక మండల దీక్ష పూజలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో భక్తులు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు.

తోటపాలెంలో సమస్యల కూత

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలిక పరిధి 32వ డివిజన్ తోటపాలెంలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఏళ్ల నాటి రోడ్లు, కాలువలే ఇక్కడ దర్శనమిస్తున్నాయి. తోటపాలెం, షిర్డీసాయినగర్, సాయి నగర్, కాచి చెరువు, సింహాద్రి అప్పన్న కల్యాణ మండపం దరి, చర్చి రోడ్ తదితర చోట్ల అధ్వాన పరిస్థితి కనిపిస్తోంది. ఐనాక్స్ నుంచి సెంట్రల్ బ్యాంకు, స్వర్గధామం మీదుగా ప్రదీప్ నగర్‌కు వెళ్లే రహదారి మరమ్మతులకు గురైంది. చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

సింహాద్రి అప్పన్న కల్యాణ మండపం సమీపంలో రోడ్డు, కాలువ దుస్థితి

అడుగడుగునా ఇబ్బందులు..

● శివాలయం దారిలోని బోరు పనిచేయడం లేదు ● సాయినగర్, షిర్డీకాలనీ, నరసింహానగర్, మౌర్యాగార్డెన్స్, ముత్యాలమ్మ కోవెల తదితర ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు ● కాచి చెరువులోకి మురుగు నీరు చేరుతోంది ● సాయినగర్ నుంచి గణేష్‌కాలనీకి వెళ్లే దారిలో కాలువ నిర్మించాల్సి ఉంది ● అన్ని చోట్లా దోమల బెడద కనిపిస్తోంది ● కోనేటి వీధిలో విద్యుత్తు స్తంభాలు, దీపాలు అవసరం● తోటపాలెం ప్రాంతంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది ● చాకలి వీధిలో కాలువలను శుభ్రం చేయడం లేదు ● సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

కాలు, చేయి విరిగిన గంగన్న

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలో పందిరప్పన్న కూడలి సమీపంలో అరకు వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ద్విచక్ర వాహన చోదకుడు కిలారి గంగన్న తీవ్రంగా గాయపడ్డాడు. విశాఖ జిల్లా దువ్వాడకు చెందిన గంగన్న అరకు నుంచి దువ్వాడ వెళ్తుండగా, ఎస్.కోట వైపు నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగన్నకు కుడికాలు, చేయి విరిగిపోయింది. ఇతనిని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స చేసి, విజయనగరం రిఫర్ చేశారు.

కోడి పందెం ఆడుతున్న 9 మంది అరెస్టు

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస పోలీసుస్టేషన్ పరిధిలోని కంటకాపల్లి పంచాయతీ శివారు కొత్తూరు రెల్లి కొంపలు వద్ద కోడి పందెం ఆడుతున్న తొమ్మిది మందిని జిల్లా స్పెషల్ బ్రాంచి(ఎస్‌బీ)బృందం, తమ సిబ్బంది కలిసి ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ సీహెచ్.షణ్ముఖరావు తెలిపారు. వీరి నుంచి రూ.16 వేలు నగదు, ఒక కోడి పుంజు, పది ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కాలువపై పలకల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

జామి, న్యూస్‌టుడే: జామి గ్రామంలోని మంగళవీధిలో కాలువపై శిథిల పలకలు తొలగించి, కొత్త పలకలు వేశారు. ఇక్కడి సమస్యపై 'ఈనాడు'లో డిసెంబరు 5న 'ప్రమాదం పలకరిస్తోంది' శీర్షికన ఇచ్చిన కథనంపై పంచాయతీ ఈవో ప్రసాదరావు స్పందించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం సూచనల మేరకు పలకలు వేయించారు.

సనాతన ధర్మమే భారత సంస్కృతికి పునాది

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: సనాతన ధర్మమే భారతీయ సంస్కృతికి పునాది అని శ్రీసమతానంద దుర్గా మహాపీఠం శ్రీశ్రవణ చైతన్యానంద చిన్నస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షను హాలులో నిర్వహించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన హిందూ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలకు భగవద్గీతను పఠింపజేస్తే వాక్‌శుద్ధితో పాటు సంస్కారం అలవడుతుందన్నారు. దక్షిణమధ్య క్షేత్రం సహ సంఘ్ చాలక్, అఖిల భారత విద్యా భారతి అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ శాంతి, సమైక్యత, విశ్వకల్యాణం సనాతన ధర్మంతోనే సాధ్యమన్నారు. వైద్యులు పి.వరలక్ష్మి, సత్యశేఖర్, న్యాయవాది రామకృష్ణ, సూర్యారావు, వీహెచ్‌పీ, సమరసతా సంఘం నాయకులు పాల్గొన్నారు. కటకం పావని ఆధ్వర్యంలో చిన్నారులు భగవద్గీత, దేవీ ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అయిదు మండలాల భజన బృందాలు, కోలాటం కళాకారులను సత్కరించారు.

మాట్లాడుతున్న శ్రీశ్రవణ చైతన్యానంద చిన్నస్వామి

విద్యుత్తు నియంత్రికల ధ్వంసం

జరజాపుపేట(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ప్రాంతంలో ఎన్టీఆర్ కాలనీలో గుర్తుతెలియని దుండగులు రెండు విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న నెల్లిమర్ల ఎస్సై బి.గణేష్ తన సిబ్బందితో కలిసి ఆదివారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నియంత్రికలో ఉన్న రాగి తీగను చోరీ చేశారు. విడి భాగాలను అక్కడే వదిలేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న ఎస్సై గణేష్

మౌలిక సదుపాయాలు కల్పించండి

రిలే నిరాహార దీక్ష చేస్తున్న దళితులు

భోగాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ముంజేరు దళిత సిద్ధార్థ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని దళితులు ఆదివారం మండల పరిషత్తు కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా భీమసేన అధ్యక్ష, కార్యదర్శులు చిన్నారావు, వసంత రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దళితులపై నిత్యం దాడులు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ కాలనీలో కాలువ నిర్మాణంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నెల్లిమర్ల ఇన్‌ఛార్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస ప్రాంతానికి చెందిన కరాటే క్రీడాకారులు జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించారు. గాజువాకలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో గంటా వెంకటరావు జ్ఞాపకార్థం ఇటీవల నిర్వహించిన ఆహ్వాన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో విద్యార్థులు పతకాలు సాధించినట్లు శిక్షకుడు రాజాబాబు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, పెద్దలు అభినందించారు.

విజేతలతో శిక్షకుడు రాజాబాబు

భక్తిశ్రద్ధలతో సహస్ర పారాయణం

రామతీర్థంలో పారాయణం చేస్తున్న పండితులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో రాములోరి సన్నిధి వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో 72వ సహస్ర శ్లోకి రామాయణ పారాయణాన్ని భగవత్ రామానుజ దాస బృందం నిర్వహించారు. కార్యక్రమంలో దాస బృందం సభ్యుడు రాజగోపాలాచార్యుడు, ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

2వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
2ND ANNIVERSARY
మీ అందరి ఆదరాభిమానాలతో దిగ్విజయంగా 2 వసంతాలు పూర్తి చేసుకొని 3వ వసంతంలోకి అడుగిడుతున్న శుభవేళ మా కస్టమర్లకు, శ్రేయోభిలాషులకు, బంధుమిత్రులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు. 2026 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
శ్రీలక్ష్మి మెడికల్ & జనరల్ స్టోర్స్
యాత వీధి, రామ మందిరం దరి, తోటపాలెం, విజయనగరం,
Cell: 9000259880
లేడీస్ ఐటమ్స్ గాజులు మరియు ఫ్యాన్సీ ఐటమ్స్ లభించును

(c) eenadu

ఈనాడు
పశ్చిమగోదావరి
సోమవారం డిసెంబరు 8, 2025

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కండి : మంత్రి

రోడ్ రన్‌లో పాల్గొన్న రవికుమార్, రాధాకృష్ణ, నాగరాణి, నయిం అస్మి, రామరాజు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు రన్నర్స్ సొసైటీ భాగస్వామ్యంతో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన తణుకు రోడ్ రన్ 10 కె, 5 కె, 3 కె కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. జిల్లా ఎస్పీ నయిం అస్మి, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో హాజరయ్యారు. రన్ ఫర్ క్లీనర్, గ్రీనర్, హెల్తియర్ పేరిట నిర్వహించిన కార్యక్రమం సందడిగా సాగింది. యువత ఉత్సాహంగా పాల్గొని పరుగులు తీశారు. పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యం కోసం మేము సైతం అంటూ పరిసర ప్రాంతాల నుంచి చిన్నపిల్లలు, యువత, పెద్దలు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 'టేక్ ఏ సెల్ఫీ మూవ్‌మెంట్ ఆఫ్ తణుకు రోడ్ రన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల వద్ద ఏర్పాటు చేసిన వేదికపై యువత వేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం శుభ్రంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. సుమారు 2500 మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడించారు. అనంతరం విభాగాల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. నిర్వాహకులు విశ్వతేజ, సాయిదీప్తి, కృష్ణకిరణ్, వినయ్‌పవన్, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

వానొస్తే నిండి.. ఎండొస్తే ఎండి..

ఎండిపోయి పూడికతో కనిపిస్తున్న కొల్లేరు (జూన్ నెలలో తీసిన చిత్రం)

అక్టోబర్‌లో వచ్చిన వరద నీటిలో పెనుమాకలంక రోడ్డు

మండవల్లి, న్యూస్‌టుడే: కొల్లేరును ప్రస్తుతం పూడిక భయపెడుతోంది. వరదల సమయంలో వచ్చే ఒండ్రు మట్టి, ఇసుకతో నిండిపోతోంది. కొల్లేరులో వరద నీటికి ప్రధాన కారణమైన బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, చంద్రయ్య, పోల్‌రాజ్ డ్రెయిన్లతోపాటు మరో 36 అంతర్గత డ్రెయిన్ల ద్వారా భారీ ఎత్తున వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. మరోపక్క సరస్సులో సహజసిద్ధంగా పెరుగుతున్న గుర్రపు డెక్క, కిక్కిస, తూడు, రాక్షస గడ్డి మొక్కలు కుళ్లిపోయి పూడిక పెరుగుతోంది.

తగ్గుతున్న నీటి నిల్వ.. కొల్లేరులోని అంతర్గత డ్రెయిన్లు పూర్తిగా పూడిపోయాయి. పదేళ్లలో ఒక్కసారి కూడా వీటిలో పూడిక తీయలేదు. కొల్లేరులోనూ పూడిక పెరిగిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం ఏటికేడు తగ్గిపోతోంది. దీనివల్ల సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఒకేసారి వచ్చే నీటిని ఇముడ్చుకోలేకపోవడంతో గ్రామాలతోపాటు రహదారులన్నీ వరద నీటితో నిండిపోతున్నాయి. జనవరి, ఫిబ్రవరి నాటికి పూర్తిగా ఎండిపోయి నెర్రెలు తీస్తోంది. ఐదేళ్లలో పదిసార్లు కొల్లేరు వరదల కారణంగా లంక గ్రామాలకు రహదారులు తెగిపోయాయి.

జీవులపై ప్రభావం.. పూడికతో కొల్లేరులో అనుకున్న స్థాయిలో నీరు లేకపోవడంతో సంతానోత్పత్తికి వచ్చే అరుదైన పక్షులకు ఇక్కడ నీరు, ఆహారం, గూడ కరవైంది. జిల్లాలో 77,138 వేల ఎకరాల్లో ఉన్న కొల్లేరు 3లక్షలపైగా 166 రకాల పక్షులకు, 128 రకాల చేపలకు నెలవు. 3లక్షల వరకు ఉన్న మత్స్యకారుల్లో 30శాతం ఉపాధి కరువై ఇతర రాష్ట్రాలకు వలసల బాట పడుతున్నారు. 'కొల్లేరు పరిస్థితిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం' అని మురుగునీటి పారుదలశాఖ కైకలూరు డీఈ రామకృష్ణ తెలిపారు.

ప్రత్యేకం.. కాదు చుట్టరికం

- పట్టణాల్లో కానరాని అధికారులు
- అసంపూర్తి పనులతో అవస్థలు

న్యూస్‌టుడే, భీమవరం పట్టణం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం

జిల్లాలోని 4 పట్టణాలు ప్రత్యేకాధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. పురపాలికల్లో పాలకవర్గాలుంటే స్థానిక సమస్యలను సమావేశాల్లో చర్చించి పరిష్కారం దిశగా కృషి చేస్తారు. ప్రత్యేకాధికారుల పాలనలో ఏ నిర్ణయమైనా కౌన్సిల్ కంటే వేగంగా ఉంటుందని ప్రజలు భావించారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఆరేళ్లకు పైగా.. భీమవరం, తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో 2019 జులై 3తో పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. అప్పట్నుంచి ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాగా ఉన్నప్పట్నుంచి ఇదే పరిస్థితి. అప్పట్లో అధికారులు పట్టణాలకు అరుదుగా వచ్చేవారు. ఇప్పుడు చెంతనే ఉన్నా అసలు రావడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

భీమవరంలో అంతర్గత దారులు పల్లంగా ఉన్నాయి. మెరక చేయడానికి ప్రతిపాదించినా పనులు జరగడం లేదు. దీంతో మురుగు మధ్యనే వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి

దీంతో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రెయిన్లు, వీధిదీపాల సమస్యలతో పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే..

- భీమవరంలో 39 వార్డులున్నాయి. రహదారుల ఆక్రమణలతో ట్రాఫిక్ అవరోధం, పైపులైన్ల లీకేజీతో నీటి వృథా, వేసవిలో శివారు కాలనీలు దాహార్తితో అలమటిస్తాయి. ప్రస్తుతం రూ. 8 కోట్ల విలువైన 60కిపైగా అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి

వీటిపై దృష్టి సారించరా..?

చెత్త పారబోసేందుకు డంపింగ్‌యార్డులు లేవు. శివారు ప్రాంతాలను సమస్యలు వెంటాడుతున్నాయి. రూ.35 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయినప్పటికీ ముందుకు కదలడం లేదు. భీమవరం, తాడేపల్లిగూడెంలో అమృత్ పనులు కొనసా..గుతున్నాయి.

- తాడేపల్లిగూడెంలో 40 వార్డులున్నాయి. దాదాపు 1.30 లక్షల జనాభా ఉన్న పట్టణంలో డ్రెయినేజీ, రహదారులు నామరూపాల్లేకుండా ఉన్నాయి.

పాలకొల్లు: మారుతి థియేటర్ నుంచి బుధవారపు వీధికి వెళ్లే దారి

- పాలకొల్లు పట్టణంలో 31 వార్డులున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రధాన డ్రెయిన్లు పొంగినప్పుడల్లా పల్లపు ప్రాంతాలను మురుగు ముంచెత్తుతోంది. దమ్మయపర్తి డ్రెయిన్ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రూ.6 కోట్ల విలువైన 16 అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

ప్రత్యేకాధికారులు ఎవరంటే..

భీమవరం- ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి
తాడేపల్లిగూడెం- ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో
తణుకు- డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి
పాలకొల్లు- ఆర్డీవో దాసి రాజు

- 34 వార్డులు, 1.04 లక్షల జనాభా ఉన్న తణుకు పట్టణంలో చెత్త వేసేందుకు స్థలం లేదు. శివారు ప్రాంతాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి.

కోవెల.. కొత్త కళ!

పాలకొల్లు మండలం అగర్తిపాలెంలో జీర్ణావస్థకు చేరిన రామాలయం ఇది. దీనిని పునర్నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. దీనిలో మూడో వంతు మొత్తాన్ని (రూ.50 లక్షలు) ప్రజా విరాళాల ద్వారా సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రముఖ ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. భక్తులు, స్థానిక శాసనసభ్యుల అభ్యర్థనల మేరకు ప్రజా భాగస్వామ్యంతో కామన్ గుడ్ ఫండ్ నిధులు జతచేసి ఆయా ఆలయాల పునర్నిర్మాణం, మరమ్మతులు, సుందరీకరణ పనులు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. తొలి విడతలో జిల్లాలో తొమ్మిది ఆలయాలకు దేవాదాయశాఖ ద్వారా రూ.10 కోట్లకు పైగా నిధులివ్వనున్నట్లు ప్రకటించింది.

ఆలయాల వారీగా మంజూరైన నిధులు(రూ.కోట్లలో) ఇలా..

ఆలయం	నిధులు
శివాలయం (విస్సాకోడేరు)	1.50
భీమేశ్వరాలయం (అనాకోడేరు)	1.00
వేంకటలింగేశ్వరాలయం (ఆకివీడు)	1.07
శివాలయం (మహదేవపట్నం)	1.08
రామాలయం (అగర్తిపాలెం)	1.45
శివాలయం (దగ్గులూరు)	1.50
శివాలయం (వేల్పూరు)	1.80
చెన్నమల్లేశ్వరాలయం (ఉండి)	0.56
శివాలయం(నత్తారామేశ్వరం)	0.20

(ఉండిలో గోపుర నిర్మాణం, నత్తారామేశ్వరంలో సుందరీకరణ పనులు చేస్తారు)

ప్రజా భాగస్వామ్యంతో..

ప్రతి ఆలయానికి మంజూరు చేసిన మొత్తంలో భక్తులు, ప్రజల నుంచి మూడో వంతు (33.33 శాతం) విరాళాల రూపంలో సమకూరితేనే నిధులు విడుదలవుతాయని అధికారులు చెబుతున్నారు. విరాళాలు సమకూరిన వెంటనే పరిపాలన పరమైన అనుమతులిచ్చి వేగంగా పనులు పూర్తి చేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై దేవాదాయశాఖ సహాయ కమిషనర్ హరి సూర్యప్రకాశ్ స్పందిస్తూ తొలి విడతలో తొమ్మిది ఆలయాలకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. మలి విడతలో మరికొన్ని ఆలయాలను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులు ఏ స్థితిలో ఉన్నాయో తెలుసుకునేందుకు 1100 సేవలను ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు.

శోభాయమానం.. హనుమంతుడి ఉత్సవం

నందమూరుగరువు (వీరవాసరం), న్యూస్‌టుడే: నందమూరుగరువు శ్రీరామ భక్తాంజనేయస్వామి వార్షికోత్సవం సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలంకరణ ఆకట్టుకుంటోంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రాక్‌స్టార్ ఈవెంట్స్ వారి సినీ సంగీత విభావరిని తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నిర్వాహకులు పర్యవేక్షించారు.

ప్రకృతి ఒడిలో పర్యాటకం

కొరుటూరు వద్ద వెదురు గుడారాలు పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి

పోలవరం, న్యూస్‌టుడే: పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పాపికొండల్లో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉంగుటూరు మండలం గొల్లగూడెం పర్యటనలో అటవీశాఖ సీసీఎఫ్‌కు సూచించారు. దానిపై ఏలూరు జిల్లా అటవీ శాఖాధికారి సందీప్‌రెడ్డి రెండు రోజుల పాటు కొరుటూరు కాటేజ్‌ల వద్ద మకాం వేశారు. అక్కడ ఉన్న ఉడెన్ కాటేజ్‌లు, వెదురు గుడారాలను పరిశీలించారు. పర్యాటకులకు ట్రెక్కింగ్‌కు అనువైన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. శిరివాక సమీపంలో ప్రవహిస్తున్న కొండవాగుపై చెక్‌డ్యామ్ నిర్మించాలని సిబ్బందికి సూచించారు. గతంలో నిర్మించిన అటవీశాఖ భవనాలను పరిశీలించారు. గెడ్డపల్లి వద్ద ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని తనిఖీ చేశారు. శుక్రవారం రాత్రి పోలవరం నుంచి బయలుదేరిన డీఎఫ్‌వో అర్ధరాత్రి కావడంతో కన్నాపురంలో బస చేసి శనివారం తెల్లవారుజామున రోడ్డు మార్గంలో బయలుదేరి పాపికొండల అభయారణ్యం పరిశీలించి కొరుటూరు కాటేజ్‌ల వద్ద రాత్రి బసచేశారు. తిరిగి ఆదివారం సాయంత్రానికి అటవీశాఖ బోటుపై బయలుదేరి పోలవరం చేరుకున్నారు. డీఎఫ్‌వో సమగ్ర నివేదిక సీసీఎఫ్‌కు అందజేస్తారని పోలవరం రేంజర్ ఎస్కే వలీ చెప్పారు. ఆయన వెంట సబ్ డీఎఫ్‌వో వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఉన్నారు.

నిరీక్షించి.. నీరసించి

అల్పాహారం, పాల సరఫరా ఆపేసిన ఆలయ అధికారులు

క్యూకాంప్లెక్స్‌లో భక్తులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి దర్శన క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులకు అల్పాహారం, చిన్నారులకు పాలు ఇచ్చే కార్యక్రమాన్ని ఆలయ అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. స్వామి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా దూర ప్రాంతాల భక్తులు ఏమీ తిన్నకుండా వస్తుంటారు. వీరిలో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఆకలితో ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో ఆలయ అధికారులు గతంలో అల్పాహారం అందించేవారు.

తరచూ ఎవరో ఒకరు.. గత నెల 1న విజయవాడకు చెందిన భక్తురాలు కల్యాణి తన కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనానికి వచ్చారు. ఒక్కసారిగా అస్వస్థతకు గురై పడిపోవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇలా చెబుతూ పోతే అనేక మంది తినక నీరసం వచ్చి అస్వస్థతకు గురవుతున్నారు. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పుడు ఇవ్వకపోవడంపై నిరాశ.. రాజమహేంద్రవరం నుంచి సంజు అనే భక్తుడు తన బంధువులు 14 మందితో కలిసి ఆదివారం శ్రీవారి దర్శనానికి వచ్చారు. ఇందులో ముగ్గురు చిన్నపిల్లలు, ఒక వృద్ధురాలు ఉన్నారు. ఉచిత దర్శనం కోసం శ్రీవారి క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్నారు. ఎంత సమయం ఉన్నా.. దేవస్థానం అధికారులు అల్పాహారం, చిన్నారులకు పాలు ఇవ్వలేదు. గతంలో ఈ సౌకర్యాలు ఉండేవి.. ఇప్పుడు లేకపోవడంతో నిరాశ చెందారు.

'శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో కూడా అల్పాహారం, చిన్నారులకు పాలు అందించేలా చర్యలు తీసుకుంటాం.' అని ఈవో మూర్తి తెలిపారు.

అమ్మకు ఆర్థిక భరోసా

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి మాతృవందన యోజన ద్వారా ప్రభుత్వం గర్భిణులకు ఆర్థిక భరోసానిస్తోంది. ఇందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రసవమైన తర్వాత శిశువుకి మూడు ఇంజెక్షన్లు చేయించడం పూర్తవగానే బాలింత ఖాతాలోకి ప్రభుత్వం రూ.6 వేలు జమ చేస్తుంది. గతంలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది నిర్వహించే ఆ పనిని కొద్ది నెలలుగా అంగన్‌వాడీలకు అప్పగించారు. ఆ కేంద్రాలకు వచ్చే గర్భిణులు అంగన్‌వాడీ సిబ్బంది వద్ద ఉంటే యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఎన్నిసార్లు అయినా ఈ పథకాన్ని పొందొచ్చు. కాని రెండో కాన్పులో మాత్రం కచ్చితంగా పాప పుడితేనే ఇది వర్తిస్తుంది. నవంబరు నెలాఖరు వరకు జిల్లాలో 7,541 మంది గర్భిణుల వివరాలు నమోదు చేశారు. ఇందులో మన జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని ఐసీడీఎస్ పీడీ లక్ష్మి తెలిపారు.

వీరు అర్హులు: తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలి. భర్త, తల్లి ఇంట్లో ఎవరి కార్డులో అయినా సంబంధిత మహిళ పేరుండాలి. ప్రభుత్వం అందించే 26 రకాల గుర్తింపు కార్డుల్లో ఏ ఒక్కటి ఉన్నా రిజిస్ట్రేషన్ చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారు అనర్హులు

సమస్య వస్తే: మొదట్లో సంబంధిత యాప్‌లో వివరాలు నమోదులో సర్వర్ సమస్య తీవ్రంగా ఉండేది. ఇప్పుడా సమస్య చాలా వరకు తీరింది. అయినా ఇంకా ఏదైనా సమస్య ఎదురైతే సంప్రదించేందుకు టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తెచ్చారు. 1515కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

జిల్లాలో ఇలా మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణుల	బాలింతల
1,626	5,487	4,457

కొత్త ఒరవడి.. ఆసక్తే పెట్టుబడి!

- తయారీ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- పీఎంఈజీపీలో అతివలకు రాయితీ రుణాలు

పాలకొల్లు, న్యూస్‌టుడే

మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా గరిష్ఠంగా రూ. 20 లక్షల వరకు రుణం మంజూరవుతోంది. సాధారణంగా ఈ మొత్తాన్ని సభ్యులంతా తలో రూ. 2లక్షలు పంచుకుని సొంత అవసరాలకు వినియోగించుకోవడం పరిపాటి. ఇలా కాకుండా కొత్త తరహా వ్యాపార లావాదేవీలు, తయారీ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న ఔత్సాహికులను గుర్తించి రాయితీ రుణాలు మంజూరు చేయించి ప్రోత్సహించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(డీఆర్‌డీఏ) నిర్దేశించుకుంది. ఉభయ జిల్లాల్లో దీనికి అర్హులను గుర్తించి జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా యూనిట్లు ఏర్పాటు చేయించేలా కృషి చేస్తోంది.

❖ అత్తిలి మండలానికి చెందిన మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులు చెప్పుల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీరికి ఎంత రుణం అవసరమవుతుంది.. శిక్షణ ఎక్కడ లభిస్తోందనే అంశాలపై డీఆర్‌డీఏ అధికారులు ఆరా తీస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు లేని పరిశ్రమ కాబట్టి ప్రారంభిస్తే మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. ఈ బృందానికి ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం(పీఎంఈజీపీ) కింద బ్యాంకు రుణం

మంజూరు చేయించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పోటీ తక్కువే

కొత్త తరహా యూనిట్ల స్థాపనకు పశ్చిమగోదావరి పరిధిలో జిల్లా పరిశ్రమల కేంద్రానికి అందిన దరఖాస్తులకు పరిశీలిస్తే పోటీ తక్కువగానే ఉంది. పరిశ్రమల సంస్థతో పాటు ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 112 యూనిట్లు స్థాపన లక్ష్యం కాగా 189 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కొన్నింటికి ఇప్పటికే బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేశారు.

పశ్చిమ గోదావరిలో ఇలా..

సంస్థ	లక్ష్యం	దరఖాస్తులు	మంజూరు
పరిశ్రమల కేంద్రం	39	94	25
ఖాదీగ్రామీణ బోర్డు	30	62	26
ఖాదీ కమిషన్	43	33	12

35 శాతం వరకు: పదోతరగతి ఉత్తీర్ణులైన మహిళలు వారు ఈ పథకం ద్వారా యూనిట్ల స్థాపనకు ముందుకు వస్తే తగినంత మేర రుణం మంజూరు చేసేలా ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది. రుణంలో 35 శాతం రాయితీ ఉంటుంది. దీనిలో గరిష్ఠంగా రూ. 50 లక్షల వరకు ప్రభుత్వం అందిస్తోంది. కొత్త తరహా యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న మహిళలను గుర్తించి యూనిట్ల స్థాపనకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ తెలిపారు.

6 నెలల్లో అందుబాటులోకి డయాలసిస్ కేంద్రం

భీమవరం: శంకుస్థాపనలో శ్రీనివాసవర్మ, రామాంజనేయులు, కలెక్టర్ తదితరులు

భీమవరం పట్టణం, ఆచంట, న్యూస్‌టుడే: భీమవరంలో ప్రభుత్వ డయాలసిస్ కేంద్రం లేకపోవడం దురదృష్టకరమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లతో భీమవరంలో 10 పడకలతో, ఆచంట సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద రూ. కోటితో డయాలసిస్ కేంద్రాల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలకు సంబంధించి 6 నెలల్లోగా పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలన్నారు. తాడేపల్లిగూడెం డయాలసిస్ కేంద్రంలో అదనపు పడకల కోసం రూ.2 కోట్లు, అత్తిలిలో డయాలసిస్ యంత్రాల కోసం రూ.75 లక్షలు సమకూర్చామన్నారు. త్వరలో రూ.4 కోట్లతో సంచార క్యాన్సర్ పరీక్షల వాహనం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యేలు రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కలెక్టర్ నాగరాణి, డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ, ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకుడు లక్ష్మణ్ జీతానంద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పర్యవేక్షణకు సారథులు

జిల్లాలో ఇలా..	
గ్రామ సచివాలయాలు	398
వార్డు సచివాలయాలు	137
ఉద్యోగులు-	4,072

నర్సింహపురంలో

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ - వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను వేగవంతం చేసేందుకు.. ఆ వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకొచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం పలు చోట్ల సంబంధిత ఉద్యోగులు సకాలంలో కార్యాలయాలకు రావడం లేదని, వచ్చినా నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు సచివాలయాలపై పర్యవేక్షణాధికారులుగా ఉప ఎంపీడీవో స్థాయి కలిగిన వారిని మండలాలు, పట్టణాలకు ఒక్కొక్కరు చొప్పున తాజాగా నియమించారు.

ఏం చేస్తారంటే?

సచివాలయాల ద్వారా ప్రజలకు అందే సేవలను ఆ ఉద్యోగులు సత్వరం అందించేలా చూస్తారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చూడటం, ఉద్యోగులు నిబంధనలు పాటించేలా పర్యవేక్షిస్తారు. విపత్తుల సమయంలో అత్యవసర సేవలూ అందించాలి.

ఎవర్ని సంప్రదించాలి?

ప్రజలకు సచివాలయాల ద్వారా అందే సేవల్లో సమస్య ఏర్పడితే మొదట ఆయా ఎంపీడీవోలు, మండలాలు, పట్టణాల్లో నియమితులైన సచివాలయాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అక్కడా పరిష్కారం కాకపోతే 91544 07287 నంబరుకు ఫోన్ చేసి గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారికి ఫిర్యాదు చేయొచ్చు.

☛ ప్రజలకు త్వరగా సేవలు అందించడం, కార్యకలాపాల పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను నియమించిందని గ్రామ-వార్డు సచివాలయాల జిల్లా అధికారి దోసిరెడ్డి తెలిపారు.

వారసులకు ఊరట!

భూముల రిజిస్ట్రేషన్ల రుసుం తగ్గింపు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. కుటుంబ సభ్యుల మధ్య భాగ పంపిణీ ఒప్పందాల రిజిస్ట్రేషన్ రుసుంలో సమూల మార్పులు తెచ్చింది. ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ రూ. 10 లక్షల లోపు ఉంటే స్టాంపు డ్యూటీగా రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. రూ.10 లక్షలపైన ఉంటే రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. అదీ వ్యవసాయ భూములకు మాత్రమే. తమ ఆస్తులకు వీలునామా రాయకుండా కుటుంబ పెద్ద మరణిస్తే ఆయన ఆస్తుల్ని భార్య, పిల్లలు భాగ పంపిణీ చేసుకుంటారు. ఇలాంటి కేసులకే ప్రస్తుత ఉత్తర్వులు వర్తించనున్నాయి.

వైకాపా ప్రభుత్వ హయాంలో పెదవేగి మండలానికి చెందిన ఓ చిన్నకారు రైతు తన వారసత్వ వ్యవసాయ భూమిని పిల్లల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలనుకున్నారు. ఆ భూమిలో ఒకరు ఎక్కువ, మిగతా వారు తక్కువ వాటాలు తీసుకుంటే.. ఎక్కువ పొందిన విలువపై 3 శాతం, మిగతా వారి వాటాకు రిజిస్ట్రేషన్ విలువపై 1 శాతం స్టాంపు రుసుము చెల్లించాల్సి ఉంటుందని కార్యాలయ సిబ్బంది తెలిపారు. అదనంగా రూ. వేలల్లో చెల్లించాల్సి రావడంతో.. ఆ రైతు రూ.100 స్టాంపు పత్రంపై ఒప్పందం రాసుకున్నారు.

వేగం కానున్న ప్రక్రియ.. కుటుంబ సభ్యుల మధ్య భాగ పంపిణీకి ప్రభుత్వం ఊరట కల్పించడంతో.. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లు వేగవంతం కానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులు వారసత్వంగా సక్రమించిన వ్యవసాయ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆటో మ్యుటేషన్ జరగనుంది. వారికి పట్టాదారు పాసు పుస్తకాలతో పూర్తి హక్కులు వస్తాయి. రానున్న రోజుల్లో రిజిస్ట్రేషన్లు మరింత పెరగనున్నాయని అధికారులు భావిస్తున్నారు. కొత్త విధానంపై ఇంకా పూర్తిస్థాయి విధివిధానాలు రావాల్సి ఉందని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా వివరాలిలా..
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు: 12
రోజువారీ రిజిస్ట్రేషన్లు: 300
ఏప్రిల్- సెప్టెంబరు మధ్య పార్టిషన్లు: 459
ఆదాయం: రూ.3.82 కోట్లు

(c) eenadu

దారి.. దరి చేరి!

నిడమర్రు మండలం పెద నిండ్రకొలను- పత్తేపురం రహదారిని పునర్నిర్మించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్వహణను పూర్తిగా విస్మరించారు. ఫలితంగా దారంతా గుంతలు ఏర్పడి.. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయి చెరువును తలపించేది. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సహకారంతో రూ.3 కోట్లతో రహదారిని అభివృద్ధి చేశారు. దాంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, నిడమర్రు

ఆడేస్తారు.. గెలిచేస్తారు..

జాతీయస్థాయి క్రీడలకు టి.నరసాపురం విద్యార్థులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు టి.నరసాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఇటీవల క్రికెట్, రగ్బీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించి, జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నిత్య సాధనతో..

క్రికెట్ అంటే చాలా మక్కువ. నిత్యం సాధన చేస్తా. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి అండర్ - 14 విభాగంలో ఆంధ్ర జట్టులో జాతీయ స్థాయిలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నా. నాన్న హమాలీ. ఆయన వద్దే మొదట క్రికెట్ నేర్చుకున్నా. అమ్మ గృహిణి. నేను ఏడు, తమ్ముడు ఆరో తరగతి చదువుతున్నాం. భవిష్యత్తులో చదువుతోపాటు క్రికెట్‌లోనూ రాణిస్తా. - కాసగాని సాయిదీపక్

జాతీయ స్థాయిలో..

నేను పదో తరగతి చదువుతున్నా. క్రీడలంటే ఇష్టం. పాఠశాలలో రగ్బీ నేర్చుకుని అండర్ - 17 విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించా. త్వరలో జాతీయ స్థాయిలో రాణిస్తా. అమ్మానాన్న వ్యవసాయ పనులు చేస్తూ నన్ను ఆట్లను చదివిస్తున్నారు. - బి.దయాకర్

గుర్తింపు సాధిస్తా..

నేను ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాన్న చనిపోయారు. అమ్మ కూలి పని చేస్తూ నన్ను తమ్ముడిని చదివిస్తోంది. అండర్ - 14 విభాగంలో ఇటీవల జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యా. అక్కడ విజయం సాధించి మంచి క్రీడాకారుడిగా గుర్తింపు సాధిస్తా. - బి.పవన్

9 నుంచి అమరావతి బాలోత్సవం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: అమరావతి బాలోత్సవం-8.. ఈ నెల 9వ తేదీ నుంచి 11 వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్వీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావులు తెలిపారు. గోడపత్రికను ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవం కోసం అనే నినాదంతో నిర్వహించనున్నామని వెల్లడించారు. 43 అకడమిక్, 17 కల్చరల్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు ప్రాంగణాలు, 5 గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 12 వేల మంది పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు.

2030 నాటికి హెచ్ఐవీ రహితంగా ఏపీ: నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌ను 2030 నాటికి హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాధితులకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోషకాహారం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. బాధితులు ఎలాంటి సహాయం అవసరమైనా తనను సంప్రదించవచ్చన్నారు. కూటమి నాయకులు జీవీ, పెళ్లెటి బాబు, కర్నేని గౌరునాయుడు, తులా రామలింగేశ్వరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు, పాముల రజని పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వెంకటరెడ్డి

నరసాపురం, న్యూస్‌టుడే: శెట్టిబలిజ సంఘం వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి సమీయులతో పాటు ఇతర సామాజికవర్గాల్లో పేదల సంక్షేమం కోసం కృషి చేసి స్ఫూర్తిప్రదాతగా నిలిచారని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. నరసాపురం పరిధి రుస్తుంబాదలో ఆ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆయన ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొందరు నాయకులను చెప్పుకోకుండా ఇద్దరి వ్యక్తుల మధ్య గొడవలను సైతం రెండు కులాలకు ఆపాదిస్తున్నారని.. అలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని యువతకు సూచించారు. సొంత నిధులతో వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయిస్తానని నాయకర్ సంఘ సభ్యులకు హామీ ఇచ్చారు. సమీయులకు తాము అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పేర్కొన్నారు. విగ్రహ దాత పాలిక శ్రీనును సంఘ నాయకులు, మంత్రి అభినందించారు.

విగ్రహం వద్ద మంత్రి సుభాష్, విప్ నాయకర్ తదితరులు

9న రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 9న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు దళిత ఐకాస ఛైర్మన్ పి.వరప్రసాద్ తెలిపారు. స్థానిక గన్‌బజార్‌లో ఆదివారం ప్రజా సంఘాల నాయకులతో ఆదివారం ఆయన సమావేశమై మాట్లాడారు. వివిధ డిమాండ్లు నెరవేర్చాలని తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక అసమానతలు తొలగించడానికే పీ4: మంత్రి

తణుకు, న్యూస్‌టుడే: సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీ4 విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. స్థానిక కూటమి పార్టీ కార్యాలయంలో పేద, దిగువ, మధ్యతరగతి వర్గాలకు చెందిన 20 కుటుంబాలకు తోపుడుబళ్లు, తినుబండారాలు తయారు చేసే బడ్డీల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సోలార్ వ్యవస్థను ప్రతి కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు పది వేల మందికి సోలార్ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పెరుగుతున్న విద్యుత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు విద్యుత్తు ఉపకేంద్రాల మంజూరుకు త్వరలోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలో పీ4 విధానంలో భాగంగా 20 మంది లబ్ధిదారులకు 15 తోపుడు బళ్లు, రూ.50 వేల విలువైన ఎగ్‌కార్ట్‌తో పాటు 15 మందికి ఎస్‌కే మెరైన్ సహకారంతో రూ.2.50 లక్షల విలువైన తోపుడు బళ్లు అందజేశామన్నారు. పీ4 విధానంలో సంస్థలు, దాతలను ప్రోత్సహించి వారి ద్వారా పేదలకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తోపుడు బండి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్, రాధాకృష్ణ, రామరాజు

క్రీడా పోటీల్లో విభిన్న ప్రతిభ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో పారా ఒలింపిక్ పోటీలు భీమవరంలో శనివారం నిర్వహించారు. జిల్లాకు చెందిన విభిన్న ప్రతిభావంతులు మనో ధైర్యంతో పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. పరుగు పందెం, షాట్‌పుట్ తదితర విభాగాల్లో పతకాలు అందుకున్నారు. డీఈవో ఇ.నారాయణ, సమగ్ర శిక్షా ఏపీసీ పి.శ్యాంసుందర్, సహిత విద్య జిల్లా సమన్వయకర్త టి.శ్రీనివాస్, పారా ఒలింపిక్ రాష్ట్ర సమన్వయకర్త పి.రామస్వామి, సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో దూసుకెళ్తున్న బాలికలు

సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ నియామకం



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం పశ్చిమ గోదావరి జిల్లా నూతన కార్యవర్గం భీమవరంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏ.పట్టణ సర్వేయర్ ఎస్.రమాకాంత్ ... విజయనగరం, ఉపాధ్యక్షులుగా పి.లోకేశ్‌కుమార్, కార్యదర్శిగా బి. నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా కె.వల్లారెడ్డి, కోశాధికారిగా టి. రమేశ్, ఇతర సభ్యులు నియమితులయ్యారని ఎన్నికల అధికారులు వి.శేషగిరిరావు, వి.నాగేంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

76 మంది గైర్హాజరు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్) పరీక్ష జిల్లాలోని 12 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించారు. 2,559 మంది విద్యార్థులు హాజరుకాగా 76 మంది గైర్హాజరయ్యారని డీఈవో ఇ.నారాయణ తెలిపారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.

జస్టిస్ గోపాలకృష్ణారావుకు జ్ఞాపిక ఇస్తున్న ఈవో మూర్తి

పెనుగొండ ఆలయాల్లో.. పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని నగరేశ్వర స్వామి, మహిషాసుర మర్దని, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు, శైలజ దంపతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నగరేశ్వర స్వామికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు స్థానిక వాసవీశాంతిధాంను సందర్శించి వాసవీమాత మరకత ప్రతిమకు పూజలు చేశారు.

జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు వేద ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

ఆలయాలను దర్శించిన రాష్ట్ర సమాచార కమిషనర్

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయం, పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయాలను రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదివారం సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మావుళ్లమ్మ ఆలయంలో ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ ఆయనతో ప్రత్యేక పూజలు చేయించి శేషవస్త్రం అందించారు. డివిజన్ ఆలయాల తనిఖీదారుడు వి.వెంకటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయాధికారి బీఎం.నగేష్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పంచారామక్షేత్రంలో పూజలు నిర్వహించినట్లు ఆలయాధికారి రామకృష్ణంరాజు తెలిపారు.

సునీల్‌కు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న వెంకటేశ్వరరావు

అపూర్వ సమ్మేళనం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధులతోపాటు ఓపిక, సహనం అలవర్చుకొని ఈ స్థాయికి ఎదిగానని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. భీమవరంలోని ఏఆర్‌కేఆర్ పురపాలకోన్నత పాఠశాలలో 1987-88లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి వర్మ మాట్లాడారు. ఇదే పాఠశాలలో చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. 37 ఏళ్ల కిందట చదువుకున్న మీరంతా వివిధ రంగాల్లో స్థిరపడి, ఇప్పుడు పాఠశాలకు వచ్చిన మీతో నాటి జ్ఞాపకాలు పంచుకున్నానన్నారు. బీహెచ్ సుబ్బరాజు, నానిబాబు, ఎన్‌వీఆర్ రవికుమార్, వెంకటరాజు, విజయరామరాజు, శ్రీరాములు, రమాదేవి, నివేదిత, పట్నాయక్, రంగబాబు, భూషణం, ఈశ్వరరావు, మస్తాన్‌వల్లి, శ్రీనివాసరాజు తదితరులు పర్యవేక్షించారు.

పాత బండి.. కొంటున్నావా గురూ..!

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే

కొత్త వాహనం ధరలో సగానికే రెండు మూడేళ్లు తిరిగిన బండి వస్తుందని.. కొన్నేళ్లు దాంతోనే నెట్టుకొచ్చి తర్వాత కొత్తది కొందామనుకుని చిరుద్యోగులు, పార్ట్‌టైమ్ పనిచేసే కళాశాల విద్యార్థులు ఎక్కువ మంది అనుకుంటారు. కొత్త వాహనాల్లో వస్తున్న మార్పులు.. నాణ్యత లోపాలు ఇతర కారణాలతో కొత్త వాటిని కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపట్లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాల క్రయవిక్రయాలు రోజూ వందల్లో జరుగుతున్నాయి. అయితే బండి కొనేటప్పుడు ముందు చూపు, అవగాహన లేకపోతే జేబుకు చిల్లు తప్పదు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఇటీవల ఉమ్మడి జిల్లాలో తరచూ ద్విచక్ర వాహనాలు చోరీలకు గురవుతున్నాయి. పట్టుపడిన వారి వద్ద ఒక్కొక్కరి నుంచి పదుల సంఖ్యలో బండ్లు దొరుకుతున్నాయి. చాలా వాటికి విడిభాగాలు మార్చేయడం.. నంబరు ప్లేట్లు తీసేయడం.. రంగులు మార్చడం.. ఛాసిస్ నంబరు చెరిపేయడం వంటివి చేస్తున్నారు. బండి కొనేముందు వీటన్నింటిని పరిశీలించుకుంటే మంచిది. ● పోలీసు కేసులు నమోదయ్యాయేమో నిర్ధారించుకోవాలి. ట్రాఫిక్ చలానాలు ఎంతున్నాయో చూసుకోవాలి. ● ఫైనాన్స్ క్లియరెన్స్ అయ్యిందా.. అయితే దానికి సంబంధించిన నిరభ్యంతర పత్రంతో పాటు ఒరిజినల్ ఆర్సీ తీసుకోవాలి. ● పత్రాలన్నీ ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. ఆర్సీ కార్డులోని ఛాసిస్ నంబరు, వాహనంపై ఉన్నది ఒకేలా ఉండాలి. ● బండి మన పేరుపై రిజిస్ట్రేషన్ అవుతుందో లేదో ఆర్టీవో కార్యాలయంలో తెలుసుకోవాలి. ● ఇతర రాష్ట్రాల వాహనమైతే రిజిస్ట్రేషన్‌కు ఎంత అదనపు ఖర్చు అవుతుందో తెలుసుకోవాలి. అన్నీ బాగుంటేనే కొనుగోలు చేయడం ఉత్తమం. -కె.ఎస్.ఎమ్.కృష్ణారావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, ఏలూరు, పశ్చిమగోదావరి

ఇంజినే గుండెకాయ..

కొనే వాహనం కండిషన్ ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. నమ్మకమైన మెకానిక్ వద్దకు తీసుకెళ్లి చూపించాలి. వాహనానికి ఇంజిన్ గుండె లాంటింది. దాని పనితీరు సరి చూశాకే కొనుగోలుకు సిద్ధపడాలి. మైలేజీ, గేర్ బాక్స్, విడిభాగాల స్థితి.. వాటి మన్నిక.. టైర్లు.. లైట్లు.. తదితరాలన్నీ జాగ్రత్తగా చూసుకోవాలి. తప్పకుండా కొంత దూరం నడిపితే లోపాలు తెలుస్తాయి. - సాధిక్, మెకానిక్, ఆగిరిపల్లి

నేత్రపర్వం.. శివ కల్యాణం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శ్రీభ్రమరాంబమల్లేశ్వరస్వామి కల్యాణం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను ఆలయ ముఖ మండపంలో ప్రత్యేక వేదికపై కల్యాణ మూర్తులుగా కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం కల్యాణ క్రతువును నిర్వహించారు.

నేడు గిరిజనుల సంప్రదాయ క్రీడా పోటీల ఎంపికలు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: పీసా మహోత్సవంలో భాగంగా శాప్ ఆధ్వర్యాన గిరిజనులకు సోమవారం సంప్రదాయ క్రీడా పోటీల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ తెలిపారు. కేఆర్‌పురంలోని ఐటీడీఏలో పీసా రన్ మారథాన్ 21.5 కిలోమీటర్లు, కబడ్డీ, ఆర్చరీ- రకవర్, గిల్లి దండ విభాగాల్లో పోటీలుంటాయన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, పోలవరం, వేలేరుపాడు మండలాల్లో పద్దెనిమిదేళ్లు నిండిన యువత పాల్గొనవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 83318 73037, 83338 19912 నంబర్లను సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు..!

ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం గొల్లవానితిప్ప ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడి వికృత చేష్టలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, వారిని లైంగికంగా వేధించినట్లు తెలియడంతో గ్రామస్థులంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఈ విషయం వెలుగు చూసింది. పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొందరు విద్యార్థినులు భయంగా ఉండటం గమనించి పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్‌తో పాటు పెద్దలు ఆరా తీయగా విషయం బయటపడింది. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు చట్టపరంగానే వెళ్లాలనే ఉద్దేశంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యా శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డీవైఈవో ఆధ్వర్యంలో ఓ కమిటీ శనివారం విచారణ నిర్వహించింది. పాఠశాలలో మొత్తం 170 మంది విద్యార్థులుండగా వారిలో 85 మంది బాలికలే. దాదాపుగా వారంతా సదరు ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన, లైంగిక వేధింపుల గురించి చెప్పి బోరుమన్నట్లు తెలిసింది. దీనిపై ఉప విద్యాశాఖాధికారి రమేశ్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా గ్రామస్థుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించామని.. కొంత మంది విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా సమస్య చెప్పారన్నారు. విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించామన్నారు.

మామయ్య నిర్వాకం వల్లే నా భర్త అదృశ్యం

ఇంటి ముందే ఆందోళనకు దిగిన బాధితుడి భార్య

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం రాయలం ప్రాంతానికి చెందిన పంతం శ్రీనివాసు అదృశ్యమయ్యాడు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ఒక లేఖ రాసి వెళ్లడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. 'నా తల్లి 2020లో మృతి చెందారని.. తండ్రి ఆంజనేయులు కొన్నేళ్ల కిందట వేరే మహిళను తీసుకొచ్చి ఇంటి విషయంలో నాపైన అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ ఇబ్బందులకు గురి చేశాడని, ఇక నేను బతికి ఉండటం అనవసరమని' లేఖలో పేర్కొన్నాడు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన అతడి భార్య అలివేలుమంగతాయారు బంధువులతో కలిసి ఆదివారం ఇంటిముందు రోడ్డుపై ఆందోళనకు దిగింది. మా మామయ్య నిర్వాకం వల్ల పోలీసులు పదే పదే స్టేషన్‌కు పిలుస్తుండటంతో తన భర్త మనస్తాపానికి గురయ్యాడని వాపోయింది. తన భర్తను ప్రాణాలతో అప్పగించాలని కోరింది. గ్రామస్థులు, గ్రామ పెద్దలు ఎన్నిసార్లు చెప్పినా మామయ్య వినకుండా మాపై దుష్ప్రచారం చేస్తున్నాడని తెలిపింది.

రాయలంలో ఆందోళన చేస్తున్న శ్రీనివాసు భార్య, అతడి బంధువులు

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం మునిపల్లి-కలవచర్ల మధ్య ఎండుగడ్డితో వెళ్తున్న వ్యాన్ ఆదివారం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం కోరుపల్లి నుంచి పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి కట్టలు కట్టిన ఎండుగడ్డిని తీసుకుని ఆకుల శ్రీరామకృష్ణకు చెందిన ఐషర్ వ్యాన్ బయలు దేరింది. కోరుపల్లి వద్ద ఈ వ్యాన్‌పై ఉన్న ఎండుగడ్డికి విద్యుత్తు తీగలు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. కొంత దూరం వచ్చేసరికి స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో వ్యాన్‌ను ఆపి మంటలు నియంత్రించే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో నిడదవోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోగా, వ్యాన్ క్యాబిన్ కూడా దగ్ధమైంది. ఈ ప్రమాదం కారణంగా సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. ఇదిలా ఉంటే గడ్డి కట్టలు పడి మంటలు వ్యాపించి నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పూర్తిగా పొగతో నిండిపోయింది. ప్రయాణాలు సాగించేవారు ఎగిసిపడుతున్న మంటలకు భయపడి కొద్దిసేపు అక్కడే నిలిచిపోయారు.

విద్యుత్తు తీగలు తగిలి గడ్డి వ్యాన్ దగ్ధం

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నం.12(1744533)/2019/డి.బి తేది. 04-12-2025.

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో షార్ట్ టెండరు నోటీసు నెం: 19 (1-6) /BHI/General/2025-26/E1/E2 & టెండరు నోటీసు నెం: 19 (7-9) /BHI/General/2025-26/E1/E2 లోని జనరల్ నిధుల నుండి 9 పనులకు గాను రూ. 80.16 లక్షలతో ఇ- ప్రొక్యురుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్. నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వో.ల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇప్రొక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో.జిల్లా (సెల్: 9849906540, 9849906543) వారిని సంప్రదించగలరు.

సం/- కమిషనరు, భీమవరం పురపాలక సంఘం

కోతకు గురవుతున్న ఒడ్డు

గోదావరిలో పెరిగిన వరద

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: గోదావరిలో నీటి మట్టం ఆరు రోజులుగా పెరుగుతూనే ఉంది. ఓ వైపు సీలేరు నది.. మరో వైపు పోలవరం ప్రాజెక్టు దిగువ కాఫర్ డ్యాం సమీపంలో పనులు జరుగుతున్న నేపథ్యంలో వరద పెరిగింది. దీంతో కాకిసనూరు, టేకుపల్లి ఒడ్డున వేసిన బొబ్బర పంటలు కొంత మేర నీట మునిగాయి. గోదావరి ఇసుక మేటల వద్ద ఏర్పాటు చేసిన ఇంజిన్లను రైతులు ఒడ్డుకు చేర్చుకున్నారు. ఎగపోటు ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గోదావరి ఒడ్డు కోతకు గురవుతోంది. కట్కూరు, కోయిదా, తాట్కూరుగొమ్ము మెట్ల రేవులు కొంత మేర నీటమునిగాయి.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

ఏలూరులో కొత్తగా ప్రారంభించే రియల్ ఎస్టేట్ సంస్థ నందు పని చేయుటకు లీడర్స్, ఏజెంట్స్, గృహిణిలు, రిటైర్డ్ ఎంప్లాయిస్ కావలెను. కమీషన్, శాలరీ. ✆ 70133 05223.

BUSINESS OFFER

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైం or ఫుల్‌టైం ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర:78160 98199.

ఒమెగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ:20k. ✆ 89776 39662,89776 39663.

JOBS

Wanted Electrical Engineers. Qualified By B.Tech Electrical Engineering, Diploma or ITI Experience 0-3 Years. Place of Work: East and West Godavari Districts, Attractive Salary. Contact: 79950 50571 or Send Resumes To hr@gvsprojectspvtltd.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.50 పై॥ తణుకు ఆఫీసు: 08819-224254

(c) eenadu

భీమవరం

•భీమవరం •ఉండి

కుట్టు శిక్షణ కేంద్రం సద్వినియోగం చేసుకోండి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం మహిళలందరూ సద్విని యోగం చేసుకోవాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ ఆదివారం అన్నారు. 10వ వార్డులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకుడు యేలేటి న్యూటన్ ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. న్యూటన్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తామని.. పూర్తి చేసిన వారికి రాజ్ ట్రస్టు సహకా రంతో కుట్టు మిషన్లు ఉచితంగా అందిస్తామన్నారు. ట్రస్టు అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్, చెల్లబో యిన రంగారావు, కె.భీమారావు, గంటా రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులందరికీ ప్రభుత్వ లబ్ధి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాహ్మణులందరికీ లబ్ధి కలిగేలా రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ కృషి చేస్తోందని కార్పొరేషన్ సభ్యుడు చెరుకుపల్లి సంతోష్ ఆదివారం అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ దినో త్సవం, బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లబ్ధిదారులు ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెదేపా ప్రభుత్వం మీ కోసం పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా బ్రాహ్మణులకు అండగా ఉంటూ సహకరిస్తోం న్నారు. సీతారామలింగేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ వేలూరి శ్రీధర్‌కుమార్, వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మ కర్త వేలూరి సుబ్రహ్మణ్యశర్మ, సోమేశ్వరాలయ ధర్మకర్త బ్రాహ్మణోత్తముల ప్రసాదశర్మ పాల్గొన్నారు.

పాతది పొమ్మంటోంది.. కొత్తది రమ్మనడంలేదు

పాలకోడేరు, న్యూస్‌టుడే: వేండ్రలో సరైన భవనం లేక వ్యవసాయ శాఖ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. కొండేపూడి వెళ్లే రహదా రిలో గత ప్రభుత్వంలో సుమారు రూ.18 లక్షల వ్యయంతో రైతు సేవా కేంద్ర భవన నిర్మాణం చేపట్టారు. నిధుల విడుదల జాప్యంతో గుత్తేదా రుడు నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివే శారు. దీంతో పాత ప్రభుత్వ భవ నంలో సిబ్బంది విధులు నిర్వహిస్తు న్నారు. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు వర్షం నీరు లీకై ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం మందు బాబులకు నిలయంగా మారింది. భవన నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. మిగిలిన పనులు పూర్తిచేసేం దుకు ప్రతిపాదనలు చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ విజయకుమార్‌రాజు తెలిపారు.

నిలిచిపోయిన కొత్త భవనం

ఆహార పదార్థాల తనిఖీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం వీరమ్మపార్కు పక్కన ఉన్న ఫుడ్‌స్టాల్స్‌లో ఆహార పదార్థాలను జిల్లా ఆహార భద్రత అధికారి సుందరరామిరెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. పర్యాటకులకు మంచి ఆహారం అందించాలని సూచించారు. పదార్థాల తయారీ, విక్రయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

శిథిల భవనాల్లో బిక్కుబిక్కు

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏళ్లుగా అవస్థలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరంలో దశాబ్దాల కిందట నిర్మించిన శిథిల భవనాల్లోనే పలు శాఖల కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనే ఆందోళనతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహి స్తున్నారు. ఉప ఖజానా, సబ్ రిజి స్ట్రార్, తహసీల్దార్, పౌరసరఫరాల డీటీ, గృహనిర్మాణ సంస్థ తదితర కార్యాల యాలు శిథిల స్థితిలో ఉన్నాయి. ర.భ.శాఖ జిల్లా అధికారి కార్యాలయ భవనమూ అందుకు తీసికట్టుగానే ఉంది. అయినా పాలకులు నూతన భవనాల నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు భయపడుతూనే వస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వ పాలనలో అయినా ఈ సమస్య పరిష్కారం కావాలని ఉద్యోగులు, ప్రజలు ఆశిస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, సబ్‌రిజిస్ట్రార్ ప్రసాదరెడ్డి, ఉపఖ జానాధికారి రవివర్మ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

విరిగిన సీలింగ్ ఇలా..

విరిగిన కిటికీ తలుపులు

● పట్టణ నడిబొడ్డున దశాబ్దాల కిందట రేకులషెడ్డుగా నిర్మించిన వ్యవసాయశాఖ భీమవరం డివిజన్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం సీలింగ్ పాడైంది. గోడలు బీటలు వారాయి. కిటికీలు చెదలు పట్టిపో యాయి. దీని పరిధిలో సుమారు 30 వేల ఎకరాల వరిసాగు విస్తీర్ణం ఉంది. డివిజన్ అధికారితోపాటు భీమవరం మండల వ్యవసా యాధికారి, పలువురు సిబ్బంది ఇక్కడే విధులు నిర్వహిస్తుంటారు. నిత్యం అనేక మంది రైతులు సలహాలు, సూచనల కోసం వస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే నూతన భవనం నిర్మించాలని రైతులు, ఉద్యోగులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74453	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:

? లోసరి- గుట్లపాడు పంటకాలువ పక్కన రహదారి పనులు వేగవంతం చేయాలి. అసం పూర్తి పనులతో ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయి. - రామచంద్రరావు, విశ్రాంత ఉద్యోగి

? విస్సాకోడేరు వంతెన నుంచి పైపుల చెరు వుకు వెళ్లే ప్రధాన రహదారి రాళ్లు లేచి ప్రమా దకరంగా మారింది. వాహన రాకపోకల సమ యంలో దుమ్ముతో పాటు రాళ్లు ఎగిరిపడుతు న్నాయి. - చంద్రబాబు, ప్రైవేటు ఉద్యోగి, పాలకోడేరు

✔ పంటకాలువ పక్కన రహదారి నిర్మాణ పనులు చేపట్టున్నారు. పైపుల చెరువు రహ దారి పనులు చేపట్టిన గుత్తేదారుకు తాఖీదు లిచ్చాం. పట్టణంలో అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేస్తున్నాం. - పి.త్రినాథరావు, ఎంఈ

ఉండి, న్యూస్‌టుడే: ? ఉండి అర్బోనీటీ ఎదు రుగా చిక్కాలబీరన్న నగర్ ప్రాంతంలో ప్రధాన పంటకాలువ అంచుల్లో చెత్త పెరిగిపోయి పడే స్తున్నారు. - కె.రామకృష్ణ, ఉండి.

✔ చెత్త తొలగింపు పనులు చేపట్టాం. హెచ్చ రిక బోర్డు ఏర్పాటుచేశాం. - అనిల్‌కుమార్, గ్రామాభివృద్ధి అధికారి, ఉండి.

వీరవాసరం, న్యూస్‌టుడే: ? మత్స్యపురిలో తాగునీటి పైపులైన్లు ఛిద్రమైనందున కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తోంది. - కరెళ్ల ఫణిబాబు

✔ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. - కల్యాణి, పంచాయతీ కార్యదర్శి, మత్స్యపురి

? వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. చిన్నపిల్లల్లి బయటకు పంపాలంటేనే భయంగా ఉంది. - రమణ

✔ వీధి కుక్కలను పట్టించి నూతన ప్రాంతానికి తరలిస్తాం. - ఎన్. సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, రాయకుదురు

కొణితివాడ (వీరవాసరం), న్యూస్‌టుడే: కొణితివాడ శివారు గవరపాలెంలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదంటూ ఈనెల 1న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

నవుడూరు (వీరవాసరం), న్యూస్‌టుడే: నవుడూరులోని కచ్చా డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయంటూ 'మేమున్నాం. . మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ఈనెల 1న ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్య దర్శి మాణిక్యం స్పందించారు. కచ్చా డ్రెయి న్లలో వ్యర్థాల తొలగింపు పనులు చేయించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి నిత్యా న్నదాన పథకానికి భీమ వరం మండలం గునుపూ డికి చెందిన గూడూరు వీర వెంకట గోవర్ధన్, భారతి దంపతులు ఆదివారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. దేవస్థానం ఈవో వారికి స్వామివారి చిత్రపటాన్ని అందజేసి అభినందించారు.

దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

కొత్త కాలనీకి కంకర రహదారి

ఉండి, న్యూస్‌టుడే: నాలుగేళ్ల నుంచి సరైన మార్గం లేక అవస్థలు పడు తున్న ఉండి కొత్తకా లనీలోని ప్రజల కష్టా లకు త్వరలో విముక్తి లభించనుంది. వర్షం కురిస్తే అడుగు తీసి అడుగేయలేని దయ నీయ స్థితి నెలకొన్న ఈ సమస్యను మండల తెదేపా అధ్యక్షుడు కరి మెరక నాగరాజు ఆధ్వర్యంలో ప్రజలు ఉప సభాపతి కను మూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి కంకర రహదారి నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవా లని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో సుమారు రూ.11 లక్షలతో దాదాపు కిలోమీటరున్నర పరిధిలో కంకర మార్గం నిర్మాణానికి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఇతర పాలకవర్గం ముందుకొచ్చింది. ఈ పనులను సౌజన్య బెనర్జీ, కరిమెరక నాగరా జుతోపాటు తెదేపా గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, గ్రామ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ చేయిస్తున్నారు.

ఉండి పుంత మార్గంలో వేస్తున్న దారి

వృద్ధులకు ఆశ్రయం కల్పించడం అభినందనీయం

చినఅమిరం(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: వందల మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించడం అభినందనీయ మని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం మండలం చినఅమిరంలో స్వామి గోశ్వరానందగిరి విశ్వశాంతి వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, పీఏసీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, తెదేపే మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి పాల్గొన్నారు.

రిబ్బను కత్తిరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

ఆక్రమణలు తొలగించండి : జేసీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆక్రమణలను వెంటనే తొలగించా లని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. వీరమ్మపార్కు, రైతుబజారు, కొత్త బస్టాండు, రైల్వే జంక్షన్, ప్రకాశం చౌక్, జువ్వలపాలెంరోడ్డు తది తర ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఫుడ్‌కోర్టుల ఏర్పాటు, ఆక్రమణల తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ, కూరగా యల ధరల నియంత్రణ విషయాల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పురపాలక కమి షనర్ కె.రామచంద్రారెడ్డి, శ్రీలక్ష్మి, ఎస్.రమాదేవి పాల్గొన్నారు.

వీరమ్మపార్కులో పరిశీలిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి, అధికారులు

చిలుకూరు పంట కాలువ ప్రక్షాళన పనులు

ఉండి, న్యూస్‌టుడే: గరగపర్రు నుంచి చిలు కూరు మీదుగా వెలివర్రు గ్రామం వరకు ప్రవహిస్తున్న పంట కాలువ ప్రక్షాళన పనులు చురుగ్గా సాగుతున్నాయి. నీటి వినియోగదారుల సంఘం ఆధ్వ ర్యంలో ఈ పనులు చేపట్టారు. ప్రధానంగా చిలుకూరు, వెలి వర్రు గ్రామాల్లో పంట కాలువకు ఇరువైపులా ఆక్వా చెరువులున్నాయి. ఎగువన వరి సాగవుతోంది. పంట కాలువలో తూడు, గుర్రపుడెక్క వివిధచోట్ల అల్లుకుపోవడం, మట్టి, ఇతర వ్యర్థాలు అవరోధంగా మారాయి. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెల కొంది. దీంతో వ్యర్థాల తొలగింపు చేపట్టామని నీటి విని యోగదారుల సంఘ ప్రతినిధులు తెలిపారు. అయిదురో జుల్లో ఈ పనులు పూర్తవుతాయన్నారు.

ఆఖరు మజిలీ అవస్థలు తీరాయి

పాలకోడేరు, న్యూస్‌టుడే: మోగల్లు హిందూ శ్మశాన వాటికలో సదుపాయాలు లేక ఎదుర్కొంటున్న స్నానాల సమస్య పరిష్కారమైంది. దహన, అంత్యక్రియలు అనం తరం స్నానాలు చేసేందుకు ఇక్కడ ఎటువంటి నీటి సౌకర్యం లేకపోవడంతో సమీప కాలువ రేవు వద్ద స్నానాలు చేస్తుంటారు. ఈ సమస్యను స్థానికులు ఉపసభా పతి కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ నుంచి నిధులు మంజూరుకు ఆదేశించారు. దీంతో స్థానిక సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి ఆధ్వ ర్యంలో శ్మశాన వాటిక వద్ద స్నానాలు చేసేందుకు అనువుగా ఘాట్ నిర్మించి తుంపర స్నానాలు ఏర్పాటు చేశారు.

కొత్తగా ఏర్పాటు చేసిన స్నానపు ఘాట్

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సనా తన ధర్మ పరిరక్ష ణకు అందరూ కృషి చేయాలని పెను గొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి ఆదివారం అన్నారు. భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో హిందూ నిర్వహణ సమితి ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనం సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందూ సమ్మేళనం నిర్వ హణ కమిటీ అధ్యక్షుడు తటవర్తి వెంకటనరసింహారావు, ఉమ్మడి జిల్లా నిర్వాహకుడు బెల్లపుకొండ వీరభద్రరాజు, ప్రొఫెసర్ సుంకర అలివేలుమంగతాయారు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజ్ఞానంద సరస్వతి

స్వామికి ఆరుద్ర నక్షత్ర పూజలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామక్షేత్రం గునుపూడి సోమే శ్వర జనార్దన స్వామి ఆలయంలో ఉదయం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సామూహిక అర్చనలు నిర్వహిం చారు. మధ్యాహ్నం లక్ష బిల్వార్చన, సాయంత్రం విశేషాలంకరణ, సహస్ర నామ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకు న్నట్లు ఆలయాధికారి డి.రామకృష్ణంరాజు, ధర్మక ర్తల మండలి ఛైర్మన్ చింతలపాటి బంగార్రాజు తెలిపారు.

బ్రహ్మసూత్ర సోమేశ్వరుడికి అన్నాభిషేకం.. **భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** మార్గ శిర మాసం ఆరుద్ర నక్షత్రం సంద ర్భంగా కొత్త బస్టాండ్ సమీపాన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో (బ్రహ్మ సూత్ర సోమేశ్వరుడికి) అన్నాభిషేకం ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం పంచా మృతాలు, పంచదారతో విశేషాభిషేకాలు చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదం వితరణ నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు రామకృష్ణశర్మ, కమిటీ సభ్యులు తెలిపారు.

బాలాత్రిపురసుందరికి కనకాంబరాలతో అలంకరణ.. **భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** మెంటేవారి తోటలోని బాలాత్రిపురసుందరి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహిం చారు. సాయంత్రం అమ్మవారికి భక్తుల సహకా రంతో కనకాంబరం పుష్పాలతో అలంకరించి సహస్ర నామ పూజలు చేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

చెన్నమల్లేశ్వరస్వామికి.. **ఉండి, న్యూస్‌టుడే:** ఉండి రాజుల పేటలోని పార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామికి ఆది వారం వేకువ జాము నుంచే ప్రత్యేక అభిషే కాలు చేయిం చారు. ఆలయ వేద పండితుడు సన్నిధిరాజు చలపతిరావు ఆధ్వర్యంలో స్వామికి తొలుత పంచామృతాలు, పండ్ల రసాలు, గంధకం, భస్మోదకాలతో ప్రత్యేక నివేదనలు సమ ర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామికి అభిషేకాలు చేయించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

ఊరంతా ఏకమై..

మూడు దశాబ్దాల తరువాత మంచినీటి వనరుకు మోక్షం

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: మూడు దశాబ్దాల తరువాత మహదేవపట్నంలోని మంచినీటి చెరువు అభివృద్ధి పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణ రాజు నిర్ణయంతో ఊరంతా ఒక్కట య్యారు. ప్రజల సహకారంతో మంచినీటి చెరువులో పొక్లెయిన్‌తో చేపట్టిన పూడిక తీత పనులను సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి ప్రారంభించారు. ఈ పనులు మూడు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణతో ముందు కెళ్తున్నామని ఆమె తెలిపారు.

మూడు నెలల్లో చెరువు అభివృద్ధి

పెద్ద పంచా యతీ అయిన మహదేవ పట్నం పరిధిలోని ఏడు నివాశిత ప్రాంతాల్లో 6 వేల మంది జనాభా నివ శిస్తున్నారు. రక్షిత తాగు నీరు అందించాలని ప్రజలు దశాబ్దం నుంచి అధి కారులకు మొరపెట్టుకుంటున్నారు. గట్లు దెబ్బతిని మట్టితో పూడిపోయిన 12 ఎకరాల చెరువుతోపాటు ఇన్‌లెట్, అవుట్‌లెట్ బోదెలను ప్రక్షాళన చేయా లని కోరుతున్నారు. అభివృద్ధికి ప్రతిపాదించడం తప్ప నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టలేకపోయారు. గతేడాది వేసవిలో మంచినీరు అందించలేని దయనీయ పరిస్థితిని చవిచూశారు. శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగు నీరందించారు. పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలతో కలిసి ఉప సభాపతి రఘురామకృష్ణరాజు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని సర్పంచి సుబ్బ లక్ష్మి తెలిపారు. రఘురామ ఆదేశాలతో డ్రెయిన్లు తవ్వించి చమురు యంత్రాలతో మురు గునీటిని బయటకు తోడుతున్నామని వివరించారు. దాతలు, ఉప సభాపతి సహకారంతో సమకూర్చిన మైక్రోఫిల్టర్ల ద్వారా శుద్ధిచేసిన నీటిని ప్రజలకు కుళా యిల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. చెరువు అభివృద్ధి పనులు పూర్తయ్యేవరకూ ప్రజలందరూ పంచా యతీకి సహకరించాలని సర్పంచి కోరారు.

గట్లను పరిశీలిస్తున్న సర్పంచి సుబ్బలక్ష్మి తదితరులు

సంయుక్త ఎల్‌పీఎంల సబ్ డివిజన్‌కు వేళాయె

నేటి నుంచి గ్రామాల వారీగా సభలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్)ల వల్ల ఆయా భూ యజమా నులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. సర్వే అనంతరం ఒకే కుటుంబంలోని సభ్యులు, సమీప సరి హద్దుదారులకు జాయింట్ ఎల్‌పీఎంలు కేటాయించారు. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సమయంలో సాంకేతిక సమ స్యలు తలెత్తి రైతులు అవస్థలు పడుతున్నారు. వాటిని పరిష్కరించాలని నిత్యం తహసీల్దారు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ బాధిత రైతులు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలను సబ్ డివి జన్ చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలనే లక్ష్యంతో పాలకోడేరు మండలంలో నేటి నుంచి గ్రామ సభలు నిర్వ హిస్తున్నారు. జాయింట్ ఎల్‌పీఎంలు కలిగిన రైతులు నేరుగా గ్రామ సభలో దరఖాస్తు చేసుకుంటే సబ్ డివిజన్ చేస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దారు రఘు సూచించారు.

ఎల్‌పీఎంల వివరాలు..

రీసర్వే పూర్తయిన గ్రామాలు	12
మొత్తం ఎల్‌పీఎంల సంఖ్య	10,815
జాయింట్ ఎల్‌పీఎంల సంఖ్య	2708
సబ్ డివిజన్ చేసినవి	823
పరిష్కరించాల్సినవి	1885

సమావేశాలు ఇలా..

8న గొరగనమూడి, 9న పెన్నాడ అగ్రహారం, 10న గరగపర్రు, గొల్లలకోడేరు, 11న కోరుకొల్లు, మైప, 12న మోగల్లు, పాలకోడేరు, 15న వేండ్ర, 16న కొండేపూడి, వేండ్ర అగ్రహారం, 17న విస్సాకోడేరు.

అలరించిన ఆరాధన వేడుకలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం డీఎన్నార్ కళాశాల రోడ్డులో ఉన్న లెమన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో ఆదివారం రాత్రి క్రిస్మస్ ఆరాధన వేడు కలు ఘనంగా నిర్వహిం చారు. చిన్నారుల పాటలు, డ్యాన్స్‌లు, లఘు నాటికలు, స్త్రీల సమాజం సభ్యులు దేవుని పాటలతో అలరించారు. ముఖ్య అతిథిగా పీటర్‌పాల్ (గుంటూరు) పాల్గొని క్రిస్మస్ సందేశం ఇచ్చారు. చర్చి పాస్టర్ జయంత రావు ప్రత్యేక ప్రార్థన చేసి వేడుకలు ప్రారంభించారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన

ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని శ్రీమాణిక్యాంబ సమేత శ్రీభీమేశ్వర స్వామి ఆలయం నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్య క్రమం ఆదివారం జరిగింది. ఛైర్మన్‌గా వేమూరు వెంకట సీతారామశాస్త్రి, సభ్యులుగా చింతా ఆదిశేష, పి.రాంబాబు, చుండూరి వెంకటేశ్వరరావు, జంగారెడ్డి మణికంఠ కొండారెడ్డి, ఎం.శ్రీదేవి, ఎం.దుర్గాభవాని, ఎన్.శ్రీలక్ష్మి, టి.చంద్రకుమారి, మొవ్వ వెంకటరత్నం ప్రమాణస్వీకారం చేశారు.

సీఐ కాళీచరణ్‌కు సన్మానం

చినఅమిరం(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: సైబర్ నేరాల కేసులు సైతం తక్కువ రోజుల్లో ఛేదించారంటూ కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ రెండో పట్టణ పోలీసులను ప్రశంసించారు. చినఅమి రంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో సీఐ కాళీచరణ్‌ను సత్కరిం చారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..

పల్లెల్లో చెత్త సేకరణ కోసం వీరవాసరం గ్రామ పంచాయతీకి గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన రిక్షాలను అధికారులు మూలన పడేశారు. ఈ గ్రామం సుమారు మూడు కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. సేకరించిన చెత్తను రిక్షాల్లో డంపింగ్ యార్డుకు తీసుకెళ్లాలంటే శ్రమ పడాల్సి వస్తోందని పారిశుద్ధ్య కార్మికులు వాటిని వినియోగించడం లేదు. పంచాయతీ ఇటీవల రూ. 10 లక్షలతో రెండు ఆటోలను కొనుగోలు చేసింది. దీంతో ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చుచేసి సమ కూర్చిన రిక్షాలు ఇలా నిరుపయోగంగా మారాయి. వాటిని సమీప పంచాయతీలకు ఇస్తే వినియోగంలోకి తీసుకురావచ్చని పలువురు పేర్కొంటున్నారు. **- న్యూస్‌టుడే, వీరవాసరం**

అనుమతి లేకుండా వైఎస్ విగ్రహం ఏర్పాటు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసిన వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.నాగలక్ష్మి తెలిపారు. భీమ వరం మండలం వెంప గ్రామంలో మధ్యపేట చర్చి సమీపాన ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్లు పంచా యతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుంతలు పూడ్చారు

ఈనాడు కథనానికి స్పందన

ఆకివీడు, న్యూస్‌టుడే: పెద కాపవరం నుంచి నిడమర్రు మండలం క్రొవ్విడి వరకు ఉన్న నాలుగు కిలోమీటర్ల ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. దీని అభివృద్ధికి రూ.23 కోట్లు మంజూరై రెండేళ్లు అయినా పనులు అసంపూర్తిగా మిగిలిపోయిన తీరుపై, భారీ గోతుల్లో వాహనచోద కులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 27న 'ఈనాడు'లో 'రోడ్డంతా గోతులు..ప్రయా ణికుల వెతలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనా నికి ఆర్‌అండ్‌బీ జేఈ శ్రీహరిరాజు స్పందించారు. ఆదివారం పొక్లెయిన్‌తో భారీ గోతులు పూడ్చి రహ దారిని చదునుచేయించారు. త్వరలో పనులు ప్రార ంభించేలా కృషి చేస్తానని జేఈ తెలిపారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమ వరం డీఎన్నార్ కళాశాలకు చెందిన అభి, సాయిరామ్, మధుకుమార్ సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీ లకు ఎంపికయ్యారని వ్యాయామ అధ్యాప కుడు బి.వి.నరసింహరాజు తెలిపారు. జేఎన్ టీయూ కాకినాడలో ఈ నెల 10 నుంచి జరిగే పోటీల్లో ఈ ముగ్గురు క్రీడాకారులు నన్నయ విశ్వవిద్యాలయ వాలీబాల్ జట్టు తరఫున పాల్గొంటారన్నారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు జోత్స్న.. **వీరవాసరం, న్యూస్‌టుడే:** ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించ నున్న జాతీయ స్థాయి ఈత పోటీలకు వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామానికి చెందిన కోరశిఖ జ్యోత్స్న ఎంపికైనట్లు బాలిక తండ్రి వీర్రాజు తెలిపారు. ఏపీ స్విమింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసారావుపేటలో ఆదివారం నిర్వహించిన ఈత పోటీల్లో జ్యోత్స్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. సౌత్‌జోన్ తరఫున జ్యోత్స్న పాల్గొనున్నట్లు తెలిపారు.

ప్రమాదకర మలుపు

భీమవరం-నరసాపురం ప్రధాన మార్గంలో తుందుర్రు గ్రామం వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భీమవరం, నరసాపురం, వీరవాసరం మండలాలకు చెందిన వేలాది మంది ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయని.. వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతు న్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ర.భ.శాఖ ఏఈ రా జశేఖర్ తెలిపారు. **- న్యూస్‌టుడే, భీమవరం గ్రామీణ**

వెంకయ్యవయ్యేరు.. నిర్వహణ గాలికొదిలేశారు

జిల్లాలో మేజర్ కాలువల్లో ఒకటైన వెంకయ్యవయ్యేరు నిర్వహణ తూతూ మంత్రంగా ఉంది. వయ్యేరులో తూడు, గుర్రపుడెక్కతోపాటు ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో పలు చోట్ల చెత్తతో పేరుకుపోయి మురుగు కాల్వను తలపి స్తోంది. వెంకయ్యవయ్యేరు నుంచి వచ్చే గోదావరి జలాలతోనే గణపవరం, నిడ మర్రు ఆకివీడు, కాళ్ల మండలాల పరిధి లోని అనేక గ్రామాల్లోని మంచినీటి చెరు వులు నింపుకోవాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువలు కలు షితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆకివీడు**

చెత్త, తూడు, గుర్రపుడెక్కతో కాలువ

D.N.R.COLLEGE, PG COURSES (AUTONOMOUS), BHIMAVARAM
(Re-accredited at "A+" grade by NAAC)
(Affiliated to Adikavi Nannaya University)

NOTIFICATION Dt. 06-12-2025

PG Programmes B-Category and Spot Admissions

Applications are invited from the eligible candidates seeking admission in the vacancies of the following PG Programmes under B-Category and Spot Admissions in D.N.R.College PG Courses (A), Bhimavaram, West Godavari Dt., for the academic year 2025-26 as per the APSCHE norms. Eligible candidates can apply for admissions on or before dt. 11-12-2025.

P.G., Programme	Vacancies		P.G., Programme	Vacancies	
	B-Cat	Spot		B-Cat	Spot
M.Sc., (Biotechnology)	9	22	M.Sc., (Anal Chemistry)	9	9
M.Sc., (Mathematics)	9	20	M.Sc., (Orga Chemistry)	9	16
M.Sc., (Microbiology)	9	14	M.Sc., (Comp. Science)	12	24
M.Com.,	30	79	M.Sc., (Aquaculture)	9	24

For further queries, please contact 9491334119, 9441554891, 9959464237

PRINCIPAL SECRETARY & CORRESPONDENT

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

పోడూరు, న్యూస్‌టుడే: ధర్మ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని దత్త పీఠాధిపతి సాయి దత్త నాగానంద సరస్వతి స్వామి సూచించారు. పోడూరులో బాల సంఘం కూడలిలో ఆదివారం జరిగిన మండల స్థాయి హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ప్రతి హిందువు సనాతన ధర్మం పాటిస్తూ ఇతరులకు ఆదర్శప్రాయంగా జీవించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్షలతో పూజలు చేశారు. అనంతరం సాయి దత్త నాగానంద సరస్వతి స్వామిని గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా సత్కరించారు.

అసాంఘిక శక్తులతో ఇబ్బందులా?

నేడు డయల్ యువర్ డీఎస్పీ

తేదీ: 8.12.25 (సోమవారం)
సమయం: ఉదయం 10-11 గంటల మధ్య
చరవాణి సంఖ్య: 94407 13567

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయ పరిధిలో పట్టణాలు, గ్రామాల్లో అసాంఘిక శక్తులు, ఆకతాయిల ఆగడాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? పోలీస్‌స్టేషన్లలో కేసుల నమోదులో జాప్యం జరుగుతుందా? ఇలాంటి సమస్యలను నేరుగా డీఎస్పీ జి.శ్రీవేద అరవింద దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఇక్కడ పేర్కొన్న చరవాణి నంబరుకు ఫోన్ చేసి పేరు, ఊరు వివరాలతో పాటు సమస్యను క్లుప్తంగా తెలియజేయడమే.

సూర్య భగవానుడికి అభిషేకాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు పరిధి సర్వోదయపురంలో ఉన్న సూర్య దేవాలయంలో ఆదివారం ఉదయం అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని రజతాభరణాలు, తమలపాకులు, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురంలో వశిష్ఠ గోదావరి తీరాన బాపు ఘాట్ వద్ద ఉన్న సూర్య నారాయణ స్వామి ఆలయంలో పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేసి పంచ హారతులు ఇచ్చారు.

భవానీ భక్తుల గ్రామోత్సవం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కొప్పర్రులో భవానీ మాలధారణ భక్తులు ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు జై భవానీ నినాదాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

శివయ్యకు బిల్వార్చనలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, గ్రామీణ, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. శివదేవునిచిక్కాలలో పార్వతీ సమేత శివదేవస్వామి, పూలపల్లిలో అన్నపూర్ణా సమేత అమృత లింగేశ్వరస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు అభిషేకాలు చేయించుకున్నారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పార్వతీ బసవేశ్వర, కామాక్షీ సమేత ఏకాంబరేశ్వర, కపిల మల్లేశ్వర, అమరేశ్వర, పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం తెల్లవారుజామున మహన్యాస పూర్వక పాశుపత రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలో ఏకాంబరేశ్వర స్వామి, జుత్తిగలోని శ్రీ ఉమా వాసుకీ రవి సోమేశ్వరస్వామి ఆలయాల్లో అన్నాభిషేకాలు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: త్రైత సిద్ధాంత భగవద్గీతపై పాలకొల్లు మండలం పెద్దమామిడిపల్లి గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

తీరు మారదు.. ముంపు తప్పదు

అధ్వానంగా మారిన డ్రెయిన్లు

ఆచంట, న్యూస్‌టుడే: పశ్చిమ డెల్టాలో నరసాపురం డివిజన్ పరిధిలోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో ప్రవాహ సామర్థ్యం కోల్పోతున్నాయి. ఈ ప్రాంతంలో ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. త్వరలోనే రబీ పనులు మొదలవుతాయి. ఖరీఫ్, రబీ సీజన్ల మధ్య సమయంలోనే మురుగు కాలువల ప్రక్షాళన పనులు చేయాల్సి ఉండగా ఈ దిశగా ఎలాంటి చర్యలు లేవు. గతేడాది కొన్ని పంట కాలువల్లో పూడిక తీశారు. నక్కల, తాడేరు, వల్లూరు, సరిపల్లి, భగ్గేశ్వరం, గొంతేరు, సరిపల్లి, మొగల్తూరు తదితర మురుగు కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు చేసినా పనులు జరగలేదు. తాజాగా మళ్లీ ప్రతిపాదనలు చేశారు. వాటికి ఆమోదం లభించి సకాలంలో నిధులొస్తేనే పూడికతీత సాధ్యమవుతుంది.

డెల్టాలో కీలకమైన తాడేరు మురుగు కాలువలో ఇలా మట్టి మేట వేసి మురుగు పారుదలకు అవరోధంగా మారుతోంది. కొన్నేళ్లుగా నిర్వహణ పనులను గాలికి వదిలేయడంతో కాలువలు ప్రవాహ సామర్థ్యం కోల్పోయి ఏటా ముంపు ముప్పు తప్పడం లేదు.

ఏటా నష్టాలే..

ఆచంట, పెనుగొండ, పోడూరు, యలమంచిలి మండలాల పరిధిలో ప్రధాన మురుగు కాలువ వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైంది. గతేడాది దీనిలో పూడికతీత పనులకు ప్రతిపాదనలు చేసినా నిధులు మంజూరు కాలేదు. దీంతో కేవలం గుర్రపుడెక్క నివారణకు రసాయనాల పిచికారీ చేసి సరిపెట్టారు. ఈ ప్రాంతంలో తాడేరు, వల్లూరు మీడియం డ్రెయిన్లు కూడా దుస్థితిలో ఉన్నాయి. ఖరీఫ్‌లో అధిక వర్షాలు కురిసినప్పుడు నక్కల కాలువ పరిధిలోని ఎ.వేమవరంలో 200 ఎకరాల్లో వరి చేలు పూర్తిగా మునిగి కుళ్లిపోయాయి. రూ.6 కోట్లతో ఈ కాలువ ప్రక్షాళన పనులకు తాజాగా ప్రతిపాదనలు పంపించారు.

ఇదీ పరిస్థితి.. పాలకొల్లు మండలంలో సరిపల్లి-గొరింటాడ మురుగు కాలువ పూడిపోయి మురుగు నిలిచిపోవడంతో ఈ ఏడాది 150 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయకుండా వదిలేశారు. సాగు ఆరంభంలోనే పెనుగొండ మండలం చినమల్లం, నడిపూడి గ్రామాల్లో నారుమడులు, నాట్లు వేసిన చేలకు నష్టం ఏర్పడింది.

పెనుమంట్ర మండలంలో పొలమూరు మురుగు కాలువ వల్ల 500 ఎకరాల్లో చేలు ముంపునకు గురయ్యాయి.

నరసాపురం మండలంలో మొగల్తూరు కాలువ కూడా దుస్థితిలో ఉంది. యలమంచిలి మండలం కంతేరు వద్ద ఆవ కాలువ పూడిపోయి మురుగు పారడం లేదు.

రూ.20 కోట్లు అవసరం.. డివిజన్‌లోని మురుగు కాలువల్లో పూడికతీత పనులకు రూ.20 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. డివిజన్ పరిధిలో అన్ని డ్రెయిన్లలో పూడికతీత పనులకు ప్రతిపాదనలు పంపినట్లు మురుగు పారుదల శాఖ ఏఈ సాయిశాంతన్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	80085 74504	ఆచంట	90631 44737
పాలకొల్లు	80085 74510	పెనుగొండ	80085 74469
పోడూరు	90631 44741	పెనుమంట్ర	91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? బస్టాండ్ రోడ్డులో చెత్తను సక్రమంగా తొలగించడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - డి. సోమశేఖర్, నరసాపురం

✔ చెత్త తొలగింపు పనులు చేయిస్తాం. - పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ? ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. - ఎన్. సత్యనారాయణ, సానికుడు

✔ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - సుధాకర్, విద్యుత్తు ఏఈ

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? గ్రామంలోని రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. - నాగేశ్వరరావు, కొత్తకాయలతిప్ప

✔ పాదులు తొలగించేలా చర్యలు. - ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి ఏఈ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? బ్రాడీపేట 2వ వీధిలో కొద్ది రోజులుగా డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదు. మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. - సాయి, పాలకొల్లు

✔ డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం. - లక్ష్మణ్, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ? నడిపూడిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సమీపాన ప్రధాన రహదారి వెంబడి చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - కనకారావు

✔ ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. - కిశోర్‌బాబు, ఇన్‌ఛార్జి కార్యదర్శి

నిరంతర కృషితో న్యాయవాద వృత్తిలో రాణింపు

జస్టిస్ మల్లికార్జునరావును సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

నరసాపురం, న్యూస్‌టుడే: నిరంతర కృషితో న్యాయవాద వృత్తిలో రాణించడంతో పాటు సమాజంలో మంచి గుర్తింపు పొందవచ్చని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని తెలగ కల్యాణ మండపంలో ఆదివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసి విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని దివంగత న్యాయవాది నాగిరెడ్డి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన న్యాయవాదులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి, సీనియర్ సివిల్ జడ్జి కె.గంగరాజు, న్యాయమూర్తులు వరలక్ష్మి, విజయలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విన్నా ప్రకాశ్, కోశాధికారి పూరెళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వైదాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో రాజీ పడొద్దు

సమీక్షలో మంత్రి నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల విషయంలో రాజీ లేకుండా పనిచేసి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. 2027 పుష్కరాల సందర్భంగా నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో ఆయన తన కార్యాలయంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. సొంతింటి కోసం ఎదురుచూస్తున్న మహిళల కోసం టిడ్కో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తిచేసేలా శ్రద్ధ పెట్టాలన్నారు. పట్టణంలోని రామగుండం, అబ్దుల్‌కలాం పార్కులతో పాటు ఎన్టీఆర్ కళాక్షేత్రం, బీసీ సామాజిక భవనం పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. పురపాలక కమిషనర్ బి.విజయసారథి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన కృషి

పోడూరు, న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని కాకినాడ జిల్లా సివిల్ జడ్జి బీరా శ్రీను పేర్కొన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థుల కోసం కవిటం దళితపేటలో అంబేడ్కర్ అసోసియేషన్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్యూషన్ సెంటర్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. అలనాడు అంబేడ్కర్ ఎదుర్కొన్న కష్టాలు నేటి తరం దళిత బిడ్డలకు రాకూడదనే లక్ష్యంతో ట్యూషన్ సెంటర్లు ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు. సొసైటీ అధ్యక్షుడు కొల్లు శ్రీను, సభ్యులు యడ్ల వీరాస్వామి, మైలె వెంకటేశ్వరరావు, పోతుమూడి రామచంద్రరావు, బుడితి భీమారావు, మోహన్‌రావు, చిట్టిబాబు, శిక్షకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరులో 'రచ్చబండ'

మొగల్తూరు, న్యూస్‌టుడే: వైకాపా జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో ఆదివారం మొగల్తూరులో 'రచ్చబండ' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, జడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

జిల్లా కేంద్రం సాధనకు కృషి

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురానికి అన్ని అర్హతలు ఉన్నా గత ప్రభుత్వ హయాంలో స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జిల్లా కేంద్రంగా భీమవరాన్ని ఎంపిక చేశారని పట్టణ ప్రముఖుడు చినిమిల్లి సత్యనారాయణరావు అన్నారు. పట్టణంలో రాజేంద్ర లయన్స్ క్లబ్ హాలులో ఆదివారం కూనపరెడ్డి రంగారావు, చెన్న రమేశ్ ఆధ్వర్యంలో వివిధ వ్యాపార సంఘాల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా ఎంపిక చేయాలనే డిమాండ్‌తో సోమవారం తెలగ కల్యాణ మండపం నుంచి ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం భీమవరంలో కలెక్టరును కలిసి వినతిపత్రం అందజేస్తామని నాయకులు పేర్కొన్నారు.

నరసాపురం బస్సు రూటు మార్పు

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం మండలంలోని తూర్పువిప్పరు, నారాయణపురం, రాపాక గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మిస్తున్నందున ఈ నెల 8 నుంచి జనవరి 10 వరకు తణుకు నుంచి నరసాపురం వెళ్లే బస్సులను ఇరగవరం, ఆలమూరు, మార్టేరు మీదుగా మళ్లించినట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెత్త కుప్పలు.. తప్పని తిప్పలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏక వినియోగ ప్లాస్టిక్ నిషేధంపై అధికారుల ప్రకటనలు, ప్రచారం తప్ప కార్యాచరణ దిశగా అడుగులు పడటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల వెంబడి, కాలువల పక్కన ఇప్పటికీ పాలిథిన్ వ్యర్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. పాలకొల్లు మండలంలో పూలపల్లి, నాగరాజుపేట, చింతపర్రు, లంకలకోడేరు, గవరపేట, ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. పంట, మురుగు కాలువలు, చెరువుల్లో కూడా భారీగా పాలిథిన్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. పాలిథిన్ సంచుల వల్ల తలెత్తే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, వస్త్ర సంచులు వినియోగం పెంచేలా చర్యలు చేపట్టామని ఎంపీడీవో ఎన్.ఉమామహేశ్వరరావు తెలిపారు.

నృత్య కళ.. అదిరేలా!

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండకు చెందిన కొందరు చిన్నారులు చదువుతో పాటు కూచిపూడి నృత్యంలోనూ రాణిస్తున్నారు. స్థానిక నృత్య అకాడమీలో శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుతున్నారు. అక్టోబరు 18న గోవాలో జరిగిన నేషనల్ డాన్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వీరు రాణించి ప్రశంసాపత్రాలు, పతకాలు అందుకున్నారు.

నిత్యం సాధన.. నాలుగో తరగతి చదువుతున్నా. నిత్యం గంట సేపు నృత్యంలో సాధన చేస్తూ మెలకువలు నేర్చుకుంటున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నృత్యంపై మక్కువ పెరిగింది. గతంలో కాకినాడ, రాజమహేంద్రవరం, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చా. - కె.యామిని

పుణ్య క్షేత్రాల్లో.. ఏడో తరగతి చదువుతున్నా. వారానికి రెండు రోజులు నృత్యం నేర్చుకుంటున్నా. గతంలో తిరుపతి, అరుణాచలం, శ్రీశైలం తదితర పుణ్య క్షేత్రాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చా. భవిష్యత్తులో మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి ఉత్తమ కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకోవడమే నా లక్ష్యం. - డి.సిరివెన్నెల

గుర్తింపు కోసం.. నాలుగో తరగతి చదువుతూ కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నా. చదువులో రాణించడంతో పాటు నృత్య కళాకారుడిగా మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి ఉత్తమ గుర్తింపు తెచ్చుకోవడమే నా లక్ష్యం. - కె.భరద్వాజ్

ఎంతో ప్రత్యేకం.. ఏడో తరగతి చదువుతున్నా. సంప్రదాయ నృత్య కళ ద్వారా ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. మరింత సాధన చేసి ఉత్తమ కళాకారుడిగా గుర్తింపు పొంది తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలన్నదే నా కోరిక. - డి.చంద్రశేఖర హర్షవర్ధన్

బ్రాహ్మణులందరికీ ప్రభుత్వ లబ్ధి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాహ్మణులందరికీ లబ్ధి కలిగేలా రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ కృషి చేస్తోందని కార్పొరేషన్ సభ్యుడు చెరుకుపల్లి సంతోష్ ఆదివారం అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవం, బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లబ్ధిదారులు ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెదేపా ప్రభుత్వం మీ కోసం పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా బ్రాహ్మణులకు అండగా ఉంటూ సహకరిస్తోందన్నారు. సీతారామలింగేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ వేలూరి శ్రీధర్‌శర్మ, వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త వేలూరి సుబ్రహ్మణ్యశర్మ, సోమేశ్వరాలయ ధర్మకర్త బ్రహ్మజోశ్యుల ప్రసాదశర్మ పాల్గొన్నారు.

అదుపుతప్పితే ముప్పే!

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు-నరసాపురం ప్రధాన రహదారిలో ఆదివారం ఓ వ్యానులో పరిమితికి మించి అట్టల లోడుతో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించింది. అట్టలు జారకుండా తాళ్లు కట్టినా వాహనం వేగానికి అవి అటూ, ఇటూ ఊగుతుండటంతో వెనుక వచ్చే వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ఇలాంటి వాహనాల వల్ల ప్రమాదాలకు అవకాశం ఉన్నందున అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.నాసరయ్య తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది, ఈఎన్‌టీ వైద్యురాలు పద్మజ, దంత వైద్యుడు మాధుర్ పాల్గొని స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు.

ప్రజా చైతన్యంతో రాజ్యాంగ విలువల పరిరక్షణ

మాట్లాడుతున్న సీతారాం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: సమ సమాజ నిర్మాణానికి అంబేడ్కర్ ఆలోచనలు మార్గనిర్దేశం చేస్తున్నాయని రాజ్యాంగ ప్రచార వేదిక రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం పేర్కొన్నారు. పాలకొల్లు త్యాగరాజ భవనంలో 'అంబేడ్కర్ స్ఫూర్తి - రాజ్యాంగ విలువలు' అంశంపై ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం తేవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, సభ్యులు పెన్మెత్స సుబ్బరాజు, వంగా నరసింహారావు, పోలిశెట్టి గోఖలే, జార్జి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలంటూ నిరసన

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు నుంచి భీమవరం మండలం వెంప వరకు ఆర్‌అండ్‌బీ రహదారిని నిర్మించాలని కోరుతూ ఆదివారం గొల్లగూడెం వాసులు ఆందోళనకు దిగారు. ఈ రహదారి ధ్వంసం కావడంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగించండి : జేసీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆక్రమణలను వెంటనే తొలగించాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. వీరమ్మపార్కు, రైతుబజారు, కొత్త బస్టాండు, రైల్వే జంక్షన్, ప్రకాశం చౌక్, జువ్వలపాలెంరోడ్డు తదితర ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఫుడ్‌కోర్టుల ఏర్పాటు, ఆక్రమణల తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ, కూరగాయల ధరల నియంత్రణ విషయాల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

అనుమతి లేకుండా వైఎస్ విగ్రహం ఏర్పాటు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసిన వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.నాగలక్ష్మి తెలిపారు. భీమవరం మండలం వెంప గ్రామంలో మధ్యపేట చర్చి సమీపాన ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురుగుతో.. నిత్యం యాతన

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధిలో 8వ వార్డు వాసులు మురుగు సమస్యతో నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రూ. 47 లక్షలతో నిర్మించిన సామాజిక భవనానికి విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు.

★ ఈ వార్డు మీదుగా ప్రవహించే ప్రధాన డ్రెయినులో పూడికను పూర్తిగా తొలగించకపోవడంతో మురుగు రహదారులపైకి చేరుతోంది. దోమల బెడద విపరీతంగా పెరిగింది.

★ కోట వద్ద పాలెం వీధిలో డ్రెయినుపై కల్వర్టు దెబ్బతింది. దీంతో వర్షం కురిసినప్పుడల్లా రహదారిపై మోకాలి లోతున మురుగు నిలిచిపోతోంది.

★ వార్డును అనుకుని ఉన్న ఏటిగట్టుపై వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రి వేళ ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. దీంతో సమీప నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్ కళాశాల రోడ్డు, బ్రాహ్మణ సమాఖ్య వీధి, లెక్చరర్స్ కాలనీ, ప్రకాశం రోడ్డు ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగటం లేదు. ★ కొండాలమ్మ గుడి వీధి ఆర్చి రోడ్డులో చోరుల బెడద పెరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ★ కొండాలమ్మ గుడి వీధి, బ్రాహ్మణ సమాఖ్య వీధి, లెక్చరర్స్ కాలనీల్లో చెత్త సక్రమంగా తొలగించడం లేదు.

డ్రెయినేజీ దుస్థితి

8 వార్డు నివేదన

జనాభా : 2,116

ప్రాంతాలు: వైఎస్ కళాశాల రోడ్డు, కొండాలమ్మ గుడి వీధి, కోట వద్ద పాలెం, బ్రాహ్మణ సమాఖ్య వీధి, లెక్చరర్స్ కాలనీ, ప్రకాశం రోడ్డు.

పరిష్కరిస్తాం: వార్డులో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయిన్లలో పూడికతీత పనులపై దృష్టి పెడతాం. విద్యుత్తు సమస్యలు పరిష్కరిస్తాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

గ్రామ సచివాలయం వద్ద మొక్క నాటుతున్న గోపీచంద్

పర్యావరణ సమతుల్యతతోనే మనుగడ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: పర్యావరణ సమతుల్యతతోనే జీవుల మనుగడ సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సీతారాంపురం సౌత్‌లో వారం రోజులు పాటు నిర్వహించిన సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వాలంటీర్లు జడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. మొక్కల నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కళాశాల పాలకవర్గ ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, పాలకవర్గ సభ్యుడు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ ఎస్.సురేశ్ కుమార్, వైస్-ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్, సర్పంచి దొండపాటి వెంకట్ పాల్గొన్నారు.

అలరించిన ఆరాధన వేడుకలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం డీన్నార్ కళాశాల రోడ్డులో ఉన్న లెమన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో ఆదివారం రాత్రి క్రిస్మస్ ఆరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల పాటలు, డ్యాన్స్‌లు, లఘు నాటికలు, స్త్రీల సమాజం సభ్యులు దేవుని పాటలతో అలరించారు. ముఖ్య అతిథిగా పీటర్‌పాల్ (గుంటూరు) పాల్గొని క్రిస్మస్ సందేశం ఇచ్చారు. చర్చి పాస్టర్ జయంతరావు ప్రత్యేక ప్రార్థన చేసి వేడుకలు ప్రారంభించారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన

టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, నరసాపురం మండలం, లక్ష్మణేశ్వరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి వారి దేవస్థానము తాలుకు మహాశివరాత్రి సందర్భముగా ఈ దిగువ ఐటమ్స్‌నకు ది. 22-12-2025 తేది సోమవారం మధ్యాహ్నం గం. 2-00లకు టెండర్-కమ్-బహిరంగ వేలం పాటలు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షమున సదరు దేవస్థాన కార్యనిర్వహణాధికారి వారిచే జరుపబడును. కావున పాటదారులు యావన్మంది వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ. నెం.	బహిరంగ వేలం జరుపబడు పాటలు	ధరావత్తు సొమ్ము	నిర్వహించవలసినవి
1	పందిర్లు వేసి అప్పగించు హక్కునకు	రూ. 10,000/-	5 రోజులు
2	విద్యుత్ అలంకరణ మరియు మైక్ సెట్ వేయి నిమిత్తం	రూ. 10,000/-	5 రోజులు
3	కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొనే హక్కునకు	రూ. 10,000/-	ఒక సంవత్సరము
4	మామిడి మొక్కల ఫలసాయము అనుభవించు హక్కునకు	రూ. 10,000/-	6 నెలలు
5	3MP సోలార్ లింకేజ్ 5 కెమెరాలు ఏర్పాటు నిమిత్తం	రూ. 5,000/-	5 రోజులు

మిగిలిన పాట షరతులు సదరు కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయంలో అడిగి తెలుసుకొనవలెను.

లక్ష్మణేశ్వరం
తేది. 07-12-2025

శ్రీ వెన్నా బాబురావు, ఛైర్మన్
మరియు పాలకమండలి

సం/- ఆర్.వి.వి.యస్.రామచంద్రకుమార్
కార్యనిర్వహణాధికారి
శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి వారి దేవస్థానం

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

పరిశుభ్రత అందరి బాధ్యత

మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలో రూ.12 లక్షలతో ఆధునికీకరించిన మరుగుదొడ్లను ఆదివారం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీటీవో ఎన్.వి.ఆర్. వరప్రసాద్, డిపో మేనేజరు దానమ్మ, అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బాబ్జీ

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ.. విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆదివారం భీమవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకాశపు స్వామి, పరిమి రవి కుమార్, పట్నాల రాంపండు, గంధం సతీశ్, ముప్పిడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాసిద్ధేశ్వరుడికి అభిషేకం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి ఉమాసిద్ధేశ్వర స్వామికి ఆదివారం ఆర్ద్ర నక్షత్రాభిషేకాన్ని ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామికి రకరకాల పండ్లతో అభిషేకాలు నిర్వహించి విశేషమైన పుష్పాలు, తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఇరగవరం, న్యూస్‌టుడే: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని రేలంగిలో ఉమా పార్వతీ సహిత తాటకేశ్వర స్వామి, మల్లేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, పండితులు, భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏలూరురోడ్డు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఏలూరు రోడ్డులో చిన్న శివాలయం లోని ఉమామార్కండేశ్వర స్వామికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను ఆలయ అర్చకుడు శివకుమార్‌శర్మ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రతువులో సప్ప సూర్యారావు, నౌడు ఆంజనేయులు, రెడ్డి సురేష్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అందజేసిన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇక పరుగే పరుగు

అథ్లెట్లకు అత్యాధునిక సింథటిక్ ట్రాక్

తణుకు, న్యూస్‌టుడే

తణుకు పట్టణంలోని అథ్లెట్ల కల సాకారం కాబోతుంది. అత్యాధునిక సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. స్థానిక ఎస్సీఐఎం కళాశాల ఆవరణలోని మైదానంలో ఈ నిర్మాణాన్ని చేపడుతున్నారు. గతంలో ఎంతో మంది ఇదే మట్టి ట్రాక్‌పై సాధన చేసి ఒలింపిక్స్ స్థాయికి ఎదిగారు. మరి కొంతమంది పోలీసు, ఆర్మీ, నేవీ, పీఈటీలుగా వివిధ శాఖల్లో ఉన్నత స్థానాల్లో నిలిచారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత యువత మరింత రాణించేలా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పూనుకున్నారు. రూ.30 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో ఏప్రిల్ 10న శంకుస్థాపన చేసి రెండు నెలల కిందట పనులు ప్రారంభించారు. పూర్తి సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి అదనంగా రూ.50 నుంచి 60 లక్షల వరకు అవసరం. దాతల సహకారంతో నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

రాష్ట్రంలో రెండోది..

తణుకు ఎస్సీఐఎం కళాశాల ప్రాంగణంలో 400 మీటర్ల పొడవుతో సుమారు 6 వరుసలతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం ప్రారంభించారు. రాష్ట్రంలో మొదటిది నాగార్జున యూనివర్సిటీలో ఉండగా, తణుకులో రెండోది కావడం విశేషం. సింథటిక్ రబ్బరుతో ఏడు లేయర్లుగా నిర్మాణం ఉంటుంది. దీనిని వర్షంతో పాటు తీవ్రమైన ఉష్ణోగ్రతలను తట్టుకు నేలా రూపొందిస్తారు. ఏడాది పొడవునా దీనిపై సాధన చేయవచ్చు. గాయాల తగ్గుదల, కీళ్లపై ఒత్తిడి తగ్గిస్తుంది. వేగవంతమైన పరుగుకు సహాయపడుతుంది. ఫిట్‌నెస్ వాకింగ్ ట్రాక్‌లకు కూడా ఇది అనుకూలం.

నత్తనడకన నిర్మాణం

ట్రాక్ నిర్మాణం చేపట్టి సుమారు రెండు నెలలపైనే అవుతున్నా నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఇది తణుకులో ప్రధాన మైదానం కావడంతో రోజు వందల సంఖ్యలో ఇక్కడ సాధన చేస్తుంటారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వాకర్స్ కోరుతున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

మట్టి ట్రాక్‌లపై సాధన చేస్తున్న వారంతా వీటిపై పూర్తి అవగాహన లేక ఆశించిన స్థాయిలో సత్తాచాటలేకపోతున్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే మంచి ఉద్దేశంతో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయడం శుభపరిణామం. దీనిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి. - **సంకు సూర్యనారాయణ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 99488 53114
తణుకు	: 85558 50851
తణుకు గ్రామీణం	: 63005 79402
అత్తిలి	: 91548 46774

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ? అత్తిలి నుంచి పాలూరు, ఈడూరు మీదుగా, అత్తిలి నుంచి మంచిలి, కంచుమర్రు మీదుగా భీమవరం వెళ్లే మార్గం, అత్తిలి నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే రహదారులపై పెద్ద గోతులు ఏర్పడటంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. - **ప్రసాద్, ఉల్లిపాయల వ్యాపారి**

✔ త్వరలోనే నూతన నిర్మాణాలు చేపడతాం. - **వరలక్ష్మి, రభశా డీఈ**

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? భీమవరం మినీ బైపాస్ రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది. - **కిరణ్**

✔ చర్యలు చేపడతాం. - **సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? కుంచనపల్లి రోడ్డులో పురపాలక కుళాయి నీరు కలుషితంగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - **శ్రీను**

✔ నీరు పరిశుభ్రంగా వచ్చేలా చర్యలు చేపడతాం. - **ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

ఉమాచంద్రమౌళీశ్వర స్వామికి సువర్ణాభిషేకం

అభిషేకాలు చేస్తున్న అర్చకులు

హాజరైన భక్తులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక శంకరమఠంలో ఉమాచంద్రమౌళీశ్వర స్వామి, శ్రీసర్వ మంగళ అమ్మవారి దేవస్థానంలో మార్గశిర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా జగద్గురు ఆదిశంకరాచార్యస్వామికి ఆదివారం విశేష అర్చనలు చేశారు. ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి 108 రకాల ద్రవ్యాలతో, 6 గ్రాముల బంగారు రజనుతో సువర్ణాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి విశేష కుంకుమార్చనలు జరిపారు. అనేక మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ధర్మాచరణ హిందువులందరి బాధ్యత

మాట్లాడుతున్న కృష్ణ చరణానంద భారతీ స్వామీజీ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: హిందువులకు పవిత్ర గ్రంథమైన భగవద్గీత ప్రతి ఇంటిలోనూ తప్పక ఉండాలని యజ్ఞవల్క్య రాజా ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ కృష్ణ చరణానంద భారతీ స్వామీజీ(ముండూరు) తెలిపారు. ఆదివారం అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రాంగణంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ధర్మాచరణ హిందువులందరి బాధ్యతన్నారు. ప్రపంచ వ్యాప్తంగా హిందువులపై జరుగుతున్న దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలన్నారు. హిందువులకు పవిత్రమైన గోవులపై హింస పెరిగిపోయిందన్నారు. కేంద్రంలో భాజపా ప్రభుత్వం హిందూ సంరక్షణ కోసం కృషి చేస్తోందని సమరసత ఫౌండేషన్ సహ సంయోజక్ తులసీ సూర్యప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వాడపల్లి సూర్యతేజ, పిసిని ప్రభాకర్, పైబోయిన శ్రీనివాస్, అధిక సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.

పలకలు తెచ్చారు.. వేయడం మరిచారు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం కొత్త పైవంతెన ఫుట్‌బ్రిడ్జిపై పలకలు పాడైపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో మున్సిపల్ సిబ్బంది స్పందించి ఇటీవల అక్కడ కొత్త సిమెంటు పలకలు దింపారు. కానీ సర్దకుండా వదిలేశారు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. త్వరితగతిన సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

నృత్యం చేస్తున్న యువతులు

కొవ్వొత్తులతో విశ్వాసులు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పీస్ ఆఫ్ యూత్ (టీపీవై) క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. టీపీవై వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 18వ వార్షికోత్సవాన్ని ఛైర్మన్ లాజర్ అబ్బదాసరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమని పేర్కొన్నారు. దైవవర్తమానికులు జేమ్స్ మాట్లాడుతూ మానవ రూపంలో మనల్ని పరిపాలించడానికి మహాత్ముడిగా క్రీస్తు జన్మించాడని అన్నారు. ఈ సందర్భంగా భారీ క్రిస్మస్ కేకును కోసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో చిన్నారులు చేసిన క్రిస్మస్ నృత్యాలు అలరించగా.. క్యాండిల్ సర్వీసు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తణుకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకన్న బాబు, పట్టణ సీఐ ఎన్.కొండయ్య, ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇనుప ఊచల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక పవన్‌మెస్ సెంటర్‌లో విభాజకం మధ్యలో ఉన్న సిమెంటు దిమ్మ నుంచి ఇనుప ఊచలు బయటకు వచ్చి వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని 'ఈనాడు'లో 'అదుపు తప్పితే ఊచ కోతే' అనే శీర్షికన నవంబరు 30న కథనం ప్రచురితమైంది. దీనికి మున్సిపల్ అధికారులు స్పందించి సిబ్బందితో ఇనుప ఊచలు తొలగింపజేశారు.

నరసాపురం బస్సు రూటు మార్పు

డిపో మేనేజర్ గిరిధర్ కుమార్

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం మండలంలోని తూర్పువిప్పర్రు, నారాయణపురం, రాపాక గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మిస్తున్నందున ఈ నెల 8 నుంచి జనవరి 10 వరకు తణుకు నుంచి నరసాపురం వెళ్లే బస్సులను ఇరగవరం, ఆలమూరు, మార్టేరు మీదుగా మళ్లించినట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ధ్రువపత్రాలు చూపుతున్న దివ్యాంగ బాలలు

క్రీడల్లో సత్తా చాటిన భవిత విద్యార్థులు

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు భవిత పాఠశాల విద్యార్థులు భీమవరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆరు విభాగాల్లో పతకాలు సాధించారు. షార్ట్‌పుట్, పరుగు తదితర విభాగాల్లో జిల్లా విద్యాధికారి నారాయణ తదితర అధికారుల చేతుల మీదుగా ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఈ సందర్భంగా విజేతలను, ప్రత్యేక ఉపాధ్యాయిని సాయి స్వరూప, ఉపాధ్యాయులు సునీత, జయలక్ష్మిలను ఎంఈవోలు శ్రీనివాస్-1, రామకృష్ణ-2, పోస్ట్‌బేసిక్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాజేశ్ అభినందించారు.

ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ వ్యాధి

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదివారం అత్తిలిలో అత్తిలి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ పరిశోధనా ఆసుపత్రి వైద్యులు 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల కారణంగా ఇటీవల కాలంలో క్యాన్సర్ వ్యాధి విస్తరిస్తోందన్నారు. ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయ సమస్యల నుంచి బయటపడొచ్చని చెప్పారు. మండలంలో 9వ తేదీ వరకు లయన్స్‌క్లబ్ ద్వారా నిర్వహిస్తున్న క్యాన్సర్ వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిరగాని నాగేశ్వరరావు, వర్ధినీడి వెంకట శివ, దాసం బాబ్జీ, పట్నాల వేంకటేశ్వరరావు, ఉలుసు భాస్కరరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో అవస్థలు

స్థానికులకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

రావిపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలంలోని రావిపాడులో కలుషిత నీటి సరఫరాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుళాయి నీటిలో వ్యర్థాలు కలిసి స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల గ్రామంలో కామెర్లు వ్యాధి అధికంగా ఉండటంతో వైద్యఆరోగ్య సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టారు. ఈ విషయాన్ని కూటమి నాయకులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లగా.. గ్రామస్థులకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. అనారోగ్యానికి గురై వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న వారిని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు కుళాయి నీరు తాగొద్దని గ్రామస్థులు తెలిపారు.

సంచార శకటంతో ఇంటింటికీ వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా ఇంటింటికీ వైద్యం కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు హుస్సేన్ అహ్మద్, నిమ్మగడ్డ అచ్యుత రామయ్య తణుకు, ఉండ్రాజవరం, వేల్పూరు ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సభ్యుడు దాట్ల రామరాజు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహా సభల విజయవంతానికి పిలుపు

గోడపత్రాలను ఆవిష్కరించి చూపుతున్న సీఐటీయూ నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: ఈనెల 31 నుంచి జనవరి 3 వరకు విశాఖలో నిర్వహించే సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అమర వీరుల భవనంలో నిర్వహించిన సంఘ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతాప్, మండల కన్వీనర్ జి.గోపి మాట్లాడుతూ ఈ నెల 15న మహాసభ ప్రారంభ సూచికగా అన్ని యూనియన్ల వద్ద జెండాలు ఆవిష్కరణ చేయాలన్నారు. జనవరి 4న విశాఖలో బహిరంగ సభకు కార్మికులు తరలిరావాలన్నారు. ఈ సందర్భంగా ఆల్‌ఇండియా మహాసభల గోడపత్రాలు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.అజయ కుమారి, రంగారావు, శ్రీనివాస్, ప్రసాద్, సాయి, బాలాజీ, బోస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు విద్యార్థుల అర్హత

అలంపురం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలం అలంపురంలోని టీబీఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న వంశీ, నాగేంద్ర ప్రతిభ కనబర్చి ఆర్మీలోని అగ్నివీర్‌కు అర్హత సాధించారని కళాశాల ఛైర్మన్ తనబుద్ధి బోగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అసౌకర్యాల చెంత.. విద్యార్థుల చింత

చిట్టడవిని తలపించే మైదానంలో సాయంత్రపు నడక

అసంపూర్తిగా మరుగుదొడ్లు

పెంటపాడులో 22 ఎకరాల్లో విస్తరించి ఉన్న డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసౌకర్యాలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. విశాలమైన మైదానం ఉన్నా లోతట్టుగా ఉండడంతో చిరు జల్లు కురిసినా నీరు చేరుతోంది. పెద్దఎత్తున గడ్డి, పిచ్చి మొక్కలు మొలిచి చిట్టడవిని తలపిస్తోంది. విషసర్పాలు సంచరిస్తుండడంతో ఉదయం, సాయంత్రం నడకకు వచ్చేవారు బిక్కుబిక్కుమంటూ నడుస్తున్నారు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 20 కేవీ సౌర విద్యుత్తు ప్లాంటు పనిచేయడం లేదు. గతంలో రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్ష అభియాన్ (రూసా) నిధులతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. దీనిపై ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సౌకర్యాల కల్పనకు అధికారులకు విన్నవించామన్నారు. ఇప్పటి వరకూ దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.లక్షల్లో వెచ్చించి తరగతి గదులు, ఆడిటోరియం, క్యాంటీన్, కంప్యూటర్లు, రుతు రుమాళ్ల యంత్రం ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మైదానాన్ని ఎత్తు చేయడంతోపాటు ప్రహరీ నిర్మించి అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. - **ఈనాడు, పెంటపాడు**

అలంకార ప్రాయంగా సౌరవిద్యుత్తు ప్లాంటు

ఆరుదలకు పాట్లు

రేలంగిలో ధాన్యం ఆరబెడుతున్న రైతు

ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరం మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల దిత్వా తుపాను కారణంగా వర్షాలు పడటంతో వరికోతల ప్రక్రియ నెమ్మదించింది. గత నాలుగు రోజులుగా వాతావరణం పొడిగా ఉండటంతో వేగంగా సాగుతున్నాయి. మండలంలో 13600 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేయగా, ఇప్పటి వరకు 8 వేల ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు ఆదివారం తెలిపారు. ఇప్పటికే కోసిన ధాన్యాన్ని తేమ తగ్గించేందుకు రహదార్ల వెంబడి రైతులు ఆరబెడుతున్నారు. తేమ 17 శాతం ఉంటేనే ప్రభుత్వ మద్దతు ధర 75 కిలోల బస్తాకు రూ.1776 చొప్పున లభిస్తుందన్నారు.

త్రుటిలో తప్పిన కారు ప్రమాదం

ఏపీనిట్ (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని ఏపీనిట్ సమీపంలోని కొండ్రుప్రోలు జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం ఆదివారం తెల్లవారు జామున తణుకు వైపు నుంచి ఏలూరు వెళుతున్న కారు ముందు వాహనాన్ని తప్పించే క్రమంలో విభాజకాన్ని ఢీకొట్టింది. తణుకు వైపు వెళ్లే మార్గంలో చెట్టును ఢీకొని ఆగింది. ఈ ఘటనలో ఉన్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం వారు వేరే వాహనంలో వెళ్లి పోయారు.

ముురుగు తొలగదు.. దుర్వాసన వీడదు

వ్యర్థాలతో మురుగు కాలువ

8వ వార్డు నివేదన

జనాభా : 2907

ప్రాంతాలు: గమినివారి, పోలీస్, మేడికొండవారి, ఉండ్రాజవరం కెనాల్ బండ్, కోనావారి, కొండాలమ్మ గుడి 1వ, 2వ, రాజుల, బెజ్జవరపువారి, పిట్టావారి, ఆకులవారి వీధులు, పెరవలి రోడ్డు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పట్టణం ఎనిమిదో వార్డులో కొందరు వ్యాపారులతోపాటు స్థానికులు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఉండ్రాజవరం కాలువకు ఆనుకొని ఉన్న వీధుల్లో నివాసితులు, వ్యాపారులు వ్యర్థాలను డ్రెయిన్లు, కాలువలు, రోడ్ల అంచుల్లో వేస్తున్నారు. ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. మురుగు ముందుకు పారక వెళ్లడం లేదు. దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ భారంగా మారుతోందని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం' అని తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు.

విద్యా సమస్యల పరిష్కారానికి పోరాటం

సభకు హాజరైన నాయకులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: విద్యా పరిరక్షణకు విద్యార్థులందరూ ఐక్య ఉద్యమాలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. స్థానిక చుక్క అప్పలస్వామి హాలులో ఆదివారం జిల్లా మహాసభ రెండోరోజు కొనసాగింది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోరాటాలు, ఆందోళనలు చేయడంలో ముందు వుంటుందని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో వున్న 6100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.గణేష్, కార్యదర్శిగా టి.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సింధు, నాగేంద్ర, లక్ష్మణ్, ఈశ్వర్, సహాయ కార్యదర్శిగా శ్రీను, రోహిత్ ఎన్నికయ్యారని తెలిపారు.

గడ్డివామి దగ్ధం

మంటలు అదుపు చేస్తున్న సిబ్బంది

భాగ్యలక్ష్మీపేట (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: 19వ వార్డు భాగ్యలక్ష్మీపేట శివారు పార్కువెనుక ఆదివారం సాయంత్రం దాసం సత్యనారాయణకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. సమీప నివాసాలకు దట్టమైన పొగ కమ్మేసింది. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక ఎస్సై కేవీ మురళి కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎవరో ఆకతాయిలు సిగరెట్ కాల్చి గడ్డివామి పైకి విసరడంతో ప్రమాదం జరిగిందని బాధితుడి సోదరుడు దాసం హనుమంతరావు తెలిపారు. దాని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం గడ్డి దొరికే పరిస్థితి లేనందున పశువులను ఎలా పెంచాలో అర్థం కావడం లేదన్నారు.

టిడ్కో రుణాలు మాఫీ చేయాలని నిరసన

నినాదాలు చేస్తున్న మహిళలు

ఎల్.అగ్రహారం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: టిడ్కో గృహ రుణాలను మాఫీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఎల్.అగ్రహారం టిడ్కో గృహాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు పొగాకు పూర్ణ మాట్లాడుతూ గృహాల్లో నివసిస్తున్నవారికి కనీస సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్యాంకర్లు రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, రికవరీ బాయ్స్ వచ్చి వేధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.యశోద, ఎం.పావని, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం

తణుకు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ వ్యవహారంలో ఆవు, పంది కొవ్వు ఉందంటూ నానాయాగీ చేసిన చంద్రబాబుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసిందని, దీనిని పక్కదారి పట్టించేందుకే జగన్‌మోహన్‌రెడ్డి యాదవులను దూషించారంటూ అసత్య ప్రచారానికి ఒడిగట్టారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శ్రీ డోకల రాము గారు
సెక్రటరీ: కిరాణా వర్తక సంఘం తాడేపల్లిగూడెం

అశ్రునివాళి
నిగర్వి, నిరాడంబరులు అందరినీ ఆప్యాయంగా పలకరించే శ్రీ డోకల రాము గారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

అల్లుడు: భోజింకి సతీష్‌కుమార్ కుమార్తె: శ్రీమతి భాగ్యగౌతమి
మనుమడు: హర్షిత్ అభిరామ్ మనుమరాలు: రూపా హారిక
గొర్రెల శ్రీధర్ - శ్రీమతి సునీత
గొర్రెల సురేష్ - శ్రీమతి దివ్య

శ్రీ డోకల రాము గారు
వ్యవస్థాపకులు: శ్రీ పరమేశ్వరి కిరాణా జనరల్ స్టోర్స్, తాడేపల్లిగూడెం

శ్రద్ధాంజలి
మంచి మనిషి, స్నేహశీలి, మా అందరి ఆత్మీయ మిత్రులు, కిరాణా వర్తక సంఘం కార్యదర్శి శ్రీ డోకల రాము గారి ఆకస్మిక మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...
కిరాణా వర్తక సంఘం, తాడేపల్లిగూడెం
అధ్యక్షులు: ఈతకోట భీమశంకరరావు (తాతాజీ)
వైస్ ప్రెసిడెంట్: కొవ్వూరి నాగేంద్రరెడ్డి
మరియు సంఘ సభ్యులు

ఈనాడు
వైఎస్సార్ కడప
సోమవారం డిసెంబరు 8, 2025

ఈ గంట.. అర టన్నంట

గంట అంటే కిలోల్లో ఉన్నవి చూసుంటారు.. ఈ గంట చూశారా.. దీని బరువు అర టన్ను.. ఇదెక్కడుంది ఏమిటి ప్రత్యేకత అనుకుంటున్నారా.. కడప పట్టణంలోని మరియాపురం కేథడ్రల్ చర్చి.. 1934 నాటి ఈ చర్చి 1976లో నెల్లూరు డయోసిస్ నుంచి విడిపడి సెయింట్ మేరీస్ చర్చిగా మారింది. ఇటలీ నుంచి తెప్పించిన మరియామాత విగ్రహం, 500 కిలోలున్న ఈ గంట ఇక్కడి ప్రత్యేకతలు. **- న్యూస్‌టుడే, మారుతీనగర్**

మైలవరంలో లాహిరి.. లాహిరి

మైలవరం జలాశయంలో నీరు పుష్కలంగా ఉండడంతో ఫెడల్ బోట్లు నాలుగు, మోటారు బోటు ఒకటి ఏర్పాటు చేశారు. చిన్న పడవ అయితే రూ.100, డీజిల్ పడవ అయితే రూ.150 చొప్పున టిక్కెట్ ధరగా నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకుని పర్యాటకులు విశేషంగా ఇక్కడికి తరలి వస్తున్నారు. త్రిమూర్తులకోన వద్ద నుంచి గండికోట లోయ పరిసరాల వరకు జలాశయం అంతా తిప్పుతున్నారు. ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. పిల్లలు పెద్దలు మైలవరం జలాశయంలో పర్యటిస్తూ ఆనందంగా గడిపారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

ఉక్కు సంకల్పానికి చకచకా అడుగులు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- జమ్మలమడుగు గ్రామీణ: కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. పరిశ్రమను స్థాపించనున్న జిందాల్ కంపెనీ ప్రతినిధులతో కలిసి రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెకు ఆదివారం చేరుకున్నారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, వారి అధికార బృందంతో కలిసి భూముల స్వాధీన ప్రక్రియ చేపట్టారు. కడపలో జరిగిన మహానాడు సందర్భంగా ఉక్కు పరిశ్రమపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేశారు. ఆ తర్వాత జిందాల్ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించింది. ఇప్పటికే కేటాయించిన 3,769 ఎకరాలకు ప్రహరీ నిర్మాణ పనులు కొలిక్కివచ్చాయి. ఈ విస్తీర్ణంలో 30 లక్షల టన్నుల సామర్థ్యంతో జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ సంస్థ పరిశ్రమ నెలకొల్పనుంది. ఏపీఐఐసీ నుంచి భూముల్ని జిందాల్ కంపెనీకి బదలాయింపు చేశారు. ఈ కంపెనీ రూ.9 వేల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో నిర్మాణాలు చేపట్టనున్నట్లు పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజు తెలిపారు. పరిశ్రమకు మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతం చేశామని, రహదారి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అప్పగిస్తామని తెలిపారు. సమీపంలోనే నెడ్‌క్యాప్ ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని జిందాల్ స్థాపించనుంది. దీనికి ప్రత్యేకంగా భూముల్ని లీజు కింద కేటాయిస్తున్నారు. పనుల్ని వేగవంతం చేయడంలో భాగంగా పరిశ్రమలశాఖ రాష్ట్ర కార్యదర్శి యువరాజ్, జిందాల్ కంపెనీ ప్రతినిధులు, ఏపీఐఐసీ అధికారులు, ఆర్డీవో సాయిశ్రీ చేరుకుని సమావేశమయ్యారు. పరిష్కారానికి నోచుకోని పనులను, పరిపాలనపరమైన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారు. త్వరలోనే పరిశ్రమ పనుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్

రహదారుల మరణశాసనం



ఏడాది	2019	2020	2021	2022	2023	2024	2025 (నవంబరు వరకు)
మృతులు	357	307	369	403	367	314	270
క్షతగాత్రులు	1121	970	949	837	722	615	319

◆ 12 గంటలకు ఒకరి మృత్యువాత
◆ ప్రమాదాల్లో జిల్లాకు 87వ స్థానం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చేంత వరకు ఎదురు చూడాల్సి వస్తుంది. జిల్లాలో సగటున రోజుకు మూడు ప్రమాదాలు జరుగుతుండగా, ఇద్దరు మృత్యువాత పడుతున్నారు. నలుగురు క్షతగాత్రులవుతున్నారు. జిల్లాలో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నట్లు సర్వేలో తేలింది. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 100 జిల్లాల జాబితాలో మన జిల్లా 87వ స్థానాన్ని పొందింది. ప్రమాదాల్లో ఎక్కువగా జాతీయ రహదారులపైనే జరుగుతున్నాయి.

● ఈ ఏడాది నవంబరు వరకు జిల్లాలో 270 మంది ప్రమాదాల్లో మృతి చెందగా, 390 మంది గాయపడ్డారు. ● కడప నుంచి రాయచోటికి వెళ్లే దారిలోని గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు వద్ద జరిగిన ప్రమాదాల్లో 22 మంది మృత్యువాత పడ్డారు. ఒకే రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ● కడప-కర్నూలు మార్గంలో దారిలో ఈ ఏడాదిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 29 మంది మృత్యువాతపడ్డారు. ఎక్కువగా దువ్వూరు వద్ద ప్రమాదాలు జరిగాయి.

అర్ధరాత్రి దాటిన తర్వాతే ఎక్కువ

జిల్లాలో ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత, తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల మధ్యలో మరీ ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎందుకంటే ఈ రెండు గంటల సమయంలో ఎంతటి వాడైన కునుకు తీస్తూ రెప్పపాటులో ప్రమాదాలకు గురవుతున్నారు.

ఫేస్ వాష్ అండ్ గో

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేసేందుకు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ జాతీయ రహదారుల పరిధిలో ఉండే ఠాణా పోలీసులు అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత ప్రతి ఒక్క వాహనాన్ని ఆపి డ్రైవర్ ముఖం కడుక్కుని వెళ్లేలా ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

శేషాజలం

దిత్వా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు కడప - చెన్నై ప్రధాన రహదారిపై జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఈ దారిలో ప్రయాణించే వారు ఆ దృశ్యాలను చూస్తూ సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. ఏటా కొండల నుంచి వర్షపు నీరు ఇలా జాలువారుతూ ఉంటుంది. ఈ సారి ఎక్కువ రోజులు కనువిందు చేయడం ప్రత్యేకత. **- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

గుత్తేదారి.. అమృత్ ఆవిరి

● నిష్ప్రయోజనంగా ఫేజ్-I పనులు
● నోటీసులిచ్చినా స్పందించని గుత్తేదారు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులను ప్రతిపాదించాల్సిన పాలకులు.. ఆ ప్రతిపాదనలకు కార్యరూపం ఇవ్వాల్సిన అధికారులు పని దక్కించుకున్న గుత్తేదారు ఈ ముగ్గురు ఎవరి ప్రయోజనాలు వారు చూసుకోవడంతో కడప నగరంలో అమృత్ ఫేజ్-1 కింద చేపట్టిన రూ.43.82 కోట్ల పనులు నిష్ప్రయోజనంగా మారాయి. నగర పాలక అధికారులు 2023 నుంచి గుత్తేదారుకు నోటీసులు ఇస్తున్నా స్పందించలేదు. చివరకు పనుల నుంచి తొలగిస్తామని 60-సీ నోటీసు ఇచ్చినా దాన్నీ బేఖాతర్ చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటి అమృత్ ఫేజ్-1లో మిగిలిన పనులను పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ విభాగం రూ.9 కోట్లతో అంచనాలు రూపొందించింది. దాదాపు 5 నెలల కిందట ఈ ప్రతిపాదనలను ఈఎన్‌సీకి పంపినా ఇప్పటి వరకు అక్కడి నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. గుత్తేదారు వదిలేసిన పనులకు అమృత్ ఫేజ్-1 కింద ఇప్పుడు నిధులు విడుదల అవుతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏ పథకం నుంచి డబ్బులు చెల్లించాలి. అన్న అంశం క్లిష్టంగా మారింది. దీంతో రూ.43 కోట్ల విలువైన తాగునీటి సరఫరా అభివృద్ధి పనులు నిరుపయోగంగా మారక తప్పదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

తగునా ఇంత నిర్లక్ష్యం!

● నగరంలోని ప్రతి వ్యక్తికీ రోజుకు 135 లీటర్ల నీటిని ఇవ్వడం లక్ష్యంగా రూ.43.82 కోట్లతో జీపీఆర్ ఇన్‌ఫ్రా సంస్థకు పనులు అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఆ సంస్థ 2020 నాటికి పనులు పూర్తి చేయాలి. ఆ సంస్థ పనులు పూర్తి చేయని నేపథ్యంలో దాదాపు 5 సార్లు గడువు పొడిగిస్తూ వచ్చారు. అయినా ఆ సంస్థ పనులు పూర్తి చేయడానికి ముందుకు రాలేదు.

● వైకాపా హయాంలో నేతలు అధికారులకు గత్తేదారుకు మధ్య ఉన్న సత్సంబంధాల వల్ల పనులు చేయకుండానే సంవత్సరాలు గడిచాయి. లాభం ఎక్కువగా ఉండే పనులను ముందుగా చేసి క్లిష్టతతో కూడుకున్న పనులను వదిలేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

● ఇప్పటి వరకు ఆ సంస్థ పూర్తి చేసిన పనులకు సామర్థ్య పరీక్షలు కూడా నిర్వహించలేదు. దీంతో పనుల నాణ్యతపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సమస్యను నగరపాలక సంస్థ ఎస్ఈ చెన్నకేశవరెడ్డి దృష్టికి తీసుకుపోగా ప్రభుత్వానికి తాజా ప్రతిపాదనలు, గుత్తేదారు మీద తీసుకునే చర్యలపై నివేదిక పంపించామన్నారు.

శంకరాపురంలోని ఓవర్ హెడ్ ట్యాంకు

రైలు బండి.. విద్యార్థులకు రాయితీలు దండి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : బస్సుల్లో మాదిరి రైల్వేలో కూడా విద్యార్థులకు ప్రయాణ రాయితీలను ఇస్తున్నారు. కరోనా సమయంలో ఈ రాయితీలను తొలగించారు. అయితే విద్యార్థులకు గతంలో కొనసాగిస్తున్న రాయితీని రెండేళ్ల క్రితమే మళ్లీ పునరుద్ధరించారు. ఈ విషయంపై చాలా మంది విద్యార్థులకు అవగాహన లేక పూర్తిస్థాయి ఛార్జీలు చెల్లిస్తూ ప్రయాణం సాగిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. విద్యార్థుల కోసం ఆ రాయితీల వివరాలు.

● దసరా, సంక్రాంతి పర్వదినాలతో పాటు సెమిస్టర్, వేసవి సెలవులకు ఇంటికి వచ్చి వెళ్లేందుకు విద్యార్థులకు రైల్వే రాయితీలను అందిస్తోంది. తాము చదువుతున్న గుర్తింపు పొందిన యూనివర్సిటీ, కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాల నుంచి పొందిన పత్రంతో డీఆర్ఎం కార్యాలయంలో సీనియర్ డీసీఎం వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ వారు సూచించిన మేరకు కొన్ని పత్రాలను ఇవ్వాలి. అనంతరం రైల్వే అధికారులు సంతకాలతో కూడిన రాయితీ పుస్తకాన్ని సంబంధిత యాజమాన్యానికి ఇస్తారు. ఆ విషయాన్ని స్థానిక రైల్వేస్టేషన్లలో తెలియజేయాల్సి ఉంటుంది. ఆపై ప్రిన్సిపల్ నుంచి లెటర్ తీసుకుని ఆఫ్‌లైన్‌లో టిక్కెట్‌ను రిజర్వ్ చేసుకోవచ్చు.

లబ్ధి ఇలా...

సాధారణ విద్యార్థులకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 75 శాతం రాయితీని ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు చేసుకున్న వారికి ఈ ప్రయాణ రాయితీ లభించదు. ఆఫ్‌లైన్‌లోనే టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలి. ఆ సమయంలో రైల్వే సిబ్బందికి అవసరమైన పత్రాలు ఇవ్వాలి. రాయితీలు జనరల్, స్లీపర్ క్లాసులకు మాత్రమే వర్తిస్తాయి. ఏసీ తరగతులకు లభించదు. జిల్లా నుంచి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు ఇదెంతో ప్రయోజనకరం.

శ్మశానాన్ని వదలని భూచోళ్లు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం మండలం పొన్నవోలు గ్రామంలో సర్వే సంఖ్య 178/2లో 1.83 ఎకరాల భూమి ఆర్ఎస్ఆర్‌లో తోపు పోరంబోకుగా ఉంది. వెబ్‌ల్యాండ్, అడంగల్ రికార్డుల్లో శ్మశానంగా నమోదైంది. దీన్ని ఏళ్ల తరబడిగా ఓ సామాజిక వర్గానికి చెందిన స్థానికులు శ్మశానంగా వినియోగించుకుంటున్నారు. ఈ శ్మశానం భూమి పెన్నా నది ఒడ్డున ఉండడం వల్ల పెన్నా వరద నీటి ఉద్ధృతికి సుమారు 70 సెంట్ల వరకు కొట్టుకుపోయింది. మిగిలిన స్థలంలో ముగ్గురు స్థానిక వ్యక్తులు కొన్నేళ్ల కిందట 55 సెంట్ల వరకు కబ్జా చేసి వారి భూమిలో కలుపేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు కూడా నాలుగేళ్ల కిందట శ్మశానంలోని 40 సెంట్లను ఆక్రమించి వారి భూమిలో కలుపుకున్నారు. ఇక కేవలం 15 సెంట్లు మాత్రమే శ్మశానంగా ఉంది. ఉన్న తక్కువ స్థలంలోనే బాధితులు చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు. భవిష్యత్తులో ఈ కొంత స్థలం కూడా పెన్నాలో కోతకు గురయ్యే అవకాశం ఉన్నందున తమకు శ్మశానం కరవు అయ్యే పరిస్థితి ఉంటుందని వారు వాపోతున్నారు.

శ్మశానం కబ్జా చేసిన రెండు వర్గాల మధ్య చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. కబ్జాకు గురైన శ్మశాన స్థలాలను ఖాళీ చేయించాలని ఒక వర్గం వారు ఇప్పటికే ఏడు సార్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులిచ్చారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు.



కబ్జాకు గురైనా శ్మశాన స్థలం

నోటీసులు జారీ చేస్తాం

రెవెన్యూ రికార్డుల్లో తోపు పరంబోకుగాను, శ్మశానంగాను ఉన్న ఈ భూమిపై పట్టాలు మంజూరు చేసేందుకు వీలులేదు. ఎవరికీ పట్టాలు మంజూరు చేయలేదు. చాలాకాలంగా శ్మశానంగా వినియోగించుకుంటున్న ఆ భూమిని కబ్జా చేసిన వారికి వెంటనే నోటీసులు జారీ చేస్తాం. ఇరు వర్గాల వారిని విచారించి తగిన చర్యలు తీసుకుంటాం.

- తిరుమలబాబు, తహసీల్దారు, సిద్దవటం

టమాట కిలో రూ.38

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో టమాట ధరలు తగ్గుముఖం పట్టాయి. వారం రోజుల వరకు మదనపల్లె మార్కెట్‌లో కిలో రూ.25 నుంచి నాణ్యమైన టమాట అత్యధికంగా కిలో రూ.46 వరకు పలికింది. ఆదివారం కిలో రూ.20 నుంచి నాణ్యమైన సరకు కిలో రూ.38కు మించి పలకలేదు. ప్రసుత్తం సీజన్ కాకపోవడంతో మదనపల్లె మార్కెట్ పరిధిలోని టమాటకు కొంత మేరకు డిమాండ్ తగ్గినట్లు తెలుస్తుంది. మార్కెట్‌కు మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి రైతులు 133 టన్నుల సరకు తీసుకొచ్చారు. ఈ మేరకు ఏ-గ్రేడ్ కిలో రూ.30 నుంచి రూ.38 వరకు, బి-గ్రేడ్ కిలో రూ.20 నుంచి రూ.29 వరకు సగటున కిలో రూ.27 నుంచి రూ.35తో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక్కడి నుంచి విజయవాడ, నెల్లూరు, గుంటూరు, ఒంగోలుతో పాటు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు నగరాలకు ఎగుమతి అవుతున్నాయి.

హస్తకళ.. పనితనం భళా!

◆ విభిన్న అంశాల్లో ప్రత్యేకతలు
◆ నేటి నుంచి వారోత్సవాలు ప్రారంభం

● గ్రామం : వనిపెంట
● హస్తకళ : ఇత్తడి వస్తువుల తయారీ
● ఆధారపడిన కుటుంబాలు : 50
● ఎగుమతులు : దేశంలోనే కాకుండా మలేషియాకు వెళ్తున్నాయి
● ఆదాయం : ఏటా రూ.60 కోట్లు పైబడి
● ప్రత్యేకతలు : దేవతామూర్తుల విగ్రహాలు, పీర్లు, ఏసు క్రీస్తు శిలువలు, ధ్వజ స్తంభాల తొడుగులు, కలశాలు, గుడిగంటలు, బిందెలు, నంది, నెమలి, అలంకార తోరణం వంటి ఎన్నో రకాల వస్తువుల తయారీలో సిద్ధహస్తులు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు కొనుగోలు చేస్తున్నారు.

మైదుకూరు : ఇత్తడి వస్తువుల తయారీలో కార్మికులు

చేనేత సప్తవర్ణాల కలబోత. భారతీయ సంప్రదాయానికి ప్రతీక. వన్నె తరగని అద్భుత హస్త కళా నైపుణ్యానికి నిదర్శనం. మానవ నాగరికతకు సజీవ సాక్ష్యం. జాతి ఔన్నత్యాన్ని చాటింది. వారసత్వ సంపదకు పెట్టింది పేరు. పోగుతో తరతరాల విడదీయరాని అనుబంధం. మగ్గంతో మమేకం. ఒంటిమిట్ట, సిద్దవటం, జమ్మలమడుగు మండలాల్లో నేతన్నలు ఒర్పు.. నేర్పు.. కూర్పుతో తయారు చేస్తున్న అందమైన వస్త్రాలు చేనేత రంగానికి తలమానికంలా నిలుస్తున్నాయి. నాణ్యత, సృజన, మన్నిక ఉండటంతో అతివలు కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. మగువ మోము మురిసేలా, మహిళలు మెచ్చేలా స్వచ్ఛమైన పట్టు వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. కళకు సృజనాత్మకతను జోడించి పట్టు సింగారంతో కళాఖండాల ఆకృతులు చూస్తే అదరహో అనాల్సిందే. కాలానుగుణంగా వస్తున్న మార్పులతో కొత్త రూపు సంతరించుకునేలా కార్మికులు స్వేదం చిందిస్తున్నారు. వీటితో పాటు మైదుకూరు మండలం వనిపెంటలో తయారయ్యే ఇత్తడి సామగ్రికి ప్రత్యేక గుర్తింపు ఉంది.

- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, మైదుకూరు, జమ్మలమడుగు

● కొత్తమాధవరం, కొండ మాచుపల్లె, సిద్దవటం, జమ్మలమడుగు
● పట్టుచీరలు
● 9 వేలు
● దేశవ్యాప్తంగా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాలకు
● ఆదాయం : ఏటా రూ.240 కోట్లు పైబడి
● ప్రత్యేకతలు : ఒక్కో కుటుంబం నెలకు సగటున 10-14 చీరలు తయారు చేస్తున్నారు. పట్టు, నూలు, సీకో రకాలను నేస్తున్నారు. నెలకు సగటున 25 వేల కళాత్మక కోకలు ఉత్పత్తి జరుగుతున్నాయి. అద్భుత ఆకృతులు సృష్టించడంలో ఇక్కడి కార్మికులు దిట్ట. ఈ వస్త్రాలు ధరిస్తే రాజసం ఉట్టిపడుతుంది. కళ్లు, కాళ్లు, మునివేళ్లతో మగ్గంతో మమేకమై రాణిస్తున్నారు. పూర్వీకుల నుంచి వారసత్వ సంపదగా వచ్చిన వృత్తి ఎంతో మంది జీవనానికి భరోసా ఇస్తోంది. స్వచ్ఛమైన పట్టు, జెరీ వాడటంతో నిండైన చీరెలు చేతికి వస్తున్నాయి. నాణ్యతలో రాజీపడటం లేదు. సాంకేతిక యుగంలో నైపుణ్యం సాధించి సృజనతో ముందడుగు వేస్తున్నారు. అందమైన కళాకృతులు మహిళామణులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

శ్రద్ధాంజలి

జననం : 10.04.1943
మరణం : 26.11.2025

శ్రీమతి చింతకుంట రత్నమ్మ గారు
W/o శ్రీ చింతకుంట మునిస్వామి నాయుడు గారు
పోట్లదుర్తి గ్రామం, యర్రగుంట్ల మం.

అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు శ్రీ సి.ఎం. రమేష్ గారి మాతృమూర్తి
కీ.శే.॥ శ్రీమతి చింతకుంట రత్నమ్మ గారి ఆత్మకు
దైవ సన్నిధిలో శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

నారపురెడ్డి చంద్రఓబులరెడ్డి
శ్రీమతి నారపురెడ్డి జయశ్రీ
నాగులపల్లి గ్రా., చాపాడు మం., కడప జిల్లా

(c) eenadu

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సభాభవనంలో ఉదయం పది గంటలకు మొదలయ్యే కార్యక్రమానికి కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదిత్యసింగ్ ఇతర జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. ఈ వేదిక ద్వారా అర్జీదారులు తమ అర్జీలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో కూడా నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

ర్యాలీలో పాల్గొన్న ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

వేంపల్లె, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములవ్వాలని డైరెక్టర్ కుమారస్వామిగుప్తా అన్నారు. ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ 4వ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని మారుతీనగర్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బాలికల విద్య, మహిళల భద్రత, యోగా, రోడ్డు భద్రత ఇతరత్రా అంశాలపై వాలంటీర్లు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ అధికారి కోటేశ్వర పాల్గొన్నారు.

టెన్నికాయిట్ విజేత పీలేరు గురుకులం

పీలేరు గ్రామీణ : పీలేరు మండలం చిత్తూరు మార్గంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు టెన్నికాయిట్ పోటీలో మొదటి స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ బేబి కరుణ ఆదివారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్‌లోని జీవీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో టెన్నికాయిట్ పోటీలు జరిగాయి. పీడీ పుష్పలత, విద్యార్థినులను అభినందించారు.

చలికాలం.. చిన్నారులు భద్రం

● 'ఈనాడు' ఫోన్-ఇన్‌లో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ వంశీధర్

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: చలికాలంలో చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కడప సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల విభాగం వైద్యుడు డాక్టర్ వంశీధర్ సూచించారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోన్ ఇన్‌లో అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి వచ్చిన సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో రిమ్స్ చిన్నపిల్లల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రెహమాన్, సీనియర్ రెసిడెంట్ సుధ, పీజీ వైద్యులు సుమతి, తన్మయ్ పాల్గొన్నారు.

సందేహాలు నివృత్తి చేస్తున్న వైద్యాధికారులు

?: మా బాబు వయసు ఎనిమిది సంవత్సరాలు. పది రోజులుగా దగ్గుతో ఆయాస పడుతున్నాడు. సమస్య ఏమై ఉంటుంది? - రమణ, పీలేరు

✓: వాతావరణంలో వచ్చిన మార్పులతో పిల్లల్లో జలుబు ఎక్కువగా ఉంది. దానికి తోడు చాలా మంది చిన్నారులు ఫ్రిడ్జ్‌లోని చల్లని నీటిని, జ్యూస్‌లు తాగుతుంటారు. దీంతో జలుబు, దగ్గు మరింత అధికమవుతుంది. తద్వారా ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరుతుంది. దాని కారణంగా ఆయాసం వస్తుంటుంది. ఎక్స్‌రే తీసి చూసి నెమ్ము ఉంటే మందులు వాడితే సరిపోతుంది. ఇంట్లో పిల్లలు ఏం తింటున్నారు.. తాగుతున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి.

?: మా పాపకు పదేళ్ల వయసు. హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. వాతావరణం చల్లబడితే జలుబు, దగ్గు వచ్చేస్తున్నాయి. వేడి నీళ్లతో స్నానం చేయని కారణంగా జలుబు చేస్తోంది. వైద్యులను సంప్రదిస్తే అల్లర్జీతో అలా వస్తుంది అంటున్నారు. మా పాప ఇబ్బంది పడుతూ ఉంది. ఏం చేయాలి? - గాయత్రి, రాజంపేట

✓: పాపకు ఏరకమైన అల్లర్జీనో తెలుసుకోవాలి. ముఖ్యంగా వాతావరణం చల్లబడినప్పుడు వేడి నీటినే తాగమని చెప్పండి. దుమ్ము ధూళి వచ్చే ప్రాంతంలో ఆటలాడేటప్పుడు మాస్క్ ధరించాలి.

?: మా పాపకు తొమ్మిదేళ్లు. పది రోజుల కిందట జ్వరం వచ్చి తగ్గింది. అప్పటి నుంచి పొట్ట మీద చిన్నపాటి దద్దుర్లు, గుల్లలు వస్తున్నాయి. ఏం చేయాలి? - సరోజ, ఒంటిమిట్ట

✓: ఏ తరహా జ్వరమొచ్చింది.. ఏం మందులు వాడారో చూడాలి. పొట్టపైన ఎలాంటి ర్యాసెస్ ఉన్నాయో పరిశీలించాలి. రిమ్స్ ఆసుపత్రికి రండి. పరీక్షించి అవసరమైన మందులు ఇస్తాం.

?: మా బాబుకు ఏడేళ్లు. అన్నం తినిపిస్తుంటే కడుపు నొప్పిగా ఉంటుందని ఏడుస్తున్నాడు. మెడికల్ స్టోర్ నుంచి మందులు తెప్పించి వేస్తున్నా తగ్గడం లేదు.? - వెంకటసుబ్బయ్య, మైదుకూరు

✓: చిన్నారుల అనారోగ్య సమస్యలకైనా సొంత వైద్యం చేయకూడదు. వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకే మందులు వాడాలి. మెడికల్ దుకాణాల్లో మందులు ఇష్టారీతిన తెచ్చి వాడకూడదు. పాఠశాలకు వెళ్లే చిన్నారులకు చిరుతిండ్ల వల్లే ఎక్కువగా కడుపునొప్పి వస్తూ ఉంటుంది. వాటిని మానిపించి కొన్ని రోజులు ఇంటి ఆహారమే అందించండి. తగ్గక పోతే రిమ్స్‌కు వస్తే అల్ట్రాసౌండ్ స్కాన్ చేసి చూస్తాం.

?: మా చెల్లెలు కుమారుడి వయసు ఏడాదిన్నర. వారం రోజులుగా జ్వరం వస్తోంది. మందులు వాడుతున్నా తగ్గుతూ మళ్లీ వస్తోంది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? - విజయకుమారి, రాయచోటి

✓: ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో జలుబు, దగ్గు, జ్వరం సాధారణంగా వస్తుంటాయి. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉండటం అవసరం. వారం రోజులుగా జ్వరం తగ్గలేదంటే తప్పకుండా వైద్యులను సంప్రదించి రక్త పరీక్షలు చేయించాలి. వచ్చిన ఫలితాల ఆధారంగా మందులు వాడాలి.

?: మా కుమారుడి వయసు ఏడేళ్లు. పోషకాహారం అందిస్తున్నా బరువు పెరగడం లేదు. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. బరువు పెరగాలంటే ఏం చేయాలి.? - జానకి, సుండుపల్లి

✓: చిరు తిండ్లకు అలవాటు చేయకూడదు. అటువంటి వాటికి దూరంగా ఉంచాలి. చిన్నారుల వయస్సుతో పాటు బరువు కూడా పెరగాలి. రోజువారీ ఆహారంలో గుడ్డు, పాలు, పండ్లు, ఆకు కూరలు, చికెన్, సున్నుండలు ఇస్తూ ఉండాలి. అప్పటికీ బరువు పెరగకపోతే రిమ్స్‌కు వస్తే పరీక్షించి చూస్తాం.

?: మా పాపకు రెండేళ్లు. వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతోంది. బయట ప్రైవేట్‌లో వైద్యులకు చూపించాం. కొన్ని మందులు రాసిచ్చారు వాడుతున్నాం. అయినా తగ్గడం లేదు. ఒంటిపై ఎర్రటి దద్దుర్లు కూడా వచ్చాయి. ఏం చేయాలి? - సుధారాణి, రైల్వేస్టేషన్ అపార్ట్‌మెంట్, కడప

✓: మూడు రోజుల కంటే మించి జ్వరం వస్తూనే ఉంటే తప్పక రక్త పరీక్షలు చేయించాలి. మందులు వేస్తున్నాం కదా పోతుందిలే అని నిర్లక్ష్యం చేయకూడదు. చిన్న పిల్లలకు వైద్యం అందించేందుకు రిమ్స్‌లో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు, వసతులు ఉన్నాయి. సద్వినియోగం చేసుకోండి.

ఎంపీ రమేష్‌కు కేంద్ర సహాయ మంత్రి పరామర్శ

ఎంపీ రమేష్ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, ఎంపీలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సభ్యులను కేంద్ర సహాయ మంత్రి, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు పరామర్శించారు. ఎంపీ రమేష్ తల్లి రత్నమ్మ ఇటీవల తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చేరుకుని చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తమిళనాడు రాష్ట్ర చేనేత టెక్స్‌టైల్ శాఖ మంత్రి ఆర్.గాంధీ, ఎంపీలు పుట్టా మహేష్ యాదవ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, సుప్రియా సూలే, నిశికాంత్‌దూబె, శ్రీకాంత్ షిండే, భోలాసింగ్, సంజయ్‌జైశ్వాల్, నీరజ్‌శేఖర్, మాజీ మంత్రి సంజయ్ బాల్యాన్, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, తదితరులు ఎంపీ రమేష్‌ను పరామర్శించారు.

నేడు డయల్ యువర్ సీఎండీ

కడప గ్రామీణ: విద్యుత్తుదారుల సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. సెల్ నెంబరు 89777 16661కు ఫోన్ చేయాలన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లాలోని 14 పరీక్ష కేంద్రాలలో ఆదివారం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 2,519 మంది విద్యార్థులకు గానూ 2,459 మంది హాజరయ్యారు. 60 మంది గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ పరిశీలించారు.

బాధితులకు సత్వర న్యాయమందించండి

కృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులు, న్యాయవాదులు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: బాధితులకు సత్వర న్యాయం అందించే దిశగా న్యాయమూర్తులు అడుగులు వేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. న్యాయవాద వృత్తిలో సుదీర్ఘ కాలంగా సేవలందించి ఇటీవల మృతి చెందిన ఎస్. కృష్ణారెడ్డి, ఎల్. తులసిరెడ్డి చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రొద్దుటూరు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి న్యాయవాది అన్నపూర్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. సీనియర్ న్యాయవాదులు కృష్ణారెడ్డి, తులసిరెడ్డి చిత్రపటాలను వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి యామిని, న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాది మెట్టుపల్లి సుధాకర్‌రెడ్డి, ఎన్టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

బద్వేలు : ప్రొద్దుటూరుకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని ఆదివారం బద్వేలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీఎస్ కృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. బద్వేలులో నూతనకోర్టు కాంప్లెక్స్ రూ.26 కోట్లు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్ కేసులకు పరిష్కారం చూపాలని హైకోర్టు న్యాయమూర్తి తెలిపినట్లు డీవీఎస్ కృష్ణ తెలియజేశారు.

బధిర ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా బధిరుల సంఘ నూతన కార్యవర్గం ఎంపికైంది. నగరంలోని ఇండోర్‌స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నట్లు ఎన్నికల అధికారి సిద్ధయ్య తెలిపారు. ఎన్నికల అసోసియేట్ అధికారి రవికుమార్, పరిశీలకులు నిత్యపూజయ్యలు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా శివనాగసంతోష్, అసోసియేట్ అధ్యక్షుడిగా కొండయ్యరాజు, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి నరేంద్రరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా భూప్రకాష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జైహింద్‌రెడ్డి, కోశాధికారిగా మహేష్, మహిళా కార్యదర్శిగా రెడ్డెమ్మ, సభ్యులుగా షబానా, సుబ్బారెడ్డి, గయానుద్దీన్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏపీ హియరింగ్, హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి, తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

వైవీయూ: భావి పౌరులైన విద్యార్థులు సీపీ బ్రౌన్‌ను స్ఫూర్తిగా తీసుకుని తెలుగు భాషా సాహిత్యాల పట్ల మక్కువ పెంచుకుని ముందుకు సాగాలని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు పార్వతి అన్నారు. స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు బ్రౌన్ జీవితం-సాహిత్యంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గడచిన నవంబర్ నెలలో జిల్లా వ్యాప్తంగా మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై 6,527 కేసులు నమోదు చేసి.. రూ. 16,16,515 జరిమానా విధించామని అందులో వివరించారు. గంజాయి, మత్తుమాత్రలు, అక్రమ విక్రయాలపై దాడులు చేసి 23.5 కిలోల గంజాయి, 1,620 మత్తు మాత్రలను జప్తు చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించే వారిపై జిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో 180 ప్రదేశాల్లో నిఘా ఉంచామన్నారు. 11 విద్యాసంస్థల్లో గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.16,84,000 నగదు జప్తు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా జూద మాడుతున్న 222 మందిని అరెస్టు చేసి రూ. 5,93,150 నగదు జప్తు చేశామన్నారు. మట్కా నిర్వాహకులపై కేసులు నమోదు చేసి 19 మందిని అరెస్టు చేసి రూ. 64,520 నగదు స్వాధీనం చేశామని తెలిపారు. శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడుపుతున్న 81 మందిపై కేసులు నమోదు చేసి.. రూ. 93,585 జరిమానా విధించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 354 మందిపై కేసులు నమోదు చేసి.. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 149 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112కు ఫోన్ చేయాలన్నారు.

అక్రమ నియామకాలపై విచారణ చేపట్టరా!

మారుతీనగర్, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది నియామకాల్లో జరిగిన అక్రమాలపై ఆధారాలతో వైవీయూ వీసీకి ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు విచారణ ఎందుకు చేయలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రశ్నించారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆధారాలతో సహా గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తే.. విచారణ జరపాలని ఉన్నత విద్యామండలి నుంచి రిజిస్ట్రార్‌కు ఆదేశాలు వచ్చినా విచారణ జరపకుండా గాలికొదిలేశారని ఆరోపించారు.

రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు

రాయచోటి, న్యూస్‌టుడే: 20వ పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి రవిశంకర్ కోరారు. ఆదివారం వారు రాయచోటిలో సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. జనవరి 10, 11 తేదీలలో తిరుపతిలో ఈ మహాసభలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్రంలో దశాబ్దాల నుంచి రాజ్య హింసకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పౌర హక్కుల సంఘం తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తోందన్నారు. అడవులలో ఉన్న ఆదివాసీలను తరిమేసి అక్కడ ఉన్న అపార ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని ప్రజలు వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి. రెడ్డెయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు వంగిమళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో పోరుబాట 10న

నినాదాలు చేస్తున్న కూటమి నాయకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప జిల్లాలో కొనసాగించాలని.. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాజంపేటకు మార్చాలని కూటమి నాయకులు కోరారు. ఒంటిమిట్ట హరిత కల్యాణ మండపంలో వారంతా ఆదివారం భేటీ అయ్యారు. ఐకాస నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 10న పోరుబాట కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. రెండు మండలాలకు జరుగుతున్న అన్యాయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి, తెదేపా, భాజపా మండల శాఖ అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, భానుప్రకాష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేదాకా పోరాడతాం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలకు న్యాయం జరిగే దాకా తాము పోరాటాన్ని కొనసాగిస్తామని ఐకాస నాయకులు అన్నారు. ఒంటిమిట్టలో రెండోరోజు ఆదివారం కట్టా యానాదయ్య, చల్లా రోశయ్య, నంద్యాల వెంకటేష్, బి. చిన్నబాబు, అవసాని రమణయ్య, కట్టా చలపతిలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, న్యాయవాది భవనాసి రామదాసు, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా యానాదయ్య, నాయకులు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. తమ విన్నపాలను కూటమి పాలకులు సహృదయంతో అర్థం చేసుకోవాలని విన్నవించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం ప్రొద్దుటూరులోని బొల్లవరంలో చోటు చేసుకుంది. ప్రొద్దుటూరు మండలం శంకరాపురానికి చెందిన రవిశంకర్‌రెడ్డికి చాపాడు మండలం రాజువారిపేటకు చెందిన సుజాత(41)తో 15 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి సంతానం లేదు. దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో సుజాత చనిపోయినట్లు భర్త బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి బంధువులు అక్కడికి వెళ్లి చూడగా సుజాత రక్తపు మడుగులో పడి ఉన్నారు. దీంతో భర్తే చంపి ఉంటాడని బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కడప నుంచి వచ్చిన క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది. ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు.

భాకరాపేట శివారులో ఒకరు..

సిద్దవటం: భాకరాపేటకు చెందిన ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గ్రామానికి చెందిన తన్నీరు నారాయణ (45), లక్ష్మీదేవి దంపతులు శివారులోని పంట పొలానికి కాపలాగా ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి పూటుగా మద్యం తాగిన నారాయణ భార్యతో గొడవ పడ్డారు. ఆమెపై దాడికి యత్నించడంతో ఆమె తప్పించుకుని భాకరాపేట వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం పొలం వద్ద నారాయణ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మహమ్మద్ రఫీ, ఒంటిమిట్ట సీఐ నరసింహారాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తల నుదిటిపై గాయాలుండటంతో ఎవరైనా దాడి చేసి ఉంటారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు

ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించిన కళాశాల అధ్యాపకులు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను) పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం రూపొందించిన గోడపత్రాలు, క్యాలెండర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ అబ్దుల్ ముక్సిత్ ఖాన్ అధ్యాపకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ప్రవేశాలు, కోర్సులు, అవకాశాలు, విద్యార్థులకు అందించే సౌకర్యాలపై మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవ సంస్థలు, తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ ఒమర్‌ఫరూక్, మొహమ్మద్ సికిందర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర కార్యవర్గం ఎంపిక

నూతన కమిటీ సభ్యులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి మాట్లాడుతూ వేతన కమిటీని వెంటనే వేయాలని కోరారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకంపై సిబ్బంది, తమ సంఘాలతో చర్చించాలని కోరారు. రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ సీతాలక్ష్మి, ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు జిలానీబాషా, అధ్యక్షులు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, కృష్ణారావు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

నీటిలో పడి ప్రాణాలొదిలిన బాలుడు

కొండాపురం, న్యూస్‌టుడే: గండికోట వెనుక జలాల్లో మృతి చెందిన అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన పదోతరగతి విద్యార్థి శిరణ్‌కుమార్ (16)కు మతిస్థిమితం లేక నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రతాప్‌రెడ్డి ఆదివారం తెలిపారు. శనివారం గండికోట వెనుక జలాల్లో శిరణ్‌కుమార్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తల్లిదండ్రులను విచారించారు. రెండు నెలలుగా మతిస్థిమితం లేక పోవడంతో బెంగుళూరులోని ఓ ఆసుపత్రిలో పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులు

పులివెందుల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పులివెందులలోని సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు మిమ్మే నవీన్, ధనుష్, సంజయ్‌లు ఎంపికైనట్లు కోచ్ రవి, పాఠశాల ప్రిన్సిపల్ దయ ఆదివారం తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలోని హాకీ క్రీడా మైదానంలో సాధన చేస్తూ ప్రతిభ కనబరిచారని వారు తెలిపారు. వీరంతా ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఆనందంగా ఉందని వ్యాయామోపాధ్యాయుడు ప్రదీప్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

గండికోటలో పర్యాటకుల సందడి

జుమ్మామసీదు ప్రాంగణంలో సందర్శకులు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోట ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి విహార యాత్రకు వచ్చిన విద్యార్థులు, సందర్శకులు గండికోటలో సందడి చేశారు. కోటలోని జుమ్మామసీదు, పెన్నానదిలోయ, మాధవరాయస్వామి దేవాలయం, రంగనాథస్వామి ఆలయంపై చెక్కిన శిల్పాల అందాలు పర్యాటకులను కట్టిపడేశాయి. కోట అందాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తూ.. సెల్ఫీలు తీసుకున్నారు. భారీ సంఖ్యలో జనాలు తరలిరావడంతో పార్కింగ్ సౌకర్యం, తాగునీటి వసతి తదితర మౌలిక వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విష ద్రావణం తాగి వృద్ధురాలి ఆత్మహత్య

పెద్దవెంకటలక్షుమ్మ (పాత చిత్రం)

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలోని బొగ్గిడివారిపల్లె పరిధిలోని పాలకొండ్రాయునిపల్లెకు చెందిన వృద్ధురాలు పెద్ద వెంకటలక్షుమ్మ (63) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె భర్త రమణయ్యతో కొన్నేళ్ల కిందట మృతి చెందగా ఆమె పాలకొండ్రాయునిపల్లెలోని తన మేనల్లుడు వెంకటసుబ్బయ్య వద్ద ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బంధువులు గుర్తించి 108లో కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు తరగతులు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ క్లాసులు అన్ని సబ్జెక్టులకు వారి వారి డివిజన్లలో డిసెంబరు 8 నుంచి 10వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు డీఈవో షంషుద్దీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పక హాజరుకావాలన్నారు. నగరంలోని జయనగర్‌కాలనీ కాలనీ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో (కడప డివిజన్), బద్వేలు జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (బద్వేలు డివిజన్), ప్రొద్దుటూరు అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ప్రొద్దుటూరు డివిజన్), పులివెందుల జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (పులివెందుల డివిజన్)ల్లో క్లాసులు జరగనున్నాయన్నారు. ప్రధానోపాధ్యాయులందరూ ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ఓరియంటేషన్ క్లాసులకు హాజరయ్యేలా చూడాలన్నారు.

అర్ధ సెంచరీలతో చెలరేగారు..!

● ఉత్సాహంగా అండర్-14 క్రికెట్ పోటీలు

లిఖిత్ ఎరగమ్‌రెడ్డి

చాణక్య

ప్రణవ్ గోవర్ధన్

యాసిన్ సిద్ధిఖీ

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 అంతర్ జిల్లాల చివరి రౌండు క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అయిదు మంది క్రీడాకారులు అర్ధ సెంచరీలు చేసి బ్యాటింగ్‌లో రాణించారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల వివరాలు ఇవి.

● వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో తొలుత బ్యాటింగ్ చేసిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. జట్టులో చరణ్‌తేజారెడ్డి 70, యాసిన్ సిద్ధిఖీ 53 పరుగులు చేశారు. రెస్ ఆఫ్ నార్త్‌జోన్ బౌలర్లలో చరణ్‌కు 3 వికెట్లు పడ్డాయి. ఆపై రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ బ్యాటింగ్‌ను ఆరంభించి తొలి రోజు ఆట ముగిసే సమయానికి అయిదు ఓవర్లలో వికెట్లేమి కోల్పోకుండా 12 పరుగులు చేసింది.

● కెవోఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ 67 ఓవర్లలో 179 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో చరణ్ 53 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ విన్నర్స్ జట్టులో చాణక్య 5, షణ్ముగ గణేష్ 3 వికెట్లు తీసుకున్నారు. ఆపై నార్త్ జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్ చేసి తొలిరోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ బౌలర్లు లోకేశ్‌రెడ్డి 3, యూనానిస్ 2 వికెట్లు తీసుకున్నారు.

● కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో సౌత్‌జోన్ విన్నర్స్-రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన సౌత్ జోన్ విన్నర్స్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జట్టులో లిఖిత్ ఎరగమ్‌రెడ్డి 96, ప్రణవ్ గోవర్ధన్ 65 పరుగులు చేశారు. రెస్ట్‌ఆఫ్ సౌత్‌జన్ బౌలర్లలో తాహీర్, సమీర్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

EENADU e Classifieds

MARRIAGE SERVICES

పద్మశాలి 40సం॥ డైవర్స్, G.జాబ్, ఫెయిర్, 5' 10'', నోచిల్డ్రన్స్ & సిబ్లింగ్స్, వెల్‌సెటిల్డ్‌కి తగిన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్: 9440339516.

ఒమేగా హోంకేర్‌నందు వృద్ధులను పేషంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం, జీ:20k. ✆ 89776 39662, 89776 39663.

ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనిలో మేనేజర్‌లుగా పనిచేయుటకు 2 సం॥లు అనుభవం, ఆసక్తి గల యువతీ, యువకులు కావలెను. ✆ 9989996784.

REAL ESTATE

HOUSE FOR SALE

ఇల్లు అమ్మబడును, ఇండిపెండెంట్ ఇల్లు (గ్రౌండ్‌ఫ్లోర్ & ఫస్ట్‌ఫ్లోర్), కడప. ఎర్రముక్కపల్లి. పి.ఎఫ్.ఆఫీసు డౌన్, గరుడాద్రి అపార్ట్‌మెంట్ దగ్గర. సంప్ర: 9963451132.

రాయచోటిలోని ప్రముఖ ఫైనాన్స్ సంస్థ నందు వర్క్ చేయుటకు మేనేజర్స్ కావలెను. అర్హత ఏదైన డిగ్రీ, వయస్సు: 30సం॥ లోపు, జీతం: 20K to 40K. వెంటనే సంప్ర॥ సెల్: 9985178956, 9441560001.

JOBS

We are Hiring Field Debt Recovery Agentsfor Banking Process. Location: Kadapa, Mydukur, Proddatur, Rajampet, Tirupati, Srikalahasti, Palamaner. Salary 15K-22K+ Incentives. 9963959854.

Wanted PRO's for Admissions - Jeevan Jyothi Junior College and Edify Proddatur. Cell: 9440914765, 9908278718.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే

Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

రైతులకు యూరియా అందజేస్తున్న మార్కెట్ యార్డు ఛైర్మన్ నారిశెట్టి సుప్రజ

అన్నదాతల అభ్యున్నతికి కృషి

పోరుమామిళ్ల: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని బద్వేలు మార్కెట్ యార్డు ఛైర్మన్ సుప్రజ అన్నారు. రంగసముద్రం రైతు సేవా కేంద్రంలో రాయితీతో ఇస్తున్న యూరియాను ఆదివారం రైతులకు పంపిణీ చేశారు. రైతుల అవసరాల మేరకు కేంద్రం యూరియాను రాయితీతో ఇస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం పథకాలు అందజేస్తోందని వివరించారు. బద్వేలు భాజపా కోకన్వీనర్ పందిరి, మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

గుర్రప్ప స్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలు ప్రాంతంలోని మద్దిలేటి గుర్రప్ప స్వామిని ఆదివారం ఏపీఐఐసీ డైరెక్టర్ బి.ప్రసాద్‌రెడ్డి, గోపవరం జడ్పీటీసీ సభ్యుడు జయరామిరెడ్డి, బ్రాహ్మణపల్లె సింగిల్‌విండో ఛైర్మన్ రామనాయుడు దర్శించుకున్నారు. వీరికి ఈవో రామలింగారెడ్డి, పురోహితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారికి పూల మాల, శాలువాలతో సన్మానం చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు శంకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు జయరామిరెడ్డికి సన్మానిస్తున్న ఆలయ పూజారులు

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు: 9000409516
మైదుకూరు: 8008573447
బద్వేలు గ్రామీణ: 8008573493

నంగనూరుపల్లెలో స్వచ్ఛత పనులు

నంగనూరుపల్లెలోని ఎస్సీ బీసీ కాలనీలో రోడ్లపై మురుగు లేకుండా పంచాయతీ సిబ్బంది స్వచ్ఛత పనులు చేపట్టారు. ఇక్కడున్న సమస్యపై ఈ నెల 6న 'పరిశుభ్రత అధ్వానం.. వ్యాధులతో భయం' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మధుమోహన్ కుమార్ అంగీ కొళాయి నుంచి నీటి వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు. స్వచ్ఛత పనులు చేయించారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

?: ముద్దనూరు మార్కెట్ రహదారిపై నీరు నిలవడంతో పాటు చెత్తా చెదారం పేరుకుపోయింది. దీంతో దుర్వాసన, దోమల బెడద అధికమైంది. సమస్య పరిష్కరించాలి. - సూర్య, ముద్దనూరు

✓: మార్కెట్ రోడ్డులో ఉన్న నీటిని, పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - నరసింహులు, పంచాయతీ కార్యదర్శి

?: కలికయ్య వీధిలోని కాలువలో చెత్త వేయడంతో రహదారిపై మురుగు పారుతోంది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. వ్యాధుల భయం నెలకొంది. -ఖాదర్, స్థానికుడు

✓: కలికయ్య వీధిలోని కాలువలోని చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - నరసింహులు, పంచాయతీ కార్యదర్శి

?: ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని రహదారిలో వీధి దీపాలు పగలే వెలుగుతున్నాయి. రాత్రివేళ మాత్రమే దీపాలు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. - రామయ్య, ముద్దనూరు

✓: కాలనీలో నిరంతరం వెలుగుతున్న విద్యుత్ దీపాలను గుర్తించి రాత్రి వేళ వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - నరసింహులు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, ముద్దనూరు

వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలిగా సరోజ

కలసపాడు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం మహిళా మండలి అధ్యక్షురాలిగా చాటకొండు సరోజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు.

యువత.. సేవలతో చేయూత

గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శిబిరాల నిర్వహణ

మైదుకూరు, న్యూస్‌టుడే: కళాశాలల్లో చదువుకుంటున్నాం అని కాకుండా సమాజ సేవా లక్ష్యంగా విద్యార్థులు ముందుకొస్తున్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా విద్యార్థులు కాలనీలు, గ్రామాలను దత్తత చేసి సమస్యలతో పాటు ప్రజల బాగోగులు తెలుసుకుంటున్నారు. క్రమంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వేదికైంది. కళాశాల, పాఠశాల స్థాయిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా చేరిన విద్యార్థులు తమ వంతు సేవ అందిస్తున్నారు. తిరుపతిలోని వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు మైదుకూరు మండలం అన్నలూరులో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇందిరమ్మ కాలనీ, విశ్వనాథపురం, బాలాయపల్లెగిరి డిగ్రీ కళాశాల విద్యార్థులు పురపాలక పరిధి శెట్టివారిపల్లెలో ఐదేళ్ల ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ప్రజలతో మమేకం



జాతీయ సేవా పథకంతో కాలనీ, గ్రామంలో సేవలందించాం. ప్రత్యేక శిబిరం ఏర్పాటుతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవాటు చేశాం. సమాజసేవ అంటే ఏమిటో తెలుసుకున్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా అందించిన సేవలతో యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో కళాశాలకు మంచి పేరు తెచ్చుకున్నాం. భవిష్యత్తులోనూ ప్రజలతో మరింత మమేకమై సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాం.
- పి.నారాయణరెడ్డి, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరు

❖ ఎన్ఎస్ఎస్‌లో వాలంటీర్లుగా చేరడం కాదు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కాలనీ, గ్రామంలో పరిసరాల పరిశుభ్రత శ్రమదానం చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. దోమకాటుతో తలెత్తే రోగాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటి చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యవసాయం లాభసాటి అయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మనుషులకు, పశువులకు శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు. మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గతంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి దాతల నుంచి రక్తం సేకరించారు.

భక్తి శ్రద్ధలతో మారెమ్మకు పూజలు

మారెమ్మను దర్శించుకుంటున్న తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎం.కంభలదిన్నెలో కొలువైన మారెమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తెదేపా జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

అర్ధనారీశ్వరుడికి అన్నాభిషేకం

చాపాడు: మార్గశిర మాసం సందర్భంగా అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయంలోని అర్ధనారీశ్వరుడికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయంలో శివలింగానికి అర్చకులు అభిషేకాలతో పూజలు చేశారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

బి.కోడూరు, అట్లూరు, కొండాపురం, కలసపాడు, న్యూస్‌టుడే : శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయా పోలీస్‌స్టేషన్లలో ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు పేర్కొన్నారు. అట్లూరు తొలి మహిళా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నాగకీర్తనను మండల తెదేపా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా అనిల్‌కుమార్, బి.కోడూరు ఎస్ఐగా సూర్యనారాయణరెడ్డి, కలసపాడు ఎస్ఐగా ఎం.సుభాన్ బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు విద్యార్థి అనాథ శరణాలయం, నిరాశ్రయుల రాత్రి బస కేంద్రాలకు ఆదివారం రోటరీ క్లబ్, రోటరీ కంటి ఆసుపత్రి ప్రతినిధులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ చలికాలం దృష్ట్యా సూరత్‌కు చెందిన శివపురం వెంకటేశ్వర్లు, మంజుశ్రీ దంపతుల ఆర్థిక సాయంతో అనాథ విద్యార్థులు, వృద్ధులకు దుప్పట్లు అందజేశామన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: నెల రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధర్మాపురం గ్రామానికి చెందిన పూజారికి రూ.50 వేల ఆర్థికసాయం చేసినట్లు జమ్మలమడుగు బ్రాహ్మణ సంఘం గౌరవసలహాదారు కల్వటాల మురళీధరరావు తెలిపారు. ఆదివారం గ్రామానికి వెళ్లి పూజారి కుటుంబానికి చెక్కు అందజేశారు. ఆపరేషన్ తర్వాత ఆరు నెలలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెప్పడంతో ఈ ఆర్థికసాయం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రామకృష్ణ, నరసింహం, సుబ్రహ్మణ్యం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో సైనికుల సేవలు మరువలేనివి

బద్వేలు, న్యూస్‌టుడే: దేశరక్షణలో సైనికుల సేవలు ఎనలేనివని పురపాలక వైస్‌ఛైర్మన్ వెంకట సాయికృష్ణ అన్నారు. బద్వేలు శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ పీజీ కళాశాలలో ఆదివారం మాజీ సైనికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో అమరులైన వీర జవాను కుటుంబాలను ఆదుకోవడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, మాజీ సైనికులు మాల్యాద్రి, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం పొందిన మాజీ సైనికులతో పురపాలక వైస్ ఛైర్మన్ వెంకటసాయికృష్ణ కళాశాల అధ్యాపకులు

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు 220 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతులతో సోమవారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి 4.30గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామభద్రయ్య తెలిపారు. మైదుకూరు, చాపాడు మండలాల్లోని అన్ని విద్యుత్తు ఉప కేంద్రాలకు సరఫరా ఉండదన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు, న్యూస్‌టుడే: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం చైతన్య నిరంజన్ ఆదివారం తెలిపారు. వెళ్లి వచ్చేందుకు రూ.4,600 చెల్లించాలన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ముద్దనూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సును ఢీకొని టిప్పర్ బోల్తా పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. నంద్యాల నుంచి ముద్దనూరుకు జిప్సం లోడుతో వస్తున్న టిప్పర్ జమ్మలమడుగు ఘాట్ రోడ్డులో అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఘటనలో టిప్పర్ బోల్తా పడగా బస్సు అద్దం పగిలిపోయింది. ఈ సమయంలో బస్సులో ఉన్న 20మందికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

జమ్మలమడుగులో పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వెంకట సురేష్ రాసిన 'మంచి మాటలు- భావనా మంజీరాలు-2' పుస్తకం సమాజహితాన్ని కోరే మంచి రచనలని ఉపాధ్యాయ సంఘాల గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కొనియాడారు. ఆదివారం స్థానిక సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుస్తకాలను ఆవిష్కరించారు. తెలుగు ఉపాధ్యాయుడు విజయరాము, మస్తాన్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, విజయరాము, రమణమూర్తి, డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు.. తొలగించక అవస్థలు

చాపాడు మండలం విశ్వనాథపురం పంచాయతీ వివి.కొట్టాల నుంచి మైదుకూరు-ప్రొద్దుటూరు రహదారి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఉన్నాయి. రాకపోకల సమయంలో ఇబ్బందిగా ఉన్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ హరినాథ్‌ను వివరణ కోరగా కంపచెట్లు తొలగించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. - న్యూస్‌టుడే, చాపాడు

వేడుకగా మాజీ మంత్రి పుట్టిన రోజు

అభిమానులతో కలిసి కేకు కోస్తున్న మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి

ఖాజీపేట, న్యూస్‌టుడే: మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఖాజీపేటలోని ఆయన నివాసంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ కేకు కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు డీఎల్ సేవలను గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు పోరాటం

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 10న సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పిలుపునిచ్చారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో ఆదివారం నియోజకవర్గం సీపీఐ నాయకులతో సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గంగా సురేష్, నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు చాంద్‌బాషా, నాగేంద్ర, సంతోష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఈ నెల 13, 14 తేదీల్లో కడపలో మొదటిసారిగా నిర్వహించనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశం, రాష్ట్ర విద్యా సదస్సును జయప్రదం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలరు గురుకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశాలకు అన్ని జిల్లాల నుంచి నాయకులు, విద్యావేత్తలు, సీపీఐ రాష్ట్ర నాయకులు హాజరవుతారని చెప్పారు. మహమ్మద్‌గౌస్, రమేష్‌బాబు, ప్రసాద్‌బాబు, శివరామిరెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు







(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

చెక్కులు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

వేంపల్లె, న్యూస్‌టుడే: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల తెదేపా కన్వీనర్ రామమునిరెడ్డి అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పేదలకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.10.33 లక్షల మొత్తాన్ని లబ్ధిదారులకు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడే వారెవరైనా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నాయకులు షబ్బీర్, పసుపులేటి వీరభద్ర, వేమకుమార్, మహమ్మద్ పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి

మారుతీనగర్, న్యూస్‌టుడే: నగర పరిధిలోని శిల్పారామంలో ఆదివారం అక్కడే ఉన్న కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. వారాంతపు సెలవు కావడంతో నగర ప్రజలు, చిన్నారులు, మహిళలు శిల్పారామానికి తరలి వచ్చారు. శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

కళావేదికపై నృత్యం చేస్తున్న బాలికలు

నైపుణ్యాలే ఉన్నత శిఖరాలకు మార్గాలు

ప్రసంగిస్తున్న కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, చిత్రంలో అధికారులు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యంతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. కడప నగరంలోని సోనియా, విజయ నర్సింగ్ కళాశాలల విద్యార్థులకు వీడ్కోలు, స్వాగతోత్సవం ఆ కళాశాలల ఛైర్మన్ భవనాశి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదవినా, ఉద్యోగ నిర్వహణ చేసినా మంచి ఫలితాలుంటాయన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజారత్నం ఐజాక్, డాక్టర్ శివానాయక్, సీఎంరెడ్డి గోర్ల తదితరులు విద్యార్థులకు దిశానిర్దేశం చేయగా వివిధ క్రీడల్లో విజేతలకు జ్ఞాపికలు అందించగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ మేరీ శివప్రసాద్, విద్యార్థి సంఘం నేతలు డీఎం ఓబులేసు, జగన్‌రాథోడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయ పన్ను బకాయి రూ.4 లక్షలు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని కాంగ్రెస్ కార్యాలయం పురపాలక కార్యాలయానికి దాదాపు రూ.4 లక్షల మేర పన్ను బకాయి ఉన్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. పులివెందుల మేజర్ పంచాయతీ నుంచి పురపాలక సంస్థగా మారినప్పటి నుంచి పన్ను చెల్లించలేదని.. తాజాగా బిల్లు బకాయి మొత్తం దాదాపు రూ.4 లక్షలకు చేరుకుందని చెప్పారు.

ఇదా స్వచ్ఛ నగరం! / చెత్తా చెదారంతో దుర్గంధమయం

బిల్టప్ (కడప) న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్త సేకరణ అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధానంగా మాసాపేట, శ్రీరామ్‌నగర్, ఇందిరానగర్, తిలక్ నగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది. పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా రాకపోయినా నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓ వైపు స్వచ్ఛ కడపగా నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని పాలకులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి అధ్వానంగా ఉంది.

మాసాపేటలో రోడ్డుపైనే దర్శనమిస్తున్న చెత్త

రోడ్డుపైనే వ్యర్థాలు

మా వీధిలోకి చెత్త సేకరణ వాహనం రావడం లేదు. పలు మార్లు వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీనికి తోడు కాలనీ వాసులు ఇంట్లోని వ్యర్థాలను రోడ్డుపైనే పడేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త కుండీలు ఏర్పాటు చేయాలి. - **రామలక్ష్మమ్మ, మాసాపేట**

భరించలేని దుర్వాసన

రోడ్డుపైనే రోజుల తరబడి చెత్త పేరుకుపోయింది. దీంతో విష పురుగులు ఇంట్లోకి వస్తున్నాయి. పిల్లలు ఆడుకోవటానికి బయటికి వెళ్తున్నారు. వ్యాధుల బారినపడుతున్నారు. చెత్త నిల్వలు తొలగించి ఫాగింగ్ చేయాలి. ప్రతి రోజూ చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలి. - **ప్రదీప్, స్థానికుడు**

ఇదీ పరిస్థితి!

నగరంలో నడిబొడ్డున 26వ డివిజన్ మాసాపేట కొత్త కొట్టాలులో (స్టేడియం) వెనుక నెలలు తరబడి చెత్త పేరుకుపోయింది. దీనిని తొలగించక పోవడంతో సమీపంలోని నివాసాల వారు.. వాహన చోదకులు, పాదచారులు ఇటు వైపు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వర్షం కురవడంతో ఈగలు, దోమలు అధికమై రాత్రి వేళలో దాడి చేస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. నగరపాలక సిబ్బంది వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో రమేష్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగిస్తామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపడతామన్నారు.

విద్యార్థులకు సాంకేతికతపై పట్టు అవసరం

వేంపల్లె, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సాంకేతికంగా పట్టు సాధించాలని హైదరాబాద్ ఐబీఎం కంపెనీ ఫౌండర్ డాక్టర్ జ్ఞాన్ ఎల్లా అన్నారు. ట్రిపుల్ ఐటీలో ఆదివారం నిర్వహించిన క్వాంటమ్ కంప్యూటింగ్ కార్యశాలలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా క్వాంటమ్ కంప్యూటింగ్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామిగుప్తా, ఏవో రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్ కైలాస్, క్యాంపస్ నిర్వహణ బాధ్యుడు పవన్‌కుమార్, సమన్వయకర్తలు రత్నకుమారి, సుధాకర్‌రెడ్డి, భాస్కరయ్య, కార్తిక్‌కుమార్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐబీఎం కంపెనీ ఫౌండర్ జ్ఞాన్ ఎల్లా.. హాజరైన విద్యార్థులు

16న జాతీయ రహదారి దిగ్బంధం

మారుతీనగర్: ఆలంఖాన్‌పల్లెలో శ్మశాన, డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఈ నెల 16వ తేదీన జాతీయ రహదారి దిగ్బంధం చేసే కార్యక్రమం చేపడుతున్నామని సీపీఎం నగర కార్యదర్శి వెంకటశివ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. స్థానికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నాయకులు సావంత్‌సుధాకర్, సుబ్బరాయుడు, నాగరాజు, మల్లికార్జున, చెంచయ్య పాల్గొన్నారు.

దారి కనిపించక.. గాలి పీల్చుకోలేక

ముద్దనూరు నుంచి పులివెందులకు వెళ్లే ప్రధాన రహదారిలో భారీగా దుమ్ము, ధూళి ఎగిసిపడుతోంది. నాలుగు వరుసల రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వాటిని మట్టితో పూడ్చడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము ఎగసిపడుతోంది. దీంతో వెనక వచ్చే వాహనాలకు ముందు వెళ్లే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా మల్లేల, తొండూరు, ఇనగలూరు గ్రామాల సమీపంలో ఈ పరిస్థితి తలెత్తుతోంది. **- న్యూస్‌టుడే, తొండూరు**

చేతికందేలా యమపాశం

నగరంలోని బ్రాహ్మణవీధిలోని ఓ విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. తక్కువ ఎత్తులో ఉండడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. పొరపాటున విద్యుత్తు నియంత్రికను తగిలే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కడప (చిన్నచౌకు)**

ప్రమాదాల పాచిక.. కర్రే సూచిక

నగరంలోని శ్రీకృష్ణ దేవరాయలు కూడలి నుంచి అన్నమయ్య కూడలికి వెళ్లే మార్గంలో మసీదుకు సంబంధించిన కాంప్లెక్సు ఉన్నాయి. వాటి వెనకాలే శ్మశాన వాటిక ఉంది. దీంతో ఆ మార్గంలో పలు రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాలువపై మార్గ మధ్యలో ఓ మ్యాన్ హోల్ ఉంది. దానిపై ఏర్పాటు చేసిన బండలు పగిలిపోయాయి. దీంతో ప్రమాదాలు జరుగుతాయనే ఉద్దేశంతో దానిపై కొందరు ఓ కర్రను సూచికగా ఉంచారు. మ్యాన్‌హోల్‌పై శాశ్వతంగా ఇనుప మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కడప (చిన్నచౌకు)**

మురుగు పారే దారేదీ!

కొత్త సంగటిపల్లెలోని ప్రధాన వీధి మలుపు సమీపంలో వాన నీరు నిలిచి మురుగుమయంగా మారింది. ఆ మురుగు నీటిలో నుంచి నడక సాగించాలంటే అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సీసీ రోడ్డు వేయడంతో రోడ్డు ఎత్తుగా అయింది. దీంతో చిన్నపాటి వర్షం వచ్చిన వాన నీరు నిలిచి మురుగుమయంగా మారుతోంది. దోమలు ఉద్ధృతి పెరిగి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మురుగు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెండ్లిమర్రి**

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ఏర్పాటు చేసిన సంపద సృష్టి కేంద్రాలు నిర్వహణ లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని కొక్కరాయపల్లెలో లక్షలు ఖర్చు చేసి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి నుంచి నేటికీ నిర్వహణకు నోచుకోలేదు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరిందని.. వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కిరణ్‌మోహన్‌ను వివరణ కోరగా.. వెంటనే పరిశీలించి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, చెన్నూరు**

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ ఎస్సైగా ప్రదీప్‌కుమార్, సైబర్ ఠాణా ఎస్సైగా నారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలల్లో వీరిని కడపకు కేటాయించారు. వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.

పులివెందుల: పులివెందుల ట్రాఫిక్ ఎస్.ఐ.గా విష్ణునారాయణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్.ఐ.గా విధులు నిర్వర్తించే ఈయన తాజాగా బదిలీలలో భాగంగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

లింగాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామని ఎస్సై జగదీశ్వరరెడ్డి అన్నారు. దువ్వూరు పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

వైకాపా నేతల విమర్శలు సరికాదు

కమలాపురం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలో రోడ్లు సక్రమంగా వేయలేదని వైకాపా నేతలు విమర్శించడం సిగ్గుచేటని తెదేపా ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఆదివారం రోడ్డుపై పడిన గుంతలను గ్రావెల్‌తో పూడ్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైకాపా పాలనలో ఏఒక్క పని సక్రమంగా చేయలేదన్నారు. ఇష్టానుసారంగా ఓపెన్ డ్రైనేజీ పనులు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే సంబటూరు బస్టాండ్ నుంచి శివాలయం వరకు సీసీ రోడ్డు వేయించారన్నారు.

బీమా నమోదు గడువు పెంచాలని వినతి

వేంపల్లె, న్యూస్‌టుడే: రబీ సీజన్‌కు పంటలకు సంబంధించి ప్రభుత్వం పసల్ బీమా గడువు పెంచాలని జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలో అత్యధికంగా రబీలో రైతులు శనగ, మినుము, నువ్వులు, జొన్న, వేరుసెనగ, ఇతర పంటలు సాగు చేశారన్నారు. దీనికి ఫసల్‌బీమా కింద ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15 గడువు విధించారన్నారు. ప్రీమియం చెల్లించేందుకు రైతు భరోసా కేంద్రాలకు వెళ్తే పంటల సాగు ధ్రువపత్రాలు ఇవ్వమని వ్యవసాయాధికారులను విన్నవితే తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందలేదని చెబుతున్నారన్నారు. ఈ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని గడువును జనవరి 10 వరకు పొడిగించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులంటే అలుసా!

మాట్లాడుతున్న ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు నాగముని, చిత్రంలో నాయకులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: జిల్లా ఆర్టీసీ అధికారులకు ఆ సంస్థలో పని చేసే ఉద్యోగులంటే అలుసుగా ఉందని ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు నాగముని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారానికి 20 రోజులకు చేరుకున్నాయి. గతంలో ఆర్టీసీ అధికారులకు పలు దఫాలుగా వినతి పత్రాలు ఇచ్చినా కనీసం చర్చలకు పిలవలేదన్నారు. తప్పని పరిస్థితుల్లో దీక్షలు చేయాల్సి వచ్చిందన్నారు. ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివారెడ్డితో పాటు పలువురు నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా...బంగాళదుంప-45, క్యాబేజి-28, క్యారెట్-55, బీన్స్-58, బీట్‌రూట్-45, కీర-30, దోస-40, దొండకాయలు-50, ముల్లంగి-35, అల్లం-60, 80, కాలీఫ్లవర్-38, క్యాప్సికం-70, టమాట-35, మిరపకాయలు 40, వంకాయలు-25, బెండకాయలు-40, బీర-40, కాకర- 40, మటిక్కాయ-40, చిక్కుడు-55, అలసందకాయలు-50, అనపకాయలు-60, ఉల్లిపాయలు-20, 25.

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారని ఏపీ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య యాదవ్ స్పష్టం చేశారు. ఈ నెల 9వ తేదీన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడప, కమలాపురంలో దివ్యాంగులు త్రిచక్ర వాహనాల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారితో కలిసి చిన్నసుబ్బయ్య మాట్లాడుతూ.. కడప ప్రెస్‌క్లబ్‌లో 9వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి సీఎం కృషి

త్రిచక్ర వాహనాల్లో ర్యాలీగా వస్తున్న దివ్యాంగులు

ఏపీ ఫార్మా కౌన్సిల్ ఎన్నికల ప్రచారం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ఏపీ ఫార్మా కౌన్సిల్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కడప డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏపీజీఏ అధ్యక్షుడు డాక్టర్ సిద్ధయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఏపీపీసీ సభ్యులుగా నరేష్, నాగకృష్ణమరాజు, రాధాకృష్ణలను గెలిపించేలా చూడాలన్నారు. వీరితో పాటు ఐపీఏ నుంచిశ్రావణ్, ఆదిరెడ్డి, మాలతి ఎన్నికల బరిలో నిలిచారని వారిని గెలిపించాలంటూ ప్రచారం చేపట్టారు. ఏపీపీఎస్ఎస్ వ్యవస్థాపకులు సురేష్‌బాబు, ఏపీ గ్రాడ్యుయేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

చక్రాయపేట, న్యూస్‌టుడే: చక్రాయపేట మండలం కొండవాండ్లపల్లెకు చెందిన తెదేపా నాయకుడు అశోక్‌కుమార్ ఇటీవల గాయపడ్డారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి ఆదివారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం చక్రాయపేటలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు రెడ్డెయ్య చనిపోవడంతో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

సీఎంతో తెదేపా నేత భేటీ

వేముల, న్యూస్‌టుడే: పులివెందుల నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షుడు పార్థసారథి రెడ్డి సీఎం చంద్రబాబునాయుడును కోరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసి పలు సమస్యలను వివరించినట్లు ఆయన చెప్పారు. వేములలో ఎస్సీ కాలనీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని.. ముస్లిం సోదరులకు షాదీఖానా నిర్మాణానికి చొరవ చూపాలని కోరినట్లు వివరించారు.

విలీనంతో నష్టం

సిద్దవటం, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లాలో విలీనం చేస్తే సిద్దవటం మండల ప్రజలు నష్టపోవాల్సి వస్తుందని ఆ ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలని సిద్దవటం మండల జేఏసీ నాయకులు డిమాండు చేశారు. సిద్దవటంలో ఆదివారం త్వరలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించారు. జేఏసీ నాయకులు రవిశంకర్, శ్రీకాంత్, వినోద్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న విజయమ్మ

మారుతీనగర్, పులివెందుల, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం అయితేనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ సీఎం జగన్ తల్లి విజయమ్మ అన్నారు. వైయస్ జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా పుట్లంపల్లెలోని ఆయన నివాసంలో ఆదివారం జార్జిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పులివెందులలోని జార్జిరెడ్డి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇందిరా మహిళా మండలి అధ్యక్షురాలు వైయస్ భారతమ్మ ఆధ్వర్యంలో విజయమ్మ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, బ్యూటీపార్లర్ శిక్షణ ప్రారంభించారు. వైఎస్ జార్జిరెడ్డి ఐటీఐ కళాశాలలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

వేమన కీర్తి.. విశ్వవ్యాప్తి

మారుతీనగర్, న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవ్యాప్తమైన కీర్తిని సంపాదించారని రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. జనవరిలో నిర్వహించనున్న వేమన జయంతి వేడుకల సందర్భంగా కడప రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పలు పాఠశాలల విద్యార్థులకు స్థానిక సేవాసమితి ప్రాంగణంలో వేమన పద్య పఠన పోటీలు నిర్వహించారు. విజేతలకు జయంతి నాడు నగదు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి

ట్రాఫిక్ పోలీసులతో డీజిల్ ట్యాంకర్ల యజమాని వాగ్వాదం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప నగరంలోని ట్రాఫిక్ ఠాణా వద్ద శనివారం రాత్రి డీజిల్ ట్యాంకర్ల యజమాని భాస్కర్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారి మధ్య తోపులాట చోటు చేసుకుంది. కడపకు చెందిన భాస్కర్‌రెడ్డికి డీజిల్ ట్యాంకర్లు ఉన్నాయి. ఆయన ఆర్టీసీతో వివిధ కంపెనీలకు డీజిల్‌ను సరఫరా చేస్తారు. ఈ నేపథ్యంలో ఓ ట్యాంకర్ అంబేడ్కర్ కూడలి వద్ద వెళ్తుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని ఆపారు. రాత్రి వేళలో నగరంలో భారీ వాహనం వెళ్లేందుకు అనుమతి లేదని చెప్పడంతో తాము ఆర్టీసీకి డీజిల్ సరఫరా చేస్తామని చోదకుడు సమాధానమిచ్చారు. దీంతో ట్యాంకర్‌పై రూ.1035 జరిమానా ఉందని.. దాన్ని చెల్లించి వెళ్లాలని సూచించారు. దానికి వారు ఒప్పుకోకపోవడంతో వాహనాన్ని ఠాణాకు తరలించారు. విషయం తెలుసుకున్న డీజిల్ ట్యాంకర్ యజమాని భాస్కర్‌రెడ్డి అక్కడికి చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సాయంత్రం వేళల్లో భారీ వాహనాలు నగరంలో వెళ్లరాదనే నిబంధన ఉందన్నారు. దీంతోనే వాహనాన్ని ఆపామన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కమలాపురం: స్థానిక వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఆదివారం మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కిమ్స్-సవీరా ఆసుపత్రి వైద్యులు ఉచిత గుండె, దంత, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురికి చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ నగేష్, పాఠశాల కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పూజలందుకుంటున్న రామలింగచౌడేశ్వరిదేవి

ప్రత్యేక అలంకరణలో గవి మల్లేశ్వరస్వామి

వల్లూరు, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరిలో వెలసిన క్షేత్రాధిపతి వైద్యానాథేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం రుద్రాభిషేకాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామిని పూలమాలలు, పండ్లతో ఆలయ పూజారి రాజేశ్‌శర్మ ప్రత్యేకంగా అలంకరించి మంగళ హారతులు ఇచ్చారు.

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని శ్రీరామలింగ చౌడేశ్వరి దేవి ఆలయం, శ్రీఅంకాళమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం బహుళ తదియను పురస్కరించుకుని ఆదివారం శ్రీఅంకాళమ్మ ఆలయంలో కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలో ఆదివారం విఘ్నేశ్వరుడికి సంకటహరచతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిశాలలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ పూజలు చేశారు. అర్చకుడు ఇంద్రకంటి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, గణపతిపూజ, కలశపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ, ఆలయ నిర్వాహకుడు మిట్టా మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

◆ వేంపల్లెలోని దుర్గగవిమల్లేశ్వరస్వామికి ఆదివారం ఆరుద్ర నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. బిడాలమిట్టలో ఉన్న ఈ ఆలయంలో అర్చకుడు దర్భాక ప్రసాదశర్మ నేతృత్వంలో దుర్గగవిమల్లేశ్వరస్వామికి ఉదయాన్నే పాలాభిషేకం, ఇతర పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ విశేష పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరుడు

తీరిన మురుగు సమస్య

కమలాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రధాన రోడ్డు పక్కనున్న కాలువ నుంచి మురుగు రోడ్డుపై పారుతుండటంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 1వ తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కమలాపురం నగర పంచాయతీ కమిషనర్ ప్రహ్లాద్ సిబ్బందితో జేసీబీతో కాలువ తవ్వించి అందులో పైపులు ఏర్పాటు చేసి అందులో నుంచి మురుగు బయటకు వెళ్లేటట్లు ఏర్పాటు చేశారు. వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu